MS P02 A2154

మూసీ
మాస పత్రిక

ప్రపంచ తెలుగు మహాసభలు - 2017



# ఆలోకనం

## 31 తెలంగాణ జిల్లాల సాహిత్యం, చరిత్ర, సంస్కృతీ సమాహారం

సంపాదకులు : డా. సాగి కమలాకర శర్మ



C7


## ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం

**మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?**

అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంభరాన్ని తాకాలా ?

సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్, ఎంబ్రియో &సెమెన్ ఫ్రీజింగ్, స్త్రీలలో గర్భాశయ అండాశయ లోపాల నివారణ-చికిత్స, వెరికోసీల్, వీర్యకణాల లోపం, ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా లోపాల నిర్ధారణ -సవరణ, ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.

**7416 106 106**
www.ferty9.com

**మీరు తీసుకునే ప్రతి నిర్ణయానికి మా ప్రేమ, సేవ అంకిత భావం మీకు తోడుగా ఉంటుంది.**

**IUI** | **IVF** | **ICSI** | **IMSI** | **HSG**





**ఫర్టీ 9** హాస్పిటల్ మరియు పరిశోధన కేంద్రం

మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...

విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్

MSP02 A254

# స్ఫూర్తి ప్రదాత



మూసీ మాసపత్రిక వ్యవస్థాపకులు

హరిహర త్రిశక్తి క్షేత్ర మూలకర్త

శాసన పరిశోధకులు, దార్శనికులు

**శ్రీ బి.ఎన్.శాస్త్రిగారు**

# హరిహర త్రిశక్తి క్షేత్రం

**నవాలయ ఆవరణం, శ్రీ విద్యాపురం, వలిగొండ, యాదాద్రి జిల్లా.**



మహాకాళీ మహాలక్ష్మీ మహా సారస్వతీ ప్రభా । ఇష్టకామేశ్వరీ కుర్యాత్ విశ్వశ్రీః విశ్వమంగళమ్ ।
షోడశీ పూర్ణచంద్రాభా మల్లికార్జున గేహినీ । ఇష్టకామేశ్వరీ కుర్యాత్ జగన్నీరోగ శోభనమ్ ॥
జగద్ధాత్రీ లోకనేత్రీ సుధా నిష్యంది సుస్మితా । ఇష్టకామేశ్వరీ కుర్యాత్ లోకం సద్బుద్ధి సుందరమ్।
పరమేశ్వర వాల్లభ్య దివ్య సౌభాగ్య సుప్రభా । ఇష్టకామేశ్వరీ దద్యాత్ మాంగల్యానంద జీవనమ్॥

# ఆలోకనం

తెలంగాణ 31 జిల్లాల సాహిత్యం, చరిత్ర, సంస్కృతీ సమాహారం


సంపాదకులు

డా॥ సాగి కమలాకర శర్మ



మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక

**ఆలోకనం**

తెలంగాణ 31 జిల్లాల సాహిత్యం, చరిత్ర, సంస్కృతీ సమాహారం

10 డిసెంబర్ 2017

హేమలంబ మార్గశిర కృష్ణ అష్టమి

ప్రతులు : 1000

అన్ని హక్కులు 'మూసీ మాసపత్రిక'వే

**వెల : రూ. 500/-**

**ప్రతులకు :**

**మూసీ మాసపత్రిక**

2-2-1109/బికె-ఎల్ఐజి-10, బతుకమ్మకుంట,

బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013.

ఫోన్ : 934 797 1177

ముఖపత్ర రూపాలంకరణ

**డా॥ పత్తిపాక మోహన్**

రంగుపేజీల నిర్వహణ

**గోపి పురాణిక్, ఆనంద్ ప్రింటర్స్.**

**ఫోన్ : 98485 77673**

అక్షరాలంకరణ

**డా॥ బి. మనోహరి, కావ్యశ్రీ గ్రాఫిక్స్,**

**ఫోన్ : 934 797 1177**

**ISBN No. 978-93-87173-04-0**

ముద్రణ

**శ్రీ సాయి ప్రాసెస్,**

నారాయణగూడ, హైదరాబాద్.

ఫోన్ : 2756 3075

## సంపాదక వర్గం

సహ సంపాదకులు

**డా॥ బి. మనోహరి**

సహాయ సంపాదకులు

**ఎ. దత్తయ్య**

**ఎ. శ్రీనాథ్ రావు**

**డా॥ నందిని సిధారెడ్డి**
అధ్యక్షులు, తెలంగాణ సాహిత్య అకాడమీ,
హైదరాబాద్.

# 'మూసీ' సంచిక సూచీ సంచిక

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రపంచ తెలుగు మహాసభలు - 2017 (డిసెంబర్ 15-19) నిర్వహిస్తున్నది. తెలుగు భాషకు పుట్టినిల్లు తెలంగాణ. తెలుగు మాగాణం తెలంగాణం. తెలుంగు గణమే కాలక్రమంలో 'తెలంగాణం' అయింది. తెలుగు భాషా సాహిత్య సంస్కృతీ వికాసాల కోసం తెలంగాణ మహనీయులెందరో విశేషమైన కృషి చేశారు. విస్మృతికి లోనయిన ఆ ఘనచరిత్రను గుర్తు చేసుకోవటం, తెలంగాణ సాహిత్య సాంస్కృతిక ప్రాభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పటం, భాషా సాహిత్య సాంస్కృతిక చరిత్ర మహా వారసత్వాన్ని, స్ఫూర్తిని కొత్త తరానికి అందించటం ప్రపంచ తెలుగు మహాసభల ప్రధాన లక్ష్యం. మహాసభల ఉత్సవ సౌరభం, వేడుకల సంబురం తెలంగాణ అంతటా, తెలుగు వారందరిలో వెల్లివిరియాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు గారి ఆకాంక్ష.

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భాన్ని పురస్కరించుకొని 'మూసీ' పత్రిక విశేష సంచిక రూపొందిస్తున్నందుకు తెలంగాణ సాహిత్య అకాడమీ సంతోషిస్తున్నది. తెలంగాణ 31 జిల్లాల సాహిత్య సాంస్కృతిక సమాచారాన్ని సేకరించి, ఒకచోట క్రోడీకరించి, కూర్చి సంపుటిగా ప్రచురించటం గొప్పపని. మంచి పరిశోధన. రేపటి అధ్యయనశీలురికి సూచీ సంచికగా ఉండబోతుందని విశ్వాసం. 'మూసీ' విశేష సంచికలన్నీ విలువైనవే. ఇప్పటికే భాషా సాహిత్యాలపై ప్రత్యేక సంచికలు వెలువరించి అందరి మన్ననలు పొందారు. ప్రస్తుతం రూపొందిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభల 'మూసీ' ప్రత్యేక సంచిక 'ఆలోకనం' తెలుగు పరిశోధకులకు, జిల్లా అధ్యయనాలకు చేర్పు అవుతుందని భావిస్తున్నాను. మంచిపనిలో సమయం పంచుకున్న పనిమంతులందరికీ అభినందనలు. రచయితలకు, సంపాదకులకు మరిన్ని మరిన్ని అభినందనలు.

**- నందిని సిధారెడ్డి**

## ఆలోకనం - జిల్లాల దర్శనం


| | | | | |
|---|---|---|---|---|
| 1. | ఆదిలాబాద్ | ... | సామల రాజవర్ధన్ | 1 |
| 2. | కరీంనగర్ | ... | గంగాధర్ | 13 |
| 3. | కామారెడ్డి | ... | దత్తయ్య అట్టెం | 25 |
| 4. | కొమరం భీం ఆసిఫాబాద్ | ... | మాడుగుల నారాయణ మూర్తి | 37 |
| 5. | ఖమ్మం | ... | డా॥ కావూరి పాపయ్య శాస్త్రి, కూరాకుల శ్రీనివాస్ | 47 |
| 6. | జగిత్యాల | ... | డా॥ సంగనభట్ల నరసయ్య | 55 |
| 7. | జనగామ | ... | రెడ్డి రత్నాకర్ రెడ్డి | 65 |
| 8. | జయశంకర్ భూపాలపల్లి | ... | పల్లేరు వీరాస్వామి, నర్రా ప్రవీణ్ రెడ్డి | 75 |
| 9. | జోగులాంబ గద్వాల్ | ... | డా॥ భీంపల్లి శ్రీకాంత్ | 81 |
| 10. | నల్లగొండ | ... | డా॥ ఇడికోజు శ్రీనివాసాచారి | 89 |
| 11. | నాగర్ కర్నూల్ | ... | వేముల నారాయణ | 103 |
| 12. | నిజామాబాద్ | ... | డా॥ బోచ్కర్ ఓం ప్రకాశ్ | 115 |
| 13. | నిర్మల్ | ... | మడిపల్లి భద్రయ్య | 127 |
| 14. | పెద్దపల్లి | ... | కావటి సతీశ్ కుమార్ | 137 |
| 15. | భద్రాద్రికొత్తగూడెం | ... | రాళ్ళబండి బాలాజీ | 147 |
| 16. | మహబూబాబాద్ | ... | మద్దెర్ల రమేష్ | 157 |
| 17. | మహబూబ్‌నగర్ | ... | మ్యాతరి ఆనంద్ | 169 |
| 18. | మంచిర్యాల | ... | ఎం.వి. పట్వర్ధన్ | 179 |
| 19. | మెదక్ | ... | వర్ధ వేణు | 191 |
| 20. | మేడ్చల్ మల్కాజ్‌గిరి | ... | డా॥ ఎం. శ్రీకాంత్ కుమార్ | 201 |
| 21. | యాదాద్రి భువనగిరి | ... | సిద్ధగౌని సుదర్శన్ | 211 |
| 22. | రాజన్న సిరిసిల్ల | ... | సంకేపల్లి నాగేంద్రశర్మ | 221 |
| 23. | రంగారెడ్డి | ... | ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి | 231 |
| 24. | వనపర్తి | ... | డా॥ గుంటి గోపి | 239 |
| 25. | వరంగల్ అర్బన్ | ... | డా॥ బి. రాములు | 251 |
| 26. | వరంగల్ రూరల్ | ... | డా॥ యల్లంభట్ల నాగయ్య | 259 |
| 27. | వికారాబాద్ | ... | డా॥ కె. భాస్కరయోగి | 271 |
| 28. | సిద్ధిపేట | ... | కె. లాల్‌బహదూర్ శాస్త్రి | 283 |
| 29. | సూర్యాపేట | ... | డా॥ దామరాజు సూర్యకుమార్ | 295 |
| 30. | సంగారెడ్డి | ... | అవుసల భానుప్రకాశ్, ఎ. శ్రీనాథ్ రావు | 309 |
| 31. | హైదరాబాద్ | ... | దోరవేటి, డా॥ బి. మనోహరి | 317 |

# జిల్లాల సమాలోకనం

ఒక ప్రాంతానికి సంబంధించిన సమగ్రమైన సమాచారాన్ని తెలుసుకోవాలంటే అక్కడి చరిత్రను, సాహిత్యాన్ని బాగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా అక్కడి ప్రజల జీవనవిధానాన్ని పరిశీలించాల్సి ఉంటుంది. ప్రస్తుత కాలంలో జీవించే విధానానికి మూలాలను అన్వేషించాల్సి ఉంటుంది. వేరు వేరు కాలాల్లో పొందిన సాంస్కృతికమైన మార్పులను ప్రత్యేకంగా దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంటుంది. ఇట్లా మౌలికాంశాలను బాగా అధ్యయనం చేసినప్పుడే ప్రస్తుత జీవన విధానంలోని ప్రత్యేకతలను పరిశీలించే అవకాశం కలుగుతుంది. తెలుగు ప్రాంతాలలో తెలంగాణ జీవనవిధానంలో ప్రత్యేకత ఉంది. ఉత్తర భారతానికి దక్షిణ భారతానికి మధ్యగా ఉన్న ప్రదేశమిది. రెండు ప్రాంతాలలోని సంస్కృతుల సంగమ స్థానమీ ప్రదేశం. వేరు వేరు రాజుల కాలంలో ఎన్నో మార్పులను పొందిన ప్రదేశమిది. ఉత్తరాది నుండి వచ్చిన పాలకులకు మొదటి విడిది తెలంగాణమే. దక్షిణాదిలో వారు ప్రారంభించే రాజ్యాలకు కేంద్రస్థానమిదే. అంతే కాకుండా గొప్ప రాజ్యాలు ఏర్పాటు చేసుకోవడానికి కావలసిన వనరులు, వాతావరణం సరియైన విధంగా ఉన్న ప్రదేశం కూడా తెలంగాణమే. వ్యాపారాదుల కోసం నదులు, సముద్ర తీరాలను ఆశ్రయించాల్సి వచ్చేది కాని, నిరంతరం ప్రశాంత జీవనానికి, ముఖ్యంగా ప్రకృతి పరమైన ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆహ్లాదాన్ని కలిగించే ప్రదేశం కూడా తెలంగాణమే. అందుకే ఇక్కడ రాజ్యాలన్నీ ఎక్కువగా వెలసినాయి. శాతవాహనుల నుండి ఆసఫ్‌జాహీల వరకు రాజ్యాలన్నింటి ప్రభావం తెలంగాణ ప్రాంతంపైన ఉన్నాయి. వీనితో పాటు పక్క రాష్ట్రాలలోని రాజవంశాలు కూడా కొంత కాలం ఈ ప్రాంతంపై ప్రభావాన్ని చూపడం వల్ల వారి ప్రభావాలు కూడా ఇక్కడి సంస్కృతి, సాహిత్యంపై ప్రత్యేకంగా ముద్రలను వేసినాయి. ఈ అంశాలన్నింటినీ ప్రత్యేకంగా దృష్టిలో పెట్టుకుంటే తెలంగాణ జీవన విధానం అర్థం అవుతుంది. ముస్లిం పాలకుల పాలనలో ప్రారంభంలో బాగానే ఉన్నా రజాకార్ల ప్రభావం మాత్రం తెలంగాణ జీవన విధానాన్ని అస్తవ్యస్తం చేసి మరింత ఇబ్బందులకు గురి చేసింది. అస్తిత్వపు ఆరాటంతో, చైతన్యశీలంతో చేసిన ఎన్నో ఉద్యమాలకు వేదిక తెలంగాణం. ప్రస్తుతం అభివృద్ధి పథంలో ముందుకు నడుస్తున్న ప్రాంతం కూడా తెలంగాణమే.

తెలంగాణంలో అడుగడుగునా కనిపించే చారిత్రకమైన ఆనవాళ్ళు, ఇక్కడ వెలువడిన చిన్న పెద్ద గ్రంథాలన్నింటినీ ప్రస్తుతం అధ్యయనం చేయాల్సి ఉంది. అన్ని శాసనాలలోని చరిత్రను పరిపూర్ణంగా పరిశీలించాల్సి ఉంది. ఇంతకాలంగా పరిశీలించని అంశాలు పరిశోధించి తెలుసుకుంటుంటే తామూ ఒక గొప్ప సంస్కృతికి వారసులమని, ఎందరికో ఆతిథ్యాన్ని ఇచ్చి ఆదరించిన వాళ్ళమనీ, ఆశ్రయాన్ని ఇచ్చినవారమనీ అర్థమయితే మళ్ళీ ఆ ఉన్నతస్థానానికి చేరుకునే ప్రయత్నం జరుగుతుంది. అందుకే మూలాలను అన్వేషించే క్రమంలో అన్ని అంశాలపై సమగ్రతను సాధించడానికి ప్రాంతాల సర్వస్వాలను తయారు చేయాల్సి ఉంటుంది. ఈ సర్వస్వాలలో పూర్వ విషయాలతో పాటు ప్రస్తుత అభివృద్ధి పథం, మార్పులు కూడా ప్రస్ఫుటించాలి. అన్ని ప్రాంతాలకూ ఈ సర్వస్వాలు అవసరమే.

తెలంగాణ జిల్లాలకు సర్వస్వాల అవసరాన్ని గుర్తించి ప్రారంభించినవారు స్వర్గీయ బి.ఎన్.శాస్త్రి గారు. వారు రచించిన నల్లగొండ, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ సర్వస్వాలు ఇప్పటికీ, ఎప్పటికీ ప్రమాణమే. వారు చూపిన మార్గంలో మూసీ మాసపత్రిక కూడా అన్ని జిల్లాలకు సర్వస్వాలు తయారు చేయాలని నిర్ణయించింది. ఇటీవల జిల్లాల పునర్విభజన నేపథ్యంలో 10 జిల్లాలు 31గా రూపుదిద్దుకున్నాయి. దీనివల్ల మూసీ పరిధి కూడా బాగా విస్తరించింది. 31 జిల్లాలకు సంబంధించిన సమాచారాన్ని పరిపూర్ణంగా అందించాలని నిశ్చయించుకున్నది.

జిల్లాల సర్వస్వాలు తయారు చేయడానికి ముందుగా అసలు అక్కడ మనకు లభించే సమాచారాన్ని గమనించాలంటే ఒక ముందుచూపు అవసరంగా భావించి ప్రస్తుతం **'ఆలోకనం'** రూపంలో 31 జిల్లాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించే ప్రయత్నం చేసింది. ఈ సమాచారం పూర్ణమనీ, సమగ్రమనీ భావించడం లేదు. జిల్లాలకు సంబంధించిన ఒక బాహ్యదృష్టి మాత్రమే. దీనిని మూలంగా పెట్టుకుంటూ ఆ ప్రాంతాన్ని ఏ రూపంలో చూడాలో అధ్యయనం చేయడానికి ఇది ఉపయోగపడుతుంది. ఆ యా జిల్లాలలో ఏ అంశాలపై అధికమైన దృష్టి కేంద్రీకరించాలో తెలుసుకునేందుకు ఈ సమాచారం వినియోగపడుతుంది. ముఖ్యంగా చరిత్ర, సాహిత్యంపై అత్యధికమైన దృష్టిని కేంద్రీకరిస్తూ ఆధునికమైన మార్పులను గమనించాల్సిన అవసరం కనిపిస్తుంది.

మూసీ మాసపత్రిక త్వరలో 31 జిల్లాలకు సంబంధించిన ప్రముఖ రచయితలతో సమావేశం నిర్వహించి ఒక ప్రత్యేకమైన ప్రణాళికతో, జిల్లాలకు సంబంధించిన ప్రాచీన, ఆధునిక సమాచారాలను అందించే ప్రయత్నం చేస్తుంది. దీనితో పాటు ఆయా జిల్లాలకు సంబంధించిన సాహిత్య సమాచారాన్ని, వైభవాన్ని అందించేందుకు గాను ఒక ప్రత్యేక జిల్లా సాహిత్య సంచికను కూడా ఈ సర్వస్వాలకు జత చేయబోతుంది. అప్పుడు ఆ యా ప్రాంతాలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఒకే చోట లభించే అవకాశం కలుగుతుంది. ఇది ప్రస్తుత తరాలకు, భావి తరాలకు కూడా వినియోగ పడుతుంది. తరువాతి తరాల వారు తయారు చేసే ప్రత్యేక సర్వస్వాలకు, సాహిత్య సంచికలకు ఇది ఆధారభూతమౌతుంది. ఈ ప్రయత్నానికి ఆ శ్రీమాత అన్ని రకాలైన శక్తులను మాకు అందించాలని ప్రార్థిస్తున్నాం.

మూసీ ఆర్థికంగా బలమైన పత్రిక కాదు. దీన్ని బలోపేతం చేయాల్సిన ఒక చారిత్రక అవసరం కూడా ప్రస్తుతం ఉంది. ఒక వర్గానికి, ఒక భావజాలానికి మాత్రమే పరిమితమైన విధానం కాకుండా స్వర్గీయ బి.ఎన్.శాస్త్రిగారి మార్గంలో అన్ని ప్రక్రియలకు, అన్ని వాదాలకు, ప్రాచీన ఆధునిక కవితా రీతులకు, సంస్కృతానికి, చరిత్రకు అన్నింటికీ ప్రాధాన్యం ఇస్తూ కొనసాగుతున్న ఒకే ఒక పత్రిక మూసీ. మూసీ ఆర్థికంగా బలోపేతం కాకపోయినా మూసీకి వ్యాసం కావాలని ఎవరికి ప్రస్తుతం ఫోన్ చేసినా, వారు ఎంతటి ఒత్తిడులలో ఉన్నా వెంటనే అందిస్తూ మూసీకి మేము ఉన్నాము అనే భావాన్ని కలిగిస్తున్నారు. ఈ శక్తి మూసీకి రావడం శ్రీ శాస్త్రిగారి ఆశీర్వచనమే.

ప్రస్తుతం వెలువడిన ఈ సంచికలో రచయితలందరూ సానుకూలంగా స్పందించినప్పటికీ ప్రపంచ తెలుగు మహాసభల ఒత్తిడులలో సమాచారం కోసం వారిని కొంత ఎక్కువగా ఇబ్బంది పెట్టాల్సి వచ్చింది. చాలా వ్యాసాలు మరోసారి ఫోన్ కూడా చేయాల్సిన అవసరం లేకుండా వచ్చాయి. కొందరు అత్యధికంగా సమాచారం పంపించారు. దానికి మేము కొంత సవరించుకోవాల్సి వచ్చింది. రెండు మూడు జిల్లాలకు సంబంధించిన సమాచారం కొంత అసమగ్రంగా చేరినప్పుడు మరో రచయితను ఏర్పాటు చేసుకుని పూర్తి చేయాల్సి వచ్చింది. ఈ మార్పులను గమనించాల్సిందిగా కోరుకుంటున్నాం.

ప్రస్తుత కాలంలో విద్యార్థులు, పరిశోధకులు, రచయితలు అందరికీ తమ ప్రాంతాన్ని అధ్యయనం చేసుకోవడానికి ఒక దిక్సూచిలాగా ఏర్పడినదే **'ఆలోకనం'**. ఈ ప్రయత్నం వెనుక ఎందరో సాహితీవేత్తలు, చారిత్రక మూర్తులు, పరిశోధకులు వెన్నుదన్నుగా నిలుచున్నారు. ఈ గ్రంథం ఈ రూపానికి రావడానికి కారకులైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ప్రత్యేకంగా ధన్యవాదాలను తెలియజేసుకుంటున్నాం.

**- సంపాదక వర్గం**

# ధన్యవాద శతం

1980లో స్వర్గీయ శ్రీ బి.ఎన్.శాస్త్రి గారి చేత ప్రారంభింపబడిన 'మూసీ' 6 సంవత్సరాల తర్వాత వారి పరిశోధనల కోసం ఆగిపోయింది. 1997 నవంబర్‌లో వారి ఆధ్వర్యంలోనే పునః ప్రారంభింపబడింది. అప్పటినుండి ఇప్పటివరకు చిన్న చిన్న అవాంతరాలు వచ్చినా నిర్విఘ్నంగా కొనసాగుతూనే ఉంది. శాస్త్రిగారు 2002లో ఈ లోకం నుండి భౌతికంగా దూరమైనప్పటికీ వారి స్ఫూర్తి, ఉన్నతమైన సంకల్పబలం వల్ల పత్రిక నిర్విఘ్నంగా కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం అన్ని విశ్వవిద్యాలయాల తెలుగు శాఖలు 'మూసీ' మాసపత్రికను 'పరిశోధనాత్మక మాసపత్రిక'గా గుర్తించాయి. త్వరలో ఈ పత్రికకు ప్రభుత్వ సంబంధమైన ఐఎస్ఎస్ఎన్ సంఖ్య కూడా రాబోతున్నది. **'మూసీ మాస పత్రిక – సాహిత్య సేవ'** అనే అంశంపై శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి., పూర్తి అయింది. మద్రాసు విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్. జరిగింది. సమగ్రమైన సాహిత్యం, సాంస్కృతిక వికాసం, సుచరిత్ర స్పృహ అనేవి ప్రత్యేకాంశాలుగా మూసీ మాసపత్రిక ముందుకు సాగుతున్నది.

మూసీ మాసపత్రిక గతంలో ద్వైవార్షిక సంచిక, తెలుగు సంస్కృతి, సుచరిత, మన తెలుగు, కదంబం వంటి ప్రత్యేక సంచికలను వెలువరించి అందరి అభినందనలనూ పొందింది. వేరు వేరు సందర్భాలలో ఆరుద్ర స్మృతి సంచిక, చారిత్రక నవలా శతాబ్ది సంచిక, బూర్గుల రామకృష్ణారావుగారిపై ప్రత్యేక సంచికల వంటివే గాకుండా ఇటీవల ఆచార్య సి.నారాయణ రెడ్డి గారిపై స్మృతి సంచికను, ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా **'తెలంగాణ తెలుగు పరిశోధన'**పై ప్రత్యేక సంచికను వెలువరించింది. ఆకాశవాణి జాతీయ కవిసమ్మేళనం ప్రత్యేక అనువాద కవితలను ప్రతి ఫిబ్రవరి సంచికలలోనూ ప్రచురిస్తూ ఉన్నది. పరిశోధనా వ్యాసాలకు, ఉన్నతమైన కవిత్వానికి, భావ వ్యక్తీకరణకు వేదికగా నిలుస్తున్న మూసీ తనదైన ప్రత్యేకతను చాటుకుంటూనే ఉన్నది.

'ఆలోకనం' – 31 తెలంగాణ జిల్లాల సాహిత్యం, చరిత్ర, సంస్కృతీ సమాహారం అనే ఈ గ్రంథానికి సంబంధించిన భావనలు దాదాపు 6 నెలలుగా ఉన్నప్పటికీ ప్రపంచ తెలుగు మహాసభల వల్ల ప్రస్తుతం అది రూపుదాల్చింది. 'ఆలోకనం' గ్రంథ రూపంలో రావడానికి ఈ సభల సందర్భంగా మూసీ పత్రికకు ఆర్థిక సహకారాన్ని అందించిన **'తెలంగాణ సాహిత్య అకాడమీ'** వారికి, దానిని నిర్వహిస్తున్న అధ్యక్షులు డా॥ నందిని సిధారెడ్డి గారికి, నిర్ణాయక సంఘానికి ధన్యవాద శతం.

ఈ కార్యక్రమ రూపకల్పన చేయడంలో సహకరించిన పెద్దలు, ఆత్మీయులు డా॥ శ్రీరంగాచార్య, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీ అష్టకాల రామ్ మోహన్, డా॥ జి. గిరిజా మనోహర్, డా॥ డి. కామేశ్వర రావు, శ్రీ శ్యామలాప్రసాద్ గార్లకు ధన్యవాద శతం.

ఈ కార్యక్రమం అత్యంత వేగంగా నిర్వహించడంలో సహకరించిన 31 జిల్లాల సమాచార రచయితలందరికీ, తమ పద్యకవితలను అందించిన డా॥ అయాచితం నటేశ్వర శర్మ గారికి ధన్యవాద శతం.

ఈ బృహత్తర కార్యక్రమ నిర్వహణలో, అక్షర రూపం కల్పించడంలో, ఫోటోల ముద్రణలో, సేకరణలో హృదయపూర్వకంగా తోడ్పడిన ఎ. దత్తయ్య, ఎ. శ్రీనాథ్ రావు, ఎం. ఆనంద్, వి. వేణు, డా॥ ఎం. శ్రీకాంత్ కుమార్, ఎన్. ప్రవీణ్ రెడ్డి మొదలైన పరిశోధక విద్యార్థులకు, ఆత్మీయులకు ధన్యవాద శతం.

అన్ని పనులు తమవిగా భావించి నిద్రాహారాలు మాని ఈ గ్రంథం వెలువడడంలో సహకరిస్తున్న ఆత్మీయులు శ్రీమతి జె.ఎల్. అనూరాధ గారికి, మూసీ ఆఫీస్ ఇన్‌ఛార్జ్ చి॥ విజయలక్ష్మికి ధన్యవాద శతం.

మూసీ మాసపత్రిక ప్రతిమాసం కవర్ పేజీ డిజైన్ చేస్తూ, ఈ సంచికలోని రంగు పేజీలన్నింటికీ ఓర్పుతో రూపకల్పన చేసిన శ్రీ గోపి పురాణిక్, ఆనంద్ ప్రింటర్స్ గారికి, ముఖపత్రాలంకరణ చేసిన ఆత్మీయ మిత్రుడు డా॥ పత్తిపాక మోహన్ గారికి, ఈ గ్రంథ ముద్రణతో పాటు ప్రతి మాసం మూసీని సకాలంలో అందిస్తున్న శ్రీసాయి ప్రాసెస్ అధినేత శ్రీ వి. రాజశేఖర్ రెడ్డి గారికి ధన్యవాదశతం.

**– మూసీ మాసపత్రిక**

# ఆదిలాబాద్ జిల్లా చిత్రపటం





జైన్ దేవస్థానం



నాగోబా



నాగోబా దేవాలయం



కుంటాల జలపాతం



గోండు కళాకారుడు



సామల సదాశివ

# ఆదిలాబాద్

వన జలపాత శోభలకు వారధియై విలసిల్లు నేలయై
యనయము వన్యశోభల విహాసము సల్పెడి పర్వతాలతో
కనుగొన జైన సంస్కృతిని కాంతుల దీరిన గోండు సంస్కృతిన్
సునయనమొంద జేసినది చూడగ నిద్ది వరాల మూటయై!

ఉత్తర భారతదేశం నుండి దక్షిణాదికి వస్తూ పెన్‌గంగా నది దాటి తెలంగాణాలో ప్రవేశించగానే ఆదిలాబాదు వాకిలి స్వాగతం పలుకుతుంది. అకారాది క్రమంలో చూసినా తెలంగాణాలోని తొలి జిల్లా ఆదిలాబాదు మాత్రమే అవుతుంది.

తెలంగాణా రాష్ట్రంలో ఆదిలాబాదు జిల్లాకు ఒక ప్రత్యేకమైన స్థానమున్నది. ఆదిలాబాదు అనగానే అడవుల జిల్లా అని, ఆదివాసుల జిల్లా అని అంటారు. గలగలా పారే సెలయేర్లు, ఉవ్వెత్తున ఎగిసిపడుతూ జాలువారే జలపాతాలు, పర్వతాలు, లోయలు, నిసర్గ రమణీయమైన జిల్లా ఆదిలాబాదు. ఇక్కడ తెలుగుతో పాటు ఉర్దూ మరాఠీ భాషలు కలగలిసి పోయినవి.

### ఈ పేరెందుకు?

ఈ ప్రాంతమంతా ఒకప్పుడు బీజాపూర్ సుల్తాన్ మహ్మద్ ఆదిల్‌షా పాలనలో ఉండేది. ఆదిల్‌షా ఈ ప్రాంతాన్ని తమ ఆర్థిక మంత్రికి ఇనాముగా ఇచ్చినాడట. అతడు తనకు సంక్రమించిన ఈ జాగీరును ఒక నగరంగా తీర్చిదిద్ది తమ పాదుషా పేరు వచ్చేట్లుగా ఆదిల్‌షా ఆబాద్ అని నామకరణం చేసినాడు. అది క్రమంగా ఆదిల్ – ఆబాద్ అయ్యి ఆదిలాబాదుగా మారింది. ఫారసీ భాషలో ఆబాద్ అంటే నివాస యోగ్యమైన, సుసంపన్నమైన భూభాగమని అర్థం.

అయితే ఈ నగరం సమృద్ధిగలది కనుక ఇక్కడ అన్నీ అంగళ్లుండేవి. అంగడి అంటే దుకాణమని అర్థమున్నప్పటికి తెలంగాణాలో అంగడి అంటే "సంత" అనేదే రూఢి అర్థం. దానికో బాజార్ అనే ఫారసీ మాటలను జోడించి అంగడి బజార్ అని అంటారు. ఆదిలాబాదులో బాజార్ హత్నూర్ అని ఒక మండలమున్నది. అక్కడ కూడా సంత జరుగుతుంది. కనుక దాన్ని బాజార్ హత్నూర్ అన్నారు. అటువంటి మరో హత్నూర్ గూడా వున్నది. అక్కడొక ప్రాచీన శివాలయ మున్నందున దాన్ని గుడిహత్నూర్ అన్నారు. ఇదీ మండల కేంద్రమే. నార్నూర్ మండలంలో తడిహత్నూర్ అని ఒక గ్రామముంది. ఈ తడి యేమిటో తెలుసుకోవలసిన అవసరముంది. అయితే దాన్ని లంబాడీ భాషలో తడి హడవ్‌నూర్ అంటారు.

ఆదిలాబాదులో కూడా ఒక అంగడి వుండేది. అది ఎడ్ల అంగడి. ఈ అంగడిలో మేలు రకమైన ఎడ్లు లభిస్తాయని చుట్టు పక్కల చాలా దూరం నుండి, మహారాష్ట్ర నుండి కూడా వ్యవసాయదార్లు, దళారీలు వచ్చి ఇక్కడి ఎడ్లను ఖరీదు చేసేవారు. తద్వార ఇక్కడి గ్రామ పంచాయితీకి చాలా లాభం చేకూరేది. రానురాను ఈ ఊరిని ఎడ్లంగడి ఊరని – ఎడ్లపురమని – ఎడ్లాపురమని – ఎదులాపురమని – ఎదులా

### రెవెన్యూ డివిజన్లు - మండలాలు

ఆదిలాబాదు జిల్లాలో ఆదిలాబాద్ మరియు ఉట్నూరు అనే రెండు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. ఈ రెండు డివిజన్లలో మొత్తం 18 మండలాలున్నాయి.

**ఆదిలాబాద్ రెవెన్యూ డివిజన్‌లోని 14 మండలాలు:**

1. ఆదిలాబాద్ 2. ఆదిలాబాద్ రూరల్ 3. మావల 4. గుడిహత్నూర్ 5. ఇచ్చోడ 6. సిరికొండ 7. నేరడిగొండ 8. బోథ్ 9. బజార్ హత్నూర్ 10. బేల 11. జైనద్ 12. తామ్సి 13. తలమడుగు 14. భీంపూర్.

**ఉట్నూరు రెవెన్యూ డివిజన్‌లో 4 మండలాలు :**

1. ఉట్నూర్ 2. ఇంద్రవెల్లి 3. గాదిగడ 4. నార్నూర్.

బాద్ అని రకరకాలుగా పిలుచుకోవటం పరిపాటయింది. అందుకే ఎదులాబాద్ కాస్తా ఆదిలాబాద్ అయిందని ఒక వాదం కూడా వినిపిస్తుంది. ఈనాడూ పాతతరంవారు ఆదిలాబాదును ఎడ్లాపురమని పిలువడం అక్కడక్కడ వినిపిస్తుంది.

ఒక ప్రముఖ తెలుగు దినపత్రిక ఆదిలాబాదులోని ఒక ప్రాంతాన్ని ఎడ్లాపురమనే పేరుతో వార్తలు రాయటం గమనించవచ్చు. విస్తీర్ణంలో నగరం పెద్దది కనుక కొంత భాగాన్ని ఆ పేరుతో పిలుచుకొని వార్తలు రాస్తున్నారనవచ్చు.

1872లో ఆసఫ్‌జాహీల కాలంలో సిర్పూర్, తాండూర్ ఉప జిల్లాలుగా యేర్పడగా ఏదులాపురం రాజూరా, సిర్పూర్, తాలూకాలుగా వుండేవి. 1905లో ఆదిలాబాదు స్వతంత్ర జిల్లాగా ఏర్పడింది. అప్పటివరకు నిజామాబాదు జిల్లాలో వున్న నిర్మల్, నర్సాపూర్ తాలూకాలు ఆదిలాబాదుకు అనుసంధానించబడినాయి. అట్లాగే చెన్నూరు లక్సెట్టిపేట తాలూకాలను కరీంనగరం (ఎలగందల) నుండి విడదీసి ఆదిలాబాదులో విలీనం చేసినారు.

1907లో జనగామ గ్రామాన్ని ఆసిఫాబాదు జిల్లాగా మార్చినారు. ఈనాటికీ పాతతరంవారు ఆసిఫాబాదును జనగామ అనే పిలుస్తారు. పరిపాలనా సౌలభ్యం కోసమని ఆదిలాబాదు జిల్లాను 1913-14 సంవత్సరాలలో ఆసిఫాబాదుకు మార్చినారు. ఆసిఫాబాదులో సమస్త సౌకర్యాలను కల్పించినారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు - ఉద్యోగుల ఆవాసగృహాలు, న్యాయస్థానం, జిల్లా కారాగారం, అవ్వల్ తాలూక్‌దార్ (కలెక్టర్), దువ్వల్ తాలూక్‌దార్ (డిప్యూటీ కలెక్టర్) కార్యాలయాలు, జిల్లా ఖజానా - వైద్య ఆరోగ్య శాఖాధికారుల కార్యాలయాలు, జిల్లా దవాఖానా - టప్పాఖానా, ప్రభుత్వ పాఠశాల భవనాలు, కళాశాల భవనాలు, విశ్రాంతి భవనం నిర్మింపబడ్డాయి. నిజాం రైల్వే ఆసిఫాబాదు దగ్గరలోని రెబ్బెన స్టేషన్‌ను ఆసిఫాబాద్ రోడ్ అని మార్చి అక్కడ అన్ని రైళ్ళు ఆగేటట్లుగా ఆదేశాలివ్వబడినాయి. 27 సంవత్సరాలు ఆసిఫాబాదు జిల్లా నిర్విఘ్నంగా కొనసాగింది. తర్వాత పరిపాలనా సౌలభ్యమనే పేరుతో 1941 లో తిరిగి ఆసిఫాబాద్‌నుండి జిల్లా కేంద్రాన్ని ఆదిలాబాదుకు తరలించినారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత విజయదశమి రోజు 31 జిల్లాలు యేర్పడగా నిర్మల్ - మంచిర్యాల - కొమురంభీం ఆసిఫాబాదు జిల్లాలు విడిపోగా ఆదిలాబాదు జిల్లాగా యేర్పడింది.

### భౌగోళిక స్వరూపం - పరిధి

ఆదిలాబాదు 77-46-80 రేఖాంశములు, 18-40-19-56 అక్షాంశముల మధ్య వ్యాపించి ఉంది. 4,153 చదరపు కి.మీ. వైశాల్యం కలిగి సముద్రమట్టానికి మూడువేల అడుగుల ఎత్తున వున్నది. ఈ జిల్లాకు ఉత్తరాన మహారాష్ట్రలోని యావత్ మాల్ చంద్రాపూర్ జిల్లాలు, తూర్పున మంచిర్యాల, పడమర కొమురంభీం, ఆసిఫాబాద్ జల్లా, దక్షిణాన నిర్మల్ జిల్లాలున్నాయి.

### సహజ వనరులు

ఆదిలాబాదు జిల్లాలో సహజ వనరులు తక్కువ. గ్రానైటు, మాంగనీసు, ఇసుక మినహా మిగతా ఖనిజ వనరుల శాతం తక్కువే. పూర్వపు జిల్లాలో బొగ్గగనులు, అడవులు, నదులు, అంతంతగానైనా వుండేవి. జిల్లా పునర్వ్యవస్థీకరణ కారణంగా ఇప్పుడు సహజ వనరుల శాతం తగ్గిపోయింది.

**నేలలు :** ఆదిలాబాదు జిల్లాకు వాయువ్యంగా సహ్యాద్రి పర్వతశ్రేణి దర్శనమిస్తుంది. ఈ జిల్లా దక్కన్ పీఠభూమిలో విస్తరించి సముద్రమట్టానికి 3000 అడుగుల ఎత్తు మీద స్థితమై వున్నది. ఇక్కడ భూములన్నీ నల్లరేగడి భూములు. ఈ భూములు నీటిని త్వరగా పీల్చుకుని తేమ శాతాన్ని నిలుపుకొని వుంచుకుంటాయి. ఈ నేలలు అధిక వర్షపాతాన్ని తట్టుకోలేవు. నీటి నిలువ అధికమైతే పంట నశించే ప్రమాదముంటుంది. ఈ నేలల్లో ప్రధానంగా పత్తి పండిస్తున్నారు. జొన్న – కంది, సోయా చిక్కుడు – పసుపు పండిస్తున్నారు. ఆదిలాబాదు జిల్లా గుడిహత్నూర్, ఇంద్రవెల్లి మండలాల రైతులు కూరగాయలు పండించడంలో నేర్పరులు. ఇక్కడినుండి తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు మహారాష్ట్ర లోని మార్కెట్‌కు ఇక్కడి కూరగాయలు సరఫరా చేస్తారు.

**అడవులు :** 1952 జాతీయ అటవీ విధానం ప్రకారం మొత్తం భూభాగంలో 33% అటవీప్రాంతం వుండాలి. తెలంగాణాలో 24.35 శాతము వుండగా ఆదిలాబాదు రాష్ట్రంలోనే అడవులశాతం అధికంగా వున్న జిల్లాగా గుర్తింపు పొందింది. జిల్లాలో 40 శాతం అడవులతో ఆదిలాబాదు జిల్లా అనగానే అడవుల జిల్లా అనిపించుకున్నది. ఉమ్మడి ఆదిలాబాదులో అభయారణ్యాలున్నాయి. జిల్లా విడిపోగానే ఆదిలాబాదు అడవుల శాతం కూడా తగ్గిపోయింది.

అడవులు అధికంగా వున్నందున ఆదిలాబాదు జిల్లాలో వర్షపాతం అధికంగా ఉంటుంది. చలి అత్యల్పంగా నమోదై, ఎండ అత్యధికంగా నమోదవుతుంది.

**నదులు :** ఆదిలాబాదులో చెప్పుకోదగ్గ పెద్ద నదులు లేనట్లే. ఆదిలాబాదుకు ఉత్తర సరిహద్దు గుండా ప్రవహించే పెన్‌గంగానది గోదావరికి ఉపనది. ఆదిలాబాదు వాసుల చిరకాల కోరిక పెన్‌గంగానదికి ఒక బ్యారేజి కావాలని. తెలంగాణా రాష్ట్రావిర్భావం తరువాత ఆదిలాబాదు వాసుల కల సాకారం కాబోతున్నది. పెన్‌గంగానదిపై కొరట – ఛనాక బ్యారేజి నిర్మాణం పనులు చురుకుగా సాగుతున్నాయి.

**మున్సిపాలిటీ :** ఆదిలాబాదు

**రెవెన్యూ గ్రామాలు :** 504

**గ్రామపంచాయితీలు :** 243

**పార్లమెంటు నియోజకవర్గం :** ఆదిలాబాద్

**అసెంబ్లీ నియోజక వర్గాలు :** 1. ఆదిలాబాద్ 2. బోథ్ 3. ఖానాపూర్‌లోని కొన్ని గ్రామాలు

**పట్టణాలు :** జిల్లాలో ప్రధానంగా రెండు పట్టణాలున్నాయి. అవి ఆదిలాబాద్, ఉట్నూరు

ఇక ఇక్కడ ప్రవహించే నదులేవీ లేవు. భీంసరి పెండలవాడు – లాండసాంగి వాగులు మాత్రమే. ఇవీ వర్షాకాలంలో మాత్రమే ప్రవహిస్తాయి. ఏడు నదుల కలయిక సాథ్‌నాల ప్రాజెక్టుగా రూపు దిద్దుకున్నది. తర్నంవాగు కూడా ఆదిలాబాదులో ప్రవహించే నదిగా చెప్పవచ్చు.

**చెరువులు – ప్రాజెక్టులు :** ఆదిలాబాదు జిల్లాలో చెరువుల సంఖ్య అధికమే అయినప్పటికీ చాలావరకు చెరువులు కనుమరుగైనాయి. మిషన్ కాకతీయ వలన కొన్ని చెరువులు పునరుజ్జీవితమై జలసిరి సంతరించుకొని అలుగు దుంకుతున్నవి. అటువంటి వాటిలో ప్రధానంగా కజ్జర్ల చెరువు, ఇంద్రవెల్లి చెరువులను ఉదాహరణగా చెప్పవచ్చు.

ఆదిలాబాదు నగరానికి చుట్టూ నాలుగు చెరువులు కళకళలాడేవి. ఆ చెరువుల దాపున వుండే వాడలను పెద్ద చెరువు వాడ, చిన్న చెరువు వాడ అని పిలిచేవారు. ఇప్పటికీ అట్లాగే పిలుస్తారు. కానీ చిన్న చెరువు నామరూపాలు లేకుండా మాయమయింది. పెద్ద చెరువు మాత్రం ఆదిలాబాదు పట్టణానికి సమాంతరంగా వున్నది. ఈ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చే ప్రతిపాదనలున్నాయి. ఆదిలాబాదు పట్టణానికి ఏడు కి.మీ. దూరంలోని మావలచెరువు నుండి వచ్చే నీరు ఆదిలాబాదు పట్టణ ప్రజల దాహార్తి తీరుస్తుంది.

ఉట్నూరు చెరువులు కూడా సాగునీటికి ఉపయోగ పడుతున్నాయి. చాలా వాగులు, ఒర్రెలు ఎండాకాలం

ఎండిపోయి వర్షాకాలం మాత్రం వరదలు వచ్చేట్లుగా తయారవుతాయి. వీటిని చెరువుల్లోకి మళ్లించగలిగితే ఇంకా ఎన్నో చెరువులు జలకళను సంతరించుకునేవి అనుకునేవారు తెలంగాణ ప్రజలు. ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయలో భాగంగా జిల్లాలోని చాలా చెరువులు పునరుద్ధరించ బడినాయి.

ఆదిలాబాదులో రెండే ప్రాజెక్టులున్నాయి. ఒకటి సాథ్‌నాలా ప్రాజెక్టు కాగా మరొకటి మత్తడివాగు ప్రాజెక్టు. పెనుగంగపై కొరటఛనాక బ్యారేజి నిర్మాణంలో వున్నది.

**జలపాతాలు :** ఆదిలాబాదు జిల్లాలో జలపాతాలకు కొదువలేదు. అందులో ముఖ్యమైనది కుంటాల జలపాతం. నేరెడిగొండ మండల కేంద్రానికి 12 కి.మీ. దూరంలో సహ్యాద్రి పర్వత శ్రేణుల మధ్యనుండి జాలువారే ఈ జలపాతం 120 అడుగుల ఎత్తు నుండి ఉరకలెత్తుతూ, వయ్యారంగా జాలువారుతుంది. దీనిని కుంతల జలపాతం అని కూడా అంటారు. జలపాతం పక్కనే వున్న గుట్ట లోపల ఒక గుహలో సోమేశ్వర స్వామి వెలసినాడు. శివరాత్రి నాడు ఇక్కడ జాతర సాగుతుంది.

కుంటాల జలపాతం రాష్ట్రంలోనే అతి పెద్ద జలపాతంగా పేరు గాంచినది. ఈ జలపాతానికి దగ్గరలోనే కాకతీయుల కాలం నాటి దేవతా విగ్రహాలున్నాయి. కుంటాల తరువాత చెప్పుకోవలసింది పొచ్చెర జలపాతం. ఇది బోథ్ మండల కేంద్రానికి ఏడు కి.మీ. దూరంలో వున్నది. నేరడిగొండ మండలం తర్నం(కే) గ్రామం దగ్గర ఏర్పడిన జలపాతాన్ని గాయత్రి జలపాతమంటారు. ఇక్కడ 60 అడుగుల ఎత్తునుండి నీళ్లు జాలువారుతాయి. బజార్‌హత్నూర్ మండలం దేగామ వద్ద కనకదుర్గ జలపాతమున్నది. బోథ్ మండలంలోనే మరో రెండు జలపాతాలున్నాయి. అవి ఘన్‌పూర్ జలపాతం. బుంగనాల జలపాతం. జాతీయ రహదారి నుండి వాంకిడి వద్ద ఒక కిలోమీటరు దూరంలో వున్న జలపాతాన్ని సవతుల గుండమని, అత్తా కోడండ్ల గుండమని వ్యవహరిస్తారు.

బోథ్ తాలూకాలో నెలకొని వున్న ఈ ఏడు గుండాలను లేదా జలపాతాలను కలిపి బోథ్ తాలూకాను సప్తగుండాల తాలూకా అంటారు. ఈ సప్త గుండాలు ఆదిలాబాదు జిల్లాలో వుండటం విశేషం.

**జనాభా :** ఆదిలాబాద్ జిల్లా జనాభా 7,08,972. అందులో పురుషుల జనాభా 3,56,407, స్త్రీల జనాభా 3,52,565. దీనిలో గ్రామీణ జనాభా శాతం75.34%, పట్టణ జనాభా శాతం 23.66%, జనసాంద్రత 171, లింగ నిష్పత్తి 1000 :989.

**అక్షరాస్యత :** అక్షరాస్యతా శాతం 63.46. ఇది తెలంగాణ రాష్ట్ర సగటు అక్షరాస్యతా శాతం కన్నా 3% తక్కువ. పురుషుల అక్షరాస్యత 73.48%, స్త్రీల అక్షరాస్యత 53.40%.

## ఆదిలాబాదు జిల్లా చరిత్ర

ఆదిలాబాదు అనగానే ముందుగా గుర్తుకు వచ్చేవారు గోండులు. 500 సం॥లు పరిపాలించినారంటే ఈతరం వారికి ఆశ్చర్యం కలుగుతుంది కానీ అది నిజం. క్రీ.శ. 870లోనే గోండు నాయక వ్యవస్థ ఆదిలాబాదులో ప్రారంభమయిందని చరిత్రకారుల అభిప్రాయం. మహారాష్ట్ర నుండి వలస వచ్చిన గోండులు క్రీ.శ.1220లో కోల్బిల్ అనే గోండురాజు నాయకత్వంలో స్థిరపడ్డారు. ఆదిలాబాదులోని చెన్నూరు, సిర్పూరు, ఉట్నూరు ప్రాంతాలలో వీరు 22 ఖిల్లాలు నిర్మించినారు. ఉట్నూరులోని కోట శిథిలాలను ఈనాటికీ చూడవచ్చు.

కోల్బిల్ తర్వాత 1240 నుండి 1262 వరకు భీం బల్లాసింగ్ పరిపాలన కొనసాగింది. ఇతను సిర్పూరు రాజధానిగా గోండ్వానా రాజ్యాన్ని విస్తృతపరచినాడు. వీరందరి పాలన క్రీ.శ. 1751 వరకు సాగింది. నీలకంఠషా గోండు రాజులలో చివరి రాజు. ప్రభోజీ, భోంస్లే గోండ్వానాను జయించి 1853 వరకు తమ ఆధీనంలో వుంచుకొన్నాడు. చంద్రపూర్, ఉట్నూర్, మాణిక్‌ఘడ్ గోండు రాజ్యాలు బ్రిటిష్ సామ్రాజ్యంలో విలీనమయినాయి.

స్వాతంత్ర్యానికి పూర్వం ఈ ప్రాంతం నిజాం పాలనలో వుండేది. 1935లో నిజాం పాలనపై విరక్తి చెందిన కొమురం భీము తిరుగుబాటు చేసినాడు. జోడేఘాటును కేంద్రంగా

చేసుకొని నిజాముపై తిరుగుబాటు చేసిన కొమురంభీము 1940 ఆశ్వీయుజ పౌర్ణమినాడు అమరుడైనాడు.

ఆదిలాబాదు జిల్లాలో ఆదివాసులైన గోండుల వెనకబాటుతనానికి, నిజాం రాజ్యంపై తిరుగుబాటుకు కారణాలు తెలుసుకోగోరి ప్రముఖ మానవ పరిణామ శాస్త్రవేత్త ప్రొఫెసర్ హెమండార్ఫ్ అతని సతీమణి బెట్టి ఎలిజబెత్‌ను ఆదిలాబాదుకు పంపింది ప్రభుత్వం. ప్రొఫెసర్ హెమండార్ఫ్ గోండుల జన జీవనాన్ని గురించి పరిశోధన చేసి ప్రభుత్వానికి పరిశోధనా పత్రాలను సమర్పించినాడు. హెమండార్ఫ్ ఇక్కడి గోండుల జన జీవనంతో మమేకమై వారిలో కలిసిపోయినాడు. అతని కొడుకుకు లచ్చుపటేల్ అని పేరు పెట్టుకున్నాడు. హెమండార్ఫ్ మరియు అతని సతీమణి బెట్టి హెమన్‌డార్ఫ్‌ల సమాధులు కూడా ఆదిలాబాదు జిల్లా ప్రస్తుతం ఆసిఫాబాద్ జిల్లాలో వుండటం గమనించవచ్చు.

తొలి తెలుగు యాత్రాచరిత్రకారుడు ఏనుగుల వీరాస్వామయ్య తన కాశీయాత్రా చరిత్రలో ఆదిలాబాదు పట్టణాన్ని సందర్శించి 1830లోని పట్టణ పరిస్థితులను తమ యాత్రాచరిత్రలో నమోదు చేసినాడు. ఆదిలాబాదుకు చేరుకునే మార్గం ప్రమాదకరమైన అడవులతో నిండి వున్నదని పేర్కొన్నారు.

చారిత్రకంగా ఆదిలాబాదు జిల్లా ఎన్నో సంస్కృతుల కలయిక అని చెప్పవచ్చు. మొగలాయిలు మౌర్యులు. దక్షిణ భారత సామ్రాజ్యాధీశులైన శాతవాహనులు ఈ ప్రాంతాన్ని పరిపాలించినారు.

క్రీ.శ. 1947-48 మధ్య జరిగిన ఉద్యమంలో ఆదిలాబాద్ ప్రాంత ప్రజలు, ప్రముఖులు, కవులు, కళాకారులు ప్రముఖ పాత్ర పోషించినారు. స్వాతంత్ర్యోద్యమంలోనూ నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో ఈ ప్రాంత ప్రజలు వీరోచితంగా పోరాడినారు. రామకృష్ణ శాస్త్రిగారు, కస్తాల రామకిష్టుగారు, సదాశివరావు గారు వారి సతీమణి నిర్మలాదేవిగారు, దాజీ శంకర్‌గారు, వన్నెల ఎల్లయ్యగారు, గాలిపెల్లి రాములుగారు వంటి ఎందరినో స్మరించుకొనే అవసరమున్నది.

1956 నవంబర్ 1వ తేదీన హైదరాబాదు రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్ర రాష్ట్రంతో కలిపి కొత్తగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినారు. ఆ విధంగా 1956 నవంబర్ 1వ తేదీ నుండి జూన్ 1, 2014 వరకు ఉమ్మడి ఆదిలాబాదు జిల్లా ఆంధ్రప్రదేశ్ పాలన వుండి తెలంగాణా మలిదశ ఉద్యమాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణా రాష్ట్రంలో విలీనమైనది. ఆ తర్వాత తెలంగాణా జిల్లాల పునర్విభజన సందర్భంగా 2016 అక్టోబర్ 11వ తేదీన ఆదిలాబాదు జిల్లా నూతనంగా ఆవిర్భవించింది.

ఆదిలాబాదు అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎన్నికైన జోగు రామన్నగారు అటవీ పర్యావరణ వెనకబడిన తరగతుల శాఖమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బోథ్ ఎం.ఎల్.ఏ.గా రాథోడ్ బాపురావు, ఖానాపూర్ ఎం.ఎల్.ఏగా శ్రీమతి రేఖానాయక్ గారున్నారు. ఆదిలాబాద్ లోక్‌సభ సభ్యునిగా గోడం నాగేశ్‌గారున్నారు.

## సంస్కృతి

ఆదిలాబాదు జిల్లాలో గిరిజన సంస్కృతి నేటికీ వర్ధిల్లుతూ వున్నది. ఒకప్పటి గిరిజన సంస్కృతిని చాటి చెప్పే కోటలు, కట్టడాలు, గుళ్లు, చెక్కిన రాళ్లు ఇంకా సాక్ష్యాలుగా నిలిచి వున్నాయి.

**ఆచారాలు సంప్రదాయాలు పండుగలు :** వేదాలు, పురాణేతిహాసాలు, వివిధ మత గ్రంథాల నుండి, పెద్దల నుండి, చరిత్ర నుండి సంక్రమించిన అనేక జీవన విధానాలను ఈ జిల్లా ప్రజలు ఆచరిస్తున్నారు. సంప్రదాయంలో భాగమైన వివిధ పండుగలు, నోములు, వ్రతాలు, ఆచారాలు, తూ.చ తప్పకుండా పాటిస్తారు ఆదిలాబాదు ప్రజలు.

వివిధ పండుగల ద్వారా కలిసి మెలిసి జీవించే తత్వాన్ని పెంపొందించుకుంటూ భక్తిని, ఆధ్యాత్మికతను చాటుకుంటున్నారు. దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది, మహాశివరాత్రి, బక్రీద్, రంజాన్, క్రిస్మస్, హోళి, పండుగలను ఇతర జిల్లాల వలెనే జరుపుకుంటారు గానీ ఆదిలాబాదు సంస్కృతి ఆచారాలపై మహారాష్ట్ర ప్రభావం చాలా వున్నందువలన

ఇక్కడి పండుగలు కూడా మరాఠీ ఆచారాల వలెనే అనిపిస్తాయి. ముఖ్యంగా ఆదిలాబాదులో జరిగే పొలాల పండుగ ఆదిలాబాదుకే ప్రత్యేకం. ఈ పండుగ మరే తెలంగాణాలో జిల్లాల్లో కనిపించదు.

ఆదిలాబాదులో మొహర్రం పండుగ చాలా భక్తి ప్రపత్తులతో జరుపుకుంటారు. ఆదిలాబాదు దగ్గరలోని రుయ్యాది గ్రామంలోని హస్సేన్ హుస్సేన్ దేవస్థానం చాలా మహిమ గలదని భావించి చాలా నిష్టగా పూజలు చేస్తారు. దూర దూరాల నుండి భక్తులు ఇక్కడికి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఇంకా భీంసరి, తలమడుగు, కప్పర్ల, చాందా అంకోలి మొదలైన అన్ని గ్రామాల్లో కూడా మొహర్రం పండుగ చాలా భక్తి ప్రపత్తులతో జరుపుతారు. ఆదిలాబాదు పట్టణంలో కూడా మొహర్రం పండుగ తొమ్మిది రోజులు పండుగ వాతావరణంతో అలరారుతుంది. ఆదిలాబాదు జిల్లా తామ్సి మండలంలోని బుడ్డన్ సవారి చాలా మహిమ గలదని ప్రజల విశ్వాసం. అక్కడి మొహర్రం పండగలో బ్రాహ్మలు పాల్గొని పూజాదికాలు చేయడమే గాక నిష్టతో ఉపవాసాలుండి అన్నదానాలు చేస్తారు. ఇంతకంటే మత సహనం మరొకటి లేదని చెప్పవచ్చు.

ఆదిలాబాదులోని పండుగలూ ప్రత్యేకమైనవే. పొలాల పండగ తర్వాత చెప్పుకోదగ్గది నాగుల పంచమి. ఈ పండుగ కూడా మహారాష్ట్రుల నుండి సంక్రమించినదే. నాగుల పంచమి రోజు పాము పుట్టలో పాలు పోసి పుట్టపైన జొన్నపేలాలు చల్లుతారు. అట్లా చల్లిన పేలాలను తీసుకొచ్చి జాగ్రత్తగా దాచిపెట్టి వాటిని వినాయక చవితినాడు ప్రసాదంగా ఇస్తారు. అవి తింటే చవితి చంద్రున్ని చూసిన దోషం పరిహరింప బడుతుందని నమ్ముతారు. నాగులపంచమిరోజు ఆడపడుచులు తమ అన్నలూ, తమ్ముండ్లకు శుభం కలగాలని వారి కండ్లు కడిగే సంప్రదాయమున్నది. అన్నలు తమ్ముండ్లు తమ అక్కలకు కట్నాలివ్వాలి. ఈ సంప్రదాయం కేవలం ఆదిలాబాదులోనే కన్పిస్తుంది.

ఆదిలాబాదులో వినాయక చవితి కూడా ప్రత్యేకమైనదే. ఇక్కడ ప్రతి వాడలో నాలుగైదు వినాయక మంటపాలు యేర్పాటు చేసి కళాత్మకంగా అలంకరిస్తారు. ప్రజలు అవి చూడటానికి తండోపతండాలుగా వెళతారు. ఈ వినాయక మంటపాలకు బహుమతులు కూడా వుంటాయి. ఈ బహుమతులను విజయదశమినాడు ప్రదానం చేస్తారు. హైదరాబాదులో జరిగే వినాయక నవరాత్రుల తరహానే ఆదిలాబాదులో జరుగుతాయి. ఆదిలాబాదు రెండో స్థానంలో నిలుస్తుంది. హైదరాబాదులో ఖైరతాబాదు వినాయకుడు యే విధంగానైతే ప్రత్యేకతను కలిగి వుంటాడో ఆదిలాబాదు పట్టణంలో నూతిమీది గణపతి ప్రత్యేకత కలిగి వుంటుంది.

విజయదశమి, దుర్గా నవరాత్రులు కూడా ఆదిలాబాదులో నియమ నిష్ఠలతో భక్తి ప్రపత్తులతో జరుపుకుంటారు. దసరా రోజు దైవదర్శనం తర్వాత అందరిండ్లకు వెళ్లి జమ్మి ఆకును బంగారమని, చేతిలో పెట్టి పెద్దవారికి పాదాభి వందనాలు చేస్తారు. చిన్నవాళ్లను అక్కున చేర్చుకుంటారు. శత్రువులు కూడా దసరా రోజు మిత్రులవుతారు. ఇది మంచి సంప్రదాయం.

తెలంగాణ అంతటా బతుకమ్మ పండుగ తొమ్మిది రోజులు జరుపుకుంటే ఆదిలాబాదువాళ్లు మాత్రం తమ ఇష్టం వచ్చినన్ని రోజులు జరుపుకుంటారు. తనివితీరా బతుకమ్మ ఆటలాడి పాటలు పాడి ఒకరోజు దినవారాలను దృష్టిలో వుంచుకొని బతుకమ్మను సాగనంపుతారు.

బతుకమ్మ తమ ఆడబిడ్డ అని, పుట్టింటి బిడ్డ అని బుధవారం, శుక్రవారం పంపకూడదని మిగతావారాల్లో ఏదో ఒక వారం బతుకమ్మను సాగనంపుతారు. అయితే ఈ బతుకమ్మ పండగ కూడా విలక్షణంగా వుంటుంది. ఇక్కడ ఆడేది అసలు బతుకమ్మనే కాదు ఆమె బొడ్డెమ్మ. ఇప్పుడందరూ బతుకమ్మ అనే అంటున్నారు. కాని సంప్రదాయం మాత్రం మారలేదు. ఇక్కడ నాటబడే వెంపలి చెట్టుకు కూడా ప్రత్యేకమైన పేరున్నది. దాన్ని ఎలవద్రి చెట్టు అంటారు. **ఎలవద్రి చెట్టుకూ, కోలు ఏడే మొగ్గాలు కోలు** అని పాటలు పాడుతూ తీసుకొస్తారు.

### కళలు

ఆదిలాబాదు కళలకు కాణాచి. ఆదిలాబాదులో జినగరి వాళ్ల భిత్తి చిత్రకళ ప్రత్యేకమైనది. వీరు వినాయకుడు, దుర్గాదేవి మట్టి విగ్రహాలను కూడా తయారు చేస్తారు. ఒకప్పుడు ఆదిలాబాదులోని షావుకార్లు దీపావళికి సున్నాలు వేసిన తర్వాత గోడల మీద వీరితో అందమైన చిత్రాలు వేయించేవారు. దుకాణంలో వీరు వేసిన గజలక్ష్మీ బొమ్మకే దీపావళి లక్ష్మీపూజ జరిగేది. ఇప్పుడీ కళ అంతరించి పోయింది. ఈ కళాకారులకు ఆదరణ లభించటం లేదు. ఈ చిత్రకారులలో పేర్కొనదగినవారు **ఎల్లప్ప తాత.** ఈయన చిత్రించిన చిత్రాలు కొన్ని స్థానిక రవీంద్రశర్మ గారి కళాశ్రమంలో చూడవచ్చు. అక్కడనే ఎల్లప్ప తాత పొట్రేయిట్ (రూపచిత్రం) కూడా దర్శనమిస్తుంది.

ఆదిలాబాదుకే చెందిన ప్రముఖ రచయిత **డా॥ సామల సదాశివగారు** చిత్రకారులు కూడా. వారి బాల్యం ఆదిలాబాద్ జిల్లా తామ్సిలో గడిచింది. తాము ఈ జినగరి కళాకారులు వేసిన చిత్రపటాలు చూసి ప్రేరణలు పొందినారని చెప్పుకునేవారు.

ఆదిలాబాద్‌లో కళాశ్రమ వ్యవస్థాపకులు **శ్రీ రవీంద్ర కుమార్ శర్మగారు** స్వతహాగా శిల్పులు హైదరాబాదులోని ఫైనార్ట్స్ కళాశాలలో, తర్వాత బరోడాలోని ఫైనార్ట్స్ కళాశాల లో శిల్పశాస్త్రాన్ని నేర్చుకొని వచ్చిన రవీంద్రశర్మగారు, ఆదిలా బాదులో కళాశ్రమాన్ని నిర్మించుకున్నారు. అంతరించిపోతున్న జానపద కళలు, వృత్తి విద్యలను, ప్రాచీన వాద్యాలను, వారి కళలను కాపాడడమే గాక వాటిని రాబోయే తరాల వారికి అందించడమే లక్ష్యంగా ఈ కళాశ్రమాన్ని నిర్వహిస్తు న్నారు రవీంద్రకుమార్ శర్మగారు. ఈ ఆశ్రమానికి దేశ విదేశాల నుండి ఎందరో వచ్చి తమ తమ కళలకు మెరుగులు దిద్దుకుంటుంటారు. ప్రతి ఉగాదిరోజు "మిత్రమిలన్" పేరిట ఇక్కడికి కళాకారులెందరో చేరుకొని తమ కళాప్రదర్శన చేస్తారు. ఆదిలాబాదుకు ఎవరు వచ్చినా కళాశ్రమాన్ని దర్శించకుండా వెళ్లరంటే అతిశయోక్తి కాదు.

రవీంద్రశర్మ గారికి లెక్కలేనన్ని పురస్కారాలు లభించాయి. ముఖ్యంగా 2010వ సంవత్సరం ఆం.ప్ర. కళారత్న (హంస) పురస్కారంతో గౌరవించింది.

ఆదిలాబాదు పట్టణానికి చెందిన **శ్రీమతి శైలజా దేశ్‌పాండే** హిందుస్తానీ గాయని. ఆమె భర్త సతీశ్ దేశ్‌పాండే తబ్లా వాయిస్తాడు. ఈ జంట కచేరీలు చేస్తూ సంగీత పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తూ ఔత్సాహికులకు సంగీతం నేర్పుతున్నారు.

### జాతరలు

జైనథ్‌లోని లక్ష్మీ నారాయణస్వామి దేవాలయంలో కార్తీక పూర్ణిమకు రథం తిరగడంతో జాతర ప్రారంభమవు తుంది. జాతర తర్వాత గంగ జాతర సదల్‌పూర్ జాతర తర్వాత ఆదిలాబాదులోని గోపాలకృష్ణ మఠంలో జరిగే జాతర కుడా చెప్పుకోదగినదే! కేస్లాపూర్, ఇంద్రవెల్లిలలో జరిగే గిరిజనుల జాతరలకు చారిత్రకాధారాలున్నాయి.

కేస్లాపూర్ నాగోబా జాతర కోండులలోని మెస్రం వంశీయులకే ఈ దేవాలయం మీద వంశపారంపర్య అధికారాలున్నాయి. ఈ జాతరలో దర్బారు జరుగుతుంది. ఈ దర్బారుకు జిల్లాలోని అధికారులందరూ పాల్గొంటారు. ఈ జాతరలోనే గిరిజనుల సమస్యలకు పరిష్కారాలు చూపాల్సి వుంటుంది. ఈ సంప్రదాయాన్ని ప్రముఖ మానవ పరిణామ శాస్త్రవేత్త హైమన్‌డార్ఫ్ ప్రారంభించినాడు. ఈ నాటికీ ఆ సంప్రదాయం కొనసాగుతున్నది.

ఆదిలాబాద్ జిల్లా బేలా మండలంలోని సదల్‌పూర్ జాతరకు ఎంతో పేరున్నది. సదల్‌పూర్‌లో ప్రాచీన శివాలయం వద్ద ఈ జాతర సాగుతుంది. ఈ జాతరలో ఆదిలాబాద్ నుండే గాక మహారాష్ట్ర నుండి కూడా ప్రజలు ఇక్కడికి చేరుకుంటారు. ఈ జాతర కూడా గిరిజనుల జాతరే కావడం గమనించవచ్చు.

## సాహిత్యం

ఆదిలాబాదులో ప్రాచీనకాలం నాటి సాహిత్యానికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదు. అయితే ఆదిలాబాదు సాహిత్య చరిత్ర **డా॥ సామల సదాశివ గారి** నుండి ప్రారంభించాలి.

ఆదిలాబాదు సాహిత్యంలో మొట్టమొదట పేర్కొనవలసినవారు డా॥ సామల సదాశివగారు. బహుభాషా వేత్త. ఉర్దూ, ఫారసీ, హిందీ, మరాఠీ భాషా సాహిత్యాలను క్షుణ్ణంగా చదివినవారు. ఉర్దూ సాహిత్యం గురించి తెలుగులో తెలుగు సాహిత్యం గురించి ఉర్దూలో వ్యాసాలు రాసినారు. ప్రముఖ మరాఠీ కవి కేశవసుత్‌ను తెలుగువారికి పరిచయం చేసినారు. తొలుత పద్యరచన చేసినప్పటికీ ఆ తర్వాత వచన రచనలకే అధిక ప్రాధాన్యత నిచ్చినారు. ఆం.ప్ర. సాహిత్య అకాడమీ ఉర్దూ అడ్వయిజరీ కమిటీ సభ్యులుగా 20 సం॥లు పనిచేసి ఉర్దూ సాహిత్యాన్ని తెలుగులోకి అనువదించినారు. కథానికలు – నవలలు – పద్యాలు – వ్యాసాలు మొదలైన అన్ని ప్రక్రియల్లోనూ వారికి ప్రవేశమున్నది. చిత్రకారులు కూడా. సంగీత విశ్లేషకులు, వారు సంగీతానికి సంబంధించి మూడు గ్రంథాలు రాసినారు. అవి పాఠకులను విశేషంగా ఆకర్షించినవి. స్వర లయలు అనే గ్రంథానికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్నందుకున్నారు. సదాశివగారు దాదాపు 25 గ్రంథాలు వెలువరించారు. అందులో సింహభాగం ఆం.ప్ర. సాహిత్య అకాడమీ ప్రచురించింది. ఏడవ తరగతి, ఐదవ తరగతి వాచకాలను రాసినారు. ఏడవ తరగతి వాచకంలో కొమురంభీం వీరోచిత పోరాటాన్ని ప్రపంచానికి తొలిసారి పరిచయం చేసిన ఖ్యాతి సదాశివ గారికే దక్కింది.

సదాశివగారు చేసిన అమ్జద్ రుబాయీల అనువాదం ఆనాటి పండితుల ప్రశంసలు పొందడమే కాక ఆం.ప్ర. ప్రభుత్వం వారిచేత ఉత్తమ అనువాద గ్రంథంగా పురస్కారాన్ని అందుకునేలా చేసింది.

కాళోజీ నారాయణరావు తొలి స్మారక పురస్కారాన్ని సదాశివగారికే అందజేసినారు. 2011లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. మా మంచి మాస్టారు అని విద్యార్థుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన డా. సామల సదాశివగారి నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని సొంత ఖర్చుతో నిర్మించి కాగజ్‌నగర్‌లో ప్రతిష్టించే సన్నాహాలు చేస్తున్నారు సిర్పూర్ ఎం.ఎల్.ఎ శ్రీ కోనేరు కోనప్పగారు. ఏ కవికైనా, రచయితకైనా ఇంతకంటే గొప్ప నివాళి వుంటుందా?

## కవులు

ఆదిలాబాదు కవులలో తెలుగు – ఉర్దూ కవులను పేర్కొనవలసి వుంటుంది. ఉర్దూ కవులలో **ఆదిలాబాదీ** అనే కవి తమ కవితలతో ఆదిలాబాదు ఖ్యాతిని ఉత్తర భారత దేశంలోని ఉర్దూ ముషాయిరాల్లో వినిపించడమే గాక అరబ్ దేశాల్లో కూడా ఆదిలాబాదు కీర్తిని ప్రసరింపజేసినారు.

**ఇస్మాయిల్ ఖురేషి** అనే అడ్వకేటుగారు తమ ఇంట్లోనే ముషాయిరాలు జరిపే సాహిత్యాభిమాని. అతని వద్దకు ఎందరో పేరు పొందిన ఉర్దూ కవులు వచ్చి కవితాగానం చేసేవారు. ఫర్హత్ సాహెబ్, అంజుం సాహెబ్, రహీంరాషీ అనే కవులు తమ కవితల ద్వారా ముషాయిరాలలో పాల్గొంటున్నారు.

బోథ్‌కు చెందిన **శ్రీ చరణదాస్ రెడ్డిగారు** భగవద్గీతను ఉర్దూలోకి అనువదించినారు. బోథ్ వాస్తవ్యులు **శ్రీ అంబారావు దేశ్‌పాండేగారు, శ్రీ సామల సదాశివగారు** ఉర్దూలో వ్యాసాలు రాసేవారు. ఆదిలాబాదులో దాదాపు ప్రతి ఇంటిలోనూ ఉర్దూ దినపత్రిక "సియాసత్" వచ్చేదంటే దానిని బట్టి ఇక్కడి వారి ఉర్దూభాషాభిమానాన్ని తెలుసుకోవచ్చు. ఈనాడా పరిస్థితి లేదు.

## పద్యకవులు

ఆదిలాబాదులో ఛందోబద్ధమైన పద్యాలు రాసిన వారిలో తొలుత పేర్కొనవలసింది డా॥ సామల సదాశివగారే! తర్వాత రాజుసారుగా గౌరవింపబడే భావకవి **శ్రీచక్రహరి భోజరాజు వేంకట నరసింహారాజుగారు,** తామ్సికి చెందిన

సదాశివగారు సామల శ్రీవర్ధన్‌గారు, నేరెళ్ల రంగాచారిగారు, తొడిశెట్టి రాములు, కాకరాల పద్మాకర్, తలమడుగుకు చెందిన శ్రీ నేరెళ్ల వేంకటాచార్యులుగారు, చక్రవర్తుల పట్టాభి రామాచార్యులుగారు, వీళ్ళిద్దరూ అవధానాలు కూడా చేసేవారు.

ఈ తరం యువకవుల్లో పద్యరచన చేస్తున్నవారిలో ఉట్నూరుకు చెందిన జ్ఞానేశ్వర్ గారిని పేర్కొనాలి.

**అచల తత్త్వ కవులు**

ఆదిలాబాదులో అచల తత్త్వకవులు కూడా వున్నారు. వారి రచనలు ఆదిలాబాదులోని భజన కూటములలో గానం చేసుకుంటారు. ఈ భజన కీర్తనలు చాలామట్టుకు స్త్రీలు పాడుకుంటుండగా ఆకాశవాణి ఆదిలాబాద్ కేంద్రంవారు రికార్డు చేసి ప్రసారం చేస్తూ వాటికి ప్రచారాన్ని కల్పిస్తున్నారు.

ఈ అచల తత్త్వ కవులు కొందరు పీఠాధిపతులుగా కూడా శిష్యులతో పూజలందుకుంటున్నారు. **నరసింహయోగి** అనే తత్త్వకవి పీఠం ఆదిలాబాదులో నెలకొని ఉన్నది.

అనుభవ కవి **శ్రీ జి. పరమేశ్వరయ్య** ఆధ్యాత్మిక తత్త్వాలు రాసి గానం చేసినారు. వీరు తాంబూర చేతబట్టి తాము రాసిన తత్త్వాలు గానం చేస్తూ భిక్షాటన చేసేవారు. వీరి శిష్య ప్రశిష్యులు అనేకులున్నారు. వీరి ఆధ్యాత్మిక తత్త్వ గీతములు గ్రంథస్థమైనవి. వీరి శిష్యులు భజన మండళ్ళ ద్వారా వీరి రచనలను ఈనాటికీ గానం చేస్తున్నారు.

బండల నాగపురం గ్రామానికి చెందిన తత్త్వకవి **జక్కుల కాశయ్య.** వీరి తత్త్వాలు ప్రజల నాలుకలే ఆకులుగా గానం చేయబడుతున్నాయి. ఈ గాయికా గాయకులు కూడా నిరక్షరాస్యులు. వారిది కేవలం శ్రుత పాండిత్యమే కానీ కవి ఆత్మను చక్కగా పట్టుకొని తన్మయంగా గానం చేస్తారు.

బండల నాగపురం గ్రామానికే చెందిన మరొక ఆధ్యాత్మిక తత్త్వకవి **ఉదారి నాగదాసు.** వీరి ఆధ్యాత్మిక వారసత్వాన్ని అందిపుచ్చుకున్నవారు వారి పుత్రులు **ఉదారి శేషన్న పంతులు గారు.** వీరు కూడా తండ్రి వలెనే ఆధ్యాత్మిక తత్త్వగీతాలు రాసి ప్రచురించినారు. ఉదారి నాగదాసుగారికి కూడా గురుపీఠమున్నది. వీరికి శిష్య ప్రశిష్యులు అనేకులున్నారు. ఈ గురుపీఠానికి ఉత్తర పీఠాధిపతిగా వారి పుత్రులు **ఉదారి కృష్ణమాచార్యులుగారు** వ్యవహరిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఉదారి నాగదాసు వర్ధంతిని వారి కుటుంబ సభ్యులు, శిష్య ప్రశిష్యులు జరుపుకునే సంప్రదాయమున్నది. ఆ సందర్భంగా జరిగే కవి సమ్మేళనంలో పాల్గొన్న వర్తమాన కవులకు బహుమతి ప్రదానం కూడా జరుగుతుంది. బయటి నుండి వచ్చిన పేరొందిన కవులు రచయితలు ఈ సభల్లో పాల్గొంటారు. చివరగా అన్నదానం కూడా ఉంటుంది. ఆవిధంగా ఆ తత్త్వకవి ఉదారి నాగదాసుగారి కవితలు సజీవంగా ఉన్నాయి.

మరో ఆధ్యాత్మిక తత్త్వకవి గంగదాసు. వీరి తత్త్వాలు కూడా జనుల నోళ్లలో నాని జానపద గీతాలవలె పారంపర్యంగా గానం చేయబడుతున్నాయి. వీరి గీతాలు కూడా ఆకాశవాణి ఆదిలాబాదు కేంద్రం ద్వారా ప్రసారమవుతున్నాయి.

గూడ లింగన్న అనే తత్త్వకవి అనేక భజన కీర్తనలు, అచల తత్త్వాలు పారమార్థిక గీతాలతో పాటు జడకొప్పులాట గీతాలు రాసిన కవి. ఇతను గంగదాసు, జక్కుల కాశయ్య, పరమేశ్వరయ్య వంటి తత్త్వకవులతో తిరిగి వారి కవితా రీతులను అవగాహన చేసుకొని రచనలు ప్రారంభించినారు. తొలుత నాటకాలు, గేయాలు రాసినప్పటికీ తరువాత ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకొని ఈ మార్గంలోకి వచ్చినారు. వీరి భజన కీర్తనలు ఈసరికి మూడు గ్రంథ రూపము దాల్చినవి. వీరి కీర్తనలు భజనమండలాల్లో గానం చేయబడుతున్నాయి. ఆకాశవాణి ఆదిలాబాదు కేంద్రం ద్వారా ప్రసారమవుతున్నాయి.

గూడ రాంపూర్ గ్రామానికి చెందిన రాంరెడ్డిగారు కూడా తత్త్వకవే. వీరు ఉపాధ్యాయులుగా పనిచేస్తూనే ఆధ్యాత్మిక తత్త్వగీతాలు రాసినారు. ఈ గీతాలు బహుళ జనాదరణ పొందినాయి. అందులో కొన్నింటిని కలిపి ఒక గ్రంథంగా ప్రచురించినారు.

## వచన కవులు

ఆదిలాబాదులో కవులకు కొదువ లేదు. ముఖ్యంగా పేర్కొనదగినవారిలో వసంతరావు దేశ్‌పాండే. బోరె మురళీ ధర్. డా॥ ఉదారి నారాయణ. రడాపు సంతోష్‌కుమార్. చిందం ఆశన్న, జాన పోశెట్టి, ఉదారి కవీశ్వరాచారి, గోపీ భాగ్యలక్ష్మి, ఎలిజబెత్ విక్టోరియా రాణి, మేడె మణికేశ్వర్, కట్టా లెనిన్, శ్యాంరావు, బి. వేణుగోపాలరెడ్డి, నేరెళ్ల రంగాచారి, తోడిశెట్టి రాములు, కాకరాల పద్మాకర్, కంది రామకృష్ణ, కమ్మల నర్సిములు, కార్తీక్‌రెడ్డి, మల్లెల కబీర్‌దాసు.

నేరెడిగొండ మండలానికి చెందిన సీనియర్ కవి **డా॥ బి.ఆర్.కుర్మే, గడ్డం భీంరెడ్డి,** ఉట్నూరు మండలానికి చెందిన **చందనగిరి దేవయ్య, గోపగాని రవీందర్, కట్టా లక్ష్మణాచారి, మెస్రం మనోహర్, అర్క మాణిక్‌రావు, జ్ఞానేశ్వర్** తదితరులు ఉన్నారు.

## కథా రచయితలు

ఆదిలాబాదులో లబ్ధప్రతిష్ఠులైన కథానికా రచయిత లున్నారు. ఆదిలాబాదు జిల్లాకు వన్నె తెచ్చిన **కీ.శే. డా. సామల సదాశివ** గారిని ఆదిలాబాదు జిల్లా తొలి తెలుగు కథానికా రచయితగా పేర్కొనాలి. 1952 సంవత్సరంలోనే సుజాత మాసపత్రికలో సదాశివగారి నాలుగు కథానికలు ప్రచురితమైనాయి.

ఆదిలాబాదు కథానికా రచయితలు అనేక పురస్కారా లను అందుకొని ఆదిలాబాదు కీర్తిని ప్రసరింపజేసినారు. **వసంతరావు దేశ్‌పాండే - బోరె మురళీధర్, మన్నె ఏలియా, గోపీ భాగ్యలక్ష్మి, బి. వేణుగోపాల్‌రెడ్డి** మొ॥న కథానికా రచయితలున్నారు.

## నవలా రచయితలు

ఆదిలాబాదు జిల్లా తొలి నవలా రచయితగా కూడా **డా॥ సామల సదాశివ** గారినే పేర్కొనాలి. వీరు 1952లోనే అపశ్రుతి అనే నవల వ్రాసి ప్రచురించారు. రేవతి అనే మరో నవలను కూడా రాసినారు. **వసంతరావు దేశ్‌పాండే** రాసిన 'అడవి' నవల, **బోరె మురళీధర్** రాసిన 'నిరుడు కురిసిన కల' నవలలు ఆదిలాబాదు రచయితల నవలా రచనలను దేశమంతటా ఎలుగెత్తి చాటినాయి.

వసంతరావు దేశ్‌పాండేగారి మరికొన్ని నవలల్లో ఊరు, అనూహ్య, దూదిపూల దుఃఖం, భూమి గుండ్రగానే అనే నవలలు కూడా పేర్కొనదగినవి. వసంతరావు దేశ్‌పాండే నవలలు కన్నడ భాషలోకి అనువదింపబడి అక్కడి పాఠకుల ప్రశంస లందుకున్నాయి. తెలంగాణా ఆవిర్భావానికి సంబంధించిన నేపథ్యంలో సాగిన నవల బహుమతిని పొంది అచ్చవుతున్నది.

## సాహితీ సంస్థలు

తొలుత ఆదిలాబాదులో **సాహితీ సదస్సు** పేరుతో ఒక సంస్థ వుండేది. ఆ సంస్థ ద్వారా హిందీ, ఉర్దూ, మరాఠీ సాహిత్యంలో వచ్చిన మంచి రచనలను చదివి వాటిని తెలుగు లోకి అనువదించడం, తెలుగు రచనలు ఉర్దూ, హిందీ, మరాఠీ భాషల్లోకి అనువదించి మూల రచయితల అనుమతితో ప్రచురించటమనే గొప్ప పని చేసేది.

సాహితీ సదస్సుల్లో వివిధ భాషల్లో బాగా చదువుకున్న వారు, పండితులు సభ్యులు. వీరిలో ముఖ్యులు విశ్వనాథరావు దేశ్‌పాండే, బాపూరావు వైద్య రఘునాథరావు, సర్ పట్వార్, తిక్కా నారాయణరావు, సామల సదాశివ, మాదిరెడ్డి శంకర రావు, చల్లా మాధవరావు, సూరపరాజు రాధాకృష్ణమూర్తి, శ్రీమతులు ఆశాలతాదాస్, చిత్రా వర్ఘే వంటివారు.

సాహితీ సదస్సు కోసం తల్లావఝ్ఝల శివశంకర స్వామి, దివాకర్ల వేంకటావధాని, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, నోరి నసింహ శాస్త్రి వంటి మహాకవులు, రచయితలు ఇక్కడికి వేంచేసి సాహిత్యోపన్యాసాలు చేసారు. వివిధ భాషల్లో ఆయా వ్యాసాలు ప్రచురింపబడినాయి. ముఖ్యంగా విఖ్యాత మరాఠీ రచయిత పు.ల.దేశ్‌పాండే రచనలను దేశ్‌పాండేగారి అనుమతితో తెలుగులోకి అనువదించినారు.

తర్వాత కాలంలో సాహితీ సదస్సులు ఆగిపోయి **ఆదిలాబాదు జిల్లా రచయితల సంఘం** యేర్పడింది. దీనికి అధ్యక్షులుగా టి. లక్ష్మయ్యగారు వ్యవహరించేవారు. కవి సమ్మేళనాలు, అష్టావధానాలు, సాహితీ సభలు జరిపేవారు.

సి. సుబ్బన్న శతావధాని గారు, గుమ్మనగారి లక్ష్మీనరసింహ శర్మగారు వంటి అవధానులు అష్టావధానాలు చేసినారు. నేరెళ్ల వేణుమాధవ్‌గారి ధ్వన్యనుకరణ, వానమామలై వరదాచార్యుల కావ్యగానాలు తరచుగా సాగుతుండేవి.

జిల్లా రచయితల సంఘం తరపున మతి, శైవలిని అనే రెండు కవితా సంకలనాలు వెలువడి ఆదిలాబాదులోని లబ్ధ ప్రతిష్టుల, వర్తమాన కవుల కవితలు, పద్యాలు ప్రచురించినారు. 1969లో మీర్జా గాలిబ్ శత జయంతి ఉత్సవాలు దేశమంతటా జరిగాయి. ఆ సందర్భంగా డా॥ సామల సదాశివగారు మీర్జాగాలిబ్ జీవితము - రచనలు అనే గ్రంథాన్ని రాయగా దానిని ఆం.ప్ర.సాహిత్య అకాడెమీ ప్రచురించింది. ఆదిలాబాదు రచయితల సంఘం మీర్జా గాలిబ్ పేరిట జరిపిన సభలో చాలామంది ఉర్దూ కవులు పాల్గొన్నారు.

కాలక్రమంలో ఆదిలాబాద్ రచయితల సంఘం కార్యక్రమాలు మందగించినాయి. చాలానాళ్లకు జి. కృష్ణయ్య గారనే పాత్రికేయులు ఆదిలాబాదు జిల్లా రచయితల సంఘాన్ని పునరుద్ధరించటానికి పూనుకొని కొన్ని కార్యక్రమాలు చేసినాడు. కానీ అవి విజయవంతం కాలేదు. జి.కృష్ణయ్య గారు స్వర్గస్థులైనందున ఆ పని అక్కడికే ఆగిపోయింది.

ఆదిలాబాదులో **బజ్మె - తామీరె - అదబ్** అనే పేరుతో ఒక ఉర్దూ సాహిత్య సంస్థ ఉండేది. దానికి అన్నీ తానే అయి నిర్వహించినవారు ఇస్మాయిల్ ఖురేషీగారనే అడ్వొకేటు. ఈ సంస్థ తరపున ఎన్నో ముషాయిరాలు జరిగినాయి. పేరు పొందిన ఎందరో ఉర్దూ కవులు ఆదిలాబాదుకు వచ్చి కవితాగానం చేసేవారు. ఇస్మాయిల్ ఖురేషీగారు స్వర్గస్థులైన తర్వాత ఆ సంస్థ మూతబడింది.

ప్రస్తుతం డా. దామెర రాములుగారు అధ్యక్షుడుగా చిందం ఆశన్న కార్యదర్శిగా తెలంగాణ రచయిత వేదిక మాత్రం వున్నది. తద్వారా ప్రముఖ కవులు రచయితలకు నివాళులర్పిస్తున్నారు.

## దర్శనీయ ప్రదేశాలు - పర్యాటక రంగం

ఆదిలాబాదు జిల్లాలో అనేక కట్టడాలు, దేవాలయాలు ఇక్కడి చరిత్రకు, సంస్కృతికి నిదర్శనంగా నిలుస్తాయి. ప్రాచీన చారిత్రక కట్టడాలు - దేవాలయాలు ఈ జిల్లాలో వున్నాయి. ముఖ్యంగా ఆదిలాబాదులోని జలపాతాలు, ఉట్నూరులోని గోండురాజుల కోట, ఆదిలాబాదులోని రవీంద్రశర్మ గురూజీ స్థాపించిన కళాశ్రమం చెప్పుకోదగిన ప్రదేశాలలో కొన్ని.

## ముఖ్య దేవాలయాలు

**లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం :** ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి 20 కి.మీ. దూరంలో జైనథ్ మండల కేంద్రంలో లక్ష్మీనారాయణస్వామి దేవాలయం వున్నది. జైన బసదులు నిర్మించినందున ఈ గ్రామానికి జైనథ్ అని పేరు వచ్చిందని స్థల పురాణం. పల్లవరాజుల కాలంలో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు చారిత్రకాధారాలున్నాయి. నాగర శైలిలో నిర్మితమైన ఈ ఆలయం దేవతల ఆవాస స్థలిగా విరాజిల్లుతుంది.

1830లో కాశీయాత్ర చేస్తూ ఈ గ్రామాన్ని సందర్శించిన తొలి తెలుగు యాత్రా చరిత్రకారుడు ఏనుగుల వీరాస్వామయ్య అప్పట్లో ఈ గ్రామ స్థితి గతులు వర్ణించినాడు. కార్తీకపూర్ణిమ నాడు ఈ దేవాలయంలో రథోత్సవం జరుగుతుంది. జాతర కూడా వుంటుంది.

**నాగోబా దేవాలయం :** ప్రపంచంలోని అతి పెద్ద గిరిజన నాగోబా దేవాలయం ఆదిలాబాదు జిల్లా కేంద్రానికి 40 కి.మీ. దూరంలో ఇంద్రవెల్లి మండలం ముత్నూరు దగ్గర కెస్లాపూర్ గ్రామంలో వున్నది. కేస్లాపూర్‌లో జరిగే నాగోబా జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. ప్రతియేట పుష్యమాసం అమావాస్య రోజున జాతర ప్రారంభమవుతుంది.

ఈ దేవాలయంలో పూజలు నిర్వహించేది మాత్రం మెస్రం వంశీయులే! ఈ జాతర సందర్భంగా దర్బార్ నిర్వహిస్తారు. 1942వ సంవత్సరంలో ప్రొఫెసర్ హెమన్‌డార్ఫ్ దర్బారును ప్రారంభించినాడు. ఈనాటికీ ఆ సంప్రదాయం

కొనసాగుతున్నది. ఈనాడు జిల్లా కలెక్టర్లు దర్బారు నిర్వహించి గిరిజనుల సమస్యలు విని వాటి పరిష్కార మార్గం చూపుతారు. సర్పజాతిని పూజించడమే ఈ పండగ ప్రత్యేకత.

**ఖైరన్‌దేవ్ దేవాలయం :** ఆదిలాబాద్ జిల్లా బేల మండల కేంద్రానికి దగ్గరలో సదల్‌పూర్ గ్రామంలోని ఖైరన్‌దేవ్ - మహాదేవ్ దేవాలయం ప్రాచీనమైనది. ఈ దేవాలయం కూడా గిరిజనులదే.

**సిరిసెల్మ శివాలయం:** ఆదిలాబాదు జిల్లా ఇచ్చోడ మండల కేంద్రానికి 16 కి.మీ.దూరంలో సిరసెల్మ గ్రామంలో నెలకొని వున్న ప్రాచీన సోమేశ్వరాలయానికి చాలా చరిత్ర వున్నది. ఈ దేవాలయం క్రీ.శ.7 వ శతాబ్దంలో నిర్మించినట్లు చారిత్రకాధారాలున్నాయి.

ఈ ఆలయం జైన, బౌద్ధ, శైవ మత సంప్రదాయాలకు ప్రతీకలుగా అరుదైన శిల్పసంపదతో అలరారుతుంది. ఆలయంలో శివలింగానికి కొద్దిగా సొట్ట కనిపిస్తుంది. ఈ ఆలయంలోని కార్తికేయుని విగ్రహం కళాత్మకంగా శివాలయం చెరువు మధ్యలో నిర్మితమై వుంటుంది. ఆలయ ప్రాంగణం లోని గన్నేరుచెట్టు వందల సం|| పురాతనమైనదని భక్తుల విశ్వాసం. ఇక్కడ ఒక ప్రాచీన కోనేరు ఉన్నది. దానిని గుండ మంటారు. మహాశివరాత్రి సమయంలో ఈ ఆలయంలో వైభవంగా పూజలు జరుపడంతో పాటు జాతర సాగుతుంది.

ఇంకా ఆదిలాబాదు జిల్లాలో కొన్ని దేవాలయా లున్నాయి. ఆదిలాబాదు పట్టణానికి 12కి.మీ దూరంలోని పూసాయి ఎల్లమ్మ దేవాలయానికి ప్రజలు తండోపతండా లుగా వెళ్ళి బోనమేసి భోజనాలు చేస్తారు. జాతర కూడా సాగుతుంది.

ఆదిలాబాదుకు 5కి.మీ దూరంలోని చాందా (టి) గ్రామంలో నెలకొన్న మహాలక్ష్మి దేవాలయం కూడా అత్యంత ప్రచారంలో వున్నది. ప్రతి శుక్రవారం ఇక్కడికి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుంటారు. ఈ అమ్మవారిని "దేవి"గా కొలుస్తారు. కనుక భక్తులు దేవమ్మ-దేవన్న అని పేర్లు పెట్టుకుంటారు.

**పెండలవాడ హనుమాన్ దేవాలయం :** ఆదిలాబాదు పట్టణానికి 15 కి.మీ.దూరంలోని పెండలవాడ గ్రామంలో నెలకొన్న హనుమంతుని విగ్రహం జిల్లాలోనే ఎత్తైన హనుమద్ విగ్రహంగా పేర్కొంటారు. ఈ విగ్రహం పెన్‌గంగ ప్రవాహంలో కొట్టుకొని వచ్చి పెండలవాడ గ్రామం వాగులో నిలిచి పోయింది.

గుడిహత్నూర్ మండల కేంద్రంలో జాతీయ రహదారి ప్రక్కన ఒక ప్రాచీన శివాలయమున్నది. ఈ ఆలయం వున్నందుకే ఆ గ్రామానికి గుడిహత్నూర్ అనే పేరు వచ్చిందంటారు. ఈ గ్రామానికి దగ్గరలోని ఉమ్రి(బి) లోని ప్రాచీన రామాలయం ఒకటి శిల్పసంపదతో కనువిందు చేస్తుంది.

ఇంద్రవెల్లి మండలంలో నెలకొని వున్న ఇంద్రాదేవి ఆలయం గిరిజనుల ఆరాధ్యదైవం. ఆమె పేరు మీదుగానే ఆ ఊరికి ఇంద్రవెల్లి అని నామం స్థిరపడింది. ఇంద్రవెల్లి పట్టణ శివార్లో 1980లో గిరిజనులపై జరిగిన పోలీసు కాల్పుల వలన దివంగతులైన గిరిబిడ్డ స్మారకార్థం నిర్మించిన స్మారకస్థూపం కనబడుతుంది.

**గోపాలకృష్ణ మఠం :** ఆదిలాబాద్ పట్టణంలోని రామచంద్ర గోపాలకృష్ణ మఠం 400 సం|| చరిత్ర కలిగి వున్నది. ఏనుగుల వీరాస్వామయ్య తమ కాశీయాత్రా చరిత్రలో ఈ దేవాలయాన్ని కూడా ప్రస్తావించినాడు. ఈ మఠానికి సమీపంలోనే మంగ మఠమని మరో మఠమున్నది. ఈ ఆలయంలో రమా సహిత సత్యనారాయణస్వామి వెలసినాడు.

ఆదిలాబాదు జిల్లా సిరికొండ మండలం ధనోరకు 4 కి.మీ. దూరంలో ప్రాచీన రామాలయం వెలసి వున్నది. ఈ ఆలయంలో కూడా జాతర సాగుతుంది.

ఆదిల్షా రాజు పేరు మీదుగా ఏర్పడ్డ ఈ జిల్లా ప్రకృతి అందాలతో, విస్తారమైన అడవులతో, గిరిజన సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. గోదావరి గలగలలతో రాష్ట్రంలో అకారాదిలో మొదటగా ఉన్న ఈ జిల్లా అగ్రస్థానంలో నిలబడే ప్రయత్నం చేస్తుంది.

# కరీంనగర్

తొలి తెలుగుల్ విరాజిలిన తోషమునందిన శాసనాలతో
తెలుగు వెలుంగులన్ పరచు తీర్థములై జనవాస భూములే
నిలయము గాగ సంస్కృతికి నిత్యవినూతన సాహితీ ప్రభల్
కొలువగ వాఙ్మయిన్ సతము కోటివరాల జనాధివాసమై!

తెలంగాణ రాష్ట్రంలో ఉజ్జ్వలమైన సామాజిక, సాంస్కృతిక, రాజకీయ చరిత్ర కలిగి ఉన్న జిల్లా కరీంనగర్. ఉద్యమాల ఖిల్లాగా, పోరాటాల పురిటిగడ్డగా పేరు పొంది నిరంతర చైతన్యంతో విలసిల్లింది. భిన్న సంస్కృతీ సంప్రదాయాలకు నిలయంగా ఉండి మహోన్నతమైన నాగరికతా వికాసానికి విలాసంగా విఖ్యాతి పొందింది.

## ఈ పేరెందుకు?

హైదరాబాద్ సంస్థానాన్ని పరిపాలించిన ఆసఫ్ జాహీల కాలంలో మొదట 'ఎల్గందల' జిల్లా ఉండేది. 6వ నిజాం రాజు మీర్ మహబూబ్ అలీఖాన్ కాలంలో ఎల్గందల ఖిలేదారుగా ఉన్న కరీముద్దీన్ ఎల్గందలకు సమీపంలో ఉన్న అలిపిరాల గ్రామాన్ని విస్తరించి తన పేరుతో కరీంనగర్ పట్టణాన్ని స్థాపించాడు. క్రీ.శ. 1905లో కరీంనగర్ పట్టణ కేంద్రంగా 'కరీంనగర్' జిల్లా ఆవిర్భవించింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావానంతరం 2016, అక్టోబర్ 11న జరిగిన జిల్లాల పునర్విభజనలో భాగంగా జిల్లా పరిధి తగ్గింది. కరీంనగర్ జిల్లా కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలుగా విభజించబడింది.

## భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి

కరీంనగర్ జిల్లా $18^0$-256 మరియు $18^0$-580 ఉత్తర అక్షాంశాల మధ్య, $78^0$-09 మరియు $79^0$-39 తూర్పు రేఖాంశాల మధ్య వ్యాపించి ఉంది. 2128 చదరపు కి.మీ.వైశాల్యాన్ని కలిగి ఉండి, సముద్ర మట్టం నుండి 300 మీటర్ల దిగువన ఉంది. ఈ జిల్లాకు ఉత్తరాన జగిత్యాల, ఈశాన్యంలో పెద్దపల్లి, తూర్పున జయశంకర్ భూపాలపల్లి, దక్షిణాన వరంగల్ అర్బన్, నైఋతిలో సిద్ధిపేట, పశ్చిమాన రాజన్న సిరిసిల్ల జిల్లాలు సరిహద్దులుగా ఉన్నాయి.

## సహజ వనరులు

కరీంనగర్ జిల్లాలో సహజవనరులు పరిమితంగా ఉన్నాయి. గ్రానైట్, ఇసుక మినహాయించి మిగతా ఖనిజ వనరులు స్వల్పంగా ఉన్నాయి. పూర్వపు జిల్లాలో నేలలు, అడవులు, నదులు, చెరువులు, ప్రాజెక్టులు అధికంగా ఉండగా జిల్లా పునర్వ్యవస్థీకరణ కారణంగా ఇప్పుడు వాటిశాతం బాగా తగ్గిపోయింది.

**నేలలు :** కరీంనగర్ జిల్లా దక్కన్ పీఠభూమిలో విస్తరించి ఉంది. ఎర్రనేలలు ఈ జిల్లాలో అధికంగా ఉన్నాయి. ఇక్కడ గ్రానైట్ రాయి నిలువలు అపారంగా ఉండడం వల్ల ఎర్రనేలలు అధికం. ఈ నేలల్లో బంకమన్ను తక్కువగా ఉండి, ఇసుక రేణువులు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల వీటిని 'ఎర్ర ఇసుక నేలలు' అని కూడా పిలుస్తారు. ఇసుకశాతం ఎక్కువగా ఉండడం వల్ల వర్షపునీరు నేలలోకి ఇంకకుండా వేగంగా ముందుకు ప్రవహిస్తుంది. మరికొన్ని

**మున్సిపల్ కార్పొరేషన్ :** కరీంనగర్

**నగర పాలక సంస్థలు :** హుజురాబాద్, జమ్మికుంట

**రెవెన్యూ గ్రామాలు :** 210

**గ్రామపంచాయితీలు :** 276

**పోలీస్ కమీషనరేట్ :** కరీంనగర్

**పార్లమెంట్ నియోజకవర్గం :** కరీంనగర్

**అసెంబ్లీ నియోజకవర్గాలు :** జిల్లాలో 4 అసెంబ్లీ నియోజక వర్గాలు ఉన్నాయి. 1. కరీంనగర్ 2. చొప్పదండి 3. మానకొండూర్ 4. హుజూరాబాద్

**పట్టణాలు :** జిల్లాలో ప్రధానమైన పట్టణాలు 3. అవి కరీంనగర్, హుజురాబాద్, జమ్మికుంట.

ప్రాంతాల్లో ఇసుక లేని ఎర్రమట్టి నేలలు ఉన్నాయి. వీటిలో నీరు త్వరగా ఇంకి లోపలి పొరలోకి వెళ్తుంది. దానివల్ల ఉపరితలం పొడిగా కనిపిస్తుంది. స్వల్ప ప్రాంతాల్లో నల్ల భూములున్నాయి.

ఈ జిల్లాలో పెద్ద పర్వత శ్రేణులేవీ లేవు. పశ్చిమ కనుమల్లో భాగమైన 'అమలుకొండ' గుట్టల శ్రేణులు మానేరు నదీ లోయలో విస్తరించి ఉన్నాయి. గంగాధర మండలంలోని 'బొమ్మలమ్మ గుట్ట' చారిత్రక ప్రాశస్త్యం కలిగి ఉంది. కరీంనగర్ - వేములవాడ రహదారికి ఇరువైపులా వేలాది గుట్టలున్నాయి. కరీంనగర్ పట్టణ శివారులో రేకుర్తి గుట్టలున్నాయి. కరీంనగర్ - హుజురాబాద్ మార్గంలో పలుచోట్ల గుట్టలు విస్తరించి ఉన్నాయి.

గ్రానైట్ వనరులు ఈ జిల్లాలో అధికంగా ఉండడం వల్ల ఇక్కడ అనేక గ్రానైట్ పరిశ్రమలు వెలిసాయి. నలుపు గ్రానైట్, కలర్ గ్రానైట్ ఇక్కడ అధికంగా లభ్యమవుతుంది. దేశ విదేశాలకు ఇక్కడినుండి గ్రానైట్ ఎగుమతి అవుతుంది. మెటల్‌రాయి, లేటరైట్ వంటి ఖనిజవనరులు కూడా ఉన్నాయి. సాధారణ ఇసుక లభ్యత ఇక్కడ అధికంగా ఉంది. ఎల్లందుల, ఖాజీపూర్, ముగ్దుంపూర్ వంటి గ్రామాల నుండి మానేరు ఇసుక క్వారీల ద్వారా ఇసుకను రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ముఖ్యంగా హైదరాబాద్‌కు ఎగుమతి చేస్తున్నారు.

**అడవులు :** కరీంనగర్ జిల్లాలో అటవీ విస్తీర్ణం చూసి నపుడు రాష్ట్రంలోనే అడవుల శాతం అత్యల్పంగా ఉన్న జిల్లా ఇది. 3.47 చదరపు కి.మీ. మేర అడవులు ఉండి, హైదరాబాద్ జిల్లా తర్వాత అతి తక్కువ అటవీప్రాంతం ఉన్న జిల్లాగా కరీంనగర్ నమోదయింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లా అటవీ విస్తీర్ణం పెంచాలని నిర్ణయించారు. ప్రజల కనీస అవసరాలు తీర్చ డానికి ఇటీవల సామాజిక అడవుల పెంపకం మొదలు పెట్టారు. కరీంనగర్ నగరంలో 2004లో లోయర్ మానేర్ డ్యామ్ సమీపంలో 12.5 హెక్టార్ల విస్తీర్ణంలో జింకలపార్కు ఏర్పాటు చేసారు.

అడవులు తక్కువ ఉన్న కారణంగా ఇక్కడ వర్షపాతం తక్కువే. నైఋతి ఋతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తాయి. శీతాకాలంలో చలి, వేసవికాలంలో ఎండలు అధికంగా ఉంటాయి.

**నదులు :** కరీంనగర్ జిల్లాలో పెద్ద నదులేవీ లేవు. గోదావరికి ఉపనది అయిన 'మానేరు' ఇక్కడ ముఖ్యమైన నది. ఇది రాజన్న సిరిసిల్ల జిల్లా ఎగువప్రాంతంలో పుట్టి రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల గుండా 230 కి.మీ. దూరం ప్రవహించి మహదేవపూర్ వద్ద గోదావరి నదిలో కలుస్తుంది. కరీంనగర్ నగరం ఈ నది ఒడ్డునే విస్తరించి ఉంది. నగర శివారులో ఈ నదిపై 24 టి.యం.సి.ల సామర్థ్యంతో 'లోయర్ మానేర్ డ్యాం' నిర్మించారు. ఈ ప్రాజెక్టు ద్వారా కరీంనగర్, వేములవాడ, సిద్ధిపేట, వరంగల్ ప్రాంతాలకు తాగునీటిని అందిస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుండి కాకతీయ వరద కాలువల ద్వారా ఈ ప్రాజెక్టులోకి నీరు చేరుతుంది. కాకతీయ కాలువ ద్వారా దిగువ భాగంలోని ప్రాంతాలకు సాగునీరు అందిస్తున్నారు. మోయుతుమ్మెద, నగునూరు మొదలగు

చిన్నవాగులు మానేరుకు అను బంధంగా ఉన్నాయి.

**చెరువులు - ప్రాజెక్టులు :** ఈ జిల్లాలో చెరువుల సంఖ్య తక్కువగా ఉంది. పూర్వ కరీంనగర్ జిల్లాలో 4 వేలకు పైగా చెరువులుండేవి. ప్రస్తుతం కొత్తపల్లి, మోతె, నారాయణ పూర్, గుమ్లాపూర్, ఆర్నకొండ, తాడికల్, మానకొండూర్, గద్దపాక, మునిమాణిక్యం, గన్నుకుల, మొలుగూర్, రంగాపూర్ మున్నగు చెరువులు ముఖ్యమైనవి. ఇవి కాకుండా పదుల సంఖ్యలో జిల్లా వ్యాప్తంగా చెరువులున్నాయి. ఇవి స్థానికంగా త్రాగు, సాగు నీటి వనరులుగా ఉన్నాయి. నారాయణపూర్ చెరువును ఇటీవల రిజర్వాయర్‌గా మార్చి ఎల్లంపల్లి ద్వారా నీటిని నింపుతున్నారు. ప్రభుత్వం చేపట్టిన 'మిషన్ కాకతీయ'లో భాగంగా అనేక చెరువులు పునరుద్ధరణకు నోచుకున్నాయి.

**జనాభా :** కరీంనగర్ నగర జనాభా 2,97.447. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన "స్మార్ట్‌సిటీ" జాబితాలో కరీంనగర్ ఉండడం విశేషం. రాబోయే ఐదేళ్ళలో కేంద్ర ప్రభుత్వం ఏడాదికి వందకోట్లతో నగరాన్ని 'స్మార్ట్‌సిటీ'గా అభివృద్ధి పరచనుంది.

2011 జనాభా లెక్కల ప్రకారం ఈ జిల్లా జనాభా 10,05,711 కాగా, పురుషుల జనాభా 5,04,620, స్త్రీల జనాభా 5,01, 091. దీనిలో గ్రామీణ జనాభా శాతం 69.28%, పట్టణ జనాభా శాతం 30.27%. ఈ జిల్లా జన సాంద్రత 473. లింగ నిష్పత్తి 1000 : 993.

**అక్షరాస్యత :** అక్షరాస్యతా శాతం 69.16%. ఇది తెలంగాణ రాష్ట్ర సగటు అక్షరాస్యతా శాతం కన్నా ఎక్కువ. పురుషుల అక్షరాస్యత 77.94%, స్త్రీల అక్షరాస్యత 60.38%.

## కరీంనగర్ జిల్లా చరిత్ర

ఆదిమ మానవుడు నడయాడిన నేలగా ఈ జిల్లా అతి ప్రాచీనమైన చరిత్రను కలిగి ఉంది. పురావస్తు త్రవ్వకాలలో బయల్పడిన ఆధారాలను బట్టి జిల్లా చరిత్ర ప్రాచీనతను అంచనా వేయడానికి వీలవుతుంది. అదేవిధంగా అనేకచోట్ల రాకాసిగుండ్లు బయటపడి ఇక్కడి ప్రాచీన చరిత్రకు

### రెవెన్యూ డివిజన్లు - మండలాలు

కరీంనగర్ జిల్లాలో కరీంనగర్, హుజురాబాద్ అనే రెండు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. హుజూరాబాద్ నూతనంగా ఏర్పడిన రెవెన్యూ డివిజన్. ఈ రెండు రెవెన్యూ డివిజన్లలో కలిపి 16 మండలాలున్నాయి.

**కరీంనగర్ రెవెన్యూ డివిజన్‌లో 10 మండలాలు:**

1. కరీంనగర్ 2. కరీంనగర్ రూరల్ 3. కొత్తపల్లి 4. గంగాధర 5. రామడుగు 6. చొప్పదండి 7. మానకొండూర్ 8. తిమ్మాపూర్ 9. చిగురుమామిడి 10. గన్నేరువరం.

**హుజురాబాద్ రెవెన్యూ డివిజన్‌లో 6 మండలాలు :**

1. హుజురాబాద్ 2. సైదాపూర్ 3. శంకరపట్నం 4. వీణవంక 5. జమ్మికుంట 6. ఇల్లంతకుంట

ఆనవాళ్ళుగా ఉన్నాయి. ఈ జిల్లా చరిత్రను సంగ్రహంగా పాతరాతియుగం, కొత్తరాతియుగం, బృహత్‌శిలా యుగం, చారిత్రక యుగం, ఆధునిక యుగం అని విభజించవచ్చు.

**పాతరాతి యుగం :** ఆదిమ మానవుడు ఉపయోగించిన పాతరాతియుగం నాటి రాతి పనిముట్లు, అవశేషాలు జిల్లాలోని పలుచోట్ల బయటపడ్డాయి. శిలాయుగపు రాతి గొడ్డళ్ళు, కత్తి ఆకారపు పనిముట్లు లభించాయి. ఆత్మ రక్షణకు, ఆహార సేకరణకు ఈ పనిముట్లు ఉపయోగపడేవి. బ్లేడు ఆకారపు బిచ్చురాళ్లు కరీంనగర్ ప్రాంతంలో బయటపడ్డాయి.

**కొత్తరాతియుగం :** భౌగోళికంగా జీవి నివాసానికి కరీంనగర్ జిల్లాప్రాంతం అనుకూలంగా ఉండేది. కరీంనగర్ శివారులోని రేకుర్తి గుట్టపైన కొండగుహ ఉంది. బృహత్ శిలాయుగంతో పోలిస్తే కొత్తరాతి యుగపు ఆనవాళ్ళు స్వల్పంగా ఉన్నాయి.

**బృహత్‌శిలా యుగం :** ఈ యుగం నాటి సమాధులు కరీంనగర్ జిల్లాలో పదుల సంఖ్యలో బయటపడ్డాయి. ఇవి రెండువేల సంవత్సరాలకు పైగా ప్రాచీనతను కలిగి ఉన్నాయని చరిత్రకారులు అభిప్రాయ పడ్డారు. కరీంనగర్ పట్టణానికి

అతి సమీపంలో ఉన్న కదంబాపూర్ గుట్టల వద్ద సుమారు 500 పైగా బృహత్ శిలాయుగపు సమాధులు బయట పడ్డాయి. ఈ సమాధులను చరిత్రకారులు రాకాసిగుండ్లు అని పిలిచినారు. కరీంనగర్‌కు సమీపంలో మానేరు నదీతీరంలో ఉన్న తొగర్రాయిలో ముగ్దుంపూర్‌లో చొప్పదండి మండలంలోని ఆర్నకొండలో, మానకొండూర్ మండలంలోని ముంజంపల్లిలో, శంకరపట్నం మండలంలోని మొలంగూరులో, జమ్మికుంట మండలంలోని బీజగిరి షరీఫ్‌లో, హుజురాబాద్ సమీపంలోని సిరిపల్లి, తుమ్మనపల్లి, చెల్పూర్, బోర్నపల్లి, ఎర్కలగూడెం గ్రామాల్లోను, సింగాపూర్ గుట్టల్లోను ఈ రాకాసిగుండ్ల సమాధులు బయటపడ్డాయి. వీటికి ఇంచుమించు 2000 సంవత్సరాల చరిత్ర ఉందని చరిత్రకారులు అభిప్రాయపడ్డారు.

ఐతరేయ బ్రాహ్మణం ప్రకారం ఈ జిల్లా ప్రాంత వాసులు ఆంధ్రులు లేదా అనార్యులు అని తెలుస్తుంది. బౌద్ధ జాతక కథల్లోను వీరి ప్రస్తావన ఉంది. క్రీ.పూ. 6వ శతాబ్దానికి చెందిన షోడశ మహాపదాల్లో ఒకటైన 'అశ్మక మహాపదం' ఉత్తర తెలంగాణ ప్రాంతమే. మెగస్తనీస్ ఇండికా గ్రంథంలో అశోకుని 13వ శిలా శాసనంలో ఆంధ్రుల ప్రస్తావన కనబడుతుంది. కరీంనగర్ జిల్లా ప్రాంతం ఈ అశ్మక మహాపదంలో భాగమై ఉండవచ్చని చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. గంగాధర మండలంలోని నందగిరి, కోట్ల నరసింహులపల్లె గ్రామాల చుట్టూ ఉన్న మట్టికోట ప్రాకారపు చిహ్నం అగడ్తల గుర్తుల ప్రకారం మగధ నేలిన నందవంశపు రాజులు ఈ జిల్లాలోని ప్రాంతాల వరకు తమ అధికారాన్ని విస్తరించారని ప్రముఖ చరిత్ర రచనాకారుడు డా. జైశెట్టి రమణయ్యగారు తమ 'కరీంనగర్ జిల్లా చరిత్ర – సంస్కృతి' గ్రంథంలో తెల్పినారు.

గోదావరి లోయలో జరిపిన త్రవ్వకాల్లో సమగోప, గోభద, కంపయస, నారన మున్నగు పాలకుల నాణేలు బయటపడ్డాయి. వీరంతా శాతవాహనులకు పూర్వపువారే.

కోటిలింగాల, కప్పరావుపేట, ధూళికట్ట, పెద్ద బొంకూర్ తదితర ప్రాంతాలు ఈ ప్రాంత ప్రాచీన చరిత్రకు ఆనవాళ్ళుగా నిలుస్తాయి. కోటిలింగాల త్రవ్వకాల్లో లభించిన నాణేలలో శాతవాహనుల చరిత్ర ప్రస్ఫుటమవుతున్నది.

శాతవాహనుల తొలి పాలకుడు సిముకుడు లేదా శ్రీముఖుడు. ఇతడు కోటిలింగాల రాజధానిగా శాతవాహన సామ్రాజ్యం స్థాపించి క్రీ.పూ. 234 – 213 మధ్య 23 సంవత్సరాలు పాలన చేసాడని తెలుస్తున్నది. ఇతని కుమారుడు మొదటి శాతకర్ణి. భోపాల్ సమీపంలోని 'సాంచి'లో ఇతని శాసనం ఉంది. ఇతని రాజధాని 'జున్నార్' అని తెలుస్తున్నది. తర్వాత పేర్కొనదగినవారు రెండవ శాతకర్ణి, కుంతల శాతకర్ణి, హాలుడు. క్రీ.శ. 20–24 మధ్యకాలంలో ఈ ప్రాంతాన్ని పాలించిన హాలుడు గొప్ప కవిగా, చక్రవర్తిగా పేరుపొందాడు. గాథాసప్తశతి, లీలావతి, అవధాన చింతామణి అనే గ్రంథాలు రచించినట్లు పురాణాల ద్వారా తెలుస్తుంది. గుణాఢ్యుని బృహత్కథ ఇతనికాలంలోనే రచించబడింది. తర్వాత గౌతమీపుత్ర శాతకర్ణి, రెండవ పులోమావి మున్నగు రాజులు తమ రాజధాని నగరాలను మార్చినప్పటికీ ఈ ప్రాంతం వీరి ఏలుబడిలోనే ఉన్నట్లు తెలుస్తుంది. శాతవాహనుల కాలంలో ఈ జిల్లాలోని ప్రాంతాలు వర్తక వాణిజ్యాలకు కేంద్రంగా ఉన్నాయని చరిత్రకారుల అభిప్రాయం. నుస్తులాపూర్, పెద్దబొంకూర్ త్రవ్వకాలలో బయటపడిన నాణేలు ఈ ప్రాంత రెండువేల ఏండ్ల ప్రాచీన చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచాయి.

అనంతరం 4,5 శతాబ్దాలలో కరీంనగర్ జిల్లా ప్రాంతం విష్ణుకుండినుల ఏలుబడిలో ఉందని, తేలికుంట గ్రామంలో దొరికిన నాణేల ఆధారంగా డా॥ జైశెట్టి రమణయ్య గారు తెల్పినారు. తర్వాత బాదామి చాళుక్యులు, వేములవాడ చాళుక్యులు, కళ్యాణి చాళుక్యుల ఏలుబడిలో ఈ ప్రాంతమున్నట్లు తెలుస్తుంది. వేములవాడ చాళుక్యుల కాలంలో కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాలు సపాదలక్ష దేశాలుగా పిలువబడ్డాయి. బాదామి చాళుక్యులు క్రీ.శ. 753 వరకు, వేములవాడ చాళుక్యులు క్రీ.శ. 973 వరకు, కళ్యాణి చాళుక్యులు క్రీ.శ. 1189 వరకు, పొలవాస రాజులు క్రీ.శ. 1188 వరకు ఈ ప్రాంతాన్ని పాలించారు.

తర్వాత కరీంనగర్ ప్రాంతం కాకతీయుల ఏలుబడి లోకి వచ్చింది. రెండవ బేతరాజు కాలం నాటికే కాకతీయుల అధికారం ఈ ప్రాంతానికి విస్తరించినట్టు జిల్లాలోని పలు శాసనాల ద్వారా స్పష్టమౌతుంది. కాకతి రుద్రదేవుని కాలం నాటికి ఈ ప్రాంతం మొత్తం కాకతీయుల చేతిలోకి వెళ్ళింది. కాకతీయుల కాలంలో నిర్మించిన అనేక దేవాలయాలు, వేయించిన శాసనాలు కరీంనగర్ జిల్లాలో ఉన్నాయి. నగునూరు, కొత్తపల్లి, గొడిశాల తదితర దేవాలయాలు కాకతీయుల నిర్మితాలే. కాకతి రుద్రదేవుని మంత్రి వెల్లంకి గంగాధరుడు వేసిన శాసనం నగునూరులో లభ్యమైంది.

తర్వాత ఈ ప్రాంతాన్ని రేచర్ల వెలమ రాజులు పాలించారు. తర్వాత విజయనగర రాజులు కూడా ఈ ప్రాంతాన్ని జయించి తమ ఏలుబడిలోకి తీసుకున్నట్లు కాళేశ్వరంలోని శాసనం ద్వారా స్పష్టమౌతుంది.

**ఆధునిక యుగం లేదా ముస్లిం రాజుల యుగం:** అనేక చారిత్రక పరిణామాల అనంతరం ఈ ప్రాంతం ముస్లిం రాజుల ఏలుబడిలోకి వచ్చింది. బహమనీ సుల్తానులు వీరిలో ప్రథములు. మొదటి మహ్మద్‌షా కాలంలో మొదటిసారిగా ఈ ప్రాంతం దండయాత్రలకు గురైంది. క్రీ.శ. 1363 నాటికి గోలకొండ కోటను బహమనీ సుల్తాన్ చేజిక్కించుకున్నాడు. గోలకొండ కోటను కాకతీయులు క్రీ.శ. 1143లో నిర్మించారు. 3వ మహ్మద్‌షా కాలంలో బహమనీ రాజ్యం 4 తరఫ్‌లుగా విభజించబడగా వాటిలో ఒకటి తెలంగాణ తరఫ్. తర్వాత తెలంగాణ తరఫ్ రెండుగా విభజించబడగా వాటిలో ఒకటి ఓరుగల్లు తరఫ్. కరీంనగర్‌లోని ఎల్లగందల, మొలంగూరు దర్గాలు ఈ ఓరుగల్లు తరఫ్‌లో సర్కారులుగా ఉండేవి.

బహమనీల అనంతరం ఈ ప్రాంతాన్ని కుతుబ్ షాహీలు పాలించారు. వీరి రాజధాని నగరం మొదట గోలకొండ.ం మహ్మద్ కులీ కుతుబ్షా కాలంలో క్రీ.శ. 1591లో హైదరాబాద్ నగర నిర్మాణం జరిగింది. అప్పటినుండి కరీంనగర్ ప్రాంతం హైదరాబాద్ రాజధానిగా ఉన్న రాజ్యం ఏలుబడిలో ఉంది.

క్రీ.శ.1724 నుండి హైదరాబాద్ రాజ్యం అసఫ్ జాహీల ఏలుబడిలోకి వెళ్ళింది. క్రీ.శ. 1724నుండి క్రీ.శ. 1948 వరకు దాదాపు 225 సంవత్సరాల సుదీర్ఘకాలం పాటు ఏడుగురు అసఫ్‌జాహీ రాజులు ఈ రాజ్యాన్ని పాలించారు. వీరినే నిజాం రాజులని పిలుస్తారు.

వీరి కాలంలో ఈ ప్రాంతం 'ఎల్గందల్' పేరుతో జాగీర్దారుల ఏలుబడిలో ఉంది. నిజాముల్ ముల్క్ 1వ ఆసఫ్‌జాహీ కాలంలో ఎల్గందల్ జాగీర్దారులుగా నవాబ్ అమీన్‌ఖాన్, ముఖ్రబ్‌ఖాన్ పనిచేశారు. సలాబత్‌జంగ్ కాలంలో ఫకీర్ మునవ్వర్‌ఖాన్, ఇబ్రహీంఖాన్ ధంసా పనిచేశారు. రెండవ నిజాం రాజు కాలంలో జఫరుద్దౌలా, ఫారుక్ మిర్జా ఎల్గందల్ పాలకులుగా ఉన్నారు. సికందర్‌జా అసఫ్‌జాహీ (క్రీ.శ. 1803-1829) కాలంలో బహదూర్ ఖాన్ ఎల్గంద్ ఖిలేదారుగా నియమింపబడ్డారు. ఇతని తర్వాత వచ్చిన సయ్యద్ కరీమొద్దీన్ అనే ఖిలేదారు ఎల్గందల కోటకు 10 కి.మీ దూరంలో మానేరు నది ఒడ్డున తన పేరుతో క్రొత్త గ్రామాన్ని నిర్మించాడు. అదే కరీంనగర్ పట్టణంగా అభివృద్ధి చెందింది. కరీమొద్దీన్‌షా సమాధి కరీంనగర్ కాపువాడ శివాలయం సమీపంలో ఉంది.

క్రీ.శ. 1865లో జిలాబంది పద్ధతి ప్రవేశపెట్టారు. దీనిలో భాగంగా రాజ్యాన్ని 14 జిల్లాలుగా విభజించారు. జిల్లా పాలనా బాధ్యతలను నిర్వహించేందుకు 'అవల్ తాలూక్‌దార్' (కలెక్టర్), వీరికి సహకరించేందుకు 'దవల్ తాలూక్‌దారు' (సబ్ కలెక్టర్)లను నియమించారు.

ఎల్గందల జిల్లా అవల్ తాలూక్‌దార్ పాలనలో ఉండేది. 6వ నిజాం రాజు మీర్ మహబూబ్ అలీఖాన్ పాలనాకాలంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరిగి క్రీ.శ. 1905లో జిల్లా కేంద్రం ఎల్గందల నుండి కరీంనగర్‌కు మారింది. 7వ నిజాం రాజు మీర్ ఉస్మాన్‌అలీఖాన్ (క్రీ.శ. 1911-1948) కాలంలో కరీంనగర్‌లో క్రీ.శ. 1937లో కమాన్, క్లాక్‌టవర్ నిర్మించారు. ఇవి ఇప్పటికీ నగరంలో ఉన్నాయి. నిజాం పాలన రజతోత్సవాల సందర్భంగా వీటిని నిర్మించారు.

క్రీ.శ. 1948లో భారత ప్రభుత్వం దేశీయ వ్యవహారాల శాఖ నిర్వహించే ఉపప్రధాని సర్దార్ వల్లభాయి పటేల్ నేతృత్వంలో పోలీస్‌చర్య తీసుకోవడంతో హైదరాబాద్ రాజ్యం తద్వారా కరీంనగర్ జిల్లా భారతదేశంలో విలీన మయ్యాయి. 1950 జనవరిలో ఎం.కె. వెల్లోడి హైదరాబాద్ రాష్ట్రానికి ఐసిఎస్ ముఖ్యమంత్రిగా నియమింప బడ్డారు. క్రీ.శ. 1952లో మొదటి సార్వత్రిక ఎన్నికలు జరిగి బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. భారతదేశ రాజ్యాంగ పరిధిలో ప్రజాస్వామ్య పాలనలోకి ఈ ప్రాంతం వచ్చింది.

అంతకుమునుపు జరిగిన జాతీయోద్యమంలో ఈ ప్రాంత ప్రజలు, ప్రముఖులు, కవులు, కళాకారులు ప్రముఖపాత్ర వహించారు. స్వాతంత్రోద్యమంలోను, నిజాం పాలనకు వ్యతిరేకంగాను జరిగిన ఉద్యమాల్లో, పోరాటాల్లో పాల్గొని ఈ ప్రాంత జవసత్వాలను చాటి చెప్పారు. బద్దం ఎల్లారెడ్డి, అనభేరి ప్రభాకరరావు, పోల్కంపల్లి వేంకట రామారావు, పి.వి. నరసింహారావు, బోయినిపల్లి వేంకట రామారావు మున్నగువారు పోరాటాల్లో ప్రముఖపాత్ర వహించారు.

1956 నవంబర్‌లో హైదరాబాద్ రాష్ట్రంలోని తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రరాష్ట్రంతో కల్పి నూతనంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. ఆవిధంగా 1956 నవంబర్ 1 నుండి 2014 జూన్1 వరకు కరీంనగర్ జిల్లా ఆంధ్రప్రదేశ్ పాలనలో ఉంది.

భారత ప్రభుత్వం 2014 జూన్ 2న 29వ రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పరచింది. కరీంనగర్ జిల్లా తెలంగాణ రాష్ట్రంలో భాగమైంది. 2014 జూన్ 2 నుండి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం ... తద్వారా కరీంనగర్ జిల్లా వేగంగా పురోగమిస్తున్నది. 2016 అక్టోబర్ 11న జరిగిన జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా కరీంనగర్ జిల్లా నూతన రూపాన్ని సంతరించుకుంది.

## సంస్కృతి

కరీంనగర్ జిల్లా ప్రజలజీవన విధానం అనాదిగా నిరంతర చురుకుదనంతో పరిఢవిల్లింది. చక్కని సంప్రదాయాలతో జీవిత వైవిధ్యంతో విలసిల్లింది. ఇక్కడి ప్రజల జీవన సరళిలో సాంఘిక చైతన్యం కనబడుతుంది.

ఆధునిక యుగంలో సంస్కృతి పురోగతిలో కీలక పాత్ర పోషించారు. ఉద్యమాలు, పోరాటాలు జరిగినప్పుడు ముందు నిలిచారు. మతపరమైన, జాతిపరమైన రంగాలలో అంకితభావాన్ని, సంయమనాన్ని కనబర్చారు. అవసరమైనప్పుడు ఆత్మ గౌరవాన్ని ప్రదర్శించి ఎదురు నిల్చారు. కళలకు, ఉన్నత సంప్రదాయాలకు ఈ జిల్లా నిలయం.

**ఆచారాలు, సంప్రదాయాలు, పండుగలు :** వేదాల నుండి, పురాణేతిహాసాల నుండి, వివిధ మతగ్రంథాల నుండి, పెద్దల నుండి, చరిత్రనుండి సంక్రమించిన అనేక జీవన విధానాలను ఈ జిల్లా ప్రజలు ఆచరించి నైతిక ప్రవర్తనతో భాసిల్లుతున్నారు. సంప్రదాయంలో భాగమైన వివిధ పండుగలను, నోములను, వ్రతాలను, ఆచారాలను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకొని ఆధ్యాత్మిక జీవనంలో ముందున్నారు. వివిధ పండుగల ద్వారా కలిసి మెలిసి జీవించే తత్వాన్ని పెంపొందించుకుంటూ సమతా సమరసతలను, భక్తినీ, ధార్మికతనూ చాటుకొంటున్నారు. భగవంతునికి పూలను అర్పించడం సర్వ సాధారణం. అయితే ఆ పూలనే దైవంగా భావించి బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకుంటారు. జీవన వైవిధ్యాన్ని, సమిష్టి తత్వాన్ని, మహిళా శక్తిని ఈ పండుగ ద్వారా చాటుతారు. దసరా, దీపావళి, ముక్కోటి ఏకాదశి, సంక్రాంతి, మహా శివరాత్రి, ఉగాది, తొలి ఏకాదశి, వినాయక చవితి, బక్రీద్, రంజాన్, క్రిస్మస్, గురునానక్ జయంతి వంటి పండుగలు ఆయా కాలాల్లో జరుపుకుంటూ సంప్రదాయాలను, వాటి వెనుకున్న శాస్త్రీయ అంశాలను ముందుతరాలకు అందిస్తున్నారు.

**కళలు :** 'కళలకు కాణాచి కరీంనగర్ జిల్లా' అని ఈ ప్రాంతంలో నానుడి. ఇక్కడి జనులు బహుముఖ ప్రజ్ఞాశీలురు,

కళాతృష్ణులు. ఆయా రంగాల్లో నిపుణత, కౌశల్యం కలవారు. సంగీతం, సాహిత్యం, నృత్యం, చిత్రలేఖనం, శిల్పం, నాటకం ఇత్యాది కళల్లో ప్రావీణ్యం కల్గి ఉన్నారు. తెలుగులో తొలి తెలుగు పద్యం ఈ జిల్లాలోనే ఆవిర్భవించింది. చాలా మంది సాహిత్యకారులకు, కళాకారులకు నిలయంగా ఉంది.

కరీంనగర్ జిల్లా సిల్వర్ ఫిలిగ్రీ పరిశ్రమకు ప్రఖ్యాతి చెందింది. నాణ్యమైన వెండి కళాకృతులు ఇక్కడ తయారై దేశ విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. 'రామడుగు' శిల్పులకు ప్రసిద్ధి చెందింది. ఇక్కడి శిల్పులు అనేక విగ్రహాలు, ఆకృతులు చెక్కడంలో ఆరితేరిన వారు.

**జాతరలు :** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గోదావరి, ప్రాణహిత నదులు ప్రవహిస్తాయి, ఈ నదులకు పుష్కరాలు ప్రతీ పన్నెండేళ్ళ కొకసారి జరుగుతాయి. పన్నెండు రోజుల పాటు జరుగుతాయి. అంటే పుష్కరాలు వంటి ఉత్సవాలు కేవలం తీర్థాలలో జరుగుతాయి. ఈ కాలంలో పుణ్య స్నానాలు చేస్తారు. అంతేకాకుండా దానాది విధులు, పితృ దేవతలకు పిండ ప్రదానాలు, వస్త్ర, వస్తు, షోడశ దానాలు ఇస్తారు. అనేక వైదిక కర్మలకు ఈ ఉత్సవాలు నిలయం.

తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రధానమైన జాతర సమ్మక్క, సారలమ్మ జాతర. ఇది 'మేడారం' గ్రామంలో జరుగుతుంది. కానీ, దానికి అనుబంధంగా అనేక ప్రాంతాల్లో ఈ జాతరలు నిర్వహిస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో కూడా రేకుర్తి, చింతకుంట వంటి గ్రామాలలో ఈ జాతర నిర్వహిస్తారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఇక్కడికి వచ్చి తమ మొక్కులు చెల్లించు కుంటారు. వీణవంక, జూపాక, వావిలాల గ్రామాల్లోనూ ఈ జాతర జరుగుతుంది.

బోనాలను సైతం ఈ జిల్లాలో ఘనంగా జరుపు కుంటారు. గ్రామదేవతలను పూజించే పండుగ ఇది. 'బోనం' అంటే 'భోజనం' అని అర్థం. దేవతలకు సమర్పించే నైవేద్యం ఇది. ఈ వేడుకలకు ఇంటి ఆడపడుచులను, బంధువులను పిలిచి రకరకాల పిండివంటలు చేసుకొని ఆనందంగా వుంటారు. ఒక ప్రాంతంలోని, వీధిలోని భక్తులంతా ఒకేసారి ఊరేగింపుగా ఆలయానికి వెళ్ళి నైవేద్యాన్ని సమర్పిస్తారు.

నాగులచవితి నాడు పుట్టలో పాలుపోయడం, మల్లన్న పట్నాలు వేయడం వంటి ఆచారాలు ఈ వేడుకల్లో భాగంగా వుంటున్నాయి. విజయదశమి, దీపావళి, దసరా, శివరాత్రి, మొహర్రం లాంటి పండుగలను ఇక్కడి ప్రజలు జరుపుకుంటారు.

జిల్లాలోని అనేక పుణ్యక్షేత్రాల్లో ప్రతీ ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. కరీంనగర్‌లోని 'గిద్దె పెరుమాండ్లు' దేవాలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. 'కొత్తగట్టు', 'మత్స్యగిరీంద్ర స్వామి' ఆలయంలో ప్రతీ ఏటా మాఘ శుద్ధ ఏకాదశి నుంచి పౌర్ణమి వరకు కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరుగుతాయి. సమీపంలోని బేతిగల్, వెన్నంపల్లి గ్రామాలకు చెందిన వారు ఈ కల్యాణానికై తలువాల బియ్యం తేవడం ఆచారంగా వస్తోంది.

వీణవంకలోని ప్రాచీన శ్రీ వేంకటేశ్వర దేవాలయంలో ప్రతీ ఏటా వైశాఖమాసంలో జాతర జరుగుతుంది. ఇల్లందుకుంట సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రతీ ఏటా శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయంలో ఉగాది, దసరా, రామనవమి పండుగల సమయాల్లో ప్రత్యేక పూజలు, వేడుకలు నిర్వహిస్తారు.

బోనాల జాతర, సమ్మక్క - సారలమ్మ జాతరలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుగుతాయి. మానకొండూర్, కొత్తగట్టు, ఇల్లందుకుంట మున్నగు ప్రాంతాల్లో జరిగే జాతరలు ప్రజలను ఒకచోటుకు సమూహంగా చేర్చి సమిష్టి తత్వాన్ని, సమతా భావాన్ని బోధిస్తున్నాయి.

## సాహిత్య చరిత్ర

తెలుగు సాహిత్య చరిత్రలో కరీంనగర్ జిల్లాది చాలా ప్రభావవంతమైన స్థానమని చెప్పవచ్చు. అత్యంత ప్రాచీనమైన చరిత్ర ఈ జిల్లా సొంతం. 2 వేల ఏళ్ళకు పైబడిన తెలుగు జాతి చరిత్రలో తొలి తెలుగు పద్యం ఈ జిల్లాలోనే పురుడు పోసుకుంది.

## శాసన సాహిత్యం

ఈ జిల్లాలోని గంగాధర మండలంలోని కురిక్యాల కొండన్నపల్లి గ్రామం మధ్యలో గల బొమ్మలమ్మ గుట్ట శాసనం' తెలుగు సాహిత్య ప్రాచీనతకు నిదర్శనం. 10 వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్నేలిన వేములవాడ చాళుక్య రాజైన 2 వ అరికేసరి కాలంలో ఈ శాసనం రచించబడింది. కన్నడ భాషలో ఆదికవి అయిన పంపని సోదరుడైన 'జినవల్లభుడు' రచించిన మూడు కంద పద్యాలు క్రీ.శ. 945 నాటి ఈ శాసనంలో వున్నాయి

కరీంనగర్ సమీపంలోని నగునూర్ గ్రామంలో వెల్లంకి గంగాధర మంత్రి వేయించిన శాసనం కాకతీయుల చరిత్రకు సాక్షీభూతంగా నిలుస్తుంది. ఇది 32 పద్యాల తెలుగు శాసనం. దీనికాలం క్రీ.శ.1117. వెల్లంకి గంగాధర మంత్రి కాకతి రుద్రదేవుని మంత్రి. నగునూర్ రాజధానిగా సబ్బి సహస్ర మండలానికి సామంత పాలకుడు.

హుజూరాబాద్ సమీపంలోని గొడిశాలలో కాకతి గణపతిదేవుడి దండనాయకుడైన 'కాటయ నాయకుడు' వేయించిన చంపూ శాసనం వుంది. ఇది క్రీ.శ. 1236 నాటిది. కాటయ నాయకుని తండ్రి రాజనాయకుని, రేచర్ల రుద్రుని యుద్ధ విజయాలు, ఆ కాలపు ధర్మకార్యాలు, అంగళ్ళలో జరిగే వర్తక విశేషాలు ఇందులో ఉన్నాయి.

## పద్య సాహిత్యం

ప్రాచీన కరీంనగర్ సాహిత్య చరిత్రలో వెలిగందులకు మంత్రిగా వ్యవహరించిన 'కందనామాత్యుడు' పేర్కొన దగినవాడు. ఇతడు 14 వ శతాబ్దానికి చెందినవాడు. ఈయన 'నీతి తారావళి' అనే పద్య కావ్యాన్ని రచించినట్లు తెలుస్తున్నది. వెలిగందులకే చెందిన 'నారయ' 15 వ శతాబ్దానికి చెందినవాడు. 'నారాయణ' అని నామాంతరం. ఈయన భక్తకవి పోతనకు ప్రియ శిష్యుడు. పోతన భాగవతాన్ని ప్రథమ స్కంధం నుంచి చతుర్థ స్కంధం వరకు మరియు సప్తమ స్కంధం నుంచి దశమ స్కంధం వరకు అనువదించాడు. పోతన శిష్యులైన బొప్పరాజు గంగన పంచమ స్కంధాన్ని, ఏర్చూరి సింగన – షష్ఠ స్కంధాన్ని అనువదించారు. శ్రీ మహాభాగవతం ఏకాదశ, ద్వాదశ స్కంధాల అంత్యంలో "ఇతి శ్రీ పరమేశ్వర కరుణాకలిత కవితా విచిత్ర కేసన మంత్రి పుత్ర సహజ పాండిత్య పోతనామాత్య ప్రియశిష్య వెలిగందుల నారాయణాఖ్య ప్రణీతంబైన, శ్రీ మహాభాగవతంబను మహా పురాణంబు నందు" అనే గద్యం ప్రకారం నారయ ఏకాదశ, ద్వాదశ స్కంధాలను అనువదించినట్లు చెప్పవచ్చు.

**ఖండేరావు రామారావు :** ఆధునిక కాలంలో 19,20 శతాబ్దాలలో పద్య సాహిత్యం ఈ జిల్లాలో విరివిగా వచ్చింది. కరీంనగర్‌లో నివసించిన వీరు మహారాష్ట్రకు చెందినవారు. వీరు అనేక పద్యాలు రచించినట్లు గోలకొండ కవుల సంచిక ద్వారా తెలుస్తున్నది.

**పరవస్తు మునినాథ :** శంకరపట్నం గ్రామానికి చెందిన వీరు 19 వ శతాబ్దివారు. వీరు లక్ష్మీశతకం, లలితా శతకము, పరవస్తు శతకము మున్నగు కావ్యాలు రచించినా ప్రస్తుతం అలభ్యం.

**ముదుంబ రామానుజాచార్య :** అంబాల గ్రామానికి చెందినవారు. వేంకటేశ్వర శతకము, కాదంబిని, ప్రేమ చాంచల్యం, రమానంద స్మృతి పద్యములు రచించారు. ఇవన్నీ అముద్రితాలే.

**ఆర్తి కిష్టయ్య :** వీరు కరీంనగర్ పట్టణానికి చెందిన వారు. వీరు రచించిన పద్యాలు గోలకొండ కవుల సంచికలో ప్రచురింపబడిననూ, కవి కాలాదులు, కృతి వివరాలు పొందుపరచబడలేదు.

**వానమామలై వేంకటాచార్య :** వీరు గట్ల నర్సింగాపురం గ్రామానికి చెందినవారు. వీరు జ్ఞానేశ్వరీ భగవద్గీత, వ్యాస భగవద్గీత మున్నగు గ్రంథాలు రచించారు. ఇవి అముద్రితాలు.

**వానమామలై జగన్నాథాచార్యులు :** పోతిరెడ్డి పేటకు చెందిన వానమామలై జగన్నాథాచార్యులు రైతు రామాయణం, శ్రీవ్రత గీతి, అభ్యుదయ గేయాలు రచించారు. రైతు

రామాయణం తొలి తెలుగు రైతు కావ్యంగా, తొలి జానపదాంధ్ర కావ్యంగా ప్రఖ్యాతి గాంచాయి. అది వరాహ అష్టోత్తర శతి, వైష్ణవతత్త్వము, బాలనీతి మున్నగునవి అముద్రితాలు.

20వ శతాబ్దంలోనే దుప్పురి సత్యనారాయణాచార్యులు పలు యక్షగానాలు, వీధినాటకాలు, రూపకాలు రచించారు. ఇవి అలభ్యం. గుండి గ్రామానికి చెందిన వెలిచాల కేశవరావు ఊహాలోకం (గేయకావ్యం), మిత్ర నీతి (శతకం) స్వీయ చరిత్ర రచించారు.

ఈ జిల్లాలో పద్య, యక్షగాన, హరికథ, బుర్రకథ, వేదాంత, రచన, గేయ, నవల, నాటిక కథా సాహిత్యం... వేరువేరు ప్రక్రియా రచనలు పుంఖానుపుంఖాలుగా వచ్చాయి.

మడికి సింగన (14 వ శతాబ్దం – పద్మ పురాణోత్తర ఖండము, వాసిష్ఠ రామాయణము), చరికొండ ధర్మన (16 వ శతాబ్దం, చిత్ర భారతం), వేములవాడ భీమకవి (కవి జనాశ్రయము, రాఘవ పాండవీయం, హర విలాసము, నృసింహపురాణము), శేషప్ప (18 వ శతాబ్ది – నరసింహ శతకం, నరహరి శతకం, నృకేసరి శతకం), జైశెట్టి రాజయ్య (20 వ శతాబ్దం – వేములవాడ రాజరాజేశ్వర శతకం), శిరసినహళ్ కృష్ణమాచార్య (20 వ శతాబ్దం) – కళాశాలా భ్యుదయం, మనస్సందేశ కావ్యం, ఆంధ్రమహానాటకం, రామానుజ చరిత్ర, అందె వేంకట రాజము (20 వ శతాబ్ది – నవోదయము, మణిమంజూష, మానసవీణ, నింబగిరి నరసింహ శతకం, ఈశ్వర శతకం), మామిడిపల్లి సాంబశివ శర్మ (20 వ శతాబ్ది – ముక్తాహారం, లోభ సంహారం, శ్రీ రాజరాజేశ్వర సుప్రభాతం, మధుర ఝుంకారం) మొదలైన వారు ప్రసిద్ధులు.

**సి.నారాయణ రెడ్డి :** ఆధునికాంధ్ర కవిత్వంలో అగ్రగణ్యులు. అనేక పద్యాలు, ఖండ కావ్యాలు, గేయ కావ్యాలు, వచన కావ్యాలు, వేలాది సినీ గీతాలు రచించారు. వీరు రచించిన 'విశ్వంభర' కావ్యం 'జ్ఞానపీఠాన్ని' అధిరోహించింది. వీరి ప్రభావంతో నవీన సాహితీ యుగంలో అనేక మంది కవులు, రచయితలు కవిత్వ ప్రపంచంలోకి వచ్చారు.

**రామక రామశర్మ –** రామ రాఘవస్తవము, రామతత్త్వ చింతనము, శ్రీ మదాంజనేయ స్తుతి; **రామక విశ్వనాథ శాస్త్రి –** శ్రీ వేంకటేశ్వర స్తవము; **పార్వెళ్ళ గోపాలకృష్ణ –** వాసంతి, పంచముఖాంజనేయము; **మచ్చ వీరయ్య –** భక్తితత్త్వ ప్రకాశిక, **ఆరుట్ల రంగాచార్య –** సోదర శతకం; **వి.ఎల్.ఎన్. శాస్త్రి :** శ్రీ నృసింహేశ్వర శతకం రచించారు.

**మలయశ్రీ :** వీరు శతాధిక గ్రంథ కర్త. కావ్య సుందరి, ధర్మశ్రీ, యక్ష సందేశం, ధర్మపదం, నీతిశాస్త్రం, అమృత మూర్తి, పల్లెసీమ, రాగశిఖ, స్వప్నం (గేయ కావ్యాలు), కలవారి కష్టాలు, తాగుబోతు, విచిత్రప్రేమ, ఏం మగాళ్ళు, వెన్నెల వాన (నవలలు) వంటి భిన్న ప్రక్రియల్లో గ్రంథాలు వెలువరించారు. **'కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్య చరిత్ర'** అనే పరిశోధన గ్రంథాన్ని రచించారు.

**బోయినిపల్లి వేంకట రామారావు :** కరీంనగర్ దేవాలయాల సంక్షిప్త చరిత్ర, కరీంనగర్ మండల సాహిత్య సంగ్రహ చరిత్ర, గాంధీ తత్వము, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ చరిత్ర, సర్వోదయ వ్యాసాలు వీరి రచనలు.

**బి. లక్ష్మయ్య –** శంకరప్ప శతకం; **సుంకె వేంకటాద్రి** –వేంకటాద్రి శతకం, భక్త రామసుమాళి, భరతాభ్యుదయము; **అనుమాండ్ల భూమయ్య –** అగ్నివృక్షం, వేయి నదుల వెలుగు, వెలుగు నగల హంస, జ్వలిత కౌసల్య; **ముద్దసాని రాంరెడ్డి–** లండన్‌లో ఒకరాత్రి, రాగ దర్బారి, గాలిమేడల కొలంబస్, సురవరం ప్రతాపరెడ్డి జీవిత చరిత్ర; **వెలిచాల కొండలరావు –** నాదేశం, విశ్వాత్మ, ఎర్ర గన్నేరు, గీతాంజలి అనువాదం; **జువ్వాడి గౌతంరావు –** విశ్వనాథ కవితా వైభవం; **మచ్చ హరిదాసు –** తథ్యము సుమతీ; **డింగరి రామాచార్య –** వ్యాస మంజరి, రైతు రామాయణం – పరిశీలన; **డింగరి నరహరి ఆచార్య –** సుభద్రా పరిణయం, వీచిక, వేళ్ళు; **బి. దామోదర రావు –** నా కవిత సమత, సింగిడి; **బొద్దుల వేంకటేశం –** వీరు అనేక అలంకార శాస్త్ర గ్రంథాలు రచించారు. అరిస్టాటిల్ కావ్యశాస్త్రం, ఆనంద వర్ధనుని సాహిత్య దర్శనం, వక్రోక్తి సిద్ధాంతం, సౌందర్య దర్శనం, ధ్వని సిద్ధాంత వైజ్ఞానిక వివేచన వంటి గ్రంథాలు రచించారు.

**కాలువ మల్లయ్య** – వీరు ఇప్పటివరకు 850కి పైగా కథలు, 16 నవలలు, 600 వ్యాసాలు రాశారు. తెలంగాణ ప్రాంతీయ స్పృహతో రాసిన వీరి కథలోనికి తెలంగాణ ప్రాంత స్త్రీల జీవితాల్లోని వివిధ కోణాలు మనకు దర్శనమిస్తాయి. అగ్నిగుండం, అడవిగాచిన వెన్నెల, అమ్మ మీది సొమ్ములు, అంబోతు, నా తెలంగాణా, హింస రచన కథలు ప్రముఖమైనవి.

**గంద్ర లక్ష్మణరావు** – వేయి పడగలు – ఒక దర్శనం (పరిశోధనా గ్రంథం), సాహితీ వనమాల (వ్యాసాలు), నీవు (పద్యకావ్యం), ముగ్గు (వచన కవిత్వం), ఒక పద్యం నేర్చుకుందాం మొదలైనవి రచించారు. తాజాగా ఖలీల్ జిబ్రాన్ రచనను 'వెర్రి మానవుడు' పేరుతో తెలుగీకరించారు.

**నలిమెల భాస్కర్** – వీరు బహుభాషావేత్త. మానవుడా, కిరణాలు, దేశదేశాల కవిత్వం, భారతీయ కథలు, మంద, నూరేళ్ళ ఉత్తమ మలయాళ కథలు, అద్దంలో గాంధారి, బాణం, ముట్టి ముత్యాలు మొన్నగు గ్రంథాలు రచించారు. తెలంగాణలోని మరుగున పడ్డ అనేక పదాలను వెలికితీసి **'తెలంగాణ పదకోశం'** రూపొందించారు. 'తెలంగాణ దేశ్య పదాలు' (వ్యాస సంపుటి) రచించారు. వీరి 'స్మారకశిలలు' కేంద్రసాహిత్య అకాదమీ పురస్కారం పొందిన రచన.

**బి.వి.ఎన్.స్వామి** – నెల పొడుపు (కథా సంపుటి), రాత్రి పగలు – ఒక మెలకువ, వివరం, కథా తెలంగాణం ( విమర్శ), అందుబాటు (త్తర తెలంగాణ కథా రచయితల పరిచయం) మొదలైనవి.

**అన్నవరం దేవేందర్** – బొడ్డుమల్లె చెట్టు, మంకమ్మ తోట, లేబర్ అడ్డా, బుడ్డ పర్కలు, పొద్దు పొడుపు, నడక, తొవ్వ మొదలైన వచన కవితా సంపుటులు వెలువర్చారు.

**సముద్రాల వేణుగోపాలాచార్య** – భావి పౌరశతకం, భారత గీత, శ్రీగోదావ్రతం, శ్రీ సప్తగిరి వేంకటేశ్వర శతకము.

**దాస్యం సేనాధిపతి** – వీరు 1000 కి పైగా సమీక్షా వ్యాసాలు, 1000 కి పైగా విమర్శా వ్యాసాలు రచించారు. సంవీక్ష మధురాక్షరి, వీక్షణ, అవలోకనం, సుహృల్లేఖ, పరిష్కారం, శబ్దలయ, అక్షరం సాక్షిగా, నానీ కవుల డైరెక్టరీ మొదలైనవి.

**గజేందర్ రెడ్డి** – సాహిత్య వ్యాసాలు; **మమత వేణు** – మల్లెచెట్టు చౌరస్తా (వచన కవిత్వం), **వావిలాల భూపతి రెడ్డి** – విద్య – పిల్లల పెంపకం, కరీంనగర్ శత వసంతాల చరిత్ర – సంస్కృతి; **శేషం వేణుగోపాల శర్మ** – శ్రీ భూయజ్ఞ వరాహ స్వామి శతకం, శ్రీ రామగిరి కోదండరామ శతకం; **సామ లక్ష్మారెడ్డి** – పద్య చంద్రిక (పద్య కావ్యం); **నడిమెట్ల రామయ్య** – జై జవాన్, జై కిసాన్ (పాటలు); **భండారి అంకయ్య** – అక్షరతార (వచన కవిత్వం); **బూర్ల వేంకటేశ్వర్లు** – వాకిలి, పెద్ద కచ్చరం, బావి గిరక మీద, ఊరిపిచ్చుక, రెండు పక్షులు ఒక జీవితం, రంగుల విల్లు (వచన కావ్యాలు); **గాజోజు నాగభూషణం** – మట్టి సరిగమలు, నెత్తుటి గాయాలు; **కూకట్ల తిరుపతి** – మేలుకొలుపు, చదువులమ్మ శతకం, పల్లె, ఎర్రగాలు, ఆరుద్ర పురుగు; **గంప ఉమాపతి** – సమర్పణ, నిశ్శబ్దం లోంచి (వచన కవిత్వం); **కలువకుంట రామకృష్ణ** – శ్రీవాసర సరస్వతీ శతకం; **వేణుశ్రీ** – స్వేచ్ఛ; **కొత్త అనిల్ కుమార్** – మౌనవీణ – రత్నాల వీణ, వాన చినుకులు, మహోజ్జ్వలం; **రామక విఠల్ శర్మ** – శ్రీ సత్యనారాయణ వ్రతకల్పం (పద్య మాలిక); **కూర్మాచలం వేంకటేశ్వర్లు** – మంగపేట శతకము; **సదాశ్రీ** – దరువు, అక్షరం సాక్షిగా (వచన కవిత్వం); **విలాసాగరం రవీందర్** – నదిపలికిన వాక్యం (వచన కవిత్వం); **డిండిగాల రవీందర్** – వందలాది జానపద గేయాలు రచించి ఆలపించారు. పలు కేసెట్లు, సి.డి.లు వెలువర్చారు.

## సాహితీ సంస్థలు

ఈ జిల్లాలో సాహిత్య సమగ్రాభివృద్ధి కొరకు పలు సాహితీ సంస్థలు పని చేస్తున్నాయి. వీటిలో ప్రధానంగా చెప్పుకోదగింది సాహితీ సంస్థల సమాఖ్య **"సాహితీ గౌతమి"**. దీని అధ్యక్ష, కార్యదర్శులుగా దాస్యం సేనాధిపతి, గాజుల రవీందర్ పని చేస్తున్నారు. వీరు ప్రతి ఏటా సాహితీ గౌతమి తరపున డా. సినారె రాష్ట్ర స్థాయి సాహితీ పురస్కారాన్ని

అందిస్తున్నారు. **"జాతీయ సాహిత్య పరిషత్"** ను గాజుల రవీందర్, నంది శ్రీనివాస్‌లు నిర్వహిస్తున్నారు. మాడిశెట్టి గోపాల్, కే.ఎస్. అనంతాచార్య **'సమైక్య సాహితీ'** ద్వారా సాహిత్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. గజేందర్ రెడ్డి **'తెలుగు రక్షణ వేదిక'**, కలువకుంట రామకృష్ణ, కొత్త అనిల్ కుమార్ **'తెలంగాణ రచయితల సంఘం'**, బూర్ల వేంకటేశ్వర్లు, కూకట్ల తిరుపతి **'తెలంగాణ రచయితల వేదిక'** నిర్వహిస్తున్నారు. **'ఎన్నీల ముచ్చట్లు'** పేరుతో ప్రతీ నెల పౌర్ణమి రాజున కవితా గోష్ఠి నిర్వహిస్తూ వర్ధమాన కవులను ప్రోత్సహిస్తున్నారు. ఈ జిల్లాలో ఇంకా అనేక సాంస్కృతిక కళా సంస్థలు, నాటక సంస్థలు పనిచేస్తున్నాయి.

## వివిధ రంగాల ప్రముఖులు

ఈ జిల్లా నుంచి అనేకమంది రాజకీయ, సాహిత్య, చారిత్రక, సాంస్కృతిక, కళాత్మక రంగ ప్రముఖులు ఉద్భవించి ఇక్కడి సృజనాత్మకతను దేశానికి చాటిచెప్పారు. దక్షిణాది నుంచి తొలి భారత ప్రధానిగా ఎన్నికైన పి.వి. నరసింహారావు ఈ జిల్లాకు చెందినవారే. ఆయన స్వస్థలం వంగర ప్రస్తుతం వరంగల్ జిల్లాలో వుంది. పూర్తి పదవీకాలం అధికారంలో నెహ్రూ వంశేతర వ్యక్తి ప్రధానిగా ఆయన రికార్డు సృష్టించారు. ఆర్థిక సంక్షోభంలో వున్న దేశాన్ని సంస్కరణల ద్వారా గట్టెక్కించారు. జువ్వాడి చొక్కారావు, బద్దం ఎల్లారెడ్డి, ఎం.ఆర్. కృష్ణ, శ్రీరంగారావు, రమాపతి రావు, వొడితెల రాజేశ్వరరావు, ఎం. సత్యనారాయణ రావు వంటి ఉద్దండులు రాజకీయ రంగంలో ఆరితేరినారు. కెప్టెన్ లక్ష్మీకాంతరావు ప్రస్తుం రాజ్యసభ ఎం.పి.గా కొనసాగుతున్నారు.

వెలిచాల కొండలరావు, జువ్వాడి గౌతంరావు, కోడూరి రవీందర్, డింగాల రవీందర్, పొన్నాల రవిచంద్ర, రఘువీర్ సింగ్, కె.బి.శర్మ, మాడిశెట్టి గోపాల్, కొత్తకొండ సత్యనారాయణ, గుండా మల్లయ్య, శ్రీరాముల సత్యనారాయణ వంటివారు సాంస్కృతిక, నాటక రంగాలలో ప్రముఖులుగా వెలుగొందుతున్నారు.

వేణుమాధవ్, ఉదయభాను వంటి వారు చలన చిత్రాల్లో రాణిస్తున్నారు. యూజీసీ ఛైర్మెన్‌గా పని చేసిన ప్రొ. జి. రామిరెడ్డి ఈ జిల్లాకు చెందినవారే.

## దర్శనీయ ప్రదేశాలు - పర్యాటక రంగం

ఈ జిల్లాలోని అనేక కట్టడాలు, దేవాలయాలు ఇక్కడి చరిత్రకు, సంస్కృతికి నిదర్శనంగా నిలుస్తాయి. ప్రాచీన చారిత్రక కట్టడాలు, దేవాలయాలు అనేకం ఈ జిల్లాలో వున్నాయి.

## పర్యాటక ప్రదేశాలు

**బొమ్మలమ్మ గుట్ట :** ఇది గంగాధర మండలంలోని కురిక్యాల గ్రామ సమీపంలో వుంది. వేములవాడ చాళుక్యుల కాలంలో ఈ గుట్ట వృషభాద్రి అనే పేరుతో జైన క్షేత్రంగా వర్ధిల్లింది. జినవల్లభుడు సంస్కృత, కన్నడ, తెలుగు భాషల్లో వేయించిన శాసనం క్రీ.శ. 945 కాలం నాటిది. ఈ శాసనం ద్వారా అప్పటి చరిత్ర, సాహిత్యం తెలుస్తున్నది.

**చొప్పదండి :** క్రీ.శ. 992 నాటి పశ్చిమ కళ్యాణి చక్రవర్తి రెండవ తైలపుని కాలంలో వేయబడిన శాసనం చొప్పదండి సమీపంలోని మేలకుంట వద్ద వుంది.

**జమ్మికుంట :** ఇక్కడి శివాలయంలో క్రీ.శ. 995 నాటి రెండవ తైలపుని కాలంలో చెక్కబడిన కన్నడ శాసనం వుంది.

**నగునూరు :** కరీంనగర్ పట్టణానికి సమీపంలో వున్న ఈ గ్రామం చారిత్రక ప్రాశస్త్యం కలిగి వుంది. అనేక శిలాశాసనాలు ఈ గ్రామంలో లభ్యమైనాయి. వేములవాడ చాళుక్యులు, కల్యాణీ చాళుక్యులు, కాకతీయుల కాలంలో రాజకీయ, ధార్మిక కేంద్రంగా నగునూరు భాసిల్లింది. రెండవ అరికేసరి క్రీ.శ.946 లో వేయించిన కన్నడ శిలా శాసనం, క్రీ.శ. 1112 నాటి బీరన్న గుడిశాసనం, క్రీ.శ. 1171 నాటి వెల్లంకి గంగాధరుని శిలాస్తంభ తెలుగు శాసనం మున్నగు శాసనాల ద్వారా ప్రాచీన చరిత్ర తెలుస్తున్నది. అయితే అంతటి మహోన్నత గ్రామం ప్రస్తుతం ఆలనాపాలనా లేక శిథిలావస్థలో వుంది. గ్రామాన్ని అభివృద్ధి పర్చి పర్యాటక, చారిత్రక కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరముంది.

**కొత్తపల్లి :** ఈ గ్రామం కరీంనగర్ పట్టణ శివారులో వుంటుంది. కాకతీయుల కాలం నాటి త్రికూటాలయం ఈ గ్రామంలో వుంది.

**కరీంనగర్ :** ఇది జిల్లా కేంద్రం. ఆరవ నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ కాలంలో ఎల్గందల్ ఖిలేదార్‌గా పనిచేసిన కరీమొద్దీన్ స్థాపించిన పట్టణమిది. ఇక్కడ నిర్మించిన క్లాక్‌టవర్, కమాన్, శివాలయం మున్నగునవి చరిత్రకు సాక్ష్యాలు.

**ఎల్గందల్ :** కరీంనగర్ రెవిన్యూ మండలంలోని ఒక గ్రామమిది. కాకతీయుల కాలం నుంచి ఈ గ్రామానికి ప్రాధాన్యత వుంది. ఇక్కడ వున్న కోట చరిత్రకు ఆనవాళ్ళుగా నిలిచింది. రేచర్ల రాజుల కాలంలో కందనామాత్యుడు ఈ కోటకు అధిపతిగా వున్నాడు. నిజాం రాజుల కాలంలో ఎల్గందుల జిల్లాగా వుంది.

**మొలంగూరు :** శంకరపట్నం మండలంలో గల ఈ గ్రామంలో కోట వుంది. ఓరుగల్లు కోటకు, ఎల్గందల కోటకు మధ్యలో మొలంగూరు కోట వుండటం విశేషం. కాకతీయ ప్రతాపరుద్రుని అధికారిగా పనిచేసిన వొరగిరి మొగ్గరాజు ఈ కోటను కట్టించాడని తెలుస్తుంది.

## ముఖ్య దేవాలయాలు

కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాచీన దేవాలయాలు చరిత్రకు, సంస్కృతికి, నాగరికతకు చిహ్నాంగా నిలుస్తాయి. ఆ కాలం నాటి సాంఘిక, మత, జీవన పరిస్థితులు ఈ దేవాలయాల ద్వారా తెలుస్తున్నది.

**శ్రీ మత్స్యగిరీంద్రస్వామి దేవాలయం :** శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలోని గుట్టపై మత్స్య గిరీంద్ర స్వామి దేవాలయం వుంది. విష్ణుమూర్తి మత్స్యావతార రూపంలో ఒక గుండ్రాయిపై చెక్కబడినాడు. గుట్టపైన వున్న కోనేరులో ఎల్లప్పుడూ నీటి నిలువ వుంటుంది.

**శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయం :** జమ్మికుంట మండలంలోని ఇల్లందకుంటలో శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయం వుంది. ప్రతీ ఏటా శ్రీరామనవమి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతాయి. ఈ ఆలయంలో సీతారామ లక్ష్మణులతో పాటు రంగనాయక స్వామి విగ్రహముంది.

**నరసింహస్వామి ఆలయం :** గంగాధర మండలం లోని కోట్ల గ్రామంలో నరసింహస్వామి ఆలయం వుంది. కాకతీయుల కాలం నాటి వీరభద్రస్వామి ఆలయం, మల్లికార్జున ఆలయం వుండి శైవమత వ్యాప్తిని నిరూపిస్తున్నాయి.

**శివాలయం మరియు నరసింహాలయం :** చిగురు మామిడి గ్రామంలోని రామంచ గ్రామంలో ఉన్న ఎత్తైన కొండపైన శివాలయం, నరసింహాలయం వున్నవి. 'రామంచ తొలి మధ్య యుగము నందు జనాదరణ పొందిన హరిహర క్షేత్రమై యుండును' అని డా. జైశెట్టి రమణయ్య రాసినారు.

**శివాలయం :** హుజూరాబాదు మండలంలో వున్న ఈ గ్రామంలో చాళుక్యుల కాలపు శివాలయం వుంది. ఈ గ్రామం లోని గుట్ట సమీపంలో బృహత్ శిలా సమాధులు వున్నాయి.

**శివాలయం :** ఈ పట్టణంలో తొలి మధ్య యుగపు చారిత్రక స్థావరమని చరిత్రకారులు చెబుతున్న శిథిల శివాలయం వుంది.

**శివాలయం – రామాలయం :** ఈ నగరంలో ప్రాచీన శివాలయంతో పాటు నవీన కాలంలో నిర్మించిన రామాలయం, వేంకటేశ్వరాలయం, మహాశక్తి ఆలయం మున్నగునవి ఆధ్యాత్మిక కేంద్రాలుగా విరాజిల్లుతున్నది.

ఈవిధంగా పూర్వపు సబ్బిమండలమే నేటి కరీంనగర్‌గా రూపాంతరం చెంది, మానేరు సంపదలతో, ఫిలిగ్రీ కళలతో అలరారుతుంది. స్మార్ట్ సిటీ జాబితాలో చోటుచేసుకుని దేశవ్యాప్త గుర్తింపు పొందింది.

# కామారెడ్డి

బోనము కామరాట్టు రమ పూర్వచరిత్రల దోమకొండ సం
స్థాన సభాసరస్వతిని సంస్తుతిజేసెడి పుణ్యభూమి; స
మ్మానిత దేశభక్త కవి మండిత పండిత ధీవిశాల, సం
ధానిత భోగభాగ్యపరధామము లక్ష్మికి దుర్గమయ్యెడిన్ !

**మం**జీర, ఆలేరు నదుల సవ్వడినేల. నిజాం నిర్మాణపు సముద్రానికి జాడ. చక్కెర, తేనెల నందించు చక్కనైన జిల్లా. ఈ-గ్రామపంచాయితీ, మిషన్ కాకతీయ, ధూం ధాం కార్యక్రమాలకు పురుడుపోసిన ప్రాంతం. పురాతన కోటలు, పుణ్యక్షేత్రాలు గల చోటు. విద్యలో విశిష్టమైన కోర్సులందిస్తున్న డైరీ కళాశాల, ఓరియంటల్ కళాశాల, మోడల్ డిగ్రీ కళాశాల వంటి ఎన్నింటికో ఆలవాలమైనది మన కామారెడ్డి జిల్లా.

### ఈ పేరెందుకు?

కామారెడ్డికి పూర్వనామం కామారెడ్డిపేట. ప్రజలు కామడిప్యాట అని కూడా వ్యవహరించేవారు. సర్కారు రికార్డులలో 'కామారెడ్డిపేట'గా ఉండేది. ఆధునికంగా వెలిసిన గ్రామాలలో ఒకటైన కామారెడ్డి గ్రామం మధ్యలో పురాతనమైన కిష్టమ్మగుడి ఉంది. ఇది ఎలా సాధ్యం అని పరిశోధకులు ఆలోచిస్తే, ఈ గుడికి ఉత్తరంగా కొంతదూరంలో 'కోడూరు హనుమాండ్లు' అని పిలువబడుతున్న మరో దేవాలయం ఉంది. దీనికి కొంత దూరంలో 'కోడిచెరువు' (కోడూరు చెరువు) అని పిలువబడే చెరువుండేది. ఇప్పుడు లేదు. కాని ఆ ప్రాంత భూముల రెవెన్యూ రికార్డులలో 'కోడిచెరువు భూములు' అని ఉందని పరిశోధకుడు ఆచార్య రాజేశ్వర శర్మగారు తన 'ఆత్మనివేదన'లో వ్రాసుకున్నారు. పై విషయాల ఆధారంగా ఇక్కడ 'కోడూరు' అనే గ్రామం ఉండేదని, దానిని ఏ దండయాత్రలోనో ధ్వసం చేయడం ద్వారానే ఇప్పుడున్న కిష్టమ్మగుడిని కూడా ధ్వంసం చేసారని అంచనా వేసుకోవచ్చు. అటువంటి గ్రామాన్ని కామినేని వంశస్థులు పునరుద్ధరించి వారి వంశంలో ఒకరైన కామిరెడ్డి పేరుమీద కామాడిపేట/కామారెడ్డిపేట/కామారెడ్డిగా పేరు మార్చారని తెలుస్తుంది.

### భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి

కామారెడ్డి కొన్ని రోజులక్రితం చిన్న పల్లె. ఈ పల్లెకు రెండు కోసుల దూరంలో ఉన్న రాజంపేటకు కామారెడ్డి వాసులు సరుకులు కొనుక్కోడానికి వెళ్ళినారట. ఇప్పటి అభివృద్ధి వెనుక కారణం రైల్వేస్టేషన్, నిజాంసాగర్ కూడలి ప్రాంతం మొదలైనవి. ఈ రైల్వే స్టేషన్ రాజంపేటలో నిర్మించడానికి గ్రామస్థులు అడ్డుకోవడంతో కామారెడ్డిపేటకు చాలా దూరంలో నిర్మించారు. నిజాంసాగర్ చౌరస్తా నిజాం కాలంలో 'నిజాం సాగర్' నిర్మాణం జరుగుతున్న కాలంలో అన్ని సరుకులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి, ఈ కూడలి మీదుగా అటువైపు వెళ్ళేవి. దానితో ఈ కూడలి ప్రసిద్ధిచెంది గ్రామం ఆ వైపు పెరిగింది. ఇలా కామారెడ్డి ప్రస్తుతం ఊహించలేని అభివృద్ధితో విస్తరించింది.

**రెవెన్యూ డివిజన్లు - మండలాలు**

ఈ జిల్లాలో నిమూడు రెవెన్యూ డివిజన్లు

1. కామారెడ్డి 2. బాన్సువాడ 3. ఎల్లారెడ్డి.

**కామారెడ్డి డివిజన్‌లోని మండలాలు :**

1. కామారెడ్డి (22 గ్రామ పంచాయితీలు) 2. తాడ్వాయి (15గ్రా) 3. రాజంపేట (20గ్రా) 4. దోమకొండ (11గ్రా) 5. బీబీపేట (10గ్రా) 6. మాచారెడ్డి (19గ్రా) 7. సదాశివనగర్(22గ్రా) 8.రామారెడ్డి (15గ్రా)

**బాన్సువాడ డివిజన్‌లోని మండలాలు :**

1.బాన్సువాడ (10 గ్రామ పంచాయితీలు) 2. బీర్కూర్ (15గ్రా) 3. నస్రుల్లాబాద్ (16గ్రా) 4. బిచ్కుంద (29గ్రా) 5. జుక్కల్ (31గ్రా) 6. పెద్దకొడప్గల్ (13గ్రా) 7. మద్నూర్ (42గ్రా) 8. నిజాంసాగర్ (30గ్రా)

**ఎల్లారెడ్డి డివిజన్ లోని మండలాలు :**

1.ఎల్లారెడ్డి (31 గ్రామ పంచాయితీలు) 2. నాగిరెడ్డిపేట్ (22గ్రా) 3. లింగంపేట్ (23గ్రా) 4. గాంధారి (3గ్రా)

జిల్లా విస్తీర్ణం 3652 చదరపు కి.మీ. ఈ జిల్లాకు తూర్పున సిద్ధిపేట, పశ్చిమాన కర్ణాటక రాష్ట్రం, ఉత్తరాన నిజామాబాద్, దక్షిణాన మెదక్ జిల్లాలు సరిహద్దులు.

## సహజ వనరులు

కామారెడ్డి పచ్చని అడవులను, పారే ఏరులను, పంటలకు నీళ్ళిచ్చే ప్రాజెక్టులను, పలురకాల భూములను కలిగిన జిల్లా. రాతిగుట్టలు, ఇసుకతెప్పలను, కావలసిన కలపను అందించే ప్రాంతం.

**నేలలు :** ప్రధానంగా నల్లరేగడినేలలు, దుబ్బ చెలకలు, ఎర్రనేలలు, మొరం భూములుగా విభజించవచ్చు. ఎక్కువగా నల్లరేగడి భూములే. ఈ విషయం 'కాశీయాత్ర చరిత్ర' లో ప్రస్తావించబడింది. ప్రత్యేకంగా తాడ్వాయి మండలంలో గెలుసు (చిన్న నల్లరాళ్ళతో కూడిన) భూములున్నాయి.

**అడవులు :** జిల్లాలో అడవులు 868.99 చ.కి.మీ. విస్తరించి వున్నాయి. జిల్లాలోని మొత్తం భూభాగంలో ఇది 23.79 శాతం మాత్రమే. కైలాస్, ఎల్లారెడ్డి, బాన్సువాడ, లింగంపేట, పిట్లం మొదలైన ప్రాంతాలలో దట్టమైన అడవులున్నాయి. ఇందులో టేకు, చెనంగి, పాలగొడిసె, నల్లమద్ది, తునిక (బీడి ఆకులు) చెట్లు ఎక్కువగా ఉన్నాయి.

పర్వతాలు సంతాయిపేట, భీంగల్, లింగంపేట్ ప్రాంతాలలో దర్శనమిస్తాయి.

**నదులు :** మంజీర, ఆలేరు, మానేరు, పెద్దవాగు పాములవాగు, కళ్యాణివాగు.

**చెరువులు - ప్రాజెక్టులు :** జిల్లాలో దాదాపు 550 చెరువులున్నాయి. ఎల్లారెడ్డిని ఆనుకుని ఉన్న 'పెద్దచెరువు' కామారెడ్డి చెరువు, టేకిర్యాల చెరువులు అతిపెద్దవిగా చెప్పుకోవచ్చు.

నిజాంసాగర్, పోచారం, కౌలాస్‌నాలా, సింగీతం రిజర్వాయర్, రామడుగు లాంటి ప్రాజెక్టులున్నాయి.

నిజాంసాగర్ ప్రాజెక్టుని బంజెపల్లి వద్ద మంజీరా నదిపై నిర్మించారు. తెలంగాణ మొత్తంలో ఇదొకటే గ్రావిటీ డ్యాం. దీనిని మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1923లో మొదలుపెట్టగా నవాబ్ ఆలీ నవాబ్‌జంగ్ బహదూర్ ఆధ్వర్యంలో 1931లో పూర్తయింది. ప్రస్తుతం 17.80 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యముంది. దీనికి 82 ప్రధాన కాలువలు, 283 ఉప కాలువలున్నాయి.

పోచారం ప్రాజెక్టును పోచారంలో ఆలేరుపై 1916-1922 సం॥లో నిర్మించారు.

**జనాభా :** 2011 జనాభా లెక్కల ప్రకారం కామారెడ్డి జిల్లా మొత్త జనాభా 9,72,625 కాగా పురుషులు- 4,78,389, స్త్రీలు- 4,94,236. ఇందులో గ్రామీణ జనాభా 8,49,003 కాగా పట్టణ జనాభా 1,23,622 అనగా జిల్లా మొత్తం జనాభాలో గ్రామంలో నివసించువారి శాతం 87.29 పట్టణంలో నివసించువారి శాతం 12.71.

**అక్షరాస్యత :** ఈ జిల్లాలో అక్షరాస్యులైన పురుషులు 2,83,542 (67.37%) కాగా, స్త్రీలు 2,03,017 (46.13%). లింగ నిష్పత్తి : 1000 : 1033.

## జిల్లా చరిత్ర

ఈ జిల్లా చరిత్ర పాతరాతి యుగంతో ప్రారంభమైందని లభించిన పురావస్తు ఆధారాలు, ప్రాచీన సమాధులు నిరూపిస్తున్నాయి. ప్రాచీన కాలం నుంచి ఈ జిల్లాను అనేక రాజవంశాలు పరిపాలించాయి.

**షోడశ జనపదాలు:** క్రీ.పూ. 6 వ శతాబ్దిలో షోడశ జనపదాల ద్వారా భారతదేశ చరిత్ర ప్రారంభమైందని చెప్పవచ్చు. వాటిలో అశ్మకరాజ్యం దక్షిణాపథప్రాంతం ఒకటని, దానికి పౌదన్యపురం (బోధన్) రాజధాని అని తెలుస్తున్నది.

**మగధ సామ్రాజ్యం :** మగధ చక్రవర్తులకు సామంతులుగా 25 మంది అశ్మక రాజ్య పాలకులు ఉండేవారని నందవంశ రాజు మహాపద్మనందుడు కూడా అశ్మక రాజ్యాన్ని తన రాజ్యంలో కలుపుకున్నట్లు చరిత్ర చెబుతుంది.

**మౌర్యులు :** క్రీ.పూ.323 లో నందులను ఓడించి మౌర్యచంద్ర గుప్తుడు రాజయ్యాడు. అతని మనుమడు అశోక చక్రవర్తి వేయించిన 13వ శిలాశాసనం ప్రకారం ఈ ప్రాంతం పాలకులు వారికి సామంతులుగా ఉన్నట్లు తెలిపింది. మెగస్తనీస్ తన ఇండికా గ్రంథంలో తెలుగు వారికి 30 బలిష్టమైన కోటలు, ఒక లక్ష కాల్బలం, 20 వేల అశ్వబలం, ఒక వేయి గజబలం ఉన్నట్లు తెలిపాడు. మెగస్తనీస్ తెలిపిన 30 కోటలలో దక్కన్ ప్రాంతంలో తొలి రాజధానిగా వెలిగిన బోధన్ కోట ఒకటై ఉంటుందనడంలో సందేహం లేదు.

**శాతవాహనులు :** క్రీ.పూ. 230 - క్రీ.శ. 220 వరకు శాతవాహనులు దక్కన్ ప్రాంతాన్ని పరిపాలించారు. వీరి తొలి రాజధాని కోటిలింగాల. తదనంతరం మహారాష్ట్ర లోని పైఠాన్ (ప్రతిష్ఠానపురం), తరువాత మలిశాతవాహనులు కృష్ణాలోయలోని ధాన్యకటకం/ ధరణికోట (అమరావతి)ను

**మున్సిపల్ కార్పొరేషన్ :** కామారెడ్డి
**రెవెన్యూ గ్రామాలు :** 478
**గ్రామపంచాయితీలు :** 323
**పోలీస్ కమీషనరేట్ / హెడ్ క్వార్టర్ :** కామారెడ్డి
**పార్లమెంట్ నియోజకవర్గం :** జహీరాబాద్
**అసెంబ్లీ నియోజకవర్గాలు :** కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్.
**పట్టణాలు :** కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ.

రాజధానిగా చేసుకొని పరిపాలించినట్లు తెలుస్తున్నది. శాతవాహన రాజులలో ప్రసిద్ధిచెందిన గౌతమీపుత్ర శాతకర్ణి అశ్మక రాజ్యాన్ని జయించినట్లు, దాదాపు 30 మంది రాజులు 400 సంవత్సరాల పాటు పరిపాలించినట్లు శాసనాలున్నాయి. ఆనాటి పాలక భాష ప్రాకృతం. హాలుడు సంకలనం చేసిన గాథాసప్తశతి ప్రాకృతంలోనూ, గుణాఢ్యుని బృహత్కథా మంజరి పైశాచీ ప్రాకృతంలోనూ రచింపబడ్డాయి.

**ఇక్ష్వాకులు :** ఇక్ష్వాకులు దక్షిణాపథ ప్రాంతంలో కోసలాపురం (కౌలాస్) రాజధానిగా రాజ్యస్థాపన జరిపినట్లు కొన్ని ఆధారాల ద్వారా తెలుస్తున్నది.

**త్రికూట వంశం :** శాతవాహనుల అనంతరం నర్మదా, తపతి నదుల దక్షిణ ప్రాంతాన్ని త్రికూట వంశం వారు పరిపాలించారు. క్రీ.శ. 388 లో ఈ వంశరాజు 'ఇంద్రపురిని' నిర్మించినట్లు, అది క్రమంగా ఇందూరుగా మారిందని చరిత్రకారులు తెలిపారు. ఇందూరులో కామారెడ్డి మొన్నటివరకు ఒక భాగంగా ఉన్నది.

**విష్ణుకుండినులు :** ఇక్ష్వాకుల సామంతులు విష్ణుకుండినులు. మహారాజేంద్రవర్మ తర్వాత 12 మంది విష్ణుకుండిన రాజులు ఈ ప్రాంతాన్ని సుమారు 266 సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా పరిపాలించారు. దీని ద్వారా సమస్త దక్షిణాపథం వీరి ఏలుబడిలో ఉన్నదని తెలుస్తున్నది. క్రీ.శ. 500 లో ఈ వంశరాజైన ఇంద్రవర్మ - 1 పేరున

ఇందూరు (కామారెడ్డి జిల్లా పూర్వం ఇందూరు జిల్లాలో భాగం) అనే పేరు వచ్చిందని చరిత్రకారులైన ఆదిరాజు వీర భద్రరావు తెలిపారు. ఈ వంశంలో సుప్రసిద్ధ రాజైన రెండవ మాధవవర్మ కూడా ఈ జిల్లాను పాలించినట్లు తెలుస్తుంది.

**రాష్ట్రకూటులు** : రాష్ట్రకూట వంశ స్థాపకుడైన దంతి దుర్గునికి సామంతునిగా, బోధన్ చాళుక్య వంశస్థాపకుడైన వినయాదిత్య యుద్ధమల్లుడు ఈ జిల్లాను పాలించాడు. కామారెడ్డి జిల్లాలోగల కౌలాస్ కోటను వీరే నిర్మించారు.

**బోధన్ చాళుక్యులు** : తెలంగాణ ప్రాంతాన్ని ఒక ప్రత్యేక రాజ్యంగా పరిపాలించిన రాజవంశం బోధన్ చాళుక్యులు. వీరి రాజధాని బోధన్ (కామారెడ్డి జిల్లా పక్కప్రాంతం) నగరం.

**కల్యాణీ చాళుక్యులు** : క్రీ.శ. 973 లో ఈ జిల్లా కల్యాణీ చాళుక్యుల వశమైంది. వీరి కాలం నాటి చారిత్రక నిర్మాణాలు, శాసనాలు అనేకం లభించాయి. వీరి పాలనలో నిర్మించినదే నగరేశ్వరాలయం. ఆ గుడిముందు గాలికి ఊగే స్తంభం ఉంది.

**కాకతీయులు** : తెలుగు వారి చరిత్రలో కాకతీయుల స్థానం శిఖరాయమానం. కాకతీయ రెండవ ప్రతాపరుద్రుడు జిల్లాలోని బాల్కొండ, ఇందూరు, బోధన్, కోటగిరి మొదలైన ప్రాంతాల్నే కాక కామారెడ్డి జిల్లాలో గల కౌలాస్ వరకు సందర్శించి, ఢిల్లీ సుల్తానుల దండయాత్రల వల్ల ధ్వంసమైన కోటలను పునరుద్ధరించారు.

**ఢిల్లీ సుల్తానులు** : కాకతీయుల తర్వాత ఢిల్లీ సుల్తానులు బోధన్, ఇందూరు కోటలను వశపర్చుకున్నట్లు ఆ తర్వాత జునాఖాన్ నామాంతరం కలిగిన మహ్మద్ బిన్ తుగ్లక్ బోధన్‌ను ఆక్రమించినట్లు అతని శాసనాలు తెలుపుతున్నాయి.

**కుతుబ్‌షాహీలు** : 1544 లో రెండవ కుతుబ్‌షాహీ నవాబులు పాలించారు.

**బరీద్‌షాహీలు** : వీరి పాలనలో కోటగిరి ప్రాంతం వైభవస్థితిలో వున్నట్లు చారిత్రకులు చెబుతారు.

**రెడ్డి రాజులు** : ఈ జిల్లాలో 16 వ శతాబ్దానికి చెందిన రెడ్డి రాజుల దాన శాసనాలు లభించాయి.

**మొఘల్ చక్రవర్తులు** : 1595 లో ఈ జిల్లా అక్బర్ చక్రవర్తి ఆధీనమైనట్లు, బోధన్, ఇందూరు, బాల్కొండ దుర్గాలను ఆక్రమించినట్లు తెలుస్తున్నది. 1687 లో ఔరంగజేబు దుర్గాన్ని జయించి మహ్మద్ ఖాసింను ప్రతినిధిగా నియమించాడు.

**మహారాష్ట్రులు** : ఛత్రపతి శివాజీ గురువైన సమర్థ రామదాసు భక్తి ఉద్యమ ప్రవక్త. వీరి కాలంలో ఇందూరు కోటపై రఘునాథాలయాన్ని, పట్టణంలోని పచుమాన్ ఆలయం, సారంగాపూర్ హనుమాన్ దేవాలయ నిర్మాణం జరిగాయి.

**అసఫ్‌జాహీ వంశం** : స్థానికుల పరిపాలన, మొగలులు అనంతరం ఈ జిల్లాను 1724 నుంచి 1948 వరకు అసఫ్‌జాహీలు పాలించారు. ఈ విషయాలు స్థానిక చారిత్రక రచనలైన తారీఖీయె నిజామాబాదు, తారీఖియె బాల్కొండ మొదలైన ముస్లిం రచనలే గాక, కామినేని వంశ చరిత్ర ద్వారా తెలుస్తున్నది.

## సంస్కృతి

సమాజంలోని వ్యక్తుల సామూహిక ప్రవర్తన ఏవిధంగా ఉంటుందో అది ఆ సమూహానికి చెందిన సంస్కృతి అవుతుంది. ఈ జిల్లాలో అన్నిరకాల మతస్థులు, భాషలవారు, కులాలవారున్నారు.

**ఆచారాలు, సంప్రదాయాలు, పండుగలు** : వ్యవసాయ దారులు ఎక్కువగా ఉన్నజిల్లా గనుక ఈ ప్రాంతం వాసుల ఆచారాలు ఎక్కువగా వారి పనులతో, కాలాలతో, పంటలతో ముడివడి ఉంటాయి. పంటమొలకపోస్తే పంచపాండవులని ఐదు రాళ్ళుపెట్టి పూజిస్తారు. మొలచి పెరుగుతున్న సమయంలో 'పసకజాతర' అని ఊరందరు కలిసి వెళ్ళి వంటలు చేసుకుని తిని వస్తారు. పంటచేతికొచ్చిన తర్వాత కళ్లంలో రాశిమీద సూర్య చంద్రులను బూడిదతో బొమ్మవేసి కొబ్బరికాయలు కొడుతారు. ఇలా ప్రతి పంటకు వేరు వేరు రూపాలలో పూజిస్తారు.

ఈ ప్రాంతం చెరుకు పంటకు ప్రసిద్ధి. బెల్లం తయారు చేస్తున్న సమయంలో దోని (బెల్లం ఆరబెట్టేది) ప్రక్కన వినాయకుణ్ణి స్థాపించుకుని ప్రతిరోజు ఉదయం మొదటి కడాయి బెల్లంలో నుండి కొద్దిగా వినాయకునికి సమర్పించాకే వారు వివిధ పద్ధతులుగా వాడుతారు. అంటే ప్రతి పనిలో దైవాన్ని చూసుకొనే ఆచారం ఇక్కడ కనిపిస్తుంది.

ఉగాది మొదలుకొని అన్ని పండగలు సహజంగానే జరుపుకున్నప్పటికీ ఈ మధ్య దుర్గా నవరాత్రి ఉత్సవాలు, వినాయక ఉత్సవాలు పెద్ద ఎత్తున జరుపుతున్నారు. అయ్యప్ప పూజలు ఇటీవల విశేషంగా జరుగుతున్నాయి.

**కళలు :** కామారెడ్డి జిల్లా జానపద కళలను కాపాడు కుంటున్న ప్రాంతం. ఇప్పటికి చాలా ప్రాంతాలలో భజనలు, కోలాటాలు, యక్షగానాలు, చిరుతల రామాయణాలు, వీధినాటకాలు, మందగొల్ల ఆటలు, ఒగ్గుకథలు, బుర్రకథలు, చిందు భాగోతాలు, నాటకాలు మొదలైనవి ఆయా ఉత్సవాల సందర్భంగా కనువిందు చేస్తున్నాయి.

లింగంపేట ప్రాంతంలోని కంసాలివారు ఇనుముతో చేసిన పాత్రల తయారీలో సిద్ధహస్తులు అని అని నిజాం కాలం నాటి గ్రంథాలు చెప్తున్నాయి.

ఈ జిల్లాలో కొంతమంది చిత్రకారులు బాగా ప్రసిద్ధి పొందారు. **పప్పునారాయణ** ఈమధ్యనే కాలం చేసారు. ఈయన నఖచిత్రకారుడు. గోరుతో అద్భుతమైన బొమ్మలకు ప్రాణం పోసారు. మరో సాహితీవేత్త సూరారం శంకర్ వేసిన బొమ్మలే ఈ మధ్య ప్రచురిస్తున్న చాలా పుస్తకాలపై అట్టపేజీలుగా మారాయి.

చిన్ననాటి నుండి విచిత్రమైన చిత్రాలను వేసి ఎందరినో అబ్బురపర్చిన **మహారాజ అశోకచారి** ఫైన్‌ఆర్ట్స్ కోర్సులో చేరి ఐ.ఐ.టి. ముంబాయిలో విజువల్ కమ్యూనికేషన్ విభాగంలో శిక్షణ పొందిన వ్యక్తి. కంటిచూపుకి తన కలంతో రూపాన్ని అందించే కళాకారుడు.

ఇంతేకాకుండా వాద్యాలలో, గానంలో, నాట్యంలో ఇతరత్రా రంగాలలో పేరుగాంచిన వ్యక్తులు ఎందరో దర్శనమిస్తారు.

బండ్ల రాము 'గుండె దరువు', గఫూర్ శిక్షక్ 'గురుదేవోభవ' బందరబోయిన శ్రీనివాస్, 'తెలంగాణ పాటలు' అనే పేర్లతో రూపొందించారు.

**జాతరలు :** జాతరలు వివిధ పండగల సందర్భంగా పలుప్రాంతాలలో జరుగుతుంటాయి. మాఘ అమావాస్య సందర్భంగా నదీపరివాహ ప్రాంతాలైన సంతాయిపేట్, మాచారెడ్డి, బుగ్గ రామలింగేశ్వరాలయం మొదలైన దేవాలయాల వద్ద జాతరలు జరుగుతాయి.

శివరాత్రి సందర్భంగా శివాలయాల దగ్గర, ఉగాది సమయంలో కొన్ని ప్రాంతాలలో, కార్తీకమాసంలో మరికొన్ని ప్రాంతాలలో జాతరలు జరుగుతూ ఉంటాయి.

కామారెడ్డి పట్టణంలో వినాయక చవితి సందర్భంగా జరిగే జాతర వారం రోజులపాటు వివిధ రకాల దుకాణాలతో కనువిందు చేస్తుంది.

జాతరలలో కొన్ని ప్రాంతాలలో ఎద్దుల బండ్లు తిరగడం ప్రసిద్ధి. మరిన్ని దేవాలయాల దగ్గర రథాలు తిరగడం ప్రత్యేకం. ఈ రథాలతో ఊరుపేరుగా మారిపోయిన గ్రామం 'రథాల రామిరెడ్డి'. ఇక్కడ అతిపెద్ద రథాలున్నాయి. అట్లే ఎల్లారెడ్డి కేంద్రం రామాలయం వద్ద కూడా బాగా ప్రసిద్ధి.

## సాహిత్య చరిత్ర

కామారెడ్డి సాహిత్య వికాసం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. వివిధ ప్రక్రియలతో జిల్లా సాహిత్యం సుసంపన్నమైంది.

నన్నయకు భారతాంధ్రీకరణలో సహకరించిన నారాయణభట్టు బాన్సువాడ ప్రాంతీయులు కావడం కామారెడ్డి మహాభాగ్యం.

### దోమకొండ సంస్థాన కవులు

దోమకొండ సంస్థానం బిక్కనూర్ కేంద్రంగా ఉన్నపుడు చాలా రచనలు వచ్చాయి. ఈ రచయితలు ఈ ప్రాంతం

వారి జన్మస్థానం కానప్పటికి వారి రచనలన్నీ ఈ ప్రాంతంలో పురుడు పోసుకున్నవి. కొంతమంది ఈ పాంత్రంవారు, స్వయంగా రాజరచయితలు కూడా ఉన్నారు. వారిని గురించి–

**పట్టమెట్ట సోమనాథ సోమయాజి** : ఇతని కాలం 16వ శతాబ్దం. తల్లిదండ్రులు తిమ్మమాంబ, వేంకటమంత్రి. రచన సూతసంహిత.

**కామినేని మల్లారెడ్డి** : తెలంగాణ ప్రబంధంగా గుర్తింపు పొందిన 'షట్చక్రవర్తి చరిత్ర' (1278 పద్యగద్యాలు) గ్రంథకర్త. శివధర్మోత్తరము, పద్మపురాణము అనే గ్రంథాలను కూడా రచించాడు. ఇతనికాలం 1535- 1600.

**రాపాక లక్ష్మీపతి** : రాజన్నదేశాయి ఆస్థానంలో గల కవి. ఆచార్య విజయము, శ్రీమధూపాఖ్యానము, నీలా వివాహము, భద్రాయురభ్యుదయము, కృష్ణవిలాసము గ్రంథాల కర్త.

**ఆదిపూడి ప్రభాకర కవి** : రామచంద్రరావు కోరిక మేరకు ఇతడు కామినేని వంశచరిత్రను తెలిపే 'ఉమాపత్యభ్యుదయము' అనే ఏకాశ్వాస గ్రంథాన్ని రాసాడు.

**చివుకుల వేంకటాచల శాస్త్రి**: ఇతని రచన 'రామేశ్వర విలాసము'. ఈ కావ్యం 154 పద్యగద్యాలు కలిగిన ఏకాశ్వాస గ్రంథం. ఇందులో పూజాదికాలు, రథోత్సవాలు మొదలైన వాటి వర్ణనలు గలవు.

**రాజరాజేశ్వరరావు** : కామినేనివంశం రాజులలో ఒకడైన రాజకవి. బహుభాషా కోవిదుడు. ఇతను 125 వరకు గ్రంథాలు రాసి గొప్ప పేరు గడించాడు.

**పెద్దమందడి వేంకటకృష్ణ కవి** : ఇతను రాజరాజేశ్వర రావు ఆస్థాన కవి. 'రాణీ రాజవ్వ జీవిత సంగ్రహము, రెడ్డికులనిర్ణయ చంద్రిక, కేశవవిలాసము, నిర్వచన భక్త విజయము, గద్వాల సంస్థాన చరిత్ర, మారుతీ విలాసము' అనే గ్రంథాల కర్త.

**కామారెడ్డి ప్రాంత రచయితలు – కవులు**

**కంజర్ల సింగరాచార్యులు** : కందర్ప విజయనాటకము (యక్షగానం), శ్రీమత్తిరుపతి వేంకటేశ్వర శతకం పీం రచనలు.

**రెడ్డిశెట్టి హనుమద్దాసు** : బీబీపేట నివాసి. రచనలు జ్ఞానబోధాధ్యాత్మలు, జగదాంబ కీర్తనలు, జీవబోధశతకం.

**సిద్ధప్ప వరకవి** : సిద్ధప్ప వరకవి జన్మించింది మాత్రమే కరీంనగర్. జీవితాన్ని పూర్తిగా గడిపింది కామారెడ్డి జిల్లా బిక్కనూర్. రచనలన్నీ ఇక్కడే చేసాడు. అవి 'సిద్ధప్పజ్ఞాన బోధిని, శ్రీజవనరేంద్ర, కాకి హంసోపాఖ్యానము, ఆత్మప్రపంచ విలక్షణం' మొదలైనవి.

**పెద్ది హనుమయ్య** : బీబీపేట నందు 1911వ సంవత్సరంలో జన్మించారు. శ్రీశైలమల్లికార్జున ఉయ్యాలపాట, శ్రీహరి భజనమాల, శ్రీబసవేశ్వర భజనమాల, భ్రాతృస్మృతి, గురుదక్షిణ మొదలైన రచనలు చేసారు.

**వడ్ల వెంకటాచార్యులు** : ఈయన మాచారెడ్డి మండలం బీబీపేట నివాసి. 'రాజయోగానంద భజనమాల' ఇతని రచన.

**బాబరాయుడు** : తాడ్వాయి మండలం కృష్ణాజివాడి వాసి. 'శ్రీరాజరాజేశ్వర' శతక కర్త.

**తిగుళ్ళ వేంకటేశ్వర శర్మ** : తెలంగాణ తొలి బాలసాహిత్య రచయిత. వీరు 'వానకారు' అనే బాలగేయాల గ్రంథాన్ని 1948లో ప్రచురించారు.

**ఆచార్య అమరేశం రాజేశ్వరశర్మ** : కామారెడ్డి పట్టణంలో తెలుగు ఓరియంటల్ కళాశాలను ప్రారంభించడానికి ముఖ్య కారకులు. తెలుగు వ్యాకరణంపై వీరి పరిశోధన గ్రంథం ఇప్పటికీ ఎంతోమందికి ప్రామాణికం. నన్నెచోదుని కవిత్వం, చరిత్రపుటలు, జయగాథావళి, వేదం వేంకటరాయ శాస్త్రి వ్యాఖ్యానాలు, ఆత్మనివేదన (రెండు సంపుటాలు) మొదలైన గ్రంథాలు రచించారు.

**లోక మలహరి** : వృత్తిరీత్య ఉపాధ్యాయుడు. శతాధిక గ్రంథ రచయిత. బీబీపేట వాసి. జగ్గనివిద్దె, సంఘము వంటి నవలలు కూడా రాసారు. వీరి గ్రంథాలు 140 వరకున్నాయి.

**డా॥ అయాచితం నటేశ్వరశర్మ** : రామారెడ్డి గ్రామంలో జన్మించిన వీరు గొప్ప రచయిత, చిత్రకారుడు. వీరు రాయని

ప్రక్రియ, గేయని చిత్రం లేదు అనడంలో విచిత్రమేమిలేదు. పద్యం, వచనకవిత, గేయకవిత, శ్లోకం మొదలైన రంగాలలో పలు పరిశోధనలకు సాహిత్యాన్ని సమకూర్చారు. సంతాయిపేట, రామారెడ్డివంటి దర్శనీయ ప్రదేశ చరిత్రలు రచించారు. మొత్తంగా 50కి పైగా రచనలు ఇప్పటి వరకు వెలువడ్డాయి.

**గన్ను కృష్ణమూర్తి** : జన్మస్థానం కామారెడ్డి కాకపోయినా ఇక్కడే స్థిరపడిన మహా విమర్శకుడు. వీరి రచనలన్ని కామారెడ్డి లోనే పురుడు పోసుకున్నాయి. అడవిపూలు, కవితా కాళింది, అంతరంగం, వాసవి, మహాసంకల్పం, కృష్ణవేదం, కత్తుల కౌగిలి, ఒక మానవతా వృక్షచ్ఛాయలో, తపస్సు వంటి రచనలు చేసారు. రామాయణం, భారతం, భాగవతం, వేదాలు వంటి శాస్త్రీయ గ్రంథాలకు విమర్శలు రాసినారు. కృష్ణమూర్తిగారి రచనలపై ఆంధ్రప్రదేశ్‌లో పరిశోధన జరిగింది.

**డా. వి.ఆర్.శర్మ** : కామారెడ్డివాసి. 'తెలుగు సాహిత్యంలో బాల్యజీవన చిత్రణ' అనే అంశంపై పరిశోధన చేసారు. రచనలు కూడా ఎక్కువగా బాల సాహిత్యానికి చెందినవే. వానపూలకొండ, ఆనంద, సూర్యుళ్ళను వెలిగిస్తూ, పిల్లలకోసం, తెల్లచీకటి, మా ఊరి మట్టివాసన, కొందరు విద్యావేత్తలు, పిల్లలలోకం, సాహు జీవితం-రచనలు మొదలగు గ్రంథాల రచయిత.

**లోక లక్ష్మీనారాయణ** (బీబీపేట నివాసి. వైదిక గ్రంథాలను ఎక్కువగా అనువాదం చేసారు. మొత్తంగా 7 గ్రంథాలు ప్రస్తుతం లభ్యం), **లోక విఠల్** (తత్త్వ సారామృతము రచన), **రామోజు లక్ష్మణచారి** (తాడ్వాయి రచయిత. 'పారిజాతాపహరణము, శివచర్య' ), **ఈరుకోట పెంటయ్య స్వామి** (బీబీపేట వాసి. శ్రీ వేంకటేశ్వరశతకము, భగవద్గీతాసారము). **మంచిరాల జనార్దనాచారి** రామారెడ్డి నివాసి. శ్రీవేణుగోపాల భజనమాల, మహాత్మా గాంధీ దశావతార వర్ణన, పోతులూరి వీరబ్రహ్మం గారి శతకాలు) **శ్రీరామోజు బాలయ్యాచారి** (తాడ్వాయి గ్రామస్తుడు. మల్లేశ్వర స్తవరాజము, రామరాఘవ శతకము, వేంకటేశ్వర దశావతార శతకము), **ఎఱ్ఱోజు వేంకటేశం ఆచారి** (సదాశివ నగర్ వాసి. కాలజ్ఞాన భోజనాష్టకాలు), **వేల్పూరు నరసింహదాసు** (చుక్కాపూర్ వాసి. కాళింగ మర్దన, సావిత్రీ పరిణయం, లక్షణా పరిణయం, శకుంతలా పరిణయం మొదలైనవి), **వేల్పూరు లక్ష్మణాచార్యులు** (చుక్కాపూర్ వాసి. శ్రీకృష్ణార్జున యుద్ధం, సుభద్రాపరిణయం, జయప్రద, శశిరేఖా పరిణయం మొదలైన రచనలతో పాటు 8 వరకు యక్షగానాలు రాసారు.

**యాదవాద్రి** (ఫరీదుపేటవాసి. సత్యనారాయణ కథ (యక్షగాన రచన), **వడ్ల వేంకటాచార్యులు** (ఫరీదుపేట శ్రీ రాజయోగానంద భజనమాల, శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి నాటకం, మార్కండేయ చరిత్ర, శ్రీ జ్ఞానేశ్వర చరిత్ర మొదలైనవి), **శబరి మాతాజీ** (తాడ్వాయి ఆశ్రమమాత. 'అమరవాణి'), **బురిగారి నారాయణగౌడ్** (పెద్ద మల్లారెడ్డి వాసి. గౌడ జీవితచరిత్ర (యక్షగానం), **గుండి వెంకటాచార్యులు** (కామారెడ్డి వాసి. శ్రీవ్రతము, వాల్మీకి-క్రాంతదర్శి, రామాయణము, వాల్మీకి-రంగనాథ రామాయణము తులనాత్మక పరిశీలన, ముకుందమాల మొదలైన గ్రంథాలు), **స్వామి ప్రియానంద విద్యాభారతి** (కామారెడ్డి వాసి. ఉపాసినీ ఉపాసనం రచనలు), **రాజీవ** (కామారెడ్డి నివాసి. రాబందు, కొత్తచిగుళ్ళు, నడుస్తున్న కథ, రాబోవుతరం స్త్రీ, కొత్తనిజం, మనసు మాట గ్రంథాలు), **బోజన్నగారి రాజేశ్వరశర్మ** (కామారెడ్డి వాసి. కుమారజననం, ఉదయరాగము, శ్రీమదాది శంకరాచార్య చరిత్రము, శ్రీ కాలభైరవస్వామి మహిమ, ఫిరదౌసి చరిత్రము మొదలైన గ్రంథాలు)

**గణపురం కృష్ణమూర్తి** (అన్నారం గ్రామవాసి. పరమార్థ దర్శిని (రెండు భాగాలు), **యాదగిర్యాచార్యులు** (బిక్కనూరు వాసి. విశ్వబ్రాహ్మణ వికాసము, చిలుక మల్లయ్య జీవిత విశేషాలు, దోమకొండ సంస్థానధీశులు - సాహిత్య సేవ మొదలైన గ్రంథాలు), **డా॥ వి.శంకర్** (వీరి జన్మస్థలం ఫరీదుపేట. నిజామాబాదు జిల్లా కవిత్వం, ఫరీదుపేట - తెలంగాణ బతుకుచిత్రం, గులేర్ (వి.ఆర్.శర్మతో కలిసి) మొదలగు రచనలు), **సి. పుండరీకశర్మ** (కామారెడ్డి వాసి.

శ్రీలలితాంబికార్చనము, శ్రీరామలింగశతకము, శ్రీరఘుకుల సార్వభౌమ శతకము మొదలగు పలు గ్రంథాలు), **సిరిగాద శంకర్** (వీరి జన్మస్థలం బీబీపేట. లే,పో,రా,పద అనే కవితా సంపుటాల రచయిత), **గఫూర్ శిక్షక్** (కామారెడ్డి నివాసి. తబ్దీల్, చైతన్య వసంతం, గుండెలవిసినచోట, గురుదేవోభవ, పిలుపు, పాటకు సలాం మొదలగు గ్రంథాలు), **శాస్త్రుల పాండురంగశర్మ** (కామారెడ్డివాసి. పాండురంగ సూక్తులు)

**సయ్యద్ బందే అలీ** (కామారెడ్డి వాసి. పల్లెపాటలు, ప్రక్షాళన), **డా॥ కొల్లు రంగారావు** (కామారెడ్డి నివాసి. వెలుగుపువ్వులు, అఖండ భారతం, మనిషికీ మనసుకీ మధ్య), **కుర్రి బాలలింగము** (తాను జన్మించిన బిక్కనూరు గ్రామ దేవాలయాన్ని గూర్చి 'బిక్కనూరు సిద్ధరామేశ్వర క్షేత్రము' అనే గ్రంథం), **అరుణకుమారి** (అరుణ కిరణాలు), **ఉప్పల సరస్వతి** (బీబీపేట వాసి. భక్తిగేయమాలిక, భవానీ గేయ శతకము), **కాచాపురం నందీశ్వర శర్మ** (శ్రీ భీమేశ్వర శతకము), **కాసం సుధాకరరెడ్డి** (క్రాంతిపుష్పాలు, సుధాకర శతకము), **జి.లచ్చయ్య** (రాత-వాత మొదలగు పుస్తకాలు, వివిధ పత్రికలలో సామాజిక వ్యాసాలు), **ఆకుల వేంకట్రాములు** (శ్రీనీలకంఠేశ్వర శతకము), **ఎనిశెట్ట గంగాప్రసాద్** (ఆక్రందన, మొర అనే గ్రంథాలు), **పెద్ది అంజన్‌కుమార్** (కవితా రసఝరి), **సి.హెచ్.ప్రకాశ్** (మనసు మల్లెలు, అలజడి) **చాడా లలితాదేవి** (ఏ సిరాతో రాయాలి), **బ్రహ్మానందచారి** (జాబిలమ్మ పదాలు), **టి.నర్సింహారెడ్డి** (ఇంగులం), **కొడి రవీందర్** (నీలకంఠ, నా తెలంగాణ శతకాలు), **పి.వి.భైరవన్ వర్మ** (మారుతీ సూక్తిసుధ) మొదలైన గ్రంథాలు వెలువరించారు.

**బాన్సువాడ ప్రాంతకవులు - రచయితలు**

**మఠం మడివాళయ్య** : ఈ కవి కాలం 18వ శతాబ్దం. బిచ్‌కుంద ప్రాంతంలో గల వీరశైవ మఠాధిపతి. రచనలు శాయిరీ రామాయణం, బసవ కీర్తన, బసవాష్టకము, బసవ స్తోత్రాలు, ఈశ్వరస్తవరాజము, లింగస్తోత్రము, బోరెంచ పోచమ్మ పాటలు, బోధన్ భవానిదేని పాట, సర్వకాటు పదాలు అనే రచనలు చేసాడు.

**తాటి భీమయ్య మహారాజ్** (దురికి ప్రాంతీయుడైన తాటి భీమయ్య మహారాజ్ 20వ శతాబ్ది రచయిత. వీరు 'తత్త్వకీర్తనలు, కాలజ్ఞాన కీర్తనలు' రచించారు.) **బసిరెడ్డి రాజిరెడ్డి** ('అచలబోధామృత సారం' అనే గ్రంథాన్ని రచించిన బసిరెడ్డి రాజిరెడ్డి బోర్లం ప్రాంతీయుడు.), **పర్వయ్య** (వీరు బోర్లం నివాసి. 'అల్లమా ప్రభులింగశతకం'), **పెద్దిరాం పోచన్న పంతులు** (14 వరకు యక్షగానాలు, తిరుమలాపురం గ్రామవాసి.), **గోశిక్ నరసింహార్యులు** (దురికి నివాసియైన వీరు 'నారసింహ శతకము, గోపాల శతకం, కోదండరామశతకం మొదలైనవి), **గోశిక్ భౌమనార్యులు** (దురికి ప్రాంతవాసి. చెంచులక్ష్మీ పరిణయం, హనుమద్విజయము, స్త్రీ సాహసము, ప్రమీలార్జునీయం, సత్యహరిశ్చంద్ర నాటకం మొదలైనవి), **నక్క రామన్న** (దురికిలో జన్మించారు. భజన, తత్త్వకీర్తనలు రచించారు), **పెనుగొండ శ్రీనివాసులు** (వీరి ప్రాంతం బోర్లం. రచనలు శబరిమాత శతకము, శ్రీమార్కండేయ శతకము, బసవ శతకము), **గోశిక్ గోపాల్** (దురికి ప్రాంతవాసి. శ్రీ సోమలింగేశ్వర వేదాంత శతకం, శ్రీ పద్మావతీ పరిణయం (యక్షగానం) మొదలైనవి), **గోశికి నరహరి** (శ్రీగంగాదేవి కళ్యాణము, శ్రీ పురందర విజయోపాఖ్యానము మొదలైనవి), **ఎలగందుల నారాయణ** (బాన్సువాద వాసి. 'జ్ఞానశీల శతకం') **శ్రీమతి తిరునగరి గిరిజా గాయత్రి** (కాంతిరేఖ, చెంగల్వ), **శ్రీమతి మామిదాల లలిత** (అడవిపూలు), **సుప్పని సత్యనారాయణ** (బాన్స్‌వాడ ప్రాంత కోనాపూర్‌వాసి. శ్రీ వీరభద్ర శతకము, అరుణిమ అనే గ్రంథాలు)

**ఎల్లారెడ్డి పాంత రచయితలు**

**అణ్ణనాచార్యులు** : ఇతడు నాగిరెడ్డిపేట మండలం కిచ్చనపేటవాసి. మొత్తం 24 వరకు యక్షగానాలు రాసారు. వాటిలో పద్మావతి పరిణయం, కౌసల్య పరిణయం మొదలైన రచనలు.

**తెన్నెరంగపొన్న రంగనాథాచార్యులు** (నాగిరెడ్డిపేట మండలం మాసానిపల్లె వాసి. కాలం 1900-1950. రచనలు 'మోహినీ రుక్మాంగద, శ్రీనివాస పద్మావతీ పరిణయము' రచనలు) **తెన్నెరంగపొన్న అణ్ణనాచార్యులు** (కిచ్చనపేట గ్రామస్తుడు. 24వరకు యక్షగానాలు రాసారు. కౌసల్యా పరిణయము, పద్మావతీ పరిణయము, పారిజాతాప హరణము మొ॥)

**పప్పు నారాయణ** (ఎల్లారెడ్డి నివాసి. వేదసుధ, వీర సదాశివరెడ్డి, సీతారామ పరివేదనము, రమ్య సుందరకాండ, పుత్రయోగము, నవనీతి శతకము, చరమాంకశతకము, ఏడుకొండల వాడి నిలువుదోపిడి, తెలంగాణ పోరుబాట మొదలగు పలు గ్రంథాలు రచించారు. వీరు అద్భుతమైన చిత్రాలను, నఖచిత్రాలను గీసేవారు. ఈ మధ్యనే కాలం చేసారు.

నాగిరెడ్డిపేటలో జన్మించిన **సూరారం శంకర్** ఉపాధ్యాయులుగా రిటైర్ అయ్యారు. వీరు చిత్రకారులు. గజల్ రచయిత, గాయకుడు. విద్యార్థిగేయాలు, మహాసంకల్పం, ఇవాళే అంకురిద్దాం, హృదయం, కుదుపు మల్లిపాటలు, సౌగంధిక, రెండు జ్ఞాపకాలు అనే గ్రంథాలు వెలువరించారు. హుమాయున్ సాంఘిర్ 'తోడు బతుకమ్మ' కథల రచయిత. **రంగన్నగారి సాయిలు** ఎల్లారెడ్డి నివాసి. వీరు 'పూలకొలిమి' అనే పుస్తకాన్ని ప్రచురించారు. అయ్యావారి మురళి 'ఆర్యరవళి శతకము' రచించారు.

లింగంపేట మండల ప్రాంతీయులు **మెంగవరం రాజేంద్రప్రసాద్** 'దేవి అక్షరమాల, మాతృభూమి, గాంధారి (మండల సర్వస్వం) లింగంపేట పురవర్ణన, సుమ సౌరభాలు మొదలైన పుస్తకాలు రచించారు. **బందరబోయిన శ్రీనివాస్** 'ప్రభులింగశతకము' **దత్తయ్య అట్టెం** 'కల్లం' (సాహిత్య వ్యాసరాశి) పుస్తక రచయితలు.

## కామారెడ్డి జిల్లా అవధాన సాహిత్యం

కామారెడ్డి జిల్లాలో ముగ్గురు ప్రసిద్ధ అవధాను లున్నారు. అవధానం రంగనాథ వాచస్పతి, అయాచితం నటేశ్వర శర్మ, బెజగామ రామమూర్తి. జంటావధానులుగా ప్రసిద్ధి పొందినవారు అవధానం రంగనాథ వాచస్పతి, అయాచితం నటేశ్వర శర్మగార్లు.

## కామారెడ్డి జిల్లా సాహిత్య పరిశోధకులు

కామారెడ్డి జిల్లా మొదటి పరిశోధకుడు ఆచార్య అమరేశం రాజేశ్వరశర్మ (తెలుగు భాషా వికాసం) అయాచితం నటేశ్వర శర్మ (సౌందర్యలహరి పరిశీలన) చాట్ల నర్సయ్య (పనస హనుమద్దాసు రచనలు - పరిశీలన) అయాచితం శ్రీధర్ (తెలుగు సాహిత్యం - ప్రభుత్వ ఆంక్షలు) అమరేశం ప్రభాకర రావు (అముద్రిత గ్రంథ చింతామణి) వి. శంకర్ (నిజామాబాద్ జిల్లా - వర్తమాన కవిత్వం) డా. సునీత (వరంగల్ జిల్లా పత్రికలు) మహీపతి (గుమ్మన్నగారి లక్ష్మీనరసింహ రచనలు -పరిశీలన) అనంత కుమారశర్మ (దోమకొండ సంస్థానాలు -సాహిత్య సేవ) అరుంధతి (నిజామాబాద్ జిల్లా - యక్షగానాలు) రామస్వామి (నిజామాబాద్ జిల్లా సాహిత్యం)

యం.ఎ. యూసుఫ్ (నిజామాబాద్ జిల్లా - జానపద కళారూపాలు) కుర్మకోరె రవికుమార్ (పెద్దింటి అశోక్ కుమార్ - రచనలు పరిశీలన) పిల్లి సురేశ్ (నిజామాబాద్ జిల్లా కథా సాహిత్యం) వై.నర్సింలు (తెలుగు వ్యాసం) దత్తయ్య అట్టెం (మహాభారతంలో సంవాదాలు -సమగ్ర పరిశీలన) కమటం కృష్ణ (నిజామాబాద్ జిల్లా - నవలా సాహిత్యం) బి. శ్రీనివాస్ (నిజామాబాద్ జిల్లా గేయ సాహిత్యం) శివ (నిజామాబాద్ జిల్లా వచన సాహిత్యం).

## సాహితీ సంస్థలు

**జాతీయ సాహిత్య పరిషత్** అధ్యక్షులు డా॥ అయాచితం నటేశ్వర శర్మ. **తెలంగాణ రచయితల వేదిక** అధ్యక్షులు గఫూర్ శిక్షక్. **తెలంగాణ రచయితల సంఘం** అధ్యక్షులు నర్సింహారెడ్డి. **కామారెడ్డి అధ్యయన వేదిక** అధ్యక్షులు డా॥ వి.ఆర్.శర్మ. **సాహిత్య తరంగిణి** అధ్యక్షులు సూరారం శంకర్. **సాహితీ సమాలోచనం** అధ్యక్షులు గంగాప్రసాద్. **భీమన్న సాహితీ**

పీఠం అధ్యక్షులు సుప్పని సత్యనారాయణ. ఈ సంస్థలు వివిధ రచయితల అధ్యక్షతన ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

## వివిధ రంగాల ప్రముఖులు

**బి.యన్.ఎస్వీ. భద్రయ్య** సామాజిక సేవకులు.

**షబ్బీర్అలీ** రాజకీయ వేత్త.

**బారాజగౌడ్** సామాజిక సేవకులు

**ఆచార్య అమరేశం రాజేశ్వర శర్మ** వ్యాకరణ పండితులు.

**అయాచితం నటేశ్వర శర్మ** ప్రముఖ సంస్కృత పండితులు.

**డా॥ ఈశ్వరదాసు** ప్రముఖ వైద్యులు

**అంజన్రెడ్డి** ప్రముఖ వైద్యులు

**కె. ప్రకాశ్** నేత్ర వైద్యులు

**డా॥ రాజగోపాల రావు** సామాజిక సేవకులు, వైద్యులు.

**పోలీస్ కిష్టయ్య** తెలంగాణ ఉద్యమం కోసం ప్రాణం అర్పించారు.

**కె.ఆర్.రాజారెడ్డి, కె.పి.రాజారెడ్డి** విద్యాపరమైన సేవకులు

**లచ్చయ్య యాదవ్, విఠల్రెడ్డి** స్వాతంత్ర సమరయోధులు.

**మిట్టపల్లి సీతారామసూరి** శాస్త్ర పండితులు

**లోక మలహరి** ప్రముఖ అనువాదకులు

**పెద్దగొల్ల ఎల్లన్న యాదవ్** బి.సీ.ల హక్కులకోసం పోరాడుతున్నారు.

**రాములు పంతులు** వందల యక్షగాన నాటకాలు వేయడం నేర్పుతారు.

**డా॥ రాంసింగ్** (ఉస్మానియా హాస్పిటల్) సమాజ సేవకులు, ప్రతినెల ఒక గ్రామంలో 'ఉచిత వైద్యశిబిరం' పేరుతో ఎంతోమంది రోగులను బాగుచేస్తున్నారు.

## దర్శనీయ ప్రదేశాలు - పర్యాటకరంగం

**పర్యాటక ప్రదేశాలు :** మాచారెడ్డి మండలంలో గల చుక్కాపూర్ నరసింహ స్వామి దేవాలయం చాలా ప్రసిద్ధి. మద్దికుంటలో బుగ్గరామలింగేశ్వరాలయం అంతే.

బిక్కనూర్లో గల సిద్ధరామేశ్వరాలయం. తాడ్వాయి మండలం సంతాయిపేటలో భీమేశ్వరాలయం. తాడ్వాయి గ్రామంలో గల శబరిమాత ఆశ్రమం ఎంతోమంది భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా మారింది. ఇక్కడికి కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలనుండి భక్తులు వస్తారు. ఇక్కడ ప్రతి రెండవ శనివారం వందల మంది భక్తులతో భజన జరుగుతుంది. నిత్యాన్నదానం జరుగుతుంది.

లింగంపేటలో గాలికి ఊగే స్తంభం. నాగిరెడ్డిపేట మండలం బొల్లారంలో పురాతన కోట. ఈ మండలంలోనే గల పోచారం ప్రాజెక్టు.

**దోమకొండ సంస్థానం :** అక్కడగల కోటలు, కోటలో గల దేవాలయం, అందలి భవనాలు చూడముచ్చట గొల్పుతాయి. ఈ సంస్థానాన్ని కామినేని వంశస్థులు పాలించారు. వీరు మొదట బిక్కనూరు, రామారెడ్డి, కామారెడ్డిలను కేంద్రాలుగా చేసుకునిపాలించారు. చివరగా దోమకొండలో స్థిరపడ్డారు.

'కౌలాస్ దుర్గం' ఈ దుర్గం కాకతీయుల కంటే ముందు వారి ఆధీనంలో ఉన్నపుడు 'కైలాసము'గా పిలువ బడింది. కుతుబ్షాహీల వశమైన తర్వాత కౌలాస్గా పేరుమార్చారు. ఇది కామారెడ్డి జిల్లాలోనే ఒక అద్భుతమైన కట్టడం.

నిజాంసాగర్ ప్రాజెక్టు వర్షాకాలం పూర్తిగా నిండిన సమయంలో నిత్యం వేలమందికి దర్శనీయ దైవంగా మారింది. ఆలేరు నదిపై నిర్మించిన పోచారం ప్రాజెక్టు చుట్టూ అరణ్యాలు కలిగి చూడముచ్చటగా ఉంటుంది.

కామారెడ్డి, మెదక్ జిల్లాల సరిహద్దుల్లో ఉన్న పోచారం అభయారణ్యం ఎన్నో వన్యమృగాలకు, ప్రత్యేకంగా పక్షులకు పేరుగాంచింది. దీనిని 1916 నుండి 1922వరకు అల్లయిర్ గట్లు అనేవారు. ఆ ప్రాంతానికి దగ్గరలోనే పోచరాం ప్రాజెక్ట్ ఏర్పడిన తర్వాత దీనికి కూడా పోచారం అభయారణ్యంగా మార్చారు. ఇది మొత్తం 130 చ.కి.మీ పరిధిలో వ్యాపించి ఉంది.

## ముఖ్య దేవాలయాలు

**సోమలింగేశ్వర ఆలయం (దుర్కి)** : ఇక్కడ గల శాసనం ఆధారంగా ఈ దేవాలయాన్ని కళ్యాణి చాళుక్య మూడవ సోమేశ్వరుడు జైనమత ప్రేరణతో నిర్మించినట్లు తెలుస్తుంది. ఈ ఆలయం పద్మ ఆకారంలో ఉంది. ముందు కోనేరు గలదు. ఈ దేవాలయానికి వారసత్వ మఠాధిపతులు కొనసాగుతున్నారు.

**కాలభైరవస్వామి ఆలయం (రామారెడ్డి)** : ఈ విగ్రహం జైనమత 23వ తీర్థంకరుడైన పార్శ్వనాథుని విగ్రహ లక్షణాలు కలిగుంది. ఇక్కడ అగ్ని గుండాలు తొక్కడం ప్రత్యేకత. ఈ ఆలయం ఇప్పుడు గొప్ప అభివృద్ధి చెందింది. ఈ దేవాలయం గురించి అయాచితం నటేశ్వర శర్మగారు రచించిన పుస్తకం ప్రామాణికం.

**నగరేశ్వరాలయం (బిచ్కుంద)** : ఈ ఆలయాన్ని రాష్ట్రకూటులు జైనమత ప్రేరణతో ప్రారంభించగా, కళ్యాణీ చాళుక్యులు వైష్ణవాలయంగా, కాకతీయులు శైవాలయంగా మార్చారు. ఆలయం గర్భగుడి పునాదిభాగం పద్మరూపాన్ని కల్గి ఉంది. గర్భగుడిలో అమృతభాండ శిల్ప చిత్రముంది.

**త్రిలింగ రామేశ్వరాలయం (తాండూరు)** : నాగిరెడ్డిపేట మండలం తాండూరులో ఉంది. ఈ ఆలయం బోధన్ చాళుక్యులు జైనమత ప్రేరణతో 3 గర్భగుడులు అంతరాలుగా మొదలుపెట్టగా కాకతీయులు దీన్ని త్రిలింగ రామేశ్వరాలయంగా తీర్చిదిద్దారు. ఇప్పుడు గ్రామ కమిటీ పునరుద్ధరణతో అలరారుతోంది.

**నగరేశ్వరాలయం (లింగంపేట్)** : ఈ ఆలయం కళ్యాణీ చాళుక్యుల కాలంలో నిర్మించబడింది. ఈ గుడి ముందు గరుడ, ఆంజనేయ శిల్పాలున్నాయి. ఈ దేవాలయం లో గాలికి ఊగే స్తంభం ఉన్నది. ఈ దేవాలయానికి కొద్ది దూరంలో గొప్ప రామాలయం, అక్కడొక పురాతనమైన కోనేరు ఉన్నది.

**భోగేశ్వరాలయం (గాంధారి)** : ఇది పురాతన దేవాలయం. దీనిని యవనులు దండయాత్రలో ధ్వంసం చేసినట్లు చరిత్ర చెబుతుంది. ఇప్పుడు చుట్టూ ఉన్న ప్రాంతాల వారితో పూజలందుకుంటున్నది. ఈ గ్రామంలోనే ఉన్న విఠలేశ్వరాలయం కూడా ప్రసిద్ధి గాంచింది.

**భీమేశ్వరాలయం (సంతాయిపేట)** : కళ్యాణీ చాళుక్యుల కాలంనాటి కట్టడం ఇది. ఈ శివాలయం పక్కనే పార్వతీ ఆలయం ఉంది. కొద్ది ముందుకు హనుమంతుని ఆలయం. అంతేకాకుండా శ్రీకృష్ణ పాండవుల శిల్పాలు, సప్తమాతృకలు, శ్రీ కాలభైరవ ఏకశిల్ప దృశ్యాలున్నాయి. ఈ దేవాలయం ముందు వాగు ప్రవహిస్తుంది.

**సిద్ధ రామేశ్వరాలయం (బిక్కనూర్)** : ఈ దేవాలయం కామినేని వంశ రాజుల కాలం నుండి ఇప్పటివరకు గొప్ప ఆదరణలో ఉంది.

**మహాదేవుని ఆలయం (దోమకొండ)** : తెలంగాణలో ప్రసిద్ధిచెందిన దోమకొండ కోటలో ఉన్న ఆలయం. ఈ ఆలయానికి చుట్టూ ఉన్న పద్మ శిల్ప చిత్రాల ఆధారంగా ఇది జైనాలయంగా రూపొందించారని తెలుస్తున్నది. కాకతీయుల కాలంలో శివాలయంగా మార్చుకున్నారు. కామినేని వంశస్థులు ఈ గుడి కలిగిన ప్రాంతాన్ని కోటగా మలచుకొని, దానినే రాజధానిగా పరిపాలన సాగించారు.

**శ్రీ రామనాథాలయం (బందరామేశ్వర్ పల్లి)** : ఈ ఆలయం మొదటి రామనాథ ఆలయంగా ఇక్కడ లభించిన కాకతీయుల కాలం నాటి శాసనం తెలుపుతుంది. ఈ ఆలయానికి ప్రవేశద్వారం రెండు అంతస్థులతో ఉంది. చుట్టు ప్రహరీ గోడపై శైవమత ఖండితశిల్పాలు, భైరవుడు దర్శనమిస్తాడు.

**లక్ష్మీనరసింహ స్వామి ఆలయం (భీంగల్)** : ఇక్కడి ఆధారాలను బట్టి ఇది మొదట జైనాలయంగా ఉండి, తర్వాత కాలంలో వైష్ణవాలయంగా మార్చినట్లు తెలుస్తుందంటారు పరిశోధకులు. తర్వాత ముస్లిం దండయాత్రలో ధ్వంసం అయినట్లు కనదుతుంది.

**మల్లికార్జునాలయం (శట్పల్లి) :** ఈ శివాలయం అతి పురాతనమైంది. ఇక్కడి ఇటుకలు వెడల్పుగా చాళుక్యుల కాలాన్ని గుర్తుచేస్తాయి. పక్కన గల చెరువును 'మాలకుంట' అని పిలుస్తున్నారు ప్రస్తుతం. కాని అది 'మల్లన్నకుంట' అయి ఉంటుంది. ఇది గ్రామానికి తూర్పుభాగంలో ఉంటే పడమరలో మరో శివాలయం 'ప్రభుదేవుని' ఆలయం ఉంది. గుడిముందు సంభాలు ప్రాచీన కాలాన్ని గుర్తుచేస్తాయి. గుడిని ఆనుకుని చెరువుంది. ఇది ఇప్పుడు 'దేవునిచెరువు' అని పిలువ బడుతున్నది.

'కిష్టమ్మగుడి' కామారెడ్డి, 'మల్లికార్జునాలయం' దేవునిపల్లి, శ్రీరాజరాజేశ్వరాలయం' రామారెడ్డి, 'హరిహరాలయం', 'నగరేశ్వరాలయం' పెద్దమల్లారెడ్డి, బసవేశ్వరాలయం' బోర్లం, నరసింహస్వామి దేవాలయం' చుక్కాపూర్. కామారెడ్డి జిల్లాలో ఎక్కుగా శైవాలయాలు, తర్వాత వైష్ణవాలయాలు, అటు తర్వాత శక్తి ఆలయాలు కనబడుతాయి. అవధూతలుగా భావించే సాయిబాబా ఆలయాలు, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాలు, మెహర్‌బాబా ఆలయాలు ఉన్నాయి. కామారెడ్డి, ఎల్లారెడ్డి మొదలైన చోట్ల అయప్ప దేవాలయాలున్నాయి. హనుమాన్ ఆలయాలు, పోచమ్మలు ఊర్లలో ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాలలో అవి నిర్మాణదశలో ఉన్నాయి.

**దర్గాలు - మసీదులు:** కామారెడ్డిలో హజరత్ నిరంజన్ షాహ్ దర్గా, హజరత్ సుల్తాన్‌షాహ్ దర్గాలు, మాచారెడ్డిలో హజరత్ దస్తగీర్ షాహ్‌దర్గా, ఎల్లారెడ్డిలో హజరత్ సయ్యద్ అబ్దుల్ రహమాన్ దర్గా, సదాశివనగర్ మండలంలో పీర్‌షాహ్ హుస్సేనీ, రహమతుల్లా అలై దర్గాలు ప్రసిద్ధి చెందినవి.

మసీదులలో కామారెడ్డి పట్టణంలో గల మదీన మజీద్ అతి పెద్దది. కామారెడ్డి ప్రాంతంలోని మసీదులలో ఇప్పటికి మదర్సాలు నడుస్తున్నాయి. లింగపేట్‌లో 1988లో ప్రారంభించిన మదర్సా రాష్ట్రంలోనే ప్రసిద్ధిచెందినదిగా చెప్తుంటారు. ఇక్కడ ఇతర రాష్ట్రాల పిల్లలు విద్య నభ్యసిస్తున్నారు. అట్లాగే రామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద, బోధన్ మొదలైన ప్రాంతాలలో మదర్సాలతో కూడిన మసీదులున్నాయి.

**చర్చిలు :** కామారెడ్డి జిల్లాలో మొత్తంగా అనేక చర్చిలు ఉన్నప్పటికీ కామారెడ్డిలోగల సి.యస్.ఐ. చర్చ్ అతిపెద్దది. ఈ చర్చి పట్టణం మధ్యలో పెద్దగ్రౌండ్‌ను, ఒక పాఠశాలను కలిగి ఉన్నది.

**ఇతర భక్తి కేంద్రాలు:** ఈ జిల్లాలో 'రాధాస్వామి సత్సంగ్‌బ్యాస్'లు, 'చిష్తి'గుంబస్‌లు వెలిసాయి. స్వాధ్యాయి పేరుతో 'అమృతాలయా'లు, 'యోగేశ్వరకృషి', 'శ్రీదర్శన్' పేర్లతో బాగా ప్రసిద్ధిచెందాయి.

**జిల్లా ప్రత్యేకతలు:** ఈ జిల్లాలో అతిపెద్ద చక్కెర పరిశ్రమ గలదు. దీని ద్వారా చుట్టుప్రక్కల వ్యవసాయదారులు చెరుకు పంటను పండించి లాభపడుతున్నారు. అట్లే చాలా మందికి ఈ ఫ్యాక్టరీ ఉద్యోగవకాశాలు కల్పించింది.


కామారెడ్డి పట్టణంలో గల డైరీ కళాశాల తెలంగాణలో మరే ప్రాంతంలో లేదు. ఇక్కడ చదువుకున్నవారు ఎక్కువమంది నేటి పాడి పరిశ్రమలలో స్థిరపడుతున్నారు.

బిక్కనూరు ప్రాంతంలో పట్టుపరిశ్రమ కలదు.

తెలంగాణ విశ్వవిద్యాలయానికి అనుబంధ క్యాంపస్ హైదరాబాదు రహదారి పక్కన దోమకొండ దగ్గరలో కలదు.

మంజీర, ఆలేరు నదుల స్పర్శతో దోమకొండ సంస్థానాధీశుల దర్పాన్ని, పద్య, గద్య కవుల తేనెలొలికే కవితలతో, చక్కెర, బెల్లం దండిగా ఉన్న కామారెడ్డి ఆధునికంగా ఈ - గ్రామపంచాయితీ కలిగిన తెలంగాణలోని ఏకైక జిల్లాగా ప్రసిద్ధి పొందిది.

# కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా చిత్రపటం





బాలేశ్వర దేవస్థానం




వాంకిడి శివాలయం



సిర్పూర్ కోట



అసిఫాబాద్ అడవులు



కొమరం భీం



కొండా లక్ష్మణ బాపూజి

36(b)

# కొమరం భీం ఆసిఫాబాద్

భద్రగిరీశు పాదములు భద్రత గూర్పగ నెల్లవేళలన్
ముద్రిత రామభద్రమయి మోహన మూర్తుల పర్ణశాలలో
నద్రి సమాన పుణ్యముల నానుచు గౌతమి పారుచుండగా
సద్రుచి దీప్తమై వెలుగు సారస భూతలి కొత్తగూడెమే!

## ఈ పేరెందుకు

కొండల్లో కోనల్లో నినదించిన సింహనాదం.

**"జల్-జంగల్ - జమీన్**
**మాననాదె మాన సాడి**
**మావనాటె మావరాజ్**
**మావ నాటె మావ సర్కార్"** నినాదం.

అడవిలో అణగారిన గిరిజనుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం నిజాం ప్రభుత్వంతో పోరుచేసి ప్రాణాలిచ్చిన యోధుడు కుమ్రం భీం. గోండులు గుండెల్లో నిండిన నాయకుని అమరత్వానికి సాక్షీభూతమే "కుమ్రం భీం ఆసిఫాబాదు" జిల్లా. తెలంగాణ రాష్ట్రంలో 2016 అక్టోబరు 11వ తేది దుర్ముఖి నామ సంవత్సర ఆశ్వీయుజ శుక్ల విజయదశమి మంగళవారం నాడు పురుడు పోసుకున్న కొత్త జిల్లా.

శతాబ్ద కాలంగా ఆదిలాబాదు జిల్లాలో భాగంగా ఉన్న ఆసిఫాబాదు పునర్వ్యవస్థీకరణలో అనూహ్యంగా పూర్వవైభవాన్ని పొందింది. ఆదిలాబాదును రెండు జిల్లాలుగా విభజించి, మంచిర్యాల కేంద్రంగా ఏర్పడే తూర్పుజిల్లాకే కుమ్రం భీం జిల్లాగా పేరు పెడతారని మూడేళ్ళుగా ప్రచారం జరిగింది.

"కలిసొచ్చే కాలం వస్తే నడిచొచ్చే కొడుకు పుడ్తాడు" అన్నట్లు పదిహేను రోజుల వ్యవధిలో రకరకాల రహస్య పరిణామాల కారణంగా ఆసిఫాబాదు కేంద్రంగా "కుమ్రం భీం" జిల్లా ఏర్పాటైంది. అధికంగా గిరిజనులు నివసిస్తూ, వారికోసం అమరుడైన స్వాతంత్ర్య సమరయోధుడు కుమ్రంభీం. ఈ జిల్లాకు పూర్వచరిత్ర గొప్పగా ఉంది. దాదాపు వెయ్యి సంవత్సరాలు ఈ ప్రాంతం గోండ్వానా రాజ్యంగా గిరిజన సంస్కృతితో కళకళలాడింది.

## భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి

పూర్వపు ఆదిలాబాదు జిల్లాకు తూర్పు ప్రాంతంలో నాలుగువేల ఎనిమిది వందల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో కుమ్రంభీం ఆసిఫాబాదు జిల్లా ఉంది. హైదరాబాదు పట్టణానికి మూడు వందల కిలోమీటర్ల దూరంలో ఉత్తరాన మహారాష్ట్ర సరిహద్దుగా ఉంది. జిల్లాకు తూర్పున తాండూరు, కన్నెపల్లి, వేమనపల్లి మండలాలున్నాయి. ఉత్తరాన వార్ధా, ప్రాణహిత నదులు, తర్వాత చంద్రాపూర్, గడిచిరోలి జిల్లాలున్నాయి. పశ్చిమాన ఆదిలాబాదు జిల్లా నార్నూరు, ఊట్నూరు మండలాలు సరిహద్దులుగా వున్నాయి. దక్షిణాన దండేపల్లి జన్నారం మండలాలు, దక్షిణ పశ్చిమాన పర్వత శ్రేణులున్నాయి. ఉత్తర అక్షాంశాలు $19^0$–24 డిగ్రీలు, దక్షిణ అక్షాంశాలు $79^0$–20 డిగ్రీలుగా జిల్లా ఉంది. తూర్పున

**రెవెన్యూ డివిజన్లు, మండలాలు**

ఈ జిల్లాలో రెండు రెవిన్యూ డివిజన్లు వున్నాయి. అవి ఆసిఫాబాదు, కాగజ్‌నగర్‌లు. మొత్తం మండలాల సంఖ్య 18.

**ఆసిఫాబాద్ రెవెన్యూ డివిజన్‌లో 8 మండలాలు :**

1. లింగాపూర్ 2. సిర్పూర్ (యు) 3. జైనూర్ 4. కెరమెరి 5. వాంకిడి 6. తిర్యాణి 7. ఆసిఫాబాద్ 8. రెబ్బెన.

**కాగజ్‌నగర్ రెవన్యూ డివిజన్‌లో 7 మండలాలు :**

1.కాగజ్‌నగర్ 2. సిర్పూర్ (టి) 3. చింతనమానె పల్లి 4. కౌటాల 5. పెంచికల పేట 6. బెజ్జూరు 7. దెహగాం

గోదావరి, దాని ఆవల మహారాష్ట్ర, పడమర ఆదిలాబాదు, నిర్మల్ జిల్లాలు, ఉత్తర దిశలో గోదావరి, దక్షిణాన మంచిర్యాల్ జిల్లాలు సరిహద్దులు వున్నాయి.

## సహజ వనరులు

**నేలలు** : జిల్లావ్యాప్తంగా నల్లరేగడి నేలలు అధికంగా ఉన్నాయి. ముప్పైవేల మంది రైతులు తెల్లబంగారం (పత్తి) పండిస్తారు. పన్నెండు జిన్నింగ్ మిల్లులున్నాయి. కందులు రెండవ పంటగా స్థానం పొందింది. తూర్పున సిర్పూరు నుండి వరి పంట పండుతుంది. ఆసిఫాబాదు, కాగజ్‌నగర్‌తో కలిపి మూడు వ్యవసాయ మార్కెటు కమిటీలున్నాయి.

సున్నపురాయి నిల్వలు ఎక్కువగా ఉన్నా ఆసిఫాబాదులో కొన్నేళ్ళు నడిచిన అన్నపూర్ణ, సోమేశ్వర సిమెంటు కంపెనీలు ఇరవై ఏళ్ళక్రితం మూతపడ్డాయి. కాగజ్ నగర్‌లో సర్‌సిల్క్ ముప్పయి ఏళ్ళకింద, సిర్పూరు కాగితాల పరిశ్రమ గతేడాది మూతపడింది.

**అడవులు** : జిల్లాలో కొండలు, అడవులు, గుట్టలు, వాగులు ఎక్కువగా ఉంటాయి. 2,400 కి.మీ. విస్తీర్ణంతో జైనూరు లింగాపూర్, సిర్పూర్, తిర్యాని ఆసిఫాబాదు కెరమెరి, వాంకిడి, బెజ్జూరు మండలాల్లో అడవులు ఎక్కువగా ఉన్నాయి. సిర్పూరు (టి) వాంకిడిలో పాక్షికంగా కన్పిస్తాయి. రెబ్బెను, కాగజునగరు, దమగం మండలాల్లో అతి తక్కువగా అడవులున్నాయి. ప్రాణహిత చేవెళ్ళ ప్రతిపాదిత ప్రాజెక్టు ఉత్తరాన 'మామిడి హెట్టి' దగ్గర పురుడు పోసుకుంది. తెరాస ప్రభుత్వం దాన్ని ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టు వరకే పరిమితం చేసింది. గూడెం నుండి మహారాష్ట్రలోని 'ఐహిరి" కి ప్రాణహిత నదిపై 24 పిల్లర్లతో నిర్మించే వంతెన శరవేగంగా కొనసాగుతోంది. దీనితో రవాణ సౌకర్యం పెరుగుతుంది. ఇప్పటికే వెంకటాపురం వద్ద ఒక వంతెన నిర్మించారు.

**సాగునీరు – చెరువులు** : జిల్లాలో పూర్వకాలంనుండి సాగునీటి వనరులు తక్కువే. పోడు వ్యవసాయం 'ఆకసాయి' పంటలే ఎక్కువ. గ్రామాలెక్కువగా వాగుపై ఆధారపడి జీవనం సాగిస్తాయి. గడిచిన దశాబ్దకాలంలో తిర్యాని మండలం చెలిమలలో ఎన్టీఆర్ సాగర్, దహగాం మండలంలో పాల్వాయి పురుషోత్తం రావు, జగన్నాథరావ్ ప్రాజెక్ట్, ఆసిఫాబాదులో కుమ్రంభీం ప్రాజెక్టు, వట్టివాగు ప్రాజెక్టు నిర్మాణాలు చోటుచేసుకున్నాయి. చిన్న చెరువులు వెయ్యి వరకు ఉంటాయి. వట్టివాగు క్రింద 16 వేలు, చెలిమెల క్రింద 4 వేలు, కుమ్రంభీం ప్రాజెక్టు క్రింద 40వేల ఎకరాలకు సాగు నీరందించే యత్నాలు సాగుతున్నాయి.

**జనాభా :** ఆసిఫాబాద్ జిల్లా జనాభా 5,15,812 అందులో పురుషుల జనాభా 2,58,197, స్త్రీల జనాభా 2,57,615. దీనిలో గ్రామీణ జనాభా శాతం 83.14%, పట్టణ జనాభా శాతం 16.86%, జనసాంద్రత 106, లింగ నిష్పత్తి 1000 : 998.

**అక్షరాస్యత :** అక్షరాస్యతా శాతం 56.72. ఇది తెలంగాణ రాష్ట్ర సగటు అక్షరాస్యతా శాతం కన్నా 10% తక్కువ. పురుషుల అక్షరాస్యత 65.99%, స్త్రీల అక్షరాస్యత 47.50%.

## జిల్లా చరిత్ర

జిల్లా కేంద్రమైన కుమ్రంభీం ఆసిఫాబాదు చారిత్రాత్మకంగా విశేష ప్రాధాన్యత గల్గిఉంది. ప్రస్తుతం ఛత్తీస్‌గడ్ (పూర్వం మధ్యప్రదేశ్) లోని చంబల్ లోయనుండి గోదావరీ, ప్రాణహిత పరివాహక ప్రాంతాలు గిరిజనులైన గోండుల పాలనలో గోండ్వానా రాజ్యంలో ప్రసిద్ధి. మేజర్ లూసీస్మిత్ అనే పరిశోధకుడు ఈ ప్రాంతాన్ని ముప్పై మంది రాజులు తొమ్మిది శతాబ్దాలు పాలించినట్లు గుర్తించాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రచురించిన గెజిటీర్ ఆధారంగా క్రీ.శ.870 లో కోల్‌భిల్ రాజు వైరాగడ్ రాజులను ఓడించాడు. మానస, గాన వంశాల తర్వాతి వారే వైరాగడ్‌లు. భీం భిల్లాసింగ్ వచ్చేవరకు క్రీ.శ.1240 దాకా గోండ్వానా రాజ్యాన్ని వైరాగడ్, నాగ, మానస వంశీయులే పాలించారు. భీం భిల్లాసింగ్ సూర్యాపూర్ (ప్రస్తుతం సిర్పూరు) పట్టణం, చంద్రపూర్, అహిరి రాజధానులుగా ఉన్నాయి. వాటి పరిధిలో ఆసిఫాబాదు, ఉట్నూరు తాలుకాలున్నాయి. క్రీ.శ.1240-1741 సంవత్సరాల కాలంలో ఇరవైమంది రాజులు మారారు. గోండు రాజుల పేరు చివరన 'షా', సింగ్' ఉంటాయి. గోందే భాషలో 'షా'అంటే రాజు అని అర్థం.

## అంకమరాజు

జిల్లా కేంద్రమైన ఆసిఫాబాదులో పట్టణం నడిబొడ్డున 'అంకమ రాజు సమాధి' ఉంది. బీర్‌షా కొడుకు బాబాజీ. ఆయన ఐదుగురు కొడుకుల్లో అంకమరాజు ఐదవవాడు. బాబాజీ పూర్తిపేరు బల్లాల్‌షా. అంకమరాజు పెద్దకొడుకు రాంషా (రామశాయి) అంకమరాజునే స్థానికులు 'అక్బర్‌షా' అని, బంధువులు 'అంకుబావ' అని పిలిచేవారు.

## గేయం

అంకమ రాజు రాబీకేయ చారిత్రాత్మక అంశాలలో పులికుంటుకు చెందిన బలిజ వీరన్న 17 శతాబ్దంలో గేయం రాశాడు. మంచిర్యాలకు వెళ్ళే రహదారి ప్రక్కన పులికంటి ఉంటుంది. ఈ గేయాన్ని గోండులు, మేర కులస్థులు ఇప్పటికే పాడుతూ నాటకీకరణ చేస్తారు. గోండుల్లో గేయాన్ని సేకరించి మందాడి నారాయణరెడ్డి అనే ఉపన్యాసకుడు, పరిశోధకుడు 1995లో ప్రచురించారు.

**మున్సిపాలిటీ :** ఆసిఫాబాద్

**రెవెన్యూ గ్రామాలు :** 431

**గ్రామపంచాయితీలు :** 173

**పార్లమెంటు నియోజకవర్గం :**

**అసెంబ్లీ నియోజక వర్గాలు :** 1. ఆదిలాబాద్ 2. బోథ్ 3. ఖానాపూర్‌లోని కొన్ని గ్రామాలు

**పట్టణాలు :** జిల్లాలో ప్రధానంగా మూడు పట్టణాలున్నాయి. అవి ఆసిఫాబాద్, సిర్పూర్, కాగజ్‌నగర్

## సంక్షిప్తంగా కథ

"జన్‌గాం" జనగామగా పిలువబడే ఆసిఫాబాదును అంకమ రాజు జనరంజకంగా పాలించాడు. ఇతడు మరదలు గంగుబాయిని ప్రేమించాడు. ఆమె ఆసక్తి చూపలేదు. అనుకోని స్థితిలో ఆమెను బలాత్కరించాడు. గంగుబాయి అతని కళ్ళు పొడిచి పీకింది. అంకమరాజు గుడ్డివాడు కావటంతో అధికారం తండ్రి బాబాజీ చేతికి వెళ్ళింది. తండ్రి రకరకాల పన్నులతో ప్రజలను వేధిస్తున్నట్లు తెలిసి అంకమరాజు నిలదీశాడు. తండ్రి మద్దతుతో నాగుబావ, దుర్గాజీలు, అంకమరాజుపై కక్ష గట్టారు. రాజును తప్పుదోవ పట్టించి అంకమ రాజును హతమార్చారు. అతని అసలు భార్య వీరుబాయి సహగమనం చేసింది. బాబాజీ ఒత్తిళ్ళతో నాగుబావ, దుర్గాజీలు ఆత్మహత్యలు చేసుకున్నారు.

## అసిఫాబాదు - నామౌచిత్యం

క్రీ.శ.1741 తర్వాత రాజ్యం నీలకంఠషా నుండి నిజాం రాజు చేతికి పోయింది. హైదరాబాదు రాష్ట్రంలో బీదరు

సంస్థానంలో సుబేదారు అసిఫ్‌ఖాన్ బీనగామ ప్రాంతాన్ని పరిపాలించే వాడు. స్థానిక తహసిల్దారు "జనుగామ" ను ఆయన పేరుతో "ఆసిఫాబాదు"గా 18వ శతాబ్దంలో మార్చారు.

'దేవోగాం' ఒప్పందంతో బ్రిటిషు రాజులు 1905లో వార్ధానది దక్షిణ ప్రాంతాలైన ఉట్నూరు, సిర్పూరు, తాండూరు దుర్గాలను నిజాం రాజుకు అప్పగించారు. అప్పటి ఎల్లందల జిల్లా (కరీంనగర్) లోని చెన్నూరు, లక్సెట్టిపేట తాలూకాలను కలిపి ఐదు తాలుకాలతో ఆదిలాబాదు జిల్లా ఏర్పాటైంది. కానీ జిల్లా కేంద్రం ఆసిఫాబాదు. జిల్లా జైలు, కలెక్టరు కార్యాలయం, కోర్టులు నిర్మించారు. వివిధ కారణాల వల్ల 1941 లో జిల్లా కేంద్రం ఆసిఫాబాదు నుంచి ఆదిలాబాదుకు తరలించారు. కుమ్రం భీం జిల్లా ఏర్పాటుతో పూర్వ వైభవం సంతరించుకుంది. పాత శిథిల భవనాలు గత వైభవాల సాక్షిగా నేడు చూడవచ్చు. జిల్లా జైలు మాత్రం 2008 వరకు ఆసిఫాబాదులోనే కొనసాగింది. ప్రస్తుతం మళ్ళీ జిల్లా జైలు స్థాయి పెరిగింది.

**జోడేఘాట్ పోరాటం**

సహజ వనరులైన నీరు, అడవి, భూమి, గాలిపై సర్వహక్కులు తమకే దక్కాలని పోరాడి, అసువులు బాసిన వీరుడు కుమ్రంభీం. అడవిలో చెట్లు నరికినందుకు గాను సుర్దాపూర్‌లో గోండులను అటవీశాఖ అధికారి సిద్ధిఖి కొడతాడు. అమాయక గోండులను చిత్రహింసలు పెట్టడంతో భీం ఎదురిస్తాడు. భీం చేతిలో దెబ్బలు తిన్న అధికారి ప్రాణాపాయ స్థితిలో ఉంటాడు. చనిపోయాడన్న భయంతో భీం పారి పోతాడు. పదిహేనేళ్ళు అస్సాం ప్రాంతంలో, ఐదేళ్ళు మహారాష్ట్రలో తలదాచుకొని ఎన్నో కొత్త విషయాలు నేర్చుకొని కుమ్రంభీం తిరిగి వస్తాడు. పన్నెండు గ్రామాలపై హక్కులు కావాలని నిజాం సర్కారుతో పోరాడుతాడు. న్యాయవాది రాంచందర్ రావు పైకాజీ సహకారంతో హైదరాబాదుకు వెళతాడు. రాజు మీర్ అలీఖాన్ దర్శన భాగ్యం లభించదు. అంతేగాకుండా అధికారులు కక్ష గట్టడంతో సాయుధ పోరాటమే శరణ్యమని నిర్ణయించుకున్నాడు. జోడేఘాట్‌లో జరిగిన యుద్ధంలో ప్రభుత్వ సైనికుల చేతిలో ప్రాణాలు కోల్పోతాడు. 1940 సంవత్సరం ఆశ్వయుజ పున్నమి నాడు ఆయన చనిపోగా తేదీలతో పనిలేకుండా ప్రతీ యేటా పున్నమి నాడు ఆయన వర్ధంతి నిర్వహిస్తారు. తర్వాత పరిణామాలు ఆఫ్రికాకు చెందిన సామాజిక శాస్త్రవేత్త హేమండార్ఫ్ సర్వేచేసి అక్షరాస్యత ఉపాధి మార్గాలు అత్యవసరమని నివేదిక అందించారు. ఫలంగా మార్లావాయి, గిన్నెధరి కేంద్రాలుగా గిరిజన యువకులకు శిక్షణనిచ్చి ఉపాధ్యాయులుగా నియమించారు. తర్వాత ఐ.టి.డీ.ఎ (సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ) ద్వారా వెయ్యి మందికి ఉపాధ్యాయ నియమకాలు చేశారు.

**సంస్కృతి**

**ఆచారాలు, సంప్రదాయాలు , పండుగలు :** జిల్లా భిన్న భాషా సంస్కృతుల సమ్మేళనం. తూర్పు ప్రాంతమైన సిర్పూరు నుంచి సోమిని వరకు, రెబ్బెన, దెహగాం మండలాల్లో మాత్రమే తెలుగు మాట్లాడే ప్రజలు ఎక్కువగా కనిపిస్తారు. గోండు రాజుల పాలన, మహారాష్ట్రీయులు ఉద్యోగాల్లో ఆధిపత్యం మహ్మదీయులు, ఆంగ్లేయుల ప్రభావం కాగజ్ నగర్, ఆసిఫాబాదు పట్టణాల్లో అధికం. ఒక దశలో తెలుగు నేలపైనే ఉన్నామా? అన్న ఆలోచన రాక మానదు. ఆసిఫాబాదు, తిర్యాణి, జైనూరు, వాంకిడి, గోండ్, ప్రధాన్, కొలాం, తోటి జాతుల గిరిజనులు ఎక్కువగా ఉంటారు. వాంకిడి, కెరిమెరి మండలాల్లో మరాఠీ, లంబాడీలు ప్రభావితం చేస్తారు. ఉత్తర భారతదేశం నుంచి బ్రతుకు దెరువు కోసం వచ్చిన వ్యాపారులు, ముస్లింలు ప్రతీచోటా ఆధిపత్యం వహిస్తున్నారు.

జిల్లా కేంద్రంలో ఏ విద్యా సంస్థలో చూసినా ఆరు రకాల మాతృభాష గల విద్యార్థులు సమపాళ్ళలో కనిపిస్తారు. తెలుగు నేలలో సాధారణంగా తెలుగు, ఉర్దు, మాతృభాషలు మాత్రమే కనిపిస్తాయి. కానీ ఇక్కడ గోండు, మరాఠీ, లంబాడీ, కొలాం, ఉర్దూ, తెలుగు భాషలు కనిపిస్తాయి.

ఏ వ్యాపార సంస్థలో నైనా గుమస్తాలు అన్ని భాషల్లో ప్రావీణ్యం గల్గి వుంటారు. ఎక్కువ కుటుంబాల్లో తల్లికి మరాఠీ, తండ్రికి తెలుగు భాష మాతృభాష కావడంతో పిల్లలు ఇరు భాషల్లో మాట్లాడగలుగుతారు. ముస్లిం, లంబాడీలు ప్రత్యామ్నాయంగా హిందీని, గోండు, కొలాంలు తెలుగును వినియోగిస్తారు.

వంద సంవత్సరాలు సిర్పూర్ పేపర్ మిల్లు నడవడంతో కాగజ్‌నగర్ మినీ భారతదేశంలా కనిపిస్తుంది. దక్షిణ భారత ద్రావిడ భాషలు, ఉత్తర భారత హిందీ ప్రభావిత భాషలు వినియోగంలో వున్నాయి. తెలుగు వాడకం తక్కువ. బంగ్లా, పాకిస్తాన్ యుద్ధ కాలంలో కాందిశీకులుగా వచ్చిన బెంగాలీల కోసం 'ఈసుగాం, రవీంద్రనగర్' వంటి నాలుగైదు గ్రామాలే వున్నాయి. బెంగాలీ, మరాఠీ, హిందీ మాధ్యమ పాఠశాలలున్నాయి. బెంగాలీలు నిరంతరం శ్రమిస్తూ రకరకాల కూరగాయలు, పంటలు పండిస్తారు. కార్మిక, శ్రామిక, వ్యాపారాల్లో కూడా అంకితభావంతో పనిచేస్తారు. మార్వాడీలు, జైనులు కాగజ్‌నగర్, ఆసిఫాబాదులో బుద్ధ మతస్తులు, వాంకిడి, కాగజ్‌నగర్‌లో ఎక్కువ కనిపిస్తారు.

తిర్యాని, సిర్పూరు (యు) లింగాపూర్, జైనూర్, కెరిమెరి, వాంకిడి, ఆసిఫాబాదు మండలాల్లో గోండులు యాభై శాతం కంటే ఎక్కువగా కనిపిస్తారు. ద్రావిడ భాషల్లో ఒకటైన గోండి భాష తెలుగు, తమిళం, మలయాళం భాషలకు దగ్గరగా అవినాభావ సంబంధం కలిగి వుంటుంది. పూర్వకాలంలో లిపి ఉన్నప్పటికీ తాళపత్ర గ్రంథాలకే పరిమితమై మరుగున పడింది. ఆచార్య జయధీర్ తిరుమలరావు, మనోజ బృందం పరిశోధనలు చేసి 'గురిజాల' గ్రామంలో వందేళ్ళ నాటి శాసనాలు, తాళపత్రాలు కనుగొన్నారు. మునిపంతులు రాసిన 'గోండీ భారతం' ప్రాచ్య భాండాగారం సంస్థ ఆధ్వర్యంలో తెలుగులో ముద్రించారు. కుమ్రం హన్మంతరావు గోండి లిపి తయారుచేశారు. పాత లిపికి, దీనికి కొన్ని తేడాలున్నట్లు పరిశోధకుల భావన.

సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తెలుగు లిపిలో గోండీ వాచకాలు ముద్రించి వెయ్యి పాఠశాలల్లో పరిచయం చేశారు. భాషాభివృద్ధి ప్రయత్నాలు పరిశోధనలు సాగుతున్నాయి.

గోండులు దేవతలుగా కుప్పాడి పాహర్ లింగో, జైజంగు బాయి అంటూ భవానీ మాతను, శివుడిని పూజిస్తారు. చెట్లు, దేవతలు కొన్ని వంశాలకు కొన్ని పరిపాతంగా, గోత్రాలు కలిగి వుంటారు. 'రాజ్ గోండులు', 'కోయతూర్' అని పిలువబడే గోండులు మైదాన ప్రాంతాల్లో కోయలుగా పిలువబడుతారు. స్వచ్ఛ తెలుగు మాట్లాడతారు. వీరికి పన్నెండు నెలలకు ప్రత్యేక పేర్లున్నాయి. చైత్, అకాడీ, శ్రవణ్, పూన్ ఇలా గ్రామ దేవతలకు ఆషాఢంలో 'అకాడీ'పండుగ చేస్తారు. శ్రావణాంతంలో పొలాల అమావాస్య తెల్లవారి 'బడుగు' పండుగలు చేస్తారు. దసరా, దీపావళి, గుట్ట పండుగలుంటాయి. దీపావళి నుంచి 'దండారి' లుగా వేషధారణ కట్టి 15వ రోజు దీక్షతో ప్రతి ఊరిలో జరుపుతారు. గుస్సాడీ నృత్యాలు చేస్తారు. జంతువుల తోలు, నెమలి ఈకలతో ఆకర్షణీయమైన వేషాలు వేస్తారు, సార్‌మేడే, రాయి సెంటర్‌లు వీరి పంచాయతీ కేంద్రాలు, గ్రామ, కుల పెద్దలు పటేల్‌గా పిలువబడుతారు. ఒంటరితాన్ని దూరంగా నివసించడానికి ఇష్టపడేవారు. పెద్దలను జూడగానే 'రాంరాం' అని పలకరించుకుంటారు.

గోండుల పురోహితులు, సంస్కృతీ పరిరక్షకులను ప్రధాన్‌లుగా పిలుస్తారు. మాతృభాష మరాఠీ. వాద్యాలతో, గాత్రంతో ఆకట్టుకుంటారు. గోండులకు ఏ పండుగ జరిగినా వీరి సహకారం వుంటుంది. ఇంటిపేర్లు, గోత్రాలు, దేవతలు గోండులకు వీరికి ఒక్కటే వుంటాయి. అధికంగా జాగృతులై సాధారణ జన జీవనంలో కలిసిపోతారు. స్వచ్ఛంగా తెలుగు మాట్లాడతారు. పండుగలన్నీ గోండులతోనే జరుపుకుంటారు.

కొండల ప్రాంతాల్లో కొలాల గిరిజనుల మాతృభాష 'కొలామి'. ఇది కూడా ద్రావిడ భాషల్లో ఒక్కటి. సముద్ర తీరాల నుంచి వచ్చిన జాతిగా పరిశోధకుల నిర్ణయం. పచ్చబొట్టు పొడవడం వృత్తి. కొలామితో పాటు తెలుగు మాట్లాడుతారు. వీరిలో పట్టుదల ఎక్కువ. భీమన్న దేవర జంగుబాయి వీరి దేవుళ్ళు. మైదాన ప్రాంతాల్లో 'మన్నెవార్'గా గుర్తింపు పొందారు. అంకమరాజు గేయంలో వున్నట్లు గోలేటి, ఒంటిమామిడి 'భీమన్న' వీరి ఆరాధ్యులు.

సాధారణ ప్రజలతో మమేకమై ఆధునికత ఎక్కువ గల్గిన 'నాయ పోదులు' ప్రత్యేక గూడేల్లో వుంటారు. స్వచ్ఛమైన తెలుగు మాట్లాడుతారు. 'లక్ష్మి దేవర' వీరి ఇలవేల్పు. వీరి ఇంటిపేరు అందరి వలెనే సాధారణంగా వుంటుంది. సంచార జాతులపై కుమ్రంభీం జిల్లాలో స్థిరపడిన వారు లంబాడీలు. గోర్మాటీలు, బంజారాలుగా పిలువబడే వీరి వేషధారణ ప్రత్యేకంగా వుంటుంది. వాంకిడి మండలం పిప్పర్‌గొంది, ఆసిఫాబాదు మండలం కోసార, కెరిమెరి మండల కేంద్రం, అనార్‌పల్లి ప్రాంతంలో ఎక్కువగా లంబాడీలున్నారు. ఆదిలాబాదు, నార్నూరు, ఉట్నూరుల్లో వున్నారు. 'జై సేవాలాల్' అంటూ శివుడిని, కృష్ణుడిని ప్రేమించేవారు హిందీ దేవత లందరినీ పూజిస్తారు. ఆధునికత వైపు ఎక్కువ మొగ్గ చూపుతారు. తీజ్, హోళీ, కృష్ణాష్టమి వీరి పండుగలు. ఆధ్యాత్మిక గురువు పూలాజీబాబా ప్రవచన ప్రభావంతో చాలామంది గిరిజనులు సన్మార్గంలో సాగుతున్నారు. వాంకిడి మండలంలో బౌద్ధ మతస్థులు ఎక్కువ.

తేలి, బారె, ఆరె వంటి చాలా వ్యవసాయ కుటుంబాలు మరాఠీ మాతృభాష కలవారు. ఇప్పటికీ పిల్లల్ని బడికి పంపటం, బాల్య వివాహాల్ని ఆపటంలో ఆశించిన చైతన్యం వీరిలో కన్పించదు. జ్యోతిబా పూలె వారసులుగా భావిస్తారు. మరాఠీ సంప్రదాయ పండుగలు, మరాఠీ పంచాంగాల కాలగణనతోనే జరుపుకుంటారు. జిల్లాలో వ్యవసాయ కూలీలెక్కువ. ఆసిఫాబాదు, సిర్పూరు, కాగజ్‌నగర్ పట్టణాల్లో మహమ్మదీయులు, క్రైస్తవులు, పదిశాతం వరకు ఉంటారు.

అగ్రకులాలు, పూర్తి స్థాయిలో విద్యా విజ్ఞానాభివృద్ధి కలిగిన వారంతా మరాఠీ ప్రభావంతో ఒక్కో పండుగ రెండు రకాలుగా జరుపుకుంటారు.

## సాహిత్యం

అంకమరాజు చరిత్రను గేయంగా 17 వ శతాబ్దిలో రాసిన పులికుంటకు చెందిన **బలిజ వీరన్న** తెలుగు కవి. 71 పుటల్లో ప్రతి పుటల్లో 27 పాదాల చొప్పున గేయం సాగుతుంది. నాటి సామాజిక, రాజకీయ ఆర్థిక స్థితులన్నీ పొందుపరిచాడు. క్రీ.శ. 1834 నుంచి 105 ఏళ్ళు బ్రతికిన **అంబేద కొండయ్య** యోగి పుంగవుడు. శివ భక్తితత్వ ప్రచారం చేశాడు. సిర్పూరు మండలంలో వెళ్ళిలో పుట్టి ప్రస్తుతం మహారాష్ట్రలోని దాభా ప్రాంతాల్లో దేవతామూర్తిగా పూజలందుతున్నాడు. ఈయన చరిత్ర ఆసిఫాబాదుకు చెందిన **అలుకాతాయి అశోక్ బోనగిరి వార్** రాశారు.

అంబేద కొండయ్య వారసులు కొత్త మండల కేంద్రం పెంచికలపేటలో వుండి రచనలు చేస్తున్నారు. **అంబేద పెద్ద శివలింగయ్య** 'సంగమేశ్వర శతకం' రాయగా, 1972 లో ప్రచురించారు. భక్తిజ్ఞాన బోధనామృతం, శ్రీ సద్గురు పూజా విధానం **మూలమఠం రాజమౌళి** ప్రచురించారు.

**అవధూత అంకులు** ప్రమథ గణస్థవం, చెన్నబసవేశ్వర నిరూపిత శైవం, బసవపురాణం, బసవ శతకాలు రాశారు. మహేశ్వర స్థలం, ప్రసాద స్థలం, ప్రాణలింగ స్థలం, మంగళ హారతులు రచించారు. **కొలిపాక నారాయణ** మల్లికార్జున శతకం, **అవధూత నందికేశం** 'శక్తి ద్వయ నిరాస కంబుయిన శుద్ధ నిర్గుణ తత్వం' రాశారు. **బెజ్జూరి కవులు సుంకరి బాపయ్యాచార్య, ప్రజ్ఞాపురం నర్సయ్య**. బాపయ్య ఇంద్రసేన విజయం, సూర్యసేన విజయం, బ్రహ్మంగారి చరిత్ర 'హరికథలు' రాశారు. నర్సయ్య ఆశు పద్యాలు రాసేవారు.

పులిజూదం ఆటపై ఆయన పద్యాలు బహుళ ప్రచారం పొందాయి. పుట్టు గుడ్డి **ఎర్రోజు రామయ్యాచారి** 'పద్మినీ చరిత్ర' హరికథ రాశారు. దహగాం మండలం 'ఐన' గ్రామస్థుడు **బొజ్జ రామయ్య** బ్రహ్మంగారి చరిత్ర రాశారు. సామల సదాశివ గారి పెద్దతాత **సామల విశ్వనాథం**. కైర్‌గాం నివాసి కాని బెజ్జూర్‌లో కొన్నేళ్ళు నివసించారు. తిరుమల తిరుపతి బాలాజీ పరిణయం యక్షగానం రచించారు. నాటకాలు రాసి యువకులతో ప్రదర్శించేవారట. కానీ ప్రతులు ముద్రణ పొందలేదు. కరీంనగర్ నుంచి వలస వచ్చిన **నర్సింహులయ్య** 'కుచేలోపాఖ్యానం' ద్విపదలో రాశారు. దీనిలో శ్రీకృష్ణుని అమలిన శృంగారం వర్ణన వుంది. **పెండ్యాల కిషన్** రసరమ్యంగా భాగవత ప్రవచనం చెబుతారు. శ్రీ సాయి శతకం రాశారు. వానమామలై జీవిత చరిత్రపై పద్య కావ్యం రాశారు. ముద్రణ కావాల్సి వుంది. **గుట్ట గణపతి శర్మ** శ్రీ కేదారేశ్వర శతకం రచించారు.

నవ్వుగామకు చెందిన **కమ్మరి పోచన్న** కులవృత్తి చేస్తూ ఆశువుగా మంగళహారతులు, భజన కీర్తనలు పాడేవారు. 'నవ్వుగామను 'స్మితపురి' అంటూ సీస పద్యాల్లో రాశారు. ఆయన మంగళారతులు నలభై వరకు ఈ వ్యాస రచయిత దగ్గర భద్రమైనాయి. **ఇందారపు విశ్వనాథ** యితిహాస పురాణాలు పుక్కిట పట్టిన దిట్ట. కళ్ళు సహకరించకపోయినా కొడుకుల సహాయంతో పద్యాలు రాశారు. సామల సదాశివకు గురుతుల్యులు. భగవన్నుతి, మానసా శతకాలు మత్తేభ శార్దూల వృత్తాలతో రాసి 1955 ప్రాంతంలో ప్రచురించారు.

ఆసిఫాబాదుకు చెందిన **గోగుల లింగయ్య** భక్తి, తత్వ పద్యాలు వందలాది రాశారు. 'బిలేశ్వర శతకం' రాశారు. 1978 లో ప్రచురించారు. రెండువందల పద్యాలు అముద్రితాలు. రచయిత దగ్గర సేకరించి ఉన్నాయి. వరంగల్‌కు చెందిన **ఉదయరాజు శేషగిరిరావు** 'కేశవనాథ శతకం' ఆసిఫాబాదులో ఉద్యోగం చేసినపుడు 1960 దశకంలో రాశారు. **చెన్నూరు రవి** 1970 దశ శంభులింగ శతకం రాశారు. 'కీర్త' కలం పేరుతో కాగజ్‌నగర్ నివాసి ఈదులపల్లి శంకర్ రావు 'శ్రీరామచంద్ర శతకం' రాశారు. ఈయన ఒక నవల రాసినా ముద్రణ పొందలేదు. వందలాది భక్తితత్వ భజన కీర్తనలు, మంగళారతులు రాశారు.

1987లో కాగజ్‌నగర్ **'తెలుగు సాహితీ సదస్సు'** పక్షాన కొత్త కలాలు కవితా సంకలనం వచ్చింది. తాళ్ళపల్లి మురళీధర్ గౌడ్ సహకారంతో సామల సదాశివ 'కావ్యసుధ, స్మృతిసుధ' వంటి యాభై పుస్తకాలు ఈ సంస్థ ప్రచురించింది. **కోటగిరి నారాయణ గౌడు** 'ఈసుగామ మల్లన్న శతకం' కందాల్లో రాశారు. **సూరిపెద్ది రాజారామ శాస్త్రి** గంగాపురి లక్ష్మి వేంకటేశ్వర చరిత్ర, జై సంతోషిమాత, వటసావిత్రీ, హరితాళిక, వ్రత కల్పాలు, శ్రీరామరక్షా స్తోత్రం, వ్యాకరణ, జ్యోతిష విజ్ఞాన దీపికలు రాసి ప్రచురించారు.

## కొమురం భీం జిల్లాలో ప్రాచీన కవులు

**పులికుంట (బలిజ) వీరన్న** : ఈ కవి 17వ శతాబ్దానికి చెందినవాడు. జిల్లా కేంద్రమైన ఆసిఫాబాదుకు తూర్పున పులికుంట గ్రామ నివాసి. 16వ శతాబ్దానికి చెందిన గోండురాజు అంకమరాజు కథను గేయంగా రాశారు. ఆసిఫాబాదు పట్టణం నడిబొడ్డున అంకమరాజు సమాధి ఉంది. 70 పుటల్లో 171 పంక్తులతో ఈ గేయం సరళమైన తెలుగు భాషలో ఉంది.

**భూమి భూములెవరివోయి**

**భూమి కురవలెవరివోయి**

**దుర్గమెవరిదోయి"** అంటూ తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే తెలుగు యాస ఉంది. దొర దొడ్డ ఘనుడు, ఏకచక్రం, భూమి, మహలు, అయినంక వంటి పదాలు కనిపిస్తాయి. ఈ గేయంలో చంద్రపూర్ మహంకాళి, ఈసుగాము మల్లన్న, వోలేటి భీమన్న, గంగపురి వెంకటేశుడు, ఆసిఫాబాదు చుట్టుప్రక్కల గల గుళ్ళు దేవతల మొక్కులు

కనిపిస్తాయి. ఈ జిల్లా పాత పేరు జనగామ దగ్గర మోవాడ, ఆవడము వంటి ఊర్ల పేర్లున్నాయి. గోండు రాజుల పరిపాలన, నేటి పెండ్లి ఆచార వ్యవహారాలున్నాయి.

**గోగుల లింగయ్య :** ఆసిఫాబాదులో రెవెన్యూశాఖలో ఉద్యోగం చేసిన ఈ కవి 1980 దశకంలో మృతిచెందారు. ఆసిఫాబాదులో గల చారిత్రాత్మక దేవాలయం బాలేశ్వరునిపై వృత్తాల్లో శతకం రాశారు. అచలతత్త్వం సూత్రంగా 200కు పైగా తత్త్వ, ఆధ్యాత్మిక పద్యాలు రాశారు. బాలేశ్వర శతకం మాత్రం ముద్రితం.

**గద్దెలపల్లి పోచయ్య :** 'ధరను శ్రీ స్మితపురధాముద్రై వెలసిన' అంటూ ఎన్నో సీస పద్యాలు రాసిన ఈ కవి **కమ్మరి పోశెట్టి**గా ప్రసిద్ధి. ఆసిఫాబాదుకు 20 కిలోమీటర్లదూరంలో గల 'నవ్వగామ నివాసి. పురంజయ గోత్రజుడు. జానకీపతి శతకం రాశాడు. హాసపురి అనే మకుటంతో మంగళహారతులు రాశాడు. 1943 ప్రాంతంలో 70 ఏళ్ళవయస్సులో కీర్తిశేషులయ్యారు. సురవరంవారి గోలకొండ కవుల సంచికలో ఈ కవి పేరు ప్రచురితమైంది. ఈరోజుకు కూడా చుట్టుపక్కల 25 కి.మీ. దూరంవరకు పల్లెల్లో భక్తుల నాలుకపై ఈ కవి మంగళహారతులు నాట్యమాడుతాయి.

**ఇందారం విశ్వనాథం :** నవ్వగామకు చెందిన విశ్వనాథం సామల సదాశివకు గురువు. 1908లో జన్మించి, 1984లో కాలంచేసిన ఈ కవి అన్ని జాతుల పద్యాలు రాశారు. మానసా మకుటంతో మానసబోధ శతకం రాశారు. 1955 లో ముద్రించారు. 1970లో భగవన్నుతి వృత్తాలతో కావ్యం రాశారు. విరాటపర్వం ద్విపదను రాశారు. కాని ముద్రించలేకపోయారు. మరో రెండువందల పద్యాలు రాశారు.

**సామల విశ్వనాథం :** రెబ్బన మండలం కైర్గామకు చెందిన ఈ కవి 1993 నవంబర్‌లో పరమపదించారు. శకుంతలా పరిణయం, తిరుమల బాలాజీ పరిణయం, యక్షగానాలు రాశారు. మేడారం సమ్మక్క సారక్కల చరిత్ర పద్యాలు అముద్రితాలు. ఇతడు నాటకాలు కూడా రచించి, వేయించినట్లు కుటుంబీకులు చెప్తారు.

**ఎర్రోజు రామయ్యాచారి (రాములు పంతులు) :** పంచకళా పురి (పెంచికల పేట)కు చెందిన ఈ కవి పుట్టు గుడ్డివాడు. విధి విలాసము, పద్మినీ హరికథ రాశారు. అద్భుత విచిత్ర కథా ప్రక్రియగా తీర్చిదిద్దారు. వేములవాడ భీమకవి చాటువుగా చెప్పిన భూపతి చంపితిన్.... పద్యాన్ని ఆధారంగా కథను నడిపారు. 19వ శతాబ్దానికి చెందిన ఈ కవి పద్యాలు పాటలు, గేయాలు రాగయుక్తంగా పాడారు. **ఏలేశ్వరపు మాధవాచార్య** అనే కవి సేకరించగా కాగజ్‌నగర్‌కు చెందిన తెలుగు సాహితీ సంస్థ ప్రతినిధి తుమ్మూరి రామ్మోహన్‌రావు సహకారంతో ప్రచురించారు. కవి ఈ కథలో ప్రవేశపెట్టిన పద్మినీ పాత్ర పతివ్రతా లోకానికి తలమానికంగా చిత్రీకరించబడింది. కొంతకాలం ఉర్దూభాషా బోధకుడిగా కూడా ఈయన పనిచేశారు. వాస్తు జ్యోతిష విషయాల నిష్ణాతుడు. మంగళహారతులు కూడా రాశాడు.

**అవధూత అంకులు :** ఇతడు కాగజ్‌నగర నివాసి. ప్రథమగణ స్తవము, చిన్న బసవేశ్వర నిరూపిత శైవ సిద్ధాంతాలు, బసవ శతకం, మహేశ్వర స్థలం, ప్రాణలింగ స్థలం రచనలు, మంగళహారతులు రాశారు. అంబేద కొండయ మహారాజు శిష్యుడు. 19వ శతాబ్దం ఉత్తరార్ధంలో ఉండేవాడు.

**సుంకరి బాపయ్యాచారి :** ఈ కవి బెజ్జూరి నివాసి. ఇంద్రసేన విజయము, సూర్యసేన విజయము, బ్రహ్మంగారి చరిత్ర, బుర్రకథలు రాశారు.

**దండనాయకుల రామారావు :** ఆసిఫాబాదు కవి. 1870లో జన్మించి 1947వరకు జీవించారు. 23వ ఏటనే బాలేశ్వర శతకం రాశారు. గంగాపురం బాలాజీ, మహంకాళి పైన మంగళహారతులు రాశారు. ఈయన మనుమడు బుల్లితెర దర్శకుడు నాగబాల సురేశ్ హైదరాబాదులో ఉంటున్నాడు.

**ప్రజ్ఞాపురం నర్సయ్య :** ఈతను సాతాని అయ్యవారు,

ఆశుకవి. పద్యాలు, పాటలు రాసేవారట. పులిజూద మాడుతూ ఆశువుగా చెప్పిన పద్యం ఒక ఉదాహరణ:

**"బద్ధనంగ మద్దింగము ముద్దుగ**
**నాతాదమనకు బుద్ధి స్థిరమౌ**
**విద్యలలో నిది పెద్దది మద్దీరంగమ్ము**
**దాన మహనీయంబే"** ఈయన 1950లో మరణించాడు.

**తుమ్మూరి రామ్మోహన్** మువ్వలు, పెన్‌గంగ, కోయిల కూసింది వంటి రచనలు చేశారు. జిల్లా గేయము, సినిమా పాటలు రాసి ఇటీవల నటన కూడా ఆరంభించారు. **డా. మాడుగుల భాస్కరశర్మ** శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర శతకం, కిరణశ్రీ పద్య కావ్యాలు రాశారు. ఈనాడు అంతర్యామికి వ్యాసాలు రాశారు. తెలుగు సాహితీ సదస్సు అధ్యక్షులు, విశ్రాంత ఉపన్యాసకులు **శ్రీ రామోజు లక్ష్మీరాజయ్య** యాభైకి పై పద్య, గద్య, గేయ, వచన, రచనలు చేశారు. పలు సన్మానాలు పొందారు. **కొండవీటి నీహారిణి** 'భవన', **పెద్దాడ వెంకటేశ్వర రావు** 'క్షితిజ' **నల్లభూమయ్య** 'భూమిగుండ్రం గానే వుంది' కథా సంపుటాలు ప్రచురించారు.

ఆసిఫాబాదుకు చెందిన రచయిత, నటుడు, దర్శకుడు **దండనాయకుల సురేశ్** నాగార్జున నటించిన 'షిరిడీ సాయి' సినిమాకు కథ రాశారు. నాగబాల, ఆత్మయాత్ర, పురాన గాథలు వంటి ఇరవై సీరియళ్ళకు స్క్రిప్టులు రాసి దర్శకత్వం వహించారు. 'నిన్ను నీవు తెలుసుకో' 'నా ఆసిఫాబాదు చరిత్ర' రచించారు. ఇరవైకి పైగా నాటికలు రాశారు.

ఆసిఫాబాదులో ఇరవై ఒకటో శతాబ్దంలో సాహిత్య వాతావరణానికి 'ఆసిఫాబాదు కవుల సంగం' ఏర్పాటు చేశారు. **మాడుగుల నారాయణమూర్తి** శ్రీ కాళేశ్వర చరితం, తెలుగుతల్లి శతకం, గోదావరి పుష్కరాలు, తెలుగులో క్షేత్రాలు – సాహిత్యం, పుష్కర దర్శిని ఆయన ప్రచురించిన రచనలు. గోదావరి తరంగాలు, అమ్మ ఒడిలో అమృత కలశం, మూర్తిమత్వ వికాస శతకం, ముళ్ళతాడు, పద్యాలతో రణం, కవితా కుసుమాలు, వ్యాసలహరి అముద్రితాలు.

'ఆదిలాబాదు జిల్లాలో తెలుగు సాహిత్య ఆవిర్భావ వికాసాలు' అంశంపై కాకతీయ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేస్తున్నారు. వరదాచార్యుల స్మృతి శతజయంతి రాష్ట్ర సంచికలో సామల సదాశివ స్మృతి, తెలంగాణా వైతాళికులు, జననేతలు వంటి ఎన్నో గ్రంథాల్లో పరిశోధక వ్యాసాలు రాశారు. ఆదిలాబాదు జిల్లా ఆధునిక కవులు పై ఓరుగల్లు విశేశ్వర సంస్కృతాంధ్ర కళాశాల నిర్వహించిన గోష్టిలో ప్రసంగించారు. ఇరవై సెమినార్లో వ్యాసాలు సమర్పించారు. దాశరథి రంగాచార్య 'అథర్వణ వేదసంహిత' కోవెల సుప్రసన్న 'వేద సూక్త సౌరభం' రవ్వా శ్రీహరి సప్తతి కోసం 'నదీతీర క్షేత్రాలు సాహిత్యం' వంటి ముప్పై వ్యాసాలు రాశారు. ముదిగొండ వీరభద్రమూర్తి 'కాళేశ్వర ఖండం' పద్య కావ్యంపై పరిశోధన చేశారు. తెలుగులో, తెలంగాణాలో రామాయణాలు అంశంపై వ్యాసాలు రాశారు.

**ఢిల్లీ విజయ్ కుమార్** ప్రాచీన దేవాలయాల చరిత్ర, **నల్లగొండ రమేశ్** 'సిరివెన్నెల' **వనపర్తి తిరుపతి** 'గోడు' పుస్తకాలు రచించారు. **గుర్రాల వెంకటేశ్వర్లు** ఆసిఫాబాదు కవుల సంగం అధ్యక్షులుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**సాహిత్య సంస్థలు**

**తెలుగు సాహితీ సదస్సు :** కాగజ్‌నగర్‌లో 'తెలుగు సాహితీ సదస్సు' సంస్థ 1986 నుంచి సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

**ఆసిఫాబాదు కవుల సంగం :** ఆసిఫాబాదులో తెలంగాణ ఉద్యమ కాలంలో 'ఆసిఫాబాదు కవుల సంగం' మాడుగుల నారాయణమూర్తి అధ్యక్షులుగా పురుడు పోసుకుంది. ప్రతి నెల మొదటి బుధవారం 'నెల పొడుపు' కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. సిరివెన్నెల, గోడు, పుస్తకావిష్కరణలు చేశారు.

**గోండ్వానా సాహిత్య పరిషత్తు :** 1999 నుండి సిడాం అర్జు 'గోండ్వానా సాహిత్య పరిషత్తు' ద్వారా గోండుల చరిత్ర పుట్టు పూర్వోత్తరాలు, న్యాయ సూత్రాలు, భాషా చరిత్ర, చిన్న నిఘంటువు పుస్తకాలు తెలుగులో ప్రచురించారు.

**తెలుగు భాషా పరిరక్షణ సమితి :** 'తెలుగు భాషా పరిరక్షణ సమితి' ఆసిఫాబాదులో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నది.

**నవజ్యోతి సాంస్కృతిక సంస్థ :** ధర్మపురి వెంకటేశ్వర్లు రామారావు ఆధ్వర్యంలో 'నవజ్యోతి సాంస్కృతిక సంస్థ' కార్యక్రమాలు నిర్వహిస్తున్నది.

**వివిధ రంగాల ప్రముఖులు**

**కుమ్రంభీం :** గిరిజనుల స్వేచ్ఛ కోసం పోరాటం చేసి అసువులు బాసిన అమరజీవి. ఆయన పేరిటే జిల్లాకు గుర్తింపు వచ్చింది.

**కొట్నాక భీంరావు :** గోండులలో మొదటి పట్టభద్రుడు. ఆసిఫాబాదు, ఖానాపూర్‌ల నుంచి శాసనసభ్యులుగా, రాష్ట్రమంత్రిగా పనిచేశారు. ఆయన వారసులు కోవలక్ష్మి ప్రస్తుత శాసన సభ్యురాలు, మర్సుకోల సరస్వతి ప్రస్తుత సర్పంచు.

**రాంచందర్ రావు పైకాజీ :** 1889 మార్చి 12 న జన్మించారు. ప్రముఖ న్యాయవాది. ఆదిలాబాదు జిల్లా పరిషత్ చైర్మెన్‌గా పనిచేశారు. కుమ్రం భీంకు న్యాయపరమైన సలహాలు అందించారు.

**ముక్తేశ్వర సిద్ధాంతి :** తెలుగు నేలలో గొప్ప పంచాంగ కర్త. ఆసిఫాబాదులో మూడు దశాబ్దాలు తెలుగు పండితులుగా, మానసిక సలహాదారులుగా సేవలందించారు. ఆయన మరణానంతరం కూడా పంచాంగాలు ఆయన రాసినవే వస్తున్నాయి.

**కొండా లక్ష్మణ్ బాపూజీ :** 1915 సెప్టెంబర్‌లో వాంకిడిలో జన్మించారు. ఆసిఫాబాదు ద్విసభ్య శాసన సభా స్థానంలో 1952 లో తొలి ఎమ్మెల్యే. తెలంగాణా రాష్ట్ర సమితికి మద్దతునిచ్చి 'జలదృశ్యం' తన నివాసం వితరణ చేశారు. '1969 తెలంగాణ ముచ్చట్లు' తెలుగులో, ఆంగ్లంలో ప్రచురించారు. 90 ఏళ్ళ వయసులో 2009లో ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేసి తెలంగాణా ఉద్యమాన్ని ప్రోత్సహించారు. డిప్యూటీ స్పీకర్‌గా, మంత్రిగా పనిచేశారు.


**చారిత్రక ప్రదేశాలు, దేవాలయాలు**

జోడెన్ ఘాట్‌లో కొమురం భీం మ్యూజియం, మార్లవాయిలో హేమండార్ఫ్ దంపతులు సమాధి, సమతుల గుండం, మిట్టె జలపాతాలు చూడదగిన ప్రదేశాలు.

వాంకిడీలో త్రికూటాలయం, బెజ్జూర్ రంగనాయకుల స్వామి, సిర్పూరు గంగాపురం లక్ష్మీ వేంకటేశ్వరాలయం, కాగజ్‌నగర్‌లో త్రిశూల్ పహాడ్‌పైన శనీశ్వర, సత్యనారాయణ స్వామి, ఆసిఫాబాదులో నీహారిణీ నదీ తీరంలో బింబేశ్వరాలయం, గోలేటి, ఒంటి మామిడి భీమన్న గుళ్ళు, చారిత్రాత్మకాలు. ఆసిఫాబాదులో జన కాపూర్ కోదండరామాలయం, కోస్లాపూర్, టొంకిణీ ఆంజనేయ స్వామి, కౌటాల కంకాలమ్మ గుళ్ళు, కాగజ్‌నగర్ ఫాతిమా చర్చి, కొమురం భీం నీటి చెరువు చూడదగినవి.

పచ్చని అడవులతో అలరారుతూ, ఆదివాసీల ఆరాధ్య దైవం కొమురం భీం స్ఫూర్తితో జిల్లా అన్ని రంగాల్లో ముందుండే ప్రయత్నం చేస్తుంది.

# ఖమ్మం జిల్లా చిత్రపటం





నేలకొండపల్లి బుద్ధ స్తూపం



కూసుమంచి శివాలయం





స్థంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం



జమలాపురం దేవస్థానం



పాలేరు చెరువు



ఆదిరాజు వీరభద్రరావు



చిరుకూరి రామరావు



జమలాపురం కేశవరావు

46 (b)

# ఖమ్మం

స్తంభము భక్తిభావనకు సద్గతి నొందిన రామదాస సం
రంభ నివాసధామము విరాజిత దైవత సన్నివాసమున్
కుంభిని గణ్య పుణ్యముల గూర్చెడి లింగము రక్ష సేయగా
కంభపు మెట్టు వెల్గులిడు గౌరవమందుచు నెల్లవేళలన్ !

**పూ**ర్వపు వరంగల్ జిల్లా నుంచి విడివడి 1953లో ఖమ్మం జిల్లా ఏర్పడింది. తెలంగాణా రాష్ట్రం సిద్ధించిన తర్వాత పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఇందులో భాగంగా ఖమ్మం కేంద్రంగా ఖమ్మం జిల్లా, కొత్తగూడెం కేంద్రంగా భద్రాద్రి - కొత్తగూడెం జిల్లా ఏర్పాటు చేశారు.

## ఈ పేరెందుకు?

1905 దాకా వరంగల్ జిల్లాలో ఖమ్మం భాగంగా వుండేది. ఖమ్మం ఊరి మధ్యలో వున్న స్తంభాద్రి నుంచే మండపాలకు, స్తంభాలకు కావల్సిన రాళ్ళు తరలిస్తూ వుండేవారు అందుకే దానికి స్తంభాద్రి అనే ప్రాచీన నామం వుంది. చరిత్రకారుల కథనం ప్రకారం ఖమ్మం అనే పేరు అదే పట్టణమందు గల నృసింహాద్రి అని పిలువబడే నారసింహాలయం నుంచి వచ్చినట్టుగా, కాలక్రమేణ అది 'స్తంభ శిఖరిగాను' ఆపై 'స్తంభాద్రి' గా పిలువబడినట్లు చెప్పబడుతోంది. ఉర్దూ భాషలో కంటే అనగా రాతి స్తంభం కావున ఖమ్మం అనే పేరు ఆ పట్టణము నందు గల రాతి శిఖరము నుండి వచ్చినట్టు మరొక వాదన. నిజాం స్టేటు 1870 రైల్వే మ్యాపు ప్రకారం ఈ పట్టణం ఖమ్మంమెట్టుగా పేర్కొనబడింది. చారిత్రక ఆధారాల ప్రకారం ఖమ్మం నిజనామము కమ్మమెట్టు తర్వాత ఖమ్మం మెట్టుగా పిలువబడి, నేడు ఖమ్మంగా స్థిరపడింది.

## భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి

భౌగోళికంగా ఖమ్మం జిల్లా చివరి జిల్లా. విద్యా రంగంలో, రాజకీయ చైతన్యంలో, పారిశ్రామిక రంగంలో ఈ జిల్లా అభివృద్ధి పథంలో నడుస్తోంది. ఈ జిల్లా విస్తీర్ణం 4,631 చ.కి.మీ. వైశాల్యాన్ని కలిగి వుంది. ఈ జిల్లాకు పడమర నల్గొండ, సూర్యాపేట జిల్లాలు; ఉత్తరాన వరంగల్, భూపాలపల్లి జిల్లాలు; ప్రస్తుత మేర్పడిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా; తూర్పున పశ్చిమ గోదావరి జిల్లా; దక్షిణాన కృష్ణాజిల్లా సరిహద్దులుగా వున్నాయి. దాదాపు తూర్పు, దక్షిణ భాగాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో సరిహద్దు లుగా గల జిల్లా యిది.

### సహజవనరులు

ఈ జిల్లాలో ప్రధానంగా గ్రానైట్ దొరుకుతుంది. ఈ జిల్లాలో దొరికే గ్రానైట్‌ను విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు. తెలంగాణ ప్రాంతంలో అత్యధికంగా గ్రానైట్ పరిశ్రమలు మరియు గ్రానైట్ క్వారీలు వున్నాయి. సత్తుపల్లి మరియు వేంసూరు తదితర ప్రాంతాల్లో బొగ్గు నిల్వలు కూడా పుష్కలంగా వున్నాయి.

**నేలలు :** ఈ జిల్లాలో ఎర్ర నేలలు, నల్లరేగడి నేలలు అధికంగా వున్నాయి. ఇక్కడ ఎర్రనేలలు అధికంగా వుండటం వల్ల గ్రానైట్ రాయి అధికంగా దొరుకుతుంది. నల్లరేగడి

**రెవిన్యూ డివిజన్లు - మండలాలు**

ఈ జిల్లాలో ఖమ్మం, కల్లూరు అనే రెండు రెవిన్యూ డివిజన్లు వున్నాయి. మొత్తం మండలాల సంఖ్య 21.

**ఖమ్మం రెవెన్యూ డివిజన్‌లో 14 మండలాలు:**

1. ఖమ్మం (అర్బన్) 2. ఖమ్మం (రూరల్) 3. తిరుమలాయాపాలెం 4. కూసుమంచి 5. నేలకొండపల్లి 6. బోనకల్లు 7. చింతకాని 8. ముదిగొండ 9. కొణిజర్ల 10. సింగరేణి 11. కామేపల్లి 12. రఘునాథపాలెం (కొత్తది) 13. మధిర 14. ఎర్రుపాలెం

**కల్లూరు డివిజన్‌లోని 7 మండలాలు :**

1. సత్తుపల్లి 2. వేంసూరు 3. పెనుబల్లి 4. కల్లూరు 5. తల్లాడ 6. వైరా 7. ఏన్కూరు

నేలలు కూడా ప్రముఖంగానే వున్నాయి. వాటిలో పత్తి మరియు మిర్చిలాంటి వాణిజ్య పంటలను పండిస్తున్నారు.

వాణిజ్య పంటలే కాకుండా మొక్కజొన్న, చెరుకు లాంటి పంటలను కూడా పండిస్తారు. పాలేరు, వైరా వంటి రిజర్వాయర్లు వుండటం వల్ల రైతులు రెండు పంటలు పండిస్తున్నారు. చెరుకును కూడా ఎక్కువగానే పండిస్తున్నారు.

సత్తుపల్లి ప్రాంతం ఇటీవల పారిశ్రామికంగా అభివృద్ధి చెందినా మంచి మామిడి తోటలకు ప్రసిద్ధి. ఇక్కడ కూడా లంకాసాగర్ చెరువు క్రింద వరి పంట పండుతుంది. ఖమ్మం చుట్టు పక్కల మెట్టభూములలో మిరప, పత్తి పంటలు పండుతున్నాయి.

ఖమ్మం జిల్లా పాడిపంటలకు ప్రసిద్ధి. శ్రీ సీతారామ ఎత్తిపోతల పథకానికి ముఖ్యమంత్రి శ్రీ చంద్రశేఖరరావుగారు ప్రత్యేక శ్రద్ధ వహించి అభివృద్ధి చేస్తున్నారు.

ఈ జిల్లాలో మరొక ఎత్తిపోతల పథకం 'భక్త రామదాసు ఎత్తిపోతల పథకం'. ఇంకా ఇతర అనేక చిన్నా పెద్ద చెరువులు వ్యవసాయానికి తోడ్పడుతున్నాయి. ప్రభుత్వం మిషన్ కాకతీయ కింద చేపట్టిన అనేక చెరువుల పూడిక, అభివృద్ధి జరుగుతున్నది.

ఒకప్పుడు కాకతీయుల కాలంలో జరిగిన గొలుసుకట్టు చెరువులు ఈ జిల్లాలో ఉన్నాయి.

**అడవులు** : జిల్లా వైశాల్యంలో దాదాపు 14.26 శాతం అడవులు వున్నాయి. 621.89 చ.కి.మీ. మేర అడవులు వ్యాపించి వున్నాయి. ముఖ్యంగా ఇల్లెందు, ఏనుకూరు, సత్తుపల్లి, సింగరేణి మండలాలలో పురాతనమైన అడవులు వున్నాయి. ప్రభుత్వం చేపట్టిన హరిత హారం అనే కార్యక్రమం ద్వారా మరిన్ని చెట్లను నాటి అటవీ సంపదను పెంచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**నదులు :** ఈ జిల్లాలో గోదావరి, పాలేరు, కిన్నెరసాని, వైరా, శబరి, సీలేరు మొదలైన నదులున్నాయి. వరంగల్ జిల్లా ఏటూరు నాగారం వైపు నుంచి గోదావరి నది ఖమ్మం జిల్లాలోకి ప్రవేశిస్తున్నది. గోదావరి జిల్లాలో దాదాపు 180 కి.మీ. మేర నది ప్రవహిస్తున్నది.

**చెరువులు - ప్రాజెక్టులు :** ఈ జిల్లాలో అనేక చెరువులు ప్రజల సాగునీటి, తాగునీటి అవసరాలు తీరుస్తున్నాయి. ఒకప్పుడు కాకతీయ సామ్రాజ్యంలో వుండే ఈ ప్రాంతంలో నాటి కాకతీయ పాలకులు అనేక చెరువులు తవ్వించారు. వీటిలో ఖమ్మంలో గల 'లకారం' చెరువు, కాటేపల్లి చెరువు, సింగభూపాలెం చెరువు, వైరా చెరువు, పాలేరు చెరువులు పేర్కొనదగినవి.

ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో రెండు రైల్వే లైన్లు ఉన్నవి. వరంగల్ నుండి విజయవాడవరకు ఒకలైను, డోర్నకల్ నుండి కొత్తగూడెం వరకు రెండవది. సికింద్రాబాదు నుండి విజయవాడ వైపు ఉన్న రైల్వే లైనులో ఖమ్మం స్టేషన్ ఉన్నది. ఇటీవల నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఖమ్మం రైల్వే లైన్‌కు జాతీయస్థాయిలో 'ఎ' కేటగిరీ లభించింది. దాదాపు 120 కి.మీ. విజయవాడ లైనులో కొత్తగూడెం లైను ఉన్నది. ఇవి కాక భద్రాచలం - కొవ్వూరు లైను, కొత్తగూడెం - సత్తుపల్లి రైల్వే లైను సర్వే జరుగనున్నవి.

ఖమ్మం జిల్లా సర్వతోముఖాభివృద్ధికి రవాణా రంగంలో ఈ రైల్వేలైన్లు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. బొగ్గు రవాణాకు రైల్వేల కృషి అపారం.

ఖమ్మం జిల్లాలో ఒక రహదారి కోదాడ నుంచి ఖమ్మం వరకు ఉంది. రెండవ రహదారి సూర్యాపేట నుండి రాజమండ్రి వరకు జాతీయ

**జనాభా :** ఖమ్మం జిల్లా జనాభా 2011 లెక్కల ప్రకారం 14,01,639. ఇందులో పురుషులు 6,99,124 కాగా, మహిళలు 7,02,515 వున్నారు. దీనిలో గ్రామీణ ప్రాంతంలో 77.40% కాగా, పట్టణ ప్రాంతంలో 22.60% జనసాంద్రత - 321/కి.మీ. లింగ నిష్పత్తి 1000:1005

**అక్షరాస్యత :** జిల్లా అక్షరాస్యత శాతం 65.95, జిల్లాలో పురుషుల అక్షరాస్యత 73.69% కాగా, స్త్రీలు 58.31%.

**మున్సిపల్ కార్పొరేషన్ :** ఖమ్మం

**మునిసిపాలిటీ :** సత్తుపల్లి, మధిర

**రెవిన్యూ గ్రామాలు :** 379

**గ్రామపంచాయితీలు :** 427

**పోలీస్ హెడ్‌క్వార్టర్స్ :** ఖమ్మం

**పార్లమెంటు నియోజకవర్గం :** ఖమ్మం

**అసెంబ్లీ నియోజకవర్గాలు :** 5

**పట్టణాలు :** జిల్లాలో ప్రధానమైన పట్టణాలు మూడు. 1. ఖమ్మం, 2.సత్తుపల్లి, 3.మధిర

## జిల్లా చరిత్ర

ఖమ్మం జిల్లాలోని 'నేలకొండపల్లి' ఒకప్పుడు బౌద్ధక్షేత్రం. ఇక్కడ అతి పెద్ద బౌద్ధస్థూపం వుంది. దక్షిణ భాతరదేశంలోనే ఇది పెద్ద బౌద్ధ స్థూపమని చరిత్రకారుల అభిప్రాయం. క్రీస్తుకు పూర్వం ఇక్కడ బౌద్ధమతం అభివృద్ధి చెందినట్లు ఆనవాళ్ళు లభిస్తున్నవి. ఇది బౌద్ధమతానికి కేంద్రంగా వుండేది. ఇక్కడ గల స్థూపం క్రీ.శ.2 వ శతాబ్దంలో నిర్మించినట్లు పురావస్తు శాస్త్రజ్ఞుల కథనం. ఈ స్థూపం ఎదురుగా జరిపిన తవ్వకాలలో బౌద్ధ భిక్షువులు నివసించిన గదులు ఉన్నట్లుగా పురావస్తు శాఖ గుర్తించింది. మొత్తం 14 ఎకరాలలో ఈ స్థూపం విస్తరించి వుంది. 2 ఎకరాలలో బౌద్ధ స్థూప నిర్మాణం జరిగింది. ఇక్కడ శాతవాహన, విష్ణుకుండిన, ఇక్ష్వాకుల కాలం నాటి నాణెములు బయట పడ్డాయి. ఇక్కడ దొరికిన విగ్రహాలు, ఇతర పాత్రలు హైదరాబాదు, గుంటూరు మ్యూజియంలో భద్రపరిచారు. ముదిగొండ, అశ్వరావుపేట ప్రాంతాల్లో కూడా బౌద్ధమతం విలసిల్లింది. క్రీ.శ. 950 లో వెలుగుమట్ల గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి, రంగారెడ్డి, వేమారెడ్డి అనే రైతులు తమ భూముల్లో సేద్యం చేసుకుంటున్నప్పుడు నిధి నిక్షేపాలు దొరికాయి. ఈ విషయాన్ని కాకతీయులు రాజుకు తెలుపడంతో ఆయన ఆదేశానుసారం ఈ ఖిల్లా నిర్మాణాన్ని చేపట్టినట్టు చరిత్ర చెబుతోంది. తొలుత అది మట్టికోట క్రీ.శ. 997 లో గజపతులతో పాటు ఖమ్మం వచ్చిన కొండాపురానికి చెందిన అక్కిరెడ్డి, ఆస్కారెడ్డి ఈ కోట నిర్మాణాన్ని కొనసాగించారు. క్రీస్తుశకం 1006 లో అది పూర్తయింది. 300 ఏళ్ళ పాటు రెడ్డి వంశీయుల పాలనలో వుంది. ఆ తర్వాత వెలమరాజులు చేజిక్కించు కున్నారు. తర్వాత నందవాణి, కాళ్లూరు, గుడ్లూరు వంశాల చేతుల్లోకి వెళ్లింది. సుల్తాన్ కులీ కుతుబ్ ముల్క్ 1531లో అప్పటి ఖమ్మం పాలకుడైన షితాబ్‌ఖాన్ (సీతాపతి రాజు) ను ఓడించి ఖమ్మం కోటను స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి ఈ కోట కుతుబ్‌షాహి పాలనలో వుంది.

17 వ శతాబ్దంలో ఖమ్మం ఆసఫ్జాహీల పాలనలోకి వచ్చింది. కాకతీయుల ఏలుబడిలో వున్న ప్రదేశం కావడం, అప్పటికి శత్రు సైన్యాలు అనేక దఫాలుగా దాడులు చేయడంతో, వాటిని ఎదుర్కొనేందుకు కాకతీయ రాజు తన పరిధిలో దొరికిన నిధి నిక్షేపాలతో జిల్లా నిర్మాణానికి పూనుకున్నాడని కథనం. దీనితోపాటు వరంగల్ నుంచి రాజు ఆదేశాల మేరకు ఖమ్మం వచ్చి ఖిల్లా దుర్గాన్ని, దాని పక్కన చెరువును నిర్మించారు. అందుకే లక్ష్మారెడ్డి పేరుతో 'లకారం

చెరువు' ఏర్పడిందని మరో కథనం. ఖిల్లా నిర్మాణమయ్యాక రెడ్డి రాజులు, వెలమ రాజులు, ఈ కోటను మెరుగు పరిచారు.

కాకతీయులకు రెండో రాజధానిగా ఖమ్మం జిల్లా వుండేది. మొదట కాకతీయుల సామ్రాజ్యంలో అంతర్భాగం గా వున్న ఖమ్మం తదనంతరం స్వతంత్ర మండలి రాజ్యంగా రూపొందింది. కాకతీయుల సామ్రాజ్యం నశించిన తర్వాత తెలుగు నేలను ఏకం చేయాలనే లక్ష్యంతో 74 మంది సామంత రాజులు ఏకమై ఖమ్మం సమీపంలో వున్న ముసునూరి వారి నాయకత్వంలో పదేళ్ల పాటు వీరోచితంగా పోరాటం జరిపారు.

అనంతరం సీతాపతి కాలంలో ఖమ్మం ఖిల్లా తెలంగాణ ముఖ్య కేంద్రమైంది. సీతాపతి బహమనీ సుల్తానుల సహాయంతో వరంగల్‌కు రాజ ప్రతినిధిగా ఎన్నికైనాడు. పెద్దయామాత్యుని సహాయంతో తెలంగాణలో తిరిగి తెలుగు సామ్రాజ్యం విస్తరింపచేశాడు. పరిపాలనా సౌలభ్యం కోసం ఖమ్మాన్ని తన సామ్రాజ్యానికి రెండో రాజధానిగా చేసుకున్నారు. ఈ సమయంలో కులీ కుతుబ్‌షా ఓటమి పాలైనా సీతాపతి ఖమ్మాన్ని కేంద్రంగా చేసుకొని ఈ ప్రాంతానికి తనను తాను రాజుగా ప్రకటించుకున్నాడు. ఇక్కడి ధన రాశులను గోల్కొండకు తరలించారు. ఈ ఖిల్లా ప్రవేశ ద్వారం వద్ద వున్న శిలాఫలకంపై ఆనాటి తెలుగులో ఈ విధంగా రాసి వుంటుంది. 1. హయగరుడ కోటలో గొంగ్గ 2. బయ్యతల గుండు గండగడి 3. కోటమాల గంగని తలగుండు గండ 4. తేరా సామంత బారామండలి కాయ 5. జాయుల మూరురాయ జగద్దళ ముఖి 6. బీరు సస్థాపంగా బీతిరుద్రకాని స్థాపంగా బీతి 7 కాకతీయ రాజ్యస్థాపనాధ్యా నెల్లూరి వీరక్ష క్రీ.శ. 1615 లో శ్రీకృష్ణదేవరాయలు కులీకుతుబ్‌షాని ఓడించి ఖమ్మం దుర్గాన్ని స్వాధీనం చేసు కున్నాడు. ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు తన దిగ్విజయ యాత్రలో భాగంగా దీనిని కూడా ఓడించినట్లు చరిత్ర చెబుతోంది. గజపతుల నుంచి 1615 లో దీనిని వశపర్చుకున్నారు.

గంభము మెట్టు గ్రక్కున గదల్చి.... రాజపుత్రుడే శ్రీకృష్ణదేవరాయ విభుడు అంటూ ముక్కు తిమ్మన తన పారిజాతాపహరణం ప్రబంధంలో వర్ణించాడు. ఆ తర్వాత గోల్కొండ నవాబు ఇబ్రహీం కుతుబ్ ముల్కీ రాజ్యాన్ని ఆక్రమించాడు. 1687 వరకు ఐదుగురు నవాబులు ఖమ్మం గిరిని పాలించినట్టు చెబుతారు. వారిలో ఆఖరివాడు అబ్దుల్ హసన్.

## సంస్కృతి

**కళలు :** ఖమ్మం జిల్లా కళలకు పెట్టినది పేరు. ఈ జిల్లా నుండి ఎంతో మంది సినీరంగంలో, సాహిత్య రంగంలో, సంగీతంలో, నాటక రంగాల్లో విశేష ఖ్యాతిని గడించారు. సినీ రంగంలో ప్రముఖంగా హాస్యనటులుగా బాబుమోహన్, శ్రీనివాస్ రెడ్డి గార్లు చెరగని ముద్ర వేశారు. సంగీతంలో వందేమాతరం శ్రీనివాస్ గారు, ఘంటాడి కృష్ణ గారు ఎన్నో మధురమైన పాటలను స్వరపరిచారు. నాటక రంగంలో దెంచనాల శ్రీనివాస్ గారు ఉన్నతమైన కృషి చేశారు. చలన చిత్ర పరిశ్రమలో దర్శకునిగా పేరుపొందిన దశరథ్ కూడా ఈ జిల్లావారే. చాలామంది సాహితీవేత్తలకు, కళాకారులకు ఈ జిల్లా నిలయంగా ఉంది.

**జాతరలు :**

ఈ జిల్లాలో బోనాల జాతర, స్నానాలక్ష్మీపురం మహాజాతర, మధిర జాతర, అన్నారుగూడెం అంకమ్మ తల్లి జాతర, గార్లఒడ్డు లక్ష్మీ నరసింహస్వామి జాతర.

**సాహిత్య చరిత్ర :**

సాహిత్య చరిత్రలో జిల్లాకు ప్రముఖ స్థానం వుంది. పావనోత్తుంగ తరంగ గోదావరి తీరాన శ్రీ రామచంద్రుడు కొలువై ఉన్న కారణమే కాక ప్రగతిశీల ఉద్యమాలకి, అస్తిత్వ రాజకీయాలకి కవిత్వ ఉద్యమాలకి అది గుమ్మం కూడా. "ఖమ్మం కవిత్వ గుమ్మం" అన్న **దాశరథి** మాటలు లోక విదితం "ఖమ్మం నా చిన్నప్పటి చందమామ !" అని అన్నాడు. అక్షర వాచస్పతి **దాశరథి రంగాచార్య**. ఖమ్మం ఏ ఉపమానా

నికీ అందని, ఏ ఉత్ప్రేక్షలకీ లొంగని, ఏ రూపకంలోనూ ఇమడని, ఏ విరోధాభాస తాకడానికి సహించని ఇక్షుఖండం అని ఒక ఆధునిక కవి అభిప్రాయ పడ్డారు.

**"ఎన్ని రకాలుగా వర్ణించినా ఖమ్మం గురించి నాలుకకు అలసట లేదు. ఎందుకంటే ఖమ్మం నాకు అమ్మ. అమ్మ గురించి మాట్లాడుతుంటే అలుపు ఎందుకు వస్తుంది"** అన్నాడు కవి రాజమూర్తి సర్వదేవభట్ల నరసింహమూర్తి.

ఖమ్మం జిల్లా మధిర తాలూకా నారాయణపురం అనే గ్రామంలో **ఏటుకూరు రంగారావు** జన్మించారు. ప్రసన్న గంభీరమైన భావ మార్దవం, చివురాకు మెత్తనైన శబ్ద పల్లవాల సొగసు, సుమధుర పరిమళ, సుచరితమైన విషయజ్ఞత గల ఈతని శైలి రసహృదయములను అమితంగా ఆకర్షించింది. ప్రజాకవి కర్షక కవిగా పేరుపొందిన రావెళ్ళ వెంకటరామా రావు గారు ఖమ్మం జిల్లా సకినాపల్లి గ్రామంలో జన్మించారు. నైజాం వ్యతిరేక సాయుధ రైతాంగ పోరాటంలో భాగస్వామ్యు లయ్యారు. వీరు రాగజ్యోతులు, జీవనరాగం, అనలతల్పం, చైతన్య స్రవంతి, పల్లెభారతి మొదలైన పద్యకావ్యాలు రాశారు.

**దాశరథి కృష్ణమాచార్యులు** కూడా ఖమ్మం జిల్లావాసే. దాశరథి వారి బాల్యం, విద్యాభ్యాసం మొత్తం ఖమ్మంలోని ఉస్మానియా హైస్కూల్‌లో సాగింది. దాశరథి కవిత్వంలో అభ్యుదయ, కాల్పనిక, జాతీయ కవితా లక్షణాలు కనిపిస్తాయి.

**"ఓ నిజాము పిశాచమా కానరాదు**
**నిను బోలిన రాజు మాకెన్నడేని**
**తీగలను దెంపి అగ్నిలో దింపినావు**
**నా తెలంగాణ కోటిరతనాల వీణ"**

**దాశరథి రంగాచార్యులు** కూడా ఖమ్మం జిల్లా సాహితీ చరిత్రలో ముందు వరుసలో వుండే వ్యక్తుల్లో ఒకరు. చిల్లర దేవుళ్ళు, మాయజలతారు, జనపదం, పావని, మోదుగు పూలు, నల్లవాగు, మహాత్ముడు మళ్లీ పుడితే లాంటి కథలు రాశారు. వీరు సంస్కృతంలో వున్న వేదాలను అందరికీ అందుబాటులోకి తెచ్చాడు.

**హీరాలాల్** బహుభాషావేత్త. భావకుడు కూడాను. ఖమ్మం జిల్లా కాంగ్రెసు కమిటీకి అధ్యక్షులుగా, ఎమ్మెల్సీగా పనిచేసిన వీరికి దేశభక్తి, దైవభక్తి, ధార్మికగుణ సంపన్నత బాల్యం నుంచే అలవడినాయి. వీరు అమృతపథం, మహాపథం, మిన్నేటి పొంగులు, ఇది కథనం కాదండి, భాగ్యమతి మొదలైన కావ్యాలు రచించారు. గుడిమెట్లు, తెగని గొలుసులు మొదలైన నవలలు రాశారు.

చిలీ కవులలో పాబ్లోనెరుడా ఎంతటివాడో తెలంగాణ కవులలో **సర్వదేవభట్ల నరసింహమూర్తి గారు** అలాంటి వాడని పేరుపొందారు. వీరు మామిళ్ళగూడెంలో జన్మించారు. ఈ జిల్లాలో సుదీర్ఘమైన సాహితీసేవ చేసినవాడు. కవిరాజమూర్తి. రజాకార్ రోజుల్లో కలం పదును చూపెట్టిన ధీశాలి కవిరాజమూర్తి. ఉన్నత కుటుంబంలో పుట్టిన మూర్తిగారు రైతు బిడ్డల కోసం కలం పట్టిన యోధుడు. తెలంగాణలోని దీర్ఘ కవితలయిన మహైక, ప్రణతి అనే దీర్ఘ కవిత ప్రచురించి తరువాత కవులకు మార్గదర్శకులైనారు. గాంధీ చరిత్రను జముకుల కథారూపంలో రాశారు. 'మానవ సంగీతం' అనే ఖండకావ్యం. నవయుగ శ్రీ అనే గేయ సంపుటి, మై గరీబ్ హూ వంటి అనేక రచనలు చేశారు. ఒక సందర్భంలో. 'నన్ను మీరేమీ చేయలేరు. నేను మరణించిన తర్వాత నలుగురి భుజాల మీద స్వారీ చేస్తాను' అని వీరు చెప్పిన పంక్తులను జిల్లా ప్రజలు ఇప్పటికీ గుర్తుచేసుకుంటారు.

**ఉత్పల సత్యనారాయణాచార్య గారు** ఖమ్మం జిల్లా మధిర తాలూకా చింతకాని గ్రామంలో జన్మించారు. వీరు సాహితీవేత్త మాత్రమే కాదు, స్వాతంత్ర్య సమరయోధులు కూడా.

**మాదిరాజు రంగారావు గారు** ఖమ్మం జిల్లా ఇల్లందు తాలూకా పండితాపురం గ్రామంలో జన్మించారు. 1993లో 'రసధునీ సాహితీ పరిషత్తు' ను ఏర్పాటుచేసి, అలుపెరగని సాహితీ సేవ చేశారు.

**పుల్లాభొట్ల వేంకటేశ్వర్లు గారు** ఖమ్మం జిల్లాలో విమర్శకులలో ప్రముఖులుగా చెప్పుకోదగ్గవారు. వీరు తెలుగులో వంద మహాకావ్యాలు, ప్రసిద్ధిచెందిన ప్రబంధ

కావ్యాలను, ప్రబంధ సుధా మాధురీ' పేరిట వ్యాఖ్యానాలు చేశారు. 'తెలుగు సాహిత్య నవలా వికాసం' పేరుతో 1000 నవలలకు సంబంధించిన సమగ్రమైన విమర్శనా గ్రంథం రాశారు.

'చేరా' కలం పేరుతో అందరికీ సుపరిచితులైన **చేకూరి రామారావు గారు** ఖమ్మం జిల్లా ఇల్లందులో ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. తెలుగు రాష్ట్రాల్లోనే గాక, అంతర్జాతీయ స్థాయిలో పేరెన్నిక గన్న భాషాశాస్త్ర వ్యాసాలను అనేక సాహితీ పత్రికలలో, దేశ విదేశాలలో రాసిన ఉద్దండ సాహితీ విమర్శకులు. భాషాశాస్త్రంపై ఆయన రాసినన్ని గ్రంథాలు మరియే విమర్శకుడూ యింతవరకు రాయలేదనడం అతిశయోక్తి కాదు. ఆంధ్రజ్యోతి పత్రికలో సాహితీ పేజీలో 'చేరాతలు' అనే శీర్షికను నిర్వహించేవారు. 2002 లో వీరు రాసిన 'స్మృతి కిణాంకం' పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.

అభినవ మొల్లగా ప్రసిద్ధిచెందిన **చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మ,** ఖమ్మం జిల్లా కోడలు ఇల్లిందుల సరస్వతీ దేవి, కొలిపాక మధుసూదన రావు, షంసుద్దీన్ (కౌముది), దిలావర్, కావూరి పాపయ్య శాస్త్రి (కవితా గౌతమి బిరుదు), అఫ్సర్, ప్రసేన్, సీతారాం, యాకూబ్, వంశీకృష్ణ, తాటికొండల నరసింహారావు, షాజహానా, హనీఫ్, ఇక్బాల్‌చంద్, విద్యాసాగర్, సి.హెచ్. ఆంజనేయులు, కె. ఆనందాచారి, జీవన్, బొబ్బిలి జోసెఫ్, సికిందర్, మొహసిన్, జ్వలిత, దెంచనాల విజయ కుమార్ లాంటి ఎంతో మంది ఆధునిక కవులు, రచయితలు తమ రచనలు, కవితలను వినిపిస్తున్నారు.

**సాహితీ సంస్థలు :** ఖమ్మం జిల్లా సాహిత్యాభివృద్ధి కోసం ఎన్నో సాహితీ సంస్థలు వెలిశాయి. జిల్లా సాహిత్యానికి మరియు తెలంగాణ సాహిత్యాభివృద్ధికి ఈ సంస్థలు విశేషమైన కృషి చేస్తున్నాయి.

**ఖమ్మం జిల్లా రచయితల సంఘం :** ఖమ్మం జిల్లాలో సాహితీ ప్రపంచానికి తెలియని ఎంతోమంది కవులను ఈ సంస్థ వెలుగులోకి తెచ్చి వారి పుస్తకాలను ముద్రిస్తుంది. మంచి కవితలు, నాటకాలు, కథలు, నవలలు వ్రాసినవారికి ఎన్నో ప్రోత్సాహకరమైన బిరుదులను, సత్కారాలను అందిస్తున్నది. మాదిరాజు రంగారావుగారు **రసధుని సాహితీ పరిషత్తును** స్థాపించి విజయవంతంగా నడిపిస్తున్నారు.

**ఖమ్మం జిల్లా సాహితీ స్రవంతి** అనే సాహిత్య సంస్థ, **ఖమ్మం జిల్లా అభ్యుదయ రచయితల సంఘం** లాంటి సంస్థలే కాకుండా కవి యాకూబ్ గారు ప్రతి సంవత్సరం వారి స్వస్థలం కారేపల్లి మండలం రొట్టమాకురేవులో అనేకమైన పుస్తకాలను సేకరించి సాహిత్యానికి విశేషమైన సేవ చేస్తున్నారు.

## వివిధ రంగాల ప్రముఖులు

ఖమ్మం జిల్లా నుంచి అనేక మంది రాజకీయ, సాహిత్య, చారిత్రక, సాంస్కృతిక, కళాత్మక రంగ ప్రముఖులు ఉద్భవించి ఇక్కడ సృజనాత్మకతను వెలికి తీశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పనిచేసిన జలగం వెంగళరావు గారిది ఈ జిల్లానే. వారి స్వస్థలం సత్తుపల్లి. వీరితో పాటు బాబు మోహన్ (హాస్య నటుడు), నన్నపనేని మోహన్ (తానా అధ్యక్షుడు), యాకూబ్ (కవి), వందేమాతరం శ్రీనివాస్ (సంగీత దర్శకులు), దశరథ్ (చలనచిత్ర దర్శకులు), శ్రీనివాస్ రెడ్డి (హాస్య నటుడు), నామా నాగేశ్వరరావు (మాజీ ఎంపీ), ఘంటాడి కృష్ణ (సంగీత దర్శకులు), తుమ్మల నాగేశ్వరరావు (మంత్రి), మల్లు భట్టివిక్రమార్క (ఎమ్మెల్యే), చేకూరి రామారావు (విమర్శకులు), ఆదిరాజు వీరభద్రరావు (భాషావేత్త), సర్దార్ జమలాపురం కేశవరావు (స్వాతంత్రోద్యమ నాయకుడు), పుల్లాభొట్ల వేంకటేశ్వర్లు (ప్రముఖ వ్యాఖ్యాత) మున్నగు ప్రముఖులున్నారు.

## దర్శనీయ ప్రదేశాలు - పర్యాటకరంగం

**పర్యాటక ప్రదేశాలు :** ఖమ్మం నగరం నడిబొడ్డులో గల 'కోట' అతి ప్రాచీనమైంది. ఇది ఖమ్మం పట్టణానికే తలమానికంగా ఉంటుంది. ఎటువైపు నుండి చూసినా నగర నడిబొడ్డున దీటుగా నిలుస్తుంది. ఈ ఖిల్లా నిర్మాణం చూస్తే హిందూ, ముస్లిం సంప్రదాయాలకు అద్దం పడుతున్నట్లు, వారి మధ్య స్నేహభావాన్ని తెలిపేలా ఉంటుంది. ఈ

ప్రాంతాన్ని క్రీ.శ. 591 సంవత్సరంలో మహాదేవ వర్మ అనే వ్యక్తి అధికారిగా ఉండి పాలించినట్లు తెలుస్తుంది. కోట చుట్టూ బురుజులు, విశాలమైన గోడలు ఉన్నాయి. కాకతీయ ప్రభువుల కాలంలో ఈ ప్రాంతమంతా మూడు పువ్వులు, ఆరు కాయలుగా విలసిల్లింది. దీనిని కాకతీయులు నిర్మించారు. కాకతీయుల సామంత రాజైన సీతాపతి రాజు ఉరఫ్ షితాబుఖాను దీనిని నిర్మించాడని చారిత్రక ఆధారా లున్నవి. ఈ కోట నిర్మాణం 950 ఏ.డి. లో జరిగింది. దీని వైశాల్యం 867 మైళ్ళు. 1512 సంవత్సరంలో గొల్కొండ సుల్తానులు దీనిని ఆక్రమించుకొన్నారు. ఆ తరువాత ఆసఫ్జాహీల వంశం వారు దీనిని పాలించారు. ఖమ్మం దుర్గానికి జఫర్‌బేగ్ అనే అతను అధికారిగా నియమించ బడినాడు.

బౌద్ధమతం పరిఢవిల్లిన నేలగా నేలకొండపల్లిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. బౌద్ధ స్థూపానికి 'బుద్ధిజం కారిడార్' లో చోటు దక్కనుంది. అంతర్జాతీయ బుద్ధిజం వారోత్సవాలలో భాగంగా నేలకొండపల్లి బౌద్ధ స్థూపాన్ని విదేశీ ప్రతినిధులు సైతం సందర్శించారు.

**రామదాసు స్మారక మందిరం**

ఒకప్పుడు రామదాసు గారు నివాసమున్న చతుశ్శాల భవంతి నేడు 'రామదాసు స్మారక మందిరంగా' విరాజిల్లు తోంది. ఈ స్మారక మందిరంలో ప్రతిరోజు సీతారామ లక్ష్మణుల విగ్రహాలకు ధూప, దీప, నైవేద్యాలు నిర్వహిస్తు న్నారు. భక్త రామదాసు జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ స్మారక మందిరం నాలుగు ఎకరాల విస్తీర్ణంలో వుంది.

**రామదాసు గారి బావి**

ఆనాడు రామదాసు గారు ఉపయోగించిన బావి కూడా దర్శనీయ ప్రదేశం. ఇక్కడకు దగ్గరలోనే 'భక్త రామదాసు ఎత్తిపోతల' పథకం ఉండడం విశేషం.

వీటితో పాటు లకారం చెరువు, లకారం జలాశయం, లంకాసాగర్ జలాశయం, వైరా జలాశయం, కూసుమంచి జలాశయం, నీలాద్రీశ్వరాలయం మొదలైనవి చూడదగ్గ ప్రదేశాలు.

**ముఖ్య దేవాలయాలు**

**కూసుమంచి శివాలయము :** సూర్యాపేట జిల్లా నుంచి ఖమ్మం జిల్లాలో ప్రవేశిస్తూనే కూసుమంచి గ్రామంలో ఈ ఆలయం వుంటుంది. కాకతీయ చక్రవర్తి గణపతి దేవుడు నిర్మించిన శివాలయం యిది. దేవాలయం ఒక శివలింగంగా ఉండటం విశేషం. విశాలమైన ఈ శివాలయంలో పెద్ద శివలింగం ఉన్నది. ఇది కాకతీయ శిల్పకళతో కూడినది.

**జీళ్ళ చెర్వు వేంకటేశ్వరాలయం :** తరువాత 'జీళ్ళచెర్వు' గ్రామంలోని వేంకటేశ్వర దేవాలయం ప్రసిద్ధి కెక్కింది. ఇక్కడి కొండపైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారు మహిమలు గల వారి స్థానికుల విశ్వాసం. 100 సంవత్సరాలుగా ఈ ఈ దేవాలయం ఎంతో ప్రసిద్ధి గాంచింది.

**స్తంభాద్రి నరసింహ స్వామి :** స్తంభాద్రి పేరు మీదనే 'ఖమ్మం మెట్టు' పేరు వచ్చిందని తరువాత ఖమ్మంగా స్థిరపడిందని చెబుతారు. స్తంభం యొక్క వికృతి కంభం అద్రి అనగా మెట్టు. ఈ రెండూ కలిసి కంభంమెట్టుగా రూపాంతరం చెందింది. ఇక్కడి ఖమ్మం నగరం నడిబొడ్డున ఉన్న గుట్ట మీద శ్రీ నరసింహ స్వామి వారి ఆలయం వుంది. ఈ నరసింహ స్వామి స్వయం వ్యక్తం. ఒక గుహలో శ్రీ నరసింహ స్వామి వారు వెలిశారు. శ్రీ స్వామి వారి ఉత్సవమూర్తులు ఖమ్మం నగరంలోని బ్రాహ్మణ బజారులో గల నరసింహ స్వామి దేవాలయంలో వున్నవి. ఇంకా ఖమ్మం నగరంలో గల శ్రీ జలాంజనేయ స్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి (కమాన్ బజార్), శ్రీ అభయ వేంకటేశ్వర స్వామి, శ్రీ గుంట మల్లన్న శివాలయం, కోదండ రామాలయం చూడదగినది. ఖమ్మం సమీపంలో గల 'తీర్థాల' గ్రామంలో నెలకొన్న శివాలయం కూడా చూడదగింది.

**అయ్యప్ప స్వామి ఆలయం :** ఖమ్మం నుంచి వైరా వెళ్ళే మార్గంలో వైరా సమీపంలోనిది. ఇక్కడ దేవాలయం ప్రాంగణంలోని 40 అడుగుల ఎత్తైన ఆంజనేయ స్వామి వారి విగ్రహం ఆశ్చర్యం గొలుపుతుంది.

**పులిగొండ లక్ష్మీనరసింహ ఆలయం :** వైరా గ్రామం నుంచి మధిర వెళ్ళే మార్గంలో గల గొల్లపూడి గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం చాలా పురాతనమైంది. ఈ స్వామి స్వయంభువు. ఒకప్పుడీ గుట్టపై 'పులి' వుండేదట. అందుచేత ఈ గుట్టకు పులి గుట్ట అని పేరు వచ్చింది. 1989 లో ఈ స్వామిపై డా.కావూరి పాపయ్య శాస్త్రి గారు మధ్యాక్కరలలో ఒక శతకం రచించారు. 2014 లో ఈ దేవాలయం పునరుద్ధరణ గావించబడింది.

**జమలాపుర శ్రీ వేంకటేశ్వరాలయం :** ఇది మధిర పట్టణానికి సమీపంలో వుంది. శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన క్షేత్రం ఇది. ఇక్కడ ఉప్పల వారు (బ్రాహ్మణులు) అనువంశిక ధర్మకర్తలు. ఇంకా గార్ల ఒడ్డు గ్రామంలో నెలకొన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవాలయం, నాచారం అడవులలో గల శ్రీ వేంకటేశ్వర దేవాలయం పేర్కొనదగింది. ఖమ్మం జిల్లా ఆధ్యాత్మిక వికాసానికి అనేక చిన్న పెద్ద దేవాలయాలు ఆలంబనగా నిలుస్తున్నవి.

**సాయిబాబా గుడి :** ఖమ్మం పట్టణంలో మామిళ్ళ గూడెంలో చిన్న సాయిబాబా గుడి ఉంది. ప్రతిరోజు భక్తులు వందల సంఖ్యలో వచ్చి బాబాను దర్శించుకుంటారు. ఉత్సవాలు, పండుగల సమయాల్లో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహిస్తారు.

**సంగమేశ్వరాలయం (తీర్థాల) :** ఖమ్మం రూరల్ మండలం తీర్థాల గ్రామంలో సంగమేశ్వర స్వామి ఆలయం తెలంగాణకే తలమానికం వంటివి. తెలంగాణ జిల్లాల్లో శివరాత్రి సందర్భంగా జరిగే జాతరలలో ఇక్కడ జరిగే జాతర చాలా ప్రసిద్ధి గాంచింది. శ్రీ శ్యామలాంబ, భ్రమరాంబా సహిత సంగమేశ్వరస్వామి, వేంకటేశ్వర స్వాములతో కూడిన ఈ ఆలయానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. ఆకేరు, మున్నేరు, బుగ్గలేరు మూడు నదలుసంగమంలో వెలసిన విశిష్టత కలిగిన ఈ ఆలయం వల్లనే ఇక్కడి గ్రామానికి తీర్థాల గ్రామమనే పేరు స్థిరపడింది.

**భ్రమరాంబా సమేత రామలింగేశ్వరాలయం :** ఇది ఖమ్మం పట్టణంలో ప్రాచీనమైన కోటకు సమీపంలో ఉంది. ఇది ప్రాచీనమైన ఆలయం. ఈ ఆలయం క్రీ.శ. 12 లేక 13 శతాబ్దంలో నిర్మింపబడినట్లు తెలుస్తుంది. ఇది చిన్న ఆలయం. ఈ ఆలయంలో గర్భగృహంలో రామలింగేశ్వర స్వామి, ఆయనకు కుడివైపు భ్రమరాంబాదేవి, ముందర నంది, నందీశ్వరునికి సమీపంలో నవగ్రహాలు, ముఖద్వారానికి దగ్గర ఆంజనేయుడు ప్రతిష్ఠించబడి భక్తుల పూజలందుకుంటున్నవి.

తెలంగాణా జిల్లాలన్నిటిలో వ్యవసాయానికి ఈ జిల్లా అధిక ప్రాధాన్యమిచ్చింది. చక్కరమిల్లులు అధికంగా ఉండి, బొగ్గు గనులు, గ్రానైట్ పరిశ్రమలు వంటి సహజ వనరులతో దైవబలం తోడుగా అనేక దేవాలయలు గల ఈ జిల్లా ప్రగతిపథంలో దూసుకుపోతుంది.

# జగిత్యాల

ధర్మపురీశుడే వెలుగు ధార్మిక వాసము, కొండగట్టుతో
శర్మదమైన నేల, సువిశాల చరిత్రకు నాలవాలమై
కర్మసుశీలురౌ జనుల కాంతినివాసము వస్త్రశాలలన్
నిర్మితి జేసినట్టి యవనీవరరాజము సస్య సంపదన్

## ఈ పేరెందుకు?

జిల్లా కేంద్రమైన జగిత్యాల ఒకప్పుడు కరీంనగర్ జిల్లాలో ఒక ప్రధాన రెవెన్యూ డివిజన్. దీంట్లో భాగమైన పొలాస నగరాన్ని పాలించిన జగద్దేవుడనే ప్రభువు (క్రీ.శ. 1110-1116) పేరిట జగత్ + ఆల = జగిత్యాలగా పేరు వచ్చి ఉంటుంది. ఆల అంటే ఊరు లేదా నగరం అని అర్థం. ఈతడు తన విజయాల సూచకంగా పొలాసకు 8 కి.మీ. దూరంలో జగద్దేవాలయం నిర్మించాడని, ఆ ఆలయ పరిసరాలే నేటి జగిత్యాల అని మరో కథనం.

## భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి

జగిత్యాల జిల్లా 18.80 ఉత్తర అక్షాంశం, మరియు 78.93 తూర్పు రేఖాంశాల మధ్య వ్యాపించి ఉంది. ఈ జిల్లా 2,419 చ.కి.మీ. వైశాల్యం కలిగి ఉంది. జగిత్యాల జిల్లాకు ఉత్తరాన నిర్మల్, ఈశాన్యాన మంచిర్యాల, తూర్పున పెద్దపల్లి, ఆగ్నేయాన కరీంనగర్, దక్షిణాన రాజన్న సిరిసిల్ల, పడమర నిజామాబాద్ జిల్లాలున్నాయి. ఇది ఉత్తర తెలంగాణలో మధ్యస్థంగా ఉంటుంది.

## సహజ వనరులు

**నేలలు :** జిల్లాలో 45% దుబ్బనేలలు, 27% రేగడి నేలలు, 15% చెలక నేలలు ఉన్నాయి. జిల్లాలో ఎర్రమట్టి నేలలు 40%, నల్లరేగడి నేలలు 54% ఉన్నాయి.

**అడవులు :** జగిత్యాల జిల్లాలో 554.91 చ.కి.మీ మేర అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇది జిల్లా భూభాగంలో 22.94% ఉంది. అతి ప్రాచీనమైన దండకారణ్యంలో ఈ జిల్లా ఉంది. మల్లాపూర్, ధర్మపురి మండలాల్లో ఉండే ఈ అడవులు ఇపుడు పూర్తిగా తగ్గిపోయాయి. సారంగపూర్, బీర్‌పూర్ ప్రాంతాల్లో ఇంకా కొద్దిగా దట్టమైన అడువులు ఉన్నాయి. రాయికల్, ధర్మపురి మండలాల్లో గిరిజన గ్రామాలున్నాయి.

**నదులు :** జగిత్యాల జిల్లా తూర్పు సరిహద్దుగా సువిస్తారంగా గోదావరి నది పారుతుంది. దీని ప్రవాహం నిడివి 45 కి.మీ. ఇది జగిత్యాల నుండి నిర్మల్, మంచిర్యాల జిల్లాలను వేరు చేస్తుంది. పెద్దవాగు పేరుతో రెండు పెద్ద ఉపోపనదులు గోదావరిలో కోరుట్ల, ధర్మపురి మండలాల్లో పారుతూ వచ్చి గోదావరిలో కలుస్తున్నాయి. నదిపై రాయికల్, రాయపట్నంల వద్ద రెండు వంతెనలు (ఒక కిలోమీటర్ నిడివితో) పక్క జిల్లాలను అనుసంధానం చేస్తున్నాయి.

గోదావరి నది ఇక్కడ రెండు అద్భుతాలు సృష్టించింది. ఇవి రెండు ప్రపంచంలోని వింతలే. ఒకటి నది (సాగర సంగమం లేకున్నా) ఏడు పాయలుగా చీలింది. దీన్నే సప్త గోదావరి అంటారు. 2 వేల సంవత్సరాలుగా ప్రసిద్ధం. మరొకటి నది రెండుగా చీలి మధ్యలో 24 కి.మీ. నిడివిగ

## రెవెన్యూ డివిజన్లు - మండలాలు

జగిత్యాల జిల్లాలో మెట్‌పల్లి, జగిత్యాల 2 రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. ఈ రెండు డివిజన్లలో మొత్తం 18 మండలాలు ఉన్నాయి.

**జగిత్యాల రెవెన్యూ డివిజన్‌లో 12 మండలాలు :**

1. జగిత్యాల 2. జగిత్యాల రూరల్ 3. రాయికల్ 4. సారంగాపూర్ 5. బీర్‌పూర్ 6. ధర్మపురి 7. బుగ్గారం 8. పెగడపల్లి 9. గొల్లపల్లి 10. మల్యాల 11. కొడిమ్యాల 12. వెల్గటూర్

**మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్‌లో 6 మండలాలు :**

1. కోరుట్ల 2. మెట్‌పల్లి 3. మల్లాపూర్ 4. ఇబ్రహీంపట్నం 5. మేడిపల్లి 6. కథలాపూర్

ద్వీపం సృష్టించింది. దీని పేరు 'బాదనకుర్తి'. ఇక్కడే గోదావరి నదిపై రెండు వంతెనలున్నాయి. అవి రెండు వైపుల పారే నదిపై కట్టినవి. రెండు వంతెనల మధ్య బాదనకుర్తి ద్వీపం ఉంది.

**చెరువులు - ప్రాజెక్టులు :** జిల్లాలో మొత్తం 1100 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఇబ్రహీంపట్నంలో గంగనాల ప్రాజెక్టు, కథలాపూర్‌లో రాళ్ళవాగు ప్రాజెక్టు, సారంగాపూర్‌లో రోళ్లవాగు ప్రాజెక్టుల ద్వారా సేద్యానికి నీరందుతుంది.

**జనాభా :** 2011 జనాభా లెక్కల ప్రకారం జగిత్యాల జిల్లా జనాభా 9,85,417 కాగా, పురుషులు జనాభా 4,84,079, స్త్రీల జనాభా 5,01,338. దీనిలో గ్రామీణ జనాభా శాతం 77.54%, పట్టణ జనాభా శాతం 22.46. ఈ జిల్లా జనసాంద్రత 407. లింగనిష్పత్తి 1000 :1036.

**అక్షరాస్యత :** జగిత్యాల జిల్లా అక్షరాస్యతా శాతం 60.26. ఇది తెలంగాణ రాష్ట్ర సగటు అక్షరాస్యతా శాతం కన్నా 6% తక్కువ. పురుషుల అక్షరాస్యత 70.60%, స్త్రీల అక్షరాస్యత 50.38%.

## జగిత్యాల జిల్లా చరిత్ర

జగిత్యాల జిల్లా తెలంగాణలో అతి ప్రాచీనమైన చరిత్ర గలది. మూడువేల సంవత్సరాల క్రితం ఈ ప్రాంతపు చరిత్ర లిఖితాధారాలతో లభిస్తుంది. పోతన నగరాన్ని రాజధానిగా ఏలిన పోతరాజు మహిషాసురుడు ఈ ప్రాంతాల్లో తొలిరాజు. ఇతడేలినది మాహిష్మతి. పోతన నగరం పోదన, పౌదన్య, బహుధాన్య మొ॥న పేర్లతో క్రీ.పూ. 1000 సం॥ క్రితం అశ్మక రాజ్యమనే పేరుతో వ్యవహరింపబడింది. అశ్మకం అంటే రాయి. ఇనుము మిశ్రితమైన రాయితో ఉక్కు తయారు చేసే పరిశ్రమ విరివిగా ఉండేది. ఇది జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలో అధికం. అగ్గిమళ్ల, వెలుగటూరు, వెల్గుకొండ, వెలుగుమట్ల, కొడిమాల (కొలిమాల) వంటి జగిత్యాల జిల్లాలోని గ్రామాలు. ఈ కొలిమిగల ఊర్లను, అక్కడి ఉక్కు తయారీని సూచిస్తున్నాయి. అతి ప్రాచీనకాలంలో ఈ ఉక్కు ఎగుమతి కోసం వ్యాపార కేంద్రాలు, విదేశీ వ్యాపారుల రాకపోకలు ఉండేవి. ఎగుమతులు గోదావరి నది గుండా జరిగేవి.

క్రీ.పూ. 3 వేల సంవత్సరాల నాడు అశ్మకరాజ్యంతో బాటే మూలకమనేది మరొక షోడశ మహాజనపదంగా గుర్తించబడి, బుద్ధుని కాలం నాటి భారతదేశంలో ప్రసిద్ధమైంది. ఇది బౌద్ధవాఙ్మయంలో పేర్కొనబడింది. ఈ మూలకమే నేటి జగిత్యాల జిల్లా, కరీంనగర్ జిల్లా ప్రాంతాలు. ఈ మూలక విషయంలోని ములకల్ల, ములకనూరు వంటివి నేటికీ గ్రామ నామాలుగా ఉన్నాయి. నాగరిక అభివృద్ధి చెందని కాలంలో ఈ మూలకులకు మూలవాసులు. వేల సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నివసించడం చేత మూలకు లయ్యారు. అశ్మకులు, మూలకులు పురాణాల్లో పేర్కొనబడ్డారు. ఇక్కడి సంస్కృతి వికాసం వెనుక గోదావరి నది, తత్తీర అరణ్యాలు, ఆహార సంపద ప్రధాన కారణాలు.

జగిత్యాల జిల్లాలోని చరిత్ర క్రీ.పూ. 6వ శతాబ్ది అనగా నేటికి రెండువేల ఆరువందల సంవత్సరాల క్రితం నుండి మనకు లభిస్తోంది. కారణం బుద్ధునికి సమకాలికంగా

ఈ ప్రాంతంలో బౌద్ధం ఆచరించబడింది. తెలంగాణాలోనే కాదు, దక్షిణ భారతంలో బౌద్ధం ఆచరించిన తొలినేల ఇది. ఈ కారణంగా ఈ ప్రాంతాలు బౌద్ధ వాఙ్మయంలో పేర్కొనబడ్డాయి. బుద్ధుని సమీపస్థుడు 'పాయసి' కోటిలింగాల యువరాజు. ఇతని పేర గ్రామం, గ్రామం వెలుపల స్థూపం ఉన్నాయి. గోదావరి నదిలో ఏర్పడ్డ ద్వీపానికి కవిట వనద్వీపం అని పేరు. నేటి బాదనకుర్తి అనే పేరు గల ఈ ద్వీపంలో నివసించిన 'బావరి' బౌద్ధం ఆచరించడానికి బుద్ధుని వద్దకు తన శిష్యులను పంపినాడు. సుత్తనిపాతలో ఈ వివరాలున్నాయి. ఈ ద్వీపం (జగిత్యాల ప్రాంతం) నుండి శ్రావస్తికి వెళ్ళే మార్గం బౌద్ధగ్రంథంలో పేర్కొనబడింది. నాడు ఉత్తర భారతానికి ఇది వ్యాపార పథం. దీనికే దక్షిణాపథం అని పథం, ప్రాంతం అనే అర్థాలు ఏర్పడ్డాయి.

క్రీ.పూ. 2వ శతాబ్దం నాటికి ముందే ఈ ప్రాంతాలను ఏలిన రాజులను ఆంధ్ర రాజులన్నారు. ఈ ప్రాంతానికి అంధ్ర, అంధకభూమి అని, ఇక్కడివారి అంధకులని పేరు వచ్చింది. వీరి నాణెములు కోటిలింగాలలో దొరికినవి. గోబద, సిరికంవయ, సమగోప, నరన ఇలా భారతదేశంలోనే తొలుతగా నాణెములపై పేర్లు ముద్రించుకొన్న రాజులు వీరు. వీరి భృత్యులైన శాతవాహనులు తరువాత ఈ కోటిలింగాల రాజధానిగా సువిశాల సామ్రాజ్యం ఏలినారు. ఈ వంశపు తొలిరాజు చిముకుని నాణెములు కూడా కోటిలింగాలలో దొరికినవి.

కోటిలింగాల, జగిత్యాల జిల్లాలో గోదావరి తీరంలో వెల్గటూరి మండలంలో ఒక గ్రామం. నాడు అది రాజధాని. మగధవరకు విస్తరించిన శాతవాహనులకు, సువిశాల సామ్రాజ్యానికి రాజధాని. తెలంగాణకు ఒక హరప్పా, మొహంజుదారో వంటిది. ఇక్కడ జరిపిన పురావస్తు తవ్వకాలలో ప్రాచీన నగరం బయట పడింది. ఇక్కడే రోమన్ల నాణెములు దొరికాయి. వారితో వ్యాపార సంబంధాలను ఒకటవ శతాబ్దానికే స్థిరీకరిస్తున్నాయి. చిముకునితో ప్రారంభమైన గౌతమీపుత్ర శాతకర్ణి కుమారుడైన వాశిష్ఠీపుత్ర

**మున్సిపాలిటీలు :** జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి
**రెవన్యూ గ్రామాలు :** 287
**గ్రామ పంచాయితీలు :** 327
**పోలీస్ హెడ్ క్వార్టర్ :** జగిత్యాల
**పార్లమెంట్ నియోజకవర్గం :** నిజామాబాద్
**అసెంబ్లీ నియోజకవర్గాలు :** మెట్‌పల్లి, జగిత్యాల
**పట్టణాలు :** జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, ధర్మపురి, కోరుట్ల

పులోమావి వరకు వీరి నాణెములు ఇక్కడ వివిధ రూపాలలో దొరికినాయి.

హాల శాతవాహన చక్రవర్తి కాలానికి కూడా కోటిలింగాల రాజధానిగా ఉండేది. ప్రతిష్ఠానం నుండి పడవలో ప్రయాణం చేస్తూ మార్గమధ్యంలోని ద్వీపం (నేటి బాదనకుర్తి) రాకుమార్తె లీలావతిని, దగ్గరలోని సప్త గోదావరి తీరంలో పెళ్లి చేసుకొన్నట్టు 'లీలావతి' అనే ప్రాకృత కావ్యం వర్ణించింది. ఈ కావ్యంలో ఈ ప్రాంతపు చరిత్ర ఉంది. ఈ ద్వీపరాజు ఒక రాక్షసరాజుగా ఈ కావ్యం చెపుతుంది.

ఈ హాల శాతవాహన చక్రవర్తి గాథాసప్తశతి కావ్యాన్ని సంకలనం చేయించాడు ఈ కావ్యంలోని గాథల్లో తెలంగాణ తెలుగు జీవితం నిక్షిప్తమైంది. ఈ చక్రవర్తి తరువాత సుమారు రెండు శతాబ్దులకు ఇక్కడ శాతవాహన రాజ్యం అంతమైంది.

శాతవాహనుల తరువాత విష్ణుకుండినులు ఈ ప్రాంతాన్ని ఏలినారు. వారు చేయించిన సహస్ర యాగాల్లో కొన్ని హిందూ ధర్మానికి కేంద్రమైన ధర్మపురిలో జరిగాయి. ఇక్కడ శ్రీమఠం కోసం చేసిన తవ్వకాల్లో ఇవి బయల్పడ్డాయి. విష్ణుకుండినుల పాత నరసింహాలయ కుడ్య శాసనం ఒకటి ఈశాన్యభాగాన ఉండేది. కూచిమంచి జగ్గకవి విష్ణుకుండిన విజయార్క భూపతి ధర్మపురి రాజధానిగా ఏలినాడని, సోమదేవ రాజీయంలో చెప్పినాడు. విష్ణుకుండిన మాధవవర్మ అడిగిన బ్రాహ్మణులకు, యజ్ఞాలకు బహుమతిగా సప్త

గోదావరి తీర భూములను దానం చేసినట్లు ప్రతాపరుద్ర చరిత్ర చెపుతోంది. ఈ సప్త గోదావరి కోటిలింగాలకు నదీ మార్గం గుండా 100 కి.మీ. దూరంలో ఉంది.

వీరి తరువాత ఈ ప్రాంతం బాదామీ చాళుక్యుల ఏలుబడి లోనికి వచ్చింది. ఈ కాలంలోనే ధర్మపురి గ్రామం లోని శివాలయంలో వాతాపి గణపతి విగ్రహం ప్రతిష్ఠాపించ బడింది. దీనికి తరువాత బోధన్ వేములవాడ నేలిన చాళుక్య రాజవంశాల రాజ్యంలో ఈ ప్రాంతం ఉండేది. ఈ వేముల వాడ రాజధాని జగిత్యాల జిల్లాకు 50 కి.మీ.దూరం. బద్దెగ సోలద గండని (9వ శతాబ్దం) ఏలుబడిలోని సామంతుడగు హైహయ వంశ అయతవర్మ వేయించిన శాసనం ధర్మపురిలో ఉంది. ఇది ఈ ప్రాంతానికి శాతవాహనుల తరువాత వచ్చిన శాసనాలలో అతి ప్రాచీన శాసనం. వేములవాడ చాళుక్య ప్రభువు ఇమ్మడి అరికేసరి కొలువులోని పంప భారతకర్త పంప మహాకవికి ధర్మపురి అగ్రహారంగా ఈయబడ్డట్టు కుర్క్యాల శాసనం చెబుతున్నది.

కళ్యాణి చాళుక్య ఆరవ విక్రమాదిత్యుని శాసనం ధర్మపురిలో ఉంది. ఈ ప్రాంతం అతని ఏలుబడిలో ఉండేది. పొలాస రాజ్య రాజధాని ఐన పొలాసలో శాసనాలు లభించి నవి. రాష్ట్రకూట సామంత రాజులు మేడరాజు అధీనంలో ఉన్న ఈ ప్రాంతం కాకతి రుద్రుడు మేడరాజును గెలువగా కాకతీయుల అధీనంలోనికి పోయింది. ఈ విషయం అనుమకొండ వేయిస్తంభాల గుడి శాసనంలో ఉంది. ఈ మేడరాజు కుమారుడు జగద్దేవుని పేర జగిత్యాల ఏర్పడింది.

ఆ తరువాత ఈ ప్రాంతం కాకతీయుల అధీనం లోనికి వెళ్లినట్లు గణపతిదేవ చక్రవర్తి ధర్మపురి శివాలయంలో వేయించిన శాసనం చెపుతోంది.

జగిత్యాల జిల్లాలోని రేకులపల్లిలో జన్మించిన ముసునూరి ప్రోలయ నాయకుడు తరువాత హనుమకొండకు రాజై ఈ ప్రాంతాన్నేలినాడు. వీరి సామంతుడు ముప్ప భూపాలుడు. రామగిరి దుర్గాధిపతిగా ఈ జగిత్యాల ప్రాంత మేలినాడు. ఈతని మంత్రులు వాణస కేసన, కందన సోదరులు ధర్మపురిలో అన్నసత్రము పెట్టినారు. వీరి ఆస్థానకవి మడికి సింగన తన పద్మ పురాణములో తెలిపినాడు. కేసన ధర్మపురి నరసింహ భక్తుడు. ఉత్సవాలు చేయించినాడు. ఇతడు వెలిగందులకు దండనాథుడుగా (దుర్గ రక్షకుడుగా) ఉన్నాడు.

ఢిల్లీ సుల్తాన్ అలాఉద్దీన్ ఖిల్జీ సేనాని మాలిక్ కాఫర్ దండయాత్రలో ధర్మపురి నరసింహాలయం దోపిడి ధ్వంసాలకు గురియై, మసీదుగా మార్చబడింది.

విజయనగర స్థాపకుడైన విద్యారణ్యుడు ధర్మపురి వాడు. అతని మేనల్లుడు దేవరాయల కడ మంత్రిగా ఉండి, ఆయనను కాళేశ్వరానికి తీసుకొని వచ్చి అక్కడ తులాభారము చేయించి శాసనం వేయించినాడు. ఈ ప్రాంతాలు ఆ సమయంలో విజయనగర రాజుల ఆధీనంలోనికి పోయి నాయి. ఆ తరువాత తిరిగి గజపతుల ఏలుబడిలోకి వచ్చి, వారి సామంతుడైన షితాబ్‌ఖాన్ ఓరుగల్లు నేలుతుండగా అతని అధీనం లోనికి వెళ్లినాయి. అతని మంత్రి ఎనుములపల్లి పెద్దనకు, ధర్మపురి వాడైన చరిగొండ ధర్మన్న చిత్రభారతము రాసి అంకితమిచ్చినాడు.

ఆ పై గోలకొండ కుతుబ్‌షాహీలు, ఈ ప్రాంతాల నేలినారు. ఆఖరురోజు తానీషా ప్రభువు మంత్రి అక్కన్న మాదన్నలలోని మాదన్న ధర్మపురిలో దిగుడుబావి కట్టించి శాసనము వేయించినాడు. ఆ తరువాత అసఫ్‌జాహీలు, నిజాం ఏలుబడిలోనికి వచ్చి, తరువాత సర్దార్ పటేల్ పోలీస్ చర్యతో భారతదేశంలో విలీనమైంది.

జగిత్యాల జిల్లాలో పేర్కొనదగిన ప్రాచీన పట్టణం కోరుట్ల. జిల్లా కేంద్రానికి దగ్గరగా 20 కి.మీ. దూరంలో ఉన్న ఈ గ్రామం వేయి సంవత్సరాల చరిత్ర కలది. పశ్చిమ చాళుక్యుల కాలపు కోనేరు దేవాలయం (రత్తమార్తాండ జినాలయం) నిర్మాణమైందని శాసనం ఉంది. రాష్ట్రకూట, పశ్చిమ చాళుక్య, బోధన్, వేములవాడ చాళుక్యుల కాలంలో ఇది ప్రధానంగా జైన కేంద్రం. మహాదేవస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, సాయిబాబా దేవాలయం ప్రసిద్ధాలు. సాహిత్యానికి ప్రసిద్ధి గాంచిన ఈ గ్రామం 3

శతాబ్దాలుగా చేతితో తయారుచేసే కాగితపు పరిశ్రమకు ప్రసిద్ధి గాంచింది. ఈ ఊళ్లోని ఓ వీధికి కాగజ్‌పురమని పేరు.

అలాగే దీనికి సమకాలికంగా చరిత్ర గల పొలాస గ్రామం కూడా ఉంది. ఇది ఒకప్పుడు రాష్ట్రకూట సామంతులకు రాజధాని నగరం. పౌలస్త్యేశ్వర దేవాలయం ప్రసిద్ధం. మేడరాజును చంపి దీన్ని కాకతీయ రుద్రుడు గెలిచాక దీని ప్రాభవం తగ్గింది. కాకతి రుద్రుడు తన వేయిస్తంభాల గుడి శాసనంలో పొలాసను (నాటి మేడెరాజును) గెలిచినట్లు చెప్పుకొన్నాడు. ఏకవీరాదేవి ఆలయం ఇక్కడ ఉన్నట్లు క్రీడాభిరామం చెప్పింది. అది నేటి ఎల్లమ్మగుడి కావచ్చు.

**శాసనాలు :** చరిత్ర ప్రశస్తమైన ఈ జిల్లాలో అనేక శాసనాలున్నాయి. కోటి లింగాలలో లఘు శాసనాలు 27, మొక్కటరావు పేటలో 1, ధర్మపురిలో 37, పొలాసలో 3, రాయికల్‌లో 1, కోరుట్లలో 2 శాసనాలు, వాల్గొండలో ఒక శాసనం, మల్లన్నపేటలో 1 శాసనం, సుమారు చరిత్రకెక్కని మరి పది శాసనాలు మొత్తం 80 లభిస్తున్నాయి. ఇవన్నీ ఈ జిల్లా ప్రాచీనతకు సాక్ష్యంగా నిలిచాయి. శాతవాహనులు, రాష్ట్రకూటులు, వేములవాడ చాళుక్యులు, పశ్చిమ చాళుక్యులు, కాకతీయులు, హైహయ రాజులు, సామంత రాజులు ఈ శాసనకర్తలుగా ఉన్నారు.

## సంస్కృతి

**కళలు :** జగిత్యాల జిల్లాలో నాటకరంగం చాలా ప్రసిద్ధి చెందినది. తొలినాళ్ళలో యక్షగానాలకు ఈ ప్రాంతం బాగా ప్రసిద్ధి. ధర్మపురి మండలం చిన్నాపూర్‌లో యక్షగానాలాడే మాదిగ కుటుంబాలు అనేకంగా ఉన్నాయి. ధర్మపురి యక్షగాన రచయితలకు ప్రసిద్ధి. శేషప్ప ధర్మపురి రామాయణం విఖ్యాతం. మనుమడు కాకుత్థ్సం నరసింహదాసు. ఇతడు ధర్మపురివాడే. ఈతడు మైరావణ చరిత్ర అనే యక్షగానం రాసినాడు.

ధర్మపురి పట్టణం నాటకాలకు అతి ప్రసిద్ధి గాంచింది. ఇటీవల 80 ఏళ్ళ పండుగ చేసుకున్న శ్రీ లక్ష్మీనరసింహ నాట్య మండలి, అనేక పౌరాణికాలు, సాంఘిక, చారిత్రకాది నాటకాలు ఆడింది. కాసర్ల వేంకట రాజయ్యగారి ఆధ్వర్యంలో 1936లో ప్రారంభమైన ఈ సంస్థలో కాకర్ల లక్ష్మీకాంత శాస్త్రి, సంగనభట్ల మాణిక్యశాస్త్రి, రొట్టె చంద్రశేఖర శాస్త్రి, దెమ్మె బాలకిష్టయ్య, (స్త్రీ పాత్రధారి) వంటి దిగ్గజాలుండేవారు. ఏటా నరసింహ స్వామి (స్థానిక జాతర) బ్రహ్మోత్సవాల్లో నాటకాలు ఆడేవారు. గయోపాఖ్యానం, వీరపాండ్య కట్ట బొమ్మన నాటకాలతో పలు సంస్థలకు విరాళాలకు సేకరించి పెట్టారు. ప్రస్తుతం సంగనభట్ల నరసయ్య, కొరిడె నరహరి, యస్. రామకృష్ణయ్య, కాకెరి దత్తాత్రేయశర్మ, మునగాల కిషన్ వంటి ప్రసిద్ధ నటులు నాటక రంగాన్ని పోషిస్తున్నారు.

మెట్‌పల్లిలోని గోధూర్ నాటకానికి పెట్టింది పేరు. ఇక్కడ నుండి పలువురు నటులు ప్రసిద్ధులైనారు. పొలాసలో పుట్టిన మురళీ మోహనాచారి మెట్‌పల్లిలో నాటక రంగానికి చాలా కృషి చేసినారు. సుప్రసిద్ధ నాట్యాచార్యులు నటరాజ రామకృష్ణగారి శిష్యులైన కళాకృష్ణ కోరుట్ల నివాసి.

**జాతరలు**

ఈ జిల్లాలో ధర్మపురి లక్ష్మీ నరసింహుని బ్రహ్మోత్సవాలు ప్రతియేటా ఫాల్గుణ శుద్ధ ద్వాదశి నుండి బహుళ పంచమి వరకు జరుగుతాయి. లక్షలాది భక్తులు తరలి వస్తారు. గోదావరిలో స్నానించి, దర్శనాదుల తరువాత నదిలో ఇసుక తిన్నెలపై, వంటలు, నిద్రలు కావిస్తారు. అర్ధరాత్రి వేలాదిమంది గోదావరి తీరంలో, ఇసుక తిన్నెలపై నిద్రించడం మనోహరంగా ఉంటుంది. ఇక్కడి బ్రహ్మగుండం, యమగుండం, సత్యవతి గుండాల్లో (గోదావరి నదిలో) స్నానాదులు చేస్తారు. అనేకంగా స్వామి మీద అల్లిన జానపద గీతాలు పాడుతారు. ఈ వారం రోజులు ఆలయంలో అనేక కళారూపాలు ప్రదర్శితమవుతాయి. కోనేటిలో తెప్ప ఉత్సవము కన్నుల పండుగగా జరుగుతుంది. దత్త, రామ, నరసింహ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించబడుతాయి.

అలాగే కొండగట్టు ఆంజనేయస్వామి మందిరంలో హనుమజ్జయంతికి విశేషంగా భక్తులు తరలి వస్తారు. పెంబట్ల, కోనాపూర్ మరొక ముఖ్య క్షేత్రం.

## సాహిత్యం

జగిత్యాల జిల్లాలో సాహిత్యం చాలా విశాల పరిధిలో అభివృద్ధి చెందింది. అతి ప్రాచీనకాలం నుండి ఈ ప్రాంతానికి గొప్ప సాహిత్య చరిత్ర ఉంది.

ఈ ప్రాంతంలో ధర్మపురి అతి ప్రాచీన సాహిత్య కేంద్రం. ఈ గ్రామం పంప మహాకవికి వేములవాడ చాళుక్యుల చేత ధారాదత్తం చేయబడింది. వేయి సం॥ క్రితం ఈ క్షేత్రంపై స్థానికంగా సంస్కృతంలో మూడువేల శ్లోకాలతో స్థానికుడైన **ఓ అజ్ఞాత కవి** మాహాత్మ్యగ్రంథం రాసాడు. మహాకవి భవభూతి ధర్మపురికి సంబంధించిన కవిగా సూచనలున్నాయి. ఈయన తరువాత బోధన్‌లో స్థిరపడినాడు. **విద్యారణ్యస్వామి** విజయనగర సామ్రాజ్య స్థాపనాచార్యునిగా ప్రసిద్ధుడు. బహుగ్రంథకర్త. ధర్మపురికి చెందినవాడు.

ఋగ్వేద భాష్యకర్త **సాయణుడు, నరహరిభట్టు** (సహాయకుడు) ధర్మపురి వారే. వేదవిద్యలకు నిలయమైన ఈ గ్రామంలోని **చతుర్వేదుల నరసింహభట్టు** విజయనగర సామ్రాజ్యంలో వేదవిద్యా స్పర్థలో అగ్రేసరుడుగా నిల్చి చక్రవర్తి సదాశివ రాయలచే పల్లకి మోయించుకొన్నవాడు. యావత్తెలుగు ప్రాంతాల్లో వీధిబళ్ళలో పాఠ్య పారాయణ గ్రంథమైన నరసింహ శతకం ధర్మపురివాడైన **శేషప్ప** రచన. ఈయన దౌహిత్రుడు **కాకుత్థం నరసింహదాసు** కృష్ణ శతకం రాసినాడు. ఇది కూడా నరసింహ శతకంతోపాటు చిన్న పద్దెం, పెద్ద పద్దెం పేర్లతో వీధి బళ్ళలో పాఠ్యంగా ఉండేది. ఈ ప్రాంతపు కవులైన మడికి సింగన, కొరవి గోపరాజుల గ్రంథాల్లో, పింగళిసూరన కళాపూర్ణోదయంలో పేర్కొనబడిన గ్రామం. **చరికొండ ధర్మన్న** ఈ గ్రామంలో స్థిరపడి, ఈ గ్రామం వాడే ఐన ఓరుగల్లు మంత్రి ఎనుములపల్లి పెద్దనామాత్యునికి తన చిత్రభారతం ప్రబంధం ఇక్కడే రాసి, అంకితమిచ్చాడు. ఈ గ్రామానికే చెందిన **హేమాద్రి పండితుడు** 'చతుర్వర్గ చింతామణి' అనే గ్రంథం రాసినాడు. ఈతడు దేవగిరి రాజుల కొలువులో ఉన్నాడు. బమ్మెర పోతన తన నారాయణ శతకంలో ఒక పద్యం 'ధర్మపురీ లక్ష్మీనాథ నారాయణా! అనే మకుటంతో పద్యం రాసినాడు. గోదావరిలో చంద్ర గ్రహణవేళ వచ్చినపు డాయన రాసినదీ పద్యం. **రామసుధీ** అనేవాడు జ్యోతిష శాస్త్రవేత్త. ధర్మపురి వాడు. 'ముహూర్త చింతామణి' అనే గ్రంథం రాసినవాడు.

**పోరాటాలు – గేయ సాహిత్యం :** జగిత్యాల పోరాటాల పురిటిగడ్డ. తెలంగాణ సాయుధ పోరాటానికి, విప్లవోద్యమానికి అనేకులైన వీరుల నందించింది. ధర్మపురి మండలం బీర్‌పూర్ నివాసి **ముప్పాళ లక్ష్మణరావు అలియాస్ గణపతి** కార్యదర్శిగా పనిచేసినాడు. ఈ ప్రాంతంలోనే నక్సలైట్లు తొలిసారిగా పోలీసులను ధర్మపురిలో కాల్చి చంపినారు. పోలీసులు, అన్నల మధ్య గ్రామాలకు గ్రామాలు ఎడారులైనాయి. అటు విప్లవవీరులు, ఇటు సాయుధ పోలీసు దళాలు జగిత్యాల జిల్లాలోని గ్రామాల్లో నెత్తురుడికించారు. ఈ ఉద్యమం సుమారు రెండు దశాబ్దాలు అతి తీవ్రంగా నడిచింది. ఎందరో కవులు, రచయితలు, ఈ ఉద్యమం నుండి పుట్టినారు. భూస్వామ్యపు బలమైన పునాదులున్న దొరల గడీలు, వారి దాష్టీకం, పన్నుల వసూళ్లకై ఆధిపత్యానికై వారు అవలంబించిన క్రూర విధానాలు ఈ ఉద్యమానికి పురుడు పోసాయి.

అల్లె ఆగిరెడ్డి (వెల్గటూరు), అమర్, మధుప్రియ, రాసభూమయ్య (కోరుట్ల), ఎద్దండి భూమయ్య, పులి గోవర్ధన్, గడిపె బాలయ్య, బి.ఎస్.రాములు, కె. రామలక్ష్మణ్ (జగిత్యాల వారు వీరిద్దరు), డా. శంకరయ్య (మల్యాల) మొదలైనవారిని ఉద్యమ రచయితలుగా పేర్కొనవచ్చు.

గాదె శంకరకవి, సబ్బని లక్ష్మీ నారాయణ, గుండేటి మొదలైనవారు ఇతర గేయకవులు. **జైశెట్టి రాజయ్య** (జగిత్యాల), వేములవాడ క్షేత్రం గూర్చి, శతకంతో పాటు అనేక గేయాలు రాసినారు.

జగిత్యాల జిల్లా అత్యాధునిక రచయితలలో **కె.వి. నరేందర్** ప్రసిద్ధులు. నాటక, కథా, నవలా రచయిత. వీరి గర్భగుడి నాటకం, 'నాన్న' మొదలైన కథా సంకలనాలు ప్రసిద్ధాలు. వీరిది జగిత్యాల. అదేవిధంగా **బి.ఎస్.రాములు**

సుప్రసిద్ధ కథా, నవలా రచయిత. స్మృతి, వేపచెట్టు, తేనెటీగలు, పాలు మొదలైన కథా సంకలనాలు, బతుకుపోరు మొదలైన నవలలు ప్రసిద్ధాలు. సామాజిక, ఆర్థిక సిద్ధాంతాలపై సుమారు 80 గ్రంథాలు రాసినారు. తెలంగాణ బి.సీ.కమీషన్ అధ్యక్షులు.

**అలిశెట్టి ప్రభాకర్** గొప్పకవి. ఈయన వచన కవితా సంపుటాలు కవిత్వ పరిమళంతో, మానవతా విలువలతో గుబాళించాయి. సుప్రసిద్ధ నవలా రచయిత **అల్లం రాజయ్య** జగిత్యాల మండలంవాడు. ఇతని రచన 'కొలిమంటుకుంది' సుప్రసిద్ధ నవల. అనేక సామాజిక చైతన్యం కల్గించే కథలు రాసినాడు. ఈతని తమ్ముడు **అల్లం నారాయణ** మంచి కవి. 'జగిత్యాల పల్లె' కవితా సంకలనం వెలువరించారు. ప్రస్తుతం వీరు ప్రెస్ అకాడెమీ చైర్మన్. **డి.వి. మోహనాచార్య** 'వలపు సంకెళ్లు', తదితర నాటకాలు రాసినారు. ధర్మపురిలో పుట్టి, పెరిగి, అక్కడే స్థానిక సంస్కృతాంధ్ర కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన మరో ప్రసిద్ధ విమర్శకులు, రచయిత, చారిత్రక పరిశోధకులు, కవి, నాటక రంగ ప్రముఖులు **సంగనభట్ల నరసయ్య** ఛందశ్శాస్త్రంలో పరిశోధించి, "దేశీచ్ఛందస్సులు" అన్న గ్రంథంతోపాటు 'తెలుగులో ఛందో వైవిధ్యం' అన్న గ్రంథం రాసినారు. తెలుగులో చాటు కవిత్వము (విమర్శ), సమాంతర రేఖలు దివ్యనేత్రాలు (కవిత్వం), ధర్మపురి చరిత్ర (చారిత్రక గ్రంథం) అనేక ప్రాచీన గ్రంథాల పరిష్కరణలు, కళారంగానికి సంబంధించిన రచనలు చేసినారు.

అలాగే కోరుట్ల మండలం కూడా రచయితలకు నిలయం. ఇక్కడివారైన **శిరిశినహళ్ కృష్ణమాచార్యులు అతి** ప్రసిద్ధులు. శతావధాని కోరుట్ల వాసి. 'గురువంశం', 'సనత్కుమార సంభవం', 'రామానుజ చరిత్రం' వీరి కృతులు.

**కొరిడె రాజన్నశాస్త్రి** మరొక ప్రసిద్ధ కవి. బహు గ్రంథకర్త. సంస్కృతాంధ్రాల్లో అనేక కృతులు రాసిన ఇతడు ధర్మపురివాడు. నలచరిత్ర, సుమనోంజలి, బలిపుష్ట విలసితం మొదలైనవి ఇతని కృతులు. ధర్మపురికి చెందిన **పెండ్యాల అచ్యుతశర్మ** గురుభక్తి అనే నాటకం రాసినారు. ధర్మపురివాడు. వేములవాడ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసినారు.

**రామసింహ కవి** రాఘవ పట్టణవాసి 'శ్రీ రామలక్ష్మణ ప్రబోధం' ఇతని కృతి. **పులిగోటి ఆనందమాంబ** కవయిత్రి బండ లింగాపూర్ వాసి. **అందె వేంకటరాజం** కోరుట్ల నివాసి. మానస వీణ, భువనవిజయం, భారత భారతి వంటి గ్రంథాలు రాసినారు. భారతీ సాహితీ సమితి పేరిట సాహిత్య సంస్థ పెట్టి వానమామలై వరదాచార్యుల వారికి స్వర్ణ కంకణం పి.వి. నరసింహారావు గారి ద్వారా అలంకరింప చేసినారు.

**కొరిడె రామయ్య** ధర్మపురి వాసి. సంస్కృతాంధ్రాల్లో మంచి పండితులు. ధర్మపురి నారసింహునిపై నారసింహేశ్వర శతకమును రాసినారు. ధర్మపురి వాస్తవ్యులై **వేమూరి లక్ష్మీ నరహరి శాస్త్రి** భర్తృహరి శతక త్రయానికి తెలుగు అనువాదం చేసినారు. ధర్మపురి నరసింహునిపై నృకేసరి శతకాన్ని రాసినారు. **కాకుత్థ్సం అనంతయ్య** ధర్మపురి నివాసి. ఇతడు నరసింహ స్వామిపై మరొక శతకమును రాసినాడు. ధర్మపురివాడైన **బల్యపల్లి సుధాకర్‌రావు** సోమేశ్వర శతకమును రాసినాడు. కోరుట్ల నివాసి **రాజేశ్వరశర్మ (పాలెపు)** దుంపెట నారసింహ శతకం రాసినాడు. **తత్వాది కృష్ణశర్మ** మంచి పద్య రచయిత. గాదె శంకర కవి (మోహనరావుపేట), ఆత్మావిష్కారం పేరిట రచన చేసినారు. **వేముల పెరుమాళ్లు** (రాయికల్) తెలుగు జాతీయాల కోశం నిర్మించినారు. ఇనుగంటి గోపాల్, చెన్నాడి వెంకట రమణారావు, వి.వి.రామారావు, గంగ్ర లక్ష్మణరావు (పెగడపల్లి), సంగినేని రవీంద్ర (చెక్కల్ల), కల్వకోట మురళీధరస్వామి, యం.వి. నర్సింహారెడ్డి, పూదూరు రామిరెడ్డి, కల్వకుంట వేదాంతా చార్యులు, పెరుమాళ్ళాచార్యులు ప్రముఖులు.

## సాహితీ సంస్థలు

ధర్మపురిలోని **శేషప్ప సాహితీ మిత్రమండలి** ఒక 20 సంవత్సరాల పాటు సంగనభట్ల నరసయ్య గారి కార్యదర్శకత్వంలో నడిచింది. వానమామలై వారిచే కావ్య

గానాలు చేయించింది. జగిత్యాలలో **విశాల సాహిత్య అకాడమీ** బి.ఎస్. రాములు గారిచే నడుపబడింది. వీరి జన్మతిథి సందర్భంగా పలువురు కథా రచయితలను సన్మానించింది. కథా రచయితలకు వర్క్‌షాప్ నడిపించి డా. జైశెట్టి రమణయ్య గారు ఒక సాహిత్య సాంస్కృతిక సంస్థను ఏర్పాటుచేసి సుమారు 20 సంవత్సరాలు ఉత్తమ ఉపాధ్యాయులను, కవులను, పండితులను, చారిత్రకారులను గౌరవించారు. వారి తండ్రిగారైన జైశెట్టి రాజయ్య గారి గేయకృతులు ముద్రించారు. డా. శంకర్ గారి సారథ్యంలో ఉగాది ఉత్సవాల్లో పలు సాహిత్య కార్యక్రమాలు, కవి సమ్మేళనాలు, అష్టావధానాలు జరిగాయి. శ్రీ యం.వి. నర్సింహారెడ్డి గారు తన కౌసల్య కళాశాల తరపున పలు సాహిత్య సమ్మేళనాలు, కవి సమ్మేళనాలు, పండిత సన్మానాలు చేసినారు.

కోరుట్లలో **భారతీ సాహితీ సమితి** గొప్ప సాహిత్య సేవ చేసింది. దీని కార్యదర్శి అందె వెంకట రాజం గారు పలు సాహిత్య కార్యక్రమాలు, అష్టావధానాలు, గ్రంథ ముద్రణలు చేసినారు. తాళ్లపల్లి మురళీధర గౌడ్ చాలా కార్యక్రమాలకు రూపమిచ్చారు. వానమామలై వరదాచార్యుల వారికి పీ.వీ. నరసింహారావు గారి చేతుల మీదుగా గండపెండేరం తొడగటం ఒక గొప్ప సాహిత్య కార్యక్రమాన్ని ఈ సంస్థ చేసింది. **మెట్‌పల్లి శిశుమందిర్** పలు గ్రంథావిష్కరణలు చేసింది.

## వివిధ రంగాల ప్రముఖులు

స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న యోధులు ఈ ప్రాంతంలో తక్కువే. కాని స్వాతంత్ర్యానంతర రాజకీయాల్లో పాల్గొన్నవారధికం. సంగనభట్ల మాణిక్యశాస్త్రి, కే.వి. కేశవులుగార్లు ధర్మపురిలో బ్రిటిష్/ నిజాం వ్యతిరేకంగా జెండా ఎగురవేసి పోలీసుల నుంచి తప్పించుకొని మహారాష్ట్రకు పారిపోయినారు. వీరిలో కే.వి. కేశవులు తరువాత మర్రి చెన్నారెడ్డి గారి మంత్రివర్గంలో చేనేత శాఖామాత్యులు పనిచేసారు. తొలితరంలో కాంగ్రెస్ నాయకులుగా కాసుగంటి లక్ష్మీనరసింహారావు గారు, చెన్నమనేని సత్యనారాయణ రావు గారు, తరువాత జువ్వాడి రత్నాకర రావు గారు, చెన్నమనేని విద్యాసాగర్‌రావు వంటి పెద్దలు రెండోతరంలో, మూడో తరంలో ప్రసిద్ధులైన రాజకీయ నాయకులు కాంగ్రెస్ కమ్యూనిస్టు తెలంగాణా ప్రజాసమితి, బీజేపీ, తెరాస పార్టీలు తమ అభ్యర్థులను గెలిపించుకున్నాయి. ప్రస్తుతం కొప్పుల ఈశ్వర్ గారు చీఫ్‌విప్‌గా తెలంగాణా ప్రభుత్వంలో వున్నారు. టీ. జీవన్‌రెడ్డి, రాజేశంగౌడ్, సుద్దాల దేవయ్య, ఎల్. రమణ గార్లు ఇతర ముఖ్య రాజకీయ నాయకులు. ఒక లక్ష పురుష ఓటర్లు, ఒక లక్షా పదమూడు వేల స్త్రీ ఓటర్లున్నారు. పార్టీలకతీతంగా స్వతంత్ర అభ్యర్థులను కూడా ఈ ప్రాంతం గెలిపించుకుంది. ఇందులో జువ్వాడి రత్నాకర్ రావు గారు ముఖ్యులు.

## దర్శనీయ స్థలాలు (పర్యాటకం)

జగిత్యాల నగరంలో ఒక ప్రాచీనమైన కోట ఉంది. క్రీ.శ. 1747లో ఫ్రెంచి ఇంజనీర్లు, జాక్ & టాల్ అనేవారు ఈ కోటను నిర్మించారు. దీన్ని నక్షత్రాకారంలో నిర్మించారు. చుట్టు గల భారీ కందకానికి కండ్లపల్లి చెరువు నీరు అగడ్తలో నింపడానికి ఉపయోగించేవారు. ఈ కోటను మొఘలుల సామంతుడు అయిన ఇబ్రహీం నవాబ్ కట్టించాడని చెప్పుతారు. ఔరంగజేబు గోలకొండను జయించాడని, గోల్కొండ అతని వశం కావడంలో ఈతడు సాయపడ్డాడు.

1937లో హైదరాబాద్ నిజాం 7వ నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ పట్టాభిషేక రజతోత్సవ సమయంలో జువ్వాడి ధర్మజ శ్రీపతిరావు దొర నిర్మించిన గడియార స్తంభం విశేషంగా ఆకట్టుకుంటుంది.

ధర్మపురిలోని కోనేరు ఒక సువిశాల జలాశయం. 16వ శతాబ్దిలో నిర్మించినట్టిదని శాసనం ద్వారా తెలుస్తుంది. ఇక్కడే ప్రాచీన శివాలయం పశ్చిమ చాళుక్యుల కాలంనాటిది ఉంది. ఈ ఆలయంలో వాతాపి చాళుక్య శిల్పంగా భారీ గణేశుని విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా ఉంది.

రాయికల్ త్రికూటాలయం మరియొక చారిత్రక స్థలం. ఇది పశ్చిమ చాళుక్యుల కాలానిది. చాలా మనోహర శిల్పంతో ఉంది.

గోదావరి ఇక్కడ ఏడు పాయలుగా చీలింది. దీన్ని సప్తగోదావరి పుణ్యస్థలంగా రెండువేల సంవత్సరాల కిందినుండి ఉన్నట్లు పాణిని మహర్షి మొదలుగా గల భారతదేశపు రచయితలు పేర్కొన్నారు.

జగిత్యాల జిల్లాలో జగిత్యాల, చలిగల్లు, బాదన్‌కుర్తి, బండ లింగాపూర్, ధర్మపురి, రాజారంలలో పాతకాలపు గడీలు ఉన్నాయి. ఇవి జాగీర్దారీ వ్యవస్థ ఏర్పడ్డాక కట్టినవి. ప్రస్తుతం కొన్ని శిథిలం, కొన్ని విద్యాలయాలకు ఇవ్వబడ్డాయి. వారసులు హైదరాబాదులో స్థిరపడ్డారు.

ప్రాచీనమైన కోటలలో కోటిలింగాలలోని కోట రెండువేల సంవత్సరాల క్రితంది. దీని ఆనవాళ్ళు మాత్రం కొద్దిగా మిగిలాయి. వాయవ్య భాగాన పాత బురుజు ఒకటి శిథిలావస్థలో ఉంది. అలాగే రణంకోట మరొకటి. ఇది కూడా చాలా ప్రాచీనమైంది. బుగ్గారానికి దగ్గరలో ధర్మపురికి 8 కి.మీ. దూరంలో రెండు పర్వత శ్రేణుల మధ్య ఉంది. ఇది కూడా ద్విసహస్రాబ్ది సంవత్సరాల పూర్వానిదే. ఆనవాళ్ళున్నాయి. జగిత్యాలో ఉన్న కోట మాత్రం శిథిలం కాకుండా చక్కగా ఉంది. ఇది 3 శతాబ్దాల క్రితంది. కోరుట్లలో కూడా కోట ఉంది. ఇది వేములవాడ చాళుక్యుల కాలంలో నిర్మాణమైంది.

## ముఖ్య దేవాలయాలు

ఈ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో పేర్కొనదగినవి ధర్మపురిలోని శ్రీ లక్ష్మీ నరసింహాలయం, కోటిలింగాలలోని కోటేశ్వరాలయం, కొండగట్టులోని ఆంజనేయస్వామి ఆలయం, నంచర్లలోని రామాలయం, రాపల్లెలోని శివాలయం ఇవి ప్రాచీనాలయాలు. నాగలికి తగిలిన ప్రాచీన లింగం కారణంగా పెగడపల్లి గ్రామంలో ఒక శివాలయం నిర్మాణమై ఇటీవల ప్రసిద్ధి చెందినది. బీర్‌పూర్‌లో నరసింహాలయం, మల్లాపూర్‌లోని శివాలయం పర్వతాగ్రాన ఉన్న ఆలయాలు, లోయల్లో ఉన్న ఆలయం గండి ఆంజనేయస్వామి ఆలయం ప్రసిద్ధం. రాయికల్‌లో పశ్చిమ చాళుక్యుల కాలపు త్రికూటాలయం ఉంది. చాలా మనోహరమైన శిల్పంతో అలరారుతుంది.

ధర్మపురి ఈ జిల్లాలోని అత్యంత ప్రసిద్ధ నారసింహ క్షేత్రం. ఇక్కడ ఐదు నరసింహాలయాలున్నాయి. దానిలో ఒకటి పశ్చిమ చాళుక్యుల కాలానిది (11వ శతాబ్దం), మసీదుగా (14వ శతాబ్దం) మార్చబడింది. ప్రస్తుతం రెండు నరసింహాలయాలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. "భూషణ వికాస శ్రీ ధర్మపురి నివాస, దుష్ట సంహార నరసింహ ధురిత దూర" అనే మకుటంతో యావత్ తెలంగాణ ప్రజలకు సుపరిచితం. "ధర్మపురికి పోతే యమపురి ఉండదనే"ది ఇక్కడికి వచ్చే భక్తుల నమ్మకం. దక్షిణ భారతదేశంలోని 108 దివ్యక్షేత్రాల్లో ఒక మహాపుణ్య క్షేత్రం. దక్షిణ కాశిగా పేరు పొందిన ఈ క్షేత్రం పురాణ, ఇతిహాస, సాహిత్య ప్రాధాన్యత కలిగి ఉంది. విమతాల విధ్వంసం, స్వమత ప్రభువుల అభిమతం మేరకు ఇన్ని ఆలయాలు రూపుదిద్దు కొన్నాయి. ఇక్కడి శివాలయాలు కూడా ఆరవ విక్రమాదిత్యుని (క్రీ.శ.11వ శతాబ్దం) కాలపువే. ఈ గ్రామం ఆలయాల గ్రామంగా ప్రసిద్ధం. సత్యవతి పేరిట బతుకమ్మకు ఒక ఆలయం ఉంది. రామ, దత్త, ఆంజనేయ, లక్ష్మి, సంతోషి, నాయకమ్మ దేవాలయాలు న్నాయి.

కొండగట్టు పుణ్యక్షేత్రం జగిత్యాల కరీంనగర్ రహదారి మీద ఉన్న గ్రామం. నిజానికి ఇది గ్రామం కాదు. అడవులు, పర్వతాల మధ్య ఉన్న క్షేత్రం. ఆంజనేయ స్వామి కొండపై వెలసి వున్నాడు. ఈ రెండు పదాలకు పర్వతమనే అర్థం ఉన్నా, రెండవ పదం గట్టు అనేది స్థానం అనే అర్థంలో నిలిచింది. ఇక్కడి ఆంజనేయ స్వామిని కొలువడానికి

వేములవాడ వచ్చిన వారందరూ తప్పక దర్శించుకుంటారు. కొండమీదికి వాహనాలు వెళ్ళడానికి దారి వుంది. ఒకప్పుడు కాలినడకనే ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ వెళ్ళేవారు. క్షేత్ర సాహిత్యం గాని, చరిత్రగానీ లేవు. ఇటీవల ప్రసిద్ధి గాంచిన క్షేత్రం. లక్షలాది భక్తులు హనుమజ్జయంతి, ముక్కోటి ఏకాదశికి తరలివస్తారు. హనుమంతుని దీక్ష ఇక్కడ విశేష విధి. దగ్గరలోని ధర్మపురికి వెళ్లి గోదావరిలో వీరు స్నానాదులు చేస్తారు. కొండమీది నీటిగుంట స్నానయోగ్యం కాదు.

**కోటిలింగాల**

కోటిలింగాల గోదావరి తీరంలోని మరొక క్షేత్ర తీర్థం. ఒకప్పటి శాతవాహనుల రాజధాని, గొప్ప వ్యాపార కేంద్రం అయిన ఈ గ్రామంలో నది అంచున కొండపై కోటీశ్వర స్వామి పేరుతో శివుడు వెలిసాడు. ఇది ప్రాచీన త్రికూటాలయం. పశ్చిమ చాళుక్యుల కాలపు నిర్మాణం. ఒక కూటం తూర్పువైపుది గోదావరి వరదలకు కొట్టుకొని పోగా శివలింగం మాత్రం మిగిలి వుంది. మిగిలిన రెండు కూటములున్నాయి. దేవాలయావరణ నుంచి సువిశాల గోదావరి నదీ ప్రవాహాన్ని, నిడివిని చూడటం ఒక వింత అనుభూతి. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిలువ నీరు వల్ల ఇపుడు గోదావరి చెరువులా కనబడుతుంది. ఇక్కడ బోటు, లాంచీలు జల విహారానికి అనువుగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

కరీంనగర్‌కు 75 కి.మీ. దూరంలో రాయకల్ గ్రామం ఉంది. కాకతీయుల కాలంలో నిర్మించబడిన కేశవనాథ స్వామి ఆలయం ఉంది. అపురూపమైన శిల్పసందపతో అలరారే ఆ ఆలయ ప్రాంగణంలోనే భీమన్నగుడి కూడా ఉంది. ఇక్కడి ముఖ్య ఆకర్షణ పంచముఖేశ్వరుడి ఆలయం.

ఈ పంచ ముఖేశ్వరుడిని పోలిన ఆలయం మరెక్కడా లేదు. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో భీమన్నగుడిలో జాతర నిర్వహిస్తారు.


ఈ జిల్లాలోని పట్టణాల్లో జగిత్యాల చాలా ప్రధానమైంది. ప్రాచీనమైంది. జగిత్యాలలో అందరూ తెలుగే మాట్లాడుతారు. ఇతర మాతృభాషలవారు కూడా తెలుగు మాట్లాడుతారు. జగిత్యాల జిల్లా పట్టణకేంద్రమైన జగిత్యాలకు వస్త్రాలు, ధాన్యం, మందులు, వైద్యం కోసం వస్తారు. జిల్లాలోని అన్ని గ్రామాలకు ఇక్కడినుండి బస్ సౌకర్యాలు, రోడ్లు ఉన్నాయి.

ఈ జిల్లావాసులు బొంబాయి, పూణె, భీవండిలకు వెళతారు. ఈ నగరం గుండా రోడ్ 63 నెం. జాతీయ రహదారి వెడుతుంది. పెద్దపల్లి నిజామాబాద్ రైల్వే దారి ఈ పట్టణం ద్వారా వెళుతుంది.


ఒకప్పటి ప్రాచీన రాజధానియైన ఈ జగిత్యాల పట్టణంలో ఒక కోట ఉంది. ఇది 18వ శతాబ్ది కాలానిది. ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది.

జగద్దేవుని పేర ఏర్పాటైన 'జగదాలయ' ప్రాంతం. తెలుగువారి వైభవానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన 'కోటిలింగాల' ఈ జిల్లాదే. నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన పవిత్ర ధర్మపురి క్షేత్రం ఇక్కడిదే. ఆ నారసింహుడి ఆశీస్సులతో జిల్లా అన్నిరంగాల్లో ముందుకు సాగుతుంది.

# జనగామ జిల్లా చిత్రపటం




6M (9)



చిలుపూర్ వెంకటేశ్వరస్వామి దేవస్థానం



దేవాదుల ప్రాజెక్ట్




ఖిల్ల షాపూర్



చుక్క సత్తయ్య



పేర్వారం జగన్నాథం



వరవర రావు



అంపశయ్య నవీన్

# జనగామ

**ఘనమగు పాలకుర్తి శివకాంతుల నిల్చి వెలుంగు సీమయై**
**సునిశిత హస్త భాక్కళల శోభలు సిద్ధుల గుట్టలాదిగా**
**ననయము పర్యటజ్జనుల హార్ద ముదంబుల కాలవాలమై**
**గన జనగామ వెల్గునిల కాంతి సమన్విత దేవతాత్మయై !**

**తె**లంగాణ రాష్ట్రానికి కేంద్ర బిందువు, దక్కన్ పీఠభూమిపై ఎత్తైన ప్రాంతం. రెండు జాతీయ రహదారుల కూడలి. సాయుధ పోరాట నేపథ్యంలో పోరాటాల జిల్లాగా ప్రసిద్ధి చెంది, నాటి శిలాయుగం నుండి నేటి కంప్యూటర్ యుగం దాకా చరిత్ర ప్రతిమైలు రాయిలో **జనగామ** చిరునామా కనిపిస్తుంది.

**ఈ పేరెందుకు?**

జైనులను సిద్ధులు, వేములు అంటారు. జైనులు తీర్థంకరులను వేలుపులుగా కొలుస్తారు. సిద్దెంకి గ్రామం, సిద్ధుల గుట్ట (కొడవటూరు) వేలుపుకొండ (జాఫర్‌గఢ్), వేములతోట (నేటి కుందారం గ్రామం, వెల్లవేముల (నేటి ఎల్లంల గ్రామం) ... ఇలా జైన సంబంధ గ్రామనామాలు, గుట్టలు ఉన్నాయి. జైన మతాన్ని అవలంబించిన రాష్ట్రకూటు లకు, కళ్యాణీచాళుక్యులకు కొలనుపాక రాజధాని. వీరి కాలంలో వేసిన శాసనాలు జైన బసదులకు దానమిచ్చిన వివరాలను తెలుపుతున్నాయి. జైనశిల్పం ఈ జిల్లాలో విరిసింది. జైన ఇంటి పేరుగా ఉన్న కోమటులు ఇక్కడ ఉన్నారు.

**'జైన గ్రామ మందిరస్తే చెన్నకేశవం భజే'** అనే మకుటం గల 8 పద్యాలను జనగామ పట్టణ కేంద్రంలోని చెన్నకేశవాలయంలోని అర్చకులు పూజలో భాగంగా చదువు తారు. జైనం వెల్లివిరిసిన నేల కాబట్టే పూర్వపు జైన్‌గావ్ నేటి జనగామగా పిలువబడుతున్నది.

## భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి

జనగామ $17^0$-19 మరియు $18^0$ -13 ఉత్తర అక్షాంశాల మధ్య $78^0$-49 మరియు $80^0$-43 తూర్పు రేఖాంశాల మధ్య వ్యాపించి ఉంది. 2,188 చ.కి.మీ. విస్తీర్ణంతో ఉంది. ఈ జిల్లాకు ఉత్తరాన సిద్దిపేట, వరంగల్ అర్బన్, తూర్పున వరంగల్ రూరల్, మహబూబాబాద్, దక్షిణాన సూర్యాపేట, యాదాద్రి, పశ్చిమాన సిద్దిపేట, యాదాద్రి జిల్లాలు సరిహద్దులుగా ఉన్నాయి.

## సహజ వనరులు

**నేలలు :** ఈ జిల్లాలో నల్లరేగడి, ఎర్రమట్టి, ఒండ్రు నేలలు ఉన్నాయి.

**అడవులు :** జిల్లాలో అటవీప్రాంతం తక్కువే. అటవీ ప్రాంతం 30,75 చ.కి.మీ. అంటే మొత్తం భూమిలో 1.41శాతం మాత్రమే.

**నదులు :** జనగామ జిల్లాలో పెద్ద నదులేవీ లేవు.

**చెరువులు - ప్రాజెక్టులు :** దేవాదుల, ఎస్.ఆర్.ఎస్.పి, బయ్యన్నవాగు రిజర్వాయర్, లింగాల ఘనపురం, నవాబు పేట, రఘునాథపల్లి, అశ్వరావుపల్లి, స్టేషన్ ఘన్‌పూర్, నర్మెట్ట, బొమ్మకూరు, గండి రామారం, కన్నెబోయినగూడెం రిజర్వాయర్లు జిల్లాలో నీటిని సరఫరా చేస్తున్నాయి. జనగామ, చీటకోడూరులో తాగునీటి కోసం నిర్మించిన జలాశయం

**రెవెన్యూ డివిజన్లు - మండలాలు**

జనగామ జిల్లాలో రెండు రెవన్యూ డివిజన్‌లు ఉన్నాయి. 1. జనగామ 2. స్టేషన్ ఘన్‌పూర్. మొత్తం 13 మండలాలున్నాయి.

**జనగామ రెవెన్యూ డివిజన్‌లో 8 మండలాలు :**

1. జనగామ 2. గుండాల 3. లింగాల ఘనపూర్ 4. రఘునాథపల్లి 5. బచ్చన్నపేట 6. దేవరుప్పల 7. నర్మెట 8. తరిగొప్పుల

**స్టేషన్ ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్‌లో 5 మండలాలు:**

అవి 1. స్టేషన్ ఘన్‌పూర్ 2. పాలకుర్తి 3. జాఫర్‌ఘడ్ 4. చిల్పూరు 5. కొడకండ్ల

ఉంది. దేవాదుల మొదటి, రెండవదశ పనులు పూర్తి కావలసి ఉన్నవి. ఇవి పూర్తి అయితే జిల్లాలో దాదాపు 50,000 ఎకరాలు అదనంగా సాగయ్యే అవకాశం ఉంది. వర్షాధార మైన కొన్ని చెరువులు, ప్రధానమైన నీటివనరులుగా ఉన్నాయి. జిల్లాలో మొత్తం చిన్న, పెద్ద కలిపి దాదాపు700 చెరువులు ఉన్నట్లు అంచనా.

**జనాభా :** 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ జిల్లా జనాభా 5,66,376, కాగా పురుషుల జనాభా 2,83,648, స్త్రీల జనాభా 2,82, 728. దీనిలో గ్రామీణ జనాభా శాతం 87.40%, పట్టణ జనాభా శాతం 12.60%. ఈ జిల్లా జన సాంద్రత 259/కి.మీ. లింగ నిష్పత్తి 1000 : 997.

**అక్షరాస్యత :** అక్షరాస్యతా శాతం 61.44%. ఇది తెలంగాణ రాష్ట్ర సగటు అక్షరాస్యతా శాతం కన్నా 5% తక్కువ. పురుషుల అక్షరాస్యత 71.21%, స్త్రీల అక్షరాస్యత 51.69%.

## జిల్లా చరిత్ర

అధికభాగం నేల గుట్టలు, పరుపుబండలతో ఉండడం వల్లనూ, వీటిపైనుంచి వర్షపు నీరు ప్రవహించి అడుగడుగునా ఒర్రెలు, చిన్న చిన్న వాగులు ఏర్పడినాయి. ఎగుడు దిగుడు నేల కావడం వల్ల ఎక్కడికక్కడ చిన్న చిన్న జలాశయాలు ఏర్పడ్డాయి. అడవి కూడా విస్తరించి ఉంది. ఈ కారణంగా ప్రాచీన శిలాయుగం నుండే ఆదిమ మానవులకు ఆవాస యోగ్యంగా మారింది ఈ ప్రాంతం.

**పాత రాతి యుగం :** నదీ ప్రవాహంలో నునుపుదేలిన రాళ్ళను పాక్షికంగా తొలచి ఉపయోగించిన రాతి పనిముట్లు, పాతరాతి యుగం చివరి దశకు చెందిన సూక్ష్మరాతి పనిముట్లు, బ్లేడులు సిద్దెంకి గ్రామం చిటకోడూర్ (జనగామ మండలం) కొన్నె (బచ్చన్నపేట) గ్రామాలలో విశేషంగా లభించాయి.

**కొత్తరాతియుగం :** ప్రతీ మూడు, నాలుగు కి.మీ.లకు ఒక గుట్ట, గుట్ట ప్రక్కన చెరువు, గుట్టనుండి జాలువారిన నీటి ప్రవాహం ఇప్పటికీ కనిపిస్తుంది. ఈ గుట్టలు అనేక గుహలను ఏర్పరచాయి. కొన్నె, రామచంద్రాపూర్, కళ్ళెం, పోలకొండ, కోలుకొండ, పెద్దమడూరు, దేవరుప్పల, నీర్మాల గోవర్ధనగిరి ఇలా ప్రతీ గ్రామంలోనూ రాతిగొడ్డళ్ళు, రింగుస్టోన్స్, దంపుడు రాళ్ళు ఎరుపు, నలుపు రంగుతో ఉన్న అనేక రకాల మృణ్మయపాత్రలు లభించాయి.

ఈ యుగంలో పెద్దపెద్ద బండరాళ్ళను వలయాకృతిలో అమర్చిన అనేక సమాధులు ఈ జిల్లాలో ఉన్నాయి. వీటిని రాకాసిగూళ్ళు అంటారు. జనగామ జిల్లా వ్యాప్తంగా పదివేల రాకాసిగూళ్ళు ఉండవచ్చును. వీటిలో ప్రధానంగా 1. గుంత సమాధులు 2. గూడు సమాధులు 3. గృహ సమాధులు (డాల్మెన్స్) 4. తొలచిన కొండ సమాధులు అని 4 రకాలుగా విభజించబడినాయి. రాకాసిగూళ్లకు అనుబంధంగా కొన్నిచోట్ల నిలువు రాళ్ళు పాతుతారు. వీటిలో కొన్ని నిలువురాళ్ళు శిల్పాలుగా చెక్కి ఉంటాయి. వీటిని మానవాకృతి శిల్పాలు అంటారు.

**మానవాకృత శిల్పాలు :** మానవాకృత శిల్పాలు తెలంగాణాలోనే అరుదు. వడ్లకొండలో ఇలాంటివి 3 నిలువు రాళ్ళున్నాయి. మైసమ్మ గుట్ట వద్ద నిలువురాళ్లు 3 డైమెన్షన్స్‌లో కనిపిస్తాయి.

**గృహ సమాధులు** : సాధారణంగా కొండ లేదా గుట్టల ఉపరితలంపై గృహ సమాధులను నిర్మిస్తారు. రఘునాథపల్లి మండలం గబ్బెట గ్రామ శివారులో 3 కాళ్ల మంచంగుట్టపై ఉన్న గృహ సమాధి విశేషంగా ఆకట్టు కుంటుంది. ఒకదానిపై మరొక రాయిని 3 పొడవు వరుసల్లో అమర్చి ఉపరితలంగా కప్పుబండను అమర్చారు. దీనినే 3 కాళ్ళ మంచం అంటారు. నరసింహస్వామి దీనిపై రాత్రివేళలో శయనిస్తాడని గ్రామస్థుల విశ్వాసం. స్థానికులు 'కలియుగ మంచం'గా భావిస్తారు. బచ్చన్నపేట మండలంలో రామచంద్రాపూర్ బోడగుట్టపై 10 కి పైగా గృహ సమాధు లున్నాయి. స్టేషన్ ఘనపూర్ మండలంలోని గండి రామవరం రిజర్వాయర్‌కు ఆనుకొని ఉన్న గుట్టపై 4 గృహ సమాధులు ఉన్నాయి. రఘునాథపల్లి మండలం అశ్వారావుపల్లి శివార్లలో ఉన్న బలపాలగుట్టపై 4 గృహ సమాధులున్నాయి.

గుండాల మండల కేంద్రంలో 2 డాల్మన్ సమాధు లుండగా మిగతావి చెదిరిపోయాయి. కొడకండ్ల మండలం మొండ్రాయి గ్రామ శివార్లలోని గుట్టపై 3 గృహ సమాధు లున్నాయి. మరొకొన్ని చెదిరిపోయాయి.

లింగాల ఘనపురం మండల కేంద్రంలోని వీరన్నగుడి వీరన్న గుట్ట అడుగు భాగాన ఉంది. దేవుడి విగ్రహం ఉండదు. గుహలా ఉన్న గుడిని మూయడానికి 20 అడుగుల ఎత్తైన భారీ రాతి పలక ఉంది. సమీపంలో రాతి పనిముట్లు నూరుకున్న గుర్తులున్నాయి. ఆదిమానవుల నివాస స్థలమై ఉండవచ్చు.

**బూడిద సమాధులు** : భారతదేశంలోనే మొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో బూడిద సమాధులు కనుగొనబడినాయి. రాబర్ట్ బ్రూస్ వీటిని గుర్తించాడు. ఆ తర్వాత తెలంగాణాలో జనగామ మండలంలోని వడ్లకొండ గ్రామ శివార్లలో కొన్నిటిని పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి కనుగొన్నాడు. ఒక 'లారీ' డబ్బా నిండా పట్టేంత బూడిద ఈ సమాధి నుండి బయట పడింది. ఇందులో చేతితో తయారు చేసిన మట్టి పాత్రలో ఎముకల నుంచి రెండవసారి ఖననం చేసినట్లుగా అనేక ఆధారాలు బయటపడినాయి ఇందులో చక్రంపై తయారు చేసిన ఎరుపు, నలుపు రంగు మృణ్మయ పాత్రలు కూడా బయట పడినాయి.

**మున్సిపాలిటీ** : జనగామ

**రెవెన్యూ గ్రామాలు** : 191

**గ్రామపంచాయితీలు** : 209

**పోలీస్ హెడ్ క్వార్టర్** : జనగామ

**పార్లమెంట్ నియోజకవర్గం** : పూర్వపు వరంగల్

**అసెంబ్లీ నియోజకవర్గాలు** : స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, లింగాల ఘనపురం.

**పట్టణాలు** : జనగామ, స్టేషన్ ఘన్‌పూర్.

గ్రూవ్స్ : రాతి ఉపరితలంపై రాతిపనిముట్లను నూరినప్పుడు ఏర్పడిన గుర్తులను గ్రూవ్స్ అంటారు. ఇవి సిర్రగోనె ఆటలో త్రవ్వే బద్దివలె సన్నగా, పొడవుగా లోతైన గాడి కలిగి ఉంటాయి.

రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరి గుట్టపై ఏకంగా 'రోళ్ళమదిరె'నే ఉంది. వందూది గ్రూవ్స్ పర్యాటకులను ఆకర్షిస్తాయి.

బచ్చన్నపేట మండలంలోని రామచంద్రాపూర్ తోడగుట్టకు ఆనుకొని కొన్నెవాగు ప్రవహిస్తుంది. ప్రవాహం ఒరుసుకు పారేచోట ఉన్న పరుపుబండపై పదుల సంఖ్యలో గ్రూవ్స్ ఉన్నాయి. బండ నాగారంలోని దేవుని గుట్టపై అనేకం ఉన్నాయి. రఘునాథపల్లి మండలం గబ్బెట గ్రామ శివార్లలోని మల్లన్నగుట్టపై కొడకండ్ల మండలంలోని పాలకొండ, జనగామ మండలంలోని సిద్దెంకి గుట్ట, పట్టణ జనగామ శివార్లలో, పెంబర్తి శివార్లలో, లింగాల ఘనపురం మండలంలోని కళ్ళెం, నిడిగొండ గుట్టలపై జిల్లాలోని ప్రతీ గుట్ట అడుగున ఉన్న పరుపు బండలపై గ్రూవ్స్ సర్వ సాధారణంగా కనిపిస్తాయి.

**గుహా చిత్రాలు** : జనగామ మండల కేంద్రం గోపరాజుపల్లి దేవుని గుట్టలో ఉన్న గుహలో ఎరుపురంగు చిత్రాలున్నాయి. పూలరేకులు, మానవుల నృత్యం, అస్థిపంజరం

మొదలైన చిత్రాలున్నాయి. ఎరుపురంగులో ఉన్న ఈ చిత్రాలలో నైపుణ్యం లేదు.

**కప్‌మార్క్డ్ ఉన్న బండలు :** రాతి ఉపరితలంపై కాకుండా విడిగా కప్‌మార్క్డ్ ఉన్న బండలు లింగాల ఘనపురం లోని కళ్ళెం గుట్టపై, జనగామ జిల్లాలోని గోపరాజుపల్లి గుట్టపై ఉన్నాయి. గోపరాజుపల్లెలోని కప్‌మార్క్డ్ బండ నుండి సంగీతం వినిపిస్తుంది.

**మగధరాజులు :** కొన్నె గ్రామంలో మగధ కాలంనాటి మట్టిపాత్ర లభించింది. కె. పుల్లారావుగారు ఈ పాత్రను ధ్రువీకరించారు.

జనగామ మండలంలోని చీటకోడూరు రిజర్వాయర్ పొట్టిగుట్ట పాటి మీద నాట్యగత్తె మట్టిముద్ర, మృణ్మయపాత్రల దిబ్బలు ఉన్నాయి. భూగర్భంలో 2 పెద్ద ఇటుకల నిర్మాణాలు ఉన్నాయి. కళ్ళెం గ్రామం పాటి మీద టెర్రకోట పొట్టేలు బొమ్మ (మూసపై తయారు చేసినది) లభించింది. చెవి కమ్మ మట్టితో చేసినది దొరకడం విశేషం.

చీటకోడూరు గ్రామంలోని మంచుకోసు శివాలయం పాటిమీద మరియు వాగుకు రెండో వైపున ఉన్న పాటిమీద అనేక మృణ్మయ పాత్రలు లభించాయి. మట్టితో చేసిన ఏనుగు తల, రాతితో చేసిన ఎద్దుబొమ్మ గొప్ప నైపుణ్యంతో చేసినది లభించింది. ఈ ఆధారాలు నాటి సామాజిక జీవనాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

**రాష్ట్రకూటులు :** కొలనుపాక రాజధానిగా కొంతకాలం రాజ్యపాలన చేశారు. గుండాల మండలంలోని వెల్మలలో 3 శాసనాలు రాష్ట్రకూటుల నాటివే. రాష్ట్రకూట రాజైన అకాలవర్షుడు (2వ కృష్ణుడు) క్రీ.శ. 1 ఏప్రిల్ 907లో ఈ శాసనం వేయించాడు. రావి చంద్రయ్య వేయించిన ఈ శాసనం జైన బసదికి 100 మర్తురుల భూమి, తోటను దానం చేసినట్లు చెబుతుంది. కొలనుపాక ప్రస్తావన మొదటగా ఈ శాసనం లోనే కన్పిస్తుంది.

**జాఫర్‌ఘడ్ శాసనం :** గుట్టపై ఉన్న నర్సింహస్వామి ఆలయం ప్రక్కన చెరువురాల కట్టడంలో ఈ శాసనం ఉంది. ఇందులో రాష్ట్రకూటుల వంశ వర్ణన చక్కని కన్నడ పద్యాల్లో ఉంది. సంకర గండడు వేల్పుకొండపై చెరువును త్రవ్వించినట్లు చెబుతున్నది.

**పొలకొండ శాసనం :** కొడకండ్ల మండలం పొలకొండ గ్రామం పెద్దగుట్టపై 'అక్కా చెల్లెండ్ల గుండం' ఉంది. దీని ప్రక్కన ఉన్న లఘు శాసనం రాష్ట్రకూటుల నాటిదని రామోజు హరగోపాల్ చెప్పారు.

**కళ్యాణి చాళుక్యులు :** వీరి రాజధాని కొలనుపాక. ఓబుల్ కేశవపూర్, కళ్ళెం, నిడిగొండ మొదలైన గ్రామాల్లో కళ్యాణి చాళుక్యులు వేయించిన శాసనాలు ఉన్నాయి.

**పశ్చిమ చాళుక్యులు :** పాలకుర్తి మండలంలో గూడూరులో పశ్చిమ చాళుక్య త్రిభువన మల్లదేవుడు క్రీ.శ. 1124లో ఈ శాసనం వేయించాడు. కొమ్మోజు అనే కవి ఈ శాసనం రచించాడు. రఘునాథపల్లి మండలంలోని తాటికొండ కోటలో ఉన్న శాసనంలో పశ్చిమ చాళుక్యరాజుల ప్రసిద్ధిని తెలుపుతుంది.

**కాకతీయులు :** కాకతీయ సామంతరాజులు నతవాడి వంశస్థులు జనగామ ప్రాంతాన్ని పాలించారు. నతవాడి రుద్రదేవుడిని గణపతిదేవుని సోదరి కుందమాంబ వివాహం చేసుకున్నది. కాకతీయుల వంశచరిత్రను తెలిపే శాసనాలు జనగామ జిల్లాలో లభించినవి.

**కుందారం శాసనం :** కుందమాంబ వేయించిన ఈ శాసనంలో కాకతీయ వంశ వర్ణనతో పాటు వేములతోట గ్రామాన్ని కుందవరంగా మార్చి కుందవరం చెరువును త్రవ్వించినట్లు తెలుపుతుంది.

**నిడిగొండ శాసనం :** కుందారం శాసనంలోని అనేక వివరాలు నిడిగొండ శాసనంలోను కన్పిస్తాయి. 'బాల భారతి' అనే బిరుదు పొందిన కవి శాసనాన్ని కవిత్వాత్మకంగా రచించాడు. జీడికల్‌లోని హిడింబ గుట్టపై శివలింగాన్ని ప్రతిష్ఠించినట్టు ఈ శాసనాల ద్వారా తెలుస్తున్నది.

జనగామ జిల్లా వ్యాప్తంగా సుమారుగా 50 శాసనాల దాకా ఉండవచ్చు. కొన్ని శాసనాలు భిన్నమైనాయి. మరికొన్ని ఇంటి పునాదుల్లో కలిసిపోయాయి. రఘునాథపల్లి మండలంలోని ఖిలాషాపురంలోని సర్వాయిపాపని కోటకు 20 అడుగుల ఎత్తులో ఒక శాసనం ఉంది. కొడవటూరు (బచ్చన్నపేట మండలం) లో ఉన్న రెండు శాసనాలు నేడు కానరావు.

దేవరుప్పల మండలంలోని నిర్మల గ్రామంలో 'బంగారి గడ్డ'గా పిలిచే పాటి గడ్డ ఉంది. ఇక్కడ విజయనగర రాజుల కాలం నాటి అనేక బంగారు నాణేలు లభించాయి. వీటిని బట్టి విజయనగర రాజుల నాటి వర్తక, వాణిజ్య, రవాణా వ్యవస్థలకు సంబంధించిన సమాచారం తెలుసుకోవచ్చు.

**సిద్దెంకి శాసనం :** జనగామ జిల్లా భువనగిరి యాదాద్రి జిల్లాల సరిహద్దులో ఉన్న సిద్దెంకి గుట్టపై శాసనం ఉంది. ఈ శాసనమే జనగామ జిల్లాలో ప్రాచీనమైనదని చెప్పవచ్చు. ఇందులో జైన బసదులకిచ్చిన దాన వివరాలున్నాయి. రఘునాథపల్లి లింగంపల్లిలో శివలింగం పానవట్టం శాసనం ఉంది.

## సంస్కృతి

జనగామ భిన్న సంస్కృతులకు నిలయమైంది. కాకతీయుల కాలంలో శైవానికి ఎక్కువ ఆదరణ లభించిన కారణంగా ఈ ప్రాంతంలో ఊరికో శివాలయమైనా కనిపిస్తుంది. తర్వాత కాలంలో విష్ణాలయాలు కూడా నిర్మించబడ్డాయి.

**ఆచారాలు, సంప్రదాయాలు, పండుగలు :** వేదాల నుండి, పురాణేతిహాసాల నుండి వివిధ మతగ్రంథాల నుండి, పెద్దల నుండి చరిత్ర నుండి, సంక్రమించిన అనేక జీవన విధానాలను ఈ జిల్లా ప్రజలు ఆచరించి నైతిక ప్రవర్తనతో భాసిల్లుతున్నారు. సంప్రదాయంలో భాగమైన వివిధ పండుగలను, నోములను, వ్రతాలను, ఆచారాలను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకొని ఆధ్యాత్మిక జీవనంలో ముందున్నారు. వివిధ పండుగల ద్వారా కలిసి మెలిసి జీవించే తత్వాన్ని పెంపొందించుకుంటూ సమతా సమరసతలను, భక్తినీ, ధార్మికతనూ చాటుకొంటున్నారు. అన్నిరకాల పండుగలను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. బతుకమ్మ, దసరా, దీపావళి, ముక్కోటి ఏకాదశి, సంక్రాంతి, మహా శివరాత్రి, ఉగాది, వినాయక నవరాత్రులు, బక్రీద్, రంజాన్, క్రిస్మస్, గురునానక్ జయంతి మొదలైన పండుగలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవటం గమనించవచ్చు.

**కళలు :** జనగామ జిల్లాకు సమీపంలో సిద్దెంకి గ్రామం, నల్లగొండ జిల్లా ఆలేరు మండలానికి చెందిన శ్రీనివాసపురం శివార్లలో సిద్దెంకి గుట్ట ఉంది. ఇక్కడ వర్ధమాన మహావీరుని శిల్పాలు, పార్శ్వనాథ శిల్పం, అమ్రకూష్మాండిని (జైన యక్షిని) శిల్పాలు రమణీయంగా చెక్కబడినాయి. మూడుచోట్ల కన్పించే శిల్పాల వద్ద 3 శాసనాలున్నాయి.

లింగాల ఘనపురం మండలం నిడిగొండ గుట్టపై స్త్రీలు, ఒక పురుషుడు, ఒక బాలుడు పూజకు వెళ్ళుతున్నట్టుగా ఉన్న శిల్పం కన్నుల పండుగగా ఉంటుంది. వీరంతా రాజ కుటుంబీకులకు చెందినవారిలా ఉంటారు. ఈ శిల్పం ఉన్న శాసనాలను చదివితే వివరాలు తెలిసే అవకాశం ఉంది.

బచ్చన్నపేట మండలం కొన్నె గజగిరి గుట్ట అడుగున చాముండి శిల్పం, భైరవ శిల్పం చెక్కబడినాయి. జాఫర్‌గడ్ మండల కేంద్రంలోని వేలుపుకొండకు చెక్కిన శిల్పాలు ధ్వంసమైనాయి. ఇదేగాక విడిగా విగ్రహాలు అనేకం ఈ జిల్లాలో బయల్పడినాయి.

**తాటికొండ విగ్రహం :** రఘునాథపల్లి మండలంలోని తాటికొండ గ్రామంలోని నిలువెత్తు జైన విగ్రహాలలోని శిల్ప నైపుణ్యం అబ్బురపరుస్తుంది. శిల్పమంటే తాటికొండ శిల్పమే అన్నట్లుగా ఉంటుంది. ఇవి ప్రస్తుతం వరంగల్ జిల్లా పురావస్తు మ్యూజియం'లో కొలువు దీరినాయి.

లింగాల ఘనపురంలోని బండ్లగూడెం నర్సింహస్వామి గుట్టపై ధ్యానభంగిమలో కొలనుపాక మ్యూజియంలో ఉన్న శిల్పం వంటిది ఉంది.

జనగామ పట్టణంలో బొర్రెంకన్న కుంట కట్టపై జైన దేవాలయం ఉందనడానికి అనేక ఆధారాలున్నాయి. సుమారుగా 16, 17 ఇంచుల రాయిని నాలుగు వైపులా కాయోత్సర్గ భంగిమలో ఉన్న జైన తీర్థంకర శిల్పం ఉంది.

పదమటి కేశవపూర్ హామ్లెట్ గ్రామం జయాలలో జైన శిల్పం యొక్క తలభాగం గుర్తు పట్టరానంతగా ఉంది.

జనగామలో జైనంతోపాటు బౌద్ధమూ విలసిల్లిందని చెప్పడానికి అనేక ఆధారాలున్నాయి. స్టేషన్ ఘనపురం మండలంలోని యిప్పగూడెంలో నాగులమ్మ గుడి ఉంది. గుడి ధ్వంసమయింది. ఇందులో ఉన్న నాగులమ్మ, నాగులయ్యలను గుడికి దూరంగా వదిలేసారు నిలువెత్తు బుద్ధుని విగ్రహం ప్రస్తుతం తల, ఛాతి భాగం వరకే ఉంది. ఈమని శివనాగిరెడ్డిగారు ఈ విగ్రహం 5వ శతాబ్దానికి చెందినదిగా ధ్రువీకరించారు.

నాగులమ్మగా స్థానికులు భావించే విగ్రహం వజ్ర యాన శాఖకు చెందిన 'తార' విగ్రహం. ఈ తార విగ్రహం అత్యంత సౌందర్యంగా ఉంటుంది. ఈమె సిగముడి'లో శిల్పి పనితనం కన్పిస్తుంది. ఈ విగ్రహం అనంతర కాలానికి చెందింది.

లింగాల ఘనపురం మండలంలోని వేలపోగుల గ్రామం గంగమ్మ చెరువుపై వజ్రాయాన శాఖకు చెందిన రెండు తారల విగ్రహాలున్నాయి. వీర శ్యామతార, భగవతీ తార.

అనేకచోట్ల కాకతీయుల నాటి దేవాలయాలు కన్పించినా ప్రధానంగా లింగాల ఘనపురం మండలం విడిగొండలో కుందమాంబ నిర్మించిన త్రికూటాలయం కాకతీయ శిల్పకళకు చిరునామ. కొడవటూరులోని త్రికూటాలయం కూడా కాకతీయుల కాలం నాటిదే.

గంటు చిత్రాలతో వేసిన చాముండి దేవతా చిత్రం నర్సింహస్వామి గుట్టకు ఎదురుగా ఉన్న గుట్టపై ఉంది. ఓబుల్‌కేశవపూర్ (జనగామ)లోని ఏనెపై 'రాకాసి పిర్రల బండ సమీపాన 'కేశవుని' చిత్రం ఉంది. సిద్దెంకి గుట్టపై ధ్యానంలో ఉన్న వారి రెండు చిత్రాలున్నాయి.

కళ్ళెం గుట్టపై ఒక వీరగల్లు, ఒక భైరవ చిత్రం ఉన్నాయి. ఎల్లంల గ్రామంలో అయ్యలకాడ అని పిలిచే చోట జైన యక్షుని విగ్రహం ఉంది. శిథిల యక్ష దేవాలయం ఆనవాళ్ళున్నాయి. జాఫర్‌ఘడ్‌లో మార్చి గుట్ట కింద అరుదైన జైన తీర్థంకరుని విగ్రహం, నలుపురాయితో మరో విగ్రహం ఉంది.

## సాహిత్య సంస్థలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్నప్పుడు వరంగల్ కేంద్రంగా అనేక సాహితీ సంస్థలుండేవి. జనగామ కొత్త జిల్లాగా ఏర్పడిన తరువాత ఇప్పుడిప్పుడే సాహితీ సంస్థలు ఏర్పాటయ్యాయి.

**యువ రచయితల సంఘం :** 1988లో జి. కృష్ణ, పన్నీరు సత్యం ఆధ్వర్యంలో ఈ సంఘం ఏర్పడింది.

**సోమనాథ కళాపీఠం :** ఆదికవి పాల్కురికి సోమన జన్మస్థలం పాలకుర్తి. ఈ మండల కేంద్రంలో రాపోలు సత్యనారాయణగారు వ్యవస్థాపక అధ్యక్షునిగా 1922లో ఏర్పడింది. సోమన రచనలను వ్యాప్తి చేయడమే సంస్థ ప్రధాన ఉద్దేశంగా ఏటా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

**శైలీ సాహితీ కళా సంస్థ :** డా. కాసుల లింగారెడ్డి అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా రెడ్డి రత్నాకర్‌రెడ్డి నిర్వహించిన శైలీ సాహితీ కళాసంస్థ 2005 లో ఏర్పడింది. ప్రముఖ కవుల జన్మదినాలను, వర్ధంతి సభలను నిర్వహిస్తుంది. రెండేళ్ళపాటు నడిచి ఆగిపోయింది.

**జనగామ రచయితల సంఘం :** కవి, చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి వ్యవస్థాపక అధ్యక్షుడుగా 2011 లో స్థాపించబడింది. జనగామ కవుల సంకలనం 'అలుగు'ను ప్రచురించారు. జనగామ జిల్లా సాధనలో పాటల క్యాసెట్‌ను తీసుకువచ్చారు.

2017 తెరవే, తెరసం జనగామ జిల్లా శాఖలు ఏర్పడినాయి. తెరవే అధ్యక్షుడిగా జోగు అంజయ్య, తెరసం అధ్యక్షుడిగా పానుగంటి రామ్మూర్తి ఉన్నారు. రెడ్డి రత్నాకర్ రెడ్డి తెలంగాణ రచయిత సంఘం రాష్ట్ర సభ్యునిగా జాగృతి కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు.

ఇవేకాక శ్రీవేంకటేశ్వర నాట్యమండలి, సాంఘిక, సాంస్కృతిక అభివృద్ధి సేవాసంస్థ, జ్యోతిర్మయి లలిత కళా సమితి, శ్రీకృష్ణ ఆర్ట్ థియేటర్, అభ్యుదయ కళా సంస్థ, యువసాహితీ కళా సమితి, భవాని ఒగ్గు కళాకారుల సంఘం, జ్యోతి జానపద కళా సమితి, విక్టరీ ఆడియోస్, బహుజన శబ్దం వంటి సంస్థలు జనగామలో ఏర్పాటయి అనేక సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాయి.

## వివిధ రంగాల ప్రముఖులు

**సాహిత్యరంగం నుండి :** పాల్కుర్కి సోమన, బమ్మెర పోతన, పేర్వారం జగన్నాథం, గంగుల శాయిరెడ్డి, వరవర రావు, రంగరాజు కేశవరావు, జి.వై.గిరి, అంపశయ్య నవీన్, కేశిపెద్ది నారాయణరాజు, డాక్టర్ లింగంపల్లి రామచంద్ర, పేర్వారం రాములు, చిటిమల్ల శంకరయ్య, రెడ్డి రత్నాకర్ రెడ్డి, పానుగంటి రామ్మూర్తి, గంగుల సుశీలాదేవి, పల్లె సరస్వతీ మొదలైన సాహితీమూర్తులున్నారు.

కళారంగంలో చుక్కా సత్తయ్య (ఒగ్గుకథ), మసురం పుల్లయ్య (చిత్రలేఖనం), గద్దం సమ్మయ్య (యక్షగానం), పానుగంటి వెంకటకృష్ణయ్య (హార్మోనియం), కడకంటి పాపయ్య (జానపద గేయాలు), కోదాది శ్రీనివాస్ (తెలంగాణ ఉద్యమ పాటలు), వంగా నర్సయ్య (పరిశోధన).

## సాహిత్య చరిత్ర

ఆదికవి **పాల్కురికి సోమన, బమ్మెర పోతన** ఈ ప్రాంతం వారే కావడంతో సాహిత్యచరిత్రలో జనగామ జిల్లా ప్రత్యేకతను సంతరించుకుంది. **డా॥ లింగంపల్లి రామచంద్ర** గారి 'జనగామ జిల్లా సాహిత్య సమావేశాలు - సంక్షిప్త రూపాలు' అనే ముద్రిత గ్రంథం అనేక అంశాలను స్పృశించింది.

గ్రంథాలయ ఉద్యమంలో భాగంగా కొమర్రాజు వేంకట లక్ష్మణరావు 'పోతన' పేరుతో ఒక గ్రంథాలయం స్థాపించారు.

గంగుల శాయిరెడ్డి రచించిన 'కాపుబిడ్డ' ఆవిష్కరణ జరిగింది. వానమామలై వరదాచార్యుల 'పోతన చరిత్రం', డా॥ దాశరథి 'మహాంధ్రోదయం', సి. నారాయణరెడ్డి 'నాగార్జున సాగరం', అనుముల కృష్ణమూర్తి 'సరస్వతీ సాక్షాత్కారం', వేముగంటి 'తిక్కన', ఆవుల లక్ష్మణరావు 'కూనలమ్మ పదాలు' వంటి కావ్యాలు, కావ్య సంపుటులు కృతికర్తలచే గానం చేయబడినాయి.

1971లో జనగామ పట్టణ కేంద్రంలో ప్రెస్టన్ విద్యాలయంలో మహాకవి 'గుర్రం జాషువా సాహిత్య సమాలోచన' జరిగింది. ఈ సమావేశంలో కాళోజీ, అనుముల, లక్ష్మణమూర్తి, సంపత్కుమారాచార్య, సుప్రసన్న, పేర్వారం జగన్నాథం వంటి సాహితీవేత్తలు పాల్గొన్నారు.

డా॥ చిట్టెమల్ల శంకరయ్యగారు, సాహితీ సంపత్, జి.వై.గిరిగారు సాంఘిక సేవా సంస్థలనుంచి సాహిత్య కార్యక్రమాలు అనేకం జరిగాయి. 1995 నుండి డా॥ రాపోలు సత్యనారాయణగారు "సోమనాథం కళాపీఠం" ద్వారా సోమనాథుని సాహితీ వైభవాన్ని చాటుతున్నారు. జనగామ పట్టణ కేంద్రంగా 2003 నుండి రెడ్డి రత్నాకర్ రెడ్డి సాహిత్య రంగంలో కొత్త కదలిక తెచ్చారు. శైలీ, సాంస్కృతిక వేదిక, జనగామ రచయితల సంఘం వంటి సంస్థల కొత్తతరం కవులకు మార్గదర్శకంగా నిలబడినారు.

'తెలంగాణ' సాహిత్య సంస్కృతులకు నెలవుగా ప్రసిద్ధి పొందింది. 'జనగామ జిల్లా' తెలంగాణ సాహిత్యంలో శిఖరాయమానమైనది. **ఆదికవి సోమన** ఈ జిల్లాలోని పాలకుర్తి గ్రామానికి చెందినవాడు కావడం. 'సహజకవి' **బమ్మెర పోతన** బమ్మెర గ్రామానికి వన్నె తెచ్చిన భాగవతకర్త ఈ జిల్లాకే చెందిన కవి కావడం విశేషం.

11వ శతాబ్దిలో కవిత్వాన్ని విప్లవాత్మకమైన దృక్పథంతో వినూత్న ప్రక్రియా వైవిధ్యంతో సృష్టించిన పాల్కురికి సోమనాథుడు తొలికావ్యం - బసవ పురాణం, తొలి శతకం - వృషాధిప శతకం మున్నగు అనేక రచనలు చేసి వీరశైవ సంప్రదాయంలో సాహిత్యాన్ని సామాన్యుని దగ్గరికి తెచ్చాడు. ఆదికవి అయినాడు.

15వ శతాబ్దికి చెందిన పోతన 'సహజ పండితుడు'. భాగవతాన్ని మధురశైలిలో రచించిన భక్తకవి. సమాజ దార్శనికుడు. దేవుడొక్కడే అనే అద్వైత భావాన్ని చాటిన కవి. భోగినీ దండకం, నారాయణశతకం ఈయన ఇతర రచనలు.

తెలంగాణ రాష్ట్ర సాహిత్య చరిత్రలో శిఖరాయమాన మైన భూమిక కల్గిన జనగామ జిల్లా ఈ ఇద్దరి కవుల వలన అగ్రతాంబూలానికి అర్హమైంది.

జనగామ జిల్లా స్వాతంత్ర్యానికి పూర్వంనిజాం ఏలుబడిలో అత్రాఫ్‌బల్దా (హైద్రాబాదు) జిల్లాలో భాగంగా వుండేది. ఖిలాషాపురం ప్రాంతం 'సర్ఫెఖాస్'గా ఉండేది. అంటే ఈ ప్రాంతం నుండి వచ్చే రెవెన్యూ ఆదాయం రాజు కుటుంబ అవసరాలకు కేటాయించబడేది. ఈ కారణంగా ఇక్కడి జమీందారులతో పాటు ఖిలాషాపురం గ్రామం కూడా రాజు దృష్టిలో ప్రత్యేకతను కల్గియుండేది. విద్య, కళలు, సాహిత్యం వృద్ధి చెందడానికి ఇదికూడా ఒక కారణం. 1835-1905 మధ్యకాలంలో జీవించిన పండితకవి, సంగీత విద్వాంసుడు. ప్రబంధాలతో పాటు యక్షగానం, కీర్తనలు, శతకాలు రచించిన **రంగారావు కేశవరావు** జనగామ జిల్లా సాహిత్య చరిత్రలో చరితార్థుడు. ఈయన రచించిన ప్రబంధాలు "ఇంద్రద్ర్యుమ్నీయం", "విక్రమాదిత్య విజయం", కీర్తనలు 'ఆధ్యాత్మరామాయణం', 'యక్షగానం', 'హనుమ ద్విజయం', ఇంకా 'పట్టాభిరామ శతకం', 'కృష్ణా! రాధికా నాయకా' శతకం, 'దాశరథీ కరుణా సుధానిధీ!' శతకం మున్నగునవే కాక గణితశాస్త్ర సంబంధములైన పద్యరచనలు, చిత్రలేఖనములు కూడా కలవు. నాటి నవాబు సిరాజుద్దౌలాను మెప్పించి 'కవి శిరోమణి' బిరుదును పొందిన ఘనుడీయన.

జనగామ జిల్లాలో గొప్ప పద్యకవి **గంగుల శాయిరెడ్డి.** ఈయన స్వగ్రామం లింగాల ఘనపురం మండలం జీడికల్లు గ్రామం. 'రైతు'ను నాయకునిగా చేసి కావ్యాలు రాసిన గొప్పకవి.

రఘునాథపల్లి మండలం ఖిలాషాపురంలో జన్మించిన కవి, విమర్శకుడు, ఆచార్య **పేర్వారం జగన్నాథం.** అధిక్షేప కవిగా, చేతనావర్తకవిగా ప్రసిద్ధుడు. సాగర తీరం, వృషభ పురాణం, గరుడపురాణం ఈయన కావ్యాలు. 'అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు' అనే వ్యాస సంకలనానికి సంపాదకత్వం వహించి తన ప్రతిభను చాటుకున్నారు. తెలుగు నవలా జాతీయోద్యమం, నాదవేదాలు ఇతర రచనలు. **పేర్వారం రాములు** (ఐపిఎస్) కూడా కవి, రచయితగా ప్రసిద్ధుడు.

ఖిలాషాపురం గ్రామానికే చెందిన కవి, నాటక కర్త ఆయుర్వేద భిషక్ **చొల్లేటి నృసింహరామ శర్మ.** వీరి రచనలు 'వంటింటి వైద్యం' మొదలైనవి. ఈ క్రమంలో ఇదే గ్రామానికి చెందిన మరోకవి **చొల్లేటి నృసింహాశర్మ.** 'నా ప్రభూ!' వంటి పద్యరచనలు వీరికి ఎంతో పేరు తెచ్చాయి. వీరు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. ఇంకా ఇదే గ్రామంలో జన్మించిన **పానుగంటి వెంకట కిష్టయ్య, శ్రీభాష్యం శ్రీనివాసా చారి, మధురకవి మల్లయ్య, కావేరి గోపయ్య, జడక నర్సయ్య** గార్లే కాక సాయుధ పోరాట యోధులైన **పెర్మాండ్ల యాదగిరి, గుజ్జుల వీరయ్య** గారలు తమ ఆత్మకథలు రాసుకొని రచయితలుగా ప్రసిద్ధులైనారు.

ఇంకా రామానుజపురం రంగనాథస్వామి, జీయర్ స్వామి, ప్రక్క గ్రామమైన వెల్ది నుండి ప్రసిద్ధులైన **డా. లింగంపల్లి రామచంద్ర** కవి, విమర్శకుడు, చారిత్రక పరిశోధకుడుగా పేరెన్నికగన్న ప్రతిభావంతుడు. ఖిలాషాపురం యొక్క సాహిత్య వారసత్వంగా భావింపబడిన భట్రాజులు, కవిపుంగవులు **కేసిపెద్ది నర్సరాజు,** వారి కుమారులు **నారాయణ రాజు,** ఆశుకవితా శతక కర్తగా లబ్ధప్రతిష్ఠులు. అనంతర కాలంలో **పానుగంటి రామమూర్తి** పద్యకవిగా, వచనకవిగా, శతక కర్తగా రాణిస్తున్న తెలుగు ఉపాధ్యాయులు.

జనగామ మండలానికి చెందిన పెద్దపహాడ్ గ్రామంలో జన్మించినారు **గంగరాజు దామోదరరావు.** వీరు రచించిన 'బాల శతక కథా విపంచిక', 'సిద్ధార్థ ఉత్తమ బాల' సాహిత్య రచనలుగా నిలిచాయి.

వీరి కుమారులు **గంగరాజు శ్రీనివాసరావు** కూడా మంచి పద్యకవి. నర్మెట్టకు చెందిన **గంగుల నారాయణరెడ్డి,** తాటికొండకు చెందిన **సౌమిత్రి ధర్మాచార్యులు,** రఘునాథ

పల్లికి చెందిన **తిరుక్కోవళ్ళూరు మధుసూదన స్వామి,** గుండాల గ్రామవాసి **వెంకన్న** తదితరులు పేరుమోసిన రచయితలు.

దేవరుప్పల మండలం కడవెండికి చెందిన **డా॥ పెద్ది వెంకటయ్య** కవిగా, పరిశోధకుడిగా, కె.యు. ఆచార్యుడుగా సుపరిచితుడు. పాలకుర్తి సాహిత్య సంపద తక్కువేమీ కాదు. **రాపోలు సత్యనారాయణ, మామిళ్ళ సాయిలు, శంకరమంచి శ్యాంప్రసాద్, జిలుకర శ్రీనివాస్, జిలుకర వెంకన్న, ఎలికంటి ప్రసూనశర్మ, గంగు నాగరాజశర్మ** ప్రభృతులు కవులుగా వన్నెకెక్కుతున్నారు.

జనగామ సాహిత్య చరిత్రలో **జి.వై.గిరిది** ఒక ప్రత్యేక స్థానం. వైవిధ్యభరిత సాహిత్య సృజన వీరి సొంతం. కవి, గాయకుడు, ఉద్యమ కారుడీయన. **డా॥ రుద్రశ్రీ** చక్కటి కవి, విశ్రాంత ఉపన్యాసకుడు. **ఏలె బాలరాజు** చక్కటి పద్యకవిగా రచనలు చేస్తున్నారు.

ఇంకా **జి. కృష్ణ, రెడ్డి రత్నాకర్‌రెడ్డి, సోమ రామచంద్ర, బీటుకూరు శేషగిరిరావు, నక్క సురేశ్, పెట్లోజు సోమేశ్వర్,** తరిగొప్పులకు చెందిన **జంగ వీరయ్య,** చిన్నపెండ్యాలకు చెందిన **తిరుపతిరెడ్డి** మొదలైన కవులు జిల్లా సాహిత్యానికి వన్నెలద్దుతున్న కవులు.

జనగామ జిల్లాలో **శ్రీమతి భల్ల సరస్వతి** 'శిశిర ధ్వని' కవితా సంపుటి వీరి రచన. ఇంకా తెలంగాణ ఉద్యమ కవితలు వందకు పైగా వివిధ పత్రికల్లో ప్రచురించబడ్డాయి. ఈమె రిటైర్డ్ ఉపాధ్యాయురాలు. వీరి కూతురు **భల్ల పద్మజా రమణ** కన్నీటి సంతకం అనే కవితా సంపుటితో పాటు వివిధ సాంఘిక సమస్యలపై రాసిన వ్యాసాలు, కవితలు అనేక పత్రికల్లో అచ్చయినాయి. మలిదశ తెలంగాణ ఉద్యమంలో వీరిది ఉన్నతమైన పాత్ర. ప్రస్తుతం వీరు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారిగా జనగామలో పనిచేస్తున్నారు. వీరితో పాటు జనగామలో **జంధ్యాల ఆదిలక్ష్మిగారు** జీవన ప్రభావం నవల, మనసుగీత కవిగా సంపుటి, కాలం చెక్కిలిపై తెలంగాణా కన్నీటిబొట్టు కవితా సంపుటితో పాటు ఇతర రచనలు చేశారు.

**శ్రీమతి గంగరాజు సుశీలాదేవిగారు** కూడా జనగామకు వన్నె తెచ్చిన కవయిత్రి. ఈ వ్యాసంలో పేర్కొన్న కవులే కాక మరెందరో కవులు జనగామ జిల్లాలో ఉన్నారు.

## దర్శనీయ ప్రదేశాలు – పర్యాటరంగం

**సిద్దెంకి గుట్ట :** జనగామ మండలం, యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు మండల సరిహద్దుల్లో సిద్ధుల గుట్ట ఉంది. ఈ గుట్టపై మూడుచోట్ల జైన తీర్థంకర శిల్పాలున్నాయి. అక్కడ శాసనాలు కూడా ఉన్నాయి. గుట్టపై రాష్ట్రకూటుల దేవాలయాలున్నాయి. ప్రధాన దేవాలయం బయట అంచుకు ఉన్న హంసల తోరణం ఆకర్షిస్తుంది. సూర్యుడు చూడని గుండం, మానవ నిర్మిత గుహలు గుట్ట పై భాగాన గంటు చిత్రాలతో వేసిన పాదాలు, గీతల వరుసలు, సింహం చిత్రం ఆకట్టుకుంటాయి.

**మంచం గుట్ట :** రఘునాథపల్లి మండలం గబ్బెట గ్రామంలో ఉంది. దీనిపై ఉన్న గృహ సమాధిని స్థానికులు నరసింహస్వామి శయనించే బంగారు మంచంగా భావిస్తారు. ఈ గృహసమాధి తెలంగాణ రాష్ట్రంలో అరుదైనది.

**ఖిలాషాపూర్ కోట :** రఘునాథపల్లి మండల కేంద్రానికి సమీప గ్రామమే ఖిలాషాపూర్. ఎత్తైన పరుపుబండను కలుపుకొని నాలుగువైపులా ఎత్తైన బురుజులతో ఈ కోట నిర్మించబడింది.

**చీటకోడూరు రిజర్వాయర్ :** జనగామ జిల్లా కేంద్రానికి ఆనుకొని వున్న ఈ రిజర్వాయర్ పొట్టిగుట్టను కలుపుకొని నిర్మించబడింది. ఈ రిజర్వాయర్ రెండవ వైపున నాలుగు గుట్టల నడుమ బూడిద సమాధులు బయటపడ్డాయి. మానవాకృత శిల్పాలున్నాయి.

**గండి రామవరం రిజర్వాయర్ :** నర్మెట, స్టేషన్ ఘనపురం మండల శివార్లలో ఉన్న ఈ రిజర్వాయర్ జనగామ జిల్లా ఊటీగా పేర్కొనబడుతుంది.

**అశ్వారావుపల్లి రిజర్వాయర్ :** అపార జలరాశి, ఎత్తైన గుట్టలు ఆకర్షిస్తాయి. బలపాల గుట్టపై నాలుగు డాల్మన్ సమాధులున్నాయి. రిజర్వాయర్ సమీపంలో 'రడకంబాల' లోని చెలకలోని రెండు నిలువు రాళ్ళను చూడవచ్చు.

**కొన్నె గజగిరి గుట్ట :** ఈ గుట్టపై ఉన్న గుహాలయం, చాముండి, భైరవ శిల్పాలు గుట్టపైన సూర్యుడు చూడని గుండం, గుట్ట పైభాగాన నీటి గుండాలు, గుట్టకంచున ఉన్న మోటబండ, దేవాలయ శిథిల ఆనవాళ్ళు పర్యాటకులను కట్టిపడేస్తాయి.

ఇవే కాక జనగామ జిల్లాలో గుండాల గుట్ట, గోవర్ధన గిరి గుట్ట, పాలకొండ గుట్ట, విడిగొండ త్రికూటాలయం పర్యాటక స్థలాలుగా పేరొందాయి.

## దేవాలయాలు

**కొడవటూరు సిద్ధేశ్వరాలయం :** బచ్చన్నపేట మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కొడవటూరు ప్రముఖ చారిత్రక, ఆధ్యాత్మిక క్షేత్రం. 1693లో మహంతస్వామికి కలలో శివుడు ప్రత్యక్షమై, సిద్ధులగుట్ట గుహలో ఉన్నానని చెప్పి మాయమయ్యాడని ఆలయ పురాణం చెబుతుంది. అప్పటి నుండి ఈ క్షేత్రం వెలుగులోకి వచ్చింది. ఇది గుహాలయం. ఇందులోని శివలింగం ఏటా చింతాకు మందం పెరుగుతుందని నమ్మకం.

**శ్రీ వీరాచల రామచంద్రస్వామి దేవాలయం-జీడికల్:** జనగామ నుండి 13 కి.మీ.దూరంలో లింగాలపురం మండలంలో జీడికల్లు గ్రామముంది. గ్రామంలోని హిడింబ గుట్ట దిగువన ఉన్న బండపై శ్రీరాముడు కాలి బొటనవేలితో ఒక నీటిగుండం ఏర్పరచి సంధ్యావందనం చేసేవాడని స్థల పురాణం చెపుతుంది.

**లేడిబండ :** వెల్మజాల గ్రామంలోని లేడిబండపై రాముడి మోకాలి అచ్చులు, లేడి నడచిన జాడలు కన్పిస్తాయి. నవీన శిలాయుగం నాటి రాతి పనిముట్లు నూరుకోగా ఏర్పడిన గ్రూవ్స్‌ను రాముడి మోకాలి అచ్చులుగా భావిస్తారు. ఈ లేడిబండిపై ఉన్న చిన్న నీటి గుండంలో నిరంతరం నీటి ఊట ఉబికి వస్తుంది. ఈ ఆలయం అనేక మార్పులకు గురైంది.

**సోమేశ్వరాలయం - పాలకుర్తి :** పాలకుర్తి మండల కేంద్రంలోని సోమేశ్వర గుట్టపై సోమేశ్వర లక్ష్మీ నరసింహ స్వామి ఇరుకైన గుహలో కొలువైనాడు. ఘనపురం నుండి 23 కి.మీ. దూరంలో ఉంటుంది. శివ కేశవులు ఒకే కొండపై వెలిసారు. కొండ రెండుగా చీలి ప్రదక్షిణ మార్గం ఏర్పడింది. గుట్టపైకి ఇరుకైన సొరికె నుండి చేరుకోవడం మరిచిపోలేని అనుభూతినిస్తుంది. పైన 'గండదీపం' వెలిగించే ఎత్తైన మిద్దె ఉంటుంది. గుట్ట ముందర చెరువు, చుట్టూ ప్రకృతి రమణీయత భక్తులకు సేద తీరుస్తుంది.

పాల్కురికి సోమన నివాసస్థలం కూడా కావడంతో పాటు పోతన జన్మస్థలం. వాల్మీకి జన్మస్థలంగా భావిస్తున్న వల్మిడిగుట్ట సమీపంలో ఉండటం సాహిత్యాభిమానులను విశేషంగా ఆకర్షిస్తుంది.

**శ్రీ బుగులు వెంకటేశ్వరస్వామి దేవాలయం - చిలుపూర్ :** పద్మావతిదేవిని వివాహమాడడానికి వేంకటేశ్వర స్వామి కుబేరుని వద్ద అప్పు తీసుకుంటాడు. అప్పు తీర్చలేక వడ్డీ మీద వడ్డీ పెరగడంలో గుబులుతో చిలుపూర్ గ్రామంలోని గుట్టపై దాక్కున్నాడని స్థల పురాణం చెబుతుంది. గుట్ట వెనుక నుండి వాగు ప్రవహిస్తుంది. ఆలయంలో సకల సౌకర్యాలు ఉన్నాయి.

ఇంకా జనగామ పట్టణ కేంద్రంలోని చెన్నకేశవాలయం, బాణాపురంలోని వేంకటేశ్వరాలయం, నూతనంగా నిర్మించబడిన బతుకమ్మకుంటలోని దుర్గామాత ఆలయాన్ని భక్తులు ఎక్కువగా దర్శించుకుంటారు.

ఒకప్పుడు జైనులు ఎక్కువగా ఉన్న ప్రాంతం. లోహ కళాఖండాలకు పుట్టినిల్లు పెంబర్తి ఇక్కడే ఉంది. పాల్కురికి సోమన, బమ్మెర పోతనల జన్మస్థలమిది. ఎంతో చారిత్రక, సాహిత్య ప్రాధాన్యం పొందిన జనగామ ఒక సాంస్కృతిక విశేషాల సమాహారం.

# జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిత్రపటం




74 (9)



సమ్మక్క సారలమ్మ అమ్మవారల గద్దెలు


కాళేశ్వరం దేవస్థానం


మంగంపేట జలపాతం


గండ్ల ప్రాజెక్ట్


ఘన్‌పుర దేవస్థానం


ప్రొ. జయశంకర్


చంద్రబోస్

74(b)

# జయశంకర్ భూపాలపల్లి

**రాలు కరుంగజేయు వరరాజస శిల్పుల కేల నుండి రా**
**మాలయ శిల్పవైభవము హాసములొల్కగ దేవళాలలో**
**మేలిమి భూపవల్లి యుపమింపగనౌను కళామతల్లిగా**
**పాలన చేయు లక్నవర వన్యసుశోభలదీరి పృథ్విపై !**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గారి ఆలోచనలో రూపుదిద్దుకున్నదే జిల్లాల పునర్విభజన. ప్రభుత్వ పాలన పటిష్ఠంగా సాగడానికి, సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందడానికి, అంతేకాకుండా అధికార వికేంద్రీకరణ జరిగి ప్రజలకు ఫలితాలు తొందరగా చేరడానికి 10 జిల్లాలుగా వున్న తెలంగాణను 31 జిల్లాలుగా విభజించినారు. ఈ పరంపరలోనే తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ పేరు మీదుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా రాష్ట్ర యవనికపై ఆవిర్భవించింది.

### ఈ పేరెందుకు ?

పూర్వం ఈ జిల్లాలో కె.వి. భూపాలరావు ఒక సామాజిక వేత్త, రెవిన్యూ అధికారి వుండేవారు. వీరు ప్రజలకు సేవ చేయాలనే తపనతో వెనుకబడివున్న తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో అనేక రోడ్లు, మురికి గుంటలు వంటి మౌలిక సదుపాయాలను కల్పించేందుకై నిత్యం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేవారు. అవి సఫలమయ్యేవి. కొన్నాళ్లకు ఆయన సేవకు గుర్తుగా ఆ ప్రాంతానికి అక్కడి ప్రజలు భూపాలపల్లి అని పేరు పెట్టుకున్నారు.

తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక అదే ప్రాంతానికి చెందిన తెలంగాణ వైతాళికుడు, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ (అక్కంపేట, ఆత్మకూరు) పేరును భూపాలపల్లికి ముందు చేర్చి జయశంకర్ భూపాలపల్లి జిల్లాగా మార్చారు.

### భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి

ఈ జిల్లా విస్తీర్ణం 6175 చ.కి.మీ. వైశాల్యాన్ని కలిగి వుంది. ఈ జిల్లాకు తూర్పున ఛత్తీస్‌ఘడ్, ఉత్తరాన మహారాష్ట్ర, పడమర పెద్దపల్లి, వరంగల్ అర్బన్ జిల్లాలు, దక్షిణాన వరంగల్ రూరల్, భద్రాద్రి, కొత్తగూడెం జిల్లాలు సరిహద్దులుగా వున్నాయి.

### సహజ వనరులు

ఈ జిల్లాలో అపారమైన బొగ్గు నిక్షేపాలున్నాయి. చెల్పూరులో జాతీయ విద్యుదుత్పాదనా కేంద్రం, కమలాపూర్‌లో రేయాన్స్ ఫ్యాక్టరీ, ఎడవెల్లి గ్రామంలో పట్టు పరిశ్రమ వుంది. అంతేకాకుండా అనేకమైన భూనిక్షిప్త ఖనిజాలతో పాటు ఇసుక ఇక్కడ బాగా లభ్యమౌతుంది.

### నేలలు

ఈ జిల్లాలో నల్లరేగడి నేలలు, ఎరుపు నేలలు కలిసి వున్నాయి. పంటలు పుష్కలంగా పండుతాయి.

### అడవులు

జిల్లాలో అడవులు 4505.5 చ.కి.మీ. లో విస్తరించి వున్నాయి. జిల్లాలోని మొత్తం భూభాగంలో ఇది 72.96 శాతం వుంటుంది. సామాజిక అడవులను పెంచడానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమం ఇది.

**రెవిన్యూ డివిజన్‌లు - మండలాలు**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భూపాలపల్లి, ములుగు అనే రెండు రెవిన్యూ డివిజన్లు ఉన్నాయి. ఈ రెండు రెవిన్యూ డివిజన్లలో మొత్తం 20 మండలాలున్నాయి.

**భూపాలపల్లి రెవెన్యూ డివిజన్‌లో 11 మండలాలు :**

1. భూపాలపల్లి 2. ఘన్‌పూర్(ములుగు) 3. రేగొండ 4. ముగులపల్లె 5. చిట్యాల 6. టేకుమట్ల 7. మాల్హార్‌రావు 8. కాటారం 9. మహదేవ్‌పూర్ 10. మహా ముత్తారం 11. పలిమెల

**ములుగు రెవెన్యూ డివిజన్‌లో 9 మండలాలు :**

1. ములుగు 2. వెంకటాపూర్ 3. గోవిందరావుపేట 4. తాడ్వాయి 5. ఏటూరు నాగారం 6. కన్నాయి గూడెం 7. మంగపేట 8. వెంకటాపురం 9. వాజేడు.

ఇందులో అనేక రకాల అటవీ ఉత్పత్తులు లభ్యమౌతాయి. అనేక రకాల వృక్ష సంపద నెలకొని వుంది. ఇవి అడవులను ఆధారంగా చేసుకొని బతికే గిరిజనులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఇందులో పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, అడవి పందులు, జింకలు, తోడేళ్ళు, కుందేళ్ళు, కోతులు సంచరిస్తుంటాయి.

**నదులు**

ఈ జిల్లాలో పెద్ద నదులేవీ కూడా లేవు. గోదావరి, మానేరు, చలివాగు, జంపన్నవాగు, మోరంచ వాగు వంటి నదులు, వాగులు ఈ ప్రాంతంలో పారుతూ భూములను సస్యశ్యామలం చేస్తున్నాయి.

**చెరువులు / ప్రాజెక్టులు**

పూర్వపు కాకతీయ ప్రభువులు నిర్మించిన తటాకాలు సముద్రాలనే తలపిస్తాయి. ప్రధానంగా లక్నవరం, రామప్ప, ఘన్‌పూర్ (ములుగు), గుండ్లవాగు ప్రాజెక్టు, భీమ ఘన్‌పూర్, నరసింహ సాగర్ ప్రాజెక్టు, దొమ్మడపల్లి పాలెం ప్రాజెక్టు, బాగిర్తీపేట, మదన్‌పల్లి, జూకారం వంటి ప్రాంతాల్లో నిర్మించిన చెరువులు అపారమైన పంటలను పండించుటలో తోడ్పడుతున్నాయి. ప్రత్యేకంగా చెప్పుకోవల్సిందేమిటంటే కాకతీయుల కాలంలో నిర్మించిన గొలుసుకట్టు చెరువులు అన్నిచోట్లా వున్నట్లే ఈ జిల్లాలోనూ వున్నాయి.వీటి స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 'మిషన్ కాకతీయ' అనే కార్యక్రమాన్ని రూపొందించింది. అంతేకాకుండా వీటిలో మత్స్య సంపదను కూడా పెంచి అపారమైన లాభాలను పొందుతున్నారు. బోగత జలపాతం జిల్లాలోని వాజేడు మండలంలో వుంది. అంతేకాకుండా కాళేశ్వరం (మేడిగడ్డ), దేవాదుల ప్రాజెక్టులు ఈ జిల్లాలోనే నిర్మిస్తున్నారు. ఈ నీరు ఈ జిల్లా వరకే కాకుండా పొరుగున వున్న జిల్లాలకు కూడా అందివ్వబడుతోంది.

**జనాభా :** జిల్లా మొత్తం జనాభా 7,11,434 కాగా, పురుషులు 3,54,203, స్త్రీలు 3,57,231. జిల్లాలోని జిల్లాలోని గ్రామీణ జనాభా 92.43% మంది, పట్టణ జనాభా 7.57%. జన సాంద్రత 115 / కి.మీ. లింగనిష్పత్తి 1000 : 1009.

**అక్షరాస్యత :** జిల్లా అక్షరాస్యత 60.33%. ఇది తెలంగాణ అక్షరాస్యత కన్నా 6% తక్కువ. పురుషుల అక్షరాస్యత 70.05%, స్త్రీల అక్షరాస్యత 50.76%

**జిల్లా చరిత్ర**

క్రీ.శ. 12-14 కాలంలో కాకతీయుల పాలించిన ప్రాంతాలకు ఓరుగల్లు రాజధానిగా వుంది. కాకతీయ రాజ్య స్థాపకుడు కాకర్త్య గుండన్న కాగా, చివరి రాజైన ప్రతాప రుద్రునితో వీరి పాలన అంతమైంది. కాకతీయుల తర్వాత వున్న ముసునూరి నాయకులు, రేచర్ల నాయకులు, బహమనీ సుల్తానులు, గోల్కొండను పాలించిన దక్కను సుల్తానుల పాలనలోకి ఈ ప్రాంతం వచ్చింది.

మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు గోల్కొండను 1687లో ఆక్రమించినపుడు ఈ ప్రాంతమూ మొఘల్ సామ్రాజ్యంలో భాగమైంది. 1724 లో మొఘల్ సామ్రాజ్యంలోని దక్షిణ ప్రాంతం విడిపోయి, హైదరాబాదు రాజ్యంగా అవతరించింది. ఈ హైదరాబాదు రాజ్యంలోనే వరంగల్ ప్రాంతమూ

అంతర్భాగమైంది. వరంగల్ జిల్లాను పరిపాలించిన గొప్ప రాజవంశం కాకతీయ వంశం. మొదటి బేతరాజు కుమారుడైన ప్రోలరాజు క్రీ.శ. 1050-1080. పశ్చిమ చాళుక్య ప్రభువు సోమేశ్వరుని వద్ద ఈ ప్రాంతాన్ని పొందినట్లు కాజీపేట శాసనం తెలుపుతుంది.

ప్రోలరాజు తర్వాత రుద్రదేవ మహారాజు రాజైనాడు. ఇతని తరువాత గణపతిదేవుడు రాజైనాడు. కాకతీయ రాజులలో ఇతడు ప్రసిద్ధుడు. తిక్కన ఇతని ఆస్థానాన్ని దర్శించి, మహాభారతం వినిపించాడు. మనుమసిద్ధి కోల్పోయిన రాజ్యాన్ని తిరిగి గణపతిదేవ చక్రవర్తి సహాయంతో పొందగలిగాడు.

ఇతని తర్వాత అతని కుమార్తె రుద్రమదేవి కాకతీయ సామ్రాజ్య సింహాసనాన్ని అధిష్టించింది. ఇటలీ దేశస్థుడైన మార్కోపోలో ఈ కాలంలోనే ఆంధ్రదేశంలో పర్యటించి రుద్రమదేవి పాలన ప్రజానురంజకంగా ఉందని ప్రశంసించాడు. కాకతీయ రాజులలో చివరి రాజు రెండవ ప్రతాప రుద్రుడు. ఇతని కాలంలోనే కాకతీయ సామ్రాజ్యం పతనమైంది. ఘియాజుద్దీన్ తుగ్లక్ వరంగల్‌పై దండెత్తి 1323లో ప్రతాపరుద్రుణ్ణి బందీగా పట్టుకున్నాడు. అతణ్ణి ఢిల్లీకి తీసుకెళ్లుతుండగా నర్మదా నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

కాకతీయుల అనంతరం ఈ ప్రాంతం పద్మనాయక రాజుల పాలనలోకి వెళ్లింది. వీరు కాకతీయుల సామంతులు. తురుష్క దండయాత్రలను ఎదుర్కొనడానికి దాదాపు 77 మంది నాయకులు ఒక్కటిగా ఏర్పడి, హిందూ రాజ్యాన్ని స్థాపించడానికి ప్రోలయ నాయకుని నాయకత్వంలో ఉద్యమించారు. వరంగల్ ప్రాంతాన్ని కాపయనాయకుడు ఆక్రమించి, పరిపాలించాడు.

పద్మనాయక రాజుల అనంతరం ఓరుగల్లు బహమనీ సుల్తానుల పాలనలోకి, తదనంతరం గోల్కొండను పాలించిన కుతుబ్‌షాహీల పాలనలోకి వచ్చింది. 1687 లో గోల్కొండను ఔరంగజేబు జయించడంతో ఈ ప్రాంతం మొఘలుల పాలనలోకి వచ్చింది. ఔరంగజేబు మరణం తర్వాత మొఘల్ సామ్రాజ్యం క్షీణించడం మొదలైంది. ఆ సమయంలో దక్కన్

**మున్సిపాలిటీ :** భూపాలపల్లి
**రెవిన్యూ గ్రామాలు :** భూపాలపల్లి, ములుగు
**పోలీసు హెడ్‌క్వార్టర్స్ :** 559
**గ్రామపంచాయితీలు :** 274
**పార్లమెంటు నియోజకవర్గం :**
**అసెంబ్లీ నియోజకవర్గాలు :** భూపాలపల్లి, ములుగు
**పట్టణాలు :** ఈ జిల్లాలో మూడు పట్టణాలున్నాయి.
1. భూపాలపల్లి 2. ములుగు 3. చిట్యాల

సుబేదారుగా వున్న నిజాముల్ ముల్క్ 1724 లో స్వతంత్రించి అసఫ్‌జాహీ రాజ్యాన్ని స్థాపించాడు.

1948 లో వరంగల్‌తో సహా హైదరాబాదు భారత దేశంలో కలిసిపోయింది. 1956 లో ఆంధ్రప్రదేశ్‌లో వుండగా తెలంగాణ స్వరాష్ట్రమైనాక ఈ ప్రాంతం వరంగల్‌గా వున్నది. నాలుగు జిల్లాలుగా విభజింపబడిన పూర్వపు వరంగల్ జిల్లాలో ప్రస్తుత జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఒకటి.

**సంస్కృతి**

సంస్కృతిపరంగా విశ్లేషిస్తే ఈ జిల్లాలో హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాల ప్రజలు సోదరభావంతో సహ జీవనం సాగిస్తున్నారు. హిందువులు బతుకమ్మ ఆటలు, బోనాలు, వన భోజనాల వంటివి సమిష్టిగా నిర్వహిస్తారు. ప్రతి ఊరికి ఒక ఆంజనేయ గుడి, పోచమ్మ గుడి, ఊరి మధ్యలో బొడ్రాయిలు వుంటాయి. గొల్ల కురుమలు బీరన్న బోనాలు చేస్తారు. గీత పనివారలు ఎల్లమ్మకు పట్నాలు వేస్తారు. ఊరి చెరువు గట్టుకు కట్ట మైసమ్మను ఆరాధిస్తారు. హోళీ పండుగ నాడు రంగులు చల్లుకోవడం, జాజిరి ఆటలు, కాముడి పాటలతో సంబరాలు చేస్తారు. శారదకాండ్రు, పెద్దమ్మలోళ్లు, బుడుబుక్కలోళ్లు, కాటి పాపల వాండ్లు, పంబాల వాండ్లు, మిత్తుల అయన వార్లు, చిందు బాగోతాలు, గంగిరెద్దుల వాండ్లు వంటి సంచార జాతుల సంస్కృతు లుంటాయి. ముస్లింలు జరుపుకునే పీర్ల పండుగ ఉత్సవాల్లో, క్రిస్టియన్ మతాల వారు జరుపుకునే క్రిస్మస్ ఉత్సవాల్లో హిందువులు

సైతం తమ భాగస్వామ్యాన్ని పంచుకుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో అన్ని కులాల వారు కలిసిమెలిసి జీవిస్తారు. ఏటేటా జరిగే జాతర ఉత్సవాల్లో ఎడ్లబండ్లను చక్కటి అలంకరణలతో తిప్పుతారు. గిరిజన గూడాల్లో వస్తు మార్పిడి విధానం ఇంకా ఇక్కడ నడుస్తోంది. ముఖ్యంగా లంబాడీ వనితలు ప్రత్యేక వేషధారణతో వుంటారు.

**జాతరలు**

ముఖ్యంగా ఈ ప్రాంతంలో రెండేళ్లకోసారి జరిగే మేడారం జాతర అతి పెద్దది. ఈ జాతర కేవలం మేడారంలో మాత్రమే కాక వెంచరామ, మొగుళ్ళపల్లి, మాల్కలపల్లి వంటి అనేక ప్రాంతాల్లో పిల్ల జాతరలు జరుపుతారు. కొడవటంచ, ముక్కిడి పోచమ్మ, గట్టమ్మ, బుడుగులోని వంటి జాతర్లు, శివాలయాల్లో జరిగే శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటారు. జాతర సందర్భాల్లో గొర్రెలు, మేకలు, కోళ్లు వంటివి బలులిస్తారు. ఎక్కువ మంది జనం మధు మాంసాలు భక్షిస్తూ సంతోష పడతారు.

**సాహిత్య చరిత్ర**

సాహిత్యపరంగా ఈ జిల్లా వెనుకబడి ఉన్నట్లే లెక్క. అందిన సమాచారం ప్రకారం **బొమ్మినేని రాజకవి,**(అసలు పేరు రాజిరెడ్డి), వెంకటాపూర్ (ములుగు) గ్రామానికి చెందినవాడు. అనేక భజన కీర్తనలు, మంగళహారతులు, పద్యాలు రాశారు. **మందల మల్లారెడ్డి** ములుగు ప్రాంతంలోని నల్లగుంట గ్రామం వాసి, ఈయన వృత్తిరీత్యా ఉపాధ్యాయుని గా వుండి తెలుగు భాషా బోధన ఎట్లా చేయాలో రాశాడు. ప్రసిద్ధ రామప్ప దేవాలయంపై ఒక పుస్తకాన్ని వెలువరించాడు. దేవాలయంలోని అతి సూక్ష్మమైన విషయాలను, శిల్ప నైపుణ్యాలను, దేవాలయ చరిత్రను ప్రపంచానికందించాడు. ఆ పుస్తకం ఎందరినో మెప్పించింది.

**దహెగం సాంబమూర్తి గారు** మహదేవపూర్ నివాసి. ఆయన గొప్ప విద్యావేత్త. బి.ఇడి కళాశాలలో ఉపన్యాసకుడిగా పనిచేశారు. తెలుగు భాషపై, సాహిత్యంపై విశేషమైన పట్టు గలవారు. బోధనా పద్ధతులపై విశేష కృషిచేసి సాధికారికంగా పుస్తకాలను ప్రచురించారు. తెలుగు సాహిత్యాన్నంతా ఔపోసన పట్టి విలువైన గ్రంథాల్ని అనేకంగా రాశారు. పత్రికా వ్యాసాల్ని అనేకం రాశారు.

**చంద్రబోస్** అనే సినీ కవి ఈ జిల్లాలోని చల్లగరిగె వాసి. పసందైన ఎన్నో సినిమా పాటల్ని రాసి లక్షలాది మందిని మెప్పించిన, మెప్పిస్తున్న కవి. ప్రస్తుతం సినీ జగత్తులో పాటల రచయితగా వెలిగిపోతున్నాడు. 'నా ఆటోగ్రాఫ్ స్వీట్ మెమోరీస్' అనే సినిమాలో వీరు రాసిన 'మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెబుతుంది' అనే పాట నేటికీ అనేక సంస్థల్లో ప్రార్థనా గేయంగా వుంది. తాళ్లపల్లి యాదగిరి గౌడ్ ములుగు ఘన్‌పూర్ వాసి. ఈయన అనేక గ్రంథాల్ని రాశారు. సినిమా స్క్రిప్టులు, నాటకాలు, సాహిత్య వ్యాసాలు, సామాజిక వ్యాసాలు రాశాడు. ప్రస్తుతం పాత్రికేయ వృత్తిలో ఉంటున్నారు. నటుడు కూడా.

ఇంకా ఈ జిల్లాలో **కొలుగూరి రాజేశ్వరరావు, ఏదెల్లి సమ్మయ్య, కామిడి సతీష్‌రెడ్డి, డా. సముద్రాల శ్రీనివాసాచార్య, డా. రాచర్ల గణపతి, రామలింగం, మాడుగుల నారాయణ మూర్తి, మురళీధర శర్మ, భాస్కర శర్మ** వంటి వారు రచనా వ్యాసంగాలు చేస్తున్నారు. బొగ్గుగని కార్మిక నాయకుడు **మోటపలుకుల రమేష్** గొప్ప పాటల రచయిత. ఈయన పాటలు రాష్ట్రంలో కొన్నాళ్లు మార్మోగాయి. **మిట్టపల్లి సురేందర్, రేలా విజయ్, వరంగల్ శ్రీనివాసులు** అత్యుత్తమ ఉద్యమ గేయాల్ని, మానవతా గేయాల్ని రాశారు. ములుగు గ్రామానికి చెందిన **తిరునగరి కిష్టయ్య** మంచి సంప్రదాయ కవిగా పేరొందారు. ప్రముఖ విప్లవకవి **జెట్టి సీతారాం** పంతులు ఈ నేలపై నడయాడారు.

**వివిధ రంగాల ప్రముఖులు**

ప్రస్తుత తెలంగాణ శాసనసభా స్పీకర్‌గా ఉన్న మధుసూదనాచారి ఈ జిల్లాకు చెందినవారే. టీఆర్ఎస్ ప్రారంభమైనప్పటి నుంచి తెలంగాణ ఏర్పడే వరకు కేసీఆర్‌కు వెనకుండి అన్నిరకాలుగా గట్టి సహాయ సహకారాలు అందించారు. వీరితో పాటు దుద్దిళ్ల శ్రీపాదరావు, అజ్మీరా చందూలాల్ (ప్రస్తుతం గిరిజన మంత్రి), విజయ రామారావులు వున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రభుత్వ

విప్‌గా పనిచేసిన గండ్ర వెంకట రమణారెడ్డి కూడా ఈ జిల్లావారే. వీరితోపాటు ఎస్. రాజేశ్వర్‌రావు, సంతోష్ చక్రవర్తి, రౌతు నరసింహయ్య, పోడెం వీరయ్య, శివాజీ, గరికపాటి మోహన్‌రావు, ప్రస్తుతం సీతారాం నాయక్ ఎంపీగా వ్యవహరిస్తున్నారు. ములుగు ప్రాంతానికి చెందిన జంగాల పల్లిలో సివిల్ సర్వీసులో పనిచేసిన ఛాయ, రతన్ ఇద్దరూ ఈ జిల్లావారే. భూపాలపల్లి సమీపంలోని కమలాపూర్‌లో సివిల్ సర్వీసులో పనిచేస్తున్న రామ్‌లక్ష్మణ్, ఏటూరు నాగారానికి చెందిన విజయరామారావు గతంలో సీబీఐ డైరెక్టరుగా పనిచేశారు. అంతేకాకుండా టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా కూడా సేవలందించారు. ప్రస్తుతం వీరు టీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు.

## దర్శనీయ ప్రదేశాలు (పర్యాటకం)

ఈ జిల్లాలోని చారిత్రక ప్రదేశాల విషయానికొస్తే రేగొండ మండలంలో గల పాండవుల గుట్ట అతి పురాతన మైంది. ఈ గుట్టలపై సువిశాలమైన చదునుగల ప్రదేశం ఉండింది. ఇక్కడి గుహల్లో మానవులు సంచరించిన ఆనవాళ్లున్నాయి. వివిధ ఆకృతులలో, రంగులతో చిత్రాలు ఇక్కడ చిత్రించబడ్డాయి. సమావేశపు మందిరాలు, కుంతీదేవి మడుగు వంటి నిదర్శనాలున్నాయి. ఇక్కడ పాండవులు అజ్ఞాతవాస కాలంలో నివసించారని ప్రతీతి. ప్రకృతి సిద్ధమైన సుందర దృశ్యాలు గల ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం వారు చేపడితే మంచి పర్యాటక కేంద్రంగా మారుతుంది. ఈ ప్రాంతంలోనే వేంకటేశ్వర స్వామి సతీసమేతంగా బుగులుతో వచ్చి మజిలీ చేసినట్లు చెబుతారు. ఇరుకైన సొరంగంలో స్వామి వారి చిత్రాలున్నాయి. ప్రతి సంవత్సరం ఇక్కడ బుగులోని జాతర నిర్వహిస్తారు.

మహదేవపూర్ మండలంలోని కాటారం నుంచి వెళితే మహదేవగిరిలో ప్రతాపగిరి గుట్టల సముదాయం వుంది. అక్కడ గొంతెమ్మ బిలంతో అనేక ఆనవాళ్లున్నాయి. పాండవులు ఈ గుట్టపై సంచరించారని చెబుతారు. ఇదే ప్రాంతంలోని అంబటిపల్లిలో కాకతీయులు నిర్మించిన శివాలయం సుందరంగా వుంటుంది. ఇప్పుడు శిథిలావస్థలో వున్న ఈ దైవ మందిరం ఒకప్పుడు వైభవోపేతంగా ఉండేదట. మహాదేవపూర్‌లో మహాదేవుని గుడితో పాటు మందరగిరి వేంకటేశ్వర స్వామి వారి గుడి వుంది. మాజీ భారత ప్రధాని పి.వి.నర్సింహారావు తనకు సమస్యలు ఎదురైనపుడు ఈ దేవాలయానికే వచ్చి అర్చించేవారని చెబుతారు. ఈ ప్రాంతంలోనే దట్టమైన అడవిలో గోదావరిపై ఇచ్చంపల్లి వద్ద ఆనకట్ట నిర్మించాలని ఆంగ్లేయులు తలపెట్టారు. రవాణా సౌకర్యం లేమి ఒకవైపు అయితే, అక్కడున్న దోమలు, ఇతర క్రిమీ కీటకాల బారిన పడి ఇంజినీర్లు మృతిచెందారు. ఆ ప్రాజెక్టు కడితే ధవళేశ్వరం ఆనకట్టను మించి వుండేదని అంటారు. ఇప్పటికీ ఆ ఇంజినీర్ల సమాధులు వారి త్యాగాలకు ప్రతిబింబాలుగా నిలుస్తున్నాయి. వేసవి కాలంలో ఔత్సాహికు లైన పర్యాటకులు సందర్శించడానికి వెళతారు.

వాజేడు మండలంతో ప్రకృతి సిద్ధంగా యేర్పడిన జలపాతం చూపరులను ఆకట్టుకుంటుంది. రోజుకు వేలాదిగా జనం ఇక్కడికి వచ్చి ఆనందపడుతుంటారు. గుట్టలపై నుంచి ప్రవహించే నీటి ప్రవాహాలు చూస్తుంటే హృదయం పరవళ్ళు తొక్కుతుంది. తెలంగాణా నయాగారాగా పిలువబడుతున్న ఈ జలపాతం ప్రభుత్వ అటవీశాఖ ఆధీనంలో వుంది. ఘన్‌పూర్ మండలంలోని మైలారం వద్ద నల్లగుట్టల్లో ఘనమైన సొరంగాలున్నాయి. ఇక్కడ ఆదిమానవులు సంచరించిన ఆనవాళ్ళున్నాయంటారు.

## దేవాలయాలు

**కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం :** కాళేశ్వర క్షేత్రం సుప్రసిద్ధమైంది. ఇక్కడ పవిత్ర గోదావరితో ప్రాణహిత సంగమిస్తుంది. కాబట్టి దీన్ని త్రివేణీ సంగమం అని కూడా అంటారు. ఈ పుణ్య క్షేత్రంలో ఒకే పానవట్టంపై శివుడు, యముడు కొలువై వుండటం ఇక్కడి ప్రత్యేకత. శివుడి గూర్చి యముడు ఘోర తపస్సు చేయగా, ఆ భోళాశంకరుడు తన ప్రక్కనే స్థానాన్నివ్వగా, ఒకే పానవట్టంపై ఇద్దరు కొలువున్నారనేది ప్రతీతి. ఇక్కడ దర్శనం చేసుకుంటే నరక లోక ప్రాప్తి ఉండదనేది భక్తుల నమ్మకం. వేలాదిమంది భక్తులు ప్రతిరోజు తమ పెద్దల అస్థికలను ఇక్కడి గోదావరిలో కలుపుతుంటారు.

**రామప్ప దేవాలయం :** కళలకు కాణాచి రామప్ప దేవాలయం. ఇది వెంకటాపూర్ మండలంలో గల పాలంపేటలో వుంది. ప్రసిద్ధ రామప్ప తటాకం చేరువలోనే ఈ దేవాలయం వుంది. వేలాదిగా పర్యాటకులు దేశ విదేశాల్లో నుంచి ఇక్కడికి చేరుకొని ఆనందిస్తారు. ఇక్కడి దేవాలయ శిల్పకళ అద్భుతం. ఎందరో మహాకవులు ఈ శిల్పాల్ని చూసి రసరమ్య కావ్యాలను రచించారు. ఇక్కడి దేవాలయం ద్వారంపై చెక్కబడిన నాట్య ప్రతిమల ఆధారంగా నటరాజ రామకృష్ణ పేరిణి నృత్యాన్ని రూపొందించారు. ఈ దేవాలయ చుట్టూరా వివిధ భంగిమ లలో అతిలోక సుందరమైన సాల భంజికలు పన్నెండున్నాయి. గుడి ఆవరణలో వర్ణించతరంగాని విధంగా స్తంభాలు, గుడిపై కప్పు భాగాన పురాణేతిహాసాలకు సంబంధించిన శిల్పాలు, సప్త స్వరాలు మోగించే చిరు స్తంభాలుంటాయి. అంతే కాకుండా ఆలయంపై పేర్చిన నీటిపై తేలియాడే ఇటుకలుండటం ఇక్కడి ప్రత్యేకత.

**కోటగుళ్లు ఆలయం** : ఘనపురం కోటగుళ్లు ఆలయాల సముదాయం. ప్రభుత్వం పట్టించుకోక, స్థానికుల చొరవ కరువై శిథిలావస్థకు చేరాయి. అద్భుత శిల్ప సంపద ఇక్కడ కానవస్తుంది. రామప్ప మరియు ఘనపురం కోటగుళ్లు తురుష్కుల దండయాత్రల వల్ల శిల్ప సంపద నాశనమైంది.

**లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం (మంగపేట) :** ఈ దేవాలయం పూర్తిగా ప్రకృతి ఒడిలోనే వుంటుంది. ఆకాశాన్నంటే గుట్టలు ఆ గుట్టల్లో వివిధ రకాలైన ఔషధ వృక్షాలు వుంటాయి. పూర్తిగా ఊరికి దూరంగా ఉంటుంది. ఈ క్షేత్రానికి వెళుతుంటే గోదారమ్మ తోడుగా వస్తుందా అన్న చందంగా వుంటుంది. పెద్ద గుట్టపై వెలసిన నృసింహుడు కలలో కనబడి గుట్టను తొలిస్తే నేను బయటికి వస్తానన్నాడట. వారు తెల్లవారున చెప్పిన చోటనే తవ్వుతుండగా అనుకోకుండా గునపం స్వామి వారి నాభిపై పడిందట. విగ్రహం ఎత్తుగా, అందంగా వుంటుంది. విగ్రహాన్ని తాకితే ఇప్పటికీ నాభి ద్వారా ఏదో ఒక జిగటు పదార్థం బయటికి వస్తుంది. విగ్రహం రాతి విగ్రహమే అయినప్పటికీ శరీర స్పర్శను పోలి వుంటుంది. మరో విశేషమేమిటంటే సంవత్సరంలో కొంతకాలం స్వామివారి ఎదపై వెంట్రుకలు మొలుస్తాయని చెబుతారు. ఆ వెంట్రుకల్ని చిన్న పిల్లలకి తాయత్తులో కడితే ఏ బాలారిష్టాలుండవని నమ్మకం. ఇక్కడ మరో విశేషమేమిటంటే ఏ ఋతువులోనైనా గుట్టల పైనుంచి నీటిధార ప్రవహిస్తుంది. ఈ నీళ్లు చాలా స్వచ్ఛతతో, రుచిగా వుంటాయి.

**నైన్‌పాక దేవాలయం :** ఇది చిట్యాల మండలంలో వుంటుంది. ఇక్కడ పూర్వీకులు ఏ కాలం వారో తెలియదు కానీ ఇది ఒక ప్రసిద్ధ దేవాలయంగా పేరుగాంచింది. ఈ ఆలయానికి నలుదిశలా ద్వారాలు, ఆ విగ్రహ మూర్తికి నాలుగు ముఖాలున్నాయి. ఇటువంటి ఆలయం మనదేశంలో మరెక్కడా లేదు. నేపాల్‌లో పశుపతినాథ దేవాలయం వలెనే ఈ దేవాలయం ఉందంటారు. అతి పురాతన ఈ దేవాలయాన్ని ఇటీవల పునరుద్ధరించే ప్రయత్నాలు ప్రభుత్వం పక్షాన జరుగుతున్నట్లు తెలుస్తుంది.

**కొడవటంచ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం :** ఇది రేగొండ మండలం కొడవటంచలో వుంది. హోలీ పండుగ సందర్భంగా జరిగే ఈ జాతరలో వేలాది ఎడ్లబండ్లు ప్రభలతో అలంకరించుకొని వస్తాయి. మోటారు వాహనాలతో జనం సరేసరి .చాలా ఉత్సాహపూరిత వాతావరణంలో ఇక్కడ జాతర జరుగుతుంది. మతి స్థిమితం కోల్పోయిన వారు ఇక్కడ కొన్నాళ్లు నిద్రిస్తే బాగుపడతారు అని నానుడి.

తెలంగాణ ఉద్యమం రూపశిల్పి ప్రొఫెసర్ జయశంకర్ గారు పేరిట ఏర్పడిన ఈ జిల్లాలో బొగ్గు గనులు, అటవీప్రాంతం అధికం. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సమ్మక్క సారక్క జాతర జరిగే ఈ జిల్లా అపురూప సాంస్కృతిక సంపదతో అలరారుతున్నది.

# జోగులాంబ గద్వాల జిల్లా చిత్రపటం




80 (9)



మల్దకల్ వెంకటేశ్వరస్వామి దేవస్థానం




జోగులాంబ దేవస్థానం




గద్వాల్ కోట




జూరాల ప్రాజెక్ట్



రాజబహద్దూరు
వెంకటరామిరెడ్డి



సురవరం ప్రతాప్ రెడ్డి



గడియారం రామకృష్ణశర్మ

80(b)

# జోగులాంబ గద్వాల

గద్వాలన్ విలసిల్లె వాఙ్మయము ధీగర్వోద్ధతౌన్నత్యమున్
విద్వత్కల్పులు జల్పముల్ విరియగా వేదాది శాస్త్రమ్ములున్
సద్వాసమ్ముల నిల్చివెల్గినవి విశ్వాలంపురారామముల్
చిద్వృద్ధిన్ విలసిల్ల జోగులకృపాశ్రీమంతమై భాసిలన్ !

**అ**ష్టాదశ శక్తిపీఠాల్లో ఐదవదైన జోగులాంబ శక్తిపీఠం అలంపూర్‌లో కొలువై ఉన్నది.

నూతనంగా ఏర్పడిన జోగులాంబ గద్వాల జిల్లా విస్తీర్ణం 2,928 చ.కి.మీ. జనాభా మొత్తం 6,64,971. గద్వాల జిల్లా చారిత్రకంగా పేర్గాంచింది. తెలంగాణ, రాయలసీమ, కర్ణాటక సంస్కృతి, సంప్రదాయాలు కలగలిసిన జిల్లాగా పేరొందింది. కృష్ణా, తుంగభద్ర నదీ పరివాహక ప్రాంతంలో విస్తరించి నడిగడ్డగా పిలువబడుతున్నది. ఇక్కడి చేనేత చీరలు ప్రపంచ ప్రఖ్యాతి గాంచినవి. చేనేత చీరలు అనగానే మనకు వెంటనే గుర్తుకు వచ్చే ప్రాంతం గద్వాల.

**ఈ పేరెందుకు?**

గద్వాల సంస్థానాధీశులు పాకనాటిరెడ్లు. వీరి ఇంటి పేరు ముష్టిపల్లి వారు. వీరు అనేక యుద్ధాలు చేసి తమ రాజ్యాన్ని విస్తరించుకున్నారు. పూడూరును చాళుక్యులు పాలించగా, చాళుక్యులకు, పల్లవులకు జరిగిన యుద్ధంలో పెదసోమ భూపాలుడు గద, వాలు అనే ఆయుధాలను ప్రయోగించడంతో ఈ ప్రాంతానికి (గదంవాల) గద్వాల అనే పేరు వచ్చిందని ప్రతీతి. అలాగే గద్వాల పేరు రావడానికి మరో కథ వాడుకలో ఉంది. పెద సోమ భూపాలుడు తన రాజ్యవిస్తరణ కోసం ప్రయత్నిస్తుండగా ఎక్కడ గద్ద వాలుతుందో అక్కడ కోటని నిర్మించాలని చెన్నకేశవ స్వామి కలలో కన్పించి చెప్పాడు. గుర్రం మీద బయల్దేరి చూడగా ఆ గద్ద వాలిన చోటనే కోటను నిర్మించాడు. అదే గద్వాల.

**భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి**

**చెరువులు-నదులు - ప్రాజెక్టులు :** కృష్ణానది పైన నిర్మించిన జూరాల ప్రాజెక్టు ఈ జిల్లాలోనే ఉన్నది. ఇది తెలంగాణలోనే మొట్టమొదటి బహుళార్థ సాధక ప్రాజెక్టు. గద్వాల జిల్లాలోని ఈ ప్రాజెక్టు ధరూరు మండలంలో ఉంది. నెట్టెంపాడు ప్రాజెక్టు కూడా ఈ జిల్లాలోనే ఉంది. జూరాల జల విద్యుత్ కేంద్రంలో ప్రతి సంవత్సరం 200 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తవుతున్నది. మిషన్ కాకతీయ ఫేజ్-1 లో 273 చెరువులు, ఫేజ్-2 లో 93 చెరువులు బాగు చేశారు.

**అడవులు :** జిల్లాలో 6.79 చ.కి.మీలలో అడవుల విస్తీర్ణం ఉంది. ఇది జిల్లా మొత్తం భూభాగంలో 0.23 శాతం మాత్రమే. సామాజిక అడవులను పెంచడానికి ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించింది. దీనికై 51 నర్సరీలను ప్రారంభించారు.

**జనాభా :** 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ జిల్లా జనాభా 6,09,990, కాగా పురుషుల జనాభా 3,09,6274, స్త్రీల జనాభా 3,00, 716. దీనిలో గ్రామీణ జనాభా శాతం 89.64%, పట్టణ జనాభా శాతం 10.36%. ఈ జిల్లా జన సాంద్రత 208. లింగ నిష్పత్తి 1000 : 972.

**రెవెన్యూ డివిజన్లు - మండలాలు**

గద్వాల జిల్లాలో రెండవ పెద్ద పట్టణం అలంపూర్. జిల్లాలో రెవెన్యూ డివిజన్ గద్వాల మాత్రమే.

**గద్వాల రెవెన్యూడివిజన్‌లో మొత్తం 13 మండలాలు:**

1. గద్వాల 2. మల్దకల్ 3. ధరూర్ 4. గట్టు 5. నందిన్నె 6. ఐజ 7. ఇటిక్యాల 8. మానవపాడు 9.వడ్డేపల్లి, 10. రాజోలి 11. మాగనూరు 12. కృష్ణ 13.మక్తల్

**అక్షరాస్యత :** అక్షరాస్యతా శాతం 49.87%. ఇది తెలంగాణ రాష్ట్ర సగటు అక్షరాస్యతా శాతం కన్నా 16% తక్కువ. పురుషుల అక్షరాస్యత 60.05%, స్త్రీల అక్షరాస్యత 39.48%.

**జిల్లా చరిత్ర**

కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య ఉండే ప్రాంతాన్ని నడిగడ్డగా పిలుస్తారు. నడిగడ్డ నామాంతరం క్రమేణ గద్వాల సంస్థానంగా రూపాంతరం సంతరించుకుంది. నిజాం సామ్రాజ్యం భారత్‌లో విలీనం అయ్యేనాటికి గద్వాల సంస్థానం తూర్పున కృష్ణానది తీరం వరకు, దక్షిణాన తుంగభద్ర నదీతీరం వరకు, పడమర ప్రస్తుత కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా శివార్ల వరకు, ఉత్తర దిశలో గద్వాల ఉత్తర భాగం నుంచి తూర్పునకు ప్రవహిస్తున్న కృష్ణానది వరకు గద్వాల సంస్థానం విస్తరించి ఉంది. జిల్లాలోనే అతిపెద్ద వైశాల్యం కలిగిన సంస్థానంగా వెలుగొందింది.

1663 నుంచి 1949 వరకు సుమారు 286 సంవత్సరాల చరిత్ర కలిగిన గద్వాల సంస్థానాన్ని అనేకమంది రాజులు పాలించారు. 1200 చదరపు మైళ్ల విస్తీర్ణం గల గద్వాల సంస్థానం నడిగడ్డ మొదలుకొని రాయలసీమలోని కర్నూల్, గుత్తి, ఆదోని, ఆత్మకూరు వరకు విస్తరించి ఉండేది. ఇంతటి సువిశాలమైన సంస్థానం గద్వాల కాబట్టే గద్వాలకు నిజాం రాజ్యంలో స్వతంత్ర సంస్థానంగా మనుగడ సాధించేందుకు ఆనాటి నిజాం ఉల్ ముల్క్ అంగీకరించారు.

1663లో అస్తిత్వంలోకి వచ్చిన గద్వాల సంస్థానం ఆనాటి నుంచి 1712 వరకు రాజా పెదసోమభూపాలుని హయంలో స్వతంత్ర్య రాజ్యంగా ఉండేది. ఢిల్లీలో మొగల్ సింహాసనాన్ని అధిష్ఠించిన బహదూర్‌షా బలహీనుడిగా ఉండడంతో దక్కన్ సుబేదార్ నిజాం ఉల్ ముల్క్ తనకు తానుగా స్వతంత్రాన్ని ప్రకటించుకున్నాడు. మరోవైపు బహదూర్‌షా అనుయాయులైనందున గద్వాల సంస్థానాన్ని దాని ఆధీనంలో ఉన్న రాజ్యాలను స్వాధీనం చేసుకునేందుకు గాను నిజాం ఉల్ ముల్క్ తన సేనాని దిలీప్ ఖానుడిని గద్వాల సంస్థానంపై దాడి చేసేందుకు పంపించాడు. పెదసోమ భూపాలుడు, దిలీప్ ఖానుడికి మధ్య కర్నూల్ సమీపంలోని నిడుమార్ వద్ద భీకర యుద్ధం జరిగింది. ఇందులో సోమభూపాలుడు వీరమరణం పొందాడు. నిజాం గద్వాల సంస్థానాన్ని వశం చేసుకోకుండా పెదసోమ భూపాలుని భార్య లింగమ్మ ముల్క్‌తో సంధి చేసుకుని నిజాం రాజ్యంలో గద్వాల సంస్థానాన్ని స్వతంత్ర్య రాజ్యంగా అవతరింపజేసింది. నాటి నుంచి 1949 వరకు నిజాం రాజ్యంలో విశేష మర్యాదలు గద్వాలకు అందాయని చరిత్ర తెలుపుతుంది. పోలీసు చర్య అనంతరం నిజాం రాజ్యం భారత దేశంలో విలీనం కావడంతో గద్వాల సంస్థానం కూడా స్వేచ్ఛా వాయువు పీల్చుకుంది. ప్రస్తుతం గద్వాల జిల్లాలో గద్వాల, అలంపురం సంస్థానాలున్నాయి.

**మహారాణుల పాలన :**

1712లో దక్కన్ సుబేదార్ నిజాం ఉల్ ముల్క్‌తో సంధి ఒప్పందం కుదుర్చుకున్న పెదసోమ భూపాలుని భార్య లింగమ్మ 1712 నుంచి 1723 వరకు తనకు నమ్మిన బంటు అయిన కల్ల వెంకటన్న, రమణయ్యతో రాజ్యపాలన సాగించారు. అనంతరం అమ్మక్క 1723-24 వరకు, లింగమ్మ 1724 నుంచి 1737 వరకు (13 సంవత్సరాలు) పాలించగా, 1742 నుంచి 1743 వరకు రాణి లింగమ్మ. రాణి చుక్కమ్మ 1743-47 వరకు, 1840-41 వరకు రాణి లింగమ్మ పాలించింది. సీతారామ భూపాలుని మూడవ భార్య రాణి వెంకట లక్ష్మమ్మ 1841-65 వరకు (25 సంవత్సరాలు), చివరగా రాజా సీతారామ భూపాల్ భార్య అయిన

ఆదిలక్ష్మీదేవమ్మ 1924-49 వరకు (25 సంవత్సరాలు) సుస్థిర పాలనను కొనసాగించి చరిత్రలో చిరస్మరణీయమైన స్థానాన్ని దక్కించుకున్నారు.

**సంస్కృతి**

**కళలు :** గద్వాల అనగానే వెంటనే గుర్తుకొచ్చే పేరు బాల భవన్. ఇది సాంస్కృతిక వికాస కేంద్రం. బాలభవన్ ద్వారా గద్వాలలో కళారంగం మూడుపూలు ఆరు కాయలుగా విరాజిల్లింది. బాలభవన్ ఏర్పడక ముందు సంస్థాన కాలంలో కళలు రాజసాన్ని పొందాయి. సంస్థానాల కాలంలో రాజులు కళలకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. కవులను, పండితులను పిలిచి గౌరవ సత్కారాలు చేశారు. కళలను ఆదరించారు. ఆధునిక కాలంలో తోలుబొమ్మలాటలు, కోలాటం, చెక్క భజనలు, నాటకాలు, భజన కీర్తనలు వంటి కళలు ఇక్కడ నిరంతరం సాగుతూనే ఉన్నాయి.

గద్వాలలో నిర్మించిన ఆలయాలు శిల్పకళా నైపుణ్యానికి ప్రతీకగా నిలిచాయి. కోటలో అత్యంత రమణీయంగా నిర్మించిన శ్రీ భూలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం, రామాలయం, శివాలయం, గాలిగోపురం ఇప్పటికి చెక్కు చెదరకుండా పర్యాటకుల మనసు దోచుకుంటున్నాయి. రామాలయంలోని దశావతార స్తంభం, చెన్నకేశవస్వామి ఆలయంలో ఉన్న రాతి స్తంభాలు తిరుమల తిరుపతి దేవస్థాన వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని పోలి ఉంది. చేపబావి, భారీ ఎత్తున నిర్మించిన రథశాలలు, రథాలు ఇప్పటకీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. పాత బస్టాండ్ సమీపంలో ఉన్న కేశమ్మబావి, చొక్కంబావి, లింగంబావి సంస్థానాధీశుల కాలంలో నిర్మించారు. రాజు భార్య, వారి తల్లుల స్మారకార్థం వాటిని నిర్మించినట్లు తెలుస్తుంది. అందులో రాణులు ఉదయం స్నానం ఆచరించిన తర్వాత దేవుని దర్శనం చేసుకోవడానికి ప్రతి బావి లోపలి భాగంలో శివాలయాలు నిర్మించారు అవి కూడా నేటికీ చెక్కు చెదరకుండా ఉండడం విశేషం.

**జాతరలు :** గద్వాల జిల్లాలో అనేక జాతరలు నిర్వహించబడతాయి. జిల్లాలో ప్రసిద్ధంగా ఉన్న దేవాలయాల్లో

**మున్సిపాలిటీ :** 2 – గద్వాల, అలంపూరు
**రెవెన్యూ గ్రామాలు :** 199
**గ్రామపంచాయితీలు :** 195
**పోలీస్ కమీషనరేట్ :** గద్వాల
**పార్లమెంట్ నియోజకవర్గం :** నాగర్‌కర్నూల్
**అసెంబ్లీ నియోజకవర్గాలు :** గద్వాల, అలంపూర్ రెండు నియోజకవర్గాలు.
**పట్టణాలు :** గద్వాల అలంపూర్

జాతరలు జరుగుతాయి. అలంపురంలోని జోగులాంబ ఆలయంలో ప్రతి సంవత్సరం జాతర కన్నుల పండువగా జరుగుతుంది. అదేవిధంగా గద్వాల సమీపంలో ఉన్న జమ్మిచేడు జమ్మలమ్మ జాతర ప్రతి మంగళ, శుక్రవారాల్లో వైభవంగా జరుగుతుంది.

మల్దకల్ స్వయంభూ ఆదిలక్ష్మి వేంకటేశ్వర స్వామి జాతర, పల్లెపాడు జాతర, అయిజలో తిక్క వీరేశ్వరస్వామి జాతర, ఉండవల్లిలో రేణుకా ఎల్లమ్మతల్లి జాతర ఘనంగా జరుగుతాయి. ఉండవల్లిలోనే రేణుక ఎల్లమ్మ తల పడిందని చారిత్రక కథనం. పరశురాముడు తన తల్లి తలను ఛేదిస్తే ఇక్కడ పడిందని అంటారు. అలాగే వల్లూరు జాతర ప్రసిద్ధి గాంచింది. గద్వాల జిల్లాకే తలమానికమైన బీచుపల్లి జాతర అంగరంగ వైభంగా జరుగుతుంది. కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా ఇక్కడ ఆంజనేయస్వామి కొలువై ఉన్నాడు.

**సాహిత్య చరిత్ర**

**1. గద్వాల సంస్థానం:** గద్వాల సంస్థాన మూల పురుషుడు బుడ్డారెడ్డి. ఇతడు ఐజ నివాసి. క్రీ.శ.1290 కాకతీయుల కాలంలో ఇతనికి రాయచూరు, అలంపురం, ఐజ, మొదుక్లు (నేటి మల్దకల్లు), ఆదోని మొదగలు ప్రాంతాలను పరిపాలించడానికి నాడగౌడరికం ఇవ్వబడింది. అప్పటి నుండి అతని సంతతివారు 'అయిజ నాడగాడలు' ని ప్రసిద్ధి చెందారు. కాకతీయుల పతనం తర్వాత వివిధ ప్రాంతాలకు వెళ్ళి క్రీ.శ.1500 నాటికి తిరిగి అయిజ

ప్రాంతం చేరుకుని పూర్వపు 'నాడగౌడరికం'ను మళ్ళీ సంపాదించుకున్నారు. 17వ శతాబ్ది ప్రారంభంలో పెద్ద నృపతి అనే అతడు అయిజ, కందనూలు (నేటి కర్నూలు) సీమకు 'నాడగౌడు' గా ఉన్నాడు. పూడూరు సీమ నాడగౌడు అయిన వీరారెడ్డి కుమార్తె బక్కాంబికను పెళ్ళి చేసుకుని ఆ సీమకు అధిపతి అయ్యాడు. తర్వాత పెద్దనృపతి కుమారుడు పెదసోమ భూపాలుడు (1663 - 1712) నాడ గౌడరికానికి వచ్చాడు. ఇతనినే పెద్దసోమనాద్రిగా పిలుస్తారు. ఇతడే గద్వాల కోట నిర్మాత. శిష్ట కవులచే శోభనాద్రిగా జానపద కవులచే నల్ల సోమనాద్రిగా పిలువబడిన పెదసోమ భూపాలుడు గద్వాల సంస్థాన రాజులలో ప్రసిద్ధుడు. 1695 - 1705 కాలంలో గద్వాల కోటను నిర్మించి, రాజ్యాన్ని విస్తరించి పూడూరు నుంచి రాజధానిని గద్వాలకు మార్చాడు.

పెదసోమ భూపాలుడు రాజ్యపాలనలోనే గాక, భక్తి భావనలోనూ, కవిత్వంలోనూ ప్రసిద్ధుడు. జయదేవుని "గీత గోవిందాన్ని" తెలుగులోకి అనువదించాడు. ఇతనికి నాడగౌడు, సన్నాడగౌడు, సర్‌దేశాయివంటి బిరుదులు కలవు. పెద్దసోమ భూపాలుని తర్వాత తిరుమలరాయడు, రామరాయడు, చినసోమ భూపాలుడు, రెండవ రామరాయడు, సీతారామ భూపాలుడు, మూడవ సోమభూపాలుడు, రాణి వెంకట లక్ష్మమ్మ, రామభూపాలుడు, సీతారామభూపాలుడు, ఆదిలక్ష్మీదేవమ్మ మొదలైన 18 మంది ప్రభువులు 300 సంవత్సరాల పాటు ఈ గద్వాలను పాలించారు.

చారిత్రకంగా, సాహిత్యపరంగా గల ప్రాచీన సంస్థానాలలో గద్వాల సంస్థానం మొదటిది. ఇది 'విద్వత్ గద్వాల'గా ప్రసిద్ధి చెందింది. అందుకు గల కారణం కేశవపంతుల నరసింహశాస్త్రి ఈ క్రింది పద్యంలో వివరించారు.

**"వాగారంభం లేమిచాలునిక, నెవ్వాడేని శాస్త్రజ్ఞతా..."**

తెలుగు, సంస్కృత పండిత కవులకు గద్వాల సంస్థానంలో ప్రవేశంతో పాటు పారితోషికం లభించడం ఆ రోజుల్లో గొప్ప గుర్తింపుగా చెప్పుకునేవారు. అందుకే తిరుపతి వేంకటకవులు ఒకచోట

**"అటు గద్వాలిటు చెన్నపట్టణము..."** అని చెప్పుకున్నారు. తెలుగు దేశపు అంచును పేర్కొన్నప్పుడు ఒకవైపు గద్వాల ఇంకొక వైపు చెన్నపట్టణం. ఇలా పేర్కొనడంవల్ల గద్వాల కీర్తిని చాటుతున్నది. తిరుపతి వేంకటకవులంతటి వారే గద్వాల ప్రాశస్త్యాన్ని, విశిష్టతను పై పద్యంలో వివరించడం విశేషం. కార్తీకమాసంలో గద్వాల కోటలో సంగీత సాహిత్య సభలు జరిగేవి.

గద్వాల కోటలో ప్రస్తుతం శ్రీ మహారాణి ఆది లక్ష్మీదేవమ్మ డిగ్రీ కళాశాల కొనసాగుతుంది. జిల్లాలోనే ఇది మొదటి డిగ్రీ కళాశాల కావడం విశేషం. ఈ సంస్థానంలో చెన్నకేశవస్వామి ఆలయాన్ని నిర్మించి ప్రతి సంవత్సరం కార్తీక శుద్ధ పౌర్ణమి, మాఘ శుద్ధపౌర్ణమి నాడు కవులకు, పండితులకు, కళాకారులకు సన్మానాలు చేసేవారు. కార్తీక శుద్ధ పౌర్ణమికి కవులు, పండితులు రాగా, సభలో మూడునాల్గు బట్టలు పరచి, వాళ్ళు వచ్చి పోయిన తర్వాత అట్టడుగున ఉన్న బట్టల మీది వాళ్ళ పాదధూళి సేకరించి స్నానానంతరం శిరోభాగంలో బొట్టు పెట్టుకునేవారట మహారాణి ఆదిక్ష్మీదేవమ్మ గారు. కవులకు, పండితులకు ఇంతటి సంస్థాన గౌరవం తెలుగుదేశంలో ఏ రాజు కూడ ఇవ్వలేదు.

తెలంగాణలోని సంస్థానాలన్నింటిలో అగ్రగణ్యమైన గద్వాల సంస్థానంలో సాహిత్య వికాసం బహుముఖాలుగా కొనసాగింది. పండితసభలు, సాహిత్య గోష్ఠులు, సమస్యా పూరణాలు, అష్టావధానాలు, శతావధానాలు, వార్షిక సభలు వంటి అనేక విధాల కవిపండితుల కేంద్రంగా అలరారింది. 'విద్వత్తు గద్వాల'గా పేరు సార్థకం చేసుకున్న గద్వాల సంస్థానాన్ని పాలించిన ప్రభువు తెలుగు సాహిత్య వికాసంలో ఆచంద్రతారార్కమైన కీర్తి ప్రతిష్ఠను సంపాదించు కున్నారు. గద్వాల సంస్థాన చరిత్రను పరిశీలిస్తే రాజు శౌర్య ప్రతాపాలు, సాహిత్య పోషణ, జనరంజక పాలన గుర్తుకొస్తాయి. సంస్థానాన్ని పాలించిన రాజు మంచి సాహిత్య ప్రియులే కాక స్వతహాగా కవులు కూడా. గద్వాల సంస్థానానికి ఆద్యుడైన రాజు పెద సోమభూపాలుడు మంచి కవి. ఈయన

సంస్కృతంలో జయదేవుడు రచించిన గీతా గోవిందాన్ని తెలుగులో అనువదించాడు. ఆ ఒరవడిని సంస్థానాధీశుల సాహిత్య లోకంలో గద్వాలకు సుస్థిర స్థానాన్ని సంపాదించి పెట్టారు. నాటి సాహిత్య సభను, సంస్థానాధీశుల కాలాన్ని సాహితి చరిత్రలో స్వర్ణ అక్షరాలతో లిఖించదగ్గవని చరిత్రలు చెబుతున్నాయి.

ప్రసిద్ధ పరిశోధకులు, పత్రికా సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డి, ప్రముఖ సాహితీవేత్త గడియారం రామకృష్ణశర్మ మొదలైనవారు గద్వాలకు చెందినవారు. నిజాంకు నిద్ర లేకుండా చేసిన సురవరం 'గోల్కొండ' పత్రిక ద్వారా శంఖారావాన్ని పూరించాడు. తెలంగాణ కవులతో 'గోల్కొండ కవుల సంచిక'ను వెలువరించాడు. 'రామాయణ విశేషాలు', యువజన విజ్ఞానాలతో పాటు కథలు, నవలలు, గేయాలు, పద్యాలు, వ్యాసాలు, సంపాదకీయాలు రచించిన గొప్ప పరిశోధకుడు. తెలంగాణ వైతాళికుడు. అలాగే గడియారం రామకృష్ణశర్మ బహుముఖ ప్రజ్ఞాశీలి. కవిగా, రచయితగా, అనువాదకుడిగా, పరిశోధకుడిగా తెలుగు సాహితీలోకంలో ప్రసిద్ధుడు. గదాయుద్ధం, విద్యారణ్య చరిత్ర, అలంపురం క్షేత్రం, బీచుపల్లి క్షేత్రం, తుంగభద్రా పుష్కరాలు మొదలైన పుస్తకాలను వెలువరించిన సాహితీ స్రష్ట. తన ఆత్మకథ 'శతపత్రం' తెలుగు సాహిత్య చరిత్రలో ప్రసిద్ధిగాంచింది. దీనికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

తెలంగాణ తొలితరం కథకుడు గొట్టుముక్కల కృష్ణమూర్తి అనేక కథలను రచించాడు. విరివింటి సంజీవశర్మ 'శివలీలా లాసం' అనే హరికథలను రచించాడు. ఇంకా ఈ జిల్లాలో డా. మహ్మద్ హుసేన్, డా. నాగేశ్వరాచారి, డా.వి. వీరాచారి, గద్దం జయప్రద, ఎక్బాల్, కె. రామ్మోహన్‌రావు, ఊర ఈశ్వరరెడ్డి, విరివింటి పరశురాంశర్మ, విరివింటి విరించి, పూదత్తు భాస్కర్, డా. జి.చెన్నకేశవరెడ్డి, రేడియం, వి.ఎస్. పారిజాత, అస్లాం షరీఫ్ తదితరులు విస్తృతంగా రచనలు చేస్తున్నారు.

**2. అలంపురం సంస్థానం :** జిల్లాలోని ప్రసిద్ధ సంస్థానాలతో పాటు చిన్న చిన్న సంస్థానాలు కూడా కవిపండిత పోషణలో తమ వంతు పాత్ర పోషించి కవిపండితులను ఆదరించాయి. అలాంటి సంస్థానాలలో అలంపురం సంస్థానం ఒకటి. ఇది బిజ్జ వంశీయుల పాలనలో ఉండేది. వీరు మోటాటి రెడ్లు. బిజ్జ వంశీయులు నాడగౌడు, దేశాయి, నాడకరణం మొదలైన బిరుదుతో అలంపూర్ సంస్థానాన్ని పరిపాలించారు. ఈ సంస్థానం అలంపూర్, ప్రాగటూరు, బోరవెల్లి, రాజోలి అనే నాలుగు ప్రాంతాలుగా మొదట్లో ఉండేది. అనంతరం బోరవెల్లి, రాజోలి ప్రాంతాలు గద్వాల సంస్థానంలో కలవగా అలంపూర్, ప్రాగటూరు ప్రాంతాలు ఒక్కటై అలంపూర్ సంస్థానంగా ఆవిర్భవించింది. క్రీ.శ.16వ శతాబ్దం నుండి కొంతకాలం అలంపూర్, మరికొంతకాలం ప్రాగటూరు రాజధానులుగా పరిపాలించిన రెడ్డిరాజులలో పెద్ద తిమ్మభూపాలుడు ప్రసిద్ధుడైనవాడు. ఇతని మనవడే బిజ్జ తిమ్మభూపాలుడు. ఇతడు 17వ శతాబ్దంవాడు. పెద్ద తిమ్మభూపాలుని కుమారుడు కృష్ణభూపాలునికి, అష్టబాహిరి గోపాలరావు సోదరి జబ్బాంబికకు పుట్టినవాడే బిజ్జ తిమ్మభూపాలుడు. ఇతడు ప్రాగటూరు రాజధానిగా అలంపూర్ సీమను పరిపాలిస్తూనే కవిపోషణ చేశాడు. ప్రాగటూరులోని రామేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంలో విద్వత్కవులను సత్కరించేవాడు.

**3. బోరవెల్లి సంస్థానం :** గద్వాల సంస్థానానికి పూర్వమే ఇది ప్రసిద్ధి కెక్కింది. ఈ సంస్థానానికి మూలపురుషుడు నాడగౌడు తమ్మారెడ్డి. వీరి ఇంటి పేరు ముష్టిపల్లి. ఈ తమ్మారెడ్డి కొడుకు నల్లారెడ్డి. అతనికి పెదసోమ భూపాలుడు, చినసోమ భూపాలుడు అనే ఇద్దరు కుమారులున్నారు. ఈ చిన్నసోమ భూపాలునికే సోమనాద్రి కూతురు గిరియమ్మను ఇచ్చి వివాహం చేశారు. ఈ గిరియమ్మ అనేక కవి పండితులను ఆదరించి పోషించడమే గాక దాన ధర్మాలను చేసిన వితరణశీలి. కవులను పోషించి కృతులను చెప్పించింది. ఈ సంస్థానంలో ప్రసిద్ధకవులతో పాటు అనేక కవిపండితులు తమ కవితా ప్రతిభను చాటుకున్నారు. బోరవెల్లి సీమ కవులకు, పండితులకు కాణాచిగా ఉన్నది. ఈ బోరవెల్లి సంస్థానంలో

చింతపల్లి, యగ్రహి వంశంలోని కవిపండితులు పేర్కొన దగినవారు. ఈ వంశంలోని కవిపండితులు తరతరాల నుండి తమ అఖండమైన పాండిత్యంతో రాజులను, పండితులను మెప్పించి ప్రజా గౌరవానికి పాత్రులయ్యారు. ఒకప్పుడు స్వతంత్రంగా ఉన్న బోరవెల్లి సంస్థానం అనంతరం గద్వాల సంస్థానంలో విలీనమైంది. విలీనం కాక ముందు ఈ సంస్థానంలో ఎన్నో గ్రంథాలు వెలుగుచూశాయి.

**సాహిత్య సంస్థలు**

గద్వాల సంస్థాన వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న చాలామంది కవులు జిల్లాలో సాహిత్య సంస్థలను నెలకొల్పి సాహిత్యానికి విశేష సేవ చేస్తున్నారు.

ప్రసిద్ధ సాహిత్య, శాసన పరిశోధకులు గడియారం రామకృష్ణశర్మగారు 'వికాస భారతి' అనే సాహిత్య సంస్థను అలంపురంలో స్థాపించి విరివిగా సాహిత్య కార్యక్రమాలను చేపట్టారు. అనేక కవి పండితులను ఆహ్వానించి సన్మానించారు. ఆంధ్ర సారస్వతపరిషత్తు సభ్యుడిగా జిల్లాలో విరివిగా సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. దీనిని ప్రస్తుతం వెంకట్రామ శెట్టి, బైరోజు రాజశేఖర్‌లు నడుపుతున్నారు.

గద్వాల కేంద్రంగా తెలుగు పండితుడిగా పనిచేసిన కె. రామ్మోహన్‌రావు 'గద్వాల సాహితి' అనే సాహిత్య వేదికను ఏర్పాటు చేశారు. దీనిని ప్రస్తుతం మేడిచర్ల హరి నాగభూషణం, అంబటి భానుప్రకాశ్‌లు నడుపుతున్నారు. ఇవే కాక ఇంకా ఇతర సాహిత్య సంస్థలు సాహితీ వికాసానికి తమ సంస్థల ద్వారా దోహదపడుతున్నారు.

**వివిధ రంగాల ప్రముఖులు**

గద్వాల జిల్లా ఉద్యమాల గడ్డ. ఇక్కడ ఎందరో కవులు, పండితులతో పాటు స్వాతంత్ర్య పోరాట యోధులు జన్మించారు. సురవరం ప్రతాపరెడ్డితో పాటు వందేమాతరం రామచంద్రరావు, పాగ పుల్లారెడ్డి, డి.కె. సత్తిరెడ్డి వంటివారు రాజకీయంగా ఈ జిల్లా నుండి రాణించారు. నిజాం వ్యతిరేకోద్యమంలో పాగ పుల్లారెడ్డి, గడియారం రామకృష్ణ శర్మలు 'భాగ్యనగర్ రేడియో' ద్వారా నిజాం రాజుకు నిద్ర లేకుండా చేశారు.

గ్రంథాలయోద్యమంలో సురవరం ప్రతాపరెడ్డిగారు ఈ జిల్లాలో విశేష కృషి చేశారు. 'వందేమాతరం' రామ చంద్రారావు వందేమాతరం ఉద్యమంలో ప్రముఖపాత్ర పోషించినందుకు అది ఇంటిపేరుగా మారిపోయింది.

**దర్శనీయ ప్రదేశాలు – పర్యాటకరంగం**

**పర్యాటక ప్రదేశాలు :** గద్వాల జిల్లాలో అనేకం దర్శనీయ స్థలాలు, పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. ఈ జిల్లాలో అలంపురం జోగులాంబ, జమ్మిచేడ్ జమ్ములమ్మ, బీచుపల్లి ఆంజనేయస్వామి, మల్దకల్ శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాలు మొదలైనవి ఈ జిల్లాలో ప్రసిద్ధి పొందిన ఆలయాలు.

పాలమూరు జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రంగా బీచుపల్లి ఆంజనేయస్వామి దేవాలయం భాసిల్లుతున్నది. పవిత్ర కృష్ణానదీ తీరంలో వెలిసిన ప్రసిద్ధ దేవాలయం. పవిత్ర పుణ్యక్షేత్రంగా విలసిల్లుతున్న బీచుపల్లి దేవస్థానం రోజు రోజుకు పర్యాటక కేంద్రంగా కూడా భాసిల్లుతుంది. బీచుపల్లిలోని ఆంజనేయ స్వామిని క్రీ.శ. 16వశతాబ్దంలో శ్రీ కృష్ణ దేవరాయల గురువైన వ్యాసరాయలు ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతోంది. బీచుపల్లి ప్రాంతంలో కణ్వమహర్షి తపస్సు చేసినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఈ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతిఏటా మే నెలలో బ్రహ్మోత్సవాలు జరుగు తాయి. బీచుపల్లి ఆంజనేయస్వామిని దర్శించుకోవటానికి నిత్యం ఇక్కడికి వేల మంది భక్తులు వస్తుంటారు. ఈ దేవాలయాన్ని సుమారు రెండు వందల సంవత్సరాల క్రితం గద్వాల సంస్థానాధీశులు కట్టించారు. ఈ బీచుపల్లి వద్ద 1953 లో రోడ్డు బ్రిడ్జిని నిర్మించారు. దీనికి సమీపంలోనే కృష్ణానదీ మధ్య భాగంలో 30 ఎకరాల విస్తీర్ణంలో నిజాం కొండ వుంది. దీనిని నిజాం నవాబులు కట్టించారు. ఈ కోటలో ఆంజనేయస్వామి దేవాలయం, మసీదు, బావి వంటివి ఉన్నాయి. పుష్కరాలకు వచ్చే సందర్శకులు జిల్లాలో అధిక సంఖ్యలో ఈ బీచుపల్లి ఆంజనేయస్వామి పుణ్యక్షేత్రంలో

పుణ్యస్నాన మాచరిస్తారు. బీచుపల్లి కృష్ణా పుష్కరాల సందర్భంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ పూజార్లు బోయవారు. గద్వాలకు 5 కిలో మీటర్ల దూరంలో గల నది అగ్రహారంలో దత్తాత్రేయ స్వామి ఆలయం, రామాలయం, శివాలయం ప్రసిద్ధిచెందిన పుణ్యక్షేత్రాలు, ప్రతి సంవత్సరం ఇక్కడికి ఏకాదశి, శివరాత్రి తదితర పర్వదినాలప్పుడు వేలాదిగా భక్తులు విచ్చేసి కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి, తమ మొక్కు తీర్చుకుంటారు. చిన్నసోమ భూపాలుడు రామావ ధూతకు ఇక్కడ మఠం కట్టించాడు.

పెద్దచింతలరేవు గద్వాల తాలుకాలోని ధరూర్ మండల పరిధిలోని గ్రామం. ఇక్కడ కృష్ణా తీరంలో వెలిసిన ఆంజనేయస్వామి చింతలు తీర్చే స్వామిగా ప్రసిద్ధి పొందాడు. శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు అతి సమీపంలో ఉన్నది. ఈ ఆంజనేయస్వామి దేవాలయం చాలా పురాతనమైంది. ఈ ఆలయం ఐదు వందల ఏళ్ల నాటిదని చారిత్రకుల అభిప్రాయం. చంద్రికా చార్యులనే వ్యాసరాయలు ఈ స్వామిని ప్రతిష్ఠించినట్లు ప్రతీతి. ఇక్కడ స్వామి ఊర్ధ్వ దృష్టి కలవాడు. ఊర్ధ్వదృష్టి కల ప్రతిమలో ఉగ్రత్వం ఉంటుందని వాడుక. ఈ ఆంజనేయ స్వామిని పుట్టలో నుండి తీసి శేషదాసులనేవారు ప్రతిష్ఠించారని చరిత్ర చెబుతోంది. తన శేష జీవితాన్ని శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో గడిపి శేషదాసు తనువు చాలించారు. శ్రీ శేషదాసు వంశస్తులు నేటికి ప్రతి సంవత్సరం జనవరి నెలాఖరున జరిగే బ్రహ్మోత్సవాలలో పాల్గొని శ్రీస్వామి వారిని సేవించి తరిస్తున్నారు.

ఈ దేవాలయానికి కిలోమీటరు దూరంలోనే ఉరకలేత్తే కృష్ణమ్మ మనకు దర్శనమిస్తుంది. అంతేకాక ఇక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలోనే జూరాల ప్రాజెక్టు, హైడల్ ప్రాజెక్టు లున్నాయి. జూరాల ప్రాజెక్టు నుండి కృష్ణానదీ జలాలు కిందికి దూకి పర్యాటకులను కనువిందు చేస్తాయి. చింతరేవు, జూరాల ప్రాజెక్టులను సందర్శించడానికి గద్వాల నుండి ఆర్టీసి బస్సులున్నాయి.

**ముఖ్య దేవాలయాలు**

జోగులాంబ గద్వాల జిల్లాలో అనేక దేవాయాలు, మఠాలు, కోటలు మొదలైనవి చూడదగ్గ ప్రదేశాలున్నాయి. ఈ జిల్లాలో అత్యంత ప్రసిద్ధి గాంచింది అలంపూరులో ఉన్న ఐదవ శక్తిపీఠం అయిన జోగులాంబ దేవాలయం. అలాగే బీచుపల్లి ఆంజనేయస్వామి దేవాలయం, పెద్దచింతరేవు ఆంజనేయ స్వామి దేవాలయం, మల్దకల్ లోని స్వయంభూ వెంకటేశ్వర దేవస్థానాలున్నాయి.

**నది అగ్రహారం :** గద్వాలకు 5 కిలోమీటర్ల దూరంలో గల నది అగ్రహారంలో దత్తాత్రేయ స్వామి ఆలయం, రామాలయం, శివాలయం ప్రసిద్ధిచెందిన పుణ్యక్షేత్రాలు. ప్రతి సంవత్సరం ఇక్కడికి ఏకాదశి, శివరాత్రి తదితర పర్వదినాలప్పుడు వేలాదిగా భక్తులు విచ్చేసి తమ మొక్కు తీర్చుకోవడానికి వస్తుంటారు. కృష్ణాతీరంలో గల ఈ నది అగ్రహారానికి చినసోమ భూపాలుడు విహారానికి రాగా అక్కడ అతనికి ఒక ఎర్రని గుండుపై 'రామావధూత' అనే యోగి తీవ్రమైన తపస్సమాధిలో కూర్చుని ఉండి కనిపించాడు. అది చూసి రాజుగారక్కడ అతనికొక మఠాన్ని కట్టించాడు. ఆ తర్వాతనే ఇక్కడ అనేక ఆలయాలు వెలిశాయి.

**పెద్దచింతరేవు:** పెద్దచింతరేవు గద్వాల జిల్లాలోని ధరూర్ మండల పరిధిలోని గ్రామం. ఇక్కడ కృష్ణా తీరంలో వెలిసిన ఆంజనేయస్వామి చింతలు తీర్చేస్వామిగా ప్రసిద్ధి పొందాడు. శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు అతి సమీపంలో కలదు. ఈ ఆంజనేయ స్వామి దేవాలయం చాలా పురాతనమైంది. ఈ ఆలయం ఐదు వందల ఏళ్ల నాటిదని చారిత్రకుల అభిప్రాయం. చంద్రికాచార్యులనే వ్యాసరాయలు ఈ స్వామిని ప్రతిష్టించి నట్లు ప్రతీతి. ఇక్కడ స్వామి ఊర్ధ్వ దృష్టి కలవాడు. ఊర్ధ్వదృష్టి కల ప్రతిమలో ఉగ్రత్వం ఉంటుందని వాడుక. ఈ ఆంజనేయ స్వామిని పుట్టలో నుండి తీసి శేషదాసునేవారు ప్రతిష్టించారని చరిత్ర చెబుతోంది. తన శేష జీవితాన్ని శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో గడిపి శేషదాసు తనువు చాలించారు.

## అలంపురం

గద్వాల జిల్లా ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలకు నిలయం. విశేషమేమిటంటే సృష్టికర్త అయిన బ్రహ్మకు దేశంలో రాజస్థాన్‌లోని పుష్కర్‌లో మరియు గద్వాల జిల్లాలోని అలంపురంలో మాత్రమే నవబ్రహ్మలయాలు వెలిశాయి. అందుకే 'అలంపురం' తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యస్థలంగా పేరు గడించింది. అంతేగాక అష్టాదశ శక్తి పీఠాలలో ఇక్కడి 'జోగులాంబ' ఒక శక్తిపీఠం. బ్రహ్మలయ అలంపూరాన్ని అత్యంత ప్రాచీన శిల్పకళా సంపదకు ప్రాప్తి స్థానంగా చెప్పుకోవచ్చు. క్రీ.శ.6వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం మధ్య కాలంలో భారతీయ వాస్తు శిల్పంలో వచ్చిన పరిణామాలను తెలియజేసే ఎన్నో ఆలయాలు ఇక్కడ ప్రసిద్ధి చెందాయి. దక్షిణ కాశీగా పిలువ బడుతున్న అలంపురం ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగానే కాకుండా పర్యాటక ప్రదేశంగా అలరారుతోంది. అపురూప శిల్ప సంపదకు, అద్భుత దేవాలయ సముదాయానికి నెలవు అలంపురం.

ఈ నవబ్రహ్మలయాలు శివుని పేరుమీద ఉన్న శివాలయాలు. బాల బ్రహ్మేశ్వర, అర్కబ్రహ్మేశ్వర, తారక బ్రహ్మేశ్వర, కుమార బ్రహ్మేశ్వర, గరుడ బ్రహ్మేశ్వర, విశ్వ బ్రహ్మేశ్వర వంటి శివాలయాలు ఉన్నాయి. ఈ క్షేత్రం అతి పురాతనమైన శైవ మహాక్షేత్రం. అలంపూర్ జోగులాంబ అని అష్టాదశ శక్తిపీఠ వర్ణనలో చెప్పబడింది.

జూరాల ప్రాజెక్టు నందిమళ్ల విభాగంలో శ్రీకాళహస్తి మల్లికార్జునస్వామి కొలువు తీరాడు. శ్రీకాళహస్తి నుంచి శివుడి విగ్రహాన్ని శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జునుడిగా నామకరణం చేస్తూ ఇక్కడి భక్తులు ప్రతిష్టించారు. దాదాపు 37 ఏళ్ల క్రితం జూరాల ప్రాజెక్టు మంజూరు కావడం, నందిమళ్ల విభాగం ఏర్పడటం జరిగింది. ఈ క్యాంపులోని ఉద్యోగులు, ఈ ప్రాంతవాసులు దేవాలయ ఆవశ్యకతను గుర్తించి శ్రీశ్రీశ్రీ మల్లికార్జునుడి దేవస్థానాన్ని 1992లో నిర్మించారు.

జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మరో దేవాలయం మల్దకల్ లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయం. ఇక్కడ స్వామి స్వయంగా వెలిసినాడని ప్రతీతి. ఈ స్వామి భక్తుల కొంగు బంగారంగా కోరికను తీర్చే భక్త జన బాంధవుడిగా ప్రసిద్ధి గాంచాడు. ఈ క్షేత్రానికి ఆది శిలా క్షేత్రమని, గిరీశాచలమని పేర్లున్నాయి. అప్పట్లో ఈ ప్రాంతాన్ని మొదుకల్లు అనే పిలిచేవారు. రాను రాను ఇది మల్దకల్‌గా మారిపోయింది. అయితే కన్నడ భాషలో మొదు అనగా ఆది అని, కల్లు అనగా రాయి అని అర్థం అక్కడ ఒక పెద్ద శిలకు మధ్య వేంకటేశ్వర స్వామి, పశ్చిమ భాగాన ఆంజనేయస్వామి, నైరుతి దిక్కుగా శివుడు వెలిశాడు. ఈ క్షేత్ర మాహాత్మ్యం గురించి బ్రహ్మాండ పురాణంలో వివరించ బడింది. ఈ పుణ్యక్షేత్రం, కృష్ణా, తుంగభద్ర రెండు నదుల మధ్య ఉండడం విశేషం. ఈ దేవాలయాన్ని గద్వాల సంస్థానాధీశుడైన నల్ల సోమనాద్రి నిర్మించినట్లు తెలుస్తుంది. ఇక్కడ పూజారులు బ్రాహ్మణులతో పాటుగా వాల్మీకులు కూడా ఉండడం విశేషం.

గద్వాల సంస్థానం కళలకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీక. గద్వాల చీరలు కూడా విశేష ఖ్యాతి పొందినవే. జూరాల ప్రాజెక్టు ఇక్కడే ఉంది. బీచుపల్లిలో కృష్ణానది ఒడ్డున హనుమత్ దేవస్థానం ప్రఖ్యాతి పొందింది. అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన జోగులాంబ పేరుతో ఏర్పాటైన ఈ జిల్లా సర్వతోముఖాభివృద్ధి దిశగా అమ్మవారి ఆశీస్సులతో కొనసాగుతుంది.

# నల్లగొండ

దివ్యత నల్లగొండయిది, తీరిచిదిద్దిన బౌద్ధమూర్తులన్
భవ్యత వాసికెక్క, ఘనవారధి సాగరధారలిక్కడే
నవ్యతదీర్ప సాగినవి నందనముల్ వెలయించి దిక్కులన్
అవ్యవధానదీధితులకాశ్రయమై సురవాసితాత్మయై!

### ఈ పేరెందుకు?

నల్లగొండ పూర్వనామం 'నీలగిరి'. చాలాకాలం వరకు ఈ పేరే ఉండేది. ఈ పట్టణము లతీఫ్ సాహెబ్‌గుట్ట, కాపురాల గుట్ట అను రెండు నల్లరాళ్ళ గుట్టల మధ్యన ఉన్నది. రెండు నల్లరాళ్ళ గుట్టల మధ్యన ఉండుట వలన దీనికి నల్లగొండ పేరు వచ్చి, వాడుకలో నల్లగొండ అయినట్లు భావించబడుచున్నది. అల్లా ఉద్దీన్ బహమనీషా పరిపాలన తర్వాత 'నల్లగొండ' అనే పేరు వచ్చింది. నిజాం సామ్రాజ్యంలో భాగంగా తెలంగాణాలో ఉన్నప్పుడే 'నీలగిరి' అనే పేరు స్థిరపడింది. 1905 లో నల్లగొండగా జిల్లా పేరు మార్చబడింది. ఈ పేరుతో నేటివరకు పిలువబడుతుంది.

### భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి

నల్లగొండ జిల్లా 7121.67 చ.కి.మీ. విస్తీర్ణంలో వ్యాపించి వుంది. నల్లగొండ జిల్లాకు ఉత్తరాన యాదాద్రి, ఈశాన్యాన సూర్యాపేట, దక్షిణాన గుంటూరు, తూర్పున కృష్ణా, పశ్చిమాన శంషాబాదు, నైఋతిన నాగర్ కర్నూలు జిల్లాలు సరిహద్దులుగా వున్నాయి.

### సహజ వనరులు :

**నేలలు** : నల్లగొండ జిల్లాలో ఎక్కువగా ఎర్ర నేలలున్నాయి. ఇవి ఎక్కువగా ఇసుక కలిసిన అడుగు భూములు. కొన్నిచోట్ల బంక మన్నుతో కలిసిన నేలలున్నాయి. పల్లపు ప్రాంతాలలో ఈ భూములు ఎక్కువగా వున్నాయి. ఎర్ర నేలలు లవణక్షార రహితమై వున్నాయి. మొత్తం మీద సారవంతమైన నల్లరేగడి నేలలు 9 శాతం మాత్రమే కృష్ణానది ఒడ్డు వెంబడి మరియు అక్కడక్కడ కలవు. ఎర్ర నేలలకు తోడు ఇసుక నేలలు 47 శాతం, చలక భూములు 44 శాతం వున్నాయి.

2015-16 గణాంకాల ప్రకారం జిల్లాలో మొత్తం నేల 7,12,167 హెక్టార్లు. దీనిలో అటవీ భూమి 58, 906 హెక్టార్లు, బంజరు భూమి 61,054 హెక్టార్లు, వ్యవసాయ యోగ్యమైన భూమి 62,506 హెక్టార్లు, సాగుకు పనికిరాని భూమి 9425 హెక్టార్లు. శాశ్వత పచ్చిక బయళ్ళు 18,263 హెక్టార్లు, చెట్లతో కూడిన నిరుపయోగ భూమి, 3,313 హెక్టార్లు, ప్రస్తుత బీడు భూములు 21,342 హెక్టార్లు, ఇతర బీడు భూములు 65,548 హెక్టార్లు కలవు.

### వ్యవసాయం - పంటలు

జిల్లాలో ముఖ్య వృత్తి వ్యవసాయం. ఈ భూములు పంటలకు ప్రశస్తమైనవి. ఇచ్చట సంవత్సరంలో ఆబి, తాబి (వానకాలం, వేసంగి) అనే రెండు పంటలు పండిస్తారు. చెలక పంటలలో జొన్న, సజ్జలు, వేరుశనగ, పెసలు, కందులు మొదలైనవి ప్రధానమైనవి. ఇక్కడ ఒకప్పుడు ఆముదం సాగుచేయు భూమి అత్యధికంగా వుండి రాష్ట్రంలో ప్రథమ

**రెవెన్యూ డివిజన్లు - మండలాలు**

ఈ జిల్లాలో మూడు రెవిన్యూ డివిజన్లు **1. నల్లగొండ 2. మిర్యాలగూడ 3. దేవరకొండ.**

ఈ మూడు డివిజన్లలో 31 మండలాలున్నాయి.

**నల్లగొండ రెవెన్యూ డివిజన్‌లో 11 మండలాలు :**

1. చండూరు 2. చిట్యాల 3. కనగల్ 4. కట్టంగూరు 5. మునుగోడు 6. నకిరేకల్ 7. నల్లగొండ 8. నార్కట్‌పల్లి 9. తిప్పర్తి 10. కేతేపల్లి 11. శాలిగౌరారం.

**మిర్యాలగూడ రెవిన్యూడివిజన్‌లో 9 మండలాలు:**

1.దామరచర్ల 2.మిర్యాలగూడెం 3. వేములపల్లి 4.అనుముల 5.నిడమనూరు 6. పెద్దవూర 7.త్రిపురారం 8. మాడ్గులపల్లి 9. తిరుమలగిరి 10. అడవిదేవులపల్లి

**దేవరకొండ రెవిన్యూ డివిజన్‌లో 9 మండలాలు :**

1. చందంపేట 2. చింతపల్లి 3.దేవరకొండ 4.గుండ్లపల్లి 5.గుర్రంపోడు 6. కొండమల్లెపల్లి 7. మర్రిగూడెం 8. నాంపల్లి 9.పెద్దఅడిశర్లపల్లి. 10. నేరెడుగొమ్మ

స్థానాన్ని ఆక్రమించింది. డిండిలో గల వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో వరి, చమురు గింజల విషయంలో పరిశోధనలు కొనసాగించబడుతున్నవి. ఆనకట్టల కింద, చెరువుల కింద, బావుల కింద వరి రెండు పంటలు పండించబడుతున్నవి. ఇటీవల కాలంలో మిర్యాలగూడెం, కనగల్లు పరిసర ప్రాంతాలలో, చెరుకు పంటను పండిస్తున్నారు. నల్లరేగడి భూములలో మిరప, పొగాకు, పత్తి, పొద్దుతిరుగుడు, కుసుమ మున్నగు వాణిజ్య పంటలే కాకుండా పెసర, కంది, వేరుశనగలు, ఉలువలు, నువ్వులు, మినుములు లాంటి పంటలు అక్కడక్కడ వేస్తున్నారు. నిమ్మ, బత్తాయి తోటలను అధిక మొత్తంలో ఈ జిల్లాలో పండిస్తారు. ఈ మధ్యనే నల్లగొండ పట్టణంలో బత్తాయి మార్కెట్ ఏర్పాటు చేయడం జరిగింది. నల్లగొండ జిల్లాలో వరి 53896 హెక్టార్లు, జొన్న 361 హెక్టార్లు, మొక్కజొన్న 169 హెక్టార్లు, సజ్జలు 39 హెక్టార్లు, కందులు 15,90 హెక్టార్లు, పెసలు 2263 హెక్టార్లు, మిరప 71 హెక్టార్లు, చెఱుకు 157 హెక్టార్లు, పత్తి 18,4098 హెక్టార్లు, ఆముదం 89 హెక్టార్ల భూమిలో సాగు చేస్తున్నారు. కూరగాయలు, ఇతర చిల్లర పంటల విషయంలో ఈ జిల్లాకు అంత ప్రాముఖ్యం లేదు. ఈ జిల్లాలో ఫ్లోరిన్ శాతం ఎక్కువగా ఉన్నందున పంటల దిగుబడి ఆశాజనకంగా లేదు.

**అడవులు** : ఈ జిల్లాలో పెద్దగా అడవులు ఏమీ లేవు. అడవులు 58,906 హెక్టార్ల విస్తీర్ణంలో వ్యాపించి వున్నవి. రిజర్వుడు అడవులు 135-57 చ.కి.మీ., రక్షిత అడవులు 60.33 చ.కి.మీ., వర్గీకరణ చేయని అడవులు 7.28 చ.కి.మీ., విస్తీర్ణాన్ని కలిగి వున్నాయి.

**నదులు** : ఈ జిల్లాలో కృష్ణానది ముఖ్యమైనది. ఇదికాక కృష్ణానది ఉపనదులైన మూసీ, పెద్దవాగు, డిండి, అహల్య నదులు తూర్పు దిక్కుగా ప్రవహించి, కనగల్ వాగు ద్వారా కృష్ణలో కలుస్తాయి. దక్షిణాన అతి ముఖ్యమైన కృష్ణానది 53 మైళ్ళ పొడవున దేవరకొండ మండలంలో ఏలేశ్వరం (ఇపుడు సాగర్ నీటి కింద మునిగిన గ్రామం) వద్ద తాకి, తూర్పు దిశలో కృష్ణాజిల్లాలో ప్రవేశిస్తున్నది. ఈ జిల్లాలో కృష్ణానది యొక్క ఉపనది మూసీ ముఖ్యమైంది. ఉత్తర భాగంలో 95 మైళ్ళ పొడవునా వ్యాపించి వజీరాబాద్ (వాడపల్లి) వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. పెద్దవాగు మరియు డిండి రెండు ముఖ్యమైన ఉపనదులు. దేవరకొండలో ప్రవహిస్తూ కృష్ణానదిలో కలుస్తున్నాయి. అహల్యా నది పడమర దిశన వున్న చండూరు సమీపాన వున్న నారాయణపూర్ కొండల్లో ప్రారంభమై ఆగ్నేయ దిశన 45 మైళ్ళ పొడవున ప్రవహిస్తూ కనగల్ వాగులో కలిసి కృష్ణానదిలో కలుస్తుంది. వీటన్నింటిని నీటిపారుదల కొరకు వినియోగిస్తున్నారు. ఈ వాగులే కాకుండా శశిలేటివాగు, పాల్వాయి వాగు, చింతపల్లి వాగు, చండూరు వాగు, దోరెపల్లివాగు, రేగట్టెవాగు ప్రధానమైనది.

**చెరువులు - ప్రాజెక్టులు : ఆనకట్టలు**

కృష్ణానదిపై నందికొండ వద్ద నిర్మించిన నాగార్జున సాగర్ ఆనకట్ట ప్రపంచ ప్రసిద్ధం. నాగార్జున సాగర్ ఆనకట్ట ప్రారంభించే నాటికి అది ప్రపంచంలో కెల్లా ఇటుక, రాతితో నిర్మించబడ్డ పెద్ద ఆనకట్ట. ఆనకట్ట 1955 లో ప్రారంభమై 1967 లో ముగిసింది. ఈ ఆనకట్ట 11.472 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీటిని నిల్వ వుంచే సామర్థ్యం గల రిజర్వాయర్ కలిగి వుంది. 590 అడుగుల ఎత్తు, సాధారణ నీటి ఎత్తు 510 అడుగులు. మొత్తం 28 గేట్లను కలిగి వుంది. ఈ ఆనకట్ట కుడి కాలువ నుంచి గుంటూరు జిల్లాలోని సేద్యపు పొలాలకు, ఎడమ కాలువ ద్వారా జిల్లాలోని హాలియా, నిడమనూర్, మిర్యాలగూడెం, వేములపల్లి మొదలైన మండలాలలో భూమి సాగు చేయబడుతోంది.

డిండి ప్రాజెక్టు నల్లగొండ, నాగర్‌కర్నూలు జిల్లాల సరిహద్దున గుండ్లపల్లి సమీపాన డిండి (దుందుభీ) నదిపై 1943 లో నిర్మించారు. దీనికింద 5061 ఎకరాల విస్తీర్ణానికి నీటి పారుదల సౌకర్యం లభిస్తున్నది. ఇవికాక ఎలిమినేటి మాధవరెడ్డి ఆనకట్ట, ఆసిఫ్‌నగర్ ఆనకట్ట, ఊట్కూర్ - మారేపల్లి ఆనకట్ట, శాలిగౌరారం ఆనకట్టల ద్వారా వేల ఎకరాలు సాగుచేయబడుతున్నవి. వీటితో పాటు అనేక చెరువులు, కుంటల ద్వారా కూడా సాగునీరు అందుతున్నది. మరిన్ని ఆనకట్టలు జిల్లాలో నిర్మించాల్సిన ఆవశ్యకత ఉన్నది.

**జనాభా :** 2011 జనాభా లెక్కల ప్రకారం నూతన నల్లగొండ జిల్లా జనాభా 16,31,399. వీరిలో పురుషులు 8,31,289. స్త్రీలు 8,00,110. స్త్రీ, పురుష నిష్పత్తి 962:1000, గ్రామీణ ప్రాంతాలలోని జనాభా 12,63,096, పట్టణ ప్రాంతాలలోని జనాభా 3,68,303, పట్టణ జనాభా 22.58, గ్రామీణ జనాభా శాతం 77.42. జిల్లా జన సాంద్రత 238 ఒక చ.కిమీ.కి, జనాభా వృద్ధిరేటు 7.41

**అక్షరాస్యత :** జిల్లాలో మొత్తం 9,15,742 మంది అక్షరాస్యులు ఉన్నారు. వీరిశాతం 63.35%, వీరిలో పురుషులు 5,34,573 వీరి శాతం 73.54%. స్త్రీలు 3,81,169 వీరి శాతం 52.98%.

**మున్సిపల్ కార్పొరేషన్స్ :** నల్లగొండ, మిర్యాలగూడెం.

**పంచాయితీలు :** దేవరకొండ, నకిరేకల్

**రెవెన్యూ గ్రామాలు :** 565

**గ్రామపంచాయితీలు :** 502

**పోలీస్ హెడ్ క్వార్టర్ :** నల్లగొండ

**పార్లమెంట్ నియోజకవర్గం :** నల్లగొండ

**అసెంబ్లీ నియోజకవర్గాలు :** నల్లగొండ, మునుగోడు, దేవరకొండ, నకిరేకల్, నాగార్జున సాగర్, మిర్యాలగూడెం.

**పట్టణాలు :** జిల్లాలో ప్రధానమైన పట్టణాలు 1. నల్లగొండ 2. మిర్యాలగూడెం 3. దేవరకొండ.

**జిల్లా చరిత్ర**

తెలంగాణ నట్టనడి గడ్డ నల్లగొండ. నల్లగొండ జిల్లాకు తెలంగాణ చరిత్రలో అత్యంత ప్రాముఖ్యత వుంది. లభిస్తున్న ఆధారాలను బట్టి ఈ జిల్లా చరిత్రను ఈ విధంగా చూడవచ్చు.

**చరిత్ర పూర్వయుగం**

**పాత రాతియుగం :** నల్లగొండ జిల్లాలో పాత రాతియుగం నాటి వస్తుజాలం విశేషంగా లభించింది. ఆ కాలపు రాతి ఆయుధాలు, శిలలతో చేసిన పనిముట్లు, ఆదిమజాతి మానవుడు నివసించిన ప్రదేశాలు అంతటా కనిపిస్తున్నాయి.

**కొత్తరాతియుగం :** (క్రీ.పూ.4000-2000) నల్లగొండ జిల్లాలో కొత్తరాతి యుగానికి సంబంధించిన పరికరాలు అనేకం లభించాయి. దేవరకొండ తాలూకాలోని హుమంతా పల్లి ప్రాంతంలో పేడకుప్పను తగులబెట్టగా ఏర్పడిన మసిదిబ్బ విశేషముగా కన్పిస్తున్నాయి. ఈ యుగంనాటి ప్రజలు వరిపంట పండించడం నేర్చుకున్నారు. కొన్ని సమాధుల్లో త్రిశూలం కన్పించడాన్ని బట్టి ఆనాటిప్రజలు శైవమతానుయాయులని భావించవచ్చు.

**శాతవాహనులు** (క్రీ.పూ.231-క్రీ.శ.225) శాతవాహనులు మౌర్య సామ్రాజ్య అంతర్భాగంగా తెలుగు దేశంలో కరీంనగర్, నల్లగొండ జిల్లాను పరిపాలించారు. ఆంధ్రదేశంలో శాతవాహన రాజు ఏలుబడికి ఆధారాలు లభించకపోయిననూ, ప్రముఖ శాతవాహనరాజు కాలములో వెలువడిన వారి నాణెములు, నిర్మాణాలు, నల్లగొండ జిల్లాలో లభించాయి. తొలి చారిత్రక యుగ కాలమున శాతవాహనుల లౌకిక నిర్మాణాలు చాలా ఈ జిల్లాలో లభిస్తున్నాయి. శాతవాహనుల కాలంలో విదేశీవ్యాపారం కూడా నల్లగొండ జిల్లా నుండి జరిగినదని తెలుపుటకు ఇటీవల లభించిన రోమన్ చక్రవర్తుల బంగారు నాణాలు నిదర్శనం.

**ఇక్ష్వాకులు** (క్రీ.శ.225-క్రీ.శ.300)వీరు ప్రాచీన గణాలో ఒకరైన ఇక్షుగణం వారు. ఇక్ష్వాకు రాజధాని నగరమైన విజయపురికి ఎదురుగా కృష్ణానది ఉత్తర తటాకము ప్రక్కన ఉన్న పుణ్యక్షేత్రం. ఇక్ష్వాకు శాసనాలు నాగార్జునకొండ, కేసానిపల్లిలో లభించాయి.

**విష్ణుకుండినులు** (క్రీ.శ. 380-624) విష్ణుకుండినుల పరిపాలన వారొసగిన తామ్ర, శిలాశాసనమువల్ల తెలుస్తున్నది. ఈ వంశానికి ఆద్యుడు మహారాజేంద్రవర్మ. శాలంకాయన, ఆనందగోత్రిక, పల్లవరాజు యుద్ధాలలో మునిగి ఉన్నప్పుడు ఏలేశ్వరం, అమరాబాద్, నల్లగొండ, ఇంద్రపాలనగరం ప్రాంతాలను ఆక్రమించి ఇంద్రపాలనగరం రాజధానిగా క్రీ.శ. 358 ప్రాంతంలో రాజ్యాన్ని స్థాపించాడని పరిశోధకులు చెప్తున్నారు.

**బాదామి చాళుక్యులు** (క్రీ.శ.546-755) చరిత్రకు అందిన ఆధారాలను బట్టి (బి.ఎస్.ఎల్. హనుమంతరావు పు.140) నల్లగొండ బాదామి చాళుక్యుల ఏలుబడిలో ఉందని భావించవచ్చు.

**రాష్ట్రకూటులు:** (క్రీ.శ. 750-973) తెలంగాణ ప్రాంతాలను బాదామి చాళుక్యులు అనంతరం రాష్ట్రకూటుల ఏలుబడిలోకి తెచ్చుకున్నారు.

**కళ్యాణీ చాళుక్యులు** (క్రీ.శ.973-1189) రాష్ట్ర కూట వంశాన్ని నిర్మూలించి 2వ తైలపుడు కళ్యాణి చాళుక్య రాజ్యాన్ని స్థాపించాడు. వీరికాలంలో నల్లగొండ జిల్లా వారి సామంతులు, దండనాయకుల మహామండలేశ్వరుల ఆధీనంలో ఉన్నది.

**కందూరి చోడులు** (క్రీ.శ.1040-1290) తెలంగాణ నుండి ముఖ్యంగా నల్లగొండ ప్రాంతం నుండి పాలించిన మాండలిక ప్రభువులలో కందూరిచోడులు అత్యంత ప్రసిద్ధులు. కళ్యాణీ చాళుక్యులకు, తర్వాత కాకతీయులకు అత్యంత విశ్వాస పాత్రులయిన మాండలిక సామంతులుగా, కొంతకాలం స్వతంత్రులుగా రాజ్యం చేసినారు కందూరి చోడులు. తొలుత వీరిని 'ఏఱువచోడు' లని పిలిచేవారు. ఏఱువ ప్రాంతం నుండి వచ్చినవారు కనుక వీరిని 'ఏఱువచోడులు' అని పిలిచారు. నల్లగొండ దుర్గానికి 'ఏఱువ పీఠము', 'ఏఱువ సింహాసనం' అనే పేర్లు ఉన్నాయి.మొదట్లో ఏఱువ మండలముతో నేటి కర్నూలు, ప్రకాశం, గుంటూరు, నల్లగొండ, కడప, కర్నూలు ప్రాంత భాగాలు కలిసి ఉన్నవి.

**కాకతీయులు:** (క్రీ.శ 1000-1324) కాకతీయులు యావదాంధ్రదేశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యముగా పాలించారు. వీరు రాష్ట్రకూట వంశ సంజాతులు. కర్నాటక నుండి ఆంధ్రదేశం వచ్చి స్థిరపడ్డారు. రాష్ట్రకూట, తూర్పు, పశ్చిమ చాళుక్యరాజు సైన్యాధ్యక్షుడిగా, మాండలికులుగా, సామంతులుగా ఉండి, యావదాంధ్రను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. రెండో ప్రోలరాజు, రుద్రదేవుని కాలంలో నల్లగొండ జిల్లాను వారి సామంతులు దండనాథులు పాలించారు. అందులో కందూరి చోడులు ముఖ్యులు.

**కాకతీయ సామంతులు :** రేచర్లరెడ్డి వంశం, రేచర్ల పద్మనాయకులు, చెఱకురెడ్డి వంశం, కాయస్థులు, కందూరిచోడులు, మల్యాల వంశం, విరియాల వంశం, యాదవరాజ్యం, నతవాడి వంశం, వెన్గొండ వంశం, పొలవాస పాలకులు, నాగవంశీయులు, బాణవంశం, వైదుంబులు కాకతీయ సామంత మాండలికులలో ముఖ్యులు. వీరిలో

చివరిదాకా అత్యంత విశ్వాసపాత్రులుగా ఉన్నవారు రేచర్ల పద్మనాయకులు.

**రేచర్ల పద్మనాయకులు** (క్రీ.శ.1326-1482) మిర్యాలగూడ తాలూకాలోని ఆమనగల్లు వీరి జన్మస్థలం. రేచర్ల ఆడబిడ్డ సంతతి ఈ పద్మనాయక వంశం. వీరికి ముందు ఆమనగల్లు రేచర్ల రెడ్లకు, కందూరి చోడులకు రాజధాని. నల్లగొండలోని ఆమనగల్లు, పిల్లలమర్రి, దేవరకొండలతో పాటు తెలంగాణ అంతా వీరి ఏలుబడిలో ఉండేది. మాదానాయకుడు, ఇతని కుమారుడు పెదవేదగిరి నాయకుడు దేవరకొండ రాజధానిగా పాలన సాగించారు.

**బహమనీ సుల్తాను** (1347-1537) ఢిల్లీ ప్రభువు నుంచి స్వతంత్రించిన హసన్‌గంగు (1347-1358) బహమనీ రాజ్యం స్థాపించాడు. కాపయ నాయకుని రాజ్యంపై దండెత్తి పానుగల్లు కోటను ఆక్రమించి వాడపల్లి పర్యంతం స్వాధీన పరచుకొన్నాడు. నీలగిరి కోటను ఆక్రమించాడు. అప్పటినుంచి దీనికి నల్లగొండ అనేపేరు వాడుకలోకి వచ్చింది.

**కుతుబ్‌షాహీలు** (క్రీ.శ. 1496-1687) క్రీ.శ. 1500 ప్రాంతంలో బహమనీరాజ్యం 5 రాజ్యాలుగా రూపొందింది. ఇందులో కుతుబ్‌షాహీలు ఒకరు. వారు తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలను పాలించారు. గోల్కొండ రాజ్యస్థాపకుడు సుల్తాన్ కులీకుతుబ్‌షా (1496-1543) ఇతడు మధ్య ఆసియా నుంచి వచ్చి మహమూద్ (1482-1518) కొలువులో చేరి 'కుతుబ్ ఉల్ ముల్క్' బిరుదు పొంది గోల్కొండ పాలనకు క్రీ.శ. 1496లో నియమింపబడ్డాడు. క్రీ.శ.1496 నుండి 1518 వరకు తెలంగాణా సుబేదార్‌గా ఉన్నాడు. గోల్కొండను 'మంగళారం' అని పూర్వం పిలిచేవారు. ఇది కాకతీయుల కాలంలో నిర్మింపబడింది.

**మొఘులులు** (క్రీ.శ.1687-1724) గోల్కొండ కుతుబ్‌షాహీ పరిపాలన క్రీ.శ 1687 సంవత్సరంలో అంతమైంది. ఔరంగజేబు కుటిల తంత్రం వలన కుతుబ్‌షాహీ వంశంలో చివరి సుల్తాన్ అబుల్‌హసన్ తానీషా దారుణ మారణకాండకు గురయ్యాడు. మొఘులులు గోల్కొండ కోటతో పాటు తెలుగు సీమనంతా వశపరచుకున్నారు. దక్కన్ రాజ్యాన్ని ఆరు సుబాలుగా విభజించారు. అందులో హైదరాబాద్ ప్రముఖమైనది. నల్లగొండ జిల్లా తొలుత మచిలీపట్నం సుబాలో ఉండి తర్వాత హైదరాబాదు సుబాలో చేరింది.

**అసఫ్‌జాహీలు** (క్రీ.శ.1724-1948) ఆరవ నిజాం ఉల్‌ముల్క్ ఈ వంశస్థాపకుడు. మొఘల్ చక్రవర్తులు బలహీనులు కాగా, బెంగాల్ పాలకులు స్వతంత్రించారు. 1948లో జరిగిన సైనిక చర్యతో అసఫ్ జాహీలు లొంగిపోయారు. నిజాం రాజ్యం భారతదేశంలో విలీనమైంది. భాషా ప్రయుక్త రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ సందర్భంలో నవంబరు 1956లో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రంలో ఈ జిల్లా కూడా భాగమైంది. 2016 నవంబరులో జరిగిన జిల్లాల విభజనలో భాగంగా సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలు ఈ జిల్లానుండి విడిపోయి కొత్త జిల్లాలుగా ఏర్పడ్డాయి.

**సంస్కృతి**

**ఆచారాలు, సంప్రదాయాలు, పండుగలు :** ఈ జిల్లాలో పండుగలు దేవతలకు, ప్రకృతికి సంబంధించినవి చేస్తారు. ముఖ్యంగా బతుకమ్మ, దసరా, దీపావళి, ఉగాది, సంక్రాంతి మొదలైన పండుగలు చేస్తారు. వినాయక చవితి, దుర్గా నవరాత్రి ఉత్సవాలను జిల్లా నలుమూలలా అత్యంత వైభవంగా చేస్తారు. శ్రీకృష్ణాష్టమి, శివరాత్రి, వీరబ్రహ్మేంద్ర స్వామి, హనుమాన్ జయంతి మొదలైన పండుగలను ఊరూరా ఘనంగా నిర్వహిస్తారు. స్త్రీలు నాగుల చవితి, వరలక్ష్మి వ్రతం, గౌరీ నోములు వంటి వాటిని చేస్తారు. రంజాన్, బక్రీద్, క్రిస్మస్ పండుగలను ముస్లింలు, క్రైస్తవులు జరుపుకుంటారు. మొహర్రం పండుగను ఐదు రోజుల పాటు హిందూ ముస్లింలు కలిసి జరుపుకుంటారు.

**తిరునాళ్ళు - జాతరలు - ఉర్సులు :**

ఈ జిల్లాలో తిరునాళ్ళు, జాతరలు, ఉర్సులను ప్రజలు భక్తి విశ్వాసాలతో జరుపుకుంటారు. గ్రామ దేవతలైన గంగమ్మ, పోలేరమ్మ, అంకాలమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ, ముత్యాలమ్మ పేర్లతో జాతరలు చేసుకుంటారు. లక్ష్మీనరసింహ

స్వామి, ఆంజనేయ స్వామి, వేంకటేశ్వర స్వామి, శ్రీ రామలింగేశ్వర స్వామి, రాఘవేంద్రస్వామి, వీరబ్రహ్మేంద్ర స్వామి, కోదండరామస్వామి, వేణుగోపాలస్వామి మొదలైన ఉత్సవాలను జరుపుకుంటారు. జిల్లాలో చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి జాతర, తుమ్మలపల్లి శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర, గుండ్రాంపల్లి శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర, అగస్త్యేశ్వర స్వామి జాతర (వాడపల్లి) వంటి శైవ జాతరలు, బాల నృసింహస్వామి జాతర (చిట్యాల), తిరుమలనాథ స్వామి జాతర (పెద్దకాపర్తి), వెంకటేశ్వర స్వామి జాతర (అవంతీపురం), వేణుగోపాల స్వామి జాతర (గోపులాయిపల్లి) వంటి ముఖ్యమైన వైష్ణవ జాతరలున్నాయి.

జిల్లాలో హిందువులే కాక హైందవేతర మతస్థులెందరో వున్నారు. ఉర్సు ఉత్సవాలు కుల మతాలకు అతీతంగా నల్లగొండ జిల్లాలో జరుపుకుంటారు. వాటిలో ముఖ్యంగా నల్లగొండ పట్టణంలోని లతీఫ్ సాహెబ్ ఉర్సు, మిర్యాల గూడెం, జాన్‌పహాడ్ ఉర్సులను వైభవంగా జరుపుకుంటారు.

**నల్లగొండ జిల్లా ప్రాచీన కవులు**

నల్లగొండ జిల్లా సాహిత్యం గురించి కీ.శే. బి.యన్.శాస్త్రి గారు, డా. శ్రీరంగాచార్య గారు, డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి గార్లు చాలా కృషి చేశారు. వారికి జిల్లా ప్రజల పక్షాన ధన్యవాదాలు.

గోకర్ణుడు గోకర్ణ ఛందస్సు అనే లక్షణ గ్రంథాన్ని రచించాడు. ఈ జిల్లాలో కవులలో మరింగంటి కవులది ఒక ప్రత్యేక కవితాశాఖ. సింగరాచార్యుల తర్వాత మరింగంటి కవులలో చెప్పుకోదగ్గవాడు వేంకట నరసింహాచార్యులు (ద్వితీయ). ఈయన దాదాపు 13 గ్రంథాల దాకా రాశాడు.

తెలుగులో తొలి యక్షగానం సుగ్రీవ విజయాన్ని రచించిన కందుకూరి రుద్రకవి నల్లగొండ జిల్లావాడే. నల్లగొండ పట్టణంలో భాగమైన చెర్లపల్లి గ్రామ నివాసియైన కర్పూరం రామకృష్ణాచార్యులు భగవద్గీతను ద్విపదలో రచించాడు. 'కుముదవల్లీ విలాసం' అనే కావ్యాన్ని రాసిన పానుగోటి జగన్నాథరాయలు దేవరకొండ పాలకుడు. శ్రీనాథుని తర్వాత నల చరిత్రను పద్య కావ్యంగా రాసిన ఘనత సిరిప్రగడ ధర్మన్నది. ఈయన పేరూరి నివాసి. ప్రహ్లాద నాటకాన్ని నూతన కవి సూరన, తొలి దళితకవి దున్న ఇద్దాసు, సంకీర్తనాచార్యుడు రాకమచర్ల వెంకటదాసు, రంభానలకూబర విలాసం అనే యక్షగాన కర్త శేషభట్టరు కృష్ణమాచార్యులు. వీరంతా నల్లగొండ వారే.

**ఉదయాదిత్యుడు (క్రీ.శ. 1136-1176)** నల్లగొండ సమీపంలోని పానగల్లు దగ్గర ఉదయ సముద్రం తవ్వించింది ఇతడే. ఇతని గ్రంథం ఉదయాదిత్యాలంకారం. ఈ గ్రంథం లభించడం లేదు గానీ, లక్షణ గ్రంథాలలో దీనిపేరు ప్రస్తావించబడింది.

**నూతనకవి సూరన (క్రీ.శ. 1400- 1480)** ఈయన దేవరకొండ పరిసర ప్రాంతానికి చెందినవాడు. ఇతడు రచించిన కావ్యం ధనాభిరామం. ఇది తెలుగు సాహిత్యంలో మొదటి కల్పిత ప్రబంధం. ధనం, సౌందర్యం ఈ రెండింటిలో మనిషికి ఏది ముఖ్యమో తెలియజేస్తుంది. 15 వ శతాబ్దం నాటి ఒక సాంఘిక సమస్యను గ్రహించి, దానిని కావ్యేతి వృత్తంగా పెంచి కావ్య రచన చేయడం అనేది కొత్త విషయం. ఇతనికి 'నూతన కవి' అనే బిరుదు వుంది.

**కందుకూరి రుద్రకవి (క్రీ.శ. 1568)** ఈయన దేవరకొండ మండలం జనార్దన కందుకూరు నివాసి. గొప్ప పండితుడు, కవి వల్లభుడు. ఈయన నిరంకుశోపాఖ్యానం, సుగ్రీవ విజయం అనే యక్షగానాన్ని, స్మర దీపిక అనే కామ శాస్త్రాన్ని, నరజన మనోరంజనం అనే ప్రౌఢ కావ్యాన్ని, బలవదరీ శతకం, గువ్వల చెన్నని శతకం, జనార్దన స్తోత్రాష్టకం, శృంగార జనార్దనాష్టకం అనే రచనలు చేశాడు.

**మరింగంటి వేంకట నరసింహాచార్యులు (ద్వితీయ) (1650-1720)** మొదట కనగల్లులో నివసించిన తర్వాత అనుముల మండల కేంద్రానికి వెళ్ళి స్థిరపడినాడు. కావ్య, భాణ నాటకాలను రచించినట్లు చెప్పుకొన్ననూ, నేడు కొన్ని మాత్రమే లభ్యం. అవి జనక సుతాభ్యుదయం, గోదావధూటి పరిణయం, విష్వక్సేన ప్రభాకరం, శ్రీ రామానుజాభ్యుదయం,

నృకంఠీరవాభ్యుదయం, క్షత్రబంధూపాఖ్యానం, జాంబవతీ కుమార శృంగార విలాసం, శ్రీ కృష్ణశతానందీయం, చిలువ పడిగటేని పేరణం, శ్రీకృష్ణ తులాభారం, మిత్రవిందోపాఖ్యానం, అలంకార కృష్ణవిలాసం, రతీమన్మధాభ్యుదయం, తారక బ్రహ్మరాజీయం, చెల్లపిళ్ళరాయ చరిత్ర, పద్మినీ కన్యకా భ్యుదయం వంటి కావ్యాలు రచించారు. వీరు వీటన్నింటినీ సిరిసెనగండ్ల నృసింహ స్వామికి అంకితం చేశారు.

**పానుగోటి జగన్నాథారాయలు (క్రీ.శ. 1650)** ఈయన దేవరకొండ పాలకుడు. సంస్కృతం, ఆంధ్ర భాషలలో పండితుడు. గోలకొండ నవాబు నుంచి ఛత్ర చామరాది రాజ లాంఛనాలను పొందాడు. ఇతని ఏకైక రచన కుముదవల్లీ విలాసం అనే ప్రబంధం. ఈ ప్రబంధాన్ని ఐదు ఆశ్వాసాలతో సుమారు 800 గద్య పద్యాలలో రచించాడు.

**కర్పూరం కృష్ణమాచార్యులు (క్రీ.శ. 1650)** నల్లగొండ పట్టణం చెర్లపల్లి ప్రాంత నివాసి. భగవద్గీతను ద్విపదలో రచించాడు. దీనిని చెర్లపల్లిలో నిలయమైన కేశవస్వామికి అంకితం చేశాడు.

**ఆసూరి మరింగంటి నరసింహాచార్యులు (క్రీ.శ. 1700)** ఇతడు అనుముల నివాసి. 'శఠవైరి వైభవ దివాకరం' అనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని సంస్కృతంలో రాశాడు. శఠవైరి అనగా నమ్మాళ్వరులు. పన్నిద్దరాళ్వారులలో ప్రసిద్ధులైన వీరి జీవిత వైభవాన్ని అలంకార యుక్తంగా వర్ణించిందే 'శఠవైరి వైభవ దివాకరం' అనే గ్రంథం. దీనిలో 100 అర్థాలంకారాలు లక్ష్య లక్షణ వ్యాఖ్యాన యుక్తంగా చెప్పబడినాయి. ఈ గ్రంథంలో 'అలంకార పరిచయం' తో పాటు నమ్మాళ్వారుల ప్రభావాన్ని తెలిపాడు. ఒకవైపు సాహిత్య దృష్టి, మరోవైపు విశిష్టాద్వైత సంప్రదాయానుసరణం ఇందులో కనిపిస్తాయి.

**సిరిప్రెగడ ధర్మన్న (క్రీ.శ. 1700-1750)** హాలియాకు సమీపాన గల పేరూరు గ్రామ నివాసి. ఈయన ఏకైక రచన నలచరిత్ర. శ్రీనాథుని తర్వాత నలచరిత్రను పద్య ప్రబంధ రూపంగా రాసిన ఘనత ధర్మన్నదే. దీనిలో 6 ఆశ్వాసాలున్నాయి. ఈ కావ్యాన్ని వేంకటేశ్వర స్వామికి అంకితమిచ్చాడు.

**మరింగంటి వేంకటాచార్యులు (క్రీ.శ. 1700)** మరింగంటి వంశకవులు నల్లగొండ ప్రాంతానికి చెందినవారు కాబట్టి ఈయన కూడా నల్లగొండ జిల్లాకు చెందిన కవిగా భావించవచ్చు. ఇతడు 'మల్లాది చరిత్ర' అనే ద్విపద కావ్యాన్ని రచించాడు. దీనిలో నాలుగు ఆశ్వాసాలున్నాయి.

**చింతలపల్లి ఛాయాపతి (క్రీ.శ. 1770)** దేవరకొండ సమీపంలోని బోయినపల్లి ఇతని నివాసం. నవఘంట సురత్రాణ బిరుదాంకితులైన పెద రాఘవయ్య మనుమడు. తిరుమల శ్రీనివాసాచార్యులు ఇతని గురువు. ఛాయాపతి సర్వంకష ప్రజ్ఞ కలవాడు. అష్టావధానాలు కూడా చేశారు. వ్యస్తాక్షరిలో గొప్ప ప్రతిభ వుంది. ద్వినందా ప్రావీణ్యం కలవాడు. కొత్త శ్లోకాలను అనులోమ విలోమ క్రమంలో పఠించగలడు. ఇతని ఏకైక రచన 'రాఘవాభ్యుదయం'. ఇది ఆరు ఆశ్వాసాల కావ్యం. కాళిదాసు రచించిన రఘువంశానికి ఇది కొంత అనువాదం.

**ఆసూరి మరింగంటి వేంకట రాఘవాచార్యులు (1800-1880)** ఈయన కనగల్లు నివాసి. తాలాంక నందినీ పరిణయ ప్రబంధకర్తయైన వేంకట నరసింహాచార్యులకు అన్న. నేడు జడ్చర్ల సమీపంలోని గంగాపురంలో వున్న మరింగంటి వారికి కనగల్లు మరింగంటి వారని ప్రసిద్ధి. వీరంతా రాఘవాచార్యుల పరంపరకు చెందినవారే. ఈయన కేశవస్వామి శతకం, క్షమా వింశతి అనే రచనలు చేశాడు.

**మరింగంటి వేంకట నృసింహాచార్యులు (తృతీయ) (1800-1880)** మరింగంటి వంశంలో ప్రౌఢకవి. ఈయన కనగల్లు నివాసి. స్వగ్రామమైన కనగల్లును రచనల్లో మొదటగా పేర్కొన్న కవి. ఈయన 'తాలాంక నందినీ పరిణయం' అనే ప్రౌఢ ప్రబంధాన్ని, ఇందిరాల గోదా పారిజాతం అనే యక్షగానాన్ని, కొన్ని చాటువులను సైతం రచించారు.

**చింతపల్లి దున్న ఇద్దాసు (క్రీ.శ.1811-1919)** పెద్దవూర మండలం చింతపల్లి గ్రామ నివాసి. అసలు పేరు ఈదన్న. ఈయనను బిరుదురాజు గారు 'మాదిగ మహాయోగి' అని పేర్కొన్నాడు. ఇద్దాసు అనేక వేదాంత కీర్తనలు, మేలుకొలుపులు, తత్త్వాలు రచించాడు.

**చిరుమర్రి నరసింహకవి (క్రీ.శ. 1820-1900)** త్రిపురారం మండలం కంబాలపల్లి గ్రామ నివాసి. ఇతని వాడుక పేరు సింగయ్య. నరసింహ కవి, కంపాలపల్లి శ్రీకృష్ణస్వామి భక్తుడైనను పేరుకు తగినట్లుగా 'ఉగ్రకవి' అని ప్రసిద్ధి చెందాడు. అపర వేములవాడ భీమకవిగా ప్రసిద్ధి. సంస్కృతాంధ్ర భాషలలో పండితుడు. ఈయన శైలి ప్రౌఢం. మహాభారతం, ఇంద్ర నారద సంవాదం, లక్షణ నవరత్న మాలిక, సూర్యగ్రహ స్తోత్రం మొదలైన రచనలు. నరసింహ కవి భారతాన్ని యథామూలంగా అనువదించి భువనగిరిలోని ఒక వైశ్యునకు అంకితమిచ్చాడని గోలకొండ కవుల సంచికలో తెలుపబడింది.

**చిత్తారు గంగాధరయ్య (క్రీ.శ. 1873)** నల్లగొండ పట్టణంలో భాగమైన చర్లపల్లి నివాసి. భక్తి కథలను శృంగార రస ప్రధానంగా రచించిన కవులలో ఇతను ఒకడు. కొలిపాక మాహాత్మ్యం, శృంగార భల్లాణ చరిత్ర, శృంగార సిరియాళ చరిత్ర, గంగా వివాహం, శుకసప్తశతి, గండదోషములు అనే జ్యోతిష గ్రంథం, గజేంద్రమోక్షం అనే పురాణాన్ని, గజేంద్ర శతకం (స్తుతి) ఇతని రచనలు. ఇందులో శుక సప్తశతి ఒక్కటే వచన రచన.

**రాకమచర్ల వేంకటదాసు (క్రీ.శ. 1834-1884)** నాంపల్లి మండలం పెద్దాపురం నివాసి. ఈయన దాదాపుగా లక్ష సంకీర్తనలు చెప్పాడు. ఈనాడు ముద్రితమై లభించేవి 500 మాత్రమే. దాసుగారు ఆశువుగా సంస్కృత పదభూయిష్టములైన కీర్తనలు, పద్యాలు చాలా చెప్పారు. ఈయన కీర్తనల్లో అంత్యప్రాసలు, లాటానుప్రాసలు, యమకాలు కోకొల్లలుగా దొర్లాయి. ఈయన కీర్తనలన్నింటికీ రాగతాళ నిర్దేశం చేశాడు.వీరికి సంగీత జ్ఞానం ఎక్కువే.

**గోవర్ధనం వేంకట నృసింహాచార్యులు (1846 - 1937)** ఈయన అనుముల మండలం ఇబ్రహీంపేట వాస్తవ్యుడు. ఈయన సంస్కృతం, తెలుగు, ఉర్దూలలో పండితుడు. ఈయన బహుగ్రంథ నిర్మాత. ఇతని రచనలలో ప్రబంధాలు, శతకాలు, చాటువులు, యక్షగానాలు, ప్రహరి ఉన్నాయి. కవితా ప్రదర్శనమే ప్రధానంగా గలవారు వివిధ ప్రాంతాలను పర్యటించి భక్తిపరులైన సంపన్నుల కోరిక మేరకు ఆయా ప్రదేశాలలో ఉన్న శ్రీ వైష్ణవ దేవాలయ అర్చామూర్తు లను సేవించి వివిధ సాహిత్య ప్రక్రియలలో దేశీమార్గ పద్ధతులలో సంగీతానికి అనుగుణంగా రచనలు చేశాడు.

**మరింగంటి చెన్నకృష్ణమాచార్యులు (క్రీ.శ.1850)** ఇతడు కనగల్లు వాస్తవ్యుడు. క్రీ.శ. 1850 ప్రాంతం. తాలాంక నందిని పరిణయ కర్త వేంకట నరసింహాచార్యుల పుత్రుడు వీరేకాక కంసాలి సుబ్బకవి, చేకూరి సిద్ధయ్య, తాడిపర్తి లక్ష్మణదాసు, శేషభట్టరు కృష్ణమాచార్యులు, గోవర్ధనం అళహరి సింగరాచార్యులు, రావిచెట్టు రంగారావు, చిదిరెమఠం వీరభద్రయ్య మొదలైన కవులు కలరు.

**ఆధునిక రచయితలు**

**సయ్యద్ అలీ :** దేవరకొండ ప్రాంతానికి చెందిన ముస్లిం కవి. సయ్యదలీ - అజ్మతుల్లా ఇద్దరు సోదర కవులు. నల్లగొండ జిల్లాలో సంస్కృతాంధ్ర సాహిత్యాలలో నిష్ణాతులై తెలుగు సాహిత్యానికి సేవ చేసిన ముస్లిం కవులలో ప్రథములు. ప్రమీల, దిగంబర మోహినీ, హరిప్రియ, నలచక్రవర్తి, ధ్రువ, సరగ, సీతారామ శతకం మొ.వి. వీరి రచనలు.

**షబ్నవీసు వేంకట రామ నరసింహారావు** : నల్లగొండ ప్రాంత కవి. ఈయన నీలగిరి పత్రికను ప్రారంభించారు. ఇది తెలంగాణాలో రెండవ తెలుగు పత్రిక. జిల్లాలో మొదటి పత్రిక కూడా ఇదే. 1924 లో సంస్కారిణి అనే గ్రంథమాలను స్థాపించాడు. 1921 లో బాలికా విలాపం అనే కథను రాశాడు. తన భార్య స్మృతిలో 'రాజ్యలక్ష్మి' అనే కావ్యాన్ని 1922 లో ప్రారంభించారు. అది అసంపూర్ణంగా ఉండటంతో శేషాద్రి రమణ కవులు 'ఉదయ లక్ష్మి' పేరుతో పూర్తిచేసి 1923 లో ప్రచురించారు.

**పులిజాల వెంకట రంగారావు :** ఈయన 1901 లో నల్లగొండలో జన్మించారు. తెలంగాణాలో జరిగిన ప్రథమ, ద్వితీయ, తృతీయ ఆంధ్రమహా సభలకు అధ్యక్షత వహించారు. 1931 లో జరిగిన హైద్రాబాద్ రాజకీయ సభకు హాజరైన తెలంగాణ ఏకైక ప్రతినిధి. నీలగిరి పత్రికల్లో ఎన్నో వ్యాసాలు

రాశారు.సంస్కరణ భావాలతో కవిత్వం రాయడం వీరి విశేషం.

**చిదిరెమఠం వీరభద్రశర్మ** : నల్లగొండ పట్టణంలో భాగమైన చర్లపల్లి ప్రాంతానికి చెందినవారు. తెలంగాణ నేలను ఆంధ్ర జననిగా సంబోధించి "ఆంధ్ర జననీ పరిదేవనం" పేరుతో శ్లోకాలు, పద్యాలు రాశాడు. 'శృత్వాపి మాతృ పరిదేవన మేతద్రుగం' అన్న శ్లోకాన్ని బట్టి తెలంగాణ తల్లి భావన 1934 కంటే ముందు నుంచే ఉందని అర్థమౌతుంది. ఈయన వీరశైవ వివాహ విధి, ఆంధ్ర మాళవికాగ్ని మిత్రం, తర్క సంగ్రహం, మీమాంసా పరిభాషా, ఆంధ్ర వీరశైవులు మొదలైనవి వీరి రచనలు.

**పైడిమర్రి వెంకట సుబ్బారావు** : నల్లగొండ జిల్లా అన్నెపర్తి గ్రామంలో జననం. ఈయన సంస్కృతాంధ్ర, ఆంగ్ల, హిందీ, ఉర్దూలలో పండితుడు. 1916 కాలం నాటి జిల్లా తొలి నవలాకారుడు. 1934 కి ముందే కాలభైరవుడనే నవలను రాసారు. 1946 లో బూర్గుల రంగనాథరావుతో కలిసి ఉషస్సు అనే కథా సంకలనాన్ని వెలువరించాడు. సింగపురీ నృకేసరీ శతకం, బాల రామాయణం, శ్రీ వేంకటేశ్వర స్తుతి రత్నావళి, గీతా మీమాంసం, దైవభక్తి అనేవి వీరి రచనలు.

**నాగార్జున కనకాచారి** : నల్లగొండ మండలం దోమలపల్లిలో జననం. 1955 లో కాలజ్ఞానం మేలుకొలుపు, బుర్రకథలను రచించాడు. బ్రహ్మంగారి వలె ముస్లింలను చేరదీశాడు. ముస్లిం కవులైన మౌల్వీ సయ్యద్ ఇస్మాయిల్, అబ్దుల్లాషా, హుస్సేన్‌లు రచించిన కీర్తనలను తన పుస్తకంలో చేర్చి ముద్రించారు.

**పులిజాల గోపాలరావు** : చండూరు మండలం దోనిపాముల గ్రామంలో జన్మించారు. సంస్కృతాంధ్ర, ఉర్దూలలో పండితుడు. ఖడ్గ తిక్కన కావ్యంతో ప్రసిద్ధి గాంచిన ఈయన అనేక శతకాలు రచించాడు. పల్లె బతుకు సాంఘిక ఇతివృత్తంతో కవిత్వం రాశారు. 'వియోగ గీతి ' రచించాడు.

**నీలా జంగయ్య** : దేవరకొండ మండలం ఇదంపల్లి గ్రామంలో జననం. ఆంధ్రసారస్వత పరిషత్ పరీక్షలను ఏర్పాటు చేయించి మారుమూల పల్లెల్లో నివసించే ఎందరికో విద్యావకాశం కల్గచేసి వారిని ఉన్నత స్థితికి తెచ్చిన వారిలో ప్రథములు. తెలుగు అకాడమీలో రీసెర్చి ఆఫీసర్‌గా పనిచేశాడు. బాల గీతాంజలి, వైశ్యకుల దీపిక, ఆవేదన, సుమమాల, విప్లవ స్వరాలు, రామ శతకం, పెళ్ళి తోరణాలు, చిత్కళ, స్వర్ణకమల మొదలైనవి వీరి రచనలు.

**జరిగల బుచ్చిరామదాసు** : నకిరేకల్లు మండలం చందుపట్ల గ్రామంలో జననం. 1941 ప్రాంతానికి చెందిన కవి. వేదాంత విషయ భరిత రచనలు చేస్తూ సామాన్య జనులకు కూడా భక్తి భావాన్ని ప్రవచింపజేశారు. వీరు జ్ఞానవిద్యా పరిపూర్ణులు. శ్రీరామదాసు బోధామృతం, కలియుగ భవిష్యత్, మహేంద్ర జననం బుర్రకథ, స్కైలాబ్ చరిత్ర అనే రగడ, బ్రహ్మజ్ఞాన నీతి శతకం వీరి రచనలు.

**మేరెడ్డి యాదగిరిరెడ్డి** : తిప్పర్తి మండలం గడ్డి కొండారం గ్రామంలో జననం. వీరు 100 కి పైగా కథలు, అనేక కవితలు రచించారు. దర్పణం అనే కథా సంపుటిలోని 'చావుకోసం' అనే కథ అక్కినేని అవార్డు పొందింది.

**శ్రీ పెరుంబుదూరు రాఘవాచార్యులు** : చందుపట్ల గ్రామంలో జననం. జ్యోతిషం, వైద్యం, వేద విద్యల్లో నిష్ణాతులు. ఈయన పద్యాలు, చాటుపద్య రత్నావళిలోను, నల్లగొండ జిల్లా సరస్వంలో ప్రచురించారు. మహాకవి, ప్రౌఢకవి, ఆశుకవిగా ప్రసిద్ధులు. వృషదద్రి రామశతకం, చందుపట్ల పుర సీతారామ చంద్ర ప్రభు శతకాలు, యాదగిరి లక్ష్మీ నృసింహ స్తోత్రాలను రచించారు.

**పెరిక రాజరత్నం** : నల్లగొండ పట్టణంలో జననం. 'తొలి వెలుగు' అనే వార పత్రికను నడిపాడు. ఈయన ఎడారి బ్రతుకులు, ఇష్టంలేని పెళ్ళి, నూతన కాంతులు, ఎవరు బాధ్యులు, తపస్విని, పుణ్యభూమి కొన్ని పాటలను రచించారు.

**అంబటిపూడి వెంకటరత్నం** : చండూరులో 'సాహితీ మేఖల' స్థాపకుడు. దీనిద్వారా ఎన్నో సాహిత్య కార్యక్రమాలను, కవి సమ్మేళనాలను, గ్రంథ ప్రచురణ, ఆవిష్కరణలను ఏర్పాటు చేసి మిక్కిలి చైతన్యం కలిగించినారు. ఈయన కృష్ణకథ,

విదేక శిఖరాలు, సంధ్యావిద్య, ప్రభు సప్తతి, భారతీయ సంస్కృతి, తత్త్వ సమావర్తనం, వేదాంతసారం, దశోపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, తాత్త్విక తరంగాలు రచించారు.

**వట్టికోట ఆళ్వారు స్వామి** : శాలిగౌరారం మండలం మాధవవరంలో 1915లో జన్మించారు. దేశోద్ధారక గ్రంధమాల పేరుతో దాదాపు 35 పుస్తకాలను ప్రచురించాడు. కొంతకాలం గోలకొండ పత్రికల్లో ప్రూఫ్‌రీడర్‌గా పనిచేశాడు. ఆంధ్రమహాసభకు నల్లగొండ జిల్లా ప్రతినిధిగా పనిచేశాడు. గోలకొండ, తెనుగు పత్రికలలో తెలంగాణ, రామప్ప రభస పేరుతో అనేక వ్యాసాలు రచించాడు. 1935-40 నాటి తెలంగాణ రాజకీయ ఉద్యమాన్ని ప్రజలమనిషి నవలలో, 1940-45 నాటి తెలంగాణ రాజకీయ ప్రజా ఉద్యమాలను, సాంఘిక జీవితాన్ని గంగు (అసమగ్రం) నవలలో చిత్రించాడు. ఇంకా 'కనువిప్పు' అనే నాటకాన్ని, 'జైలు లోపల' అనే కథానికి సంపుటిని రచించాడు.

**బద్దం నరసింహారెడ్డి (బి.ఎన్.రెడ్డి)** : నకిరేకల్లు మండల కేంద్రానికి చెందిన వ్యక్తి. ఈయన ఒక 'ఆర్కిటెక్చర్ ఇంజనీర్'. వృత్తి వేరైనా ప్రవృత్తి మాత్రం సాహిత్య జీవితం. రమణీయంగా అర్థవంతంగా సమయోచితంగా కవిత చెప్పి ఎందరినో మెప్పించారు. ఈయన సందేశాత్మక రచనగా 'సామాన్యుని సందేశము'ను, లోకవృత్తిని నీతి ప్రబోధకంగా 'బి.ఎన్.భాషితాలు' పేర ప్రచురించారు.

**గింజల నరసింహారెడ్డి** : నకిరెకల్లు గ్రామ నివాసి. ప్రాచీన కవుల్లో ఆధునిక కవి. ఆధునికుల్లో ప్రాచీన కవిగా ప్రశంసించ బడినాడు. ఈయన ఊహాకృతి, శక్తిధార, శబ్దధనువు, శేషేంద్ర ధనువు, విశ్వగీతి, వివేకానంద స్మృతి అనే రచనలు చేశాడు.

**శ్రీరంగాచార్య** : నకిరేకల్లు మండలం చందుపట్ల గ్రామ వాస్తవ్యులు. మరింగంటి కవుల సాహిత్య సేవ అంశంపై పిహెచ్.డి. చేశారు. నల్లగొండ తాళపత్ర గ్రంథాలు, జిల్లాకు చెందిన ప్రాచీన, ఆధునిక కవులు, వారి రచనలను పరిచయం చేస్తూ 'నల్లగొండ జిల్లా కవులు - పండితులు' అనే గ్రంథాన్ని రచించారు. అంతేకాకుండా దశరథరాజనందన చరిత్ర, తాలాంకనందినీ పరిణయం, చాటుపద్య రత్నావళి, చంద్రికా పరిణయం మొదలైన గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. దేశిక సాహితి మొదలైన గ్రంథాలను వెలువరించారు.

**సుంకిరెడ్డి నారాయణ రెడ్డి** : కనగల్లు మండలం పగిడిమర్రిలో జననం. సాహిత్య సామాజికోద్యమాల పరిణామ క్రమంలో కవిత్వాన్ని చరిత్ర శకటానికి ఎక్కించి తెలంగాణ తోవకు కదిలిన వరిష్ట పరిశోధకునిగా గుర్తింపు పొందిన ఈయన తెలంగాణకు ఎనలేని సేవ చేస్తున్నారు. ముంగిలి, మత్తడి, తోవ ఎక్కడ, దాలి (తెలంగాణ దీర్ఘకవిత), నల్ల వలస, విపశ్యన కవిత్వం, తావు, గనుమ లాంటి ఎన్నో పుస్తకాలను రచించి కవిగా, విమర్శకునిగా, పరిశోధకునిగా ప్రఖ్యాతి పొందినాడు.

**గురిజాల రామశేషయ్య** : 1949లో శాలిగౌరారంలో జన్మించారు. వివిధ సాహిత్య సభలలోను, కవి సమ్మేళనాల లోను అత్యుత్సాహంగా పాల్గొని ప్రశంసలు అందుకున్న నిరంతర సాహితీ పరిశోధకుడు, కవి. సాహితీ లహరి అనే కవితా సంకలనాన్ని, అక్షరపతాక, వికాస రేఖలు అనే వచన కవితా సంపుటి, విశ్వంభర - అనుశీలనం, సాహిత్య వ్యాసాలు అనే పుస్తకాలను వెలువరించారు.

**వేణు సంకోజు** : చండూరు పట్టణంలో జననం. అసలు పేరు సంకోజు యాదగిరి. ఈయన తొలికవితా సంపుటి 'మనిషిగా పూచె మట్టి', తర్వాత మనం, నేలకల మొదలైన అనేక సంపుటాలు వెలువరించారు.

**డా॥ ఎస్. రఘు** : నల్లగొండలో జననం. ప్రస్తుతం ఉస్మానియా తెలుగుశాఖలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్నారు. ప్రకృతి ఆరాధకుడు. సమాజ ప్రేమికుడు. కవి, విమర్శకుడు, పరిశోదకునిగా సాహిత్యంలో విశిష్ట సేవ చేస్తున్నారు. వీరు 'జీవనలిపి' అనే నానీల పుస్తకాన్ని, నానీలు - సంవీక్షణం, నానీల దశాబ్ది, డా.ఎన్.గోపి సాహిత్య వివేచన మొదలైన రచనలు చేసినారు. అనేక పత్రికలలో వ్యాసాలు, పుస్తక సమీక్షలు చేశారు.

**ఆచార్య సూర్యాధనంజయ్** : మిర్యాలగూడెం మండలానికి సమీపంలో భల్లునాయక్ తండాలో జననం. ఈమె తన అధ్యయనాన్ని కేవలం బంజారా సాహిత్యం, సంస్కృతులకు, గిరిజన సాహిత్య సంస్కృతులకు మాత్రమే పరిమితం చేయకుండా నిబద్ధతగల తెలుగు అధ్యాపకురాలిగా అటు ప్రాచీన సాహిత్యం, ఇటు ఆధునిక సాహిత్యాలలో అభినివేశాన్ని ప్రదర్శిస్తున్నారు. రామాయణం అరణ్యకాండ లోని ఆశ్రమాలు – శ్రీరాముని దర్శనాలు, నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం – జీవన చిత్రణ, చతురతకు బహుమానం, బంజారా నానీలు, తాంగ్డి, బంజారాల స్త్రీల గేయ సాహిత్యం సామాజిక మానవ శాస్త్ర అధ్యయనం అనే గ్రంథాలను రచించారు.

**డా॥ సాగి కమలాకర శర్మ** : నార్కట్‌పల్లి మండలం జువ్విగూడెంలో జననం. ప్రస్తుతం ఉస్మానియా తెలుగుశాఖలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్నారు. మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రికకు సంపాదకుడు. జ్యోతిష పండితులు. తెలుగు సాహిత్యంలో జ్యోతిష విజ్ఞానం అనే అంశంపై పరిశోధన చేసి 'జ్యోతిర్మయం వాఙ్మయం' అనే గ్రంథం వెలువరించారు. చాలా సాహిత్య, జ్యోతిష గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. జాతీయ అంతర్జాతీయ సదస్సుల్లో అనేక పత్ర సమర్పణలు చేశారు.

**సాహితీ సంస్థలు** : నల్లగొండ వివిధ రంగాలలో ప్రసిద్ధిగాంచిన విధంగానే కళా సాహిత్య సాంస్కృతిక రంగాలలో కూడా గణనీయమైన కృషితో ప్రఖ్యాతమైంది. ఈ జిల్లాలో ఎన్నో గ్రంథాలయాలు, సాహితీ సంస్థలు వెలిశాయి. సాహిత్య సంస్థల ఏర్పాటుకు నిజాం ప్రభుత్వం అనుమతిని ఇవ్వకుండా ఎన్ని నిర్బంధాలను విధించినా ఆనాటి పెద్దలు సాహితీ సంస్థలను, గ్రంథాలయాలను స్థాపించి, వాని ద్వారా ప్రజా చైతన్యాన్ని కలిగించారు. నల్లగొండలో తొలిసాహితీ సంస్థ 'సంస్కారిణి'ను 1911లో షబ్నవీస్ నెలకొల్పాడు. 1934 సం.లో చందూరు మండలంలో అంబటిపూడి వెంకటరత్నం సాహితీ మేఖల అనే సంస్థను ఏర్పాటు చేశాడు. 1945సం.లో ధవళా శ్రీనివాసరావు గారు నీలగిరి సారస్వత సమితిని ఏర్పాటు చేశారు. నవోదయ కళామండలి, హనుమత్ సాహితీ సంస్థ, తరులు కల్ప సంచయం, లలిత కళాపరిషత్తు, అన్నమాచార్య కళాసమితి, జాతీయ సాహిత్య పరిషత్తు, జానపద సాహిత్య పరిషత్తు, నీలగిరి సాహితి సమాఖ్య, పరిశోధక మండలి, జిల్లా రచయితల సంఘం, యువ రచయితల సమితి ... అంతే కాకుండా మిర్యాలగూడ పట్టణంలో సాహితీ లహరి, స్పందన సాహితి సంస్థలు. నాగార్జున సాగర్ యువరచయితల సమితి, దేవరకొండలో సాంస్కృతిక సాహితీ సమాఖ్య, చిట్యాలలో ప్రమోద సాహితి, తెలుగు పరిరక్షణ సమితి, సాహితీ మిత్రులు, చండూరులో స్పందన జానపద కళాసమితి, నల్లగొండలో సారస్వత పరిషత్తు, జయమిత్ర మొదలైన సాహితీ సంస్థలున్నాయి.

**జిల్లాలో ప్రముఖ వ్యక్తులు**

నల్లగొండ జిల్లా రాజకీయ, సినిమా, సాంస్కృతిక రంగాలలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని కలిగి వుంది. రాజకీయ రంగం విషయానికొస్తే కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్వాయి గోవర్ధన్ రెడ్డి, కుందూరు జానారెడ్డి, చకిలం శ్రీనివాసరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ధీరావత్ రాగ్యానాయక్ ముఖ్యులు. ఇతర పార్టీల విషయానికొస్తే గుత్తా సుఖేందర్ రెడ్డి, జూలకంటి రంగారెడ్డి, తిప్పన విజయసింహా రెడ్డి, నర్రా రాఘవరెడ్డి, నోముల నర్సింహయ్య, గుర్రం యాదగిరిరెడ్డి, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, గాదరి కిశోర్, బండా నరేందర్ రెడ్డి, కంచర్ల భూపాల్ రెడ్డి, దుబ్బాక నరసింహారెడ్డి, భోనగిరి దేవేందర్, రవీందర్ కుమార్, భాస్కర్‌రావు ప్రముఖులు.

సినిమా రంగానికొస్తే ఎం. ప్రభాకర రెడ్డి, జయప్రకాశ్ రెడ్డి, చిన్ని చరణ్, గద్దర్ నర్సిరెడ్డి ప్రముఖులుగా చెప్పవచ్చు. మిర్యాలగూడకు చెందిన సుదర్శన్ గొప్ప చిత్రకారుడు. 'దాసి' సినిమాకు కళా దర్శకుడిగా పనిచేసి రాష్ట్రపతి అవార్డు పొందినారు. ఇదే ప్రాంతానికి చెందిన 'దేవరాయ' మంచి

చిత్రకారుడు. అనేక చిత్రకళా ప్రదర్శనలు ఏర్పాటు చేసి పలువురి ప్రశంసలు పొందారు. చండూరు మండల కేంద్రానికి చెందిన ఇత్తడి నగిషీ కళాకారులు ప్రసిద్ధి గాంచారు.

**జిల్లాలో పర్యాటక కేంద్రాలు**

నల్లగొండ తెలంగాణాలో పర్యాటక కోణం దృష్ట్యా ఒక ముఖ్య భాగం. నల్లగొండకు వాటిపై ఆధారపడే ఏవిధమైన ఇతర ప్రధాన వ్యాపారాలు లేకపోవడం వలన ఆర్థిక వనరులు ప్రధానంగా పర్యాటక రంగంనుంచే లభిస్తాయి. నాగార్జునసాగర్, వాడపల్లి క్షేత్రాలు, లతీఫ్ సాహెబ్ దర్గా, నందికొండ, దేవరకొండ, రాచకొండ కోటలు, పానగల్ దేవాలయాలు, ఎత్తిపోతల జలపాతాలు, చందంపేట మండలం అటవీ ప్రాంతం, బుగ్గతండా నుంచి జాలువారే జలపాతాలు, సలేశ్వరం గుట్టలు, డిండి ప్రాజెక్టు, చెర్వుగట్టు రామలింగేశ్వర స్వామి ఆలయం, కాపురాల గుట్ట, బుద్ధవనం, చండూరు ఇత్తడి పరిశ్రమ మొదలైనవి.

**నాగార్జున సాగర్** : నాగార్జునసాగర్ ప్రపంచంలో వున్న బౌద్ధులకు ముఖ్యమైన స్థలం. ఇది దక్షిణ భారత రాష్ట్రమైన తెలంగాణాలో ఒక చిన్న పట్టణంగా ప్రసిద్ధి. దీనిని విజయపురి అనే పేరుతో పిలిచేవారు. ఒక బౌద్ధ భక్తుడు నాగార్జున పేరుతో ఈ పట్టణం పేరు ఏర్పడింది. ఈయన బుద్ధుని భక్తుడే గాక, అక్కడి ప్రజలచే కీర్తింపబడినాడు.

పురాతన తవ్వకాలలో ఈ ప్రాంతంలో బౌద్ధమతం ప్రసిద్ధి చెందినట్లుగా సాక్ష్యాధారాలు కనిపించాయి. ఈ ఆధారాలన్నీ స్థూపాలు మరియు శిల్పాల రూపంలో బుద్ధుడి జీవిత చరిత్ర గురించి, అతని బోధనల గురించి ఉన్నాయి. ఈ సాక్ష్యాధారాల వలన నాగార్జునసాగర్ ఒక ముఖ్యమైన పురావస్తు స్థలంగా కూడా పేరు పొందింది. ఇక్కడ నాగార్జునసాగర్ డ్యాం, ఎత్తిపోతల జలపాతాలు మరియు నాగార్జున కొండ వున్నాయి.

**నాగార్జున కొండ** : ఆచార్య నాగార్జునుడి పేరుతో ఏర్పడినదే నాగార్జున కొండ. ఇది నాగార్జునుడి కాలంనాటి జిజ్ఞాసకు, మానవతా వాదానికి చక్కని ప్రతీకగా నిలుస్తుంది. ఈ ప్రాంతంలో బ్రహ్మలిపిలో రాసిన రాతలు కనిపిస్తాయి. ఇక్కడ లభించిన అవశేషాలన్నింటినీ సాగర్ జలాల మధ్యలో ద్వీపం వంటి గట్టుమీద మనం ప్రస్తుతం గమనించవచ్చు.

**వాడపల్లి** : మిర్యాలగూడ నుంచి 25 కి.మీ. దూరంలో వాడపల్లి వుంది. కృష్ణా, మూసీ నదుల సంగమ క్షేత్రం ఇది. జలదుర్గంగా గుర్తింపు పొందింది. 12 వ శతాబ్దంలో కాకతీయుల కాలం నాటి 'మీనాక్షి అగస్త్యేశ్వర స్వామి ఆలయం' మరియు 'లక్ష్మీనరసింహ స్వామి ఆలయం' ఇక్కడ ప్రసిద్ధి. ఇది ఒక చారిత్రక ప్రదేశం. అగస్త్యేశ్వర స్వామి దేవాలయంలో శాసనం ఇక్కడి చరిత్రను మనకు తెలియజేస్తుంది. ఈ శివాలయంలోని శివలింగం మధ్యలో ఒక పెద్ద రంధ్రం ఉంటుంది. దాని నిండా అన్ని కాలాల్లో నీరు నిండి ఉంటుంది. పెద్దదైన శివలింగంలో ఆ నీటి ఊటకు మూలాన్ని ఎవరూ ఊహించలేక పోతున్నారు. ఆ నీరు అక్కడి నుండి పొంగి పొరలదు, ఎన్ని నీళ్ళు దాని నుండి తీసినప్పటికీ తగ్గిపోదు.

అదేవిధంగా లక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయం అపురూప వాస్తుశిల్ప శోభితం. స్వామి వారి వద్ద పెట్టే రెండు దీపాల్లో ఒక దీపం ఎప్పటికీ కదులుతూ ఉంటుంది. ఇవి స్వామి వారి ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా భావిస్తుంటారు.

**దేవర కొండ కోట** : దేవరకొండ కోట ఏడు కొండలతో చుట్టబడిన ఒక కొండపై వుంది. అప్పట్లో ఎంతో ప్రాముఖ్యత వహించిన ఈ కోటను 14 వ శతాబ్దంలో వెలమరాజులు నిర్మించారు. ఈ కోటను నల్లగొండ, హైదరాబాదు, శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి రోడ్డు మార్గాన చేరవచ్చు.

**పానగల్ దేవాలయాలు** : పానగల్లులో పచ్చల సోమేశ్వరాలయం, ఛాయా సోమేశ్వరాలయాలు వున్నాయి. సోమేశ్వర ఆలయం పానగల్లు గ్రామంలో వుంది. చరిత్ర

ప్రకారం పానగల్ కాకతీయ రాజుల రాజధానిగా వున్నప్పుడు అభివృద్ధి చెందిన పట్టణం. కాకతీయులు ఈ ప్రాంతాన్ని 11 వ శతాబ్దంలో కొంతకాలం పాటు తమ రాజధానిగా చేశారు. అదే సమయంలో దేవాలయాన్ని నిర్మించారు. ఈ దేవాలయం 66 స్తంభాల గొప్ప నిర్మాణం. ఈ స్తంభాలపై అంతర్భాగమైన, అందమైన చెక్కడాలున్నాయి. మండపానికి ఎదురుగా మధ్యలో ఒక నంది విగ్రహం వుంది. ఇక్కడ ఆలయం లోపలి శివుని విగ్రహం వుంటుంది. దేవాలయ గోడలపైన గొప్ప హిందూ పురాణాలు రామాయణ, భారత దృశ్యాలను చూడవచ్చు.

నల్లగొండ పట్టణానికి సమీపంలో పానుగల్లుకు తూర్పు దిశలో శ్రీ ఛాయా సోమేశ్వరాలయం వుంది. ఈ ఆలయ నిర్మాణం ఓ అద్భుతమని చెప్పవచ్చు. 24 గంటలు పగలు రాత్రి తేడా లేకుండా ఈ ఆలయంలోని శివలింగంపై నీడ పడుతుంది. ప్రత్యేకమైన వాస్తుశిల్ప రీతులు మన పూర్వకాలంలో ఉన్నాయనడానికి ఇటువంటి దేవాలయాలే మనకు తార్కాణంగా నిలిచి ఉన్నాయి. ఈ ఆలయం త్రికూటాలయం. ఆలయం ముందు ఉదయ సముద్రంగా పిలువబడే పెద్ద చెరువు వుంది.

**చెర్వుగట్టు** : నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలో శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం. జాతీయ రహదారికి కేవలం నాలుగు కి.మీ. దూరంలో వుంది. 108 ప్రసిద్ధి శివలింగాలలో చెర్వుగట్టు లింగం ఒకటని భావిస్తారు. ఇక్కడ గుట్టపైన మూడుగుండ్లు ఉండడం ప్రసిద్ధంగా భావిస్తారు. ఈ గుట్టపై శివలింగాన్ని స్వయంగా పరశురాముడే ప్రతిష్ఠించాడని స్థల పురాణాన్ని బట్టి తెలుస్తోంది.

**ఎత్తిపోతల జలపాతాలు** : ఈ జలపాతాలు నాగార్జునసాగర్ ఆనకట్టకు 11 కి.మీ. దూరంలో వున్నాయి. కృష్ణానదికి ఉపనది అయిన చంద్రవంక 70 అడుగుల ఎత్తునుంచి ఉధృతంగా ప్రవహించడం వలన ఈ జలపాతాలు ఏర్పడ్డాయి. నిజానికి చంద్రవంక వాగు, తుమ్మలవాగు మరియు నక్కలవాగు అనే మూడు నదుల కలయికే ఈ జలపాతాలు. జలపాతాల నీరు నాగార్జునసాగర్ డ్యాం నుంచి కృష్ణానదిని చేరుతుంది. ఈ జలపాతం నదికి 35 కి.మీ. దూరంలో వుంటుంది. రంగనాథ మరియు దత్తాత్రేయ ఆలయాలు ఈ జలపాతాలకు చాలా దగ్గరగా వున్నాయి.

**లతీఫ్ సాహెబ్ దర్గా** : ఈ దర్గా నల్లగొండ పట్టణంలో మత సామరస్యానికి ప్రతీక. ఇక్కడ రెండువేల సంవత్సరాల క్రితమే ఒక దుర్గము ఉండేదని చరిత్ర చెబుతోంది. ఈ దుర్గము ఇప్పుడు నామమాత్రంగా కనిపిస్తుంది. ఇది చాళుక్య రాజుల కాలం నాటిది. ఈ దర్గా ముస్లిం సన్యాసికి చెందినప్పటికీ అన్ని మతాల ప్రజలు పెద్ద సంఖ్యలో ఇక్కడకు వస్తారు. ఈ దర్గాలో ప్రతి యేడు 'ఉరుసు' అనే ఉత్సవం జరుగుతుంది. ఈ గుట్టకు ప్రక్కనే కాపురాల గుట్ట వుంది.

**చండూరు ఇత్తడి పరిశ్రమ** : చండూరు నల్లగొండ పట్టణానికి 33 కి.మీ. దూరంలో వుంది. ఇక్కడ ఇత్తడి పరిశ్రమ తరతరాలుగా వర్ధిల్లుతూ, నగిషీ చెక్కిన కళాఖండాలు దేశ, విదేశాలలో పేరు ప్రఖ్యాతులు సంపాదించాయి. అనేక మంది నగిషీ కళాకారులు కలరు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులు, అవార్డులు కూడా స్వీకరించారు ఇక్కడి కార్మికులు,బిందెలు, సర్వలు, చెంబులు, వంటపాత్రలు చేయడంలో ప్రసిద్ధి.

**పేరూరు** : అనుముల మండలంలో అహల్యా నదీ ఒడ్డున ఈ గ్రామం వుంది. ఈ గ్రామంలో స్వయంభూ సోమేశ్వరాలయం వుంది. ఇది ప్రాచీన చరిత్ర గల గ్రామం. కందూరిచోళులు, కాకతీయులు, కల్యాణీ చాళుక్యులు ఈ పట్టణాన్ని పాలించినట్లుగా తెలుస్తోంది. ఇక్కడ ప్రతి సంవత్సరం శివరాత్రి ఉత్సవాలు, జాతర జరుగును. పూర్వం ఇది ఒక వ్యాపారకేంద్రమని ఇక్కడి శాసనాలు చెపుతున్నాయి.

తమిళప్రాంతం వారు కూడా ఇక్కడికి పడవలపై వచ్చి వ్యాపారాలు చేసేవారట.

**గోపలాయపల్లి** : ఇది నార్కట్‌పల్లి మండలంలో వున్న గ్రామం. ఇక్కడ శ్రీవారిజాల వేణుగోపాల స్వామి దేవాలయం గోపలాయపల్లి గుట్టపై నిర్మించబడింది. దేవాలయం వద్ద ప్రశాంత వాతావరణం భక్తులకు ఆనందం కలిగిస్తుంది.

**అజిలాపురం బుగ్గ** : మర్రిగూడెం మండలం అజిలాపురం పంచాయితీకి మూడు కిలోమీటర్ల దూరంలో వున్న బుగ్గ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం పురాతనమైంది. ఇక్కడ నాగుపాముకు ఇష్టమైన మొగిలి చెట్లు భారీ సంఖ్యలో వున్నాయి. కోరికలను తీర్చే దేవుడిగా ప్రసిద్ధికెక్కాడు. నాగార్జునసాగర్ ఎత్తిపోతల జలపాతాల వలె ఇక్కడి గుట్టలపై నుంచి జలపాతాలు దూకుతాయి. దీనిని న్యూ ఎత్తిపోతలుగా పిలుస్తారు.

**దేవాలయాలు**

నల్లగొండ జిల్లాలో వున్న ప్రతి సాధారణ గ్రామం లోనూ ఒక దేవాలయం కనిపిస్తుంది. గ్రామ దేవతల ఆలయాలు లేదా హనుమంతుని విగ్రహాలుంటాయి.

**ప్రసిద్ధ దేవాలయాలు**

శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయం - చెర్వుగట్టు; అగస్త్యేశ్వర స్వామి ఆలయం - వాడపల్లి (దామర చర్ల); పార్వతీ శంభులింగేశ్వర స్వామి ఆలయం - శాలిగౌరారం; ఉమామహేశ్వర ఆలయం - భైరవునిబండ, శాలిగౌరారం; స్వయంభూ సోమేశ్వరాలయం - పేరూరు, హాలియా; పచ్చల సోమేశ్వరాలయం - పానగల్లు, నల్లగొండ; ఛాయా సోమేశ్వరాలయం-పానగల్లు, నల్లగొండ; మార్కండేశ్వర స్వామి దేవాలయం - చండూరు పట్టణం; శంభులింగేశ్వర స్వామి ఆలయం - ఒల్లాల; లింగమంతుల స్వామి దేవాలయం - ఎల్లబెల్లి; రామలింగేశ్వర స్వామి - తుమ్మలపల్లి, చండూరు; త్రికూట శివాలయం - ఆకారం, నకిరేకల్లు; కాశీలింగేశ్వర స్వామి - నల్లగొండ పాతబస్తీ.

శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం - నల్లగొండ పట్టణం; శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం - నల్లగొండ పట్టణం; సప్తగిరి బుగ్గా నరసింహ స్వామి - అజిలాపురం, మర్రిగూడెం; వేంకటేశ్వరస్వామి దేవాలయం - అవంతీపురం, మిర్యాలగూడెం; శ్రీ వేణుగోపాల స్వామి - గోపలాయపల్లి; శిథిల త్రిపురాంతకేశ్వరాలయం శాసనం - ఆలగడప, మిర్యాలగూడెం; సూర్య దేవాలయం - ఆకారం, నకిరేకల్లు;

మొదటి నుండీ ఉద్యమ కేంద్రంగా, చైతన్యశీలంతో అడుగు ముందుకు వేసిన జిల్లా ఇది. ఎంతో చారిత్రక వారసత్వంతో కూడుకున్న ప్రదేశమీ నల్లగొండ. నాగార్జున సాగరం ద్వారా లక్షల ఎకరాలకు నీరు అందుతున్న ప్రదేశమిది. ఎందరో మహనీయులు, కళాకారులు, ఉద్యమశీలురు జన్మించిన క్షేత్రమిది. ఎన్నో విశిష్టమైన దేవాలయాలున్న ప్రదేశం. దేవరకొండ, వాడపల్లి, పానుగల్లు, నాగార్జున కొండ వంటి ప్రాచీన తెలుగు నగరాలు విలసిల్లిన ప్రదేశం. ఈ స్ఫూర్తితో అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలుస్తున్న జిల్లా నల్లగొండ.

# నాగర్‌కర్నూల్

సోమశిలన్ వెలుంగులిడు సోముని కోవెలలుల్లసిల్లెడిన్
భామహ మల్లె తీర్థములు పాలెము వేంకటనాధు ధామముల్
ఖ్యామతులైన సజ్జనులు గౌరవమందిన వీరులెందరో
ప్రేమలనందినారిచట విశ్వహితాత్యమత సంస్కృతి ప్రభన్ !

తెలంగాణ రాష్ట్రం జూన్ 2, 2014న ఇరవై తొమ్మిదవ రాష్ట్రంగా ఆవిర్భవించింది. పరిపాలనా సౌలభ్యం కొరకు తొలి ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పది జిల్లాల తెలంగాణను ముప్పైయొక్క జిల్లాలుగా విభజించారు. కొత్త జిల్లాల చరిత్ర 11.10.2016 నుండి ప్రారంభమైంది. 1985లో తాలూకాల స్థానంలో మండలాలు రావడంతో బహుముఖంగా అభివృద్ధి చెందింది. ఇప్పుడు అదే విధంగా కొత్త జిల్లాల ఏర్పాటుతో మరింత అభివృద్ధిని ఆశించవచ్చు.

## ఈ పేరెందుకు?

1. గడియారం రామకృష్ణ శర్మ అభిప్రాయం ప్రకారం ఇక్ష్వాకుల సామంతుడు విశాఖనాగుడు ఈ భాగాన్ని పాలించాడు. కనుక నాగన కందనూలు అని ఒక వాదన.

2. నైజాం కాలంలో ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌ను పెద్దకందనూలని నాగర్‌కర్నూల్‌ను చిన్నకందనూలని పిలిచేవారు. నేటికి నాగర్‌కర్నూల్‌ను సామాన్య ప్రజలు కందనూలు అని పిలవడం గమనార్హం. కర్నూల్‌కు “కల్లూరు” అని పేరు. “కల్లు” అనగా రాయి అని అర్థం. ఈ ప్రాంతంలో భూగర్భంలో పొరలుపొరలుగా నాపరాయి లాంటి రాయి ఉంది. అందువల్ల ఈ ప్రాంతాన్ని “కల్లూరు” అన్నారు. నాగర్‌కర్నూల్ భూగర్భంలో కూడా నల్లరాతి గుండ్లు ఉన్నవి. ఈ గుండ్లు కేసరి సముద్ర నిర్మాణంలో ఉపయోగించినారు. ఈ ప్రాంతాన్ని మొదట “కల్లూరు” అని పిలిచారు.

3. అలంపూర్ దేవాలయ నిర్మాణానికి జగన్నాథం గట్టు నుండి రాయిని తీసుకొచ్చే బండ్లు కల్లూరు వద్ద తమ బండ్లకు కందెన వేసుకునేవారు. బాదేపల్లి మార్కెట్టుకు రైతులు తమ పంటను తీసుకుపోయే దారిలో “కల్లూరు” వద్ద తమ బండ్లకు కందెన వేసుకొనే వారు. దీనితో ఈ ప్రాంతాలకు “కందెనవోలు”గా పేర్లు వచ్చినాయి.

4. పూర్వం నాగన, కందన సోదర ద్వయం ఈ ప్రాంతానికి వచ్చి నాగనవోలు (నాగనూలు), కందనవోలు (కందనూలు)గా స్థావరాలు ఏర్పాటు చేసుకొన్నారు. నాగనవోలు ప్రధాన దారికి దూరంగా, నీటి ఎద్దడికి దగ్గరగా ఉండడం. కందనవోలు అన్ని వసతులుండి ప్రధాన రహదారిలో ఉండడంతో కాలక్రమేణ నాగనవోలు ప్రజలు కందనవోలులో స్థిరపడ్డారు. సోదరులపై ఉన్న గౌరవాభిమానాలచేత కందనవోలు ప్రాంతం “నాగన కందనవోలు”గా పిలవబడింది.

5. ఇది ఇలా ఉండగా క్రీ. శ. 1867లో నిజాం రాష్ట్రం డివిజన్లుగా విభజించినప్పుడు నల్గొండ జిల్లాలోని కొంత భాగాన్ని కందనూలు జిల్లాలో కలుపుతున్న సందర్భంలో

**రెవెన్యూ డివిజన్లు - మండలాలు**

రెవెన్యూ డివిజన్లు 3 -

1. నాగర్‌కర్నూల్ 2. కల్వకుర్తి 3. అచ్చంపేట

**నాగర్‌కర్నూలు డివిజన్‌లోని మండలాలు 9 :**

1. నాగర్‌కర్నూల్ 2. తాడూరు 3. బిజినేపల్లి 4. తిమ్మాజిపేట 5. తెల్కపల్లి 6. పెద్దకొత్తపల్లి 7. కొల్లాపూర్ 8. పెంట్లవెల్లి 9. చిన్నంబావి.

**కల్వకుర్తి డివిజన్‌లోని మండలాలు 5 :**

1. కల్వకుర్తి 2. ఉరకొండ 3. వెల్దండ 4. వంగూరు 5. మిడ్జిల్

**అచ్చంపేట డివిజన్‌లోని మండలాలు 7 :**

1. అచ్చంపేట 2. అమ్రాబాద్ 3. పాదర 4. బల్మూరు 5. లింగాల 6. ఉప్పునూతల 7. సిద్ధాపూర్

సర్ సాలార్జంగ్ ఒకే పేరున రెండు జిల్లాలు (పెద్ద కందనూలు, చిన్న కందనూలు) ఉంటే పరిపాలనలో సమస్యలు వస్తాయని భావించి "నాగర్" అనే శబ్దాన్ని చేర్చి "నాగర కందనూలు"గా మార్చినాడు. కాలంతో పాటు నాగరకందనూలు "నాగర్‌కర్నూల్"గా మారినది.

## భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి

నాగర్‌కర్నూల్ జిల్లా విస్తీర్ణం రీత్యా రెండవ అతిపెద్ద జిల్లా. నాగర్‌కర్నూల్ జిల్లా విస్తీర్ణం 6,924 చ.కి.మీ. సముద్ర మట్టానికి ఎత్తు 458 మీటర్లు. తూర్పు అక్షాంశం $16^0$ $49^1$ ఉత్తర రేఖాంశం $78.31^1$. జిల్లా ఎల్లలు తూర్పున నల్లమల కొండలు, పడమర వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాలు. ఉత్తరాన రంగారెడ్డి, నల్గొండ జిల్లాలు. దక్షిణాన కృష్ణానది ఉన్నాయి.

## సహజ వనరులు

**నేలలు :** కృష్ణానది పరివాహక ప్రాంతం వాగులు, సెలయేరులు, ప్రవహించే మార్గాలలో మరియు అక్కడక్కడ నల్లరేగడి భూములున్నాయి. ఈ నేలలో నీరు నిలువ ఉండదు. కంది, పెసర, బొబ్బర, జొన్న, సజ్జ, రాగి, వేరుశనగ వంటి వర్షాధార పంటలకు ఈ నేల అనువైంది. ఆముదం, మిరప, ప్రత్తి, ఉలవ, కొర్ర, అర్కలు మొదలైన పంటలు పండిస్తారు.

**అడవులు** : జిల్లాలోని అచ్చంపేట, కొల్లాపూర్ తాలూకాలలో నల్లమల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఈ అడవులలో సహజవనరులు అపారంగా ఉన్నాయి. అవి తేనె, జిగురు, సుగంధ పాలవేర్లు, కుంకుడుకాయలు, చీపురుపుల్లలు, కానుగ, ఇప్పపలుకు, సారెపప్పు, తునికాకు, మోదుగాకుతో పాటు వనమూలికలలు పుష్కలంగా ఉన్నాయి. అచ్చంపేట ప్రాంతంలోని అక్కారం కుంకుడు కాయలకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఈ కుంకుడు కాయలతో బల్మూరు మండలం కొండనాగులలో షాంపూల తయారీ పరిశ్రమ నెలకొల్పనున్నారు.

అమ్రాబాద్ మండలంలోని టైగర్ రిజర్వు ఫారెస్టును దేశంలోనే పెద్దదైన పెద్ద పులుల అభయారణ్యంగా ప్రభుత్వం ప్రకటించింది. శ్రీశైలం వెళ్లేదారిలో అమ్రాబాద్ టైగర్ వైల్డ్‌నేచర్ క్యాంప్ ఉంది. పొడవైన కృష్ణాతీరం, సోమశిల అందాలు, నల్లమల అభయారణ్యం జిల్లా సిగలో ఆణిముత్యాలు.

అడవుల విస్తీర్ణం 2498.49 చ.కి.మీ. రాష్ట్రంలో 36.08% కలిగి ఉంది. జిల్లా రెండు ప్రత్యేక ప్రాంతాలుగా విభజింపబడింది. 1. చెదురు మదురుగా దిగువ కొండలతో కూడిన మైదాన ప్రాంతం. 2. విస్తృతమైన అమరాబాదు, ఫర్హాబాద్ పీఠభూమి ప్రాంతం.

నాగర్‌కర్నూల్ జిల్లా సరిహద్దుగా కృష్ణానది ప్రవహిస్తున్నది. ఈ నది వెంట ప్రాక్ పశ్చిమ దిశల యందు సరాసరి 800మీ ఎత్తు గల కొండల వరుసలతో అమరాబాదు పీఠభూమి కూడి ఉన్నది. ఈ కొండల వరుసలలో వెళ్ళడానికి వీలులేని లోతైన లోయలు ఉన్నాయి. దట్టమైన అడవులున్నాయి.

**1. ఆకురాల్చు అడవులు :** అమ్రాబాద్ పీఠభూమికి పర్వతశ్రేణులకు సమీపాన దిగువ మైదాన ప్రాంతాలందు చెదురుమదురుగా ఈ అడవులు పరిమితంగా ఉన్నవి. టేకు, ఏగి, బిల్లుడు, నల్లమద్ది, ఇల్లింత, సొపెర వంటి వృక్షాలు 12-15 మీటర్ల ఎత్తులో ఉండి 100 సెం.మీ చుట్టుకొలత కలిగి ఉన్నవి. ఇవి విలువైన ఆకురాల్చు అడవులు.

**2. ముళ్ళపొద అడవులు :** జిల్లాలోని భూములలో అధికం మెరకగా ఉండి రాళ్ళు రప్పలు, బండలు, గుండ్లు, ఏనెలు కలిగి ఉండును. మట్టి గోధుమ రంగులో కనిపించును. బీడు పొలములందును కంచె కట్టిన చేలలోను కొన్నిరకాల ముళ్ళపొదలు కన్పించును. ఇవి వర్షాకాలంలో వృద్ధిచెంది వేసవిలో కనుమరుగై పోవును.

**3. విప్ప-ఏప అడవులు :** అమరాబాదు, కొల్లాపూర్ ప్రాంతములలోని లోయలలో ఏప జాతి వృక్షాలు ఎక్కువగా ఉన్నాయి.

**4. వెదురు పొదలు :** ఈ జిల్లాలోని అచ్చంపేట, కొల్లాపూర్, అమరాబాద్ అడవులందు వెదురు పొదలు విరివిగా కనిపిస్తాయి. అమరాబాద్, ఫర్హాబాద్ అడవులలో వెదురు పొదలు దట్టంగా ఉన్నాయి.

**ఖనిజ సంపద :** నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆస్‌బెస్టాస్, వజ్రాలు, సున్నపురాయి (స్టియటైట్) లోహాలు లభిస్తున్నాయి. ఆస్‌బెస్టాస్; కొల్లాపూర్ తాలూకాలోని సోమశిల నార్లకొండ అటవి ప్రాంతంలో ఆస్‌బెస్టాస్ నిల్వలు ఉన్నాయి. వజ్రాలు - కొల్లాపూర్ తాలుకా పెంట్లవెల్లి గ్రామంలో లభించినాయి. ఇప్పలపల్లి, లక్ష్మీపూర్, పెంట్లవెల్లి కృష్ణానది తీరాలలో వజ్రపు రాళ్ళు లభించే అవకాశాలున్నాయి. స్టియాటైట్ కొల్లాపూర్ తాలుకా సోమశిలలో లభిస్తున్నది. క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పర్, స్టోన్ మెటల్, బ్లాక్‌గ్రానైట్, ఇసుక వంటి ఖనిజాలు లభిస్తాయి.

**నదులు :** ఈ జిల్లాలో కృష్ణానది, దుందుభి ప్రవహిస్తున్నాయి. కృష్ణానది మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో 510 కి.మీ ప్రవహించి, మన రాష్ట్రంలో మహబూబ్‌నగర్ జిల్లాలో కృష్ణా గ్రామం వద్ద ప్రవేశిచింది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్, అచ్చంపేట తాలూకాలలోని నల్లమల కొండల గుండా శ్రీశైలం డ్యాంకు చేరుకుంటుంది.

**మున్సిపల్ కార్పొరేషన్ :** 1. నాగర్‌కర్నూల్ 2. కొల్లాపూర్ 3. అచ్చంపేట 4. కల్వకుర్తి
**రెవెన్యూ గ్రామాలు : 349**
**గ్రామపంచాయితీలు :** 301
**పోలీస్ కమీషనరేట్ :** నాగర్ కర్నూల్
**పార్లమెంట్ నియోజకవర్గం :** నాగర్‌కర్నూల్ (రిజర్వ్‌డ్)
**అసెంబ్లీ నియోజకవర్గాలు :** 4 (1) నాగర్‌కర్నూల్ (2) అచ్చంపేట (రిజర్వ్‌డ్) (3) కల్వకుర్తి (4) కొల్లాపూర్
**పట్టణాలు :** నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్

మహబూబ్‌నగర్‌లోని మహాబాద్ కొండలలో దుందుభి లేదా దిండినది జన్మించి శంషాబాద్, షాద్‌నగర్ గుండా పయనించి నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి తాలూకాలో ప్రవేశిస్తుంది. దుందుభికి "దెంది" అనే దేశీయ వ్యవహారం కలదు. శాసనాలలో దీన్ని "దండెన గోవ" అని రాసినారు. దుందుభీ నది తీరంలో రామగిరి క్షేత్రం ఉంది. ఇది దుందుభి నిండుగా పారుతున్నప్పుడు రెండవ భద్రాచలం అనిపిస్తుంది. ఇక్కడ ఆలయం మొదట జినాలయం తరువాత శివాలయం, ఇప్పుడు విష్ణువాలయంగా మార్చబడింది.

**చెరువులు - ప్రాజెక్టులు :**

నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రధానమైన చెరువుల వివరాలు - పంట పండే విస్తీర్ణం హెక్టార్లలో.

1. కేసరి సముద్రం - నాగర్‌కర్నూల్ - 705 హెక్టార్లు

2. శ్రీవారి సముద్రం - సింగోటం, కొల్లాపూర్ - 707 హెక్టార్లు.

3. చంద్రసాగర్ - అచ్చంపేట - 608 హెక్టార్లు

కృష్ణా, దుందుభి, చిన్నవాగు, పెద్దవాగు, పెంటోని చెరువు, ఋసుల్ చెరువు వంటి వాటి వల్ల నీటి వనరులు సమకూరుతున్నాయి.

1. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం. దీనికి మరోపేరు మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం.

అ. ఎల్లూరు రిజర్వాయరు ఆ. జొన్నల బొగుడ రిజర్వాయరు ఇ. గుడిపల్లి రిజర్వాయరు.

2. పాలమూరు ప్రాజెక్టులో భాగంగా

అ. నార్లాపూర్ వద్ద - 8.61 టి.ఎం.సి లు

ఆ. వట్టెం వద్ద-16.58 టి.ఎం.సి.లు సామర్థ్యం గల రిజర్వాయర్లున్నాయి.

3. శ్రీశైలం వెనుక జలాల ఎత్తిపోతల ప్రాజెక్టు

4. శ్రీశైలం ఎడమకాల్వ సొరంగం

**జనాభా :** మొత్తం జనాభా 8,61,766, పురుషులు 4,37,986, స్త్రీలు 4,23,780. జనసాంద్రత 124/కి.మీ. స్త్రీ పురుష నిష్పత్తి : 1000: 968. గ్రామీణ జనాభా శాతం 89.81. పట్టణ జనాభా శాతం 10.19.

**అక్షరాస్యత :** అక్షరాస్యత శాతం : 54.38 పురుషుల అక్షరాస్యత శాతం : 64.85 స్త్రీల అక్షరాస్యత శాతం : 43.64.

## జిల్లా చరిత్ర

ఈ జిల్లాలో లక్షల సంవత్సరాల నాటి విశేషాలు లభించినవి. కృష్ణా మరియు దుందుభి నదుల మధ్యన ఈ జిల్లా విస్తరించి ఉన్నది. జిల్లాలోని నల్లమల కొండలు, పర్వతాలు, నదీనదాలు, వాగులు, వంకలు, సెలయేరులు, జలపాతాలు, ప్రకృతి, అటవీసంపదలు, ఆటవిక జాతులు, చెంచులు, ఆంధ్ర-రాయలసీమ సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, పుణ్యక్షేత్రాలు, ఆదిమానవ ఆవాసాలు, గొలుసుకట్టు తటాకాలు, కుంటలు, ప్రాచీన చారిత్రక ప్రదేశాలు, కట్టడాలు, గిరి, స్థల, జల, వన దుర్గాలు నాగర్‌కర్నూల్ జిల్లాకు స్వంతం.

ఈ ప్రాంతం ఆరవ శతాబ్ది నాటి రాజ్యవ్యవస్థ కలిగి ఉన్నది. నందరాజులు, మౌర్యులు, శాతవాహనులు, ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, బాదామి చాళుక్యులు, కందూరు చోడులు, విజయ నగర రాజులు, కాకతీయులు, దేవగిరి యాదవరాజులు, చెఱకు, వావిలాల, ముసునూరి, బహుమనీ సుల్తానులు, రేచర్ల పద్మనాయకులు, కుతుబ్‌షాహీలు, మొగలు చక్రవర్తుల ప్రతినిధులు, ఆసఫ్‌జాహీలు మొదలగు రాజుల తమ రాజ్యంలో భాగంగా ఈ ప్రాంతాన్ని పరిపాలించారు.

కుతుబ్‌షాహీలు ప్రాంతాలను జిల్లాలుగా విభజిస్తూ... క్రీ.శ.1794 నాగర్‌కర్నూల్ జిల్లాను ఏర్పాటు చేశారు.

ఈ ప్రాంత పాలకుడు సయ్యద్ నూరుల్లా హుసేన్ ఆలోచనల మేరకు రైల్వేలైను ద్వారా రవాణా సౌకర్యం కొరకు క్రీ.శ.1904లో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం మహబూబ్ నగర్‌కు తరలిపోయింది.

2016 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో కొనసాగి నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ తాలుకాలతో తిరిగి జిల్లాగా అవతరించింది.

## సంస్కృతి

**ఆచారాలు, సంప్రదాయాలు, పండుగలు :** జిల్లాలోని అత్యధిక సంఖ్యాకులు హిందువులు, తరువాతి స్థానంలో ముస్లింలు, వీరి తరువాత క్రైస్తవులున్నారు. హిందువులలో జననం నుండి మరణం వరకు షోడశ క్రియలు నిర్వహిస్తారు. ముస్లింలు చనిపోయిన వారిని మసీదుకు తీసుకొని పోయి నమాజు చేసి మక్కా దిక్కుగా తలనుంచి ఖననం చేస్తారు. క్రైస్తవులు చర్చికి తీసుకెళ్ళి ప్రార్థనలు జరిపి ఖననం చేస్తారు. హిందువులు అత్యధికులు దహన సంస్కారాలు చేస్తారు. అస్తికలను పవిత్రనదులలో కలుపుతారు. ముస్లింలు క్రైస్తవులు తీర్థయాత్రలు చేస్తారు.

అత్యధిక సంఖ్యాకులు తెలుగు మాట్లాడుతారు. ఉర్దూ, హిందీ, ఎరుకల, లంబాడి, గిరిజన భాషలు మాట్లాడేవారు అల్పసంఖ్యాకులు. ఆటవిక జాతులలో చెంచు జాతివారు అధికం. నల్లమల్ల అటవీ ప్రాంతాలలో చిన్నచిన్న పెంటలు పెక్కుగలవు. వీరు తెలుగు మాట్లాడుతారు. చెంచులు అనాది నుండి సంచార జీవులు. వీరు అడవి సంపదను ఎక్కువగా ఉపయోగించుకుంటారు. పండ్లు దుంపలు, తేనె, వెదురు బియ్యం మొదలగునవి. వీరు ప్రస్తుతం వ్యవసాయం చేస్తూ స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు.

**కళలు :** కళలకు కాణాచి ఈ జిల్లా. కొల్లాపూర్ ప్రాంతం కళాకారులకు పుట్టినిల్లు. ఈ ప్రాంతంలోని పెంట్లవెల్లి గ్రామంలో జన్మించిన పద్మలయాచార్య హరికథకురాలు. సంగీత, సాహిత్యాలలో నేర్పరి. తెలంగాణలోనే ఏకైక హరికథకురాలు. ఐదువేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చింది. ఈమె పది పాటలు సి.డిల రూపంలో తానే సంగీతం, రచన సమకూర్చి రూపొందించారు. ప్రముఖ వాగ్గేయకారుడు గోరటి వెంకన్న పలు ప్రజారంజకమైన పాటలు రాసి, పాడి ప్రజలను రంజింపచేస్తున్నారు. పోలోజు సత్యం ఎంతో మంది విద్యార్థులకు సంప్రదాయ నృత్యాలు నేర్పి కళలవైపు విద్యార్థులను మళ్ళిస్తున్నారు. శివనాగులు వివిధ టి.వి. షోలలో జానపదపాటలు పాడి అందరి మన్ననలు అందుకొంటున్నాడు.

మార్చాల రామాచార్యుల చేత గోల్కొండ కవుల సంచిక ముఖచిత్రం, మీసాల కృష్ణుని చిత్రం సురవరం ప్రతాపరెడ్డి గారు వేయించారు. వీరు మంచి చిత్రకారులు. సుజాత పత్రిక ముఖచిత్రం వేశారు.

నాటక రంగంలో ఈ జిల్లాలో పలువురు కృషిచేశారు. కమాలుద్దీన్, వీధినాటకాలను వేయించేవారు. బల్మూర్ కృష్ణమాచార్యులు వివిధ నాటక సమాజాలలో వివిధ పాత్రలు పోషించారు. గుడిపల్లి నర్సింహ్మారెడ్డి, మురళి, బాసవేంకటేశ్వర్లు, సంబరాజు, సురేష్ బాబు, డి.రాములు మొదలగువారు పలు నాటక ప్రదర్శనలు ఇచ్చి జిల్లా ప్రజల అభిమానం చూరగొంటున్నారు.

మొగులయ్య పన్నెండు మెట్ల కిన్నెరను రూపొందించి పలుప్రదర్శనలు ఇస్తున్నారు. జిల్లాలోని ప్రముఖ వ్యక్తుల జీవితాలను ఆవిష్కరిస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు.

**జాతరలు :** సిరసన గండ్ల జాతర : అపర భద్రాద్రి సిరసన గండ్లంలో శ్రీరామనవమికి జాతర జరుగును. ఇక్కడికి జిల్లా నలుమూలల నుండి అత్యధికులు తరలివస్తారు. సింగోటం జాతరలో ఉభయరాష్ట్రాల ప్రజలు పాల్గొంటారు. ఊర్కొండపేట జాతర : ఇక్కడ ఆంజనేయ స్వామి కొలువై ఉంటాడు. అత్యధికులు ఈ జాతరలో పాల్గొంటారు. రంగాపురం – ఉర్సు జాతర అచ్చంపేట నుండి శ్రీశైలం వెళ్ళుదారిలో ఉంది. అజ్రత్ నిరంజన్ షావాలీ దర్గా దగ్గర ఈ జాతర జరుగును. ఈ ఉర్సులో వేలకొలది హిందూ ముస్లిం భక్తులు పాల్గొని హిందు–ముస్లింల ఐక్యతను చాటుతారు. దీనికి సమీపంలోనే ఉమామహేశ్వర క్షేత్రం కలదు. వీటితోపాటు పాలెం, వట్టెం, బిజినాపల్లి, కుమ్మెర, దేవుని తిరుమలాపురం, గుండాల జాతరలు పేర్కొనదగినవి. ఇవియే కాక సాయినోన్ పల్లి మైసమ్మ జాతర, కోడేరు మండలం మంత్రాలమ్మ జాతర, కొల్లాపూర్ ఈదమ్మ జాతర ప్రసిద్ధమైనవి.

## సాహిత్య చరిత్ర

నాగర్‌కర్నూల్ జిల్లా భౌగోళికంలోను, సాహిత్యంలోను విశాలమైనదే. సాహిత్య సంపదకు కొదవలేదు. దీనికి కారణం ఈ ప్రాంతం సంస్థానాలతో విరాజిల్లడం. కపబ, జటప్రోలు, కొల్లాపురం, నంది వర్ధమానవపురం వంటి సంస్థానాల సాహిత్య సంపద తులతూగినది. పండితులు, కవులు, వేదశాస్త్ర సంపన్నులు, మంత్రశాస్త్రవేత్తలు, యాజ్ఞికులు,

వైయాకరణులు, వేద, వేదాంగేతిహాస, పురాణ, కావ్య, నాటకాలంకారాలను క్షుణంగా అభ్యసించిన మహనీయులు ఈ జిల్లాలో ఎందరో కలరు. అంతేకాక సంస్కృతం, ఉర్దూ సాహిత్యం కూడా ఉన్నది.

తెలుగు సాహిత్యం వివిధ ప్రక్రియలతో ఈ ప్రాంతం పరిఢవిల్లింది. ప్రబంధాలు, పరిణయకావ్యాలు, స్థల మాహాత్మ్యాలు, ఉదాహరణ కావ్యాలు, శతకాలు, ద్విపద కావ్యాలు, అచ్చతెనుగు కావ్యాలు, యక్షగానాలు, కీర్తనలు, హరికథలు, నాటకాలతో పాటు తర్కశాస్త్రం, జ్యోతిష్య గ్రంథాలు, సంస్కృత రూపకాలు, ప్రౌఢ కవితా శైలికి తార్కాణమైన శాసనాలు, జానపద సాహిత్యం పల్లె ప్రజల నాలుకలపై ఆశువుగా నాట్యమాడినది. చాటు పద్యాలు చెప్పిన కవులెందరో ఉన్నారు. ఇలా తెలుగు సాహిత్యంలో తనస్థానాన్ని సుస్థిర పరుచుకొన్నది.

తెలుగు సాహిత్యంలో తొలి తెలుగు రామాయణం ఈ జిల్లా నుండే వెలువడినది. తొలి తెలుగు జంటకవుల - కాచవిభుడు, విఠలనాథుడు తొలి తెలుగు కవయిత్రి కుప్పాంబిక కూడ ఈ ప్రాంతానికి చెందిన వారే. తొలి తెలుగు సుభాషిత త్రిశతి ఈ ప్రాంతం నుండే వచ్చినది.

ఈ జిల్లాలో ప్రాచీన కవులు (80), ఆధునిక కవులు (90 వరకు) , సమకాలీన కవులు (50 వరకు), సంస్కృత, శాసన, చాటు, సంకీర్తన, జానపదాలలో దాదాపు రెండు వందల పై చిలుకు కవులున్నారు.

**ప్రాచీన కవులు**

**గోకర్ణుడు (క్రీ.శ. 1109 - 1136) :** వర్ధమానపుర పాలకుడు, కందూరు చోడ రాజకవి, "గోకర్ణ ఛందస్సు" అనే లక్షణ గ్రంథం రాశారు. ఇది అలభ్యం. అప్పకవీయం, గోల్కొండకవుల సంచిక, ఆనంద రంగరాట్ఛందంలో కొన్ని పద్యాలు ఉదహరించబడ్డాయి.

**ఉదయాదిత్యుడు (క్రీ.శ. 1136-1176) :** కందూరు చోడ రాజకవి వర్ధమానపుర పాలకుడు. ఇతని గ్రంథం "ఉదయాదిత్యాలంకారం". ఇది అలభ్యం. లక్షణ గ్రంథాలలో దీనిపేరు మాత్రం ప్రస్తావిత్రమైనది.

**గోన బుద్ధారెడ్డి (క్రీ.శ. 1210-1300):** వర్ధమానపుర పాలకుడు. తెలుగులో తొలిరామాయణం రంగనాథ రామాయణం రచించాడు. ఇది ద్విపదలో ఉంది. ఇతని కుమారులు తొలి తెలుగు జంటకవులు.

**కుప్పాంబిక (క్రీ.శ. 1230-1300) :** తొలి తెలుగు కవయిత్రి. పుట్టినిల్లు, గోనవంశం మెట్టినిల్లు, మల్యాల వంశం రెండూ ఈ ప్రాంతాన్ని పరిపాలించాయి. అయ్యలరాజు తన సంకలనంలో కుప్పాంబిక పద్యాన్ని ఉదహరించినాడు.

**గోన కాచ భూపతి, విఠలరాజు (క్రీ.శ. 1300 - 1325) :** తొలితెలుగు జంటకవులు. గోనబుద్ధారెడ్డి కుమారులు. వీరు తండ్రిమార్గంలోనే ద్విపదలో "ఉత్తర రామాయణం" రచించారు. వీరు తొలితెలుగు జంటకవులుగా ఈ జిల్లా కీర్తిని దశదిశలా వ్యాపింపచేశారు.

**సర్వజ్ఞ పద్మనాయక భూపాలుడు (క్రీ.శ. 1310 - 1360) :** ఇతని బిరుదు "సర్వజ్ఞ". ఇతని రచన "సారంగధర చరిత్ర" ఇది యక్షగానం. అముద్రితం. ఈ కృతి, కర్త విషయంలో స్పష్టత వస్తే ఇదే తెలుగులో మొదటి యక్షగాన రచన అవుతుంది.

**ఎలకూచి బాల సరస్వతి (1620 - 1670) (తొలి తెలుగు సుభాషిత త్రిషతి) :** జటప్రోలు సంస్థానాన్ని ఆశ్రయం పొంది సురభిమాధవ రాయల ఆస్థానకవి. ఎలకూచి వెంకట కృష్ణయ్య తెలుగులో ప్రప్రథమంగా మహామహోపాధ్యాయ బిరుదు పొందినవాడు. ఇతడు చంద్రికాపరిణయం మల్ల భూపాలీయం ఇవియేకాక పదికి పైగా రచనలు చేశాడు. భర్తృహరి సుభాషిత త్రిశతిని (మల్ల భూలీయం) తెలుగులోకి తెచ్చిన తొలికవి.

**సురభి మాధవరాయలు (1620-1670) :** జటప్రోలు సంస్థానాధీశుడు. ఇతడు కవులను పోషించిన రాజకవి.

**వెల్లాల సదాశివశాస్త్రి (1861 - 1926) :** జటప్రోలు నివాసి. అవధానం శేషశాస్త్రితో కలిసి సురభిమాధవరాయల చంద్రికా పరిణయానికి వ్యాఖ్య రాశారు. కావ్యాలంకార సంగ్రహవిమర్శనం, ఆంధ్ర దశరూపక విమర్శనం వంటి 27 గ్రంథాలు రచించాడు. వీటిలో 15 గ్రంథాలు ముద్రితం.

**వెల్లూరి నరసింగ కవి (1860 - 1920) :** జటప్రోలు రాజు సురభి వెంకట లక్ష్మారావు సమకాలీనుడు. ఇతడు "వెల్లూరి వెంకటాచల రమణా" అనే మకుటంతో సుభాషిత త్రిశతిని అనువదించాడు. ఇతని ఇతర రచనలు చూతపురీ విలాసం, రాచకన్యకా పరిణయం.

**బిజినేపల్లి చెన్నకిష్టమ్మ (19వ శ॥) :** ఈమె రచనలు సత్యనారాయణ కథాకల్పం, బువ్వబంతి (పెండ్లిపాటలు) మొదలగునవి.

**కసబ కృష్ణమాచార్యులు (1870) :** ఇతడు కసబ సంస్థానకవి. ఇతని రచనలు హనుమత్తారావలి, నిరోష్ఠ్య దాశరథీ తారావతి వంటి నాలుగు రచనలు. శ్రీరామ శతకంలో కలిపి 4 శతకాలు, ఉషాపరిణయం మొదలు 4 యక్షగానాలు ఇతని తెలుగు కృతులు. గోపాల పంచవింశతి వంటి సంస్కృత కృతులు.

**వేపూరు హనుమద్దాసు :** ఈయన భక్తకవి, తత్వకవి. ఇతనికి పరాంకుశుడు అనే పేరు. ఇతని రచనలు శారదా రామాయణం, సీతాకళ్యాణం, కృష్ణలీలలు, రామమూర్తి శతకం, పుత్రకామేష్టి, బతుకమ్మపాట, బొబ్బిలి బుర్రకథ, ఉర్దూ కందార్థాలు, "హక్ కానిహకీ ఖత్" ఉర్దూ కృతి మొదలగునవి. "జలక్రీడలు" ముద్రితరచన. ఆశువుగా, భక్త్యావేశంలో ఎన్నో కీర్తనలు ఆలపించాడు.

**పల్లా నారాయణ ధ్వరి (19-20శ॥) :** ఇతడు కల్వకుర్తి నివాసి. శతాధిక గ్రంథకర్తలుగా ప్రసిద్ధులు. వీరి రచనలు రామోత్సవ రత్నాకరం, రామోపాసక పద్ధతి, పారిజాతాపహరణం - యక్షగానం మొదలగునవి.

**మార్చాల కవులు :** వీరిలో మార్చాల రంగాచార్యులు, రామాచార్యులు, రంగనాథాచార్యులు. వీరిలో మార్చాల రంగచార్యులు 1. నిరోష్ఠ్య కృష్ణ శతకం. అభినవ శిరోమణితో కలిపి నాలుగు రచనలు చేశాడు.

**వట్టెం కవులు :** ఇక్కడ ఖండవల్లి, గంగాపురం, చింతల పల్లి, సంబరాజు, తిరునగరి వంశాల కవులు ఉండేవారు.

ఖండవల్లి పాపయ్యశాస్త్రి - హరిశ్చంద్ర యక్షగానం, చింతలపల్లి చాయపతి - రాఘవాభ్యుదయం, చింతలపల్లి వీరరాఘవయ్య, మధురవాణి విలాసం, సంజీవయ్య - చంద్రాంగదోపాఖ్యానం, సంబరాజు తిరుమల రామదాసు - రాధాకృష్ణ విలాసం, సంబరాజుశేషాహి - భాగవతాంబరీష రాజవిలాసం, సంబరాజు నరసింగరాజు - వట్టెంచెన్నకేశవ లాలి ప్రహరి (జిల్లాలోని తొలి ప్రహరి) సంబరాజు రామచంద్రకవి - సుపాణివీ పరిణయం (అచ్చతెనుగుకావ్యం) తిరునగరి సింహయ్యకవి విలాస పరిణయం, అనంతవ్రత కల్పం అనే కావ్యాలు. రెండు యక్షగానాలు, రెండు ఇతర రచనలు చేశాడు. తిరునగరి లక్షణాదాసు నారదగిరి భజన కీర్తనలు, తిరునగరి పాపకవి. విజయవిలాసం, హరిశ్చంద్ర నాటకం, కృష్ణతులాభారం వంటి 11 రచనలు రాశాడు. తిరునగరి సీతారామదాసు, రుక్మిణీ కళ్యాణం వంటి మూడు హరికథలు మరియు గణపతి పూజాక్రమం రాశాడు. తిరునగరి నరహరికవి నారదగిరి మహాత్మ్యం రాశాడు.

వర్థమానపురానికి చెందిన పెద్దమందడి వెంకటకృష్ణ కవి. పాలమూరు తిరుమల నాథ శతకం వంటి ఏడు రచనలు చేశాడు.

వెలుగొండ జ్ఞానదేవుడు. అజామిళోపాఖ్యానం వంటి 3 నాటకాలు, 8 హరికథలు, ఇతరములైన 7 రచనలు చేశాడు.

**ఆధునికయుగ కవులు**

**మరిగంటి జగన్నాథాచార్యులు :** కల్వకుర్తి సమీపం లోని ఎల్లమ్మ రంగాపురానికి చెందినవారు. ఇతని రచనలు. యాదగిరి లక్ష్మీనరసింహ సుప్రభాతం మరియు శతకం తోపాటు మరో మూడు రచనలు కలవు.

**వాజపేయల యాజుల రామసుబ్బరాట్కవి:** స్నేహలతా కవితా సంఘ స్థాపకుడు. ఈ కవితా సంఘం ద్వారా రెండు వందల గ్రంథాలు ముద్రించారు. ఇతను స్వయంగా శతాధిక గ్రంథకర్త. జటప్రోలు సంస్థానకవి.

**తెలకపల్లి రామచంద్రశాస్త్రి:** వీరు రాజాపురం నివాసులు. వీరి రచనలు 9 ముద్రితాలు. 7 అముద్రితాలు. వీరు అవధాన విద్యను కూడా ప్రదర్శించారు.

**గంగాపురం హనుమచ్ఛర్మ (1925-96) :** వీరి రచనలు దుందుభి ఋగ్వేద విజ్ఞానం, పద్యగేయఖండికలు, చెన్నకేశవ సుప్రభాతం (సంస్కృతం). వీరి దుందుభి కావ్యం కీర్తి పతాకంగానిలించింది.

**ముకురాల రామారెడ్డి (1929 - 2003) :** వీరి రచనలు దేవరకొండ దుర్గము, మేఘమాత, నవ్వేకత్తులు మొదలైనవి.

**పాకాలయశోదారెడ్డి (1929 - 2007) :** తొలి తరం కథా రచయిత్రి. వీరి రచనలు మావూరి ముచ్చట్లు, ధర్మశాల, ఎచ్చమ్మకథలు, మొదలగు కథాసంపుటాలు, 20 కి దగ్గర రచనలు చేసింది. "తెలుగులో హరివంశములు" పై పరిశోధన చేసి డాక్టరేటు పొంది అధికార భాషాసంఘం అధ్యక్షులుగా పనిచేసిన తొలిమహిళ.

**ఇరువెంటి కృష్ణమూర్తి (1930 - 1990) :** ఇతని రచనలు చాటువులు, ఇరువెంటివ్యాసాలు మొదలగునవి. ఇతని పరిశోధన గ్రంథం "కవి సమయములు".

**ఇమ్మడి జెట్టి చంద్రయ్య (1934 - 2001) :** వీరు రామ ప్రభుశతకం తోపాటు 3 శతకాలు రాశారు. కర్పూరాద్రి మాహాత్మ్యము రాశారు. హనుమద్రామ సంగ్రామము, వీర బ్రహ్మేంద్ర విలాసము మొదలగు హరికథలు రచించారు. ఇంకా మూడు అముద్రిత రచనలున్నాయి.

**వెలుదండ రామేశ్వర రావు ( 1935 - 2005) :** వీరి రచనలు శ్రీ రామ భూవర శతకం, శ్రీనివాస నివేదనము, శ్రీ కుసుమహర శరణాగతి, శ్రీ సత్యసాయి రామ అక్షరార్చన, నాదైవం - నాదేశం (పాటలు-2004), ఆంధ్రనారద భక్తి సూత్రములు. ఇవి ముద్రితాలు. ఇంకా 7 అముద్రితరచనలు గలవు.

**తోటపల్లి యజ్ఞనారాయణ శర్మ :** రసగ్రాహి కలం పేరుతో రచనలు కొనసాగించినాడు. కాని వీరి రచనలు గ్రంథరూపం దాల్చలేదు.

**రంగినేని సుబ్రహ్మణ్యం :** ఇతడు యువదశలో మరణించిన కవి. జీవనహేల, సితపుష్పమాల గేయ సంపుటాలుగా రచించారు.

**సమకాలీన కవులు**

**కపిలవాయి లింగమూర్తి :** జననం (1928): సాహితీ కురువృద్ధుడు కపిలవాయి శతాధిక గ్రంథకర్త. 9 శతకాలు, 6 కావ్యాలు, 3 సంకీర్తనలు, 12 చరిత్రలు, 2 ఉదాహరణలు, 3 ఆధ్యాత్మికాలు, 4 సంకలన వ్యాఖ్యానాలతో పాటు పామర సంస్కృతం, నాగరకందనూలు కథ లాంటి రచనలు ముద్రితాలు. మిగతా రచనలు అముద్రితాలు. తెలుగు విశ్వవిద్యాలయం వీరికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. వీరు తొంబైయేళ్ళ వయస్సులో గూడ పరిశోధన చేస్తూ, పరిశోధకులకు సహకరిస్తూ తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేస్తున్నారు.

**రుక్మాంగదరెడ్డి (1942) :** ఈయన కథకుడు, కవి, రచయిత. ఒకే రోజు ఏడు పుస్తకాలను విడుదల చేసి ప్రతిభను చాటుకొన్నాడు. ఆమెకథ, ముత్యాలపేరు కథలు బహుమతులు పొందాయి. హిందీ అగస్త్యుడు నాటకాన్ని తెలుగు అనువాదం చేసి పలువురి ప్రశంసలు అందుకొన్నాడు.

**పెంటమరాజు నరసింగరావు (1942)**: వీరు పలు రంగాలలో నిష్ణాతులు. వీరి రచనలు – ఆధునిక తెలంగాణ చాటువులు, సింగయ శతకం, ఆఫీసు తత్త్వాలు మరియు ఇతర రచనలు. వీరు కథకులు. కంద పద్యం రాయడంలో నిష్ణాతులు.

**పరవస్తు కమల**: వీరు రంగారెడ్డి జిల్లాలో పుట్టి మెట్టినిల్లు మామిళ్ళపల్లి నివాసిగా పలురచనలు చేశారు. కథలు, కవితలు, నవలలు పలు ఆధ్యాత్మిక రచనలు చేశారు. వీరి రచనలు 20 పై మాటే. వీరి పరిశోధనా గ్రంథం "ప్రాచీనాంధ్ర సాహిత్యం ప్రతీకలు" అనే అంశంపై డాక్టరేటు పొందినారు.

**దరగోని శ్రీశైలం : క్రీ. శ. 1942 :** శ్రీకృష్ణశతకం, ఉప్పునూతల కేదారేశ్వర శతకం, విజయగాధ, భ్రమర గీతికలు, భాగవత కథామృతం, వివాహవైభవం, తెలుగు సంస్కృతీ వైభవంతోపాటు మరో మూడు ముద్రితాలు, పదకొండు అముద్రితాలున్నాయి. విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు.

వీరు బీదతనం నుండి స్వయం కృషితో ఎదిగి సాహిత్య సేవ చేశారు. ఇతని రచనలు కమలారామం, గురుత్రయ స్తోత్రం, గురురాఘవేంద్రశతకం, వివేక శంఖారావం మొదలైనవి.

**డా॥ రుక్నుద్దీన్ (1947 – 2013) :** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేశారు. వీరి రచనలు సూక్తిసుధ, విశ్వదర్శనం, చెలిమి, కిన్నెరమెట్లు మొదలగునవి. వీరి పరిశోధన గ్రంథం "జానపద సాహిత్యంలో అలంకార విధానం".

**ముత్యాల కృష్ణయ్య (1949)**: కల్వకుర్తి వేమనగా గుర్తింపుపొంది సామాజిక రచనలు చేశాడు. ఇతను వరకట్న లీలలు, నేటి సమాజం, తీరులు లాంటి 20కి పైగా రచనలు చేశాడు.

**డా॥ వెలుదండ సత్యనారాయణ :** జిల్లాలో శతక కవిగా ప్రసిద్ధిపొంది 12 కు పై శతకాలు రాసినాడు. యాభైకి పై అముద్రిత రచనలున్నాయి. "చంద్రికా పరిణయము – సమగ్ర పరిశీలనము" అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేటు పట్టా పొందారు. అధ్యాపకులుగా పదవీవిరమణ చేసి ఆధ్యాత్మిక రచనలు చేస్తూ పద్యకవిగా పలువురికి సేవలందిస్తున్నారు.

**వీణారెడ్డి :** వీరివి ఎనభై దాకా కథలు, దిన, వార, మాస పత్రికల్లో ముప్పైఆరు వ్యాసాలు, కొన్ని కవితలు, జోక్స్, వగైరాలు ప్రచురితాలు.

**పెద్దూరు వెంకటదాసు :** కథకుడు. రెక్కలు అను ప్రక్రియలో రచన చేసి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి అంకితం చేశాడు.

**డా॥ వెలుదండ నిత్యానందరావు :** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ అధ్యక్షులుగా సేవ లందించారు. పలు రచనలకు సంపాదకత్వం వహించారు. తెలుగు సాహిత్యంలో పేరడిపై పరిశోధన చేసి డాక్టరేటు పొందారు. పలు గ్రంథాలు రచించిన విమర్శకుడు, పరిశోధకుడు.

**డా॥ సి. కాశీం :** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేస్తూ సామాజిక కోణంలో రచనలు చేస్తున్నారు. నడుస్తున్న తెలంగాణ పత్రికా సంపాదకత్వం వహిస్తున్నారు.

**గాడి సురేందర్ :** బాలసాహిత్యంపై రచనలు చేశాడు. రఘువీర్ ప్రతాప్ తన కవితల ద్వారా అంతర్జాలంలో ప్రసిద్ధి పొంది విశ్వవ్యాప్తమైనాడు.

ఎం.ఏ. గఫార్ నానీల రచనలో సిద్ధహస్తుడు. దేవదానం మండల విద్యాశాఖాధికారిగా సేవచేసి, సాహిత్య కృషిచేస్తూ పలు రచనలు చేశాడు. జహంగీర్ పద్యరచనలు, యువకవి వనపట్ల సుబ్బయ్య దీర్ఘకవితలు, కథా సంపుటాలు సాహిత్య రంగంలో వారి ప్రస్థానానికి తోడ్పడుతున్నాయి.

**శాసనాలు :** గట్టు తుమ్మెన శాసనం - 1116 - ధెన్న మహాదేవి వేయించినది.

పాలెము శాసనం - మయూర భట్టోపాధ్యాయుడు రచించెను.

**రాచూరు శాసనం** - క్రీ.శ. 1157, 1159, 1160; **లింగాల శాసనం** - క్రీ.శ. 1168 - అభినవ మయూరుడు రచించినాడు ; **మామిళ్ళపల్లి శాసనం** - క్రీ.శ. 178 - భీమ, గోకర్ణులు వేయించినారు ; **మామిళ్ళపల్లి శాసనం** - క్రీ.శ. 1115 - భూపాల వావిశెట్టి వేయించినాడు; **కూడలి సంగమేశ్వర శాసనం** - క్రీ. శ. 1185 ; **వర్ధమానపుర శాసనం** - క్రీ.శ. 1225 - గోన గణపయ్య వేయించినాడు; **కూడలి సంగమేశ్వర శాసనం** - క్రీ. శ. 1280 ; **అమ్రాబాద్ శాసనం** - క్రీ.శ. 1264, క్రీ.శ. 1290 ; **ఉడిమిల్ల శాసనం** - 9వ శతాబ్దం ; **మాదావాయని ఉమామహేశ్వర శాసనం** - క్రీ.శ. 1376 ; **పెద్దూరు శాసనం** - క్రీ.శ. 1191

## సాహితీ సంస్థలు

స్నేహలతా సంఘం స్ఫూర్తితో పలు సంస్థలు సాహితీసేవ చేస్తున్నాయి. అందులో ముఖ్యంగా వెన్నెల సాహిత్య అకాడమి, కందనూలు సాహిత్య అకాడమి ఎన్నదగినవి.

**సంస్కృత కవులు / శాసనకవులు :** అభినవ మయూర సూరి మహాకవి. పద, వాక్య, ప్రమాణ, ప్రమేయ విచిత్ర కవిత్వ తత్వజ్ఞుడు. వర్ధమానపుర మల్యాల గుండ దండనాథుని ఆస్థానకవి. ఇతని చేత రాయబడిన శాసనం రసవత్కావ్యం. ఈ శాసనంలో చక్రబంధ మున్నది. దీని ద్వారా ఈయన బంధకవితా చతురత వెల్లడగుచున్నది.

ఈశ్వర భట్టోపాధ్యాయుడు, అభినవ మయూర సూరి పుత్రుడు. తండ్రి తరువాత మల్యాల గుండ దండనాథుని ఆస్థానకవిగా ఉన్నాడు. మల్యాల గుండయ ఇతనిచే రెండు శాసనాలు రాయించాడు. ఒకటి తల్లి, భార్య పేర రెండు చెరువులు, ఒక దేవాలయం నిర్మించిన సందర్భంలో. రెండవది తన చక్రవర్తి పేర గూపసముద్రం నిర్మించిన సందర్భంలో ఈ శాసనాలలో మహాకవి పాండిత్యం కనిపిస్తుంది.

మాయి భట్టోపాధ్యాయుడి చేత శాలివాహన శకం 1298 లో రేచర్ల మాధవనాయకుడు ఉమామహేశ్వరంలో శిలామంటపం కట్టించిన సందర్భంలో శాసనం వేయించాడు. ఇందులో 28 శ్లోకాలలో చక్రబంధంతో వర్ణించాడు. ఇది ఒక శాసనకావ్యం.

వంగూరు తిప్పయాభట్టు, నృసింహాధ్వరి, ఇరువురు ఉమామహేశ్వరంలోని శాసనకవులు. భట్టు ఆశుకవిత్వం శబ్దాలంకార భూయిష్టం. ధ్వరి కవిత్వం బంధకవిత్వం.

జటప్రోలు సంస్థాన రాజకవులు సురభి నరసింగరావు, సురభి చిన మాధవరావు సంస్కృతకవులు. నక్షత్రఖేలనం, శూద్రస్మృతి రచించారు. అన్నంభట్టు సర్వశాస్త్ర కోవిదుడు సంస్కృతంలో పెక్కురచనలు చేశాడు. తర్కసంగ్రహం, మహాభాష్యటీకాతో కలిపి దాదాపు పదిహేను వరకు గ్రంథాలు రాశాడు. ఈ విధంగా సంస్కృత సాహిత్యం పరిఢవిల్లింది.

**ఉర్దూ కవులు :** ఈ ప్రాంతం నిజాంరాజ్యంలో అంతర్భాగంగా ఉండినది. ఆనాటి రాజభాషను ఇక్కడి ప్రజలు అభ్యసించడమే కాక కవిత్వం కూడా చెప్పారు. వీరిలో పాపయ్య పార్సా అటు సామాజిక సేవలో ఉంటూ విద్యార్థి దశ నుండే చక్కని కవిత్వం చెప్పారు. వేపూరు హనుమద్దాసు. కృష్ణలీలలు, (యక్షగానం), కందార్థాలు చెప్పారు. నాగోజి ఉర్దూకవి సమ్మేళనాలలో పాల్గొనేవారు. కొత్తపల్లి జానకీరాం రెడ్డి "బిస్వీనదిమే" "మహేలఖా జులెఖకీ అబదీ ఖాబగాహ్ - మొహబ్బత్‌కీ రాహ్" ముద్రితాలు.

మహమ్మద్ జలార్ ఆరీఫ్ "షాయరే షనాఖత్" ముద్రితకృతి. సయ్యద్‌ఖుతుబుద్దీన్-పరేషార్ "ఆల్‌ఫూస్ ఔపాఖే" ముద్రితరచన. అల్‌హజ్ మహమద్ ఉస్మాన్ రచనలు ఖిస్సా తప్సిరే యూసుఫ్, ముహ్వాయి జెహస్నా, ఇలా జుప్‌సాలికీన్,

హాదిస్ చేశాడు. గులాంయాసిన్, రుక్నుద్దీన్, అహమదోద్దీన్ మొదలగు కవులు ఎన్నో ఉర్దూరచనలు చేశారు.

**పరిశోధనా రంగం :** సాహితీ కురువృద్ధుడు కపిలవాయి లింగమూర్తి నిరంతర పరిశోధకుడు. ఎన్నో శాసనాలను, గ్రంథాలను పరిష్కరించి వెలుగులోకి తెచ్చినాడు. ఎందరో పరిశోధకులకు మార్గదర్శిగా నిలిచి వారిని తీర్చిదిద్దారు.

పాకాల యశోదారెడ్డి "తెలుగులో హరివంశాల"పై పరిశోధనచేసి 1969లో డాక్టరేటు పొందినారు. గంగాపురం హరిహరనాథ్, గంగాపురం ఇందిర, వెలుదండ సత్యనారాయణ, కమల, రుక్నుద్దీన్, మహమ్మద్ హుసేన్ వంటి ప్రముఖులు పరిశోధనలు చేసి జిల్లా కీర్తిని పెంచినారు.

వెలుదండ నిత్యానందరావు "తెలుగు సాహిత్యంలో పేరడి" అనే అంశంతో పాటు "విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన" అనే గ్రంథం వెలువరించి ఇటు పరిశోధక విద్యార్థులకు, అటు విశ్వవిద్యాలయాలకు తమ పనిని సులభ తరం చేశారు. సి. కాశీం గారు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. వీరేగాక రామన్ గౌడ్, కృష్ణయ్య, శ్యామ్, సురేఖ, చంద్రశేఖర్, జయప్రకాశ్, శేఖరయ్య, వెంకటేశ్వర రావు, రంగా, శీనయ్య మొదలగు వారు వివిధ అంశాలలో పరిశోధనచేసి పట్టాపొందారు. ప్రస్తుతం ఎందరో విద్యార్థులు పరిశోధనలు చేస్తున్నారు. ఈ వ్యాస రచయిత "నాగర్‌కర్నూల్ జిల్లాసాహిత్య-సమగ్ర అధ్యయనం" అనే అంశంపై పరిశోధన చేస్తూ జిల్లా సాహిత్య చరిత్ర నిర్మించడంలో కృషి చేస్తున్నారు.

## వివిధ రంగాల ప్రముఖులు

అనంత రామశర్మ గ్రంథాలయాభివృద్ధి. కట్టా జనార్ధన్‌రెడ్డి రాజకీయం. కూచుకుళ్ళ హన్మంతరెడ్డి వ్యవసాయం. మర్యాద గోపాలరెడ్డి రాజకీయం. యజ్ఞనారాయణ శర్మ సాహిత్యం. మహేంద్రనాథ్ రాజకీయం. మార్చాల రామాచార్యులు చిత్రలేఖనం. పాపయ్య పార్సీ విద్య. అబ్దుల్ ఖాదర్ రవాణా. సుజీవన్‌రావు విద్య. చంద్ర మౌళి మాలె రాజకీయం. కపిలవాయి లింగమూర్తి సాహిత్యం. గంగాపురం హనుమచ్ఛర్మ రాజకీయం-సాహిత్యం. పుట్టపాగ రాధాకృష్ణ రాజకీయం. మల్లేపల్లి శేఖర్‌రెడ్డి సాహిత్యం. గోరటి వెంకన్న వాగ్గేయకారుడు. మొగులయ్య పన్నెండు మెట్ల కిన్నెర. పద్మలయాచార్య హరికథ రంగాల్లో సుప్రసిద్ధులు.

## దర్శనీయ ప్రదేశాలు - పర్యాట రంగం

**పర్యాటక ప్రదేశాలు :** నంది వర్ధమాన పురంలోని కోటలు బలిష్టమైనవి. శత్రుదుర్భేద్యమైనవి. ఉదయన చోడ మహారాజు జ్యేష్ఠపుత్రుడు ఈ కోటలను నిర్మించినాడు. ఇక్కడ వీరభద్ర, త్రికూట, నంది, నాగేశ్వర, చెన్నకేశవాలయం, శనీశ్వరాలయాలున్నాయి. త్రికూటాలయం వేశ్యలు నిర్మించినట్లు చెప్తారు. ఇచ్చట బృహత్ నంది ఉన్నది. ఆ నంది పేర నంది వడ్డెమాను అని పేరు వచ్చింది. మల్యాల గుండ దండనాథుడు నాగేశ్వర ఆలయానికి ప్రాకార, శిఖరాలు, నిర్మించినాడు.

దుందుభీ నదీ తీరాన రామగిరి అనే దేవాలయం కలదు. ఇక్కడ జైన తీర్థంకరుల విగ్రహాలను తొలగించి గణపతి, శివ, మహిషాసుర మర్దిని విగ్రహాలు ప్రతిష్ఠించి నారు. మహమ్మదీయుల కాలంలో ఈ దేవాలయం ధ్వంసం చేయబడింది. తరువాతి కాలంలో విష్ణు విగ్రహం ప్రతిష్ఠించ బడింది.

**జిల్లా ప్రత్యేకతలు ఇంకేమైనా ఉంటే....** వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జిల్లాలోని బిజినేపల్లి మండలం పాలెంగ్రామంలో వ్యవసాయ పరిశోధనాసంస్థ నెలకొల్ప బడింది. ఇక్కడ మెట్ట పంటలు తోటల పెంపకంపై పరిశోధన జరుగుతున్నాయి. కల్వకుర్తిలో పశువుల సంఖ్య అధికం. నాగర్‌కర్నూల్ ప్రాంతంలో కోళ్ల పరిశ్రమలు అధికం. కల్వకుర్తి సమీపంలో కాటన్ పరిశ్రమ ఉన్నది. అచ్చంపేట ప్రాంతంలో అక్కారం కుంకుడు కాయలకు అంతర్జాతీయ

మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. వీటిని ఉపయోగించి బల్మూర్ మండలం కొండనాగులలో షాంపూ తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నారు.

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టెను దేశంలోనే పెద్దదైన పెద్దపులుల అభయారణ్యంగా ప్రకటించారు. ఇచట టైగర్ వైల్డ్ నేచర్ క్యాంపు ఉంది. ఈ అడవిలో సాధారణ ఉడత కంటె మూడురెట్లు పెద్దదిగా ఉండే బిట్టుడుత కనిపిస్తుంది.

కొల్లాపూర్ ప్రాంతంలో దక్షిణ భారతదేశంలోనే మొదటి విమానయానం ఉన్నది.


మౌర్యుల పాలనాకాలం నుండి ఈ జిల్లా ప్రాంతం విద్యా విషయంలో తన ఉనికిని చాటుకున్నది. వర్ధమానపురం, ఉమామహేశ్వరం, విద్యలకు కేంద్రాలుగా ఉన్నాయి. శాతవాహన, ఇక్ష్వాకు, విష్ణుకుండిన, బాదామి, చాళుక్య, రాష్ట్రకూట, కందూరు చోడ, కళ్యాణి చాళుక్య, కాకతీయ, గోన, మల్యాల, ముసునూరి, రేచర్ల పద్మనాయక మొదలగు రాజులు తమ రాజ్యాంతర్భాగంగా ఈ జిల్లాను గ్రహించి పాలించినారు. వీరి పరిపాలనలో సమస్త విద్యలు వృద్ధి చెందినాయి.

ముస్లిం పాలకుల కాలంలో దేశీయ విద్యలకు ఆటంకం ఏర్పడింది. జిల్లాలోని సంస్థానాధీశులు కవి పండితులను వేదవేదాంగేతిహాస పురాణ శాస్త్రజ్ఞులను గౌరవించి పోషించుట వలన ప్రాచీన కళలు, విద్య నిలువ గలిగినవి. ఇలా సంస్థానాలలో కవి పండితులను ఆదరించినా సాధారణ ప్రజలకు విద్యాసౌకర్యం అందుబాటులో లేదు.

అనేక రాజ వంశీయుల పాలనలో ఈ జిల్లాలో వివిధ మతాలకు కులాలకు, విభిన్న సంస్కృతులకు, వివిధ ఆచార వ్యవహారాలకు చెందిన ప్రజలు అన్యోన్యంగా జీవన విధానాన్ని కొనసాగిస్తున్నారు. హిందువులు ముస్లింలు, హరిజన, గిరిజన, చెంచులు, గోండులు, బిల్లులు, నాగులు, బంజారాలు కలిసిమెలసి జీవించుట ఈ జిల్లా ప్రత్యేకత.

సోమశిల అందాలు వ్యాపించి ఉన్న జిల్లా ఇది. మలెల్ల తీర్థం జలపాతం ఈ జిల్లాలోనే ఉంది. కృష్ణానదీ పరీవాహ ప్రాంతం ఈ జిల్లాలోనే ఎక్కువ. కవులకు కాణాచిగా, చారిత్రకంగా విశేషమైన గుర్తింపు పొందిన ఈ జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నిలుస్తూ ఉంది.

# నిజామాబాద్ జిల్లా చిత్రపటం







తెలంగాణ విశ్వవిద్యాలయం



డిచ్‌పల్లి దేవాలయం




అలీ సాగర్



డిచ్‌పల్లి రామాలయం



కాంతేశ్వరాలయం




పంప మహాకవి

114 (b)

# నిజామాబాద్

**ఇందుపురంపు దుర్గముగ నీ ధర కీర్తి వహించినట్టి దు**
**ర్గేందిర కాటపట్టువయి హెచ్చెడి వీర కిశోర భూమియై**
**సుందర దృశ్యమాన వన శోభల వెల్గెడి 'ఖిల్ల' జిల్లయై**
**చిందులు వేయు సత్కళల 'చిందు'కు మూలము నాలవాలమై!**

తెలుగు జాతి చరిత్రలో నిజామాబాదు జిల్లాకు విశిష్ట స్థానం వుంది. ఇందూరు జిల్లాగా ప్రసిద్ధి చెందిన ఈ జిల్లా తీర్థస్థానంగా, యాత్రాస్థలంగా, అపూర్వ చారిత్రక స్మారకంగా సహస్రాధిక సాహితీ, చారిత్రక, సాంస్కృతిక విలువలు కలిగిన సుసంపన్న స్థలంగా ప్రసిద్ధి చెందింది.

ప్రాచీన జీవన వికాసానికి సంబంధించిన పురావస్తు సంపద ఈ జిల్లాలో పుష్కలంగా బయటపడింది. జిల్లాలోని నగరాల, గ్రామాల పూర్వ చరిత్రలు ఈ జిల్లా ప్రాచీనతను ప్రకటిస్తాయి. ఇక్కడి బోధన్ నగరానికి ఘనమైన చరిత్ర వుంది.

## ఈ పేరెందుకు?

'అశ్మకోనామ రాజర్షి స్సపౌదన్యం న్యవేశయత్' అని సంస్కృత మహాభారతంలో చెప్పబడింది. అశ్మకుడు అనే రాజు పౌదన్యం అనే నగరాన్ని పరిపాలించాడని పై శ్లోకానికి అర్థం. మహాభారత కాలం నాటి పౌదన్య నగరమే నేటి నిజామాబాదు జిల్లాలోని బోధన్ నగరం. చరిత్ర పూర్వ యుగంలోకి వెళితే పౌరాణికంగా, ఆధ్యాత్మికంగా కూడా ఈ ప్రాంతానికి మహోజ్జ్వల చరిత్ర వుంది. వేర్వేరు కాలాలలో అశ్మక రాష్ట్రం, నాగభూమి, మంజీర భూమి, సపాద లక్షభూమి, దక్షిణ కోసల, ధక్రాభిదానపురం, పోదనపాడు, కాసలనాడు, ఇందూరు అని పిలువబడ్డ ఈ ప్రాంతం ప్రస్తుతం నిజామాబాదుగా వ్యవహారంలో వుంది. జైన యుగం నాటికి ఇందూరు ప్రాంతం పుళక ప్రాంతంగా పిలువబడింది. ఋషభదేవుని కుమారుడు బాహుబలి (గోమతేశుడు) ఆనాడు బోధన్ ప్రాంతాన్ని పరిపాలించినట్లు చెబుతారు. ఆ తర్వాత సన్యాసం స్వీకరించి జైన మునులలో ప్రసిద్ధుడై పూజలందుకొంటున్నట్లు చెబుతారు. ఆనాడు జైనమత కేంద్రమైన బోధన్ దక్షిణ భారతదేశ యాత్రా స్థలంగా పేరుగాంచింది. ఈ ప్రాంతం మంజీరానది పరివాహక ప్రాంతం కావడం వల్ల మంజీరా భూమిగా పిలువబడింది. బినోల, కాలూరు, జక్రాన్‌పల్లి, ఎడపల్లి, జాన్కంపేట, డిచ్‌పల్లి లాంటి వందలాది గ్రామాలు ఆనాడు జైనమత కేంద్రాలుగా వెలుగొందాయి.

రాష్ట్రకూటుల కాలంలో ఈ ప్రాంతం నాగభూమిగా పిలువబడింది. పోచంపాడు శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో మునిగిపోయిన కుస్తాపురం ఒకప్పటి ఇక్ష్వాకుల రాజధానిగా చరిత్రకారులు పేర్కొన్నారు. విష్ణుకుండినుల పాలనలో ఈ ప్రాంతాన్ని శక్రాభిదానపురం అని వ్యవహరించారు.

ఇందూరు పూర్వనామం ఇంద్రపురి. విష్ణుకుండిన రాజైన ఇంద్రదత్తుడు క్రీ.శ. 388 ప్రాంతంలో తన పేరుతో ఇంద్రపురిని నిర్మించాడని ఒక కథనం. క్రీ.శ. 500 ప్రాంతంలో మొదటి ఇంద్రవర్మ ఇంద్రపురిని నిర్మించాడని కొందరు చారిత్రకుల భావన. రాష్ట్రకూట రాజైన నిత్య

## రెవెన్యూ డివిజన్లు - మండలాలు

నిజామాబాదు జిల్లా మూడు రెవిన్యూ డివిజన్లుగా విభింపబడింది. అవి నిజామాబాదు, ఆర్మూర్, బోధన్.

**నిజామాబాద్ డివిజన్‌లోని మండలాలు 10 :**

1. నిజామాబాదు (సౌత్) 2. నిజామాబాదు (నార్త్) 3. నిజామాబాదు (రూరల్) 4. మోపాల్ 5. డిచ్‌పల్లి 6. దర్పల్లి 7. ఇందల్‌వాయి 8. నవీపేట 9.సిరికొండ 10.మాక్లూరు

**ఆర్మూరు డివిజన్‌లోని మండలాలు 11 :**

1.ఆర్మూర్ 2. బాల్కొండ 3. మెండోర 4. కమ్మర్‌పల్లి 5. వేల్పూరు 6. మోర్తాడు 7. భీంగల్ 8. నందిపేట 9. ముప్కాల్ 10.జక్రాన్‌పల్లి 11. ఏర్గట్ల

**బోధన్ డివిజన్‌లో గల మండలాలు 6 :**

1.బోధన్ 2.ఎడపల్లి 3.రెంటజల్ 4. కోటగిరి 5.వర్ని 6.రుద్రూర్

నవీపేట మండలాన్ని బోధన్ రెవిన్యూ డివిజన్ నుంచి నిజామాబాదుకు, జక్రాన్‌పల్లి మండలాన్ని నిజామాబాదు రెవిన్యూ డివిజన్ నుంచి ఆర్మూర్‌కు, ఆర్మూర్‌లో వున్న మాక్లూరు మండలాన్ని నిజామాబాదుకు మార్చడం జరిగింది.

వర్షేంద్రుడు క్రీ.శ. 915 ప్రాంతంలో బోధన్ నగరంలో ఇంద్రనారాయణ దేవాలయం నిర్మించి, తన పేర ఇంద్రపురం నగరాన్ని నిర్మించాడని కొందరు చారిత్రకారుల అభిప్రాయం. క్రీ.శ. 1905 లో జిల్లాల పునర్విభజన జరిగి కొత్తగా ఆదిలాబాదు జిల్లాను ఏర్పాటు చేసినపుడు ఇందూరును నిజామాబాదు జిల్లాగా నామకరణం చేయడం జరిగింది.

## భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి

నిజామాబాదు జిల్లా తెలంగాణ రాష్ట్రంలో ఉత్తర వాయువ్య దిశలో ఉంది. ఈ జిల్లాకు తూర్పున జగిత్యాల, కరీంనగర్ జిల్లాలు, దక్షిణాన కామారెడ్డి జిల్లా, పశ్చిమాన నాందేడ్, ఉత్తరాన నిర్మల్, ఆదిలాబాదు జిల్లాలు సరిహద్దులుగా ఉన్నాయి. ఈ జిల్లా విస్తీర్ణం 4,288 చ.కి.మీ.

## సహజ వనరులు

**నేలలు :** ఈ జిల్లాలోన నేలలు ప్రధానంగా నల్లరేగడి నేలలు, దుబ్బ చెలకలు, ఎర్ర నేలలుగా విభజించవచ్చు. నిజామాబాదు, ఆర్మూర్ ప్రాంతాలలో నల్లని మెత్తనైన నేలలున్నాయి. ఎక్కువ శాతం నల్లరేగడి భూములే.

**అడవులు :** ఈ జిల్లాలో కమ్మర్‌పల్లి, సిరికొండ, భీంగల్ మండలాలలో అడవులు దట్టంగా వ్యాపించి వున్నాయి. ఆర్మూర్, నిజామాబాదు మధ్యలో కూడా దట్టమైన అడవులు విస్తరించి వున్నాయి. ఈ అడవుల్లో టేకు, వేప, మత్తి, తెల్లమద్ది చెట్లు, మోదుగ, మామిడి, జువ్వి, సీతాఫలం వంటి అనేక రకాల వృక్షాలే కాకుండా భీంగల్, మానాల వంటి ప్రాంతాల్లో ఔషధ మొక్కలు లభిస్తాయి. సుగంధ తైలాన్ని తయారు చేసే రూసాగడ్డి ఈ జిల్లాకు ప్రత్యేకమైనదిగా చెప్పుకోవచ్చు. ఈ అడవుల్లో రూసాగడ్డి విస్తారంగా లభిస్తుంది.

ఈ నిజామాబాదు జిల్లాలో గుట్టలకు కొదువలేదు. ఒకరకంగా చెప్పాలంటే ఈ జిల్లాని పర్వతాలలో దాగివున్న జిల్లాగా పేర్కొనవచ్చు. ఈ జిల్లాలోని ఆర్మూర్ గుట్టలు నవనాథ సిద్ధుల గుట్టలుగా ప్రసిద్ధి చెందాయి. నవనాథ సిద్ధులు ఇక్కడి గుహలలో తపమాచరించి సిద్ధి పొందినట్లు ఇక్కడి ఐతిహ్యం. అట్లే జాన్కంపేట, బోధన్, వర్ని, కమ్మర్‌పల్లి, డిచ్‌పల్లి, భీంగల్, కోన సముద్రమానాల వంటి ప్రాంతాలలోని ప్రాంతాలు చాలా ఎత్తైనవి. ఉత్తర తెలంగాణలోని నింబాచల క్షేత్రం పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధమైంది.

**నదులు :** ఈ జిల్లాలో గోదావరి, మంజీరా, విరజానది, పూలవాగు, పసుపువాగు మొదలైనవి ప్రవహిస్తూ ఈ నేలను సస్యశ్యామలం చేస్తున్నాయి. గోదారి, మంజీరా ఈ రెండు నదులు జిల్లాలోని రెంజల్ మండలం కందుర్తి గ్రామం వద్ద పసుపులేరులో కలిసి ఈ ప్రాంతాన్ని పరమ పవిత్రమైన త్రివేణీసంగమ స్థలంగా మలిచాయి. భీంగల్ గుట్టలలో నుంచి తడపాకల్ వరకు విరజానది పెద్దవాగు

ప్రవహించి గోదావరి నదిలో కలుస్తుంది. మంచిప్ప అడవులలో పుట్టి పూలవాగు (పులాంగు) నిజామాబాదు ప్రక్కనుంచి ప్రవహిస్తూ కాళేశ్వరం వద్ద గోదారిలో సంగమిస్తుంది. పుసుపులేరునే (బోధన్) హరిద్రానది అని పిలుస్తారు.

**చెరువులు - ప్రాజెక్టులు :** జిల్లాలో అలీసాగర్, అశోక్‌సాగర్‌లు మిక్కిలి పెద్దనైన చెరువులు. అలాగే ఆర్మూర్, మోర్తాడ్, కేశపల్లి, జక్రాన్‌పల్లిలోని రెండు చెరువులు, కమ్మర్‌పల్లిలోని బషీరాబాదు సమీపంలోని చెరువు, బోధన్, వర్ణి మొదలైన ప్రాంతాలలోని చెరువులు ప్రసిద్ధమైనవి. పోచంపాడు (మెండోర మండలం) ప్రాంతంలో శ్రీరాంసాగర్ ప్రసిద్ధమైన ఆనకట్ట. 1964 లో భారతదేశ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేయగా నిర్మించింది. లక్ష్మి కాలువ, గుత్ప ఎత్తిపోతల పథకం వ్యవసాయానికి ఉపయోగపడే జలవనరులు.

ఈ నిజామాబాదు జిల్లా ప్రాంతంలో వరి, మొక్కజొన్న, పసుపు, చెఱకు వంటి పంటలే కాకుండా కందులు, పెసర్లు, మినుములు, అలసందలు, మిరప, శనగలు వంటి పంటలు పండుతాయి. తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా భారతదేశంలోనే ప్రసిద్ధిచెందిన అంకాపూర్ గ్రామం. ఆర్మూర్ మండలంలోనే వుంది. ఈ అంకాపూర్ గ్రామాన్ని సందర్శించడానికి మన రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి, విదేశాల నుంచి కూడా శాస్త్రవేత్తలు, రైతులు వస్తారంటే ఈ గ్రామం వ్యవసాయంలో ఎంత అభివృద్ధి చెందిందో చెప్పవచ్చు.

**జనాభా :** మొత్తం జనాభా 15,71,022. పురుషులు 76,8,477, స్త్రీలు 80,2,545.

**అక్షరాస్యత :** మొత్తం శాతం 64.25. పురుషులు 74.08 శాతం, స్త్రీలు 54.95 శాతం.

## జిల్లా చరిత్ర

ఇందూరుగా ప్రసిద్ధిచెందిన నిజామాబాదు జిల్లా చరిత్ర పాతరాతి యుగంతో ప్రారంభమైందని లభించిన పురావస్తు ఆధారాలు, ప్రాచీన సమాధులు నిరూపిస్తున్నాయి.

**మున్సిపల్ కార్పొరేషన్ :** నిజామాబాద్, ఆర్మూర్, బోధన్.
**రెవెన్యూ గ్రామాలు :** 443
**గ్రామపంచాయితీలు :** 393
**పోలీస్ కమీషనరేట్ :** నిజామాబాద్
**పార్లమెంట్ నియోజకవర్గం :** నిజామాబాద్
**అసెంబ్లీ నియోజకవర్గాలు :** నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, బాల్కొండ, ఆర్మూర్.
**పట్టణాలు :** నిజామాబాద్, బోధన్, ఆర్మూర్.

ప్రాచీన కాలం నుంచి ఈ జిల్లాను అనేక రాజవంశాలు పరిపాలించాయి.

**షోడశజన పదాలు :** క్రీ.పూ. 6 వ శతాబ్దిలో షోడశజన పదాల ద్వారా భారతదేశ చరిత్ర ప్రారంభమైందని చెప్పవచ్చు. వాటిలో అశ్మకరాజ్యం దక్షిణాపథ ప్రాంతం ఒకటని దానికి పౌదన్యపురం (బోధన్) రాజధాని అని తెలుస్తుది.

**మగధ సామ్రాజ్యం :** మగధ చక్రవర్తులకు సామంతులుగా 25 మంది అశ్మక రాజ్య పాలకులు ఉండేవారని నందవంశ రాజు మహాపద్మనందుడు కూడా అశ్మక రాజ్యాన్ని తన రాజ్యంలో విలీనం చేసినట్లు చరిత్ర చెబుతుంది.

**మౌర్యులు :** క్రీ.పూ.323 లో నందులను ఓడించి మౌర్యచంద్ర గుప్తుడు రాజయ్యాడు. అతని మనుమడు అశోక చక్రవర్తి వేయించిన 13 వ శిలాశాసనం ప్రకారం ఈ ప్రాంతం వారికి సామంతులుగా ఉన్నట్లు తెలిపింది. మెగస్తనీస్ తన ఇండికా గ్రంథంలో తెలుగు వారికి 30 బలిష్టమైన కోటలు, ఒక లక్ష కాల్బలం, 20 వేల అశ్వబలం, ఒక వేయి గజబలం ఉన్నట్లు తెలిపాడు. మెగస్తనీస్ తెలిపిన 30 కోటలలో దక్కన్ ప్రాంతంలో తొలి రాజధానిగా వెలిగిన బోధన్ పురాతన కోట ఒకటై ఉంటుందని అనడంలో సందేహం లేదు.

**శాతవాహనులు :** క్రీ.పూ. 230 - క్రీ.శ. 220వరకు శాతవాహనులు దక్కన్ ప్రాంతాన్ని పరిపాలించారు. వీరి

తొలి రాజధాని కోటిలింగాల. తదనంతరం మహారాష్ట్ర లోని పైఠాన్ (ప్రతిష్ఠానపురం) తరువాత మలిశాతవాహనులు కృష్ణాలోయలోని ధాన్యకటకం/ ధరణికోట (అమరావతి) రాజధానిగా చేసుకొని పరిపాలించినట్లు తెలుస్తుంది. శాతవాహన రాజులలో ప్రసిద్ధిచెందిన గౌతమీపుత్ర శాతకర్ణి అశ్మక రాజ్యాన్ని జయించినట్లు, దాదాపు 30 మంది రాజులు 400 సంవత్సరాల పాటు పరిపాలించినట్లు శాసనాలున్నాయి. ఆనాటి పాలక భాష ప్రాకృతం.

**ఇక్ష్వాకులు :** ఇక్ష్వాకులు దక్షిణాపథ ప్రాంతంలో కోసలాపురం (కౌలాస్) రాజధానిగా రాజ్యస్థాపన జరిపినట్లు వర్ణించబడింది.

**త్రికూట వంశం :** శాతవాహనుల అనంతరం నర్మద, తపతి నదులకు దక్షిణ ప్రాంతాన్ని త్రికూట వంశం పరిపాలించారు. క్రీ.శ. 388 లో ఈ వంశరాజు 'ఇంద్రపురిని' నిర్మించినట్లు, అది క్రమంగా ఇందూరుగా మారిందని చరిత్రకారులు తెలిపారు.

**విష్ణుకుండినులు :** ఇక్ష్వాకుల సామంతులు విష్ణుకుండినులు. మహారాజేంద్ర వర్మ విష్ణుకుండిన స్వతంత్ర సామ్రాజ్యాన్ని స్థాపించాడు. అతని తర్వాత 12 మంది విష్ణుకుండిన రాజులు సుమారు 266 సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా పరిపాలించారు. వీటిద్వారా సమస్త దక్షిణాపథం వీరి ఏలుబడిలో ఉందని తెలుస్తుంది.

**రాష్ట్రకూటులు :** తెలుగు నేలను పరిపాలించిన రాజవంశాలలో రాష్ట్రకూటుల వంశం పేర్కొనదగింది. నిజామాబాదు జిల్లాలో ఈ రాజులు వేయించిన శాసనాలు లభించాయి. రాష్ట్రకూటులు (క్రీ.శ. 753-973) 200 సంవత్సరం పై చిలుకు యావత్ తెలంగాణ ప్రాంతాన్ని పరిపాలించారు. రాష్ట్రకూట వంశ స్థాపకుడైన దంతిదుర్గునికి సామంతునిగా, బోధన్ చాళుక్య వంశస్థాపకుడైన వినయాదిత్య యుద్ధమల్లుడు ఈ జిల్లాను పాలించాడు. ఇందూర్, కౌలాస్ కోటలను నిర్మించాడు. బోధన్‌లో ఇంద్రనారాయణ ఆలయాన్ని నిర్మించినట్లు చెబుతారు. వీరి పాలనలో జిల్లా గొప్ప వైభవ స్థితికి చేరుకుంది

**బోధన్ చాళుక్యులు :** తెలంగాణ ప్రాంతాన్ని ఒక ప్రత్యేక రాజ్యంగా పరిపాలించిన రాజవంశం బోధన్ చాళుక్యులు. వీరిని వేములవాడ చాళుక్యులు అని కూడా అంటారు. సపాదలక్ష దేశంగా పరిపాలించిన రాజులు వీరు. వీరి రాజధాని బోధన్ నగరం. క్రీ.శ. 750-973 వరకు రాష్ట్రకూట సామంతులుగా, బంధువులుగా జిల్లాకు విశేష సేవలందించారు. ఈ వంశంలో ప్రసిద్ధుడైన రెండో అరికేసరి ఆస్థానంలోని పంప మహాకవి ఈ ప్రాంతంవాడే. కన్నడ భారతం విక్రమార్జున విజయం పేరుతో రచించి కన్నడ రత్నత్రయంలో మొదటివాడిగా పేరుపొందాడు. అట్లే ఆదిపురాణం, తెలుగులో జినేంద్ర పురాణం రచించాడు.

**కల్యాణీ చాళుక్యులు :** క్రీ.శ. 973 లో ఈ జిల్లా కల్యాణీ చాళుక్యుల వశమైంది. వీరి పాలనకు ప్రత్యేక స్థానం వుందని చెప్పవచ్చు. వీరి కాలం నాటి చారిత్రక నిర్మాణాలు, శాసనాలు అనేకం లభించాయి. ఇందూరు పట్టణంలోని నీలకంఠేశ్వరాలయం, బోధన్‌లోని చక్రేశ్వరాలయం 11 వ శతాబ్దం నాటివి.

**కాకతీయులు :** తెలుగు వారి చరిత్రలో కాకతీయుల స్థానం మూలస్తంభం వంటిదని చెప్పవచ్చు. కోటగిరి శాసనం ప్రకారం యాదవరాజైన మహాదేవుని రుద్రమదేవి ఓడించి, కౌలాస్, బోధన్‌ను ఆక్రమించుకొని మిర్యాల సోమనాథుని ప్రతినిధిగా నియమించింది. ఇతడు కోటగిరి రాజధానిగా ఈ ప్రాంతాన్ని పాలించాడు. కాకతీయ రెండవ ప్రతాప రుద్రుడు జిల్లాలోని బాల్కొండ, ఇందూరు, బోధన్, కోటగిరి మొదలైన ప్రాంతాల్నే కాక కౌలాస్ వరకు సందర్శించి, ఢిల్లీ సుల్తానుల దండయాత్రల వల్ల ధ్వంసమైన కోటలను పునరుద్ధరించారు. ఈ జిల్లాలో కాకతీయుల శాసనాలు, శైవాలయాలు, చారిత్రకాధారాలుగా నిలుస్తాయి.

**ఢిల్లీ సుల్తానులు :** కాకతీయుల తర్వాత ఢిల్లీ సుల్తానులు బోధన్, ఇందూరు కోటలను వశపర్చుకున్నట్లు ఆ తర్వాత జునాఖాన్ నామాంతరం కలిగిన మహ్మద్‌బిన్ తుగ్లక్ బోధన్‌ను ఆక్రమించినట్లు అతని శాసనాలు తెలుపుతున్నాయి.

బోధన్‌లోని ఆలయాన్ని మసీదుగా మార్చినట్లు చెబుతారు. దీన్ని దేవల్ మసీదుగా చెబుతారు.

**కుతుబ్‌షాహీలు :** 1544 లో రెండవ కుతుబ్‌షాహీ నవాబు కౌలాస్ దుర్గాన్ని నిర్మించారు.

**బరీద్‌షాహీలు :** వీరి పాలనలో కోటగిరి ప్రాంతం వైభవస్థితిలో వున్నట్లు చారిత్రకులు చెబుతారు.

**మరెడ్డి రాజులు :** ఈ జిల్లాలో 16 వ శతాబ్దానికి చెందిన రెడ్డి రాజుల దాన శాసనాలు లభించాయి.

**మొఘల్ చక్రవర్తులు :** 1595 లో ఈ జిల్లా అక్బర్ చక్రవర్తి ఆధీనమైనట్లు, బోధన్, ఇందూరు, బాల్కొండ దుర్గాలను ఆక్రమించినట్లు తెలుస్తున్నది. 1687 లో ఔరంగజేబు దుర్గాన్ని జయించి మహ్మద్ ఖాసింను ప్రతినిధిగా నియమించాడు. నిజామాబాదు సమీపంలోని న్యాల్‌కల్‌లో అతని వెండి నాణేలు లభించాయి.

**మహారాష్ట్రులు :** ఛత్రపతి శివాజీ గురువైన సమర్థ రామదాసు భక్తి ఉద్యమ ప్రవక్త. వీరి కాలంలో ఇందూరు కోటపై రఘునాథాలయాన్ని, పట్టణంలోని పచుమాన్ ఆలయం, సారంగాపూర్ హనుమాన్ దేవాలయ నిర్మాణం జరిగాయి. ఔరంగజేబు మరణాంతరం మహారాష్ట్రులు విజృంభించి, ఈ ప్రాంతంపై దండెత్తి చౌత్, సర్దేశ్‌ముఖి పన్నులు వసూలు చేసినట్లు తెలుస్తున్నది.

**అసఫ్‌జాహీ వంశం :** స్థానికుల పరిపాలన, మొగలుల అనంతరం ఆసఫ్‌జాహీలు ఈ జిల్లాను 1724 నుంచి 1948 వరకు పాలించారు. ఈ విషయాలు స్థానిక చారిత్రక రచనలైన తారీఖీయె నిజామాబాదు, తార్నీఖియె బాల్కొండ మొదలైన ముస్లిం రచనల్లోనే గాక, కామినేని వంశ చరిత్ర ద్వారా తెలుస్తున్నది.

## సంస్కృతి

నిజామాబాదు జిల్లాకు తూర్పున జగిత్యాల్ / కరీంనగర్, పడమటన మహారాష్ట్ర, నైఋతి భాగాన కర్ణాటక, ఉత్తరాన ఆదిలాబాదు సరిహద్దులుగా ఉండటం వలన విభిన్న భాషా సంస్కృతుల సంగమస్థలంగా ఈ జిల్లా వెలుగొందుతుంది. ఇక్కడ తెలుగుతో పాటు మరాఠీ, ఉర్దూ, మార్వాడీ, ఖత్రీ, కన్నడ, హిందీ, తమిళ మొదలైన భాషలు మాట్లాడే వారున్నారు. నిజామాబాదు జిల్లాలో క్రీ.పూ. 1000 సంవత్సరాల నుంచే చక్కని సంస్కృతి విలసిల్లినట్లుగా చారిత్రక ఆధారాలు లభిస్తున్నాయి. అశ్మక రాజ్యానికి బోధన్ రాజధాని కాబట్టి అప్పటి నుంచే చక్కటి రాజ్య వ్యవస్థతో పాటు చక్కని సంస్కృతి పరిఢవిల్లినట్లుగా చెప్పుకోవచ్చు. ఆ తర్వాత 14 వ శతాబ్దంలో ముస్లింల దక్షిణ భారత దండయాత్రలలో మొదటి దాడి జరిగింది బోధన్‌పైనే. కాబట్టి ముస్లిం సంస్కృతి ప్రభావం ఈ జిల్లాలో ఎక్కువగానే వుందని భావించవచ్చు.

**ఆచారాలు, సంప్రదాయాలు, పండుగలు :** భారతదేశంలో మాదిరిగానే నిజామాబాదు జిల్లాలో కూడా వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలను పరమపవిత్రంగా భావించే హిందువులు అధికంగా వున్నారు. విభిన్న దేవతారాధనతో పాటు శివారాధన చేసే వీరశైవులు, విష్ణువును పూజించే ఆచారం ఈ జిల్లాలో కనిపిస్తుంది. ప్రకృతి శక్తులైన అడవి, నది, నీరు, కొండలు, భూమి మొదలైన వాటిని స్త్రీ దేవతాకారంలో పూజించే ఆచారం ఇక్కడ కనిపిస్తుంది. హిందువులు, ముస్లిం పీర్ల పండుగల్లో పాలు పంచుకుంటారు. దర్గాలు, సమాధుల పూజ కూడా ముస్లింల నుండి హిందువుల్లోకి ప్రవేశించింది. ముస్లిం మతస్థుల్లో కూడా ఖురాన్ మార్గంలో నడిచే సున్నీలు, పీర్ల పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకొనే షియాలు, దర్గాలను పూజించేవారు కనిపిస్తారు. సిక్కులు, జైనులతో పాటు క్రైస్తవులు కూడా ఈ జిల్లాలో కనిపిస్తారు. ఇన్ని రకాల మతాలు కలిగినా పరమత సహనంతో, సౌభ్రాతృత్వంతో ఇక్కడ జీవిస్తారు. ఈ విధంగా సుదీర్ఘ చరిత్ర, విభిన్న మతాలు, భాషల ప్రభావంతో ఇక్కడి సంస్కృతి లఘు భారతదేశంగా మారింది. ఈ జిల్లాలో ప్రవహించే గోదావరి నది కూడా జిల్లా సంస్కృతిపై ప్రభావం చూపింది.

ఈ జిల్లాలో ప్రాచీనం నుంచి పండుగలను ఘనంగానే జరుపుకుంటారు. ఉగాది, శ్రీరామనవమి, నృసింహ

జయంతి, మిరుగు, ఊర పండుగ, నాగపంచమి, పొలాల అమావాస్య, గణపతి చవితి, రాఖీలు, దసరా, బతుకమ్మ, దీపావళి, సంక్రాంతి, శివరాత్రి వంటి హిందూ పండుగలే కాక, రంజాన్, పీర్లపండుగ, బక్రీద్ వంటి ముస్లిం పండుగలు, క్రిస్మస్, గుడ్‌ఫ్రైడే వంటి క్రైస్తవ పండుగలు ఇక్కడ ఘనంగా జరుపుకుంటారు.

**కళలు :** వివిధ జానపద కళారూపాలు ఈ జిల్లాలో విరివిగా కనిపిస్తాయి. గోత్రాలవారు, తోటివారు, వీరభ్రతులు, ఒగ్గుకథకులు, భట్రాజులు, చిందు భాగోతాలు, కూచిపూడి, శారదాకాండ్లు, గోసాయిలు, బుడగ జంగాలు, నకాషీలు, పగటివేషాలు, కాటికాపరులు, పులివేషాలు, దొమ్మరాట, బుడబుక్కలు, పోషమ్మలవారు, బహురూపుల వారు, కోలాటాలు, చిరుతలు, జడకొప్పులు, వీరముష్టివారు, జోగినీ నృత్యం, బతుకమ్మ పాటలు, తంబుర కథ, హరికథ, ఒగ్గుకథ. తోలుబొమ్మలాట మొదలైన వివిధ కళారూపాలు ఈ జిల్లాలో కనిపిస్తాయి.

**జాతరలు :** కుల సంప్రదాయాలు, సామూహిక ఆచారాలు కలిగిన పండుగే జాతర. జానపదుల సాంస్కృతిక చిహ్నంగా జాతరను పేర్కొనవచ్చు. ఈ జిల్లాలో జరిగే జాతరలు ప్రసిద్ధిచెందినవి. జాతర సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఒక చోటికి చేరి ఉల్లాసంగా, ఉత్సాహంగా గడపడం ఆనవాయితీ. దేవుని జన్మదినం సందర్భంగా, పుణ్య తిథుల్లోనూ ఉగాది, రామ నవమి, శివరాత్రి, హనుమ జ్జయంతి సందర్భంగా జాతరలు నిర్వహించడం ఈ జిల్లాలో చూడవచ్చు. మూడు లేదా ఐదు, కొన్నిచోట్ల తొమ్మిది రోజులు నిర్వహించే ఉత్సవాలు కూడా ఉన్నాయి. కొన్నిచోట్ల యువకుల కుస్తీ పోటీలు, ఎడ్లబండ్ల పోటీలు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. రథ సప్తమినాడు నీలకంఠేశ్వర ఆలయంలో గొప్ప జాతర జరుగుతుంది. బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయం వద్ద లక్ష దీపాలతో శివరాత్రి జాగరణ జరుగుతుంది. బోధన్ మండలంలోని పిడిగుద్దుల జాతర, ఎడపల్లి మండలం జాన్కంపేట లక్ష్మీనృసింహాలయం జాతర ప్రసిద్ధిచెందాయి. ఇక్కడి అష్టముఖి కోనేరులో స్నానం చేసి దేవాలయాన్ని దర్శించుకోవడాన్ని విశేషంగా చెప్పుకోవచ్చు. ఉత్తర తెలంగాణాలోనే ప్రసిద్ధిచెందిన అతిపెద్ద జాతర భీంగల్ సమీపంలోని లింబాద్రి నరసింహ స్వామి జాతర. ఇది కార్తీక పౌర్ణమి రోజును పురస్కరించుకొని జరుగుతుంది. ఆర్మూర్ పట్టణ కేంద్రంలోని నవసిద్ధుల గుట్టపై జాతర ప్రసిద్ధమైంది. మంథని గ్రామంలో శ్రీరంగనాయక స్వామి ఆలయం వద్ద జాతర, ధర్పల్లి మండలంలోని గంగమ్మ జాతర, సిరికొండ మండలంలో లొంక ప్రాంతంలో వెలసిన లొంక రామేశ్వరుని జాతర ప్రసిద్ధి. పెద్దవాల్గోట్‌లో శివాలయం వద్ద అన్నపూర్ణమ్మ జాతర వైభవంగా జరుగుతుంది. హుస్సేన్‌సాగర్ జాతరలో సరస్వతీ ఆలయంలో రథాన్ని ఊరేగించడం జరుగుతుంది. దమ్మన్నపేట్‌లో శివరాత్రి సందర్భంగా శివగుట్టపై వైభవోపేతంగా జాతర నిర్వహిస్తారు. జక్రాన్‌పల్లిలో హనుమ జ్జయంతిని పురస్కరించుకొని అతి ప్రాచీనమైన ఆదినాథ స్వామి ఆలయంలో జాతర నిర్వహించడం, రథోత్సవం, చక్రతీర్థం మూడురోజులు వైభవంగా నిర్వహించడం జరుగుతుంది. అలాగే జిల్లా కేంద్రంలోని జెండా బాలాజీ జాతర, ఆర్మూర్ జెండా జాతరలు చెప్పుకోదగిన జాతరలు. నందిపేటలోని కేదారేశ్వర ఆశ్రమంలో శివరాత్రి, కార్తీక పౌర్ణములకు జరిగే జాతరలు ప్రత్యేకమైనవి. ఈ విధంగా జిల్లాలోని అన్ని మండలాల్లోనూ, అత్యంత వైభవోపేతంగా జాతరలు నిర్వహించడం గమనించవచ్చు.

## సాహిత్య చరిత్ర

**పంప మహాకవి :** ఇందూరు జిల్లాగా ప్రసిద్ధిచెందిన నిజామాబాదు సహస్రాధిక వసంతాల సాహితీ సౌరభాలను వెదజల్లిన జిల్లాగా పేరుగాంచింది. నాటి నుంచి నేటి వరకు సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని పదిలపర్చుకుంది. అమూల్య సాహిత్య సంపదతో విరాజిల్లిన ఈ జిల్లాలో ప్రాచీన సాహిత్యాన్ని పరిశీలించగా క్రీ.శ. 930-955 మధ్య కాలంలో పోథన నగరాన్ని (బోధన్) పరిపాలించిన బోధన్

చాళుక్య ప్రభువైన రెండవ అరికేసరి ఆస్థానకవిగా పంప మహాకవి ఈ జిల్లా సాహితీ చరిత్రలో అతి ప్రాచీన కవిగా మనకు కనిపిస్తారు.

కన్నడ భాషలో విక్రమార్జున విజయం అనే కావ్యాన్ని రచించాడు. ఇది కన్నడ భారతంగా ప్రసిద్ధి చెందింది. కన్నడరత్న త్రయంలో మొదటి రత్నంగా ప్రసిద్ధిచెందిన ఇతడే 'ఆది పురాణాన్ని' కూడా రచించాడు. నన్నయ కంటే 100 సంవత్సరాల పూర్వీకుడైన పంపమహాకవి, నన్నయకు పూర్వమే 'జినేంద్ర పురాణం' అనే కావ్యాన్ని రచించాడని చారిత్రకుల అభిప్రాయం. ఈ కావ్యం ప్రస్తుతం అలభ్యం. అయితే పంపని సోదరుడైన జినవల్లభుడు కరీంనగర్ జిల్లా గంగాధర గ్రామ సమీపంలో కుర్క్యాల శాసనంలో తెలుగు కంద పద్యాలు లభించడం చేత పంపమహాకవి కూడా తెలుగులో రచనలు చేసి ఉండవచ్చు అనేది పరిశోధకుల అభిప్రాయం. పంపడు జైన ధర్మాన్ని అవలంబించి తర్వాతి కాలంలో శుభనంది అనే పేరుతో పరివ్రాజకుడై పోదనం పట్టణంలో మరణించాడు. ఈనాటికి బోధన్ నగరంలో పంపమహాకవి సమాధి వుంది.

**జినవల్లభుడు:** పంపమహాకవి తమ్ముడైన జిన వల్లభుడు కరీంనగర్ జిల్లాలోని గంగాధర సమీపంలోని కుర్క్యాల సమీపం బొమ్మలగుట్ట మీద జినవల్లభుడు రచించిన ఈ శాసనంలో తెలుగు కందపద్యాలు కనిపిస్తాయి. లభించిన సమాచారం మేరకు తెలంగాణలో తెలుగు పద్యాలున్న తొలి శాసనమిది. ఈ శాసనం సుమారు క్రీ.శ. 946 లో రచించాడని పరిశోధకుల భావన.

**సోమదేవ సూరి** : బోధన్ చాళుక్యుల కాలంలోనే క్రీ.శ. 959 ప్రాంతంలో సోమదేవసూరి అనే సంస్కృత మహాకవి ఆశ్రయాన్ని పొందాడు. ఈ మహాకవి సంస్కృతంలో రచించిన మహాకావ్యం 'యశస్థిలకమ్'. బోధన్ చాళుక్యులు వారి పరిపాలన చివరి కాలంలో వారి రాజధానిని బోధన్ నుంచి కరీంనగర్ జిల్లాలోని గంగాధరకు మార్చినట్లుగా తన కావ్యంలో పేర్కొన్నాడు. గుణాఢ్యుడు ప్రాకృతంలో రచించిన బృహత్కథను 'కథాసరిత్సాగరం" అనే పేరుతో సంస్కృత కథా సాహిత్యాన్ని తన రచన ద్వారా సుసంపన్నం చేశాడు.

**కొరవి సత్యనారన** : కొఱవి గోపరాజు చిన్న తాత అయిన సత్య నారన. ఇతనికి భీమన అనే నామాంతరము ఉంది. ఈ కవి 14 వ శతాబ్దిలోనే తెలుగులో రామాయణాన్ని రచించి, అల్లసాని పెద్దన కంటే పూర్వమే 'ఆంధ్రకవితా పితామహుడన్న' బిరుదు పొందిన కవి శ్రేష్ఠుడని గోపరాజు తన కావ్యంలో ప్రస్తావించాడు.

**"రామాయణ కృతి కృతియై**
**తామెరయుచు నంధ్ర కవి పితామహుడనగా**
**భూమిని మించిన భీమన**
**నామంబున బరగె సత్యనారన ఘనుడై"**

అని తెలిపాడు. అయితే ఈ మొట్టమొదటి ఆంధ్రకవితా పితామహుని కావ్యమైన రామాయణం నేటి దాకా లభించక పోవడం తెలుగు సాహిత్యానికే కాక, నిజామాబాదు జిల్లా సాహిత్యానికే తీరని నష్టంగా భావించవచ్చు.

**కొఱవి గోపరాజు** : క్రీ.శ. 1405– 1480 మధ్య కాలంలో జీవించిన కొఱవి గోపరాజు ఈ జిల్లాలోని ఉపలబ్ధ కావ్యకర్తలలో ప్రథమునిగా కనబడతాడు. వేముగల్లుగా పిలువబడే నేటి భీంగల్‌కు సమీపాన వున్న పల్లికొండను పాలించిన రాణామల్లన్నకు ఆశ్రిత కవివర్యులు. 'సింహాసనా ద్వా త్రింశిక' అన్న కథా కావ్యాన్ని ఈ మహాకవి రచించాడు. ఈ కావ్యం కథా కావ్యాలలో మణికిరీటం వంటిది. ఈ కావ్యం సంస్కృతంలోని విక్రమార్క చరిత్రకు అనుసరణం అంటారు. ఈ విషయాన్ని గోపరాజే స్వయంగా "ఈ సరసోక్తి కావ్యమొకడిమ్ముల సంస్కృత భాషనచ్చుగా, జేసినయట్ల వీడు మరిచేయుట" అని అవతారికా ముఖంగా ప్రకటించాడు. వేముగల్లు (భీంగల్) ప్రాంతాన్ని గోపరాజు ఈ విధంగా రమణీయంగా వర్ణించాడు.

**"రాణామల్లిన కీర్తి చంద్రికలు పర్వంబొంగి మధ్యాశ్రిత**
**క్షోణీభృద్వనదుర్గమై గుణమణి స్తోమంబులన్ నిండి, య**
**క్షీణ శ్రీ పురుషోత్తమాశ్రయమునై చెల్వారి దానామృత**
**శ్రేణిన్ ద్యాగ సముద్ర నామము వహించెన్ వేముగల్లీ మహిన్"**

ఇతడి అనువాదం పూర్తిగా యథాతథం కాకుండా నవీన కల్పనలతోనూ, నవీన కథలతోనూ కూడి స్వతంత్ర రచన లాగా కనబడుతుంది. భోజరాజు విక్రమార్కుని సింహాసనం అధిరోహించే సమయంలో ఆ సింహాసనంలోని మెట్లపై వున్న సాలభంజికలు అడ్డుపడి చెప్పిన 32 రసవంత మైన కథలు సింహాసనా ద్వాత్రింశికలో కనిపిస్తాయి. 12 ఆశ్వాసాల మహాకావ్యమిది. ఈ కావ్యం హరిహర నాథునికి అంకితం చేయబడింది.

భీంగల్ ప్రాంతానికి చెందిన దత్తోజీ పండితుడనే కవి కృష్ణార్జున సంవాదం అనే నాటకాన్ని రచించాడు. ఇతడే భగవద్గీతకు, యోగ శాస్త్రానికి తెలుగులో అనువాద కావ్యాలు రచించాడని ప్రతీతి. ఇప్పుడవి అలభ్యాలు.

**ఆధునిక సాహిత్య పరిమళాలు :**

నిజామాబాదు జిల్లాలో సాహిత్య రంగం గురించి అవలోకనం చేసినపుడు ఆధునిక దశలో ఎన్నో అమూల్య సాహిత్య రత్నాలు కనిపిస్తాయి. సాహిత్య సంస్థలు, పత్రికలు చేసిన కృషితో పాటు కవులు, రచయితలు చేసిన సేవ ఎంతో విలువైంది. కావ్యాలు, శతకాలు, ఖండికలుగా సంప్రదాయ అధునాతన వస్తు విశేషాలతో చక్కని పద్య కవిత్వం చెప్పిన కవులు ఇందూరు సీమలో ఎందరో వున్నారు. ఆధునిక కాలంలో వికసించిన పద్య సాహిత్యాన్ని స్థూలంగా పరిచయం చేసుకుందాం.

**తాళ్ళ గంగాదాస యోగీంద్రులు** రచించిన లొంక రామేశ్వర, లింగ రహిత సామల రాజలింగయ్య శతకాలు భక్తి భావంతో పాటు వేదాంతాన్ని ప్రబోధించేవి. **గణపతి రామచంద్రారావు** సీస పద్యాలలో రచించిన శ్రీనివాసార్థ శతకం ప్రౌఢమైనవి. విద్వత్కవిగా, కవి గణపతిగా ప్రసిద్ధులైన వీరు ఛందో ప్రక్రియలలో వివిధ విన్యాసాలు చేశారు. చిత్రబంధ కవితలలో ఆరితేరినవారు. ఇందుపురీశ్వర వేంకటేశ్వర శతకం (కంద్లాకై లక్ష్మీనరసింహాచార్యులతో కలిసి), 'లక్ష్మీశతకం', 'శ్రీమద్ధర్మపురి లక్ష్మీనరసింహ శతకం, వాసర జ్ఞాన సరస్వతీ శతకం, శ్రీ దుబ్బ రాజేశ్వర శతకం, సంతోషీమాత శతకం ప్రసిద్ధమైనవి.

**నంబి శ్రీధర్ రావు** రచించిన 'శ్రీమన్నింబగిరి నరసింహ శతకం', 'శ్రీ లొంక రామేశ్వర శతకం' ధారాశుద్ధితో అలరారే శతకాలు. **కల్లూరి రామచంద్రారావు** రచించిన 'తెలుగుబిడ్డ శతకం' బాల ప్రబోధాత్మకమైనది. **రాగి చిన్నయ్య** రచించిన 'శతకత్రయం, లక్ష్మీ శతకం, బలప్రబోధ శతకం, చిన్నప్ప శతకం, భక్తి ప్రబోధాత్మకమై, సామాజిక విలువలను ఆవిష్కరించేవి. **మామిండ్ల రాజాగౌడు** రచించిన 'శ్రీ నారసింహ శతకం', 'కవిగౌడప్ప శతకం', ప్రథమ, ద్వితీయ భాగాలు అధిక్షేపాత్మకమైనవి.

**శిరిశినహళ్ కృష్ణమాచార్యులు** రచించిన 'గాంధీతాత శతకం' ప్రసిద్ధమైంది. 'సిద్ధేశ్వరా!' మకుటంతో సోమశేష రచించిన శతకం ప్రౌఢమైనది. 'మాణిక్యప్రభు' శతకాన్ని **మాకునూరి లక్ష్మీనరసింహాచార్యులు** రచించారు. **చిత్కల పుండరీక శర్మ** రచించిన రామలింగేశ శతకం, శ్రీరఘుకుల సార్వభౌమ శతకం' భక్తిభావాలతో కూడినది. **ఆకుల వేంకట రాములు** రచించిన నీలకంఠ, రాజలింగ శతకాలు శివభక్తి పారమ్యాన్ని ప్రకటించేవి. **డా. గణపతి అశోక శర్మ** రచించిన 'కామేశ్వరీ శతకం', 'శ్రీ విద్యా సాంప్రదాయంతో కూడి ప్రౌఢమైనది. **చిత్కల శ్రీనివాస శర్మ** రచించిన 'సత్యదేవ, శ్రీశాస్త (అయ్యప్ప) శతకాలు భక్తి ప్రబోధాత్మకమైనవి. 'మాతృ సందేశం, జీవవైవిధ్య త్రిశతి, శారదాంబ' శతకాలు వీరు రచించిన ప్రసిద్ధ శతకాలు. 'కోటిరత్నాల వీణ శతకం' ఉద్యమ స్ఫూర్తితో రచించింది.

**తల్లావజ్ఝల మహేష్ బాబు** రచించిన 'తెలుగువాణి శతకం' నైతిక సందేశాత్మకమైనది. పొడుపు కథలకు సంబంధించిన 'పొడుపు – విడుపు శతకం' మేధకు పదును పెట్టేది. వీరి సంపాదకత్వంలో వచ్చిన 'తెలంగాణ శతకం' 12 మంది కవులు రచించిన విలక్షణ శతకం. **మేడిచర్ల ప్రభాకర రావు** రచించిన 'వాసరమ్మ వాణి పంచశతి', బాసర

సరస్వతి విశిష్టతను తెలియజేసేది. **ఆచార్య ఫణీంద్ర** రచించిన 'ముద్దుగుమ్మ' ముకుంద శతకం, వరాహ శతకం పేర్కొనదగినది. **ఉల్లెంగల గంగాధర్** 'విశ్వనాథ శతకం', శ్రీహరిరామం, 'విజయగీతి శతకం', **పబ్బం మురళి** రచించిన 'మురళి శతకం', **కట్కం ముత్యం** రచించిన 'లక్ష్మీనారసింహ శతకం', **మఠ్ఠిపల్లి శ్రీధరాచార్యులు** రచించిన 'వాసరేశ్వరి శతకం', **ఎలగందుల లింబాద్రి** రచించిన 'నింబాద్రి నరసింహ శతకం', **డా. పింగళి గంగాధర్ రావు** రచించిన 'త్ర్యంబకేశ్వర శతకం', **వెంకన్న గారి జ్యోతి** రచించిన 'పల్లెటూరు శతకం', **అంబట్ల రవి** రచించిన 'సాయి శతకం, **స్వర్ణ లక్ష్మణ రావు** రచించిన 'శ్రీనివాస శతకం' పేర్కొనదగింది. గంట్యాల 'ఓటరన్న శతకం', **శృంగారం జనార్ధనాచార్యులు** రచించిన 'గోవింద గోపాల శతకం', **చింతల శ్రీనివాస్** రచించిన 'శ్రీవిలాస శతకం' ప్రసిద్ధమైన శతకాలు. ఈ విధంగా నిజామాబాదు జిల్లా శతకనందనోద్యానంలో శతకమందారం నిత్యం వికసిస్తూ పద్య సుగంధాలను వెదజల్లుతున్నాయి.

**కావ్య సాహిత్య వికాసం :**

నిజామాబాదు జిల్లాలో పద్య ప్రక్రియలో ఆధునిక కాలం విశిష్టమైనది. వీటిలో బృహత్కావ్యాలు, లఘు కావ్యాలు, ఖండ కావ్యాలు, అనువాద కావ్యాలు, కవితా సంకలనాలు, నక్షత్ర మాలికలు, దండకాలు, ఉదాహరణలు, జీవిత చరిత్రలు, యాత్రా చరిత్ర, స్వీయ చరిత్ర, ద్విపద కావ్యాలు, చిత్రబంధ కవిత్వం, తాత్త్విక రచనలు ఇలా వివిధ ప్రక్రియలలో పద్యం బహుముఖీనమై అలరారింది.

నైజాం రాష్ట్ర ఆద్య శతావధానిగా పేరు పొందిన **శిరశినహాళ్ కృష్ణమాచార్యులు** రచించిన 'కళాశాలాభ్యుదయం' మూడు ఆశాస్వాలు కలిగిన బృహత్కావ్యం. అలాగే మనస్సందేశం, వేదాంత పరమైన కావ్యం. 'రామానుజ చరిత్రము' జీవితచరిత్ర ప్రక్రియకు చెందిన కావ్యం. 'రత్నమాల' ఖండకావ్యం. 'స్తుతి గీతములు' మూడు భాగాలు అనువాద రచనలు. చిత్ర ప్రబంధ చిత్ర కవిత్వానికి సంబంధించిన అమూల్య రచన. వీరు ఇవేకాక అనేక సంస్కృత రచనలు, గద్య రచనలు చేసారు. వీరు మోర్తాడ్ గ్రామానికి చెందినవారు. దాశరథి కృష్ణమాచార్యులు జైలు గోడలపై 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అని నిజాంను అక్కడే వ్యతిరేకించారు. తాళ్ళ గంగాదాస యోగీంద్రులు జీవేశ్వరాద్వయ దోష రహితాచల గురుబోధామృత చరిత్ర 'శ్రీ జ్ఞాన సరస్వతీ దేవతా స్త్రీల లాలిపాట', 'మహాయోగి గంగదాసు పద్యరత్నావళి', 'గురుదీక్ష - క్రమశిక్ష' వంటి రచనలు తాత్త్వికపరమై అచల సిద్ధాంతాన్ని ప్రకటించేవి. 'మహాయోగి గంగదాసు జీవిత చరిత్ర' స్వీయచరిత్ర, **నంబి శ్రీధర్‌రావు** రచించిన 'శారదా గణితం' శాస్త్ర సంబంధమైన రచన. నింబాచల మాహాత్మ్యం బృహత్కావ్యం. **మమాదేవ శ్రీనివాసరావు** రచించిన శ్రీమద్రామాయణం ప్రౌఢ భావ విలసితమైంది. **తంగుడిగె శ్రీధర్ రావు** 'ద్విపద భగవద్గీత' ప్రసిద్ధ రచన. **సేనాపతి భాస్కరాచార్యులు** రచించిన 'కవితా తరంగిణి' ఖండకావ్యం. అనేక బుర్ర కథలు కూడా రచించారు. 'శ్రీ లలితా కవితా కుసుమాంజలి' అనే కవితా సంకలనాన్ని రచించిన **చిత్కల పుండరీకాక్ష శర్మ** సచ్చిదానంద దీక్షా నామాంచితులు, దేవీయాగ నిర్వహణ దురంధరులు. శ్రీలలితాంబికార్చనం, శ్రీపరాంబవ్రతకల్పం, శ్రీలలితా సుప్రభాత స్తవము వంటి రచనలు వీరి కలం నుంచి జాలువారాయి.

**కవి గణపతి రామచంద్రరావు** రచించిన 'శ్రీమద్వరదాచార్యోదాహరణము, శ్రీ వాసర సరస్వతీ దేవి ఉదాహరణము, రస భూమిక, శ్రీ వాసర సరస్వతీ దేవీ దండకం' రమణీయ రచనల మధుర కవి బిరుదాంకితులైన **మామిండ్ల రామాగౌడు** రచించిన రస తరంగిణి గౌడజన ప్రబోధం, కవితా సుధాలహరి, శ్రీ శబరిమాత జీవిత చరిత్ర రచనలు సులభ శైలితో కూడి పాఠకులను అలరించాయి.

**మేడిచర్ల ప్రభాకర రావు** రచించిన భారత భారతి, రథ సారథి, విశ్వసుందరి, రుద్రమదేవి, సారంగధరుడు, సోముని సౌందర్యం, సౌందర్య సౌరభం, కామాక్షీకైవల్యం, భక్త కుచేల వంటి రచనలతో సుప్రసిద్ధ కవిగా పేరుపొందిన

వీరు. కవి భారతి బిరుదాంకితులు **చవుల చిన్నయ్య** రచించిన 'కన్నుల ఒర, మౌనధ్వని' కవితా సంకలనాలు. తల్లావజ్జల బాలరామాయణం, అమృత వర్షిణి కవితా సంకలనం రచించారు. **డా. గణపతి అశోకశర్మ** రచించిన శ్రీహరివిల్లు కవితా సంకలనం. **ఆచార్య ఫణీంద్ర** గారు రచించిన పద్య ప్రసూనాలు కవితా సంకలనం, మాస్కో స్మృతులు యాత్రా చరిత్ర రచన. **చిత్కల శ్రీనివాస శర్మ** రచించిన ప్లాస్టిక్ ప్రబోధం, జీవ వైవిధ్య త్రిశతి పేర్కొనదగిన రచనలు. ఈ విధంగా నిజామాబాదు జిల్లా పద్య సాహిత్యంలో కావ్య రచన చేస్తున్న కవులు మనకు గోచరిస్తారు.

**అవధాన సాహితీ వికాసం :**

నైజాం రాష్ట్ర ఆద్య శతావధానిగా బిరుదు వహించిన శ్రీమాన్ శిరశినహళ్ కృష్ణమాచార్యులు మోర్తాడ్ వాస్తవ్యులు. అనేక చోట్ల అవధానాలు చేశాడు. ఆ తర్వాత కోరుట్లలో మొదటి శతావధానం చేశారు. జగిత్యాల్‌లో రెండు సార్లు, ధర్మపురిలో ఒకసారి చేసినట్లు ఆధారాలున్నా గానీ, 1929 లో వారు ప్రచురించిన 'శతావధానం' గ్రంథంలో కోరుట్ల శతావధానం ఒకటి.

ప్రచురింపబడిన వారి రెండు శతావధానాలలోను, సమకాలీన అంశాలతో పాటు వారి ప్రతిభా పాటవాలను ప్రకటించే పూరణలు కనిపిస్తాయి. శిరశినహళ్ పెరుమాండ్లా చార్యులు, శిరిశినహళ్ కృష్ణమాచార్యుల వారి తమ్ముడే. వీరు గొప్ప కవిగా అష్టావధానిగా పేరుపొందినారు. ప్రౌఢ కవిగా, అష్టావధానిగా పేరుపొందిన డా. గణపతి అశోకశర్మ అర్ధ శతాధిక అష్టావధానాలు నిర్వహించారు. వీరి జన్మస్థలం దర్పల్లి మండలంలోని రామడుగు గ్రామం. డా. అవధానం రంగనాథ వాచస్పతి గారు వీరి అవధాన కవితా గురువులు.

పద్యకోకిల, పద్య కళావాచస్పతి బిరుదాంకితులైన డా. బోచ్కర్ ఓం ప్రకాశ్ గారు శిరిశినహళ్ కృష్ణమాచార్యులు జన్మించిన మోర్తాడ్ గ్రామంలోనే జన్మించారు. వీరి స్వస్థలం జక్రాన్‌పల్లి. పాతిక పైచిలుకు అష్టావధానాలను వివిధ ప్రాంతాలలో దిగ్విజయంగా నిర్వహించారు. ఒక అవధానం లో బాసర సరస్వతిని వర్ణించమని కోరగా వీరు ఈ విధంగా స్తుతించారు.

**"బాసర పీఠమున్ వెలిగి భక్తుల పాలిట కల్పభూజయౌ**
**దోసములన్నిటన్ దునిమి దోర్బల ధీబల ధాత్రివంచు,నీ**
**బాసట వీడకే హృదయ పద్మమునందున గొల్తునమ్మరో**
**బాసర భారతీ సుతుని పాలన జేయుమీ దివ్య దృష్టులన్"**

ఆచార్య శ్రీశ్రీ గా పిలువబడ్డ శిరశినహళ్ శ్రీమన్నాచార్యులు ఉద్యోగరీత్యా నిజామాబాదులో స్థిరపడ్డారు. (ప్రస్తుతం పరమపదించారు) 30 పై చిలుకు అవధానాలు చేశారు. ఈ విధంగా అవధాన విద్య నిజామాబాదు జిల్లాలో వ్యాప్తమగుచున్నది.

**వచన సాహిత్యం :**

నిజామాబాదు జిల్లాలో వచన సాహిత్యం బహు ముఖీయంగా విస్తరించింది. వయోభేదం లేకుండా ఆ బాల వృద్ధ రచయితలు వచన కవితలను రచిస్తున్నారు. 1962లో సైబ పరంధాములు 'వెన్నెల' సాహిత్య పత్రికను నిర్వహిస్తూ అందులో తన రచనలతో పాటు ఇతర రచయితల రచనలను కూడా రేఖా చిత్రాలతో ప్రచురించేవారు. వీరు రచించిన పద చిత్రాలు, శబ్ద చిత్రాలు పేర్కొనదగినవి. 30 మంది రచయితలతో ఇందూరు భారతి నగ్న చిత్రాలు అనే కవితా సంకలనాన్ని ప్రచురించింది. కిషన్‌చందర్ రచించిన జైత్రయాత్ర నవలలో జిల్లా నేపథ్యం కనిపిస్తుంది. తంగుడిగె నరసింహం (1953-57) మధ్య కాలంలో తేనె పలుకులు అన్న తొలి సాహిత్య పత్రికను నడిపి, సాహిత్య స్పృహను పెంచాడు. సూర్య ప్రకాశ్ చౌరస్తా, స్పందన, నగరంలో నీడలు, మళ్ళీ సూర్యోదయం, కాగితం పువ్వు, అలలకు ఓటమి లేదు, నిశ్శబ్ద ధ్వని, మీరంతా నేనే వంటి రచనలతో ప్రసిద్ధి చెందారు. సి.హెచ్. మధు సంచలన జ్వలిత గీతాలు ఈ మధ్యనే ప్రచురించారు.

బైస రామదాసు, బెడిద రాజేశ్వర్ రచించిన రేపు కవితా సంకలనం, సలింద్ర లక్ష్మినారాయణ వేడిగాలి,

చావుగీతం, బద్దూరి నరసింహం, స్వాతి 'చౌరస్తా' కవితా సంకలనం, కేశనకుర్తి రచించిన కొత్త దారి, పంచరెడ్డి లక్ష్మణ ఇసిత్రం, కన్నెగంటి నరసింహారావు, కారటొచ్చింది, తెగిన సంకెళ్ళు, నాళేశ్వరం శంకరం 'దూదిమేడ', ఇందూరు జంట కవులుగా ప్రసిద్ధిచెందిన వి.పి.చందన్‌రావు, కందాళై రాఘవాచార్యులు కవితలు పేర్కొనదగినవి.

సుదర్శన్, లక్ష్మణ్ కవితా సంపుటి 'ఎక్స్‌రే' శ్రీశ్రీ ప్రశంసలను అందుకుంది. గిరి నాగభూషణం ఏరువాక కవితా సంపుటి రాజకీయ దుస్థితిని వర్ణిస్తుంది. ఎనిశెట్టి శంకర్ సంపాదకత్వంలో 'గాయి ఒకటే మాట తెలంగాణ, గాయలే గేయాలై, రాజీవ అమృతలత సంయుక్త ఆధ్వర్యంలో వెలువడిన కవితా సంకలనం. ఎ.యస్.పోశెట్టి విప్లవం వర్ధిల్లాలి, రష్యాలో ఏముంది?, యమ్. రాములు 'కాలం కదలికలు', భారతీశర్మ 'అందాల శిశిరమా!!' చక్కని భావుకత నిండిన కవితా సంపుటాలు. శారదా హన్మాండ్లు రచించిన 'మనో దర్పణం' పదునైన కవితల దర్పణం. డి.వి. సుబ్బారావు 'వర్తమానం, బైసదేవదాసు ప్రగతిశీల భావాలతో కవితలల్లారు. వీరు నేటినిజం అనే పత్రికకు సంపాదకులుగా వున్నారు. 'ఈ వ్యవస్థపై మరో రాయి' పేరుతో దళిత కవిత్వం వెలువరించారు. తుర్లపాటి లక్ష్మి 'తలెత్తి' కవితా సంకలనం, టి. కృష్ణమూర్తి యాదవ్ 'తొక్కుడు బండ', శిరీష 'ప్రశాంత ప్రస్థానం', మొదలైనవి. కాసర్ల నరేశ్ రావు 'కాలసర్ప' ప్రసిద్ధ కవితా సంకలనం. 'కాగడ' ఉద్యమ స్ఫూర్తితో రాసిన రచన, 'కాలగంధం' మినీ కవితల రచన. ఘనపురం దేవేందర్ 'ఘన తెలంగాణ' శ్రీనివాసాచార్య ఘనపురం రచించిన 'నుడుగు పిడుగులు' వంటి రచనలు ప్రసిద్ధమైనవి.

**గేయ సాహిత్య వికాసం :**

ఈ ప్రక్రియలో తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడు 'గంగి పాటలు' రచించారు. శిష్టా శ్రీశర్మ 'గేయ చంద్రిక', కళా వాచస్పతి అనంతరాములు 'శ్రీ జ్ఞానసరస్వతి సప్తస్వర గీతమాలిక, పొదిల గంగారాం, 'చైతన్య గీతాలహరి', ఈమని సత్యనారాయణ శర్మ 'బాలగేయ మందారం', మామిండ్ల కృష్ణమూర్తి 'పన్నీరులో కన్నీరు', బి.నాగభూషణం, బి.యన్.బి. పాటలు సజ్జనపూడి అనంతరాములు 'నాట్య గీతరవళి', మెండా ప్రభాకర్ రావు బాల సాహిత్యం, పాపాయి తువ్వాయి, ఉడుత - బుడత మొదలైన గేయ సాహిత్య పరిమళాలు వెదజల్లేవి. ఈ విధంగా ఈ జిల్లా గేయ సాహిత్యం వివిధ కోణాల్లో ఆవిష్కరించబడుతూ ప్రజలను ఆనందపరుస్తున్నవి. తెలంగాణోద్యమం కారణంగా వివిధ కవులు ఆయా పత్రికలలో రచించిన గేయాలు ప్రబోధాత్మకమైనవి. ఈ ప్రక్రియలో సాంబ యాదగిరి, సిర్ప లింగయ్య, పి. లింగం, కె. గంగాధర్, డా. కొండా ఆశన్న, విఠల్‌రెడ్డి మొదలైన వారు కృషిచేస్తూ ఈ గేయ ప్రక్రియను సుసంపన్నం చేస్తున్నారు.

**యక్షగాన సాహిత్య వికాసం :**

జానపద సాహిత్యంలో ప్రధాన భాగమైన యక్షగానాలు, చిరుతల నాటకాలు అత్యధిక సంఖ్యలో ఈ జిల్లా కవులచే రచింపబడ్డాయి. ప్రజల భాషలో యక్షగానాలు చిరుతల నాటకాలను రచించి అద్భుతమైన గానవాహినిలో సుమారు ఆరు దశాబ్దాలు ఇందూరు ప్రజలను ఓలలాడించిన గాన గంధర్వుడు. కవి, నటుడు, ప్రయోక్త పనస హమనుద్దాసు రుక్మాంగద యక్షగానం, హనుమద్రామ సంగ్రామం, శకుంతలా విలాసం, వేంకటేశ్వర మాహాత్మ్యం, డాంగ్నేయోపాఖ్యానం, బాల నాగమ్మ, గుణ సుందరి యక్షగానం, ఆడది గొడ్డా!! మొదలైనవి ముఖ్యమైనవి.

ఆర్మూరు మండలంలోని దేగాం గ్రామానికి చెందిన ముని పంతులు మహా భారతాన్ని యక్ష గానంగా రచించాడు. రఘువీర దాసు మాంధాత చరిత్ర, భీంగల్ నివాసి అయిన నింబాద్రి దాసుడు 'భళ్ళాణ చరిత్ర, కాళీయమర్ధనం, సావిత్రీ పరిణయం, లక్షణా పరిచయం, శకుంతలా పరిణయం, వేల్పూరు నరసింహదాసు రచించారు. వేల్పూరు లక్ష్మణాచార్యులు యక్షగాన రచయితే కాక గ్రంథ పరిష్కర్త కూడా! శ్రీకృష్ణార్జున యుద్ధం, సుభద్ర పరిణయం, జయప్రద,

శశిరేఖా పరిణయం, లవకుశ, శకుంతల, ఉత్తరా పరిణయం, నాగార్జున యక్షగానాలను రచించాడు. అవధూత నిర్మలానంద స్వామి, ముదకపల్లి వాస్తవ్యులు గుణసుందరి, సోమవార వ్రత మాహాత్మ్యం, దమయంతీ స్వయంవరం యక్షగానాలు రచించారు. చతుర్వేదాలకు భాష్యాలు రాసి ప్రసిద్ధి చెందిన లోక మల్హరి నిజామాబాదు మాండలికంలో 'జగ్గని విద్దె' అనే యక్షగానాన్ని రచించాడు. ఈ విధంగా యక్షగాన ప్రక్రియలో ఈ జిల్లాలో అద్భుత రచనలు వెలుగుచూశాయి.

## దర్శనీయ ప్రదేశాలు - పర్యాటకరంగం

**ముఖ్య దేవాలయాలు :**

ఇందూరు జిల్లా ఎన్నో కట్టడాలకు, ఆలయాలకు ప్రసిద్ధమైన స్థలం. ఈ జిల్లాలోని కోటలు, దుర్గాలు చారిత్రక సంపదను సంతరించుకున్నాయి. బోధన్ కోట క్రీ.పూ. 8 వ శతాబ్దికి చెందిందని అంటారు. కల్యాణీ చాళుక్యులు ఈ కోటకి చారిత్రక వైభవ స్థితిని కలిగించారు. ఢిల్లీ సుల్తానులు, మొఘలులు ఈ కోటపై దాడి చేశారు. కాకతీయులు, ముసునూరి వంశం దీనిని పునరుద్ధరించగా బహమనీ, కుతుబ్‌షాహీ, నిజాంషాహీలు తమ అధీనం చేసుకున్నారు. ఇందూరు కోట ఈ జిల్లాలోని అతి ముఖ్యమైన చారిత్రక ప్రదేశంగా గుర్తించబడింది. దీనినే ఖిల్లా అంటారు. ఇందులోనే మహాకవి దాశరథిని బంధించారు. ఇక్కడి రామాలయం ప్రసిద్ధమైంది. బాల్కొండ కోట, అర్గుల్ దుర్గం ప్రసిద్ధిచెందినవి. రుద్రూరు దుర్గం స్థల దుర్గంగా ప్రసిద్ధి. ఈ జిల్లాలోని డిచ్‌పల్లిలోని ఖిల్లా రామాలయం రాష్ట్రకూటులు నిర్మించారు. కాకతీయులు దీనిని పునరుద్ధరించారు. లోలంలోని మల్లికార్జునాలయం ప్రసిద్ధమైంది. నిజామాబాదు నగరంలోని నీలకంఠేశ్వరాలయం ఈ జిల్లాలోనే ప్రాచీనాలయం. రాష్ట్రకూటుల, బోధన్ చాళుక్యుల కాలంలో ఇది నిర్మింపబడినట్లు చెబుతారు. కాకతీయుల కాలంలో ఇది శైవాలయంగా రూపుదాల్చింది. ఈ ఆలయ సమీపంలోని ప్రాంతాన్ని 'కంఠేశ్వర్' అంటారు. రఘునాథాలయం చారిత్రాత్మకమైంది. రాష్ట్రకూటులు, బోధన్ చాళుక్యులు జైనమత ప్రేరణతో నిర్మింపగా, కల్యాణీ చాళుక్యులు వైష్ణవాలయంగా మార్చారు. ముస్లిం దండయాత్రల వల్ల పతనమై, సమర్థరామదాసు చే పునరుద్ధరింపబడి ప్రస్తుతం శ్రీ రామచంద్రాలయంగా ప్రసిద్ధి చెందింది. జాన్కంపేటలోని లక్ష్మీనరసింహాలయం, అష్టముఖి కోనేరు ప్రసిద్ధిచెందింది. భీంగల్‌లోని నింబాచల క్షేత్రం సుప్రసిద్ధ లక్ష్మీనారసింహ క్షేత్రం. నిజామాబాదు సమీపంలోని మాణిక్‌భండార్ గ్రామ సమీపంలో గుహలో వెలసిన లక్ష్మీనరసింహాలయం ప్రాచీనమైంది. ఇంద్ర నారాయణాలయం (దేవల్ మసీదు) రాష్ట్రకూటులు జైనమత ప్రేరణతో నిర్మించగా, ప్రగడ జోగయ్య దీనిని ఇంద్ర నారాయణాలయంగా మార్చారు. జునాఖాన్ దండయాత్రతో ఇది దేవల్ మసీదుగా మారింది. వర్ణి మండలంలోని బడాపహాడ్ (పెద్దగుట్ట) దర్గా, ఇందూరులోని సీఎస్ఐ చర్చి ప్రార్థనాలయాలుగా ప్రసిద్ధిచెందాయి. జక్రాన్‌పల్లిలోని ఆదినాథ స్వామి ఆలయం అతి ప్రాచీన మైంది. మాధవ్‌నగర్ సాయి ఆలయం, శ్రీరాం సాగర్ ప్రాజెక్టు, అశోక్ సాగర్, అలీసాగర్ ప్రాంతాలు పర్యాటక ప్రాంతాలుగా ప్రసిద్ధిచెందాయి.

శ్రీ లలితాశ్రమం, లక్ష్మీ గణేష, నర్సింగపల్లి వేంకటేశ్వర, అపురూప వేంకటేశ్వరాలయం ఈ మధ్య కాలానికి సంబంధించింది. ఈ జిల్లా రామచిలుకలు అత్యధికంగా గల జిల్లాగా దేశంలోనే ప్రఖ్యాతి గాంచింది. సిర్నపల్లి దొరసాని జానకీబాయి నిర్మించిన గోడ గడియారం నిజామాబాదు గంజ్ ప్రాంతంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ విధంగా ప్రాచీన కాలం నుంచి చారిత్రక, సాంస్కృతిక సాహితీ పరిమళాలను వెదజల్లుతున్న జిల్లాగా వెలుగొందుతోంది.

# నిర్మల్ జిల్లా చిత్రపటం





జ్ఞాన సరస్వతి దేవి



కదలి దేవస్థానం



నిర్మల్ కోట




బాసర ఐ.ఐ.ఐ.టి.



నిర్మల్ కళాకృతులు



రాజా రెడ్డి, రాధారెడ్డి దంపతులు

126(b)

# నిర్మల్

అచ్చెరువొందు బొమ్మలకు నక్షయపాత్రగ వెల్గునీధరన్
విచ్చిన విద్యలెల్ల పరివేష్టితమైనవి వాసరమ్ములై
మెచ్చెడి శిష్ట సంస్కృతికి మేలిమి జీవనశైలి శోభకున్
నచ్చెడి నిర్మలంబయిన నవ్య విలాసిని యీ ధరిత్రిపై !

2014 లో తెలంగాణ రాష్ట్రం దేశంలో 29వ రాష్ట్రంగా రూపు దిద్దుకొనబడిన విషయం సర్వజనులకు సువిదితము. ప్రజాపరిపాలన సజావుగా జరగడానికి పాలనా సౌకర్యం కోసం 10 జిల్లాలున్న తెలంగాణ రాష్ట్రాన్ని 31 జిల్లాలుగా పునర్విభజించారు.

**ఈ పేరెందుకు?**

400 ఏండ్ల క్రితం నిమ్మనాయుడు నిర్మించిన ఆనాటి గ్రామమే 'నిమ్మల' వారి పేరుపై ఏర్పడి రూపాంతరం చెంది 'నిర్మల్' గా ప్రస్తుతం పిలువబడుతోంది.

## భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి

నిర్మల్ జిల్లా రాష్ట్ర పునర్వ్యవస్థీకరణకు పూర్వం ఆదిలాబాద్ జిల్లాలో భాగంగా ఉండేది. ఈ జిల్లా దక్కను పీఠభూమిపై విస్తరించి ఉంది. దీనికి ఉత్తరాన సహ్యాద్రి పంక్తి శ్రేణి ఉంది. ఈ శ్రేణి దాదాపుగా ఆదిలాబాదు జిల్లా పరిధిలోకి వస్తుంది. ఇక దక్షిణ సరిహద్దులో గోదావరి నది ప్రవహిస్తూ నిజామాబాద్ జిల్లా ఉత్తర సరిహద్దుగా ఉంది. తూర్పున మంచిర్యాల - జగిత్యాల జిల్లాలుగా - పడమర బాసర సరస్వతీ క్షేత్రంతో పాటు మహారాష్ట్రలోని నాందేడు జిల్లా విస్తరించి యున్నది.

జిల్లా ప్రధాన కార్యాలయం నిర్మల్ పట్టణంలో ఉంది. ఈ జిల్లా 3,845 చదరపు కిలోమీటర్ల (1,485 చదరపు మైళ్ళు) విస్తీర్ణంతో విస్తరించింది.

## సహజ వనరులు

**నేలలు :** నిర్మల్ జిల్లాలో 4,17,442 ఎకరాల సాగుకు అర్హమైన నేలలున్నాయి. ప్రధానంగా వరి, ప్రత్తి, పసుపు, మిరప, సోయాబీన్, జొన్న, పప్పుధాన్యాలు, మొక్కజొన్న మొదలగునవి పండించేందుకు అనువుగా ఉన్నాయి.

**అడవులు** : భౌగోళికంగా జిల్లాలో గల భూవిస్తీర్ణము 3,56,6251 హెక్టార్లలో 1,20,566.75 హెక్టార్లు, 33.8% అడవులు విస్తరించియున్నవి. నిర్మల్ జిల్లా అటవీప్రాంతం ఉత్తరమున ఇచ్చోడ - ఉట్నూరు ఫారెస్టు డివిజన్లు ఆదిలాబాదు జిల్లా పరిధిలోనివిగా, తూర్పున జన్నారం ఫారెస్టు డివిజన్ మంచిర్యాల జిల్లాకు సంబంధించినవిగా దక్షిణ భాగాన గోదావరీ నదీ ప్రవాహమే సరిహద్దుగా పశ్చిమోత్తరమున నాందేడ్ (మహారాష్ట్ర) డివిజన్ పరిధిలో ఉంటూ ఎక్కువశాతం టేకు. మొదలగు చెట్లతో అలరారు చున్నవి.

**నదులు :** దక్షిణ దిశలో గోదావరీ నది ప్రవహిస్తూండగా శ్రీరామసాగర్ ప్రాజెక్టు ఎడమకాలువ వలన జిల్లాలో గల తూర్పుదిశలో గల కొన్ని మండలాల చెరువులు నింపి వ్యవసాయానికి, సాగునకు ఉపయోగ పడుచుండగా, ఇదే నదిపై ఖానాపూర్ నియోజకవర్గములోని సదర్‌మాట్ ద్వారా కాలువలు ఎప్పుడో నిజాము జమానాలో నిర్మింపబడి పంట

**రెవెన్యూ డివిజన్లు - మండలాలు**

నిర్మల్ జిల్లాలో రెవెన్యూ డివిజన్లు రెండు ఉన్నాయి.

1. నిర్మల్ 2. భైంసా.

**నిర్మల్ రెవెన్యూ డివిజన్‌లో మొత్తం 11 మండలాలు:**

1. నిర్మల్ (రూరల్) 2. నిర్మల్ (అర్బన్) 3. సోన్ 4. దిలావర్ పూర్ 5. నర్సాపూర్ (జి) 6. కడెం పెద్దూర్ 7. దస్తూరాబాద్ 8. ఖానాపూర్ 9. మామడ 10. లక్ష్మణ్ చందా 11. సారంగపూర్

**భైంసా రెవెన్యూ డివిజన్‌లో మొత్తం 7 మండలాలు.**

1. కుబీర్ 2. కుంటాల 3. భైంసా 4. ముథోల్ 5. బాసర 6. లోకేశ్వరం 7. తానూర్

కాలువలు ప్రవహిస్తూ వ్యవసాయానికి సహకరిస్తున్నాయి. స్వర్ణానదిపై నిర్మించబడిన 'స్వర్ణ' ప్రాజెక్టు ద్వారా సారంగాపూర్ మండల భూములకు సాగు నీరుగా మరియు నిర్మల్ పట్టణమునకు తాగునీరుగా ఉపయోగపడు చున్నది. ఈ మధ్యే గోదావరి నీటిని పైపుల ద్వారా నిర్మల గ్రామీణ ప్రాంతానికి రప్పిస్తూ నిర్మల్ పట్టణం తాగునీటి వసతిని కల్పించి నీటి కొరత లేకుండా కొనసాగుచున్నది. కడెం నది ద్వారా ప్రవహించే నీరు కుంటాలలో జలపాతంగా మారి కడెం ప్రాజెక్టులో కలిసి 'కడెం' మరియు దస్తూరాబాద్ మండల వ్యవసాయ భూములకు సహకారంగా ఉన్నది. పశ్చిమదిశలో భైంసా డివిజన్‌లో ప్రవహించే సుధానది (సుద్దవాగు) గడ్డన్న ప్రాజెక్టు ద్వారా భైంసా పట్టణ దాహార్తిని తీరుస్తున్నది. ఇదే డివిజన్‌లో ఈ నడుమనే మాటేగాంవ్ నదిపై రంగారావు పల్సీకర్ ప్రాజెక్టు నిర్మాణము కొనసాగుచున్నది.

**చెరువులు - ప్రాజెక్టులు :** జిల్లాలో మొత్తము 822 చెరువులున్నాయి. వీటిలో కొన్నిటిని మిషన్ కాకతీయ ద్వారా క్రమబద్ధీకరించి చిన్ననీటి వనరుల పునరుద్ధరణ గావించబడు చున్నవి. కొత్తగా నిర్మల్ నియోజకవర్గంలో 15, ఖానాపూర్‌లో 4 ముథోల్‌లో 5 నిర్మించబడి దరిదాపుగా 3190 ఎకరాల విస్తీర్ణపు భూమిని వ్యవసాయానికి యోగ్యమయ్యేటట్లు కృషి జరుగుచున్నది. జె.ఐ.సి.ఏ పథకం క్రింద పసుపుల మరియు తాటిగుడాలలో 2 చెరువులు నిర్మించి 650 ఎకరాలు సాగులోనికి తేబడినవి.

మినీ ట్యాంక్‌బండ్ల నిర్మాణం నిర్మల్‌లో ధర్మసాగరం చెరువు మరియు గడ్డన్న సుద్దవాగు ప్రాజెక్టు ప్రాంతంలో కొనసాగుచున్నది.

**జనాభా :** 2011 జనాభా లెక్కల ప్రకారం నిర్మల్ జిల్లా జనాభా 7,09,418 కాగా, పురుషుల జనాభా 3,46,721, స్త్రీల జనాభా 3,62,697. దీనిలో గ్రామీణ జనాభా శాతం 78.62%, పట్టణ జనాభా శాతం 21.36. ఈ జిల్లా జనసాంద్రత 185/కి.మీ. లింగనిష్పత్తి 1000 : 1046.

**అక్షరాస్యత :** నిర్మల్ జిల్లా అక్షరాస్యతా శాతం 57.77. ఇది తెలంగాణ రాష్ట్ర సగటు అక్షరాస్యతా శాతం కన్నా 9% తక్కువ. పురుషుల అక్షరాస్యత 69.03%, స్త్రీల అక్షరాస్యత 47.14%.

## జిల్లా చరిత్ర

దరిదాపుగా క్రీ.శ. 1600 - 1650 మధ్యకాలంలో భద్రాచలం తహసీల్దారుగా ఉన్న కంచర్ల గోపన్న (రామదాసు) భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం నిర్మించి ఉత్సవాలను జరిపించటం వల్ల కుతుబ్‌షాహీ ఖజానాలోని డబ్బులు ఖర్చు పెట్టినందున అప్పటి గోల్కొండ నవాబు తానీషా శ్రీరామదాసును చెరలో పెట్టించాడు. శ్రీరామదాసుకు సన్నిహితుడైన వెలమ దళవాయి శ్రీ నిమ్మనాయుడు మరికొందరు తానీషాతో చేయి కలిపి కుట్ర పన్ని వెలమ భూస్వాముల ద్రోహానికి విసుగెత్తి, పాల్వంచ, భద్రాచలం జమీదారు భూమిపన్ను చెల్లించే తగాదాలో మాట కలిసి రాక నిమ్మనాయుడు కుటుంబ సమేతుడై కొంత సిబ్బందితో నిరాశ నిస్పృహలతో గోల్కొండ విడిచి భద్రాచలం తూర్పు గోదావరీ నదీతీరం వెంబడి చెన్నూరు - కోటిలింగాల నుండి మట్టికోటగా నెలకొని ఉన్న నల్లగుట్ట (ఇప్పటి ఖానాపూర్ సమీపమున గలది) ప్రాంతానికి మొదటి రాత్రికే చేరుకున్నాడు.

ఇచ్చట ఔరంగజేబుచే నియమింపబడిన ఖిల్లాదారుతో ఆ రాత్రి పోరాడి నిమ్మనాయుడు విజయం సాధించాడు.

నిర్మల్ పట్టణానికి తూర్పుదిశగా ఉన్న 'పులిమడుగు' (చత్తీస్‌ఘడ్ ప్రాంతం) పేరుతో ఒక బస్తీ ఉండేది. ఛత్రపతి శివాజీ నాయకత్వంలో గోల్కొండ సైన్యాలు మహారాష్ట్ర యోధుల అండదండలతో ఎన్నోసార్లు మొగలు సైన్యాలను పులిమడుగులో ఓడించారట. ఈ సైనికులు యుద్ధ సమయాల్లో తలదాచుకోవడానికి కోట గోడలు, బురుజులు, నేల బొయారాలు (సొరంగాలు), కందకాలు మొదలగునవి ఏర్పరుచుకొన్నారు. వాటి ఆనవాళ్లు నేటికీ కనిపిస్తాయి.

కొన్నిరోజుల తర్వాత నిమ్మనాయుడు ఉత్తర పశ్చిమంగా ప్రయాణం చేస్తూ పులిమడుగు ప్రాంతం నుండి రాత్రిపూట వెళ్తూండగా అదివరకే నల్లగుట్ట యందు జరిగిన సంఘటన వినిన పులిమడుగు ఖిల్లాదారుడు నిమ్మనాయుని స్నేహాన్ని కోరి ఆతనిని తనకు సహాయముగా ఉంచుకొన్నాడు. అనంతరం ఒకనాడు నిమ్మనాయుడు తెల్ల ఏనుగుపై ఎక్కి వేట కుక్కలను వెంట బెట్టుకొని వేటకై ఇప్పటి దేవరకోట శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి మందిర ప్రాంతానికి బయలుదేరాడు. అక్కడ తన వేట కుక్కలను కుందేళ్లు – నక్కలు తరమివేయడం చూసి స్థల మహత్తును తెలుసుకొని నిమ్మనాయుడు యుక్తిచే పులిమడుగు ఖిల్లాదారుని మచ్చిక చేసుకొని ఆయన అనుమతితో పర్వతలోయలో కుటీరం ఏర్పరుచుకొని స్థిరపడ్డాడు. దేవరకోట-శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి మందిర స్థలంలోనే "శ్రీ సీతారామాంజనేయ" విగ్రహాలను ప్రతిష్ఠించి నిత్యం ధూప దీప నైవేద్యాదులతో భజనలు చేస్తూ ఈ సమయంలోనే కొన్ని కుటీరాలు ఏర్పరచుకున్నాడు.

నిమ్మనాయుడు ఈ ప్రాంతంలోని అటవీ భూ సంపత్తిని ఉపయోగంలోకి తేవడానికి తనకు పరిచయం ఉన్న ప్రాంతాలైన భద్రాచలం, సిరివంచ, కొండపల్లి, విజయవాడ, ఖమ్మం, మధిర, ఎలగందుల, ఓరుగల్లు, కొండవీడు తదితర ప్రాంతాల నుండి కర్రబొమ్మలు చేసేవారిని బ్రాహ్మణ, వైష్ణవ, ఆరాధ్య, పద్మశాలి, తెనుగు, కుమ్మరి,

**మున్సిపల్ కార్పొరేషన్ :** 1. భైంసా 2. నిర్మల్

**రెవెన్యూ గ్రామాలు :** 420

**గ్రామ పంచాయితీలు :** 240

**పోలీస్ కమీషనరేట్ / హెడ్ క్వార్టర్ :** నిర్మల్

**పార్లమెంట్ నియోజకవర్గం :** ఆదిలాబాద్

**అసెంబ్లీ నియోజకవర్గాలు :** నిర్మల్, ముధోల్, ఖానాపూర్.

**పట్టణాలు :** నిర్మల్, ముధోల్, ఖానాపూర్, భైంసా.

కమ్మరి, వడ్రంగి, నగిషీ (నక్కాశీ) మొదలగు జాతులవారిని రప్పించి వారి నివాసానికై నాటి అరణ్య ప్రాంతమైన నేటి 'కసుబా' అను వీధిలో 12 ఇండ్లతో గ్రామాన్ని రూపొందించాడు. ఇట్టి నూతన గ్రామనికి తన పేరు చిరస్థాయిగా ఉండుటకై "నిమ్మల" అని నామకరణం చేసాడు. తరువాత వచ్చిన పాలకులు దీనిని 'నిర్మల్'గా మార్చినారు. నేటికీ చుట్టు గల పల్లె ప్రజలు "నిమ్మల" అనే పిలుస్తుంటారు.

ఏనుగుల వీరాస్వామయ్య మాటల్లో ఆనాటి నిర్మల పట్టణం "31వ తేది మధ్యాహ్నము 12 గంటలకు ఆ గోదావరి నది దాటి యివతల అయిదు కోసుల దూరములో నుండే నిర్మల అనే షహరు(పట్టణం) 4 గంటలకు ప్రవేశించినాను. దారి, నదికి అటు ప్రక్క ఉన్న రెండు మజిలీల వరకు ఉన్నట్టే బాగా గులక యిసుక పర్రగా నున్నది. నది దాటగానే ఒక బంగళా జాతులవాండ్లు దిగడానికి యోగ్యమయినదిగా నున్నది. యివతల చిన్న యూళ్లు మూడున్నవి, కొన్ని మజుబూతి అయిన పాడు కోటలున్నవి. నిర్మల అనే యూరు పట్టణము వంటిది. సకల పదార్థాలు దొరుకును. సకల విధములయిన పనివాండ్లున్నారు. ఊరు చుట్టూన్నూ, ఊరు నడుమనున్న చిన్నకొండలు నిండా వున్నవి. గొప్ప యిండ్లు కలవు. ఊరికి చుట్టున్నూ, తోటలు, చెరువులు కలిగియున్నవి. ఇక్కడ అరికాటి (హర్‌కాట్) నవాబు కింద లోగడ రాయి(మ్)జీ సర్వాధికారిగా ఉన్నట్టు ఒక పరగణాదారుడు ఉన్నాడు. దేశ్‌ముఖి – దేశ్‌పాండ్యాలు

ఉన్నారు. కొత్తవాలు (కోత్వాల్) మొదలయిన అధికారస్థులున్నారు. 100 బ్రాహ్మణుల యిండ్లును, ఒక దేవాలయమ్మును ఉన్నవి. అక్కడ నేను దిగినాను. యిట్లా గొప్ప యూళ్లలో నుండే బ్రాహ్మణ మండలికి సభాపతి అనే ఒక బ్రాహ్మణుడు ఉన్నాడు. అతని యాజ్ఞకు తక్కినవారు యథోచితముగా లోబడియున్నారు. నిర్మల పంచపాత్రలు ఈ ప్రాంతములలో ప్రసిద్ధిగా నున్నవి. నిండా కంచర యిండ్లున్నవి. అయితే కూతురి ప్రౌఢిమ తండ్రికి ఏ ప్రకారము అనుభవానికి రాదో అలాగే ఆయా పదార్థాలు పుట్టే స్థలములయందు అచ్చటి వారికి అనుభవానికి రావు. అందుకు దృష్టాంతమేమంటే యిక్కడ చేసే పంచపాత్ర యొకటి చూతామన్నా యీ యూరున దొరికినది కాదు". అని నిర్మల్ పట్టణాన్ని గూర్చి వారు చూసిన అంశాలను పేర్కొన్నారు.

ఇక తూర్పుభాగమున గల ఖానాపూర్ నియోజకవర్గములో గల వేలగడప (ఎల గడప) ఒక పరిపాలనకు సౌలభ్యంగా వుండే కేంద్రమై ప్రతివర్గము కులమునకు చెందినవారు అధిక సంఖ్యలో ఉండేవారని, వరంగల్ సుబాగా ఉన్న నాటికాలంలో ఇక్కడి ఈ ప్రాంతంలో వసూలు చేసిన రకరకాల పన్నులను పోలీసు బందోబస్తుతో వరంగల్లుకు చేర్చేవారని ఈ ప్రాంతీయుల్లోని వయోవృద్ధులు చెప్పగా తెలిసింది.

ఖానాపూర్‌కు 6 కి.మీ. దూరంలో గోదావరి నది రెండు పాయలుగా చీలి ప్రవహిస్తుండగా మధ్యలో గల కుఱ్ఱు ద్వీపంపై దరిదాపుగా 2,600 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంతంలో బాదనకుర్తి అనే గ్రామం ఉంది. నదీ పరివాహక ప్రాంత నేలలు మిక్కిలి సారవంతంగా ఉండుట వలన పచ్చని పొలాలు మరియు సస్యశ్యామల ప్రదేశంగా అలరారుచున్నది. దీనిని 'బాదాపూర్ కుర్దు' అనేవారు. ఇక్కడే బుద్ధుని బోధనలు జరిగినట్లు, బావరి అనే మహాత్ముడు ఇక్కడ బౌద్ధ ధర్మ బోధనలను కొనసాగిస్తూండే వాడని, ఈ ప్రాంతంలో బౌద్ధ స్థూప నిర్మాణం జరిగిందని ఇక్కడి ఆలయ ధ్వజస్తంభం కోసం త్రవ్వినప్పుడు స్థూపం ఆనవాళ్లు బయల్పడినట్లు తెలుస్తోంది. ఈ గుర్తుల వల్ల ఇచ్చటి ప్రాచీనత వెల్లడౌతుంది.

పశ్చిమదిశలో వెలసిన శ్రీ జ్ఞాన సరస్వతీ దేవాలయాన్ని గూర్చి వివరాలు దేవాదాయ శాఖలో ఉండవచ్చును. మొదట అనగా హైద్రాబాద్ రాష్ట్ర రీ ఆర్గనైజేషన్‌కు ముందు 'ముథోల్ ప్రాంతము' నాందేడ్ జిల్లా పరిధిలో ఉండేదని – ఉత్తర వాయువ్య భాగములో గల 'కిన్వట్ ప్రాంతము' ఆదిలాబాదులో ఉండేదని అయితే మహారాష్ట్ర కిన్వట్ ప్రాంతమును గైకొని ముథోల్ ప్రాంతమును ఆదిలాబాద్ జిల్లాలో కలపబడినట్లు రికార్డులు గలవు.

అట్లే – 'గాజుల నర్సాపూర్' కూడా పైగా తాలూకాగా ఉండేదన్నట్లు రికార్డులు గలవు.

## సంస్కృతి

**ఆచారాలు, సంప్రదాయాలు, పండుగలు :** ఈ అంశాలు ఒకదానిపై ఒకటి ఆధారపడి యున్నవి. వందల సంవత్సరాల చరిత్ర గలిగి దినదినాభివృద్ధి దిశలో ప్రయాణిస్తున్న తరుణంలో నిర్మల్ జిల్లా ప్రాంతం మైదాన ప్రాంతం కలిగి ఉండి, ఇక్కడి జనజీవనం ముఖ్యంగా వ్యవసాయంపై ఆధారపడి యున్నదన్న విషయం నిర్వివాదాంశం. ఇక్కడ తెలుగు – ఉర్దూ భాషలు ముఖ్యంగా మాట్లాడేవారుండగా భైంసా – ముథోల్ డివిజన్‌లో మరాఠీ మాతృభాషగా కలిగిన వర్గాలెన్నో ఉన్నాయి. ఇక ఖానాపూర్ నియోజకవర్గ పరిధిపై కొంతలో కొంతవరకు జగిత్యాల–కరీంనగర్ జిల్లాల ప్రభావం ఉన్నదని చెప్పకనే చెప్పవలసి వచ్చుచున్నది. గోదావరి సరిహద్దుగా ఉండటం వలన ఇచ్చటి జనులు హిందూ సంస్కృతిని, ముస్లిం వర్గాలు తమ సంస్కృతిని సంప్రదాయా లను ఆచరిస్తూ ప్రశాంత వాతావరణంలో తమ జీవనాలు గడుపుతున్నారన్న మాట అక్షరసత్యం.

పల్లెటూర్లలో ఇప్పటివరకు ప్రదర్శించిన వీధి భాగవతాలు, చిరుతల రామాయణాలు – భక్తి ప్రపూరిత హరికథలు, భజనలు ఆయా భాషల్లో కొనసాగినప్పటికీ నేటి టి.వి మాధ్యమ ప్రభావంతో అవన్నీ దరిదాపుగా

అడుగంటి పొయ్యాయనే చెప్పవచ్చు. అయినప్పటికీ అక్కడక్కడ దేవాలయ ప్రాంగణాల్లో భావభక్తితో ప్రత్యేకంగా ముథోల్ నియోజకవర్గంలోని కుబీర్ - సుంక్లీ, చాతా, మహాగావ్, భైంసా, నిగ్వా, తానూర్ మొదలగు గ్రామాల్లో సందర్భోచితం గా సాగుతున్నట్లు సమాచారం. వినాయక నవరాత్రి ఉత్సవాలు మొత్తం జిల్లాలో ఘనంగా జరుపుకుంటున్నప్పటికిని భక్తి చాటున రక్తి అన్నట్టు ఎన్నో దురలవాట్లు యువతలో పెచ్చు పెరగడం వల్ల ఎవ్వరూ ఏమీ చేయలేని పరిస్థితి ఉందనిపిస్తోంది.

అటవీ ప్రాంతంలోని గిరిజన తండాల్లో ఇంకా నియమ నిష్ఠలతో సంస్కృతీ సంప్రదాయాలు రక్షింపబడు తున్నప్పటికి ఆధునిక పోకడలు, పట్టపగ్గాలు లేని పట్టణీకరణ మోహంలో వాళ్ళూ తమ తమ విధులను ప్రక్కకు నెట్టేస్తున్న వాతావరణం దృగ్గోచరమౌతోంది. ఉత్తర తెలంగాణా జిల్లా కాబట్టి దీనిపై అటు మహారాష్ట్ర, ఇటు అచ్చ తెలంగాణపు జిల్లాలైన జగిత్యాల - కరీంనగర్ మరియు నిజామాబాదుల సంస్కృతీ ప్రాబల్యం పొడసూపుతూ ఉంటుంది.

పట్టణాల మాటెట్లా ఉన్నా పల్లె ప్రజల జీవన విధానము ఏ మత సంప్రదాయాలకు తల ఒగ్గక వారు నిర్వహిస్తూ ఉన్నారనడంలో ఎలాంటి సంకోచంగాని సంశయం గాని లేదనే నా భావన. అయినా సమాజంలోని ఆర్థిక వనరులు, స్థితుల కారణంగా ఇంకా ఎన్నో ఒడిదుడుకులతో జీవన విధానాన్ని గడుపుతున్న వారలు లెక్కకు మిక్కిలేయని చెప్పవచ్చును. ఇప్పటికీ సంచార జీవన విధానాలను అనుసరించే వారున్నారు. వ్యవసాయ కూలీలుగా, తడకలు అల్లి బుట్టలను తయారు చేస్తూ పండ్లు కూరగాయలను అమ్ముతూ విస్తళ్లను కుడుతూ కట్టెలనమ్ముతూ రోజువారి కూలీలుగా హమాలీలుగా రకరకాల వృత్తులను చేపడుతూ జీవనం గడిపేవారూ ఉన్నారు.

**కళలు :** కళలకు ఆలవాలమైనది నిర్మల్ పట్టణము. ఇక్కడ నాడు నిమ్మనాయుడిచే వెంటరాబడిన వృత్తులవారిలో కొయ్యబొమ్మల తయారీవారు మరియు నక్కాశీవారు ఉండిరి. ఆనాటినుండి నేటివరకు ఆనువంశికంగా ఈ కళను పోషిస్తూ ప్రపంచమునాకర్షిస్తున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. వీరిలో **పాలకొండ గుండాజీ, భూసాని నర్సింలు, దన్నూరి పోశెట్టి, లింబయ్య** గారలు చాలా ప్రముఖులు. వారి కళా చాతురిమకు రాష్ట్రపతి అవార్డును కూడా పొందారు.

**బైరోజు వెంకటరమణాచారి** (ప్రఖ్యాత చిత్రకారుడు, తెలంగాణ తల్లి రూపశిల్పి) **మంగ్లారపు భాస్కరరాజు** (ప్రఖ్యాత చిత్రలేఖకుడు) వీరి చిత్రాలు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి పొందాయి.

కూచిపూడి నాట్యాచార్యులుగా **శ్రీమతి రాధారెడ్డి, మరియు రాజారెడ్డి** గారలు అట్లే **కౌసల్యా రెడ్డి, యామినీ రెడ్లు** నర్సాపూర్ (గాజుల) వాస్తవ్యులు అంతర్జాతీయ ఖ్యాతిని గడించారు. **వైరాగ్యం హనుమంతరావు** (ప్రఖ్యాత నృత్యకారుడు) **నాగభూషణ్‌రావు** (ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్టు - జాతీయ అంతర్జాతీయ కీర్తిని గడించిన వ్యక్తి). **రాంరెడ్డి, వెంకట్రామిరెడ్డి** మరియు **సుధాకర్ స్వాములు** ప్రముఖ ధ్వన్యనుకరణులు.

**నందకిషోర్ నాయుడు** (సంగీత దర్శకులు), **సుదర్శన్** (సారంగపూర్) ప్రఖ్యాత సంగీతజ్ఞులు. **రాంచందర్** (క్యాషియో ప్లేయర్), **లక్ష్మీనరసింహాచారి** (ప్రముఖ గాయకులు), **జోసెఫ్ బాబూరావు** (ప్రముఖ వ్యాఖ్యాత, గాయకులు), **చుక్క ధర్మరాజు** (కరాటే విద్యా నిపుణులు),

కడెం - ఖానాపూర్ ప్రాంతంలో మిమిక్రీ కళాకారులుగా చిన్న చిన్న సినిమాలను ప్రొడ్యూస్ చేస్తూ దర్శకత్వం వహిస్తున్నవారు ఉన్నారు. అట్లే ముథోల్ - భైంసా - కుబీర్ ప్రాంతంలో భజనల్లో ప్రావీణ్యం ఉన్నవారు భక్తి గీతాలను ఆలపిస్తూ సంగీత సారథ్యం వహించేవారున్నట్లు తెలియవచ్చింది. నిర్మల్ డివిజన్లో కూడా ఆధునికము మరియు పూర్వ సంప్రదాయాలయిన వీధి భాగోత కళాకారులున్నట్లు సమాచారం.

నిర్మల్‌లో స్థానికంగా పోచమ్మ - మహాలక్ష్మిలను కొలుస్తారు. బోనాల జాతర, నందిగూడం దుర్గామాత జాతర

– షిర్డీసాయి పారాయణం – షేక్ సాహెబ్ జాతర – వినాయక నవరాత్రులలో బ్రహ్మాండమైన జాతర – గాజులపేటలో స్థిరమై యున్న క్రీస్తు ప్రార్థనాలయంలో జాతర – అయ్యప్ప దీక్షాపరుల పూజలు – భజనలు ఇత్యాదివి.

**జాతరలు :** అడెల్లి పోచమ్మ జాతర; కాల్వ నరసింహ స్వామి ఉత్సవాలు; నర్సాపూర్ (గాజుల)లో దేవుని చెరువు జాతర; కదిలే పాపేశుని జాతర; ప్యారమూరు – కల్లూరులలో – గొల్లమాడలో గురు పౌర్ణిమ; దత్త జయంతి జాతర; కుంటాల గజ్జెలమ్మ దేవీ మరియు వైశాఖ పున్నమికి మహాదేవుని జాతర ; ప్రాచీన కృష్ణ మందిరములో సప్తాహము చేస్తూ చేసే జాతర.

భైంసాలో మహాదేవుని జాతర – పొలాల అమావాస్యకు రోకడ్ హన్మాన్ మందిర ప్రాంగణంలోను అట్లే నర్సింహనగర్ లో నర్సింహస్వామి జాతర; కుబీర్‌లో విఠ్ఠలేశ్వర సప్తాహం జాతర; ముథోల్‌లో మహాదేవ మందిర జాతర ఆయా పండుగల సందర్భాలలో ముస్లిం సోదరుల జాతరలు.

బాసరలో శ్రీ జ్ఞాన సరస్వతీ మాత జాతర; మహారాష్ట్ర సరిహద్దునందు గల పాలజ్ గణేశ్వరుని జాతర; బేల్ తరోడా గ్రామంలో శ్రీ దత్తాత్రేయుని జాతర; మహాగాంవ్‌లో స్వాధ్యాయుల అమృతాలయ జాతర మొదలైనవి.

ఇక తూర్పు భాగంలో పీచరలో కోతిదేవుని జాతర, సోన్ మండల కేంద్రంలో మధ్వాచార్యుల నేతృత్వంలో గోదావరి పుణ్యస్నానాలు; యజ్ఞాదులు; హోమాదులతో కూడిన జాతర; దిలావర్‌పూర్ ఎల్లమ్మ దేవి జాతర; మల్లాపూర్ – లక్ష్మణ చాందా వద్యాలలో రాజేశ్వరుని, వేంకటేశ్వరుని జాతర; పొనకల్‌లో లక్ష్మీ వేంకటేశ్వరుని జాతర; ఖానాపూర్ నియోజకవర్గంలో సింగాపూర్ సాయిబాబా; బీర్నంది స్థానిక వేంకటేశ్వర స్వామి; సుర్జాపూర్ వెంకటేశ్వర స్వామి; బాదనకుర్తి దత్తాత్రేయస్వామి; కడెం మండలంలోని లక్ష్మీ నరసింహస్వామి జాతర; దస్తూరాబాద్ మండలంలోని 'గొడిసెర్యాల' గ్రామం లోని శ్రీరాజేశ్వరస్వామి, నాగోబా జాతర మొదలగునవి నిర్మల్ జిల్లాలో భక్తి శ్రద్ధలతో కొనసాగుచున్నవి.

## సాహిత్య చరిత్ర

**భల్లాపేర కవి :** క్రీ.శ. 1750 కాలానికి చెందిన ఈయన భద్రగిరి శతకాన్ని రచించాడు. ఇతడు నిర్మల్ నివాసి. ఇస్లాం దండయాత్రల వల్ల భద్రాద్రి రామునికి ఏర్పడిన ఇక్కట్లను చూసి చలించి, రాముని గురించి చేసిన శతకమిది.

**శ్రీముని పంతులు :** నిర్మల్‌కు 20 కి.మీ.దూరంలో వున్న మామడ గ్రామనికి చెందిన ఈయన సుమారు 200 సంవత్సరాల క్రితం వాడు. జిల్లా కవితా పితామహునిగా పిలవబడుతున్న ఈయన అనేక కావ్యాలు, నాటకాలు రచించాడు. వీరు రచించిన భారతాన్ని ఈ మధ్యే శ్రీజయధీర్ తిరుమలరావ్‌గారు గోండి భారతం అనే పేరుతో ప్రచురించారు. ఇదేకాకుండా మునిపంతులుగారు రామాయణ, భాగవతాలకు సంబంధించిన వత్సలా పరిణయం, బభ్రువాహన చరిత్ర, చంద్రహాస చరిత్ర వంటి కావ్యాలు రచించాడు.

**బోయ ధర్మయ్య కవి :** 18 వ శతాబ్దికి చెందిన ఇతను మధురమైన రచనలతో ప్రజల గుండెల్లో మధుర కవిగా చిరస్థాయిగా నిలిచిపోయాడు. ఇతడు రచించిన బభ్రువాహన, హరిశ్చంద్ర, అభిమన్యు, లవకుశ తదితర యక్షగానాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శింపబడ్డాయి.

**పొన్నకంటి రాజన్నకవి :** పొన్కల్ గ్రామ నివాసి అయిన వీరు ఆ గ్రామ ఓంకారేశ్వరునిపై భక్తి పారవశ్యంతో అనేక పద్యాలు రచించాడు. అతని భార్య చనిపోతే ఆమె ఎడబాటుకు కుంగి రామునిపై భారం వేసి రామాలయ ముఖ మంటపంపై కూర్చొని ఆశు కవితా ధారలతో స్వామిని తన భార్యను బ్రతికించమని వేడుకొనగా ఆ విధంగానే జరిగిందనేది ఐతిహ్యం. శ్రీ విశ్వనాథ్ మరియు శ్రీ బొందిడి పురుషోత్తమరావు గారలు, శ్రీరామచంద్ర శతకమన్న పేరిట వీరి రచనను పరిష్కరించి ఈమధ్యే ప్రచురించారు.

**శివశ్రీ నిర్మల శంకర శాస్త్రి :** శతాధిక గ్రంథకర్తగా కీర్తిగడించిన వీరు శ్రీ నీలకంఠ బ్రహ్మసూత్ర భాష్యము, శ్రీమద్భగవద్గీత భాష్యాంధ్రీకరణము., శ్రీ శివమహాపురాణం, గురుశిష్య సంవాదం, అయ్యప్ప పూజా విధానం, శ్రౌత శైవ

సంధ్యావందనం వంటి అనేక గ్రంధాలను రచించాడు. జీవన పర్యంతం శైవ సంప్రదాయానికి సేవచేసి శ్రీ శైవ మహాపీఠానికి పీఠాధిపతిగా వుండి 91 వ యేట 2007 లో కైలాస ప్రాప్తి పొందారు.

**మార్గొండ నర్సింహదాస కవి :** శ్రీదేవరకోట వేంకటేశ్వర స్వామిని స్తుతిస్తూ శతకాన్ని రచించాడు. 'దుఃఖ సందేశ దుష్కృత దురితనాశ వికృత గుణనాశ నిర్మల వేంకటేశ' అనే మకుటంతో పద్యాలను అల్లారు.

**తిరునగరి నారాయణ :** విశ్రాంత ఉపాధ్యాయులైన వీరు దేవరకోట పునరుద్ధరణలోనూ, గీతా ప్రచార మండలి లోనూ తన శక్తిని ధారపోసి నిర్మల్ చరిత్రను సేకరించి భద్రపరిచిన వారిలో ఆద్యులు. చిరుమువ్వలు కావ్యంలో వీరి రచనలు ముద్రితమైనాయి.

**మడిపల్లి వీరయ్య :** పద్య కవుల్లో ప్రసిద్ధి గన్న వారిలో వీరొకరు. శ్రీ వేములవాడ రాజరాజేశ్వర శతకం, శ్రీ కాశీ విశ్వనాయక శతకాలను వెలువరించారు. 'శ్రీ సరస్వతీ శివకరీ సురనర వందితే శ్రీ సరస్వతీ వాసరపుర వాసిని భావ పాశాంబుల బాపుమంబ' అంటూ ధారాశుద్ధిగా సాగే వీరి రచన పండిత పామర జన రంజకమై విలసిల్లుతోంది.

**శ్రీమాన్ శిరిశినహళ్ పెరుమాండ్లాచార్య :** కోరుట్ల కృష్ణమాచార్యులకు అనుజులైన వీరు గొప్ప సంస్కృత పండితులు. సంస్కృత భాషలో రచనలు చేయడం వీరి వద్ద చాలామంది నేర్చుకున్నారు.

**టి. లక్ష్మయ్య :** రిటైర్డ్ ఉప విద్యాధికారి అయిన వీరు నిర్మల్ వాస్తవ్యులు. శైవలిని, చిరుమువ్వలు అనే సాహితీ సంకలనాలను వెలువరించారు. నిర్మల్‌లో భారతీ కళానికేతనం అనే సంస్థను స్థాపించి నడిపించారు.

ఆధునిక రచయితలుగా, లబ్ధప్రతిష్టులుగా, జిల్లా రాష్ట్ర జాతీయ అవార్డులను పొందినవారు నిర్మల్ జిల్లాలో ఉండటం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం. వీరే కాకుండా వర్ధమాన రచయితలుగా కొనసాగుతున్న వారూ ఉన్నారు.

టి. లక్ష్మీనరసింహ స్వామి - తెలంగాణ యూనివర్శిటీ రిజిస్ట్రార్‌గా పనిచేసిన వీరు శ్రీ వేంకటేశ్వర శతక కర్త. డా॥ దామెర రాములు (నెత్తుటి వెన్నెల నుండి భిన్నకాలం వరకు) శ్రీరాముల శ్రీనివాస్ (రుధిర బాష్పాలు మొ॥నవి) అంకం రాములు (శ్రీశ్రీ దయానందగిరి స్వామి జీవితచరిత్ర - నిర్మల్ చరిత్ర) పత్తిశివప్రసాద్ ( ఎరుపెక్కిన పత్తిపూలు) డా॥ మురళీధర్ (పల్లెశోభ పద్యకావ్యం) మునిమడుగుల రాజారావు (అనాగరిక గేయం నుండి సత్యమంటే ఏమిటి వరకు రాసిన తాత్విక రచయిత) తుమ్మల దేవరావు (కచ్చురం, గడ్డిపూలు) శ్రీమతి తుమ్మల సుజాత (రచయిత్రి) కారం శంకర్ (అశ్రుచైతన్యం - సూర్యుడికన్నా ముందు అక్షరం) బొందిడి పురుషోత్తమరావు (కళ్యాణకుంతలం, శ్రీసరస్వతీ శతకాలు) తొడిశెట్టి పరమేశ్వర్ (అక్షరసౌరభం) నిర్మల నీలకంఠశాస్త్రి (శ్రీకాశీ క్షేత్రమహాత్యం) నిర్మల రామనాథ శర్మ (సంస్కృత కవి) నిర్మల సిద్ధిరామశర్మ (చాణుక్య నీతి దర్పణం) దాస్యం సేనాధిపతి (బహుగ్రంథ రచయిత, సమీక్షకుడు) మధుసూదన్ (రచయిత, నటుడు) గుండి రామకుమార్ (రచయిత, నటుడు) ఎలిశెట్టి సుదర్శన్ - నాగరాజు - కడార్ల రఘు (గాయకులు, రచయితలు, వాద్యకారులు) గోవిందుల శ్యామసుందరాచారి (శ్రీవాణీ విలాస శతకం) కొండాజి వేంకటాచారి (జ్యోతిషులు, కవి) డా॥ చక్రధారి (నేను ఆదిలాబాదోన్నే రచయిత, ప్రముఖ పిల్లల వైద్యులు, సామాజిక సేవా కర్త) సత్యనారాయణ గౌడ్ (చిగురించిన తెలంగాణ) అంబటి నారాయణ (బరువెక్కిన బతుకులు-తడి మొదలగు పుస్తకాలు) విద్యాసాగర్‌రెడ్డి (ఆంగ్ల, తెలుగు) కీ.శే. రుక్మారెడ్డి (మార్పు నవల) డా॥ కృష్ణంరాజు (సందర్భోచిత గేయరచయిత, సమాజసేవకుడు) నేరెళ్ల హనుమంతు (సందర్భోచిత గేయరచయిత, సమాజసేవకుడు) డా॥ మురళీకృష్ణ (సందర్భోచిత గేయరచయిత, సమాజసేవకుడు) మడిపల్లి దక్షిణామూర్తి (ప్రముఖ వ్యాఖ్యాత, రచయిత) మడిపల్లి రాజ్‌కుమార్ (వచన మరియు పద్య రచయిత) మంగ్లారపు దివాకర్ (నిత్యదర్శనాలు)

మట్టభూమన్న (జైభీం- రైతుగోస) సి. హెచ్.నరహరి (శ్రీరామానుజుల చరిత్ర) బి.శశికుమార్ (గేయరచయిత) వెంకట్ (సంస్కృతభాషా వ్యాపకుడు, రచయిత) మడిపల్లి భద్రయ్య (పద్య, గద్య, గేయ, కవి రచయిత) రాజులదేవ్ శంకర్ (ఆంగ్ల రచయిత) చిరుత నర్సయ్య (రచయిత) శ్రీ హాజ్రమీ మరియు అబ్దుల్ హాదీ మునజ్జా - అబ్దుల్ మాజిద్ నిసార్ - తహిసీనుల్లా హుస్సేన్ మొదలగు వారు ఉర్దూ కవులు. మడిపల్లి హరిహరనాథ్ (సందర్భోచిత వచన, గేయ రచయిత)

గప్పార్ (ఆత్మీయ సంస్థ రచయిత) ఉస్మాన్ (మౌలానా అబుల్ కలాం ఆజాద్ సంస్థ రచయిత) కిరణ్ సిస్టర్స్ (రసఝరి పుస్తక రచయిత్రులు) వొడ్నాల వేణుగోపాల్ (పద్యకవి, నటుడు) ధర్మపురి యమునాచారి (పద్యకవి) చక్రపాణి వాసుదేవాచార్యులు (రచయిత) చక్రపాణి నరసింహమూర్తి (రచయిత) చక్రపాణి సుమతి (రచయిత్రి) కరిపె రాజ్‌కుమార్ (రచయిత) డి.యల్.యన్.చారి (రచయిత) అమరవేణి వెంకటరమణ గౌడ్ (రమణా శతకం, సంధించిన బాణం రచయిత) గొడిసెల వెంకాగౌడ్ (పద్య రచయిత) శేషం నరేష్ కమార్ (రచయిత) డా. కోవెల శ్రీనివాసాచారి (పద్య రచయిత), కాట్‌పల్లి కిషన్‌శాస్త్రి (పద్య రచయిత), కమలాకర్ కులకర్ణి (హిందీ, మరాఠీ భాషల రచయిత), కడారి దశరథ్, గంగుల చిన్నన్న, జాదవ్ పుండలీక్‌రావ్, సోమ జనార్దన రెడ్డి, శేష మహేష్ కుమార్, కత్తి నాగోరావు, దాసుపత్రి నరేందర్, సుజాతా గంగుల, గంగుల అరుణాదేవి, కృష్ణమూర్తి, ఎలకంటి వెంకటరెడ్డి, సల్లా రాంకిషన్, కొంతం అడెల్లు, గైని భోజన్న, శ్రీనివాస్, రవి కుమార్, వడ్ల దిగంబర్ వీరంతా కూడా భైంసా ప్రాంత రచయితలు.

**సాహితీ సంస్థలు :** నిర్మల్ కల్చరల్ ట్రస్టు - మానస - నిర్మల భారతి - ఆత్మీయ - డా. కావేరి మెమోరియల్ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సాహితీ సాంస్కృతిక సేవా కార్యక్రమాలు నిర్మల్ ప్రాంతంలో జరుపుతున్నారు. అట్లే భైంసా ప్రాంతంలో శ్రద్ధాళువులైన తెలుగు పండితులు ఒకటి, రెండు సాహితీ సంస్థలను ఏర్పర్చుకొని కవితా సంకలనాలను ప్రచురించుకుంటున్నారు. అదేవిధంగా ఖానాపూర్ నియోజక వర్గంలో కూడా పద్య, గద్య రచనలు పుస్తకాలుగా సాహితీ సాంస్కృతిక సంస్థల ద్వారా వెలువడుతున్నాయి.

**వివిధ రంగాల ప్రముఖులు :** ధర్మ నాగభూషణ రావు గారు సాంగ్వి అనే గ్రామంలో నిత్యాన్నదాతగా పేరు గాంచారు. నిర్మల్ పంచశీల్ కాలేజ్ స్థాపకులు, మరియు నిర్వాహకులైన అబ్దుల్ షకూర్ గారు విద్యావ్యాప్తితో పాటు ఎన్నో ధార్మిక కార్యక్రమాలకు చేయూతనిస్తున్నారు.

భైంసా వాస్తవ్యులైన ప్రొఫెసర్ చంద్రకాంత్ కొకాటే గారు 5 సార్లు జాతీయ అవార్డును అందుకొని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్‌గా రిటైర్డయ్యారు.

డా. అప్పాల చక్రధారి గారు వందల కొలది ఉచిత వైద్య శిబిరాలు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చేసి, ఎయిడ్స్‌పై అవగాహన సదస్సులు నిర్వహించి, మూఢనమ్మకాలపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారు.

ఇందూరు ప్రవీణ్‌కుమార్ ఉమ్మడి ఆదిలాబాదు జిల్లాలో గల దర్శనీయ స్థలాలు ప్రత్యేకంగా జలపాతాల గురించి వెబ్‌సైట్ ఓపెన్ చేసి ఎందరికో మార్గదర్శనం చేస్తున్నారు.

ఈ మధ్య ఆయా పాఠశాలల్లో చదివి, పలు రంగాల్లో పనిచేస్తున్న వాళ్ళు పెద్దమనస్సుతో పేద విద్యార్థులకు సహకారం మరియు విద్యాసంస్థల భౌతిక అవసరాలకై పాటుపడుతూ ఆర్థిక వనరులను చేకూరుస్తున్నారు.

ఆధ్యాత్మికత పరంగా కుంటాల మండల కేంద్రంలో పురాతన శ్రీకృష్ణాలయాన్ని ఉద్ధరించి ఎందరో సందర్శకులకు, భక్తులకు నెలవైన కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు శ్రీ నర్సింగరావు గారు.

ప్రదీప్ గందేవార్ ఎన్నారైగా అమెరికాలో స్థిరపడ్డప్పటికీ తాను పుట్టిపెరిగిన గ్రామం ఓలాలో తన తండ్రి గందె శంకర్ గారి స్మృత్యర్థం ఉన్నత పాఠశాల భవనాన్ని నిర్మించారు.

సారంగాపూర్ మండల కేంద్రంలో శ్రీ పడిగెల కిష్టన్న గారు నాడు దాతగా, వైద్యశాలను నిర్మించి ప్రజలకై అంకిత మిస్తూ ఆనాటి నిండు సభలో కలెక్టర్, ఇతర అధికారుల సమక్షంలో ఆనందానుభూతిని తట్టుకోలేక వేదికపైనే అమరుడయ్యాడు.

కుంటాల మండలంలోని కల్లూరు సాయిబాబా క్షేత్రంలో ఎన్నో వసతులు సమకూర్చడానికి తమ తన,మన, ధనాల్ని వెచ్చించిన శ్రీ ప్రభాకర్ మహారాజ్ గారి సేవలు చిరస్మరణీయం.

ఇదే రీతిలో నిర్మల్ జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి దయాళువులైన ఎందరో ప్రముఖులు సందర్భోచితంగా సేవలు చేస్తూవున్నారు.

ప్రస్తుత రాజకీయ రంగ ప్రముఖులుగా అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర గృహనిర్మాణ - న్యాయ మరియు దేవాదాయ శాఖామాత్యులు.

గెడాం నగేశ్ గౌ॥ పార్లమెంటు సభ్యులు. (ఉమ్మడి ఆదిలాబాద్) సముద్రాల వేణుగోపాలాచారి తెలంగాణ రాష్ట్ర కేంద్ర సలహాదారులు. శ్రీమతి శోభా సత్యనారాయణ గౌడ్ చైర్‌పర్సన్ జిల్లాపరిషత్ ఆదిలాబాద్. పురాణం సతీష్ ఎమ్.ఎల్.సి. ఆదిలాబాద్. లోక భూమారెడ్డి, ఛైర్మన్, పాడిపరిశ్రమ సంస్థ. జి. విఠల్ రెడ్డి ఎం.ఎల్.ఎ. ముథోల్ నియోజకవర్గం. శ్రీమతి రేఖానాయక్ ఎం.ఎల్.ఎ. ఖానాపూర్ నియోజకవర్గం. మూలరాజరెడ్డి వైస్‌ఛైర్‌మెన్ జి.ప. ఆదిలాబాద్. కే. రామ్ కిషన్‌రెడ్డి ఛైర్‌మెన్ యఫ్.యస్.సి.యస్. నిర్మల్. అప్పాల గణేష్ చక్రవర్తి మున్సిపల్ ఛైర్‌మెన్ నిర్మల్. జబీర్ అహ్మద్ మున్సిపల్ ఛైర్‌మెన్ భైంసా.

**స్వాతంత్ర్య సమరయోధులు:** మిర్యాల్‌కర్ రాములు, భూసాని సత్యనారాయణ ఆర్య, బాబురావుజోషి, బాపురావు, రాజలింగం, ఎ. లింగారెడ్డి, యం. ఎల్లయ్య, జి. భూమారెడ్డి, ఎ. శివయ్య, యం. రామమూర్తి, పి.యం. భూమన్న, ఎల్. గణపతి, కే. నర్సయ్య, మారుతి, నరసింహ, హనుమంతు, నారాయణరావు, జుట్టు గజ్జరామ్, ఏనుగు లింగారెడ్డి.

## దర్శనీయ ప్రదేశాలు - పర్యాటకరంగం

**పర్యాటక ప్రదేశాలు :** నిర్మల్ కోటలు, కొయ్యబొమ్మల పరిశ్రమ, ఆదిలాబాద్ పరిధిలో గల కుంటాల మరియు పొచ్చర జలపాతాలు. గోదావరి నదిపై గల సదర్‌మాట్, కడం ప్రాజెక్ట్, కుంటాల కృష్ణమందిర ప్రాంగణం, జీయర్ గురుకులం, బాదనకుర్తి బాసర సరస్వతీ క్షేత్రం మొదలగునవి.

## ముఖ్య దేవాలయాలు

**శ్రీ జ్ఞానసరస్వతీ దేవస్థానం - బాసర :** దేశంలో గల రెండే రెండు సరస్వతీ క్షేత్రాలు. ఒకటి కాశ్మీర్. రెండోది మన బాసర క్షేత్రం. దీనినే ఆసర, వాసర, బాసర అంటూ వుంటారు. అసలు వ్యాస ప్రతిష్ఠమైన దేవి కాబట్టి వ్యాసర్, వ్యాసపురి, వాసర్, బాసర్‌గా మారింది. పౌరాణిక ఆధారాల ద్వారా వ్యాస మహర్షి దక్షిణాపథానికి వచ్చినపుడు గోదావరి స్థిత ఈ స్థలాన్ని తన తపస్సునకు తగిన నెలవుగా ఎన్నుకొని ప్రతి దినము మూడు పిడికిలుల ఇసుకను గోదావరి నుంచి తేగా లక్ష్మి, పార్వతి, సరస్వతి మూర్తుల విగ్రహాలుగా రూపుదిద్దుకున్నాయని ఐతిహ్యం. అలాగే ఇక్కడ ఆంజనేయ, ఏకవీర, గణపతి ఆలయాలే కాక వ్యాసుల గుడి, దత్తాత్రేయ స్వామి గుడులు ఇందులో వున్నాయి. ఎక్కువ శాతము ఈ క్షేత్రంలో భక్తులు దీక్షలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అంటే 41 రోజులు లేదా 21 రోజులు దీక్షగా యుండి దేవీ నామస్మరణ చేస్తూ 'మాధూకరీ' (భిక్ష) చేస్తూ, అలా వచ్చిన అన్నమును అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి, వీరు నైవేద్యంగా తీసుకుంటారు.

**శ్రీ లక్ష్మీనరసింహ స్వామి :** కడెం గ్రామ సమీపం లోనే అక్కకొండ అనే గుట్టపై ఈ దేవాలయం వుంది. ఇక్కడ లక్ష్మీనరసింహ స్వామి స్వయంభువుగా వెలిశాడు. ప్రతి మాఘ పౌర్ణమికి ఇక్కడ మూడు రోజుల జాతర జరుగు తుంది. ఈ ప్రాంతీయులే కాక, కరీంనగర్, నిజామాబాదు వారు కూడా స్వామిని దర్శించుకొని తరిస్తుంటారు.

**వేంకటేశ్వరాలయం :** సుర్జాపూర్ గ్రామంలో ఈ ఆలయం వుంది. ఇది చాలా పురాతన ఆలయం. ఇక్కడ

ప్రతి సంవత్సరం దసరా సందర్భంగా ఉత్సవాలు జరుగుతుంటాయి.

మామడ మండలంలోనే వున్న బూరుగుపల్లి శివాలయమూ గొప్ప శిల్ప సంపదతో విరాజిల్లుతోంది. పొనకల్‌లోని ఓంకారేశ్వరాలయం కూడా చాలా పురాతన మైంది, మహిమాన్వితమైంది. మామడ మండలంలోని గోదావరి నది పక్కనే 'నాగలింగేశ్వర ఆలయం కూడా వుంటుంది. పొనకల్ మండలంలో చాలా శిథిలమైన ఆలయాలు వున్నాయి. ఇక్కడి ఓంకారేశ్వర స్వామి దేవాలయం వుంది.

**ఆంజనేయ స్వామి దేవాలయం – లక్ష్మణచాందా:** లక్ష్మణచాందా గ్రామంలో వున్న ఆంజనేయ స్వామి దేవాలయం ప్రసిద్ధిచెందింది. ఓ ముప్పై ఏళ్ళ క్రితం ఇక్కడ ఓ కోతి భక్తులైన వారి కోరికలను తీర్చింది. పిదప అది మరణించడం, దాన్ని సమాధి చేసి మందిరాన్ని నిర్మించారు. ఇప్పటికీ ప్రతి సంవత్సరం ఉత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

**శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి – నిర్మల్ :** కాల ప్రవాహంలో ఈ ఆలయం మూతపడిపోవడంతో రాజా చందూలాల్ బహదూర్ అనే వ్యక్తి అల్వాల గ్రామంలో విగ్రహాన్ని ప్రతిష్ఠ చేసారని తెలుస్తోంది. తర్వాత 1942 లో రాజారెడ్డి గారితో కలిసి ప్రస్తుత దేవాలయ స్థలాన్ని సుదర్శన్ రావు దేశ్‌పాండే కొనిపించారు. తరువాత 1948లో ఈ ప్రదేశాన్ని దేవాలయానికి యథాతథంగా రాజారెడ్డి గారు దానం చేయగా, దేశ్‌పాండే గారు ఇతరులు కలిసి ఈ ఆలయ సింహ ద్వారాన్ని తెరిచారు.


వీటితో పాటు వీరహనుమాన్ మందిరం. బ్రహ్మపురి లోని రథాల గుడి ప్రాంగణం, ఖజాన్ చెరువు వద్ద గల ఓంకారేశ్వర స్వామి మందిరం, కస్బాలో గల నగరేశ్వర స్వామి మందిరం, రాజేశ్వరవాడలో గల రాజేశ్వర స్వామి ఆలయాలు, మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం, పాతబస్టాండు రోడ్డు లోని గీతాప్రచార మండలి, ఆదిలాబాదు వైపు వెళ్ళే రోడ్డుకు గండిరామన్న గుహ, షిర్డీసాయిబాబా ఆలయం, మల్లన్న గుట్టపై వున్న హరిహర దేవస్థానం వున్నాయి.

**పాపహరేశ్వర క్షేత్రం – కదిలి :** ఉత్తర దిశలో మాడేగామ్ గుట్టపై ఎన్నో వందల సంవత్సరాల క్రితం 'కదిలి' అనే గ్రామ శివారులో పాపహరేశ్వర శివాలయ నిర్మాణం జరిగింది. దీనిలోని శిల్పకళా నైపుణ్యం వర్ణనాతీతం. ఎప్పుడూ ప్రవహించే నీట ఊటగా వుండి ఇక్కడ ఆ కాలంలో నిర్మించిన కుండాల్లో నీరు అన్ని కాలాల్లో వుంటుంది. ఈ నీటిలో స్నానంచేస్తే సర్వరోగాలు అరిష్టాలు పోతాయని విశ్వాసం. ఈ ప్రవాహానికి దగ్గర్లోనే ఒక మహావృక్షం వుంది. ఎన్నో చెట్ల కలయికలో వున్న ఈ వృక్షాన్ని పూజించి ఎందరో ధన్యులైనట్లు తెలుస్తోంది. ఇక్కడున్న శివలింగం కదులుతుందని ప్రచారంలో వుంది.


దివాలాపూర్‌లో పురాతన కాలం నాటి గుర్తులుగా శ్రీ ఏకనాథ స్వామి దేవాలయం దర్శనమిస్తుంది. ఈ గ్రామం ఎల్లమ్మ దేవీ మందిరానికి చాలా ప్రసిద్ధం. ఈ మండలంలోనే చక్కని ప్రకృతి మధ్యలో దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయం వుంది. దీనితోపాటు పురాతన దేవాలయమైన బ్రహ్మేశ్వర స్వామి దేవాలయం వుంది.

పూర్వం ఇందూరుగా పిలువబడిన ఈ నగరం చారిత్రకంగా సాహిత్య పరంగా ప్రసిద్ధి పొందింది. గోదావరి నది తెలంగాణలో ప్రవేశించేది ఈ జిల్లాలోనే. శ్రీరామ్ సాగర్ వంటి పెద్ద ప్రాజెక్టును తనదిగా చేసుకున్న ఈ జిల్లా అనేక దేవాలయాలకు, పర్యాటక ప్రదేశాలకు నెలవు. ఈ చారిత్రక వారసత్వంతో అభివృద్ధి పథంలో దూసుకువెళ్తున్నదీ జిల్లా.

# పెద్దపల్లి జిల్లా చిత్రపటం



136 (9)




వినాయక దేవస్థానం




శైలేశ్వరస్వామి దేవస్థానం




కేశోరాం సిమెంట్



రామచంద్రస్వామి దేవస్థానం



గౌతమేశ్వర దేవాలయం



శ్రీ మహాలక్ష్మీ దేవాలయం



సింగరేణి బొగ్గు బావి



ఎన్.టి.పి.సి.




అల్లం రాజయ్య



అల్లం వీరయ్య



అల్లం నారాయణ



గట్టు నారాయణ



వెంకటస్వామి

136 (b)

# పెద్దపల్లి

**బౌద్ధము హైందవము ఘన పూర్ణ సమన్విత చంద్రికా స్థితిన్**
**బోద్ధముగాగ కుండములు భూతిని నింపగ నిత్యదేవతా**
**సిద్ధ వరాలయాత్మమయి శేవధియై తెలగాణ తల్లికిన్**
**బద్ధత నిల్చుగాదె వరవర్ణినియై యిల పెద్దపల్లియై !**

**కొ**త్త జిల్లాల విభజనతో తెలంగాణ రాష్ట్ర పాలనా స్వరూపం మారిపోయింది. ప్రజల వద్దకే పరిపాలన అన్న సూత్రంతో ముఖ్యమంత్రి కేసీఆర్ పది జిల్లాలతో వున్న రాష్ట్రాన్ని పునర్విభజించారు. కొత్తగా 21 జిల్లాలను ఏర్పాటు చేయగా, మొత్తం జిల్లాల సంఖ్య 31 కి చేరింది. ఇందులో భాగంగా తెలంగాణ మ్యాప్‌లో కొత్తగా చేరింది ఈ పెద్దపల్లి జిల్లా. పూర్వం కరీంనగర్ జిల్లాలో ఇది భాగంగా వుండేది.

**ఈ పేరెందుకు?**

పెద్దపల్లి ప్రాంతం నిజాం ప్రత్యేక సంస్థానంగా మరియు నిజాం ప్రభువు విడిది విశ్రాంతి కేంద్రంగా ఉండేది. దానితో ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందింది. అప్పుడు ఈ ప్రాంతంలో అన్ని పల్లెలు ఉండేవి. ఆ పల్లెలో నిజాం అభివృద్ధి చేసిన పల్లెను 'పెద్దపల్లి'గా పిలిచేవారు. అంటే చుట్టూ ఉన్న ప్రాంతాలలో ఈ పల్లె పెద్ద పెద్ద పరిశ్రమలకు, మార్కెట్‌లకు ప్రసిద్ధి చెందింది. కాబట్టి "పెద్దపల్లి"గా రూపుదిద్దుకుంది.

క్రమక్రమంగా పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రధాన కేంద్రంగా మారింది. పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులు అధికంగా ఉన్న ఈ జిల్లా హైదరాబాద్ తరువాత రెండో పారిశ్రామిక కేంద్రంగా గుర్తింపు పొందింది. భారీ పరిశ్రమలు, బియ్యం మిల్లులు, విద్యుత్ కేంద్రాలున్నాయి. జాతీయ రహదారి అయిన రాజీవ్ రహదారి ఈ ప్రాంతం గుండా వెళుతుంది.

**భౌగోళిక విస్తీర్ణం – పరిధి**

పెద్దపల్లి జిల్లా 2,236 చ.కి.మీ. వైశాల్యాన్ని కలిగి వుండి, సముద్ర మట్టానికి 250 మీ. దిగువన ఉంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి కొత్తగా ఏర్పడిన ఈ జిల్లాకు తూర్పున జయశంకర్ భూపాలపల్లి, పశ్చిమాన కరీంనగర్, జగిత్యాల జిల్లాలు, ఉత్తరాన మంచిర్యాల్, దక్షిణాన వరంగల్ అర్బన్, వాయువ్యాన జగిత్యాల జిల్లాలు సరిహద్దులుగా ఉన్నాయి.

**సహజవనరులు**

ఈ జిల్లా ప్రధానంగా నేలబొగ్గు, ఇసుక సహజ వనరులుగా కలిగి వుంది. వీటిని మినహాయించి మిగతా ఖనిజ వనరులు స్వలంగానే వున్నాయి. గోదావరిఖనిలో విస్తరించిన సింగరేణి ద్వారా పెద్దఎత్తున నేలబొగ్గు ఉత్పత్తి జరుగుతుంది. మరియు రోడ్డు మెటల్, కలర్ గ్రానైట్, లేటరైట్ వనరులు లభ్యమౌతాయి. గ్రానైట్ వనరులు వుండటం వల్ల అనేక గ్రానైట్ పరిశ్రమలున్నాయి. నలుపు గ్రానైట్ అధికంగా వుంటాయి. ఇక్కడి గ్రానైట్‌ను దేశ విదేశాలకు ఎగుమతి చేసుకుంటారు.

**రెవిన్యూ డివిజన్లు - మండలాలు**

ఈ జిల్లాలో పెద్దపల్లి మరియు మంథని అనే రెండు రెవిన్యూ డివిజన్లు వున్నాయి. ఈ రెండు రెవిన్యూ డివిజన్‌లలో మొత్తం14 మండలాలు వున్నాయి.

**పెద్దపల్లి డివిజన్‌లోని మండలాలు 10 :**

1. పెద్దపల్లి 2. ఓదెల 3. సుల్తానాబాదు 4. జూలపల్లి 5. ఎలిగేడు 6. ధర్మారం 7. రామగుండం 8. అంతర్‌గాం (కొత్తది) 9. పాలకుర్తి (కొత్తది) 10. శ్రీరాంపూర్

**మంథని రెవిన్యూ డివిజన్‌లోని మండలాలు 4:**

1. కమాన్‌పూర్ 2. రత్నాపూర్ 3. మంథని 4. ముత్తారం

**నేలలు :** ఈ జిల్లాలో ప్రధానంగా ఎర్ర నేలలు, నల్లరేగడి నేలలే ఎక్కువ. ఈ ఎర్ర నేలల్లో బంక మన్ను తక్కువగా వుండి ఇసుక రేణువులు ఎక్కువగా వుంటాయి. 65 శాతం దుబ్బ నేలలు, 27 శాతం రేగడి, 5 శాతం చెలక నేలలు వున్నాయి. జిల్లాలో ఎర్రమట్టి నేలలు 45 శాతం, నల్లరేగడి 55 శాతం వున్నాయి. బాలాఘాట్ పర్వత శ్రేణికి చెందిన పర్వత పంక్తులు ఈ జిల్లాలో వున్నాయి.

**అడవులు :** జాతీయ అటవీ విధానం ప్రకారం మొత్తం భూభాగంలో 33% అటవీ ప్రాంతం వుండాలి. తెలంగాణా రాష్ట్రంలో ఈ శాతం 24.35 శాతం ఉండగా, పెద్దపల్లి జిల్లాలో అటవీ విస్తీర్ణం చూసినపుడు అడవుల శాతం చాలా తక్కువగా ఉన్నది. జిల్లా విభజనలో భాగంగా మంథని ప్రాంతంలో వున్న దట్టమైన అడవుల ప్రాంతం భూపాల పల్లికి చేరింది. ప్రస్తుతం జిల్లా అటవీ విస్తీర్ణం 304.91 చ.కి.మీ. అటవీ విస్తీర్ణ శాతం 13.64%. ప్రస్తుతం అటవీ విస్తీర్ణం పెంచడానికి హరితహారం ద్వారా ప్రయత్నం చేస్తున్నారు. ఈ జిల్లాపై నైరుతి ఋతుపవనాల ప్రభావం వుంటుంది. సింగరేణి గనుల ప్రభావంతో శీతకాలంలో చలి, వేసవిలో ఎండ అధికం. ఈ కాలుష్యాన్ని తగ్గించడానికి సింగరేణి యాజమాన్యం మొక్కల పెంపకం చేపట్టారు.

**నదులు :** పెద్దపల్లి జిల్లాలో గోదావరి నది ప్రధాన మైంది. ఆదిలాబాదు, మంచిర్యాల జిల్లాల నుంచి రామగుండం వద్ద పెద్దపల్లిలోకి గోదావరి నది ప్రవేశిస్తుంది. గోదావరినది మంథని మీదుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోకి కాళేశ్వరం వద్ద ప్రవేశిస్తుంది.

మంథని మండలం ఖానాపూర్ వద్ద గోదావరినదిలో ఎల్ మడుగు ఉంది. ఇది మొసళ్ళ సంరక్షణ కేంద్రంగా వుంది మరియు సిరిసిల్ల జిల్లాలో పుట్టిన 'మానేరు' అనే నది గోదావరికి ఉపనది. ఇది పెద్దపల్లి, మంథని మీదుగా ప్రవహించి భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ వద్ద గోదావరిలో కలుస్తుంది.

మంథనిలో బొక్కలవాగు ప్రవహించి గోదావరిలో కలుస్తుంది. ఈ విధంగా గోదావరి, మానేరు, బొక్కలవాగు నదులు పెద్దపల్లి జిల్లాలో వున్నాయి.

**చెరువులు - ప్రాజెక్టులు**

పెద్దపల్లి జిల్లాలో చెరువులు మరియు ప్రాజెక్టులు అనేకంగా వున్నాయి. చెరువులు ప్రధానంగా వర్షాధారాలు మరియు ఎస్సారెస్పీ కెనాల్ నీటిపై ఆధారపడి వుంటాయి. పెద్దపల్లి, సుల్తానాబాదు, రాణాపూర్, సబ్బితం, జల్లారం, కమాన్‌పూర్, మంథనిలో చెరువులు వున్నాయి. ప్రధానంగా మంథనిలో పూర్వం అనేక చెరువులను త్రవ్వించారు. రావుల చెరువు, తమ్మ చెరువు, అయ్యగారి చెరువు, శిలాసముద్రం చెరువు, పాలకుర్తి చెరువు, అంతర్గాం చెరువులున్నాయి.

ఈ జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు. రామగుండం పరిధిలో నిర్మించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీరు రాకుండా బాబ్లీ ప్రాజెక్టు నిర్మించిన తరువాత దీని ఆయకట్టు కింద వున్న భూములకు సాగు నీరు అందించడానికి దీనిని నిర్మించడం జరిగింది. ఈ ప్రాజెక్టు నుంచి కాలువ ద్వారా సాగు నీరు అందించడం జరుగుతుంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుసందానంగా నిర్మిస్తున్న సుందిల్ల (సిరిపురం) గోళివడ ప్రాజెక్టులు నిర్మిస్తున్నారు. కన్నాల ప్రాజెక్టు ద్వారా మంథని నుంచి పంట భూములకు సాగునీరు అందిస్తున్నారు.

**జనాభా :** పెద్దపల్లి జనాభా 7,95,322 మంది. ఇందులో పురుషులు 3,99,325 కాగా, మహిళలు 3,96,325 గా వుంటారు. స్త్రీ, పురుషుల నిష్పత్తి 992 మంది (1000) గ్రామ జనాభా 4,91,319. పట్టణ జనాభా 3,04,013. పెద్దపల్లి జిల్లా జనసాంద్రత 356 కి.మీ.

**అక్షరాస్యత :** జిల్లా జనాభాలో 7.95 లక్షల్లో 4,77,361 అంటే 65.52% మంది అక్షరాస్యులున్నారు. జిల్లా పురుషుల్లో అక్షరాస్యత 2,68,587 (73.68%) కాగా మహిళల్లో 2,08,774 (57.36%) వుంది.

## జిల్లా చరిత్ర

ఈ జిల్లాలో ఆదిమానవులు నడయాడినట్లు తవ్వకాలలో బయల్పడిన ఆధారాల వల్ల తెలుస్తుంది. రామగుండం తవ్వకాలలో గుర్రం బొమ్మ బయట పడింది. ధూళికట్టలో బౌద్ధారామాలు, ప్రాచీన చరిత్రకు ఆనవాళ్ళుగా ఉన్నాయి. వీటన్నిటి ఆధారంగా చరిత్రను ఈ క్రింది విధంగా విభజించవచ్చు.

**పాతరాతియుగం :** ఆదిమానవుడు ఉపయోగించిన పాతరాతియుగం నాటి రాతి పనిముట్లు. అవశేషాలు పలుచోట్ల బయటపడ్డాయి. శిలాయుగపు రాతి గొడ్డళ్ళు. కత్తి ఆకారాపు పనిముట్లు లభించాయి. ఆదిమానవులు జంతువులను వేటాడటానికి మరియు రక్షణ కొరకు వీటిని ఉపయోగించారు.

**కొత్త రాతి యుగం :** జీవి మనుగడ సాగించడానికి పెద్దపల్లి జిల్లా అనువైన ప్రాంతంగా ఉండేది. 15 కిలోమీటర్ల దూరంలో ధూళికట్ట వద్ద కొండగుహలున్నాయి. మంథని ప్రాంతంలోని బగుళ్ళగుట్ట వద్ద కొండగుహలు కలవు.

**బృహత్ శిలాయుగము :** ఐతరేయ బ్రాహ్మణం ప్రకారం ఈ జిల్లావాసులు ఆంధ్రులు లేదా అనార్యులని తెలుస్తుంది. అష్టాదశ పురాణాల్లో మంథనికి సంబంధించిన వర్ణన ఉంది. బ్రహ్మపురాణంలో దేవగామ తీర్థం గురించి ప్రస్తావన ఉంది. స్కాందపురాణంలో గౌతమ మహర్షి తపస్సు చేసుకున్న ప్రదేశం మంథని గోదావరి తీరంగా తెలుస్తుంది.

**మున్సిపల్ కార్పొరేషన్ :** రామగుండం, పెద్దపల్లి

**నగరపాలక సంస్థ :** పెద్దపల్లి

**రెవిన్యూ గ్రామాలు :** 215

**గ్రామపంచాయితీలు :** 208

**పోలీస్ కమీషనరేట్ :** రామగుండం

**పార్లమెంటు నియోజకవర్గం :** పెద్దపల్లి

**అసెంబ్లీ నియోజకవర్గాలు :** పెద్దపల్లి, మంథని, రామగుండం

**పట్టణాలు :** జిల్లాలో ప్రధానమైన పట్టణాలు మూడు. 1. పెద్దపల్లి 2. రామగుండం 3. మంథని

బౌద్ధ, జాతక కథల్లోనూ ఈ ప్రాంత ప్రస్తావన కనిపిస్తుంది. క్రీ.పూ.6వ శతాబ్దానికి చెందిన షోడశ మహాపదాల్లో ఒకటైన 'అశ్మక మహాజనపదం' ఉత్తర తెలంగాణ ప్రాంతమే. మెగస్తనీస్ ఇండికా గ్రంథంలో అశోకుని 13వ శిలా శాసనంలో ఆంధ్రుల ప్రస్తావన ఉంది. పెద్దపల్లి జిల్లా ప్రాంతం ఈ అశ్మక మహాపదంలో భాగమై ఉండవచ్చు. ఎందుకంటే పెద్దపల్లికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ధూళికట్టలో అశోకుని కాలంనాటి రాజ్య పరిస్థితులకు సంబంధించిన ఆనవాళ్ళు కనబడ్డాయి. ఇక్కడ ప్రఖ్యాత బౌద్ధ స్థూపముంది. 30 వరకు కోటగోడలున్నాయి.

గోదావరి లోయలో జరిపిన తవ్వకాల్లో శాతవాహనుల చరిత్ర బయల్పడింది. పెద్దబొంకూర్, ధూళికట్ట తదితర ప్రాంతాల్లో లభించిన నాణేలలో శాతవాహనుల చరిత్ర ప్రస్ఫుటమవుతుంది. క్రీ.పూ. 230 నుండి క్రీ.శ.220 వరకు దాదాపు 450 సంవత్సరాలు శాతవాహనులు పరిపాలించారు. శ్రీముఖుడు కోటిలింగాల ప్రాంతాన్ని రాజధానిగా చేసుకుని శాతవాహన సామ్రాజ్యం స్థాపించాడు. పెద్దపల్లి జిల్లా ప్రాంతాలు వీరి పరిపాలనలో ఉండేవని తెలుస్తుంది.

అనంతరం పెద్దపల్లి జిల్లా విష్ణుకుండినులు, బాదామి చాళుక్యులు, కళ్యాణీ చాళుక్యులు, వేములవాడ చాళుక్యుల ఏలుబడిలో ఉన్నట్లు తెలుస్తుంది. ఆ తరువాత పెద్దపల్లి

ప్రాంతం కాకతీయుల ఏలుబడిలోకి వచ్చింది. రెండవ బేతరాజు కాలం నాటికే కాకతీయుల రాజ్యం విస్తరించిందని ఇక్కడ లభించిన మంథని శాసనము, గంగాపుర శాసనము, సుందిళ్ళశాసనము, కాళేశ్వర శాసనము, ఖమ్మంపల్లి శాసనాల ఆధారంగా తెలుస్తుంది. వీరి అనంతరం విజయనగర రాజులు కూడా ఈ ప్రాంతాన్ని జయించి పరిపాలించినట్లు కాళేశ్వరం లోని శాసనం ద్వారా తెలుస్తుంది.

**ఆధునిక యుగం :** అనేక చారిత్రక పరిణామాల అనంతరం ఈ ప్రాంతం మొదట బహుమనీ సుల్తానులు, కుతుబ్‌షాహీలు, అసఫజాహీలు లేదా నిజాం రాజుల ఏలుబడిలో ఉండేది. నిజాం రాజుల కాలంలో పూర్వ కరీంనగర్ ప్రాంతం నిజాం ఉల్-ముల్క్ మొదటి ఆసఫ్‌జాహి కాలంలో ఎల్గందల జాగీర్దారులుగా ఉండేది. ఆ సమయంలో పెద్దపల్లి ప్రాంతం ప్రత్యేక సంస్థానంగా ఉండేది.

నిజాం సంస్థానం హైదరాబాద్ భారతదేశంలో విలీనం కావడానికి జరిగిన పోరాటాల్లో, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం 1969 మరియు నక్సల్బరీ ఉద్యమాలు, మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఈ ప్రాంత ప్రజలు, కవులు, రచయితలు కీలకపాత్ర పోషించారు. ముఖ్యంగా మంథని ప్రాంతం నుండి అనేకమంది ఉద్యమాల్లో ప్రముఖపాత్ర వహించారు. తెలంగాణను సాధించుకున్న తర్వాత 2016 అక్టోబర్ 11న పాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన జిల్లాలలో భాగంగా కరీంనగర్‌నుండి విడిపోయి పెద్దపల్లిగా అవతరించింది.

**సంస్కృతి**

ఇక్కడి ప్రజల జీవన విధానం సంస్కృతి అనేది భిన్నత్వంలో ఏకత్వం మాదిరిగా ఎంతో గొప్పగా వుంటుంది. ఈ నేల ముందు నుంచి కూడా అనేక విప్లవ ఉద్యమాలకు నిలయంగా వుంది కాబట్టి సహజంగానే అనేక కుల, మతాలకు నిలయం. అస్తిత్వ పోరాటాలకు, నక్సల్బరీ ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటాలు మరియు ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఇక్కడి ప్రజల జీవన సరళిలో సామాజిక, సాంస్కృతిక, సాంఘిక చైతన్యం కనబడుతుంది. ఇక్కడి ప్రజలు నదీ తీరం వెంబడి తమ నివాసాలు ఏర్పర్చుకున్నారు. నాగరికత వికాసంలో ప్రధాన పాత్ర పోషించారు. ఈ ప్రాంతంలో జరిగిన రైతాంగ పోరాటాలు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు, నక్సల్బరీ ఉద్యమాల్లో ముందు వరుసలో నిలిచారు. ఆయా కాలాల్లో వచ్చిన ఉద్యమాలకు అనుగుణంగా ఇక్కడి ప్రజలు తమని తాము మలుచుకున్నారు.

**ఆచార సంప్రదాయాలు, పండుగలు**

పెద్దపల్లి జిల్లా ఆచార, సంప్రదాయాలకు, పండుగలకు పెట్టింది పేరు. పెద్దపల్లి ప్రాంతంలో మంథని మంత్ర పూరితంగా ప్రసిద్ధి పొందింది. ఆచార సంప్రదాయాలు, పండగలు, ఆధ్యాత్మికతకు నిలయం. వివిధ పండుగలు, నోములు, వ్రతాలు, ఆచారాలను ప్రజలు తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకొని ఆధ్యాత్మిక జీవనంలో ముందున్నారు. ప్రజలందరూ ఐక్యంగా ఒకచోట చేరి అనేక పండుగలు జరుపుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉగాది, తొలిఏకాదశి, వినాయకచవితి, దసరా, దీపావళి, సంక్రాంతి, శివరాత్రి, పొలాల అమావాస్య, బోనాలు, బతుకమ్మ, రాఖీ పౌర్ణమి, నాగులచవితి, వరలక్ష్మీవ్రతం, రంజాన్, క్రిస్మస్ లాంటి పండుగలు జరుపుకుంటారు.

**జిల్లా సాహిత్య చరిత్ర**

తెలుగు సాహిత్య చరిత్రలో పెద్దపల్లి జిల్లాకు ప్రత్యేక స్థానం వుంది. సాహిత్య చరిత్రకు ప్రధానమైనదిగా మంథనిలో లభించిన అనేక శాసనాల ద్వారా తెలుస్తుంది. ఉత్తర భారతదేశంలోని ప్రముఖ తీర్థ క్షేత్రమూ, శ్రాద్ధ స్థానమూ అయిన గయలో కాకతీయ ప్రతాపరుద్రుని పేరిట వున్న ఒక శాసనంలో నేడు 'మంథెన' గా పిలువబడుతున్న మంత్రకూటము గురించి ఒక ప్రస్తావన వుంది. ఇటువంటిదే మంథని ఒక శాసనం వుంది. గయా శాసనం మంత్రకూట శాసనం రెండూ 'శ్రీ' అనే అక్షరంతో ప్రారంభమయ్యాయి. గయాశాసనంలో 'శ్రీ మన్నిఖిల భూపాలమౌళి రత్నలస్పద' అని ప్రతాపరుద్రుని గురించి ప్రారంభమైతే, మంత్రకూట

శాసనము 'శ్రీ మంత్రకూట గోపీజన వల్లభాయనము' అని గోపాలకృష్ణుని గురించి ప్రారంభమౌతుంది. కుండ స్థానమైన ప్రణీతా సంగమ కుశాతర్పణ తీర్థమే తరువాత కాలంలో కాళేశ్వర ముక్తేశ్వర క్షేత్రమైంది అని తెలుపబడి ఉంది.

గయా శాసనము, మంథెన శాసనము, గంగాపుర శాసనము, అనుమకొండ శాసనం, సుందిళ్ళ శాసనము, కాళేశ్వర శాసనం, ఖమ్మంపల్లి శాసనాల ద్వారా పెద్దపల్లి జిల్లాకు సంబంధించిన సాహిత్యము గురించి తెలుస్తుంది.

మంత్రకూట శాసనంలో భువన త్రయము, పాతాళము, వార్షిజలము, స్వర్ణాద్రి, మహివలయము, అలకాపురము, ఓరుగల్లు, చేక్నూరు, తటాకము, నాగపురము (నాగారం), జనగామ, గుంజపడగ, లింగాల ఎడ్లపల్లి, కోటిపల్లి, రుద్రపురము, నడికుండ, సుందిళ్ళ, కందవరం, బల్లితకుంట అనే స్థలాలున్నాయి.

**సాహిత్యరంగ కవులు**

**గజానన్ తామన్ :** మంథనికి చెందిన సాహిత్యకారులలో **గజానన్ తామన్** గారిది ప్రత్యేక స్థానం. మరాఠా నేపథ్యం కలిగిన వీరు ఆదిలాబాదు జిల్లా బెల్లంపల్లి మండల చాకేపల్లి గ్రామానికి చెందినవారు. వీరు తెలుగు, హిందీ, మరాఠీ, ఆంగ్లం, ఉర్దూ, సంస్కృత భాషలలో నిష్ణాతులు. 'మానస సరోవరం (కవితాగేయ సంపుటి), సాకేత రామాయణం (గేయకావ్యం), మోర్దోపు దున్న' లాంటి రచనలు చేశారు. గట్టు నారాయణ గురూజీ రచించిన Offerings, Noble Leaders కు, కథాంజలి -1, కథాంజలి - 2, కథాంజలి -3, ఉదాత్తనేత, కఠోపనిషత్ పద్యానువాదం, పాబులో నెరూద కవితా అనువాదాలు చేశారు. లక్ష్మణమూర్తి రచించిన గోపికావల్లభా, అంపశయ్య నవీన్ రచించిన చీకటి రోజులు, సోమసుందర్ రాసిన ఆమ్రపర్ణి, జోస్యం విద్యాసాగర్ రచించిన అమ్మ లాంటి వాటికి సమీక్షా వ్యాసాలు రాశారు.

**గుండోజు శంకర్ :** సాహిత్య కళాపిపాసకుడు గుండోజు శంకర్ గారి జన్మస్థలం మంథని. వీరు ఉన్నత విద్యావంతులు. ఉద్యోగ రీత్యా మున్సిపల్ కమీషనర్‌గా పనిచేసారు. వీరు వ్యవహారిక భాషలో 'శ్రీ మంత్రపుర చరిత్ర' ను రచించారు. అలనాటి మంథని వాళ్ళ ఆచార, వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలు, అలవాట్లతో పాటు గౌతమీ నది గలగలలను చక్కగా వర్ణించారు. 'శ్రీ మంత్రపురి చరిత్ర, శీలేశ్వర - సిద్ధేశ్వర శతకం, సహచరి చరితవ్యం, సంక్రాంతి హేళ- సకినాల గోల' లాంటి రచనలు చేశారు.

**రావికంటి రామయ్య గుప్త :** సహజ కవిగా, మంత్రకూట వేమనగా ప్రసిద్ధి పొందారు. పామరులకు సైతం అర్థమయ్యే రీతిలో ఆశువుగా కవిత్వం చెప్పడం వీరి ప్రత్యేకత. 40 ఏళ్లు ఉపాధ్యాయునిగా సేవలందించిన వీరి రచనల్లో నిజాయితీ సాక్షాత్కరించే గొప్ప గుణం వుంటుంది. మాట్లాడినంత తేలికగా 'ఆటవెలది' పద్యాలను అల్లడం వీరి ప్రత్యేకత. నగ్న సత్యాలు (కావ్యం), వరద గోదావరి (ఉయ్యాల పాట), గీతామృతం (గేయకావ్యం), నల్లాల భాగోతం (సామాజిక గేయాలు), రామగుండం - రాత్రిగండం (సామాజిక గేయాలు) వీరు రచించారు.

**గట్టు నారాయణ గురూజీ :** వీరు మంథని వాస్తవ్యులు. బహుభాషా కోవిదులు. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లో డిగ్రీ, మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో స్నాతకోత్తర పదవీధరులు, గ్రంథపఠనాసక్తిలో 'రావు బహదూర్ దహగాం లక్ష్మీ నారాయణ గారితో పోల్చదగినవారు. వీరు నూటికి పైగా ఆంగ్లంలో, తెలుగులో గ్రంథాలు రాశారు. కొన్ని భారతీయ భాషల్లోకి అనువదితమైనది. వీరి రచనల్లో ముఖ్యంగా Noble Leader మరియు Offerings ను. చెప్పవల్సిందే. బౌద్ధుల పవిత్ర గ్రంథమైన 'దమ్మపదం'లోని 26 పర్యాయముల నుంచి ఒక గాథను తీసుకొని, దానికి తన వైదుష్య పూర్ణమనదగిన భాష్యాన్ని చేర్చి Noble Leader అనే గ్రంథాన్ని రూపొందించారు. Offerings అనే పేరుతో నాలుగు సంపుటాలుగా అనువదింపచేసి ప్రచురించారు. వీరు Gurudarshan అనే ఆంగ్ల గ్రంథాన్ని రచించారు. 2003 లో సీతారామ సేవాసదన్' ను స్థాపించారు.

**గీట్ల నారాయణ రెడ్డి :** మంథని మండలం నాగారం గ్రామ వాసి. ఉన్నత విద్యావంతులు. స్వభావతః ఉత్సాహ

పరుడు. విద్యార్థి దశలో 'విజిగీషువు' అనే కలం పేరుతో ఆయన రాసిన వ్యాసాలు వార్తా పత్రికల్లో పెనుసంచలనం సృష్టించాయి. వీరు ఎమ్మెల్సీగా పనిచేశారు. 'దుగ్ధగీత', 'జ్వాలా తోరణం', 'రక్తాశ్రుధారలు' వీరి రచనలు. వీరు పర్యావరణ పరిరక్షణ కోసం గోదావరిఖనిలో ఓ సంస్థను స్థాపించారు.

**కొల్లారం సీతారామ శర్మ :** మంథనిలో వేద పాఠశాలను, దీప నిర్వాణ గ్రంథ స్థితికి చేరుకున్న వేద విద్యను పునః ప్రజ్వలితం చేశారు. వీరు ఉభయ భాషా ప్రవీణులు. గీర్వాణ సాహితీ మధురిమను ఎందరో ఛాత్రులచే ఆస్వాదింపచేశారు. సంస్కృతంలో కొన్ని స్తోత్రాలు రాశారు. అవి అముద్రితం.

**గంగా రాజేశ్వరరావు :** ఈయన సాహిత్య సృజనకే యావజ్జీవితాన్ని అంకితం చేశారు. మంథనిలో గంగా తరంగిణి అనే సాహితీ సంస్థలను స్థాపించారు. రుక్మిణీ కల్యాణం, పార్వతీ విజయము, పరీక్షిచ్చరిత్రము, హనుమద్విజయము, గంగారూపకాలు వీరి రచనలు.

వీరే కాకుండా చయనం శాస్త్రిగారు, గుల్కోట రామశాస్త్రి గారు, గోస్వామి లింగన్న గారు, మేతేరాం రాజేశ్వర శాస్త్రి, నల్గొండ చంటయ్య గారు, సూర్యనారాయణ వదుత్కర్, మహావాది లక్ష్మణశాస్త్రి, వజ్జల రాజారాం శర్మ, ఘనకోట రాజేశ్వర శాస్త్రి మొదలగు వారు ముఖ్యులు.

మంథని గ్రామం చతుర్వేదాలకు నిలయం. ఇచటి వేద వేదాంగవేత్తలు, సారస్వతులు మహామంత్రకూట యశోగాథను ఆసేతు హిమాచలం పరివ్యాప్తం చేశారు. మంథని ప్రాచీన కవులలో ప్రథమగణ్యులు. ముద్దు బాలంభట్టు. డా. మలయశ్రీ గారి 'కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్య చరిత్ర'లో బాలంభట్టు గారి రచనలను గురించి వుంది.

**ముద్దు బాలంభట్టు :** జీవిత విశేషాలు పోతన జీవిత విశేషాలవలె మనకంతగా తెలియవు. ఈ కవి రెండు శతాబ్దాల పూర్వం వాడని కవిశేఖరం గంగా రాజేశ్వరరావు నిర్ధారిస్తే మూడు శతాబ్దాల క్రితం వాడని కొందరు అభిప్రాయపడ్డారు. మంథెన్న రామాయణం, శివపురాణం (యక్షగాన శైలి), మానస వీథి, పవిత్రమెందుకు యక్షగానాలలో హృదయ స్పర్శియైన కీర్తనలు రాశారు.

**గంగా లక్ష్మణకవి :** ఇరువదేండ్ల జీవనంలో సంస్కృతాంధ్రాల్లో ఎనలేని వైదుష్యం సముపార్జించారు. సురవరం ప్రతాపరెడ్డి గారి గోలకొండ కవుల సంచికలో వీరి రచలు కనిపిస్తాయి. రత్నకాంత నాటకము, కుచేల చరిత్రము, దండకారణ్య చరిత్రము, కృష్ణదేవరాయ చరిత్ర అనేవి వీరి కావ్యాలు.

**తిరువరంగం పాపయ్యశాస్త్రి :** వీరు సదాచార సంపన్నమైన శ్రీవైష్ణవ కుటుంబంలో జన్మించారు. అష్టావధాని. పురాణ ప్రవక్త. వీరి రచనలు గోలకొండ కవుల సంచికలో 'మంథెన్న ద్విజులు'గా ప్రచురితమైంది.

**వెంకట రాజన్న అవధాని :** బహుభాషా కోవిదులు. అవధాన విద్యలో అగ్రగణ్యులు. సహస్రావధాని జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి గారి అంతేవాసి. గోలకొండ, ఆంధ్రభూమి పత్రికలకు సహాయ సంపాదకులుగా పనిచేశారు. కాళోజీతో కలిసి 1950 లో 'వైతాళిక సమితిని' స్థాపించారు. అగ్నిశబ్ద మాహాత్మ్యం, లక్ష్మీశతకం, కుంభకర్ణ నిద్ర అనే కావ్యాలతో పాటు సురవరం గారి హిందువుల పండుగలు' గ్రంథంపై విమర్శనాత్మక సమీక్షలు చేశారు.

**బహద్దూర్ దహగాం లక్ష్మీనారాయణ :** గ్రంథ పఠనాసక్తి కలవారు. 1920 లో ఏ.పి. శాసనమండలి సభ్యునిగా ఎన్నికైనారు. ఆయన ఉపన్యాసాల సంపుటి ప్రచురితం చేశారు.

**అల్లం రాజయ్య :** వీరి రచనలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో, ధనవంతుల ఆగడాలను ప్రశ్నిస్తూ సమాజంలోని అస్పృశ్యత, పాలేర్ల సమస్యలపై అనేక రచనలు చేశారు. మొదట వీరు గాంధీ గారి ప్రభావంతో రచనలు చేశారు. వీరి మొదటి కథ శివసత్తి శక్తి. జమ్మికుంట కళాశాల మ్యాక్సిన్‌లో ప్రచురితమైంది. వీరు దాదాపుగా 100 కు పైగా కథలు రచించారు. మనిషిలోని విధ్వంస్వం, మహాదేవుని కళ అనే కథలకు బాగా పేరు వచ్చింది.వీటితో పాటు సృష్టి కర్తలు, కమల, అతడు, ప్రత్యర్థులు మొదలైన కథలు, కొలిమంటుకున్నది, ఊరు, అగ్నికణం, కొమురంభీం లాంటి నవలలు, నాగేటి సాలల్లో అనే నాటికను వీరు రాశారు.

**అల్లం వీరయ్య :** వీరు గేయ సాహిత్యంలో ప్రసిద్ధులు వీరు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేసి విశ్రాంతు లయ్యారు. వీరు అనేక సమస్యలపై గేయాలు రచించారు. 1976 లో వీరు రచించిన 'ఎర్రజెండ ఎరజ్రెండ ఎన్నీయల్లో పెను సంచలనమే సృష్టించింది.

**అల్లం నారాయణ :** మంథని మండలం గాజులపల్లె గ్రామానికి చెందిన అల్లం నారాయణ పలు ప్రక్రియలలో ప్రవేశం కలిగినవారు. జీవగడ్డ, ఆంధ్రజ్యోతి, ఆంధ్రా పొలిటిక్స్ డాట్‌కామ్, ప్రజాతంత్ర, నమస్తే తెలంగాణ వంటి పత్రికలలో ఉన్నత స్థానంలో పనిచేసినవారు. రచనలు జగిత్యాల పల్లె కవితా సంపుటి, యాది మనాది దీర్ఘ కవిత, ఎన్నెల కోనల్లో, అల్లకారం, లైఫ్‌లైన్, ప్రాణహిత కాలమ్స్, అయ్యంకాళి మొ॥న వాటిని వీరు వెలువరించారు.

**అల్లం వంశీ :** వీరయ్య గారి కుమారులు వీరు. వంశీ ఉన్నత విద్యావంతుడు. ప్రస్తుతం సీబీఐ అధికారిగా పంజాబ్‌లో పనిచేస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి కాకతీయ యూనివర్శిటీ జేఏసీ నాయకునిగా వున్నారు. వీరి కథల్లో ముఖ్యంగా ఏదో ఒక సమకాలీన సాంఘిక సమస్య చిత్రణ చేశాడు. మొలకలు, కలలో మనుషులు, సహచరి, జైలు అనే రచనలు చేశాడు.

**ఏలేశ్వరం వెంకటేశ్ :** గోదావరిఖనికి చెందిన వీరు ఉస్మానియాలో చదివారు. తెలంగాణ రచయితల వేదిక మరియు సాహితీ గౌతమి కరీంనగర్ ఉపాధ్యక్షులుగా పనిచేసారు. వీరు నమ్మకాలు వమ్మవుతోన్న చోట, అబద్ధాల కోరు, మనసారా ఇవ్వు, పిసినారి అనే రచనలు చేశారు. ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా రచయితల సమాఖ్య కన్వీనర్‌గా పనిచేస్తున్నారు.

**తల్లావజ్ఝల సదాశివుడు :** చేతన సాహితీ సాంస్కృతిక సమాఖ్య స్థాపించి వర్ధమాన రచయితలను ప్రోత్సహిస్తున్నారు. గొప్పకవి, రచయిత. "తాలాపున పారుతుంది గోదావరి... నీ చేను నీచెలక ఎడారి..." అనే పాట తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదింది. ఆయన రచనలు సైరన్ (కవితా సంకలనం), ఎర్రకుంకుమ (పాటల పుస్తకం).

**తుమ్మేటి రఘోత్తమరెడ్డి :** ఇతని రచనలు కార్మికుల జీవితంలోని లోతులని, దైన్యాన్ని, ఇక్కడి జీవిత సంక్షోభాన్ని, కుటుంబాల్లోని అంతర్వేదనను సజీవంగా చిత్రీకరించారు. ఇతని రచనలు కొన్ని ఇతర భాషల్లోకి అనువాదం అయ్యాయి. రచనలు చావువిందు, హంతకులు, పసిపిల్ల, శత్రువు జాడ, నల్లవజ్రం.

**పి.చంద్ :** సింగరేణి ఉద్యోగైన రచయిత పీ.చంద్ ఇక్కడి కార్మికుల జీవతాలను, భూనిర్వాసితులు అంతర్వేదనను, పల్లె బతుకులకు కళ్ళకు కట్టినట్లు చూపించారు. భూనిర్వాహితులు కథలు, నేను రాజ పోశవ్వను, శేషగిరి, పీ.ఎల్ వంటి ఎన్నో రచనలు వెలువరించారు.

ఆధునిక యువ కవులు సందర్భోచితంగా కవితలు, గేయాలు, పాటలు రాస్తున్నారు. రచయితలు అందె సదానందం, వజ్జల శివకుమార్, అల్లెంకి లచ్చయ్య, పిట్టల రాజేందర్, రామశంకర్, మొగురం గట్టయ్య, జాకబ్, స్వామి, లక్ష్మీనారాయణ, వేల్పుల నారాయణ, గొసిగంటి రాజలింగం, దయానర్సింగ్, మధుప్రియ, ఏటరవి, ఢిల్లీ వెంకటస్వామి, కాసిపేట సంతోష్, ఆనంద్, యాకుబ్, వేల్పుల కుమార్, కావేటి సతీష్ కుమార్, మాచీడి సంతోష్‌కుమార్ మొదలగువారు.

## సాహితీ సంస్థలు

ఈ జిల్లాలో సాహిత్య వికాసం కోసం అనేక సాహితీ సంస్థలు పనిచేస్తున్నాయి. '**గంగాతరంగిణి**' స్థాపకాధ్యక్షులు గంగా రాజేశ్వరరావు. **సీతారామ సేవ సదన్** గట్టునారాయణ గురూజీ దీనిని 2003లో స్థాపించి, కొనసాగిస్తున్నారు. **ఉదయ సాహితి** దీనిని 1983లో స్థాపించారు. **చేతన సాహితీ సాంస్కృతిక సంస్థ** అధ్యక్షులు మల్లావజ్జల సదాశివుడు. **చైతన్య సాహిత్య సంస్థ** వజ్జల శివకుమార్ ఆధ్వర్యంలో ముందుకు సాగుతున్నది. **స్నేహ సాహితీ సంస్థ** ఈ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఏలేశ్వరం వెంకటేష్ 1998 సం॥లో స్థాపించి అందరి మన్నలు పొందేటట్లు నడిపుతున్నారు. **తెలంగాణ కళానాట్యమండలి** ఏట రవి స్థాపించి నడుపుతున్నారు.

## వివిధ రంగాల ప్రముఖులు

**పి.వి. నరసింహారావు :** దేశ ప్రధానిగా చేసిన వీరి జన్మస్థలం వంగర. పూర్వ కరీంనగర్, ప్రస్తుత వరంగల్ అయినా కూడా అతను మంథని నుంచి రాజకీయ జీవితం ప్రారంభించారు.

**జి.వెంకటస్వామి :** కేంద్ర కార్మిక మంత్రిగా పనిచేసిన వీరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు. పెద్దపల్లి పార్లమెంటు నియోజక వర్గం నుంచి నాలుగు సార్లు ఎంపీగా గెలుపొంది, కేంద్ర కార్మిక మంత్రిగా పనిచేసారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీలో అత్యున్నత విధాన నిర్ణయక మండలి అయిన సీడబ్ల్యూసీలో సభ్యునిగా కూడా వున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రస్తుత తెలంగాణ నుంచి కాంగ్రెస్ అధిష్ఠానానికి చాలా దగ్గరి వ్యక్తిగా చెలామణి అయ్యాడు. వీరిని అందరూ ముద్దుగా 'కాకా' అని పిలిచుకునేవారు. వీరికి ఇద్దరు కుమారులు. ఒకరు జి. వినోద్ (మాజీ మంత్రి), జి. వివేక్ (మాజీ ఎంపీ)

**శ్రీపాదరావు :** ఆంధ్రప్రదేశ్ శాసనసభా స్పీకర్‌గా పనిచేసారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బ్రాహ్మణ వర్గానికి గట్టి అండగా వుంటూ, ఆ వర్గానికి ప్రాతినిధ్యం వహించారు. వీరు మంథనికి చెందిన సీనియర్ నాయకులు. వీరి కుమారుడే మాజీమంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు.

**గేట్ల జనార్దనరెడ్డి :** వీరు మంథని మండలం నాగారం గ్రామవాసి. గతంలో ఎమ్మెల్సీగా పనిచేశారు.

**జి. వివేకానంద్ :** పెద్దపల్లి ఎంపీగా పనిచేశారు. ప్రస్తుతం వీరు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా కొనసాగు తున్నారు. దీనితోపాటు హైదరాబాదు క్రికెట్ అసోసియేషన్‌కు అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో నడుస్తోన్న V6 ఛానల్ ఉద్యమ సమయంలో కీలకపాత్ర పోషించిన విషయం జగద్విదితమే.

పెద్దపల్లి జిల్లా నుంచి పుట్టమధు, గీట్ల ముకుందరెడ్డి, బిరుదు రాయమల్లు, చందుపట్ల రాంరెడ్డి, కొప్పుల ఈశ్వర్, సోమారపు సత్యనారాయణ, దాసరి మనోహర రెడ్డి, భానుప్రసాద్, శ్రీధర్‌బాబు, చందుపట్ల సునీల్‌రెడ్డి, కోరుకంటి చందర్, మక్కాన్‌సింగ్ ఠాకూర్ తదితరులు జిల్లా రాజకీయ యవనికపై కీలకపాత్ర పోషిస్తున్నారు.

పెద్దపల్లి జిల్లా ఉద్యమాల గడ్డగా పేరుగాంచింది. సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలతో పాటు విప్లవ ఉద్యమాలకు నిలయం. ఇక్కడి నుంచి నక్సల్బరీ ఉద్యమ, కేంద్ర, రాష్ట్ర కమిటీలో పనిచేసి, అమరులైన వ్యక్తులున్నారు. మల్లోజుల కోటేశ్వర్ రావు (కిషన్‌జీ), బుర్ర చిన్నయ్య (మాధవ్), వడ్కాపూర్ చంద్రమౌళి, సందె రాజమౌళి, మల్లోజుల వేణుగోపాలరావు, రాజలింగం వంటి వారెందరో ఉద్యమాలలో వున్నారు. సామాజికంగా అంబేద్కర్ సంఘాలు ఎంతో చైతన్యం కల్పించాయి. ఈ ప్రాంతం నుంచి మిమిక్రి శివారెడ్డి, యాంకర్ ఉదయభాను, తాగుబోతు రమేష్ వంటి బుల్లితెర కళాకారులు ఉన్నారు. పాత్రికేయ రంగంలో ప్రెస్ అకాడమీ చైర్మెన్‌గా నియమితులైన అల్లం నారాయణ, తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని ప్రతి రోజూ ఉదయం 'నమస్తే తెలంగాణ' పేపరుతో తెలంగాణ పాత్రికేయ రంగంలో విజృంభించిన చిల్లప్పగారి లక్ష్మీరాజం (సి.ఎల్.రాజం) మంథనికి చెందినవారే.

## దర్శనీయ ప్రదేశాలు

పెద్దపల్లి జిల్లాలోని అనేక ప్రాంతాలు పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయి. కట్టడాలు, దేవాలయాలు, నదీతీర ప్రాంతాలు ప్రత్యేకతను చాటుతున్నాయి.

**శ్రీరామగిరి ఖిల్లా :** ఇది కొత్తగా ఏర్పడిన రామగిరి మండలంలోని బేగంపేట నుంచి కల్వచర్ల వరకు దక్షిణమున సరిహద్దు వలె, పర్వతం వలె ఉండి శతృదుర్భేద్యంగా విస్తరించి ఉంది. బీటలు వారని కోటలు. శత్రుదుర్భేద్యమైన కోటగోడలు, బురుజులు, ఫిరంగులు వంటి అద్భుతమైన శిల్పకళ కలదు. ఈ ఖిల్లాలో అనేక దివ్యౌషధములున్నాయి. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో శని, సోమవారంలో భక్తులు పెద్దఎత్తున ఈ ఖిల్లాను సందర్శిస్తారు. గిరికి రామగిరి అని పేరు రావడానికి రాముడు వనవాసము చేయునపుడు ఈ పర్వతం మీద ఉండడం వల్ల రామగిరి అన్ని పేరు వచ్చింది.

**ఎల్ (లంజ) మడుగు :** ఇది మంథని మండలం ఖాన్‌శాయిపేట గ్రామంలో గోదావరి నదిలో కలదు. ఇది రెండు పర్వతాల మధ్య భాగంలో గోదావరి మలుపులో కలదు. ఇది చాలా లోతుగా వుంటుంది.

**ధూళికట్ట :** ఇది పెద్దపల్లి జిల్లా కేంద్రానికి 15 కి.మీ. దూరంలో వుంది. ఇక్కడ బౌద్ధ స్థూపం ఉండటం ప్రత్యేకత. బౌద్ధం విలసిల్లిన కాలంలో ఇచట బౌద్ధ స్థూపం, ఆరామాలు వుండేవి. ఇవి 2 వ శతాబ్దికి చెందినవి. దాదాపు 30 వరకు గోడలు వున్నాయి.

**సబ్బితం జలపాతం :** ఇది పెద్దపల్లి జిల్లా కేంద్రం నుంచి 10 కి.మీ. దూరంలో వుంది. కొండ పైనుంచి జాలువారే నీటితో పర్యాటకులను ఎంతగానో ఆకట్టు కుంటుంది. చుట్టుపక్క ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తారు.

**ఎల్లంపల్లి ప్రాజెక్టు :** ఇది రామగుండం సమీపంలో నిర్మించిన బహుళ నీటిపారుదల ప్రాజెక్టు. దీనికి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అనే పేరు పెట్టారు. ఇది దాదాపు 36,000 ఎకరాలకు సాగునీటిని అందిస్తుంది. అంతేకాకుండా పర్యాటక కేంద్రంగా పేరు గాంచింది.

**ఆదివరాహ స్వామి దేవాలయం :** ఇది కమాన్‌పూర్ మండల కేంద్రంలో కలదు. ఇచట ఆది వరాహ స్వామి కొలువై వుండట ప్రత్యేకత. ఆలయ నిర్మాణం ప్రత్యేక శైలిని కలిగి వుంటుంది.

**రాముని గుండాలు :** ఇది రామగుండం మండల కేంద్రానికి సమీపంలో వుంటుంది. ఇచట కొండపైన నుంచి నీరు కారుతూ వుండి గుండాల రూపంలో దర్శనం ఇస్తుంది.

**గౌరీగుండాలు :** ఇదిపెద్దపల్లి మండల కేంద్రానికి సమీపాన ఉన్న ఈ జలపాతం పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంది.

**జిల్లా ముఖ్య దేవాలయాలు**

**ఓదెల మల్లికార్జున స్వామి దేవాలయం :** పెద్దపల్లి రెవిన్యూ డివిజన్‌లోని ఓదెల మండల కేంద్రంలో వెలిసిన దేవాలయం. ఇక్కడ ఒగ్గు సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించి పంచ ముగ్గులతో పట్నాలు వేసి బోనాలు సమర్పిస్తారు. ప్రతి సంవత్సరం ఉగాది నాడు స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు.

**శ్రీ దత్తాత్రేయస్వామి ఆలయం :** ఈ ఆలయం మంథనిలో కలదు. పురాతనమైన ఆలయం. ఈ ఆలయాన్ని మంథని మహా మహిళ, ఆదర్శ సేవా యోగిని కొల్లారపు రాధమ్మ గారు ప్రజల సహకారంతో, నిజాం ప్రభువుల ప్రధాని సర్ కిషన్ ప్రసాద్ బహదూర్ గారు మరియు గద్వాల సంస్థాన మహారాణి గార్ల సహాయంతో నిర్మించారు. ఈ ఆలయంలో దత్తాత్రేయ స్వామితో పాటు రాధాకృష్ణుల మూర్తులు కలవు.

**శ్రీ మహాలక్ష్మి దేవాలయం :** ప్రఖ్యాతి గాంచిన మంథని మహాలక్ష్మి ఆలయాన్ని సుమారు ఐదు శతాబ్దాల క్రితం దుద్దిళ్ల రాజం శర్మ గారు నిర్మాణం చేశారు. ఈ దేవాలయము మంథని ప్రజల ఇలవేల్పుగా పేరు గాంచింది.

**గౌతమేశ్వర ఆలయం :** మంథని గోదావరి తీరాన అత్యంత ప్రసిద్ధి చెందిన పురాతన దేవాలయం. సాక్షాత్తూ గౌతమ ముని ఇక్కడ తపస్సు చేసినట్టు ఇక్కడి చరిత్రను బట్టి తెలుస్తోంది. అనేక మంది మునులకు ఇది తపస్సు కేంద్రంగా ఉండేదని చరిత్రకారుల అభిప్రాయం.

**శీలేశ్వర - సిద్దేశ్వరాలయం :** ఈ ఆలయం అత్యంత పురాతనమైనదిగా చెప్పవచ్చు. కాకతీయ రాజైన రెండవ ప్రోలరాజు గుండరాజును జయించుటలో రేచర్ల కామసేనానితో పాటు మరో ఇద్దరు సేనా నాయకులు తోడ్పడినారు. ఆ ఇద్దరు సేనానాయకులే శీలప్ప మరియు సిద్ధప్పలు. వీరు తమ విజయమునకు స్మృతి చిహ్నంగా అద్భుతమైన శీలేశ్వర సిద్దేశ్వర ఆలయాన్ని మంథని పట్టణం మధ్యలో కట్టించారు. కాకతీయ వాస్తు శిల్ప నిర్మాణ శైలిని ఈ ఆలయ నిర్మాణంలో మనం గమనించవచ్చు.

**లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం:** మంథనిలో ఇది ప్రసిద్ధ దేవాలయం. పూర్వం జమ్మికుంట వీణవంక మండలంలో లక్ష్మీనారాయణ దేవాలయం వుండేది. ఒకనాడు

అక్కడ నిద్రిస్తున్న మంథనికి చెందిన వ్యక్తి కలలోకి వచ్చి తనని మంథనిలోని దేవాలయమునకు తీసుకెళ్ళమనగా, వారు తీసుకొని వచ్చి గోవిందరాజుల దేవాలయంలో ప్రతిష్ఠించినారు. అప్పటి నుంచి లక్ష్మీనారాయణ స్వామి, గోవింద రాజుల విగ్రహాలు ఈ దేవాలయంలో వున్నాయి.

**భిక్షేశ్వరాలయం :** మంథనిలో వెలసిన దేవాలయంలో విశిష్టమైనది భిక్షేశ్వరాలయం. శివుడినే భిక్షేశ్వరుడిగా పిలువబడటం ఇక్కడి ప్రత్యేకత. ఇందులో రెండు శివలింగాలు వున్నాయి. గర్భ గుడిలో వుండే శివలింగాన్ని భిక్షేశ్వరునిగా పిలుస్తారు. ఈ శివలింగం పడమర వైపు చూచుట మరో ప్రత్యేకమైన అంశం. గర్భగుడి బయట వుండే శివాలయాన్ని దక్షిణామూర్తిగా పిలుస్తారు.

**వినాయక దేవాలయం :** మంథనిలోని ఈ దేవాలయం విశిష్టమైంది. వివిధ దేవాలయాల్లో వినాయకుడు ఒక్కడే వున్న విగ్రహం వుంటుంది. కాని ఇందులో వినాయకుడు తన ఇద్దరు భార్యలైన సిద్ధి, బుద్ధి విగ్రహాలతో వుంటాడు. ఇదీ ఇక్కడి ప్రత్యేకత.

**బలవీర హనుమాన్ దేవాలయం :** మంథనిలోని బోయినిపేట గొల్లగూడెం ప్రాంతంలో వెలిసిన ఈ దేవాలయం ప్రాచీన చరిత్ర కలది. శ్రీరాముడు వనవాస సమయాన రామగిరి ప్రాంతం నుంచి బయలుదేరగా హనుమంతుడు మంథని ప్రాంతంలో వెలిసినట్టు చెబుతారు. ఈ ఆలయమును దర్శిస్తే సకల భయాలు పోతాయని ప్రతీతి.

**మంత్రపురి కాళింగదేవి :** మంథని బోయినిపేట ప్రాంతంలో వెలసిన దేవాలయం కాళింగదేవి. బొక్కలవాగు ఒడ్డున వుంది. ప్రతీ పన్నెండు సంవత్సరాలకొకసారి గోదావరి నీరు వచ్చి కాళింగదేవి పాదాలు కడిగిపోవునని నానుడి.

**సుందిళ్ల నరసింహ స్వామి ఆలయం :** కమాన్‌పూర్ మండలం సుందిళ్ళ గ్రామంలో వెలసిన పురాతన దేవాలయం. దాదాపు 1197 ప్రాంతంలో ఈ ఆలయం నిర్మించినట్లు సుందిళ్ల శాసనము ద్వారా తెలుస్తోంది. ఇక్కడ సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా జరగడం ఈ ఆలయ ప్రత్యేకతల్లో ఒకటి.

**చెన్న పర్వతాల మల్లన్న దేవాలయం :** మంథని భగత్‌నగర్ దొంతులవాడలో ఈ మధ్య వెలికితీసిన 13 వ శతాబ్దికి చెందిన పురాతనమైన విగ్రహం చెన్నపర్వతాల మల్లన్న. పూర్వం దేవతలకు, రాక్షసులకు యుద్ధం జరిగినపుడు శివునికి చెమట వస్తే పర్వతంపై కొట్టగా పర్వతం నుంచి పుట్టిన మల్లన్నగా పేర్కొంటారు. ఈ విగ్రహం వీరభద్రుని అవతారంలో వుంటుంది.

ఇవేకాకుండా కమాన్‌పూర్ మండలంలోని జూలపల్లి గ్రామంలో ప్రసిద్ధ పర్వతాల మల్లన్న దేవాలయం కలదు. మంథని మండలంలో సిరిపురం, గుంజపడుగు గ్రామాల మధ్యవెలిసిన మిట్ట మల్లికార్జున స్వామి దేవాలయం గలదు. గాజులపల్లి, మైదుపల్లి, పెద్దమ్మ తల్లి దేవాలయాలు ముఖ్యమైనవి.

ఒకనాటి ముఖ్యమైన సంస్థానంగా వెలుగొందిన ఈ ప్రదేశంలో ఎన్నో పెద్ద పరిశ్రమలున్నాయి. గోదావరి జలాలు అధికంగా అందుబాటులో ఉన్న ప్రదేశమిది. నల్లబంగారం నిధులున్న ప్రదేశమిది. కవి పండిత నిలయమైన ఈ ప్రదేశం అభివృద్ధి పథాన ప్రయాణిస్తుంది.

# భద్రాద్రి - కొత్తగూడెం

భద్రగిరీశు పాదములు భద్రత గూర్చగ నెల్లవేళలన్
ముద్రిత రామభద్రమయి మోహన మూర్తుల పర్ణశాలలో
నద్రి సమాన పుణ్యముల నానుచు గౌతమి పారుచుండగా
సద్రుచి దీప్తమై వెలుగు సారస భూతలి కొత్తగూడెమే!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణా రాష్ట్రంలో అత్యధికంగా గిరిజనులు నివసించుచున్న జిల్లాలో రెండవది. మొదటిది మహబూబాబాద్ జిల్లా. దక్షిణ అయోధ్య అని పేరొందిన భద్రాచలం ఈ జిల్లాలో రెండవ పెద్ద పట్టణం. మొదటిది జిల్లా ప్రధానకేంద్రం కొత్తగూడెం పట్టణం.

## ఈ పేరెందుకు?

గోదావరీ తీరాన ఉన్న ప్రసిద్ధ శ్రీరామ పుణ్యక్షేత్రమైన భద్రాచలం పేరు మీద ఈ కొత్త జిల్లా ఏర్పడింది. దీని ముఖ్య ప్రదేశం అంతా కొత్తగూడెం పరిసర ప్రాంతాల్లో ఉండడం వల్ల ఈ జిల్లాకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాగా నామకరణం జరిగింది. దైవాన్ని నిరంతరం తలచుకునే భారతీయ జీవన సంప్రదాయానికి ఈ జిల్లా పేరు కూడా గొప్పగా సహకరిస్తుంది.

## భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణా రాష్ట్రంలో తూర్పుప్రాంతానికి చెందినది. జిల్లా పునర్విభజన జరుగక ముందు ఇది ఖమ్మం జిల్లాలోని భాగంగా ఉండేది. ఈ జిల్లాలో మొత్తం 23 మండలాలు ఉన్నాయి. ఈ జిల్లాకు ఉత్తరం మరియు ఈశాన్యదిశగా ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రానికి చెందిన బీజాపూర్ మరియు సుక్మా జిల్లాలు ఉన్నాయి. తూర్పున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన తూర్పుగోదావరి జిల్లా కలదు. దక్షిణము మరియు ఆగ్నేయం దిక్కున ఖమ్మం జిల్లా మరియు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పశ్చిమగోదావరి జిల్లాలు ఉన్నాయి. పడమర మహబూబాబాద్ జిల్లా మరియు వాయవ్యమున జయశంకర్ జిల్లాలు కలవు. తెలంగాణా రాష్ట్రంలో బాసరలో గోదావరి ప్రవేశించి భద్రాచలం వరకు ప్రవహిస్తుంది. అటవీ సంపద, అపార ఖనిజసంపద ఉన్న జిల్లా భద్రాద్రి కొత్తగూడెం.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విస్తీర్ణం 8951చదరపు కిలోమీటర్లు. పినపాక, అశ్వారావు పేట, కొత్తగూడెం, భద్రాచలం మరియు ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గా లున్నాయి. వెలుగులు విరజిమ్మే సింగరేణి సంస్థ యొక్క ప్రధాన కార్యాలయం కొత్తగూడెంలో ఉన్నది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 2016 అక్టోబర్ 11న ఏర్పడింది.

## సహజ వనరులు

**నేలలు :** అపారమైన అటవీ సంపద, ఖనిజసంపద ఈ జిల్లాలో కలదు. ఈ జిల్లా ఏర్పడిన తర్వాత ప్రభుత్వ కార్యాలయాల కొరకు 120 ఎకరాలను కేటాయించడం జరిగింది. ఈ జిల్లాలో 4.6 లక్షల హెక్టార్ల భూమిలో అటవీ సంపద ఉన్నది. ఈ ప్రాంతం దండకారణ్యానికి చెందినది అని చరిత్రకారుల అభిప్రాయం. 3.33 లక్షల ఎకరాల వ్యవసాయ భూమిలో వరి, ప్రత్తి మొదలైన పంటలతో సస్యశ్యామలంగా పైరుపచ్చలతో విలసిల్లుతున్నది.

**అడవులు :** ఈ జిల్లాలో పాల్వంచ మరియు భద్రాచలం నార్త్ డివిజన్‌లో అపారమైన అటవీ సంపద

## రెవెన్యూ డివిజన్లు - మండలాలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు రెవిన్యూ డివిజన్‌లు ఉన్నాయి అవి (1) కొత్తగూడెం రెవిన్యూ డివిజన్ (2) భద్రాచలం రెవిన్యూ డివిజన్.

జిల్లాలో మొత్తం 24 మండలాలు ఉన్నాయి. వీటిలో ఎక్కువ ఏజన్సీ మండలాలు ఉన్నాయి. గిరిజనులైన కోయ, కొండరెడ్డి, లంబాడీ మొదలైన గిరిజన జాతులు నివసి స్తుంటారు. కొత్తగూడెం రెవిన్యూ డివిజన్‌లో 15 మండలాలు, భద్రాచలం రెవిన్యూ డివిజన్‌లో 9 మండలాలు ఉన్నాయి.

**కొత్తగూడెం రెవిన్యూ డివిజన్‌లోని మండలాలు:** 1) అశ్వారావుపేట 2) చంద్రుగొండ 3) దమ్మపేట 4) గుండా 5) కొత్తగూడెం 6) ముకపల్లి 7) పాల్వంచ 8) టేకుపల్లి 9) ఇల్లెందు 10) సుజాతనగర్ 11) చుంచుపల్లి 12) లక్ష్మీదేవిపల్లి 13) ఆళ్ళపల్లి 14) అన్నపురెడ్డిపల్లి 15) జూరుపాడు

**భద్రాచలం రెవిన్యూ డివిజన్‌లోని మండలాలు :** 1) అశ్వాపురం 2) భద్రాచలం 3) బూర్గంపాడు 4) చర్ల 5) దుమ్ముగూడెం 7) పినపాక 8) కరకగూడెం 9) మణుగూరు

ఉన్నది. కిన్నెరసాని, అటవీశాఖ ఈ ప్రాంతంలో అడవులను సంరక్షిస్తున్నది. కిన్నెరసాని వన్యసంరక్షణ ప్రాంతం సుమారు 634 ఎకరాలలో ఉన్నది.ఈ ప్రాంతంలోని అడవులలో ఎక్కువగా గిరిజనులు నివసిస్తుంటారు. కోయ, కొండరెడ్డి, లంబాడీ తెగవారు వ్యవసాయం వృత్తిగా జీవిస్తుంటారు. గుండా, పినపాక, పాల్వంచ, ఇల్లెందు, భద్రాచలం, దుమ్మగూడెం ప్రాంతాలలో అడవులు ఎక్కువగా ఉన్నాయి. అడవులోని కొన్ని ప్రాంతాలలో పులులు, చిరుతపులులు, అడవి పందులు, దుప్పులు, నెమళ్ళు వంటి జంతువులు, వివిధరకాల పక్షులు నివసిస్తుంటాయి. కొంతమంది గిరిజనులు పండ్లు, తేనె, ఇప్పపువ్వు, జిగురు మొదలైన వాటిని సేకరించి ఉపాధి పొందుతున్నారు.

**నదులు :** ప్రధానంగా ఈ జిల్లాలో దక్షిణ గంగగా పేరొందిన పవిత్ర గోదావరీ నది ప్రవహిస్తున్నది. మణుగూరు భారజల కర్మాగారం గోదావరి నీటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధిస్తున్నది. గోదావరి నదికి ఉపనదులుగా కిన్నెరసాని, తాలిపేరు, పమ్మిలేరు మొదలైనవి ప్రవహించి వ్యవసాయ రంగంలో అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. "కిన్నెరసాని" అందాన్ని వర్ణిస్తూ మొదటి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథవారు, 'కిన్నెరసాని పాటలు' అనే పుస్తకాన్ని వ్రాశారు. గోదావరీనది, భద్రాచలం సీతారాముల వారి ఆలయాన్ని చుట్టి ప్రవహిస్తున్న తీరు ఎంతో రమణీయంగా ఉంటుంది.

**చెరువులు - ప్రాజెక్టులు :** ఇటీవల తెలంగాణాలో చెరువుల పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా మిషన్ కాకతీయ క్రింద కొన్ని కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఎన్నో చెరువుల పునరుద్ధరణకు కృషిచేస్తున్నారు. సుజాతనగర్ లోని సింగభూపాలం చెరువును పునరుద్ధరిస్తున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 3.33 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. చంద్రుగొండ, జూరుపాడు, టేకుపల్లి మొదలైన చిన్న నీటిపారుదల ప్రాజెక్టులున్నాయి. ఆయా ప్రాంతాలలో వరి, ప్రత్తి, ఎక్కువగా పండిస్తున్నారు. దుమ్ముగూడెంలో సీతారామప్రాజెక్టు పనులు చురుకుగా సాగుతున్నాయి. అశ్వారావుపేటలో గుమ్మడివల్లి వద్ద పెద్దవాగు ప్రాజెక్టు ఆ ప్రాంత రైతులకు నీటి సదుపాయాన్ని కలుగ జేస్తోంది. గోదావరికి ఉపనది అయిన పెద్దవాగుపై ఈ ప్రాజెక్టును 1987లో నిర్మించారు. ఈ ప్రాజెక్టు 4500 ఎకరాలకు నీరు అందిస్తున్నది.

తాలిపేరు ప్రాజెక్టును గోదావరికి ఉపనది తాలిపేరుపై 'చర్ల' గ్రామం వద్ద నిర్మించారు. ఈ ప్రాజెక్టు సుమారు 24000 ఎకరాలకు నీటి సౌకర్యం కలిగిస్తున్నది.

గోదావరికి ఉపనది అయిన కిన్నెరసానిపై కిన్నెరసాని ప్రాజెక్టు ద్వారా సుమారు 10000 ఎకరాలకు నీటిని అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**జనాభా :** 2011 జనాభా లెక్కల ప్రకారము 10,69,261 మంది జనాభా నివసిస్తున్నారు. వీరిలో పురుషులు 5,32,390 కాగా, స్త్రీలు 5,36,871 మంది. లింగ నిష్పత్తి 1000 : 1008. జనసాంద్రత 143/కి.మీ. జిల్లాలో రెండు రెవిన్యూ డివిజన్లు ఉన్నాయి. అవి కొత్తగూడెం మరియు భద్రాచలం. జిల్లాలో మొత్తం 449 గ్రామా లున్నాయి.

**అక్షరాస్యత :** జిల్లా మొత్తం అక్షరాస్యత 66.04 శాతం కాగా, పురుషులు 73.56 శాతం. స్త్రీలు 59.33 శాతం.

## జిల్లా చరిత్ర

దక్షిణ భారతదేశంలో ఓరుగల్లును రాజధానిగా చేసుకొని కాకతీయులు 13 వ శతాబ్దంలో పాలించారు. తెలంగాణాలోని భద్రాచల ప్రాంతం కూడా వారి అధీనంలోనే వుండేది. ఇప్పటికీ ఈ ప్రాంతంలో కాకతీయుల కాలం నాటి శాసనాలున్నాయి. ఈ ప్రాంతంలో ఎన్నో శివాలయాలను కాకతీయులు నిర్మించారు. రుద్రమదేవి, ప్రతాపరుద్రుడు -2 కాలంలో కాకతీయుల సామ్రాజ్యం భద్రాద్రి ప్రాంతం మరియు ఆంధ్రలో కొంత ప్రాంతం వరకు విస్తరించింది. కాకతీయులు ఈ ప్రాంతంలో ఎన్నో చెరువులను నిర్మించి వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషిచేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జిల్లా పునర్విభజన జరుగక ముందు ఖమ్మం జిల్లాలోని ఒక భాగంగా ఉండేది. ఈ ప్రాంతంలో పరిశ్రమలు, అపార ఖనిజసంపద, భద్రాచలం వంటి పుణ్యక్షేత్రాలు, అడవులు మొదలైనవి ఉన్నాయి. ఇవి గతంలో ఖమ్మం జిల్లా అభివృద్ధిలో ప్రధానపాత్ర వహించాయి. పురావస్తు ప్రాముఖ్యత కలిగిన గుండా వంటి ప్రదేశాలు కూడా ఉన్నాయి. స్వాతంత్రోద్యమ కాలంలో బ్రిటీషువారిని ఎదిరించి, పోరాడిన వారెందరో ఈ జిల్లాలో ఉన్నారు. దుమ్మగూడెంలో సోమరాజు పురుషోత్తమ దాసు అనే దేశభక్తుడు 'స్వరాజ్య రథం' అనే పుస్తకాన్ని వ్రాశాడు. దానిని బ్రిటీషువారు నిషేధించి ఆయనను అరెస్టు చేశారు. తదుపరి ఆయన రంగూన్ పారిపోయి "రంగూన్ రౌడీ" అనే నాటకాన్ని వ్రాశాడు. అప్పట్లో అది ఒక ప్రసిద్ధిపొందిన నాటకం. నైజాం నవాబును ఎదిరించి పోరాడిన నాయకునిగా చర్లకోటకు చెందిన మత్స్యమేదినీ రాయుని గురించి ఆ ప్రాంతం వారు వివరిస్తారు. ఒకప్పుడు భద్రాచలం పార్లమెంటరీ స్థానంగా కూడా ఉండేది. ప్రస్తుతం అసెంబ్లీ స్థానంగా ఉన్నది. ప్రస్తుత యం.యల్.ఎ., శ్రీ సున్నం రాజయ్య గారు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నారు. ఎంతోమంది నిస్వార్థపరులైన నాయకులు ఈ జిల్లా అభివృద్ధికి కృషిచేయడం జరిగింది.

**మున్సిపల్ కార్పొరేషన్ :** కొత్తగూడెం

**నగర పాలక సంస్థలు :** కొత్తగూడెం, ఇల్లందు, పాల్వంచ, మణుగూరు

**రెవెన్యూ గ్రామాలు :** 377

**గ్రామపంచాయితీలు :** 205

**పోలీస్ హెడ్‌క్వార్టర్స్ :** కొత్తగూడెం

**పార్లమెంట్ నియోజకవర్గం :** భద్రాచలం

**అసెంబ్లీ నియోజకవర్గాలు :** కొత్తగూడెం, అశ్వారావుపేట, భద్రాచలం, ఇల్లందు, పినపాక.

**పట్టణాలు :** కొత్తగూడెం, భద్రాచలం

ఇల్లందు, బూర్గంపాడు, పాల్వంచ ప్రాంతాలు 1959లో వరంగల్ జిల్లా నుండి ఖమ్మం జిల్లాకు చేర్చబడ్డాయి. ప్రస్తుతం ఇవి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్నాయి. భద్రాచలం, మణుగూరు, వెంకటాపురం ప్రాంతాలు తూర్పుగోదావరి జిల్లా నుండి ఖమ్మం జిల్లాలోకి వచ్చాయి. ప్రస్తుతం వెంకటాపురం భూపాలపల్లి జిల్లాలో చేర్చబడింది.

## సంస్కృతి

**ఆచారాలు, సంప్రదాయాలు, పండుగలు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎక్కువశాతం గిరిజనులే నివసిస్తుంటారు. పూర్వం పోడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. ఇప్పుడు మాత్రం ఒకచోట స్థిరనివాసం ఏర్పరచుకొని వ్యవసాయం చేస్తున్నారు. చాలామంది గిరిజనులు అడవులపైననే ఆధారపడి జీవిస్తున్నారు. కొందరు మాత్రం విద్యను అభ్యసించి ప్రభుత్వ ఉద్యోగులుగా,

వ్యాపారులుగా జీవిస్తున్నారు. నాణ్యమైన జీవనాన్ని కొనసాగిస్తున్నారు. కోయ, కొండరెడ్డి, లంబాడీ జాతులవారు నివసిస్తున్నారు. వీరి భాషకు లిపి ఉండదు. కానీ ఆ భాషంటే వారికి గౌరవం. ఆ భాషలోనే పాటలు పాడుతూ నృత్యాలు చేస్తారు. ముత్యాలమ్మ, సమ్మక్క సారక్క మొదలైన దేవతలను పూజిస్తారు. సమస్యలుంటే సాధ్యమైనంత వరకు పెద్దల తీర్పును శిరసా వహిస్తారు. వ్యవసాయంలో ప్రస్తుతం అధునాతన పద్ధతులతో, ఆధునిక యంత్రాలతో ఎక్కువ పంటలు పండిస్తున్నారు. భద్రాచలంలో వీరికోసం ప్రత్యేకంగా సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఎ.)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ సంస్థ గిరిజనులకు ఉచిత విద్య, ఉచిత వైద్యం అందిస్తూ వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతూ విశిష్ట సేవలను అందిస్తున్నది. వీరికి వారి సంప్రదాయం అంటే చాలా ఇష్టం. పండుగ రోజులలో తప్పని సరిగా నృత్యం చేస్తారు. "చిక్కుడు కాయ పండుగ"ను కొన్ని గిరిజన గ్రామాలలో ఇప్పటికీ నిర్వహిస్తారు. వివాహ సమయంలో మగపిల్లలకు కట్నం ఇచ్చే సంప్రదాయం వీరికి లేదు.

**కళలు :** భద్రాచలం పట్టణంలో ప్రగతి కల్చరల్ అసోసియేషన్ అనే సంస్థ నాటక రంగంలో విశిష్టసేవలను అందించింది. శ్రీ తాండ్ర వెంకటరమణారావు అరుణ కల్చరల్ అసోసియేషన్ అను సంస్థను స్థాపించి ఈ ప్రాంతంలో నాటక రంగానికి ఎనలేని సేవ చేశారు. ఆ రోజుల్లో అఖిల భారత స్థాయి నాటక పోటీలను నిర్వహించి కళారంగానికి సేవ లందించారు. ఎందరో పేద కళాకారులను ప్రోత్స హించారు. చర్లలో శ్రీ సి.వి.కె.రావు మరియు డాక్టర్ శ్రీ డి.యన్.కుమార్ ఆధ్వర్యంలో దేవభక్తుని నందీశ్వర నాటక కళాపరిషత్ ఎన్నో నాటకాలను ప్రదర్శించి ఎందరో కళాకారులను ప్రోత్సహించింది. ఎన్నో నాటక పోటీలను నిర్వహించింది. భద్రాచలంలో భద్రాద్రి కళాభారతిని 2001 అక్టోబరు 21న శ్రీ అల్లం నాగేశ్వరరావు గారు స్థాపించి ఇప్పటివరకు 100 నాటికలను ప్రదర్శించారు. ఢిల్లీ, కలకత్తా, వంటి ప్రదేశాల్లో భారీస్థాయిలో నాటకాలను ప్రదర్శించి అవార్డు పొందారు. ఎందరో యువకళాకారులను ప్రోత్సహించారు. ప్రస్తుతం పది సంవత్సరాల నుండి నాటక పోటీలను భద్రాచలంలో నిర్వహిస్తున్నారు. ఇటీవల ఈ జిల్లాలో విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో, జాతీయస్థాయిలో బాలోత్సవాలు నిర్వహించి బాలల సర్వతోవికాసానికి కృషిచేస్తున్నారు. ఈ విధంగా కొత్తగూడెంలో డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌గారు, భద్రాచలంలో శ్రీ బెక్కంటి శ్రీనివాసరావు, బూసిరెడ్డి శంకర్‌రెడ్డి, శ్రీ తాళ్ళూరి పంచాక్షరయ్యగారు బాలోత్సవాలను నిర్వహించి బాలలలోని సృజనాత్మకతను పెంపొందుటకు కృషిచేయుచున్నారు.

**జాతరలు :** దుమ్ముగూడెంలో ముత్యాలమ్మ జాతర, మోతెలో, శివరాత్రి జాతర, చర్ల మండలంలో ఎదిర గుట్ట వద్ద సమ్మక్క, సారక్క జాతర, మారాయిగూడెంలో సమ్మక్క, సారక్క జాతర చాలా ప్రముఖమైన జాతర్లు. ఈ జాతరకు వేలాది మంది గిరిజన, గిరిజనేతరులు తరలివస్తారు. ఎంతో భక్తిశ్రద్ధలతో దేవతలను పూజిస్తారు.

## సాహిత్య చరిత్ర

17 వ శతాబ్దికి చెందిన రామభక్తుడు, కవి, కర్ణాటక సంగీత విద్వాంసులైన **కంచెర్ల గోపన్న**కు భద్రాద్రి సాహిత్య రంగంలో విశిష్ట స్థానముంది. రామదాసు కీర్తనలు ప్రపంచ ప్రఖ్యాతి పొంది ప్రజల నాలుకలపై వున్నాయి. దశరథుడి తనయుడైన దాశరథిపై 108 శతక పద్యాలను అద్భుతంగా రచించారు. సాహిత్యంలోని ఎన్నో అలంకారాలు, ప్రాసలు వీరి పద్యాలలో కనిపిస్తాయి. తదుపరి **తూము నరసింహ దాసు** అనే భక్త శిఖామణి కవి, శ్రీరామునిపై ఎన్నో కీర్తనలు, పద్య కుసుమాలు రచించి వారి జీవితాన్ని శ్రీరాముని సేవకు అంకితమిచ్చారు. వీరి ఇష్టదైవం శ్రీరాముడు. చిన్న తనంలోనే తన ఇంటిలో రామ మందిరాన్ని నిర్మించారు. ఈయన శిష్యుడు **వరద రామదాసు** కూడా తన ఐశ్వర్యాన్ని శ్రీరామచంద్రుల కైంకర్యానికి అర్పించి ధన్యుడయ్యాడు. నారద, తుంబురులే నరసింహ వరద రామదాసులుగా వచ్చి శ్రీరాముల వారి సేవ చేశారని భక్తులు భావించేవారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎందరో సాహితీ వేత్తలకు పుట్టినిల్లు. చర్లలో గౌతమీ నవ్య సాహితీసంస్థను నిర్వహించడం ద్వారా శ్రీ **పెద్దాడ వెంకట రాజగోపాస్వామి** దాదాపు ముప్పది

సంవత్సరాలు సాహిత్యరంగంలో విశిష్ట సేవలందించారు. వీరికి శ్రీ **చింతూరు వెంకట్రావు** తమ సహకారాన్ని అందించారు. **మాల్యశ్రీ** అనుకవి ఈ సంస్థ ద్వారా చర్లలో సేవలందించడమే కాక భద్రాచలంలో సాహితీస్రవంతి అను సంస్థ ద్వారా ఎన్నో కార్యక్రమాలను ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. వీరు రామదాసు అనే చారిత్రక పద్య కావ్యాన్ని వ్రాసి 2010లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పద్యకావ్యంగా అవార్డును అందుకొన్నారు. మన్యభారతం, జనరంజని, వెన్నెల మలుపులు, 'చీకటి వెలుగులు' అనే కథానిక సంపుటిని వ్రాశారు.

కీర్తిశేషులు శ్రీ **రాళ్ళబండి కవితాప్రసాద్** ద్విశతావధాని, గంటకు 300వందల కందపద్యాలను ఆశువుగా చెప్పిన కవి. ఉపాధ్యాయునిగా ఈ ప్రాంతంలో విశిష్ట సేవలందించి అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ పదవి చేపట్టి, తిరుపతిలో జరిగిన ప్రపంచ మహాసభ నిర్వహణలో విశిష్టపాత్ర వహించారు. భద్రాచలం ప్రాంతవాసులు గర్వించదగిన మహాకవి. కాదంబిని, నూరుతీగలవీణ, ఒంటరి పూలబుట్ట వంటి ఎన్నో కావ్యాలను రచించిన బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ కవితాప్రసాద్.

**యర్రాప్రగడ రామమూర్తిగారు** కవి. సాహితి విమర్శకు 'ఈనాడు జర్నలిజం' ద్వారా ఎన్నో సాహిత్య వ్యాసాలు వ్రాశారు. ఎన్నో సాహితీకార్యక్రమాలు నిర్వహించారు. అభినవ మొల్ల బిరుదాంకితులైన **చక్రవర్తుల లక్ష్మీనర్సమ్మ గారు** ఈ ప్రాంతంలో గొప్ప కవయిత్రి. వీరు కూడా రామదాసుపై పద్యకావ్యాన్ని వ్రాశారు. **కీ.శే.గొట్టుపుల్ల రాజగోపాలాచారి** భద్రాచలం లోని విశిష్ట కవులలో ఒకరు. తెలుగు భాషకు ఈ ప్రాంతంలో ఎనలేని సేవను శ్రీ రాజగోపాలాచారి చేశారు.

**చక్రవర్తిగారు** బాలకొలువు, రెండు దరుల నడుమ, నానీ పంచశతి, మొదలైన ఎన్నో పుస్తకాలను రచించి సాహితీ రంగంలో ఎనలేని సేవచేశారు. ఎన్నో పుస్తకాలకు సమీక్ష నిర్వహించారు. వందలాది సాహితీ కార్యక్రమాలకు అధ్యక్షత వహించారు. **శ్రీధర వెంకటాచారి, కావూరు పాపయ్యశాస్త్రి,** పాల్వంచకు చెందిన దిలావర్ కవయిత్రి **షాజహాన,** ప్రముఖ కథారచయిత **శిరంశెట్టి కాంతారావుగారు** విశిష్ఠ సేవలందించారు. శ్రీధర వెంకటాచారిగారు అమ్మమ్మ కథలు, ఉపాధ్యాయ శతకం మొదలైన పుస్తకాలను రచించారు. **డా.వీధుల రాంబాబు** తెలంగాణా సాహితి ద్వారా ఎన్నో సాహితీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. హిందీ సాహిత్య రంగంలో కూడా వీరు విశేషమైన సేవను అందించారు.

కొత్తగూడెం ప్రాంతానికి చెందిన గొప్పకవి దివంగతులు **జాతశ్రీ** గారు. ఈ ప్రాంతంలో **రూత్‌మేరీ** అనే కవయిత్రి, మరియు **మండవ సుబ్బారావుగారు** సాహితీ రంగంలో విశిష్ఠసేవను అందిస్తున్నారు. ఇల్లెందు ప్రాంతానికి చెందిన **బైరి ఇందిర, కటుకోజ్వల రమేష్** సాహితీరంగంలో ఎనలేని సేవచేస్తున్నారు. అశ్వారావుపేటకు చెందిన కవి **కె.ప్రభాకరాచార్యులు,** మణుగూరుకు చెందిన కవి **బొమ్మరాత ఎల్లయ్యగారు** ఆయా ప్రాంతాల్లో సాహితీరంగంలో సేవలందిస్తున్నారు. ఇటీవలి కాలంలో **చిగురుమళ్ళ శ్రీనివాస్** దాదాపు 30 శతకాలను వ్రాసి పద్యరచనలో మంచి పట్టు ఉన్న కవిగా ప్రసిద్ధికెక్కాడు. అమ్మశతకం, వృక్షశతకం, రాళ్ళబండి శతకం వంటి శతకాలను వ్రాశారు. ఈ ప్రాంతంలో వచన కవితలో కూడా చిగురుమళ్ళ శ్రీనివాస్ ఎన్నో అవార్డులను పొందారు. తెలుగు పద్య ప్రచారాన్ని చేస్తూ విద్యార్థులకు పద్యాలపై ఆసక్తి కలిగించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బాల సాహిత్యంలో డాక్టరేట్ చేసి **అమ్మిన శ్రీనివాసరాజుగారు** సాహితీరంగానికి సేవలందించారు. ఇంకా ఎందరో కవులు, పండితులు, ఈ జిల్లాలో ఉన్నారు. స్థలాభావం వలన వ్రాయలేని పరిస్థితి. భద్రాచలం ప్రాంతం గత ఇరవై సంవత్సరాలుగా ఉపాధ్యాయ ఉద్యమ నాయకులుగా పేరొందిన **జి.గోపాలకృష్ణ గారు** సాహిత్య విమర్శ చేయడంలో దిట్ట. వీరు ఇటీవల 'సీతాకోక చిలుక' అనే పరిశోధన గ్రంథాన్ని వ్రాశారు.

## సాహితీ సంస్థలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో **గౌతమి నవ్య సాహితీ సంస్థ** ఎన్నో సాహితీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. దీనిని ఏజెన్సీ ప్రాంతమైన చర్లలో 30 సం॥ల క్రితం శ్రీ పెద్దాడ

వెంకటరాజగోపాల స్వామి స్థాపించారు. అనేక సాహిత్య సమావేశాలు, కవి సమ్మేళనాలు, పుస్తక ప్రచురణలు చేశారు. ప్రస్తుతం ఈ సంస్థను సమాజ సేవకులు చింతూరు వెంకట్రావు నిర్వహిస్తున్నారు.

భద్రాచలంలో మాల్యశ్రీ **సాహితీ స్రవంతి** సంస్థ ద్వారా ఎన్నో కార్యక్రమాలను నిర్వహించారు. కవి సమ్మేళనాలు, అవధానాలు, సాహితీ గోష్ఠులు నిర్వహించి ఈ ప్రాంతంలో తెలుగు భాషాభివృద్ధికి కృషి చేశారు. ప్రస్తుతం ఈ సంస్థను తెలంగాణ సాహితి అనే సంస్థలో విలీనం చేసి మాల్యశ్రీ గారు ఆ సంస్థ ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారు. రామదాసు, మన్యభారతం అనే పద్య కావ్యాలు రాసి 2010లో రాష్ట్ర స్థాయిలో పద్యకావ్య పురస్కారాన్ని పొందినారు.

ప్రస్తుతం జిల్లాలో అతి పెద్ద సాహితీ సంస్థ **తెలంగాణ సాహితి.** దీని అధ్యక్షులు మండవ సుబ్బారావు. ఈ సంస్థ కార్యదర్శి కటుకోజ్వల రమేశ్. ప్రముఖ నవలా రచయితలు జాతశ్రీ, శిరంశెట్టి కాంతారావు, ప్రముఖ కవులు దిలావర్, తులసీదాస్, దుర్గాచారి, రచయిత్రి అద్దం అనసూయ ఈ సంస్థ ద్వారా తమ సేవలను అందిస్తున్నారు.

**అరసం సాహితీ సంస్థ** ద్వారా ఆర్.వెంకయ్య గారు చేస్తున్న సాహితీ సేవ ప్రశంసనీయం. వీధుల రాంబాబు, **కామిశెట్టి జాతీయ పురస్కారాన్ని** నెలకొల్పి ఎందరో సాహితీ వేత్తలను ప్రోత్సహిస్తున్నారు.

## వివిధ రంగాల ప్రముఖులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఈనాడు పారిశ్రామికంగా, వ్యవసాయపరంగా అభివృద్ధి చెందటానికి కారణం ఈ ప్రాంతానికి చెందిన కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావుగారు అనటంలో సందేహంలేదు. ఈ ప్రాంతంలో తాలిపేరు వంటి ప్రాజెక్టు, వాగుపై ఎన్నో వంతెలను, ఐటిడిసి భద్రాచలం పేపరు మిల్లును, మణుగూరు భారజల కర్మాగారం మొదలైన పరిశ్రమకు ఆయన చేసిన కృషి ప్రశంసనీయము. ఈ ప్రాంతం అద్భుత పారిశ్రామిక ప్రగతికి జలగం వెంగళరావుగారు ఆద్యులు.

ఈ జిల్లాలో భారతకమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నాయకు టి.వి.ఆర్. చంద్రంగారు, మహ్మద్ తాసీల్ గారు పేద ప్రజల సమస్య కొరకు కృషిచేసి, తమ సేవలందించారు. రైతు సమస్య పరిష్కారానికి కందుకూరి సుబ్బారావుగారు, నూపా బొజ్జి, కారం చంద్రయ్య, జయరామిరెడ్డి వంటి నాయకులు కృషి చేశారు. సుజాతనగర్ ఎమ్మెల్యేగా పువ్వాడ నాగేశ్వరరావుగారు తమ విశిష్ఠ సేవలను అందించి, నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేశారు. భద్రాచలం ప్రాంతంలో పేదప్రజలకు ఇండ్లు కట్టించడానికి శ్రీ జగదీష్ ఎంతో కృషిచేశారు. భద్రాచలంలో వీరి పేరుపై "జగదీష్ కాలనీ" అని ఉన్నది. ఈ విధంగా ఎందరో నాయకులు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తరపున తమ సేవలను అందించారు.

సీపీఎం పార్టీకి ఈ జిల్లాలో ప్రత్యేకస్థానం ఉన్నది. శ్రీ బండారు చంద్రరావుగారు, దుమ్ముగూడెం నుండి యలమంచిలి సీతారామయ్యగారు, చర్లనుండి బి.యస్. రామయ్యగారు, శ్యామ వెంకటరెడ్డిగారు పేదప్రజల పక్షాన పోరాడారు. నిస్వార్ధపరుడు, ఆదర్శ యం.యల్.ఎ. కుంజా బొజ్జి గారు 3 సార్లు యం.యల్.ఎ.గా భద్రాచలం అసెంబ్లీ స్థానం నుండి గెలిచి ఎనలేని సేవచేశారు. ప్రస్తుతం సున్నం రాజయ్యగారు యం.యల్.ఎ.గా ఉండి ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నారు.

భద్రాచలం నుండి శ్రీ బాల నరసారెడ్డిగారు, దుమ్ము గూడెం నుండి యలమంచలి రవికుమార్ గారు, సరియం కోటేశ్వరరావు గారు రైతు, వ్యవసాయకూలీల, అణగారిన వర్గాల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నారు. ఇల్లందు నుండి న్యూడెమొక్రసీ పార్టీ తరపున గుమ్మడి నరసయ్యగారు యం.యల్.ఎ.గా విశిష్ఠ సేవలందించారు. ఈ విధంగా నిస్వార్ధపరులైన నాయకులు ఈ జిల్లాలో ఎందరో ఉన్నారు.

గతంలో భద్రాచలంలో కాంగ్రెస్ పార్టీ తరపున శ్రీమతి రాధాబాయి ఆనందరావుగారు శ్రీమతి రమణారావు గారు యం.పి.మరియు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించి గిరిజనుల అబివృద్ధికి కృషిచేశారు. బలరామ్ నాయక్ గారు యం.పి. మరియు కేంద్రమంత్రిగా విశిష్ఠ సేవలను

అందించారు. కొత్తగూడెం ప్రాంతంలో వనమా వెంకటేశ్వర రావు గారు వ్యవసాయరంగ అభివృద్ధికి కృషిచేశారు. నియోజకవర్గ అభివృద్ధికి శ్రీమతి కుంజా సత్యవతి భద్రాచలం ఎమ్మెల్యేగా తమ విశిష్ఠ సేవలను అందించారు. చందా లింగయ్యగారు, రేగా కాంతారావు గారు ఈ జిల్లా ఎమ్మెల్యేలుగా చేసిన కృషి ప్రశంసనీయము. భద్రాచలం ప్రాంతం నుండి శ్రీ పలివె మాధవరావు గారు శ్రీ కె.వి. రమణగారు, తాండ్ర వెంకట రమణారావు గారు, మైథిలి రెడ్డి, కురుచేటి పాండురంగా రావు గారు, బుడగం శ్రీనివాసరావు గారు, యం.డి.మక్బుల్, చర్ల ప్రాంతం నుండి సివికె రావు, కడెం మురళి, వంటి ఎంతోమంది నాయకులు ఎనలేని సేవచేశారు. దుమ్ముగూడెం నుండి శ్రీ మస్తాన్ వంటి నాయకులు పదవి ఆశించకుండా తమ నిస్వార్థ సేవలే అందించారు.

ఈ జిల్లా వ్యవసాయరంగ అభివృద్ధికి పారిశ్రామిక అభివృద్ధికి కృషిచేసిన గొప్పనాయకులో ప్రస్తుత మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు గారి కృషివల్ల ఈ జిల్లాలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు జరిగాయి. తెలుగుదేశం పార్టీ నుండి కోనేరు నాగేశ్వరరావు గారు, తాళ్ళూరి బ్రహ్మయ్యగారు మొదలైనవారు ఎనలేని సేవలు అందించారు

ప్రస్తుతం షేక్ అజీమ్, కొడాలి శ్రీనివాసరావు, మచ్చా వెంకటేశ్వరరావు, భవానీ శంకర్ మొదలైన నాయకులు ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేస్తున్నారు. భారతీయ జనతాపార్టీ నుండి బైరెడ్డి ప్రభాకరరెడ్డి, బెహరా యర్రంరాజు, పసుమర్తి సతీష్‌కుమార్, ముక్కెర కోటేశ్వరి మొదలైనవారు తమ విశిష్ఠ సేవలు అందిస్తున్నారు.

తెలంగాణా రాష్ట్ర సమితి (టి.ఆర్.యస్.) ఈ జిల్లాలో తెంగాణా ఉద్యమకాలంలో మరియు ప్రస్తుతం ఎంతో ప్రముఖ పాత్ర వహిస్తున్నది. మానె రామకృష్ణ, యశోదనగేష్, చింతాడి చిట్టిబాబు, రత్నం రమాకాంత్, చింతాడి రామకృష్ణ, తిప్పన సిద్ధు, తాళ్ళ రవికుమార్, మామిడి పుల్లారావు, ముంతాజ్, రఫీ, బషీర్ మొదలైన నాయకులు ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

**సమాజ సేవ :**

నన్నపనేని మోహన్ ఫౌండేషన్ ఎందరో పేదవిద్యార్థు లకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నది. నన్నపనేని మోహన్ ఈ ప్రాంత కళాకారులకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తూ తాను చదువుకున్న పాఠశాలకు భవనాన్ని నిర్మించారు. వీరు గతంలో తానా అధ్యక్షుగా తమ సేవందించారు. ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలకు ధన సహాయం చేశారు.

తాళ్ళూరి పంచాక్షరయ్యగారు సమాజ సేవా కార్యక్రమాలు ఎన్నో నిర్వహిస్తూ విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధికి కృషిచేస్తున్నారు. వీరి కుమారుడు జయశంకర్ ప్రస్తుతం తానా అధ్యక్షులుగా చేస్తున్నారు.

శ్రీ మాగంటి సూర్యంగారు విద్యారంగంలో విశిష్ట సేవలను అందిస్తూ ఎన్నో దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. చర్ల నుండి సివికె రావు గారు, డాక్టర్ డి.యన్. కుమార్‌లు విద్యా, వైద్య రంగాల్లో సమాజసేవా కార్యక్రమా లను నిర్వహిస్తున్నారు. ఇంకా లయన్స్, రోటరీ, వంటి ఎన్నో సంస్థలు ఈ జిల్లాలో తమ విశిష్ఠ సేవలను అందిస్తున్నాయి. చిరంజీవి రక్తనిధి సంస్థ తరపున శ్రీ తాళ్ళపూడి రాము రక్తదాన కార్యక్రమాలు నిర్వహించి ఎనలేని సేవచేస్తున్నారు. ఇంకా ఎందరో సమాజసేవా కార్యక్రమాలు చురుకుగా పాల్గొంటూ ఈ జిల్లా ప్రగతిపథంలో ప్రయాణించేందుకు కృషిచేస్తున్నారు.

**దర్శనీయ ప్రదేశాలు - పర్యాటక రంగం :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చూడదగిన చారిత్రక ప్రదేశాలలో భద్రాచలం, పర్ణశాల, కిన్నెరసాని వన్యప్రాణి సంరక్షణకేంద్రం, తాలిపేరు ప్రాజెక్టు మొదలైనవి. ఈ జిల్లాలో ఎన్నో దేవాలయాలు ఉన్నవి. వాటిలో ముఖ్యమైనవి భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవాలయం, పెద్దమ్మతల్లి గుడి, నవభారత్ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయం, ఇరవెండి సంతాన వేణుగోపాల స్వామి వారి దేవాలయం, మోతెలో శివాలయం, భద్రాచలంలోని నృసింహాలయం, గోవింద రాజస్వామి (తాతగుడి), శ్రీ అభయాంజనేయస్వామి

వారి దేవాలయం ముఖ్యమైనవి.

**తాలిపేరు ప్రాజెక్టు :** ఇచ్చట ప్రకృతి దృశ్యము రమణీయంగా ఉంటుంది. అడవుల మధ్య తాలిపేరు డ్యామ్ యాత్రికులను ఎంతో అలరింపచేస్తుంది. తాలిపేరు గోదావరికి ఉపనది. ఇచ్చట చాలావేగంగా ప్రవహిస్తుంది. “తాళిపేరు” అని పూర్వం దీనిని పిలిచేవారు.

**కిన్నెరసాని వన సంరక్షణ కేంద్రము :** గోదావరికి ఉపనది కిన్నెరసాని. ఈ ఉపనది ఎంతో అందమైన ఉపనది. కిన్నెరసాని ఎంతో సొగసుతో అడవుల మధ్య ప్రవహిస్తుంది. పాల్వంచకు 21కి.మీ. దూరంలో ఈ వన్యప్రాణి సంరక్షణ కేంద్రమున్నది. 635.4 చదరపు మీటర్లు విస్తరించి ఉన్నది. వన్యప్రాణులైన అడవిదుప్పు, హైనాలు, నక్కలు, కొండచిలువ, పులులు, చిరుత పులులు మొదలైన వన్య మృగాల సంరక్షణ ఇక్కడ జరుగుతుంది. నెమళ్ళు, పావురాలు, అడవిలో నివసించు అనేక రకాల పక్షులను ఇక్కడ సంరక్షిస్తారు. వెదురు, టేకు, మద్ది, బండారు వంటి రకరకాల వృక్షజాతులతో ఇక్కడి ప్రదేశం కనులకు విందుగా ఉంటుంది. ఇచ్చట డీర్ పార్క్ యాత్రికులను ఆకట్టుకొంటుంది. చుట్టూ గుట్టల మధ్య ఉన్న కిన్నెరసాని డ్యామ్ యాత్రికులను విశేషంగా ఆకట్టుకుంటుంది. విద్యార్థులు విహారయాత్రలు, విజ్ఞానయాత్రల కొరకు దీనిని సందర్శిస్తారు.

**దుమ్ముగూడెం :** ఇక్కడ శ్రీరాముని ఆదర్శరాముడు అంటారు. శ్రీరాముడు ఖరదూషణాదునే రాక్షసులకు చెందిన 14000 మంది రాక్షసులను ఇక్కడ సంహరించాడని అంటారు. భద్రాచలం దగ్గరలో “ఎటపాక” గ్రామం జటాయువు రావణాసురుదుని ఎదుర్కొన్న ప్రాంతమని అంటారు. ఇక్కడ సీతారామ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. గుండా గ్రామంలో కూడా దర్శనీయం. గోదావరి ఒడ్డున త్రవ్వితే వేడినీరు వస్తుంది. ఈ ప్రాంతాన్ని ఉష్ణగుండా అంటారు.

**పర్ణశాల :** పర్ణశాల భద్రాచలమునకు 32 కి.మీ. దూరంలోనున్నది. ఇది దుమ్మగూడెం మండలంలోనున్నది. పర్ణశాల అనగా ఆకులతో నిర్మించిన ఇళ్లు. సీతారాములు అరణ్యవాసము చేసినపుడు ఇచ్చటనే పర్ణశాలను నిర్మించుకొని నివసించారని పెద్దల నమ్మకం. రావణుడు సీతాదేవిని అపహరించినది ఈ ప్రదేశంలోనే అని చెప్తారు. ఇచ్చట శ్రీరాముడిని శోకరాముడు అని అంటారు. ఇచ్చట గల సెలయేటిని సీతవాగు అని అంటారు. సీతమ్మవారు వస్త్రాలను ఆరవేసిన గుర్తు, తొపు, పసుపు, కుంకుమరంగు శిలలు ఇప్పటికినీ కనిపిస్తాయి. ఇచ్చట శూర్పణఖ చెట్టు అని ఉన్నది. ఈ చెట్టుపై వచ్చినవారు రాళ్ళు విసరగా అక్కడ ఒక గుట్ట ఏర్పడినది. ఇచ్చట గోదావరి ఎంతో అందంగా ప్రవహిస్తుంది. యాత్రికులకు బోటుషికారు సౌకర్యం కూడా కూడా ఉంది. ఇచ్చట దేవాలయ ప్రాంగణంలో సినీదర్శకులు, చిత్రకారులు బాపుగారు చేసిన రావణాసురుడు, సీత మొదలైన శిల్పాలు యాత్రికులను ఆకట్టుకుంటాయి. సీతవాగును రామాయణంలో పద్మసరస్సుగా పేర్కొన్నారు. ఇక్కడ మాయలేడి పాదాల గుర్తు, దశకంఠుడు భూమిని పెళ్ళగించిన జాడలు యాత్రికులను ఆకట్టుకుంటాయి.

## ముఖ్య దేవాలయాలు

**భద్రాచలం :** శ్రీరామచంద్రమూర్తి విష్ణుమూర్తి యొక్క ఏడవ అవతారం. భద్రాచలం రామాలయంలో వైష్ణవ పాంచరాత్రాగమం సంప్రదాయాన్ని పాటిస్తారు. శ్రీరామదాసు తమిళనాడులోని శ్రీరంగం రంగనాథ స్వామి దేవాలయ నమూనాలో ఈ ఆలయాన్ని నిర్మించారు. దేవాలయానికి నాలుగు దిక్కులా నాలుగు ద్వారాలున్నాయి. ఉత్తరం ద్వారం వద్ద రాజ గోపురం వుంటుంది. దీనినే వైకుంఠ ద్వారం అంటారు. దేవాలయ ప్రాంగణంలో లక్ష్మీతాయారు అమ్మవారి గుడితో పాటు చిన్న చిన్న గుడులు, మంటపాలు ఎంతో అందంగా నిర్మించబడ్డాయి. మూల వరులు శ్రీరాముల వారు పద్మాసనంలో వుంటారు. సీతమ్మ వారు రాములవారి వామాంకంపై ఆసీనులై వుండటం ఇక్కడి ప్రత్యేకత. లక్ష్మణ స్వామి శ్రీరాముల వారికి ఎడమ వైపుకి వుంటారు. దేవాలయం గోదావరి ఒడ్డున పడమర వైపుకి తిరిగి వుంటుంది. గోదావరి కూడా శ్రీరాముని దేవాలయం చుట్టూ మలుపు తిరిగి వుంటుంది. గోదావరి ఒడ్డు నుంచి సీతారాముల వారి గుడికి వచ్చే మార్గమధ్యంలో శ్రీ

యోగానంద నరసింహ స్వామి దేవాలయం కలదు. దేవాలయ ప్రాంగణంలో ఋష్యమూకం అనే మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో శ్రీరామదాసు స్వామి వారికి, అమ్మవారికి చేయించిన కిరీటాలు, హారాలు ఎన్నో నగలున్నాయి. రంగనాయకుల గుట్టపై ప్రాచీనమైన ఒక శివాలయం వుంది. దీనిపేరు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం.

భద్రాచలం దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన గొప్ప పుణ్యక్షేత్రం. ఇచ్చట గోదావరి నదీ తీరాన సీతారాముల వారి దేవాలయం అత్యంత రమణీయంగా ఉంటుంది. ప్రతినిత్యం వేలాదిమంది భక్తులు రాముల వారిని దర్శించు కొంటారు. పూర్వము ఈ ప్రాంతమును దండ కారణ్యము అని పిలిచేవారు. గోదావరి నది పడమటి కనుమలో పుట్టి తూర్పుదిక్కుగా భద్రాచలం వరకు ప్రవహించి అచ్చటి నుండి ఉష్ణగుండం వరకు ప్రవహించి శబరినదితో కలిసి పాపికొండల మధ్య, తూర్పుగా ప్రవహించి తదుపరి సముద్రంలో కలుస్తుంది. గోదావరినది వంపుసొంపు భద్రాచలంలో హృద్యంగా ఉంటుంది. శ్రీరాముడు తండ్రి ఆజ్ఞను పాటించి వనవాసం చేసేటప్పుడు ఈ ప్రాంతములోని పర్ణశాలలో నివసించాడు. భద్రుడు అను భక్తునిపేరుపై భద్రగిరి అనే పేరు వచ్చింది. కాలక్రమేణా భద్రగిరి భద్రాచలముగా రూపాంతరం చెందింది. జటాయువు పాక యటపాకగా, సంపాతిపాక కాలక్రమేణ సారపాకగా మారినదని అంటారు.

శ్రీ సీతారాముల కళ్యాణం ప్రతి సంవత్సరం భద్రాచలంలో ఘనంగా నిర్వహిస్తారు. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం మరియు తిరుమల తిరుపతి దేవస్థానం నుండి శ్రీ సీతారాముల వారికి "పట్టువస్త్రాలు" సమర్పిస్తారు. ముక్కోటి పర్వదినం కూడా భద్రాచంలో వైభవంగా జరుపుతారు. తెల్లవారు ఝామున వైకుంఠద్వార దర్శనం ఉంటుంది. గోదావరి నదిపై గత 32 సంవత్సరాలుగా తెప్పోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. హంస వాహనంపై మిరుమిట్లు కొలిపే విద్యుత్ అలంకరణలో సీతారాముల వారిని విహారయాత్రకు తీసుకువస్తారు.

ఇచ్చట శ్రీరాముని వైకుంఠరాముడు, రామ నారాయణుడు, మోక్షప్రదరాముడు అని పిలుస్తారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి గ్రామానికి చెందిన కంచర్ల గోపన్న సీతారాముల వారి ఆలయాన్ని ఎంతో భక్తితో ఆరు లక్షల రూపాయల వ్యయంతో నిర్మించాడు. కంచర్ల గోపన్ననే రామదాసు అని పిలుస్తారు. ఆయన ఈ ప్రాంతంలో తహశీల్దారు. ఈ ఆలయ నిర్మాణానికి సర్కారు వారి ధనాన్ని ఉపయోగించినందున తానీషా ప్రభువు ఆయనను కారాగారంలో బంధించగా, రామలక్ష్మణులు తానీషాకు కన్పించి రామదాసును సొమ్ము చెల్లించి కారాగారం నుండి విడిపించారని ప్రజల నమ్మకం. 'దాశరథీ కరుణాపయోనిధీ' అనే మకుటంతో దాశరథీ శతకాన్ని రామదాసు రచించారు. "నను బ్రోవమని చెప్పవే సీతమ్మతల్లీ" వంటి ఎన్నో కీర్తనలను రచించాడు.

రామాలయంలో శ్రీ మహాలక్ష్మీ తాయారు సన్నిధి, సీతమ్మ వారికి రామదాసు చేయించిన నగలున్న మ్యూజియం, చిత్రకూటమండపం ఉన్నాయి. చిత్రకూట మండపంలో సంస్కృత పాఠశాల కూడా నడుపబడుచున్నది. భద్రాచలంలో అష్టదిక్కులయందు ఆలయము కలవు. తూర్పున గోవిందరాజ స్వామి (తాతగుడి), ఆగ్నేయమున ఈశ్వరమ్మగుడి, దక్షిణమున రంగనాయకస్వామి, నైఋతి దిశన అంబసత్రం, పశ్చిమమున నృసింహాలయం, వాయవ్యమున గోవిందస్వామి మఠం, ఉత్తరమున అపూర్వ శిల్పకళా శోభతో కళ్యాణమండపం, దత్తాత్రేయ పూజా పీఠం ఉన్నాయి. గోదావరి నది ఒడ్డున పార్కులో ఎంతో పెద్దదైన ఆంజనేయుని విగ్రహం భద్రాచలం పట్టణానికి అభయం ఇస్తూ ఎంతో ఠీవిగా ఉంటుంది. ప్రక్కనే అభయాంజనేయస్వామి దేవాలయం, అయ్యప్పస్వామి దేవాలయం, వినాయకుడి దేవాలయం ఉన్నాయి. భద్రాచలం పట్టణంలో ఇంకనూ ఎన్నో దేవాలయాలున్నాయి. గోదావరి నది దగ్గర కరకట్టపై బాపుగారు రూపొందించిన అద్భుతమైన శిల్పాలు కనువిందు చేస్తాయి. ఈ శిల్పాలు రామాయణంలోని పుత్రకామేష్ఠి యాగం నుండి రావణాసురుని వధ వరకు అనేక ఘట్టాలు రమణీయంగా శిల్పరూపాలలో చెక్కారు.

**అంబసత్రం :** భద్రాచలంలో అంబసత్రంలో శ్రీ బాలాత్రిపురసుందరీ అమ్మవారి పీఠం ఉంది. ఈ ప్రాంగణంలో శివపంచాయతన దేవాలయం, ప్రసన్నాంజనేయస్వామి, నవగ్రహదేవాలయాలున్నాయి. ఈ సత్రాన్ని 1877 సంవత్సరములో శ్రీ పమిడిఘంటం వెంకటరమణ హరిదాసుగారు ప్రారంభించారు. ఇప్పటివరకు నిరాటంకంగా వచ్చినవారికి లేదు అనకుండా అన్నదానం చేస్తున్నారు.

**పెద్దమ్మతల్లి గుడి :** పాల్వంచ మండలం, కె.పి. జగన్నాథపురం వద్ద పెద్దమ్మతల్లి గుడి రహదారి ప్రక్కనే ఉన్నది. వేలాదిమంది భక్తులు ప్రతిరోజూ ఈ గుడిని సందర్శించి మొక్కులు తీర్చుకుంటారు. ఈ ప్రాంతంలో ఒకప్పుడు పెద్దపులి సంచరించేది. అది ఎవరినీ ఏమీ చేయకుండా ఉండేది. దానిని అందరూ అమ్మవారి వాహనంగా భావించేవారు. దానికి గుర్తుగా ఈ ఆలయాన్ని నిర్మించారు.రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు ఇక్కడికి వస్తారు.

**ఇతర ప్రత్యేకతలు :** కొత్తగూడెం రైల్వేస్టేషన్ చాలా పురాతనమైన రైల్వేస్టేషన్. దీనిని భద్రాచలం రోడ్ అని అంటారు. మొదట ఇది బొగ్గురవాణా కొరకు ఏర్పాటు చేయబడినది. ప్రస్తుతం ప్రయాణీకుల కొరకు రైళ్ళను నడుపుతున్నారు. హైదరాబాదు మరియు ఎన్నో ప్రాంతాలకు నడుస్తున్నాయి.

సింగరేణి కాలరీస్ కోల్‌మైనింగ్ కంపెనీ (యస్.సి.సి.యల్) ముఖ్యకేంద్రం కొత్తగూడెంలో ఉన్నది. 16 ఓపెన్‌కాస్ట్ గనులతో 60000 మంది ఉద్యోగులతో పనిచేస్తుంది. ఈ ప్రాంత ప్రజలకు ఈ సంస్థ ఉపాధినిస్తున్నది.

కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కెటిపియస్) పాల్వంచలో ఉన్నది. ఐటిసి పేపర్‌బోర్డు అండ్ స్పెషాలిటి డివిజన్ (పి.యస్.పి.డి.) భద్రాచలం వద్ద సారపాకలో ఉన్నది. ఇది ప్రపంచంలో ప్రసిద్ధి పొందిన వ్యాపారసంస్థ. ఈ ప్రాంతంలోని అడవులలోని కలపతో పేపరు తయారు చేస్తారు.

కె.యు.సి.ఇ. కాకతీయ యూనివర్సిటీకి చెందిన యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ కొత్తగూడెంలో ఉన్నది. ఇది తెలంగాణాలోని మొదటి మైనింగ్ కళాశాల మరియు భారతదేశంలో స్థాపించబడిన రెండవ మైనింగ్ కళాశాల. తెలంగాణాలో హైదరాబాద్ తర్వాత పరిశ్రమలకు పేరొందినది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. త్వరలో ఖనిజ వనరుల పరిశోధనకు ప్రత్యేక యూనివర్సిటీని కొత్తగూడెంలో ఏర్పాటు చేయనున్నారు. క్రొత్తగా ఉద్యోగాల కల్పనకు రెండు పారిశ్రామిక జోన్స్‌ను నెలకొల్పాలని ప్రణాళికలు రూపొందించారు. భవిష్యత్‌లో పాల్వంచ, కొత్తగూడెం రెండు కవలనగరాలుగా (ట్విన్ సిటీస్)గా రూపుదిద్దుకోనున్నాయి.

మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ అండ్ టూరిజమ్ వారు భద్రాచలంలో వస్త్రతన్ అను ప్రాజెక్టును చేపట్టబోతున్నారు. కొత్తగూడెం మండలం పునుగుచెలక వద్ద త్వరలో విమానాశ్రయాన్ని నిర్మించబోతున్నారు. దీనికొరకై 1500 ఎకరాలను కేటాయించారు. తెలంగాణాలో శంషాబాద్ తర్వాత రెండవ విమానాశ్రయం ఇది. విమానాశ్రయం నెలకొల్పాక ఇంకా ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందగలదు. ప్రతిష్ఠాత్మకమైన మణుగూరులోని భారజల కర్మాగారం భారతదేశంలో రెండవది. మొదటిది రాజస్థాన్‌లోని కోటాలో ఉన్నది. ప్రతి సంవత్సరం 180 మెట్రిక్‌టన్నుల భారజలాన్ని ఇందులో ఉత్పత్తి చేస్తారు.

ఈ విధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రగతి పథంలో పయనిస్తూ తెంగాణాలో ప్రత్యేకస్థానాన్ని కలిగియున్నది.

# మహబూబాబాద్

కురవిని వీరభద్రుడు నకుంఠిత దీక్ష జనాల బ్రోవగా
పరిమళవంతమౌ గుడుల భాసిలునీ మహబూబబాదనన్
వరఖనిజమ్ములన్ గలిగి వర్ధిలు సంపదలందు మిన్నగా
నిరుపమ వైభవాత్మమయి నిశ్చలశైలములే ధనాలుగా!

అరవై ఏళ్ళ పోరాట ఫలితంగా తేదీ 2.6.2014 న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. ఆ తర్వాత పాలనా సౌలభ్యం కోసం, రాష్ట్ర అభివృద్ధి ఫలాలు మారుమూల గ్రామాల ప్రజలకు అందడం కోసం, నూతనంగా ఏర్పాటు చేసిన ఇరవై ఒక్క జిల్లాలలో మహబూబాబాద్ జిల్లా ఒకటి. రాష్ట్రంలో ఏకైక గిరిజన జిల్లాగా పదహారు మండలాలతో మణిహారంగా 2016 అక్టోబర్ 11 దసరా పర్వదినాన ఈ జిల్లా ఆవిర్భవించింది.

**ఈ పేరెందుకు?**

ప్రస్తుతం మహబూబాబాద్‌గా వ్యవహారంలో వున్న ఈ పట్టణం చాలా కాలం 'మానుకోట'గా పిలువబడేది. చుట్టూ మ్రానులతో నిండి వున్న మట్టికోట ఇక్కడ వుండేది. అందువల్లనే దీనికి 'మ్రానుకోట'గా పేరొచ్చిందని చరిత్ర చెబుతోంది. అదే కాలక్రమంలో మ్రానుకోట కాస్తా 'మ్రా' లోని 'ర' కారం పోయి 'మానుకోట'గా స్థిరపడిపోయింది. తర్వాత తర్వాత మహబూబాబాద్ అయ్యింది.

ఆరవ నిజాం మహబూబాబాద్ అలీఖాన్ వేటయందు అమితాసక్తి కలిగినవాడు. తరచూ వేటకు వెళ్ళేవాడు. మెదక్ జిల్లా కుక్కునూరు, రామాయిపల్లి అటవీ ప్రాంతం మహబూబ్‌అలీ పాదుషా వేటాడుటకు ప్రత్యేకించబడింది. అలాగే మానుకోట ప్రాంతం కూడా దట్టమైన అడవులతో కూడిన ప్రాంతం కాబట్టి అప్పుడప్పుడు ఈ ప్రాంతానికి వేటకు వచ్చేవాడు. అతడు వేటకు వచ్చినపుడు కొద్ది కాలమిక్కడ నివాసముండేవాడు. మ్రానుకోటగా పిలుచుటకు కారణమైన మట్టికోట ఒకటి ఇక్కడ వుండేదని, ఆ కోటకు దగ్గరలో నిజాం నివాసమేర్పర్చుకొని ఉండేవాడని, తాను 'శికారు' (వేట) చేసిన అడవి జంతువుల మాంసాన్ని ఇక్కడ వండించుకొని తినేవాడని చెప్తారు. అలా తాను శికార్ చేసిన మాంసాన్ని తినే 'గడ్డ' ను 'శిఖార్‌ఖానాగడ్డ' గా వ్యవహరించడం మొదలైందని అంటారు. అందుకు సాక్ష్యంగా మహబూబాబాద్‌లో పాత బజార్ సమీపంలోని వాడకు 'శిఖార్ ఖానా గడ్డ' గా నేటికీ వ్యవహారంలో వుంది. ఆరవ నిజాం 1911 సంవత్సరంలో తీవ్ర అనారోగ్యానికి గురై మరణించాడు. అతని జ్ఞాపకంగా ఈ పట్టణానికి మహబూబాబాద్ అనే పేరు వాడుకలోకి వచ్చింది.

'అబాద్' నివాసమని అర్థం. మహబూబ్ అలీఖాన్ నివాసముండిన ప్రాంతం కనుక అప్పటి ముస్లిం అధికారులు దీనికి మహబూబ్ ఆబాద్‌గా నామకరణం చేసి ప్రభుత్వ రికార్డుల్లోకి ఎక్కించారు. క్రమంగా అది రైల్వే రికార్డులలో కూడా చేరి రైల్వేస్టేషన్ బోర్డులపై మహబూబాబాద్‌గా రాయబడి ఉండటం వల్ల ఎక్కువగా జన ప్రచారంలోకి వచ్చింది. నిన్న మొన్నటి వరకు పట్టణ స్థానికుల

**రెవెన్యూ డివిజన్లు - మండలాలు :**

మహబూబాబాద్ జిల్లాలో మహబూబాబాద్, తొర్రూర్ అనే రెండు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. ఈ రెండు డివిజన్లలో 16 మండలాలు ఉన్నాయి.

**మహబూబాబాద్ రెవెన్యూ డివిజన్‌లో**

1. మహబూబాబాద్ 2. కురవి 3. కేసముద్రం 4. డోర్నకల్ 5. గూడూరు 6. కొత్తగూడ 7. గంగారం 8. బయ్యారం 9. గార్ల

**తొర్రూరు రెవెన్యూ డివిజన్‌లో**

1. చిన్న గూడూరు 2. దంతాలపల్లి 3. తొర్రూరు 4. పెద్ద వంగూరు 5. నెల్లికుదురు 6. మరిపెడ 7. నరసింహులు పేట

వ్యవహారంలో తప్ప చుట్టుపక్కల గ్రామాల వృద్ధుల నోళ్లలో ఇప్పటికి 'మానుకోట' గానే వినపడడం మనం గమనిస్తాం.

**భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి :**

మహబూబాబాద్ జిల్లా $18^0$-256 మరియు $18^0$-580 ఉత్తర అంక్షాంశాల మధ్య, $78^0$-09 మరియు $79^0$-39 తూర్పు రేఖాంశాల మధ్య వ్యాపించి ఉంది. 2877 చ.కి.మీ. వైశాల్యం కలిగి ఉంది. ఈ జిల్లాకు ఉత్తరాన జయశంకర్ భూపాలపల్లి, తూర్పున భద్రాద్రి కొత్తగూడెం, దక్షిణాన ఖమ్మం, పడమర జనగామ జిల్లాలు సరిహద్దులుగా ఉన్నాయి.

**సహజ వనరులు**

**నేలలు :** ఈ జిల్లాలో ఎక్కువగా నల్లరేగడి నేలలు, ఎర్ర నేలలు, తక్కువగా ఇసుక నేలలు విస్తరించి ఉన్నాయి. అందువల్లనే ఈ ప్రాంతం అన్ని రకాల పంటలకు అనువుగా మారింది. ఇక్కడ వరి, గోధుమ, పచ్చజొన్న, మొక్కజొన్న, సద్దలు మొదలైన ఆహార ధాన్యాలు ఎక్కువగా పండిస్తున్నారు. మిర్చి, పత్తి వంటి వాణిజ్య పంటలకు కూడా అనువైన భూభాగమిది. పండ్లు, కూరగాయలు పండించడానికి కూడా అనువుగా వుండి అన్ని విధాలా స్వయం సమృద్ధిని పొందిన ప్రాంతం.

**అడవులు :** జిల్లాలో అడవుల విస్తీర్ణం దాదాపు 52 శాతం ఉంది.

**నదులు :** అటవీ ప్రాంతమైన కొండలు, కోనలతో నిండి వున్న ఈ ప్రాంతంలో సహజసిద్ధమైన నీటి పారుదల వ్యవస్థ వుంది. కొండల నడుమ ప్రవహించే కాలువలకు అడ్డుగా కట్టలు పోసి ఏర్పాటు చేసిన చెరువులే ఇక్కడి ప్రధాన వ్యవసాయాధారం. జిల్లాలో మున్నేరు, ఆకేరు, పాలేరు, వట్టేరు, వెన్నారం కాల్వ, రాళ్ళవాగు, మొండివాగు మొదలైన సహజ సిద్ధమైన కాలువలు పూర్వకాలం నుంచి ఈ నేలను సస్యశ్యామలం చేసి, సిరుల పంటలను కురిపిస్తున్నాయి. అంతేకాకుండా మున్నేరువాగు ఇతర గ్రామాల గుండా ప్రవహించి వెన్నారం కాల్వలో కలుస్తుంది. ఈ కాలువపై తొమ్మిది చెక్‌డ్యాంలను నిర్మించారు. వీటితోపాటు ఆకేరు, పాలేరు వాగులపై చెక్‌డ్యాంలు నిర్మించి పరిసర ప్రాంతాలకు నీటి సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. బయ్యారం మండలంలోని వినోభానగర్ గ్రామం వద్ద వట్టేరుపై నిర్మించిన తులారం (బి.ఎన్.గుప్తా) ప్రాజెక్టు ఆ ప్రాంతానికి సాగునీటిని అందిస్తోంది.

**చెరువులు - ప్రాజెక్టులు :** తెలుగు ప్రాంతాన్ని ఏకఛత్రంగా పరిపాలించిన కాకతీయులు మొదట్లో తమ రాజ్య విస్తరణలో భాగంగా ఒకవైపు యుద్ధాలు చేస్తూనే, ప్రజల్ని సుభిక్షంగా పాలించడం కోసం, వారి ఆర్థిక జీవనం కూడా సంతృప్తికరంగా సాగటం కోసం తగు చర్యలు తీసుకున్నారు. అందుకు ప్రకృతిపై పూర్తి అవగాహనతో, జలసాధనలో సంపూర్ణ విజయం సాధించి వ్యవసాయాభివృద్ధి చేశారు. ఆ క్రమంలోనే తెలంగాణాలో ప్రతి గ్రామానికి ఒక చెరువు వెలసింది. అది ఆనాటి ప్రజల జీవితాలలో వెలుగులు నింపింది. ఆ వెలుగులు చెరువుల రూపంలో ఇప్పటికీ ఉపయోగంలో వున్నాయి.

**జిల్లా బయ్యారం చెరువు :** ఇది కాకతీయుల కాలంలో గణపతిదేవుని చెల్లెలు మైలాంబ తన తల్లి బయ్యాలదేవి నిర్మించిన తటాకం. ఎనిమిది వందల సంవత్సరాలుగా ఈ

ప్రాంత వ్యవసాయానికి ప్రధానాధారంగా నిలిచి వుంది. పెద్ద చెరువుగా పిలిచే ఈ చెరువు చేపల పెంపకానికి, పెంకు తయారీ కార్మికులకు కూడా జీవనాధారంగా వుంది.

**కేసరి సముద్రం (విలేజీ కేసముద్రం చెరువు)** : కాకతీయుల కాలంలో తొలిసారిగా నిర్మించబడిన చెరువుగా పేరున్న చెరువు కేసరి సముద్రం. కాకతీయ వంశపు తొలి రాజన్యులలో రెండవ ప్రోలరాజుకు 'అరిగజకేసరి' అనే బిరుదముంది. ప్రోలరాజు తను చేపట్టిన ప్రజోపయోగ కార్యక్రమాలన్నింటికీ తన బిరుదు పేరుతోనే ప్రచారంలోకి తెచ్చాడు. అలా ఈ చెరువు పేరు కేసరి తటాకం, కేసరి సముద్రం పేరు కాలక్రమంలో కేసముద్రంగా వ్యవహారం లోకి వచ్చింది.

**బి.ఎన్.గుప్తా తులారాం ప్రాజెక్టు** : జిల్లాలో వున్న ఏకైక ప్రాజెక్టు ఇది. బయ్యారం మండలం గీరారం గ్రామ సమీపంలో ఈ ప్రాజెక్టు నిర్మితమై వుంది. కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుని పరిపాలనా కాలంలో అంటే 694 సంవత్సరా లకు పూర్వం ఇది నిర్మితం. పూర్వపు ఆనకట్ట శిథిలమైతే దాని పునరుద్ధరణ కోసం సుదీర్ఘకాలం బి.ఎన్. గుప్తా పోరాటం చేసిన ఫలితంగా 2002 డిసెంబర్ 22 న పునర్నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు సామర్థ్యం 257.09 మిలియన్ల ఘనపుటడుగులు.

దీనితో పాటు మానుకోట పట్టణానికి సమీప గ్రామాలయిన ఈదులపూసపల్లి, తాళ్ళపూసపల్లి గ్రామాలలో కూడా చెరువులున్నాయి. ఈదుల పూసపల్లి చెరువును పెద్ద చెరువుగా పిలుస్తారు. సాధారణంగా కాకతీయుల కాలంనాటి చెరువులను పెద్ద చెరువుగా పిలవడం మనం గమనిస్తాం. ఈ ఈదుల పూసపల్లి చెరువులోకి ఒక్కసారి నిండుగా నీరుచేరి అలుగుపోస్తే రెండు సంవత్సరాలు కొన్ని వందల ఎకరాల వరిసాగుకు సరిపడా నీరందిస్తుంది. అంతేకాక మానుకోట ప్రజల దాహార్తిని తీర్చడంలోను సహకారమందిస్తుంది. అలాగే జానాల చెరువు, జమాండ్ల చెరువు, మానుకోట పట్టణంలో వున్న నిజాం చెరువు, కురవి పెద్ద చెరువు, మొగిలిచర్ల చెరువు, రాజోలు చెరువు, సీరోలు గ్రామచెరువు, తాళ్ళసంకీస

**మున్సిపాలిటీ** : మహబూబాబాద్

**రెవెన్యూ గ్రామాలు** : 285

**గ్రామపంచాయితీలు** : 235

**పోలీస్ హెడ్ క్వార్టర్** : మహబూబాబాద్

**పార్లమెంట్ నియోజకవర్గం** : మహబూబాబాద్

**అసెంబ్లీ నియోజకవర్గాలు** : జిల్లాలో 2 అసెంబ్లీ నియోజక వర్గాలు ఉన్నాయి. 1. మహబూబాబాద్ 2. డోర్నకల్.

**పట్టణాలు** : మహబూబాబాద్ జిల్లాలో ప్రధానంగా 1. మహబూబాబాద్, 2. తొర్రూరు 3. డోర్నకల్లు పట్టణా లున్నాయి.

పెరుమాళ్ళ సంకీస చెరువులు, ఇనుగుర్తిగుండు చెరువు, అయ్యగారి పెళ్ళి చెరువులు, వాటికింద వున్న గుంటలు, వాగులు, వంకలు ఇక్కడి వ్యవసాయానికి ఉపయోగపడు తున్నాయి. తొర్రూరు రెవిన్యూ డివిజన్ నుంచి చూస్తే మాటేడు చెరువు చాలా పెద్దది. దీనికి గణప సముద్రమనే పేరుంది. తొర్రూరు పరిసరాలలో గుర్రూరు చెరువు, కంఠాయపాలెం చెరువు, చిట్యాల చెరువు, దంతాలపల్లి పెద్ద చెరువు, నర్సింహుల పేట చెరువు... ఇలా ఎన్నో చెరువులు ఆ ప్రాంత వ్యవసాయానికి ఉపయోగ పడుతున్నాయి.

**జనాభా** : మహబూబాబాద్ జిల్లా మొత్తం 7,74,549 జనాభాను కలిగి ఉండగా ఇందులో పురుషులు 3,88,058 కాగా స్త్రీలు 3,86,491.

రాష్ట్రంలోనే అత్యధికంగా గిరిజనులున్న ప్రాంతంగా జిల్లాకు ఒక ప్రత్యేకత వుంది. జిల్లాలో అత్యధికంగా గిరిజనులున్న మండలం మరిపెడ. అక్కడ సగానికి పైగా అంటే 36 వేల 742 మంది గిరిజనులే. తర్వాతి స్థానంలో గూడూరు 31,196 గిరిజనులతో రెండవ స్థానం, కురవిలో 31,265 గిరిజనులతో మూడవ స్థానం కాగా, 29,048 గిరిజన జనాభాతో మహబూబాబాద్ నాలుగో స్థానంలో వుంది. 1133 గిరిజన జనాభాతో చిన్నగూడూరు చివరి స్థానంలో వుంది.

జిల్లాలో సాగులో వున్న భూమి 47.950 ఎకరాలు. 1884 చెరువుల క్రింద ఈ భూమి సాగవుతుంది.

**అక్షరాస్యత :** జిల్లాలో అక్షరాస్యతాశాతం 57.13, పురుషుల అక్షరాస్యత 66.52, స్త్రీల అక్షరాస్యత 47.81, రూరల్‌లో అక్షరాస్యత 57.5 శాతం, అర్బన్ 78.67 శాతంగా నమోదయింది.

## జిల్లా చరిత్ర

మానవ చరిత్ర అధ్యయన క్రమంలో ముందుగా తెలుసుకోవాల్సింది ఆదిమ మానవుడి జీవన విధానం. మనిషి ప్రాకృతిక వ్యవస్థకు సంబంధించిన చరిత్రను తెలుసుకోడానికి ఆనాటి మానవ అవశేషాలే ఏకైక ఆధారం. ఇవి ప్రధానంగా ఆనాటి సమాధుల ద్వారానే మనకు లభ్యమౌతాయి. చారిత్రక పూర్వయుగం నాటి మానవ సమాధులను కెయిరనులు అంటారు. ఇవి ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలలో కనిపిస్తాయి. ప్రాకృతిక మానవ వ్యవస్థ నుంచి నాగరికతను సంతరించుకుంటున్న క్రమంలో చనిపోయిన వారి శవాలను ఆయా ప్రాంతాల జనసమూహాల సంప్రదాయాలకు అనుగుణంగా సమాధి చేయడం జరిగేది. అలాంటి ప్రాచీన సమాధులే కెయిరనులు. ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా పరిధిలో వీటిని గుర్తించినట్లు ప్రసిద్ధ చరిత్రకారుడు ఆదిరాజు వీరభద్రరావు రచనలో కనిపిస్తుంది. అవి మానుకోట, డోర్నకల్లు గ్రామాలకు సమీపంలో వున్నట్లు వీరి రచనల ద్వారా తెలుస్తుంది. ఈ ఆధారాలను బట్టి మానుకోట జిల్లాలో అతి ప్రాచీన కాలం నుంచి మానవ ఆవాస కేంద్రాలున్నట్లు, ఆ కాలం నుంచి ఇక్కడ మానవ నాగరికత ఆరంభమైనట్లు మనం గ్రహించవచ్చు.

గోదావరి తీరాన పోతన అంటే ప్రస్తుత బోధన్ రాజధానిగా అశ్మక రాజ్యం వుండేది. వాయు పురాణంలో ఇక్ష్వాకు వంశస్థులు ఈ రాజ్యాన్ని పాలించినట్లు చెప్పబడింది. కాశీ రాజ్యానికి అశ్మక రాజ్యంపై ఆధిపత్యం వున్నట్లు అశ్మక జాతక కథలలో వుంది. దక్షిణాపథంలోని సగ భాగాన్ని అశ్మక జనపదం వ్యాపించి వుంది. ప్రస్తుత తెలుగు ప్రాంతమంతా ఈ అశ్మక జన పదంలో భాగంగానే వుండేది.

## ముదిగొండ చాళుక్యులు

వీరు తెలంగాణకు తూర్పు భాగమున వున్న నాటి మంచికొండ విషయాన్ని పరిపాలించారు. ప్రస్తుత ఖమ్మం లోని ముదిగొండ గ్రామం వారికి రాజధానిగా వుండేది. కాబట్టి వారిని ముదిగొండ చాళుక్యులుగా చరిత్రకారులు వ్యవహరించారు. అప్పటి మంచికొండ విషయం కురవి ప్రాంతం వరకు అంటే నేటి మానుకోట వరకు విస్తరించి వుండేది. వీరిలో కల్యాణీ చాళుక్యులు, ముదిగొండ చాళుక్య శాఖలకు చెందిన వారు ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా పరిధిలోని ప్రాంతాలకు వివిధ కాలాలలో పాలకులుగా వున్నారు.

వీరి చరిత్రకు ఆధారాలుగా రెండు తామ్రదాన పత్రాలు, రెండు శిలా శాసనాలున్నాయి. మొదటిది – మొగలి చెరువు తామ్రదాన పత్రం. ఇది ముదిగొండ చాళుక్య వంశపు నాలుగవ కుసుమాయుధుడు కురవి సమీపాన గల మొగలిచెరువు గ్రామాన్ని దోనెయ అనే బ్రాహ్మణుడికి దానం చేసిన తామ్రదాన పత్రం. రెండవది – రెండవ కుసుమాదిత్యుని కుకునూరు పత్రాలు.

శిలా శాసనాల్లో మొదటిది – రెండవ చాళుక్య భీముని కాలానికి చెందిన నిరవద్యుని కొరవి శాసనం. రెండవది వేములవాడ రాజు రెండవ అరికేసరి కాలానికి చెందిన చెన్నూరు శాసనం.

మొగలిచెరువు శాసనంలో రణమర్ధుడనే రాజు మంచికొండ విషయమునకు, కొండపల్లి ప్రాంతాలకు రాజని చెప్పబడింది. మంచికొండ విషయానికి మంచికొండనాడు అని కూడా పేరుంది. ఇది కొరవి దేశము లేక మండలంలోని అంతర్భాగంగా కాని దాని సరిహద్దు విషయముగానీ కావచ్చని ప్రఖ్యాత చరిత్రకారుడు కందూరి ఈశ్వర దత్తు అభిప్రాయం.

## పొలవాస నాయకులు

పొలవాస నాయకులు రాష్ట్రకూట శాఖకు చెందిన వారు. వీరు పూర్వ కరీంనగర్ జిల్లాలోని ప్రస్తుత జగిత్యాల

జిల్లా కేంద్రానికి దగ్గరలో గల పొలాస గ్రామాన్ని రాజధానిగా చేసుకొని క్రీ.శ. 1075 నుంచి 1160 దాకా పరిపాలన చేశారు. ఈ ప్రాంతాన్ని పూర్వం పొలవాస అనేవారు. ప్రస్తుత మహబూబాబాద్ జిల్లాలోని కొంతభాగం పొలవాస నాయకుల పరిపాలనలో వుండేదని రూఢి అవుతోంది.

**కాకతీయులు :**

కాకతీయ రాజులు 350 సంవత్సరాలకు పైగా ఈ ప్రాంతానికి పాలకులుగా కనబడతారు. అటువంటి కాకతీయ సామ్రాజ్యానికి పునాది రాయి పడింది ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా కురవి ప్రాంతంలోనేనని గర్వంగా చెప్పుకోవచ్చు. రాష్ట్రకూట రాజు రెండో కృష్ణుడు, వేంగీ దేశంపై ఎన్నో దాడులు చేశాడు. రెండవ కృష్ణుడి సేనా నాయకుడిగా వున్న గుండన కృష్ణుడు చేసిన అనేక దాడులలో ఎన్నో విధాలుగా సహాయకారిగా వున్నాడు. ఒకనాటి దండయాత్రలో ప్రాణాలు కోల్పోయాడు. తర్వాతి కాలంలో అతని మనుమడయిన నాలుగవ గుండన చరిత్రలో కాకర్త్య గుండ్యనగా ప్రసిద్ధుడు.

కానీ కాకతీయ స్వతంత్రతకు బాలారిష్టాలు మొదలయ్యాయి. నాలుగవ గుండన రాజ్యపాలన ఎంతో కాలం కొనసాగలేదు. చాళుక్య రాజైన రెండవ తైలపుడికి లొంగిపోకుండా ముదిగొండ చాళుక్యుల ప్రాంతాన్ని చేజిక్కించుకొని స్వతంత్రతను పాటించాడు. కాబట్టి రెండవ తైలపుడి ఆజ్ఞతో విరియాల ఎర్రన గుండనపై దండెత్తి యుద్ధంలో గుండనను సంహరించాడు. నాలుగవ గుండనచే కురవి నుంచి పారద్రోలబడిన 'బొట్టుచేతయ'ను తిరిగి కురవికి రాజుగా నిలబెట్టాడు.

విరియాల ఎర్రయ చేతిలో నాలుగవ గుండన మరణించినపుడు అతని కుమారుడు మొదటి బేతయ చిన్నవాడు. కురవి నుంచి పారద్రోలబడి తిరిగి ఎర్రయతో కురవిలో నిలబెట్టబడిన బేతయకు, గుండన కొడుకు బేతయకు తేడాను గుర్తించడం కోసం ఈ బేతయను గరుడాంక బేతయగా పేర్కొంటారు. తమ పూర్వ ప్రభువులైన రాష్ట్రకూటుల రాజలాంఛనం 'గరుడ' కాబట్టి వారిపై గౌరవానికి చిహ్నంగా ఈ గరుడ లాంఛనాన్ని కాకతీయ వంశీయులు ధరించారని చరిత్రకారుల అభిప్రాయం.

షితాబ్ ఖాన్ వరంగల్లును రాజధానిగా చేసుకొని క్రీ.శ. 1054 నుంచి 1504 నుంచి 1512 వరకు పరిపాలించాడు. ఆ కాలంలో హిందూ ఆలయాల పునరుద్ధరణ కోసం కొంత కృషిచేశాడు. తెలంగాణలో కాకతీయుల అనంతరం హైందవ రాజ్య రక్షణ కోసం కృషిచేసిన కాపయ నాయకుడు, పద్మనాయకులు, కుందూరు రెడ్లవంటి సామంతుల తర్వాత చెప్పుకోదగిన హిందూవీరుడు సీతాపతి రాజు. అతని పాలనలో నేటి మహబూబాబాద్ జిల్లా ఉన్నది అనే చరిత్రను గుర్తుచేయడం కోసమే ఇక్కడి షితాబ్‌ఖాన్ ప్రస్తావన. మహబూబాబాద్ 40 కి.మీ. దూరంలో వున్న పాకాల చెరువుపై కూడా 'షితాబ్‌ఖాన్' గండి పేరుతో ఒక అలుగు ఉండడం మనం గమనించవచ్చు.

కుతుబ్‌షాహీల చివరి రాజైన 'అబుల్ హసన్' కాలం నాటికి గోల్కొండ ఆరు రాష్ట్రాలుగా 37 సర్కార్లు, 517 సిమ్తులుగా వుండేది. గోల్కొండలోని 'తరఫ్'లు అన్నీ సమానంగా లేవు. పరగణాల సంఖ్య వేర్వేరుగా వుండేది. ఆయా సర్కార్ల వైశాల్యం కూడా వేరుగా వుండేది. ఆనాడు ఒక సర్కార్‌గా వున్న వరంగల్‌లో 16 పరగణాలుండేవి. ఆ 16 పరగణాలతో మహబూబాబాద్ ప్రాంతం కూడా ఒక పరగణాగా వుండేది.

ఆసఫ్‌జాహీ పాలకులు మహబూబాబాద్ అలీఖాన్ పాలనా కాలంలో ఒకరి తర్వాత ఒకరు ఇద్దరు సాలార్జంగులు దివాన్ పదవిని చేపట్టారు. ఆ తర్వాత అస్మాన్‌జా, వికారులుమ్రా అనేవారు వరుసగా దివానులయ్యారు. వారి తర్వాత మహారాజా సర్‌కిషన్‌ప్రసాద్ బహద్దూర్ దివానయ్యాడు.

అతిపిన్న వయసులో బాలుడిగా క్రీ.శ.1869 లో నిజాం రాజ్య అధికార పీఠాన్ని పొందిన మహబూబ్ అలీఖాన్ తన ప్రజారంజక పాలనతో 'మహబూబే దక్కన్' గా కీర్తించబడి క్రీ.శ. 1911 లో మరణించాడు. అతనిపై అభిమానంతో తెలంగాణలోని చాలా గ్రామాలకు, పట్టణాలకు కొత్తగా

పేర్లు వాడుకలోకి వచ్చాయి. ఆ క్రమంలోనే మానుకోట మహబూబాబాద్‌గా వ్యవహారంలోకి వచ్చింది.

ఉస్మాన్ అలీఖాన్ పరిపాలనా కాలంలోనే నిజాం రాష్ట్రం అభివృద్ధి పథంలోకి చేరింది. మహబూబాబాద్ పట్టణంలో ఇప్పుడున్న పూర్వపు రైల్వేస్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, కోర్టు భవనం, గతంలో కూల్చిన ఆసుపత్రి భవనం, బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసు మొదలైనవి ఏడవ నిజాం కాలంలో నిర్మించబడినవే.

## జిల్లా ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలు

జిల్లాలో పూర్వం నుంచి ఆధ్యాత్మిక కేంద్రాలుగా విలసిల్లుతున్న ఆలయాలతో పాటు ఇటీవలి కాలంలో ప్రాచుర్యం పొందిన పర్యాటక కేంద్రాలు కూడా ఉన్నాయి .అందులో ప్రధానమైన కొన్నింటిని పరిశీలిద్దాం.

**ప్రసిద్ధ శైవక్షేత్రం – కురవి :** ఈ కురవి శైవక్షేత్రం జిల్లా కేంద్రానికి పది కి.మీ. దూరంలో వుంది. కోరిన వరాలిచ్చే 'కురవి వీరన్న' గా, సంతాన ప్రదాతగా, భూతప్రేత, పిశాచాల పాలిట భయంకరుడిగా భక్తుల పూజలందుకుంటూ భద్రకాళీ సమేతంగా శ్రీ వీరభద్రస్వామి వెలసిన క్షేత్రమిది. ఈ ప్రాంత గిరిజనులే గాక మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల గిరిజనులు సైతం తమ కులదైవంగా భావించి పూజిస్తూ వుంటారు. సంతానం లేని వారు తడిబట్టలతో ఈ ఆలయం చుట్టూ ప్రదక్షిణం చేసి 'పానరసం' తాగితే సంతానం కలుగుతుందని చెప్తారు.

**చిన్న తిరుపతి :** నర్సింహుల పేట మండల కేంద్రానికి శివారున ఇంద్రకీలాద్రి పర్వతంపై పద్మావతి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి వెలసి వున్నారు. మరో పర్వతంపై శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వుంది. ఈ జంట పర్వతాలు యాత్రికులను ఆకర్షిస్తూ, వారికి తిరుపతి దివ్య క్షేత్రాన్ని దర్శించిన భక్తి భావనను కలిగిస్తూ ఈ ప్రాంతంలో చిన్న తిరుపతిగా ప్రసిద్ధికెక్కింది.

**మాటేడు దేవాలయాలు :** కాకతీయ ప్రభువు రెండవ ప్రోలరాజు కాలంలో అతని బంటు వేమబోల బొడ్డీమ మల్లెనాయకుడు మాటేడు గ్రామంలో ఈశ్వరునికి, నారాయణునికి, ఆదిత్యునికి త్రికూటాలయం నిర్మించాడు. ప్రస్తుతం ఇది రామలింగేశ్వర, వేణుగోపాల స్వామి దేవాలయాలుగా వ్యవహరించబడుతూ, తొర్రూరు ప్రాంతంలో ప్రసిద్ధ ఆధ్యాత్మిక కేంద్రంగా వుంది.

**అనంతాద్రి :** మహబూబాబాద్ పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో అనంతారం గ్రామ శివారులో ఈ దేవస్థానం వుంది. స్థానికంగా చిన్నతిరుపతిగా ప్రాచుర్యం పొందింది. ఇది స్వయంభూ జగన్నాథ, వేంకటేశ్వర స్వామివార్ల దేవస్థానం. క్రీ.శ. 1312 లో ఈ ఆలయ నిర్మాణం జరిగినట్లు చరిత్ర చెబుతోంది. కానీ ఇది చాలా కాలం శిథిలావస్థలో వుండి తర్వాత పునరుత్థానం పొందింది. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ పెద్దజీయర్ స్వామి ఇక్కడ పునర్వసు దీక్షతో 27 రోజులు శ్రీరామ మహాక్రతువులు నిర్వహించి 102 వ శ్రీరామక్రతు స్థూపాన్ని ప్రతిష్ఠించారు. ఇపుడు చాలా మంచి సౌకర్యాలతో మహా వైభవంగా వెలుగొందుతోంది.

**ఎపిఫనీ కేథడ్రిల్ చర్చి :** డోర్నకల్ గ్రామంలో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచి వున్న ఎపిఫనీ కేథడ్రిల్ చర్చి ప్రార్థనా మందిరంగా చాలా ప్రసిద్ధి పొందింది. ఇది హిందూ, ముస్లిం, క్రైస్తవ, ద్రావిడ శిల్ప సంప్రదాయాల సమ్మిళిత కేంద్రంగా విలసిల్లుతోంది. 1915 లో మద్రాసుకు చెందిన ఐదవ బిషప్ హైనీసైట్ ఏహెడ్ ఈ చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేశాడు. ఈ దేవాలయాలే కాకుండా ప్రస్తుతం కొన్ని శిథిలావస్థలో వున్న దేవాలయాలు కూడా వున్నాయి. గూడూరు మండల కేంద్రంలో శిథిలమైన కాకతీయుల కాలం నాటిదిగా చెప్పుకుంటున్న శివాలయం వుంది. అలాంటిదే కొత్తగూడ మండలంలో కేసముద్రం మండలం వెనుగొండ గ్రామంలో రమణీయ శిల్పకళా వైభవంతో నిర్మించిన పదహారు స్తంభాల శ్రీ లక్ష్మీనృసింహాలయం, కురవి మండలం గుండ్రాతి మడుగులో వేంకటేశ్వర స్వామి ఆలయం, సీరోలు, మొగలిచర్ల గ్రామాలలో శిథిలమై వున్న శివాలయాలు ఎన్నో వున్నాయి. మహబూబాబాద్ పట్టణంలో శివాలయం,

వేణుగోపాలస్వామి ఆలయాలు కూడా వున్నాయి, కానీ వాటి చారిత్రకత తెలియడం లేదు.

**ఇమాంషావలీ దర్గా :** మహబూబాబాద్ పట్టణానికి మూడు కి.మీ. దూరంలో వున్న ఈదుల పూసపల్లి గ్రామంలో ఈ దర్గా వుంది. మానుకోట పట్టణానికి చెంది సంపన్నుడైన ఒక పారిశ్రామికవేత్త ఈ దర్గాను నిర్మించినట్లు చెబుతారు. ఈ దర్గా నిర్మాణమైన నాటినుంచి ఇస్లాం కాలమాన ప్రకారం వారి క్యాలెండర్‌లో వచ్చే మూడవ నెల జిల్‌హల్ మాసంలో 12 వ రోజున, దేశవ్యాప్తంగా బక్రీద్ పండుగను జరుపుకున్న రెండవ రోజున ఇక్కడ ఉర్సు నిర్వహిస్తూ వారి హిజ్రి క్యాలెండర్ ప్రకారం జిల్‌హల్ మాసంలో 11 వ రోజున మహబూబాబాద్ నుంచి సందల్‌ను కందిల్‌తో ఊరేగింపుగా తెచ్చి 12 వ రోజున ఇమాంషావలీ దర్గాకు గంథ లేపనం చేసి ఉర్సు ప్రారంభిస్తారు. మతాలకతీతంగా వేలాది మంది భక్తులతో చాలా సందడిగా వెలుగొందుతోంది.

## జిల్లా ప్రాచీన ఆధునిక సాహిత్యాలు

దట్టమైన అడవులతో నిండి వున్న ఈ ప్రాంతం గిరిజన ఆవాస కేంద్రంగా ఉండటం వల్ల ఇక్కడ కళలు, సాహిత్యం, సాంస్కృతిక వికాసం ఎక్కువగా జరగలేదని కొందరు పండితుల అభిప్రాయం. కొంత లోతైన పరిశోధన చేస్తే ఇక్కడ ఉదయించి, వికాస దశకు చేరుకున్న కళలు, సాహిత్యం కూడా చాలానే వెలుగుచూసే అవకాశం వుంది. ఇక్కడ వెలువడిన మౌఖిక, లిఖిత సాహిత్యాలలో మనం ఒడిసి పట్టుకోగలిగేది లిఖిత సాహిత్యం మాత్రమే. అది శాసనాల రూపంలోను, గ్రంథ రచనల రూపంలోనూ మనకు లభిస్తుంది.

**శాసన వాఙ్మయం** : మహబూబాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు లభించిన శాసనాలను చూస్తే కాలక్రమంలో సాహిత్య ప్రాధాన్యం కలిగి వున్న చాలా విలువైన శాసనం మాటేడు శాసనం. ఆ తర్వాత కందికొండ శాసనం, గోవిందాపురం శాసనం, మొగిరి చెరువు దాన పత్రం, ఇనుగుర్తి శాసనం, బయ్యారం శాసనం. కురవిలో బయల్పడిన మూడు శాసనాలు ప్రముఖమైనవి.

**జిల్లా మాటేడు శాసనం :** కాకతీయుల కాలంనాటి మొదటి తెలుగు గద్య పద్యాత్మక శాసనం ఇది. మహబూబాబాద్ జిల్లాకు సంబంధించి మొదటి తెలుగు శాసనం కూడా ఇదే. కాకతీయ ప్రభువు రెండవ ప్రోలరాజు బంటు అయిన వేమబోల బొడ్డమ మల్లెనాయుడు మాటేడు గ్రామంలో వేయించిన శాసనం ఇది. ఇందులో మల్లె నాయకుని తండ్రి తాతల ప్రశస్తి వర్ణించబడింది.

ఈ శాసనంలోని పద్యాలకు సాహిత్య గౌరవం లేకపోయినా, ఈ ప్రాంతంలో వచ్చిన తొలి పద్య వాఙ్మయంగా దీనికి ప్రత్యేక గౌరవము వుంది.

**కందికొండ శాసనాలు :** రేచర్ల పద్మనాయక వంశీయుడు వెన్నభూపాలుడు వేయించిన శాసనం ఒకటి. ఇది కందికొండ లేక స్కంధాద్రిలో జనార్ధన స్వామిని ప్రతిష్ఠించి పూజాదికాల కొరకు కొంత భూమిని దానమిచ్చిన సందర్భంలో వేయించబడింది. ఇది శిలాఫలకంపై మూడు వైపులా వుంది. రెండువైపుల సంస్కృత భాషలోను, ఒకవైపు తెలుగు భాషలోను మొత్తం 91 పంక్తులలో వుంది. కందికొండలోని మరొక శాసనం క్రీ.శ. 1375 లో కందికొండ గ్రామంలో జనార్ధన స్వామి ఆలయాన్ని నిర్మించి, దాని నిర్వహణ కోసం కొంత భూమిని దానంగా ఇచ్చిన శాసనం.

**గోవిందాపురం శాసనం :** గోవిందాపుర శాసనం పొలవాస నాయకులు వేయించింది. గోవిందాపురం గ్రామం ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో వుంది. పొలవాస నాయకులు మేడరాజు మంత్రి నాగరాజు, ఇరవై మూడవ తీర్థంకరుడైన పార్శ్వనాథుని విగ్రహాన్ని ప్రతిష్ఠించాడని, జగ్గదేవుని కుమారులైన రెండవ మేడరాజు, గుండరాజులు పార్శ్వనాథాలయానికి కొన్ని దానాలు చేశారని ఈ శాసనం తెలియజేస్తుంది. పొలవాస నాయకుల వంశ క్రమాన్ని కూడా ఈ శాసనం తెలియజేస్తుంది.

**మొగిలిచెరువు తామ్రదాన పత్రం :** ఇది చాళుక్యరాజు నాలుగవ కుసుమాయుధుని చెరువు దానపత్రం. ఈ కుసుమాయుధుడు చాళుక్య రణమర్దుని కుటుంబానికి చెందిన

నాలుగవ రాజు. కురవి సమీపాన గల మొగలిచర్ల గ్రామాన్ని దోనెయ అనే బ్రాహ్మణునికి కుసుమాయుధుడు దానమిచ్చాడని తెలుస్తుంది.

**బయ్యారం శాసనం :** కాకతీయ వంశ చరిత్ర నిర్మాణానికి అత్యంత మూలాధారమైంది బయ్యారం శాసనం. ఇది 1965 లో వెలుగుచూసింది. అంతకు పూర్వం కాకతీయ వంశవృక్ష నిర్మాణంలో వున్న చిక్కుముడులు ఈ శాసనం వల్ల విడివడ్డాయి. ఇలా మహబూబాబాద్ జిల్లా పరిధిలో బయల్పడిన శాసనాలు చరిత్ర నిర్మాణానికి తోడ్పడుతూ ప్రాచీన భాషా సాహిత్యాల తీరు తెన్నులను తెలుసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాయి.

**ప్రాచీన కవులు – వారి సాహిత్యం :** సాధారణంగా తెలుగు వారి ఇంటిపేర్లు వారి పూర్వీకుల నివాస గ్రామాలను బట్టి వస్తున్నట్లు అందరికీ తెలిసిన విషయమే. మహబూబాబాద్ జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన కురవి తూర్పు చాళుక్యులు రాష్ట్రకూటుల పరిపాలనా కాలంలో ఒక ప్రసిద్ధ పట్టణంగా పరిమిత ప్రాంతానికి రాజధానిగా వున్నట్లు చరిత్రలో చూస్తాం. చారిత్రక ప్రసిద్ధి నొందిన ఈ కురవి కవి పండిత కుటుంబాలకు నెలవై వుండవచ్చునన్నది ప్రస్తుతాంశం. ఆ కవి, పండిత కుటుంబాలకు చెందినవాడే కొరవి సత్యనారన. వీరు కొరవి గోపరాజుకు తాత.

## గోలకొండ కవుల సంచికలో మానుకోట కవులు

తెలంగాణ వైతాళిక శిరోమణి సురవరం ప్రతాపరెడ్డి గారు 1934 లో ప్రకటించిన 'గోలకొండ కవుల సంచిక' లో ప్రస్తుత మానుకోట జిల్లాకు సంబంధించిన ఎనిమిది మంది కవుల పద్యాలు చోటు చేసుకున్నాయి. ముందుగా మానుకోట పట్టణ స్థానికుడైన కన్నెగంటి సత్యనారాయణ మూర్తి 'భాగ్య సంపూత' శీర్షికతో రాసిన పద్యాలలో ఒక పద్యాన్నిక్కడ చూద్దాం.

**"ధీరోధాత్తుడు రామచంద్రుడు జగద్విఖ్యాత చారిత్రుడోం**
**కారుండోముత లక్ష్మణాఢ్య కవితాఖండ ప్రతాపాయతో**
**ధారత్వంబు నిజాము రాష్ట్ర నిజభక్త శ్రేణికిప్పట్టునన్**
**భారంబౌ కవి కోటి నాస్తియను దుర్వ్యాఖ్యౌఘముల్"**

తెలంగాణ ప్రాంతంలో కవులు పూజ్యమన్న ఆంధ్రా ప్రాంతం వారి దురహంకార పూరితమైన వ్యాఖ్యలకు సత్యనారాయణమూర్తి ఎంత ఘాటుగా స్పందించాడో హైదరాబాదు సంస్థానంపై అతనికి ఎంత పూజ్య భావ ముండేదో ఈ ఖండికలో తెలుస్తుంది.

ప్రస్తుత నెల్లికుదురు మండలం రాజులకొత్తపల్లి గ్రామ వాస్తవ్యులైన కందాళ శఠగోపాలాచార్యులు గారు 'జ్యేష్ఠా దేవిస్తవము' పేర ఒక చంపకమాల, రెండు ఉత్పలమాలలలో నాడు తెలంగాణాలో తిష్ఠ వేసిన దరిద్ర దేవతను పొగుడుచూ సాగనంపే ప్రయత్నం చేశాడు. గార్ల జాగీరు చెందిన మాటేటి వరవరరావు గారు 'గోపాల చూడామణి' మకుటంతో శతకం రాసాడు. అందులోని రెండు శార్దూలాలు గోలకొండ కవుల సంచికలో అచ్చయ్యాయి.

అదే గార్ల జాగీరుకు చెందిన మాటేటి గోపాలరావు గారు గొప్ప కవి, పండితుడు. ఆయన 'సింధుమతీ విలాసం' గార్ల వేంకటేశ్వర శతకం రాసాడు.

ఇనుగుర్తి గ్రామానికి చెందిన ఒద్దిరాజు గోపాలరావు 'విశేష శతకము', 'మనోరమ' అనే గ్రంథాలు రచించినట్లు గోలకొండ కవుల సంచిక ద్వారా తెలుస్తుంది. 'విశేష శతకము' లోని ఐదు పద్యాలు సంచికలో చోటు చేసుకున్నాయి. గోలకొండ కవుల సంచిక వెలువడే నాటికి తెలంగాణాలో చాలామంది కవులు రచనలు చేస్తున్నారు. అలాగే మహబూబాబాద్ ప్రాంతంలో కూడా సంచికలో చోటు చేసుకోని కవులు మరికొంత మంది ఉండవచ్చు. అయితే ప్రతాపరెడ్డి గారు పూర్వ కవులను పరిచయం చేస్తున్న క్రమంలో 1300 సంవత్సరానికి చెందిన ఈ ప్రాంత కవి గోపమంత్రిని పేర్కొన్నాడు. గోపమంత్రి సింధుమతీ విలాసమనే శృంగార కావ్యాన్ని రాశాడు. వీరితో పాటు పందొమ్మిదో శతాబ్దానికి చెందిన వైష్ణవ కవి మాడభూషణం రంగాచార్యులు. గొప్ప భగవద్విషయవేత్త. ఈయన

'రామాయణ రహస్యత్రయ వివరణం, తిరునామాలు' వంటి గ్రంథాలు రచించాడు. వీరి స్వగ్రామం నెల్లికుదురు.

వీరి తర్వాత మహబూబాబాద్ ప్రాంతంలో అపారమైన సాహితీ సృజన చేసిన మహామూర్తులు ఒద్దిరాజు సోదరులు, దాశరథి సోదరులు.

**ఒద్దిరాజు సోదరులు** : వీరి వంశీయులు పూర్వం నుంచి ఇనుగుర్తిలో దేశ్‌ముఖులు. వీరిది సంపన్న కుటుంబం. తమ సంపదను తమ విలాసాల కోసం కాకుండా సాహిత్యంతో ముడిపెట్టి శాశ్వత కీర్తిని సంపాదించారు. ఇందుకోసం వీరు "విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాల" పేరుతో చాలా గ్రంథాలు రాశారు. అంతేకాకుండా 'తెనుగు' పత్రికను తొలిసారిగా నడిపిన ఘనత కూడా వీరికే దక్కుతుంది. వీరిలో పెద్దవారైన సీతారామచంద్ర రావు సంస్కృతం, ఆంగ్లం, ఆంధ్ర భాషలతో పాటు ఉర్దూ, అరబ్బీ, తమిళం భాషలలో అసమాన పండితుడు. వీరి పాండిత్యానికి నికషోపలంగా చెప్పదగింది 'సౌదామినీ పరిణయం' ప్రబంధం. దీన్ని పేర్వారం జగన్నాథం సంపాదకత్వంలో కాకతీయ విశ్వవిద్యాలయం ప్రచురించింది. దీనితో పాటు 'రుద్రమదేవి' అనే చారిత్రక నవల, 'ఉపదేశ రత్నమాల' అనే వైష్ణవ సంప్రదాయ గ్రంథం, శౌర్యశక్తి, బ్రాహ్మణ సాహసము, వరాహముద్ర, భ్రమర, స్త్రీ సాహసం మొదలైనవి రచించారు.

ఈ సోదరులలో చిన్నవారు రాఘవ రంగారావు గారు. ఈ సోదరులిద్దరి గురించి వేర్వేరుగా రంగరించి చెప్పలేనంత కలివిడిగా సాగింది వీరి రచనా వ్యాసంగం. రాఘవ రంగారావు గారు కొన్ని శాస్త్రగ్రంథాలను, సంస్కృత గ్రంథాలకు వ్యాఖ్యానం, వ్యాకరణ గ్రంథాలు రచించినట్లు తెలుస్తుంది.

ఒద్దిరాజు సోదరులతో పాటు దాశరథి సోదరులు కూడా తమ సాహిత్యంతో జిల్లాను సాహిత్యంలో శిఖరాయమానంగా నిలబెట్టారు. దాశరథి సోదరులు మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు గ్రామంలో జన్మించారు. తెలుగు సాహిత్యంలో ఇద్దరూ ఇద్దరే. వీరిలో పెద్దవారు దాశరథి కృష్ణమాచార్యులు, చిన్నవారు దాశరథి రంగాచార్యులు. కృష్ణమాచార్యులు కవిగా 'దాశరథి' పేరుతో ప్రసిద్ధిగాంచారు. బాల్యంలోనే పద్య కవితా సాధన చేసినవారు. కవిగా, నిజాం రాజు నిరంకుశత్వాన్ని ఎదిరించిన యోధుడు. అంతేకాకుండా ఏకంగా జైలు గోడలపైనే బొగ్గుతో పద్యాలను రాశాడు.

**"ఓ నిజాము పిశాచమా! కానరాదు**
**నిన్నుబోలిన రాజు మాకెన్నడేని**
**తీగెలను తెంపి అగ్నిలో దింపినావు**
**నా తెలంగాణ కోటి రతనాల వీణ'**

అంతేకాకుండా 'అగ్నిధార', 'రుద్రవీణ', 'మహాబోధ', 'మహేంద్రోదయం', 'పునర్నవం', అమృతాభిషేకం, కవితా పుష్పకం, తిమిరంతో సమరం, నవ మంజరి, దాశరథి శతకం లాంటి గ్రంథాలు ప్రచురించడమే కాకుండా, సినిమా పాటలు కూడా రాశారు.

దాశరథి సోదరులలో చిన్నవాడు దాశరథి రంగాచార్యులు. అన్న కృష్ణమాచార్యులు పద్య రచనలో ప్రసిద్ధుడయితే, తమ్ముడు వచన రచనలో సిద్ధహస్తుడు. తనకు వ్యక్తిగా, ఉద్యమకారునిగా, రచయితగా జన్మనిచ్చిన తెలంగాణ జన జీవనాన్ని చిత్రించడం ఒక ఎత్తుగా, తన మాతృ దేశమయిన భరతదేశ ఆర్ష సంస్కృతీ సంప్రదాయాలను గర్భీకరించుకున్న వేదాలు, పురాణాలు, భారత, రామాయణేతిహాసాలను సరళ సుందర వ్యాఖ్యానాలతో సామాన్యులకు అందుబాటులోకి తెచ్చారు. వీరి మొదటి నవల 'చిల్లర దేవుళ్ళు'. అదే ఒరవడిలో మోదుగుపూలు, జనపదం, రానున్నది ఏది నిజం?, మానవతా శరతల్పం, అమృతం గమయ, పావని నవలలు కూడా రాసి విస్తృతమైన తెలంగాణ జీవితానికి అద్దం పట్టారు.

### ఆధునిక కవులు, రచయితలు - వాగ్గేయకారులు

**రుక్మిణీ రామిరెడ్డి** : రంగాచార్యుల గారి శిష్యులుగా, డోర్నకల్ గ్రామం హైస్కూలులో సాహిత్య ఓనమాలు దిద్దుకున్నారు. అదే పాఠశాలలో చాలాకాలం ఉపాధ్యాయులుగా పనిచేసిన బహుముఖీన ప్రజ్ఞాశాలి. నాటకకర్తగా, ప్రయోక్తగా, కథా రచయితగా, కార్టూనిస్టుగా ప్రసిద్ధు డయ్యాడు. వీరు రచించిన 'పంజరంలో చిలుక' నాటి ఆంధ్ర రాష్ట్రమంతా అనేక

ప్రదర్శనలిచ్చింది. వాడు దేవుడ్ని చూశాడు, కట్టు, కూడు, నీడ, పనిమనిషి, ముడి, వడ్డించిన విస్తరి, ఎలుక తోలు, కంచెను మేసిన చేను వంటి అనేక కథలను రచించారు.

**కోమాకుల సీతారాములు :** వీరు దళిత బహుజన సామాజిక దృక్పథంతో రచనలు చేస్తున్న నిబద్ధత గల రచయిత. పుట్టింది మానుకోటలోనే కానీ, సాహితీ వ్యవసాయాన్ని చేసింది మాత్రం ఖమ్మంలో. వీరు రచించిన నాటికల్లో తొలికోడి కూసింది, మనకోసం వంటివి పలువురి ప్రశంసలు పొంది అతనికి నాటక రచయితగా గుర్తింపు నిచ్చాయి. 'జన్మభూమి' పేరిట అతని నాటికలు, 'గుమ్మడి పూలు' కథల సంపుటులు విడుదల చేశారు.

**దార్ల రామచంద్ర :** అంబేద్కర్ భావజాల ప్రభావంతో రచనలు చేస్తున్న కవి, రచయిత దార్ల రామచంద్ర. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ప్రవృత్తి రీత్యా సాహిత్యోపాసకుడు. వీరి రచనల్లో 'కిర్రుచెప్పులు' కథా సంపుటి కథా రచయితగా గుర్తింపు తెచ్చింది. తెలంగాణ ఉద్యమ కాలంలో వీరు రచించిన కవితల్ని 'విధ్వంసపు ఆనవాళ్ళు' పేరుతో సంపుటిగా వెలువరించారు. 'చంద్రహాస ఖడ్గం' (నానీలు), 'మా ఊరు' (వచనకవితా సంకలనం), 'పాట మా ప్రాణం' (సామాజిక గేయాలు) వంటివి ముద్రణ పొందాయి.

**సయ్యద్ ఖుర్షీద్ :** వీరు కవి, రచయిత, సామాజిక విశ్లేషకులు. వృత్తిరీత్యా కో ఆపరేటివ్ డిప్యూటీ రిజిస్ట్రార్. కానీ తన సాహితీ కృషి అభిరుచితో సాహిత్య జీవనం ముందుకు సాగింది. అందుకు మానుకోట వేదికైంది. మేడిపండు బ్రతుకులు, అద్దాలమేడ, దొంగాట, ఫైసలా, బాబోయ్ పోలీస్ వంటి మరెన్నో కథలను రాసాడు.

**వి.ఎస్.పాణి :** వీరు రచించిన కథలలో 'ది వైట్ టైగర్' కథ శిల్పరీత్యా అనేక మన్ననలను పొందింది. ఆర్థిక సమస్యలతో సతమతమయ్యే మధ్య తరగతి జీవుడి వేదన ఎలా వుంటుందో ఇందులో వివరించారు. అంతేకాకుండా బాల్య స్నేహితులు, అవార్డులు, సన్మానాలు, ఫేస్ రీడింగ్, ఎంటర్ ది డ్రాగన్, కపాల నృత్యం, ఒక తోక కావాలి ముఖ్యమైనవి.

**మద్దెర్ల రమేశ్ :** వీరు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. వీరు కవి, రచయిత, వ్యాఖ్యాత, క్విజ్ మాస్టర్‌గా జిల్లాకు సుపరిచితులు. గత రెండు దశాబ్దాలుగా రాస్తున్న కవితల్లోంచి కొన్ని కవితల్ని ఏరి 'మళ్ళీ మళ్ళీ ఉదయిస్తాను' పేరుతో సంపుటంగా కూర్చాడు. బాధ్యతలు, ఆసం, విముఖత, ఆర్థికం, దాపరికం, అస్వతంత్ర, పరాధీన, అమ్మపెట్టిన భిక్ష వంటి కథలను రచించారు.

**బండారి రాజ్‌కుమార్ :** తెలంగాణ భాషను, యాసను కవిత్వంలో కమ్మగా పలికిస్తున్న యువకవి. 'గరిక పోస', 'నిప్పుమెరికలు', 'గోస' వంటి కవితా సంపుటాలు వెలువరించారు. 'వెలుతురు గబ్బిలం' అనే మరో సంపుటిని సాహితీ లోకానికి అందించే ప్రయత్నంలో వున్నారు. అంతేగాక ఉమ్మడి వరంగల్ జిల్లా కవితలతో ఒక సంకలనాన్ని తన సంపాదకత్వంలో తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు.

**అక్షరం ప్రభాకర్ :** నాగెల్లి ప్రభాకర్ కవి, ఉపాధ్యాయుడు. 'అక్షరం సాక్షిగా' అనే తన మినీ కవితల సంపుటితో అక్షరం ప్రభాకర్‌గా వెలుగులోకి వచ్చాడు. నిబద్ధత గల ఉపాధ్యాయునిగా ఉద్యోగ జీవితం గడుపుతూ ప్రాథమిక విద్యార్థులకు తెలుగు భాషను సులభంగా నేర్పడం కోసం 'అక్షరాభ్యాసం' అనే గ్రంథాన్ని రాసి ప్రచురించాడు.

**డా. చింత రమేశ్ :** వీరు వృత్తిరీత్యా వైద్యులు. ప్రవృత్తి రీత్యా కవి. సామాజిక దృక్పథంతో కూడిన పద్దెనిమిది కవితలతో 'అడవి' అనే సంపుటిని ప్రచురించారు. అందులో ప్రపంచీకరణను వ్యతిరేకించేవి. స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు, తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన కవిత లున్నాయి. కొమురం భీం పోరాట స్ఫూర్తిని అభిమానించే రమేశ్, ఆ కోణంలో కూడా కవితలు, వ్యాసాలను రాశాడు.

**చిందకుంట్ల కుమార స్వామి :** వీరు కవి, నాటికల రచయిత, ప్రయోక్త, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత. నమో యమా, సెల్‌ఫోన్ సునామీ, కార్గిల్, ఇప్పుడే పెళ్ళెందుకు?, తల్లిదండ్రులూ జాగ్రత్త!, పెళ్ళిచూపులు వంటి నాటకాలను రచించారు.

**మండవ రాజు మల్లేశ్ :** వీరు కవి, సినీగేయ రచయిత. ఉపాధ్యాయులు కూడానూ. కేవలం మానుకోట ప్రాంతానికే కాక, తెలుగు రాష్ట్రాలకు సుపరిచితులు. వీరు విద్యార్థి దశ నుంచే గాయకులుగా సుపరిచితులు. 'శ్రీనిలయం' సినిమాలో 'మావూరు ఒక్కసారి పోయి రావాలి' అనే పాటను రాశాడు. నలబై కవితలలో ఇటీవల 'కుంపటి' పేరుతో సంపుటిని విడుదల చేశాడు.

**టి.వి. రాం నర్సయ్య :** వీరు ప్రభుత్వ ఉపాధ్యాయులు. గతంలో రెండు దశాబ్దాలకు పైగా పాత్రికేయవృత్తిలో వున్నారు. వీరు అనేక కవితలు, కథలు, వ్యాసాలు రాశారు. అందులో భాగంగా ధిక్కారం, నాయిన, ఊపిరి వంటి ప్రసిద్ధ సంకలనాలలో రాంనర్సయ్య కవితలున్నాయి. అంతేకాకుండా మామిడి హరికృష్ణ ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'తొలిపొద్దు' కవితా సంకలనంలో వీరి కవిత వుంది.

**గుర్రపు సత్యనారాయణ :** వీరు కవి, తెలుగు భాషా పరిరక్షణ ఉద్యమకారుడు. సహృదయత గల సాహిత్యాభిమాని. 'లేవాలి నిద్రలేవాలి' అనే గుడుంబా వ్యతిరేక గేయాలు రాసి గుడుంబా నిర్మూలనకు కృషిచేశాడు. 'మట్టి' అనే దీర్ఘ కవితలో మనిషికీ, మట్టికీ వుండే సంబంధాన్ని వివరించాడు. అవయవ దానం గొప్పదని తెలుపుతూ 'చిరంజీవి' అనే దీర్ఘ కవితను రచించాడు.

**తాదూరి మోహనాచార్యులు :** వీరు పద్యకవి. తొర్రూరు దగ్గర వెలికట్టె వీరి స్వగ్రామం. పద్య రచనలో అందెవేసిన చేయి. తొర్రూరు ప్రాంతానికి పద్య కవితాభిమానులకు సుపరిచితులు. వీరికి కీర్తి తెచ్చిపెట్టినది 'సంగమేశ్వర శతకం'.

వీరు కాక తొర్రూరు ప్రాంతంలో పద్య కవిత్వంలో ఈశ్వర ప్రసాద్, అక్కెర సదానందాచారి, కరుణా సాగర్. అమ్మాపూర్ గ్రామం నుంచి గట్టు నవీన్, నెల్లికుదురు మండలంలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కందగట్ల రాకేశ్, ఇమ్మడి రాంబాయి, బుదారపు శ్రీనివాస్, తండ ప్రభాకర్, రఘు నారాయణ లాంటి యువకవులు కవిత్వ యవనికపై వస్తున్నారు.

## రచయిత్రులు, కవయిత్రులు :

**సంకేపల్లి కీర్తనారెడ్డి :** నూతనంగా కవిత్వం రాస్తున్న యువ కవయిత్రి. ఉపాధ్యాయురాలిగా, మహిళా సభలు, సమావేశాల్లో వ్యాఖ్యాతగా చిరపరితులు. గత కొద్ది కాలంగా రాస్తున్న తన కవితలను 'జీవన వీణ' పేరుతో సంపుటిని ఇటీవలే ఆవిష్కరించారు. గేయ కవితా ఫణితిలో కొన్ని కవితలు, వచన కవితా లక్షణంలో మరికొన్ని కవితలున్న 'జీవనయాణం' ఆమె సామాజిక దృక్పథాన్ని వ్యక్తం చేస్తాయి.

**కొమ్మల సంధ్య :** వీరు కేసముద్రం కల్వల గ్రామానికి చెందిన యువ కవయిత్రి. వృత్తిరీత్యా తెలుగు అధ్యాపకురాలు. వీరు బతుకమ్మ పాటలు రాయడంలో సిద్ధహస్తురాలు. తాను రాసిన స్త్రీల పాటలను 'పూల జాతర' పేరుతో పుస్తకంగా ప్రచురించారు. ఇందులో 108 పాటలున్నాయి.

**డా. టి.యాకమ్మ :** తాళ్ళపెల్లి యాకమ్మ వృత్తిరీత్యా తెలుగు ఉపాధ్యాయురాలు. కొద్దికాలంగా కవితలు రాసి కవి సమ్మేళనాలలో తనదైన గొంతుకను వినిపిస్తోంది. ఇటీవలే 'బోయ జంగయ సాహిత్యం - అనుశీలన' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు.

వీరు కాకుండా జిల్లాలో కుంజ కళ్యాణి ఒకరు. వీరి సామాజిక వర్గమైన కోయజాతి సమస్యలు, సమాజంలో వారు ఎదుర్కొంటున్న అసమానతల గురించి కవిత్వం రాస్తున్నారు. టి. భారవి. ఉపాధ్యాయురాలు. చాలా కవితలు, పాటలు రచించింది. తను పనిచేస్తున్న పాఠశాలను కేంద్రంగా చేసుకొని విద్యార్థులను సాహిత్యాభిమానులుగా తీర్చిదిద్దుతున్నారు.

**కొమిరె వెంకన్న :** కొమిరె వెంకన్న కవి, గాయకుడు. తత్వాల రచయిత.మంచి ప్రజా వాగ్గేయకారుడు. తెలంగాణ రాష్ట్ర సాధనకు పాటకు పట్టం కట్టి, కాలికి బలపం కట్టి రాష్ట్రం నలుమూలలా తిరిగాడు. 'తెలంగాణా ధూం ధాం' లో అనేక పాటలను పాడారు. వీరు రాసిన పాటలు 'అమ్మ తెలంగాణ వందనాలమ్మా - నా తెలంగాణ తల్లి, నాకు జన్మనిచ్చిన తల్లి వందనాలమ్మా" అనే పాట ఊరూరా వాడవాడలా ప్రతిధ్వనించింది.

**జయరాజు :** జయరాజ్ రాసిన పాటలు 'జయరాజ్ పాటల సంకలనం - 1, సంకలనం - 2, 'వసంత గీతం - 1, 'వసంత గీతం - 2' పుస్తకాలుగా వెలువడ్డాయి. ఆయన జీవితానుభవాలను 'జ్ఞాపకాలు' పేరుతో గ్రంథం వెలువడింది. ఈ పుస్తకం జయరాజ్‌కు మరింత సాహిత్య గౌరవాన్ని పెంచింది. అంతేకాకుండా తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక పాటలు పాడి, రచించి ఖ్యాతి గడించారు. 'ఎవరో ఈ బిడ్డలు నింగిలో నెలవంకలు', అమ్మ పాటలు, వృక్షాన్నిరా.. నేను వృక్షాన్నిరా...., వానమ్మా.. వానమ్మా పాట, విద్య ఆవశ్యకత గురించి సినిమాలో రాసిన పాటలు బహుళ ప్రాచుర్యం పొందాయి.

**కందుల ప్రేమ్‌కుమార్ :** వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. ప్రవృత్తి రీత్యా కవి, గాయకులు, వాగ్గేయకారులు. మహబూబాబాద్ జిల్లా పూర్వ మరిపెడ మండలం గుండంరాజుపల్లి గ్రామంలో పుట్టిన వీరు గాయకులుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి సుపరిచితులు.

**గిద్దె రాంనర్సయ్య :** వీరు తొర్రూరు మండలం చిట్యాల గ్రామంలో జన్మించిన తెలంగాణ ముద్దుబిడ్డ. తెలంగాణ ఉద్యమంలో రాంనర్సయ్య చిందెయ్యని వేదిక లేదంటే అతిశయోక్తి కాదు. వీరు అనేక పాటలు రచించారు. వేదికపై ప్రస్తుతాంశాలకు తగిన సామాజిక వస్తువుతో జానపద ఫక్కీలో కవితలల్లి గానం చేస్తారు.


**కొంకాల శంకర్ :** వాగ్గేయకారునిగా, నటుడిగా జిల్లాకు సుపరిచితులైన వీరు కేసముద్రం సమీప గ్రామమైన ఉప్పరపల్లి వాస్తవ్యుడు. బాల్యం నుంచే సామాజికోద్యమాలలో పాల్గొంటూ గాయకుడిగా, వాగ్గేయకారునిగా ఎదిగాడు. శంకర్ తీసిన 'తెలంగాణ' సినిమాలో రావి నారాయణరెడ్డి పాత్ర రుద్రమదేవి డాక్యుమెంటరీ చిత్రంలో అంబదేవుడి పాత్ర వేసి నటుడిగా గుర్తింపు పొందారు.

ఇంకా చాలామంది కళాకారులు జిల్లాను సాంస్కృతికంగా సంపద్వంతం చేస్తున్న వారిలో వున్నారు. అందులో మానుకోట ప్రసాద్. 'మానుకోట గడ్డకు వందనం" అనే పాటతో అలరించాడు. అలాగే కందగట్ల వెంకన్న దంతాలపల్లి గ్రామానికి చెందిన యువకళాకారుడు. వెంకన్న ఆశువుగా కవితలల్లి పాడటంలో దిట్ట. మహబూబాబాద్ పట్టణంలో ఉపాధ్యాయుడిగా జీవితం ఆరంభించిన అయోధ్య రామయ్య తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కాలికి గజ్జెకట్టి, భుజాన గొంగళితో పాటలు పాడారు.

జిల్లాలో వాగ్గేయకారులుగా ఇప్పుడిప్పుడే ఎదిగి వస్తున్న వారు చాలామందే వున్నారు. ఇనుగుర్తి నుంచి మధు. 'ఇనుగుర్తి మధు' వ్యహారంలో వుంది. కంచాలపల్లి పాపయ్య, తెలంగాణ ఉద్యమ కాలంలో ఎన్నో పాటలు పాడారు. సామాజిక చైతన్య గీతాలతో వేదికలపై నుంచి శ్రోతలను రంజింపజేస్తున్నాడు.


గూడూరు పాపారావు - పాపన్నగా వ్యవహరిస్తారు. ఈయన ఎన్నో గిరిజన పాటలు రాశాడు. కోయ గోండు చైతన్య గీతాలు, కొమురం భీం జీవితంపై అవగాహన కలిగించే పాటలు రాసాడు. పెద్దగూడూరు గ్రామవాసి రవీందర్ గౌడు జానపద గేయాలను ఆలపిస్తాడు. ఇంకా ఎందరో వాగ్గేయకారులున్నట్లు తెలిసింది. ఈ ప్రాంతంలో అన్ని కళలూ విలసిల్లాయి. ఎన్నో ఉద్యమాలు నడిచాయి. సమాజ అభివృద్ధికోసం ఎందరో మహానుభావులు ఎంతగానో కృషిచేశారు. వారందరి కృషి ఫలితంగానే నేడు మానుకోట చరిత్ర, సంస్కృతీ సాహిత్యాల మణిహారంగా విరాజిల్లుతోంది.

# మహబూబ్‌నగర్ జిల్లా చిత్రపటం





168(9)





ఆంజనేయస్వామి    కురుమూర్తి ఉద్దాలు    కొలంపల్లి దర్గ

మన్యంకొండ    కోయిలకొండ కోట




కోయిల్ సాగర్ డ్యాం    పిల్లల మర్రి





హస్నాబాద నాగలింగ శివయోగి    తోటపల్లి కృష్ణమూర్తి    పులి వీరన్న

168(b)

# మహబూబ్ నగర్

**కోయిల సాగరమ్మొకట గూర్పగ పంటల ధాన్యరాశులన్**
**పాయని పూర్వసచ్చరిత వాసితమై నెలకొల్పు కీర్తితో**
**మాయలు లేని యాదరణ మానని సత్య పథానురక్తితో**
**రేయిబవళ్ళు వెల్గునిల ప్రేమల బెంచుచు పాలమూరనన్ !**

పాలమూరు జిల్లా అనగానే గుర్తుకువచ్చేవి వలసలు, కరువుకాటకాలు, వెనకబాటుతనం. ఈ జిల్లాలో నీటి వనరులు కొంత తక్కువగా ఉండడం వల్ల సారవంతమైన నేలలు తక్కువ. అందువల్ల ఇక్కడి ప్రజలు వ్యవసాయం కోసం భూగర్భ జలాలు, చెరువులపై ఆధారపడుతున్నారు. అందుకే ఇక్కడ వ్యవసాయం అంటే జూదం లాంటిది. రైతుకు పంట పండవచ్చు, ఎండవచ్చు. అందుకే ఇక్కడివారు ఎక్కువగా ఉపాధికోసం వలసలు వెళ్ళడానికి మక్కువ చూపిస్తారు.

పాలమూరు జిల్లా దేశంలోనే రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యం లాంటిది. ఎందుకంటే బ్రిటీష్ వారు వ్యాపారం కోసం వలసలు వెళ్ళితే ఇక్కడివారు ఉపాధికోసం వలసలు వెళుతున్నారు. దేశంలో ఎక్కడ పెద్దపెద్ద నిర్మాణాలు జరిగినా వీరి శ్రమ తప్పనిసరిగా కనిపిస్తుందంటే అతిశయోక్తి కాదేమో. ఆ క్రమంలో వారు ఎంతోమంది గుంపు మేస్త్రీల ఆగడాలకు బలైన సందర్భాలు అప్పుడప్పుడు పేపర్లలో చూస్తుంటాం. అందుకే దీనిని వలసల జిల్లా అని పిలుస్తారు.

పాలమూరు అంటే వలసలే కాదు. పిల్లలమర్రి కూడా గుర్తుకు వస్తుంది. 800 సం॥రాల నాటి చారిత్రక ఆనవాళ్ళకు నిదర్శనం ఈ చెట్టు. అందుకే రాష్ట్రంలో పాలమూరు జిల్లాకు ప్రత్యేకస్థానం ఉంది.

మహబూబ్ నగర్ జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే చాలా మంది ప్రజలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ జిల్లాకు పర్యాటకంగా అభివృద్ధి చెందడానికి కావలసిన వనరులు అధికంగా ఉన్నాయి. ఈ జిల్లాలో నీటి వనరులు కొంత తక్కువగా ఉండటం వల్ల సారవంతమైన నేలలు కూడా కొంతవరకు తక్కువగానే ఉన్నాయి. ఇక్కడి ప్రజల వ్యవసాయం చాలావరకు భూగర్భనీటిపై ఆధారపడి ఉండటం వల్ల వ్యవసాయం అనేది జూదంగా మారిందని చెప్పవచ్చు. అందుకే ఇక్కడి ప్రజలు ఉపాధి కోసం వలస జీవులుగా మారిపోయారు.

## ఈ పేరెందుకు?

మహబూబ్ నగర్ జిల్లాను మొదట రుకుమంపేట్ అని పిలిచేవారు. తరువాత దీన్ని పాలమూరు అని పిలుస్తున్నారు. ప్రస్తుతం మహబూబ్ నగర్ నామకరణంతో చెలామణి అవుతున్నది. మహబూబ్ నగర్ అనే పేరు 1989 డిసెంబర్ 4 నుండి అమలులోకి వచ్చింది. నిజాం నవాబ్ మీర్ మహబూబ్ ఆలీఖాన్ అసఫ్ జాహీ (క్రీ.శ 1869 - 1911) పేరు మీద ఈ పట్టణానికి ఆ పేరు వచ్చింది. పెద్దవాళ్ళు, చదువుకోని వాళ్ళు, ఈ పట్టణ పరిసర గ్రామాల వాళ్ళు పాలమూరు అని పిలుస్తారు. గతంలో ఈ పట్టణం చుట్టుపక్కల గ్రామాల నుంచి పాలు అమ్మడానికి ఈ పట్టణానికి వచ్చేవారు. అది తరువాత కాలంలో పాలు అమ్మే ఊరు కాస్తా, ఉచ్చారణ సౌలభ్యాన్ని సంపాదించుకొని పాలమూరుగా మారింది అని ఒక ఐతిహ్యం ఉంది.

## రెవెన్యూ డివిజన్లు - మండలాలు

ఈ జిల్లాలో 1.మహబూబ్‌నగర్ 2. నారాయణపేట అనే రెండు రెవిన్యూ డివిజన్లు ఉన్నాయి. మొత్తం మండలాలు 26 వున్నాయి.

**మహబూబ్‌నగర్ రెవెన్యూ డివిజన్‌లో 15 మండలాలు**

1. అడ్డాకల్ 2. బాలా నగర్ 3. భూత్పూర్ 4. చిన్నచింతకుంట 5. దేవరకద్ర 6. గండీడ్ 7. హన్వాడ 8. జడ్చర్ల, 9. కోయిలకొండ 10. మహబూబ్ నగర్(రూరల్) 11. మహబూబ్ నగర్ (అర్బన్) 12. నవాబ్ పేట్, 13. మిడ్జిల్ 14. రాజాపూర్ 15. మూసాపేట్.

**నారాయణపేట రెవెన్యూ డివిజన్‌లో 11 మండలాలు**

1. దామరగిద్ద 2. ధన్వాడ 3. కోస్గి 4. కృష్ణా 5. మద్దూర్ 6. మాగనూర్ 7. మఖ్తల్ 8. మరికల్ 9. నారాయణపేట 10. నర్వ 11. ఊట్కూర్.

## భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి

మహబూబ్‌నగర్ జిల్లా మొత్తం విస్తీర్ణం 5285 చ.కి.మీ. ఈ మహబూబ్‌నగర్ జిల్లాకు తూర్పున నాగర్ కర్నూల్ జిల్లా, పశ్చిమాన కర్ణాటక రాష్ట్రం, ఉత్తరాన రంగారెడ్డి జిల్లా, దక్షిణాన వనపర్తి, గద్వాల జిల్లాలు ఎల్లలుగా ఉన్నాయి.

## సహజ వనరులు

**నేలలు :** మహబూబ్ నగర్ జిల్లాలో సారవంతమైన నేలలు కొంతవరకు తక్కువనే ఉన్నాయి. అందులో ఎర్రమట్టి నేలలు, నల్లరేగడి నేలలు, చౌడు నేలలు, ఇసుక నేలలు మనకు ఎక్కువగా కనిపిస్తాయి.

**అడవులు** : జిల్లాలో అడవులు 370.84 చ.కి.మీ. మేర విస్తరించి ఉన్నాయి. జిల్లాలో మొత్తం భూభాగంలో ఇది 7.02 శాతం మాత్రమే కాని ఈ అడవుల్లో చెట్లు అంతగా లేవు. ఈ ప్రాంతంలో సామాజిక అడవుల పెంపకం ద్వారా పెంచే అడవుల్లో కానుగ, వేప, నీలగిరి, సీతాఫలం మొదలైనవి అధికంగా కనిపిస్తాయి. మొత్తం మీద ఈ జిల్లాలో దట్టమైన అడవుల శాతం చాలా తక్కువ. హరితహారం ద్వారా జిల్లాలో అడవుల శాతం పెంచే కార్యక్రమం చేపట్టారు.

**నదులు :** మహబూబ్ నగర్ జిల్లాలో ప్రవహించే నదుల్లో కృష్ణా, దుందుభి నదులు ప్రధానమైనవి. ఈ నదులే కాక చాలా వరకు వాగులు, చెరువులు, కాలువలు, బోరు బావుల ద్వారా ప్రజలకు తాగు, సాగు నీటి అవసరాలు తీరుతున్నాయి. అందులో మహబూబ్ నగర్ పెద్దవాగు, చిన్న చింతకుంట చెరువు, హన్వాడ చెరువు, కొతలాబాద్ చెరువు, అంకిళ్ళ వాగు మొదలైనవి.

**చెరువులు - ప్రాజెక్టులు :** పాలమూరు జిల్లాలో ప్రధానమైన నీటి వనరులు కోయిలసాగర్ ప్రాజెక్టు, పాలమూరు ఎత్తిపోతల (నిర్మాణంలో ఉంది), రామన్ పాడ్ ప్రాజెక్టు (ప్రస్తుతం వనపర్తి జిల్లాలో ఉంది) వీటి ద్వారా కూడా త్రాగు, సాగునీరు పాలమూరు జిల్లా ప్రజలకు అందుతుంది. జూరాల ప్రాజెక్ట్ నీరు కాలువల ద్వారా అందుతుంది.

**జనాభా :** మహబూబ్‌నగర్ జిల్లాలో జానాభా 2011 లెక్కల ప్రకారం 14,85,567మంది ఉన్నారు. అందులో మగవారు 7,44,280 కాగా ఆడవారు7,41,287. గ్రామీణ జనాభా 79.27%, పట్టణ జనాభా 20.73%. జనసాంద్రత 281. లింగ నిష్పత్తి 1000 : 997

**అక్షరాస్యత :** జిల్లా అక్షరాస్యత 56.78% కాగా అందులో పురుషుల అక్షరాస్యత 66.77%, కాగా స్త్రీల అక్షరాస్యత 46.83%.

## జిల్లా చరిత్ర

**మౌర్య సామ్రాజ్యం :** క్రీ.పూ 250లో అశోక చక్రవర్తి కాలంలో మౌర్య సామ్రాజ్యంలో ఈ ప్రాంతం దక్షిణ సరిహద్దుగా ఉండేది. అశోకుని తర్వాత భోగలాలసులు, స్వార్థచింతన గల బలహీనులైన, అసమర్థులైన పాలకుల వలన మౌర్య సామ్రాజ్యం విచ్ఛినమైంది. కరీంనగర్ మండలమందు గణతంత్ర రాజ్య పాలకులుగా నున్న శాతవాహన వంశీయులు, శక్తి సమాన్వితులై కోటిలింగాల ప్రాంతం నుండి విజృంభించి దక్షిణాపథమందు అనేక

ప్రాంతాలను జయించి విశాల సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. క్రమంగా పాలమూరు మండలం వారి ఏలుబడిలోకి వచ్చింది.

**శాతవాహన రాజ్యం:** క్రీ.పూ. 221 నుంచి క్రీ.పూ. 218 వరకు పాలించిన శాతవాహన కాలంలో మహబూబ్ నగర్ ప్రాంతం వారి భూభాగంగా ఉండేది. మౌర్య వంశం పతనం తర్వాత శాతవాహనులు కరీంనగర్ కోటిలింగాల నుంచి దక్షిణాపథాన పాలమూరు వరకు రాజ్య విస్తరణ చేసినట్లు మనకు చారిత్రక ఆధారాల ప్రకారం తెలుస్తుంది.

**చాళుక్య రాజ్యం :** క్రీ. శ 5వ శతాబ్దం నుంచి క్రీ.శ 11వ శతాబ్దం వరకు ఈ ప్రాంతం చాళుక్య రాజ్యంలో భాగంగా ఉండేది. శాతవాహనుల తర్వాత దక్షిణాపథం పరిపాలించిన రాజ్యవంశాలలో బాదామి చాళుక్యులు ముఖ్యులు. వీరు ముఖ్యంగా తీరాంధ్ర, రాయలసీమ, తెలంగాణ మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలను పరిపాలించారు.

**రాష్ట్రకూట రాజ్యం :** క్రీ.శ 9వ శతాబ్దంలో కొద్ది కాలం ఇక్కడ రాష్ట్రకూటులు పరిపాలించారు. రాష్ట్రకూటుల రాజ్యంలో పాలమూరు జిల్లా అంతర్భాగంగా ఉంది. వీరి పాలనకు సంబంధించి నాలుగు శాసనాలు ఉమ్మడి పాలమూరు జిల్లాలో లభించాయి. రాష్ట్రకూట ధ్రువుడు అలంపూర బ్రహ్మేశ్వర స్వామి దేవాలయానికి పశ్చిమ ద్వారాన్ని నిర్మించాడు. ఆ సందర్భంగా ఆయన ఆలంపురంలో దాన శాసనాన్ని వేయించాడు. ఈ శాసనం ద్వారా ఎన్నో భూములు దానం చేసినట్లు తెలుస్తుంది. గంగాపురం చేరువలో గల గట్టుపైన చౌడేశ్వరి ఆలయం ముందు రాష్ట్రకూట కవి వల్లభుని కుమారుడైన గోవింద వల్లభుడు ప్రకటించిన శాసనం ఉంది.

**కందూరి చోడులు :** తెలంగాణ ప్రాంతాల్లో తెలుగు చోడ వంశీయులో ఒక శాఖవారు కందూరు చోడులుగా ప్రసిద్ధి పొందినారు. వీరు కళ్యాణి చాళుక్యులకు, కాకతీయులకు, సామంతులుగా, కొంతకాలం స్వతంత్రులుగా పరిపాలించారు. మహబూబ్ నగర్, నల్లగొండ, ఖమ్మం మండలాలను కొంత కాలం పరిపాలించారు.

**మున్సిపల్ కార్పొరేషన్ :** మహబూబ్ నగర పట్టణం, నారాయణపేట పట్టణం, బాదేపల్లి(జడ్చర్ల) పట్టణం.

**నగర పాలక సంస్థలు :** 3. మహబూబ్‌నగర్, జడ్చర్ల, నారాయణపేట్.

**రెవెన్యూ గ్రామాలు :** 545

**గ్రామపంచాయితీలు :** 468

**పోలీస్ కమీషనరేట్ / హెడ్ క్వార్టర్ :** మహబూబ్‌నగర్

**పార్లమెంట్ నియోజకవర్గం :** మహబూబ్‌నగర్

**అసెంబ్లీ నియోజకవర్గాలు :** 6. మహబూబ్‌నగర్, నారాయణపేట్, దేవరకద్ర, జడ్చర్ల, మక్తల్, కొడంగల్.

**పట్టణాలు :** మహబూబ్ నగర పట్టణం, నారాయణ పేట పట్టణం, బాదేపల్లి(జడ్చర్ల) పట్టణం

**కాకతీయ రాజ్యం :** క్రీ. శ 1100 నుంచి క్రీ.శ 1474 వరకు ఇక్కడ కాకతీయ రాజులు పరిపాలించారు. ఆంధ్రదేశ చరిత్రలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించిన రాజ్య వంశం కాకతీయ రాజ్యవంశం. అప్పటి వరకు అస్తవ్యస్తంగా ఉన్న ఆంధ్రదేశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యం కిందికి తెచ్చిన ఘనత కాకతీయ రాజ్యవంశానిదే. అందులో మహబూబ్‌నగర్ ప్రాంతం కూడా కాకతీయుల ఏలుబడిలోకి వచ్చింది.

**మల్యాల వంశం :** పాలమూరు జిల్లాను కాకతీయుల సామంతులుగా పరిపాలించిన రోజులలో మాల్యాల, వావిలాల, చెఱుకురెడ్డి, గోనవంశాలు ప్రధానమైనవి. ఇందులో మాల్యాల వంశంలో గుండగండాధీశుడు గణపతి దేవ చక్రవర్తికి, రుద్రమ్మకు సామంతునిగా, దండనాయకునిగా ఉండి బూదపుర, వర్ధమాన పురాలపై అధిపత్యం వహించాడు. గోనవంశంలో గోనగన్నారెడ్డి, విఠల నరేంద్రుడు చెప్పుకోదగ్గ పాలకులు. గన్నారెడ్డి తండ్రి గోనబుద్ధారెడ్డి ద్విపదలో రంగనాథ రామాయణాన్ని రచించారు. నేటికీ బూదపురం (భూత్‌పూర్) లో వీరి శాసనాలు ఉన్నాయి. దేవగిరి యాదవ రాజులకు సంబంధించిన శాసనాలు కూడా ఈ జిల్లాలో లభిస్తున్నాయి. మగతల(మక్తల్) శివాలయంపై గల

శిలాస్థంభంపై దేవగిరి యాదవుల రాజైన రామచంద్రదేవుని దండనాయకుడు స్థానుమంత్రి వేయించిన శాసనం సంస్కృత భాషలో ఉంది.

**రేచర్ల పద్మనాయకులు :** బహమనిరాజు ఫిరోజ్‌షా పానగల్లుపై దండయాత్ర చేయగా, రెండవ అనపోతనీడు పానగల్లు దుర్గాన్ని స్వాధీనం చేసుకుని పద్మనాయకుల పాలనను పునరుద్ధరించారు. వీరి రాజ్యం పాలమూరు జిల్లా, పానగల్లు, ప్రతాపగిరి, గణపురం, కోయిల కొండ, వడ్డెమాన్ మొదలైన దుర్గాలు వీరి ఆధీనంలో ఉన్నాయి.

**బహుమనీ రాజ్యం :** క్రీ. శ 1347 నుంచి క్రీ.శ 1518 వరకు ఇది బహుమనీ రాజ్యంలో భాగంగా ఉండేది. కాకతీయ రాజ్యం పతనమైన తర్వాత సుల్తాన్ మహ్మద్‌బీన్ తుగ్లక్ తెలంగాణ ప్రాంతాన్ని బీదరులో నున్న తన ప్రతినిధి అధికారమందుంచెను. పాలమూరు జిల్లా తెలంగాణ మందున్నట్టిది. కావున ఈ ప్రాంతం షిహాజె సుల్తానీ అగు నుస్రత్ ఖాన్ అధికారము నుండెను. అందుకు ఇతడు ఢిల్లీ సుల్తానుకు సంవత్సరానికి లక్షటంకముల కప్పం చెల్లించేవాడు.

**కుతుబ్ షాహి రాజ్యం :** క్రీ.శ. 1518 నుంచి క్రీ.శ 1687 వరకు ఈ ప్రాంతం కుతుబ్‌షాహి రాజ్యంలో భాగం. క్రీ.శ.1500 ప్రాంతంలో బహుమని రాజ్యం అయిదు రాజ్యాలుగా రూపొందింది. అందులో గోలకొండ నేలిన కుతుబ్‌షాహీ రాజ్యం తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలకు పరిమిత మైంది. కుతుబ్ షాహీ వంశీయుల పాలనలో పాలమూరు సర్వతోముఖాభివృద్ధి చెందింది.

**మొఘల్ సామ్రాజ్యం :** క్రీ. శ 1687 నుంచి దాదాపు 37 సంవత్సరాల పాటు మహబూబ్ నగర్ ప్రాంతాన్ని మొఘలులు పాలించారు. కుతుబ్ షాహీల తర్వాత ఔరంగజేబు పాలనలో పాలమూరు మొఘలుల పాలనలోకి వచ్చింది.

**నిజాం రాజ్యం :** క్రీ. శ 1724 నుంచి ఇక్కడ నిజాం పాలన ప్రారంభమైంది. స్వాతంత్ర్యం అనంతరం హైదరాబాద్ సంస్థానం దేశంలో కలిసే వరకు నిజాం రాజ్యంలో భాగంగానే కొనసాగింది. ఔరంగజేబు తర్వాత మొగల్ సామ్రాజ్యం పతనమై పాలమూరు నిజాం రాజ్యం పాలన కిందికి వచ్చింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో కలిసే వరకు పాలమూరు నిజాం సంస్థానంలో భాగంగా ఉండేది.

## సంస్కృతి

మహబూబ్ నగర్ జిల్లా సంస్కృతి పరంగా మిగతా జిల్లాల కంటే చాలా ప్రత్యేకత కలిగి ఉంది. తెలంగాణలో హైదరాబాద్ తర్వాత అంతటి స్థాయిలో మత సామరస్యాన్ని పాటిస్తున్న జిల్లా పాలమూరు అని చెప్పాలి. ఇక్కడ హిందువులు, ముస్లింలు కలిసి పండుగలను జరుపుకుంటారు. ముస్లింల పండుగ మొహర్రం. ఇది ముఖ్యంగా ముస్లింల పండుగే ఐనా, హిందువులే అధికంగా జరుపుకుంటారు.

**ఆచారాలు, సంప్రదాయాలు,పండుగలు :** పాలమూరు జిల్లాలో జరిపే పండుగలలో ఉగాది, బోనాలు, దసరా, దీపావళి, మొహర్రం, రంజాన్, క్రిస్మస్ మొదలైనవి ముఖ్యమైన పండుగలు. పాలమూరు జిల్లాలో గ్రామదేవతలను పూజించే సంస్కృతి అధికంగా కనిపిస్తుంది. కొన్ని ఊర్లలో ప్రతి ఐదారు ఇండ్లకు ఒక గ్రామదేవత గుడి తప్పనిసరిగా ఉంటుంది. ప్రతి ఇంటికి ఇంటి దేవుడు, ఇంటి దేవత వేరువేరుగా ఉంటారు. ఎల్లమ్మ, పోచమ్మ, బాలమ్మ, మైసమ్మ, వీరనాగమ్మ మొదలైన గ్రామదేవతలను ఎక్కువగా పూజిస్తారు. ఇంటికి తొలకరి పంట వచ్చిందంటే రైతులు ముందుగా ఇంటిదేవత ముందు ఐదుకుప్పల ధాన్యం పోసి మొక్కిన తర్వాత వాటిని వాడుకుంటారు. వారు చేసే ప్రతి కార్యక్రమానికి ఆయా దేవతలు అండగా ఉంటారని వారి నమ్మకం. ఇక్కడి ప్రజలు బంధాలకు, బంధుత్వాలకు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు.

**కళలు :** పాలమూరు జిల్లా జానపద కళలకు ప్రసిద్ధి. ఈ జిల్లాలోని నారాయణపేట పట్టణం చేనేత వస్త్రాలకు పేరు గాంచింది. గ్రామ ప్రజలు ఉత్సవాలు, పండుగల సందర్భంలో వీటిని ఎక్కువగా ప్రదర్శిస్తారు. మగవారు కోలాటం, అలయ్, యక్షగానాలు మొదలైన కళలను

ప్రదర్శిస్తారు. ముఖ్యంగా పండగలప్పుడు పుట్టింటికి వచ్చిన ఆడపడుచులు బొడ్డెమ్మను ఆడుకుంటారు. గ్రామంలో యువకులు సమూహంగా ఏర్పడి యక్షగానం ప్రదర్శిస్తారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా ప్రదర్శించే యక్షగానాలు శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి, శ్రీమునిరంగ స్వామి, రేణుక ఎల్లమ్మ, సత్య అనసూయ, భక్త సిరియాళ, భక్త మార్కండేయ, యోగి వేమన, చిరుతల రామాయణం మొదలైనవి. మిగతా వృత్తులకు సంబంధించిన ఈ ప్రాంత కళారూపాలు బాల సంతలు, బైండ్లవారు, పగటి వేషకారులు మొదలైనవారు.

**జాతరలు :** మహబూబ్‌నగర్ జిల్లాలో జాతరలు అన్ని ప్రాంతాలవారికంటే ఎక్కువగా కనిపిస్తాయి. గంగాపురం, మన్యంకొండ, కురుమూర్తి, చిన్న రాజమూరు, కోయలకొండ వీరభద్రస్వామి, క్యాతంపల్లి వీరభద్రస్వామి, కందూరు రామలింగేశ్వర స్వామి, గురుమిట్కల, అభంగపట్నం, రామకొండ గుట్ట, పగిడ్యాల మొదలైన ప్రాంతాలలో వివిధ సందర్భాలలో జాతరలు జరుగుతాయి.

ఈ జిల్లాలో అతి పెద్ద గిరిజన జాతర మద్దూరు మండలం తిమ్మారెడ్డిపల్లెలో జరుగుతుంది. ఈ జాతర సద్గురు సంత్‌శ్రీ లోకాసంద్ మహారాజ్ జయంతి సందర్భంగా నిర్వహింపబడుతుంది.

మొహర్రం సందర్భంగా కోయిలకొండలో బీబీ ఫాతిమా జాతర జిల్లా మొత్తంలో పెద్ద ముస్లిం జాతరగా చెప్పు కోవచ్చు. అట్లే నిడ్జింత, గోటూరు, గార్లపహడ్ మొదలైనవి ఈ ప్రాంతంలో పీర్ల పండగ జాతరలు.

## సాహిత్య చరిత్ర

సాహిత్య చరిత్రలో పాలమూరు జిల్లాకు ప్రత్యేకస్థానం ఉంది. సాహిత్య చరిత్ర గురించి మాట్లాడవలసిన అవసరం ఏర్పడితే మొదట జానపద సాహిత్యాన్ని గురించి మాట్లాడాలి. పాలమూరు జిల్లా జానపద వీరగాథలలో చెప్పుకోదగినవాడు పండగ సాయన్న. ప్రస్తుతం ఈ వ్యాసంలో వర్ధమాన కవుల గురించిన ప్రస్తావన కొంత తగ్గించి ప్రాచీన కవులకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాను.

**బండారు శ్రీనివాస శర్మ :** ఈయన నివాసం కోయిల కొండ దగ్గర గల ముష్టిపల్లి. ముష్టిపల్లి కోయిలసాగర్‌లో మునగగా వీరు అనంతవరంలో స్థిరనివాసం ఏర్పరుచు కున్నారు. తెలంగాణ ప్రాంతంలో వెలువడిన తొలి తెలుగు 'హితబోధిని' మాస పత్రిక 1913లో పాలమూరు నుంచి వెలువడింది. దీనికి బండారు శ్రీనివాసశర్మ సంపాదకత్వం వహించారు. ఈ పత్రిక వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతను ఇచ్చింది. దీనితో పాటు పారిశ్రామిక, సాహిత్య అంశాలు కూడా ప్రచురితం అయ్యాయి. సరోజిని విలాస ముద్రణా లయంలో ఇది ముద్రింపబడేది. పత్రిక నిర్వహణ భారం కాగా అప్పులు తీర్చుటకు వీరలోక నాట్యమండలి ద్వారా నాటకాలు ప్రదర్శించేవారు. ఆ విధంగా హితబోధిని పత్రికను రెండు సంవత్సరాలు మాత్రమే నడిపారు. ఈ ముద్రణ యంత్రాన్ని నల్లగొండ వాసులకు అమ్మారు. ఈ యంత్రం పైననే వారు నీలగిరి పత్రికను నడిపారు. ఈయన రచన 'ఆశాదోషం' కోయిలకొండను గురించిన నవల.

**బండారు కృష్ణరాయలు :** ఈయన శ్రీనివాస శర్మ కుమారుడు. షట్పద రామాయణం ఈయన కృతి. ఇది కన్నడ ఛందస్సులో రాసారు. అది అముద్రితం.

**పల్లెర్ల జానకిరామశర్మ :** ఈయన మహబూబ్ నగర్ నివాసి. పాలమూరి జిల్లా చరిత్ర వీరి రచన.

**బాలాజీ :** ఈయన స్వస్థలం హన్వాద మండలం, తిరుమలగిరి. పైసా శతకం, దృగ్దర్పణం, స్నేహశీలి పద్య కావ్యాలు ఇతని కృతులు.

**గాదిరాజు సత్యనారాయణరాజు :** ఈయన మహబూబ్ నగర్ నివాసి. భట్రాజు వంశానికి చెందినవాడు. బాల భజనమాల, విశ్వరూప దర్శనయోగం, దాత శ్రీరామ సుప్రభాతం, మంత్రపుష్ప దండకమాల, రాఘవేంద్రస్వామి దండకం, ఆంజనేయ దండకం, బాల విద్యా విజ్ఞాన లహరి, పార్థసారథీయం, కాలజ్ఞాన సంగ్రహకాలం, దైవదశస్తుతి, రత్నమాల అనే లఘుకృతులు వీరింతవరకు ప్రచురించారు.

**చౌదూరు గోపాలరావు:** ఈయన కొడంగల్ తాలుకా వాడు. ప్రస్తుతం మహబూబ్‌నగర్‌లో స్థిర నివాసులైనారు. గోపాలరావు పద్య, గద్య, గేయాలు మూడింటిలో చేయి తిరిగిన కవి. చక్కని వక్త, మధుశాల, అభాగిని(పద్య కృతులు), ఉత్తిష్ఠ. ఇంటి నుండి ఇంద్రలోకం (గేయ సంపుటాలు), మల్లి పదాలు (జానపద గేయ మాల) మొదలయిన కృతులు ముద్రితాలు.

**నాగలింగ శివయోగి :** ఈయన కోడంగల్ తాలుకా హసనాబాద్ నివాసి. మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాచీన గ్రంథ సంపాదనలో ఈయన చేసినంత కృషి మరెవ్వరు చెయ్యలేదు. అమూల్యమైన తాళపత్ర గ్రంథాలెన్నో ఈయన గ్రంథాలయంలో ఉన్నవి.

**తోటపల్లి కృష్ణమూర్తి :** ఈయన మణికొండ నివాసి. తిరుమల దేవ శతకం, మల్లికార్జున ప్రార్ధనావళి ఈయన రచనలు.

**కొండాపురం అనంతాచార్యులు :** ఈయన స్వస్థలం కొండాపురం. ఈయన పద్య రచనలో చేయితిరిగిన వాడు. తులసీ తృణరాజ సంవాద (ఖండ కావ్యం), అనంతగిరి మాహాత్మ్యం (వచనం), శ్రీ లక్ష్మీ నృసింహ ద్విపద మాలికలు వీరి రచనలు. ఇవి ముద్రితాలు.

**కట్టా వేంకటేశ్వర శర్మ :** ఆయన స్వస్థలం తాటికొండ. 'గద్వాల సంస్థానం తెలుగు సాహిత్య పోషణ' ఈయన పరిశోధన గ్రంథం. ఇది ముద్రితం.

**ఆలూరు శివరాఘవయ్య :** వీరి స్వస్థలం జడ్చర్ల సమీపంలోని ఆలూరు. సౌశృత నలకూబరం (ప్రకరణం), విరాటపర్వం (నాటకం), సమస్యా మంజరి(పద్యం), ఇతని కృతులు. ఇవి అముద్రితాలు.

**తిరునగరి రామచంద్రకవి :** కురుమూర్తి స్వామి అర్చకుడైన ఇతడు మృత్యుంజయ శతకం, కురుమూర్తి నాయక శతకం, గడ్డం వానపల్లి హనుమత్ శతకములతో పాటు భజన కీర్తనలు కూడా రాశారు.

**కోట్ల (డోకూరు) బాలబ్రహ్మాచారి :** దేవరకద్ర మండలం డోకూరు వీరి స్వస్థలం. చమత్కార దర్శిని, శ్రీ మహేంద్ర గర్వ భంగం, మన్నెంకొండ వెంకటేశ్వర శతక ద్వయం, నామలింగేశ్వర శతకం, కొడంగల్ వేంకటేశ్వర శతకం, భారతీ శతకం, మౌనప్రభు శతకం, శంభులింగ ప్రభు శతకం, రంగనాథ శతకం, సర్వేశ్వర శతకం, కొలిమి కలిమి, నాగ్నజితీ పరిణయం, సుగుణవర్మోపాఖ్యానం, బసవ నక్షత్రమాల, కృష్ణరాజీయం మొదలైనవి ఈయన రచనలు.

**ఎదిరె చెన్నకేశవులు:** తెలంగాణలోని తొలితరం కథకుల్లో చెన్నకేశవులు పేర్కొనదగిన వారు. మహబూబ్ నగర్ వీరి స్వస్థలం. పొట్టకోసం, అర్పణం, అందరికోసం, నన్నిలా ఉండనీ, అదృశ్య హస్తం, పతిత, సహకార సహజీవనం, చేనేత ప్రముఖులు వీరి రచనలు.

**ఉర్దూ కవులు**

**కిషన్ సింగ్ పారస్:** ఈయన స్వస్థలం మహబూబ్ నగర్. ఇతడు ఉర్దూ, హిందీ భాషల్లో పండితుడు. ఈయన రచనలు రహెనుమయె దక్కన్, పిల్లల మర్రి (హిందీపత్రిక), హిందీ తామేర్ పత్రికల్లో ప్రచురించబడినవి. కల్లమే పాస్ ఇతని రచన.

**సలీం ఆబిదీ :** ఆయన స్వస్థలం మహబూబ్ నగర్. సోజేఇష్క్ (నవల), మతాయే సలీంతీ(గజల్స్ సంపుటి) ఇతని ముద్రిత కృతులు.

**బుచ్చయ్య ప్రేమి:** మహబూబ్ నగర్ ఈయన స్వస్థలం. ఇతని కలం పేరు ప్రేమి. వీరు జిల్లాలోని 'ఉర్దూ ప్రేమి మండలి'కి చాలా కాలం అధ్యక్షుడుగా, అక్కడి నుండి వెలువడే "పిల్లల మర్రి" అనే హిందీ వార పత్రికకు సంపాదకుడుగా చాలా కాలం పనిచేశాడు. తెలుగు, హిందీ, ఉర్దూ భాషలలో కవితలు కూడా రాశారు.

**నుస్రత్ ఫారుఖీ:** మహబూబ్ నగర్ వీరి స్వస్థలం. ఉర్దూలో సీనియర్ కవి, ఉర్దూ భాషాభివృద్ధికి నిరంతరం కృషి చేసిన వారిలో ఒకరు. జిల్లాలో 'అంజుమాన్ తరక్కీ

ఉర్దూ' శాఖకు ముప్పై సంవత్సరాల పైగా సేవలందించారు. గజల్స్, నాత్ ఈయన రచనలు.

## సాహితీ సంస్థలు

పాలమూరు జిల్లా సాహితీ, సాంస్కృతిక వైభవాన్ని నలుదిశల వ్యాపింపచేస్తున్న సాహితీ సంస్థలు 'పాలమూరు కళావేదిక, మిత్ర కళామండలి, జనసేవ సమితి, స్వరలహరి కల్చరల్ అకాడమి, పాలమూరు కల్చరల్ అకాడమి, ధ్వని సాహితీ సమితి. తెలంగాణ రచయితల సంఘం మొదలైనవి ఈ జిల్లాలో సాహిత్యానికి ఎంతగానో సేవ చేస్తున్నాయి.

## వివిధ రంగాల ప్రముఖులు

పాలమూరు జిల్లా సాహిత్య, సాంస్కృతిక రంగాలకు సంబంధించిన కొంతమంది ప్రముఖులు : బండారు శ్రీనివాస శర్మ, కుప్పాంబిక, పల్లెర్ల హనుమంతరావు, గట్టన్న గౌడు, కొత్తకేశవులు, పోల్కంపల్లి నరసింహరెడ్డి, రూమాండ్ల రామచంద్రయ్య, పులి వీరన్న, ఇరివెంటి కృష్ణమూర్తి, ఇరివెంటి రామ్మూర్తి, కత్తుల రామగౌడ్, మానవరెడ్డి మొదలైనవారు వివిధ రంగాలలో పాలమూరు జిల్లా ప్రతిభను ప్రపంచానికి తెలియజేసినవారు.

## దర్శనీయ ప్రదేశాలు - పర్యాటకరంగం

**పర్యాటక ప్రదేశాలు :** మహబూబ్ నగర్ జిల్లా పర్యాటకంగా అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకు కావల్సిన వనరులు పుష్కలంగా ఉన్నాయి. పర్యాటక శాఖ, పురావస్తు శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖలు సమన్వయంతో పనిచేస్తే పర్యటక రంగంలో మహబూబ్ నగర్ అభివృద్ధి సాధిస్తుంది. అందులో ప్రధానంగా పిల్లల మర్రి, కోయిల్ సాగర్ ప్రాజెక్టు, కోయిల్‌కొండ ఖిల్లా, పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు, భవాని సాగర్, గంగాపురం చెన్నకేశవ స్వామి ఆలయం, మన్యం కొండ, కురుమూర్తి, చిన్నరాజమూరు ఆంజనేయస్వామి దేవాలయం, సిలివేరు చర్చి, అబ్దుల్ ఖాదర్ దర్గ, పందుగ సాయన్న సమాధి మొ॥నవి.

**పిల్లల మర్రి :** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రమైన మహబూబ్ నగర్ పట్టణానికి 4 కిలోమీటర్ల దూరంలో పిల్లల మర్రి అనే వటవృక్షం ఉంది. ఇది రెండు ఎకరాల స్థలంలో విస్తరించి ఉంది. ఇది దాదాపు 800 సంవత్సరాల నుంచి ఉన్నట్లు శాస్త్రవేత్తల అభిప్రాయం. దీన్ని పర్యాటక శాఖ విహార యాత్ర స్థలంగా మార్చడం ద్వారా ప్రతి రోజు వందల సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. ఈ వృక్షాన్ని కబీర్‌దాసు నాటినట్లు స్థానికుల్లో ఐతిహ్యం ఉంది.

ఇక్కడే పాలమూరు జిల్లా పురావస్తు ప్రదర్శన శాల ఉంది. మహబూబ్ నగర్, గద్వాల, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో బయల్పడిన అనేక పురాతన శిలలు, శాసనాలు, విగ్రహాలు భద్రపర్చడం జరిగింది. అందులో హైందవ, బౌద్ధ, జైన, శిల్పాలతో పాటు వీరగల్లులు, నవీన శిలాయుగపు పనిముట్లు, బృహత్ శిలాయుగపు మృణ్మయ పాత్రలు, పూసలు, గాజులు శాతవాహనుల కాలం నాటి అనేక వస్తువులు ఈ ప్రదర్శన శాలలో దర్శనమిస్తాయి.

పక్కనే అటవీశాఖ వారి పార్కు, మనకు మరింత ఆహ్లాదాన్ని పంచుతుంది. ఇక్కడి పచ్చదనం పర్యాటకులను మరింత ఆకర్షిస్తుంది. కొన్ని జంతువులను కూడా ప్రదర్శనకు ఉంచడం జరిగింది.

అటు పిల్లలమర్రి ప్రవేశ ద్వారంవద్ద సైన్స్ మ్యూజియం కలదు. ఇక్కడికి వచ్చే చిన్నారులకు అనేక సైన్స్ విషయాలను విడమరిచి చెప్పుతారు. సైన్స్, నమ్మకానికి మధ్య నలిగిపోతున్న వారి అనేక ప్రశ్నలకు ఈ సైన్స్ మ్యూజియం వారికి సమాధానం చెప్తుంది. ఇక్కడ పిల్లలకు పాఠ్యపుస్తకాల్లో ఉండే అంశాలను ప్రయోగాత్మకంగా ఎలా చెయ్యాలో వివరిస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ పిల్లలమర్రి విజ్ఞానం, వినోదం, ఆనందంతో కూడిన విజ్ఞాన యాత్రగా మిగిలి పోతుంది.

**కోయిల్ కొండ :** మహబూబ్ నగర్ కు 22 కిలోమీటర్ల దూరమున చారిత్రక ప్రసిద్ధి గల కోయిల్‌కొండ దుర్గం ఉంది. పూర్వం ఇది కోయల రాజుల పాలనలో ఉండేదని స్థానికుల అభిప్రాయం. గోల్కొండ తొలి సుల్తాన్ కులీ కుతుబ్షా స్వాధీనపరుచుకొనేంత వరకు ఇది హిందూ రాజుల

ఆధీనంలో ఉండేది. ఇక్కడ కొండపై శత్రు దుర్భేద్యమైన కోట ఉంది.

ప్రస్తుతం ఇక్కడ బీబీ ఫాతిమా మసీద్ ఉంది. ఇక్కడ అమె చరిత్రకు సంబంధించిన ఆనవాళ్ళు అధికంగా కనిపిస్తున్నాయి. ప్రతి మొహర్రం నాడు ఇక్కడ ఘనంగా బీబీ ఫాతిమా జాతర జరుగుతుంది. ఇది మహబూబ్ నగర్ జిల్లాలోనే చాలా ప్రసిద్ధమైన ముస్లిం జాతర. కానీ ఈ జాతరలో ముస్లింల కంటే హిందువులే అధికంగా పాల్గొంటారు.

పక్కనే వడెన్న తాత దర్గా ఉంది. ఇక్కడ ప్రతి సంవత్సరం ఉర్సు జరుగుతుంది. దీనికి కూడా చాలా మంది హిందు, ముస్లింలు హాజరై ఘనంగా నిర్వహిస్తారు.

అటు పక్కనే రాంకొండ గుట్ట ఉంది. ఇక్కడ ప్రతి ఆదివారం, అమావాస్యనాడు పెద్ద ఎత్తున జాతర జరుగుతుంది. ఇక్కడ రాముల వారి దేవలయం కొండ మధ్యలో ఉంటుంది. ఎటువైపు నుంచి ఎక్కినా ఒకటే దూరంలో ఉంటుంది. ఇక్కడ అనేక అయుర్వేద మూలికలు కూడా దొరుకుతాయి. ప్రతి జాతరకు ప్రజలు వాటిని ఇంటికి తీసుకెళ్ళి అనారోగ్య సమయంలో, చిన్న పిల్లల సమస్యలకు వాడుతారు.

కోయిలకొండ మండల కేంద్రానికి 4 కిలోమీటర్ల దూరంలో వీరభద్ర స్వామి ఆలయం ఉంటుంది. ఇక్కడ స్వామి వారు ఏకశిలపై కాకతీయుల కాలంలో వెలిసినట్లు స్థానికులు చెప్తారు. కాకతీయుల కోట నుండి ఇక్కడి వచ్చి వెలసినట్లు వారి అభిప్రాయం. ఇక్కడ కూడా ప్రతి సంవత్సరం మార్చి, ఏప్రిల్ నెలల్లో జాతర జరుగుతుంది.

కోయిలకొండ ప్రాంతాన్ని ప్రభుత్వం పట్టించుకొని అభివృద్ధి చేస్తే పర్యటకంగా బాగా అభివృద్ధి సాధించే అవకాశం చాలా ఉంది.

**మన్యంకొండ** : మహబూబ్ నగర్ పట్టణానికి అత్యంత సమీపంలో ఈ క్షేత్రం ఉంటుంది. మహబూబ్ నగర్ జిల్లాలో జరిగే జాతరలో అత్యంత ప్రధానమైన వాటిలో ఈ మన్యం కొండ జాతర ఒకటి. ఇక్కడ శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్నాడు. మహబూబ్‌నగర్ పట్టణానికి10 కిలోమీటర్ల దూరంలో రాయిచూర్ రహదారి పై ఉన్నది.

**గంగాపురం** : తెలంగాణలోని ప్రముఖ చెన్నకేశవ స్వామి క్షేత్రాల్లో గంగాపురం చారిత్రకంగా చాలా ప్రసిద్ధి చెందినది. ఇక్కడి చెన్నకేశవస్వామి ఆలయం. అపురూప శిల్ప సంపద కలదు. బాదామి, కళ్యాణి చాళుక్య, రాష్ట్రకూట రాజ వంశీయుల కాలములోను, కందూరు చోడుల కాలమందు, తర్వాత కాకతీయ, గోన, మాల్యాల, పద్మనాయక రాజవంశీయుల పాలనలోను గంగాపురం ప్రసిద్ధ పట్టణంగా విరాజిల్లింది.

పాలమూరు (మహబూబ్ నగర్) జిల్లాల్లోని ప్రముఖ దర్శనీయ పుణ్యక్షేత్రాలల్లో ఒకటైన గంగాపురం, జిల్లా కేంద్రమైన మహబూబ్ నగర్‌కు 22 కిలోమీటర్ల దూరంలోను, 44వ నెంబర్ జాతీయ రహదారిపై గల జడ్చర్ల మండలానికి 6 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ ప్రతి సంవత్సరం జరిగే జాతరలో తెలంగాణ ప్రజలే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర ప్రజలు కూడా పాల్గొంటారు.

గంగాపురం సమీపాన అల్వాన్ పల్లి ఉంది. ఇక్కడున్న జైన బసదులను, జైన విగ్రహాలను, గుడులను గొళ్ళత్త గుళ్ళని పిలుస్తారు. ఇది జైనమత కేంద్రంగా వర్ధిల్లిన ప్రాంతము. పురావస్తు శాఖ తవ్వకాలల్లో అనేక విగ్రహాలు బయల్పడినవి. ఇవి ప్రస్తుతం పిల్లల మర్రి వస్తు ప్రదర్శన శాలలో భద్ర పర్చబడినవి.

**కోయిల సాగర్ ప్రాజెక్ట్** : ఇది మహబూబ్‌నగర్ జిల్లాకు తాగు, సాగునీరు అందిస్తున్న అతిముఖ్యమైన ప్రాజెక్ట్. ఇది మహబూబ్‌నగర్ పట్టణానికి 25 కి.మీ.దూరంలో దేవరకద్ర మండలంలో ఉంటుంది. ఈ సాగర్ నిండిన సమయంలో చుట్టూ ప్రాంతాల నుండి పర్యాటకులు పెద్దఎత్తున తరలి వస్తుంటారు. కాబట్టి ఈ పరిసర ప్రాంతాలను ప్రభుత్వ విహారకేంద్రంగా మార్చితే ఇంకా బాగుంటుంది.

## ముఖ్య దేవాలయాలు

**ఫతేపురం మైసమ్మ :** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రానికి 4 కిలోమీటర్ల దూరంలో ఫతేపురం మైసమ్మ దేవాలయం ఉంది. ప్రతి ఆదివారం, మంగళవారం, గురు వారం ఇక్కడ అమ్మవారికి పుజాది కార్యక్రమాలు నిర్వహించ బడుతాయి. ఇక్కడ కేవలం పగలు మాత్రమే పూజా కార్యక్రమాలు జరుపుతారు. రాత్రిపూట అక్కడ ఎవరు ఉండరు. ప్రతి ఆదివారం ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొంటారు.

**బావోజీ దేవాలయం :** ఇది మహబూబ్ నగర్ జిల్లాలో అతి పెద్ద గిరిజన జాతర. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం నుంచి పడమర దిక్కులో 35 కిలో మీటర్ల దూరంలో మద్దూర్ మండలం, తిమ్మారెడ్డిపల్లి గ్రామం వద్ద పెద్దవాగు(కృష్ణానది) ఒడ్డున సద్గురు సంత్ శ్రీ గురులోకాసంద్ మహారాజ్ దేవస్థానం ఉంది. ఇక్కడ ప్రతి సంవత్సరం మార్చి, ఏప్రిల్ నెలల్లో జాతర జరుగుతుంది. ఇక్కడికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, పంజాబ్, హర్యాన, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి గిరిజన ప్రజలు అధిక మొత్తంలో తరలివస్తారు.

**కురుమూర్తి వేంకటేశ్వరస్వామి దేవాలయం:** చిన్నచింతకుంట కురుమూర్తి అనే గ్రామానికి సమీపంలో ఒక కొండపై శ్రీ వేంకటేశ్వర ఆలయం ఉంది. కురుమూర్తి స్వామి గుట్టపై ఉన్న గుహల్లో తిరుమల వెంకటేశ్వర స్వామి వలే నిలిచాడు. అందుకే ఈ ప్రాంతాన్ని రెండవ తిరుపతిగా పిలుస్తారు. అక్కడి అమ్మపురం సంస్థానానికి చెందిన ముక్కెర వంశ రాజులు కురుమూర్తిస్వామి వారికి ఆభరణాలు సమర్పిస్తారు. ప్రతీ సంవత్సరం కార్తీక శుద్ధ పాడ్యమి మొదలు సప్తమి వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఇక్కడ ఉద్దాల ఉత్సాహం అత్యంత ప్రధానమైన ఘట్టం. ఇక్కడ దళితుడు చేసిన ఉద్దాలతో స్వామివారికి ఉత్సాహం ప్రారంభం అవడం ఇక్కడి ప్రత్యేకత.

**రామలింగేశ్వర స్వామి దేవాలయం :** కందూర్ 44 జాతీయ రహదారికి 3 కిలోమీటర్ల దూరంలో అడ్డాకల్ మండలంలో ఉంది. ఇక్కడి రామలింగేశ్వర స్వామి దేవాలయం కాకతీయుల కాలంలో నిర్మించబడింది. ఇక్కడ ప్రతి సంవత్సరం శివరాత్రి నుంచి శ్రీరామనవమి వరకు ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఆలయ ప్రాంగణం చుట్టూ కదంబ వృక్షాలు దాదాపు 20వరకు ఉన్నాయి. ఈ వృక్షాలు, కాశీ, కందూర్‌లో మాత్రమే కలవు.

**ఔదుంబరేశ్వరస్వామి దేవాలయం:** నారాయణపేట దగ్గర లోకాయపల్లి గ్రామము వద్ద గల గుట్టపై ఔదుంబరే శ్వరాలయం ఉంది. లోకాయపల్లి రాజవంశమునకు చెందిన లక్ష్మమ్మ ఔదుంబరం గుట్టపై ఆలయం నిర్మించినది. అక్కడ రెండు గుట్టల నడుమ లోయలో చిన్నవాగు ప్రవహించుట విని లక్ష్మమ్మ ఆజ్ఞమేరకు పుష్కరణి నిర్మించబడింది. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో శివరాత్రినాడు జాతర జరుగుతుంది.

**చిలువేరు చర్చి :** ఈ చిలువేరు జడ్చర్ల పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇది మహబూబ్ నగర్ జిల్లాలో అత్యంత పురాతనమైన చర్చి. ఈ చర్చి త్వరలోనే వంద సంవత్సరాల ఉత్సవాలను జరుపుకోబోతుంది. ఇక్కడ ప్రతి సంవత్సరం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుగుతాయి.

మహబూబ్ నగర్ జిల్లాలో ప్రధానమైన చర్చిలలో క్రిష్టియన్ పల్లి చర్చి, జడ్చర్ల చర్చి మొదలైనవి ఉన్నాయి.

**కొలంపల్లి దర్గా :** కొలంపల్లి మహబూబ్ నగర్ జిల్లాలో అత్యంత పురాతనమైన దర్గల్లో ఒకటి. ఇది హజ్రత్ సయ్యద్‌షా అహమ్మద్ ఖాదర్ ఉస్సేన్ జీవసమాధి. ఇది దేవరకద్ర పట్టణానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ దర్గాను ఔరంగజేబు దర్శించినట్లు ఇక్కడి పీఠాధితుల చెబుతారు.

మహబూబ్ నగర్ జిల్లాలో అత్యంత ప్రధానమైన దర్గాల్లో అబ్దుల్ ఖాదర్ దర్గ, కోయిలకొండ వడెన్న దర్గ, నారాయణపేట తాయమ్మ దర్గ మొదలైనవి.

**చిన్నరాజమూరు** : ఈ చిన్న రాజమూరు దేవరకద్ర మండలంలో ఉంది. ఇది మండల కేంద్రానికి 12 కిలో మీటర్ల దూరంలో ఉంది. చిన్నరాజమూరి ఆంజనేయస్వామి దేవాలయం. మహబూబ్ నగర్ జిల్లాలో జరిగే ప్రధానమైన జాతరలో ఇది ఒకటి. ప్రతి సంవత్సరం నవంబర్, డిసెంబర్ నెలల్లో పెద్ద ఎత్తున జాతర జరుగుతుంది.

**క్యాతన్‌పల్లి వీరభద్రస్వామి దేవాలయం**: ఇది మహబూబ్‌నగర్ జిల్లాలో మద్దూరు మండల కేంద్రానికి 15కి.మీ.దూరంలో ఉన్నది. జిల్లాలో అత్యంత పురాతణమైన దేవాలయాలలో ఇది ఒకటి. ప్రతి సంవత్సంర మార్చి, ఏప్రిల్ జాతర నిర్వహించబడుతుంది.

**రాజాపూర్ లలితాంబికాలయం** : 44వ జాతీయ రహదారి పక్కన రాజాపూర్ మండలంలో ఉంది. ఇక్కడే శ్రీమలయ మారుత స్వామి ఆశ్రమం కూడా ఉంది.

**పగిద్యాల కృష్ణతాత** : గండీడు మండలం పగిద్యాల గ్రామంలో శ్రీకృష్ణతాత జీవసమాధి కలదు. ప్రతి సంవత్సరం ఇక్కడ జాతర నిర్వహించబడుతుంది.

**తాటికొండ** : భూత్‌పూర్ మండలం తాటికొండ గుట్టపై వీరన్నగుడి శివాలయం, వేంకటేశ్వరాలయం, ఆంజనేయ స్వామి ఆలయాలున్నాయి. ఇక్కడ ప్రతి సంవత్సరం జాతర నిర్వహించబడుతుంది.

**కొల్లూరు** : ఊటుకూరు మండలం కొల్లూరులో బృహదీశ్వరాలయం ఉంది. ఇక్కడ ప్రతిశివరాత్రికి ఉత్సవాలు నిర్వహించబడుతాయి.

**జడ్చర్ల** : ఈ పట్టణంలో వేంకటేశ్వరాలయం, రంగ నాథాలయాలు ప్రసిద్ధి. ఇక్కడి రంగనాథాలయం రంగనాథ స్వామిని రంగనాథ రామాయణాన్ని రచించిన గోన బుద్ధారెడ్డి కులదైవంగా పూజించేవాడు.

**ముగింపు**


మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణలో అత్యంత వెనుకబడిన జిల్లాగా పేరు సంపాదించుకుంది. ప్రస్తుతం 31 జిల్లాల విభజన జరిగిన తరువాత మహబూబ్‌నగర్ జిల్లా తన సర్వస్వాన్ని కోల్పోయిందని చెప్పాలి. జిల్లాకు సంబంధించి నీటి వనరులు తక్కువ, వ్యవసాయానికి సంబంధించి సారవంతమైన నేలలు తక్కువ, అక్షరాస్యత విషయానికి వస్తే అందులో చదువులు మధ్యలో మానేసినవారే అధికంగా కనిపిస్తారు. ఉన్నత చదువులపై అవగాహన ఈ ప్రాంతం ప్రజలకు తక్కువనే చెప్పాలి. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఎక్కువగా వలసలు ఉన్న ప్రాంతం ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లా, అందుకే ఇప్పటికీ మహబూబ్‌నగర్‌కు వలసల జిల్లాగా ఉన్న పేరు అలాగే ఉండి పోయింది.

మహబూబ్‌నగర్ జిల్లా గురించి ఇందులో చర్చించిన అంశాలు చాలా తక్కువ, చర్చించాల్సినవి అంశాలు చాలానే ఉన్నాయి, స్థల భావం వల్ల అధిక అంశాలు, ఇంకా వెలుగులోనికి రాని అంశాలు, నా దృష్టికి రానివి చాలానే ఉన్నాయి. వాటిని మరొకసారి అవకాశం వచ్చినప్పుడు తప్పకుండా చర్చించుకుందాం.

# మంచిర్యాల జిల్లా చిత్రపటం




178(9)



కత్తెరశాల మల్లన్న




వెలాల శివలింగం



ఎల్లంపల్లి ప్రాజెక్ట్



ఎ.సి.సి.సిమెంట్ ఫ్యాక్టరి



గూడెం సత్యనారాయణస్వామి దేవస్థానం



వానమామలై వరదాచార్యులు



గూడ అంజయ్య

178 (b)

# మంచిర్యాల

అభయారణ్య విహార భూధరములన్ హ్లాదమ్ము నొందింపదే
విభవం బొందెడి 'మంచి'యాలయముగా వేద్యత్వ సిద్ధిన్‌గొనన్
ప్రభలన్ జిల్కెడు వృక్షరాజములతో భాసించు నెల్లప్పుడున్
శుభముల్ సంపదలుల్లసిల్లు ఖనిజ స్వోత్కృష్టతన్ వెల్గెడిన్ !

**సు**విశాలమైన ఆదిలాబాదు జిల్లాను మంచిర్యాల కేంద్రంగా చేసి విభజించాలనే ఆలోచన ఎప్పటినుండో ఉంది. ఈ భావన తెలంగాణా రాష్ట్రం ఏర్పడి, ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం చిన్నజిల్లాలను ఏర్పాటు చేయాలనుకొని, జిల్లాలను పునర్వ్యవస్థీకరించడం వలన మాత్రమే సాధ్యపడింది. మే 11, 2016 నాడు మంచిర్యాల్ కేంద్రంగా మంచిర్యాల్ జిల్లా ఏర్పడిన నేపథ్యంలో జిల్లా భౌగోళిక, రాజకీయ, సాహితీ, సాంస్కృతిక, సామాజిక చరిత్రను సంక్షిప్తంగా పరిచయం చేయడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

## ఈ పేరెందుకు?

మంచిర్యాల్‌ను మంచిర్యాల అని కూడా తరచూ వ్యవహరిస్తూ ఉంటారు. ర్యాల అనగా ఇసుక అని అర్థం. అంటే మంచి ఇసుక అని అర్థం చెప్పుకోవచ్చు. పేరుకు తగినట్టే ఈ ప్రాంతంలో నాణ్యమైన ఇసుక లభిస్తుంది. ఇంకా ఇక్కడ ఉన్న రాళ్ళ వాగులో మంచి రాళ్ళు ఉండేవని, వాటిని మంచి రాళ్ళు అనే వారనీ, అదే క్రమంగా మంచిరాల, మంచిర్యాల్ అయ్యిందని చెప్పుకుంటారు.

## భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి

క్రొత్తగా ఏర్పడ్డ మంచిర్యాల్ జిల్లాకు విభక్త ఆదిలాబాద్ జిల్లాతో పాటు నూతనంగా ఏర్పరిచిన కొమురంభీం (ఆసిఫాబాదు), నిర్మల్, పెద్దపల్లి, జయశంకర్ (భూపాలపల్లి) జిల్లాలు మరియు మహారాష్ట్రలు సరిహద్దు ప్రాంతాలుగా ఉన్నవి. వేమనపల్లి మండలంలోని అర్జున్ గుట్ట వద్ద ప్రాణహితా నది మంచిర్యాల్ జిల్లాను మహారాష్ట్రనుండి వేరుచేస్తున్నది. ఆవలి ఒడ్డున ఉన్న సిరోంచా పేరుకు మహారాష్ట్ర లోనే ఉన్నప్పటికీ, అక్కడ తెలుగుదనమే సర్వత్రా పరిమళిస్తూ ఉంటుంది.

క్రొత్తగా ఏర్పడిన మంచిర్యాల్ జిల్లా మంచిర్యాల్, బెల్లంపల్లి అనే రెండు రెవెన్యూ డివిజనులు మరియు 18 మండలాలతో సుమారు 4,016 చ.కి.మీ. విస్తీర్ణంలో వ్యాపించి ఉంది.

## సహజ వనరులు

మంచిర్యాల్ జిల్లాలో బొగ్గు ఎక్కువగా లభిస్తున్నది. దీనితోపాటు సున్నపురాయి కూడా. బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, సి.సి.సి, రవీంద్ర ఖని, కళ్యాణ్ ఖని, కాసీపేట్, ప్రాంతాల్లో నెలకొన్న సింగరేణి గనులు ఈ ప్రాంతాన్ని పారిశ్రామిక ప్రగతి పథంలో నడిపించాయి. అదేవిధంగా ఈ మధ్య జైపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామం వద్ద సింగరేణి కాలరీ వారు నెలకొల్పిన థర్మల్ విద్యుత్ కేంద్రం ఎందరికో ఉపాధి కల్పిస్తున్నది. ఇంకా ఈ ప్రాంతంలో సున్నపు రాయి కూడా విస్తారంగా లభిస్తున్నది. సిమెంటు పరిశ్రమలు కూడా ఎక్కువే. ఏ.సి.సి ఇక్కడ పేరుమోసిన

**రెవెన్యూ డివిజన్లు - మండలాలు**

క్రొత్తగా ఏర్పడిన మంచిర్యాల్ జిల్లాలో మంచిర్యాల్, బెల్లంపల్లి అనే రెండు రెవెన్యూ డివిజనులు ఉన్నాయి.

**మంచిర్యాల్ డివిజనులో 11 మండలాలు:**

1.చెన్నూరు 2. జైపూరు 3. భీమారం(క్రొత్తది) 4. కోటపల్లి 5.లక్సెట్టిపేట్ 6. మంచిర్యాల్ 7. నస్పూర్ (క్రొత్తది) 8. హాజీపూర్ (క్రొత్తది) 9. మందమర్రి 10. దండెపెల్లి 11. జన్నారం.

**బెల్లంపల్లి రెవెన్యూ డివిజనులో 7 మండలాలు :**

1. కాసీపేట్ 2. బెల్లంపల్లి 3. వేమన్ పల్లి 4. నెన్నెల్ 5. తాండూర్ 6. భీమిని 7. కన్నెపెల్లి(క్రొత్తది)

సిమెంటు పరిశ్రమ. అదిప్పుడు యాజమాన్యం మారడంతో ఎం.సి.సి.గా పేరు మారింది. అదేవిధంగా దేవాపూర్ లోనూ సిమెంటు పరిశ్రమ ఉన్నది. సెరామిక్ పైపుల పరిశ్రమలు కూడా ఈ ప్రాంతంలో అధికంగా ఉన్నాయి. కొంతమేరకు చెన్నూరు మరియు పరిసర ప్రాంతాల్లో పట్టుపురుగుల పెంపకం కూడా సాగుతున్నది. బీడీ పరిశ్రమల తునికాకు సేకరణ కూడా ముఖ్యమైంది.

**అడవులు :** ఆదిలాబాద్ జిల్లా దట్టమైన అడవులకు ప్రసిద్ధి అన్న విషయం తెలిసిందే! ఇప్పుడు మంచిర్యాల జిల్లాగా ఏర్పడ్డ తరువాత కూడా వేమనపల్లి, కోటపల్లి, జైపూర్, జన్నారం మండలాల్లో చెప్పుకోదగిన రీతిగా అటవీసంపద ఉన్నది. ప్రధానంగా టేకుచెట్లు ఎక్కువ. వేమనపల్లి ప్రాంతంలో దేవాలయాలకు ధ్వజస్తంభాలను తయారుచేసే వేగిస కర్ర లభిస్తుంది.

**నదులు :** జిల్లాలో ఎక్కువ భాగం గోదావరి నది, కొంతమేరకు మహారాష్ట్ర నుండి వచ్చే ప్రాణహితానది ప్రవహిస్తున్నాయి. వరి,పత్తి ప్రధానమైన పంటలు.

**చెరువులు - ప్రాజెక్టులు :** గోదావరి నదిమీద నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఇక్కడి ప్రజలకు సాగునీటిని కాకపోయినప్పటికీ త్రాగునీటిని అందిస్తున్నది. భీమారం - ఆవడంల మధ్య గొల్లవాగు, నీలవాయి వాగు, రాళ్ల వాగుల మీద నిర్మించిన ప్రాజెక్టులు వ్యవసాయాన్ని సుసంపన్నం చేస్తున్నప్పటికీ ప్రధానంగా బావులు, చెరువులూ, బోరు నీళ్ళే ఇక్కడి వ్యవసాయానికి ముఖ్య జల వనరురులుగా ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల్లో మత్స్య పరిశ్రమను కూడా పెంపొందించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నది.

## జిల్లా చరిత్ర

మంచిర్యాల్ ప్రాంతం మొదట ఆసిఫాబాదు జిల్లాలో భాగంగా, ఆ తరువాత ఆదిలాబాదు జిల్లాలో భాగంగా ఉండి, ఇప్పుడు స్వతంత్ర జిల్లాగా ఏర్పడింది. పరిపాలనా సౌలభ్యత కోసం ఆదిలాబాద్ జిల్లాను రెండు భాగాలను చేయాలని, ఒకదానికి మంచిర్యాల కేంద్రంగా ఉండాలని ఎప్పటి నుండో ఉన్న ఆకాంక్ష. ఈ మేరకు రాజకీయ నాయకులు హామీలు కూడా ఇచ్చారు. చివరకు అక్టోబరు 11, 2016 నాడు జిల్లాగా అవతరించింది.

చారిత్రకంగా శాతవాహనులు తొలినాళ్ళలో కోటిలింగాలను కేంద్రంగా చేసుకొని, ఈ ప్రాంతాన్ని పాలించి నట్టు తేలింది. ఆ తరువాత కాలక్రమంలో ఈ ప్రాంతం గోండు మరియు ఒడ్డె రాజుల చేత పరిపాలించబడినట్టు తెలుస్తున్నది. కుందారం గ్రామంలో కాకతీయుల ఆడబిడ్డగా భావించబడుతున్న కుందమాంబ విగ్రహం లభించడంతో ఈ ప్రాంతానికి కాకతీయులతోనూ సంబంధం ఉన్నదని ఊహించవచ్చు. చెన్నూరులోని అంబాగస్త్యేశ్వర దేవాలయం లోని శాసనం ఈ ప్రాంతాన్ని శ్రీకృష్ణ దేవరాయలు దర్శించి నట్టుగా తెలుపుతున్నది. అల్లావుద్దీన్ ఖిల్జీ సేనాధిపతి మాలిక్ కపూర్ ఈ దేవాలయాన్ని ధ్వంసం చేయగా రాయలు పునరుద్ధరణ చేసినట్టు మహామంత్రి తిమ్మరుసు పేరు మీద ఉన్న ఈ శాసనం తెలుపుతున్నది.

## సంస్కృతి

మంచిర్యాల జిల్లా వైవిధ్యభరితమైన సంస్కృతిని కలిగి ఉన్నది. తెలుగుతో పాటు కొంచెం తక్కువగానైనా హిందీ భాష కూడా వినిపిస్తుంది. కోయలు, గోండులు, నాయక్

పోడులు మొదలైన గిరిజన తెగలున్నాయి. గిరిజనుల దండారి పండుగ, ఉత్తర భారతీయుల జరుపుకునే చాత్ పండుగతో పాటు తెలంగాణలో మామూలుగా జరుపుకునే అన్ని పండుగలూ ఇక్కడ కనిపిస్తాయి. మతసామరస్యంతో విలసిల్లే ఈ జిల్లాలో హజ్రత్ సయ్యద్ సహా బాబా (అర్.ఏ) పేరు మీదుగా జరిగే ఉర్సు చాలా పేరుగాంచింది.

**ఆచారాలు- సంప్రదాయాలు - పండుగలు**

చెన్నూరుకు సమీపంలోని కత్తెరసాలలో మల్లన్నగా పూజల నందుకుంటున్న మల్లికార్జున స్వామి దేవాలయం ఉన్నది. ఇక్కడ యాదవులే పూజాదికాలు నిర్వహిస్తుండడం విశేషం. శివరాత్రి సమయంలో జాతర జరుగుతుంది. ఇక్కడి అర్చకులు ఒగ్గు పూజలతో ఆలయచరిత్రను వివరిస్తారు. తెలుగు రాష్ట్రాల వారే కాక పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరౌతారు.

జైపూరు మండలంలోని వేలాలలో వెలసిన మల్లన్న దేవాలయం కూడా చాలా ప్రసిద్ధి. ఇక్కడ పట్నం పూజలు ప్రత్యేకం. గుట్టమీద చిన్న సొరికలో స్వయంభూ మల్లన్న దేవాలయం, క్రింద ఊరిలో నిత్యపూజా నిమిత్తం మరొక దేవాలయం ఉన్నాయి.

ఏ.సి.సి సమీపంలోని క్వారీ దుర్గామాత దేవాలయం ఒక చక్కటి పర్యాటక ప్రాంతంగా కూడా విలసిల్లుతుంది. ఇక్కడి ఆహ్లాదకరమైన వాతావరణంలో తరచుగా వనభోజనాలు జరుగుతూ ఉంటాయి.

**సాహిత్యం**

**మంచిర్యాల్ జిల్లా సాహితీ సాంస్కృతిక విశేషాలు:** ఈ జిల్లాలో కవులూ, కళాకారులూ ఎందరో ఉన్నప్పటికీ ప్రచారాన్ని కోరుకోకపోవడమూ, పుస్తకాలను ప్రచురించు కోకపోవడమూ మూలాన ఈ కాలంలో చాలామంది విస్మృతికి గురయ్యారు. కాబట్టి ప్రాచీన సాహిత్య చరిత్ర అందడం లేదు.

**మున్సిపాలిటీలు :** 3

**నగర పాలక సంస్థలు :**

**రెవెన్యూ గ్రామాలు :** 382

**గ్రామపంచాయితీలు :** 210

**పోలీస్ హెడ్‌క్వార్టర్ :** మంచిర్యాల

**పార్లమెంట్ నియోజకవర్గం :** పెద్దపల్లి

**అసెంబ్లీ నియోజకవర్గాలు :** 3

**పట్టణాలు :** మంచిర్యాల్, బెల్లంపల్లి, చెన్నూరు, లక్సెట్టిపేట్

**జనాభా :** మొత్తం జనభా 8,07,037.

**అక్షరాస్యత :** 64.35%

**చెన్నూరు కేంద్రంగా :** చెన్నూరు అనగానే మనకు పరిచయం అక్కరలేని మహాకవి అభినవ పోతన **కీ.శే. వానమామలై వరదాచార్యులు** గుర్తొస్తారు. వీరు వరంగల్ జిల్లా మడికొండ గ్రామంలో జన్మించినప్పటికీ చెన్నూరులోనే స్థిరపడ్డారు. వీరు సుప్రసిద్ధమైన 'పోతనచరితము' అనే ప్రబంధాన్ని రచించారు. మణిమాల, జయధ్వజం, విప్రలబ్ధ, (ఖండకావ్యాలు), మరాఠీలో జి.డి.మాడ్గూళ్కర్ రచించిన గీత రామాయణానికి గీతరామాయణం పేర అనువాదం, వైశాలిని (నాటకం), కూలుతున్నకొమ్మ (వచన కవితా సంకలనం) మొదలైన అనేక ఇతర రచనలు కూడా చేసారు. ఆనాటి ముఖ్యమంత్రి పి.వి. నరసింహారావు గారి చేతుల మీదుగా గండపెండేరాన్ని కూడా అందుకున్నారు. ఆచార్యుల వారి మామగారు **జగన్నాథాచార్యులు** కూడా విద్వత్కవి. హరికథలు అద్భుతంగా చెప్పేవారు.

కీ.శే.ఆరుట్ల రామానుజాచార్యులు చెన్నూరులోని జగన్నాథస్వామి మీద భక్తిపారవశ్యంతో సంస్కృతంలో జగన్నాథ చంపువును ఆశువుగా చెప్పారట. అదిప్పుడు లభించడం లేదు. గోల్కొండ కవుల ప్రత్యేక సంచికలో 103వ కవిగా వీరి గూర్చి ఉన్నది. ఈ పట్టణానికి చెందిన కీ.శే.

శ్రీరాంభట్ల వేంకటేశ్వర సిద్ధాంతి పంచాంగకర్తగా, సాహితీ మూర్తిగా విఖ్యాతులు. వీరు వేంకటేశ్వర శతకాన్ని రచించారు కానీ అలభ్యం.

కీ.శే.శ్రీరాంభట్ల చంద్రశేఖర సిద్ధాంతి బహుగ్రంథ రచయిత. సాంబశివ భజన కీర్తనలు, పార్వతీశ్వర శతకం, అంబాగస్త్యేశ్వర సుప్రభాతం మొదలైనవి రచించారు. వీరి రచనలు లిఖిత రూపంలో లభించకపోయినప్పటికీ ఇప్పటికీ స్థానికుల నోళ్ళలో నానుతూనే ఉన్నాయి. అంబాగస్త్యేశ్వర సుప్రభాతంలోని **"నానా స్థావర జంగమాది సకలం త్వయ్యేవ సంవాదినం సర్వం ఖల్విదమేవ హే భవ భవాన్ నాన్యం పరం సర్వదా నిత్యానంద నిరామయత్వ మమరో వేదాంత సారో భవాన్ శ్రీశాభ్యర్చిత పార్వతీశ దయతే నిత్యం ప్రభాతే నమః"** అన్న వీరి శ్లోకం ఆధారంగా వీరెంత ప్రౌఢకవో మనం అర్థం చేసుకోవచ్చు. పంచాంగ కర్తగా పేరుమోసిన ముక్తేశ్వర సిద్ధాంతి వీరి కుమారులే! వీరు తమ జీవితకాలంలోనే రానున్న వందేళ్ళకు సంబంధించిన పంచాంగాలను సిద్ధం చేసి తమ తరువాతి తరానికి వారసత్వంగా అందించారు. కీ.శే.మారేపెల్లి మాధవరావు (వ్యాసకర్త పెదనాన్న) కొన్ని కృతులను రచించినట్లు తెలుస్తున్నది. చెన్నూరులో ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయడంలో వీరి పాత్ర ప్రధానమైనది.

కీ.శే. రేగళ్ళ రామశర్మ మార్కండేయ శతకాన్ని రచించారు. కీ.శే. వేదం లక్ష్మణ ఎన్నో మంగళారతులను విరచించి స్వరపరిచారు. కీ.శే. కె.వి రాఘవాచార్యులు గారు స్వప్న సుందరి అనే కావ్యాన్ని, వీరరాఘవ శతకాన్ని రచించారు. కీ.శే .కె.వి.నరసింహాచార్యులు మందారవల్లి అనే ఖండకావ్యాన్ని రచించి ప్రచురించారు. వీరు నఖ చిత్రకళలో నిష్ణాతులు.

తాండూరుకు చెందినప్పటికీ చెన్నూరులోనే విద్యాభ్యాసం చేసి కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా ఎదిగిన ఇందారం కిషన్ రావు అష్టావధాని. చక్కటి ధారతో శ్రీనివాస శతకం, ఋతుసంహారం, అవధాన లేఖ, వసంత సుమనస్సులు మొదలైన కృతులను వెలయించారు. వీరు ఇటీవలే కీర్తి శేషులయ్యారు. కీ.శే.దూలం నారాయణ "గాంధీ శతకం" వ్రాసారు. కీ.శే. దేవరాజు సాంబమూర్తి మూసీ మరియు తదితర సాహిత్య పత్రికలకు ఎన్నో రచనలు చేసారు. వీరు ఈ మధ్యనే పరమపదించారు.

కీ.శే. మహావాది రాజన్న తెలుగు, ఫారసీ, ఉర్దూ, ఆంగ్లం, హిందీ భాషల్లో కవిత్వం చెప్పేవారట.

కీ.శే. నీర్ల మదునయ్య గారు చెన్నూరు ప్రాంతానికి చెందిన విద్వత్ కవి. శంభులింగ శతకం, శ్రీనివాస శతకము, మేఘసందేశము, (కాళిదాస కృతికి స్వేచ్ఛానువాదం), చిట్టితల్లి రామాయణము, తెలుగు సాహిత్య సుమదళాలు, తెలుగు బోధనా పద్ధతులు, నాలోని భావాలు, శ్రీరంగ శతకం, భాషాశాస్త్రం-అలంకారం అనే గ్రంథాలతో పాటుగా ఇంకా అనేక అముద్రిత కృతులను వెలయించారు. వీరికి మంచిర్యాలలో ఘనంగా పౌరసన్మానం జరిగింది.

కీ.శే. వైద్య వినాయక రావు ఆంగ్ల భాషలో కవిత్వాన్ని చెప్పేవారు. వీరు ఆంగ్లంలో రాప్సోడిక్ రామాయణ్ అనే గ్రంథాన్ని రచించారు. అది అంత్యప్రాసలతో కూడుకొని సుందరంగా ఉంటుంది. హనుమంతుడు మొదటిసారి చూసిన సీతాదేవిని "Matted hair with a single braid.... squatted Seeta a dropping maid being in a bough at the spot above... Hanuman saw her in Ashoka grove" అంటూ వర్ణిస్తారు. ఇంతేకాకుండా వీరు చొరవతీసుకొని వానమామలై వరదాచార్యుల వారి శతజయంతిని అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రధాన నగరాల్లో ఘనంగా నిర్వహించారు.

**కీ.శే. మహాంకాళి దత్తాత్రేయ గారు** బహుభాషా ప్రవీణులు. తెలుగుతో పాటు ఆంగ్లము, హిందీ, మరాఠీ, కన్నడ భాషల్లో నిష్ణాతులు. వరదాచార్యుల వారికి గీత రామాయణ రచనా సందర్భంగా మరాఠీ నుండి తెలుగులోనికి అనువదించుటకు సముచితంగా సహాయపడ్డారు.

**రేవెల్లి రామయ్యగారు** శ్రీరామచంద్రశతకాన్ని, సూక్తి వైజయంతిని, **మేకల రామస్వామి** శ్రీరామభక్త హనుమ శతకాన్ని వెలయించి చెన్నూరు సాహిత్యాన్ని సుసంపన్నం చేసారు. కొమ్మెర రాజేశ్వరరావుగారు హితవాణి పేరిట కథాకావ్యాన్ని వ్రాసారు. **కాకరాల పద్మాకర్** వేదవతీ చరిత్ర అనే కావ్యాన్ని రచించారు. **చిలకమారి తిరుపతి** నూతనమైన ఛందస్సులలో శ్రీ మార్కండేయ చరిత్రను రచించారు. అయితే ఇందులోని నూతన ఛందస్సుల మీద ఇంకా చర్చ జరగాల్సి ఉన్నది. **కట్ల శ్రీనివాస్** వేంకటేశ్వర స్వామి మీద ఎన్నో కీర్తనలను రచించి, స్వరపరిచి, ఆలపిస్తున్నారు.

**సద్దనపు సదానందం** సుందరకుసుమాలు పేరిట ఒక కృతిని విరచించారు. కానీ ఇంకా ముద్రితం కావాల్సి ఉన్నది. **బొడ్డు మహేందర్** రాసిన కొన్ని పాటలు ఈటీవి ప్లస్‌లో ప్రసారం అయ్యాయి.

**కొమ్మెర దత్తమూర్తి సిద్ధాంతి** ప్రతిసంవత్సరం పంచాంగాన్ని వెలయిస్తున్నారు. పుష్కరాల సందర్భంగా తీర్థ శ్రాద్ధ ప్రయోగ చంద్రికను వెలయించారు.

**జక్కెపెల్లి కుటుంబం:** ఇక్కడ చెన్నూరు ప్రాంతం గూర్చి చెప్పేటప్పుడు జక్కెపెల్లి కుటుంబం గూర్చి ప్రత్యేకించి చెప్పుకోవాలి. **కీ.శే. జక్కెపెల్లి కృష్ణశాస్త్రి** పంచభాషా ప్రవీణులు. తెలుగుతో పాటు మరాఠీ, మార్వాడీ, ఉర్దూ, హిందీ వీరికి కరతలామలకం. హిందుస్తానీతో పాటు కర్ణాటక సంగీతం లోనూ నిష్ణాతులు. హార్మనీ, ఫ్లూటు, తబలా, మృదంగం, వయొలీన్ వాద్యాలను అద్భుతంగా నిర్వహించగలిగి పంచవాద్య ప్రవీణునిగా పేరు తెచ్చుకున్నారు. వీరు తమ గీతాలను తామే స్వర పరచుకునే వారు. మంచి నాటక దర్శకులు కూడా. లవకుశ, చింతామణి, గయోపాఖ్యానం నాటకాలకు దర్శకత్వంతో పాటు నటించారు కూడా. నాదబ్రహ్మ, స్వరశిరోమణి వీరి బిరుదులు.

వీరి కూతురు **కీ.శే. రేగళ్ళ శ్యామలాబాయి** కూడా సంగీత విద్వాంసురాలు. ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో వీరు ఏ గ్రేడు గాయని. వీరివి అనేక గీతాలు ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో ప్రసారం అయ్యేవి. శ్యామలాబాయి కుమారులు **రేగళ్ళ భూషణశర్మ** కూడా తబలా వాద్య నిపుణులు. **హిమాకర శర్మ** హార్మనీ, ఫ్లూటు వాద్యాల్లోనూ, **ముక్తేశ్వర శర్మ** తబలా వాద్యంలోనూ పేరొందారు.

కృష్ణశాస్త్రి గారి చిన్న కుమారుడు **జక్కెపెల్లి నాగేశ్వర్ శర్మ** సంగీతంలో తమ తండ్రికి నిజమైన వారసులుగా నిలిచారు. తండ్రివలెనే అటు హిందుస్తానీ, ఇటు కర్ణాటక సంగీతంలో దిట్ట. మృదుమధురమైన స్వరం వీరికి అయాచిత వరం. వీరు హైదరాబాదులోని త్యాగరాయ గానసభలో 12 గంటలపాటు నిర్విరామంగా సంగీతకచేరీ చేసి రికార్డు స్థాపించారు. చెన్నూరులో జరిగిన నాద సప్తాహంలో వీరిది ప్రముఖమైన పాత్ర. వరదాచార్యులు వ్రాసిన గీత రామాయణంలోని గీతాలన్నిటికీ బాణీలు కట్టి ఆలపించారు. ఇవి ఆకాశవాణిలో ఇప్పటికీ ప్రసారితం అవుతూనే ఉన్నాయి. వీరు సంగీత విద్వాంసులే కాక మంచి పద్యకవి కూడా. పార్వతీశ్వర శతకం, సంస్కృతి తరంగాలు వీరి అముద్రిత రచనలు. వీరి ప్రజ్ఞా పాటవాలను ఎన్నో సంస్థలు "సంగీత సాహిత్య కళా వాచస్పతి", "సంగీత కళానిధి" మొదలైన అపూర్వ బిరుదాలను ప్రదానం చేసి గౌరవించుకున్నాయి. 1993 సంవత్సరంలో "ఆల్ ఇండియా నేషనల్ లెవెల్ సింగర్" అవార్డుకు ఎన్నికయ్యారు. ఇదే వంశానికి చెంది పురాణం కిష్టయ్యగా పేరొందిన కీ.శే. జక్కెపెల్లి కృష్ణశాస్త్రి చక్కటి పౌరాణికులు. **శ్రీరాంభట్ల రాజేందర్, రామడుగు కృష్ణప్రసాద్, శ్రీరాంభట్ల సురేశ్** కూడా గాయకులుగా పేరొందారు.

ఇంకా ప్రత్యేకించి పద్యకావ్యాలు వ్రాయనప్పటికీ **జక్కెపెల్లి మధూకరశర్మ, కాంచనపల్లి దిగంబర్**లు పద్యకవులుగా ప్రసిద్ధులు. ఇంకా **కీ.శే. సిరంగి రాజయ్య, కీ.శే.వెంకటరాజంలు** చెప్పుకోదగిన స్థాయిలో వచన కవిత్వాన్ని రాసినట్టు తెలుస్తున్నది. **కీ.శే.మారేపెల్లి విఠల్ రావు** బహుముఖ ప్రజ్ఞాశాలి. సంగీత సాహిత్యాల్లో గట్టిపట్టును సాధించి ఉత్తమ సాహిత్య విమర్శకులుగా పేరొందారు. **కీ.శే.నానయ్య** రంగస్థల అలంకరణ నిపుణులు.

ఎలాంటి ఆహార్యాన్నైనా అద్భుతంగా సమకూర్చే వారు. సాహిత్యాభిమాని కూడా!

సోమనపల్లి కేంద్రంగా చెన్నూరుకు దగ్గరి సోమనపెల్లి గ్రామానికి చెందిన **గంగుల రాంరెడ్డి** హాస్యకవిత్వాన్ని ఎక్కువగా రాస్తారు. **తుమ్మల మల్లారెడ్డి** విద్యాసంబంధ విషయం మీద పరిశోధన చేసి తెలుగుభాషలో డాక్టరేటు పొందారు. ఆదిలాబాదులోని డైటు కళాశాలకు ఉప ప్రిన్సిపాలుగా పనిచేసిన వీరు సందర్భానుసారం అనేక కవితలు వ్రాస్తూ ఉంటారు. వీరు సాహితీ సంరక్షణ సమితికి గతంలో అధ్యక్షులుగా తమ సేవలు అందించారు. **బెల్లంకొండ మల్లారెడ్డి** మంచి సాహితీవేత్త. జాగృతి పత్రికకు సహ సంపాదకులుగా తమ సేవలను అందించారు.

వేమనపల్లి కేంద్రంగా వేమనపల్లి గ్రామానికి చెందిన **కీ.శే. ఈదులపల్లి రాజేశ్వర రావు** తెలుగుతోపాటు హిందీ, ఉర్దూ భాషల్లో అపారమైన పాండిత్యం కలిగినవారని తెలుస్తున్నది. పారమార్థిక జీవనకళ, సారవాణి, శివ, చండికాంబ, అచ్యుత, రామచంద్ర, వేంకటేశ్వర మొదలగు అనేక శతకాలు రచించిన బహుగ్రంథ కర్త వీరు. **మహర్షి శివబ్రత్ లాల్** ఉర్దూలో రాసిన అనేక ఉర్దూ గ్రంథాలను తెలుగులోనికి అనువదించారు. ఋషి దత్త, మహాత్ముల వచనములు మొదలగునవి వీరి అనువాదగ్రంథములు.

వేమనపల్లి గ్రామానికే చెందిన **కీ.శే. గంగు భగవంతం పట్వారీ** ఎలాంటి సాంప్రదాయిక సాహిత్య నేపథ్యం లేనప్పటికీ తమ వృద్ధాప్య దశలో చక్కటి శైలిలో "శ్రీకోదండ రామాయణాన్ని సుమారు 2,500 పద్యాలలో, నిర్వచనంగా రచించారు. కావ్యాన్ని స్వయంగా వినే అదృష్టం ఈ వ్యాసకర్తకు దక్కింది. కానీ వారి హఠాన్మరణంతో ప్రస్తుతం ఇంతటి మహాత్కావ్యం లభ్యం కాకపోవడం దురదృష్టకరం.

నెన్నెల కేంద్రంగా పుస్తకప్రేమికులు, గ్రంథాలయ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న **భూపతి రాజేశ్వర్ రావు** గారు ఉపాధ్యాయుడిగా తమ జీతాన్ని సర్వస్వం వెచ్చించి సుమారు 5000 పుస్తకాల వరకూ సేకరించారు. వీరిని నడిచే విజ్ఞాన సర్వస్వంగా చెప్పవచ్చును. తమ గ్రామంలో విజ్ఞానం అందరికీ అందుబాటులో రావాలనే ఉద్దేశ్యంతో స్వంతంగా గ్రంథాలయం స్థాపించారు. కేవలం పుస్తకాల కొరకే మూడు గదులను నిర్మించి, వాటిని పరిరక్షించారంటే పుస్తకాలపై వీరికి ఎంత మక్కువో అర్థం అవుతుంది. వివిధ పాఠశాలలకు విరాళంగా ఇచ్చిన పుస్తకాలు పోగా ఇప్పటికీ వీరి వద్ద సుమారు 1000 పుస్తకాలున్నాయి. ఇంతేకాకుండా వీరు భావనా శబలత కలిగిన రచయిత, ఆధ్యాత్మికవేత్త కూడా. వీరి రచనలు ఆనాటి భారతి, వేదాంతభేరి తదితర పత్రికల్లో తరచుగా ప్రచురించబడేవి. ఇప్పుడు వీరు వయోవృద్ధులు. వీరి అన్నగారు కీ.శే.రాంచందర్ హార్మోనిస్టుగా రాణించారు.

ఈ మండలంలోని కుష్ణపల్లికి చెందిన **దేంద్ర సాంబయ్య** హరికథలు చెప్పేవారు. మంచి శిల్పి. ఆంజనేయ శతకాన్ని వ్రాసినట్టుగా తెలుస్తున్నది. ఇదే గ్రామానికి చెందిన **తాళ్ళపల్లి మురళీధర్ గౌడ్** వానమామలై వరదాచార్యుల వారి ప్రత్యక్ష శిష్యులు. "ఫ్రెష్ సిగ్నేచర్స్" పేరిట కవితా సంకలనాన్ని వెలయించారు. తెలుగులోనూ అనేక గేయ, వచన కవిత్వాలను వ్రాస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాదులో స్థిరపడి పుస్తకముద్రణ సంబంధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వీరిని సాహిత్య లోకం పుస్తకశిల్పి అని పిలుచుకుంటుంది.

**బెల్లంపల్లి కేంద్రంగా :** బెల్లంపల్లిలో ఎన్నో ఏళ్ళు సింగరేణిలో వృత్తి రీత్యా నివసించిన **పాలకుర్తి రామమూర్తి** రచించిన గంగావతరణం పద్యకావ్య సాహితీ విమర్శకులు ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం వంటి వారి ప్రశంసలను అందుకుంది. మహాభారతంలో ద్రౌపది అపూర్వ వ్యక్తిత్వం వంటి రచనలు చేసారు. వ్యక్తిత్వ వికాసరంగంలో ప్రత్యేక కృషి చేస్తూ, విద్యార్థినీ, విద్యార్థులను ఉత్తేజపరుస్తూ ఉంటారు. వీరిప్పుడు భువనగిరిలో స్థిరపడ్డారు. **రేగుంట పోచయ్యా గారు** సరళ వ్యావహారికంలో సహస్ర శ్రీరామార్చన వంటి విశిష్ట వచన రచన చేసారు. **హన్మాండ్ల రమాదేవి** అమరవీరులకి

విజయం, నిర్భయ వంటి వచనకవిత్వ సంపుటులను వెలయించారు. ఈ ప్రాంతానికి చెందిన **హెచ్.రవీందర్** కూడా సాహితీవేత్తగా పేరొందారు.

**అచ్చలాపూర్ కేంద్రంగా :** అచ్చలాపూర్ అగ్రహారానికి చెందిన **గట్టు గణపతిశర్మ గారు** విద్వత్కవి. వీరు వేంకటేశ్వర శతకాన్ని రచించారు. జప, హోమ, విగ్రహ ప్రతిష్ఠాపనలలో నిపుణులు. ఇదే గ్రామానికి చెందిన విశ్రాంత ఆంగ్లోపన్యాస కులు **ముద్దురాజయ్య** ఎన్నో అష్టావధానాలు చేసారు. శ్రీ సత్యసాయి శతకము, కేదారేశ్వర శతకము వీరి ముద్రిత రచనలు. ఇక్కడి మహాదేవ వేద పాఠశాలలో ఉపాధ్యాయులు గా పనిచేస్తున్న అప్పాల శ్యాం ప్రణీత శర్మ శివపార్వతీ కల్యాణం, ఉపాకర్మ ప్రయోగం, గోదావరీ పుష్కర ప్రయోగం, కృష్ణా పుష్కర ప్రయోగం, జాతక కళానిధి, మొదలైన రచనల ద్వారా వేద, ఆధ్యాత్మిక వాఙ్మయాన్ని ప్రజలకు అందిస్తున్నారు. **గట్టు శ్రీహరి** కూడా పద్యరచన చేస్తున్నారు. తాండూరు గ్రామానికి చెందిన **గట్టు వినోద్ కుమార్** అనేక అవధానా లలో పృచ్ఛకులుగా వ్యవహరిస్తున్నారు.

**రామకృష్ణాపురం :** సింగరేణి గనుల్లో సాంకేతిక నిపుణులుగా పనిచేస్తున్న **తల్లపురెడ్డి వీరభద్రారెడ్డి** ఉదయం, వేంకటేశ్వర సుప్రభాతం, షిర్డీసాయి భక్తిమాల, వేములవాడ రాజేశ్వరస్వామి శతకం, యువకా శతకం, సిరులవేణి సింగరేణి శతకం మొదలైనవి రచించారు. వీరు చైతన్య సాహితీ సాంస్కృతిక సంస్థకు వ్యవస్థాపక అధ్యక్షులు.

**ఆవడం :** ఆవడం ఉన్నత పాఠశాల కేంద్రంగా తెలుగు పద్య సాహిత్య చరిత్రలో పెనుసంచలనమే నమోదైంది. తమ గురువు **జక్కెపెల్లి నాగేశ్వర శర్మ** నేర్పిన ఛందస్సు పాఠాల నుండి స్ఫూర్తి పొందిన **తోకల రాజేశం** (రైతు శతకం), **పెద్దపల్లి మహేశ్** (శారదాంబ శతకం), **రాజం మల్లేష్** (భరత మాత), **కామెర రఘువర్మ** (రఘువర్మ మాట), **కాళీ ప్రకాశ్** (కాళి వారి మేలు బాట), **తిగుళ్ళ రవీందర్** (శ్రీనివాస శతకం), **తిగుళ్ళ సంధ్య** (ఛాత్ర శతకం), **తోకల దశరథం** (దశరథోక్తి శతకం), **ఎగ్గే చంద్రశేఖర్** (హనుమత్ శతకం), **గోదరి ప్రవీణ్ కుమార్** (పార్వతీశ శతకం), **కలాలి ప్రవీణ్ కుమార్** (కలాలి మాట శతకం) అనే పదకొండుమంది బాలకవులు వ్రాసిన శతకాల నుండి పది ఏరికూర్చిన పద్యాలతో "బాలకవితా రసాలం" అనే సంకలనం విడుదల అయ్యింది. ఈ పద్యోద్యమం అంతా అప్పట్లో బాలకవి అయిన తోకల రాజేశం నాయకత్వంలో జరిగింది. దీనికి కొనసాగింపుగా ఆ తరువాత కూడా **ధర్మాజీ శశికుమార్** (చద్దిమూట శతకం), **సద్దాం హుస్సేన్** (తాజు బాబా శతకం), **మగ్గిడి రాజేశం**(అంజనేయ శతకం) **గుళ్ళపల్లి రాజ్ కుమార్** (లక్ష్మీ దేవి శతకం), **బింగి వంశీ** (శివ మహేష్ శతకం) శతకాలు రచించారు. అయితే వీరిలో చాలా మంది ఆ తరువాత కవిత్వాన్ని కొనసాగించి నట్టుగా కనబడదు. ఒక్క **తోకల రాజేశం** మాత్రం అంచెలంచెలుగా ఎదిగి పద్య, వచన, కవిత్వాలు రెండింటి లోనూ పట్టు సాధించి చెమట చుక్కలు అనే నానీల పుస్తకాన్ని వెలువరించారు. అంతేకాకుండా 'పాతాళగరిగె' పేరిట సాహిత్య వ్యాసాలతో విమర్శాత్మక గ్రంథాన్ని తీసుకొని వచ్చారు. అనేక సన్మాన సత్కారాలు పొందారు. తె.ర.వే.లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు.

**మంచిర్యాల కేంద్రంగా:** జిల్లా కేంద్రం మంచిర్యాల్ ఇప్పుడిప్పుడే సాహిత్య కేంద్రంగానూ ఎదుగుతున్నది. వరంగల్ జిల్లాలో జన్మించినప్పటికీ ఉపాధ్యాయ వృత్తి రీత్యా ఆదిలాబాద్ జిల్లాలో పలుప్రాంతాల్లో పనిచేసి చివరకు పదవీ విరమణ అనంతరం మంచిర్యాలలో స్థిరపడ్డ **ముత్యబోయిన మలయశ్రీ** పద్య, గేయ ప్రక్రియల్లో ఆరితేరినవారు. నిత్య చైతన్య శీలి. దివిసీమ దీన గాథ, జాగృతి, అమ్మ భాష (శతకం), సబల(పద్యకావ్యం), చదువుపాటలు, జాగృతి, తెలంగాణా గెలుపు (పాటలు, పద్యాలు) మొదలైన అనేక గ్రంథాలను వెలువరించారు. ఇంకా తెలుగు శతకం, మొగ్గలు, సిరిపురసీమ, సంక్రాంతి, మహాపురుషులు, (పద్య కావ్యాలు), మలయ మారుతాలు (3-7), ఆలోచనాలోచనాలు (వ్యాసాలు) మొదలైనవి ముద్రితం కావాల్సి ఉన్నది. వీరు

తెలంగాణా తొలి, మలిదశ పోరాటాల్లోనూ చురుకుగా పాల్గొన్నారు. ప్రస్తుతం సాహితీ సంరక్షణ సమితికి గౌరవాధ్యక్షులుగానూ, గతంలో అధ్యక్షులుగానూ వ్యవహరించారు. తెలంగాణా రాష్ట్రావతరణోత్సవాల సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పదిమంది పద్య కవుల్లో ఒకరిగా ఎన్నికై, పద్య తెలంగాణ కార్యక్రమంలో రాష్ట్రప్రభుత్వం చేత సన్మానించ బడ్డారు.

**ఎం.వి.పట్వర్ధన్ :** వృత్తి రీత్యా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పనిచేస్తూ మంచిర్యాలలో స్థిరపడ్డ చెన్నూరు గ్రామానికి చెందిన ఎం.వి.పట్వర్ధన్ (వ్యాసకర్త) పద్య, వచన కవిత్వాలు రెండింటిలోనూ కృషి చేస్తున్నారు. పలు సాహిత్య సంస్థలను స్థాపించారు. శ్రీవాసర జ్ఞానసరస్వతీస్తవం (శతకం), శ్రీ శిరిడీసాయి మహిమామృతం (పద్యకావ్యం), జనాంతర్గామి (తెలంగాణా ఉద్యమ దీర్ఘ కవిత), వీరి ముద్రిత గ్రంథాలు. విజిగీష (యువ ప్రబోధక శతకం, దేవకీ పరిదేవనం (లఘు పద్య కృతి), శ్రీ షిరిడీ సాయి బోధామృతం (పద్యకావ్యం), శ్రీవేంకటేశ్వర శతకం, విజయోపనిషత్తు (వచన శతకం), దేవకీపరిదేవనం (పద్య ఖండకావ్యం), శ్రీ వేంకటేశ్వర శతకం, పెన్సిలిన్స్ (మినీ కవితలు). తమసోమా జ్యోతిర్గమయా (పద్య ఖండకావ్యం), మనాది (వచన కవిత్వం) ఇంకా ముద్రితం కావాల్సి ఉన్నవి. సాహితీ సంరక్షణ సమితి, మంచిర్యాలకు వ్యవస్థాపకులైన వీరు ప్రస్తుతం కూడా అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణా రాష్ట్రావతరణోత్సవాల సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పదిమంది పద్య కవుల్లో ఒకరిగా ఎన్నికై పద్య తెలంగాణం కార్యక్రమంలో రాష్ట్రప్రభుత్వం చేత సన్మానించబడ్డారు.

**కవుటూరి ప్రసాద్ :** వృత్తిరీత్యా మంచిర్యాలలో స్థిరపడ్డారు. శ్రీ శ్రీనివాస కల్యాణం (పద్య కావ్యం), బాల వికాస శతకం వీరి ముద్రిత రచనలు. కవిత్రయ భారతాన్ని సంక్షిప్తం చేసి అందులోని ముఖ్యమైన పద్యాలకు భావార్థం వ్రాస్తూ వీరు వ్రాసిన బృహద్గ్రంథం ఇంకా ముద్రించబడాల్సి ఉన్నది. వీరు సాహితీ సంరక్షణ సమితి, మంచిర్యాలకు పూర్వ ప్రధాన కార్యదర్శి.

**దండనాయకుల వామన్ రావు :** మంచి గాయకులు. అనేక గీతాలను స్వయంగా వ్రాసి, ఆలపిస్తూ ఉంటారు. వామన గీతికలు వీరి ముద్రిత కృతి. ప్రస్తుతం సాహితీ సంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. వీరి కూతురు నాగవినీశ కూడా గాయని. ఈ టీవి 'పాడుతా తీయగా' కార్యక్రమంలో పాల్గొన్నది.

**అసర్ ఖుర్షీద్:** ఈయన విలక్షణమైన త్రిభాషా కవి. సహజ సుందరంగా తెలుగులో గజళ్ళు వ్రాసే వీరు ఆంగ్లం మరియు ఉర్దూలో కూడా కవిత్వం చెప్పగలరు. వీరి అసర్ గీతావళి త్వరలో ఆవిష్కరించబడనున్నది.

వీరు సాహితీ సంరక్షణ సమితికి సంయుక్త కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

**దాసరి శ్రీనాథ్ గౌడ్** బహుముఖ ప్రజ్ఞావంతులు. కవి, గాయకులూ, ధ్వన్యనుకరణ కళాకారులు కూడా. వీరు రాసిన మధురాక్షర గీతమాలిక, విరిసిన మల్లెలు (నానీలు), జననీ ఓ కల్పవల్లి (108 మినీ వచన కవితలు), వెన్నెల కిరణాలు (దీర్ఘ కవితలు), శ్రీసాయినాథ శతకం ముద్రితమైన రచనలు కాగా, శ్రీనాథకవితలు (వచన కవితలు), శ్రీ షిరిడీ సాయి గీతామృత తరంగిణి పుస్తకాలు త్వరలో ఆవిష్కరణ కాబోతున్నాయి. విశ్వ జనని, సుజల (శతకం), తెలంగాణా పలుకుబళ్ళు గ్రంథాలు ముద్రణ కావాల్సి ఉన్నవి. మంచిర్యాలలో సంగీత సాహిత్య సుధా వాహిని సంస్థకు వ్యవస్థాపక అధ్యక్షులు.

**బోనగిరి రాజారెడ్డి:** దర్శకులు, స్వయంగా నటులు కూడా అయిన బోనగిరి రాజారెడ్డి 'విత్తనాల్లో అలజడి' అనే నానీల పుస్తకాన్ని వెలువరించారు. వీరు యువకళా సమితికి వ్యవస్థాపక మరియు ప్రస్తుత అధ్యక్షులు. కొన్ని దూరదర్శన్ సీరియళ్ళలో నటించారు. మంచిర్యాలలో అనేక నాటకాలను వేసారు. వేయించారు.

**బండవరం రంగనాథ స్వామి:** అటవీశాఖాధికారిగా పదవీ విరమణ చేసిన బండవరం రంగనాథస్వామి వానమామలై వరదాచార్యుల వారి ప్రత్యక్ష శిష్యులు. చెన్నూరుకు చెందిన వీరు మంచిర్యాలలో స్థిరపడ్డారు. అనేకానేక గ్రంథాలను రచించారు. మెహర్ బాబా మీది భక్తి ప్రపత్తులతో ఎన్నో కృతులను వారి పేరు మీదుగా వ్రాసారు. ఆవేదన – ఆక్రందన– ఆలాపన (ఖండ కావ్యం), శాత్తుముర్రై, మౌనప్రస్థానంలో అవసానం, అ–ఆ, బ్రతుకురీతి బాట–బండవరం కవనమూట వీరి కవితాసంకలనాల్లో కొన్ని మాత్రమే! ఇంకా అనేక డాక్యుమెంటరీలు తీసారు. సి.డి. లు విడుదల చేసారు. అవతార్ మెహెర్ బాబా వృద్ధాశ్రమ కేంద్ర ట్రస్టుకు వ్యవస్థాపక ఛైర్మన్‌గా ఉన్నారు.

**తోట సదానందం :** కవి, కథానిక రచయిత కూడా. వీరు విజయకేతనం అనే వచన కవితా సంపుటిని వెలువరించారు. కొన్నాళ్ళు యువకళాసమితికి ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు.

**నాగినేని లీలా ప్రసాద్ :** వృత్తి రీత్యా మంచిర్యాలలో స్థిరపడిన నాగినేని లీలా ప్రసాద్ మరియు సంస్కృతం మరియు తెలుగుభాషా కోవిదులు. జాగృతి పత్రికలో అనేక వ్యాసాలు వ్రాసారు. సంస్కృత నీతి శ్లోకాలకు తెలుగులో లఘు వ్యాఖ్యతో వెలువడ్డ నిత్య సత్యాలు, బాలల బొమ్మల సుందరకాండ వీరి ముద్రిత గ్రంథాలు .

**చీపెల్లి బాపు :** పూదోట అనే గేయసంపుటిని, వజ్ర సంకల్పం (తెలంగాణా దీర్ఘ కవిత) పుస్తకాలు వెలువరించారు. వీరు కొన్నాళ్ళు సాహితీ సంరక్షణ సమితి, మంచిర్యాలకు ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు.

శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన **నూతన్** జీవన విధ్వంసం, **రాంప్రసాద్** ఎర్రచీమలు అనే వచన కవితా సంకలనాలను ప్రచురించారు.

**తోటపల్లి భూమన్న** నా రేపటికి, పాటకు పాదాభివందనం గేయ సంకలనాలను ప్రచురించారు.

లక్సెట్టిపేట్ సమీపంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన **పొనకంటి దక్షిణామూర్తి** కవి, గాయకులూ, నటులూ కూడా. వీరు సంగీత సాహిత్య సమలంకృతే (గేయ సంపుటి), అదే విధంగా కరుణశ్రీ పుష్పవిలాపం ప్రేరణతో విశ్వవిలాపం పద్య కావ్యాన్ని వెలయించారు. దీనిలో దశవిధ ప్రాణుల విలాపాలున్నాయి. ఇదొక విలక్షణ ప్రయోగం.

**పెద్దిరాజు సంతోష్ కుమార్ :** వీరు గాయకులూ, కవి కూడా. వీరు అయ్యప్ప స్వామి మీద శతకాన్ని రచించారు.

**అడ్డిచర్ల సాగర్ :** ఒక్కపాటనైనా చాలదా, పాపం పసిబుగ్గలు గేయ సంకలనాలను తీసుకొని వచ్చారు. వీరు అనేక లఘు చిత్రాలకు సాహిత్యాన్ని సమకూర్చారు. వివిధ సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఉంటారు.

ఇక కథానిక విభాగానికి వస్తే మంచిర్యాలలో స్థిరపడ్డ **అల్లం రాజయ్య** సుప్రసిద్ధులు. వీరు **సాహు**తో కలిసి వ్రాసిన కొమరంభీం నవల చాలా ఆదరణ పొందింది. అదేవిధంగా మహాదేవుడి కల అనే కథ వీరికి మంచి పేరును తీసుకు వచ్చింది.

**శ్రీమతి ఐ.వి సుబ్బాయమ్మ :** (లక్సెట్టిపెట్) వీరు తెలుగు సాహిత్యంలో స్త్రీ స్వరూప స్వభావాలు అనే విమర్శా గ్రంథాన్ని రచించారు.

ఇంకా ప్రత్యేకమైన పుస్తకాలను వెలయించక పోయినప్పటికీ మంచిర్యాల్ జిల్లా నుండి పద్యకవిత్వంలో మల్లప్ప వసంత రావు, పెద్ది భరత్, బెల్లాల సుగుణాకర్, పి.హైమవతి, గురునాథం ఫణీంద్ర గౌడ్, ముద్దు ప్రదీప్ (లక్సెట్టిపేట్), ఎర్రోజు వెంకటరాయ శర్మ (ముల్కల్)లు;

గేయకవిత్వంలో డా.వంగ చక్రపాణి, గుండేటి యోగేశ్వర్, భూపతి నారాయణరావు, పాలకుర్తి వసంత, బద్రి రమారాణి, మేసు మల్లేశం, గసిగంటి రాజలింగం, కోరల్ల రామిరెడ్డి, గాదె మహీపాల్, ఉప్పల రూపాచారి, రాంపెల్లి పద్మజ (బెల్లంపల్లి), ఓంకారి వెంకటేశ్ (రొయ్యలపల్లి – కోటపల్లి మం॥), నందనకారి సురేశ్ (కొత్తూరు–లక్సెట్టిపేట్ మం॥), జి.ఆచార్య శ్రీనివాస్ (లక్సెట్టిపేట్). సుద్దాల వెంకటి (రామకృష్ణాపూర్)లు,

వచనకవిత్వంలో డా.ఆర్.శోభారాణి, ఇట్యాల వెంకటకిషన్, నూతెక్కి రవీందర్, బద్రి గోపీకృష్ణ, సత్యం, దుర్గం రాజేశం గౌడ్, రామోజు రమేశ్ (వీరు కొన్నాళ్ళు యువకళాసమితి ప్రధానకార్యదర్శిగా పని చేసారు), భూపతి సంతోష్, కంపెల శ్రీనివాస్, బొల్లవరం జగన్మోహన్ రావు (వీరి జలనాదం ముద్రితం కావాల్సి ఉంది), సి.హెచ్.సరిత, దండనాయకుల వంశీకృష్ణ, సాహితీ సంరక్షణ సమితి ఉపాధ్యక్షులు బిజుమళ్ళ ఆనంద్ రావు, అంతర్జాలంలో చురుగ్గా ఉండే సూదిరెడ్డి నరేందర్ రెడ్డి, కొండు జనార్దన్, జంబోజు సత్తయ్య, యద్దనపూడి సుధాకర్, బొలిశెట్టి నాగేంద్రబాబు (వీరు యువకళాసమితి ప్రధాన కార్యదర్శి), పులిజాల వేణుగోపాల్, తాడోజు సత్యనారాయణ, వఝుల నాగేంద్ర సంతోష్ కుమార్ శర్మ, వఝుల వెంకట కిషన్, గూడ రాజేందర్ (లింగాపూర్), ఆజాద్ పాషా (పాతకొమ్ము గూడెం-లక్సెట్టిపేట్), లేదాళ్ళ రాజేశ్వర్ రావు (లక్సెట్టిపేట్), కప్పల సురేందర్, నాగవర్మ ముత్యం (రెబ్బెనపల్లి-దండెపెల్లి మం॥), ముద్దు ప్రణవ్ శాస్త్రి (లక్సెట్టిపేట్), మాలావత్ భిక్షపతి నాయక్ (లింగాపూర్), దుర్గం బక్కన్న (కోటపల్లి) తమ ప్రతిభను చాటుకుంటున్నారు.

**సాహితీ సాంస్కృతిక సంస్థలు :** గతంలో ఈ మంచిర్యాల్ జిల్లా ప్రాంతంలో సాహితీ గౌతమీ (చెన్నూరు), మిత్ర కళాసమితి (జన్నారం) మొదలైన సంస్థలు సాహితీ సాంస్కృతిక సేవ చేసినప్పటికీ ప్రస్తుతం క్రియాశీలంగా లేవు. మంచిర్యాల్ జిల్లా కేంద్రంలో నెలకొని, సేవలు చేస్తున్న సంస్థలు ఈ విధంగా ఉన్నాయి.

**సాహితీ సంరక్షణ సమితి:** 2008 సంవత్సరంలో ఎం.వి.పట్వర్ధన్ (వ్యాసకర్త) వ్యవస్థాపక అధ్యక్షులుగా బద్రి శ్రీనివాస్, తోకల రాజేశం, మేసు మల్లేశం మరియు ఇతర సాహిత్యాభిమానుల సహకారంతో సాహితీ సంరక్షణ సమితి, మంచిర్యాల స్థాపించబడింది. ఇటీవలే సుమారు 170 మంది కవితలతో ఉమ్మడి ఆదిలాబాదు జిల్లా కవిత్వ ప్రత్యేక సంచిక సాహితీ విపంచి-4 విడుదలైంది. మంచిర్యాల సాహిత్యంలో క్రియాశీలక పాత్రను పోషిస్తున్నది.

**యువకళా సమితి :** బోనగిరి రాజారెడ్డి అధ్యక్షతన సుమారు నలుబది ఎనిమిది ఏళ్ల క్రింద స్థాపించబడిన యువ కళాసమితి మొదట్లో సాంస్కృతిక కార్యక్రమాలకు, నాటకాలకు మిక్కిలి ప్రోత్సాహం ఇచ్చింది. ఇప్పుడు సందర్భానుసారం కవి సమ్మేళనాలను నిర్వహిస్తున్నది. ఈ సమితి అధ్వర్యంలో ఇప్పటివరకూ కాలం నవ్వుతోంది, సాహితీ సుగంధాలు, మంచిర్యాల తెలంగాణ గొంతుకలు పేరిట మూడు ఆదిలాబాద్ జిల్లా స్థాయి సంకలనాలు వచ్చాయి.

**సంగీత సాహిత్య సుధావాహిని :** ఇది దాసరి శ్రీనాథ్ గౌడ్ చేత స్థాపించబడింది. అవకాశానుసారం సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

**నటరాజ కళావాహిని:** ఇది నటుడూ, కవీ అయిన కొమ్మెర విశ్వేశ్వర శర్మ చేత స్థాపించబడింది. ఆయా సందర్భాల్లో సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నది.

**శ్రీ సాయి నాట్య కళానిలయం :** ఇది పెండెం అశోక రావు చేత స్థాపించబడింది. ఎందరెందరో విద్యార్థినీ విద్యార్థులకు శాస్త్రీయ నృత్యం నేర్పిస్తున్నది.

**అభినవ పోతన కళాపీఠం :** ఇది నటుడు, దర్శకుడు వై.ఉమామహేశ్వర రావు చేత స్థాపించబడింది. అభినవ పోతన వానమామలై వరదాచార్యుల వారి సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకొని పోవడానికి కృషి చేస్తున్నది.

**జిల్లా సాహితీ సాంస్కృతిక సమాఖ్య :** ఇది ఆదిలాబాద్ జిల్లా అంతటికీ సంబంధించినది అయినప్పటికీ మంచిర్యాల్‌లో ఎక్కువగా సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలను చేస్తుంది. "నాగబాల" దండనాయకుల సురేశ్ కుమార్ చేత స్థాపించ బడిన ఈ సమితి ఇక్కడి జిల్లా కార్యక్రమాలకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నది.

## వివిధ రంగాల ప్రముఖులు

మంచిర్యాల్ జిల్లాకు రాజకీయ రంగంలోనూ ప్రధాన స్థానమే ఉన్నది. అలనాడు నిజాం ప్రభుత్వ వ్యతిరేక సమరంలో ఎందరో యువకులు ఈ ప్రాంతం నుండి సమీప బ్రిటిష్

పాలిత ప్రాంతం మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో నిర్వహించే శిబిరానికి అజ్ఞాతవాసంలో తరలిపోయారు. చెన్నూరు ప్రాంతం నుండి సుడిగాల విశ్వనాథ సూరి, (తరువాత కాలంలో చెన్నూరు నియోజక వర్గం మొదటి ఎం.ఎల్.ఏ.గా ఎన్నికయ్యారు). మారేపెల్లి రామకిషన్ రావు (వ్యాసకర్త తండ్రి), గౌతమ్ కాంతయ్య, కొమ్మెర కిష్టయ్య, కొమ్మెర రామన్న, (వీరికి కాంగ్రెసు రామన్న అని కూడా పేరు), మంచిర్యాల్ ప్రాంతం నుండి కె.వి.రమణయ్య, ఏనుగు రామలింగం, రాజయ్య ఇంకా అప్పటి ఎందరో యువకులు క్రియాశీలక పాత్రను పోషించారు. చెరకు మాధవరెడ్డి గారు ఈ పోరాటంలో ముఖ్య భూమిక నిర్వహించడమే కాక ఆ తరువాత ఆదిలాబాదు పార్లమెంటు స్థానానికి మొదటి ఎం.పి గా కూడా ఎన్నికయ్యి, సోషలిస్టు పార్టీ తరఫునుండి పార్లమెంటులో శాసన సభాపక్ష నేతగా వ్యవహరించారు. అదేవిధంగా సరస్వతీ కాలువ నిర్మాతగా ఖ్యాతి గాంచిన ప్రొఫెసర్ జీ.వీ.సుధాకర్ రావు గారు ఈ జిల్లాలోని తపాల్ పూర్ ప్రాంతానికి చెందిన వారు. ఆ తరువాత తెలంగాణ తొలి, మలి పోరాటాల్లోనూ ఈ ప్రాంతం ప్రధాన పాత్ర పోషించింది. మలిదశలో జే.ఏ.సీ నాయకులైన కోదండరాం ఈ ప్రాంతానికి చెందిన వారే !

## దర్శనీయ ప్రదేశాలు - పర్యాటక రంగం

**చారిత్రక ప్రదేశాలు :** వేమనపల్లి మండలంలోని మంగనపల్లి గ్రామ సమీపంలో అతిపురాతనమైన రాక్షసబల్లి అస్థిపంజరం పూర్తిగా లభించింది. అంతేకాకుండా వృక్ష శిలాజాలు ఈ ప్రాంతంలో లభించాయి. ఇప్పటికీ వీటి శకలాలను మనం చూడొచ్చు. ఇదే మండలంలోని రాజారం గ్రామంలో భారీ పరిమాణంలో, శిల్ప కళాశోభితమై ఉన్న దశావతార విగ్రహాలున్నాయి. ఇక్కడే భైరవుడి విగ్రహం కూడా కనిపిస్తుంది. ఇంకా ఏక శిలా నిర్మితమైన కూర్మ శిల్పం ప్రత్యేక ఆకర్షణ. అయితే ఇటీవలే గుప్తనిధులున్నాయనే అనుమానంతో ఇది నిట్టనిలువుగా ధ్వంసం చేయబడడం ఒక విషాదం. ఇక్కడే స్థానికులు బొర్రయ్యగా చెప్పుకునే బుద్ధ విగ్రహం దర్శనమిస్తుంది. దీన్నిబట్టి ఒకప్పుడు కొంతమేరకైనా బౌద్ధం ఉండేదేమో అని అనుమానించడానికి ఆస్కారం కలుగుతున్నది. ఈ విగ్రహాలన్నీ మహారాష్ట్రలోని చంద్రపూరు కేంద్రంగా పరిపాలించిన గోండు రాజుల కాలం నాటివని చరిత్రకారులు భావిస్తున్నారు.

జైపూరు మండలంలోని శివ్వారం వద్ద ఉన్న ఎల్.మడుగులో ఉన్న మొసళ్ళ సంరక్షణాకేంద్రం జీవ వైవిధ్యానికి నిలయం. 1978లో పుష్పకుమార అనే పర్యావరణ శాస్త్రవేత్త ఈ ప్రదేశాన్ని మొదటిసారిగా ప్రపంచానికి పరిచయం చేసారు.

అలాగే జన్నారం మండలంలో ఉన్న కవ్వాల్ పులుల అభయారణ్యం, జింకల సంరక్షణ కేంద్రం ప్రకృతి ప్రేమికులు ప్రత్యేకంగా దర్శించాల్సిన ప్రదేశాలు.

**ముఖ్యదేవాలయాలు :**

మంచిర్యాల జిల్లాలోని దేవాలయాల్లో చాలా పేరు పొందింది రెండో అన్నవరంగా భక్తులు భావించే గూడెం గుట్ట సత్యనారాయణస్వామి దేవాలయం. ఇక్కడ గోదావరీ తీరంలోని గుట్టపై వెలసిన స్వామి వారు రమా సహిత సత్యనారాయణ స్వామిగా పూజల నందుకుంటున్నాడు. కార్తీకపౌర్ణమి రోజున పెద్ద జాతర జరుగుతుంది. ప్రక్కనే మరొక గుట్టమీద అయ్యప్పస్వామి దేవాలయం నిర్మించ బడింది.

లక్సెట్టిపేట్ పట్టణంలోని సి.ఎస్.ఐ. చర్చి కొంచెం పరిమాణంలో చిన్నగా ఉన్నప్పటికీ అన్ని విధాలా మెదక్ చర్చిని పోలి ఉంటుంది. మెదక్ చర్చి తరువాత దీన్నే ఎత్తైనదిగా పేర్కొంటారు.

చెన్నూరు పట్టణంలో అంబాగస్త్యేశ్వర స్వామి దేవాలయం చాలా పురాతనమైనది. నిత్యం ధూపదీప నైవేద్యాదులూ, భక్తజన సందోహంతో కళకళలాడుతూ ఉంటుంది. ఇదే పట్టణంలో తెలంగాణలో తక్కువగా కనిపించే జగన్నాథ స్వామి ఆలయం ఉన్నది. ఇక్కడ

స్వామివారు అచ్చం పూరీ క్షేత్రంలో ఉన్నట్టే ఉంటారు. ఈ గ్రామానికి ఎనిమిది దిక్కులలో ఎనిమిది హనుమదా లయాలు ఉన్నాయి. చెన్నూరు గ్రామ శివార్లలో వెలసిన మదన పోచమ్మ దేవాలయం కూడా ముఖ్యమైనది.

చెన్నూరుకు సమీపంలోని కత్తెరసాలలో మల్లన్నగా పూజల నందుకుంటున్న మల్లికార్జునస్వామి దేవాలయం ఉన్నది. ఇక్కడ యాదవులే పూజాదికాలు నిర్వహిస్తుండడం విశేషం. శివరాత్రి సమయంలో జాతర జరుగుతుంది. ఇక్కడి అర్చకులు ఒగ్గు పూజలతో ఆలయచరిత్రను వివరిస్తారు. తెలుగు రాష్ట్రాల వారే కాక పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరౌతారు.

జైపూరు మండలంలోని వేలాలలో వెలసిన మల్లన్న దేవాలయం కూడా చాలా ప్రసిద్ధి. ఇక్కడ పట్నం పూజలు ప్రత్యేకం. గుట్టమీద చిన్న సొరికలో స్వయంభూ మల్లన్న దేవాలయం. క్రింద ఊరిలో నిత్యపూజా నిమిత్తం మరొక దేవాలయం ఉన్నాయి.

అదేవిధంగా జిల్లాలో అందమైన ప్రకృతి సౌందర్యంతో, గుట్టల మధ్య నెలకొన్న బుగ్గ రాజేశ్వర స్వామి దేవాలయం చూపరులను ఆకట్టుకుంటుంది. ప్రక్కనే ఉన్న గుట్టమీద నుండి నిరంతరం జలధార లింగం మీద నుండి పడుతుంది.

దండెపెల్లి మండలంలోని చిన్నయ్య, పెద్దయ్య గుహలు చూడదగినవి. 100 మీటర్ల ఎత్తున ఉన్న గుట్టను కేవలం పది నిమిషాల్లో పూనకం వచ్చిన పూజారి ఎక్కి, దిగి రావడం నిజంగా విశేషమే!

తిర్యాని మండలంలోని అర్జున్ లొద్ది ప్రాంతం కూడా ప్రకృతి సౌందర్యానికి ఆటపట్టు. ఇక్కడ పాండవులు నివసించారని చెప్పుకుంటారు.

జన్నారం మండలం, చింతగూడ లోని లక్ష్మీదేవి (లచ్చిందేవి) ఆలయం ప్రతి శుక్రవారం, ఆదివారం జనసముద్రంగా మారుతూ ఉంటుంది.


మంచిర్యాల్ పట్టణంలో విశ్వనాథ ఆలయ సముదాయం ఉన్నది. దీనిలో శివ, వేంకటేశ్వర, కన్యకా పరమేశ్వరి ఆలయాలు ఉన్నాయి. ఇక్కడ పర్వదినాల్లో విశేష కార్యక్రమాలు నిర్వహించబడుతాయి.

మందమర్రి మండలంలోని బొక్కలగుట్ట పర్వత శ్రేణుల్లో గాంధారి ఖిల్లా తప్పక చూడాల్సిన ప్రదేశం. ఈ కోట రాజ్ గోండుల చేత నిర్మించబడింది. ఒడ్డెరాజు వేయించిన శాసనం కూడా కనిపిస్తుంది. ఈ ఖిల్లాను మొత్తం కోటను తొలచి నిర్మించారు. లోపల రెండు ధ్వంస దేవాలయాలు, పడగతో ఉన్న నాగరాజు, మైసమ్మ, కాల భైరవుడు, ఏనుగు విగ్రహాలు కనిపిస్తాయి. ఖిల్లా పైభాగాన ఎప్పుడూ నీరు ఇంకిపోని సవతుల బావులుగా చెప్పబడే బావులు కనిపిస్తాయి. మెట్లు గుట్టకే చెక్కబడి ఉంటాయి. కోట పైభాగానికి చేరటం నిజంగా ఒక చిన్నపాటి సాహస యాత్రే. ఇక్కడ రెండేళ్లకు ఒకసారి నాయక పోడు వంశీయుల సమ్మేళనం జరుగుతుంది. పర్యాటకులు మంచిర్యాల్‌లో తప్పకుండా దర్శించాల్సిన ప్రదేశం.


ఈ రకంగా నూతనంగా ఆవిష్కరించబడిన మంచిర్యాల జిల్లా విశేషాలను సంక్షిప్త పరిచయం చేసినప్పటికీ ఇంకా విస్తారమైన పరిశోధన జరగాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. క్రొత్త రాష్ట్రంలో క్రొత్త చూపుతో చరిత్ర పునర్నిర్మాణం జరగాల్సి ఉన్నది. ఈ దిశగా మూసీ పత్రిక ప్రయత్నాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తూ, పరిమితులకు లోనైన ఈ వ్యాసం ఎంత మాత్రం సమగ్రం కాదని, అయితే చిత్త శుద్ధికి మాత్రం లోపం లేదని విన్నవిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

# మెదక్ జిల్లా చిత్రపటం





ఏడుపాయల దుర్గమాత దేవాలయం



చాముండేశ్వరి దేవాలయం



పార్శ్వనాథ దేవాలయం



మెదక్ కోట



రాణి శంకరమ్మ కోట



మెదక్ చర్చి



మల్లినాథ సూరి

190(b)

# మెదక్

**మెతుకుల నిచ్చు సీమ యిది మేదినిపై ఘన 'చర్చి'తాత్మమై**
**శ్రుతులు పఠింప వెల్గినది శోభిలు దుర్గ సరిత్తటమ్ములో**
**వెతలను దీర్చు వాఙ్మయము వీధులనెల్ల ప్రతిధ్వనించు స**
**మ్మత జనతాభిరామమది మాన్యము సర్వ కళాకలాపతన్!**

తెలంగాణ రాష్ట్రం పూర్వం పది జిల్లాలతో ఆంధ్రప్రదేశ్‌లో కలిసి వుండేది. 2014 లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత తెలంగాణ జిల్లాలను పరిపాలనా సౌలభ్యం కోసం 2016 అక్టోబర్ 11 న పది జిల్లాలను కాస్తా 31 జిల్లాలుగా పెంచారు. అందులో మెదక్ మూడు జిల్లాలుగా అంటే సిద్ధిపేట, సంగారెడ్డి, మెదక్‌లుగా ఏర్పడటం జరిగింది.

## ఈ పేరెందుకు?

మెదక్ పూర్వనామం 'మెతుకు' సీమ. మెతుకు సీమనే కాకుండా రాచనీడు, గుల్షనాబాద్ అనే పేర్లతో పిలుస్తూ, పిలుస్తూ 'మెదక్' గా స్థిరపడింది. ప్రతాపరుద్రుని కాలంలో నిర్మించిన ఈ దుర్గాన్ని మెదక్ దుర్గమని, మెతుకుసీమ అని అంటారు.

## భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి

జిల్లా విస్తీర్ణం 2,722 చ.కి.మీ. 2011 జనాభా లెక్కల ప్రకారం 7,67,428 జనాభాను కలిగి వుంది. అందులో పురుషులు 3,78,654 కాగా, స్త్రీలు 3,88,774. ఈ జిల్లాకు తూర్పున సిద్ధిపేట జిల్లా, పడమర కర్ణాటక రాష్ట్రం, ఉత్తరాన కామారెడ్డి జిల్లా, దక్షిణాన రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలు సరిహద్దులుగా వున్నాయి.

## సహజ వనరులు

ఇక్కడి ఖనిజ సంపదల్లో చెప్పుకోదగింది క్వార్ట్జ్. ఇసుక, బంకమన్ను, పలుగురాయి ఎక్కువగా వెల్దుర్తి మండలంలోని రామంతాపూర్, రాయికోట్ మండలంలో హుసేనాబాద్, పెద్ద శంకరం పేట గొట్టిముక్కుల, తిమ్మాపూర్, చేగుంట మండలంలో రాంపూర్, నర్సాపూర్ మండలంలో మాదాపూర్, మెదక్ మండలంలో రయన్‌పల్లి, రామాయంపేట మండలంలో కోమట్‌పల్లిలో దొరుకుతుంది. క్వార్ట్జ్ తెల్లగా వుండి చిన్న పరిమాణంలో వుంటుంది. దీనిని సీసం తయారీకి వాడతారు. దీనితోపాటు జిల్లా అంతటా సున్నపురాయి దొరుకుతుంది. పల్లెల్లో సున్నపు బట్టీ పెట్టి సున్నం తయారీ చేస్తారు. ఈ పరిశ్రమలు శివంపేట, నర్సాపూర్, వెల్దుర్తి, రామాయంపేటలో ఎక్కువగా వున్నాయి. సున్నాన్ని ఇసుకతో కలిపి దంగు చేస్తారు. దీన్ని ఇండ్ల నిర్మాణాల్లో వాడతారు.

**నేలలు :** ఇక్కడి నేలల్లో 40% చెల్క నేలలు, 11% దుబ్బనేలలు, 42% నల్లరేగడి నేలలున్నాయి. ఇక్కడి ప్రధాన పంట వరి. వరి తర్వాత చెరుకును పండిస్తారు. అల్లాదుర్గం ప్రాంతంలోని ధనియాల పంట ఈ జిల్లా ప్రత్యేకత. కూరగాయలు కూడా ఎక్కువగా పండిస్తారు. మొత్తం వ్యవసాయ భూమిలో 20% వరిని పండిస్తారు.

**రెవెన్యూ డివిజన్లు - మండలాలు**

మెదక్ జిల్లాలో మూడు రెవిన్యూ డివిజన్లు వున్నాయి. అవి 1. మెదక్ 2. నర్సాపూర్ 3. తూప్రాన్.

**మెదక్ డివిజన్‌లోని మండలాలు :**

1. మెదక్ 2. హవేలీ ఘన్‌పూర్ (కొత్తది) 3. పాపన్నపేట 4. శంకరంపేట (ఆర్) 5. శంకరం పేట (ఎ), 6. టెక్మల్ 7. అల్లాదుర్గం 8. రేగొండ

**తూప్రాన్ డివిజన్ (కొత్తది) లోని మండలాలు :**

1. రామాయంపేట 2. నిజాంపేట (కొత్తది) 3. వెల్దుర్తి 4. చేగుంట 5. తూప్రాన్ 6. మనోహరాబాదు (కొత్తది)

**నర్సాపూర్ డివిజన్ (కొత్తది) లోని మండలాలు :**

1. నర్సాపూర్ 2. శివంపేట 3. కౌడుపల్లి 4. కుల్చారం 5. చిలా - చేడ్ 6. నార్సింగ్

**అడవులు** : ఈ జిల్లాలో అడవుల విస్తీర్ణం 20.22 శాతం. పోచారం అభయారణ్యం, నిజామాబాదు, మెదక్ జిల్లాలతో కలిపి వుంది. వివిధ రకాల చెట్లున్నాయి. పెలికాన్, బార్‌హెడెడ్ గూస్ లాంటి అరుదైన పక్షులు, బ్రాహ్మణీ బాతులు, ఓపెన్‌బిల్డ్ స్టోక్ లాంటి విదేశీ పక్షులు ఇక్కడికి వస్తుంటాయి.

**నదులు :** మంజీరాకు ఉపనది అయిన పసుపులేరు, కడలేరు నదులు చెప్పుకోదగినవి. మంజీరాకు ఉపనది అయిన హల్దీవాగు గజ్వేల్‌లో పుట్టి మెదక్, రామాయంపేట్‌ల మీదుగా ప్రవహించి మంజీరా నదిలో కలుస్తుంది.

**చెరువులు-ప్రాజెక్టులు :** ఈ జిల్లాలో 2,988 చెరువు లున్నాయి. వీటిలో కాకతీయ మిషన్ మొదటి దశలో 561 చెరువులను, రెండవ దశలో 670 చెరువులను అభివృద్ధి చేశారు.

**జనాభా :** 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లా మొత్తం జనాభా 7,67,428 కాగా, అందులో పురుషుల జనాభా 3,78,654, స్త్రీల జనాభా 3,88,774. దీనిలో గ్రామీణ జనాభా శాతం 92.33% కాగా, పట్టణ జనాభా 12.60%. ఈ జిల్లా జన సాంద్రత 275. లింగ నిష్పత్తి 1000 : 1027.

**అక్షరాస్యత :** అక్షరాస్యతా శాతం 56.12%. రాష్ట్ర సగటు అక్షరాస్యత శాతం కన్నా ఈ జిల్లాది 10శాతం తక్కువ. వీరిలో పురుషుల అక్షరాస్యత 67.51%, స్త్రీల అక్షరాస్యత 45.15%.

## మెదక్ జిల్లా చరిత్ర

**శాతవాహనులు:** మెదక్ జిల్లా అశ్మక దేశంగా శాతవాహనుల కాలంలో పిలువబడేదని చరిత్ర చెబుతోంది. అంటే మెదక్ జిల్లా శాతవాహనుల ఏలుబడిలో వున్నట్లు తెలుస్తోంది. వీరి కాలంలో వైదిక, బౌద్ధ మతాలతో పాటు జైనం వున్నట్లు తెలుస్తోంది. కానీ మెదక్ జిల్లాలో బౌద్ధం కంటే జైనమే ఆచరించే వారెక్కువని తెలుస్తోంది. పాత జిల్లా ప్రకారం చూస్తే జిల్లాలో పొట్ల చెరువు, కోలాచలం త్రవ్వకాల్లో మహావీరుని ప్రతిమలు బయటపడ్డాయి. ఈ తవ్వకాలలో బయటపడిన మహావీరుని విగ్రహం పొడవు 8 అడుగులు. జోగిపేటలో ఒక పెద్ద జినాలయం వున్నట్లు చరిత్ర చెబుతోంది. ఆనాటి ప్రజల ఆచార వ్యవహారాలు, సాంఘిక జీవనం, కళాపోషణ, మతం మొదలైనవి తెలుసు కొనుటకు నాటి శాసనాలు, గుహాలయాలు, దేవాలయ శిల్పాలు, గ్రంథాలు ముఖ్యమైన ఆధారాలుగా పేర్కొనవచ్చు.

**రాష్ట్రకూటులు** : వీరు మొదట బాదామీ చాళుక్యుల సామంతులుగా, మాన్యకేట ప్రాంత పాలకులుగా పరిపాలిం చారు. చాళుక్య రాజైన కీర్తివర్మను పదవీభ్రష్టుడిని చేసి బాదామీని వశపరుచుకొని రాష్ట్రకూట రాజ్యాన్ని స్థాపించారు. మెదక్ జిల్లాలో ఈ రాజు వేయించిన శాసనాలు లభించాయి. కావున మెదక్ ప్రాంతాన్ని రాష్ట్రకూటులు పాలించారని ఈ శాసనాల ఆధారంగా చెప్పవచ్చు. వీరు సుమారు 200 సంవత్సరాలు యావత్తు తెలంగాణ ప్రాంతాన్ని పరిపాలించారు.

**కళ్యాణి చాళుక్యులు** : మెదక్ జిల్లా భూభాగాన్ని రాష్ట్రకూట వంశ పరిపాలనాంతరం కళ్యాణి చాళుక్యులు పరిపాలించారు. వీరు రాయలసీమ తెలంగాణ ప్రాంతాన్ని కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కళింగాది ప్రాంతాలను

పరిపాలించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. వీరు బాదామి చాళుక్యరాజ్యం కన్న విశాలమైన రాజ్యాన్ని ఏర్పరచి పరిపాలించారు.

**కాకతీయులు**: తెలంగాణ చరిత్రలో కాకతీయ రాజులు సుమారుగా 300 సం. పైగా యావత్తు తెలంగాణతో కూడిన ఆంధ్రప్రదేశ్‌ను ఏకచ్ఛత్రాధిపత్యం కిందకు తెచ్చి పరిపాలించారు. కాకతి రుద్రదేవుడు తెలంగాణ ప్రాంతమును జయించిన పిదప తీరాంధ్రంపై దృష్టి సారించారు. రుద్రదేవుడు మెదక్‌జిల్లా దగ్గర ఉన్న బీదర్ ప్రాంతము వరకు వ్యాపించి ఉన్న భూభాగంపై కళ్యాణి చక్రవర్తుల నుంచి ఆధిపత్యం సాధించారు. మెదక్‌జిల్లాలో కూడా కాకతీయుల కాలంలో నిర్మించిన జీర్ణ శిథిల దేవాలయాలు కల్పనూరు, అల్లాదుర్గం మొదలైన ప్రాంతాల్లో ఉన్నాయి. దుర్గనిర్మాణంలో కూడా కాకతీయుల శిల్పాలను చూడవచ్చు. మెదక్ దుర్గము కాకతీయుల కళాసంపదను చాటుతున్నవి అని ఖండవల్లి వారి ఆంధ్రుల చరిత్ర సంస్కృతి నిర్ధారిస్తుంది.

**అసఫ్‌జాహీ వంశము** : క్రీ.శ. 1854లో మీర్ మహబూబ్ అలీ అసఫ్‌జాహీ బహద్దూర్ పరిపాలనాకాలంలో నిజాం రాజ్యం 5 సుబాలుగా విభజించబడింది. ప్రతి సుబాకు ఒక సుబేదారు ఉండేవాడు. ఈ ఐదు సుబాలకింద 17 జిల్లాలు ఉండేవి. ప్రతి జిల్లాకు ఒక తాలుకాదారు, పరిపాలనాధికారి ఉండేవారు. ఆనాడు మెదక్ ఒక సుబాగా ఉండేది. ఈ సుబాను 'గుల్షనాబాద్' అని పిలిచేవారు. క్రీ.పూ. 200 సం.ల నుండి క్రీ.శ. 1300 వరకు చరిత్రలో మెదక్ అనే పేరు ఎక్కడా కనబడదు.

మెదక్ ప్రాంతానికి ఒక్కో సమయంలో ఒక్కో పేరు ఉండేది. దక్షిణ భారతదేశంలో బౌద్ధుల కాలంలో విదర్భరాష్ట్రం, అపరాంతక రాష్ట్రం, అశ్మక రాష్ట్రం అని మెదక్ సీమ ప్రాంతాన్ని పిలిచేవారు. జైనుల కాలంలో దేశాలను రాజ్యాలని పిలిచేవారు. కళింగ, రాష్ట్రకూట, చోడ, ఆంధ్రరాజ్యాలు ఉండేవి. అప్పుడు మెదక్‌ను పులక దేశముగా, రాష్ట్రకూటుల కాలంలో నాగభూమిగా, శాతవాహనుల కాలంలో మంజరీక దేశముగా

**మున్సిపల్ కార్పొరేషన్ :** మెదక్

**నగర పాలక సంస్థలు :** తూప్రాన్, మెదక్, నర్సాపూర్

**రెవిన్యూ గ్రామాలు :** 381

**గ్రామపంచాయితీలు :** 320

**పోలీస్ హెడ్‌క్వార్టర్స్ :** మెదక్

**జిల్లా పరిషత్ :** మెదక్

**పార్లమెంటు నియోజకవర్గం :** మెదక్

**అసెంబ్లీ నియోజకవర్గాలు :** మెదక్, రామాయంపేట, నర్సాపూర్, చేగుంట.

**పట్టణాలు :** మెదక్, తూప్రాన్, నర్సాపూర్

పిలిచారు. కాకతి బేతరాజు కొరవి దేశాన్ని పాలించినట్లు చరిత్రలో తెలుస్తుంది. అంతకు ముందు ఈ ప్రాంతాన్ని చాళుక్యులు పరిపాలించారు. త్రైలోక్య మల్లుని శాసనాలు, బేతరాజు శాసనాలు, డాకూరు, ముది మాణిక్యం, అల్లాదుర్గాలలో లభించిన ఆధారాలతో కొరవి ప్రాంతాన్ని కొరవి బేతరాజు పాలించి ఉండవచ్చు అని తెలుస్తుంది.

కుతుబ్‌షా పరిపాలనలో మెదక్ ప్రాంతం కాసలనాడు అని పిలువబడింది. శ్రీశైలం మలికార్జున దేవాలయంలో పాతిన శిలా శాసనములో 'కుసలనాడు' అని ఉంది. కుసలనాడు కాసలనాడుగా మార్పుచెందింది. కాసలనాడు గురించి ఈ క్రింది పద్యంలో చక్కగా వర్ణించాడు.

**"వీసపు ముక్క వత్తు నరవీసపు మంగళ సూత్రమమ్మినన్**
**గాసునురాని కమ్మల రకాసును రానిని పచ్చపూసలున్**
**మాసిన చీర గట్టి ముప మాన ముంసగగ నేడురాగనా**
**కాసలనాటి వారి కనకాంగిని చూచితి నీళ్ళ రేవునన్"**

పై పద్యంలో కాసులనాడు అను పేరు కనబడుతుంది. శ్రీనాథుడు క్రీడాభిరామము అను రచనలో కూడా కాసలనాడు అను పదం కనబడుతుంది.

**"కాసల్నాటి శ్రేష్ఠుడు**
**మీసాలప్పయ్యగారి మేనల్లుడు ధా**

**శ్రీసుర తిలకుడు కుసుమ శ**

**రాసుమదంధ్రనగరంపు యాత్రోన్ముఖుడై** అని వర్ణించడం జరిగింది.

తొలి అచ్చ తెనుగు కావ్యం యయాతి చరిత్ర రచించిన తెలగనార్యుడు తన కావ్యంలో కాసలనాడును స్తుతించాడు. మెదక్ జిల్లాలో కాసల, కాసాలపురం, కాసలబాదు అను పేర్లున్నాయి. వీటన్నింటిని బట్టి చూడగా మెదక్ కాసలనాడుగా పిలువబడినదని తెలుస్తోంది. కాకతీయుల కాలంలో మెతుకుగా పిలువబడింది.

**"పడమటను సవాయి బసవనిగాజేసి**
**యచట గొయ్యల కొండ నావరించె**
**దమిదుల్లాఖాను దక్షిణంబున గొట్టి**
**. . . . . . . . . . . . . . . . .**
**వాహ ఖఖరాధి రోహ రేవంతి మూర్తి**
**కుతుబుషాహనిక్ష్మాపాలు గుణవిశాలు"**

పై పద్యం ప్రకారం కుతుబ్షా పాలన నాటికి మెదక్ దుర్గము పటిష్ఠంగా ఉన్నట్లు తెలుస్తుంది. అందోలు రెడ్డి రాజులు మెదక్‌ను రాచవీడుగా పిలిచారు. ఈ విధంగా మెదక్‌కు వేరు వేరు కాలాల్లో వేరు వేరు పేర్లు ఏర్పడినాయి.

1. అశ్మకరాష్ట్రం 2. పులాక దేశము 3. మంజరీక దేశం 4. నాగభూమి 5. కొరవి దేశము 6. కాసలనాడు 7. మెదక్ 8. మెతుకు 9. గుల్షనాబాద్

**ఆచారాలు, సంప్రదాయాలు, పండుగలు :**

పురాణేతిహాసాల నుంచి, పెద్దల నుంచి సంక్రమించిన సంప్రదాయాలను అనుసరించి ఇక్కడి ప్రజలు తమ పండుగలను జరుపుకుంటున్నారు. సంప్రదాయంలో భాగమైన వివిధ పండుగలను, నోములను, వ్రతాలను, ఆచారాలను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకొని ఆధ్యాత్మిక జీవనంలో ముందున్నారు. పువ్వులతో అలంకరించే బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకుంటారు. ఈ పండుగ ద్వారా మహిళల శక్తిని చాటుతారు. దసరా, దీపావళి, సంక్రాంతి, మహాశివరాత్రి, ఉగాది, తొలి ఏకాదశి, వినాయక చవితి, బక్రీద్, రంజాన్, క్రిస్మస్ వంటి పండుగలను కాలానుసారంగా జరుపుకుంటూ సంప్రదాయాలను ముందు తరాలకు అందిస్తున్నారు.

**కళలు :** మానవునిలోని సృజనాత్మక శక్తికి, ఆనందానుభూతికి దర్పణం పట్టేవి కళలు. ఈ జిల్లా శిల్పకళకు ఆయువు పట్టువుగా వుంటోంది. అందచందాలు గల శిల్పాలను చాళుక్యులు, కాకతీయులు ఇక్కడ చెక్కించారు. వెల్దుర్తి మండలంలో సుమారు 700 సంవత్సరాల క్రితం నిర్మించిన అపురూపమైన శిల్ప సంపద, శివాలయాలు, వైష్ణవాలయాల్లో వున్నాయి. ఇక్కడి ఉన్న రాతి స్తంభాలు, మందిరాలు ఆకాలం నాటి శిల్పాల నైపుణ్యానికి ప్రతీకలుగా కనబడుతున్నాయి. వీటిలో విఠలేశ్వరాలయం వద్ద వున్న కాకతీయ సింహద్వారం ప్రత్యేకం. ఇది 18 అడుగుల ఎత్తులో వుంది. ఈ ద్వారానికి ఒక పక్క రాక్షసులు, మరోపక్క దేవతలు నిలబడి వాసుకీ పాముని ఉపయోగించి మందర పర్వతం అనే సముద్రాన్ని చిలుకుతున్నట్లుగా, మరో పక్క శివుడు నాట్యం చేస్తూ విషం తాగుతున్నట్లుగా చిత్రం చెక్కబడివుంది. ఈ సింహద్వారానికి ఆరు రంధ్రాలున్నాయి. ఒక్కో ఋతువులో ఒక్కో రంధ్రం గుండా సూర్యుని కిరణాలు రంగనాయకుల నాభిపై పడతాయి. ఈ జిల్లాలోని కోలాటం, యక్షగానం, హరికథ, బుర్రకథలు, వంతపాటలు ఇక్కడి కళా నైపుణ్యానికి నిదర్శనాలుగా నిలుస్తున్నాయి.

**జాతరలు : ఏడుపాయల దుర్గమ్మ జాతర :** మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలో నాగసాని పల్లె గ్రామానికి సమీపంలో ఈ ఆలయం వుంది. ఇక్కడ మంజీరా నది ఏడు పాయలుగా చీలిపోయి, మూడు కి.మీ. ప్రవహించి మళ్ళీ ఒకే చోట కలుస్తుంది. అమ్మవారి విగ్రహం దగ్గరికి ఒక్క వ్యక్తి మాత్రమే వెళ్ళగలిగే సౌకర్యం వుంటుంది. ఈ జాతర సమయంలో కూడా ఎడ్లను దుస్తులతో అలంకరించి, ఎడ్లబండ్లపై వారి వారి కుటుంబాలతో ఊరేగుతూ ఊరంతా తిరుగుతారు.

## జిల్లా సాహిత్యం

మెదక్‌జిల్లా సాహిత్య చరిత్రలో లభించిన ఆధారాలను బట్టి సంస్కృత భాషా సాహిత్యమే ముందుగా ప్రభావితమైంది. ఈ జిల్లా సాహిత్యానికి మల్లినాథసూరి ఆద్యుడుగా భావించాలి. మొదటి మల్లినాథ సూరి అవధాన విద్యకు ఆద్యుడుగా గుర్తించబడుతున్నాడు.

**కపర్థి** : కపర్థి మల్లినాథుని కుమారుడు. ఇతడు ఆపస్తంబ సూత్రుడు, మహాపండితుడుగా పేరు పొందిన భాష్యకారుడు. ఇతని రచనలు 1. ఆపస్తంబ శ్రౌతసూత్ర భాష్యము 2. భారద్వాజ గృహ్యసూత్రభాష్యము 3. ఆపస్తంబ గృహ్య పరిశిష్ట భాష్యము 4. శ్రౌతకల్పకావృత్తి. వీరి కుమారులు మల్లినాథసూరి, పెద్దిభట్టులు.

**మల్లినాథ సూరి**: మెదక్‌జిల్లా లోని కొల్చారం గ్రామంలో జన్మించిన సూరి యావత్తు భారతజాతికే కీర్తి తెచ్చిన మహనీయుడు. మల్లినాథసూరి గొప్ప వ్యాఖ్యాన కర్త. వీరి రచనలు 1. రఘువంశమునకు సంజీవని వ్యాఖ్యానం 2. కిరాతార్జునీయానికి ఘంటాపథం అనే వ్యాఖ్యానం 3. శిశుపాల వధకు సర్వంకశ వ్యాఖ్యానం 4. శ్రీహర్షుని నైషధానికి జీవాతు అనే వ్యాఖ్యానం 5. విద్యాధరుని అలంకార శాస్త్రంపై వ్యాఖ్యానాలు రచించారు. కృతులు 1. రఘువీర చరితం 2. వైశ్యవంశ సుధాకరం 3. ఉదార కావ్యం.

**పెద్దిభట్టు**: కపర్థి పండితుని రెండవ కుమారుడు. ఇతడు సంస్కృత భాషలో ఆరితేరిన పండితుడు. 'ఇత్యర్థః ఇతి భావః' అని పెద్దిభట్టు వ్యాఖ్యలు రచించారు. చక్కని కవితా ధార గలిగిన ధీరశాలి, హాస్యప్రియులు. వీరు సర్వజ్ఞ సింగభూపాలునిచే సత్కారం పొందారు. 14వ శతాబ్దానికి చెందినవారు.

**కుమారస్వామి సోమపీథి** : పెద్దిభట్టు కుమారుడైన ఇతడు వేదవేదాంగాలు నేర్చిన కవి. ప్రతాపరుద్రీయం అనే అలంకార శాస్త్రానికి వ్యాఖ్యానం వ్రాశారు. వీరికి నలుగురు కుమారులు.

**లక్ష్మీశకవి**: అల్లాదుర్గం మండలంలో దేవునూరు గ్రామంలో జన్మించారు. వీరు సంస్కృత జైమిని భారతము (68 అధ్యాయాలు) రచించారు. ఇతనికి 'చూతవన చైత్ర' అనే బిరుదు ఉన్నది.

**ముదిగొండ బ్రహ్మయ్యలింగము**: వీరు మెదక్ జిల్లాలోని టేకుమాలు వాస్తవ్యులు. 17వ శతాబ్దానికి చెందిన వీరు 'శివరహస్య ఖండము' అను వచన కావ్యాన్ని రచించారు.

**వెల్దుర్తి మాణిక్యరావు**: జన్మస్థలమే ఇంటిపేరుగా మారిన మాణిక్యరావుగారు తెలుగు, ఉర్దూ, మరాఠీ, హిందీ, ఆంగ్ల భాషలలో పండితులు. వీరు గ్రంథాల యోద్యమంలో భాగంగా అణా గ్రంథమాలను స్థాపించారు. వీరి రచనలు 1. సీతపెండ్లి 2. బంగారు లేడి 3. దయ్యాలకథ మొదలైనవి.

**భాగవతం సీతారామ శర్మ** : వీరు మెదక్ వాస్తవ్యులు. తన సాహిత్యాన్ని ధర్మప్రచారానికి వినియోగించారు. మెదక్‌లో ప్రభుత్వ పాఠశాలలో పండితునిగా పనిచేశారు. వీరు తత్త్వబోధిని గ్రంథమాలను స్థాపించి కొన్ని గ్రంథాలను ప్రచురించారు. వీరి రచనలు 1.భక్తి శిరోమణి 2. ఉద్ధవుడు 3. స్మరణ భక్తి శబరి 3. దేవర్షి నారదుడు 4. గీతా కృష్ణుడు 5. గీతాపాకారోపాసన 6. ప్రతిమార్చనము 7. అనుసూయ రజకాగ్ని 8. శ్రీమహాశివరాత్రి (పద్యకావ్యం) 9. సంగమేశ్వర తారావళి పద్యములు 10. పశ్చాత్తాపము (నవల) 11. వైద్యనిఘంటువు (అసంపూర్ణము) 14. దేవకీనందన శతకము 15. మేలు కొలుపు (అసంపూర్ణం)

**చెర్విరాల బాగయ్య** : వీరు కౌడిపల్లి మండలం ముట్రాజ్‌పల్లి వాస్తవ్యులు. వీరు కిరాతార్జునీయంతో పాటు అనేక యక్షగానాలను రచించారు. వీరిని 'తెలంగాణ యక్షగాన పితామహునిగా' పిలుస్తారు. హైదరాబాదులో వీరు స్థిరపడినారు.

**సిరిశనగండ్ల శ్రీనివాసాచార్యులు**: మెదక్ పట్టణం నివాసస్థానంగా గల శ్రీనివాసాచార్యులు రామాచార్యుల కుమారుడు. రామాచార్యుల వారు మంత్ర, తంత్ర, ఆగమ, జ్యోతిష, వైద్యశాస్త్రములందు పండితులు. వీరు రచించిన

పద్యకావ్యం 'మెతుకుసీమ'. ఈ కావ్యాన్ని తిరుమల వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చారు.

**శాస్త్రుల విశ్వనాథశర్మ :** 20వ శతాబ్దానికి చెందిన వారు. చిన్నతనంలో సీతారామ్ బాగ్ వేదాంతవర్ధిని సంస్కృత కళాశాలలో విద్యాభ్యాసం చేశారు. వేదాంత శాస్త్రాన్ని ప్రత్యేకంగా అభ్యసించి 'సాహిత్య శిరోమణి' పట్టాను పొందినారు. ఏడుపాయల దేవస్థానం వారి కోరిక మేరకు దేవాలయ చరిత్ర సుప్రభాతం రచించారు. సంస్కృత శతాబ్దీ గ్రంథాన్ని రచించి లాల్ బహుదూర్ శాస్త్రి గారి చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. వీరికి శిరోమణి, అభినవ విద్యారణ్య బిరుదు లభించింది. 1985లో మరణించారు.

**దోర్బల విశ్వనాథ శర్మ:** విశ్వనాథ శర్మగారు రామాయంపేట వాస్తవ్యులు. 1933లో జన్మించారు. వీరు చిన్నతనం నుండి సంస్కృతం, ఆంధ్రము, హిందీ, ఆంగ్లంలో పరిపూర్ణమైన పాండిత్యం సంపాదించారు.

1. మూకపంచశతి (అయిదు శతకములు తెలుగు వ్యాఖ్యానంతో) 2. హరిమీడే, శివమీడే (స్తోత్రము తెలుగు వ్యాఖ్యానంతో) 3. శ్రీ లాలిత్యము (సంస్కృతాంధ్ర పద్య సహస్రములు) 4. మహిమ్న స్తోత్ర పంచకానువాదము 5. హలాయన శివస్తోత్రము (తెలుగు వ్యాఖ్యానము) 6. చండీ శతకము (తెలుగు వ్యాఖ్యానము) 7. శివకర్ణామృత స్తోత్రము 8.శివసప్తశతి ఆంధ్ర పద్యానువాదం

**బి. అనంతరాజ శర్మ:** వీరు పెద్దశంకరంపేట వాస్తవ్యులు. వీరిది ఉపాధ్యాయ వృత్తి. వీరి రచనలు 1. సంగమేశ్వర సుప్రభాతం 2.సంగమేశ్వర స్తోత్రము 3.సంగమేశ్వర మంగళశాసనములు.

**డా. శివునూరి విశ్వనాథ శర్మ :** మెదక్‌జిల్లా చేగుంట వాస్తవ్యులు. 1940లో జననం. వీరు వేములవాడ సంస్కృత పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. హైదరాబాదులో తెలుగుపండితులుగా పనిచేశారు. 'కావ్యకంఠ వాశిష్ఠ గణపతిముని జీవితము - రచనలు' అను అంశంపై వేయిపుటల సిద్ధాంత వ్యాసాన్ని ఆచార్య పుల్లెల రామచంద్రుడు గారి పర్యవేక్షణలో సంస్కృత భాషలో రచించి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్.డి.పట్టా పొందారు. రాష్ట్రపతిచే సన్మానించబడ్డారు. విద్యార్థి దశలో 1. శ్రీగణేశ సుప్రభాతం 2. స్తోత్రప్రపత్తి 3. మంగళశాసనములు రచించారు. తన తండ్రి స్మారకంగా 'నీరాజన సంపుటి' మాతృ స్తుతి అనే గ్రంథాన్ని రచించారు.

**గజవాడ హనుమత్కవి :** హనుమత్కవి గారి ఇంటిపేరు గజవాడ. నివాసం అల్లాదుర్గము. వీరు క్రీ.శ. 1898-1948 మధ్యకాలంలో జీవించారు. వీరు రచించిన 'మనోహర పద్మావతి' నాటకము 1930 లో ప్రచురించారు. సంస్కృతాంధ్రాలలో విశేష పాండిత్యమున్న వీరు శత నాటక కర్తలుగా పేరుగాంచారు.

**శాస్త్రుల పాండురంగ శర్మ :** యాదగిరి నృసింహ స్వామి క్షేత్రమందలి సంస్కృత పాఠశాలలో, వేదాంత వర్ధనీ కళాశాలలో చదివి, సంస్కృతంలో బి.ఓ.ఎల్. పట్టా పొందారు. 'పాండురంగ సూక్తి' అనే శతకాన్ని రచించారు. వీరికి ఉపన్యాస కిశోర, కవిశార్దూల, కళా వాచస్పతి మొదలైన బిరుదులున్నాయి.

**శాస్త్రుల రామనాథ శర్మ :** సంస్కృతాంధ్రాలలో చక్కని పాండితీ ప్రతిభ కలవారు. ఉపాధ్యాయ వృత్తి కొనసాగిస్తూ జ్యోతిశ్శాస్త్రాన్ని కూలంకషంగా గ్రహించిన వీరు 'దైవజ్ఞ శిరోమణి' అనే బిరుదును పొందినారు.

**కృష్ణమూర్తి శర్మ :** వేద సంస్కృతాలను అభ్యసించినారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టి ఆంగ్ల , హిందీ భాషలలో సునిశితమైన పాండిత్యాన్ని సంపాదించినారు. మూక పంచశతి ఆంధ్రాను వాదము, ఆర్యాశతకం, దేవి మహిమతో పాటు ఎన్నో వ్యాసాలను రచించి పత్రికలో ప్రచురించారు. గేయాలు, పాటలు, మంగళహారతులు రచించారు.

**డా. కిడాంబి నరసింహాచార్యులు:** వీరు శివంపేట మండలం దొంతిగ్రామ వాస్తవ్యులు. వీరు వైష్ణవ భక్తి తత్వాలపై పరిశోధనా వ్యాసాలు రాసి, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టాను పొందారు. వీరు అనేక సంస్కృత రచనలను తెలుగీకరించారు.

**దోర్బల వెంకటరాజ శర్మ :** రామాయంపేట వాస్తవ్యులు. 1929 లో జన్మించారు. సాహిత్య విద్యా ప్రవీణులు, చక్కని భాషా పండితులు, సాహిత్యప్రియులు. త్రిలింగ, మహాకవి బాణభట్టు, అదృష్టం, భక్తకవి, జయదేవుడు, ప్రభుత గేయాలతో పాటు విజయ విలాసమనే నాటకాన్ని రచించారు.

**సముద్రాల వేంకటాచార్యులు :** నేటి మండల కేంద్ర మైన శివంపేటలో జన్మించారు. వేదశాస్త్ర అభ్యాసాలతో పాటు, వైద్యశాస్త్రాన్ని కూడా చదివి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. పాండిత్యం, కవిత్వం, వైద్యం, సంగీతం, జ్యోతిషం మొదలైన విషయాలలో ఆరితేరిన ప్రజ్ఞాశాలి. వీరికి 'ఆగమ శాస్త్ర పండిత ప్రవర' అనే బిరుదున్నది. వీరి రచన 'ధనుర్దాసు'. వీరు మెదక్ మండల సాహిత్య పరిషత్తు శాఖ అధ్యక్షులుగా సేవలందించారు.

**దోర్బల ప్రభాకర శర్మ:** రామాయంపేట వాస్తవ్యులు. చిన్నతనం నుంచే సంస్కృతాన్ని అభ్యసించారు. ఈ భాషపై అభిమానం జాస్తి. సంస్కృత భాషా ప్రచారం వీరి నిత్యకృత్యం. అతి సామాన్యులకు కూడా సంస్కృతాన్ని చేరవేయడానికి వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా వీరు చేస్తున్న అవిరళ కృషి అనన్యమైంది.

**గంగాధర భట్టు రామకృష్ణ శాస్త్రి :** వీరు చేగుంట మండలంలోని చందాయిపేటలో జన్మించారు. గంగాధర భట్టు చిన్నతనం నుంచే సంస్కృతాన్ని చదువుకున్నారు. వీరు 'పోతన' అనే పద్యకావ్యాన్ని రచించారు.

**శాస్త్రుల భార్గవ రామశర్మ:** శివంపేట వాస్తవ్యులు. 1945 లో జన్మించారు. కొన్నాళ్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా పనిచేశారు. వేదాంత శాస్త్రాన్ని పఠించారు. మాండుక్యోపనిషత్తు వైతథ్య ప్రకరణాన్ని విశ్వనాథ శర్మ గారితో కలిసి తెలుగులోకి అనువదించారు. 'శ్రీరామ నవరాత్రోత్సవ కల్పం, యజ్ఞోపవీత సంస్కార సంకలనం, సత్యగణపతి వ్రతం, శ్రీ విద్యారణ్య ప్రోక్త శ్రీసూక్త విద్యారణ్య స్తోత్రాలను' రచించారు. వీటితో పాటు అనేక వ్యాసాలు రాశారు. వీరు 'శ్రీవిద్యా సంప్రదాయం' అనే అంశంపై తన పిహెచ్.డీ. చేశారు.

**కాందూరి రామాచార్యులు:** తూప్రాన్ మండలం జీడిపల్లిలో పుట్టిపెరిగారు. చిన్ననాడే వేదాంత వర్ధినీ కళాశాలలో చేరి సంస్కృతం నేర్చుకున్నారు. మెదక్ జిల్లాలో తెలుగు పండితులుగా విధులను నిర్వహించారు. 'సంగమేశ్వర సుప్రభాతం, లక్షణ చంద్రిక, రామవిజయం, కల్యాణ చంద్రిక, కాదంబరి, తత్సమాంధ్ర వ్యాకరణం అనే గ్రంథాలను రచించారు. వీరికి చారిత్రక పరిశీలనపై అభిలాష మెండు.

**ఎస్. రఘునాథ శర్మ:** చేగుంట వాస్తవ్యులు. సంస్కృతాంధ్రంలో చక్కని పాండిత్యం కలవారు. తెలుగు పండితులుగా కూడా పనిచేశారు. 'రస తరంగాలు' అనే గ్రంథాన్ని రచించారు.

**తిరునగరి శ్రీనివాస్:** మెదక్ పట్టణవాస్తవ్యులు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి 'ఆచార్య సూక్తి ముక్తావళి' అనే అంశంపై పి.హెచ్.డి. చేశారు.

**ప్యారక శేషాచార్యులు:** శివంపేటలోని గోమారం వాస్తవ్యులు. తెలుగు పండితులుగా పనిచేస్తూ ఎందరో విద్యార్థులకు సాహితీ చైతన్యాన్ని కలిగిస్తున్నారు. సాహితీ ప్రక్రియలన్నింటినీ చవి చూసిన కవి. మెదక్ మండల సాహిత్య పరిషత్తు నర్సాపూర్ శాఖకు కార్యదర్శిగా, కళావాహిని హితకారిగా సాహిత్య సేవను సాగించారు. మిత్రుల ప్రోత్సాహంతో అష్టావధానం చేయడం ప్రారంభించి 18 సార్లు చేశారు. 'మాతృశ్రీ' అనే ఖండ కావ్యాన్ని, ఏకలవ్య నాటకం, సమాజం, ఏకాంకిక, గురోపదేశం, కాకతాళీయం, ప్రపత్తి నిర్వేదం అనే కావ్యాలు రచించారు. శిఖిముఖాలు అనే వచన కవితా సంకలనాన్ని బాల్య మిత్రుడు శాస్త్రుల రఘురామ శర్మతో కలిసి రాశారు.

**ఎస్. రామచంద్రరావు:** సూరినేని రామచందర్ రామాయంపేటలోని కోనాపూర్ గ్రామ వాస్తవ్యులు. ఎం.ఏ రాజనీతి శాస్త్రం చేసి, ఇంజినీరింగ్ శాఖలో సర్వే అసిస్టెంటుగా వృత్తిలో స్థిరపడ్డారు. వీరికి తెలుగు భాష అన్నా, సాహిత్య మన్నా అభిమానం మెండు. దర్పణం అనే కవితా సంకలనాన్ని రచించారు.

**శాస్త్రుల రఘురామ శర్మ:** శివంపేట మండలంలోని గోమారం వాస్తవ్యులు. మెదక్ మండల సాహిత్య పరిషత్తు నర్సాపూర్ శాఖ కార్యదర్శిగా పనిచేశారు. కాదంబరీ పూర్వ భాగం, తిక్కన్న - కంకంటి పాపరాజుల ఉత్తర రామాయణం - తులనాత్మక పరిశీలన, శ్రీగిరి మల్లికార్జున శతకం, వరుగంటి భారతీ స్తవం, చాణక్య పద్యకావ్యం, వేకువ కువకువలు, చాణక్య నీతిసూత్రాలు రచించారు.

**ప్రజాయుద్ధనౌక గద్దర్:** తూప్రాన్ మండలంలో జన్మించారు. వీరి అసలు పేరు గుమ్మడి విఠల్‌రావు. గద్దర్ అనేక విప్లవ పోరాటాల్లో ముందుండి నాయకత్వం వహించారు. జననాట్య మండలిని స్థాపించి ప్రజల కష్టాలను పాటల రూపంలో వినిపించిన వాగ్గేయకారుడు. వీరు పాడిన పాటలు ప్రజల గుండెల్లోకి వెళ్ళి చైతన్యాన్ని కలిగించాయి. వీరు ఏకకాలంలో మాట, పాట, ఆటలు ప్రదర్శించి ప్రజలను ఆకట్టుకుంటున్నారు. వీరు 'నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా, సిరిమల్లె చెట్టుకింద లచ్చువమ్మ, పొడుస్తున్న పొద్దు మీద, అమ్మా తెలంగాణమ్మా ఆకలి కేకల గానమా' అనే పాటలను రచించారు.

వీరే కాక పి.మాణిక్య ప్రభు - మెదక్ జిల్లా గ్రామ నామాలు, నీలకంఠం పాండురంగం-బాలగేయాల కథమాల, వినయరంగ శతకం, జగద్గీత, నమశ్శివాయ గారి వేంకట నర్సింహులు - వీణాపాణి శతకం, అహల్యా సంక్రందనం, వానమాల నరసింహదాసు-బలిచక్రవర్తి చరిత్రం (యక్షగానం), కిష్టాగౌడ్ - అల్లిరాణి చరితం (యక్షగానం) మొదలైన కవులు ఉన్నారు.

ఇంకా వామనమూర్తి (నారదీయ చరిత), దేశపతి కృష్ణమూర్తి (బతుకమ్మ వర్ణాలు, గురజాడ పురస్కార గ్రహీత), అంజాగౌడ్ (బాల సాహిత్యం), భానుప్రకాష్ (రాజశేఖర శతకం), రామారావు ( రచయిత, వ్యాసకర్త), దేశపతి రమ్య (వర్ధమాన రచయిత్రి), జి.వి.బి.శర్మ (బాల వ్యాకరణ గేయాలు) మొదలైన వారున్నారు.

**సాహితీ సంస్థలు**

జిల్లాలోని సాహిత్య సమగ్రాభివృద్ధి కొరకు కొంతమంది యువ సాహితీ మిత్రులచే 1984లో ప్రారంభింపబడిన 'రమ్య భారతి' సంస్థ కృషి చేస్తోంది. ఇదేకాక ఈ జిల్లాలో సాహితీ చైతన్యాన్ని తీసుకువస్తున్న మరో సంస్థ 'కళాభారతి'.

**వివిధ రంగాలలో ప్రముఖులు.**

ఈ జిల్లాలో ఎందరో ప్రముఖులు వున్నారు. పద్మా దేవేందర్ రెడ్డి మెదక్ శాసనసభా సభ్యురాలు. వీరు మెదక్ వాస్తవ్యులు. ప్రస్తుతం వీరు శాసనసభ ఉపసభాపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రవీణ్‌రెడ్డి (నర్సాపూర్ ఎమ్మెల్యే), కొత్తకోట ప్రభాకరరెడ్డి (మెదక్ ఎంపీ), కె.వి. రమణాచారి (తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు) వీరు మెదక్ వాస్తవ్యులు. కరాటే రంగంలో కరాటె నగేష్. వీరి వృత్తే ఇంటిపేరుగా మారిపోయింది. నాగరాజు, మధు (క్రీడారంగం), బి. సురేందర్ (వైద్యరంగం), బసవరాజు. వీరు ఈ మధ్యనే ఎవరెస్టు అధిరోహించారు. సాయి సిరి (వర్ధమాన సినీ రచయిత), హనుమంత రావు కులకర్ణి (కాళోజీతో పాటు ఉద్యమంలో పాల్గొన్న కవి), భాష్యం మధుసూదనాచార్యులు మొదలైనవారు.

## దర్శనీయ ప్రదేశాలు - పర్యాటకరంగం

**మెదక్ చర్చి :** ఆసియా ఖండంలోనే రెండవదిగా ప్రసిద్ధమైనది మెదక్ చర్చి. దీని నిర్మాణం 1914 లో ఆరంభింపబడి 10 సంవత్సరాలలో ముగిసింది. ఇది ప్రఖ్యాత శిల్పి జె. పాలిస్‌బరి చిత్ర రూపకల్పనలతో నిర్మించబడింది. నిర్మాణంలో ఉక్కు, సిమెంట్, కాంక్రీట్ ఉపయోగించి నవయుగాన్ని ఆవిష్క రించారు. 2014లో ఈ చర్చి 100 సంవత్సరాలు పూర్తిచేసుకుంది.

**మెదక్ ఖిల్లా :** జిల్లా చరిత్రలో ప్రత్యేక స్థానం కలది ఈ కోట. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కొండపై ఈ కోట నిర్మించబడింది. రాతితో దీని ప్రధాన ద్వారం పైభాగాన

ఒక ప్రధాన మందిరం నిర్మించడం జరిగింది. ఇది మొత్తం శిలతో నిర్మితమైంది. దీనికి ఇరువైపులా రెండు సింహాలు కళాత్మకంగా చెక్కబడి వున్నాయి. ఈ కోటకు వున్న మరో ద్వారం గజద్వారం. ఈ ద్వారానికి ఉత్తరం దిక్కున ఏనుగు బొమ్మ చెక్కబడి వుంది. ఈ కోట మొదటి ద్వారంపైన గుర్రపు బొమ్మలు నిర్మించబడి వున్నాయి. ఇందులో పాలబావి పేరున ఒక బావి వుంది. ఈ బావి 300 అడుగుల ఎత్తుపై వున్నప్పటికీ కూడా తియ్యని నీరు కలిగి వుంటుంది. ఈ బావిని రెండుగా విభజించారు. ఒకటి రాణి బావి కాగా, రెండోది రాజబావి. ఈ కోట ఒక్క చక్కని విహార కేంద్రం.

## ముఖ్య దేవాలయాలు

**ఏడుపాయల దుర్గమ్మ :** మెదక్‌కు ఈశాన్యాన మంజీరా ఉపనదులైన ఏడు ఉపనదుల సంగమం ఉంది. అక్కడ ఒక దుర్గాలయం వుంది. 1780 లో ప్రసిద్ధ యోగి శ్రీ కాశీనాథ యోగేంద్రుల వారు ఈ ప్రదేశంలో తపస్సు చేసినట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో దుర్గాలయంతో పాటు, ఉత్తరాన పాపాల మడుగు అనే తీర్థం వుంది. ఇందులో స్నానం చేస్తే సర్వపాపాలు పోతాయని నమ్మకం. దుర్గాలయంతో పాటు గంగా, శివుడు, ముత్యాలమ్మను కూడా పూజిస్తారు. శివరాత్రి పర్వదినాన తొమ్మిది రోజుల పాటు జాతర జరుగుతుంది.

**కొల్చారం దేవాలయం:** మెదక్ జిల్లాలోని కొల్చారం గ్రామంలో జైన తీర్థాంకరుడైన పార్శ్వనాథుని విగ్రహం బయటపడింది. అద్భుతమైన వాస్తు కళతో ఈ దేవాలయాన్ని నిర్మించారు. జైనులతో పాటు హిందువులు కూడా ఇక్కడికి వెళుతుంటారు.

**చాముండేశ్వరి దేవాలయం (చిట్కుల్) :** కౌడిపల్లి మండలం చిట్కుల్ గ్రామం దగ్గర మంజీరా నది ఒడ్డున శ్రీ చాముండేశ్వరీ దేవాలయం నిర్మించబడి వుంది. గర్భగుడి నిర్మాణానికి 1977 లో శంకుస్థాపన చేశారు. కాగా 1983 లో దేవీ ఉపాసకులు వెంకట రమణయ్య గారు తన మనో సంకల్పంతో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ విగ్రహం 18 భుజాలతో 11 అడుగుల ఎత్తుతో వుంది.

**రామలింగేశ్వరాలయం (గోమారం) :** మెదక్ జిల్లా శివంపేట మండలంలోన గోమారం గ్రామంలో దీనిని నిర్మించారు. ఈ ఆలయం నిర్మాణం రాష్ట్రకూటుల నాటిదని చరిత్ర చెబుతోంది. వీరి ఏలుబడిలో అనేక రామలింగేశ్వరాలయాలు ప్రతిష్ఠించబడినాయి. మెదక్ జిల్లాలో రామ లింగేశ్వర, రామేశ్వర దేవాలయాలున్నాయి.

**తిరుమలనాథ స్వామి ఆలయం (చల్మెడ) :** మెదక్ జిల్లాలో ఈ ఆలయం ప్రసిద్ధమైంది. ఇది అత్యంత ప్రాచీనం. కాకతీయ రాజుల ఏలుబడిలో నిర్మించబడిందని చరిత్ర చెబుతోంది. ఆలయ పశ్చిమాన పుష్కరిణి కలదు. ప్రధాన ద్వారం నుంచి ప్రవేశించగా ఎడమవైపు ఆంజనేయులు, గరుత్మంతుడు, గణపతి విగ్రహాలున్నాయి. కుడివైపు క్షేత్ర పాలకుడైన భైరవుని విగ్రహం వుంది.

**తుంబురేశ్వరాలయం (వేల్పుగొండ) :** టెక్మల్ మండలం లోని వేల్పుగొండ గ్రామానికి కిలో మీటర్ దూరాన పశ్చిమాన కొండ వుంది. దాని పక్కన చెరువుంది. ఆ చెరువు మధ్య ఒక చిన్న గుట్ట వుంది. ఆ గుట్టను దేవతల కుచ్చగుట్ట అంటారు. చెరువు గట్టుపై తుంబురేశ్వరాలయం వుంది. ఆలయ బహిరావరణంలో ఒకవైపు లక్ష్మి, మరోవైపు కాళీ, ఒకవైపు సరస్వతీ విగ్రహాలున్నాయి. అవేకాక, అద్దాన్ని చూస్తూ అలంకరించుకునే స్త్రీ మూర్తి విగ్రహాలు, పిల్లలకు పాలిచ్చే తల్లి విగ్రహాలు, వీణను మీటుతున్న స్త్రీ విగ్రహాలు చూపరులను ఆకట్టుకుంటాయి.

**గోపాలస్వామి ఆలయం, దొంతి :** సుమారు 400 సంవత్సరాలు చరిత్ర కలిగిన తెలంగాణలో పురాతన దేవాలయంగా ప్రసిద్ధి పొందింది. ఈ ఆలయం శివంపేట మండలం దొంతి గ్రామంలో వుంది. ఈ ఆలయాన్ని నాటి దేశ్‌ముఖ్‌ల వంశానికి చెందిన గురువమ్మ నిర్మించింది. దొంతి గ్రామం పక్కనే ఉన్న గోపాలపల్లి నుంచి విగ్రహాలను తీసుకొచ్చి ప్రతిష్ఠించారు.

**ఆంజనేయస్వామి, చాకిరిమెట్ల :** శివంపేట మండల కేంద్రానికి ఏడు కిలోమీటర్ల దూరంలో నర్సాపూర్, తూప్రాన్ రహదారిలో వున్న అరణ్యంలో వుంది. 55 సంవత్సరాల క్రితం ఇక్కడ రోడ్డు నిర్మాణం చేపడుతున్న సమయంలో

హనుమంతుని విగ్రహం బయటపడింది. అదే రోడ్డుకు 50 గజాల దూరంలో విగ్రహాన్ని ప్రతిష్టించారు. దీనిని చాకిరిమెట్ల ఆంజనేయ స్వామి అని పిలుచుకుంటారు.

**వెల్దుర్తి దేవాలయం :** 13 వ శతాబ్దిలో కాకతీయ రుద్రదేవుడు వేయిస్తంభాల గుడి నిర్మాణ సమయంలోనే ఈ దేవాలయాన్ని నిర్మించారు. సుమారు 700 సంవత్సరాల క్రితం కాకతీయులు నిర్మించిన ఈ మందిరం శివాలయం అనడానికి పరిసరాల్లో నంది, ఇక్కడ నిర్మించిన విఠలేశ్వర ఆలయం ఆదరణ లేక పురాతన దేవాలయ జాబితాలోకి వెళ్ళిపోయింది.

**లక్ష్మీనరసింహ ఆలయం, సికింద్రాపూర్ :** శివంపేట మండలంలోని గోమారం గ్రామానికి మూడు కి.మీ. దూరంలో దట్టమైన అడవిలోని గుట్టపై స్వామి వెలిసారు. శతాబ్దం క్రితం సికింద్రాపూర్ గ్రామానికి చెందిన రెడ్డికి స్వామి కలలో కనిపించి, తాను ఇక్కడ వున్నానని, గుడి నిర్మించి జాతర చేయాలని చెప్పగా గుట్టకింద ఆలయాన్ని నిర్మించారు. గుట్టపై ఎక్కడానికి దాదాపు 100 మెట్లున్నాయి. ఈ అడవిలో ప్రతీ యేటా డిసెంబర్ మాసం నుంచి మార్చి వరకు ప్రతీ ఆదివారం జాతర జరుగుతుంది.

**శాసనాలు**

**అల్లాదుర్గం (ఈదులలో ఉంది) :** ఇది అల్లాదుర్గంలో ఊరుబయట ఉన్న తెలంగాణ శాసనం. దీని వివరాలు చాళుక్య శాసనాలు 18లో తెలుపబడింది. త్రిభువనమల్ల బిరుదు పొందిన విక్రమాదిత్యుని 8వ రాజ్య సంవత్సరంలో ఈ శాసనం ఉన్నట్లు కనబడుతుంది. త్రిభువనమల్లుడు క్రీ.శ. 1076 నుండి 1127 వరకు కల్యాణి రాజధానిగా పరిపాలించారు. ఈ శాసనం క్రీ.శ. 1084 నాటిది.

ఇది త్రిభువన మల్లదేవుని సామంతుడైన ఆహవమల్ల పెర్మాడి అల్లాదుర్గం సమీపంలో ఉన్న రెండు చెరువుల క్రిందనున్న భూమిని కమలదేవుడనే బ్రాహ్మణుడికి చేసిన దానాన్ని వివరిస్తుంది.

**అల్లాదుర్గం (కేశవాలయంలో):** ఈ శాసనం అల్లాదుర్గంలో ఉన్న కేశవాలయంలో ఉంది. భాష కన్నడమే ఐనా మధ్యమధ్య కొన్ని అక్షరాలు స్పష్టంగా కనిపించటం లేదు. ఇది కూడా తెలంగాణా శాసనం మొదటి సంపుటంలో చాళుక్య శాసనములు 39 సంఖ్యగా ప్రకటింపబడింది.


**టేకుమాల:** ఈ శాసనం కాకతీయ ప్రతాప రుద్ర చక్రవర్తి పరిపాలనలో శా.శ. 1230 అంటే క్రీ.శ. 1308న వేయబడింది. ఈ శాసనం ప్రకారం తొలి కాకతీయులు శైవమతాభిమానులైనా గణపతి దేవ చక్రవర్తి వరకు అందరు రాజులు శివునితో పాటు కేశవుని కూడా ప్రతిష్ఠ చేసినారు. గణపతి దేవ చక్రవర్తి కాలం నుండి త్రికూటాలయాల్లో మూడుచోట్ల శివలింగమే కనిపిస్తుంది. ఆ విధంగా శైవాభిమానాన్ని అధికంగా చూపే ఆ రోజుల్లో టేకుమాలులో రంగనాథస్వామి దేవాలయముండడం, ఆ దేవుని అంగరంగ భోగాదులకు మహాప్రధాని వంటి గొప్ప పదవిలో ఉన్న మహాదేవ నాయకుడు ఆ గ్రామ ప్రజల అనుమతితో దానం చేయడం చాలా విశేషం.

**రామాయంపేట శాసనము:** ఈ శాసనము రామాయంపేట చెరువుకట్ట పైనున్న శివాలయం దగ్గర ఉంది. క్రీ.శ. 1311న వేయబడింది. ఇది కాకతీయ ప్రతాపరుద్ర చక్రవర్తి కాలంలోనే వేయబడ్డా చక్రవర్తి పేరు ఈ శాసనంలో రాయలేదు.

బయలు రుద్రరెడ్డి తమ తండ్రికి పుణ్యం కలుగాలని గొడపర్తి రామనాథ దేవుని నైవేద్యానికి ఈ భూమిని దానం చేసినట్లు ఈ శాసనం వల్ల తెలుస్తుంది.

చారిత్రకంగా విశేషమైన ప్రాధాన్యాన్ని సంతరించుకున్న మెదక్ జిల్లా ఎన్నో ప్రత్యేకతలను పొందు పరచుకున్నది. పూర్వకవుల వారసత్వంలో, దుర్గమ్మ దీవెనలతో మరింత అభివృద్ధి పథం పై దృష్టి సారిస్తున్నది.


# మేడ్చల్ జిల్లా చిత్రపటం




200(a)



కీసరగుట్ట దేవాలయం



మౌలాలి దర్గ



మౌలాలి




నల్సర్ విశ్వవిద్యాలయం



కేంద్రీయ విద్యాలయం



చెరబండ రాజు



సంగం లక్ష్మీబాయి

200(6)

# మేడ్చల్ మల్కాజ్‌గిరి

మేడిచలమ్మురా నిరుపమేయము తోడగు వాయుసైన్యమే
వాడని సంస్కృతి ప్రభల వాసము కీసరగుట్ట తోడుగా
వీడని పూర్వవైభవము విచ్చిన నేటి మనోజ్ఞదృశ్యమున్
కూడినదీ సరోవరపు కోమల దృశ్యవనాల మూలయై!

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారి ఆలోచనలో రూపుదిద్దుకున్నదే జిల్లాల పునర్విభజన. ప్రభుత్వ పాలన పటిష్ఠంగా అమలు జరగడానికి, అధికార వికేంద్రీకరణ జరగడానికి, సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందడానికి పది జిల్లాలు 31 జిల్లాలుగా మార్చబడినాయి. నూతన జిల్లాల ఆవిర్భావం ప్రజాభీష్టంతో పాటు పలు కమిటీలు చేసిన శాస్త్రీయ అధ్యయనం మేరకు జరిగింది.ఆ పరంపరలోనే మేడ్చల్ జిల్లా నూతనంగా ఏర్పడింది. 2016 అక్టోబర్ 11న అధికారికంగా ఏర్పడింది. గ్రామీణ, పట్టణ సంస్కృతుల సమ్మేళనం ఈ జిల్లా. పూర్వపు రంగారెడ్డి జిల్లా హైదరాబాదు నగరం చుట్టూ వడ్డాణంలా అలంకృతమైతే యిప్పటి మేడ్చల్ జిల్లా హైదరాబాదుకి మకుటంలా శోభిస్తుంది. హైదరాబాదు నగరాన్ని ఉత్తర తెలంగాణ ప్రాంతంతో అనుసంధానించేది ఈ జిల్లానే. రాజధానికి ఆనుకొని ఉండటం వల్ల పరిశ్రమలు, విద్యాసంస్థలు ఎక్కువగా నెలకొల్పబడ్డాయి. తద్వారా ఈ జిల్లా నివాస ప్రాంతాలకు యోగ్యమై, అభివృద్ధి చెందుతోంది.

**ఈ పేరెందుకు?**

సికింద్రాబాదులోని ప్యారడైజ్ - బాలంరాయి నుంచి మొదలుకొని సిద్ధిపేట శివారు దాకా విస్తరించిన దట్టమైన అటవీ ప్రాంతాన్ని పూర్వం 'మేడిచర్ల' గా వ్యవహరించేవారు. గోల్కొండ/ హైదరాబాద్ చేరడానికి పయనమయ్యే మెదక్, నిజామాబాదు, ఆదిలాబాద్, నాగపూర్ ప్రాంత యాత్రికులకు, వ్యాపారులకు నాటి మేడ్చల్ ప్రాంతం విడిది కేంద్రంగా వుండేది. మేడిచెట్లు ఎక్కువగా గల ఈ ప్రాంతానికి ఒక సాధువు విచ్చేశాడని, దప్పికగొని తన స్వ హస్తాలతో 'చెలిమె' తోడి దాహాన్ని తీర్చుకున్నాడని, అందుకే ఈ ప్రాంతానికి మేడి + చెలిమె - మేడ్చల్ అనే పేరు స్థిరపడినట్లు స్థానిక ఐతిహ్యం. నామ విజ్ఞానశాస్త్రం ప్రకారం చర్ల, గూడెం, గుండ్ల, పల్లి వంటి ద్వితీయ అవయవాలు వృక్ష, జంతు, స్థల నామాదులతో కూడిన పదాలను ఆశ్రయించి పేర్లు ఏర్పడుతాయి. అలా ప్రకృతి నుంచి జనించిందే మేడ్చల్ అనే పేరు. స్థానికులు మేడ్చల్ ప్రాంతాన్ని నిజాం నవాబుల విడిది కేంద్రంగానూ, ప్రకాశవంతమైన ప్రాంతంగానూ అభివర్ణిస్తారు.

**భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి**

పూర్వపు రంగారెడ్డి జిల్లా విభజింపబడి వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలుగా ఏర్పడ్డాయి. మేడ్చల్ జిల్లాకు ఉత్తరాన మెదక్, సిద్ధిపేట, తూర్పున యాదాద్రి, పడమట సంగారెడ్డి, దక్షిణాన హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాలు భౌగోళిక సరిహద్దులుగా వున్నాయి. ఈ జిల్లా విస్తీర్ణం 1084 చ.కి.మీ. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాదు తర్వాత విస్తీర్ణంలో రెండవ చిన్న జిల్లా మేడ్చల్.

**రెవిన్యూ డివిజన్లు - మండలాలు**

మేడ్చల్ జిల్లాలో మల్కాజ్‌గిరి, కీసర అనే రెండు రెవిన్యూ డివిజన్‌లు, ఒక్కో డివిజన్‌లో ఏడింటి చొప్పున మొత్తం కలిపి 14 మండలాలున్నాయి.

**మల్కాజ్‌గిరి డివిజన్‌లోని మండలాలు :**

1. అల్వాల్ 2. కుత్బుల్లాపూర్ 3. మల్కాజ్‌గిరి 4. దుండిగల్ గండిమైసమ్మ (కొత్తది) 5. బాచుపల్లి (కొత్తది) 6. బాలానగర్, 7. కూకట్‌పల్లి (కొత్తది),

**కీసర డివిజన్‌లోని మండలాలు :**

1. శామీర్‌పేట 2. మేడ్చల్ 3. కీసర 4. కాప్రా (కొత్తది) 5. ఘట్‌కేసర్ 6. మేడిపల్లి 7.ఉప్పల్

మల్కాజ్‌గిరి డివిజన్‌లో 44 గ్రామాలు, కీసర మండలంలో 118 గ్రామాలతో మేడ్చల్ మొత్తం 162 గ్రామాలున్నాయి.

**సహజవనరులు**

ఒకనాడు దట్టమైన అటవీ ప్రాంతమైన మేడ్చల్‌లో గత కాలపు చిహ్నాలుగా నల్లతుమ్మ, పెద్దఈత, మర్రి, వేప, మునగ, మారేడు, సీతాఫలం వంటి వృక్షజాతులు కనిపిస్తాయి. ద్రాక్ష తోటలకు మేడ్చల్ ప్రాంతం ప్రసిద్ధి. ఈ ప్రాంతంలో చిరుతలు, ఎలుగుబంట్లు, హైనాలు, కుందేళ్ళ సంఖ్య ఎక్కువగా వుండేది. సాధారణమైన ఎండలతో కూడిన పొడి వాతావరణం కనిపిస్తుంది. జిల్లాకు అత్యధిక వర్షపాతం నైరుతి రుతుపవనాల ద్వారా అందుతుంది. దక్కన్ పీఠభూమిలోని మెట్ట ప్రాంతమైన మేడ్చల్ పడమర నుంచి తూర్పు వైపుకు వాలుగా వుంటుంది. ప్రధానమైన జీవ నదులు లేని లోటును కృష్ణా ఉపనది మూసీ తీరుస్తుంది. వికారాబాదు జిల్లాలో పుట్టిన మూసీ హైదరాబాదు నగరం నుంచి తూర్పు వైపుగా ప్రవహిస్తూ మేడ్చల్ జిల్లాలోని ఉప్పల్, మేడిపల్లి, ఘట్‌కేసర్ మీదుగా యాదాద్రిలోకి ప్రవేశిస్తుంది. మూసీనది మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలకు సహజమైన సరిహద్దుగా వుంది. మూసీ ద్వారా ఘట్‌కేసర్ మండలంలో కొంత వ్యవసాయం జరుగుతున్నా ప్రధానంగా చెరువుల ద్వారానే పంటలు పండిస్తారు. శామీర్‌పేట్, ఫాక్స్‌సాగర్, సఫిల్‌గూడ, ఉప్పల్, రామంతాపూర్ వంటి ప్రాంతాలలోని చిన్నాపెద్ద చెరువులతో కలిసి ఈ జిల్లా వ్యవసాయ ఫలాలతో పాటు పర్యాటక శోభను సంతరించు కుంది. జిల్లా విస్తీర్ణం 1084 చ.కి.మీ.లో 8.23 శాతం అంటే 89.19 చదరపు కిలోమీటర్లలో అడవులు వ్యాపించి వున్నాయి. దూలపల్లి, నారపల్లి, పోచారం వంటి ప్రాంతాలలో రక్షిత అటవీ భూములున్నాయి. మేడ్చల్, మల్కాజ్‌గిరిలో 'క్వార్ట్జ్ సిరలు' అనే ఖనిజం ఎక్కువగా లభ్యమౌతుండగా, బ్లాక్ గ్రానైట్, రోడ్డు మెటల్ వంటివి ఇక్కడి పరిశ్రమల ద్వారా ఉత్పత్తి అవుతున్నాయి.

**అడవులు**

జిల్లాలో అడవులు 89.19 చ.కి.మీలో వ్యాపించి వున్నాయి. జిల్లాలోని మొత్తం భూభాగంలో ఇది 8.23 శాతం మాత్రమే. దూలపల్లి, నారపల్లి, పోచారం వంటి ప్రాంతాలలో రక్షిత అటవీ భూములున్నాయి. అడవులు తక్కువగా వుండటం వల్ల వర్షపాతం తక్కువనే చెప్పాలి. నైఋతి ఋతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తాయి.

**నదులు**

ప్రధానమైన జీవ నదులు లేని లోటును కృష్ణాకు ఉపనది మూసీ తీరుస్తుంది. వికారాబాదు జిల్లాలో పుట్టిన మూసీ హైదరాబాదు నగరం నుంచి తూర్పు వైపుగా ప్రవహిస్తూ మేడ్చల్ జిల్లాలోని ఉప్పల్, మేడిపల్లి, ఘట్‌కేసర్ మీదుగా ప్రయాణించి యాదాద్రి జిల్లాలోకి ప్రవేశిస్తుంది. మూసీ నది మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలకు సహజమైన సరిహద్దుగా వుంది. మూసీ ద్వారా ఘట్‌కేసర్ మండలంలో కొంత వ్యవసాయం జరుగుతున్నా, ప్రధానంగా చెరువుల ద్వారానే జరుగుతుంది.

**చెరువులు - ప్రాజెక్టులు**

ఇక్కడ ప్రధానంగా పంటలు చెరువుల ద్వారానే పండుతాయి. శామీర్‌పేట్, ఫాక్స్‌నగర్, సఫిల్‌గూడ, ఉప్పల్,

రామంతాపూర్ వంటి ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాలలో వున్న చిన్నా పెద్దా చెరువులతో ఈ జిల్లా వ్యవసాయం జరుగుతుంది. జిల్లాలో మూడు ఇరిగేషన్ ప్రాజెక్టులున్నాయి.

**జనాభా :** 2011 జనాభా లెక్కల ప్రకారం మేడ్చల్ జిల్లాలో 24,40,073 జనాభా వుంది. అందులో పురుషులు 12,46,666 కాగా, మహిళలు 11,93,407 మంది వున్నారు. వీరి నిష్పత్తి 1000:957. అత్యధిక జనాభా గల జిల్లాల్లో హైదరాబాదు, రంగారెడ్డి తర్వాత మూడవ స్థానం మేడ్చల్ జిల్లాదే. జనసాంద్రతలో సైతం చదరపు కిలోమీటరుకు 2251 మందితో రెండవ స్థానంలో నిలుస్తుంది. మొత్తం జనాభాలో 91.40% పట్టణాలలో వుండగా, 8.60% గ్రామీణ జనాభా ఉంది. మేడ్చల్‌లో అత్యధిక జనాభా గల మండలం కుత్బుల్లాపూర్ కాగా ఘట్‌కేసర్‌లో అత్యల్ప జనాభా ఉంది. కూకట్‌పల్లి 1,87,000 జనాభాతో జిల్లాలోనే పెద్ద పట్టణం.

### మేడ్చల్ జిల్లా చరిత్ర

మేడ్చల్ జిల్లాలో లోహయుగం నుంచి జనావాసాలు ఉన్నట్లుగా సాక్ష్యాలు కనబడుతున్నాయి. ఓల్డ్ బోయిన్‌పల్లికి సమీపంలోని హస్మత్‌పేట్ వద్ద పెద్ద పెద్ద రాళ్ళతో నిర్మితమైన వలయాకార సమాధులు బయటపడ్డాయి. మొట్టమొదటి సారిగా వీటిని వెలుగులోకి తెచ్చిన డా. వాకర్, వీటిని క్రీ.పూ. 300 కాలం నాటివిగా ధ్రువీకరించాడు. ఆ తర్వాత నిజాం కాలంలో డి.జి. మెకంజీ పర్యవేక్షణలో మరోసారి తవ్వకాలు జరిగాయి. 1971 లో బిర్లా పురాతత్వ సంస్థ వారు జరిపిన తవ్వకాలలో లోహ పాత్రలు, మానవ అస్థిపంజరాలతో కూడిన రెండు సమాధులు వెలుగుచూశాయి. చివరిసారిగా 2000-01 లో మూడు సమాధులను కనుగొన్నారు. హస్మత్‌పేట్‌లోని మొత్తం 28.27 ఎకరాల రక్షిత స్థలంలో ఈ నిర్మాణాలు కనిపిస్తున్నాయి. ఇక చరిత్ర పూర్వ యుగంలో ద్రవిడులు దక్షిణ భారతాన్ని, దక్కను పీఠభూమితో సహా పరిపాలించారు. అశోకుని శాసనం ప్రకారం ఈ ప్రాంతాన్ని క్రీ.శ. 3 వ శతాబ్దం వరకు ఆంధ్రులు పాలించారు. అటుపై శాతవాహనులు క్రీ.శ. 200 వరకు, ఇక్ష్వాకులు క్రీ.శ

**మున్సిపాలిటీలు** : 3

**నగర పాలక సంస్థలు** : 2, బోడుప్పల్, పీర్జాదిగూడ

**గ్రామ పంచాయితీలు** : 77 (హైదరాబాద్‌ని మినహాయిస్తే అతి తక్కువ గ్రామపంచాయితులు ఉన్న జిల్లా)

**పోలీస్ హెడ్‌క్వార్టర్స్** : మేడ్చల్

**పార్లమెంటు నియోజకవర్గం** : మల్కాజ్‌గిరి, దేశంలోనే జనాభా పరంగా (31,83,325) అతిపెద్ద పార్లమెంటు నియోజకవర్గంగా పేరొందిది.

**అసెంబ్లీ నియోజకవర్గాలు** : మేడ్చల్, ఉప్పల్, మల్కాజ్‌గిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్

**పట్టణాలు** : ఉప్పల్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, కూకట్‌పల్లి

225-300, విష్ణుకుండినులు క్రీ.శ. 358-624, బాదామి చాళుక్యులు క్రీ.శ. 546-755, రాష్ట్రకూటులు - వేములవాడ చాళుక్యులు క్రీ.శ. 750-973, కల్యాణీ చాళుక్యులు క్రీ.శ. 973-1189, కాకతీయులు క్రీ.శ. 1150-1323 వరకు ఈ ప్రాంతంలో అధికారం నెరిపారు. ప్రత్యేకంగా మేడ్చల్‌ని కేంద్రబిందువుగా చేసుకొని చారిత్రక పరిశోధనలు జరగని కారణంగా తెలంగాణా పాలకులనే ఈ ప్రాంతానికీ అన్వయించుకోవాల్సి వస్తుంది. అల్లా ఉద్దీన్ ఖిల్జీ దండయాత్ర (1294 ఎ.డి.) నుంచి మహమ్మదీయుల పాలకుల అధీనం లోకి వచ్చిన తెలంగాణను బహమనీలు, కుతుబ్‌షాహీలు (1512-1686), అసఫ్జాహీలు (1713-1948) పరిపాలించారు. కాకతీయుల కాలంలో మేడ్చల్ సైనిక సరిహద్దు కేంద్రంగా వుండేది. నిజాం కాలంలో రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులుగా వున్న గులాం యాజ్దానీ మరియు ప్రాచీన పరిశోధకులు, ఔరంగాబాద్ కలెక్టర్ నవాబ్ మన్‌సబ్ జంగ్ బహదూర్ మేడ్చల్‌ని దట్టమైన అటవీ ప్రాంతంగా పేర్కొన్నారు. ఏనుగుల వీరాస్వామి రాసిన 'కాశీయాత్ర చరిత్ర' లో సైతం మేడ్చల్ ప్రాంతంలో మద్దిచెట్లు విరివిగా ఉన్నట్లు వివరించారు.

ఆసఫ్జాహీల పరిపాలనలో నిజాం రాజ్యం నాలుగు డివిజన్లు, 16 జిల్లాలతో ఏర్పడింది. 1905 లో ఏర్పడిన మెదక్ - గుల్షనాబాద్ డివిజన్‌లో 5 జిల్లాలున్నాయి. అత్రాఫ్‌బల్దా, మహబూబ్‌నగర్, మెదక్, నల్లగొండ, నిజామాబాదు. ఇందులోని అత్రాఫ్‌బల్దా అనేది పూర్వపు హైదరాబాదు రూరల్ జిల్లా, అటుపై అదే రంగారెడ్డి జిల్లాగా రూపుదిద్దుకుంది. 'బల్దా' అనగా నగరం, అత్రాఫ్ అంటే శివారు ప్రాంతం. అంటే హైదరాబాదు రాజధాని నగర శివారు/ చుట్టుపక్కల ప్రాంతాలతో కూడిన జిల్లా అత్రాఫ్‌బల్దా. ఈ జిల్లాలోని 7 తాలూకాలు, ఔరంగాబాద్, పర్భణి, బీదర్, బీడ్, గుల్బర్గా, ఉస్మానాబాద్‌లోని 11 తాలూకాలో గల పదివేల చదరపు కిలోమీటర్ల భూములు 'సర్ఫెకస్ భూములు' గా నవాబులు స్థిరపరిచారు. ఈ భూములు పూర్తిగా నిజాం కుటుంబం యొక్క సొంత జాగీరు. ఈ భూముల ద్వారా వచ్చే సమస్త ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరదు. ఐరోపాలోని 'క్రౌన్‌లాండ్స్' లాగే ఈ భూములకు ఒక ప్రత్యేక వ్యవస్థ వుండేది. 'సదర్ - ఉల్ - మొహమ్' అనే ప్రత్యేక అధికారి ఈ భూములను పర్యవేక్షించేవాడు. నైజాంలోని మిగతా ప్రాంతాలు జాగీర్దార్ల చేతుల్లో వుండగా, యీ అత్రాఫ్ బల్దా ప్రాంతం మాత్రం నవాబు సొంత ఏలుబడిలో వుండేది. బహుశః అందుకే తెలంగాణలో పశ్చిమ ప్రాంతమైన ఈ జిల్లా విద్యాపరంగా, సామాజికంగా, పారిశ్రామికంగా ఎలాంటి అభివృద్ధికీ నోచుకోలేదు.

ఈ జిల్లాలో మార్పుచేర్పులను అనుసరించి కాలానుగుణంగా మూడు దశలుగా విభజించవచ్చు. మొదటి దశ 1948-78 వరకు. 1948 వరకు అత్రాఫ్‌బల్దా పేర కొనసాగిన యీ జిల్లా, భారతదేశంలో విలీనానంతరం రూపు మార్చుకుంది. నిజాంకు పైకం చెల్లించి సర్ఫేకస్ భూములను స్వాధీనం చేసుకొని అందులో కొంత సైన్యం అవసరాల కోసం కంటోన్మెంట్ ప్రాంతంగా కేటాయించుకొని మిగతా ప్రాంతాన్ని పౌర నివాస యోగ్యంగా ధ్రువీకరిస్తూ 'హైదరాబాదు రూరల్' గా నామకరణం చేశారు. 1949 లో మెదక్ 'సుబా'లోని 'గతే' తహసీల్‌కు చెందిన ఏడు గ్రామాలను యీ జిల్లాలో విలీనం చేశారు. 1950 లో ధరూర్, వికారాబాదు, మెదక్‌లో కొన్ని ప్రాంతాల విలీనం, 1956 లో జిల్లాలో 11 తాలూకాల ఏర్పాటు, 1958 లో షాబాద్ తాలూకాలో కొంత మరియు మెదక్‌లోని 11 గ్రామాలను కలిపి చేవెళ్ళ తాలూకా ఏర్పాటు, అలాగే నల్లగొండ రామన్నపేటలోని కొన్ని గ్రామాలతో ఇబ్రహీంపట్నం తాలూకా ఏర్పాటు వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి.

రెండవ దశలో 1978 ఆగస్టు 15 వ తేదీన ఒకప్పటి హైదరాబాదు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొండా వెంకట రంగారెడ్డి పేరుతో నాటి ముఖ్యమంత్రి డా. చెన్నారెడ్డి - రంగారెడ్డి జిల్లా ఏర్పాటు చేశారు. 1978 నుంచి 1998 వరకు రంగారెడ్డి జిల్లా అస్తిత్వం ఉచ్చస్థితిలో ఉన్నది. జిల్లా అనేక విధాల అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామి అయింది.

మూడవ దశ 1998 నుంచి ఒక రకంగా క్షీణదశ. హైదరాబాదు చుట్టూ వ్యాపించి వుండటం వల్ల పారిశ్రామీకరణ పెరిగి, వందల ఎకరాలలో పరిశ్రమలు, వాటి ఆధారిత కేంద్రాలు, విద్యా సంస్థలు ఏర్పడ్డాయి. హైదరాబాదు నగరం రంగారెడ్డి జిల్లాలోకి చొచ్చుకొని వచ్చి జిల్లా రూపురేఖలను మార్చివేసింది. 1806 లో బ్రిటీషు సైన్యంతో కుదిరిన ఒప్పందంలో భాగంగా ప్రత్యేకంగా ఒక ప్రాంతాన్ని ఏర్పాటు చేసుకోడానికి నాటి రెసిడెంట్ 'సెడెన్ హోం' మూడవ ఆసఫ్జాహీ పాలకుడు సికిందర్‌ఝా కు విజ్ఞప్తి చేస్తూ లేఖ రాశాడు. తదనంతర పరిణామాల నేపథ్యంలో ఏర్పడ్డ లష్కర్ (సైనిక స్థావరం అని అర్థం) సికింద్రాబాదుగా వ్యవహరించబడింది. సైనిక స్థావరం క్రమేణా నగరంగా అభివృద్ధి చెంది హైదరాబాదు, సికింద్రాబాదు జంట నగరాలుగా ప్రఖ్యాతి పొంది రాజధాని నగరంలో కలిసి పోయింది. సికింద్రాబాదు శివారు ప్రాంతాలు, అంటే నేటి మేడ్చల్ జిల్లాలోని కంటోన్మెంట్ ప్రాంతం భారత సైన్యానికి, వాయుదళానికి ఆయువు పట్టు. అల్వాల్, బొల్లారం మొదలైన

ప్రాంతాలలో ఆయా సైన్య విభాగాల ముఖ్య కేంద్రాలు, శిక్షణా కేంద్రాలు, సాంకేతిక విద్యాలయాలు ఏర్పడ్డాయి. ఇలా ఆసఫ్జాహీల నుంచి ఈ ప్రాంతం అనేక కూడికలు, తీసివేతలతో కూర్చబడి, 1978 లో రంగారెడ్డి జిల్లాగా కుదురుకుని, తిరిగి 38 సంవత్సరాల తరువాత మూడు జిల్లాలుగా విభజింపబడింది.

### సంస్కృతీ సంప్రదాయాలు

ఏ ప్రాంత సంస్కృతి చూసినా ఆయా ప్రాంతాల చరిత్ర, భౌగోళిక, మత, రాజకీయ, సామాజిక పరిస్థితుల ఆధారంగా రూపుదిద్దుకోవడం కనిపిస్తుంది. మేడ్చల్ జిల్లా యిందుకు అతీతమేమీ కాదు. అయితే తెలంగాణలోని మిగతా జిల్లాలతో పోల్చితే సాంస్కృతికంగా కొంచెం ప్రత్యేకంగా కనిపిస్తుంది. అతి తక్కువ విస్తీర్ణంలో అత్యధిక పట్టణ జనాభా వల్ల పట్టణ సంస్కృతికి ఈ జిల్లా దక్షిణ భాగం కేంద్రం. అయితే మేడ్చల్, శామీర్‌పేట, కీసర, ఘట్‌కేసర్ వంటి మండలాలలో గ్రామీణ సంస్కృతి కనబడుతుంది. అటవీ ప్రాంతం కావడం, జీవనదుల లేమి వల్ల వ్యవసాయం తక్కువ, ఉన్న కొద్దిసాగు శామీర్‌పేట్, ఘట్‌కేసర్, గొలుసుకట్టు చెరువులు, కుంటల ద్వారా బోర్లు, బావుల ద్వారా, వర్షాధారంగా జరుగుతుంది. ఐ.టి. పరిశ్రమల వల్ల భూముల ధరలలో విపరీతమైన మార్పులు జరిగి వ్యవసాయం సన్నగిల్లింది. పరిశ్రమలు రావడం, ఉపాధి కల్పన, నివాస ప్రాంతాలకు మౌలిక వసతులు కల్పించడం వల్ల కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, బాచుపల్లి, బాలానగర్, ఉప్పల్ వంటి ప్రాంతాలలో జనసాంద్రత అనూహ్యంగా పెరిగి వలసలకు నిలయమయ్యాయి. కోస్తా, సీమ నుంచి మాత్రమే కాక, ఉత్తర, దక్షిణ భారతదేశం నుంచి వచ్చిన ప్రజలు ఈ జిల్లాలో స్థిరపడ్డారు. ఈ పరిణామాలు గత పాతికేళ్ళలోనే జిల్లా ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేశాయి. భాష, ఆహార్యం మొదలైన అంశాలలో విపరీత మార్పులు చోటు చేసుకున్నాయి. తెలంగాణలోని అన్ని జిల్లాలలాగే యీ జిల్లాలోనూ దసరా, దీపావళి, సంక్రాంతి పండుగలు వైభవంగా జరుపుకుంటారు. గ్రామాలలో బతుకమ్మ పండుగ, పీర్ల పండుగ సామాజిక తత్వానికి, మత సహనానికి ప్రతీకలుగా జరుపుకుంటారు. పట్టణాలలో వినాయకచవితి, హనుమాన్ జయంతి వంటి సంప్రదాయ పండుగలతో పాటు నూతన సంవత్సర వేడుకలను విశేషంగా జరుపుకుంటారు. కంటోన్మెంట్ ప్రాంతంలోని పండుగలు 'మినీ భారత్' ని దర్శింపచేస్తాయి. ఓనం, పూరి జగన్నాథుని రథయాత్ర, హోళీ, బైసాఖీ వంటివి సైతం జరుపుకుంటారు. మహంకాళీ బోనాలు హైదరాబాదులో ఆషాఢమాసంలో జరిగితే ఘట్‌కేసర్, కీసర వంటి మండలాలలో శ్రావణ మాసంలో అంగరంగ వైభవంగా జరుపుతారు. ఘట్‌కేసర్‌లో ప్రతీ యేడు సంక్రాంతి తర్వాత ఆదివారం జరిగే మైసమ్మగుట్ట జాతర ఎంతో విశేషమైనది. యాదవుల ఆధ్వర్యంలో కుమ్మరి కులస్తులు పూజారులుగా యిక్కడ కార్యక్రమాలు నిర్వహిస్తారు. మేడ్చల్‌లోని కైతారమ్మ జాతర, గాజుల రామారంలోని చిత్తారమ్మ జాతర, సూరారం గండి మైసమ్మ జాతర ఈ జిల్లాలో ప్రముఖమైనవి. కీసర మండలం భోగారం గ్రామంలోని చిందుయక్షగాన కళాకారులైన గడ్డం దేవయ్య, గడ్డం యాదగిరి వంటి వారు వివిధ సందర్భాలలో యక్ష గానాలను ప్రదర్శించడమే కాక, ప్రభుత్వ కార్యక్రమాలకు తమ కళ ద్వారా ప్రాచుర్యం కల్పిస్తున్నారు. ఘట్‌కేసర్ మండలం కొర్రెముల గ్రామంలో మేర బాలయ్య వంటివారు 'పాండురంగ భజన మండలి' ద్వారా నూరేళ్ళ నాటి భజనలను, కీర్తనలను ఆలపిస్తూ భక్తులను ఆకట్టుకుంటున్నారు. పోచారం గ్రామంలోని ఒగ్గు కథకులు విలక్షణమైన కథా గానంతో, వాయిద్యాలతో 'ఎల్లమ్మ కల్యాణం' వంటివి నిర్వహిస్తూ కళను బ్రతికిస్తున్నారు.

### సాహిత్యం

హైదరాబాదు నగరం 'చార్‌సౌ సాల్ షహర్' గా కీర్తించబడుతుంది. అయితే నగరం ఏర్పడక ముందే చుట్టు పక్కల ప్రాంతాలలో జనావాసాలు–తదనుగుణమైన సంస్కృతీ సాహిత్యాలున్నాయి. మూసీనది ఒడ్డున చైతన్యపురిలో

లభించిన మొట్టమొదటి ప్రాకృత శాసనం క్రీ.శ. 370-440 సంవత్సరాల నాటిదిగా చరిత్రకారులు ధ్రువీకరించారు. బౌద్ధమతం పరిఢవిల్లిన ఈ ప్రాంతంలో విష్ణుకుండిన ప్రభువు మొదటి గోవింద వర్మ వేసిన శాసనమిది. తెలంగాణ చరిత్ర, సాహిత్యాలపై కొంత పరిశోధన జరిగినా, హైదరాబాదు దాని చుట్టూ వున్న ప్రాంతం 'ఎవరికీ పుట్టని బిడ్డ' గా మిగిలిపోయింది. అయితే శిలాయుగం, లోహయుగం లేకపోతే కాకతీయుల అనంతరం బహమనీ యుగం నుంచి మాత్రమే యిక్కడి చరిత్ర, సాహిత్యాలు వెలుగుచూశాయి. మేడ్చల్ మండలంలోని రాంపల్లి గ్రామానికి చెందిన **గుండోబా కవి** క్రీ.శ.1903 ప్రాంతంవాడు. సంస్కృతాంధ్ర పారశీక భాషలలో పండితుడైన ఈ కవి 'హైమధరతుల్యకాయ వీరాంజనేయ' అనే మకుటంతో వీరాంజనేయ శతకాన్ని రచించాడు. వీర రస ప్రధానమైన ఈ శతకంలో స్వామి వారి ఒక్కొక్క అవతారాన్ని ఒక్కొక్క పద్యంలో రచించాడు. పార్శీ భాషా పదాలతో కూడిన ఈ పద్యం, నాటి ప్రజల, పండితుల వ్యవహారంలో అధికార భాషా ప్రభావాన్ని తెలుపుతుంది.

**"రామచంద్రుడు నీకు రహిజెందు సర్కారు**
**సులభమా నీయంత చోపుదారు**
**నామీద చేరునెన్నటికి మేర్భాను**
**కూర్మిచే నాకొనగూర్చు చైను"**

సుమారు అదే కాలానికి చెందిన **దొంతర మల్లేశం** అనే కవి 'అలువాల మాహాత్మ్యము' అనే గ్రంథాన్ని రాశాడు. వేంకటేశ్వర లీలలు, దేవేరుల సంభాషణ, లక్ష్మీదేవి విలాస వర్ణనలతో కూడిన యీ గ్రంథం ప్రఖ్యాతం. దేవరయాంజల్ నివాసి **భీమరాజు పాండురంగారావు** అనేక గ్రంథాలను రచించాడు. అందులో 'వేంకటేశ్వర శతకం' తరువోజ వృత్తములతో రాయబడింది. కంద పద్యాలతో 'శ్రీరామస్తోత్ర శతకం', ఉత్సాహ వృత్తంలో 'పాండురంగ శతకం' రాసిన ఈ కవి బాల కవిగా ప్రసిద్ధులు. శామీర్‌పేట మండలంలోని లాల్‌గడి మలక్‌పేట్ గ్రామానికి చెందిన **వంగరి వెంకట నర్సయ్య** 'అచల పరిపూర్ణ నిర్మలానంద వంగరి వేంకట నరసింహాచార్యులు' గా ప్రసిద్ధి. వీరు 'వామన చరిత్ర' అనే చిరుతల నాటకాన్ని, 'శ్రీ మార్కండేయ విలాసము' అనే హరికథను, 'శ్రీ రామలింగేశ్వర శతకము' ను రచించారు. 'శ్రీ ఛత్రగిరి వేంకటేశ్వరునిపై సీస పద్యాలను రాశారు. 'భక్తితత్వ సంకీర్తనలు' పేరిట 40 కి పైగా కీర్తనలు రాసి, స్వయంగా గానం చేశారు.

**'దేహమున కొన్ని భాగముల్ దాచుటకున్**
**ఆకులలములు చర్మముల్ వల్కలములు**
**తగ ధరించుచు కాలంబు దొరలుచుండ**
**నాగరికమొచ్చె వస్త్రంబు నవసరంబు"**

అంటూ తేలిక పదాలతో రచనలు చేశారు. వీరి సోదరి కుమార్తె **డా|| వి. త్రివేణి** వెంకట నర్సయ్య గారి జీవిత చరిత్రను రచించడమే గాక, చిల్లరిగె స్వరాజ్యలక్ష్మి కవిత్వంపై పరిశోధన చేశారు. తూనీగలు పేర నానీల కవితా సంపుటిని వెలువరించిన వీరు ఆధ్యాత్మ, ధార్మిక గ్రంథాల ననేకం పరిష్కరించారు. ప్రస్తుతం తెలంగాణ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

బొల్లారంలో 1925 లో జన్మించిన **టి.వి. నారాయణ** ఆర్ష గ్రంథాలపై, ఆర్య సమాజ సిద్ధాంతాలపై విశిష్టమైన పరిశోధనలు చేశారు. 'మిము వీడిన ఫలం' అనే గీత సంపుటి, 'ఆత్మ దర్శనం' అనే కవితా సంపుటి, 'అమర వాక్సుధా స్రవంతి' అనే వచన గ్రంథం రచించారు. 'అవధరింపుమయ్య ఆర్షపుత్ర' అనే మకుటంతో రాసిన 'ఆర్షపుత్ర శతకం' మంచి ఆదరణ పొందింది.

తెలుగు సాహిత్యాన్ని ఒక్క కుదుపు కుదిపి 'షాక్ ట్రీట్‌మెంట్' యిచ్చిన దిగంబర కవులలో ప్రముఖుడు **చెరబండ రాజు (బద్దం భాస్కరరెడ్డి)** మేడ్చల్ జిల్లా వాసి. ఘట్‌కేసర్ మండలంలోని అంకుశాపూర్ గ్రామానికి చెందినవాడు. దిగంబర కవులలో వున్న ఆవేదన, నిరాశ, జుగుప్స, కోపం, కసి వంటి భావాలు చెరబండరాజు కవిత్వంలోనూ ప్రస్ఫుటంగా వ్యక్తమౌతాయి. దిగంబర కవిత్వం మొదటి

సంపుటిలోని 'నన్నెక్కనివ్వండి బోను', రెండవ సంపుటిలోని 'ఆకాశం వెక్కివెక్కి ఏడుస్తుంది', మూడవ సంపుటిలోని 'జగద్గురువులొస్తున్నారు జాగ్రత్త' అనే కవితలు వీరి ప్రతిభకు నిదర్శనాలు.

**'మాష్టార్జీ'** గా ప్రఖ్యాతులైన ప్రముఖ దళిత కవి **గంగాధరి శ్రీరాములు గారు**. కంటోన్మెంటులోని రిసాలా బజార్‌కు చెందినవారు. 1978 లో 'దళిత కళామండలి' ని స్థాపించి మూలవాసీ సిద్ధాంతానికి అనుగుణంగా గీతాలు రచించారు. తత్వ గీతాల బాణీలో రచనలు చేయడం వీరి ప్రత్యేకత.

**'మాల మాదిగ పిల్లలు రెండు రొట్టెను పొందంటా**
**హక్కుల రొట్టెను పొందంటా**
**పంచుకు తిందామన్నకాడ అవి - పీకులాడెనంట**
**ఓరన్నా తగవు లాడెనంటా'**

మట్టిపూలు (కవితా), ఔనుమల్లా (వీధి నాటకం), అంగులీ మాలుదు (చారిత్రక నాటకం) వీరి ప్రముఖ రచనలు. ఈయన అనేక సినీ గీతాలను సైతం రచించారు. ప్రముఖ సాహిత్య పత్రిక పాలపిట్ట వర్కింగ్ ఎడిటర్ **కె.పి. అశోక్ కుమార్ గారు** మచ్చబొల్లారంకు చెందినవారు. హాలీవుడ్ సినిమాలు, కథావలోకనం, తెలుగులో మారుపేరు రచయితలు అనే పుస్తకాలు వెలువరించారు. నాలుగు పుస్తకాలకు సంపాదకత్వ బాధ్యతలు వహించడమే గాక, రెండువేలకు పైగా పుస్తకాలని సమీక్షించారు. నవలా విమర్శ, నాటక విమర్శ అనే పుస్తకాలు త్వరలో వెలువడనున్నాయి.

**వివిధ రంగాల ప్రముఖులు**

మేడ్చల్ జిల్లా మౌలాలిలో ప్రసిద్ధ నిర్మాణం మహాలఖ బాయి సమాధి. **చందా బీబీగా** జన్మించిన వీరు బహుముఖ ప్రజ్ఞాశాలి. కవయిత్రి, గాయకురాలే కాక పద్నాలుగవ యేటనే యుద్ధ విద్యలను నేర్చుకున్న చందాబీబీ పురుష వేషం ధరించి నాటి నిజాం నవాబుతో పాటు మూడు యుద్ధాలలో పాల్గొన్నారు. ఆమె యుద్ధ కౌశలానికి, కవిత్వానికి ముగ్ధుడైన నవాబు వివిధ సందర్భాలలో హైదర్‌గూడ, చందానగర్, సైదుపల్లి, అడిక్‌మెట్ జాగీరులిచ్చి సన్మానించాడు. మహలఖా అనేది ఆమె బిరుదు. దాని అర్థం 'చంద్రవదన'. ప్రముఖ హైదరాబాదు చారిత్రక పరిశోధకులు నరేంద్ర లూథర్ ఈమెను మొట్టమొదటి ఉర్దూ కవయిత్రిగా పేర్కొన్నారు. అంతేగాక, నవాబుల దివానులో ఆసీనురాలైన మొదటి కవయిత్రి కూడా వీరే. మంత్రులలో అత్యున్నత స్థానమైన 'ఒమెరా' ను నవాబు ఆస్థానంలో పొందింది. 'దివాన్ - ఎ - చందా' అనే పేరుతో రాసిన 125 గజళ్ళు, స్వరపరచి, స్వంత దస్తూరితో అందంగా కూర్చిన ప్రతి లండన్ బ్రిటీషు మ్యూజియంలో వుంది. 'గుల్జార్ - ఎ- మహలఖా' అనేది ఈమె ప్రసిద్ధ కవితా సంకలనం. ఆమె వెంట ఎప్పటికీ 500 మంది సుశిక్షితులైన సైన్యం సాగుతూ వుండేది. వివిధ రాగాలతో గజళ్ళు ఆలపించే మహలఖా స్వయంగా దక్కనీ శైలీ కథక్ నృత్యంలో ప్రవీణురాలు. 300 మంది యువతులకు శిక్షణ నిమిత్తం కళా క్షేత్రాన్ని నెలకొల్పింది. మౌలాలిలోని కొండపై వున్న నిర్మాణంలో తరుచుగా 'ముషాయిరాలు' నిర్వహించేది. ఈ ప్రాంగణంలోనే తమ మాతృమూర్తికి సమాధి నిర్మించింది. చందాబీబీ మరణానంతరం యిక్కడే సమాధి చేయబడింది. మొఘల్, రాజస్థానీ శైలిలో 'చార్‌బాగ్' గా నిర్మితమైన ఈ కట్టడం శిథిలావస్థకు చేరుకోగా, పరిశోధన నిమిత్తం వచ్చిన స్కాట్ కర్గ్ల్ అనే ఆచార్యుడు, అమెరికా కాన్సులేట్ నిధులతో పునరుద్ధరించాడు. మహాలఖాబాయి మరణానంతరం ఆమె జాగీరులను కైవసం చేసుకున్న ప్రభుత్వం అడిక్‌మెట్ జాగీరులోని సుమారు 1700 ఎకరాలను ఉస్మానియా విశ్వవిద్యాలయానికి యిచ్చింది. హైదరాబాదు చరిత్రలో **మహలఖాబాయి** విస్మృత విదుషీమణి.

**సంగం లక్ష్మీబాయి** (1911-1979) స్వాతంత్రోద్యమంలో, అటుపై సాంఘిక ఉద్యమాలలో విశేష పోరాటం చేసిన వీర వనిత. ఘట్‌కేసర్‌లో వెనుకబడిన 'సాగర్ ఉప్పర' కులంలో జన్మించిన ఈమె సామాజిక అసమానతలను జయించి హిందీలో 'సాహితీ విదూషి' పట్టా పొందారు. అటుపై ఆంగ్ల విద్యాభ్యాసం చేసి బి.ఎ, చదివి పట్టభద్రు

లైనారు. ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘనం ఉద్యమాలలో చురుకుగా పాల్గొని జైలుపాలయ్యారు. రజాకార్ల అకృత్యానికి బలైన 'ఇమ్రోజ్' పత్రికా సంపాదకులు షోయబుల్లాఖాన్ కుటుంబాన్ని పరామర్శించి, వీర నారిలా నిజాం ఆజ్ఞలు ఉల్లంఘించి ఎన్నో సమావేశాలు ఏర్పాటు చేశారు. 1952 మొదటి సాధారణ ఎన్నికలలో విజయం సాధించి బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వంలో విద్యాశాఖ ఉప మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. అటుపై 14 సంవత్సరాలు ఎంపీగా సేవలందించారు. 1950 లో ఆచార్య వినోబాభావే భూదాన యాత్రలో వారి వెంట వుండి ఉపన్యాసాలను తెలుగులోకి అనువదించారు. 1953 లోనూ ఆయన సందేశంతో 16 గ్రామాలు తిరిగి 43 మంది దాతల నుంచి 314 ఎకరాల భూమిని సేకరించారు. హైదరాబాదులోని సైదాబాద్ ప్రాంతంలో 'ఇందిరా సేవా సదన్' స్థాపించి అనాథ పిల్లలకు, స్త్రీలకు ఉచిత భోజనం, రక్షణ, ఉచిత విద్య, వృత్తి విద్యా శిక్షణ కల్పించారు. ఇందిరా ప్రాచ్య కళాశాల, మాశెట్టి హనుమంతరావు గుప్త పాఠశాలల ఏర్పాటుకు కృషి చేశారు. 1953 లో విద్యా శాఖ ఉపమంత్రిగా వున్న సమయంలో 'నా అనుభవాలు' అనే పుస్తకాన్ని రాశారు. మేడ్చల్ నియోజకవర్గానికి **సింగిరెడ్డి వెంకట్రామిరెడ్డి** మూడు పర్యాయాలు శాసనసభ్యునిగా సేవలందించారు. వారి తర్వాత వారి సతీమణి **ఉమా వెంకట్రామిరెడ్డి** మంత్రిగానూ బాధ్యతలు నిర్వహించారు. ప్రసిద్ధ చలన చిత్ర నటుడు **కీ.శే. శ్రీహరి** బాలానగర్ ప్రాంతానికి చెందినవారు. జిమ్నాస్టిక్స్‌లో పట్టు సాధించి, చిన్న చిన్న వేషాలతో చిత్రరంగంలో ప్రవేశించి కథా నాయకుడిగా మారాడు. హైదరాబాదు నగరానికి చేరువగా ఉండటం వల్ల పండితులు, విద్వాంసులు, కవులు అనేకులు యిక్కడ స్థిరపడ్డారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు తంగెడ కిషన్ రావుగారు అల్వాల్‌లో, మసన చెన్నప్ప గారు బోడుప్పల్‌లో నివసిస్తున్నారు. మెదక్, నిజామాబాదు జిల్లా సర్వస్వాలు వెలయించిన **శాస్త్రుల రఘురామ శర్మ గారు** యీ జిల్లా వాసులే. వఝల శివకుమార్, బెల్లంకొండ సంపత్ కుమార్, రాజేశ్వర శర్మ, సౌభాగ్య, లక్ష్మీనర్సయ్య వంటి కవులు మేడ్చల్ జిల్లాలో స్థిరపడ్డారు.

**దర్శనీయ ప్రదేశాలు – పర్యాటకం**

ఈ జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కీసర. హైదరాబాదు నగరానికి ముప్పై కి.మీ. దూరంలో వున్న ఈ క్షేత్రంలో శ్రీ రామలింగేశ్వర స్వామి కొలువై వున్నాడు. ఈ ప్రాంతాన్ని కీసరగుట్ట/ కేసరిగిరి అని సైతం వ్యవహరిస్తారు. నృసింహావతారం అనంతరం ఆగ్రహంతో అరణ్యాలలో ప్రవేశించిన స్వామిని ప్రహ్లాదుడు 'నృకేసరీ! శాంతించు' అని వేడుకొని ఈ ప్రాంతంలోనే నిలువుమని ప్రార్థించినట్లుగా స్థల పురాణం. అయితే, బ్రాహ్మణుడైన రావణుని వధించినందుకు ప్రాయశ్చిత్తంగా శ్రీరాముడు యిక్కడ సైకతలింగం ప్రతిష్ఠించదలిచాడని, కాశీ నుంచి సమయానికి హనుమంతుడు శివలింగంతో తిరిగి రాకపోవడంతో తన స్వహస్తాలతో చేసిన శివలింగానికి పూజలు చేశాడని, అందుకే స్వామికి రామలింగేశ్వరుడనే పేరు స్థిరపడిందనేది మరో కథనం. క్రీ.శ. 3,4 శతాబ్దాలలో కీసర రాజధానిగా విష్ణుకుండినులు పరిపాలన చేశారు. ఇటీవలి తవ్వకాలలో అనేక జైన తీర్థంకరుల విగ్రహాలు బయట పడడం వల్ల ఒకప్పుడు ఈ ప్రాంతం జైనులకు ఆవాసయోగ్యంగా వున్నట్లు తెలుస్తుంది. అల్వాల్‌లో రాజా చందూలాల్ అనే భక్తుడు శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని నెలకొల్పాడు. ఇది దాదాపు 300 సంవత్సరాలు పురాతనమైన ఆలయం. అప్పటి నిజాం అల్వాల్ గ్రామాన్ని ఈ గుడి మాన్యంగా బహూకరించాడు. ఇదే గ్రామంలో సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం, సంయుక్త వేంకటేశ్వర స్వామి దేవాలయం, పాండురంగ మందిరం, రాధాకృష్ణ మందిరం సైతం అతి పురాతనం. పూర్వపు రంగారెడ్డి జిల్లా సాధువులకు, బైరాగులకు ఆలవాలం, అందుకు చిహ్నంగా చిలుక మఠం, రామస్వామి మఠం వంటివి నేటికీ కనబడతాయి. బ్రిటీషు సైన్యంతో పాటు అల్వాల్, బొల్లారం, మల్కాజ్‌గిరి ప్రాంతాలలో స్థిరపడ్డ తమిళులు, తమ ద్రావిడ

సంప్రదాయానుసారం అనేక దేవాలయాలను స్థాపించారు. సికింద్రాబాదులోని పలు విద్యాసంస్థలు, నిర్మాణాలకు వీరి తోడ్పాటు ఎంతగానో వుంది. ఘట్‌కేసర్‌లోని గోదా రంగనాథ స్వామి దేవాలయం మరో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం. ఘట్‌కేసర్ – యమ్నంపేట్ నడుమ వున్న దేవాలయం, గ్రామంలో ప్లేగు వ్యాధి పాకడంతో మూల విగ్రహాలతో సహా ఏదులాబాదులో ప్రతిష్టించడం జరిగింది. ఈ మండలంలో సుప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం యిది. నాచారంలో వెలిసిన శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవాలయం స్వయంభూ నారసింహ క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. స్వయంగా నారదుడే ఈ ఆలయాన్ని నిర్మించినట్లు స్థానిక ఐతిహ్యం. శామీర్‌పేట్ మండలంలోని అలియాబాదు లో గల రత్నాలయం వేంకటేశ్వరస్వామి దేవాలయం పర్యాటక ప్రదేశంగా కూడా పేరు తెచ్చుకుంది.

మహమ్మదు ప్రవక్త అల్లుడు, షియా ముస్లింలకు మొదటి ఇమాం అయిన అలీ స్మారకార్థం మల్కాజ్‌గిరి మండలంలో మౌలాలి దర్గా నిర్మితమైంది. ఎత్తైన గుట్టపై వున్న దర్గాకు ముస్లింలతో పాటు, హిందువులు కూడా అత్యధిక సంఖ్యలో వెళుతారు. ఈ ప్రాంతంలో సైతం లోహయుగం నాటి అనేక సమాధులు బయటపడ్డాయి. తెలంగాణలో మెదక్ చర్చి తర్వాత అంతటి ప్రసిద్ధమైన 'హోలీ ట్రినిటీ చర్చ్' బొల్లారంలో నిర్మితమైంది. ఈ నిర్మాణానికి నిజాం భూమిని దానం చేయగా బ్రిటీషు రాణి విక్టోరియా ఆర్థిక సహాయాన్ని అందించింది. లెఫ్టినెంట్ కల్నల్ కిర్క్‌వుడ్ 1892 లో నెలకొల్పిన బొల్లారం గ్రంథాలయం ఈ మధ్య కాలం వరకు ప్రసిద్ధ కట్టడంగా వెలుగొందింది.

ఒకనాడు అటవీ శోభతో అలరారిన మేడ్చల్ ప్రాంతం యిప్పుడు పరిశ్రమలకు, విద్యా సంస్థలకు చిరునామాగా మారిపోయింది. ఘట్‌కేసర్ మండలం పోచారం ఐటీ సెజ్‌లో ఇన్ఫోసిస్ సంస్థ 447 ఎకరాలలో దేశంలోనే రెండో పెద్ద కార్యాలయాన్ని నెలకొల్పింది. ఇందులో 25,000 మంది ఉద్యోగుల సామర్థ్యానికి గల సదుపాయాలున్నాయి. అలాగే ఈ సెజ్‌లో రహేజా సంస్థ నూరు ఎకరాలలో ఐటీ పార్క్ ఏర్పాటు చేసింది. దుండిగల్ – గండి మైసమ్మ మండలంలోని బహదూర్ పల్లిలో టెక్ మహేంద్ర సంస్థ 26 ఎకరాలలో ఐటీ పరిశ్రమ నెలకొల్పింది. 'బయలాజికల్ ఈ లిమిటెడ్' అనే ఔషధ సంస్థ శామీర్‌పేట్ మండలం తుర్కపల్లిలో, నేరెడుమెట్లో పరిశ్రమను నెలకొల్పింది. జినోమ్‌వ్యాలీ పేరిట మేడ్చల్ జిల్లాలోని శామీర్‌పేట్, మేడ్చల్, ఉప్పల్, జీడిమెట్ల కీసర ప్రాంతాలలో బయో మెడికల్ పరిశోధనలకు సంబంధించిన పరిశ్రమలు ఏర్పడ్డాయి. శామీర్‌పేట్ మండలంలోని జవహర్‌నగర్‌లో బిర్లా (BITS-PILANI) ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ సంస్థ తమ డీమ్డ్ విశ్వ విద్యాలయాన్ని స్థాపించింది. ఇదే మండలంలో నేషనల్ అకాడమీ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ సెంటర్ (NALSAR) జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వుంది. బహదూర్‌పల్లిలో మహీంద్ర ఎకోల్ సెంట్రల్ (MEC) ప్రైవేటు రంగంలో అత్యున్నత ఇంజనీరింగ్ విద్యను అందిస్తుంది. ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలు ఎన్నో ఈ జిల్లాలో కేంద్రీకృతమైనాయి. ఉదాహరణకు సర్వే ఆఫ్ ఇండియా, HMT, NGRI, IICT, NRSA, NFC, ECIL, CPRI, HAL, HMT, CCI వంటివి కొన్ని దశాబ్దాలుగా సేవలందిస్తున్నవి. పౌల్ట్రీ పరిశ్రమలకు మేడ్చల్ జిల్లా పేరు గడించింది.

శామీర్‌పేటలోని జింకల జాతీయ ఉద్యానవనం 54 ఎకరాలలో వ్యాపించి కృష్ణ జింకలకు పేరెన్నికగన్నది. అలాగే మేడిపల్లి మండలంలోని నారపల్లిలో భాగ్యనగర నందనవనం 200 హెక్టార్లలో వ్యాపించి అనేక జంతు జాలాలతో సందర్శకులకు కనువిందు చేస్తుంది. సఫిల్‌గూడ, శామీర్‌పేట, ఫాక్స్‌నగర్ వంటి చెరువులు పర్యాటకులను ఆకట్టుకుంటాయి. మేడ్చల్ జిల్లాకున్న మరో ప్రత్యేకత వారాంత విడిది కేంద్రాలు గా లియోనియో, అలంకృత వంటి రిసార్ట్‌లు అలరిస్తాయి.

మేడ్చల్ రోడ్‌లో కొంపల్లి వద్ద వున్న 'ధోలా-రి-ధని' రాజస్థానీ శైలిలో నిర్మించిన విడిది కేంద్రం. ఆటపాటలకు, వినోదాలకు, విందులకు, పెళ్ళిళ్ళకు,

సమావేశాల నిర్వహణకు యిది పెట్టింది పేరు. కళా ప్రదర్శనల నిమిత్తం యిందులోనే ఒక వలయాకార నిర్మిత సభాస్థలి వుంది. హబ్సిగూడలో నిర్మించిన రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం జాతీయ, అంతర్జాతీయ మ్యాచ్‌లకు ఆతిథ్యం యిస్తూ, క్రీడా ప్రేమికులను ఆకట్టుకుంటుంది. దుండిగల్‌లో గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమం, సుందర చైతన్యానంద ఆశ్రమాలు ఆధ్యాత్మిక సౌరభాలను వెదజల్లుతున్నాయి.

దుండిగల్‌లో వున్న వాయుసేన అకాడమీ ఈ జిల్లాకు మరో ప్రత్యేకత. 7,000 ఎకరాల విస్తీర్ణంలో 1969 లో నెలకొల్పబడ్డ ఈ సంస్థ యుద్ధ విమానాల చోదనలో పైలెట్‌లకు శిక్షణనిస్తుంది. అలాగే హకీంపేటలో వాయుసేనకు చెందిన ట్రైనింగ్ కమాండ్ సెంటర్ వుంది. రెండవ ప్రపంచ యుద్ధంలో రాయల్ ఎయిర్ ఫోర్స్ వినియోగించిన ఈ కేంద్రం, అటుపై భారత వాయుదళం కైవసమైంది. ఇందులో హెలికాప్టర్‌ల చోదనలో శిక్షణతో పాటు సాంకేతిక అంశాలలో నిష్ణాతులను చేస్తారు. బొల్లారంలో రాష్ట్రపతి శీతాకాల విడిది కేంద్రం వుంది. వేసవికాల విడిది ఒకటి సిమ్లాలో వుంటే రెండవది ఈ జిల్లాలోనే వుండటం విశేషం. ఒకప్పటి బ్రిటీషు రెసిడెంట్ కార్యాలయం యిప్పుడు రాష్ట్రపతి నిలయంగా రూపుదిద్దుకుంది. 1860 లో నిర్మితమైన ఈ కట్టడం 90 ఎకరాలలో విస్తరించి వుంది. రాష్ట్రపతి పర్యటన అనంతరం ఈ ప్రదేశంలోకి సాధారణ పౌరులను, సందర్శకులను అనుమతిస్తారు. సికింద్రాబాదు కంటోన్మెంట్ ప్రాంతానికి ఎంతో చారిత్రక నేపథ్యమున్నది. రెండవ ప్రపంచ యుద్ధంలో బ్రిటన్‌కు సారథ్యం వహించిన విన్‌స్టన్ చర్చిల్ కొంతకాలం యిక్కడే బాధ్యతలు నిర్వహించాడు. జగమెరిగిన క్రీడాకారుడు మిల్కాసింగ్ యిక్కడి ఈ.ఎమ్.ఈ సెంటర్‌లోనే పనిచేసేవాడు. ఆసియా ఖండంలోనే సైనిక దళాలకు సాంకేతిక శిక్షణనిచ్చే ఏకైక కళాశాల The college of Defence management (CDM) యిక్కడే వుంది.

మేడ్చల్ జిల్లా చరిత్రపై, సాహిత్యంపై, కళలపై మరెంతో పరిశోధన జరగాల్సి వుంది. దూసుకొస్తున్న పారిశ్రామిక వేగానికి గ్రామాలలో మిగిలి వున్న ఆ కొంత సంస్కృతీ సంప్రదాయాలు అంతే వేగంగా అంతరిస్తున్న దృశ్యం మన కళ్ళముందు కనిపిస్తుంది. ఒకవైపు కూకట్‌పల్లి, మరోవైపు శామీర్‌పేట్ మండలం ఒకే జిల్లాలోని యీ రెండు ప్రాంతాల సంస్కృతుల్లో వైరుధ్యానికి మొత్తం రాష్ట్రంలోనే యింతకంటే నిదర్శనం కనబడదు. పరిశ్రమల ద్వారా అభివృద్ధి అనే సూత్రాన్ని యీ జిల్లా నిరూపిస్తుంది. అయితే సాంస్కృతిక, చారిత్రక మూలాలను కాపాడుకోవడంతోనే ఏ ప్రాంతమైనా అస్థిత్వాన్ని నిలుపుకుంటుంది. మేడ్చల్ మేడిచెట్ల నడుమ చెలిమె లాగా స్వచ్ఛంగానూ, సుందరంగానూ సౌభాగ్యంగానూ వుండాలని ఆశిద్దాం.

# యాదాద్రి భువనగిరి జిల్లా చిత్రపటం




210 (9)



యాదగిరిగుట్ట




లక్ష్మీనరసింహస్వామి



సురేంద్రపురి



భువనగిరి కోట



మత్స్యగిరి దేవాలయం



సుద్దుల హనుమంత



బి.ఎన్.శాస్త్రి



ఆచార్య రవ్వ శ్రీహరి



కొలనపాక జైన్ దేవస్థానం



ఆచార్య ఎన్.గోపి



సుద్దుల అశోకతేజ



హరిహర త్రిశక్తి క్షేత్రం

210 (b)

# యాదాద్రి భువనగిరి

యాదగిరీశు దీవెనల నందినదీ భువనాద్రి శోభ, స
మ్మోదములొల్క జైనము నమోఘ శివాలయ భాసమానయై
భూదివ సామ్యమై మహిత పోచముపల్లి కళాలయంబునై
మేదురదీప్తి వెల్గునిదు మేదినికెల్ల వరేణ్యధామమై!

ఆధ్యాత్మిక కేంద్రాల ఆలయం. మహోన్నత చరిత్ర పుటల నిలయం భువనగిరి ఖిల్లా. అరుదైన జైన దేవాలయపు అడుగుజాడ. విష్ణుకుండినులు ఏలిన విశ్వగీతి. విజ్ఞాన సర్వస్వాలను తవ్వి తీసిన త్యాగమూర్తి. శాసనాల శాస్త్రిని కన్న ధన్యభూమి. కాకతీయ సామంతుల కళల కాణాచి. సాహిత్య సౌరభాలను విరబూసిన స్వర్గసీమ. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాల పురిటిగడ్డ. భూదాన ఉద్యమానికి బీజం వేసిన త్యాగమూర్తి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పోచంపల్లి చీరల ఘనకీర్తి. మట్టి మమతలను కలబోసుకున్న ప్రేమమూర్తి. రాజకీయ దురంధరులను అందించిన జీవగడ్డ. ఇది యాదాద్రి. ఇది భువన భారతి. అక్షరాల ఆనవాళ్లను గుండెల్లో నింపుకున్న సాహిత్య భాండాగారం. పుణ్యభూమి మన యాద్రాద్రి భువనగిరి జిల్లా.

## ఈ పేరెందుకు?

యాదాద్రి-భువనగిరి జిల్లా వైశిష్ట్యం బహు ప్రాశస్త్యమైంది. యాదగిరి గుట్ట (యాదాద్రి)కి సంబంధించిన కథకు మూలం వాల్మీకి రామాయణంలో ఉంది. విభాండక ఋషి కుమారుడు ఋష్యశృంగుడు. అతని కుమారుడు యాదఋషి (యాదర్షి) నరసింహస్వామి కోసం తపస్సు చేయగా ఈ కొండమీదనే స్వామివారు కొలువయ్యాడు. దీంతో తపస్సు చేసిన ఈ కొండకు యాదగిరిగుట్ట అని పేరు వచ్చింది. దీనికే తెలంగాణ ప్రభుత్వం యాదాద్రిగా నామకరణం చేసింది.

పశ్చిమ చాళుక్య రాజైన త్రిభువనమల్ల ఆరవ విక్రమాదిత్యుని పేరు మీద త్రిభువనగిరి, భువనగిరిగా పేరు వచ్చినట్లు చరిత్ర చెప్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన శుభ తరుణంలో నల్లగొండ జిల్లాను నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి అని 3 జిల్లాలుగా ఏర్పాటు చేశారు.

## భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి

యాదాద్రి భువనగిరి జిల్లా ఉత్తర అక్షాంశ రేఖకు దక్షిణ రేఖాంశ రేఖకు మధ్య ఉంది. జిల్లా విస్తీర్ణం 3, 092 చ.కి.మీ వైశాల్యం కలిగి ఉంది. ఈ జిల్లాకు సరిహద్దులుగా సిద్ధిపేట జిల్లా, జనగామ జిల్లా, సూర్యాపేట జిల్లా, నల్లగొండ జిల్లా, రంగారెడ్డి జిల్లా, మేడ్చల్ జిల్లాలు సరిహద్దులుగా ఉన్నాయి. జిల్లా భూభాగం సముద్రానికి సగటున 500 నుండి 600 మీటర్ల ఎత్తులో భువనగిరి-రామన్నపేట పీఠభూమి ఉంది. యాదాద్రి గుట్టలు, భువనగిరి గుట్టలు, తుర్కపల్లి, పోచంపల్లి మండలాల్లో గుట్టలు వ్యాపించి ఉన్నాయి.

## సహజ వనరులు

జిల్లాలో సహజ వనరులు పరిమితంగా ఉన్నాయి. ఇసుక, ఎర్రమట్టి, రాతిగుట్టలు, కలర్ గ్రానైట్ విస్తరించి ఉన్నాయి. స్వల్పంగా అడవులు, నదులు, వాగులు, చెరువులు ఉన్నాయి. మూసీనదిపై రెండు ప్రాజక్టులు ఉన్నాయి. జిల్లాలో ఇనుము, కెమికల్, ఆటోమొబైల్స్, ప్లాస్టిక్, చేనేత పరిశ్రమ

## రెవెన్యూ డివిజన్లు

ఈ జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. **1. భువనగిరి 2. చౌటుప్పల్.** ఈ రెండు డివిజన్లలో 16 మండలాలు ఉన్నాయి.

**భువనగిరి రెవెన్యూ డివిజన్‌లో 11 మండలాలు**

1. అడ్డగూడూరు 2. ఆలేరు 3. ఆత్మకూరు 4. బీబీనగర్ 5. భువనగిరి 6. బొమ్మల రామారం 7. మూటకొండూరు 8. మోత్కూరు 9. రాజపేట 10. తుర్కపల్లి 11. యాదగిరి గుట్ట

**చౌటుప్పల రెవెన్యూ డివిజన్‌లో 5 మండలాలు**

1. భూదాన్ పోచంపల్లి 2. చౌటుప్పల్ 3. సంస్థాన్ నారాయణపురం 4. రామన్నపేట 5. వలిగొండ

లున్నాయి. భువనగిరి, బీబీనగర్‌లలో మానుఫాక్చరింగ్ పరిశ్రమలున్నాయి.

**నేలలు :** యాదాద్రి – భువనగిరి జిల్లా భువనగిరి రామన్నపేట పీఠభూమిలో విస్తరించి ఉంది. జిల్లాలో ఇసుక, ఎర్రమట్టి నేలలు ఉన్నాయి.

**అడవులు :** జాతీయ అటవీ విధానం 1952 ప్రకారం మొత్తం భూభాగంలో 33% అటవీ ప్రాంతం ఉండాలి. అయితే జిల్లాలో అటవీ విస్తీర్ణం 116.97 చ.కి.మీ. అంటే 3.78 శాతంగా వుంది.

**నదులు :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండా రెండు నదులు ప్రవహిస్తాయి. వీటి పరీవాహక ప్రాంతం కూడా జిల్లాలో స్వల్పంగానే ఉంది. 1. మూసీనది 2. ఆలేరునది. మూసీనది వికారాబాద్ జిల్లాలో అనంతగిరి కొండల్లో జన్మించి యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్, భువనగిరి, రామన్నపేట మండలాల్లోని కొన్ని గ్రామాలు, పరీవాహక ప్రాంతాలుగా కలిగి ఉన్నాయి. మూసీనదినే 'ముచికుందా నది' అని కూడా పిలుస్తారు.

**చెరువులు, ప్రాజెక్టులు :**

**శామీర్‌పేట వాగు :** ఇది మేడ్చల్ జిల్లాలోని శామీర్‌పేట చెరువు ద్వారా వచ్చే వాగు. ఇది బొమ్మల రామారం మండలంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రవేశిస్తుంది. భువనగిరి మండలంలోని అనేక గ్రామాలను తడుముకుంటూ ప్రవహిస్తుంది.

ఇక చెరువుల విషయానికి వస్తే బస్వాపూర్ చెరువు, గంధమల చెరువు, మల్లాపూర్ చెరువు, సైదాపూర్ చెరువు, యాదగిరిపల్లి చెరువు, రాయగిరి చెరువు, రంగాపూర్ చెరువు, మల్యాల చెరువు... ఇంకా చిన్నా చితక చెరువులు 80 పైనే ఉన్నాయి. వీటిద్వారా భూగర్భ జలాలు నిలువ ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

యాదాద్రి జిల్లాలో నాలుగు ప్రాజెక్టులున్నాయి. 1. అసఫ్‌నగర్ ప్రాజెక్టు 2. శాలి గౌరారం ప్రాజెక్టు 3. బస్వాపూర్ జలాశయం 4. గంధమల ప్రాజెక్టు.

**జనాభా :** 2011 జనాభా లెక్కల ప్రకారం యాదాద్రి జిల్లా జనాభా 7,39,448 కాగా పురుషుల జనాభా 3,74, 719, స్త్రీల జనాభా 3,64,729. ఇందులో గ్రామీణ జనాభాశాతం 83.34, పట్టణ జనాభాశాతం 16.66%. ఈ జిల్లా జనసాంద్రత 239, లింగనిష్పత్తి 1000:973

జిల్లాలో అక్షరాస్యతా శాతం 65.53. ఇది తెలంగాణా రాష్ట్ర అక్షరాస్యత కన్నా ఒక శాతం తక్కువ. పురుషుల అక్షరాస్యత 75.82%, స్త్రీల అక్షరాస్యత 66.02%.

తెలంగాణ చరిత్రలో విష్ణుకుండినుల యుగం మహోజ్వలమైన అధ్యాయం. క్రీ.శ. 358 నుంచి 569 వరకు దాదాపు 210 సంవత్సరాలు 12మంది విష్ణుకుండిన రాజుల పరిపాలనకు రాజధానిగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని వలిగొండ మండలం తుమ్మలగూడెం (ఇంద్రపాలనగరం) గణుతికెక్కింది. చరిత్రకే ఒక కొత్త అధ్యాయాన్ని సృష్టించిన సుదీర్ఘ సంస్కృత తామ్ర శాసనాలను ప్రసాదించి ఈ జిల్లా గొప్పతనాన్ని చాటడం గర్వకారణం. వీటన్నిటినీ ఈ జిల్లాకే

చెందిన శాసన పరిశోధకులు, చరిత్రకారులు, సాహితీ మూర్తులు బి.ఎన్.శాస్త్రిగారు ఆధారాలతో నిరూపించారు.

క్రీస్తుపూర్వం రెండున్నరవేల సంవత్సరాల నాటి నాగరికత, చరిత్రలున్నట్లు తెలుస్తోంది. అందుకు సంబంధించిన శాసనాలు కొన్ని మిగిలి ఉన్నాయి. అవి ఈ జిల్లా చరిత్రను మరింత తేజోవంతం చేస్తున్నాయి. అంటే 4500 సంవత్సరాల చరిత్ర కలిగిన పుణ్యభూమి ఈ జిల్లా అనడంలో అతిశయోక్తి లేదు.

కొలనుపాక పట్టణం చరిత్ర శైవ, జైన మతాల సమ్మేళనం. కొలనుపాకలోని ప్రసిద్ధ జైన దేవాలయాన్ని రెండవ కృష్ణుని కాలంలో (క్రీ.శ. 880-914) మధ్య నిర్మించినట్లు తెలుస్తోంది. కొలనుపాకకు దగ్గరలో ఉన్న సిద్ధింకి గుట్టపై రాష్ట్రకూటుల కాలం నాటి జైన శిల్పాలున్నాయి. బాదామి, వేంగి, కళ్యాణి చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలంలో జైనమతాన్ని పోషించినట్లు శాసనాలు లభిస్తున్నాయి. కొలనుపాకలో క్రీ.శ. 1089 నాటి కన్నడ శాసనం ఉంది. అందులో త్రిభువనమల్ల ఆరవ విక్రమాదిత్య ప్రశంస ఉంది. దీన్ని తొండరస చోళ మహారాజు వేయించాడు.

11వ శతాబ్దంలో కళ్యాణి చాళుక్యులు కొలనుపాకను రాజధానిగా చేసుకొని తమ రాజ్యాన్ని పరిపాలించారు. ఇది జైనుల తీర్థయాత్రా స్థలం కూడా కావడం విశేషం.

చరిత్రకు సంబంధించినంతవరకు శాసనాలు ప్రథమ సాక్ష్యాలు. వీటిద్వారానే చరిత్ర అవశేషాలను నిర్ధారించుకోగలుగుతున్నాము. భువనగిరి కోట ఈ ప్రాంతంలో వివిధ కాలాలలో జరిగిన చారిత్రక ఘటనలకు సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ కోట వైభవాన్ని తెలిపే శాసనాలు వివిధ కాలాల్లో, పలు ప్రాంతాల్లో తెలుగు, సంస్కృత, కన్నడ, పారసీ, ఉర్దూ భాషల్లో లభించాయి. ఇవి ఈ నేల ప్రాభవాన్ని తేటతెల్లం చేస్తూనే ఉన్నాయి.

అందమైన భువనగిరి దుర్గం పశ్చిమ చాళుక్య రాజైన త్రిభువనమల్ల ఆరవ విక్రమాదిత్యుని రాజ ప్రతినిధిగా ఉన్న జగద్దేవుని పాలనలో క్రీ.శ. 1076-1126 వరకు వైభవంగా వెలిగిందని తెలుస్తోంది. త్రిభువనమల్ల పేరు మీదనే త్రిభువనగిరిగా పేరు వచ్చింది. కాకతీయ రాజుల కళాత్మక పాలనకు ప్రతీకగా మొదటి ప్రతాపరుద్రుడు (క్రీ.శ. 1289-1323) భువనగిరి కోటపై భువనేశ్వరాలయం కట్టించాడని, ఆ దేవిపై గల భక్తితో భువనగిరి అని పేరు పెట్టారని ఐతిహ్యం ఉంది. భోనయ్య, గిరమ్మ పేరిట 'భోనగిరి' అనే పేరు వచ్చిందనే కథ కూడా ప్రచారంలో ఉంది.

**మున్సిపాలిటీ :** భువనగిరి

**నగర పాలక సంస్థలు :** భువనగిరి

**రెవెన్యూ గ్రామాలు :** 300

**గ్రామ పంచాయితీలు :** 334

**పోలీస్ కమీషనరేట్ :** రాచకొండ

**పార్లమెంట్ నియోజకవర్గం :** భువనగిరి

**అసెంబ్లీ నియోజకవర్గాలు :** జిల్లాలో 4 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. 1. భువనగిరి 2. ఆలేరు 3. మునుగోడు 4. తుంగతుర్తి

**పట్టణాలు :** జిల్లాలో ప్రధానమైన పట్టణాలు రెండు. 1. భువనగిరి 2. చౌటుప్పల్

ఎంతో వైభవాన్ని చూసింది భువనగిరి కోట. ఈ భూమి తన కాలగర్భంలో మహోన్నత చరిత్రను ఇముడ్చు కుంది. వీటన్నిటికీ సాక్ష్యాలు ఈ ప్రాంతంలో లభించిన శాసనాలు.

భువనగిరి దుర్గం చరిత్రలో సర్దార్ సర్వాయి పాపన్న అధ్యాయం విలక్షణమైంది. వైవిధ్యమైంది. 1695-1710 వరకు సర్వాయి పాపన్నది ఒక వీరోచిత ఘట్టం. ఒక సామాన్య బహుజన వీరుడు ధైర్య సాహసాలతో, తెలివి తేటలతో రాజ్యాధికారి కాగలిగాడు. అనేక కోటలను జయించాడు. 1708లో ఓరుగల్లు కోటను ముట్టడించి వశపర్చుకున్నాడు. ఆ తర్వాత భువనగిరి కోటను తన ఏలుబడిలోకి తీసుకున్నాడు. క్రీ.శ. 1709లో సర్వాయి పాపన్న తన సైన్యంతో గోల్కొండ కోటపై దాడిచేసి సింహాసనం అధిష్టించాడు. సర్వాయి

పాపన్నకు సంబంధించిన వీరోచిత ఘట్టాలు నేటికీ తెలంగాణ ప్రాంతంలో పాటలుగా పాడుకుంటారు.

**ఆచారాలు, సంప్రదాయాలు, పండుగలు :**

యాదాద్రి భువనగిరి జిల్లాలో తెలంగాణా మాదిరిగానే భిన్నమైన సంస్కృతి, చరిత్ర, భాష ఉన్నాయి. అనేక చారిత్రక కారణాల వల్ల ఈ ప్రాంతానికి ఒక అస్తిత్వం ఉంది. ఇక్కడి ప్రజలు మాట్లాడే భాష, యాస, ఇక్కడి ప్రజల ఆచార వ్యవహారాలు, పండగలు, ఆహారపు అలవాట్లు తదితర అంశాలతో కూడిన ప్రజల సంస్కృతి ఇతర ప్రాంతాలతో పోల్చినప్పుడు కొంత భిన్నత్వం కన్పిస్తుంది. దాదాపు 400 సంవత్సరాలు తెలంగాణ ప్రాంతం ముస్లింల పాలనలో ఉండిపోయింది. దీని ప్రభావం ప్రజల భాషపై, జీవన విధానంపై కన్పిస్తుంది. అంతకుముందు ఈ జిల్లా ప్రాంతాన్ని పరిపాలించిన విష్ణుకుండినులు, కాకతీయ సామంతులు అనుసరించిన మత ధర్మాల ప్రభావం ఇప్పటికీ కన్పిస్తుంది. తెలంగాణలో ప్రకృతి ఆరాధన ఎక్కువగా కన్పిస్తుంది. ఇక్కడ వాగులు, నదులు, చెట్లు, పుట్టలను, గుట్టలను పూజించడం ప్రజల జీవన విధానంలో భాగం. మనిషికి ప్రకృతికి మధ్య అంతస్సంబంధం పునాదిగా సంస్కృతి విలువలు ఆవిర్భవించాయి. ఇవన్నీ యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రజల జీవన విధానంలో ప్రతిబింబిస్తాయి.

జిల్లాలో ఇప్పటికీ కుటుంబ వేడుకలు, పండుగలు జాతరలు, కర్మకాండలు తదితర సందర్భాల్లో ఉమ్మడి కుటుంబ వాతావరణం, సంస్కృతి ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. జిల్లా సంస్కృతిలో ఆధ్యాత్మిక భావన, దైవభీతి అంతర్భాగంగా కన్పిస్తాయి.

యాదాద్రి భువనగిరి జిల్లాది మిశ్రమ సంస్కృతిగా చెప్పవచ్చు. గ్రామీణ సంస్కృతిలో ప్రకృతి ఆరాధన అంతర్భాగం. బొడ్డెమ్మ పండుగ, నాగుల చవితి, బతుకమ్మ పండుగ... ఇలా ప్రకృతి ఆరాధన సంస్కృతిలో అంతర్భాగమైంది.

తెలంగాణలోని అన్ని జిల్లాల మాదిరిగానే ఇక్కడి సాంస్కృతిక అంశాల్లో వివిధ మత సంప్రదాయాల మధ్య అనుబంధం కన్పిస్తుంది. ముస్లింల పండుగలైన మొహర్రం (పీర్ల పండగ), బక్రీదు, ఉర్సు ఉత్సవాలను హిందువులు కూడా నిర్వహించుకుంటారు. ఈ జిల్లాలో అత్యధికంగా ఉండే గిరిజన తెగ లంబాడీలు. వీరి ఆచార వ్యవహారాలు, వేషధారణ ప్రత్యేకంగా ఉంటుంది.

**కళలు :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని పోచంపల్లి 'ఆసియా (తేలియా) రుమాల్' తయారీకి ప్రసిద్ధి. ఇక్కత్ అనే నేతను ఇందులో ఉపయోగిస్తారు. మరోవైపు జానపద కళలు ఈ జిల్లాలో విష్ణుకుండినులు, కాకతీయ సామంతుల కాలం నుంచే కొత్త పుంతలు తొక్కాయి. కవిత్వం, దేశీ సంగీతం, కళలు, జానపద సాహిత్యం అనేక రూపాల్లో ఆవిష్కరణలు జరిగాయి. వీధి భాగవతాలు, తోలు బొమ్మలాట, హరికథలు, ఉయ్యాల పాటలు, పటం చూపిస్తూ వివరించే పాండవుల కథలు, చిందు యక్షగానాలు తదితర జానపదాలకు పుట్టినిల్లుగా ఉండేది. ఒగ్గుకథ, బుర్రకథ, జంగం కథ, బైండ్ల కథ, కోలాటం, చెక్కభజన, బీరప్ప డొల్లులు, గొరవయ్యల నృత్యం, దండోరా డప్పుల నృత్యం, పీర్ల పండుగలో మదిమి ఆట తదితర నృత్యాలు గతంలో ఈ జిల్లాలో ఎక్కువగా కనిపించేవి. ప్రపంచీకరణ ప్రభావంతో ఈ కళలకు ప్రాధాన్యం తగ్గినట్టు గమనించవచ్చు.

**జాతరలు :** తెలంగాణ ప్రాంతంలోని జాతరలన్నీ జానపదుల జీవన విధానానికి, విశ్వాసాలకు, ధార్మిక జీవనానికి అద్దం పడుతాయి. తెలంగాణలోని పల్లెపల్లెల్లో జాతరలు జరుగుతాయి. అయితే వాటిలో కొన్ని మాత్రమే ప్రముఖంగా కనిపిస్తాయి. జానపదులు ప్రసిద్ధ జాతరలలో అధిక సంఖ్యలో పాల్గొంటారు. యాదాద్రి జిల్లాలో జరిగే వివిధ జాతరలు.

**1. మారమ్మ తల్లి జాతర :** ఈ జాతర రామన్నపేట మండలంలోని వెలువర్తి, పిట్టంపల్లి గ్రామాల్లో ఘనంగా జరుపుకుంటారు. ఈ గ్రామ దేవత పిల్లలకు, పశువులకు

ఆరాధ్య దేవత. పశువులను, పిల్లలను ఈ తల్లి కాపాడు తుందని భక్తుల నమ్మకం.

**2. మైసమ్మ జాతర :** జిల్లాలోని బొమ్మల రామారం మండల కేంద్రంలోని గుట్టల్లో కొలువైంది. శ్రీరామనవమి తర్వాత వచ్చే సోమవారం రోజున ప్రతి ఏటా మైసమ్మ జాతర జరుపుకుంటారు. చుట్టుపక్కల ఉన్న 45 గ్రామాలతో పాటు హైదరాబాద్ నుంచి కూడా భక్తులు భారీగా ఈ జాతరకు తరలి వస్తారు. అమ్మవారు కోరిన కోర్కెలు తీరుస్తారని భక్తుల విశ్వాసం. మైసమ్మ అత్యంత శక్తివంతమైన గ్రామ దేవత.

**3. తిరుమలయ్య స్వామి జాతర :** బొమ్మల రామారం మండలం చీకటి మామిడి గ్రామ సమీపంలోని అడవిలో శ్రీ తిరుమలనాథ స్వామి దేవస్థానం ఉంది. ఇక్కడ ప్రతీ ఏటా ఉగాదికి తొమ్మిది రోజుల ముందునుంచి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఇక్కడ శ్రీ వేంకటేశ్వర స్వామి 800 సం॥ల క్రితం కొలువయ్యాడని పురోహితులు చెప్తున్నారు. ఇక్కడి జాతరకు చుట్టుపక్కల 50 గ్రామాలు, తండాల నుంచి, హైదరాబాద్ నుంచి భక్తులు వస్తారు. కోరిన కోర్కెలు తీర్చే దేవుడని భక్తుల విశ్వాసం.

## సాహిత్య చరిత్ర

కవిత్వమే ఆయుధంగా ఆధ్యాత్మికతను గుబాళిస్తూ చారిత్రక ఘట్టాలకు అక్షర రూపమిస్తూ, సమకాలీన సమాజాన్ని రచనల్లో ప్రతిబింబింపజేస్తూ, నిత్య చైతన్యానికి నిదర్శనంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉద్భవించిన కవులు అద్భుతమైన ఆవిష్కరణలు చేశారు. తెలంగాణ తెలుగు సాహిత్యంలో సమున్నత స్థానాన్ని సంపాదించుకున్నారు. ఉద్విగ్నభరిత హృదయావిష్కరణలను కవిత్వంగా, పద్యాలుగా, గద్యాలుగా, శతకాలుగా, పాటల రాసులుగా పేర్చి సాహిత్య నిధులుగా మిగిల్చి వెళ్లిన ప్రజాకవులకు పెట్టిన కోటగా యాదాద్రి భువనగిరి జిల్లా చరిత్ర పుటల్ని లిఖించుకుంది.

యాదాద్రి జిల్లాలో వెలసిన వివిధ శాసనాల వల్ల ప్రాచీన కాలం నుంచి ఎందరో కవి పండితులు, సంస్కృతాంధ్ర వైదిక విద్యామూర్తులు ఉన్నారని తెలుస్తోంది. వీరు రాసిన విలువైన గ్రంథాలు ఎన్నో ఉన్నాయి. కాలప్రవాహంలో కొన్ని వెలుగు చూడలేదు.

పద్యకవితా ధురీణులైన పూర్వ తెలుగు కవులు సంస్కృత సాహిత్యంలో మంచి పట్టు కలిగి ఉన్నారు. ఈ జిల్లా కవులు సంస్కృతాంధ్ర భాషా దక్షులు, చతుర్భాషా కవితా పితామహులు, అష్టభాషా కవిత్వ శ్రీ విరాజితులు. సంస్కృతాంధ్ర అవధాన మూర్తులు, తదేక దీక్షతో సాహితీ సేవ చేసి మనకు అమూల్యమైన అక్షర సంపదను ప్రసాదించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 18మంది ప్రాచీన కవులున్నట్లు తెలుస్తోంది.

క్రీ.పూ.850 నుంచి ఆధునిక కాలం వరకు **రేణుకాచార్యులవారి** గురించి సంస్కృతం, తెలుగు, కన్నడ, జర్మనీ, ఆంగ్లభాషల్లో గ్రంథాలు వచ్చాయి. చిత్తారు గంగాధరయ్య 'కొలనుపాక మాహత్మ్యము' రాశారు. రేణుకా చార్యుల 'రేణుకా భాష్యం' అనే గ్రంథం అముద్రితం. రేణుకాగస్త్య బోధనను సంగ్రహించిన శివయోగి శివాచార్యుడు 'సిద్ధాంత శిఖామణి' అనే గ్రంథాన్ని రచించారు..

క్రీ.శ. 1142 ప్రాంతానికి చెందిన భువనగిరి కవి నరహరి సరస్వతీ తీర్థముని. కావ్యప్రకాశానికి 'బాల చిత్తానురంజన' పేరుతో వ్యాఖ్యను రచించాడు. ఇది మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయంలో ఉంది. 'స్మృతి దర్పణం', 'తర్కరత్నం' ఈయన రచనలు.

రాచకొండ ప్రాంతానికి చెందిన **శాకల్య మల్లన** (క్రీ.శ. 1294-1380)కు 'చతుర్భాషా కవితా పితామహ' బిరుదు ఉంది. శ్రీరాముని చరిత గల 'ఉదార రాఘవం' (సంస్కృతం), 'నిరోష్ఠ్య రామాయణం' (అలభ్యం), 'అవ్యయ సంగ్రహ నిఘంటువు', 'అప్పకవీయం' 'సిద్ధేశ్వర చరిత్రలో ఈయనకు సంబంధించిన ప్రస్తావన ఉంది.

రాచకొండ సంస్థాన పాలకుడైన రెండవ సింగ భూపాలుని ఆస్థానకవిగా ఉన్న **విశ్వేశ్వరుడు** (క్రీ.శ. 1320-1400) నారాయణపురం మండలానికి చెందినవాడు. సంస్కృత అలంకార శాస్త్ర గ్రంథకర్తలలో ప్రసిద్ధుడు. 'చమత్కార చంద్రిక', 'వీరభద్ర విజృంభణం' (డిమం), కరుణా కందళం' (అంకం) ఈయన రచనలు.

అల్లసాని పెద్దనకు ముందే ప్రప్రథమ ఆంధ్రకవితా పితామహునిగా పేర్కొనబడిన **కొరవి సత్యనారన** నారాయణపురం నివాసి. **పశుపతి నాగనాథుడు** (క్రీ.శ. 1340-1415) సంస్థాన్ నారాయణపురం నివాసి. రాచకొండను పరిపాలించిన పద్మనాయక రాజులలో మొదటి అనపోతానేని ఆస్థానంలో ప్రసిద్ధుడు. సంస్కృతంలో 'మదనవిలాస భాణము' తెలుగులో 'విష్ణుపురాణం' ఈయన రచనలు.

రాచకొండ సంస్థానంలోని మరో ప్రముఖ కవి **గౌరన** (క్రీ.శ.1380-145). ఈయన సంస్కృతంలో 'లక్షణదీపిక' అనే ఛందో గ్రంథాన్ని, తెలుగులో 'నవనాథ చరిత్ర', 'హరిశ్చంద్రోపాఖ్యానం' రచించాడు. ఈయన శ్రీనాథుని సమకాలికుడు. ఈయనకు 'సరస సాహిత్య లక్షణ విలక్షణుడు' అనే బిరుదు ఉంది.

**సర్వజ్ఞ సింగ భూపాలుడు** (క్రీ.శ. 1384-1399). ఈయన సంగీత, నాట్య మర్మజ్ఞులు, కవి, నాటకకారుడు. పలువురు కవి పండితులను పోషించాడు. ఇతడు సంస్కృతంలో 'రసార్ణవ సుధాకరం' అనే అలంకార గ్రంథం, 'సంగీత సుధాకరం', 'కందర్ప సంభవం' బాణం 'కువలయావళి (రత్న పాంచాలిక) నాటకం రాశాడు.

భువనగిరికి చెందిన **నాగేంద్రకవి** (క్రీ.శ. 1440) 'రమాధీశ్వర శతకం' రాశాడు. రాచకొండ సంస్థానంలోని భైరవుడు (క్రీ.శ 1420-1475) గౌరన కుమారుడు. ఈయన బంధకవిత్వం, చమత్కార కవిత్వానికి ఆద్యుడు. 'శ్రీరంగ మాహాత్మ్యం', 'రత్న పరీక్ష', 'కవి గజాంకుశం' అనేవి భైరవుని రచనలు.

కొలనుపాకకు చెందిన **విశ్వనాథయ్య** (క్రీ.శ.1650). ఇతడు 'సిద్ధేశ్వర పురాణం' ద్విపదలో రాశాడు. ఇందులో గొల్ల కురుమవంశం వారి పుట్టుక, వారి వ్యాప్తి గురించి చెప్పబడింది.

భువనగిరి సమీపంలోని ఉద్దమర్రికి చెందిన **వెంకటరాయకవి** (క్రీ.శ.1700) 'సర్వోపనిషత్సార సంగ్రహం' సంస్కృతంలో రచించాడు. ఇది అముద్రితం.

కొలనుపాకకు చెందిన **మల్లికార్జున సిద్ధయోగి** 'గౌడపురాణం'ను ద్విపద కావ్యంగా మలచాడు. ఇందులో గౌడ కులస్థుల పుట్టుక, వారి ప్రత్యేకత, కొలనుపాకలోని మల్లికార్జున దేవాలయ నిర్మాణాన్ని గూర్చి పేర్కొన్నాడు. కొలనుపాకకు చెందిన మరోకవి **రావూరి సంజీవరాయకవి** (క్రీ.శ. 1706-1800) మందళం గ్రామ నివాసి. ఇతడు వీరనారాయణ శతకం, వసుదేవనందన శతకం, రుక్మిణీ పరిణయం, త్రివిక్రమ విలాసం, భాగవతం 11,12 స్కంధాలు రాశాడు. ఆలేరుకు చెందిన మరోకవి **తిరువాయి వెంకటకవి** (క్రీ.శ. 1840). యాదగిరి నృసింహ శతకం, యాదగిరీంద్ర శతకం రాశాడు.

యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన కవులు సంస్కృతాంధ్ర భాషల్లో మంచి ప్రవీణులైనవారున్నారు. పద్యరచనలో, శతకంలో, రూపకం, యక్షగానం, బుర్రకథలు, కథలు, నవలలు, వచన గేయ కవితలు, పరిశోధనలు, జ్యోతిష, వాస్తువిద్యా ప్రవీణులు, సాహితీ సంస్థల నిర్వాహకులు, పత్రికలు మొదలైన అన్ని రంగాల్లో తమదైన రీతిలో రచనలు చేసి జిల్లా సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.

"బండెనుక బండి కట్టి పదహారు బండ్లు గట్టి ఏ బండ్లె పోతవు కొడుకో నైజాము సర్కరోడా" అని వీర తెలంగాణ సాయుధ పోరాటంలో నైజాముల, దేశ్ముఖ్ల గుండెల్లో గర్జన చేసిన **బండి యాదగిరి** పుట్టిన పోరుగడ్డ యాదాద్రి భువనగిరి జిల్లా. మోత్కూరు మండలం పాలడుగుకు చెందిన మరో విప్లవకవి, గాయకుడు **సుద్దాల హనుమంతు** (1908). పల్లెటూరి పిల్లగాడ, పసులగాసే మొనగాడా" పాటల పుస్తకం, 'వీర తెలంగాణ' అనే యక్షగానం రాశాడు.

నిరంతర పరిశోధనలతో తాను సేకరించిన శాసనాల ఆధారంగా మరుగునపడిన తెలంగాణ చరిత్రను వెలుగులోకి తెచ్చిన దార్శనికుడు **బి.ఎన్.శాస్త్రి**. మన తెలంగాణ చరిత్రను, సంస్కృతిని స్వీయ పరిశోధనల ఆధారంగా నిర్మించిన నిరుపమాన పాండిత్య సంపన్నుడు. వీరి స్వస్థలం వలిగొండ. సుమారు వెయ్యి శాసనాలను వెలికితీసి పరిష్కరించి

ప్రచురించారు. మూసీ పత్రిక వ్యవస్థాపకులుగా సాహిత్య సేవ చేశారు. సుమారు 70 గ్రంథాలను రచించారు. అందులో 3 జిల్లా సర్వస్వాలు, 9 నవలలు, 5 నాటికలు, భారతదేశ చరిత్ర 21 సంపుటాలు, ఆంధ్రదేశ చరిత్ర 3 సంపుటాలు, రాజ్య సర్వస్వాలు 2, ఒక జీవిత చరిత్ర, 12 శాసన సంపుటాలు ప్రచురించారు. విష్ణుకుండినుల రాజధాని వలిగొండ మండలం తుమ్మలగూడెం (ఇంద్రపాల నగరం) అని తామ్ర శాసనాలు వెలికితీసి నిరూపించారు. ఆదికవి నన్నెచోడుడని శాసనాధారాలతో నిరూపిస్తే, దాన్ని అంగీకరించక సిద్ధాంత వ్యాసాన్నే తిరగరాయాలన్న ఆచార్యుల మాటను అంగీకరించక తన పిహెచ్.డి పట్టానే వదులుకున్న మహోన్నతుడు.

సంస్కృతాంధ్ర వ్యాకరణమూర్తి, మహామహోపాధ్యాయ **ఆచార్య రవ్వా శ్రీహరి** యాదాద్రి జిల్లా వెల్వర్తి గ్రామస్థుడు. భాస్కర రామాయణంపై పరిశోధనతో పాటు తెలుగు, సంస్కృత భాషల్లో 50కి పైగా గ్రంథాలు రాసి సాహితీలోకానికి అందించాడు. హైద్రాబాద్ విశ్వవిద్యాలయ ఆచార్యుడుగా, ద్రవిడ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా పదవులు నిర్వహించారు. వ్యాకరణ పదకోశాలు, మాండలిక పదకోశాలు తయారు చేశారు.

**మండె సత్యనారాయణ** వందకు పైగా విప్లవ గీతాలు రాసిన భువనగిరి నివాసి. చౌటుప్పల్ మండలం పంతంగికి చెందిన బోయ జంగయ్య లోకం, గొర్రెలు, ఎచ్చరిక, దున్న వంటి 11 కవితా సంపుటాలు, 10 నవలలు రచించారు.

ఆలేరుకు చెందిన **డా॥ తిరునగరి** మానవత్వం నింపుకున్న కవి. పద్యాలు, కవిత్వం హృద్యంగా రాయడంలో ఆయనది అందెవేసిన చేయి. 'శృంగార నాయికలు', 'బాలవీర' వంటి 50కి పైగా రచనలు చేశారు. భారత్‌భాషా భూషణ్, కవి తిలకతో పాటు అనేక పురస్కారాలు అందుకున్నారు.

భువనగిరికి చెందిన **ఆచార్య ఎన్.గోపి** కవిత్వం ప్రత్యేకమైనది. నానీల సృష్టికర్తగా ప్రసిద్ధి పొందిన గోపి ప్రజాకవి వేమనపై పరిశోధన చేశారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా సేవలందించిన వీరు 'తంగెడుపూలు', 'వంతెన', 'చుట్ట కుదురు' 'నానీలు' వంటి అనేక రచనలు చేశారు. 'కాలాన్ని నిద్రపోనివ్వను' కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది. వీరి-'జలగీతం' అనేక భాషల్లోకి అనువదింపబడింది.

తన ఇంటినే సాహితీ కుటీరంగా మలచుకొని పల్లెపట్టుల్లో సాహిత్య పరిమళాలను వెదజల్లుతున్న సాహితీమూర్తి **డా॥ కూరెళ్ళ విఠలాచార్య**. నిర్నేములకు చెందిన వీరు వెల్లంకిలో స్థిర నివాసమేర్పరచుకున్నారు. 'తెలుగు గొలుసుకట్టు నవల' అనే అంశంపై పరిశోధన చేశారు. 'విఠలేశ్వర శతకం', 'స్మృత్యంజలి', 'తెలంగాణ కాగడాలు', 'వెల్లంకి వెలుగు' వంటి గ్రంథాలు వెలువరించారు. రామన్నపేట పరిసర ప్రాంతాల్లోని యువకవులను, రచయితలను ప్రోత్సహిస్తున్నారు.

**సుద్దాల అశోక్‌తేజ** సినీ గేయ రచయితగా వేలాది పాటలు రాసి తెలుగు ప్రజల్ని మెప్పించారు. 'ఠాగూర్' సినిమాలోని నేను సైతం పాటకు 2003లో జాతీయ ఉత్తమ గేయ రచయితగా పురస్కారం అందుకున్నారు. 'బతుకు పాటలు', 'వెలుగు రేఖలు', 'నేలమ్మ, నేలమ్మ' వీరి రచనలు.

యాదగిరి గుట్ట మండలానికి చెందిన **సంగిశెట్టి శ్రీనివాస్** నిర్విరామ పరిశోధకుడు, విమర్శకుడు, రచయిత. తెలంగాణ చరిత్రను తవ్వి అక్షరాల రాసులుగా పోసిన అక్షర యోధుడు. "సింగిడి" సాహిత్య సంస్థ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. 'వట్టికోట ఆళ్వారుస్వామి'పై పరిశోధన చేశారు. 'సిర్ఫ్ హైదరాబాద్ హమారా', 'దస్తూం' కథల సంపుటి వీరి రచనలు. 'షబ్నవీస్' 'తెలంగాణాలో తొలి తెలుగు పత్రిక 'శోధ్య చంద్రిక' అని నిర్ధారించారు. 'తెలంగాణ తొలితరం కథలు ముదిగంటి సుజాతారెడ్డి గారితో కలిసి వెలువరించారు. అనేక గ్రంథాలు రాసి పురస్కారాలు అందుకున్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు.

ఆలేరుకు చెందిన **ఎస్. హరగోపాల్** కలంనుండి 'మట్టి పొత్తిళ్లు', 'మూలకం' ' పాదాలని', 'గాలి అలల మీద నీ నవ్వు'... వంటి రచనలు వెలువడినవి. వచనకవిత్వంలో **తిరునగరి శ్రీనివాస్** కొత్తపుంతలు తొక్కుతున్నాడు. 'వెలుతురు వాహనం, 'జానపదం' వంటి పుస్తకాలు రాశాడు.

దిగంబర కవుల్లో ఇద్దరు ఈ జిల్లాకు చెందినవారే. **చెరబండరాజు** – దిక్సూచి, ముట్టడి, గమ్యం, కాంతియుద్ధం, జన్మహక్కు ఇతని రచనలు. **నిఖిలేశ్వర్** (కుంభం యాదవరెడ్డి) మండుతున్న తరం, దిగంబర కవుల 1,2,3 సంపుటాలు, 'గోడల వెనుక' హైదరాబాద్ అజ్ఞాత చరిత్ర... ఇలా పలు భాషల్లో ఈయన కవితలు అనువాదమయ్యాయి.

**పి.లక్ష్మీ నారాయణ** – 'సూర్యుని వాజ్ఞూలం', 'మనిషిని వెదుకుదాం' (కవిత్వం), 'అరచేతిలో సూర్యుడు' లాంటి కవితా సంపుటాలు రాశారు. భువనగిరికి చెందిన **మెరుగు వెంకటదాసు** మంచి కవి. చదువుకున్నది నాలుగవ తరగతే అయినా, అనేక గ్రంథాలు, శతకాలు రాసులుగా పోశారు. ఒక రకంగా చెప్పాలంటే వీరు పద్య నైవేద్యాన్నే వడ్డించారు.

వీరితోపాటు చిక్కారామదాసు, విరువంటి గోపాలకృష్ణ, మంగళగిరి యాదగిరి స్వామి , నర్సింహులు, బైరపాక స్వామి, జడల మల్లేశం, గొట్టిపాముల శంకర్, బండ జహంగీర్, అభినయ శ్రీనివాస్, దేవరాజు మహారాజు, అంజనిదాసు, అనంత శాస్త్రి, అనంతాచారి మోతుకూరి, భట్టరు అనంతాచార్య, మహమ్మద్ అబ్దుల్, తిరునగరి ఆంజనేయులు, సి.హెచ్. ఆంజనేయులు, తోట ఆనందరావు, ఉషాగౌడ్ చెరుకు, ఎల్లప్ప పున్న, ఏలె ఎల్లయ్య, జొన్న ఎల్లారెడ్డి, గుండా కేశవులు, ఆసూరి మరింగంటి కృష్ణమాచార్య, శ్రీరామ కవచం కృష్ణయ్య, కూరాకుల చంద్రన్న, ఆకవరం జగన్మోహనాచారి, మూర్తిగారి జగన్నాథం, సంపన్ముడుంబ జయ మోహనాచార్య, రావీటి దత్త గణేశ్వర సిద్ధాంతి, టి. ధర్మయ్యాచార్యులు, కేశవపట్నం నరసయ్య, ఆకెళ్ళ నరసింహ మూర్తి, నల్లీగ నరసింహాచార్య, గోవర్ధనం నరసింహాచార్య, నీలా జంగయ్య, కాటేపల్లి చంద్రారెడ్డి, ఎలబోయిన ఆంజనేయులు, చిక్కా శంకర్, మెరుగు మల్లేశం, వలందాస్ కైలాసం, గడ్డం మోహనరావు, సిద్దగౌని సుదర్శన్, పున్నం అంజయ్య, సాగర్ల సత్తయ్య, మెరుగు వెంకటదాసు, గడ్డం నర్సింహారెడ్డి, మెరుగు సదానందం, జెల్ల జహంగీర్, పండుగ ప్రభాకర్, లెక్కల మల్లారెడ్డి, కటుకం అంజయ్య, నక్క అండాలమ్మ, బల్ల గౌతమయ్య, ఏలె ఎల్లయ్య, పెసరు లింగారెడ్డి, కందాళ నరసింహాచార్యులు, పొనుగోటి నరసింహారావు, ఏనుగు నరసింహా రెడ్డి, మోతుకూరు నరహరి, పందరి శ్రీపాద, ప్రతాపరెడ్డి కాసుల, గోవర్ధనం పురుషోత్తమాచార్య, రావి ప్రేమలత, గోదాసు బాలయ్య, పోతంశెట్టి బాలయోగి, మైలారం బాలస్వామి, భాస్కర్ రెడ్డి జిట్టా, ఎల్లోజు బ్రహ్మాచారి, ఈగ బుచ్చిదాసు, మంగపల్లి బుచ్చి వెంకటాచార్యులు, బి. మల్లారెడ్డి, లెక్కల మల్లారెడ్డి, మల్లేశం, వెన్నకూచి మురళీధర శర్మ, చింతల యాదయ్య, నూగూరు రంగాచార్యులు, మాడభూషి రంగాచార్యులు, రంగానంద స్వామి, రఘుపతి వేదాటి, దీవి రమాదేవి, సటుకూరి రాజమౌళి, వెదిరె రామచంద్రారెడ్డి, భువనగిరి రామదాసు, రామమోహనా ఆచార్యులు, కందాళ, వల్లందాసు రామహరి, కొటూరి లక్ష్మణాచార్య, ముదుంబ వరదాచార్యులు, కత్రోజు విజయ్ కుమార్, రామోజు విశ్వనాథాచారి, వెంకట కృష్ణా రాయుడు అన్నగారి, ఉత్పల వెంకటరావు, కందుకూరి వేణు కుమార్, శరభలింగం పంతులు, మేడి శివకుమార్, శ్రీపాద శివప్రసాద్, నల్లీగ శ్రీనివాసాచార్య, తిరునగరి స్వామినాథన్, ఆత్మాన్ సుందర దేశికులు, చెరుకు సుధాకర్, రామోజు హరగోపాల్, బేతోజు సత్తయ్య, సీతారామానుజాచార్య, గొబ్బూరి గోపాలరావు, నాగపురి శ్రీనివాసులు, ఎర్రోజు బాల నర్సయాచారి, గుడిపల్లి వీరారెడ్డి, బండారు జయశ్రీ, చిక్కా విఘ్నేశ్వరి, మూర్తిగారి జనార్ధన్, లక్ష్మణాచార్యులు కాటూరి, గోవిందరాజుల గోవింద్, బోడ జగన్నాథ్, గడ్డం నరసింహారెడ్డి, కాచరాజు జయప్రకాశరావు, కస్తూరి లక్ష్మీనారాయణ, డొంకెన శ్రీశైలం గౌడ్, కాశివజ్జల మధుసూదనాచారి, చకిలం సురేందర్ రావు, మెరుగు

సదానందం, వెల్దుర్తి నవీన్, శెట్టి బాలయ్య యాదవ్, శ్రీపాద శివప్రసాద్, అనుముల ప్రభాకరాచారి, మల్లేశం మెరుగు, రచ్చా యాదగిరి, ఎర్రోజు బాలనర్సయ్య, పాల్వంచ హరికిషన్, శిక గణేష్ గౌడ్, సుతారపు వెంకట నారాయణ, పాండాల మహేశ్వర్, జిన్నం అంజయ్య, రెబ్బ మల్లికార్జున్, గుడిపల్లి వీరారెడ్డి, భట్టు సుధాకర్, బండ జహంగీర్, మైలారం సత్తయ్య, శెట్టి బాలయ్య యాదవ్, దయ్యాల బాలనర్సయ్య, గడ్డం నరసింహారెడ్డి మొదలైనవారు. ఇంకా ఎంతోమంది మరుగున పడిన కవులు, రచయితలు, సాహితీవేత్తలు ఈ జిల్లాలో వున్నారు.

## వివిధ రంగాల ప్రముఖులు

**రావి నారాయణరెడ్డి :** 1944 లో భువనగిరిలో జరిగిన 11 వ ఆంధ్ర మహాసభలకు అధ్యక్షులుగా వున్నారు. తెలంగాణ సంస్థానం భారత్‌లో విలీనం తర్వాత 1952 లో జరిగిన తొలి పార్లమెంటు ఎన్నికల్లో భారత ప్రధాని నెహ్రూ కంటే అత్యధిక మెజారిటీతో భువనగిరి నుంచి గెలుపొందారు.

**బి.ఎన్.శాస్త్రి :** తెలంగాణ చరిత్రలో, భారతదేశ చరిత్రలో ఈయన వెలికితీసిన, పరిష్కరించిన శాసనాలు చరిత్ర సాక్ష్యాలుగా నిలుస్తాయి. వీరు శాసనాల శాస్త్రిగా సమాజంలో గుర్తింపు పొందారు.

**బండి యాదగిరి** - 'బండెనక బండి కట్టి' పాట పాడిన ప్రజాకవి.

**ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి** - వీరు తెలంగాణ పోరాట యోధులు.

**రేణిగుంట రామిరెడ్డి** - నిజాం గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన యోధుడు.

**బొమ్మగాని ధర్మభిక్షం** - ప్రసిద్ధ కమ్యూనిస్టు యోధునిగా పేరుపొందారు. వీరి నాయకత్వంలో అనేక పోరాటాలు జరిగాయి. మాజీ పార్లమెంటు సభ్యులు.

వీరితోపాటు ఆదిలాబాదుకు చెందిన కొండా లక్ష్మణ్ బాపూజీ భువనగిరి ఎమ్మెల్యేగా పనిచేశారు. ఎలిమినేటి మాధవరెడ్డి హోంమంత్రిగా, మోత్కుపల్లి నర్సింలు ఎమ్మెల్యేగా, మంత్రిగా వున్నారు. డా॥ ఇటిక్యాల పురుషోత్తం నిజాం కళాశాలలో ప్రొఫెసర్‌గా వుంటూ జేఏసీ కో చైర్మెన్ వున్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలిగా విమలక్క, ప్రజాగాయిని బెల్లి లలితలుండగా, ప్రత్యూష, ఉత్తేజ్‌లు సినిమా రంగంలో వున్నారు. చింతకింది మల్లేశం, గజం అంజయ్య, ఆచార్య రవ్వా శ్రీహరి, డా. తిరునగరి, ఎన్.గోపి, ఆచార్య పి. లక్ష్మీనారాయణ, సుద్దాల హనుమంతు, కూరెళ్ల విఠలాచార్య వంటి ఎంతో మంది ఆణిముత్యాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఈ జిల్లా నిలిచింది.

## దర్శనీయ ప్రదేశాలు - పర్యాటకరంగం

**భువనగిరి కోట :** ఏకశిలపై వెయ్యేళ్ల క్రితం నిర్మించిన ఈ కోట పర్యాటకులను ఆకట్టుకుంటోంది. హైదరాబాదు నుంచి 51 కి.మీ. దూరంలో ఈ కోట వుంది. ఇది 500 అడుగుల ఎత్తులో, 40 ఎకరాల విస్తీర్ణంలో ఏకశిలపై అభేద్యమైన కోడిగుడ్డు ఆకారంలో వుంటుంది. ఈ నిర్మాణానికి రెండు ప్రవేశ మార్గాలుంటాయి. కోట చుట్టూ గల కందకం నేత తలపులు, ఆయుధ భాండాగారం, అశ్వ శాలలు, చెరువులు, బావులున్నాయి. ఈ కోటను తెలంగాణ ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసింది.

**కొలనుపాక :** ఈ పట్టణం చరిత్ర, మతాల సమ్మేళనం. 11 వ శతాబ్దిలో కల్యాణీ చాళుక్యులు కొలనుపాకను రాజధానిగా చేసుకొని పరిపాలించారు. ఇక్కడ అనేక దేవాలయాలతో పాటు రాష్ట్ర పురావస్తు శాఖ మ్యూజియం కూడా వుంది. ఇక్కడికి పర్యాటకులు దేశ విదేశాల నుంచి వస్తుంటారు. దీనికి 2000 సంవత్సరాల చరిత్ర వుంది.

**రాజపేట కోట :** చారిత్రక ప్రాధాన్యం గల ఈ కోటను కూడా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

**రాయగిరి గుట్టలు (పురుష శిలలు) :** హైదరాబాదు హుస్సేన్ సాగర్‌లోని జిబ్రాల్టర్ రాక్‌పై ఉన్న 57.9 అడుగుల

బుద్ధ విగ్రహం దేశ విదేశాల పర్యాటకులను ఆకట్టుకుంటోంది. ఆ బుద్ధ విగ్రహాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి గుట్టల నుంచి తీసుకెళ్ళడం విశేషం.

**పోచంపల్లి గ్రామీణ పర్యాటకం :** భూదానోద్యమానికి బీజం వేసిన ఈ మండలం, చేనేత వస్త్రాలకు పుట్టినిల్లుగా మనకు తెలుసు. అయితే ప్రస్తుతం ఇక్కడి గ్రామీణ పర్యాటకం అందర్నీ ఆకట్టుకుంటోంది. ఇక్కడి ప్రకృతిలోని అందమైన దృశ్యాలు తెలుగు సినీ పరిశ్రమకు లొకేషన్ స్పాట్‌గా మారాయి.

**బస్వాపూర్ జలాశయం :** మైసూర్‌లోని బృందావన్ ఉద్యానవనం తరహాలో బోటింగ్, లైటింగ్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది.

## దేవాలయాలు

**యాదాద్రి (యాదగిరి గుట్ట) :** తెలంగాణాలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రం. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఇక్కడ కొలువై వున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల యాదాద్రిగా నామకరణం చేసింది. వందకోట్ల రూపాయలు కేటాయించి అభివృద్ధి చేస్తున్నారు. హైదరాబాదు నుంచి 70 కి.మీ. దూరంలో వుంటుంది. ఈ దేవాలయానికి కింద లోటస్ టెంపుల్, పాత నరసింహ స్వామి దేవాలయం, మరోవైపు సురేంద్రపురి (కుందా సత్యనారాయణ శిల్ప కళాధామం) ఉన్నాయి. ఇక్కడ దేశంలోని అన్ని దేవతా మూర్తుల ప్రతిమలను ఒకేచోట ఏర్పాటు చేశారు.

**కొలనుపాక దేవాలయం :** దీనికి 2000 సంవత్సరాల చరిత్ర వుంది. ఇది అరుదైన జైన దేవాలయం. దేశ విదేశాల నుంచి పర్యాటకులను ఆకట్టుకుంటోంది. సోమేశ్వరాలయం, వీరనారాయణ స్వామి దేవాలయాలున్నాయి. కొలనుపాక ఆలయాలకు కర్ణాటక నుంచి వీరశైవ భక్తులు వస్తారు. అనేక రాజ వంశాలు వేయించిన శాసనాలు ఇక్కడ దొరుకుతాయి.

**పచ్చలగుట్ట సోమేశ్వరాలయం :** ఈ ఆలయం పర్యాటకులను విశేషంగా ఆకర్శిస్తోంది. భువనగిరి కోటను చూడడానికి వచ్చిన వారు ఈ ఆలయాన్ని సందర్శిస్తారు. అటు భువనగిరిలోనే 'రేణుకా ఎల్లమ్మ' ఆలయం వుంటుంది.

**తిరుమలనాథ స్వామి దేవాలయం :** బొమ్మల రామారం మండలం చీకటి మామిడి సమీపంలోని ఈ ఆలయం 800 సంవత్సరాల చరిత్ర కలిగి వుంది. ఇక్కడ శ్రీ వేంకటేశ్వర స్వామి స్వయంభుగా వెలిశాడని తెలుస్తోంది. దీన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి ప్రతిపాదనలు చేస్తున్నారు.

**సాయిధామం :** బొమ్మల రామారం మండలం పర్వతాపురం సమీపంలో వుంటుంది. ఇక్కడ శ్రీ శిరిడీ సాయి ఆలయం, వృద్ధ, అనాథాశ్రమాలతో పాటు ఒక పాఠశాల కూడా వుంటుంది. ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాలు కూడా జరుగుతాయి.

**రామలింగేశ్వర స్వామి ఆలయం, సుంకిశాల వెంకటేశ్వర స్వామి ఆలయం :** వలిగొండ మండలం తుమ్మల గూడెంలోని ఈ దేవాలయానికి భక్తుల తాకిడి పెరుగుతోంది. సుంకిశాల వెంకటేశ్వర స్వామి ఆలయం కూడా వలిగొండ మండలంలోనే వుండటం విశేషం.

మత్స్యగిరి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, చౌటుప్పల్ మండలంలోని మహదేవ్‌పురం ఆలయం, బీబీనగర్‌లోని అక్కన్న మాదన్న ఆలయాలు, విడిది కేంద్రాలు వున్నాయి. ఇలా యాదాద్రి పర్యాటక కేంద్రాలకు నెలవుగా మారుతోంది.

**హరిహర త్రిశక్తి క్షేత్రం :** ఈ మండలంలోనే శ్రీవిద్యాపురం ఆవరణలోని 'హరిహర త్రిశక్తి క్షేత్రం' కూడా వుంది. ఇక్కడి ప్రత్యేకత ఏమంటే కాళీ, లక్ష్మీ, సరస్వతి అమ్మవార్లు ముగ్గురు కూడా ఒకే పీఠంపై వుంటారు. వీరితో పాటు ఈ దేవాలయంలో ఇతరమైన తొమ్మిది దేవాలయాలు భక్తులకు కనువిందు చేస్తున్నాయి.

ఇలా యాదాద్రి భువనగిరి జిల్లా చారిత్రక, ఆధ్యాత్మిక కేంద్రాలకు నిలయంగా చెప్పవచ్చు. అందుకే ఇది పుణ్యభూమి.

# రాజన్న సిరిసిల్ల జిల్లా చిత్రపటం




220(9)



వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానం



నాంపల్లి గుట్ట



లోయర్ మానేరు డ్యాం



గుడూరు సీతారాం



మీద్దె రాములు



డా.సి.నారాయణ రెడ్డి



జుకంటి జగన్నాథం

220 (b)

# రాజన్న సిరిసిల్ల

వేములవాడలో వెలయు వేలుపు దీవెనలుల్లసిల్లగా
ధామములొప్పు పుణ్యముల దాల్పగ జేసి సమస్త ధాత్రికిన్
సేమములందుదేలి సిరిసిల్ల పరిశ్రమకెల్ల మూలమై
నోములపంటయై వెలుగు నూతన దీప్తులు కీర్తి నింపగన్ !

కొత్త జిల్లాల విభజనతో తెలంగాణ రాష్ట్ర పాలనా స్వరూపం మారిపోయింది. ప్రజల వద్దకే పరిపాలన అన్న సూత్రంతో ముఖ్యమంత్రి కేసీఆర్ పది జిల్లాలతో వున్న రాష్ట్రాన్ని పునర్విభజించారు. కొత్తగా 21 జిల్లాలను ఏర్పాటు చేయగా, మొత్తం జిల్లాల సంఖ్య 31 కి చేరింది. ఇందులో భాగమైన ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి విడిపోయి ప్రత్యేక జిల్లాగా అవతరించిన రాజన్న సిరిసిల్లా జిల్లా, కొత్తగా ఏర్పాటైన 21 జిల్లాలలో అతి చిన్న జిల్లాగా అవతరించి, చేనేతరంగంలో తనదైన ప్రత్యేకతను నిలుపుకుంటోంది.

**ఈ పేరెందుకు వచ్చింది?**

శాసనాల్లో ఈ ప్రాంతం పూర్వం సిద్ధశిలగ పేర్కొనబడింది. క్రమానుగత కాలాల్లో సిద్ధశిల కాస్తా శ్రీశిలగ, అదే సిరిశిలగ, సిరిసిల్లగా మార్పుపొందింది.

**భౌగోళిక స్వరూపం -విస్తీర్ణం – పరిధి**

సిరిసిల్లా జిల్లా 2,019 చ.కి.మీ. వైశాల్యాన్ని కలిగి వుంది. ఈ జిల్లాకు తూర్పున కరీంనగర్, పశ్చిమాన కామారెడ్డి, నిజామాబాదు జిల్లాలు, ఉత్తరాన జగిత్యాల, నిజామాబాదు జిల్లాలు, దక్షిణాన సిద్ధిపేట జిల్లాలు సరిహద్దులుగా వున్నాయి.

**సహజవనరులు**

ఈ జిల్లాలో సహజ వనరులు ముఖ్యంగా గ్రానైట్ వంటి ఖనిజాలు లభిస్తున్నాయి. ముఖ్యంగా ఇసుక, గ్రానైట్ ఖనిజాలు లభిస్తున్నాయి. పూర్వపు కరీంనగర్ జిల్లాలో నేలలు, అడవులు, నదులు, చెరువులు, ప్రాజెక్టులు అధికంగా వుండగా జిల్లా పునర్వ్యవస్థీకరణ కారణంగా ఇప్పుడు వాటి శాతం తగ్గిపోయింది. జిల్లాలో నాణ్యత లేని ఇనుప ఖనిజం కొంత మేరకు దొరకుతుంది. ఇది మేగ్నటైట్ క్వార్ట్‌జైట్‌తో కలిసి లభ్యమౌతుంది.

**నేలలు :** ఈ జిల్లా దక్కన్ పీఠభూమిలో విస్తరించి వుంది. ఎర్ర నేలలు ఈ జిల్లాలో అధికంగా వున్నాయి. ఇక్కడ గ్రానైట్ రాయి నిలువలు అపారంగా వుండటం వల్ల ఎర్ర నేలలు అధికం. దీనితో పాటు ఎక్కువ మోతాదులో నల్లరేగడి నేలలు కూడా వున్నాయి. ఈ నేలల్లో బంకమన్ను తక్కువగా వుండి, ఇసుక రేణువులు ఎక్కువగా వుంటాయి. అందుకే వీటిని ఎర్ర ఇసుక నేలలు అని అంటారు. 65% శాతం దుబ్బ నేలలు, 27% రేగడి నేలలు, 5% చెలక నేలలు, ఎర్రమట్టి నేలలు 45%, నల్లరేగడి నేలలు 55% వున్నాయి.

**అడవులు :** సిరిసిల్లా జిల్లా అడవుల విస్తీర్ణం 349.14 చ.కి.మీ. మేరకు విస్తరించి వున్నాయి. కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి, వీర్నపల్లి మండలాల్లో కొండలు, గుట్టలు, గిరిజన తండాలు, అటవీ ప్రాంతాలు ఎక్కువగా వున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం

**రెవిన్యూ డివిజన్లు - మండలాలు**

ఈ జిల్లాలో కొత్తగా ఏర్పాటైన నాలుగు మండలాలతో కలిసి మొత్తం 13 మండలాలున్నాయి. సిరిసిల్లా ఏకైక రెవిన్యూ డివిజన్. సిరిసిల్లా టౌన్ జనాభా పరంగా మున్సిపాలిటీ కిందికి రాగా, వేములవాడ నగర పంచాయితీ హోదాలో వుంది. చొప్పదండి (బోయినపల్లి మండలం), మానకొండూర్లు (ఇల్లంతకుంట మండలం) నియోజకవర్గాలు పాక్షికంగా ఈ జిల్లాతో సంబంధం కలిగి వున్నాయి.

**జిల్లాలోని మండలాలు :** 1. సిరిసిల్లా 2. ఇల్లంతకుంట 3. గంభీరావుపేట్ 4. ముస్తాబాద్ 5. ఎల్లారెడ్డిపేట్ 6. వేములవాడ, 7. వేములవాడ రూరల్ 8. బోయినపల్లి 9. కోనరావుపేట 10. చందుర్తి 11. రుద్రంగి (కొత్తది) 12. వీరన్నపల్లి (కొత్తది) 13. తంగళ్లపల్లి

కార్యక్రమంలో భాగంగా అటవీ విస్తీర్ణం పెంచాలని నిర్ణయించారు. ప్రజల కనీస అవసరలు తీర్చడానికి ఇటీవల సామాజిక అడవుల పెంపకం జిల్లాలో మొదలుపెట్టారు. అడవులు తక్కువగా వున్న కారణంగా ఇక్కడ వర్షపాతం తక్కువే. నైరుతి ఋతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తాయి.

**నదులు :** రాజన్న సిరిసిల్లా జిల్లా ప్రధానంగా మెట్టప్రాంతం. తక్కువ వర్షపాతం, పరిమిత నీటి వనరులున్న ప్రాంతం. ఇక్కడ గంభీర్రావుపేట, సిరిసిల్లా నుంచి ఎగుమ మానేరు నది, కోనరావు పేట, వేములవాడల నుంచి మూలవాగు నదులున్నాయి. పలుచోట్ల చెరువులు, చిన్నచిన్న వొర్రెలు, వాగులు, వంకలున్నాయి. ఎగువ మానేరు నదిపై మానేరు ప్రాజెక్టు నిర్మించారు. చీరులవాంచ గ్రామంవద్ద మధ్య మానేరు ప్రాజెక్టు నిర్మాణంలో ఉంది. ఇవి కేవలం వర్షాకాలంలోనే కళకళలాడుతుంటాయి.

**జనాభా**

2011 జనాభా లెక్కల ప్రకారం ఈ జిల్లా జనాభా 5,52,037. రాష్ట్ర జనాభాలో ఇది 1.74 శాతంగా వుంటుంది. ఇందులో పురుషులు 2,74,109 కాగా, మహిళలు 2,77,928 వున్నారు. జిల్లా జనసాంద్రత 273 గా నమోదైంది. జిల్లాలోని ప్రతి వెయ్యి మంది పురుషులకు 1014 మంది మహిళలున్నారు. జిల్లాలో గ్రామీణ జనాభా 4,35,145 మంది వుండగా, పట్టణ ప్రాంతాల్లో 1,16,892 మంది వున్నారు.

**జిల్లా చరిత్ర**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వెలసిన వేములవాడ దివ్య క్షేత్రం పౌరాణికంగా, చారిత్రకంగా నాటి నుంచి నేటి వరకు తన అస్తిత్వాన్ని చాటుకుంటూనే వుంది. క్రీ.పూ.6 నుంచి క్రీ.శ.4 వ శతాబ్దం వరకు వేములవాడ శాతవాహనుల పాలన కింద వుంది. శాతవాహన రాజుల పాలన ఇక్కడికి యాభై కి.మీ. సమీపంలో వున్న కోటి లింగాల నుంచే మొదలైంది. కోటిలింగాలకు సుమారు 2,500 వందల చరిత్ర వుంది. పూర్వ శాతవాహనులు, శాతవాహనులు ఇక్కడి నుంచే పాలన చేసి, తెలంగాణా తెలుగుజాతి వైభవాన్ని సాంస్కృతికంగా, సాహిత్యపరంగా అభివృద్ధి గావించారు. ఇక్కడి నుంచే హాల చక్రవర్తి రాసిన గాథాసప్తశతి, గుణాఢ్య పండితుడు రాసిన బృహత్కథలు వెలువడ్డాయి. క్రీ.పూ. వున్న 16 జనపదాల కాలంలో (ఈ జిల్లాలోని ప్రాంతం) వేములవాడ ప్రాంతం అశ్మక దేశంలో వుండేది. అంతేగాక త్రిలింగ దేశంగా చెప్పుకుంటున్న కాళేశ్వరం ఈ ఉమ్మడి జిల్లాలో వుండటం వల్ల ఈ ప్రాంతం పౌరాణికంగా, చారిత్రకంగా విశేషంగా నిలిచిపోయింది. అంతేగాక ఈ జిల్లా ప్రాంతానికి సుమారు పదివేల సంవత్సరాలకు పైగా చరిత్ర వుంది. ఇందుకు సాక్ష్యం వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాలలో నాంపల్లి గుట్ట సమీపంలో పాతరాతి యుగం, కొత్తరాతి యుగపు కాలానికి చెందిన బృహత్‌శిలా సమాధులు దొరికాయి. స్వర్గీయ ఠాకూర్ రాజారాంసింగ్ చారిత్రక

పరిశోధనల్లో ఇక్కడి అంశాలు వెల్లడయ్యాయి. ఇవి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్కియాలజీ చరిత్రలో నమోదు కావడం జరిగింది. వేములవాడ చాళుక్యులు క్రీ.శ. 7 వ శతాబ్దంలో అశ్మక రాజధాని బోధన్ నుంచి వేములవాడకు తమ రాజధానిని మార్చుకున్నారు. వేములవాడను రాజధానిగా చేసుకొని క్రీ.శ. 750 నుంచి క్రీ.శ. 973 వరకు సుమారు 223 సంవత్సరాలు పరిపాలన చేశారు. వేములవాడ ప్రాంతం తొలుత జైనంలో వుండేది, తదుపరి శైవంలోకి మారిందని చరిత్రకారులు చెబుతున్నారు. దానికి సాక్ష్యం వేములవాడ గుడిలో జైన దిగంబర విగ్రహాలు పలుచోట్ల కనిపించడమే. ప్రస్తుతం ఈ విగ్రహాలను తొలగించి వేములవాడ భీమేశ్వరాలయ ప్రాంగణానికి మార్చారు. వేములవాడ గుడిలోని ఐదు జైన్ చౌక్‌లను హైదరాబాదు బిర్లా సైన్స్, ఆర్కియాలజీ మ్యూజియంలోకి తరలించారు. రాష్ట్రకూటులతో సమాంతరంగా పాలన చేసిన వేములవాడ చాళుక్యులు మొదటి నుంచి దగ్గరి చుట్టరికపు సంబంధాలను కలిగియున్నారు. శాతవాహనుల తర్వాత తదుపరి ఈ నూతన జిల్లా ప్రాంతాన్ని ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, బాదామీ చాళుక్యులు, వేములవాడ చాళుక్యులు, కల్యాణీ చాళుక్యులు, పద్మనాయకులు, కాకతీయులు, ముసునూరి నాయకులు, విజయనగర రాజులు, బహమనీలు, కుతుబ్‌షాహీలు. మొగలులు, ఆసఫ్‌జాహీలు పరిపాలించారు. వేములవాడ చాళుక్యుల పరిపాలనా కాలం ముగిశాక, క్రీ.శ. 973 నుంచి 1189 వరకు సుమారు 216 సంవత్సరాలు కల్యాణీ చాళుక్యుల పరిపాలనలోకి వేములవాడ ప్రాంతం వచ్చింది. కన్నడ రాష్ట్రం బసవకళ్యాణిని రాజధానిగా చేసుకొని పాలించిన కళ్యాణీ చాళుక్యులు తమ సామంత రాజులను ప్రతినిధులుగా నియమించుకొని పరిపాలించారు. తర్వాత కాకతీయులు అధికారంలోకి వచ్చారు. కల్యాణీ చాళుక్యరాజు, త్రిభువన మల్ల ఆరవ విక్రమాదిత్యుడి క్రీ.శ. 1076-1126 పరిపాలనా కాలంలో వేములవాడ మహామండలేశ్వరుడైన రాజాదిత్యుడు క్రీ.శ. 1083 లో వేయించిన శాసనంలో వేములవాడలో తన పేరిట రాజాదిత్యేశ్వరాలయాన్ని కట్టించినట్లు ఉంది. ఇదే వేములవాడలోని ప్రధాన దేవాలయమై వుంటుందని వేములవాడ చరిత్రపై పరిశోధించిన జైశెట్టి రమణయ్య అనే చరిత్రకారుడు పేర్కొన్నాడు. జగదేక మల్ల రెండవ జయసింహుని క్రీ.శ. 1033 లో కేదారేశ్వరాలయ శాసనంలో చికరాజు రాజేశ్వరుని ప్రతిష్టించినట్లు వుందని ఇదే తదనంతర కాలంలో కేదారేశ్వరాలయమై వుంటుందని అభిప్రాయపడ్డారు. 1947 స్వాతంత్ర్యం వచ్చినా, నైజాం పాలన నుండి విముక్తి పొంద లేదు. అటు తర్వాత 1948 లో పోలీస్ యాక్షన్ తర్వాత, ఈ ప్రాంతం ప్రజా ప్రభుత్వాల ఆధీనంలోకి వచ్చింది.

**మున్సిపాలిటీలు** : సిరిసిల్ల,

**నగర పాలక సంస్థలు** : వేములవాడ

**రెవిన్యూ గ్రామాలు** : 171

**గ్రామ పంచాయితీలు** : 211

**పోలీస్ హెడ్‌క్వార్టర్స్** : సిరిసిల్ల

**పార్లమెంటు నియోజకవర్గం** : కరీంనగర్

**అసెంబ్లీ నియోజకవర్గాలు** : సిరిసిల్ల, వేములవాడ, మరియు పాక్షికంగా చొప్పదండి, మానుకొండూరు

## సంస్కృతి

### ఆచారాలు, సంప్రదాయాలు, పండుగలు :

వేదాల నుంచి, పురాణేతిహాసాల నుంచి, పెద్దల నుంచి సంక్రమించిన అనేక జీవన విధానాలను ఈ జిల్లా ప్రజలు ఆచరించి నైతిక ప్రవర్తనతో సంప్రదాయాలను నిలబెడుతున్నారు. సంప్రదాయంలో భాగమైన వివిధ పండుగలను, నోములను, వ్రతాలను, ఆచారాలను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకొని ఆధ్యాత్మిక జీవనంలో ముందుకు సాగుతున్నారు. వివిధ పండుగల ద్వారా కలిసి మెలిసి జీవించే తత్వాన్ని పెంపొందించుకుంటూ సమతా సమరసతలను, భక్తినీ, ధార్మికతను చాటుకొంటున్నారు.

మామూలుగా మన దేశంలో దేవునికి పూలను అర్పించడం సాధారణమే. కానీ మన తెలంగాణాలో మాత్రం ఆ పూలనే దైవంగా భావించి బతుకమ్మను జరుపుకుంటారు. అదేవిధంగా ఈ జిల్లాలో కూడా బతుకమ్మను విశేషంగా 7 నుంచి 12 రోజుల వరకు జరుపుకుంటారు. వేములవాడ ఆలయంలో జరిగే శరన్నవరాత్రుల ఉత్సవాలతో ఈ బతుకమ్మ పండగ ముడిపడి ఉంటుంది. జీవన వైవిధ్యాన్ని, సమిష్టి తత్వాన్ని, మహిళాశక్తిని ఈ పండుగ ద్వారా చాటుతారు. దసరా, దీపావళి, ముక్కోటి ఏకాదశి, సంక్రాంతి, ఉగాది, తొలి ఏకాదశి, వినాయక చవితి లాంటి పండుగలు హిందువులు జరుపుకుంటారు. శివరాత్రిని ప్రత్యేకంగా పెద్ద ఎత్తున జరుపుకుంటారు. ఎందుకంటే వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఈ జిల్లాలోనే వుంది కాబట్టి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ఘనంగా జరుపుకుంటారు. వీటితో బక్రీద్, రంజాన్, క్రిస్మస్ లాంటి పండుగలను కూడా జరుపుకుంటారు.

**కళలు :** సిరిసిల్ల అనగానే గుర్తుకొచ్చేది చేనేత కాళాకారులు. ఇక్కడ అధికశాతం ప్రజలు ఈ చేనేత రంగంపైనే ఆధారపడి జీవిస్తుంటారు. సిరిసిల్ల చేనేత కార్మికుడు దివంగత నల్ల పరంధాములు అగ్గిపెట్టెలో చీరను పెట్టి ప్రపంచ దృష్టిని ఆకర్షించాడు. వీరి కుమారుడు నల్ల విజయ్. జిల్లాలో ఎందరెందరో కళాకారులు జిల్లా ఖ్యాతిని నలుదిశలా వ్యాపించారు. వేములవాడ మండలంలోని అనుపురం అనే గ్రామం నకాషీ కళకు ప్రసిద్ధి. ఇక్కడ నకాషీ కళాకారుడు చంద్రయ్య ఈ కళకు జీవం పోశాడు. ఈ కళ సిద్దిపేట మండలం చేర్యాలకు చెందిన చంద్రయ్య మరణం తర్వాత వారి బంధువులు దీనిని కొనసాగిస్తున్నారు. బోయిన్‌పల్లి మండలం బూర్గుపల్లికి చెందిన కోట వైకుంఠం చిత్రకళలో ప్రసిద్ధులు. తెలంగాణ జానపద సంస్కృతిపై వీరు వేసిన చిత్రాలు దేశమంతటా కాకుండా విదేశాలలో ప్రదర్శించబడ్డాయి. ఒగ్గుకథా కళాకారుడు మిద్దెరాములు ప్రాంతీయంగా ప్రసిద్ధిచెందాడు. వీరు వేములవాడ మండలం హన్మాజీపేట వాస్తవ్యులు. వేములవాడ కర్ణాటక సంగీతంలో భాస్కర్ ప్రసిద్ధులు. సుద్దాల బాలయ్య, నమిలికొండ రాధిక, శ్రీనివాస్, జే.ఎన్.శర్మ, శంకర్‌గౌడ్‌లు గాత్ర కచేరీలు ఇస్తున్నారు. శ్రీమతి కందేపి రాణీప్రసాద్ ఆసుపత్రిలో వున్న వస్తువులు, పరికరాల ఆధారంగా ఎన్నో అద్భుతమైన చిత్రాలను వేశారు.

**జాతరలు :** ఈ జిల్లాలో వేములవాడలో ప్రతి మహాశివరాత్రికి ఐదు రోజుల జాతర వైభవంగా జరుగుతుంది. లక్షలాది మంది యాత్రీకులు దేవస్థానాన్ని సందర్శిస్తారు. దేవస్థానంలో మహా శివరాత్రికి మహన్యాసక పూర్వక లింగోద్భవ అభిషేక పూజలు, మహాలింగార్చన పూజలు, శివపార్వతుల జాగారాలు వైభవంగా జరుగుతాయి. ఈ ఆలయంలో శ్రీరామనవమి కల్యాణం, ఉగాది, దసరా, దీపావళి, కార్తీక, శ్రావణ మాస పూజలు వైభవంగా జరుగుతాయి. మార్గశిర మాసంలో ధనుర్మాస వ్రతం, మార్గళి పూజలు, అనంత పద్మనాభ స్వామి, శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో వైభవంగా జరుగుతాయి. శ్రీరామ నవమికి, రాజన్న కళ్యాణోత్సవాలలో రథోత్సవాలు వైభవంగా జరుగుతాయి.

సిరిసిల్ల విశ్వనాథ శివాలయంలో ప్రత్యేక పూజలు, జాతరా ఉత్సవాలు జరుగుతాయి. మామిడిపల్లి రామాలయంలో, నాంపల్లి లక్ష్మీనృసింహాలయంలో వైభవంగా కల్యాణోత్సవాలు జరుగుతాయి. బోయినపల్లి మండలంలోని విలాసాగర్ త్రికూటాలయంలో వైభవంగా శివరాత్రి జాతరా ఉత్సవాలు జరుగుతాయి. గ్రామాల్లో ఎల్లమ్మ సిద్ధోగాలు, ప్రతి శివరాత్రి ముందు ఇక్కడ బీరప్ప పట్నాలు జరుగుతాయి. గ్రామాల్లో ఒగ్గు కథల కోలాహలం వుంటుంది. బతుకమ్మ, బోనాలు ఆశ్వీయుజ మాసంలో, ఆషాఢమాసంలో వైభవంగా గ్రామగ్రామాన జరుగుతాయి. రుద్రంగి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతి సంవత్సరం కల్యాణోత్సవాలు కన్నుల పండుగగా జరుగుతాయి. వేములవాడ, బోయినపల్లి మండలాలలోని పది గ్రామాలు మధ్య మానేరు డ్యాంలో

మునిగిపోవడం వల్ల వాటి పునరావాస కాలనీలు కొత్తగా ఏర్పాటు అయ్యాయి. ఇక్కడ నూతన దేవాలయాల నిర్మాణాలు మొదలయ్యాయి. సిరిసిల్లాలో ప్రతి సంవత్సరం శ్రావణ పూర్ణిమకు నూల పున్నమి ఉత్సవాలు, మార్కండేయ జయంతిలు వైభవంగా జరుగుతాయి. ప్రతి సంవత్సరం మాఘశుద్ధ తదియ రోజున పద్మశాలీల గోత్ర స్థాపకుడైన మార్కండేయ జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. మాఘమాసంలో ఊరూర దేవాలయాలలో జాతరలు, ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి.

### పర్యాటక ప్రదేశాలు

జిల్లాలో వేములవాడ క్షేత్రం తర్వాత నాంపల్లి గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు. సి.హెచ్. విద్యాసాగర్ రావు కేంద్రమంత్రిగా వున్నప్పుడు 'కాళీయ మర్ధనం' ఘట్టాన్ని స్ఫురించేట్లు ప్రతిమను ఏర్పర్చారు. ఇది పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు, చర్లవంచ మధ్య ప్రాజెక్టు నిర్మాణ స్థలాలను మిషన్ కాకతీయలో భాగంగా వేములవాడ చెరువుతో పాటు వివిధ చోట్ల చెరువు బండలను విహారయాత్రా కేంద్రాలుగా అభివృద్ధి చేసే యోచనలో వుంది.

### దేవాలయాలు

హరిహర క్షేత్రంగా పేరొందిన వేములవాడలో ప్రధాన దేవాలయమైన శ్రీ రాజరాజేశ్వరాలయంతో పాటు రాజరాజేశ్వరీ దేవి, లక్ష్మీ గణపతి, అనంతపద్మనాభ స్వామి, సీతారామచంద్ర స్వామి, బాలరాజేశ్వరాలయం, రాజబోసు దర్గా, విఠలాలయం, కాశీవిశ్వేశ్వరాలయం, భీమేశ్వరస్వామి, బద్దిపోచమ్మ, నగరేశ్వరస్వామి, మహాలక్ష్మీ, సోమేశ్వర, బాలాత్రిపుర సుందరీ దేవి, దుర్గాలయం, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, దక్షిణామూర్తి ఆలయాలు, శృంగేరీ శంకరమఠము వున్నాయి. వేములవాడకు మూడు కి.మీ. దూరంలో వున్న నాంపల్లి గుట్ట లక్ష్మీనృసింహ స్వామి ఆలయం పర్యాటకంగా అభివృద్ధి చేశారు. ఇక్కడి దేవాలయ నిర్మాణాలను ఆధునీకరించారు.

### జిల్లా సాహిత్యం

వేములవాడ చాళుక్యులు వేములవాడను రాజధానిగా చేసుకొని, క్రీ.శ. 750 నుంచ 973 వరకు సుమారు 223 ఏళ్ళు పరిపాలన చేశారు. రెండవ అరికేసరి కాలంలో బోధన్ నుంచి వేములవాడకు రాజధాని మార్చబడింది. రెండవ అరికేసరి ఆస్థానంలో ఆస్థాన కవిగా వున్న తొలి కన్నడ పంప మహాకవి, పంప భారతం రాశారు. ఇక్కడి వాడైన పంపమహాకవి, కన్నడ భాషకు ఆది కవిగా పిలువబడు తున్నారు అంటే వేములవాడ ప్రసిద్ధి ఏమిటో తెలియవస్తున్నది. పంపమహాకవి తమ్ముడే జినవల్లభుడు క్రీ.శ. 946 లో వేములవాడకు సమీపంలోని కురిక్యాల వద్ద గల బొమ్మలమ్మ గుట్ట శాసనం తెలుగుకు ప్రాచీన హోదా రావడానికి ఎంతగానో ఉపయోగపడింది. అలాగే ఇక్కడి కోటి లింగాల లఘు శాసనాలు, నాణాలు పెద్దబొంకూర్‌లో దొరికిన శాతవాహన నాణాలు, ధూళికట్ట బౌద్ధ స్థూపం వంటివి ఎంతగానో ఉపకరించాయి. ఈ ఐదు కంద పద్యాలు నన్నయ కాలం నాటి కంటే వంద సంవత్సరాలు వెనకటివే. రెండవ అరికేసరి కాలంలో ఆస్థాన కవిగా వున్న పంపకవి ఆదిపురాణం, విక్రమార్జునీయం వంటి గ్రంథాలను రాశాడు. విక్రమార్జునీయ గ్రంథం పంప భారతంగా ప్రసిద్ధిచెందింది. అయితే ఈ గ్రంథం కన్నడలో రాయబడింది. నేటి వరకు తెలుగులోకి అనువాదం కాలేదని తెలిసింది. రెండవ అరికేసరి పుత్రుడైన వాగరాజు వేములవాడ ఉప రాజధాని గంగాధరను క్రీ.శ. 955-965 పాలిస్తున్న పరిపాలనా కాలంలో సోమదేవ సూరి అనెడి జైనకవి 'యశస్తిలక చంపూ' అనే చంపూ కావ్యాన్ని రాశాడు.

**వేములవాడ భీమకవి:** క్రీ.శ. 13 వ శతాబ్దిలోనే వేములవాడ భీమకవిగా ప్రసిద్ధిచెందిన వీరు వేములవాడలోనే నివసించి పలు రచనలు, చాటువులు రాసినట్లు తెలియు చున్నది. అప్పాలన్నీ కప్పాలయో.. అన్న భీమకవి పద్యపాదాలకు సాక్షిగా, ఇక్కడ అప్పాల వంశం వుంది. అంతేకాక క్రీ.శ. 966 వ నాటి కాలంలో నిర్మించిన

భీమేశ్వరాలయం వుంది. ఈ ఆలయం మూలవిరాట్టు అయిన రాజరాజేశ్వర స్వామి వారికన్నా ముందు నిర్మించబడిందని అంటారు. భీమకవి తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామం వాడని కొందరు కవి పరిశోధకులు వాదిస్తున్న వాదలను తెలంగాణ సాహిత్య పరిశోధకులు తోసిపుచ్చుతున్నారు. కొరవి గోపరాజు రాసిన సింహాసన ద్వాత్రింశిక కావ్యంలో వేములవాడ భీమకవి ప్రశస్తి వుంది. ఇతను రాసిన కవిజనాశ్రయం మాత్రం అందుబాటులో వుంది. మిగితావి అలభ్యం.

**శరభాంక కవి**: వీరు 14 వ శతాబ్దికి చెందినవారని శేషాద్రి రమణ కవుల అభిప్రాయం. శరభాంక కవి రాసిన రెండు గ్రంథాలలో ఒకటి శరభాంక లింగ శతకం లభ్యము. క్రీ.శ. 15 వ శతాబ్దికి చెందిన ఎలగందుల నారయ అనేడి కవి పోతన భాగవతంలోని చివరి రెండు స్కంధాలను అనువదించాడు. ఎలగందుల వేములవాడకు సమీప గ్రామం. 1934 లో గోల్కొండ పత్రిక సంపాదకులు వేసిన గోలకొండ కవుల సంచికలో వేములవాడ, సిరిసిల్ల కవులవి పది వరకు రచనలున్నవి. క్రీ.శ. 16,17 శతాబ్ది రచనలను పరిశీలిస్తే వేములవాడకు చెందిన సోమనాథకవి వసుచరిత్ర వ్యాఖ్యాతగా చతుర్భుజాభిషేకం, ధ్రువచరిత్ర, మరుత్సందేశం, ముద్రాలాభం, గంగాగౌరీ సంవాదము, వసుచరిత్ర వ్యాఖ్య అనే రచనలు చేసినట్లు తెలుస్తుంది.

**20వ శతబ్దపు కవులు**

నూతన జిల్లాకు చెందిన ఈతరం కవులను పరిశీలిద్దాం. వీరు పద్య కావ్యాలు, యక్షగానాలు, తత్వాలు, శతకాలు, ముక్తకాలు, నాటకాలు, సుప్రభాతాల వంటివి రాశారు. అప్పటి నిజాం రాజుపై కొందరు కవులు ప్రస్తుతించారు. మరికొందరు తెగిడారు. పౌరాణికాల అంశాలపై రాజుల చరిత్రలపై, ప్రకృతిపై వర్ణనలు చేస్తూ పద్య, కవిత్వాలు రాశారు.

**మధురకవి సాంబకవి** : వేములవాడకు చెందిన మధురకవి, బహుముఖ ప్రజ్ఞాశాలి మామిడిపల్లి సాంబశివ శర్మ వేములవాడ రాజన్నపై సుప్రభాతం రాసి చరితార్థు దయ్యాడు. వేములవాడ దేవస్థాన ఆస్థానకవిగా పనిచేశారు. అంతేకాక పలు రచనలు, కీర్తనలు, పద్యకావ్య ఖండికలు, బుర్రకథలు, యక్షగానాలు, పలు దైవతాలపై సుప్రభాతాలు రాశారు. ముక్తాహారము, లోభ సంహారము, అధిక్షేప పద్యకావ్యం, మధుర ఝుంకారము భక్తి కవితా సంపుటి, జయశ్రీ ఖండకావ్యం, భక్తి గీతములు, శ్రీ రాజరాజేశ్వర సుప్రభాతము, హిందీలోని పండిత రాధేశ్యాం రాసిన గేయ రామాయణ రచనకు తెలుగు సేత ద్విపద రామాయణ – బాలకాండము, సుందరకాండం. సంగీత సాహిత్యాల్లో, సంస్కృతాంధ్ర భాషల్లో మార్గదేశీ కవిత్వంలో, అధిక్షేప కవిత్వంలో సాంబకవి సవ్యసాచిగా పేరు తెచ్చుకున్నారు.

**ఐల్నేని గోపాలనాయుడు** : వేములవాడకి సమీపంలోని మూడపల్లి వీరి గ్రామం. వీరు శ్రీరామ శతకము, రఘువీర శతకము అనే రచనలు చేశాడు. గోలకొండ కవుల సంచికలో వీరివి రెండు పద్యాలు అచ్చయినాయి.

**నెమలికొండ శ్రీరంగాచార్య శాస్త్రి** : పూర్వ సిరిసిల్ల తాలూకాకు చెందిన జాగీర్ నారాయణపురం అష్టావధాని. వీరివి ప్రత్యేక రచనలు కనబడటం లేదు. వీరి అవధాన పద్యాల్ని సంకలనం చేస్తే కావ్యమవుతుందేమో!

**తిగుళ్ళ లక్ష్మణ శాస్త్రి** : వీరిది సిరిసిల్ల తాలూకా వదిరె గ్రామం. వీరు రామచంద్ర శతకం రాశారు.

**చక్రహరి అచ్యుతరాజు** : వీరిది సిరిసిల్ల పట్టణం. వీరి రచన శిరిశాల వేంకటేశ్వర స్వామి వారి శతకము. వేంకటేశ్వరా అనెడి మకుటంపై వీరు శతక పద్యాలు రాశారు.

**భట్టు అచ్యుతరాజు** : వీరిది సిరిసిల్ల తాలూకాలోని బందలింగాపురం. బంధగర్భ పద్యశతకం, జగన్మోహినీ నాటకం, అనంత శతకం, వీరి రచనలు ప్రస్తుతం అందుబాటులో లేవు.

**అమరవాది వేంకట నరసింహాచార్యులు** : వీరిది ముస్తాబాద్ మండల కేంద్రం. గోలకొండ కవుల సంచికలో వీరి పద్యాలున్నాయి.

**పండిత భావి కృష్ణశాస్త్రి** : వీరిది సిరిసిల్ల సమీపంలోని నారాయణపురం. వీరి కవిత్వాలు అచ్చులో లేకున్నా, వీరి పద్యాలు గోలకొండ కవుల సంచికలో లభ్యం.

**తిగుళ్ళ కృష్ణశాస్త్రి** : వీరిది సిరిసిల్ల సమీపంలోని పదిరె గ్రామం. వీరు భవభూతి రాసిన ఉత్తర రామచరిత్రం అనువదించారు. కానీ అలభ్యం. వీరి పద్యాలు గోలకొండ కవుల సంచికలో అచ్చయినాయి.

**పరవస్తు నెంబర్‌మాళ్** : సిరిసిల్లా సమీపంలోని గూడెం వాస్తవ్యులు. వీరు నాలుగైదు రచనలు చేశారు. కానీ అలభ్యాలు. వీరి పద్యాలు గోలకొండ కవుల సంచికలో వున్నాయి.

**అవునూరు వేణుగోపాల రావు** : గోలకొండ కవుల సంచికలో రెండు పద్యాలున్నాయి. వీరి అముద్రిత రచన జోహరాబాయి నవల. వీరిది అవునూరు గ్రామం.

**వటపురి వేంకట నరసింహాచార్యులు** : వీరిది సిరిసిల్ల పాత తాలూకా కందికట్కూర్ గ్రామం. వీరు సీతా చరిత్రము అనే పద్యకావ్యం అచ్చువేశారు. ఇందులో ఆశ్వాసాల పుస్తకంలో 700 వరకు పద్యాలున్నాయి. వీరి పద్యాలు గోలకొండ కవుల సంచికలో ప్రచురించబడ్డాయి.

**డా.సి. నారాయణ రెడ్డి** : వీరు హన్మాజీ పేటలో జన్మించారు. అచ్చమైన తెలుగు నుడికారం తెలిసిన అచ్చమైన తెలంగాణ భాషాకవి. ఆచార్యుడిగా, ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం అధ్యక్షులుగా, సార్వత్రిక, తెలుగు యూనివర్శిటీల వీసీగా, రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సలహామండలి ఛైర్మన్‌గా, తదుపరి దీనికి సలహాదారుగా, రాజ్యసభ సభ్యునిగా, తెలంగాణా సారస్వత పరిషత్తుకు అధ్యక్షులుగా వివిధ హోదాల్లో పనిచేశారు. అంతేకాక 3,500 సినిమా పాటలు రాశారు. వీరు సాహిత్యంలో విశిష్టమైన జ్ఞానపీఠ అవార్డు (విశ్వంభర) పొంది తెలంగాణ కీర్తి బావుటాలను ఎగురవేశారు. **"ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయములు"** అనే అంశంపై వీరు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు.

**డా.జె. బాపురెడ్డి** : ఉన్నత విద్యావంతుడు, సాహిత్య కారుడైన వీరిది సిరికొండ గ్రామం. ఉస్మానియాలో ఎం.ఏ ఆర్థిక శాస్త్రం చదివి, ఐఎఎస్ సర్వీసులో చేరి, వివిధ హోదాల్లో పనిచేశారు. తెలుగు, సంస్కృతంలోకి 40 వరకు రచనలు చేశారు. చైతన్య రేఖలు, రాకెట్టు రాయబారం, హృదయ పద్యం, బాపురెడ్డి గేయాలు, బాపురెడ్డి గేయనాటికలు, శ్రీకార శిఖరం (గేయ సంపుటి), నా దేశం నవ్వుతూంది (గేయం), మనస్సులో మాట (వ్యాస సంపుటి), మన చేతుల్లోనే వుంది (వచన కవిత్వం), రంగురంగుల చీకట్లు (వచన కవిత్వం), వాడిపోని వసంతాలు, సౌదామినీ కవితలు మొదలైనవి రచించారు. వీరికి ఏపీ సాహిత్య అకాడమీ అవార్డు, మైఖేల్ మధుసూదన అవార్డు మొదలైన అవార్డులు లభించాయి.

**డా.వడ్డేపల్లి కృష్ణ** : ప్రముఖ గేయ కవిగా, సినీ పాటల రచయితగా, కథా రచయితగా ప్రసిద్ధులు. వీరిది సిరిసిల్లా. వీరి కార్యక్రమాలు ఆకాశవాణి, దూరదర్శన్, వివిధ ఛానల్స్‌లో ప్రసారం అయ్యేవి. లలిత గీతాలు అనే అంశంపై ఉస్మానియా నుంచి పిహెచ్‌డి పొందారు. 1981 లో ఆంధ్రజ్యోతి ఉగాది కథల పోటీలో, 1992 లో తెలుగు విశ్వవిద్యాలయం బాల సాహిత్యపు పోటీలో రచనలో గెలుపొందారు. గేయ కిరీటి అనే బిరుదు పొందారు. కనరా నీ దేశం, అంతర్మథనం, వెలుగుమేడ, వసంతోదయం, రాగరథం, హాలాహలం, మనసా తెలుసా, చిరుగజ్జెలు, వంటివి రచించారు.

**వేదాంతం కాశీనాథం** : వీరు వేములవాడ వాస్తవ్యులు. పద్యకవిగా రాణించారు. గొడగూచి అనే పద్యకావ్యం, ముకుంద మాల ఆంధ్రానువాదం, శ్రీ రాజరాజేశ్వర శతకం, శ్రీరామపాదక నాటకం, వలపుటీల ఖండకావ్యం, కాశీనాథ గేయమాల, వేములవాడ భీమకవి నాటకం, గ్రామోద్ధరణ నాటకం, ఏకపాత్ర, విద్యార్థి బుర్రకథ, కథలు, గాథలు, పద్యాలు రాశారు.

అలాగే వేములవాడకు చెందిన వజ్జల సాంబశివశర్మ, నందగిరి అనంతరాజ శర్మ, కేశన్నగారి రాజశర్మ, వఝుల

చంద్రయ్య శాస్త్రులు, కోరుట్ల నరసింహాచార్యులు, బ్రహ్మనగారి నరహరి శర్మ వంటి వేములవాడ సనాతన కవులు తమ వివిధ రచనల ద్వారా తమ ప్రతిభ చాటుకున్నారు. వీరితో పాటు పురాణం రామచంద్ర, గోవర్ధన్ యాదవ్, యాదవ్, నాగభూషణం, సుద్దాల బాలయ్య, గర్శకుర్తి సురమౌళి, మునుగోటి కృష్ణమూర్తి, మిద్దె రాములు, గూడూరి సీతారాం, జి. రాములు మొదలైన వారు కూడా వున్నారు.

**గర్శకుర్తి సురమౌళి** : వీరు కథా రచయిత, వ్యాస రచయిత. ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో ప్రాంతీయ వార్తలు చదివే జర్నలిస్టుగా పనిచేశారు. వీరి స్వగ్రామం వేములవాడ. వీరు రాసిన కథలను సంకలన పరిచి సంగిశెట్టి శ్రీనివాస్ ఇటీవల సురమౌళి కథల పేరిట ఒక కథాపుస్తకం అచ్చువేశారు.

**దూడం నాంపల్లి** : సిరిసిల్ల ప్రముఖ పద్యకవిగా, సిరిసిల్ల సాహితీ సమితి వ్యవస్థాపక కార్యదర్శిగా పనిచేశారు. తెలుగు పండితునిగా ప్రభుత్వ ఉద్యోగం చేసి, రిటైరయినారు. పద్యకవితా సదస్సు జిల్లా శాఖ అధ్యక్షులుగా, సాహితీ గౌతమి ప్రచార కార్యదర్శిగా, సిరిసిల్ల సుందర్ సత్సంగ్ సభ్యులుగా పనిచేశారు. 20 వరకు కావ్య రచనలు చేశారు. 1990 లో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి హరికథా సాహిత్య పురస్కారం అందుకున్నారు. శిష్య ద్విశతి, జీమూత వాహనుడు, భూమిక, పరశురామ ప్రీతి, ద్యయినాదం మొదలగు పద్య కృతులు రాశారు. శకుంతల, పాండవ జననం, హరికథలు, పాండవ అజ్ఞాత వీధి నాటిక, అభినందన చందనం గేయ సంపుటి, పాటల పల్లకి పాటల పేటిక, సాహితీ సమదర్శనం షష్టిపూర్తి సంచిక, జై నానీ – జైజై నానీ అనే గల్పిక రాశారు.

**డింగరి నరహరి ఆచార్య** : వేములవాడ మండలం మల్లారం వాస్తవ్యులు. వివిధ ప్రక్రియలలో పలు గ్రంథాలు రాశారు. కరీంనగర్ డిగ్రీ కళాశాల తెలుగు ఉపన్యాసకులుగా రిటైరయ్యారు. వానమామలై జగన్నాథాచార్యుల రచనపై పి.హెచ్.డి. చేశారు. సుభద్రా పరిణయం గేయకావ్యం వీచిక వ్యాస సంపుటి, వేళ్ళు వచన కవితా సంకలనం, అభిరామం వంటి రచనలు చేశారు. శతకసుధ, పద్యరచన, జగద సంస్కృత అనువాద కథలు రాశారు.

**డా.నలిమెల భాస్కర్** : ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపురంలో జన్మించారు. వీరు బహు భాషావేత్తగా, తెలంగాణ పదకోశ రచయితగా, కవిగా, వ్యాసకర్తగా, అనువాదకునిగా, కథా రచయితగా సుప్రసిద్ధులు. వీరి అనువాద సాహిత్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ వారి పురస్కారం లభించింది. వీరు మళయాళం నుంచి తెలుగులోకి అనువదించి రాసిన 'స్మారక శిలలు' అనే నవలకు ఈ పురస్కారం లభించింది. అంతేగాక అద్దంలో గాంధారి అనే అనువాద కథా సంకలనానికి తెలుగు యూనివర్శిటీ పురస్కారం లభించింది. తెలంగాణ పదకోశ రచనను చేసి, తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచారు. ప్రస్తుతం ఇది పదివేల పదాలు దాటిపోయాయి. వీరికి 14 భాషల్లో ప్రావీణ్యం వుంది. మానవుడా, కిరణాలు, ఈతరం పాటలు, నూరేళ్ళ పది ఉత్తమ మలయాళ కథలు, అద్దంలో గాంధారి మరి పదకొండు కథలు, సాహితీ సుమాలు, తమిళ్ తోటత్తిల్ తెలుంగు, తెలంగాణ పదకోశం, వంద మరియు 13 కథలు, మట్టి ముత్యాలు, నానీలు, బాణ సాహిత్య వ్యాసాలు, సుద్దముక్క కవిత్వం, భారతీయ సాహిత్య వ్యాసాలు, భారతీయ కథలు, దేశ విదేశాల సాహిత్యం, భారతీయ సామెతలు, స్మారక శిలలు మొదలైనవి రాశారు.

**వజ్జల శివకుమార్** : వీరు వేములవాడలో జన్మించారు. జింబో, వారాల ఆనంద్, మంచె సత్యనారాయణ, చంద్రమౌళి, జోగారావు లాంటి ఇతర వ్యక్తులతో కలిసి 'నటరాజ కళానికేతనాన్ని' స్థాపించారు. ఒకటిన్నర దశాబ్దం వరకు వేములవాడ, కరీంనగర్, ఎల్లారెడ్డిపేట, సిరిసిల్లాలో సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారు. గోగుపూవు,

పాలకంకుల కల, దాఖలా, కలల సాగు తదితర వచన కవిత్వాలను అచ్చులోకి తెచ్చారు. కుందుర్తి ఫీవర్స్ ఫ్రంట్ పురస్కారం అందుకున్నారు.

**మంగారి రాజేందర్ (జింబో)** : వీరు వేములవాడ వాస్తవ్యులు. వీరు జింబోగా ప్రసిద్ధులు. వివిధ ప్రక్రియల్లో సవ్యసాచియై, పలు రచనలు చేస్తూ ప్రసిద్ధిచెందారు. ఉస్మానియా నుంచి న్యాయవాద పట్టా పుచ్చుకొని, జర్నలిజం చేసి, న్యాయవాదిగా, తదుపరి జ్యూడీషియల్ సర్వీస్‌లో చేరి జిల్లా న్యాయమూర్తి హోదాలో రిటైరయ్యారు. వీరు హాజిర్‌హై, రూల్ ఆఫ్ లా, లావొక్కింతయు లేని కథలు న్యాయవాద సంబంధమున్న సాహితీ రచనలే కావడం విశేషం. హాజిర్ హై, రెండక్షరాలు, లోపలి వర్షం, చూస్తుండగానే వీరి కవితా సంపుటాలు. రూల్ ఆఫ్ లా, జింబో కథలు, మా వేములవాడ కథల పేర్లతో మూడు కథా సంపుటాలు వచ్చాయి.

**మిద్దె రాములు** : వీరు ఒగ్గుకథా దిగ్గజం. వీరు ఒగ్గు కథ మొదలుపెడితే ఊర్లకు ఊర్లే కదిలివస్తాయి. పురాణాల కథల్ని ఒగ్గు కథలుగా, అశువులుగా మలుచుకొని దాదాపు రెండు వందలకు పైగా కథలు చెప్పే సామర్థ్యం వీరికున్నది. వీరు 20 వేలకు పైగా ఒగ్గు కథలు చెప్పారని అంటారు. 2009 లో జరిగిన వీరి ఒగ్గు కథా స్వర్ణోత్సవాలప్పుడు ఇతనికి 'ఒగ్గుకథా సమ్రాట్' అనే బిరుదును ప్రదానం చేశారు.

**గూడూరి సీతారాం** : తొలి కథా సాహిత్యకారుడిగా వీరికి పేరుంది. వీరు సిరిసిల్లలో స్థిరపడ్డా, వేములవాడ హన్మాజీపేటలో జన్మించారు. వీరు 1953-1963 మధ్య రాసిన కథలు వివిధ పత్రికల్లో వచ్చాయి. వీరు ఎనభై అయిదు కథలు, రెండు నవలికలు రాశారు. ప్రస్తుతం వీరి కథలు 14 మట్టుకే దొరుకుతాయి. వీటిని సిరిసిల్లా మానేరు రచయితల సంఘం వారు గూడూరి సీతారాం కథల పేరుతో ఒక సంకలనం తెచ్చారు. 'కానుగ చెట్టు' అనే పేరు మీద వీరి సాహితీ జీవిత స్వర్ణోత్సవ సంచిక వెలువడింది. గూడూరి సీతారం కథల పరిశోధనం అనే పేరిట 2009 లో ఒక పుస్తకం వెలువడింది.

**జూకంటి జగన్నాథం** : వీరు సిరిసిల్లా వాస్తవ్యులు. సిరిసిల్ల సెస్‌లో అకౌంటెంట్‌గా చేసి రిటైరయ్యారు. కథకుడిగా, అభ్యుదయ కవిగా, కవిగా, వ్యాసకర్తగా వీరు ప్రసిద్ధులు. తెలంగాణా రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షులుగా కీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం ఆల్ ఇండియా తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షునిగా పనిచేస్తున్నారు. 1993 లో పాతాళ గరిగే కవిత్వంలో తొలి కవిత్వాన్ని వెలువరించారు. గంగడోలు, పాతాళగరిగె, వాస్కోడిగామా డాట్‌కాం ఇలా 11 కవితా సంకలనాలు వెలువరించారు. ఈ 11 కవితా సంకలనాలు 2012 లో మూడు కవితా సంపుటాలుగా ముద్రించబడ్డాయి.

**పెద్దింటి అశోక్ కుమార్** : వీరు కథా, నవలా, వ్యాస రచయితగా స్థిరపడ్డారు. వీరు రాసిన 'జిగిరి' నవల పాపులర్ అయ్యింది. ఈ నవల తొమ్మిది భాషల్లోకి అనువాదమై, సంచలనం సృష్టించింది. దీనికి తెలుగు యూనివర్శిటీ ప్రతిభా పురస్కారం లభించింది. ఇంతవరకు 6 నవలలు, 200 కథలు, 35 వ్యాసాలు రాశారు. 'దాగుడు మూతలు దండాకోర్' అనే సినిమాకి పాటలు రాశారు. ఎడారి మంటలు, దాడి, జిగిరి, ఊరికి ఉప్పులం, సంచారి, లాంగ్‌మార్చ్ అనే ఐదు నవలలు రాశారు. ఊటబావి, వలస బతుకులు, మావూరి బాగోతం, మాయిముంత, భూమదు, పోరుగడ్డ, జుమ్మేకి రాత్ అనే ఏడు కథా సంపుటాలు వెలువరించారు.

**పత్తిపాక మోహన్** : బాల సాహిత్యానికి చాలా కృషి చేస్తున్నారు. వీరు సిరిసిల్ల వాస్తవ్యులు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి యువజన పురస్కారం అందుకున్నారు. సిరిసిల్లా మానేరు రచయితల సంఘంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేసి, గూడూరి సీతారాం కథలను వెలికి తీసి ప్రచురించారు.

తొలితరం రచయిత రాములు రాసిన పెరటిచెట్టు వంటి తొలితరం కథా రచయితల సంకలనాలను అచ్చులోకి తీసుకొచ్చారు. తెలుగులో 'గజల్' ప్రక్రియపై సమగ్ర పరిశీలన అనే అంశంపై పిహెచ్.డి. చేశారు. ప్రస్తుతం నేషనల్ బుక్‌ట్రస్టు తెలుగు విభాగానికి సహాయ సంపాదకులుగా వున్నారు. బంతిపూలు (కవిత్వం), నేతన్నల ఆత్మహత్యలపై 'తెగిన పూవు' దీర్ఘ కవిత్వం రాశారు. 2013 లో చందమామ రావే గేయాలకు బాల సాహిత్య పురస్కారం వచ్చింది. పిల్లల కోసం 15 పుస్తకాలను అనువదించారు.

**సాహితీ సంస్థలు**

ఈ జిల్లాలో వేములవాడ నటరాజ కళానికేతన్, కళాభారతి, స్ఫూర్తి వంటి సాహితీ సంస్థలు చురుకుగా పనిచేస్తున్నాయి. నటరాజ కళానికేతన్ శాఖ ఎల్లారెడ్డిపేటలో ఏర్పడింది. సిరిసిల్లలో సిరిసిల్ల సాహితీ సమితి, మానేరు రచయితల సంఘం, వివేక రచయితల సంఘం వంటివి చురుకుగా పనిచేస్తున్నాయి. గంభీరావుపేట, బోయిన్‌పల్లి, రుద్రంగి వంటి చోట్ల సాహితీకారులు తమ సాహితీ సంస్థలను నడుపుతున్నారు.

**జిల్లా రంగాల ప్రముఖులు**

వేములవాడ సీపీఐ పార్టీ నాయకులు సి.హెచ్. రాజేశ్వర రావు 5 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. చొప్పదండి నియోజకవర్గం నుంచి కూడా ఒకసారి ఎన్నికయ్యారు. వీరు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రధాన కార్యదర్శిగా పనిచేసి జైలుపాలయ్యారు.

వీరి సోదరులు బీజేపీ నాయకులైన సి.హెచ్. విద్యాసాగర్ రావు రాజకీయ రంగంలో దిట్ట. వీరు మెట్‌పల్లి నుంచి మూడు పర్యాయాలు ఎన్నికయ్యారు. కరీంనగర్ నుంచి ఎంపీగా ఎన్నికై వాజ్‌పాయ్ ప్రభుత్వంలో కేంద్ర హోంశాఖా సహాయ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం వీరు మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరి మరో సోదరులు సి.హెచ్. హనుమంతరావు ఆర్థికవేత్తగా ప్రసిద్ధిచెందారు. వీరు ప్రణాళికా సంఘం సభ్యులుగా పనిచేశారు. కేంద్ర ప్రభుత్వానికి ఆర్థిక సలహాలు ఇస్తుంటారు. తెలంగాణ సాయుధ పోరాటంలో బద్దం ఎల్లారెడ్డి ముఖ్య నాయకులు. వీరు ఎంపీగా (రాజ్యసభ) పనిచేశారు. సిరిసిల్లా నుంచి రాజలింగం, రుద్ర శంకరయ్య, కొండ శంకరయ్య, కేటీఆర్ రాష్ట్ర మంత్రిగా, చెన్నమనేని రమేష్ శాసనసభ్యులుగా వున్నారు. వీరితో పాటు జాతీయ భావాల ప్రతినిధిగా ప్రతాప రామకృష్ణ వేములవాడలో క్రియాశీలకంగా వున్నారు.

మరమగ్గాలకు, చేనేత పరిశ్రమకు ప్రసిద్ధి చెందిన ప్రాంతం ఇది. రాష్ట్రంలో ప్రముఖమైన దేవస్థానమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి కొలువైన ప్రాంతమిది. ఈ జిల్లా రాజన్న స్వామి దివ్యాశీస్సులతో జిల్లా మంచి అభివృద్ధి పథంలో కొనసాగుతూ ఉంది.

# రంగారెడ్డి జిల్లా చిత్రపటం








చిలుకూరు బాలాజీ దేవస్థానం



మైసిగండి మైసమ్మ



ప్రొ. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం



గండిపేట్



జహంగీర్‌పీర్ దర్గ



శంషాబాద్ విమానాశ్రయం



బురుగుల రామకృష్ణ రావు

230 (b)

# రంగారెడ్డి

**యోధుల పోటుగడ్డ జనతోదయకృత్య విలాస హాసయై**
**బోధల దీరినట్టి గురు పూజ్యధరాతలి సంస్కృతి ప్రభా**
**రాధిత దేవతాలయము రంగము దాల్చిన రాణ్మయంబునై**
**యీ ధరణిన్ కళామయిగ హేలల వెల్గును పుణ్యభూమిగా !**

**2**016 లో జిల్లాల పునర్విభజనలో రంగారెడ్డి జిల్లా రూపు రేఖలు మారిపోయాయి. అయినా ఇప్పటికీ ఇది హైదరాబాదు పరిసరాల్లోని గ్రామీణ జిల్లాయే. అయితే హైదరాబాదు నగర నగరీకరణ ప్రభావానికి గురౌతున్న జిల్లాయే. నగరం పరిసరాల్లో పండే పంటలు, కూరగాయలు, పాలు ఇంకా అనేకానేక ఖాద్య పదార్థాలు హైదరాబాదు, సికిందరాబాదు నగరాలకు వస్తాయి. హైదరాబాదుకు అన్నం పెడుతోన్న జిల్లాల్లో రంగారెడ్డి ఒకటి.

**ఈ పేరెందుకు వచ్చింది?**

హైదరాబాదు సంస్థానం 1948 సెప్టెంబరు 17 న నిజాం నుంచి విముక్తి పొందింది. దేశంలోని అన్ని ప్రాంతాలు 1947 ఆగస్టు 15 న స్వాతంత్ర్యం పొందితే, 13 నెలలు ఆలస్యంగా హైదరాబాదుకు స్వాతంత్ర్యం లభించింది. ఆ హైదరాబాదు రాష్ట్రంలో హైదరాబాదు రాజధానే గాక అదొక జిల్లా కూడా. ఆ జిల్లా చుట్టూరా ఉన్న గ్రామాలకు, గ్రామీణులకు సరియైన సౌకర్యాలు అందడం లేదనే వాదన ఒకటి వినబడుతున్న దశలో నాటి ప్రభుత్వం ప్రజాభిప్రాయం మేరకు, హైదరాబాదు పరిసరాలను ఆ జిల్లా నుంచి విడదీసి కొత్త జిల్లా ఏర్పర్చింది.

1978 ఆగస్టు 15 న యేర్పడిన ఈ జిల్లాలోకి మహబూబునగర్ తదితర జిల్లాల నుంచి కొన్ని గ్రామాలు చేరాయి. ఈ జిల్లాకీ పేరు పెట్టడానికి కొంత నేపథ్యముంది. హైదరాబాదు రాష్ట్ర ప్రప్రథమ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, ఆయన మంత్రివర్గంలో శ్రీకొండా వేంకట రంగారెడ్డి ఒకరు. ఆంధ్రప్రదేశ్ అవతరణ అనంతరం నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయినపుడు ఆయన మంత్రివర్గం లోనూ వారు ఉన్నారు. ఆయన రాష్ట్రానికెంతో సేవ చేశారు. విద్యాలయాలు, వసతి గృహాలు, గ్రంథాలయాలు నెల కొల్పారు. వారి అధ్యయన కాలంలో అందరి మీదా ఉర్దూ పెత్తనం చెలాయించినా, స్వాతంత్ర్య ప్రాదుర్భావం తర్వాత తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల వికాసం నిమిత్తం రంగారెడ్డి ఎంతో శ్రమించారు. వారు మంత్రిగానే కాకుండా, కొన్నాళ్లు ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆ రంగారెడ్డి పేరుతో ఈ జిల్లా ఏర్పడింది.

**భౌగోళిక స్వరూపం – విస్తీర్ణం – పరిధి**

రంగారెడ్డి జిల్లా $16^0$ – 30 నుంచి $18^0$ – 20 ఉత్తర అక్షాంశం మరియు $77^0$ – 30 నుంచి $79^0$ – 30 తూర్పు రేఖాంశాల మధ్య విస్తరించి వుంది. జిల్లా విస్తీర్ణం 5,031 చ.కి.మీ. వైశాల్యాన్ని కలిగి వుంది. రంగారెడ్డి జిల్లాకు ఉత్తరాన హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి; పడమర వికారాబాద్; దక్షిణాన మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్; తూర్పున యాదాద్రి నల్లగొండ జిల్లాలు సరిహద్దులుగా ఉన్నాయి.

**రెవిన్యూ డివిజన్లు, మండలాలు**

ఈ జిల్లాలో 1.రాజేంద్రనగర్ 2. చేవెళ్ళ 3. కందుకూరు 4. ఇబ్రహీంపట్నం 5. షాద్‌నగర్ అనే ఐదు రెవిన్యూ డివిజన్లు ఉన్నాయి. మొత్తం మండలాలు 27 వున్నాయి.

**రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్‌లో 4 మండలాలు :**

1. గండిపేట 2. రాజేంద్రనగర్ 3. శేర్ లింగంపల్లి 4. శంషాబాద్.

**చేవెళ్ళ రెవెన్యూ డివిజన్‌లో 4 మండలాలు :**

1. చేవెళ్ళ 2. మొయినాబాద్ 3. షాబాద్ 4. శంకరపల్లి.

**కందుకూరు రెవెన్యూ డివిజన్‌లో 7 మండలాలు :**

1. ఆమనగల్.2. బాలాపూర్ 3. కందుకూరు 4. కడ్తాల్ 5. మహేశ్వరం 6. తలకొండపల్లి 7. సరూర్‌నగర్.

**ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజన్‌లో 6 మండలాలు :**

1. అబ్దుల్లాపూర్‌మెట్ 2. హయత్‌నగర్ 3. ఇబ్రహీంపట్నం 4. మాడ్గుల్ 5. మంచాల 6. యాచారం.

**షాద్‌నగర్ రెవెన్యూ డివిజన్‌లో 6 మండలాలు :**

1. చౌదర్‌గూడ 2. ఫారూఖ్‌నగర్ 3. కేశంపేట 4. కొందుర్గ్ 5. కొత్తూర్ 6. నందిగామ

### సహజవనరులు

ఈ జిల్లాలో రాళ్ళు ప్రధానమైన ఖనిజ సంపద. గ్రానైట్ బాక్సైట్, రైన్‌స్టోన్, శాండ్‌స్టోన్ వంటి రాళ్ళు లభ్యమవుతున్నాయి. చేవెళ్ళ, షాబాద్ మండలాలలో సున్నపురాయి, నాపరాయి, దొరుకుతాయి. కంకర మిశ్రమ కర్మాగారాలకు అనువైన రాళ్ళు యీ జిల్లాలో అధికంగా ఉన్నాయి.

### నేలలు

బెట్టనేల, చౌడునేల, రేగడినేల, ఎరుపు నేల, ఇసుక నేలలు ఉన్నాయి. జిల్లాలో సాధారణంగా ఎర్రమట్టి భూములే ఎక్కువ. అక్కడక్కడ నల్లరేగడి భూములు ఉన్నాయి. కొన్ని మండలాలలో ఊబనేలలు కూడా ఉన్నాయి. దాదాపు 50% గ్రామాలలో నల్లరేగళ్ళు ఉన్నాయి. 17 మండలాలలో ఎర్ర చెలకలుండగా, 5 మండలాలలో దుబ్బ నేలలు విస్తరించి ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో అత్యధిక వ్యవసాయం వర్షాధారమే. పొడి వాతావరణం కావడం వల్ల నల్లతుమ్మ చెట్లు విస్తరించి ఉన్నాయి.

### అడవులు

జిల్లాలో అడవులు 292.73 చ.కి.మీ. విస్తీర్ణంలో విస్తరించి వున్నాయి. జిల్లాలోని మొత్తం భూభాగంలో ఇది 5.82 శాతంగా వుంటుంది. సామాజిక అడవులను పెంచడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం హరితహారం. దాదాపు 390 చ.కి.మీ.లు అడవులున్నాయి. ఈ అడవులలో అధిక భాగం జిల్లా పశ్చిమ భాగంలో వున్నాయి. వికారాబాదు సమీపంలో ధరూర్, అనంతగిరి ప్రాంతాలలో మధ్య రకపు అడవులున్నాయి. దట్టమైన అరణ్యాలు ఈ జిల్లాలో లేవు.

### నదులు

రంగారెడ్డి జిల్లా సాధారణంగా మైదాన ప్రాంతమే. అక్కడక్కడ చిన్నవాగులు పారుతున్నా ప్రధానమైన నది మూసీ నది. ఇది వికారాబాద్ జిల్లా అనంతగిరి అడవులలో మొదలై తూర్పుదిశగా ప్రవహించి హైదరాబాదును దాటుతూ వాడపల్లి వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. ఈ నదిపై ఉస్మాన్‌సాగర్ (గండిపేట), హిమాయత్‌సాగర్ అనే రెండు జలాశయాలు నిర్మితమైనాయి. మూసీనదీ ప్రవాహం రాజధాని నగరాన్ని ముంచెత్తకుండా నాటి నిజాం నవాబు కోరికపై భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆధ్వర్యంలో యీ చెరువుల నిర్మాణం జరిగింది. ఇటీవలి వరకు హైదరాబాదు నగర తాగునీటి అవసరాలకు మూసీనదియే ఆధారం.

## చెరువులు - ప్రాజెక్టులు

ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ చెరువులు హైదరాబాదు నగర తాగునీటికి ఉపయోగపడుతున్నాయి. జిల్లాలో ఇదే అతి పెద్ద చెరువు. షాబాద్ చెరువు, కాముని చెరువు, ఇబ్రహీంపట్నం చెరువు వంటివి యితోధికంగా వ్యవసాయానికి ఉపకరిస్తున్నాయి. జీవనదులు లేకపోవం వల్ల ప్రాజెక్టుల నిర్మాణం జరుగలేదు.

**జనాభా :** 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ జిల్లా జనాభా 24,46,265గా వుంది. ఇందులో పురుషులు 12,54,184 కాగా, మహిళలు 11,92,081 గా వున్నారు. గ్రామీణ జనాభా 41.95%, పట్టణ జనాభా 58.05%. జనసాంద్రత 486. లింగనిష్పత్తి 1000 : 950.

**అక్షరాస్యత :** రంగారెడ్డి జిల్లా అక్షరాస్యతా శాతం 71.95. ఇది తెలంగాణ రాష్ట్ర సగటు అక్షరాస్యతా శాతం కన్నా 5% ఎక్కువ. పురుషుల అక్షరాస్యత 78.94%, స్త్రీల అక్షరాస్యత 64.63%.

**మున్సిపాలిటీలు :** 5

**రెవిన్యూ గ్రామాలు :** 604

**గ్రామపంచాయితీలు :** 415

**పోలీసు హెడ్‌క్వార్టర్స్ :** రంగారెడ్డి

**పార్లమెంటు నియోజకవర్గం :** చేవెళ్ళ, హైదరాబాదు తూర్పు, వికారాబాదు

**అసెంబ్లీ నియోజక వర్గాలు :** చేవెళ్ళ, రాజేంద్రనగర్, ఎల్.బి.నగర్, షాద్‌నగర్, శేర్ లింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం.

**పట్టణాలు :** చేవెళ్ళ, శంకర్‌పల్లి, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, శంషాబాద్, మొయినాబాద్, షాబాద్.

## రంగారెడ్డి జిల్లా చరిత్ర

ఆసఫ్జాహీల పాలనా కాలం నుండి మాత్రమే యిక్కడి చరిత్ర లిఖించబడి ఉంది. ఈ జిల్లాకు పూర్వనామం అత్రాఫ్‌బల్దా. హైదరాబాద్ నగరాన్ని చుట్టుకుని ఉన్న యీ ప్రాంతం యావత్తు నిజాం సొంత జాగీరు. యిక్కడి పన్నులు, జమాబంది సర్వస్వం నిజాం సొంత ఖర్చులకు వినియోగించబడేది. నేటి కర్ణాటక, బీదర్, గుల్బర్గా, మహారాష్ట్రలోని ఔరంగాబాద్, బీడ్, పర్భణి వరకు ఈ జిల్లా విస్తరించి ఉండేది. స్వాతంత్ర్యానంతరం యీ జిల్లాకు 'హైదరాబాద్ రూరల్'గా నామకరణం చేశారు. కన్నడ, మరాఠా ప్రాంతాలు విడిపోగా మెదక్, షాబాద్, రామన్నపేటలోని కొన్ని గ్రామాలతో ఈ జిల్లా కొత్తరూపం సంతరించుకుంది. అటుపై 1978 ఆగస్టు 15వ తేదీన హైదరాబాద్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన కీ.శే. కొండా వెంకట రంగారెడ్డి పేరుపై యీ జిల్లాను 'రంగారెడ్డి జిల్లా'గా వ్యవహరించడం ప్రారంభించారు. నేటి మొయినాబాదు మండల కేంద్రంలోని పెద్ద మంగళారం రంగారెడ్డి గారి స్వస్థలం. మాజీ ముఖ్యమంత్రి చెన్నారెడ్డి వీరి మేనల్లుడు. కాగా ప్రస్తుత చేవెళ్ళ ఎం.పి కొండా విశ్వేశ్వర రెడ్డి వీరి మనవడు. రంగారెడ్డిగారు తెలంగాణ స్వాతంత్రోద్యమంలోనూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కాంక్షను వ్యక్తపరచడంలోనూ, పెద్దమనుషుల ఒప్పందంలోనూ చురుకుగా పనిచేశారు.

## సంస్కృతి

ఈ జిల్లాలోని అత్యధిక భూములు ఇటీవలివరకు వ్యవసాయ యోగ్యం కానివి. వర్షాధార పంటలతో ప్రజలు నిరుపేదలుగా మిగిలిపోయారు. ఐ.టి. విప్లవం యీ జిల్లా ఆర్థిక పరిస్థితిలో విపరీతమైన మార్పులు చేసింది.రాజధానికి ఆనుకొని ఉన్న ప్రాంతాలు కోట్లు కురిపిస్తున్నాయి. అట్లాగే శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం యీ జిల్లాలోని భూములను పారిశ్రామిక యోగ్యంగా మార్చివేసింది. అయితే యిది కేవలం ఒక పార్శ్వం మాత్రమే. పట్టణాలకు దూరంగా ఉండే గ్రామాల్లో నేటికీ దారిద్ర్యం కనిపిస్తుంది. అందుకే ఈ జిల్లాలో మిశ్రమ సంస్కృతి కనిపిస్తుంది. శంషాబాద్, షాబాద్, పాలమూరును ఆనుకొని ఉన్న ప్రాంతాల్లో బంజారా తండాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ జిల్లా కన్నడ రాష్ట్రానికి

చేరువగా ఉండడం వల్ల అక్కడి భాష, సంస్కృతుల ప్రభావం కనిపిస్తుంది. కన్నడ బసవని వీరశైవ మఠాలు ఇటీవల వరకు విరివిగా కనిపించేవి. అట్లాగే బీదర్ 'ఝర్నీ నరసింహ దేవాలయాన్ని, హుమ్నాబాద్ మాణిక్‌ప్రభు ఆలయాన్ని దర్శించేవారు ఎక్కువగా కనబడతారు.

**ఆచారాలు, సంప్రదాయాలు, పండుగలు**

తెలంగాణాలో సాధారణంగా జరుపుకునే అన్ని పండుగలు యిక్కడ జరుపుకుంటారు. మొయినాబాద్ దగ్గరి రాధాస్వామి సత్సంగ్ క్షేత్రంలో జరిగే కార్యక్రమాలు చుట్టుప్రక్కల ఊర్లలోని వారిని విశేషంగా ఆకర్షిస్తాయి. నల్లగొండ జిల్లా నుండి కొన్ని గ్రామాలు ఇబ్రహీంపట్నంలో కలవడం వల్ల రాచకొండ గుట్టలకు సమీపాన ఉండడం వల్ల యీ మండలంలో కొంత వామపక్ష ప్రభావం కనిపించేది. ఆచారాలలో కన్నడ ప్రాంత ప్రభావం కనిపిస్తుంది. 90వ దశకం వరకు జొన్నరొట్టెల ఆహారమే ఈ ప్రాంతంలో అధికం.

**కళలు, జాతరలు**

రంగారెడ్డి జిల్లా యోగులకు, సాధు సన్యాసులకు ఆలవాలం. మత, సాంస్కృతిక విధ్వంసం వల్ల ప్రజలలో ధార్మిక భావనలు ప్రజ్వరిల్లి అనేక మఠాలు, ఆశ్రమాలు, దేవాలయాలు నిర్మించబడ్డాయి. వాటిలో భజన మండలులు ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించాయి. యక్షగానాలు ఈ జిల్లాలో ప్రత్యేకంగా కనిపిస్తాయి. నిజాం సొంత జాగీరు కావడంవల్ల సాంఘికంగా, మతపరంగా దౌర్జన్యాలు ఎక్కువగా జరిగాయి. తత్పరిణామంగా ప్రజలు కళను తమ ఉద్ధరణకు సాధనంగా తీర్చిదిద్దుకున్నారు. పౌరాణిక, జానపద యక్షగానాలను వ్రాసి, స్వరపరచి, ప్రదర్శించి ప్రజల్లో కేవలం ఆధ్యాత్మికను పెంపొందించడమే కాక ఐక్యతను కాపాడడంలో యీ కళ విశేష సేవలందించింది. తిలక్ అంకురార్పణ చేసిన వినాయక ఉత్సవాలు మరాఠా గడ్డపై ఏవిధమైన సాంస్కృతిక మార్పులు తెచ్చాయో, యక్షగానాలు సైతం యీ ప్రాంతంలో అటువంటి భూమికను ఏర్పరిచాయి. సబ్బండ వర్ణాలవారు ఏకమై కులరహితంగా గుమికూడి యక్షగానాలను నేర్పే 'పంతుళ్ళు' నాటి కళా స్రవంతికి సాక్ష్యాలుగా నిలిచారు.

**సాహిత్యం**

**"ధరణిలోన చరిగొండ ధర్మన్న రచియించె**
**చిత్ర భారతము విశిష్ట సరణి**
**ఆశుకవితగట్ట అప్పకవీయమ్ము**
**రాసురాట్కవి యిచ్చెరా ప్రసన్నమగు-భా**
**రతము జన మనోరథముదీర**
**ఆశ్వవధానాల హదల గొట్టిన బుక్క**
**పట్టణాచార్యుల ప్రభవెలుంగ"**

**"వెలసిరిచ్చోట కప్పగంతులయు, హనుమ**
**శర్మ, ముకురాల, కేశవశాస్త్రి, రఘుమ,**
**కపిల, చౌదూరి, ఎల్లూరి కవివరుందు**
**ఉర్విగుణ సీమ వర పాలమూరు సీమ"**

ఇది పాలమూరు జిల్లాలోని ప్రాచీన – అర్వాచీన కవులను ప్రస్తావించిన పద్యం. ఇప్పుడు ఆ జిల్లాలోని ఆమన గల్లు, మాడ్గుల, కడతాల, షాద్‌నగర్, నందిగామ, కేశంపేట తదితర మండలాలు రంగారెడ్డి జిల్లాలో కలిశాయి. ఆ కారణంగా పై పద్యంలో ప్రస్తావించిన చరిగొండ ధర్మన్న, అప్పకవి తదితరులు రంగారెడ్డి జిల్లాలోకి వచ్చారు

**చిత్రభారత కర్త చరిగొండ ధర్మన్న** 1500 ప్రాంతంలో చరిగొండ సీమలో వున్నాడు. ఆయన చిత్ర చిత్ర విషయాలతో, ముఖ్యంగా శ్రీకృష్ణార్జునుల యుద్ధాన్ని ఇతివృత్తంగా గ్రహించి, చిత్ర కవితా ప్రక్రియ ప్రౌఢ కావ్యంగా నిర్మించారు. ఇప్పుడీ చరిగొండ గ్రామం కడ్తాల – ఆమనగల్లుల మధ్యలో వుంది.

అదేవిధంగా 17 వ శతాబ్దానికి చెందిన **కాకునూరు అప్పకవి** ప్రస్తుతం కేశంపేట మండలానికి చెందిన లేమావిడి గ్రామ వాసి. ఈ గ్రామానికి దగ్గరే కాకునూరుంది. కాకునూరర్థాలు చెప్పిన కారణంగా వీరికా ఇంటిపేరు వచ్చింది. అప్పకవి 1620–60 మధ్యలో ఉన్నారు. ఆయన అప్పకవీయం కవులకు ప్రమాణ గ్రంథంగా నిలిచింది.

అప్పకవి తండ్రి తాతలకు కూడా వేద పండితులుగా పేరు ప్రఖ్యాతులున్నాయి. చరిగొండకు చెందిన ఒన్నయ్య, నరసింహయ్య పేర్లు కూడా ప్రచారంలో వున్నాయి. విచిత్రమేమంటే రామాయణ కవయిత్రి మొల్ల కుటుంబం పూర్వం చరిగొండలో ఉండేదనీ, వారు మొల్ల రచన ప్రారంభించే కాలం నాటికే నెల్లూరు మండలం వెళ్లిపోయారని ఈ ప్రాంతంలో చెప్పుకొంటుంటారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో పనిచేసిన **డా. ఇరివెంటి కృష్ణమూర్తి** పూర్వీకులు చరిగొండ సీమకు చెందిన, ఒకనాటి ఇరివెంటి గ్రామానికి చెందినవారే. ప్రస్తుతం ఈ ఇరివెన్ను మండలం నాగర్‌కర్నూలు జిల్లాలో వుంది. ఈ తెలుగు శాఖలో పనిచేసిన **ఆచార్య కసిరెడ్డి** **రంగారెడ్డి** జిల్లాలోని ఆమనగల్లు మండలం పోలేపల్లి గ్రామానికి చెందినవారు. వారు తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియలనూ స్పృశించారు. 130 పుస్తకాలు ప్రచురించారు. 1969 నాటి తెలంగాణ ఉద్యమంలో మొట్టమొదటి గేయ కవితా సంపుటి జై తెలంగాణను వీరు ప్రచురించారు. విశ్వహిందూ, శివానంద భారతి, గీతాజ్ఞాన యోగ సమాచార్ వంటి అయిదు పత్రికలకు సంపాదకులుగా అనేక సంవత్సరాలు బాధ్యతలు నిర్వహించారు.

చౌదరి గూడెం మండలంలో వేదగిరి (లాల్‌పహాడ్) ఆశ్రమ స్థాపకులు **డా. మత్తి కృష్ణారెడ్డి** నాలుగు వేదాలను తాత్పర్య సహితంగా తెలుగులోకి తెచ్చిన విద్వాంసులు. వారు వేదవిజ్ఞానం మీద 10 పుస్తకాలు రచించారు. వేదగిరిపై వేద పీఠాన్ని స్థాపించారు. వారి గురుదేవులు శ్రీశ్రీశ్రీ వేదానంద సరస్వతీ స్వాముల వారు వేదవిజ్ఞానంపై గ్రంథాలు రచించారు.

కడ్తాల మండలానికి సాయిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన **శ్రీశ్రీశ్రీ నిత్యశుద్ధానందగిరి స్వాములవారు,** శ్రీ మలయాళ సద్గురు సంప్రదాయానికి చెందిన సన్యాస దీక్షను స్వీకరించి షాదునగర్లో ఆశ్రమం ద్వారా గీతా జ్ఞానయోగ సమాచార్ పత్రికను వెలువరిస్తున్నారు. గజేంద్రమోక్షం, భజగోవిందం, శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్రం వంటి గ్రంథాలపై శ్రీ స్వామి వారు వ్యాఖ్యాన గ్రంథాలు రచించారు. ఇదేవిధంగా షాద్‌నగర్ గ్రామానికి చెందిన **శ్రీశ్రీశ్రీ రామేశ్వరానందగిరి స్వామివారు** గొల్లెపల్లి సమీపంలో లలితా తపోవనం స్థాపించి సద్గురు భారతి పత్రిక నడిపించారు. వారూ ఆధ్యాత్మిక గ్రంథాలెన్నో రచించారు.

శంకర్‌పల్లి మండలానికి చెందిన **పిల్లిగుండ్ల నాగభూషణం** శతకాలు రచించారు. దాంపత్య ధర్మం వంటి పద్య కావ్యాలు రచించారు. అయిదారు శతకాలు రచించారు. అన్నింటికీ మించి 19 వ శతాబ్దానికి చెందిన రాకమచర్ల వెంకటదాసు కీర్తనలు పునరుద్ధరించారు. రాకమచర్ల భజన సంకీర్తనల సంఘాల ద్వారా (దాదాపు 400 భజన సంఘాలు) ఈ కీర్తనలకు అపూర్వ ప్రచారం కల్పించారు. ఈ కీర్తనలు రంగారెడ్డి, వికారాబాదు, మహబూబునగర్, నాగర్‌కర్నూలు, వనపర్తి, సూర్యాపేట, నల్లగొండ, భువనగిరి, జనగామ జిల్లాల్లో ఈనాటికీ ప్రచారంలో వున్నాయి. భజనల్లో ఇవి వినిపిస్తూనే వున్నాయి.

పూర్వపు షాద్‌నగర్ తాలూకాకు చెందిన తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి **బూర్గుల రామకృష్ణారావు** బూర్గుల గ్రామవాసి. వీరు అష్ట భాషా పండితులు. శ్రీకృష్ణ శతకం, పుష్పాంజలి, తొలిచుక్క, నివేదన వంటి గ్రంథాలు ప్రచురించారు. పండితరాజు పంచామృతం, సౌందర్యలహరి, కనకధారాస్తవం, ఉమర్‌ఖయ్యాం, సర్మద్ గీతములు వంటి గ్రంథాల్ని సంస్కృతం, పర్షియన్ భాషల నుంచి అనువదించారు. హిందీలో ఆంధ్రభాగవత్ సమీక్షా రాశారు. ఆంగ్లంలోనూ మూడు గ్రంథాలు రాశారు. సారస్వత వ్యాసముక్తావళి, పారసీక వాఙ్మయచరిత్ర, బూర్గుల పీఠికలు తదితర వచన గ్రంథాలు వారున్న కాలంలోనూ, తర్వాతి కాలంలోనూ ప్రచురితమయ్యాయి.

షాద్‌నగర్ మండలానికి చెందిన **శ్రీ చెన్నమరాజు కొండలరావు** శ్రీ వేంకటేశ్వర శతకం, సంగమేశ్వర శతకం, శ్రీ మల్లికార్జున స్తవం తదితర గ్రంథాలు ప్రచురించారు. తిరువాయి మొడిని అనువదించారు.

18 వ శతాబ్దికి చెందిన **శ్రీ కిషన్‌ప్రభు** సద్గురువుగా ప్రసిద్ధి. కేశంపేట మండలం లేమామిడి ప్రాంతంలో శ్రీ సద్గురు ఆశ్రమం వుండేది. శ్రీ కిషన్ ప్రభు వేదాంత తత్త్వగీతాలు ప్రచారంలో వున్నాయి. వీరిపేరిట భక్త సమాజాలు ఏర్పడి ఆ గీతాలను భజనల్లో పాడుకుంటున్నారు.

**శ్రీ బూర్గుల రంగనాథ రావు** రచయిత. తండ్రి బూర్గుల రామకృష్ణారావు. శ్రీ రంగనాథ వాహ్యాళి కథా సంపుటిని, అభిమానం పద్యకవితా సంపుటిని ప్రచురించారు. తిరుప్పావై, ముకుందమాల వంటి ఎనిమిది గ్రంథాల్ని అనువదించారు.

**శ్రీ వెల్దెండ ప్రభాకరామాత్య** తలకొండపల్లి గ్రామవాసి. వీరు ఆముక్తమాల్యద పద్యాలోకనము, ప్రేమసీమ వంటి వచన గ్రంథాల్ని ప్రచురించారు.

**శ్రీ చౌదూరి గోపాలరావు** షాద్‌నగర్ మండలానికి చెందిన చౌదూరు గ్రామవాసి. రోహిణి, మధుశాల, అభాగిని, మల్లిపాటలు, ఇంటినుంచి ఇంద్రలోకం, ఉత్తిష్ఠ, కొడంగల్ వేంకటేశ్వర శతకం, సంగమేశ్వర శతకం, వెలుగుబాట వంటి పద్య వచన గేయ కావ్యాలను, ఆలోకనం, హిందూ జీవన పద్ధతి తదితర వచన గ్రంథాలను ప్రచురించారు.

**శంకరపల్లి వెంకట్రావు పంతులు** బాకవరం ఆంజనేయ శతకం రాశారు. షాద్‌నగర్ వాస్తవ్యులు **శ్రీ వంగీపురం నరసింహాచార్యులు** అభినవ శశిరేఖ నాటకంతో పాటు ఎన్నో పద్య కవితలు రాశారు.

వీరితో పాటు ఇంకా భజన కీర్తనలు రాసినవారు, యక్షగానాలు రాసినవారు ఎందరో వున్నారు. **ఆమనగల్లు భద్రయ్య, శంకరపల్లి శ్రీ నరేంద్ర** తదితర ఆధునిక కవులు రచనా రంగంలో వున్నారు. గోలకొండ కవుల సంచిక ఆధారంగా రంగారెడ్డి జిల్లా పరిధిలో కనిపించే కవులను ప్రత్యేకంగా పరిశీలించే అవకాశం వుంది. పత్రికారంగంలో, ప్రచార ప్రసార సాధనాల్లో పనిచేస్తున్న ఆధునికులెందరో వున్నారు. అంతేగాక అనువర్తిత జానపద సాహిత్యాన్ని ఆధునిక జీవనం లోకి తెస్తున్నవారున్నారు. విశ్వవిద్యాలయాల్లో తెలుగు భాషా, సాహిత్య సంస్కృతులపై పరిశోధనలు చేసిన వారున్నారు, చేస్తున్నవారున్నారు. ఇవన్నీ ప్రత్యేకంగా పరిశీలించాల్సి వుంది.

## రంగారెడ్డి జిల్లా ప్రముఖులు - ప్రజాసేవకులు

స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచి ఈ జిల్లాలో ఎందరో ప్రజాసేవ రంగంలో పనిచేశారు. తలకొండపల్లి గ్రామస్థులు శ్రీ మందుముల నరసింగరావు తెలంగాణ స్వాతంత్ర్య ఉద్యమానికి చేయూతనిచ్చారు. ఉర్దూలో రయ్యత్ వారపత్రికను స్థాపించి 1927 నుంచి హైదరాబాదులో నడిపించారు. నిజాం ప్రభుత్వం పత్రికను నిషేధించింది. తెలంగాణ స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన రచనలు చేశారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత ఆయా మంత్రి వర్గాలలో హోం మంత్రిగా పనిచేశారు. వీరి సోదరులు మందుముల రామచంద్రరావు వర్తక స్వాతంత్ర్యం వంటి లఘు గ్రంథాలు రచించారు. గ్రంథాలయోద్యమంలో ముఖ్యపాత్ర పోషించారు. స్టేట్ కాంగ్రెసులో పనిచేశారు. ఆంధ్ర మహాసభకు కార్యదర్శిగా వున్నారు.

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులుగా, శాసన మండలి సభ్యులుగా, మేధావి పత్రికా సంపాదకులుగా వ్యవహరించిన శ్రీ వి.పి. రాఘవాచారి విద్యారంగానికి తమ సేవలందిస్తూనే పాఠ్య గ్రంథాలు చారిత్రక గ్రంథాలుగా రచించారు.

కొండా వెంకట రంగారెడ్డి సోదరులు శ్రీ కొండ సత్య నారాయణ రెడ్డి జిల్లా ధార్మిక రంగానికి సేవలందించారు. వారి పుత్రులు కొండా లక్ష్మీకాంతరెడ్డి విజ్ఞాన సరోవర ప్రచురణల సంస్థను స్థాపించి గోలకొండ కవుల సంచిక పునర్ముద్రణ చేశారు. వీరిది మొయినాబాద్ మండలంలోని కన్‌కల్ గ్రామం శ్రీ రెడ్డి సాహిత్య - విద్యార్థి రంగాలకు విశిష్ట సేవలందించారు. శ్రీ రెడ్డి రాజ్య సర్వస్వం వంటి చారిత్రక గ్రంథాలను శ్రీ బి.ఎన్.శాస్త్రిచే రాయించి ప్రచురించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం అధ్యక్షునిగా, ఆంధ్రజనత పత్రిక సంపాదకునిగా, యువ కాంగ్రెసు నాయకునిగా, ఎమ్మెల్యేగా క్రమంగా ఎదిగి, పార్లమెంటు సభ్యులై, కేంద్రమంత్రియై ఉత్తమ పార్లమెంటేరియన్ గౌరవాన్ని అందుకొన్న శ్రీ ఎస్. జైపాల్‌రెడ్డి మాడ్గుల గ్రామవాస్తవ్యులు. జయపాల్ యాదవ్ ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహించారు. దేవేందర్ గౌడు మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఇంద్రారెడ్డి, శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి మంత్రిగా సేవలందించారు. శ్రీ కసిరెడ్డి నారాయణ రెడ్డి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా సేవలందించారు. పడకల్ వెంకటరెడ్డి, నరహరి రెడ్డి రాజకీయంగా ఉన్నత స్థానాలకెదిగి ప్రజా సేవలో లీనమై పనిచేశారు.

**ఆలయాలు**

తెలంగాణలోని చాలా జిల్లాలను చోళులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డి వెలమ పద్మనాయక రాజులు పరిపాలిం చారు. ఆ తర్వాత బహమనీలు, కుతుబ్‌షాహీలు, ఆసఫ్జాహీలు పరిపాలించారు. ఆయా రాజవంశాల కాలంలో ముఖ్యంగా విదేశీ రాజుల కాలంలో తెలుగు వికసించలేదు. పైగా తెలంగీ, ఛేడంగీ అని పాదుషాలు వారి అనుయాయులు దూషించినపుడు తెలుగు గొప్పతనం గ్రహించిన రాజులు చాటుమాటుగా తెలుగు వికాస చైతన్యాలకు దోహదం చేశారు. ముఖ్యంగా సంస్థానాధిపతులు తెలుగు భాషా సాహిత్యాలను నిలబెట్టారు. ఆచార సంప్రదాయాలు నిర్వహించుకోవడంలో ఆటంకాలు కల్పించలేదు. అయితే ఆసఫ్జాహీల పాలనా కాలంలో ఆంక్షలే కాక నిషేధాలు విధించబడ్డాయి. అలనాటి నుంచి ఆలయ సంస్కృతి సంప్రదాయాలను ఆచరించే కొన్ని దేవాలయాలను ఆలయం ఉత్సవాలను తెలుసుకుందాం.

**శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయం :** మండల కేంద్రం చేవెళ్లలో వుంది. కళ్లులేని వారికి కళ్లనిచ్చే స్వామి అంటూ చెప్పుకొనే ఐతిహ్యముంది. మాధ్వ సంప్రదాయ పద్ధతిలో పూజాది కార్యక్రమాలు జరుగుతాయి. వార్షిక బ్రహ్మోత్సవం నిర్వహిస్తారు. అయిదు రోజుల ఈ ఉత్సవాలే సామాన్యుల దృష్టిలో జాతర.

కొత్తూరు మండలంలో జహంగీర్‌పీర్ దర్గా వుంది. ఇది దర్గాగా మారక ముందు ఇక్కడ జంగమేశ్వర ఆలయం వుండేది. ఇప్పటికీ పరిసర ప్రాంతాల్లో ఆ ఆలయ శిథిలాలు కనిపిస్తాయి. చౌదరిగూడెం మండలం లాల్‌పహాడ్‌లో వేద ఆంజనేయ స్వామి ఆలయం వుంది. ఈ గట్టు నిప్పుడు వేదగిరి అని పిలుస్తారు. చౌదరిగూడెంలోనే మాణిక్య ప్రభు దేవాలయం వుంది. ఈ దేవాలయం వార్షికోత్సవాలను నిర్వహిస్తుంది.

ఆమనగల్లు మండలంలోని చుక్కాపూర్ సమీపంలోని కలిజొన్న వేణుగోపాల స్వామి దేవాలయం వుంది. ఇది అతి ప్రాచీన దేవాలయం. వార్షికోత్సవం జాతర జరుగుతుంది.

ఆమనగల్లు - కడ్తాల మండలాల మధ్య వీరభద్ర మూర్తి విరాట్టుగా అయ్యసాగర దేవాలయ ప్రాంగణం కొన్ని ఎకరాలలో ఉంది. ఇక్కడే శివాలయం, సరస్వతీ ఆలయం, కాళికాలయం, ఉమా మహేశ్వరాలయం, సీతారామచంద్ర స్వామి ఆలయం. ఆంజనేయ స్వామి ఆలయం, ఎత్తయిన నంది వుంది. శివరాత్రి సందర్భంగా ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవాలనే జాతర అంటారు.

మైసిగండి కాళికామ్మ వారి దేవాలయం ప్రసిద్ధమైంది. హైదరాబాదు, శ్రీశైలం రహదారిలో ఆమనగల్లు కడ్తాల మండలాల మధ్యలో ఉన్న ఈ 'శక్తి' ఆలయం ఓ తీర్థంలా కనిపిస్తుంది. మూలస్థాన శివాలయం వెనుక వైపున ఉంటుంది. ఇక్కడ రోజూ జాతరే. నిజానికిది మైసమ్మ ఆలయం. హైదరాబాదుకు నాలుగువైపులా మైసమ్మ ఆలయా లిట్లే వుంటాయనీ, ఇవి నగర రక్షణ శక్తులంటారు పెద్దలు.

యాచారం మండలం నంది వనపర్తిలో నంది, శ్రీ వేంకటేశ్వర్ల బావిలో గుట్టమీద శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, బాలాపూర్ మండల కేంద్రంలో ఆంజనేయ స్వామి ఆలయం, సరూర్‌నగర్ మండలం సమీపంలోనే ఉన్న కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి, మీర్‌పేట్ శ్రీ వేంకటేశ్వర

స్వామి ఆలయం, మహేశ్వరం మండల కేంద్రంలోని స్థలదుర్గం, అందులో జలేశ్వర నీలకంఠ స్వామి ఆలయం, తుక్కుగూడ సమీపంలోని దత్తాత్రేయ ఆశ్రమం, ఆశ్రమంలో ఆలయాలు... ఈ విధంగా వందలాదిగా ఉన్న దేవాలయాలను ప్రత్యేకంగా అధ్యయనం చేయాల్సి వుంది.

**జిల్లా ప్రత్యేకతలు**

రంగారెడ్డి జిల్లా మండలాలు, రెవిన్యూ డివిజన్లలో చాలా వరకు హైదరాబాదు చుట్టూరా ఉన్నవే. అందువల్ల ఈ జిల్లా పూర్తి చరిత్ర హైదరాబాదుతోనే ముడిపడి వుంది. ఏడవ నిజాం సొంత ఆస్తిగా, అందులో వచ్చే పన్ను కూడా సొంత ధనంగా భావింపబడే అత్రాఫ్‌బల్దా భూములెన్నో ఈ జిల్లాలోనే వున్నాయి. గండిపేట చెరువు, గండిపేట పరిసరాల్లోని చారిత్రక కట్టడాలు, ఇబ్రహీం పట్టణం చెరువు, అబ్దుల్లాపూర్ మెట్‌లోని రామోజీ ఫిలింసిటీ, యాచారం మండలంలోని నంది వనపర్తిలోని నంది జ్ఞాన సరస్వతీ దేవాలయం, మంచాల మండలం పరిసరాల్లో కనిపించే రాచకొండ గుట్టలూ, రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం, సరూర్ నగర్ మండలంలోని చెరవు, మొయినాబాదు మండలంలో కనిపించే చారిత్రక కట్టడాలు, చర్చి, చర్చి నడిపే విద్యాలయాలు, కడ్తాల్ మండలంలో ఈ మధ్యే నిర్మాణమైన పత్రీజీ పిరమిడ్ మందిరం, భాగ్యనగర పరిసరాల్లోని ప్రైవేటు ఉన్నత విద్యాలయాలు, చిన్నా పెద్దా కలిపి దాదాపు 20 వరకున్న ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలు, సేవా సంస్థలు, జిల్లాలోని భజన సంఘాలు, గ్రంథాలయాలు, వీధి భాగవతాల ప్రదర్శనలు, నిర్వాహక సంస్థలు, ప్రతి గ్రామంలో వున్న పోచమ్మ ఎల్లమ్మ మైసమ్మ గుళ్ళు, ఆ గుళ్ళ ఆధ్వర్యంలో జరిగే పండుగలు, ఉత్సవాలూ, ఊరూరా నిర్వహించుకొనే విత్తనంతతి పండుగలు, ప్రతి గ్రామంలోని బొడ్రాయి పండుగ విశేషాలు, పశువుల సంరక్షణం ప్రతి సంవత్సరం ప్రతి గ్రామం నుంచి వనాలకు వెళ్ళే సంప్రదాయం, ప్రచారంలో వున్న అనుముల బ్రహ్మారెడ్డి గేయగాథ, అసలు సిసలైన ప్రాచీన జానపద సాహిత్యం, ఆయా పండుగల సందర్భంలో ప్రదర్శించే జానపదుల ప్రదర్శనలు, హరి కథలు, బుఱ్ఱకథల ప్రదర్శనల కళాకారులు, ఈ నాటికీ పగటి వేషాలు వేస్తున్న ఉత్సవ ప్రదేశాలు, పగటి వేషగాళ్లు ఇలా ఇలా ఎన్నో విశేషాలు ప్రత్యేకంగా అధ్యయనం చేయాల్సినవి ఈ జిల్లాలో వున్నాయి. ఈ జిల్లాలోని ఒకటి రెండు మోట పాటలు చూద్దాం.

**"మోటాకూ మొగ్గలా దండా**
**ఎద్దూకూ కుచ్చులా దండా**
**నల్లపూసలా నాయిదండా - సిన్నాపిలగా**
**పిల్లా మెడలా గుత్తమౌరా!**
**"అట్లాకాదు రా లొట్లా దొంగా**
**గిట్లా వాడురా ర్యాల పదమూ**
**రాగీమానూల సిల్కవోలే - సిన్నాపిలగా**
**రాగామెత్తీ గిట్లావాడూ!"**


**రంగారెడ్డి జిల్లా ఓ పొడుపు కథ :** మూడు పిడికిట్ల గడ్డి ముప్పయి ఎడ్లకు తొక్కుడు బొక్కుడు - తొంబయి ఎడ్లకు (కుంకుమ)

**జాతీయాలు :** పొట్టకొచ్చింది; నింద ముంచింద

**సామెతలు :** అవ్వ తీసిన గంధం అయ్య బుడ్డకు సరిపోయె ఎన్కలేదు ముందల్లేదు ఏతుల్లావు.

ఐ.టి. పరిశ్రమలకు ఆలవాలమై, రక్షణ, ఏరోస్పేస్, ఫార్మా, పోలీస్ ట్రైనింగ్ అకాడమీ వంటి అనేక సంస్థలకు నెలవైనది ఈ రంగారెడ్డి జిల్లా. హిమాయత్ సాగర్, గండిపేట జలాశయాల ద్వారా హైదరాబాదుకు దాహార్తిని తీరుస్తున్న ఈ జిల్లా ఆధునిక సాంకేతిక చైతన్యంతో అభివృద్ధిలో అత్యంత వేగంగా ముందుకు కొనసాగాలని ఆశిద్దాం.

# వనపర్తి జిల్లా చిత్రపటం




238(a)



వనపర్తి కోట



శ్రీరంగపురం దేవస్థానం




ఘనపుర కోట



సరళ సాగర్ ప్రాజెక్ట్



పొల్కంపల్లి శాంతాదేవి




ఎస్.వి.రామారావు

# వనపర్తి

ఘనపురముల్ వెలుంగునిట కాంతుల వెల్గెడి కొత్తకోటలున్
వనములు రంగసాగరము వంటి జలాశయ మాలికా తతుల్
కననగు సేతు నిర్మితులు కాంతుల నొప్పెడు నెత్తిపోతలున్
కనుగొన సంపదల్ వెలయు కాంచనమీ వనపర్తి స్ఫూర్తియై!

కొత్త జిల్లాల విభజనతో తెలంగాణ రాష్ట్ర పాలనా స్వరూపం మారిపోయింది. ప్రజల వద్దకే పరిపాలన అన్న సూత్రంతో ముఖ్యమంత్రి కేసీఆర్ పది జిల్లాలతో వున్న రాష్ట్రాన్ని పునర్విభజిం మొత్తం జిల్లాల సంఖ్య 31కి చేరింది. ఇందులో భాగంగా వనపర్తి ఉమ్మడి మహబూబునగర్ జిల్లా నుంచి విడిపోయి ప్రత్యేక జిల్లాగా అవతరించింది.

**ఈ పేరెందుకు**

వనపర్తి జిల్లాకు పూర్వం 'వనపురి' అనే పేరు వుండేది. వనాల తల్లి 'వనంపతి' వనం+ పతి = వనపతి. అదే కాల ప్రవాహంలో వనపర్తిగా ఏర్పడిందని జానపదులు చెప్పుకుంటారు. వనపురి వనాల తల్లిగా, అనంతరం వనపర్తిగా ఏర్పడిందని నా భావన. జిల్లా ఏర్పడకముందు మహబూబునగర్ జిల్లాలో అంతర్భాగంగా ఉండేది.

**భౌగోళిక స్వరూపం -విస్తీర్ణం - పరిధి**

ఈ జిల్లా 2,152 చ.కి.మీ. వైశాల్యాన్ని కలిగి వుంది. తూర్పున నాగర్‌కర్నూలు జిల్లా, పడమరన రాయచూర్, గుల్బర్గా జిల్లాలు, ఉత్తరాన మహబూబునగర్ జిల్లా, దక్షిణాన ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలు సరిహద్దులుగా వున్నాయి.

**సహజనవరులు**

ఈ జిల్లాలో ఖనిజ నిల్వలు, సున్నపురాయి, కలర్ గ్రానైట్, స్టోన్ మెటల్, సాధారణ ఇసుక లభ్యమవుతున్నాయి.

**నేలలు**

ఈ జిల్లాలో చెలక భూములు ఎక్కువ. అచ్చంపేట ప్రాంతపు నేలలు ఇసుకతో కూడి వున్నాయి. కొన్ని ప్రాంతాలలో దుబ్బ నేలలు కూడా వున్నాయి.

**అడవులు**

ఈ జిల్లాలో అడవులు 118.74 చ.కి.మీ. విస్తరించి వున్నాయి. జిల్లాలో మొత్తం భూభాగంలో ఇది 5.52 శాతం వుంటుంది. సామాజిక అడవులను పెంచడానికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం ఇది. దీనికై ప్రభుత్వం 2017 యాక్షన్ ప్లాన్‌ను రూపొందించింది. జిల్లాలో హరితహారం కోసం 71 నర్సరీలను ప్రారంభించారు. జిల్లా నర్సరీలో 88 లక్షల మొక్కలను పెంచుతున్నారు. ప్రభుత్వం చేపట్టిన హరితహారం ద్వారా ఇప్పటికి కొన్ని మొక్కలను నాటారు.

**చెరువులు, ప్రాజెక్టులు**

ఈ జిల్లాలో చెరువుల సంఖ్య తక్కువే. సంస్థానాధీశుల కాలం నాటి సప్తసముద్రాలు అవే చెరువులు. నేటికి కూడా అవి తమ సేవలను అందిస్తున్నాయి. గణపసముద్రం, బుద్ధ సముద్రం మొదలైన చెరువులను రిజర్వాయర్‌లుగా మార్చి జూరాల ద్వారా నీటిని నింపి వ్యవసాయానికి, తాగు నీటికి నీరు అందిస్తున్నారు. ఈ జిల్లాలో అతి పెద్ద ప్రాజెక్ట్ జూరాల. ఇది వనపర్తి జిల్లాకు ఎంతో ఉపయోగపడుతుంది.

## రెవిన్యూ డివిజన్లు - మండలాలు

**ఈ జిల్లాలో వనపర్తి రెవిన్యూ డివిజన్ వుంది. ఇందులో మొత్తం 17 మండలాలున్నాయి.** అవి 1. వనపర్తి 2. గోపాలపేట 3. పెద్దమందడి 4. ఘనపూర్ 5. కొత్తకోట 6. వీపనగండ్ల 7. పానగల్ 8. పెబ్బేర్ 9. చిన్నచింతకుంట 10. ఆత్మకూరు 11. అమరచింత (కొత్తది) 12. మదనాపూర్ (కొత్తది) 13. కోదేరు 14. అడ్డాకల్ 15. అలంపూర్ 16. ఉండవెల్లి (కొత్తది) 17. ఏదుల (కొత్తది)

వనపర్తి జిల్లాలో వనపర్తి నియోజకవర్గ 7 మండలాలతో పాటు దేవరకద్ర నియోజక వర్గ 2 మండలాలు, మక్తల్‌లోని 2 మండలాలతో కలిపి 14 మండలాలు ఈ జిల్లాగా ఉంది.

**జనాభా**

2010 -11 ప్రకారం జిల్లా జనాభా 5,77,758. మొత్తం రాష్ట్ర జనాభాలో 1.65 శాతం. ఇందులో పురుషులు 2,94,833, స్త్రీలు 2,82,925 గా వున్నారు. జిల్లాలో ప్రతి వెయ్యి మంది పురుషులకు 960 మంది మహిళలున్నారు. జిల్లాలో గ్రామీణ జనాభా 84.03 శాతం ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 15.97% మంది వున్నారు. జనసాంద్రత చదరపు కిలో మీటర్‌కు 268 మంది.

**అక్షరాస్యత**

జిల్లాలో 2,81, 331 మంది అంటే 55.67% మంది అక్షరాస్యులున్నారు. పురుషుల అక్షరాస్యతా శాతం 65.73% కాగా, స్త్రీలు 45.27% గా వుంది.

**జిల్లా చరిత్ర**

చరిత్ర తెలుసుకోడానికి ఉపయుక్తమైనవి పురాణాలు, శిథిలాలు, నాణేలు, కట్టడాలు. ఉన్నది ఉన్నట్లుగా కాకుండా అనేక వర్ణనలతో వుంటాయి. అందులో నుంచి అవసరమైన మేరకే మాత్రమే సమాచారం తీసుకోవాల్సి వుంటుంది. ప్రకృతి వైపరీత్యాలకు అయితేనేమి? మానవ దుశ్చర్యలకైతే నేమి భూగర్భంలో కలిసిపోయిన ఎన్నో సాక్ష్యాలు తవ్వకాలలో బయట పడ్డాయి. తవ్వకాలలో లభించిన పెంకులు, రాళ్లు, పాత్రలు, నాణేలు, ఆభరణాలు, ఇటుకలు వాటి చరిత్రను చాటి చెబుతాయి. రాజులు తాము సాధించిన విజయాలకో, చేసిన దానాలకో రాళ్లపై చెక్కించిన శిలా శాసనాలు చాలా వరకు చారిత్రక ప్రమాణాలు. అట్లే రాగి రేకులపై రాయించిన శాసనాలు, తామ్ర శాసనాలు చరిత్రకు ఉపకరిస్తుంటాయి. నాటి పాలకుల వారి సామంత దండనాది అధికారులు నిర్మించిన దేవాలయాలు, గోపురాలు, సత్రాలు, చెరువులు చరిత్రకు సాక్షీభూతాలై నిలుస్తాయి. కాలగర్భంలో కలిసి పోతున్న కూజానీపేట, గోపాల్‌పేట సంస్థానాల చరిత్రను పట్టించుకున్నవారు లేరు.

ఏ ప్రాంతమైనా సమగ్రంగా అవగాహన చేసుకోడానికి పూర్వ కాలంలో జరిగిన చారిత్రక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. పూర్వకాలంలో వున్న వాటి స్వరూప స్వభావాలను కాలక్రమంలో వచ్చిన విభిన్న పరిణామాలను అంచనా వేయాల్సి వుంటుంది.

చరిత్ర రచనకు ఎలాంటి లిఖిత ఆధారాలు దొరకని కాలాన్ని చారిత్రక పూర్వయుగం అని మనం చెప్పుకోవచ్చు. ఆదిమానవుని కాలం నుంచి క్రీ.పూ. 6 వ శతాబ్దం వరకు గల కాలాన్ని చరిత్ర పూర్వయుగంగా చెబుతారు. ఆది మానవుని కాలం నుంచి వనపర్తి జిల్లా ప్రాంతం మానవ నివాసానికి యోగ్యమే. ఈ విషయం పురాతత్వ పరిశోధన వల్ల నిరూపితమైంది. చారిత్రక పూర్వయుగ అవశేషాలు వీర్లదిన్నె, బుడిపాడు. పెద్దమారూరు, చిన్నమారూరు, చాల్లపాడు, కోపానూర్, లక్ష్మీపురం, ఎర్లదిన్నె, మస్తిపల్లి, చింతరెడ్డి పల్లె గ్రామాల్లో లభిస్తున్నాయి. తెలంగాణలో లోహయుగం నాటి ఆనవాళ్లు వనపర్తి జిల్లాలో చాలా చోట్ల కనుమరుగై పోతున్నాయి.

చరిత్ర రచనకు ఆధారాలు దొరుకుతున్న కాలం నుంచి చారిత్రక యుగం అంటారు. తెలంగాణకు సంబంధించినంత వరకు ఈ యుగం క్రీ.పూ. 6వ శతాబ్ది నుంచి మొదలౌతుందని

చెప్పవచ్చు. అందులో భాగమైన వనపర్తి జిల్లా చారిత్రక యుగం నాటి అవశేషాలు లభిస్తున్నాయి. చారిత్రక యుగంలో వనపర్తి జిల్లా మొదట షోడశ జనపదాల్లో కొనసాగిందని చారిత్రకుల భావన. అశోకుని శిలా శాసనాలు కర్నూలు జిల్లాలో లభించడం వల్ల వనపర్తి ప్రాంత పాలకులు అశోకుని సామంతులుగాను, బౌద్ధమత అనుయాయులుగా ఉన్నారని భావించాలి. చారిత్రక యుగం నాటి ఆనవాళ్లు మరియు షోడశ జనపదాలు, మగధ సామ్రాజ్యం, మౌర్యుల కాలం నాటి శాసనాలు కానీ మరే ఆధారాలు వనపర్తిలో లభించకపోయినప్పటికీ వనపర్తి జిల్లా షోడశ జనపదాలు, మగ సామ్రాజ్యం, మౌర్య సామ్రాజ్యాలకు లోబడి గణతంత్ర రాజ్యాలు ఉన్నాయని మనం భావించాలి.

శాతవాహన యుగం పూర్వం తెలంగాణ ప్రాంతంలో, ఆంధ్ర ప్రాంతంలో గణతంత్ర్య రాజ్య వ్యవస్థలుండేవి. 1. శాతవాహనులు కోటి లింగాలను రాజధానిగా చేసుకొని యావత్ దక్షిణ భారతాన్ని పరిపాలన చేశారు. ఈ వంశానికి ఆద్యుడు సిముకుడు. సిముకుని నాణాలు కరీంనగర్ జిల్లా దగ్గర్లోని కోటిలింగాలలో లభించాయి. తెలుగు రాజుల మొట్ట మొదటి సామ్రాజ్యం శాతవాహన సామ్రాజ్యం. వనపర్తి జిల్లా శాతవాహన రాజ్యంలో అంతర్భాగంలో ఉండేది. శాతవాహనుల సామంతులు, మండలాధీశులు, దండనాధీశులు వనపర్తి ప్రాంతంలోనే దుర్గాలను కాపాడుకుంటూ పాలించే వారని బి.ఎన్. శాస్త్రి పేర్కొన్నారు.

తొలి చరిత్రకారులు శాతవాహనుల తర్వాత బాదామీ చాళుక్యుల వరకు అజ్ఞాతయుగంగా భావించారు. శాతవాహన సామ్రాజ్యం క్రీ.శ. 3వ శతాబ్దానికి క్షీణించుకుంటూ వచ్చింది. అటు తర్వాత తెలంగాణ చరిత్ర సరిగా లభించలేదు. ఉత్తర దేశమందు హర్షుడు రాజ్యం చేసిన కాలంలో దక్షిణమున వాతాపిని రాజధానిగా చేసుకొని పులకేశి రాజ్యాన్ని పరిపాలించాడు. అతని అధీనంలో తెలంగాణ ఉందని సురవరం ప్రతాపరెడ్డి రాశారు. శాతవాహనుల సామంతులలో

**మున్సిపాలిటీ :** వనపర్తి

**రెవిన్యూ గ్రామాలు :** 223

**గ్రామపంచాయితీలు :** 185

**పోలీస్ హెడ్‌క్వార్టర్ :** వనపర్తి

**పార్లమెంటు నియోజకవర్గం :** నాగర్‌కర్నూలు

**అసెంబ్లీ నియోజకవర్గాలు :** మఖ్తల్, వనపర్తి, దేవరకద్ర

**పట్టణాలు :** వనపర్తి, కొత్తకోట, ఆత్మకూరు

ఇక్ష్వాకులు ఒకరు. వీరు ప్రాచీన నగరాలలో ఒకటైన ఇక్షు గణానికి చెందినవారు. వీరిని శ్రీపర్వతీయులు అని కూడా అంటారు. పురాణాల్లో ఈ వంశానికి చెందిన ఏడుగురు రాజుల ప్రస్తావన వుంది. ఇక్ష్వాకుల పాలనా కాలంలో వనపర్తి జిల్లాలోని వీపనగండ్ల, ఖిల్లా ఘనపూర్, అమరచింత తదితర ప్రాంతాలను పాలించుటకు మహా తలవర, మహా దండనాయకాది బిరుదులు గల సామంత మండలాధీశులను నియమించారని బి.ఎన్.శాస్త్రి పేర్కొన్నారు.

ఇక్ష్వాకులకు ఇంచుమించు సమాంతరంగా వాకాటకులు తెలంగాణలో మూడో వంతు భాగాన్ని పరిపాలించారు. ఈ విషయాన్ని హిస్టరీ కాంగ్రెస్ వారు విస్మరించడం బాధకర విషయం. వనపర్తి జిల్లాలో ఆత్మకూర్ ప్రాంతం వాకాటకుల పాలనలో వుందని మనం నిర్ధారించవచ్చు. వాకాటకులు తమ పాలనను వనపర్తి జిల్లా వరకు విస్తరించగా కాలక్రమంలో విష్ణుకుండిన రాజ్యంలో విలీనమైంది.

ఇక్ష్వాకులు సామంతులుగా ఉండి తర్వాత, కళింగతో సహా ఆంధ్ర దేశాన్నంతటిని పాలించిన రాజవంశం విష్ణుకుండినులేనని చరిత్రకారుడు శ్రీరామశర్మ రాశాడు. విష్ణుకుండిన వంశానికి చెందిన మొదటి మాధవవర్మ వనపర్తి జిల్లాను తన అధికారం కిందికి తెచ్చుకున్నాడని సుంకిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు.

ఎక్కువ కాలం బాదామీ, చాళుక్య, వేములవాడ, ముదిగొండ చాళుక్యులు పాలిచడం వల్ల ఈ యుగాన్ని చాళుక్య యుగం అంటారు. ఈ యుగం తెలంగాణ చరిత్ర

వివక్షకు గురైనట్టు చారిత్రకారుల అభిప్రాయం. బాదామీ చాళక్యులు కృష్ణాతీర ప్రాంతాల్లో ఆవిర్భవించిన రాజులు. పశ్చిమదిశగా వెళ్ళి అభివృద్ధి చెందినట్లు చరిత్రకారుల అభిప్రాయం.

బాదామీ చాళుక్యుల సామంతులైన రాష్ట్రకూటుల పాలనలో వనపర్తి జిల్లా వుంది. వీరి పరిపాలన దాదాపు 200 ఏళ్ల పాటు కొనసాగింది. వీరి అనంతరం పాలనలోకి వచ్చిన వేములవాడ చాళుక్యుల, కల్యాణీ చాళుక్యుల రాజ్యాలలో వనపర్తి అంతర్భాగం.

తెలంగాణలోని నల్లగొండ, పూర్వ మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి ప్రాంతం వరకు గల భూభాగాన్ని కందూరి చోడులు క్రీ.శ. 1040 నుంచి 1290 వరకు పరిపాలించారు. వీరి ముఖ్య పట్టణాల్లో పానుగల్లు ఒకటి. వీరి ఏలుబడిలో వనపర్తి జిల్లా మొత్తం వున్నట్లు తెలుస్తుంది. వీరి రాజ్యాలలో పానుగల్లు, ఘనపురం ప్రసిద్ధ పట్టణాలు.

దక్షిణ భారతంలో కాకతీయుల పరిపాలన విశిష్టమైందని చెప్పుకోవచ్చు. సుమారు 300 ఏండ్ల పాటు కొనసాగిన వీరి పాలనలో వనపర్తి జిల్లాదే కీలక భూమికగా చెప్పుకోవచ్చు. గణపతిదేవుని పేర గణపతి దేవుడు పానుగల్లు కోటను చంద్రగుప్తుని కోట నిర్మాణంలో పాలుపంచుకున్నాడు అనడానికి ఆధారాలున్నాయి. కాకతీయ చక్రవర్తులకు అంతరంగికులుగా వున్న గుణ వంశీయులు ఈ జిల్లా వారే. రుద్రమదేవి ప్రతాపరుద్రుల కాలంలో కూడా కాకతీయుల వైభవం కొనసాగింది.

గోన వంశంలో గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణాన్ని రచించాడు. అందుకు సంబంధించిన శాసనాలు మనకు లభిస్తున్నాయి. గోనవంశాల అనంతరం ఈ జిల్లాను ముసునూరి వంశస్థులు పాలించారు. అనంతరం రేచర్ల పద్మనాయకులు పాలన చేశారు. రెండవ సింగభూపాలుడు రాజకొండ ప్రభువు వున్న కాలంలో వీరి ఆధీనంలోని పానుగల్లు దుర్గాన్ని విజయనగర రాజులు ఆక్రమించారు. పద్మనాయకుల ఏలుబడిలో పానుగల్లు, ఘణపురం దుర్గాలున్నాయి.

పద్మనాయకులను ఓడించిన తర్వాత బహుమనీ రాజ్యంలోకి వనపర్తి జిల్లా వెళ్ళింది. వీరి కాలంలో అల్లావుద్దీన్ మహ్మద్ షా అనేక కోటలను, ఆలయాలను విధ్వంసం చేశాడు. అనంతరం కుతుబ్‌షాహి వంశ పాలనలోకి వెళ్ళింది. అసఫ్జాహీలు కూడా కొంత కాలం పరిపాలన చేసినట్లు కనిపిస్తుంది. కానీ 17 వ శతాబ్దం ముందునుంచి వనపర్తి జిల్లా సంస్థానాల ఏలుబడిలో వుండేది.

**సంస్థానాల చరిత్ర**

ఉమ్మడి పాలమూరుజిల్లా సంస్థానాల ఖిల్లాగా పేరొందింది. వనపర్తి జిల్లా ఏర్పడిన తర్వాత వనపర్తి, ఆత్మకూర్, గోపాల్‌పేట, మానాజిపేట, చంద్రఘఢ్ సంస్థానాలతో పాటు జటప్రోలు సంస్థానంలోని కొంత భాగం వనపర్తి జిల్లాలో అంతర్భాగమైనాయి. వనపర్తి జిల్లా సంస్థానాలు దాదాపు 400 ఏళ్ల పాటు పరిపాలన కొనసాగించాయి. 1948 సెప్టెంబర్ 17 వరకు స్వతంత్ర రాజ్యాలుగా వనపర్తి, ఆత్మకూర్ సంస్థానాలు పాలన కొనసాగిస్తే, గోపాల్‌పేట, మానాజిపేట, చంద్రఘఢ్ సంస్థానాలు దాదాపు 200 ఏళ్ల పాటు పాలన కొనసాగించి అనంతరం అంతరించినట్లు తెలుస్తోంది. వనపర్తి, ఆత్మకూర్, గోపాల్‌పేట, మానాజిపేట సంస్థానాలు రెడ్లకు చెందితే, చంద్రగఢ్ సంస్థానం బ్రాహ్మణ సంస్థానం. వనపర్తి రాజులు స్వయంగా సూగూరు పిక్కలు పేరుతో నాణేలు ముద్రించి చెలామణి చేశారు. నిజాం సంస్థానంలో నిజాం నాణేలతో పాటు చలామణిలో వున్న నాణేలు వనపర్తి నాణేలు.

భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్యం వచ్చేవరకు సంస్థానాధీశులు హైందవ సంస్కృతిని పరిరక్షించారు. అలాగే నిజాం రాజ్యంలోని వనపర్తి, ఆత్మకూర్, గోపాల్‌పేట, మానాజిపేట, చంద్రగఢ్ సంస్థానాధీశులు దాదాపు పదిహేడవ శతాబ్దం నుంచి 20వ శతాబ్దం వరకు దాదాపు 250 సంవత్సరాలు

సంస్థానాలను పాలించి సంస్కృతిలో విజయనగర రాజ్యాన్ని అనుకరించారు. వీరు నిర్మించిన దేవాలయాలు చాలా వరకు విజయనగర శైలిని పోలి వున్నాయి. ఎత్తైన గోపురాలు, పెద్ద ప్రాకారాలు గల ఆలయాలను నిర్మించి సంస్థానాధీశులు హైందవ పండుగలతో పాటు ఇతర పండుగలను కూడా వైభవంగా జరిపేవారు. వనపర్తి సంస్థానంలో శ్రీరంగనాథుని ఆలయం, అమరచింత సంస్థానాధీశులు కేశవాలయం, కురుమూర్తి ఆలయం, గోపాల్‌పేట సంస్థానాధీశులు రామాలయం నిర్మించారు. వనపర్తి సంస్థానంలో 217 ఆలయాలు, అమరచింత సంస్థానంలో 97, గోపాల్‌పేట సంస్థానంలో 50 ఆలయాలున్నాయి.

**వనపర్తి సంస్థాన సాహిత్యం**

నిజాం రాష్ట్రంలోని సంస్థానాలలో వనపర్తి సంస్థానం కీర్తి ద్వితీయ స్థానం. ఈ సంస్థానానికి మూల పురుషుడు వీర కృష్ణారెడ్డి. ఇతడు క్రీ.శ. 1510వ ప్రాంతంవాడు. ఇతడు కర్నూలు జిల్లా నంద్యాలలోని జనుంపల్లి ప్రాంతంవాడు. ఇతడు పానుగంటిసీమలో ఒక రాజ్యాన్ని స్థాపించాలన్న కోరికతో వచ్చి పాతపల్లిలో నివాసం ఏర్పరుచుకున్నాడు. అక్కడి నుంచి వ్యాపారం చేసి సూగూరు ప్రాంతమును రాజధానిగా చేసుకొని సంస్థానాన్ని స్థాపించాడు. తర్వాత మొదటి రామకృష్ణారావు సూగూరు నుంచి వనపర్తికి రాజధానిని మార్చాడు.

అప్పటి నుంచి వనపర్తి సంస్థానంగా పేరు పొందింది. వీర కృష్ణారెడ్డి తరువాత అతని పెద్ద కుమారుడు వెంకట కుమార గోపాలరావు, పెద్ద వెంకటరెడ్డి, ఇమ్మడి వెంకటరెడ్డి, అష్టబహిరి గోపాలరావు, సవై వెంకటరెడ్డి, గోపాలరావు, నాల్గవ వెంకటరెడ్డి గోపాలరావు. మొదటి రామకృష్ణారావు, ద్వితీయ రామకృష్ణారావు, ద్వితీయ రామేశ్వరరావు, కృష్ణదేవరావు తదితరులు పాలించారు. ఈ సంస్థానాన్ని 15 తరాల వారు, 23 మంది రాజులు పాలించారు. నాలుగు శతాబ్దాలు ఈ సంస్థానం క్రీ.శ. 1510 నుంచి 1948 వరకు కొనసాగింది.

ఈ సంస్థానంలో ప్రభువులు శిల్ప, సంగీత, సాహిత్యాది కళలను ఆదరించి సాంస్కృతిక వికాసానికి దోహదపడ్డారు. అనేక మంది కవి పండితులను ఆదరించి పోషించారు. తెలుగు సాహిత్యం సంస్థానాల నుంచి ప్రారంభమై తెలుగు సాహిత్య వికాసానికి దోహదపడింది. ఈ వనపర్తి సంస్థానం కూడా తెలుగు సాహిత్య వికాసానికి తన వంతు కృషిచేసింది. తమ ఆస్థానంలో అనేక మంది కవుల, పండితులను, అవధానులను ఆదరించి ఆశ్రయం కల్పించారు.

వీరు తరుచుగా పాండిత్య చర్చలను, విద్వత్సభలను, కవి గోష్ఠులను నిర్వహించేవారు. కవులను శాలువాలతో పాటు నూట పదహార్లతోను, బిరుదులతోనూ సత్కరించేవారు. అనేకమంది కవి పండితులను ప్రోత్సహించారు. ఆ రోజుల్లో రూ.116 లతో సన్మానం అనేది చాలా గొప్పనైన విషయం.

ఈ సంస్థాన పాలకులలో అష్టభాషా బహిరి గోపాల రావు గొప్ప కవి పండితుడు. ఇతడు మొదట రాజ కవి. సంస్కృత తెలుగు భాషలలో కావ్యాలను రచించినవాడు. ఇతని కాలం నుంచే సంస్థానంలో సాహిత్య పోషణ జరిగినట్లు తెలుస్తుంది. అలాగే రాజా ప్రథమ రామకృష్ణారావు జ్యోతిష శాస్త్రంలో గొప్ప పండితుడు. సంస్థాన ప్రభువులు రాజనగరం, శ్రీరంగాపురం గ్రామాలలో జాతరలు నిర్వహించేవారు. ఈ ఉత్సవాలలో కవి పండితులకు సన్మానాలు చేశారు. ఈ సన్మానాలు అందుకోడానికి తెలుగు దేశంలోని దాదాపు రెండు వేల మంది కవి పండితులు వచ్చేవారు.

అలాగే తెలుగు దేశంలోని సుప్రసిద్ధ కవి పండితులు ఈ సంస్థానానికి వచ్చి తమ పాండిత్యాన్ని ప్రదర్శించేవారు. ద్వితీయ రామేశ్వరరావు కాలంలో తిరుపతి వేంకటకవులు కూడా ఈ సంస్థానానికి వచ్చేవారు. ఈ సంస్థానం వారు వనపర్తిలో 'బ్రహ్మ విద్యా వికాస ముద్రాక్షర శాల' ను ఏర్పాటు చేశారు. ఇది తెలంగాణాలోనే మొట్టమొదటి ముద్రాక్షర శాల కావడం విశేషం. వీరు క్రీ.శ.1870 నుంచి 1923 వరకు అనేక గ్రంథాలు ముద్రించారు.

ఈ సంస్థానం వారు నన్నెచోడుని కుమార సంభవం, క్రీడాభిరామం, నీతిసార ముక్తావళి, అనర్ఘ రాఘవం, ప్రబంధ మణిభూషణం వంటి ఎన్నో అమూల్య గ్రంథాలను ముద్రించి వెలుగులోకి తీసుకొచ్చి తెలుగు సాహిత్య వికాసానికి దోహదం చేశారు. వనపర్తి సంస్థానం ప్రారంభమైన 150 సంవత్సరాల తర్వాత ఇక్కడ సాహిత్య వికాసం ప్రారంభమైంది. పదిహేడవ శతాబ్దం పూర్వార్థం నుంచి చివరి వరకు సాహిత్య వికాసం కొనసాగించి తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోయింది.

ఈ సంస్థానం క్రీ.శ. 1519 నుంచి క్రీ.శ. 1948 వరకు అనగా (భారత ప్రభుత్వంలో విలీనం అయ్యేంత వరకు) జనుంపల్లి వంశస్థులైన రెడ్డి రాజులు పూర్వ సంప్రదాయాల ప్రకారం న్యాయ పరిపాలన చేశారు. సంగీత, సాహిత్య, శిల్ప, నాట్య కళలను పోషించారు. ఇందులో సాహితీవేత్తలైన కవి పండితుల రచనల వల్ల ఆ వంశ చరిత్ర మనకు నేడు లభ్యమౌతోంది.

**ఆత్మకూరు సంస్థాన సాహిత్యం**

నైజాం పత్ర వ్యవహారంలో 'అమరచింత' సంస్థానం అని పేర్కొనబడిన ఈ ఆత్మకూరు సంస్థానం వనపర్తి జిల్లాలోనిది. ఈ సంస్థానాధిపతులు కూడా పాకనాటి రెడ్డి వంశీయులే. వీరి ఇంటిపేరు 'ముక్కర'వారు. తక్కువ ఆదాయం గల సంస్థానం. ఆనాడు ఐదు లక్షలకు మించిన ఆదాయం వీరికి లేదు. అయితేనేమి వితరణగుణ విద్వత్పక్షపాత కవి పోషణములందు వీరు గద్వాల్ రాజులతో పోటీపడేవారు. తమ దగ్గరికి వచ్చిన శ్రీ గాడేపల్లి వీర రాఘవశాస్త్రి శతావధాని మొదలైన కవులను ఈ సంస్థానాధీశుడై యుండిన శ్రీరామ భూపాలుడు గద్వాల రాజు మీకేమిచ్చినారండీ? అని అడిగి సత్కరించేవాడట.

వీరి మూలపురుషుడు గోపాలరెడ్డి. ఈయన సంతతి వారు సుల్తానులకు, పేష్వాలకు, ఆసఫ్జాహీ వంశీయులైన నవాబుకు యుద్ధ సమయంలో సహాయపడుతూ సామంతులై యుండి వారి ఆదరణ పొందుచు, దేశ్‌ముఖ్, దేశ్‌పాండే, సర్ దేశ్‌ముఖ్, సర్‌దేశ్‌పాండే, నాడగౌడ్, సర్ నాడగౌడ్, మహారాజ ఇత్యాది బిరుదులు గలవారై అమరచింత (ఆత్మకూరు) సంస్థానాన్ని వృద్ధి పరుచుకున్నారు. వీరి కులదైవం కురుమూర్తి అను ప్రదేశమున కొండపై వున్న శ్రీ శ్రీనివాసస్వామి. శ్రీనివాస విలాసాది గ్రంథాలు ఈ దేవునిపైనే రచించారు. ఆత్మకూరు సంస్థాన ప్రభువులు దేవ బ్రాహ్మణులకు ఇవ్వబడిన ఇనాములు, గృహారామ క్షేత్రాలను చిట్టచివర సమయము వరకు పాలించిన శ్రీ భాగ్యలక్ష్మీ మహారాణీ కాలము వరకు కాపాడిన వదాన్య శేఖరులు.

సురపురం కేశవయ్య అనే కవి నిరోష్ఠ్య రామాయణాన్ని రచించి ఈ సంస్థాన పూర్వ ప్రభువై యుండిన శ్రీ రాజా సోమభూపాలునకు అంకితం చేసినాడు. ఈ ప్రభువులకు గురు వంశంవాడైన శ్రీ తిరుమల బుక్క పట్టణం రంగాచార్యులు గారు 'గుణ రత్నాకరము' పద్మినీ పరిణయం అనే చంపూ గ్రంథాలను రచించారు. ఈ సంస్థానానికి చెందిన అరిశాణపాలెం వేంకటాధ్వరి లక్ష్మీ సహస్రమునకు వ్యాఖ్యను రచించెను. ఇలా ప్రాచీన కాలం నుంచి కవి పండిత పోషణము జరిపారు. శ్రీ తిరుమల బుక్క పట్టణం శ్రీనివాసాచార్యుల వారు రాజగురువులైన యుండిన ఉద్ధండ పండితులే కాక, మహా కవులు కూడాను. బుచ్చి వేంకటాచార్యుల వారి వద్దను, మైసూరులోనూ, కాశీలోనూ విద్యనభ్యసించారు. మైసూరు విద్వత్సభలో బాలసరస్వతి బిరుదును, నవద్వీపం నందు తర్కతీర్థ బిరుదును సంపాదించి, దర్భాంగ, జోధ్‌పూర్, బందీదత్తియం, గ్వాలియార్, జ్యోతిపురం, కొటాంజం, ఇందూరు, ధారానగర్, జమ్మూ మొదలైన సంస్థానాలకు వెళ్ళి సత్కారాలను, స్వర్ణ పతకాలను పొందాడు. బనగానిపల్లి, పెనుకొండ, సురపురం, ఆదెగొంది మొదలైన ప్రదేశాలలో శతఘంటా కవనము, ఆశుకవితా ప్రదర్శనలు చేసి విశేషంగా సత్కరించబడిరి.

ఈ బాల సరస్వతి బుక్కపట్టణం శ్రీనివాసాచార్యుల వారు, ఆత్మకూరు సంస్థానాన్ని శ్రీ సీతారామ భూపాలరావు ఏలుచున్న కాలమున ఆస్థాన పండితులుగా వుండిరి. వీరి కాలంలో జగద్విఖ్యాత శతావధానులైన శ్రీ తిరుపతి వేంకటేశ్వర కవులు ఆత్మకూరు సంస్థానానికి వచ్చుటయు, శ్రీ శ్రీనివాసాచార్యుల వారికి, తిరుపతి వేంకటేశ్వర కవులకు

వాదోపవాదాలు జరుగుటయు మొదలైన చారిత్రక అంశాలు జరిగాయి. ఉద్ధండ పాండితీ వైభవోపేతులైన ఇరువురు సాహిత్య కవితా యుద్ధములు చేయుగా, రసజ్ఞులు ఆనందించారు. రాజు గురువాజ్ఞ మీరలేక ఘనసీయ యశస్కులైన అతిథులను నిరాకరింపలేక మధ్యలో నలిగిపోయారు. ఆరు మాసాలు జరిగిన పాండితీ ఖండనమును గురుభక్తి పరాయణుదును, సుకవీశ్వర చరణ కమల సేవాధురంధరుడగు శ్రీ సీతారామ భూపాలరావు వారిని ప్రసన్నులను జేసి తన ఔదార్యం చేత తిరుపతి వేంకటేశ్వర కవులను తృప్తిపరిచాడు.

**గోపాలపేట సంస్థాన సాహిత్యం**

వనపర్తికి సమీపాన వుండిన ఒక చిన్న సంస్థానం. దీని ప్రభువులు జనుంపల్లి వారు. వనపర్తి వారితో వుండి చీలిన శాఖవారు ఈ రాజులు. వనపర్తి రాజులలో పూర్వుడైన బహిరీ గోపాలరావు పేరుతో నిర్మించడం చేత దీనికి ఈ పేరు వచ్చింది. వీరు కూడా కవి పండిత పోషణమును చేశారు. పూర్వపు రాజ శ్రీ జక్పాల్ రావు గారి సమయమున శ్రీ పల్లా లక్ష్మీనరసింహ శాస్త్రి శ్రీ బుక్కపట్టణం రాఘవాచార్యులు, శ్రీ కేశవ పంతుల సింగయ్య సిద్ధాంతి, కాకునూరి అప్పకవి వంశీయులు మొదలైన కవి పండితులను పోషించారు. ఈ సంస్థానమునకు చెందిన చింతకుంట గ్రామలో 'మంగువారు' అనే కవులుండేవారు. మంగువారు జగమెరిగిన వారు. చికిలి జాగంట సిరిగుల్కు చింతకుంట ఇత్యాది పద్యాలు మాత్రం లభ్యములు.

శ్రీ బుక్కపట్టణం రాఘవచార్యుల వారు వ్యాకరణ శాస్త్రంలో ఉద్ధండ పండితులు. కాశీ నగరమున విద్యనభ్యసించి, వచ్చి, మైసూరు సంస్థానంలో ఆ కాలమున 'అపార పతంజలి' గా పేర్కొనబడిన శ్రీమాన్ కస్తూరి రంగాచార్యుల వారు చేసిన విద్వత్పరీక్షలో ఉత్తీర్ణులైరి. వారిచేత ఎక్కువగా ప్రశంసించబడి సంస్థాన సత్కారము బహుకాలం పొందుతూ తెలంగాణకే కీర్తి తెచ్చిన మహా విద్వాంసుడు రాఘవాచార్యుల వారు. వీరి కుమారులిద్దరూ పండితులు. పెద్దవాడైన శ్రీరామచంద్రాచార్యులు శతావధాని. ఆనంద రామాయణం మొదలైన అనేక కావ్యాలను తెలుగులో రచించారు. శతాధికంగా రచింపబడిన రచనలన్నీ అముద్రితాలే. వీరి తమ్ముడు శ్రీరంగాచార్యుల వారు సంగీత సాహిత్యాలను నేర్చుకున్న పండితులు.

**మానాజి పేట సంస్థానం**

ఖిల్లా ఘనపూర్ మండలంలోని మానాజీపేట దేశ్‌ముఖ్‌గారైన శ్రీ తూము రామకృష్ణారెడ్డి గారు తమ తాతైన తూము రామచంద్రావనీపాల ప్రణీతమైన అలమేలు మంగపరిణయాన్ని ప్రకటించాడు. ఈ సంస్థానాధీశుల సాహిత్యాన్ని వెలికి తీయాల్సిన అవసరం వుంది. అలాగే చంద్రగఢ్ సంస్థానంలో వెలువడిన సాహిత్యాన్ని పరిశీలిస్తే మరికొన్ని అంశాలు వెలుగులోకి వస్తాయి.

**సంస్కృతి**

వనపర్తి నియోజకవర్గం, తెలంగాణాలోని ఇతర జిల్లాల కన్నా కొంత వెనకబాటు కనిపిస్తుంది. విద్యా విషయంలోను ముందంజలో వున్న పరిశ్రమల విషయంలో వెనుకబడిన జిల్లా అనేది వాస్తవం.

వనపర్తి సంస్థానాధీశుల కాలంలో ఈ ప్రాంతంలో గొప్ప సాంస్కృతిక విప్లవం వచ్చింది. ఆనాటి నుంచి నేటి వరకూ కొనసాగుతోంది. రెండవ రామేశ్వరరాయల కాలంలో నిమ్న జాతుల వారికి తన సంస్థానంలో సమాన పదవులు, సహపంక్తి భోజనాలు, బాల్య వివాహాలు రద్దు మొదలైన సాంఘిక కార్యక్రమాలు చేపట్టారు. వీరిని తెలుగు ప్రాంతంలో మొట్టమొదట సంఘ సంస్కర్తగా పేర్కొన్నవారు సురవరం.

**ఆచారాలు, సంప్రదాయాలు, పండుగలు**

వేదాల నుంచి, పురాణేతిహాసాల నుంచి, వివిధ మత గ్రంథాల నుంచి సంక్రమించిన అనేక జీవన విధానాలను ఈ జిల్లా ప్రజలు ఆచరించి నైతిక ప్రవర్తనతో భాసిల్లుతున్నారు. సంప్రదాయంలో భాగమైన వివిధ పండుగలను, నోములను, వ్రతాలను, ఆచారాలను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకొని ఆధ్యాత్మిక జీవనంలో ముందున్నారు. వివిధ పండుగల ద్వారా కలిసి మెలిసి జీవించే తత్వాన్ని పెంపొందించుకుంటూ భక్తిని చాటుతున్నారు. ఇక్కడ బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకొని మహిళాశక్తిని,

సంప్రదాయాన్ని చాటుతారు. దసరా, దీపావళి, ముక్కోటి ఏకాదశి, సంక్రాంతి, మహాశివరాత్రి, వినాయక చవితి, హోళీ, రాఖీ పౌర్ణమి, ఉగాది, తొలి ఏకాదశి హిందువులు జరుపుకుంటారు. బక్రీద్, రంజాన్, మిలాదున్నబీ , గుడ్‌ఫ్రైడే, క్రిస్మస్ లాంటివి ముస్లింలు, క్రిస్టియన్లు జరుపుకుంటారు.

**జాతరలు**

సంస్థానాధీశులు ఆలయాలను నిర్మించడంతో బాటు వాటి ప్రాముఖ్యతను చాటుటకు జాతరలు, ఉత్సవాలు కూడా జరిపేవారు. ఆత్మకూర్ సంస్థానంలో కురుమూర్తి, ఆత్మకూరు జాతరలు, గోపాల్‌పేట, కేశంపేట జాతరలు, గోపాల్‌పేట సంస్థానంలో శ్రీరంగపురం, రాజనగరం, పెద్దగూడెం, కానాయపల్లి, అమడబాకుల, కొమ్ములగట్టు, రాజపేట జాతరలు వనపర్తి సంస్థానంలో బెక్కం జాతరను జటప్రోలు సంస్థానాధీశులు జరిపించేవారు.

ఇంకా ఈ జిల్లాలో చెప్పుకోదగినవి శ్రీరంగపురం రంగనాయక స్వామి జాతరలు, ఆత్మకూర్ పరమేశ్వర స్వామి జాతర, రాజనగరం జాతరలు దాదాపు 300 ఏళ్ళనుంచి కొనసాగుతున్నాయి. ఈ జాతర సమయాల్లో ఆయా సంస్థానాధీశులు ప్రత్యేక ఏర్పాట్లు చేసేవారు. అలాగే అమరచింత షేక్ సయ్యద్‌షావలీ ఉర్సు, పానగల్, ఈదయ్య జాతర, వీపనగండ్ల పాముకాటు జాతర, బెక్కి మఠం రామయ్య జాతరలు ఈ జిల్లాలో జరుగుతాయి.

**కళలు**

వనపర్తి జిల్లాకు కళా క్షేత్రంలో విశిష్ట స్థానముంది. తెలంగాణాలో విలక్షణమైన జిల్లాగా, సంస్థానాల ఖిల్లాగా లలిత కళలకు కాణాచిగా ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ జిల్లాలో వనపర్తి, ఆత్మకూరు, గోపాల్‌పేట, మానాజిపేట్ సంస్థానాలతో పాటు, జటప్రోలు సంస్థానంలోని కొంతభాగం ఉండటం వల్ల సంస్థానాధీశులు సంస్కృతాంధ్ర భాషా కవులను పోషించడమే గాక, వేదశాస్త్ర పండితులను, సంగీత నృత్యాది లలితా కళా నిపుణులను సన్మానించి, విజ్ఞాన వినోద వికాసాలకు దోహదపడ్డాయి. వనపర్తిలో తోలుబొమ్మలు, బుట్టబొమ్మలు, పగటివేషాలు, ఎలుగుబంటి వేషం, పులివేషం, కోలాటం లాంటి కళలు ఈ జిల్లాలో వెల్లివిరుస్తున్నాయి. జిల్లాలోనే ప్రసిద్ధిచెందిన 'సిడి' ఉత్సవాలు, పానుగల్లు ఈదమ్మ జాతరలో మేకపోతును సిడికి బంధించి దేవతలకు బలులిస్తారు. వీటితోపాటు జానపద కళాకారులు ఎక్కువగా వుండే జిల్లాగా ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది.

**సాహిత్యచరిత్ర**

సురవరం ప్రతాపరెడ్డి వెలువరించిన గోలకొండ కవుల సంచికలో మొత్తం 354 కవులుంటే, అందులో పూర్వకవి పరిచయం కింద పదకొండు మంది, ప్రక్రియల పరిచయం కింద 42 మంది మొత్తం 53 మంది వనపర్తి కవులే వున్నారు. ఇది ఈ జిల్లాకే గర్వకారణంగా చెప్పుకోవచ్చు.

వనపర్తి జిల్లా మొత్తం ప్రాంతం దాదాపు 400 ఏండ్లు సంస్థానాధీశుల పాలనలో కొనసాగడం వల్ల సంస్థానాధీశులు శిల్ప, సంగీత, సాహిత్యాది కళలను ఆదరించి సాంస్కృతిక వికాసానికి దోహదపడ్డారు. అనేకమంది కవి పండితులను పోషించారు. ఈ సంస్థానాధీశుల్లో కొందరు కవి పండితులున్నారు. వనపర్తి సంస్థానరాజు అష్టభాషా బహిరి గోపాలరావు గొప్ప పండితుడు. ఇతడు ఈ జిల్లా మొదటి కవి. రాజా ప్రథమ రామకృష్ణరావు జ్యోతిశ్శాస్త్రంలో పండితుడు. తిరుపతి వేంకటకవులు వనపర్తి సంస్థానానికి వచ్చి సత్కారాలు పొందారు. తెలంగాణ మొదటి ముద్రణాలయమైన 'బ్రహ్మ విద్యావిలాస ముద్రాక్షరశాల' ను వనపర్తి సంస్థానాధీశులు ఏర్పాటు చేశారు. ఇందులో మానవల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో నన్నెచోదుని కుమార సంభవం, క్రీడాభిరామం, నీతిసార ముక్తావళి, అనర్ఘ రాఘవం, ప్రబంధ మణిభూషణం వంటి ఎన్నో అమూల్య గ్రంథాలను ముద్రించి వెలుగులోకి తెచ్చారు.

ఆత్మకూర్ సంస్థానంలో సురపురం కేశవయ్య నిరోష్ఠ్య రామాయణం రచించి రాజా సోమభూపాలునకు అంకితమిచ్చాడు. బుక్కపట్టణం రంగాచార్యులు గుణ రత్నాకరము, పద్మిని పరిణయము, చంపూకావ్యాలు రచించాడు. అరిశణపాలెం వేంకటాధ్వరి లక్ష్మీసహస్రమునకు వ్యాఖ్యను రచించాడు. ఈ సంస్థానంలో తిరుమల బుక్కపట్టణం శ్రీనివాసాచార్యులు బాలసరస్వతి బిరుదు పొందాడు. తెలుగులో మొట్టమొదటి పి.హెచ్‌డి. చేసిన చిలుకూరి

నారాయణరావు ఆత్మకూరు సంస్థానానికి వచ్చి కురుమూర్తినాథ శతకం రాసి, సంస్థానాధీశులకు అంకితమిచ్చాడు. ఈ సంస్థానాధీశులు కూడా ఎన్నో విలువైన గ్రంథాలను ముద్రించి వెలుగులోకి తెచ్చారు. సురవరం ప్రతాపరెడ్డికి గోల్కొండ ప్రెస్‌ను కూడా ఈ సంస్థానాధీశులే దానం చేసినారు.

గోపాల్‌పేట సంస్థానంలో పల్లా లక్ష్మీనరసింహారావు, బుక్కపట్టణం రాఘవాచార్యులు, కేశవపంతుల సింగయ్య సిద్ధాంతి మొదలైన కవులుండేవారు. ఈ సంస్థానానికి చెందిన చింతకుంట గ్రామంలో 'మంగువారు' అనే కవులుండేవారు. "మంగువారు జగమెరుంగు వారు" అనే నానుడి ఈ జిల్లాలో బహుళ వ్యాప్తిలో వుంది. కేశంపేటలో జరిగిన జాతరలో ఎందరో కవి పండితులు పాల్గొనేవారు. అలాగే మానాజిపేట, చంద్రగఢ్ సంస్థానాల్లో అక్కడక్కడ కవులున్నట్లు కనిపిస్తుంది. ఆ వివరాలు వెలుగులోకి రావాల్సి వుంది.

గోనబుద్ధారెడ్డి తెలుగులో తొలి ద్విపద రామాయణం రాశాడు. తెలుగు సాహిత్యంలో ఇది చాలా ప్రసిద్ధిపొందింది. వీరి కుమారులు కాచవిభుడు, విఠ్ఠలనాథులు తొలి తెలుగు సోదర జంట కవులుగా కీర్తికెక్కారు. తండ్రి గోనబుద్ధారెడ్డి రాసిన రంగనాథ రామాయణంలో ఉత్తర కాండను వీరు పూర్తిచేశారు. గోనబుద్ధారెడ్డి కుమార్తె అయిన కుప్పాంబిక తొలి తెలుగు కవయిత్రిగా పేరు గాంచింది.

**ఆచార్య ఎస్వీ రామారావు :** శ్రీరంగాపురం వాస్తవ్యులైన ఆచార్య ఎస్వీరామారావు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో శాఖాధ్యక్షులుగా, డీన్‌గా పనిచేశారు. విమర్శ ప్రక్రియపై ప్రప్రథమ ప్రామాణిక పరిశోధనా గ్రంథం 'తెలుగులో సాహిత్య విమర్శ'ను వెలువరించారు. ఈ పుస్తకం ఐదు ముద్రణలు పొందింది. అన్ని విశ్వవిద్యాలయాల్లో ఈ గ్రంథం పాఠ్యాంశంగా వుంది. అన్వీక్షణం, సమవీక్షణం, అభివీక్షణం, మనోవీక్షణం, కావ్యామృతం వ్యాస సంపుటాలు, 20 వ శతాబ్ది కవిత, విమర్శక వతంసులు, పాలమూరు సాహితీ వైభవం, పాలమూరు ఆధునిక కవుల చరిత్ర, తెలంగాణ సాహితీ చరిత్ర మొదలైన పుస్తకాలతో పాటు 50 పుస్తకాలు వెలువరించారు.

**ఆచార్య ఎల్లూరి శివారెడ్డి :** కల్లూరుకు చెందిన వీరు ఉస్మానియాలో తెలుగు శాఖాధ్యక్షులుగా, తెలుగు విశ్వ విద్యాలయం ఉపకులపతిగా సేవలందించారు. 'సురవరం ప్రతాపరెడ్డి జీవితము, సాహిత్యము' అనే గ్రంథానికి సాహిత్య అకాడమీ అవార్డును పొందారు. భావదీపాలు వ్యాస సంపుటిని, పూలకారు అనే వచన కవిత్వాన్ని వెలువరించారు. తిక్కన విరాటోద్యోగములోని రస పోషణపై డాక్టరేట్ పట్టా పొంది, కొన్ని తిక్కన పద్యాలకు చక్కని వ్యాఖ్యను కూర్చారు.

**పోల్కంపల్లి శాంతాదేవి :** వీరు వనపర్తి నివాసి. వీరు 73 నవలలు రాసి తెలంగాణాలో అత్యధిక నవలలు రాసిన రచయిత్రిగా పేరు గాంచారు. వీరు రాసిన నవలలు సినిమాలుగా, టీవీ సీరియల్స్‌గా వచ్చాయి. నవలలతో పాటు మూడు కథాసంపుటాలు, దాదాపు 300 కథలు వెలువరించారు. స్త్రీవాద చైతన్యం వీరి సాహిత్యంలో మనకు కనిపిస్తుంది. వీరితో పాటు రాజ్యలక్ష్మి, కోట్ల వెంకటేశ్వర రెడ్డి, జనజ్వాల, స్వర్ణ సుధాకర్‌రెడ్డి, తంగెళ్ల శ్రీదేవి రెడ్డి, కోట్ల వనజాత, గుంటిగోపి, దాసరి రంగ, నాగవరం బలరాం, రమేష్‌బాబు మొదలైన ఆధునికులు వివిధ ప్రక్రియల్లో రచనలు చేస్తున్నారు.

**గుడిమంచి సుబ్రహ్మణ్య శాస్త్రి :** వీరు శ్రీరంగాపురం వాస్తవ్యులు. భావకల్పన శిరోమణి బిరుదాంకితులు. భారత సంగ్రహము అనే కావ్యాన్ని రచించారు. చింతామణి యామునాచార్యులు శంకరంపేట వాసి. తెలుగులో ఛందో పద్ధతిలో ఆంధ్ర లక్షణ శ్లోకములను లక్షణోదారణముతో రాశారు. జాజాల వాసుదేవశర్మ సంస్కృతాంధ్ర ఉర్దూ భాషలయందు ప్రావీణ్యం సంపాదించారు. 'ఆంధ్ర సత్యనారాయణ కథలు' అనే గ్రంథం రాశారు. తెలకపల్లి రామచంద్ర శాస్త్రివీరు కవితా సోదరులు. వాసుదేవ శర్మ స్వాతంత్ర్యయోధులు, సంఘ సంస్కరణగా ఎన్నో సేవలు అందించారు. పల్లా అప్పయ్యశాస్త్రి, పల్లా వేంకట కృష్ణయ్య సంస్కృతాంధ్ర జ్యోతిష పండితులు.

**కమల :** 'ప్రాకృత సాహిత్యంలో ప్రతిఫలించిన భారతీయ జీవనము' అనే సిద్ధాంత గ్రంథాన్ని వెలువరించారు. వీరు సంస్కృత భాషా విదుషీమణి. కాదంబరి కావ్య సుష్మ, వ్యాస సూక్తము అనే గ్రంథాలు రచించారు.

**మల్యాల దేవీప్రసాద్ :** శ్రీరంగపుర నివాసి. మల్యాల దేవీప్రసాద్ మెదక్ జిల్లా సంగారెడ్డి స్థిర నివాసం ఏర్పర్చుకొని 1951 లో సంగారెడ్డి నుంచి పల్లెటూరు అనే సాహిత్య మాసపత్రికను నడిపారు. మెదకు మండల సాహిత్య చరిత్రను కూడా వెలువరించారు. యాదవ చంద్రిక, గొల్లల వంశ చరిత్ర, భారతోదయం, పద్యకావ్యం, రంగ శతకం మొదలైన కావ్యాలతో పాటు తత్వాలు, భజనకీర్తనలు రచించారు.

**వల్లపురెడ్డి బుచ్చారెడ్డి :** వీరు కావ్య పరిష్కరణ రంగంలో కృషి చేసి గొప్ప పరిశోధకులుగా గుర్తింపు పొందారు. చింతపల్లి వీర రాఘవ కవి 'మధురవాణీ విలాసం' మరింగంటి జగన్నాథాచార్యుల శ్రీ రంగనాథ విలాసము అనే కావ్యాలను పరిష్కరించారు. కేశవయ్య నిరోష్ఠ్య రామాయణం, దాశరథి చరిత్రను పరిష్కరించడంతో పాటు 'కవికర్ణ రసాయనముపై 'నరసయ్య సరస కవిత' పేరుతో సమీక్షా గ్రంథం ప్రకటించారు. ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతకానికి టీకాను సమకూర్చారు.

**తోటపల్లి బాలకృష్ణ శర్మ :** వనపర్తి స్వగ్రామం గల బాలకృష్ణ శాస్త్రి వాఙ్మయంలో గురువుకు గల ప్రాధాన్యాన్ని విశదీకరిస్తూ గురువిజ్ఞాన సరస్వము, వేద శాస్త్రములను మదించి ఓంకార తత్వమును ప్రకటించారు.

### సాహితీ సంస్థలు

**జ్యోతిర్మయి సాహితీ సంస్థ :** దీనిని ఆచార్య ఎస్వీ రామారావు 1962 లో ప్రారంభించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా రచయితల తొలి సమావేశాలు 1964 లో వనపర్తిలో సినారె ముఖ్య అతిథిగా నిర్వహించారు. ఈ సంస్థ నుండి పాలమూరు జిల్లా అముద్రితాంశాలను ఎన్నో వెలుగులోనికి తీసుకుని వచ్చారు. ఆత్మకూర్ సంచిక, అలంపూర్ సంచిక వెలువరించారు. పాలమూరు జిల్లా తొలి కవుల కవితా సంకలనం జ్యోతిర్మయిని 1964 లో వెలువడింది. ఉమ్మడి పాలమూరు జిల్లా తొలి కథా సంకలనమైన 'సమర్పణ' ఈ సంస్థనుండి వెలువడింది.

**శ్రీరంగాపూర్ సేవాసమితి :** శ్రీరంగాపూర్ ప్రాంతానికి చెందిన ఆచార్య ఎస్వీ రామారావు ఈ సంస్థను ఏర్పాటు చేసి తమ తండ్రిగారి పేరుమీదుగా ప్రతి సంవత్సరం పురస్కారం అందిస్తున్నారు. ఇప్పటికీ గుంటిగోపి కార్యదర్శిగా ఎన్నో సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**సాహిత్య కళావేదిక :** ఉమ్మెత్తల లక్ష్మీనరసింహ మూర్తి 1984లో ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ద్వారా సాహిత్య దుందుభి మాస పత్రికను 3 సం॥లు వెలువరించారు. ఎన్నో సాహిత్య కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా పాలమూరు సాహిత్యాన్ని పత్రిక ద్వారా వెలువరించారు.

**సాహితీ కళావేదిక :** ఓంకార్, శంకర్‌గౌడ్‌లు స్థాపించి ప్రతినెల ప్రముఖ సాహితీవేత్తల వర్ధంతులను, జయంతులను నిర్వహిస్తున్నారు. అనేక పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వనపర్తి జిల్లాలో చురుకుగా పనిచేస్తున్న సంస్థ ఇది.

### వివిధ రంగాల ప్రముఖులు

వనపర్తి జిల్లాలో చారిత్రక, సాంస్కృతిక, సాహిత్య, కళాత్మక, రాజకీయ ప్రముఖులు ఆవిర్భవించి ఈ ప్రాంత ఔన్నత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. సంఘసంస్కర్త రామేశ్వర రాయలు, తొలి తెలుగు కర్త గోనబుద్ధారెడ్డి, తొలిజంట కవులు గోన విఠ్ఠలనాథుడు, కాచవిభుడు, తొలి తెలుగు కవయిత్రి కుప్పాంబిక, తెలంగాణాలో మొదటి ముద్రణాశాల, హైదరాబాదు తొలి కొత్వాల్ రావ్ బహదూర్ వెంకట్రామిరెడ్డి, మహబూబునగర్ జిల్లాలో మొదటి బస్సు స్టేషన్‌ను అందించిన ఘనత వనపర్తి జిల్లాదే.

తెలుగు విశ్వవిద్యాలయ వీసీగా పనిచేసిన ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, సాహిత్య విమర్శకులు ఆచార్య ఎస్వీ రామారావు, తెలంగాణ నవలా రచయిత్రి పొల్కంపల్లి శాంతాదేవి, 5 నంది అవార్డ్స్ గ్రహీత ఆర్.సి.యం రాజు, నాటక రంగంలో నంది అవార్డు గ్రహీత, తెలుగు విశ్వవిద్యాలయ ఆచార్యులు కోట్ల హనుమంతరావు, ప్రముఖ సంగీత దర్శకులు కె.ఎం. రాధాకృష్ణన్, ప్రముఖ దర్శకులు ఎం. వేంకటేశ్వరావు, నంది అవార్డు గ్రహీత కోట్ల తన్మయి, ప్రసిద్ధ నాటక కళాకారుడు దుప్పల్లి శ్రీరాములు ఈ జిల్లావారే. రాజకీయ రంగంలో రామేశ్వరరావు, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి (రాష్ట్ర ప్రణాళికా సంఘం అధ్యక్షులు), రాణి కుముదిని దేవి, చిన్నారెడ్డి (కాంగ్రెస్), రావుల చంద్రశేఖరరెడ్డి (టీడీపీ) లాంటి వారు ఈ జిల్లాకు మకుటాయమానంగా వెలుగొందుతున్నారు.

## దర్శనీయ ప్రదేశాలు, పర్యాటకం

ఈ జిల్లా పర్యాటక రంగానికి అనుకూలం. శ్రీరంగ పురంలోని రంగనాథ ఆలయం, మంచి చారిత్రక పర్యాటక ప్రాంతం. జూరాల ప్రాజెక్టు, ఆటోమెటిక్ సైఫన్ సిస్టం గల ఆసియాలో మొదలైన సరళసాగర్, వనపర్తిలోని ఎకోపార్క్, తిరుమలయ్య గుట్ట, సప్త సముద్రాలు పర్యాటక ప్రాంతాలుగా విలసిల్లుతున్నాయి.

**ఖిల్లా ఘనపురం :** ఇది వనపర్తి 27 కి.మీ. దూరంలో వుంది. ఇది పూర్వం కాకతీయ సామంత రాజ్యం. కాకతీయ గణపతి దేవచక్రవర్తి పేరుతో ఒక దుర్గముంది. గోన గన్నారెడ్డి ఖిల్లా ఘనంగుట్టపై దుర్గాన్ని, గుట్టకింద గణపతి దేవుని పేరుతో గణపేశ్వర ఆలయాన్ని కట్టించాడు. ఈ గుట్ట పరిసర ప్రాతంలో కుతుబ్‌షాహీల కాలంనాటి శాసనాలు దర్శన మిస్తాయి. అల్లావుద్దీన్ ఈ కోటపై దండయాత్ర చేసిన ఆధారాలున్నాయి.

కేశంపేట గ్రామాన్ని గోపాల్‌పేట సంస్థాన రాణి అయిన కేశమ్మ నిర్మించింది. ఇక్కడి గోపాలస్వామి ఆలయం ప్రసిద్ధం. పక్కనే వున్న కోనేరు ఇప్పటికీ మనకు కనిపిస్తుంది.

**ఆత్మకూరు :** అమరచింత సంస్థానాధీశుల కాలంలో గొప్ప విద్యా కేంద్రంగా వుంది. ఈ గ్రామంలోని పరమేశ్వర స్వామి ఆలయం చెరువు మధ్యలో వుంది. ఇదే గ్రామంలోని సాయిబాబా ఆలయం దర్శింపదగింది.

**పానుగల్లు :** పానుగల్లు చారిత్రక ప్రసిద్ధి గల గిరిదుర్గం. ఈ దుర్గము మొదట పద్మనాయకుల ఏలుబడిలో వుంది. తర్వాత బహుమనీ, విజయనగర, కుతుబ్‌షాహీ పరిపాలన కొనసాగింది. కుతుబ్‌షాహీ వంశస్థాపకుడు సుల్తాన్ కులీ కుతుబ్‌షా విజయనగర రాజు అచ్యుత దుర్గము మధ్యలో 'బాల హిస్సారము' అనే కోట వుంది. 16,17 శతాబ్దం నాటి శాసనాలు ఇక్కడ కనిపిస్తాయి. బాలనాగమ్మ, మాయల ఫకీరుల కథ పానుగల్లుతో సంబంధమున్నట్లు ఇక్కడి ప్రజల భావన.

**బెక్కం :** శ్రీరంగపురంలోని గ్రామం. ఈ గ్రామ సమీపంలో 11 ఆలయాలున్నాయి. కల్యాణీ చాళుక్య త్రిభువనమల్ల ఆరవ విక్రమాదిత్యుని సామంతుడు బిజ్జరసు ఈ ప్రాంతాన్ని పాలించాడు. శ్రీశైల ప్రాజెక్టు ముంపుకు గురైంది ఈ గ్రామం. 12,13 వ శతాబ్దంలోని శైవ మత ఆనవాళ్లు ఇక్కడ చాలా వున్నాయి. చారిత్రక పరిశోధకుల దృష్టికి వస్తే ఆ విషయాలు వెలుగులోకి వస్తాయి.

## దేవాలయాలు

వనపర్తి జిల్లాలో సంస్థానాలుండటం వల్ల ఇక్కడ ఎన్నో వైవిధ్యభరిత ఆలయాలున్నాయి. దాదాపు 800 ఏళ్ళ క్రిందటి నుంచి ఇక్కడ ఆలయాలు వెలిసినట్లు చెబుతారు.

**రంగనాయక స్వామి ఆలయం :** ఈ ఆలయం శ్రీరంగాపురంలో ఉంది. సుమారు మూడు శతాబ్దాలకు పూర్వం వనపర్తి రాజు బహిరి గోపాలరావు నిర్మించాడు. దీనిని ఎత్తైన చోట నిర్మించారు. ఆలయాన్ని అనుకొని రంగసముద్రం వుంది. శ్రీరంగమున గల రంగనాథాలయ నిర్మాణం లాగే ఈ ఆలయ నిర్మాణం కూడా వుంటుంది. ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ అష్టమి నుంచి బహుళ విదియ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ దేవాలయ గోపురం అతి మనోహరమైంది. చక్కని సింహద్వారం, అపురూప శిల్ప సంపద కలిగి వుండటం వల్ల సినిమా షూటింగ్‌లు చేస్తారు.

**కేశవ శివాలయం :** గోపాల్‌పేటలో శివ కేశవాలయాలు రెండూ ఒకే దగ్గర వుండటం వలన దీనిని హరిహర క్షేత్రమంటారు. ఈ రెండు ఆలయాల మధ్య పుష్కరిణి వుంది. గోపాలుపేట సంస్థానాధీశుడు గోపాల రాయుడు ఇచట వెలసిన ఆలయాలను పునరుద్ధరించి గోపురము కట్టించి, ప్రాకారం నిర్మించాడు. అపురూప శిల్ప సంపదకు నిలయం ఈ ఆలయం.

**గణపేశ్వరాలయం :** ఖిల్లా ఘన్‌పూర్‌లో వున్న ఆలయాన్ని గోన గన్నారెడి ముస్లిం దండయాత్రల వల్ల ఈ ఆలయం తర్వాత మసీదుగా మార్చబడింది. అందుకు సంబంధించిన ఆనవాళ్ళను మనం చూడవచ్చు. గుట్టపైన గోనగన్నారెడ్డి వీరభద్రుని, నరసింహ స్వామి ఆలయాలు కట్టించాడు.

**బెక్కమేశ్వరాలయం :** ఈ ఆలయం బెక్కర గ్రామంలో వుంది. ఇక్కడి శివుడిని బెక్కమేశ్వరుడు అని అంటారు. ఇక్కడ గొప్ప చెరువును తవ్వి కాశీనుంచి మోక్షేశ్వర, సాక్షేశ్వర లింగాలను తెప్పించి, గుడులు కట్టి ప్రతిష్టించారు. కొత్తగా ఈ ఆలయానికి గోపురాన్ని నిర్మించారు. మహిషాసుర మర్దిని ఆలయము, కాళిక, నటరాజ ఆలయాలు ముఖ్యమైనవి. ఇక్కడి ఆలయాలపై మార్జాల ప్రతిమలున్నాయి.

**రామకృష్ణాలయము :** వనపర్తికి 5 కి.మీ. దూరంలో రాజా నగర గ్రామంలో ఈ ఆలయం వుంది. రామకృష్ణరాయలు ఈ గ్రామ నిర్మాత. ఈ ఆలయాన్ని రాతితోను, గోపురమును ఇటుక సున్నముతో వనపర్తి రాణి నాంచారమ్మ కట్టించారు.

**గండి ఆంజనేయస్వామి :** బుద్దారం గ్రామంలో వెలసిన ఈ స్వామి చాలా మహిమాన్వితుడు. ఈ ఆలయం పక్కనే గోనబుద్ధారెడ్డి పేర గోన గన్నారెడ్డి బుద్దాపురం అనే గ్రామంతో పాటు బుద్ధ సముద్రాన్ని తవ్వించాడు. ఇక్కడే బుద్ధేశ్వరాలయము వుంది. ఇక్కడ ప్రతి ఏకాదశికి, శివరాత్రికి ప్రత్యేక పూజలుంటాయి.

**నృసింహాలయం :** అంకూరు గ్రామానికి చేరువలో గుండ్లగుట్టపై భావనామూర్తి రూపమే ఈ ఆలయం. వనపర్తి రాజా కృష్ణ దేవరాయలు ఆలయాన్ని మట్టితోనే నిర్మింపబడి క్షీణదశలో వుంటే శివున్ని ప్రతిష్ఠించి పునరుద్ధరణ చేశాడు. నృసింహాలయము చెంతనే ఈ శివ ప్రతిష్ఠ జరిగింది. ఈ ఆలయము ముందున్న దీపస్తంభం అతి మనోహరం. దీనిపై నృత్య భంగిమలు చెక్కబడినాయి. ఇటుకలతో నిర్మించిన గుడిలో దీపపు ప్రతిమను ముట్టిస్తే, ఆ వెలుగు వనపర్తి వరకు కనిపిస్తుందని భావిస్తారు.

**అంజనగిరి వెంకటేశ్వరాలయం :** అంజనగిరి గుట్టపై పెద్ద గుండు కింద వేంకటేశ్వరుడు స్వయంభూగా వెలిశాడు. గుట్ట కింద మరొక వేంకటేశ్వరాలయం వుంది. ఈ దేవాలయ ఆవరణలో యజ్ఞవాటిక, అధ్యయన మండపం, ఆళ్వారు స్వాముల ప్రతిష్ఠలున్నాయి. గుట్టపై నున్న స్వామి వారికి అనునిత్యం పూజాదులు నిర్వహిస్తారు.

**ఆత్మకూరు :** ఆత్మకూరు ప్రాంతమందున్న ఒక తటాకమున ఆత్మలింగము లభించుట వలన ఇది ఆత్మపురమైందని ప్రజల నమ్మకం. ఇక్కడ ఈశ్వర, వేంకటేశ్వర, కేశవ, ఆంజనేయ స్వామి దేవాలయాలున్నాయి. శివరాత్రి మహోత్సవాలు అతి వైభవంగా జరుగుతాయి.

**ఏదులాపురము :** ఇది చింతకుంటకు చేరువలో వుంది. ఇక్కడ రామలింగేశ్వరాలయం వుంది. ఈ ఆలయ మందలి శివలింగం క్రమ క్రమంగా వృద్ధి చెందుతుంది. 11/2 అడుగుల ఎత్తైనదని ప్రజలు నమ్ముతారు. మహిమాన్వితుడైన శివుడు లింగరూప ధారియై ఇక్కడ నివసించుచున్నాడని ప్రజల నమ్మకం.

**కేశంపేట :** గోపాలపేట రాణి కేశమ్మ రాజా వెంకట లక్ష్మణరావు భార్య. ఆమె తన పేర కేశంపేట గ్రామాన్ని నిర్మించి, అచట వేణుగోపాల స్వామి ఆలయాన్ని కట్టించెను. ఆమె కోడలు లక్ష్మీనర్సమ్మ ఒక కోనేరును తవ్వించింది. ఈ ఆలయానికి నాలుగు ద్వారాలున్నాయి. రుక్మిణీ సత్యభామా సమేతుడై వున్న వేణుగోపాల స్వామి భక్తుల కోరికలు తీర్చే స్వామిగా భావిస్తారు.


వీటితో పాటు కొత్తకోట వేంకటేశ్వరాలయం, గట్ట కానాపురము రంగనాయక దేవాలయం, గోపాల్‌పేటలో వున్న కేశవాలయం, తెల్లరాళ్ళపల్లి గణపతి దేవాలయం, దగడ వేంకటేశ్వరాలయం, నారదగడ్డ శివాలయాలున్నాయి.

వనపర్తి సంస్థానంగా ఒకానొక రోజుల్లో గొప్పగా ప్రసిద్ధి పొందిన ఈ ప్రదేశం మళ్ళీ జిల్లాగా అవతరించింది. గొప్ప నీటి ప్రాజెక్ట్‌తో విలసిల్లుతున్న జిల్లా. అన్ని రంగాల్లో విశిష్టతను సాధించుకుని అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నదీ వనపర్తి జిల్లా.

# వరంగల్ అర్బన్ జిల్లా చిత్రపటం




250(9)



భద్రకాళి దేవాలయం



భద్రకాళి అమ్మవారు




వేయి స్థంబాల గుడి



వరంగల్ కోట



ఆచార్య బిరుదురాజు రామరాజు



ప్రజాకవి కాళోజి



డా. పల్లా దుర్గయ్య

# వరంగల్ (అర్బన్)

రాజసమొప్పు కాకతి విరాజిత దుర్గము భర్గరక్షయై
ఓజసమొప్ప నిల్చిన వహో! కదనోత్సవ కేళి లోలయై
రాజుల యోరుగల్లు ఘనరాజిత మద్రనరాలయంబుతో
పూజిత భద్రకాళి విరబూసిన సాంస్కృతిక ప్రభాసయై !

తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత రెండవ పెద్ద నగరం వరంగల్. సామాజిక, రాజకీయ ఉద్యమాలకు, విభిన్న సంస్కృతీ సంప్రదాయాలకు కాణాచి వరంగల్. సకలాంధ్ర ప్రాంతమును ఏకతాటిపై తెచ్చి పరిపాలించిన కాకతీయ చక్రవర్తుల రాజధానిగా విలసిల్లిన నగరం వరంగల్.

**ఈ పేరెందుకు?**

వరంగల్ అని పిలువబడుతున్న ఈ నగరానికి పూర్వం 'ఓరుంగల్లు', 'ఓరుగల్లు' అనే పేర్లు వ్యవహారంలో ఉన్నాయి. ఓరుంగల్లు శబ్దం నుండే వరంగల్లు, ఏకశిలా నగరం, ఏకశిలా పురి, ఏకోవల అని సంస్కృతీకరించిన రూపములు శాసనము లందు, కావ్యములందును కలవని ఆదిరాజు వీరభద్రరావు గారు తమ పరిశోధనలో తెలిపినారు. తెలుగు ప్రాంతము నంతటినీ పాలించిన కాకతీయులకు రాజధానిగా ఉన్న కారణంగా ఆంధ్రనగరి యని పేరు వచ్చింది. నిజాం నవాబు 1866లో వరంగల్, ఖమ్మం మెట్టులను కలిపి వరంగల్లు జిల్లాను ఏర్పాటు చేశాడు. 1953 అక్టోబర్ 1న వరంగల్లు, ములుగు, మహబూబాబాద్, జనగాం, పరకాల తాలూకాలతో వరంగల్లు జిల్లాగా ఏర్పడింది. 11.10.2016 జి.ఒ.ఎం.ఎస్. నెం. 231తో వరంగల్ జిల్లా ఐదు కొత్త జిల్లాలుగా విభజించ బడింది. 11 మండలాలతో ఈ జి.ఓ. ద్వారా వరంగల్ పట్టణ జిల్లా ఏర్పడింది.

**భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి**

వరంగల్ అర్బన్ $17^0$-57 మరియు $17^0$ -90 ఉత్తర అక్షాంశాల మధ్య $79^0$-30 మరియు $79^0$-50 తూర్పు రేఖాంశాల మధ్య వ్యాపించి ఉంది. 1309 చ.కి.మీ విస్తీర్ణంతో సముద్ర మట్టానికి 990 అడుగుల ఎత్తున ఉంది. ఈ జిల్లాకు ఉత్తరాన కరీంనగర్, తూర్పున వరంగల్ రూరల్, దక్షిణాన జనగామ, పశ్చిమాన సిద్ధిపేట జిల్లాలు సరిహద్దులుగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో అతి తక్కువ మండలాలు కలిగిన జిల్లా ఇదే.

**సహజ వనరులు**

ఖాజీపేట, మడికొండ పరిసర ప్రాంతాలలో గ్రానైట్ గనులున్నాయి. ఈ జిల్లాలో అధికభాగం మహా నగరమే.

**నేలలు :** ఈ జిల్లాలో నల్లరేగడి, ఎర్రమట్టి, ఒండ్రు నేలలు ఉన్నాయి.

**అడవులు** : జిల్లాలో అటవీప్రాంతం తక్కువే. అటవీ ప్రాంతం 1,309 చ.కి.మీ. అంటే మొత్తం భూమిలో 2.20శాతం మాత్రమే.

**నదులు :** వరంగల్ జిల్లాలో పెద్ద నదులేవీ లేవు.

**చెరువులు - ప్రాజెక్టులు :** వడ్డేపల్లి చెరువు, భద్రకాళి చెరువు, ధర్మసాగర్ చెరువు, మడికొండ చెరువు, హసన్‌పర్తి

**రెవెన్యూ డివిజన్లు - మండలాలు**

వరంగల్ అర్బన్ జిల్లాలో **వరంగల్ ఒకటే రెవెన్యూ డివిజన్ ఉంది. ఇందులో 11 మండలాలున్నాయి.**

1. వరంగల్ 2. ఖిలా వరంగల్ 3. హన్మకొండ 4. కాజీపేట 5. ధర్మసాగర్ 6. వేలేరు 7. ఐనవోలు 8. హసన్‌పర్తి 9. ఎల్కతుర్తి 10. భీమదేవరపల్లి 11. కమలాపూర్.

వీటిలో ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్ మండలాలను పూర్వపు కరీంనగర్ జిల్లానుండి విడదీసి వరంగల్ అర్బన్ జిల్లాలో కలిపారు. ఖిల్లా వరంగల్లు, కాజీపేట, వేలేరు, ఐనవోలు మండలాలు కొత్తగా ఏర్పాటు చేయబడ్డాయి.

చెరువులు ఈ జిల్లాలో ముఖ్యమైనవి. వీటిలో మొదటి మూడు వరంగల్ మహానగర సాగునీటి అవసరాలను తీరుస్తున్నాయి. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా ధర్మసాగర్ రిజర్వాయర్‌ను నింపుతున్నారు.

**జనాభా :** 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ జిల్లా జనాభా 10,93,841 కాగా, పురుషుల జనాభా 5,84,719, స్త్రీల జనాభా 5,45, 122. దీనిలో గ్రామీణ జనాభా భాతం 31.49%, పట్టణ జనాభా శాతం 68.51%. ఈ జిల్లా జన సాంద్రత 826. లింగ నిష్పత్తి 1000 : 937.

**అక్షరాస్యత :** అక్షరాస్యతా శాతం 76.17%. ఇది తెలంగాణ రాష్ట్ర సగటు అక్షరాస్యతా శాతం కన్నా 10% ఎక్కువ. పురుషుల అక్షరాస్యత 84.40%, స్త్రీల అక్షరాస్యత 67.08%.

## వరంగల్ అర్బన్ జిల్లా చరిత్ర

కాజీపేట, హన్మకొండ, వరంగల్ పట్టణాలను కలిపి వరంగల్ నగరంగా తీర్చిదిద్దారు. క్రీస్తు శకారంభం నుండి హనుమకొండ పట్టణమున్నట్టుగా చరిత్ర పరిశోధకులు గుర్తించారు. వరంగల్లును పరిపాలించిన గొప్ప రాజవంశం కాకతీయ వంశం. మొదటి బేతరాజు కుమారుడైన ప్రోలరాజు క్రీ.శ. 1050-1080, పశ్చిమ చాళుక్య ప్రభువు సోమేశ్వరుని వద్ద హనుమకొండను పొందినట్లు కాజీపేట శాసనం తెలుపుతుంది.

ప్రోలరాజు తరువాత రుద్రదేవ మహారాజు (1158-1195) రాజైనాడు. ఓరుగల్లు కోటను నిర్మించింది ఇతడే. ఇతని తరువాత గణపతి దేవుడు రాజైనాడు. కాకతీయ రాజులలో ఇతడు ప్రసిద్ధుడు. తిక్కన ఇతని ఆస్థానాన్ని దర్శించి, మహాభారతం వినిపించాడు. మనుమసిద్ధి కోల్పోయిన రాజ్యాన్ని తిరిగి గణపతిదేవ చక్రవర్తి సహాయంతో పొందగలిగాడు. ఓరుగల్లు పట్టణాన్ని అభివృద్ధి పరిచి, హనుమకొండ నుండి రాజధానిని ఓరుగల్లుకు మార్చింది ఇతడే.

గణపతిదేవ చక్రవర్తి తరువాత అతని కుమార్తె రుద్రమ దేవి (1262-1296) కాకతీయ సామ్రాజ్య సింహాసనాన్ని అధిష్టించింది. ఇటలీ దేశస్థుడైన మార్కోపోలో ఈ కాలంలోనే ఆంధ్రదేశంలో పర్యటించి రుద్రమదేవి పాలన ప్రజాను రంజకంగా ఉందని ప్రశంసించాడు.

కాకతీయ రాజులలో చివరిరాజు రెండవ ప్రతాప రుద్రుడు (1296-1323). ఇతని కాలంలోనే కాకతీయ సామ్రాజ్యం పతమైనంది. ఘియాజుద్దీన్ తుగ్లక్ వరంగల్‌పై దండెత్తి 1323లో ప్రతాపరుద్రుణ్ణి బందీగా పట్టుకొన్నాడు. అతణ్ణి ఢిల్లీకి తీసుకువెళ్లుచుండగా నర్మదా నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

కాకతీయుల అనంతరం వరంగల్ ప్రాంతం పద్మ నాయక రాజుల పాలనలోకి వెళ్లింది. వీరు కాకతీయుల సామంతులు. తురుష్క దండయాత్రలను ఎదుర్కొనటానికి దాదాపు 77 మంది నాయకులు ఒక్కటిగా ఏర్పడి, హిందూ రాజ్యాన్ని స్థాపించటానికి ప్రోలయ నాయకుని నాయకత్వంలో ఉద్యమించారు. వరంగల్ ప్రాంతాన్ని కాపయ నాయకుడు ఆక్రమించి, పరిపాలించాడు.

పద్మనాయక రాజుల అనంతరం ఓరుగల్లు బహమనీ సుల్తాన్‌ల పాలనలోకి, తదనంతరం గొల్కొండను పాలించిన కుతుబ్‌షాహీల పాలనలోకి వచ్చింది. 1687లో గోల్కొండను ఔరంగజేబు జయించటంతో ఓరుగల్లు ప్రాంతం మొఘలుల పాలనలోకి వచ్చింది. ఔరంగజేబు మరణం (1707) తర్వాత మొఘల్ సామ్రాజ్యం క్షీణించటం మొదలైంది. ఆ సమయంలో దక్కన్ సుబేదారుగా ఉన్న నిజాముల్‌ముల్క్ 1724లో స్వతంత్రించి ఆసఫ్‌జాహీ రాజ్యాన్ని స్థాపించాడు. ఓరుగల్లు నిజాం రాజ్యంలో 1948 వరకు అంతర్భాగమైంది.

1886లో వరంగల్లు, ఖమ్మంమెట్టులను కలిపి వరంగల్లు జిల్లాగా ఏర్పాటు చేసినపుడు భువనగిరి సర్కార్‌లోని కమలాపూర్ ప్రాంతాన్ని కరీంనగర్‌లో కలిపినారు. 1905లో హైదరాబాద్ నిజాం రాజ్యం నాలుగు చిన్న రాజ్యాలుగా విభజింప బడింది. అవి 1. ఔరంగాబాద్ డివిజన్ 2. గుల్బర్గా డివిజన్ 3. గుల్షానాబాద్ డివిజన్ 4. వరంగల్లు డివిజన్.

వరంగల్లు డివిజన్‌ను ఏర్పాటు చేసే క్రమంలో జనగామ, కోదాడ తాలూకాలను నల్గొండ జిల్లాలో చేర్చారు. 1948 సెప్టెంబర్ 17న జరిపిన పోలీస్ చర్య ద్వారా నిజాం రాజ్యం భారత యూనియన్‌లో విలీనం కావటంతో వరంగల్లు కూడా భారత యూనియన్‌లో భాగమైంది. అక్టోబర్ 1, 1953 న వరంగల్, ములుగు, జనగామ, మహబూబాబాద్, పరకాల తాలూకాలతో వరంగల్ జిల్లాగా ఏర్పడింది. 10.11.2016 న తెలంగాణ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా వరంగల్ (పట్టణ) జిల్లాను ఒక రెవెన్యూ డివిజన్, 11 మండలాలతో ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులిచ్చింది.

తెలంగాణ మలిదశ ఉద్యమంలో వరంగల్ ప్రముఖ పాత్ర పోషించింది. వివిధ పార్టీల నాయకులు అధ్యాపక, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు సకల జనుల సమ్మె మొదలైన వాటిలో చురుగ్గా పాల్గొని తెలంగాణ ప్రత్యేకరాష్ట్రంగా ఏర్పడటానికి తమ వంతు ప్రయత్నం చేశారు. ఈ ఉద్యమంలో కాకతీయ విశ్వ విద్యాలయ ఆచార్యులు, విద్యార్థుల పాత్ర మరువలేనిది. ప్రత్యేక రాష్ట్రం కల సాకారమైనాక గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు పలుమార్లు వరంగల్‌లో పర్యటించారు. తెలంగాణాకు వరంగల్‌ను రెండవ రాజధానిగా అభివృద్ధి చేయాలనే సంకల్పాన్ని వ్యక్తీకరించారు.

**మున్సిపల్ కార్పొరేషన్ :** వరంగల్ మహానగర పాలకసంస్థ

**రెవెన్యూ గ్రామాలు :** 124

**గ్రామపంచాయితీలు :** 104

**పోలీస్ కమీషనరేట్ :** వరంగల్

**పార్లమెంట్ నియోజకవర్గం :** వరంగల్

**అసెంబ్లీ నియోజకవర్గాలు :** జిల్లాలో ధర్మసాగర్ మండలం స్టేషన్ ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది.

కాజీపేట హసన్‌పర్తి మండలాలు వర్ధన్నపేట అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలోనివి.

కమలాపురం మండలం హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోనిది.

భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలు హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి.

వరంగల్ నగరం స్మార్ట్‌సిటీ జాబితాలోను, ప్రపంచ వారసత్వ సంపద నగరాల్లోను చోటు చేసుకుంది.

**పట్టణాలు :** వరంగల్, కాజీపేట, హన్మకొండ

## సంస్కృతి

వరంగల్ భిన్న సంస్కృతులకు నిలయమైంది. హిందువులతో పాటు ముస్లిం, క్రిస్టియన్ మొదలైన మతాల వారున్నారు. కాకతీయుల కాలంలో శైవానికి ఎక్కువ ఆదరణ లభించిన కారణంగా ఈ ప్రాంతంలో ఊరికో శివాలయమైనా కనిపిస్తుంది. తర్వాత కాలంలో విష్ణాలయాలు కూడా నిర్మించబడ్డాయి.

**ఆచారాలు, సంప్రదాయాలు, పండుగలు :** వేదాల నుండి, పురాణేతిహాసాల నుండి వివిధ మతగ్రంథాల నుండి, పెద్దల నుండి, చరిత్ర నుండి సంక్రమించిన అనేక జీవన

విధానాలను ఈ జిల్లా ప్రజలు ఆచరించి నైతిక ప్రవర్తనతో భాసిల్లుతున్నారు. సంప్రదాయంలో భాగమైన వివిధ పండుగలను, నోములను, వ్రతాలను, ఆచారాలను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకొని ఆధ్యాత్మిక జీవనంలో ముందున్నారు. వివిధ పండుగల ద్వారా కలిసి మెలిసి జీవించే తత్త్వాన్ని పెంపొందించుకుంటూ సమతా సమరసతలను, భక్తినీ, ధార్మికతనూ చాటుకొంటున్నారు. ఇక్కడ ప్రజలలో ఆధ్యాత్మికత ఎక్కువగానే కనిపిస్తుంది. అన్నిరకాల పండుగ లను భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. బతుకమ్మ, దసరా, దీపావళి, ముక్కోటి ఏకాదశి, సంక్రాంతి, మహా శివరాత్రి, ఉగాది, వినాయక నవరాత్రులు, బక్రీద్, రంజాన్, క్రిస్మస్, గురు నానక్ జయంతి మొదలైన పండుగలను ఆయా మతాల వారు భక్తి శ్రద్ధలతో జరుపుకోవటం గమనించవచ్చు. ఇటీవల కాలంలో ప్రతి ఊరిలో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాన్ని జరపటం గమనించ గమనించవచ్చును.

**కళలు :** కాకతీయుల కాలం నుండి ఓరుగల్లు కళలకు ప్రసిద్ధి. కాకతీయులు నిర్మించిన వేయిస్తంభాల గుడి, ఖిలా వరంగల్ కోట మొదలైన నిర్మాణాలు వారి శిల్ప కళాభిరుచిని వెల్లడిస్తాయి. కాకతీయ కళా తోరణం యావత్తెలంగాణాకే గుర్తింపు చిహ్నం. అందుకే మన రాష్ట్ర ప్రభుత్వ లోగోలో కూడా అది చోటు చేసుకుంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ధ్వన్యనుకరణ సమ్రాట్టు పద్మశ్రీ నేరెళ్ల వేణుమాధవ్ వరంగల్ నివాసి. సినిమా, టి.వి సీరియల్, నాటక రంగం మొదలైన వాటిలో వరంగల్ వాసులు ముందంజలో నున్నారు.

**జాతరలు :** ఈ జిల్లాలో ప్రసిద్ధమైన జాతర ఐనవోలు జాతర.

## సాహిత్య చరిత్ర

తెలుగు సాహిత్య చరిత్రలో వరంగల్లుకు ప్రత్యేక స్థానముంది. కాకతీయుల రాజభాష సంస్కృతమైనప్పటికీ వారు తెలుగును ఆదరించారు. కాకతీయుల కాలం నాటి **విద్యానాథుడు** 'ప్రతాప రుద్ర యశోభూషణ'మనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. **కాకతి మొదటి రుద్రుడు** సంస్కృతంలో 'నీతి సార'మనే రాజనీతి గ్రంథాన్ని రచించాడు. **రెండో ప్రతాపరుద్రుడు** సంస్కృతంలో 'యయాతి చరిత్ర' నాటకాన్ని రచించాడు. రెండో ప్రతాపరుద్రుని ఆస్థానంలో ఉన్నటువంటి **కొలని రుద్రుడు** 'రాజరుద్రీయం' పేరుతో పాణిని సూత్రవృత్తికే వ్యాఖ్యానం వ్రాశాడు.

కాకతీయ రాజ్యంలోని ముఖ్య ఉద్యోగులు తెలుగును ఆదరించారు. మారన మార్కండేయ పురాణ కృతిభర్త అయిన **నాగయ గన్నడు** రెండో ప్రతాపరుద్రుని సేనాపతి. ప్రతాప రుద్రుని అశ్వ సేనాధ్యక్షుడైన **సాహిణి మారనకు** భాస్కర రామాయణం అంకితమీయబడింది.

వరంగల్ నగరంలోని మట్టెవాడకు చెందిన **పరశు రామపంతుల లింగమూర్తి** 'సీతా రామాంజనేయ సంవాద' మనే కావ్యాన్ని రచించాడు.

వరంగల్‌కు సమీపంలోని మడికొండ పండిత కొండగా ఖ్యాతి గడించింది. **పండరినాథ కవి** సంస్కృతంలో 'రామకథా కల్పలత' రచించాడు. ఇందులో పదకొండు వేల శ్లోకాలు కలవు. తెలుగులో పండరినాథ రామాయణమును రచించాడు.

మడికొండలో జన్మించిన **పల్లా దుర్గయ్య** 'గంగిరెద్దు' (పద్యకావ్యం), 'పాలవెల్లి' (పద్య సంపుటి) 'పారిజాతాప హరణము (గేయ కావ్యం)లను రచించడంతో పాటు 'ప్రబంధ వాఙ్మయ వికాసం', 'అల్లసాని పెద్దన', 'పెద్దన కవితా వైభవం' 'చతుర వచోనిధి' అను పరిశోధనా గ్రంథాలను ప్రకటించారు.

**ఆచార్య బిరుదురాజు రామరాజు** జానపద గేయ వాఙ్మయంపై విశేష పరిశోధన గావించారు. రామరాజీయం (వ్యాస సంపుటి), 'ఆంధ్రయోగులు' పేరుతో వీరు వెలువరించిన సంపుటాలు వీరి పరిశోధనా తీరుకు అద్దం పడుతాయి. శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యం మొదలైన పలు గ్రంథాలు పరిష్కరించారు. పల్లా దుర్గయ్య ఉస్మానియా విశ్వ విద్యాలయం లో ఎం.ఎ తెలుగులో మొదటి విద్యార్థి కాగా, ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖలో మొదటి పిహెచ్.డి చేసినవారు ఆచార్య రామరాజుగారు.

మడికొండకు చెందిన మరొక ప్రసిద్ధకవి **అనుముల కృష్ణమూర్తి**. రస బ్రహ్మ వీరి బిరుదు. సరస్వతీ సాక్షాత్కారము, శబరి ఇతర ఖండికలు వీరు రచించారు. మడికొండలో ప్రసిద్ధులైన కవులు వానమామలై సోదరులు. **వానమామలై వెంకటాచార్యులు** భగవద్గీతను అచ్చతెలుగు పద్యాల్లో వ్రాసారు. **వానమామలై లక్ష్మణాచార్యులు** సంస్కృతంలో 'రామాశ్వ మేధము', సావిత్రీ నాటకమును వ్రాశారు. తెలుగులో అనసూయా చరిత్రమును కావ్యంగా వ్రాశారు. వీరి రచనలు 50 వరకు ఉండునని ప్రతీతి. ఇవి వెలుగులోకి రాలేదు. **వానమామలై జగన్నాథాచార్యులు** రైతు రామాయణము కావ్యాన్ని, కార్పాస లక్ష్మి నాటకాన్ని, విద్యార్థి శతకం, శ్రీ వరలక్ష్మీ నృసింహ శతకాలను రచించారు. అభినవ పోతనగా ప్రసిద్ధులైన **వానమామలై వరదాచార్యులు** 'పోతన చరితము', 'సూక్తి వైజయంతి' 'వ్యాసమణి', 'రైతుబిడ్డ' (బుఱ్ఱకథ), 'మణిమాల', 'విప్రలబ్ధ', 'స్తవరాజ పంచశతి' గీతమాల 'వైశాలినీ పరిణయము' (నాటకం), 'కూలిపోయే కొమ్మ' (వచన కవిత సంపుటి) మొదలైన రచనలు చేశారు.

మధురకవి **మోత్కూరి మధుసూదన్‌రావు** వరంగల్‌లోని మడికొండవారు. వీరు 'వేంకటేశ్వర శతకం', 'చిత్రపద్య కావ్యము'ను, 'సార్థకజీవి' నాటకమును, 'మావూరు, ముందంజ, మధుమంజరి' పద్య గేయ సంకలన ములను వెలువరించారు. వీరి కుమారులైన **మోత్కూరి మాణిక్యరావు** 'శ్రీఘణిగల రామలింగ శతరత్నావళి' 'మహాకవి భారవి చరిత్రము', 'ఖండకావ్య సంపుటి', 'ఆయుర్వేద చరిత్రము' మొదలైన గ్రంథాలను రచించారు.

మడికొండకు చెందిన మరొక పద్యకవి **వానమామలై లక్ష్మణాచార్యుల తిరువరంగం సుధాకర్.** వీరు శ్రీ తోగు వేంకటేశ్వర శతకం, శ్రీ సాయి శతకములను రచించారు. వీరి సరస్వతీ శతకం 27 పద్యములు మాత్రమే లభించినవి. 'శ్రీ శంఖవరం రాఘవాచార్యుల విజయం'పై పరిశోధన చేశారు.

వరంగల్‌కు చెందిన ప్రముఖ సాహితీవేత్త **దేవులపల్లి రామానుజారావు**. వీరు 'పచ్చతోరణము', 'సారస్వత నవనీతము', 'తెలుగు సీమలో సాంస్కృతిక పునరుజ్జీవనము', 'తెలంగాణాలో జాతీయోద్యమము', 'తలపుల దుమారము', 'నా రేడియో ప్రసంగాలు', 'సాహిత్యోపన్యాసాలు', 'బంకిం చంద్ర చటర్జీ జీవితం' మొదలైన రచనలు వెలువరించారు. వీరు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యదర్శిగా, పూర్వపు ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులుగా ఉండి తెలుగు భాషా వ్యాప్తికి ఎంతో కృషి చేసిన మహనీయులు.

వరంగల్లుతో విడదీయరాని అనుబంధం ఉన్న వ్యక్తి **కాళోజీ నారాయణరావు.** 'నా గొడవ', 'ఇదీ నా గొడవ', 'జీవన గీతి', 'కాళోజీ కథలు' మొదలైన రచనలు వెలువరించారు. వీరి అన్నగారు **కాళోజీ రామేశ్వరరావు** ప్రముఖ ఉర్దూకవి. వీరి కలం పేరు 'షాద్'. కాళోజీ గురువుగారైన **గార్లపాటి రాఘవరెడ్డి** ప్రముఖ పద్యకవి. వీరు 'వేణుగోపాల శతకం', 'గోపికా వల్లభా' శతకం రచించారు. పొట్లపల్లి రామారావు 'చుక్కలు', 'మెరుపులు', 'ఆత్మవేదన', 'అక్షరదీప్తి' మొదలైన కవితా సంపుటాలను వెలువరించారు. 'జైలు కథలు' కథా సంపుటాన్ని ప్రచురించారు.

**ఆచార్య కోవెల సంపత్కుమాచార్యులు** ఆంధ్రదేశంలో ఛందస్సుకు చిరునామాగా వాసికెక్కారు. వీరు 'యతీంద్ర వ్యాజ రామానుజ' అనే మకుటంతో అంతర్మథనం అనే శతకాన్ని, ఆముక్త పద్య కావ్యాన్ని, 'చేరాకొక శతమానం' అంటూ వంద పద్యాలు రచించారు. 'తెలుగు ఛందో వికాసం', 'తెలుగు ఛందఃపదకోశం' వీరి ప్రసిద్ధ రచనలు.

**ఆచార్య కోవెల సుప్రసన్నాచార్యులు** కవి, పండితుడు, పరిశోధకుడు, అవధాని. 'హృద్గీత', 'ఆనంద లహరి' తేజశ్చక్రము', 'అధునా', 'ఋతుంభర', 'పాంచాల రాయ శతకం', 'శతాంకుర', 'సాంపరాయం', 'సేఫాలిక', 'సహృదయ చక్రము', 'విశ్వనాథ మార్గము', 'భావుక సీమ', 'చందన సాక్షీ' మొదలైన రచనలను వెలువరించారు. **అనిశెట్టి రజిత** వరంగల్‌కు చెందిన ప్రసిద్ధ రచయిత్రి. 'గులాబీలు జ్వలిస్తున్నాయి', 'నేనొక నల్లమబ్బునవుతాను' 'చెమట చెట్టు' 'ఓ లచ్చవ్వ', 'ఉసురు', 'గోరంత దీపాలు', 'దస్తఖత్',

'అనగనగా కాలం' మొదలైన సంపుటాలను వివిధ ప్రక్రియలలో వెలువరించారు. మట్టిబంధం వీరి కథల సంపుటి.

వరంగల్లులో జన్మించిన మరొక ప్రసిద్ధ కవి, రచయిత **రామా చంద్రమౌళి.** 'జనన బీభత్సం', 'మరణ సౌందర్యం', 'పిల్లన గ్రోవికి నిలువెల్లా గాయాలు', 'పక్షి విశాలాకాశం' మొదలైన కథా సంపుటాలతో పాటు 26 నవలలు, 8 కవితా సంపుటాలు, 2 విమర్శ గ్రంథాలు వెలువరించిన నిత్య సాహితీ కృషీవలురు వీరు.

వరంగల్‌కు చెందిన మరొక పండిత పరిశోధకుడు **ఆచార్య హరిశివకుమార్** కేతన కృతుల మీద పరిశోధన చేశారు. గద్వాల సంస్థానము సాహిత్య సేవ, బాల ప్రౌఢ వ్యాకరణములు విశ్లేషణాత్మక అధ్యయనము, శ్రీభద్రకాళీ దేవాలయము - చరిత్ర, ఓరుగల్లు అసలు చరిత్ర మొదలయిన గ్రంథాలు వెలువరించారు. కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ఆచార్యులుగా పనిచేసిన **పాకనాటి జ్యోతి** వందేమాతరం - పరిశీలన, నాటక సాహిత్య విమర్శ, వ్యాస మందారం మొదలయినవి రచించారు.

వరంగల్లుకు చెందిన మరొక రచయిత **పి.చంద్.** అసలు పేరు ఊరుగొండ యాదగిరి. శేషగిరి, నెత్తుటిధార, విప్లవాగ్ని మొదలైన నవలలను రచించాడు.

ఈవిధంగా ఎంతోమంది కవులు, రచయితలు వరంగల్ అర్బన్ జిల్లా సాహిత్య చరిత్రలో తమ స్థానం పదిలం చేసుకున్నారు. వేరే ప్రాంతంలో జన్మించి, ఇక్కడ స్థిరపడిన కవి పండితులు పలువురున్నారు. వారిని ఇక్కడ ప్రస్తావించడం లేదు.

## సాహితీ సంస్థలు

జిల్లా సాహిత్య వికాసానికి పలు సాహిత్య సంస్థలు తమ వంతు కృషి చేస్తున్నాయి.

**మిత్రమండలి :** కాళోజీ సోదరుల మేధో పుత్రిక అయిన ఈ సంస్థ తొలి, మలి తెలంగాణ ఉద్యమాల్లో భాషా పరివ్యాప్తికి విశేషమైన కృషి చేసింది. సాహిత్యరంగంలో విశేష కృషి చేసిన వ్యక్తులకు ప్రతి ఏటా కాళోజీ పురస్కారాన్ని అందిస్తూ సత్కరిస్తుంది.

**చైతన్య స్రవంతి :** డా. హరిశివకుమార్, డా. జీ.వీ. రత్నం, టి.వి. రామారావు ఈ సంస్థ వ్యవస్థాపకులు. విశ్వనాథ, నల్లాన్ చక్రవర్తుల వంటి ప్రముఖుల ప్రసంగ కార్యక్రమాలను నిర్వహించింది.

**శ్రీలేఖ సాహితి :** 'శ్రీలేఖ సాహితి' వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీ టి.రంగస్వామి. ఈ సంస్థ అనేక కవి సమ్మేళనాలను, అవధాన కార్యక్రమాలను ఏర్పాటు చేయడమే కాకుండా ఇప్పటివరకు 118 పుస్తకాలను ప్రచురించింది.

**సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ :** సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తుంది. భారత, భాగవత, రామాయణ, భగవద్గీత వంటి అంశాలపై పండితులచేత ఉపన్యాసాలు ఏర్పాటు చేసింది. కొన్ని గ్రంథాలు సైతం ప్రచురించింది.

ఇవి కాకుండా పోతన విజ్ఞాన పీఠం, సృజనలోకం మొదలైన పలు సాహితీ సంస్థలు ఈ జిల్లాలో కలవు.

## వివిధ రంగాల ప్రముఖులు

ఈ జిల్లా నుండి చాలామంది రాజకీయ, సాంస్కృతిక, కళాత్మక రంగ ప్రముఖులు జిల్లాకు పేరు ప్రతిష్టలను ఆర్జించి పెట్టారు.

భారత మాజీ ప్రధాని, బహుభాషా కోవిదుడు పి.వి. నరసింహారావు జన్మస్థలమైన వంగర ప్రస్తుత వరంగల్ (పట్టణ) జిల్లాలోనిది. రాష్ట్రమంత్రులుగా సేవలందించిన తిరువరంగం హయగ్రీవాచారి, ప్రణయ్‌భాస్కర్‌లు ఈ జిల్లాకు చెందినవారు. స్వాతంత్ర్య సమరయోధుడు భూపతి కృష్ణమూర్తి వరంగల్లు వారే. ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు స్వాతంత్ర్య సమర యోధుడు బి.ఆర్. భగవాన్‌దాస్ ఈ జిల్లాకు చెందినవారే.

ప్రముఖ మూకాభినయ కళాకారుడు కందగట్ల శ్రీధర్, నృత్య కళాకారిణి ఉమా వైజయంతీమాల, హిందూస్థాన్ సంగీత విద్వాంసుడు గుమ్మడి జనార్దన్, శాస్త్రీయ నృత్యకారుడు

పేరిణి రంజిత్‌కుమార్, కూచిపూడి నాట్యకారుడు బి. సుధీర్ రావు మొదలైనవారు జిల్లాకు కీర్తిప్రతిష్ఠల నార్జించి పెట్టారు.

ప్రముఖ జానపద గాయకులు సారంగపాణి, వరంగల్ శ్రీనివాసు ప్రభృతులు ఈ జిల్లావాసులే. నాటక రంగంలో కూడా పలువురు ప్రముఖులున్నారు. భండారు ఉమా మహేశ్వర రావు ప్రముఖ పిల్లల వైద్యులే కాకుండా నటులు, నాటక కర్త కూడా. ఎన్.ఎన్.చారి నటుడు, ప్రయోక్త, దర్శకుడు, రచయిత. పందిళ్ల అశోక్‌కుమార్, సదానందం, సదానందాచారి, రంగస్థల పద్య నాటకాలలో ఆరి తేరిన వారు. అంకం లింగమూర్తి, ఎస్.కే. గౌడ్, వనం లక్ష్మీకాంత రావు, ఎన్.వి. ఎన్.చారి, జి.వి.కె. బాబు, ఆడెపు రవీందర్ మొదలైన వారు నాటక రంగంలో ప్రసిద్ధులు.

## దర్శనీయ ప్రదేశాలు - పర్యాటరంగం

**ఖిలా వరంగల్ :** ఇది వరంగల్‌లో ఉంది. ఇక్కడే కాకతీయుల కళాతోరణం, ఖుష్‌మహల్ కలవు.

వరంగల్ నగరంలో దర్శించుకోదగ్గ మరో రెండు ప్రసిద్ధ స్థలాలు మెట్టుగుట్ట, పద్మాక్షమ్మగుట్ట. మెట్టుగుట్టలో రామలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు రామాలయం కూడా ఉంది. ఇది కాజీపేట రైల్వేస్టేషన్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. పద్మాక్షమ్మ గుట్ట హన్మకొండ బస్టాండ్ నుండి కిలోమీటర్ దూరంలో ఉంది. ఈ స్థలంలో గల కొన్ని జైన తీర్థంకరుల విగ్రహాలు చూస్తే ఈ ప్రాంతంలో జైన ప్రాబల్యం ఉన్నట్లు తెలుస్తుంది.

**ఖుష్‌మహల్ :** ఇదొక అద్భుత కట్టడం. షితాబుఖాన్ నిర్మించిన, ఆయన దర్బారుహాలుగా చెబుతారు. ఇది ఓరుగల్లు కోటలో కలదు. ఇటీవల కాలంలో దీనికి మరమ్మత్తులు చేశారు.

**వరంగల్ కోట :** ఓరుగల్లు కోట వరంగల్ రైల్వేస్టేషన్‌కు 2 కి.మీ. దూరంలో ఉంది. కాకతీయుల కళాతోరణం ఈ కోటలోనిదే. తెలంగాణ ప్రభుత్వ లోగోలో చోటు సంపాదించు కున్న కీర్తి తోరణమిదే. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కాకతీయ ఉత్సవాలను ఈ కోటలోనే నిర్వహించింది.

**వన విజ్ఞాన కేంద్రము :** ఇది హన్మకొండ హంటర్ రోడ్డులో ఉంది. దీనిని 1985లో అప్పటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ డా. శంకర్ దయాళ్‌శర్మ ప్రారంభించారు. నెమళ్లు, రంగు రంగుల పక్షులు, ఎలుగుబంట్లు మొదలయిన జంతువులు దీనిలో కలవు. ఇటీవల దీనిలో రెండు పులులను కూడా తెచ్చి ఉంచారు.

**వరంగల్ పురావస్తు ప్రదర్శనశాల :** చాళుక్యుల కాలం నుండి ఇప్పటివరకు తవ్వకాల్లో బయట పడిన శిథిల శిల్పాలు దీనిలో భద్రపరిచారు. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వెనుక భాగంలో దీనికోసం కొంత స్థలాన్ని కేటాయించారు. వరంగల్లులో వీటితో పాటుగా కాకతీయ విశ్వ విద్యాలయం, జాతీయ సాంకేతిక విద్యా సంస్థ ఎన్.ఐ.టి, కాకతీయ వైద్య కళాశాల, ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ మొదలయినవి ముఖ్య దర్శనీయ ప్రదేశాలు.

## దేవాలయాలు

**వేయి స్థంభాల గుడి :** దీనికే రుద్రేశ్వరాలయమని పేరు. రుద్రదేవ మహారాజు క్రీ.శ. 1084లో దీనిని నిర్మిచాడు. ఇది త్రికూటాలయం. దీనిలో ఒకే వేదిక మీద మూడు దిక్కులలో మూడు ఆలయాలు నిర్మించబడినవి. అవి శ్రీ రుద్రేశ్వర, వాసుదేవ, సూర్యదేవరల ఆలయాలు. కాకతీయుల శిల్ప కళాభిరుచి దీనిలో గోచరమవుతుంది. నందీశ్వరుని వెనుక ఉన్న కళ్యాణ మండపాన్ని పునరుద్ధరించే పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఈ దేవాలయంలో ఎక్కడ చూసినా స్తంభాలే కన్పిస్తూ 'వెయ్యి స్తంభాల గుడి' నామం సార్థకం అయ్యింది. ఇది హన్మకొండ బస్టాండుకు ఒక కిలోమీటరు దూరంలో ఉంది.

**భద్రకాళి దేవాలయం :** ఇది కాకతీయుల కాలం నాటికే మంచి ప్రాభవంలో ఉన్నట్లు ఏకామ్రనాథుని 'ప్రతాప చరిత్ర', కాసె సర్వప్ప 'సిద్ధేశ్వర చరిత్ర'లను బట్టి తెలుస్తుంది. కాకతీయుల అనంతరం ఈ ఆలయం ప్రాభవం కోల్పోయింది. 1950 తర్వాత హరి రాధాకృష్ణ మూర్తి వంటి

పెద్దల సహకారంతో పునర్వైభవం సంతరించుకుంది. ఇది చాళుక్య రాజుల చేత తొలుతగా నిర్మింపబడిందని చెప్తారు.

**పద్మాక్షి - సిద్ధేశ్వరాలయాలు :** హనుమకొండ బస్టాండ్‌కు దక్షిణదిశలో, ఒక కిలోమీటర్ దూరంలో కొండలపై ఈ ఆలయాలున్నాయి. పద్మాక్షి దేవి ఆలయం ప్రక్కనున్న జైన తీర్థంకరుల విగ్రహాలు ఈ ఆలయ ప్రాచీనతను వెల్లడిస్తాయి. ఇది మొదట జినాలయంగా ఉండి, ఆ తర్వాత పద్మాక్షి ఆలయంగా మారి ఉంటుందని చరిత్రకారుల ఊహ.

**మెట్టుగుట్ట :** కాజీపేట రైల్వేస్టేషన్ నుండి 3 కి.మీ దూరంలో హైదరాబాద్ వెళ్లే మార్గంలో శ్రీ మెట్టు రామలింగేశ్వర ఆలయముంది. దీనికి మెట్టు రామప్ప తీర్థమని, మెట్టు రామప్ప క్షేత్రమని నామాలు కలవు. ఇక్కడి శివలింగాన్ని శ్రీ రాముడు ప్రతిష్ఠించాడని ప్రతీతి. దీని ప్రక్కనే రామాలయము కూడా కలదు.


**ఐనవోలు మల్లికార్జున స్వామి దేవాలయం :** దీనినే మల్లన్నగుడి అంటారు. చాళుక్యుల కాలంలోను, కాకతీయుల కాలంలోను ప్రాముఖ్యతను సంతరించుకున్న ఆలయమిది. సంప్రదాయ, జానపద రీతులలో పూజలు జరగడం ఇక్కడి ప్రత్యేకత. ఈ ప్రాంతంలో ప్రసిద్ధికెక్కిన ఐలోని జాతర సంక్రాంతి నుండి ఉగాది వరకు జరుపుతారు.

ఇవే కాకుండా కాజీపేట రైల్వేస్టేషన్ సమీపంలో ఆలయ సముదాయంలోని రామ, సాయి, ఆంజనేయ, నవగ్రహ ఆలయాలు, కాజీపేట నుండి సోమిడి వెళ్లే మార్గంలోని శ్వేతార్క మూల గణపతి ఆలయం, వరంగల్ బొమ్మలగుడి, వరంగల్ వేణుగోపాల స్వామి ఆలయం మొదలయిన పలు ఆలయాలు జిల్లాలో కలవు.

కాకతీయులు ఏకశిలానగరం నుండి మొత్తం తెలుగు ప్రాంతాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించినవారు. మూడు గ్రామాలుగా విడివిడిగా ఉన్న వరగల్, హనుమకొండ, కాజీపేట నేడు విడదీయలేని ప్రాంతాలుగా మారిపోయాయి. ఈ ప్రాంతం కాలక్రమంలో మహానగర స్థాయికి చేరుతుంది.

నాటి నుండి నేటివరకు తన ప్రతిష్ట నిలుపుకున్న వరంగల్లు తెలంగాణకు శిరోభూషణమై ప్రకాశిస్తుందనడంలో ఎటువంటి సందేహము లేదు.

# వరంగల్ రూరల్ జిల్లా చిత్రపటం





ఏకవీర దేవాలయం



పాకాల చెరువు



త్రికూటాలయం



రుద్రమదేవి



ఓరుగల్లు తోరణం



ప్రొ. జయశంకర్

258(b)

# వరంగల్ (రూరల్)

గ్రామ సురాజ్య వైభవము రాజిలుచుండగ నోరుగల్లులో
భామహిత ప్రభాకరము వర్ధిలుచుండుననంత శైలమున్
నోముల వీరభద్రుని వినూత్న కళామయ హేలనిల్వగా
క్షేమములందుచుండును విశేషములెల్లెడ నుల్లసిల్లగన్ !

కాకతీయ రాజులు 'ఓరుగల్లు' రాజధానిగా తెలుగు నేలను చాలా కాలం పరిపాలించారు. ఏకశిలా నగరముగా కూడా పిలువబడిన ఓరుగల్లు క్రమంగా వరంగల్లు అయింది. వీరి పాలనా కాలంలో వరంగల్లు చారిత్రకంగా, సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా గొప్ప కేంద్రంగా విలసిల్లింది. వెయ్యి స్తంభాల గుడి, రామప్ప దేవాలయం, కాకతీయ కళా తోరణము, పాకాల, లక్నవరం చెఱువులు మున్నగునవి వారి వారసత్వ సంపదకు గుర్తులుగా నేటికినీ నిలిచి వున్నాయి.

వరంగల్లు ప్రాంతం కాకతీయుల తర్వాత ఢిల్లీ సుల్తానుల స్వాధీనం అయింది. కొద్ది కాలం నాయక రాజులు పరిపాలించారు. వీరి నుంచి స్వాధీనం చేసుకున్న బహమనీ సుల్తానులు గోల్కొండ రాజధానిగా ఈ ప్రాంతమును పరిపాలించారు. 1687 లో మొఘల్ సామ్రాజ్యంలో కలిసిన ఈ నేల 1724లో హైదరాబాదు స్టేట్‌గా ఏర్పడింది. చివరలో సెప్టెంబరు 1948 లో ఇది స్వతంత్ర భారతదేశంలో విలీనమైంది. 1956లో తెలుగు భాష మాట్లాడే ప్రజలు గల ప్రాంతాలు ఒకే రాష్ట్రంగా చేయబడిన సందర్భంలో వరంగల్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక భాగమైంది. 2-6-2014 లో తెలంగాణ ఏర్పడింది. అప్పుడు వరంగల్లు ఈ రాష్ట్రంలో భాగమైంది. ప్రభుత్వం GO. MS NO. 232 Revenue (DA.MRF)dept తేది. 11.10.2016 ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలను పునర్విభజన చేసింది. దీని ప్రకారం వరంగల్లు ఐదు జిల్లాలుగా విభజింపబడింది. ఇందులో వరంగల్ రూరల్ జిల్లా ఒక్కటి. ఇది 11.10.2016 నుంచి అమలులోకి వచ్చింది.

వరంగల్ రూరల్ జిల్లా కార్యాలయం హన్మకొండ నక్కలగుట్టలోని నీటిపారుదల కేంద్ర కార్యాలయంలో వుంది. దీనిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి గారు ప్రారంభించినారు.

**భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి**

వరంగల్లు రూరల్ జిల్లా భౌగోళిక విస్తీర్ణము 2,09,466 హెక్టార్లుగనూ, 2094.66 స్క్వేరు కిలోమీటర్లుగను ఉన్నది. ఈ జిల్లాలో 10,441 హెక్టార్లలో అడవి విస్తరించి వుంది. అనగా ఇది జిల్లా భూభాగంలో 5% అవుతుంది. ఇందులో 229 రెవిన్యూ గ్రామాలున్నట్లు వ్యవసాయ భూముల లెక్కల ద్వారా తెలుస్తుంది. గ్రామ పంచాయితీలు 269 వున్నవి. జెడ్పీటీసీలు 14 కనిపిస్తున్నవి.

2011 లెక్కల ప్రకారం ఈ జిల్లా జనాభా 7,18,537 గా ఉంది. అందులో పురుషులు 3,60,315 ఉండగా, మహిళలు 3,58,222 లు ఉన్నారు. వెయ్యి మంది పురుషులకు 994 మంది స్త్రీలు సరాసరిగా ఉన్నట్లు తెలుస్తుంది.

**రెవెన్యూ డివిజన్లు - మండలాలు**

ఈ జిల్లా నర్సంపేట, పరకాల, వర్ధన్నపేట, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలలో విస్తరించి వుంది.

జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లు వున్నవి.

అవి 1. వరంగల్లు రూరల్ 2. నర్సంపేట.

జిల్లాలో 15 మండలాలున్నాయి.

**వరంగల్లు రూరల్ రెవిన్యూ డివిజన్‌లోని 9 మండలాలు:**

1. పర్కల్ 2. శాయంపేట 3. ఆత్మకూరు 4. దామెర 5. గీసుకొండ 6. సంగెం 7. వర్ధన్నపేట 8. పర్వతగిరి 9. రాయపర్తి

**నర్సంపేట రెవిన్యూ డివిజన్‌లోని 6 మండలాలు:**

1. నర్సంపేట 2. దుగ్గొండి 3. నల్లబెల్లి 4. ఖానాపురం 5. చెన్నారావుపేట 6. నెక్కొండ

**సహజ వనరులు :**

వరంగల్ రూరల్ జిల్లాలోని సంగెం, గీసుకొండ మండల పరిధిలోని శాయంపేట హవేళి ప్రాంతంలో 12000 ఎకరాల్లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయుటకు తెలంగాణ ముఖ్యమంత్రి 22.10.2017 న శంకుస్థాపన చేశారు. ఇది పూర్తి అయితే కొన్ని వేలమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా పని దొరుకుతుంది. ఉపాధి కొరకు భీవండీ, నాందేడ్ వెళ్ళే పద్మశాలీలు ఇక్కడే ఉండిపోతారు. ఇది అతిపెద్ద జాతీయ ప్రాజెక్టుగా ప్రకటింపబడింది. ప్రసిద్ధి పొందిన అలనాటి ఆజంజాహి మిల్లుకు ప్రత్యామ్నాయంగా ఇది ప్రతిపాదించబడింది.

వరంగల్ రూరల్ జిల్లా ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయం, కూలీ పనులు. వ్యవసాయానికి కావల్సింది నీటి వనరులు. ఇచ్చట ప్రతి గ్రామంలోనూ కాకతీయుల నాటి పురాతన చెఱువులున్నాయి. అయితే ఇవి వర్షాధారికత నీటి వసతులు. నెక్కొండ ప్రాంతంలో ప్రస్తుత ప్రభుత్వం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఏర్పాటుకు మంజూరు చేసింది. మిషన్ కాకతీయ ద్వారా చెఱువుల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందింప చేస్తున్నారు.

**నేలలు :** వరంగల్ రూరల్ జిల్లాలో వివిధ రకాల భూములున్నాయి. నల్లరేగడి, ఎర్రనేలలు, బంకమట్టి నేలలు వున్నాయి.

**అడవులు** : జిల్లాలో దాదాపు 164 కి.మీ. అటవీ ప్రాంతం వుంది. ఇది జిల్లా మొత్తం విస్తీర్ణంలో 7.52 శాతం వుంటుంది. అనేక రకమైన చెట్లు పెరుగుతున్నాయి. ఔషధ సంబంధమైన మొక్కలు ఎక్కువగా ఉన్నాయి.

**నదులు :** ఈ జిల్లాలో నదులు తూర్పుకు ప్రవహిస్తుంటాయి. మున్నేరు నది కలదు.

**చెరువులు - ప్రాజెక్టులు :** ఈ జిల్లాలో కాకతీయులు తవ్వించిన చెరువులున్నాయి. కాకతీయుల కాలువ, పాకాల చెరువు, చలివాగు ప్రాజెక్టులు ఈ జిల్లాలో వున్నాయి. ఇక్కడ చిన్నవి పెద్దవి కలిపి దాదాపు 82 చెరువులున్నాయి. పాకాల చెరువు గణపతిదేవుని కాలంలో ఇమ్మడి నాయుడు నిర్మించాడు.

**పాకాల రిజర్వాయరు**

ఇది జిల్లాలోని ఖానాపురం మండలం పాకాల గ్రామ సమీపంలో ఉంది. క్రీ.శ. 1198-1162 ప్రాంతంలో నున్న జగదాల ముమ్మడి నాయకుడు దీనిని నిర్మించాడు. ఇతడు కాకతి గణపతి దేవుని సేనాని. ఇది కృష్ణానదికి ఉపనది అయిన మున్నేరు నదిపై నిర్మింపబడింది. నేటికిని ఇది ఈ ప్రాంతంలో మధ్యతరహా నీటిపారుదల కింద అత్యధిక ఆయకట్టు కల్గిన రిజర్వాయరు. దీని విస్తీర్ణం 103 చదరపు మైళ్లు. నీటి సామర్థ్యం 3262 క్యూబిక్ మిలియన్ అడుగులు. ఆయకట్టు భూములు 18192 ఎకరాలు. దీనికి ప్రధాన కాలువలు రెండున్నాయి. ఉప కాలువలు, పిల్ల కాలువలు పొలాలకు నీరందిస్తాయి. కుడి కాలువ పొడవు 19 కి.మీ. కాగా, ఎడమ కాలువ పొడవు 16.85 కి.మీ. ఇది సమీపంలోని ఖానాపురం, ధర్మారావుపేట, అశోక్‌నగర్, సర్వాపూర్,

వీరవరం, అయినవల్లి, తుంగవనం మున్నగు గ్రామాలను సస్యశ్యామలం చేస్తుంది.

నర్సంపేట, పరకాల ప్రాంతంలోని భూములు నల్లరేగడులు. నర్సంపేట, పాకాల రిజర్వు అడువులు. ఇవి మున్నేరు నదీ పరివాహక ప్రాంతాలనావరించి అక్కడక్కడా వున్న కొండల్లో వ్యాపించి వున్నాయి. ఈ అభయారణ్యం టేకు, అబ్నస్ వంటి సుమారు 200 రకాల చెట్లకు, పెద్దపులి, చిరుత వంటి జంతువులకు నిలయమై వుంది.

నర్సంపేట మండలంలోకి కిష్టాపురంలో ఏర్పడిన మున్నేరువాగు మీదనే అశోక్‌నగర్ వద్ద పాకాల చెరువు నిర్మింపబడింది. ఇది తర్వాత మట్టివాగుతో కలిసి ఖమ్మం జిల్లాలోని వైరా నదితో కలిసి కృష్ణలో చేరుతుంది.

**మైలారం బాలెన్సింగ్ రిజర్వాయరు**

ఇది రాయపర్తి మండలం మైలారం వద్ద నిర్మింప బడింది. ఆకేరు నుంచి బయలుదేరిన కాకతీయ కాలువ 12 కి.మీ. ప్రవహించి ఈ రిజర్వాయరులో కలుస్తుంది. ఇది దాదాపు 23 కి.మీ. ప్రవహించి బయ్యన్న వాగు రిజర్వాయర్‌లో కలుస్తుంది.

**చలివాగు ప్రాజెక్టు**

దీనిని 1964 లో ప్రభుత్వం నిర్మించింది. శాయంపేట, పరకాల మండలాల్లో చలివాగు అను చిన్న వాగు ప్రవహిస్తుంది. వర్షాకాలంలో ఉధృతి కలిగి ఎక్కువ నీటికి నిలయంగా వుంటుంది. అందువల్ల శాయంపేట సమీపంలో దీనిమీద ఆనకట్ట నిర్మించి రిజర్వాయరుగా చేశారు. ఈ ఆనకట్టుకు రెండు వైపులా రెండు ప్రధాన కాలువలున్నాయి. కుడి కాలువ పొడవు 9.46 కి.మీ. దీని కింద 2188 ఎకరాలు సాగు అవుతుంది. ఎడమ కాలువ పొడవు 4.2 కి.మీ. దీనికింద 861 ఎకరాలుంది. శాయంపేట పరకాల మండలాలలోని పెదకూడెపాక, జంగంపల్లి, కొప్పుల, చినకొడెపాక, చెన్నపురం, శాయంపేట, పరకాల, ధర్మన్నపేట మొదలైన గ్రామాలకు చలివాగు ప్రాజెక్టు సాగు నీటిని అందిస్తుంది.

**మున్సిపల్ కార్పొరేషన్ :** నర్సంపేట, పరకాల

**రెవెన్యూ గ్రామాలు :** 225

**గ్రామపంచాయితీలు :** 270

**పోలీస్ కమీషనరేట్ :** వరంగల్ రూరల్

**పార్లమెంట్ నియోజకవర్గం :** వరంగల్

**అసెంబ్లీ నియోజకవర్గాలు :** నర్సంపేట, పరకాల, వర్ధన్నపేట, పాలకుర్తి.

**పట్టణాలు :** నర్సంగల్, నర్సంపేట, పరకాల.

ఇవి వరంగల్లు రూరల్ జిల్లాను సస్యశ్యామలం చేస్తున్న ప్రధాన మధ్యతరహా నీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు.

**జనాభా :** ఈ జిల్లాలో 7,18,537 లక్షలు కాగా ఇందులో పురుషులు 3,60,315 మహిళలు 3,58,222 మంది వున్నారు. గ్రామీణ జనాభా 6,68,324 వుండగా పట్టణ ప్రాంత జనాభా 50,213 మంది. జనసాంద్రత 330/కి.మీ., లింగనిష్పత్తి 1000 : 994.

**అక్షరాస్యత :** మొత్తం 61.26% వుండగా, పురుషులు 71.90% కాగా, స్త్రీలు 50.67% ఉన్నారు.

**జిల్లా చరిత్ర**

కాకతీయ రాజులు తమ పరిపాలనా కాలంలో ఈ జిల్లాలోని అనేక ప్రాంతాలలో శిలాశాసనాలు వేయించారు. ఇవి ఇక్కడి చరిత్రను తెలుపుటలో ఉపయోగపడుతున్నాయి. వీటినిబట్టి ఈ ప్రాంతాన్ని చాళుక్యులు, రాష్ట్రకూటులు కాకతీయులు పరిపాలించినట్లు తెలుస్తుంది.

**ఎలకుర్తి శాసనము 91 :** ఇది కాకతి ప్రతాపరుద్రుని కాలంలో ఎలకుర్తిలోని రుద్రేశ్వరాలయం గోడమీద చెక్కబడింది. గొల్లకోట గ్రామంలో వైద్యనాథాలయానికి 2 మూతర్తాముల మాగాణి, మైలారదేవునకు, స్వయం భూదేవునకు కొన్ని భూములు, బ్రాహ్మణులకు మరికొన్ని భూములు కటక రక్షపాలక తలారి భైరయ దానంగా యిచ్చినట్లు ఈ శాసనంలో చెప్పబడింది.

**ఎలకుర్తి-73 :** కాకతీయుల రాజ్యకాలంలో రేచర్ల రుద్ర సేనాపతి ఈ ప్రాంతాన్ని పరిపాలించినారు. ఇతడు తన కుమారుల పేరుమీద రుద్రేశ్వర, అన్యేశ్వర, గణేశ్వర ఆలయాలను నిర్మించెను. దేవతల పూజా ఖర్చుల కొరకు కొన్ని భూములు రాజు దానం చేసినట్లు శాసనం తెలుపుతుంది.

**కంఠాత్మకూరు శాసనము - 75 :** ఇది పరకాల సమీపంలోని కంఠాత్మకూరులో నున్నది. ఇచ్చట ఆంజనేయ విగ్రహం పక్కగా రాతి స్తంభంగా ఉంది. శక. 1180 ప్రభవ నామ సంవత్సర క్రీ.శ. 12 వీరిలో అచ్చట ఉండే వీరముష్టులు ఒక దేవాలయానికి చేసిన దానాలను ఇది పేర్కొంటున్నది.

**గుండాల శాసనము - 117 :** ఇది నర్సంపేట తాలుకా గుండాలలో నున్నది. ఇది అచ్చట శివాలయం మండపంలోని స్తంభంపై చెక్కి ఉంది. రమానాథ దేవాలయ రక్షకులు అయిన కాచ బోయుడు, మల్లె బోయుడు అనువారు దీపారాధనకు సంవత్సరానికి నేయి ఇవ్వవలసిందని శాసనంలో తెలుపబడింది.

**గురజాల శాసనము - 32 :** ఇది నర్సంపేట తాలుకా గురజాల గ్రామంలో ఉంది. ఇది చాళుక్య చక్రవర్తి జగదేక మల్ల రాజ్యపాలనా కాలంలో చెక్కించబడినది. ఈ శాసనం చాళుక్య ప్రభువుకు సామంతుడైన మహామండలేశ్వర అరిశంకభీమ చోళ మహారాజు బిరుదావళి ప్రశస్తి. యిందు "చరణ సరోరుహ విహిత విలోచన, ప్రముఖాఖిల పృథ్వీశ్వర... కాంచీపుర త్రిపుర మహేశ్వర..." అను విధంగా సుదీర్ఘంగా చేయబడింది. "కాంచీపుర త్రిపుర మహేశ్వర" అను బిరుదు చోళులకు రెండవ రాజధానిగా ఉండి కాలిపోయిన కాంచీపురమును తెలియజేస్తుంది.

**గోవిందపురం శాసనం - 26 :** నర్సంపేట సమీపం లోని గోవిందపురంలో ఇది ఉంది. శ.క. 1043 ప్లవనామ సంవత్సరం. క్రీ.శ. 1122లో ఒక చెరువు నిర్మాణంలో రాతి స్తంభంపై చెక్కిన శాసనమిది. జైనదేవత అనుగ్రహం కల్గిన మాధవవర్మ 8000 గజబలం, 10కోట్లు అశ్వబలం పొందినాడు. ఇతని తర్వాత పరిపాలించిన రాజులు, వీరి పరంపర వివరంగా శాసనంలో చెప్పబడి ఉంది. మేడరాజు ఆదేశానుసారం నాగదేవుడు జినాలయాన్ని నిర్మించి పార్శ్వజినేశ్వర విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు అందలి పూజారు లకు భూదానములు చేసినట్లును యిందు పేర్కొనబడింది.

**దిచ్చగుంట శాసనము - 55 :** నర్సంపేట తాలుకా దిచ్చగుంట గ్రామానికి పడమరగా స్తంభంగా పాడు పొలాలలో నున్న శాసనం ఇది. గణపతిదేవ చక్రవర్తి మందడి రేచర్ల మాండలికుడు యితరులనుండి దానంగా తీసుకొనిన దిచ్చిగుంట చెఱువు ఏలేశ్వర కాలువ కింది పొలాన్ని గొలకొట్టు ఏలేశ్వర దేవునకు బహుమతిగా యిచ్చినట్లు శాసనాలలో పేర్కొనబడింది.

**దిచ్చగుంట శాసనము - 56 :** ఇది దిచ్చగుంటకు దక్షిణంగా మాటుపొలం అనే ప్రదేశంలో ఉన్నటువంటి రాతిస్తంభ శాసనము. కాకతి గణపతి చక్రవర్తి అశ్వపాలకుడు రేచర్ల మండలాధిపతుడు దానంగా పొందిన మాగాణిని శివాలయానికి కానుకగా యిచ్చినట్లు శాసనంలో కలదు.

**ధర్మరావు పేట శాసనము - 69 :** ఇది నర్సంపేట సమీపంలోని ధర్మారావు పేట గ్రామమునందలి శివాలయం ఎదురుగా రాతి స్తంభం మీద ఉన్న శాసనం. ఈ శాసనం కాకతీయ వంశావళిని, రేచర్ల వంశావళిని, ఈ శాసన దానకర్త వంశావళిని వివరంగా వర్ణిస్తుంది. కాకతీయ వంశపు మొదటి రాజు ప్రోలరాజు. ఇతని కొడుకులు రుద్రుడు, మహా దేవుడు. మహాదేవుడు యుద్ధంలో చనిపోగా అతని కుమారుడైన గణపతి దేవుణ్ణి ఆ రాజ్యపు రుద్రసేనాని సింహాసనంపై కూర్చుండ బెడుతాడు. అట్లాగే రేచర్ల రుద్ర సేనాని వంశంలో అతని కొడుకు కాట సేనాని; ఇతని కొడుకు పపాయిత ; అతని కుమారుడు వీర పసాయత చమూనాథుడు; శాసనాన్ని రచించిన వ్యక్తి సూరమంత్రి వంశజుడు. భరద్వాజముని కుమారుడు ఎర్రయ; ఈయన తరవాత

అప్పయ; తర్వాత అప్పయ మాచమాంచల కుమారుడు సూరుడు వీరపసాయతుని మంత్రి. ఈ వరుస క్రమం శాసనంలో చెక్కబడి ఉంది.

**నర్సంపేట శాసనము -16 :** ఇది నర్సంపేట నగరంలో నున్న ఒక శిలాస్తంభ శాసనం, చాళుక్యుల సామంతరాజు మహా మండలేశ్వర బుద్ధరాజు ఇంద్రపుర గ్రామానికి ఇచ్చిన దాన వివరాలు యిందులో ఉన్నవి.

**పరకాల శాసనము - 81 :** పరకాల మండలం గుడిమెట్ట ప్రాంతంలోని దేవాలయం వద్ద ఉన్న ఈ రాతి స్తంభం సంస్కృత శ్లోకాలలో నున్నది.

**పాకాల శాసనం - 67 :** ఇది కాకతి గణపతి దేవుని కాలంలో నర్సంపేట సమీపంలోకి పాకాల చెరువు పడమటి గట్టుపై ఉన్నది. చివరి నాలుగు పాదాలు తప్ప శాసనమంతయు సంస్కృతంలోనే ఉంది. ఇందులో కాకతీయ వంశావళి పౌరాణికంగానూ, చారిత్రకంగానూ వర్ణింప బడింది. ఈ శాసనంలో గణపతి దేవుడు కాశి, కళింగ, శక, మాళవ, కేరళ, తుమ్మనహుణ, మగధ నేపాల, చోళాది రాజుల చేత కీర్తింపబడిన గొప్పరాజుగా తెలుపబడింది. శాసన రచయితకు 5 మర్తురుల దానం యిచ్చినట్లున్నది.

**బానాజిపేటశాసనము :** నర్సంపేట మండలం బానాజిపేట గ్రామానికి తూర్పుగా పడి ఉన్న రాతి స్తంభ శాసనం. దీనిని అయ్యప్పయ్య, శ్రీధరుడు అను రచయితలు రచించారు. మేడరాజు నిర్మించిన వీరకమల జినాలయానికి కాకతి బేతరాజు కొంత భూమిని దానం చేసినట్లు ఈ శాసనం చెబుతుంది.

**మేడపల్లి శాసనము - 21 :** నర్సంపేట మండలం మేడపల్లి గ్రామం చెరువు కట్టమీద ఒక రాతి స్తంభం మీద ఈ శాసనం చెక్కబడి ఉంది. ఇది సంస్కృతం, కన్నడం, తెలుగు భాషల్లో పద్యరూపంలో నున్నది. శాసనం అచన పగ్గడి అను రాజు ఆదిత్యపల్లిలో గల అచేశ్వర, విష్ణు దేవాలయాలకు భూదానం చేసినట్లుంది.

**మేడపల్లి శాసనము - 118 :** ఇది నర్సంపేట మండలం మేడపల్లి గ్రామంలోనున్న వీరగల్లు శాసనం. అందులో ఒక వాక్యం తప్ప ఏమీ కన్పించడంలేదు.

**మేడపల్లిశాసనములు 123,124 :** ఈ రెండు శాసనాలు గీసుగొండ మండలంలోని మొగిలిచర్ల గ్రామంలో పోచమ్మ గుడి ముందు ఒక రాతి ఫలకంపై చెక్కబడి ఉన్నవి. రెండును శిథిలమై కన్పిస్తున్నాయి. మొగిలి చెరువు క్రమంగా మొగిలిచర్లగా మారినట్లు తెలుస్తుంది.

**రాయపర్తి శాసనములు 66,83 :** మండల కేంద్రమైన రాయపర్తి గ్రామ శివాలయంలో ఈ రెండు రాతి స్తంభ శాసనాలు ఉన్నవి. మొదటి శాసనం కాలం శక.1169 క్రీ.శ.1247 సూరమాంబకు జన్మించిన యిద్దరు కుమారులు కాకతి మహాదేవరాజు పాల్గొన్న భయంకర యుద్ధంలో అండగా నిల్చినట్లు శాసనం తెలుపుతుంది. రెండవ శాసనం పార్థివ నామ సంవత్సరం మాఘమాసంలో రూపొంది నట్లున్నది. వివరాలు లేవు.

**వర్ధన్న పేట శాసనము-72 :** కాకతి గణపతిదేవుని రచన కాలం నాటిదిగా తెలుపడబిన ఈ శాసనం వర్ధన్నపేటలో కొమటి అప్పయ్య ఇంటివద్ద ఉన్నది. కాకతి గణపతి దేవరాజును స్తుతిస్తూ ఆయన సామంతుడు దానం చేసనట్లు తెలుపుచున్నది.

**శాయంపేట శాసనము - 110 :** మండల కేంద్రమైన శాయంపేట మహేశ్వరాలయం ముందున్న రాతి స్తంభంపై చెక్కబడినదీ శాసనం. దీని కర్త రావు ధర్మనాయకుడు. ఇతని కాలం శక.1386. క్రీ.శ. 1464. ఇతడు పిన్నమ నాయకుడు, సింగమాంబల కొడుకు. ఇతనికి "కాకతి రాజ్య స్థాపనాచార్య" వంటి ముఖ్యమైన అనేక బిరుదులున్నవి. రేచర్ల వంశపు రాజైన ధర్మనాయకుడు శక.1386 తారణ నామ సంవత్సరం. వైశాఖ శు. 1వ వడ్డవారం సూర్యగ్రహణ సందర్భంగా మాచెర్ల లోని తిరువెంగళనాధ దేవునకు యిచ్చిన దానధర్మాలు ఈ శాసనంలో ఉన్నవి.

వరంగల్ రూరల్ జిల్లాకు సంబంధించిన శాసనాలను పరిశీలించినపుడు రాజుల వంశచరిత్రలు, వారు చేసిన వివిధ రకాల దానధర్మాలు, ఇవి ఆనాటి సాంస్కృతిక జీవనానికి దోహదపడిన విషయం తెలుస్తుంది.

## సంస్కృతి

**కళలు :**

వరంగల్లు రూరల్ జిల్లా ప్రాంతం వివిధ రంగాల కళాకారులకు నిలయంగా వెలుగొందుతుంది.

**శ్రీ విరాట్ కళా సంస్థ:** శ్రీ రామోజు భిక్షమాచారి, తాళ్లపల్లి చంద్రమౌళి గౌడ్ నిర్వహణలో ఇది నర్సంపేటలో స్థాపించబడింది.

**భారతీయ నాటక కళా సమితి:** 1974లో ఇల్లందు గ్రామంలో ఏర్పడిన ఈ సంస్థ 1980లో సమీప తాలూకా కేంద్రమైన వర్ధన్నపేటకు మార్చబడింది.

**పాలాయి ఆదిరెడ్డి:** వీరు 1953లో నర్సంపేటలో జన్మించిరి. వరంగల్లు జిల్లాసమాచార పౌర సంబంధాల శాఖలో చలనచిత్ర ప్రదర్శకులుగా పనిచేసిన వీరు నటులు, సంగీత వాద్య కళాకారులు.

**ఇమాన్యూల్:** పరకాలలో డ్రాయింగ్ ఉపాధ్యాయులైన వీరు చక్కని ప్రకృతి చిత్రకారుడు.

**తిరునహరి కృష్ణ:** రాయపర్తిలో 11.10.1927లో జన్మించిరి. 1945లో ఇంటర్ చదువుతున్న రోజుల్లో గుబ్బి కంపెనీవారు వరంగల్ లాడ్జీ దొడ్డిలో ప్రదర్శించిన నాటకాలు చూచి స్ఫూర్తి పొంది కాలేజీ గర్ల్స్ నాటికలో ఆడవేషం వేయటంతో నట జీవితాన్ని ప్రారంభించినారు.

**చంద్రబోస్:** వీరు ఈ ప్రాంతంలోని చల్లగరిగె గ్రామంలో జన్మించినారు. విద్యార్థి దశనుండి పాటల యందాసక్తి గల్గిన వీరు సినీరంగంలో ప్రవేశించి కొన్ని వందల పాటలు రాసినారు.

**కూచన చక్రపాణి:** వీరు నర్సంపేటలో 24-5-1952 లో జన్మించిరి. వీరు అనేక నాటికలలో నటించి ఉత్తమ నటుడిగా పేరు పొందినారు.

**మంద వీరాస్వామి:** వీరు నఖచిత్ర కళాకారుడు. చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లిలో 25.3.1950లో జన్మించినారు. గాంధీ, నెహ్రూ వంటి నాయకుల, ప్రకృతి దృశ్యాలను గోటితో వేసి ప్రశంసలు పొందినారు.

**గోకా రామస్వామి:** వీరు నర్సంపేటలో 6.8.1953లో జన్మించినారు. డ్రాయింగ్‌లో శిక్షణ పొందిన వీరు చిత్రకళ మీది అభిమానంతో సబ్బుబిళ్ళ, ప్లాస్టర్, కాండిల్స్, సుద్ద ముక్కలపై ఠాగూర్, చంద్రబోస్ వరకు సర్వేపల్లి, గురజాడ, కందుకూరి వంటివారి చిత్రాలను వేసి ప్రశంసలు పొందినారు.

**వల్లంపట్ల నాగేశ్వరరావు :** వీరు పరకాల మండలం వెల్లంపల్లిలో 1953లో జన్మించిరి. శాంతి కళానికేతన్, సాహితీ మిత్రమండలి సంస్థలను స్థాపించి స్వయంగా గేయాలు రాసి, బాణీలు కూర్చి పాడుతూ జానపద గాన గేయ కళలకు విశిష్ట సేవలందిస్తున్నారు.

**కందకట్ల పాపారావు:** ఇతడు ఆత్మకూరు మండలం నీరుకుళ్ళలో 1942, ఆగస్టులో జన్మించిరి. వికలాంగుడైన ఈయన వరంగల్లు రీజనల్ ఇంజనీరింగ్ కళాశాలలో క్లర్కుగా పనిచేస్తూనే నటుడిగా, ప్రయోక్తగా ప్రశంసలందుకొన్నారు..

**సంధి రాజారెడ్డి :**వీరు రాయపర్తి మండలం మైలారంలో 2-12-1948లో జన్మించిరి. అధ్యాపకులుగా పనిచేసిన ఇతడు 100 నాటకాలకు పైగా దర్శకత్వం వహించారు. అనేక నాటకాలలో నటించిన వీరు సబల, మా మతం మానవత్వం వంటి ఉత్తమ నాటకాలను రచించి అనేక అవార్డులు పొందిరి.

**అనుమాండ్ల వెంకట నారాయణ:** వీరు నర్సంపేట మండలం ఉప్పరపల్లిలో 1950లో జన్మించిరి. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థలో పనిచేసిన వీరు పౌరాణిక నాటకాలతో పాటు సాంఘిక నాటకాలలో నటించి పేరు తెచ్చుకున్నారు.

**సుద్దాలపల్లి శోభారాణి** : పరకాల మండలం సీతారాంపురంలో 25-6-1972లో జన్మించిన శోభారాణి రంగస్థల నటి. నర్తకి, గాయనిగా ప్రదర్శనలిస్తుంది.

**గోకా సంధ్యారాణి** : ఈమె నర్సంపేటలో 10-8-1970 లో జన్మించింది. అనేక జాతీయ రాష్ట్ర నృత్యపోటీలలో పాల్గొని బహుమతులు అందుకొన్నది.

**శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి**: వర్ధన్నపేట మండలం ఇల్లందులో 1950లో ఈ సంస్థ ప్రారంభమైంది.

**జాతరలు** : కొమ్మాల జాతర, గీసుకొండ ఉత్సవాలు మొదలైనవి ఈ ప్రాంతంలో ప్రత్యేకమైన జాతరలు.

## సాహిత్య చరిత్ర

వరంగల్ రూరల్ జిల్లా ప్రాంతం సాహిత్య నందనవనం. పేరుపొందిన పండితులు, కవులు, రచయితలు ఇక్కడ అనేక మంది ఉన్నారు.

1854 -1895 ప్రాంతంలో నివసించిన **సుంకరనేని ఫణికుండలుడు** నర్సంపేట మండల మహేశ్వరం గ్రామానికి చెందిన కవి. వీరు రచించిన సీమంతినీ విలాసం' ను తమ్ముడు ప్రచురించిరి. ఇందులో కవి సుమేధ, సుమంతుల కథను చిత్రవిచిత్రంగా వర్ణించినాడు. ప్రతిపద్యము ఎటు చదివినా వికటకవి లాగా ఉండే ఈ కావ్యం వృత్తప్రాస, సర్వత్రప్రాస, ఏకప్రాస వంటి సీసపద్య భేదాలు, పవడగీతి, మేలనగీతి వంటి గీత పద్యభేదాలు గల్గి చిత్రవిచిత్రంగా రచింపబడింది. విజయవిలాసం, అముద్రితరచనలు అలభ్యము.

**సుంకరనేని రాజమౌళి** ఫణికుండలుని తమ్ముడు క్రీ.శ.1860-1915 మధ్యలో మహేశ్వరంలో నివసించిరి. వీరు విజయవిలాసము (ప్రబంధము) సుభద్ర పరిణయం (నాటకం) రచించిరి. విజయవిలాసం రెండుభాగాలు ఉన్నది మొదటి భాగంలో చిత్రాంగదార్జునుల వివాహం, రెండవ భాగంలో సుభద్రార్జునుల వివాహములు వర్ణింపబడినవి. సుభద్ర పరిణయం నాటకం దొరకటంలేదు.

నర్సంపేట వాస్తవ్యులైన **ముదుంబ రంగాచార్యులు** వేదవాస్తుమంత్రశాస్త్ర ప్రవీణులు. మంగళహారతులు ప్రసిద్ధము. 'పాంచరాత్రాగమాచార్య' అని వీరికి బిరుదు. సూరిపల్లి నివాసితులు **దర్భశయనం అయ్యమాచార్యులు** గోదాకల్యాణం, రామాంజనేయ యుద్ధం, పార్వతీ కల్యాణం, దక్షయుద్ధము అనువారి కథలు, రామచంద్ర ప్రభుశతకము, మోహినీ రుక్మాంగద ప్రబంధము రచించిరి. పద్యరచన యందు ప్రవేశం ఉన్న **బార్లమల్లారెడ్డి** 'కర్షకుడు' బతుకమ్మపాటలు ముద్రించిరి. **మరింగంటి సుందర రామానుజాచార్యులు** 'సులభ చికిత్సాబోధిని' పద్యరచన ద్వారా అనేక చికిత్సలను వివరించిరి. అప్పల్‌రావు పేట వాస్తవ్యులు **గోవర్ధనం నరసింహాచార్యులు** మంచి హరికథకులు.

**సంపన్ముదుంబై వరదాచార్యులు** 1957లో నర్సంపేటలో సాహితీ మిత్రమండలిని స్థాపించి అనేక పుస్తకాలను ప్రచురించి ఇంకను సాహిత్య సేవచేస్తున్నారు. అధ్యాపకులుగా పదవీ విరమణ పొందిన వీరు మానవతా పురుషోత్తముడు, వరదరాజ శతకం, వాణీ నాదం, కరావలంబ స్తోత్రం, పసిడి పలుకులు, కళ్యాణ రాఘవ సమీక్ష, పాకాల చరిత్ర, పరమపద సూక్తులు, నాచ్చియార్ తిరుమొయి, తిరుప్పలాండు - తిరుప్పళ్ళియెయిచ్చి- తిరుప్పావై - కణ్ణినుణ్ శిరుత్తాంబు, రామాయణ పారాయణ విధానము, రామాయణ ప్రశస్తి, పరమ పదోత్సవ విధానము, భాగవత సప్తాహ పారాయణ విధానము, సుధాపాణి అను రచనలు చేసిరి. వీరు జ్యోతిషము, వైదికములలో ప్రవీణులు.

సాహితీమిత్ర మండలి అధ్యక్షులుగా నున్న **మహమ్మద్ నవాజ్ అలీ** 'సంజీవని' కవితా సంపుటి ప్రచురించిరి. **సముద్రాల వెంకట్రామ నరసింహాచార్యులు** 'నన్ను గన్న తండ్రి' శతకం, ఎన్.జి.ఒల పాటలు, కీర్తనలు, సాంఘిక నాటకాలు రచించిరి. తిరు వేంగళాచారి సద్గతి, శ్రీనివాస శతకాలు రచించగా, వీరి శ్రీమతి **మంథెన ఆండాళ్** యువతీ శతకం, విరహ గోపికము, మానవ ప్రబోధము, శ్రీమద్రామాయణ

శతకము, శ్రీ విష్ణు శతకము, నా కవిత్వం. భక్తి భజనమాల, సరస వినోదిని, సమస్యా పూరణము (నాల్గు భాగాలు) భారతీ శతకము, భద్రాద్రి శతకములను రచించెను. ఖానాపురం వాస్తవ్యులైన **మండవ సుబ్బారావు** నవ భారతం, మాతృ మందిరం, ఎం.ఎస్.ఆర్ కథలు, నా మాట, త్వమేవాహం, కావ్యదర్శనం, విద్యార్థి వ్యాకరణం, విహంగ వీక్షణం అను రచనలు సవ్యసాచి, ఎంఎస్ఆర్, శ్రీకాంత్ అను కలం పేర్లతో రచించిరి.

దుగ్గొండి మండలం అడవి రంగాపురానికి చెందిన **నల్ల ఉపేందర్** ఉపాధ్యాయ వృత్తి చేస్తూనే తెలంగాణ ఉద్యమ కెరటాలు అయిదు భాగాలు, శ్రీ భాగవత కృష్ణ కవితా వైభవం, బైబిల్ ప్రధాన పాత్రలు, ప్రబంధ గణపతి స్తుతి, జల ప్రళయం, సమ్మక్క జాతర, రామప్ప శిల్పి కన్నీటి కథ, గట్టు మల్లన్న క్షేత్ర మాహాత్మ్యం, అక్షరసమరం, ప్రగతి సూత్రాలు మున్నగు నలబై పద్య రచనలు చేసిరి. వీరు అచల సిద్ధాంత బోధకులు. **దర్భశయనం శ్రీనివాసాచార్యుల** 'జీవన వీచిక', **గన్ను సుదర్శన్** 'బాటసారి' 'మామ పెండ్లాము', **గన్ను కృష్ణమూర్తి** 'అడవిపూలు, అంతరంగం, కుసుంబ లింగయ్య' 'ఆరె తెలుగు నిఘంటువు', **వద్దిరాజు మోహనరావు** 'మోహన రామాయణము', **పాతూరి రఘురామయ్య** 'శ్రీశ్రీ శతకం', శ్రీ రుద్రంగి లక్ష్మీ నృసింహ మధ్యాక్కరలు, శ్రీ భద్రకాళి శతక తారావళి, శ్రీ కృష్ణదేవ శతకం మున్నగునవి నర్సంపేట ప్రధాన కేంద్రంగా ఈప్రాంతం నుండి వెలువడిన రచనలు.

ప్రజాకవి కాళోజీ మామ **వేలూరు మాణిక్యరావు** గవిచర్ల నివాసి. బహుభాషా పండితులైన వీరు 'శివస్తుతి' పద్యకావ్యాన్ని రచించిరి. పరకాల వాస్తవ్యులైన రాపాక వంశంలో అనేకమంది కవులు కలరు. 1700 ప్రాంతానికి చెందిన **రాపాక లక్ష్మీపతి కవి** భద్రాయురభ్యుదయము, శ్రీ కృష్ణ విలాసము, శంకర విజయము, శ్రీమదుపాఖ్యానము, నీలా వివాహములు అను పద్య కృతులు రచించిరి. 1780 ప్రాంతంవాడైన **రాపాక శ్రీరామకవి** 'అధ్యాత్మ రామాయణము' రచించగా **రాపాక వెంకటదాస కవి** 'శివ రహస్య ఖండము' రచించిరి. బహుభాషా ప్రవీణుడు, హరికథకుడు అయిన **రాపాక వెంకటపతి శాస్త్రి** వెంకటేశ్వర శతకము, రామ శతకము, కేదారేశ్వర శతకము, భజనమాల, రాజరాజేశ్వర స్తవము, కూకుమేశ్వర కీర్తనలు, మంగళ హారతులు రచించిరి.

ఆత్మకూరు సంస్థానాధీశులైన ఇనిగెల వెంకట ధర్మారావు, వెంకట నరసన్న దేశాయి గారల వద్ద ఆస్థాన కవిగా పనిచేసిన బహు గ్రంథకర్త **అంబటి లక్ష్మీ నరసింహరాజు.** వీరు తెలుగులో పాండవ ప్రభావము, ప్రచ్ఛన్న పాండవము, రఘువీర విజయము, యదువీర విజయము, కర్ణాభ్యుదయము, అర్జునాభ్యుదయము వంటి చంపూ రచనలు, త్యాగరాజు చరిత్ర, గజేంద్రమోక్షము వంటి నిర్వచన పద్య కావ్యాలు, శశిరేఖ, రుక్మాంగద, ప్రభావతి, ప్రహ్లాద, ద్రౌపది, పార్వతీ పరిణయం వంటి నాటకాలు రచించినారు. వీరు 1891లో జన్మించారు. ఆత్మకూరు వాస్తవ్యులైన **సముద్రాల లక్ష్మీ నరసింహాచార్యుల** ప్రస్తావన గోల్కొండ పత్రికలో ప్రస్తావింపబడింది. 'పత్రికా సతీ' అంటూ వినూత్న రీతిలో పత్రికను సతితో పోల్చుట వీరి రచనలో కనబడుతుంది. వీరు గోదా స్తవము, లక్ష్మీనృసింహ శతకము, రామాంజనేయము' అను పద్య రచనలు చేసిరి.

కల్లెడ గ్రామంలో జన్మించిన **మోటుపల్లి కృష్ణమాచార్యులు** శారదా శతకం రచించినట్లు తెలుస్తుంది. నర్సంపేట మండలం ఆలంఖానుపేటలో జన్మించిన **సిద్ధిరాజు లక్ష్మీనరసింహారావు** భక్త భిక్ష, సత్యకీర్తి పద్యాలు, దయావీరుడు నాటకం రచించిరి. పరకాల మండలం పెద కొడిపాక గ్రామంలో జన్మించిన **గులాం నబి అల్‌హజ్** విశ్వ మానవ శ్రేయస్సును కోరుతూ ఉర్దూ, పారశీ తెలుగు భాషల మేలు కలయికతో అనేక రచనలు చేసిరి. వీరి దిక్సూచి అను నీతి శతకం మేలుకొలుపు, గరీబీ హటావో అను పద్య కావ్యాలు, పాఠశాల ప్రగతి గీతాలు అను పాటలు, భావ స్వరూపాలు అను వచన కవితలు, న్యాయమే జయము అను జానపద నాటిక, మధ్యవర్తి, జ్ఞానసుధలు అను యితర రచనలు

లభించుచున్నవి. పెదకోడెపాక వాస్తవ్యులైన **సూర్యదేవర సుందరయ్య** ఉపాధ్యాయ వృత్తి చేస్తూ శ్రీరామామృత శతకము, శ్రీ సుందరయ్య శతకము, హనుమాన్ చాలీసా, భగవద్గీత, కల్లేశ్వర శతకము, మగువ అను రచనలు చేసినారు. పరకాల మండలం మెట్టుపల్లి నివాసి అయిన **ముసిపట్ల సుధాకర్** కవితలు 'సుధారంజని' సంపుటిగా వెలువడినవి. వర్ధన్నపేట మండలం ఒంటి మామిడిపల్లిలో జన్మించిన **ఆడెపు చంద్రమౌళి కవి** శ్రీ శ్రీనివాస బొమ్మల శతకం, శ్రీ రాజ రాజేశ్వరీ సాహిత్య క్యాలెండర్, స్త్రీ, 'How to Learn English in a short period' రామాయణ రమణీయములు రచించిరి. నెక్కొండ మండలం గంద్రపల్లి గ్రామానికి చెందిన **శేషభట్టర్ వెంకటాచార్య** మానవతావాద దృక్పథంతో కవితాజ్యోతి, అయిదు వందల పద్యాలు, భక్తిగీతాలు, కీర్తనలు, పేరడీ పాటలు ద్వంద్వార్థ వ్యాఖ్యా కవితలు రచించిరి. అధ్యాపకులుగా పని చేసిన **ఆరుట్ల భాష్యాచార్య** శాయంపేట వాస్తవ్యులు. వీరు శ్రీ గట్టు రాజేశ్వర శతకము, కల్హార హారము, ఆరాధన, సమర్పణ, మందగిరి శ్రీ వేంకటేశ్వర సుప్రభాతము, సుమస్రజము' అను పద్య రచనలు చేసినారు. గంగదేవపల్లి నివాసులైన **జీడికంటి శ్రీనివాసమూర్తి** 'పోతన మాధురి' 'స్పందన' 'ప్రగతిపథంలో గంగదేవిపల్లి' రచించిరి.

**వి.ఆర్. విద్యార్థి** పర్వతగిరి మండలం గవిచర్ల నివాసి. వీరు అలలు, పలకరింత, ఘర్మ సముద్రం, మంచు మైదానం, కవిత్వం నా భాష, కవి శాపం, 'The Note Book of Vidhyarthy' రచించిరి. పరకాల మండలం నాగారంలో జన్మించిన **పల్లేరు వీరాస్వామి** ఉషోదయం, పల్లేరు శతకం, వ్యాసప్రభ రచనలు చేసిరి. నర్సంపేట మండలం రంగాపురానికి చెందిన **మహమ్మద్ సిరాజుద్దీన్** ప్రపంచ శాంతి పండుగ, యుద్ధం, కథలు, కవితలు, హాస్య నాటికలు, గజళ్ళు, ఖవ్వాలీలు రచించిరి. వీరు 'World Peaceful Festival' సంస్థను నెలకొల్పిరి. ఇల్లందులో జన్మించిన **అడ్లూరి అయోధ్యరామకవి** దీపావళి, ఘంటారావము, ఆంధ్రకేసరి, స్వాతంత్ర్య గీతాలు, తెలంగాణ మంటల్లో... తాటికొండ, అన్నపూర్ణేశ్వర శతకం, సీతారామ శతకం, సంఘర్షణలు, ప్రజా విప్లవం, విజయం, రుద్రమదేవి రచనలు చేసిరి. రామపర్తి మండలం కొండాపురం గ్రామమున జన్మించిన **డా. కండ్లకుంట కోదండ రామానుజాచార్యులు** అధ్యాపకులుగా పనిచేసిరి. మందారమాల, సాహితీ సమార్చన, స్తంభాద్రి వెంకటేశ్వర వైభవం, వేదములు సాంఘిక జీవనం, జల విజ్ఞాన తరంగిణి, కవి మనోగతం వంటి రచనలు చేసిరి. 1976లో పర్కాలలో స్థాపించబడిన 'మిత్రమండలి' సాహిత్య సంస్థ పల్లేరు వీరాస్వామి నిర్వహణలో అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నది.

సామాజిక విశ్లేషకుడు **ఆచార్య కంచె అయిలయ్య,** ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పని చేసిన **ఆచార్య ననుమాస స్వామి,** కాకతీయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న **ఆచార్య బన్న అయిలయ్యలు** వరంగల్లు రూరల్ జిల్లా నర్సంపేట ప్రాంతానికి చెందనవారు. వీరి రచనలు బహుళ ప్రచారములు.

ఈవిధంగా ప్రాచీన కాలం నుండి వివిధ ప్రక్రియలలో తెలుగు సాహిత్య రచనలు చేస్తున్న ఉత్తమ కవులు, రచయితలు, విమర్శకులు ఈ జిల్లా ప్రాంతంలో అనేకమంది ఉన్నారు.

## వివిధ రంగాల ప్రముఖులు

వరంగల్లు రూరల్ జిల్లా ప్రాంతంలో అనేకమంది ప్రముఖులు జన్మించిరి. తెలంగాణ సిద్ధాంతకర్త అయిన డా. కొత్తపల్లి జయశంకర్ ఆత్మకూరు మండలంలోని అక్కంపేటలో 6.8.1934లో జన్మించారు. వీరు ఎం.ఎ., పిహెచ్.డి (ఎకనామిక్స్) బి.ఇడి డిగ్రీలను పొందిరి. వీరు సి.కె.ఎం. కళాశాల ప్రిన్సిపాల్, కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, వైస్ ఛాన్సలర్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ మరియు ఫారిన్ లాంగ్వేజస్ రిజిస్ట్రారుగా పదవులు నిర్వహించిరి. అధ్యాపక సంఘాలతో పాటు అనేక సంస్థలలో వివిధ హోదాలలో పనిచేసినారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర

అభిమాని అయిన వీరు విద్యార్థి దశలోనే నాన్ - ముల్కీ ఉద్యమంలో పాల్గొన్నారు. 1969లో తొలిదశ ఉద్యమంలో ముందు నడిచారు. 'ఔర్ ఏక్ ధక్కా' అంటూ 1996లో మలిదశ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమం విజయవంతమై జూన్ 2, 2014లో తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. వీరు బ్రహ్మచారిగానే వారి జీవితాన్ని గడిపిరి. వీరికి తెలుగు, సంస్కృతం, ఉర్దూ, హిందీ, ఆంగ్ల భాషలలో మంచి ప్రావీణ్యం ఉంది. జయశంకర్ 1996 అక్టోబర్ 27, 2001లో హన్మకొండ ఝాన్సీ ఎస్టేట్‌లో వీరు ప్రారంభించిన ఉపన్యాసాలే తర్వాతి ఉద్యమానికి ఆరంభములైనవి. తెలంగాణ చరిత్రపై అవగాహన కల్గించడం, నీళ్లు, నిధులు, ఉద్యోగాల దోపిడిని తెలియపర్చడం, భవిష్యత్‌లో ఉండవల్సిన తెలంగాణ అను మూడంచెల ప్రణాళికలో ఉద్యమాన్ని ముందుకు నడిపారు. వీరు 'తెలంగాణలో ఏం జరుగుతోంది', 'తెలంగాణ రాష్ట్రం ఒక డిమాండ్' అను పుస్తకాలను రచించిరి. వీరి 'వడవని ముచ్చట్లు' చాలా ప్రచారం పొందింది. 42 మంది తెలంగాణ కాంగ్రెస్ ఎం.ఎల్.ఏలు సోనియాగాంధిని కల్సి చూపించిన తెలంగాణ అవశ్యకతను తెలిపే డాక్యుమెంటేషన్‌ను జయశంకర్ రూపొందించిరి. యుపిఎ ప్రభుత్వం నియమించిన శ్రీకృష్ణ కమిటీకి సమర్పించిన నివేదికను వీరే సిద్ధం చేసినారు. వీరు 21.6.2011లో మరణించిరి.

అసెంబ్లీ టైగర్‌గా పేరు పొందిన మద్దికాయల ఓంకార్ నర్సంపేట వాస్తవ్యులు. వీరు ఇక్కడినుండి 1972,1978, 1983, 1985, 1989 లలో వరుసగా శాసనసభ్యులుగా ఎన్నికైనారు. భారత మాజీ ప్రధానమంత్రి పి.వి. నర్సింహారావుగారి అమ్మమ్మ ఇల్లు నర్సంపేట. వారు ఇక్కడే జన్మించినారు. ప్రస్తుతం సివిల్ సప్లయీస్ చైర్మన్‌గా ఉన్న పెద్ది సుదర్శనరెడ్డి ఇక్కడి నివాసి. ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావుగారి కార్యాలయం పి.ఆర్.ఒగా పనిచేస్తున్న గటిక విజయ్‌కుమార్ ఇక్కడి నెక్కొండ మండలంవాడు. నీటిపారుదల శాఖామాత్యులు తన్నీరు హరీష్‌రావుగారు నెక్కొండ మండలాన్ని దత్తత తీసుకొని అనేక అభివృద్ధి పనులను చేయిస్తున్నారు.

స్వాతంత్ర్య సమరయోధులు కటంగూరి నర్సింహారెడ్డి, యం.యన్. రంగాచార్యులు పరకాల ప్రాంతంవారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరిగారు పర్వతగిరిలో జన్మించినారు. ఎం.ఎల్.ఎ. ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాయపర్తి మండల నివాసి. ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ తిరుపతిరావు, మాజీ మంత్రి పురుషోత్తమరావు, పర్వతగిరి కొంకపాకలో జన్మించినారు. మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ వర్ధన్నపేట వాస్తవ్యులు. ఇంకా చాలామంది ఈ జిల్లాకు చెందిన ప్రముఖులు ఉన్నారు.

వరంగల్ రూరల్ జిల్లా ఈవిధంగా అన్ని రంగాల్లోను అభివృద్ధి దిశలో పయనిస్తుంది.

## దర్శనీయ ప్రదేశాలు - పర్యాటకరంగం

**ముఖ్య దేవాలయాలు :** వరంగల్లు రూరల్ జిల్లాలో ఆధ్యాత్మిక సాంస్కృతిక వాతావరణానికి నిలయమైన దేవాలయాలు, దర్శనీయ స్థలాలు, వివిధ మతస్థుల ప్రార్థనా మందిరాలు అనేకం ఉన్నాయి.

**ఆత్మకూరు పంచకూటాలయం :** అయిదు ఆలయాలు ఒక కూటంగా ఉన్న ఈ దేవాలయాన్ని 1250 నాటి కంఠాత్మకూరు శాసనం భీమదేవర ఆలయంగా పేర్కొన్నది. ఇది 'యు' ఆకారంలో ఉంటుంది. ఇందులో మధ్యలోనున్న శివాలయానికి అటురెండు ఇటురెండు శివాలయాలున్నాయి. అయిదింటికి ఎదురుగా ఐదు నందులున్నాయి. అందమైన కక్షాసనం, చుట్టూ చక్కని జగతి సుందరమైన ఉపపీఠాలున్నాయి. ఆలయ ప్రధాన మంటపం భూమిలోకి కృంగిపోయి ఉంది. దీని నిర్మాణం కాకతీయుల కళాశిల్పానికి, పనివారి శిల్పనైపుణ్యానికి గొప్ప నిదర్శనంగా ఉంటుంది.

**ఆత్మకూరు వేణుగోపాలస్వామి ఆలయం :** మండల కేంద్రమైన ఆత్మకూరులో కాకతీయులు నిర్మించిన మరొక విశేషమైన గుడి యిది. శివ సంబంధమైన పానవట్టం మీద వేణు గోపాలస్వామి ఆలయం ఏర్పాటు చేయడం మత సామరస్యానికి నిదర్శనం. దేవాలయంలోని ఒక స్తంభంపై

ఏనుగు, సింహాకృతులు కలిపి చెక్కబడి ఉన్నాయి. ఇది ఒకవైపు నుండి చూస్తే ఏనుగు మరొకవైపు నుండి చూస్తే సింహం కనిపిస్తాయి. ఇది విశాలమైన ప్రాంగణం నాల్గుస్తంభాలపై నిర్మించిన పెద్దగోపురం గోడపైన సింహాలు ద్వారపాలకులు కల్గి ఉంటుంది. అద్భుతమైన ఈ నిర్మాణం కాకతీయుల శిల్ప కళాభిరుచిని చక్కగా వెల్లడిస్తుంది.

**ఎలుకుర్తి హవేలి ఆలయాలు** : ఇది సంగెం మండలం లోనిది. రేచర్ల రుద్ర సేనాని క్రీ.శ.1192 -1262 ప్రాంతంలో తన పేర అన్యేశ్వరాలయం, పెద్దకొడుకు పేర లోకేశ్వరా లయం, చిన్న కొడుకు పేర గణపేశ్వరాలయం నిర్మించి వాటి నిర్వహణకు భూదానం చేసినట్లు శాసనంలో నున్నది. ఇందులో మొదటి రెండు శిథిలములుకాగా మూడవది నేటికిని సందర్శకులను ఆకర్షిస్తుంది. ఇందలి గర్భాలయం, అంతరాలయం, ద్వారస్తంభాలు సుందరంగా ఉంటాయి. ఇందలి గణపతి చతుర్భుజుడై పొట్టిగా దిట్టంగా అద్భుతంగా కన్పిస్తాడు.

**కక్కిరాలపల్లి ఆలయాలు** : వర్ధన్నపేట మండలం కక్కిరాలపల్లిలో నంది మాత్రం మిగిలిన శిథిల శివాలయం ఉంది. దీనిని కాకతీయ మంత్రి అన్నయ దేవుడు నిర్మించాడు. ఆలయానికి 100 గజాల దూరంలో అందంగా చెక్కిన సుఖాసనుడైన మహాగణపతి విగ్రహం ఉంది. ఇంత పెద్ద విగ్రహం కాకతీయ శిల్పాలలో చాలా తక్కువగా కనిపిస్తాయి.

**కటాక్షపురం - శివకేశవాలయాలు:** కటాక్షపురం గ్రామంలో రెండు త్రికూటాలయాలు నేడు శిథిలావస్థలో ఉన్నాయి. విశాలమైన స్థలంలో 7 అడుగుల ఎత్తైన వేదికపైన ఈ ఆలయాలలోనికి మెట్లు ఉన్నాయి. లోపల విశాలమైన నృత్యమంటపం, పైకప్పు పద్మాకార శిలాఫలకం, దీనికి మూడు ఆలయాలున్నాయి. ఇక్కడి చెన్నకేశవ స్వామి వారి విగ్రహం హైదరాబాదు పురావస్తు మ్యూజియంలో భద్రపరచ బడిందంటారు.

**కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం** : వరంగల్లు, నర్సంపేట ప్రధాన రహదారిలో కొమ్మాల వద్ద ఒక కొండపై ఈ దేవాలయం ఉంది. దీనిని పాండవుల గుట్ట, పాండవుల చోటు అనికూడా పిలుస్తారు. పాండవుల గుట్ట చరియలో నరసింహస్వామి యిరు ప్రక్కల భూదేవి, నీలాదేవి విగ్రహాలు ఉంటాయి. ఈ ప్రాంతంలో కొమ్మాల జాతర చాలా ప్రసిద్ధి. ఈ జాతర ప్రతి సంవత్సరం మార్చిలో 16 రోజులు జరుగుతుంది. ఇందులో అలంకరించిన ఎడ్లబండ్లలో గడ్డితో చేసిన రకరకాల బొమ్మలను పెట్టి తిప్పుతూ ప్రదర్శిస్తారు. ప్రజలు అధికసంఖ్యలో పాల్గొంటారు.

**గీసుకొండ - లక్ష్మీనరసింహస్వామి ఆలయం:** గీసుకొండ గ్రామం చివర కొండమీద 300 అడుగుల ఎత్తులో ఈ గుడి ఉంది. ఈ కొండమీద ఏడాది పొడుగునా స్వచ్ఛమైన నీరున్న కోనేరు ఉంటుంది. ప్రతిసంవత్సరం పుష్య శుద్ధ ఏకాదశి నుండి పౌర్ణమి వరకు ఉత్సవాలు జరుగుతాయి. ఇది కాకతీయరాజుల నిర్మాణమని ప్రసిద్ధి.

**గుండంవల్లి శివాలయం** : నర్సంపేటకు సమీపంలో నున్న గుండంవల్లి గ్రామంలో యిది ఉంది. పాకాలచెరువు చూడటానికి వచ్చిన వారు ప్రతాపరుద్రుడు నిర్మించిన శివాలయాన్ని దర్శించిపోతారు.

**నీరుకుళ్ళ దేవాలయాలు:** ఇచ్చట మూడు దేవాలయా లున్నాయి. గ్రామం ప్రారంభంలోనే చెన్నకేశ్వరాలయం ఉంటుంది. ఆలయ ప్రాంగణంలో నున్న వీరగల్లులు, సప్తమాతృకలు, వినాయకుడు వంటి చిన్నచిన్న విగ్రహాలు శిథిలమై కనిపిస్తాయి. ఇక్కడ ఉన్న మరొక దేవాలయం వేణుగోపాల స్వామి వారిది. నల్లరాతిలో వేణువు ఊదుతూ నిల్చున్నట్లు ఉన్న ఈ శిల్పం మనోహరంగా ఉంటుంది. ప్రక్కన మరొకటి శివాలయం ఉంది. ఇక్కడ శివలింగం ఉంచిన పానవట్టము, అమ్మవారి విగ్రహము, వినాయకుని విగ్రహాలు పూర్తిగా కాకతీయశైలిలోనే ఉంటాయి. స్థానిక నర్సంపేట శ్రీవేంకటేశ్వర శివాలయం కూడా అతిపురాతనమైంది.

**తెలగిచర్ల ఏకవీరాలయం:** గీసుగొండ మండలం మొగిలిచర్ల నడిబొడ్డున ఈ ప్రాచీన దేవాలయం ఉంది. కాకతీయుల దేవతలలో ఏక వీరాదేవి ప్రధాన దేవత. ఈమె తర్వాత ఎల్లమ్మ దేవతగా ప్రసిద్ధి పొందింది. ఇప్పటికి ఎల్లమ్మ గుళ్ళు, ఎల్లం బజారులు ఉన్నాయి.

కాకతీయులు నిర్మించిన ఈ దేవాలయాలు వారి ఆర్ష సంప్రదాయ ప్రవర్తనకు శిల్పకళాభిమానమునకు నిదర్శనములు. హైందవ దేవాలయాలతో పాటు ఇక్కడ దర్గాలు, చర్చీలు కూడా నిర్మింపబడినవి. దీనికి పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని అన్నారం షరీఫ్, వరంగల్, నర్సంపేట మార్గంలో ఉన్న జాన్‌పాడ్ రహమతుల్లా దర్గా మున్నగునవి. ఇవి ముస్లింల సంప్రదాయంలో నిర్మింపబడినా, వారితో పాటు హిందువులను అనేకమంది పూర్తి విశ్వాసంతో దర్శించుకొనుట మత సామరస్యానికి నిదర్శనములు.

ఈ జిల్లాలో ప్రసిద్ధి పొందిన అలనాటి ప్రసిద్ధ గడీలున్నాయి.

**ఆత్మకూరు గడి:** మండల కేంద్రమైన ఆత్మకూరులో ఉన్న ఈ గడి నిజాంపాలనా కాలంలో సంస్థానంగా వెలుగొందింది. ఆత్మకూరు దొరలు చుట్టుపట్ల 80 గ్రామాలకు అధిపతులుగా పరిపాలన సాగించిరి. 200 సంవత్సరాలపైగా చరిత్ర కలిగిన ఈ గడి 300 గదులు కల్గి అన్ని సౌకర్యాలతో కట్టుదిట్టంగా నిర్మింపబడినది.


**ధర్మారాయుని కోట:** దాదాపు 150 సంవత్సరాలకు పూర్వం ధర్మారాయుడు నిజాముల నెదిరించి రక్షణకోసం ఖానాపురంలో ఈ ఖిల్లాను నిర్మించుకొనినట్లు తెలియు చున్నది.

కాకతీయరాజులు చక్కని ప్రణాళికలో, ఉత్తమ శిల్పకళానైపుణ్యంలో ప్రజల కోరికలకనుకూలంగా అనేక నిర్మాణాలు కావించినట్లు అనుకొనవచ్చు.


మండల కేంద్రమైన గీసుగొండ ప్రాచీన చరిత్ర కల్గిన గ్రామము. ప్రాచీన కాలంలో గ్రీకులు ఇచ్చట స్థావరాలను నెలకొల్పి వర్తక వాణిజ్యాలు సాగించినట్లు ఇక్కడ దొరికిన గాంధార శిల్ప కళను పోలినట్టి బొమ్మలను బట్టి తెలుస్తుంది. ఇక్కడ లభించిన శిలాయుగానికి చెందిన అనేక మట్టి రాతి పనిముట్లు చారిత్రక ప్రాచీన అవశేషాలు పురావస్తు శాఖవారు హైదరాబాదు మ్యూజియంలో భద్రపరిచినారు.

వరంగల్ చుట్టుప్రక్కల ఉన్న అన్ని ప్రాంతాల సమాహారమిది. నర్సంపేట ప్రాంతాలు చాలా విశేషాలను పొందుపరచుకున్నాయి. వరంగల్ ప్రాంత రాజులైన కాకతీయుల ఏలుబడి వల్ల ఈ ప్రాంతం చాలా ఉన్నతంగా వికసించింది. ప్రస్తుతం వారి స్ఫూర్తితో మళ్ళీ వరంగల్ రూరల్ జిల్లా ఉన్నత స్థితిని పొంది ఆదర్శప్రాయమవుతుందని ఆశిద్దాం.

# వికారాబాద్ జిల్లా చిత్రపటం




270(a)



లక్ష్మీ అనంతపద్మనాభస్వామి



పాంబండ రామస్వామి



అనంతగిరి దేవస్థానం



భూకైలాస్



అనంతగిరి కొండలు



అనంతగిరి జలపాతం

# వికారాబాదు

భక్తిననంతధామమయి భాసిలు కొండల నిండుగుండెయై
సక్తి గొనంగ ప్రాకృతిక సారసరోవర రాజితమ్మునై
శక్తి నొసంగునట్టి దరజాల పరిశ్రమ భాసమానయై
రక్తినొసంగు నెల్లరకు రాగవికారములెల్ల బాపుచున్!

వికారాబాదు జిల్లా పూర్వపు రంగారెడ్డి జిల్లా నుంచి విడివడిన తురుపు ముక్క. కొత్త జిల్లాల ఏర్పాటులో ముందునుంచి ముందున్న జిల్లా వికారాబాదు. ఉద్యమ కాలంలోనే నాటి ఉద్యమకారుడు, నేటి ముఖ్యమంత్రి కేసీఆర్ 'వికారాబాదు'ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటుచేస్తాం అని ప్రకటించారు. అనుకొన్నట్లుగానే వికారాబాదు జిల్లా ప్రకటించబడింది. కాకపోతే ఇక్కడి ప్రసిద్ధమైన 'అనంతగిరి'ని జిల్లా పేరు మొదటపెడితే ఇక్కడి ప్రజల ఆకాంక్ష తీరేది. అలాగే ఒకప్పుడు మొత్తం నగరంతో కలిసి వున్న ఈ ప్రాంతం ప్రస్తుతం మొత్తానికి మొత్తంగా గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటైందని ఇక్కడి ప్రజల ఆవేదన.

## భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి

వికారాబాదు జిల్లా $16^0$- $30^1$ మరియు $18^0$-$20^1$ ఉత్తర అక్షాంశాల మధ్య $77^0$-$30^1$ మరియు $79^0$-$30^1$ తూర్పు రేఖాంశాల మధ్య వ్యాపించి వుంది. 3,386 చ.కి.మీ. వైశాల్యాన్ని కలిగి వుండి సముద్ర మట్టం కన్నా ఎత్తులో వుంది. ఈ జిల్లాకు ఉత్తరాన సంగారెడ్డి జిల్లా, పశ్చిమంలో కర్నాటక (గుల్బర్గా) సరిహద్దు, తూర్పున రంగారెడ్డి జిల్లా సరిహద్దు, దక్షిణంలో మహబూబ్‌నగర్ జిల్లా సరిహద్దులు కలిగి వుంది.

## సహజ వనరులు

వికారాబాదు జిల్లాలో ప్రత్యేకించి తాండూరులో 'రాయి పరిశ్రమ' వుంది. భూగర్భంలో పొరలు పొరలుగా వచ్చే ఈ రాళ్ళను అనేక ప్రాంతాల్లో బండలుగా పరుచుకుంటారు. రాజస్థాన్ మార్బుల్స్, టైల్స్ నిర్మాణ రంగంలోకి వచ్చినా ఈ రోజుకూ తాండూరు నాపరాయికి విలువ తగ్గలేదు. జిల్లాలో మూసీ, ఈసా, కాగ్నా నదులు ప్రవహిస్తున్నాయి. అయితే వాటివల్ల చెప్పుకోదగ్గ పంటలు పండకున్నా భూగర్భ జలాల పరిరక్షణకు ఇవి బాగా ఉపయోగపడుతున్నాయి. ఈ జిల్లాకు అనంతగిరి కొండలు పచ్చని మణిహారంలా వున్నాయి. హైదరాబాదుకు అతి సమీపంగా ఉన్న ఈ కొండలు చక్కని పర్యాటక కేంద్రంగా వుంది.

**నేలలు :** వికారాబాద్ జిల్లాలో భూములు మిశ్రమంగా వున్నాయి. నల్లరేగళ్లు 50%, ఎర్రనేలలు, దుబ్బ చెల్కలు కలిపి వున్నాయి. పరిగికి తూర్పు భాగంలో ఎర్రనేలలు, కొడంగల్ ప్రాంతంలో నల్లరేగళ్లు, గల్సు నేలలు, సున్నపురాయి నేలలు, మరికొన్ని చోట్ల పూర్తి ఎర్రనేలలు, పూర్తి నల్ల నేలలు కనిపిస్తాయి. వ్యవసాయపరంగా పత్తి, మొక్కజొన్న, వరి, జొన్న, కందులు, శనగలు, వేరు శనగ, చెఱకు, పసుపు, కూరగాయలు, పూల, పండ్ల తోటలు వేయడానికి ఈ జిల్లా

## రెవిన్యూ డివిజన్లు, మండలాలు

ఈ జిల్లాలో వికారాబాద్, తాండూర్ రెవెన్యూ డివిజన్లు, మొత్తం 17 మండలాలున్నాయి.

**వికారాబాద్ డివిజన్‌లోని మండలాలు :**

1. మర్పల్లి, 2. మోమిన్‌పేట్, 3. నవాబ్‌పేట, 4. వికారాబాద్, 5. పూడూరు, 6. కుల్కచర్ల, 7. దోమ, 8. పరిగి, 9. దరూర్, 10. కోటేపల్లి, 11. బంట్వారం

**తాండూర్ డివిజన్‌లోని మండలాలు :**

1. పెద్దేముల్, 2. యాలల, 3. కొడంగల్, 4. బొమ్మరాస్‌పేట, 5. బషీరాబాద్, 6. తాండూర్

అనువుగా వుంటుంది. హైదరాబాద్ పారిశ్రామికవేత్తలు ఈ ప్రాంతంలో భూములు కొనుక్కొని తోటలు పెంచుతున్నారు. మన్నెగూడ ప్రాంతంలో వున్న ఫాంహౌజ్‌లు బహుశా, నగరానికి ఇంత దగ్గరగా ఎక్కడా లేకపోవచ్చు. నైట్రోజన్, జింక్, సల్ఫర్‌ల శాతం జిల్లాలో తక్కువగా ఉండిన కొన్ని ప్రాంతాల భూములు ఎక్కువగా వాణిజ్య అభివృద్ధికే ఎక్కువ ఉపయోగపడుతున్నాయి,. రాకమచర్ల ప్రాంతంలో లభించే ఎర్ర మట్టిని సిమెంటు తయారీలో ఉపయోగిస్తారని చెప్తారు. తాండూరులో సీసీఐ, కోరమాండల్, సిమెంట్ ఫ్యాక్టరీలు, నాపరాతి గనులున్నాయి.

**అడవులు :** ఈ జిల్లాలో అడవులు 432.97 చ.కి.మీ. విస్తరించి వున్నాయి. జిల్లాలోని మొత్తం భూభాగంలో ఇది 12.79 శాతం మాత్రమే. నల్లమద్ది, టేకు, వేప, ఇప్ప, బిజాపల్, చెన్నంగి, సర్వి, సాలి, గంధం చెట్లు వున్నాయి. వికారాబాదు జిల్లాలో బంటారం, కోట్‌పల్లి, దోమ, అనంతగిరి, కుల్కచర్ల, కొడంగల్, తాండూరుకు చుట్టుపక్కల అటవీ భూములున్నాయి. జిల్లాలో చిట్టడువులు, దట్టమైన అడవులు, పొదలు ఉండటం వల్ల చిరుతలు, ఎలుగులు నివసిస్తున్నాయి. ఒక్క పరిగికి తప్ప అన్ని పట్టణాల పక్కన అటవీ భూములు ఉన్నాయి. అనంతగిరిపైనే జిల్లా ప్రధాన అటవీ శాఖా కార్యలయం వుంది. జిల్లాలో మొత్తం అటవీ శాతం 30 శాతానికి మించదు.

**నదులు :** వికారాబాదుకు ప్రత్యేకమైన మూసీ నదికి గొప్ప చరిత్రనే వుంది. ముచికుందా నదిగా పేరొందిన మూసీనది ఒడ్డునే భాగ్యనగరి చరిత్ర అంతా ఒకప్పుడు విస్తరించింది. అనంతగిరిలో ముచికుందుడు తపస్సు చేసినందువల్ల ఈ నదికి ముచికుందా నది అని పేరు. ముస్లిం రాజుల పాలనలో మూసీనదిగా ఇది పేరు పొందింది. ఇది కృష్ణకు ఉపనది.

**చెరువులు, ప్రాజెక్టులు :** అలాగే భీమానదికి ఉప నదిగా చెప్పే కాగ్నానది వికారాబాద్, తాండూరుతో సంబంధం కలిగి వుంది. కోట్‌పల్లి ప్రాజెక్టు వ్యవసాయాధారమే కాక పర్యాటక కేంద్రంగా కూడా వుంది. బంటారం పక్కనున్న అడవి చూడ ముచ్చటగా వుంటుంది. జుంటుపల్లి ప్రాజెక్టు, బొంరాస్‌పేట చెరువు వ్యవసాయ ఆధారంగా రైతులకు ఉపయోగపడుతున్నాయి. జిల్లాలో గొలుసుకట్టు చెరువులున్నాయి.

**జనాభా :** వికారాబాద్ జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 9.27 లక్షలుండగా, చదరపు కిలోమీటర్‌కు 274 లెక్కన జనాభా వుంది. జిల్లా మొత్తం జనాభా 9,27,190 ఉండగా అందులో పురుషులు 4,63,400, స్త్రీలు 4,63,790 ఉన్నారు. గ్రామీణ జనాభా 8,02,171 ఉండగా, పట్టణ జనాభా 1,24,969 ఉన్నారు. లింగనిష్పత్తి 1000:1001.

**అక్షరాస్యత :** జిల్లాలో మొత్తం అక్షరాస్యత 57.91%. ఇందులో పురుషులు 67.58%, మహిళలు 48.32% గా వుంది.

## జిల్లా చరిత్ర

కాకతీయుల పతనం తర్వాత ఈ ప్రాంతమంతా గోల్కొండ రాజుల పాలన కిందికి వచ్చింది.తెలంగాణ ప్రాంతంలో పేరెన్నికగన్న వికారాబాదు ప్రాంతాన్ని అన్ని ప్రాంతాల్లో లాగానే శాతవాహన, చాళుక్య, బాదామీ, రాష్ట్రకూటులు, కళ్యానీ చాళుక్యులు, కాకతీయులు 14 వ శతాబ్ది వరకు పాలించారు. ఆ తర్వాత కుతుబ్‌షాలు క్రీ.శ.

1687 వరకు గోల్కొండ కేంద్రంగా పాలించగా, ఔరంగజేబు గోల్కొండపై దాడి చేయడం, మంత్రి మాదన్నను క్రూరంగా హత్య గావించడంతో కుతుబ్‌షాహీల పాలనకు తెరపడింది. వారి సహకారంతో దక్కన్ సుబేదారుగా వచ్చి ఔరంగజేబు మరణం తర్వాత కమ్రుద్దీన్ బిన్ పలేఖన్ స్వతంత్ర రాజుగా క్రీ.శ. 1724 లో ప్రకటించుకున్నాడు.

ఈ నిజాం ఉల్‌ముల్క్ 1748 లో మరణిస్తే దక్కన్‌ను ఆంగ్లేయులు, ఫ్రెంచివారు ఆక్రమించుకున్నారు. అయితే ఫ్రెంచ్ వారి సహకారంతో నిజాం మనుమడు పాలకుడయ్యాడు. అతను కొద్దికాలానికే మరణించగా ఆయన మూడవ కుమారుడు సలాబత్‌జంగ్ రాజయ్యాడు. ఇతడు రాబర్ట్ క్లైవ్ సహాయంతో ఫ్రెంచి వారిని పంపివేసాడు. ఆసఫ్జా నాల్గవ కొడుకే 1767 లో సింహాసనం అధిష్టించాడు. అతడు నిజాం అలీఖాన్. 1863 లో రెండవ ఆసఫ్జా మరణిస్తే అతని కుమారుడు సికిందర్‌జా సింహాసనం ఎక్కాడు. క్రీ.శ. 1827 లో మూడవ నిజాం మరణిస్తే నాసిరుద్దౌలా నాల్గవ నిజాం రాజుగా, అదేవిధంగా 5 వ నిజాం అఫ్జలుద్దౌలా పాలించి 1868 లో మరణించాడు. ఆ తర్వాత మహబూబ్ అలీఖాన్ 6వ నిజాంగా పాలించాడు. ఇతడు 1868 లో పాలనలోకి వచ్చి 1911 లో మరణించాడు. ఏడవ చివరి నిజాం 1911 లో పాలనలోకి వచ్చి 1967 లో మరణించాడు. ఇతని కాలంలోనే ప్రజలు తెలంగాణ గడ్డపై అనేక పోరాటాలు చేశారు. రజాకార్లపై తిరుగుబాటు జరిగి 17 సెప్టెంబర్ 1948 న తెలంగాణకు స్వాతంత్ర్యం లభించింది. దానితో ప్రస్తుతమున్న వికారాబాద్ జిల్లా కూడా విముక్తి పొందింది.

గోల్కొండ ప్రభువుల కాలంలో ఉర్దూ, ఫారసీ వంటి దక్కన్ భాషలకు, తెలుగుకు ఆదరణ లభించింది. పర్షియన్ల పెత్తందారీతనానికి ప్రతిగా బహమనీ పాలన మొదలయ్యాక దక్కను భాషలకు మరింత ప్రాధాన్యం పెరిగింది. అందుకే ఈ రోజుకు వికారాబాద్ ప్రాంతాలలోని ఎన్నో గ్రామాలు ముస్లిం పాలకుల పేర్లతో వుంటాయి. ఔరంగజేబు

**మున్సిపాలిటీ** : వికారాబాదు

**నగరపాలక సంస్థలు** : వికారాబాదు, తాండూరు

**రెవిన్యూ గ్రామాలు** : 501

**గ్రామపంచాయితీలు** : 374

**పోలీస్ హెడ్‌క్వార్టర్స్** : వికారాబాదు

**పార్లమెంటు నియోజకవర్గం** : వికారాబాదు

**అసెంబ్లీ నియోజకవర్గాలు** : తాండూరు, వికారాబాదు

**పట్టణాలు** : వికారాబాదు, తాండూరు, కొడంగల్, పరిగి

దండయాత్రతో ఈ ప్రాంతంలో కుతుబ్‌షాహీల పాలన మారిపోయి దక్కన్ ప్రాంతం ఆసఫ్‌జాహీల కిందికి వచ్చింది. రెండవ ఆసఫ్‌జాహీ కాలంలో రాజధాని హైదరాబాదుగా మారడంతో ప్రస్తుతమున్న వికారాబాద్ జిల్లా కూడా దానిలో భాగంగా ఉండేది.

ఏడవ నిజాం అఫ్జలుద్దౌలా కాలంలో సాలార్జంగ్ ప్రధానిగా వున్న సమయంలో నిజాం రాష్ట్రాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాలుగా విభజించారు. మొత్తం రాష్ట్రాన్ని తెలంగాణ, మరాఠ్వాడాలుగా విభజించారు. తెలంగాణను మెదక్, వరంగల్ సుబాలుగా ఏర్పాటు చేశారు. అలాగే మరాఠ్వాడాను ఔరంగాబాదు, గుల్బర్గా సుబాలుగా విభజించారు.

మెదక్ సుబాలో మెదక్, నల్లగొండ, మహబూబు నగర్, నిజామాబాదు, బాగాత్ జిల్లాలు. వరంగల్ సుబాలో వరంగల్, కరీంనగర్, ఆదిలాబాదు జిల్లాలు. ఇవిగాక ఔరంగాబాదు సుబాలో ఔరంగాబాదు, బీడ్, పర్భనీ, నాందేడ్ జిల్లాలుండగా, గుల్బర్గా సుబాలో గుల్బర్గా, బీదర్, రాయచూర్, ఉస్మానాబాద్ జిల్లాలను చేర్చారు.

ఇక ఈ 16 జిల్లాలు కాకుండా నిజాం స్వతంత్ర జాగీరైన అత్రాఫ్ బల్దా జిల్లా నగరానికి చుట్టుపక్కల ప్రాంతాలతో కూడి వుండేది. దానినే పూర్వం రంగారెడ్డి జిల్లాగా చెప్పవచ్చు. ఈ రంగారెడ్డి జిల్లాను 15 ఆగస్టు

1978 లో కె.వి. రంగారెడ్డి జిల్లాగా ఏర్పాటుచేశారు. కొండా వెంకటరంగారెడ్డి ప్రస్తుతం మొయినాబాద్ మండలం పెద్ద మంగళారం వాస్తవ్యులు. డా. మర్రిచెన్నారెడ్డికి మామగారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత కూడా ఈ ప్రాంతం హైదరాబాదు జిల్లాలోనే కొనసాగింది. హైదరాబాదు రాష్ట్రంలో బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో సభ్యుడైన కె.వి. రంగారెడ్డి పేరు ఈ జిల్లాకు పెట్టారు. తర్వాత జిల్లా పేరు నుంచి కె.వి. తొలగించారు. జిల్లా ఏర్పడిన సమయంలో 11 తాలూకాలు ఉండేవి. 1986 లో మండల వ్యవస్థ వచ్చాక 37 మండలాలు ఏర్పడ్డాయి.

అలా కొనసాగిన రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 2016 నాడు జరిగిన జిల్లాల పునర్వ్యవస్థీకరణ వల్ల వికారాబాద్ జిల్లాగా ఏర్పడింది. కొన్ని కొత్త మండలాలను కలిపి రంగారెడ్డి జిల్లాను యథావిధిగా వుంచగా, గ్రామీణ ప్రాంత మండలా లకు, మహబూబునగర్ జిల్లాకు చెందిన కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేటలను కలిపి వికారాబాద్ జిల్లాను ఏర్పర్చారు. అయితే అంతకు ముందున్న పాత జిల్లాలోని గండీడ్ మండలం మాత్రం మహబూబునగర్ జిల్లాలోకి చేర్చారు.

ప్రస్తుతమున్న వికారాబాద్ జిల్లాను పూర్వం తెలంగాణను పాలించిన రాజులే పాలించారు. ఆ తర్వాత కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీలు పాలించారు. వారి కాలంలోనే ప్రస్తుతం కుల్కచర్ల మండలంలోని ముజాహిద్ పూర్‌ను కేంద్రంగా చేసుకొని కొందరు దివానులు పరిపాలన చేసినట్లు తెలుస్తుంది. ముజాయత్ ముల్క్, ఐనన్ ముల్క్, ఇబ్రహీముల్క్ అనే ముగ్గురు మహ్మదీయులు పాలన కొనసాగించారు. వారిపేర్ల మీదనే ప్రస్తుతమున్న ముజాహిద్‌పూర్, ఇబ్రహీంపూర్, ఐనాపూర్ ఏర్పడి వుండవచ్చు. ఇప్పటికి వికారాబాద్ జిల్లా నిండా ముస్లిం పేర్లే కనిపిస్తాయి. ఆఖరుకు వికారాబాద్ కూడా!!

పూర్వం రంగారెడ్డి జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పాలమూరు జిల్లా కొంతభాగం గుల్బర్గా జిల్లాలో అంతర్భాగంగా ఉండేవి. అందుకే 1918 లో ఉస్మానియా విశ్వవిద్యాలయం స్థాపించకముందు 'గుల్బర్గా విశ్వ విద్యాలయం' నిజాం రాష్ట్ర విద్యావంతులకు డిగ్రీ పట్టాలు ఇచ్చేది. ఆ తర్వాత 1948 సెప్టెంబరు 17 వరకు అత్రాఫ్‌బల్దాలో భాగంగా కొనసాగాయి. అయితే ఈ అత్రాఫ్ బల్దా కొంతభాగం మెదక్‌లో వుండేది. 'గతే' తహసీల్‌లోని 7 జిల్లాలు 1949 లో అత్రాఫ్‌బల్దాలో కలిసిపోగా 1950 వరకు కూడా ధారూర్, వికారాబాద్ లోని కొంతభాగం మెదక్ జిల్లాలోనే వుండేవి. ఆ తర్వాత 1956 లో ఆంధ్రప్రదేశ్ అవతరణ జరిగింది. 1958-59 లో షాబాద్‌లోని కొంతభాగం చేవెళ్ల తాలూకాగా, మెదక్‌లోని 11 గ్రామాలు చేవెళ్లలోనే కలువగా అప్పటి నల్లగొండలోని రామన్నపేట తాలూకాలోని కొన్ని గ్రామాలు ఇబ్రహీంపట్నంలో చేర్చి హైదరాబాద్ జిల్లాగా మార్చారు.

15-8-1978 నాడు అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి డా. మర్రిచెన్నారెడ్డి సూచనతో కె.వి.రంగారెడ్డి జిల్లా ఏర్పడింది. ప్రస్తుతం ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో 16 అక్టోబర్ 2016 లో జిల్లాల పునర్విభజన జరిగి రంగారెడ్డి జిల్లా పశ్చిమ గ్రామీణ ప్రాంతభాగమంతా కలిసి వికారాబాద్ జిల్లాగా ఏర్పడింది. ప్రస్తుతం కొడంగల్ శాసన సభ్యునిగా ఎ. రేవంత్‌రెడ్డి, తాండూరు శాసనసభ్యునిగా మహేందర్ రెడ్డి రవాణా మంత్రిగా పనిచేస్తున్నారు. వికారాబాద్ శాసనసభ్యునిగా సంజీవరావు, పరిగి శాసనసభ్యునిగా టి. రామ్మోహన్ రెడ్డి వున్నారు. చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీగా పి. జితేందర్ రెడ్డి పనిచేస్తున్నారు. వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా సునీతా మహేందర్ రెడ్డి, జిల్లా పాలనాధికారిగా దివ్య దేవరాజన్, ఎస్పీగా అన్నపూర్ణ పనిచేస్తున్నారు.

**పాలించిన రాజవంశాలు**

తెలంగాణ ప్రాంతంలో పేరెన్నిక గన్న వికారాబాద్ ప్రాంతాన్ని అన్ని ప్రాంతాల్లో లాగానే శాతావాహన, చాళుక్య,

బాదామి, రాష్ట్రకూటులు , కల్యాణీ చాళుక్యులు, కాకతీయులు 14 వ శతాబ్ది వరకు పాలించారు. కాకతీయుల కాలంలో క్రీ.శ. 1321 లో మహ్మద్‌బిన్ తుగ్లక్ దండయాత్రతో ఈ ప్రాంతం పరాధీనమైంది. ఆ తర్వాత కుతుబ్‌షాలు క్రీ.శ. 1687 వరకు గోల్కొండ కేంద్రంగా పాలించగా, ఔరంగజేబు గోల్కొండపై దాడి చేయడం, మంత్రి మాదన్నను క్రూరంగా హత్య గావించడంతో కుతుబ్‌షాహీల పాలనకు తెరపడింది. వారి సహకారంతో దక్కన్ ప్రాంత సుబేదారుగా వచ్చి ఔరంగజేబు మరణం తర్వాత కమ్రుద్దీన్ ఖాన్ పలేఖన్ స్వతంత్ర రాజుగా క్రీ.శ. 1724 లో ప్రకటించుకొన్నాడు.

## సంస్కృతి

వికారాబాద్ జిల్లా పూర్వం నుంచి హైద్రాబాద్‌కు పక్కనే వుండటం వల్ల సాంస్కృతిక ఆదాన ప్రదానం జరిగింది. ప్రాచీన కాలం నుంచి ఈ జిల్లాలో హిందూ సంస్కృతి ప్రధాన భూమిక వహించింది. మధ్యలో ఇస్లాం రాజుల పాలనలో కొంత ఆందోళన కలిగినా మూలమైన హైందవ తాత్త్విక భూమిక ఈ జిల్లా ప్రజలు వదిలిపెట్టలేదు. అయితే వేష, భాషల విషయంలో కొంత నాగరికతలో మార్పులు కనిపించినా ఎప్పటికపుడు వినూత్నమైన ఆలోచనలో ఈ జిల్లా ప్రజలు ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలకు మెరుగులద్దుతూనే వున్నారు. ఇక్కడి ప్రజలకు సంబంధంలేని పీర్ల పండుగ ఒకప్పుడు ఈ జిల్లాలోని అనేక గ్రామాల్లో చాలా ఘనంగా జరిగేది. ప్రస్తుతం అది పూర్తిగా కనుమరుగైంది. నామమాత్రంగా కనిపిస్తున్నా అందులో ప్రజల భాగస్వామ్యం లేకుండా పోయింది.

**ఆచారాలు, సంప్రదాయాలు, పండుగలు :** స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా తిలక్ మహాశయుడు వినూత్నంగా తెరపైకి తెచ్చిన వినాయక నవరాత్రులు దేశమంతా ఘనంగా జరిగినట్లే వికారాబాద్ జిల్లాలో కూడా జరుగుతాయి. అందునా హైదరాబాద్ జిల్లాకు దగ్గరగా ఉండటం వల్ల అనేక విధాల సాంస్కృతికాంశాలతో ఇక్కడ వినాయక ఉత్సవాలు నిర్వహిస్తారు.

దసరా, దీపావళి, సంక్రాంతి, బోనాలు, శివరాత్రి, ఏరువాక పౌర్ణమి, గౌరీనోములు, కార్తిక, శ్రావణ మాసాలు... వంటివి జిల్లా ప్రజలంతా ఘనంగా జరుపుకొంటున్నారు. జిల్లాలోని వివిధ దేవాలయాల్లో ఈ కార్యక్రమాలు జరుగుతాయి. హైద్రాబాద్‌లో మాత్రమే జరిపే సదర్ ఉత్సవాలు ఈ జిల్లాలోని యాదవులు కూడా నిర్వహిస్తున్నారు. దున్నపోతులను అలంకరించి ప్రదర్శన లిస్తున్నారు.

జిల్లాలో బోనాల పండుగకు చాలా ప్రత్యేకత వుంది. ఆషాఢ, శ్రావణ మాసాల్లో బోనాల పండుగను జరుపుకుంటారు. పోచమ్మ, మైసమ్మలకు ప్రతి గ్రామంలో బోనాలు జరుగుతాయి. వికారాబాద్ జిల్లాలో ప్రతి గ్రామంలో గ్రామదేవతారాధన జరుగుతున్నది. పోషించే తల్లిగా పోషమ్మను, మహిషాసుర మర్దనిగా మైసమ్మను ఆరాధిస్తారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ మైసమ్మను చేయడం ఇంకా జరుగుతూనే వుంది. గ్రామం అంతా కలసి మైసమ్మ దున్నపోతుల బలి చేస్తున్నారు. బొంరాస్ పేట మండలం పోలేపల్లి ఎల్లమ్మ జాతర, ఆదివారాలు ఘనంగా పూజలు జరుగుతాయి. కర్ణాటక తాండూరు సరిహద్దుల్లో ఎల్లమ్మ దేవాలయం దగ్గర పెద్ద ఎత్తున పూజలు జరుగుతాయి. కుర్మ యాదవులు బీరప్పను ఆరాధించడం, దానికి సంబంధించిన కథను చెబుతూ బీరప్ప పండుగ చేస్తారు. అలాగే వికారాబాద్ జిల్లాలో లంబాడాల సంఖ్య గణనీయంగా వుంది. వారు మొలకల పండుగగా చెప్పే 'తీజ్ ఉత్సవం' జరుపుతారు. ఆడపిల్లలు జరిపే ఈ పండుగ తాండాలకు శోభను కలిగిస్తుంది. తాండూరు పక్కనున్న 'భూ కైలాస్' పేరుతో నిర్మించిన 'పౌరాణిక ప్రదర్శన శాల' పరిగి పక్కనున్న మైలారం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయాలు 'లంబాడా దాతలు' నిర్మించినవే.

అయ్యప్ప, శివ, హనుమాన్ మాలలు ధరించే భక్తులు కూడా జిల్లాలో ఎక్కువే. చాలా పట్టణాల్లో అయ్యప్ప దేవాలయాలు, శివాలయాలు కొత్తగా నిర్మిస్తున్నారు. ముఖ్యంగా చలికాలంలో చక్కని నియమ నిష్ఠలతో మాల

ధరించి పూజలు చేస్తున్నారు. మండల దీక్షలో భాగంగా యువకులు, పెద్దలు తమ ఇష్టదైవాల మాలధారణ చేసి భజనలు, పూజలు చేస్తున్నారు. వినాయక చవితి వస్తే తాండూరు, వికారాబాద్, కొడంగల్, పరిగి వంటి ముఖ్య కేంద్రాలే గాక మండలాల్లో సైతం అనేక సాంస్కృతిక ప్రదర్శనలు జరుపుతున్నారు.

**కళలు :** జిల్లాలో నాటకాలు ఈ రోజుకూ సజీవంగానే వున్నాయి. వర కవుల జగన్నాథరాజు పరిగి కేంద్రంగా జీవిస్తూ ఈ నాటకాలకు ప్రాణం పోశాడనే చెప్పవచ్చు. వారు స్వయంగా రచించిన పుండరీక చరిత్ర, అలాగే తిరుపతి వేంకట కవుల పాండవోద్యోగం, శ్రీరామాంజనేయ యుద్ధం వంటి నాటకాలను ఇక్కడి నటులకు నేర్పించడమే కాకుండా రాష్ట్ర స్థాయిలో ప్రదర్శనలు ఇప్పించారు. ఈ జిల్లాలో జరిగే నాటక ప్రదర్శనలకు ఈ రోజుకూ జనాదరణ తగ్గలేదు. జగన్నాథ రాజు అన్నగారైన సత్యనారాయణ రాజు కూడా హరికథలు చెప్పడం, భజనమండళ్ల ఏర్పాటు, చివరి దశలో నాటకాలు నేర్పించారు. వారి మరో సోదరుడు నరహరిరాజు మహబూబునగర్‌లో నాటకాలు నేర్పిస్తున్నారు

వికారాబాద్ జిల్లాలో శ్రీ వీరాంజనేయ నాట్యమండలి, శ్రీ జ్ఞానసరస్వతి నాట్యమండలి, మహ్మమదాబాద్‌లో ఒక నాట్య మండలి బాగా నడుస్తున్నాయి. జగన్నాథరాజుతో పాటు వేణుగోపాల్‌చారి కూడా నాటకాలు నేర్పిస్తున్నారు. పరిగి, వికారాబాద్, నంచర్ల, మహ్మదాబాద్‌లో అనేక మంది కళాకారులు ఈ నాటకాలు నేర్చుకుంటున్నారు. పరిగిలో వేంకటేశం, నర్సింలు, నస్కల్ బైండ్ల నర్సయ్య, సంజీవ్‌గౌడ్, రాంచంద్రయ్య, భద్రప్ప, నాగేశ్ వంటి కళాకారులు అనేక ప్రదర్శనలిస్తున్నారు. నంచర్లకు చెందిన మాలెల అంజయ్య రాష్ట్ర స్థాయిలో గుర్తింపుపొందిన నటుడు. పరిగికి చెందిన వెంకటేశం కూడా ఎంతో రంగస్థల నాటక ప్రదర్శనలతో పేరు గడించారు. అదేవిధంగా జిల్లాలో యక్షగానాలు రచించిన వారున్నారు. అవిభాజ్య రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ మండలం నాగరకుంటకు చెందిన గడిగె భీమయ్యగౌడ్ యక్షగాన రచయిత. జిల్లాలో చాలా గ్రామాల్లో యక్షగాన ప్రదర్శన చేసే కళాకారులున్నారు. అలాగే 'బయలాటలు' ఈ జిల్లలో చాలా గ్రామాల్లో ప్రదర్శిస్తారు. వీర బ్రహ్మేంద్రస్వామి విలాసం, మల్లికార్జున స్వామి ఆట, రామాయణం, భారత ఘట్టాలు ఇందులో ప్రదర్శిస్తారు.

పటం కథలు, కులపురాణ కథలు చెప్పేవారు జిల్లాలో వున్నారు. వికారాబాదు ప్రక్కనున్న అనంతగిరిపల్లిలో జాంబ పురాణం చెప్పే కళాకారులున్నారు. వారు వంశపారం పర్యంగా ఈ కళలను ప్రదర్శిస్తున్నారు. బైండ్ల వాళ్లు వివిధ గ్రామదేవతలు, కుల దేవతలను చేసినపుడు కథలు చెప్తారు.

**ప్రజల జీవనశైలి**

వేషధారణ సాధారణ హిందూ జీవన విధానంలో భాగంగా హిందువులది ఉండగా, ఇతర మతాల వారు వారి సంప్రదాయాలకు అనుగుణంగా దుస్తులు ధరిస్తారు. తాండూరు, కొడంగల్, దౌల్తాబాద్, బషీర్‌బాద్ మండలాలకు కర్ణాటక ప్రాంతం పక్కనే వుండటం వల్ల వారి వేషధారణ, భాష, ఆహారం, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక జీవనం వుంటుంది. మిగతా ప్రాంతాల్లో మిగిలిన తెలంగాణ ప్రజలు ఎలా ఉంటారో అలాగే ఉంటారు. కన్నడిగుల పక్కనున్న మండలాల్లో వివాహ సంబంధాల వల్ల వారి సంప్రదాయాలు జిల్లా వాసులు పట్టుకున్నారు. కన్నడ ప్రాంతంలో వివాహాన్ని 'శాస' అనీ, అందులో చదివించే కట్నాలను 'ముయ్యల'ని పిలుస్తారు. ఇక్కడి ప్రజలు అవే పదాలను వాడుతారు. అలాగే కన్నడ ప్రాంతంలో చేసే పెళ్ళిళ్లు, ఆచార సంప్రదాయాలను పైన చెప్పిన మండలాల వారు అనుసరిస్తారు. కనకప్ప, వెంకటప్ప, మొగులప్ప, సాయప్ప, కిష్టప్ప అని పేర్ల చివర కన్నడ వాళ్ళలాగా 'అప్ప' అని పెట్టుకుంటారు. 'అయ్యా' అని పేర్ల చివర పెట్టుకున్నట్లే అప్ప అని పెట్టుకుంటారు.

వికారాబాదు జిల్లాలో 50 ఏళ్ల క్రితం వరకు అనేక రకాల వృత్తి కళాకారుల ప్రజలు కనిపించేవారు. కంకల్, మిట్టకంకల్ గ్రామంలో శిల్పకారులు, మన్నెగూడలో గంగిరెద్దుల వారు, అంతారంలో మాష్టివారు, బాకాపురంలో

బుడిగెజంగాలు, దామరగిద్ద, బస్తీపురం, రాకమచర్లలో ఒగ్గు కళాకారులు ఉండేవారని పేర్కొంటారు. నాయీ బ్రాహ్మణ, యాదవ, మత్స్యకారులు, ముత్తరాసి ప్రజలు తమ వృత్తుల ఆధారంగా ఇప్పటికీ జీవిస్తున్నారు.

వరి అన్నం భుజించడం జిల్లా అంతటా చూస్తాం. కర్ణాటక ప్రక్క గ్రామాల వారు మాత్రం జొన్నరొట్టెకు ప్రాధాన్యమిస్తారు. బ్రాహ్మణేతర కులాల్లో మాంసాహారం భుజిస్తారు. కందిపప్పు, ఉల్లిగడ్డ, టమాట, చింతపండు ఆహారపదార్థాల్లో బాగా వాడుతారు.

**జాతరలు :** వికారాబాదు జిల్లాలో ఆరాధనలు, ఉత్సవాలు బాగా జరుగుతాయి. ఆయా దేవస్థానాలు, ఆశ్రమాల్లో గురువులు వేసిన మార్గం ఈ రోజుకూ అందరూ ఆదర్శంగా భావిస్తారు. తాండూరు పక్కనున్న మిర్యాణంలో పూదోట రామన్న ఆశ్రమం, ఆలంపల్లి కెంపె మఠం శంకరస్వామి ఆరాధన, మోమిన్‌పేట మండల ఎన్కెతలలో శంకర్ మహరాజ్ ఆరాధన, పూడూరు మండలం ఉమ్మెంతలలో రాకమచర్ల వేంకటదాసు ఆరాధన, పరిగికి చెందిన ఆధ్యాత్మిక గురువు శ్రీ లక్ష్మీకాంతరావు బాబా, లొంక క్షేత్రంలో వేమల శంకరమ్మ, భీమయ్య పంతులు ఆరాధన గొడగోనిపల్లిలో పద్మమ్మ యోగిని ఆరాధన, మలయాళస్వామి ఆరాధన చాలా గొప్పగా నిర్వహిస్తారు.

జిల్లాలో అనేక చోట్ల జాతరలు జరుగుతాయి. తాండూరు భావిగి భద్రేశ్వర స్వామి జాతర, వికారాబాద్ అనంత పద్మనాభస్వామి జాతర, పోలేపల్లి రేణుకా ఎల్లమ్మ జాతర, ఏకామ్రేశ్వర జాతర, బుగ్గ రామేశ్వరం జాతర, జుంటుపల్లి జాతర, సాంబండ రామలింగేశ్వరస్వామి జాతర, కొడంగల్ జాతర, ధారూర్ మండలంలో మెథడిస్టు జాతరలు జిల్లాలో జరుగుతాయి. వీటిలో కొన్ని ప్రసిద్ధ దేవాలయాల్లో జరిగే నవరాత్రులు, ఉత్సవాలు జాతరగా జరుపుతారు. కోట్‌పల్లి బుగ్గరామేశ్వర జాతర, బండవెల్కిచర్ల బీరప్ప జాతర, దామరబేడ్ భవానీ జాతర, కొల్లాపూర్ ఎల్లమ్మ జాతర, తాండూరు శ్రీ గురుగంగాధర బక్కప్రభు జాతర, పరిగి సీతారామాంజనేయ స్వామి జాతర, పరిగి శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి జాతర, ధారూరు మండలం తిమ్మనగర్‌లో మైసమ్మ జాతర, కోట్‌పల్లి మండలం బుగ్గాపురం అంబా భవానీ జాతర, మోమిన్‌పేట మండలం దుర్గం చెరువు మల్లికార్జున స్వామి జాతర, వికారాబాద్ శ్రీ వేంకటేశ్వర స్వామి జాతర... ఇలా అనేక జాతరలు జిల్లాలో ఘనంగా జరుగుతాయి.

వికారాబాద్ జిల్లాలో జరిగే ఈ జాతర్లలో నృత్య విశేషాలు, కోలాటాలు, భజనలు, రథోత్సవ, దర్బారు ఉత్సవం, జల్దిబిందె ఉత్సవం వంటివి చేస్తారు. ఇక ప్రసిద్ధ ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. పరిగి లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు, కొడంగల్ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్స వాలు, శ్రీ అనంతగిరి పద్మనాభస్వామి బ్రహ్మోత్సవాలు చాలా ఘనంగా జరుగుతాయి.

బతుకమ్మ, బొడ్డెమ్మ, కోలాటం, భజనలు జిల్లాలో ముఖ్యమైన కార్యక్రమాలు. ఆయా సందర్భాలలో కోలాటం జిల్లా ప్రజలు వేస్తారు. ముఖ్యంగా నవరాత్రుల్లో, గణేష్ ఊరేగింపులో ఈ ప్రదర్శన వేస్తారు. ఇప్పటికీ ప్రస్తుత రాకమచర్ల పీఠాధిపతి శ్రీ వేంకచిదాసు గారు ప్రతీ గ్రామం తిరిగి భజన సంప్రదాయాన్ని బతికిస్తున్నారు.

## జిల్లా సాహిత్యం

వికారాబాదు జిల్లాలో వున్న కొండలను అనంతగిరి కొండలని పిలుస్తారు. ఈ అనంతగిరి మాహాత్మ్యం గురించి స్కంధ పురాణం తెలిపింది. దీనిని అనంతాచార్యులు పద్య రూపంలో రచించారు. ఇది క్షేత్ర మాహాత్మ్యం తెలిపే గ్రంథం. అలాగే దామగిరి క్షేత్ర మాహాత్మ్యం కూడా రచించబడింది. జిల్లాలో ఒకప్పుడు యక్షగానాలు రచింప బడ్డాయి. వీరబ్రహ్మేంద్ర స్వామి, శివరామ దీక్షితుల ప్రబావం బ్రాహ్మణేతర కులాలపై వుండేది. వీరబ్రహ్మేంద్ర స్వామిపై యక్షగానాలు, బయలాటలు రచించారు. అదే బాటలో తత్వ సాహిత్యం వచ్చింది. తెలంగాణలో ప్రసిద్ధిపొందిన అగ్రశ్రేణి వాగ్గేయకారుడు రాకమచర్ల వేంకటదాసు ఈ జిల్లాలో పుట్టడం వల్ల కావల్సిన సంకీర్తనా సాహిత్యం వచ్చింది. అచల

గురువులంతా అవిభాజ్య రంగారెడ్డి జిల్లాకు చెందిన వెలివర్తి రామదాసు కీర్తనలు ఆలపిస్తారు. ఆయన మార్గంలోనే కీర్తనలు రచించారు. పెద్దేముల్ పర్యాద నర్సయ్య పంతులు తత్వాలు, కీర్తనలు రచించారు.

వికారాబాదు జిల్లా నగరంతో కలిసి ఉన్నా జానపద తత్వాన్ని కోల్పోలేదు. రంగారెడ్డి జిల్లా జానపద గేయాలు పేరుతో ఆచార్య కసిరెడ్డి, తెలంగాణ యక్షగానం పై డా. పొద్దుటూరు ఎల్లారెడ్డి వంటివారు ఈ ప్రాంతం ఆధారంగా జానపదాలను బయటపెట్టారు. అలాగే మాలె అంజయ్య రచించిన జన స్వరాలు - నా స్వరాలు', పరిగికి చెందిన మహేందర్‌జీ పల్లీయు పసిడి పాటలు గొప్ప జానపద గేయాలు. పోచయ్య గారు (రాపోలు) కూడా ఈ మార్గంలో చక్కని కృషి చేశారు.

అలాగే పరిగికి చెందిన శ్రీమతి పి. ప్రభావతి ఈ ప్రాంతంలో ఆలపించే స్త్రీ మంగళహారతులను భక్తి పల్లకి పేరుతో ముద్రించారు. వికారాబాదు ప్రక్కనున్న సిద్ధులూరు నివాసి గడ్డాల చంద్రప్ప శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర గారి జీవిత చరిత్ర, పేరుతో యక్షగానం రచించారు. అలాగే 1908 ప్రాంతానికి చెందిన పూడూరు మండల అత్వెల్లి చన్నప్ప వీధి బాగోతాలు, కీర్తనలు రచించారు. 191 ప్రాంతంలో జీవించిన నవాబుపేట మండలం ఆర్కతల గ్రామస్థుడు మయబ్రహ్మ అడివయ్యాచారి యక్షగాన రచయిత. రామరావణ యుద్ధం, భీష్మార్జున యుద్ధం, కరిదానవా సురవధ, వీరభద్ర విజయం, లక్ష్మణ పరిణయం ముఖ్యమైనవి. భీమాచార్యులు (1919) నవాబ్ మండలం మాదిరెడ్డిపల్లి గ్రామస్థులు. ఈ కవి శ్రీకృష్ణపాండవీయం, రాజసూయయాగం, కర్ణపట్టాభిషేకం, ఉషా పరిణయం, హరవిలాసం, కార్త్యవీర్యార్జునీయం, కిరీటి విజయం, సంపూర్ణ రామాయణం, కురుక్షేత్రం, రామాంజనేయ యుద్ధం వంటి యక్షగానాలు రచించారు. 1934 తర్వాత జీవించిన ప్యారం ఆనందయ్య పాండురంగ మాహాత్మ్యం అనే వీధి నాటకం రచించారు. ఈయన వికారాబాదు పక్కనున్న సిద్ధలూరు గ్రామస్థుడు. ప్రముఖ పరిశోధకులు ఇదే జిల్లాకు చెందిన డా. మొరంగంపల్లి బాగయ్య 'తెలంగాణ యక్షగానాల' పై ప్రత్యేక అధ్యయనంతో గొప్ప పుస్తకం రచించాడు.

తెలంగాణ వాగ్గేయకారుల్లో మేలిరత్నంగా చెప్పదగిన రాకమచర్ల వేంకటదాసు (1708-1859) పూర్వపు పాలమూరులో జన్మించినా ఇదే జిల్లాలోని పూడూరు మండలం ఉమ్మెంతలలో నివసించారు. రామదాసు తర్వాత అంతటి ప్రసిద్ధమైన కీర్తనలు రాకమచర్ల వేంకటదాసు రచించారు. 1927 లో సోమనగుర్రి కృష్ణారావు ఆయన జీవిత చరిత్ర రచించారు. వారి జీవితంపై, రచనలపై దోరవేటి, డా. పి. భాస్కరయోగి కూడా అనేక కోణాల్లో పరిశోధన చేశారు. డా. సాగి ఆంజనేయ శాస్త్రి పిహెచ్‌డి పరిశోధనకు ఇతని కీర్తనలనే ఎన్నుకున్నారు. ప్రస్తుతం ముద్రింపబడిన రాకమచర్ల కీర్తనలు ఆరు భాగాలుగా వున్నాయి, ఇటీవల కాలంలో ఉమ్మెంతాల పీఠం ప్రస్తుత పీఠాధిపతులు వేంకటదాసు గారు పరిష్కరించిన ప్రతిని అందంగా ముద్రించారు. పూడూరు మండలం అంగడి చిట్టంపల్లి గ్రామస్థులైన పట్లోళ్ల లింగారెడ్డి కీర్తనలతో పాటు, పద్యాలు, బుర్రకథ (ఆయన జీవితాన్ని) ఉయ్యాల పాట రచించారు, రుసుంపల్లి అంజయ్యగౌడ్ నటుడు, కవి, వాగ్గేయకారుడు. ఆయన శ్రీ కోదండ సీతారామ భజన మాలిక' అనే పేరుతో భజన కీర్తనలు, బలి అనే నాటికల సంపుటి, మంత్రాలయ శ్రీరాఘువేంద్ర స్వామి చరిత్ర, 'నా స్వరాలు - జన స్వరాలు' అనే గేయ సంపుటిని అచ్చు వేశారు. పర్యాద నర్సయ్య పెద్దేముల్ గ్రామస్థులు. వారు పాండురంగ భజన కీర్తనలు, మంగళహారతులు, గృహలక్ష్మి, చంద్రహాస నాటకం, రుద్రమదేవి బుర్రకథలు రచించారు. బొంరాస్‌పేట మండలం బురాన్‌పూర్ గ్రామస్థులైన పరమహంస లక్ష్మయ్యదాసు, సద్గురు పూజా విధానము - అచలతత్వ కీర్తనలు రచించారు. రాపోల్ గ్రామస్థుడైన కణపర్తి వీరదాసు (1916-1997) పరమపద విజ్ఞాన తత్వములు పేరుతో భజన కీర్తనలు రచించారు. మిరియాణం దగ్గరున్న పూదోట రామన్న

ఆశ్రమం నుంచి భజన పాటలు ముద్రితమయ్యాయి. చిల్‌ముల్ మైలారం గ్రామస్థులు సద్గురు రామబ్రహ్మానంద స్వామి తత్వజ్ఞాన గానమంజరి పేరుతో భజనమాల రచించారు. 1884 లో జన్మించిన పరదేశి వీరప్పయ్య పంతులు బషీరాబాదు మండలం చిన్నగొట్టిగట నివాసి. ఇతను సుజ్ఞాన కల్పవల్లి అనే భజనమాల, శివతత్వ ఖండమాల, శివతత్వరత్నావళి అనే పద్యాలు, సంకలనాలు రచించారు. వాటితో పాటు కొన్ని యక్షగానాలు రచించారు. ధరూర్ మండలం హరిదాసుపల్లికి చెందిన అనంతదాసు యక్షగానాలు, శతకాలు, కీర్తనలు, తత్వాలు రచించారు. నవాబుపేట మండలం పులిమామిడి గ్రామస్థులైన రామరాజుల నరహరిరావు బహుభాషా పండితుడు. ఆధ్యాత్మిక గీతాలు, భక్తిభావన మాల మార్గదర్శిని, మంత్రాలయ రాఘవేంద్రుని కీర్తనలు రచించారు. నవాబుపేట మండల మునిమల్కపురం గ్రామస్థులైన సామ అనంతరెడ్డి శ్రీగురుసారామృతం రచించారు.

పూడూరు మండలం సోమనగుర్తి వాస్తవ్యులు కులకర్ణి కృష్ణారావు అనే కవి రాకమచర్ల మాహాత్మ్యము పేరుతో 5 ఆశ్వాసాల కావ్యం రచించారు. అదేవిధంగా వేంకటదాసు చరిత్రను రాసింది కూడా ఆయనే. నవాబుపేట మండలం చించల్‌పేట గ్రామస్థులు విశ్వనాథ వైద్య విశ్వనాథ సంహిత పేరుతో వైద్య గ్రంథాన్ని రచించారు. పరిగి మండలం ఖుదావంద్‌పూర్ గ్రామస్థులైన శంభుని విశ్వకర్మ 'స్ఫూర్తిసుధ' పేరుతో పద్యాలు రచించారు.

తాండూరు నివాసి అయిన నాగయ్య తెలుగు పండితులు. తల్లోజు పద్యమంజరి, చింతలపల్లి గ్రామస్థులు తల్లోజు యాదవాచారి (1954 తర్వాత) తల్లోజు పద్యమంజరి, విరిసిన మల్లెలు, వీరపుత్ర, కవితా స్రవంతి మొదలైన పద్య సంకలనాలు రచించారు. యాలాల్ మండలం నాగసముందర్‌కు చెందిన సిహెచ్.నారాయణరెడ్డి 1948లో జన్మించారు. 'కవితా మంజరి' లో వీరు ఖండకృతిని రచించారు. ధరూర్ మండలం హరిదాస్‌పల్లి వాస్తవ్యులైన చిగుళ్లపల్లి అంజయ్య గౌడ్ 'అనురాగవల్లి' అనే పద్యకృతి రచించారు. వికారాబాద్ వాస్తవ్యులైన ఆకుల మల్లికార్జున్ 'కర సేవకులు' అనే ఖండ కావ్యాన్ని, నైవేద్యము అనే పద్య సంపుటిని రచించారు. ప్రస్తుతం తాండూరులో ఉంటున్న మడపతి సిద్ధిలింగయ్య జిల్లాలో పేరు మోసిన పద్యకవి. దశాధిక గ్రంథాలను వెలయించిన ఈ కవి మంచి పండితుడిగా పేరొందాడు.

రాకమచర్లకు సమకాలికుడైన పంతులు చిన్నయ్య కుల్కచర్ల మండలం కొత్తపల్లి నివాసి. ఈయన రాసిన మన్నెంకొండ శతకం లభ్యం. వారు అనేక ఇతిహాస గ్రంథాలు తాళపత్రాల్లో రాసినా అవి అలభ్యమని అవధాని అంజయ్య పేర్కొన్నారు. అలాగే 1885 ప్రాంతంలో జీవించిన కాకుంట్ల గ్రామస్థుడు నారాయణరావు 'ప్రభు తనయ శతకం' రచించారు. వరకవుల జగన్నాథరాజు హనుమచ్ఛతకం, పుండరీక విజయం నాటకం రచించారు. పెద్దేముల్ మండలానికి చెందిన కవయిత్రి డా. పర్యాద సరళ గారు ఆనంద రామాయణంపై పరిశోధన, నేల పద్యకావ్యం, శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహ శతకం రచించారు. పూడూరు మండల అంగడి చిట్టెంపల్లి వాస్తవ్యులైన డా. తూర్పు మల్లారెడ్డి ప్రముఖ సాహిత్య పరిశోధకులు. వీరు శ్రీరామ శతకం, ఆధునిక తెలుగు సాహిత్యంలో తిరుగుబాటు ధోరణులు అన్న అంశంపై పరిశోధన, అనేక వ్యాసాలు రచించారు. డా. ములుగు అంజయ్య అవధాని అనేక సాహిత్య ప్రక్రియల్లో అందివేసిన చేయి. పూడూరు మండలం అంగడి చిట్టెంపల్లిలో జన్మించిన అవధాని స్వామి శతకం, దామగుండ శతకం, షిరిడిసాయి శతకం, సత్యసాయి శతమందారాలు, అమ్మ శతకం, ప్రభుదాస ప్రబోధం వంటి శతకాలు రచించారు. ఎన్నో అష్టావధానాలు చేశారు. 'రంగారెడ్డి జిల్లా కవులు, రచయితలు – సాహిత్య సేవ' అన్నది వారి పరిశోధన. అదే ఈ రోజు జిల్లా సమగ్ర సాహిత్య చరిత్రను తెలియజేస్తుంది. రుద్రారం శ్రీనివాస్ రెడ్డి కొడంగల్ మండలం రుద్రారం వాస్తవ్యులు. వీరు శతక రచయిత. వీరు పద్యకవే గాక,

ఆధునిక వచన కవిత్వంలో కూడా ఆరితేరినవారు. కుల్కచర్ల మండలం పుట్టపహాడ్‌కు చెందిన గొల్లకృష్ణయ్య శతక కవి. పంతులయ్య శతకం రచించారు. వికారాబాద్ మండల గొట్టిముక్కలకు చెందిన దోరవేటిగా ప్రసిద్ధులైన చెన్నయ్య తెలంగాణాలోనే పేరుమోసిన పద్యకవి, రచయిత. వారి కథలు, పరిశోధక రచనలు చాలా గొప్పవి. పద్యం - రస నైవేద్యం, శరణు బసవ వంటి దశాధిక గ్రంథాలు వారి సాహిత్య కృషిని తెలియజేస్తున్నాయి. ధన్నారానికి చెందిన రాచ గాలిరెడ్డి పార్వతీ రమణ శతకం రచించారు.

రాపోలు వేంకటేశం యాలాల్ గ్రామస్థులు. వీరు వేంకటేశ్వర శతకం రచించారు. మర్పల్లి మండలం కోటమర్పల్లి గ్రామానికి చెందిన నరేందర్ వీరభద్ర శతకం రచించారు. నస్కల్ గ్రామస్థులైన బైండ్ల నర్సయ్య నరసింహాశతకం రచించాడు. ఇతడు చేయి తిరిగిన పద్యకవి. అక్నాపురం గ్రామస్థుడైన టి. ఆశీర్వాదం 'పద్మనాభ శతకం' రచించాడు. పెద్దేముల్ మండలానికి చెందిన ద్యావరి నరేందర్ రెడ్డి శ్రీ అయ్యప్ప స్వామి శతకం రచించారు. బొంరాస్‌పేట మండలం వడిచెర్ల గ్రామస్థుడైన సత్యం తెలుగు శతకం మొదలుకొని ఈ రోజు వరకు అనేక రచనలు చేస్తున్న కవి. పులుసు మామిడి గ్రామస్థుడైన మనోహర్ పరమేశ్వర శతకం రచించారు.

కులకర్ణి సుదర్శనరావు సుదర్శన చక్రం అనే గీతావళి, రంగారెడ్డి జిల్లా జానపద గీతాలు రచించారు. యాలాల్‌కు చెందిన కాముని సిద్ధప్ప కాము సిద్ధు పద్యాలు, వ్యాసావళి రచించారు. తుంకమెట్ల ఆనందం హరిదాస్‌పల్లి నివాసి. దళితబిడ్డ పేరుతో వీరు రాసిన కవితలు గొప్పగా వున్నాయి. అంతర్వేదన కవితా సంపుటి, అల్లుకున్న మల్లెపందిరి, భావతరంగిణి - కవితా సంపుటి రచించారు. వసధిల్లి శేషాద్రి ఓ భారత వీర విజయ కుమార' పుస్తకం కవితా సంకలనం. ఆధునిక కవితను అక్కున చేర్చుకున్న ఈ కవి చక్కని కవిత్వం రచించారు. తాండూరుకు చెందిన కోటం చంద్రశేఖర్ క్షిపణి, ఆవిష్కరణ పేర్లతో కవితా సంపుటాలు రచించారు., నవాబుపేట మండలం ఎల్లంకొండ వాస్తవ్యులైన అవుసలి వీరబ్రహ్మం' 'నిశ్శబ్ద వాహిని' పేరుతో కవితలు రచించారు. బషీరాబాద్ మండలం గొట్టిగ గ్రామస్థులైన జడల రామకృష్ణరాజు 'మొగిలి రేకులు' పేరుతో కవితలు రచించారు.

వికారాబాద్‌కు చెందిన కూర జయదేవ్ 'శతఘ్ని' పేరుతో మినీ కవితా సంపుటి వెలువరించారు. జాతీయవాద భావాలతో వెలువడ్డ ఈ రచన రాశిలో చిన్నదైనా వాసిలో గొప్పది. అలాగే వికారాబాదు నివాసులైన చక్రవర్తి వేణుగోపాలరావు రాసిన 'మిణుగురు పురుగులు' అనే కవితా సంచికలో కవితలు, దేశభక్తి గీతాలు ఉన్నాయి. బలమైన గేయాన్ని పలికించగల వేణు జాతీయవాద భావాలతో కవితా గానం చేస్తున్నారు. పూడూరు మండలం చన్‌గొముల్ వాస్తవ్యులైన సి. కృష్ణ ఇప్పుడిప్పుడే తెరపైకి వచ్చిన యువకవి.

తుంగతుర్తి సుభద్రాదేవి, మఠం కల్యాణయ్య స్వామి, లక్ష్మణరావు పతంగే, విశ్వనాథ్ జోషి, అమ్మంగి వేణుగోపాల్, డా. మహంతయ్య, గోపాల్‌కిషన్, అర్ధచంద్ర ప్రకాష్‌రెడ్డి, డా. మొరంగంపల్లి బాగయ్య, రాజలింగం, యం.నర్సింలు, అవుసరి ఆంజనేయులు, బొబ్లాద్ రాఘవేంద్రాచార్య, ముదిగొండ సాంబశివ, సాంబశివ శర్మ వంటి కవులు వికారాబాద్ జిల్లాలో ప్రముఖంగా తమ రచనలను వెలువరిస్తున్నారు.

వికారాబాదు జిల్లాలో ప్రాచీన సాహిత్యం తక్కువగా వున్నా, హైదరాబాదు నగరానికి సమీపంలో ఉండటం వల్ల సాహిత్య సృజన బాగానే జరిగింది. అంతేకాకుండా ఎందరో కవులు తమ స్వగ్రామం వదిలిపెట్టి నగరానికి వలసవెళ్లి అక్కడే స్థిరపడి తమ రచనా వ్యాసాంగం కొనసాగిస్తున్నారు. జిల్లా సరిహద్దులు ఎప్పటికప్పుడు మార్పు చెందటం వల్ల ప్రాచీన సాహిత్యానికి గుర్తింపు లేకుండా పోయింది. ఇక్కడ సంస్థానాలు లేకపోవడం కూడా సాహిత్య వికాసానికి గొడ్డలిపెట్టుగా మారింది .అయినా సాహితీ వ్యవసాయం చేసే సాహిత్యమూర్తులెందరో ఇక్కడ అత్యద్భుత సాహిత్యం అనేక ప్రక్రియల్లో సృష్టించారు.

## సాహితీ సంస్థలు మరియు కళా సంస్థలు

వికారాబాదు జిల్లాలో 1970 ప్రాంతంలో ఉగాది రోజు ప్రముఖ మేధావి ముళ్లపూడి సూర్యనారాయణ మూర్తి గారి ఆధ్వర్యంలో సాహితీ సమితి ఏర్పడింది. 1973 రంగారెడ్డి జిల్లా రచయితల సంఘంగా సాహితీ సమితి గుర్తింపు పొందింది. 1975 తర్వాత నుంచి ఆ సంస్థ జాతీయ భావాలకు నెలవైన సాహిత్య పరిషత్తుకు అనుబంధంగా పనిచేస్తోంది. దాదాపు 30 కి పైగా శాఖలతో జిల్లా సాహిత్యాన్ని నడిపించిన ఈ సంస్థకు ముళ్లపూడి వారు ఆజీవన పర్యంతం విశేష సేవలు అందించారు. వారి పేరిట వికారాబాద్‌లో ఏటా ప్రముఖ సాహితీవేత్తలకు అవార్డు అందిస్తున్నారు. తాండూరులో సాహితీ సేవ చేసిన ఓగేటి అచ్యుత రామశాస్త్రి పేరిట ఈ సంస్థ మరో అవార్డును అందిస్తోంది.

ఉమ్మడి రంగారెడ్డిలో శంకర్‌పల్లి శాఖ వెంకట్ పంతులు ధార్మిక పురస్కారం అందిస్తుంది. దాదాపు ఈ జిల్లాలోని సింహభాగం కవులు ఈ సంస్థ నుంచి రూపుదిద్దుకున్నవారే. వందలాది పుస్తకాలు ఈ సంస్థ నుంచి ప్రచురితం అయ్యాయి. సాహిత్య చర్చలు, కవితా రచన, సదస్సులు, అవార్డు ప్రదానాలు ఈ సంస్థ గొప్పగా చేస్తున్నది.

పరిగిలో 1999 లో స్థాపించబడిన శ్రీ రామాంజనేయ నాట్య కళామండలి అనేక నాటక ప్రదర్శనలు చేస్తుండగా 2008 నుంచి తాండూరు కేంద్రంగా కళా భారతి అనే సాహితీ సంస్థ పనిచేస్తుంది. తాండూరు ప్రాంతంలో మరో సాహితీ సంస్థగా కాగ్నా రచయితల సంఘం, వడిచర్ల సత్యం ఆధ్వర్యం లో పనిచేస్తున్నది. పరిగి ఆధ్యాత్మికవేత్త లక్ష్మీకాంతారావు బాబా ఆధ్వర్యంలో ప్రారంభమైన రాకమచర్ల సత్సంగ మండలి, ఉమ్మెంతలలోని వేంకటదాసు భజనమండలి జిల్లాలో అనేక గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేస్తున్నది.

## వివిధ రంగాల ప్రముఖులు

ఈ జిల్లాలో అనేక రంగాల్లో ఎందరో ప్రముఖులు కనిపిస్తారు. పూర్వం నుంచి రాజకీయాల్లో కొనసాగుతూ ఈ రోజుకూ తమ ప్రాబల్యాన్ని నిరూపించుకొన్నట్లు వారు కొందరు ఉండగా, మెరుపు వేగంతో రాజకీయాల్లో అచిర కాలంలోనే దూసుకుపోతున్న వారూ వున్నారు. తాండూరు ప్రాంతంలో 'మహరాజ్ కుటుంబం' గా చెప్పబడే మాణిక్‌రావు నారాయణరావు, రమేశ్‌లకు తాండూరులో ఈ రోజుకూ ప్రత్యేక స్థానం వుంది. మంత్రిగా పనిచేసిన మాణిక్‌రావు మరణించగా నారాయణరావు, రమేశ్‌లు వారి కుటుంబం నుంచి రాజకీయాల్లో క్రియాశీలకంగా వున్నారు. అలాగే ఇంద్రారెడ్డి కుటుంబానికి ఈ జిల్లాతో ఎనలేని అనుబంధం వుంది. ఇంద్రారెడ్డి రణించినా ఆయన భార్య సబిత, కొడుకు కార్తీక్ రెడ్డిల ప్రభావం జిల్లా రాజకీయాలపై వుంది. అదే కుటుంబానికి మరో పార్శ్వం అయిన మహేందర్‌రెడ్డి ఆయన సోదరుడు నరేందర్ రెడ్డి ప్రస్తుతం జిల్లా రాజకీయాల్లో చురుకుగా పనిచేస్తున్నారు. కొడంగల్‌లో మూడు సార్లకు పైగా శాసన సభ్యునిగా పనిచేసిన గుర్నాథ్‌రెడ్డి అతని కుటుంబం ఒకవైపు వుండగా, రేవంత్‌రెడ్డి మరోవైపు దూసుకుపోతున్నారు.

పరిగిలో ఒకప్పుడు మంత్రిగా పనిచేసిన కమతం రాంరెడ్డి కూడా నియోజకవర్గంపై ప్రభావం చూపిస్తున్నారు. మూడు సార్లకు పైగా శాసనసభ్యునిగా, ఉప సభాపతిగా పనిచేసిన కొప్పుల హరీశ్వర్ రెడ్డికి ఇప్పటికీ ప్రజల్లో మంచి పేరు, పట్టు వున్నాయి. మరోవైపు రామ్మోహన రెడ్డి తన వంతుగా రాజకీయాల్లో వున్నారు. ఒకప్పుడు జగన్మోహన్‌రెడ్డి, షరీఫ్‌లు పరిగి నియోజకవర్గాన్ని, జిల్లా రాజకీయాలను నడిపించారు. వికారాబాదు ప్రాంతం నుంచి యాదవరెడ్డి ఎమ్మెల్సీగా కొనసాగుతుండగా, సంజీవరావు, ప్రసాద్ కుమార్, చంద్రశేఖర్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. కుల్కచర్ల ప్రాంతంలో కరణం ప్రహ్లాదరావు జాతీయవాద భావజాలంతో రాజకీయాల్లో చురుకుగా ఉన్నారు.

## దర్శనీయ స్థలాలు - పర్యాటకం

### ముఖ్య దేవాలయాలు


జిల్లాలో అనంతగిరి కొండలు పర్యాటకం పరంగా ఎందరినో ఆకర్షిస్తే అక్కడున్న శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆధ్యాత్మికంగా ఎందరినో ఆకర్షిస్తున్నారు.'అనంతగిరీ కా హవా సౌ మరీజోం కా దవా' అని చెబుతారు. అనంతగిరి కొండల గాలి తాకితే చాలు వచ్చిన రోగాలు పోతాయనే సామెత వచ్చింది. అందుకే అక్కడ క్షయవ్యాధి నివారణ కేంద్రం చాలా కాలం నుంచే వుంది. కార్తీక మాసాంతంలో అక్కడ జరిగే జాతరకు వేలాదిమంది వస్తారు.ఇక్కడ చలన చిత్రాలను కూడా చిత్రీకరిస్తారు. జిల్లాలో ధామగుండం ప్రత్యేకమైన దర్శనీయ స్థలం. ఇక్కడి సహజంగా, ప్రకృతి మధ్య వెలసిన శివుణ్ణి దర్శించుకోడానికి వేలాది మంది వస్తారు. తాండూరు పక్కన ఏర్పాటు చేసిన పౌరాణిక దర్శనీయ క్షేత్రం 'భూ కైలాస్' ను ఎందరో దర్శిస్తున్నారు. ధనవంతుడైన ఓ గిరిజన భక్తుడు ఇది ఏర్పాటు చేశాడు. కొడంగల్ - తాండూరు మధ్యనున్న జుంటుపల్లి రామాలయం, కొడంగల్ నియోజకవర్గంలోని స్థానిక వేంకటేశ్వరాలయంలో ఆగమశాస్త్రం ప్రకారం తిరుపతిలో జరిగినట్లు అన్ని సేవలు చేస్తారు. అలాగే కొడంగల్ పశ్చిమంగా వున్న ఏకామ్రేశ్వర స్వామి ఆలయం అడవి మధ్యలో వుంది. పరిగి పక్కనున్న లొంక క్షేత్రం ప్రకృతి రమణీయంగా వుంటుంది. తాండూరుకు ఉత్తరంగా వున్న అంబురామేశ్వరం చక్కని దేవాలయం, కుల్కచర్ల పక్కన పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయం ప్రసిద్ధం. ఎన్నెతలలో శనైశ్వరాలయం రాష్ట్రంలోనే ప్రసిద్ధి. అక్కడ 'శని త్రయోదశికి' జరిగే కార్యక్రమంలో వేలాది మంది పాల్గొంటారు. పులుసు మామిడి గుట్టమీద శివరాత్రికి గొప్ప ఉత్సవాలు జరుగుతాయి. మర్పల్లి మండలం కల్‌కొడలో ఎల్లమ్మ దేవాలయం 300 ఏళ్ళ చరిత్ర కలది. వికారబాద్ పక్కనున్న బుగ్గ రామలింగేశ్వర క్షేత్రంలో శివరాత్రి నాడు అనేక కార్యక్రమాలు జరుగుతాయి. తాండూరు భావిగి భద్రేశ్వర స్వామి దేవాలయంలో విశేష కార్యక్రమాలు జరుగుతాయి. రాకంచర్లలోని యోగానంద లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని ఎందరో భక్తులు దర్శిస్తారు.

ప్రకృతి శోభలతో విలసిల్లిన ప్రదేశం, అనంతగిరి పర్వత ప్రాంతంలో మూసీ నది ఆవిర్భవించిన ప్రదేశం, ఆధ్యాత్మిక క్షేత్రం అయిన వికారాబాదు జిల్లా పరిపూర్ణ వికాస మార్గంలో ముందుకు వెళ్ళాలని ఆశిద్దాం.

# సిద్ధిపేట జిల్లా చిత్రపటం




౨౮౨(౧)



లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, బెజ్జంకి



కొమరవెల్లి మల్లికార్జునస్వామి




సిద్దిపేట లాల్ కమాన్



విద్యా సరస్వతీ దేవాలయం



సరస్వతీ దేవి



వేముగంటి నరసింహాచార్యులు

282(b)

# సిద్ధిపేట

సిద్ధినిగొన్న పేట యిది చిక్కని కాంతికి రాచబాటయై
వృద్ధిని గొన్నదీ ధరణి వీరుల ధీరుల జన్మభూమిగా
బద్ధసమృద్ధితో నడచు వర్గలవాణి కృపాప్రసక్తయై
శుద్ధ విశాల సంస్కృతికి శోభగ నిల్చుచు నెల్లవేళలన్ !

**ఉ**ద్యమాలకు, కళలకు పుట్టినిల్లుగా భాసిస్తున్న సిద్ధిపేట జిల్లా రాష్ట్రంలోనే ప్రత్యేకతను సంతరించుకుంది. చారిత్రకంగా, సామాజికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా బలమైన ముద్రను కలిగి ఉంది. ఇది పూర్వం తాలూకా కేంద్రం. ఆ తర్వాత అవిభక్త మెదక్ జిల్లాలో సిద్ధిపేట డివిజన్‌గా ఉండేది. పరిపాలనా సౌలభ్యం కోసం ఏర్పాటైన నూతన జిల్లాల్లో సిద్ధిపేట ఒకటి. మెదక్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో అంతర్భాగంగా ఉన్న కొన్ని ప్రాంతాలను కలిపి సిద్ధిపేట జిల్లాగా ఏర్పాటు చేశారు.

**ఈ పేరెందుకు?**

సిద్ధిపేట సమీపంలోని చంద్లాపూర్ గుట్టపైన నవనాథ సిద్ధుల్లోని ఒక సిద్ధుడు సిద్ధి పొందాడు. ఆయనే సిద్ధిపురి గ్రామాన్ని నిర్మించాడు. సిద్ధిపురియే రాను రాను సిద్ధిపేట అయింది.

నిజాం నవాబు దర్బారులో ఒక సేనా నాయకుడి పేరు సిద్ధిఖీ. అతడు ఈ ప్రాంత వ్యవహారాలను పర్యవేక్షించే వాడు. తన పేరు స్థిరంగా ఉండాలనే ఉద్దేశంతో సిద్ధిపేటను సిద్ధిపేటగా మార్చాడని ప్రతీతి.

**భౌగోళిక విస్తీర్ణం - పరిధి :**

సిద్ధిపేట జిల్లా 18.1019 ఉత్తర అక్షాంశాల మధ్య, 78.8521తూర్పు రేఖాంశాల మధ్య వ్యాపించి ఉంది. ఈ జిల్లా 3,632 చ.కి.మీ. వైశాల్యం కలిగి ఉంది. సిద్ధిపేట జిల్లా ఏడు జిల్లాలను సరిహద్దుగా కలిగి ఉంది. తూర్పున జనగామ, పడమర మెదక్, ఉత్తరాన రాజన్న సిరిసిల్ల, దక్షిణాన యాదాద్రి భువనగిరి, ఈశాన్యంలో కరీంనగర్, నైఋతిలో మేడ్చెల్, వాయవ్యంలో కామారెడ్డి జిల్లాలు ఉన్నాయి.

**సహజ వనరులు**

జిల్లాలో పలు రకాల సహజ వనరులు ఉన్నాయి.

**నేలలు :** జిల్లాలో మూడు రకాల నేలలు ఉన్నాయి. ఇసుకతో కూడిన చెలక నేలలు, ఎర్ర నేలలు, నల్లరేగడి నేలలు ఉన్నాయి.

**అడవులు :** సిద్ధిపేట జిల్లాలో అటవీ విస్తీర్ణం 253.18 చ.కి.మీ. కాగా అటవీ విస్తీర్ణతా శాతం 6.94%. ములుగు ప్రాంతంలో అటవీ విస్తీర్ణం ఎక్కువగా ఉంది. గజ్వేల్ ప్రాంతంలోని నాచారంలో కూడా కొంతమేర అటవీ విస్తీర్ణం ఉంది. హుస్నాబాద్, అక్కన్నపేట ప్రాంతాలతో పాటు పర్వత శ్రేణులు, గుట్టలు, పొదలతో కూడిన చిన్న చిన్న అడవులు ఉన్నాయి. ములుగులో ఉద్యాన విశ్వవిద్యాలయం, అటవీ కళాశాల కేంద్రాలు ఉన్నాయి.

**నదులు :** బెజ్జంకి ప్రాంతంలో ప్రవహించే మానేరు, గజ్వేల్, దుబ్బాక మండలాల్లో ప్రవహించే కూడలేరు లాంటి చిన్ననదులే ఇక్కడి ప్రధాన నదులు.

**రెవెన్యూ డివిజన్లు - మండలాలు**

సిద్ధిపేట జిల్లాలో సిద్ధిపేట, గజ్వేల్, హుస్నాబాద్ అనే మూడు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. ఈ మూడు డివిజన్లలో మొత్తం 22 మండలాలు ఉన్నాయి.

**సిద్ధిపేట రెవెన్యూ డివిజన్‌ల్లో 10 మండలాలు :**

1. సిద్ధిపేట అర్బన్ 2. సిద్ధిపేట రూరల్ 3. నంగునూర్ 4. చిన్నకోడూర్ 5. తొగుట 6. దౌల్తాబాద్ 7. మిరుదొడ్డి 8. దుబ్బాక 9. చేర్యాల 10. కొమురవెల్లి

**గజ్వేల్ రెవెన్యూ డివిజన్‌లో 7 మండలాలు :**

1. గజ్వేల్ 2. జగదేవ్‌పూర్ 3. కొండపాక 4. ములుగు 5. వర్గల్ 6. మార్కూక్ 7. రాయ్‌పోల్

**హుస్నాబాద్ రెవెన్యూ డివిజన్లో 5 మండలాలు :**

1. హుస్నాబాద్ 2. కోహెడ 3. బెజ్జంకి 4. మద్దూర్ 5. అక్కన్నపేట

**చెరువులు - ప్రాజెక్టులు :** జిల్లాలో చెరువులు, వాగులు, కుంటలు కొంతమేరకు సాగుకు ఉపయోగకరంగా ఉన్నప్పటికీ ఇవి వర్షాకాలంలో మాత్రమే నిండే అవకాశం ఉంది. ఈ జిల్లాలో కోమటి చెరువు, ఎర్ర చెరువు, నర్సాపూర్ చెరువు, చింతల్ చెరువు, శనిగరం చెరువు (దీన్ని మధ్య తరహా ప్రాజెక్ట్‌గా ప్రణాళికలు రూపొందిస్తున్నారు), ముస్త్యాల చెరువు, చిన్నకోడూర్ చెరువు, చేబర్తి పెద్ద చెరువు మొదలైనవి ఇక్కడి భూగర్భ నీటి మట్టాన్ని పెంచే ప్రధాన నీటి వనరులు. ఇటీవల కాలంలో జిల్లాలో ఉన్న 3,269 చెరువుల్ని మిషన్ కాకతీయ పథకం కింద పునరుద్ధరించడం ద్వారా నీటి వనరులను వృద్ధి చేసే ప్రయత్నంలో ఉన్నారు.

తెలంగాణాను కోటి ఎకరాల మాగాణిగా చేసేందుకు రీడిజైనింగ్‌లో భాగంగా కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టింది. రంగనాయకసాగర్ రిజర్వాయర్, గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్లు, మల్లన్నసాగర్ రిజర్వాయర్, కొండపోచమ్మ రిజర్వాయర్‌లు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి.

**జనాభా :** 2011 జనాభా లెక్కల ప్రకారం సిద్ధిపేట జిల్లా జనాభా 10,12,065 కాగా, పురుషులు జనాభా 5,04,141, స్త్రీల జనాభా 5,07,924. దీనిలో గ్రామీణ జనాభాశాతం 86.26%, పట్టణ జనాభా శాతం 13.74. ఈ జిల్లా జనసాంద్రత 279. లింగనిష్పత్తి 1000 : 1008.

**అక్షరాస్యత :** సిద్ధిపేట జిల్లా అక్షరాస్యతా శాతం 61.61. ఇది తెలంగాణ రాష్ట్ర సగటు అక్షరాస్యతా శాతం కన్నా 5% తక్కువ. పురుషుల అక్షరాస్యత 72.30%. స్త్రీల అక్షరాస్యత 51.08%.

## జిల్లా చరిత్ర

ఈ జిల్లాకు సంబంధించిన చరిత్రను కచ్చితంగా చెప్పడం కష్టమే. ఎందుకంటే ఉమ్మడి మెదక్‌జిల్లా చరిత్రను మెదక్ కేంద్రంగా చేసుకొని రాయడం జరిగింది. అట్లాగే కొండాపూర్‌లో దొరికిన పురావస్తు ఆధారాలను తీసుకొని చరిత్రను అంచనా వేశారు. ప్రస్తుతం సిద్ధిపేట జిల్లా ఇటు మెదక్ రాజ్య కేంద్రానికి దూరంగా ఉండడం, ఇటు వరంగల్, కరీంనగర్ ముఖ్యమైన రాజ్యకేంద్రానికి దూరంగా ఉండడం ఈ ప్రాంతంలో నిర్దిష్టమైన పాలనా కేంద్రాలు లేకపోవడం మూలంగా సరిగ్గా చారిత్రక నేపథ్యాన్ని చెప్పలేకపోతున్నాము. అయితే ప్రతి దేశానికొక చరిత్ర ఉంటుంది. విశేష ముంటుంది. స్థల పురాణముంటుంది. కాబట్టి ప్రస్తుతానికి మనకు తెలిసినంత మేర శాసనాల ఆధారంగా ఈ జిల్లా చారిత్రక నేపథ్యాన్ని చెప్పదలచుకున్నాను. ఇంకా చారిత్రకమైన, లోతైన పరిశోధన ఇంకా జరగాల్సి ఉంది.

గజ్వేల్, దుబ్బాక ప్రసిద్ధి కెక్కిన సంస్థానాల వల్ల పలు రాజవంశాలైన శాతవాహనులు, రాష్ట్రకూటులు, విష్ణుకుండినులు, దేవగిరి యాదవులు, కాకతీయులు, గోనరాజులు, గోల్కొండ నవాబులు, అసఫ్‌జాహీలు ఈ జిల్లాను పాలించినట్లు తెలుస్తోంది. అందులో ముఖ్యమైన రాజవంశాల గూర్చి తెలుసుకుందాం

**శాతవాహనులు :** సిద్ధిపేట జిల్లాలోని నంగునూర్ మండలం రాజగోపాల్‌పేట గ్రామం క్రీ.పూ. 230 నుంచి

క్రీ.శ 218వరకు శాతవాహన పాలకుల కింద దక్కన్ ప్రాంతంలో అంతర్భాగంగా ఉండేదని అక్కడ ఉన్న చారిత్రక కోట ద్వారా తెలుస్తుంది.

**బాదామీ చాళుక్యులు :** దక్షిణాపథమును పాలించిన రాజవంశాలలో చాళుక్య వంశం ప్రసిద్ధమైంది. ఈ వంశీయులు వివిధ ప్రాంతాలను పాలించారు. ఇందులో వారి వారి రాజధానులను బట్టి వారి వంశనామాలతో శాఖలుగా పేర్కొనబడినవి. సిద్ధిపేట జిల్లా ప్రాంతమంతా బాదామీ చాళుక్యరాజుల పరిపాలనలో ఉన్నదని చెప్పవచ్చు.

**రాష్ట్రకూటులు :** రాష్ట్రకూటులు మొదట బాదామీ చాళుక్య రాజుల సామంతులుగా ఉన్నారు. చాళుక్య రాజైన కీర్తివర్మను పదవీ భ్రష్టుని చేసి బాదామీని వశపరచుకొని (మాన్యఖేటము ప్రాంత చాళుక్య సామంతుడు మొదటి ఇంద్రరాజు) రాష్ట్రకూట రాజ్యాన్ని స్థాపించాడు. వీరు సుమారు 200 సంవత్సరాలు యావత్ తెలంగాణ ప్రాంతాన్ని పరిపాలించారు.

అయితే సిద్ధిపేట జిల్లాలో రాష్ట్రకూటుల పాలనకు సంబంధించిన ఆధారం నాడు 'నాగులూరు', 'నగునూరు', నగ్నూరుగా పిలువబడే నేటి నంగునూరు (మండల కేంద్రం) గ్రామంలో ధూల్మిట్ట రహదారి పక్కన విశాలమైన బండపై ఉన్న ఏకశిలా దిగంబర విగ్రహమే. జైన తీర్థంకరుడైన పార్శ్వనాథుడి విగ్రహం ఇది. ప్రస్తుతం స్త్రీ విగ్రహంగా కనిపిస్తున్న ఈ విగ్రహాన్ని జైన తీర్థంకరుడి బండ అని పిలువకుండా 'జోకిరమ్మ బండ' అని పిలుస్తున్నారు.(దీనికి అంతగా కట్టుకథ ప్రచారమై చారిత్రక సత్యం కనుమరుగై పోయింది)

**బాదామీ చాళుక్యులు :** వెయ్యి సంవత్సరాల క్రితం రాష్ట్రకూట రాజులకు సామంతులుగా... క్రీ.శ. 750 నుంచి క్రీ.శ. 973 మధ్య గంగాధర, వేములవాడలను రాజధానిగా చేసుకొని సపాదలక్ష దేశంగా ప్రసిద్ధి చెందిన పశ్చిమోత్తర తెలంగాణ ప్రాంతాన్ని వేములవాడ చాళుక్యులు పాలించారు. ఇక్కడ వేములవాడ చాళుక్యులు నిర్మించిన హిందూ జైన దేవాలయమైన రామాలయం ఇందుకు సాక్ష్యంగా నిలుస్తోంది.

**మున్సిపాలిటీ :** సిద్ధిపేట మున్సిపాలిటీ జిల్లాలో ఉన్న ఏకైక మున్సిపాలిటీ.

**రెవన్యూ గ్రామాలు :** 397

**గ్రామ పంచాయితీలు :** 399

**పోలీస్ హెడ్ క్వార్టర్ :** సిద్ధిపేట**పార్లమెంట్ నియోజకవర్గం** : సిద్ధిపేట

**అసెంబ్లీ నియోజకవర్గాలు :**

**పట్టణాలు :** సిద్ధిపేట, గజ్వేల్, హుస్నాబాద్

**కళ్యాణీ చాళుక్యులు :** ఉమ్మడి మెదక్ జిల్లా భూభాగం రాష్ట్రకూటుల పరిపాలనానంతరం కళ్యాణీ చాళుక్యుల పరిపాలన క్రిందికి చేరింది. దీంతో ప్రస్తుత సిద్ధిపేట జిల్లాలో వీరి పాలన ఉందనేది సుస్పష్టం.

అందుకు సిద్ధిపేట జిల్లాలోని మిట్టపల్లి అగ్రహారం చాళుక్య విక్రమాదిత్య మహారాజు క్రీ.శ. 1098లో వేయించిన శాసనం సోమేశ్వర బ్రహ్మేశ్వర దేవుని రంగభోగానికి, నిత్య నైవేద్యానికి ఆ గ్రామంలో ఉన్న బలిదేవ పండితునికి చేసిన భూదాన వివరాలను తెలుపుతుంది. వీరు తమ సామ్రాజ్యాన్ని చక్కగా పరిపాలించుకుంటూ కృషి చేసి, కవి, పండితులను పోషిస్తూ, సాహిత్యాభివృద్ధికి విశేషంగా కృషి చేశారు.

**కాకతీయులు :** యావత్ ఆంధ్రదేశాన్ని కాకతీయులు సుమారు 300 సంవత్సరాలు పరిపాలించినారు. వీరు కళ్యాణీ చాళుక్యుల సామంతులుగా ఉన్న సమయంలో కాకతీయ మొదటి బేతరాజు అనుమకొండ విషయ పాలకునిగా నియమింపబడ్డాడు. ఆ సమయంలో ఇతని రాజ్యం కొరవి సీమ సరిహద్దు నుండి ఈనాటి సిద్ధిపేట జిల్లాలోని శనిగరం వరకు వ్యాపించి ఉన్నట్లు అతడు వేయించిన 'శనిగరం శిలా శాసనం' చెబుతుంది.

రుద్రదేవుని కాలంలో తనకు అన్నివిధాల విశ్వాస పాత్రుడైన గంగాధర మంత్రిని నగునూరు (నేటి నంగునూరు)

రాజధానిగా సబ్బసాయిర మండలానికి తన సామంతునిగా నియమించినాడు. అదేవిధంగా సిద్ధిపేట ప్రాంతాల్లోని మిట్టపల్లి, దుద్దెడ, కొండపాక, శనిగరం మొదలైనచోట్ల ఉన్న కాకతీయుల శాసనాలను బట్టి క్రీ.శ.10వ శతాబ్దిలో పుల్లనూరు అని ఆనాడు పిలువడే నేటి పుల్లూరు కింద 70 గ్రామాలుండేవి. నాటి కరీంనగర్, నేటి సిద్ధిపేట జిల్లాలోని శనిగరం వరకు గ్రామాలన్నీ పుల్లూరు క్రింద ఉండేవి. ఈ పుల్లూరు ప్రాంతం నాటి సబ్బిసాయిర మండలం అంతర్భాగం. దీన్నే సబ్బినాడు అని కూడా పిలుస్తారు.

12వ శతాబ్దంలో కాకతీయుల పాలనలో లక్ష్మీనరసింహ ఆలయాన్ని బెజ్జంకిలో నిర్మించినట్లు ఇక్కడి చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఆలయంలోని రాతిపై చెక్కిన శిల్పాలు, చాళుక్య, కాకతీయుల కాలంనాటివని తెలుస్తోంది.

## సంస్కృతి

జాతి ప్రత్యేక అస్తిత్వాన్ని నిలబెట్టేది సంస్కృతి. జాతి జీవన విధానాన్ని 'సంస్కృతి'గా వ్యవహరిస్తాం. సంస్కృతి విస్తృతమైంది. విశ్వాసాలు, వ్యవహారాలు, భావోద్వేగాలు, వేడుకలు, కళలు, సంప్రదాయాలు అన్నీ కలిసి సంస్కృతి. తెలంగాణ సంస్కృతి విశిష్టమైంది. సిద్ధిపేటలో విభిన్న సంస్కృతుల సమ్మేళనం కనిపిస్తుంది. హుస్నాబాద్ డివిజన్‌లో అక్కన్నపేట మండలంలో లంబాడీల సంఖ్య అధికం. వీరిది ప్రత్యేకమైన సంస్కృతి. అదేవిధంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఇక్కడ వ్యాపార కార్యక్రమాలు నిర్వహించుకుంటూ వారి సంస్కృతితో పాటు ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాల్లో పాలుపంచుకుంటూ భిన్న సంస్కృతుల సమ్మేళనంగా కనిపిస్తున్నారు.

**కళలు :** సిద్ధిపేట జిల్లా కళలకు కాణాచి ఇక్కడ అనేక కళలు విలసిల్లుతున్నాయి. అంతర్జాతీయ చిత్రకారుడు కాపురాజయ్య సిద్ధిపేట బిడ్డనే. గ్రామీణ సహజ సౌందర్యాన్ని చిత్రాలుగా అందించిన రాజయ్య చిత్రకళ రారాజుగా ఖ్యాతి గడించారు. ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన మరో చిత్రకారుడు యాసాల బాలయ్య. ఇతడు బాతిక్ చిత్రకళలో సిద్ధహస్తుడు. సిద్ధిపేటకు చెందిన రుస్తుం, ఇతని కుమారుడు నయీం రుస్తుం నైరూప్య చిత్రకారునిగా చక్కని ప్రతిభ కనబరుస్తున్నారు. చేర్యాల ప్రాంతం అరుదైన పెయింటింగ్ కళకు ప్రసిద్ధి గాంచింది.

శిల్పకళలో ప్రత్యేకంగా కృషి చేసిన శిల్పకారుల్లో సిద్ధిపేటకు చెందిన కీ.శే. కొంపర్తి బాల్‌రత్నంను పేర్కొన వచ్చు. వీరు సృష్టించిన కళాఖండాల్లో సిద్ధిపేట పట్టణంలో ఉన్న గద్ద బొమ్మ, శరభేశ్వరాలయం సమీపంలో ఉన్న నెహ్రూ విగ్రహం, మోహినిపుర వేంకటేశ్వరాలయంలో వేంకటేశ్వర స్వామి నిర్మాణదశలోని నమూనా, మకరతోరణం, కోటి లింగాల ఆలయంలో ఉన్న నాగ పడిగ వీరి కళా నైపుణ్యానికి చక్కని నిదర్శనం.

ఇటీవల కాలంలో చక్కని శిల్పాలు చెక్కుతూ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్న శిల్ప చిత్రకారుడు రమణారెడ్డి. కొండపాక మండలం లకుడారం గ్రామానికి చెందిన ఇతడు ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర్య ఉత్సవాల పెరేడ్‌లో ప్రదర్శించిన బోనాల శకట రూపశిల్పి.

సంగీత విద్వాంసులను, జానపద కళాకారులను, గాయకులను సైతం అందించిన జిల్లా సిద్ధిపేట. హరికథాగానంలో కొత్త ఒరవడి ప్రవేశపెట్టి అశేష జనాదరణ పొందిన గేయ వాల్మీకి బిరుదాంకితుడు రుక్మాభట్ల నరసింహ స్వామి సిద్ధిపేట వాస్తవ్యులు. జానపద గాయకుడుగా ప్రసిద్ధుడై ప్రస్తుతం ఎం.ఎల్.గా సాంస్కృతిక శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న రసమయి బాలకిషన్ సిద్ధిపేట మండలం రావూరు ముద్దుబిడ్డ. తెలంగాణ ఉద్యమంలో మాటను, పాటను కలిపి తెలంగాణ అంతటా తన గొంతును వినదించిన మరో అరుదైన కవి గాయకులు దేశపతి శ్రీనివాస్ సిద్ధిపేట వారే. ఆయన గొంతు వినని తెలంగాణ పల్లె లేదంటే అతిశయోక్తి కాదు. వీరు పాడిన 'నాగేటి చాల్లల్ల' ఆడియో క్యాసెట్ బహు జనాదరణ పొందింది.

ఆంధ్రాప్రాంతం గుప్పిట్లో మగ్గుతున్న రోజుల్లో సైతం తెలంగాణ ప్రాంతానికి చెందిన దర్శకులు, నటులు తమ ప్రతిభను నిరూపించుకొన్న వారున్నారు. అందులో ఈ జిల్లాలో మొదట చెప్పుకోదగ్గ వ్యక్తి ప్రజ్ఞాపూర్ ప్రాంతానికి చెందిన బి. నరసింగరావు. తెలుగు సినిమా చరిత్రలో చెప్పుకోదగ్గ చిత్రమైన 'మా భూమి' సినిమాను నిర్మించి సినిమాకళలో సిద్ధిపేట కీర్తిని అంతర్జాతీయంగా వ్యాపింపజేశారు. 'దాసి, ఊరు, మట్టి మనుషులు, దివిటీ, హరివిల్లు వంటి పలు చిత్రాలు నిర్మించి జాతీయ, అంతర్జాతీయ చిత్రోత్సవాలలో అపురూపమైన సత్కారాలు అందుకున్నారు.

1983 ప్రాంతంలో కాశీయాత్ర సినిమాని నిర్మించింది సిద్ధిపేటకు చెందిన ఔత్సాహిక కళాకారులు. ఈ సినిమాకు కథానాయకుడుగా సిద్ధిపేటకు చెందిన గౌరిశెట్టి ఆంజనేయులు నటించారు. ఇదే పట్టణానికి చెందిన ముద్దసాని రఘుపతిరెడ్డి పసుపు కుంకుమ, నక్సలైట్ అనే చిత్రాలు నిర్మించారు. ఇటీవలి కాలంలో నిర్మాత, దర్శకుడు, మాటల రచయితగా చక్కని సందేశాత్మక లఘుచిత్రాలతో పయనం సాగిస్తోన్న వ్యక్తి నక్షత్రం వేణు. సిద్ధిపేటకు చెందిన ఈయన అమెరికాలో సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తూనే మానవీయ కోణాలతో లఘుచిత్రాలకు ప్రాణం పోస్తున్నారు. ఇవి అమెరికాలోని వివిధ వేదికలపై విమర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. 'నక్షత్రం... మూడు హృదయాల చప్పుడు' పేరుతో మూడు లఘు చిత్రాలు అమెరికాలో జరిగిన సౌత్ ఏషియాన్ నార్త్ కరోలినా ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపికై ప్రశంసించ బడ్డాయి.

అదేవిధంగా కామెడీ హీరోగా రాణిస్తున్న కథా నాయకుడు సంపూర్ణేశ్ బాబు. ఇతడు సిద్ధిపేటకు సమీపంలోని మిట్టపల్లి గ్రామానికి చెందినవాడు. వీరు నటించిన చిత్రాలు చక్కని ఆదరణ పొందాయి.

నాట్యకళా రంగంలో కూడా పలువురు వ్యక్తులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు గాంచారు. సిద్ధిపేటకు చెందిన గజభీంకార్ రమేశ్ (పేరిణి రమేశ్) పేరిణీ నృత్యాన్ని దేశ విదేశాల్లో పలు ప్రదర్శనలిచ్చి ప్రశంసలు పొందారు. ఇంకా కుకునూరుపల్లెకు చెందిన శ్రీమతి సుమన ఆంధ్రనాట్యంలో, శ్రీనివాస్ పేరిణి నృత్యంలో ఎంతో చక్కని ప్రతిభను కలిగి ఉన్నారు.

**జాతరలు :** తెలంగాణ ప్రాంతం జాతరలకు ప్రసిద్ధి. అందులో సిద్ధిపేట జిల్లాకు ప్రముఖస్థానం ఉంది. ఇందులో కొమురవెల్లి జాతర ముఖ్యమైంది. మూడు నెలలపాటు (జనవరి నుండి ఉగాది వరకు) వైభవంగా జరుగుతుంది. దుబ్బాక మండలంలోని కూడవెల్లి రామలింగేశ్వర స్వామి జాతర (చౌదరిపల్లి జాతర), సిద్ధిపేట మండలంలోని పుల్లూరు గ్రామ చివర సుమారు తొంబై ఎకరాల్లో భారీ బండపై వెలసిన లక్ష్మీ నరసింహస్వామి జాతర, బెజ్జంకి మండల కేంద్రంలోని గుట్టపై వలసిన లక్ష్మీ నరసింహస్వామి జాతర, సిద్ధిపేట పట్టణంలోని శరభయ్య జాతర, గజ్వేల్ సమీపంలో జరిగే తీగల్ జాతరకు తెలంగాణ ప్రాంతం నుండే కాక వివిధ రాష్ట్రాల నుండి భక్తులు వేలాది సంఖ్యలో తరలి వస్తారు. కొహెడ మండలంలో జరిగే సింగరాయ జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారు.

## సాహిత్యం

తెలుగు సాహితీ యవనికపై సిద్ధిపేట జిల్లా చిత్రం అత్యంత సుస్పష్టమైనదీ సుమధురమైదీనూ. అక్షరజ్ఞానం లేకున్నా సహజ సిద్ధంగా సాహిత్య రచనా వ్యాసంగాన్ని పూనుకొని 'వరకవులు'గా రాణించిన ఎందరో కవులు ఈ జిల్లాలో సాహితీ సౌరభాలు పరిమళింపజేసినవారే!

సిద్ధిపేట జిల్లా సాహిత్యంలో దాదాపు అన్ని ప్రక్రియలూ ఉండడం విశేషం. ఈ ప్రాంత కవులు, సాహిత్య సంస్థలు ఏదో ఒక ఇజానికి మాత్రమే పరిమితం కాకుండా సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాహిత్య రచనలు చేశారు. ఇక్కడి సాహిత్యం సామాజిక, రాజకీయ ఉద్యమాలకు సాంస్కృతిక ఇంధనాన్ని అందించింది.

సంప్రదాయ కవిత్వంలో పేరుమోసిన ఎందరో కవులున్నారు ఈ జిల్లాలో. **కుక్కునూరు యాయవరం**

**రామశాస్త్రి** శ్లేష, యమక చక్రవర్తిగా పేరు పొందారు. గురుస్తుతి, భవానీస్తవం, శంకర స్తవం ఈయన యొక్క ప్రసిద్ధి గాంచిన రచనలు. ఇతని పద్యాలు 'గోలకొండ కవుల సంచిక'లో చోటు చేసుకున్నాయి. సిద్ధిపేటకు చెందిన **ముత్యంపేట సాంబయారాధ్యులు** శైవ సంబంధమైన పలు రచనలు చేశారు. శివస్తవ సుధ, రామామణి శతకం, శాంకరీస్తవం మొదలైనవి రచించారు. గోలకొండ కవుల సంచికలో చోటు సంపాదించుకున్న మరోకవి **గడ్డం రామదాసు.** 'వరకవి'గా ప్రసిద్ధి చెందిన ఈయన మిరుదొడ్డి నివాసి. కుచేలోపాఖ్యానం, కాళింగమర్దన, విప్ర నారాయణ, ప్రభావతి వంటి పలు కావ్యాలు రచించారు. గజ్వేల్ ప్రాంతానికి చెందిన **రుక్మాభట్ల విధుమౌళిశాస్త్రి** రచించిన 'తందనాన రామాయణము' బహుళ ప్రాచుర్యం పొందింది.

అట్లాగే **రిమ్మనగోడు రఘురామశాస్త్రి** 'రాజరాజేశ్వర శతకం రచించగా, **మూలంపల్లి రాజశేఖర శాస్త్రి** 'శ్రీనాథ విజయం' రచించారు. కవి కోకిల, విద్వత్కవి బిరుదాంకితులైన సిద్ధిపేటకు చెందిన ప్రసిద్ధ కవి **వేముగంటి నరసింహాచార్యులు.** వీరు నలభైకి పైగా కావ్యాలు రచించారు. ప్రబోధము, తిక్కన, వీరపూజ, ఆంధ్రవిష్ణువు, వివేక విజయం, భావతరంగిణి వంటి రచనలు చేశారు. పండితకవిగా చక్కని పేరు సంపాదించిన మరోకవి **ఉమాపతి పద్మనాభశర్మ**. వీరి స్వస్థలం సిద్ధిపేట. ఉమాపతి పలు చక్కని కావ్యాలు రచించారు. అందులో 'తేజోవల్లరి' గ్రంథం ముఖ్యమైంది. విమర్శకుడిగా పేరు సంపాదించిన స్వర్గీయ **ముదిగొండ ఈశ్వర చరణ్** సిద్ధిపేట నివాసి. 'వ్యాసనవమి' 'వ్యాసపీఠం' గ్రంథాలు వీరి రచనలు. సిద్ధిపేటకు చెందిన **దేశపతి గోపాలకృష్ణ** మధుశ్రీ, వాసర సరస్వతీ సుప్రభాతం రచించారు. పండగల మీద ఈ కవి రచించిన పద్యాలు వివిధ పత్రికలలో ప్రచురింపబడ్డాయి.

గోల్కొండ తొలి సమాజ వేదాంత కవి **కీ.శే.సిద్ధప్పకవి.** 'వరకవి'గా పేరు పొందిన వీరు కోహెడ మండలం గుండారెడ్డిపల్లి గ్రామస్థులైన వీరు 'సిద్ధప్ప వరకవి జ్ఞానబోధిని' అనే గ్రంథం రచించారు. సిద్ధిపేటలో స్థిరపడ్డ **ఐతా చంద్రయ్య** శ్రీగిరి శతకం, భద్రగిరి నివాస శతకం రచించారు.

చౌడారం గ్రామానికి చెందిన పండిత కవి **కటుకోజ్వల ఆనందం.** వాస్తు, జ్యోతిష, పౌరోహిత్యంలో చక్కని పేరు పొందిన వీరు పలు రచనలు చేశారు. భక్త గజేంద్ర మోక్షం, సీతారామ కళ్యాణం – బతుకమ్మ పాటలు; అలివేలు మంగ వేంకటేశ్వర వర్ణమాల, కోటి లింగేశ్వర స్తుతి, షిర్డీసాయి పదాలు... ఇంకా పలు రచనలు చేశారు. చెల్లాపురం గ్రామానికి చెందిన **అమ్మన చంద్రారెడ్డి** చక్కని పద్యకవి. ఈయన చంద్రవీక్షణం, చంద్రాలోకనం, సోమేశ్వర శతకం రచించారు. మిట్టపల్లికి చెందిన **దాశరథుల బాలయ్య** శ్రీరామచంద్రోదాహరణం, జ్ఞాన సరస్వతీ మధ్యాక్కరలు, శివ సాక్షాత్కారం వంటి రచనలు చేశారు. గజ్వేల్ పట్టణానికి చెందిన **మూటకొండూరు బ్రహ్మం** పూలమాల, శ్రీ నాచగిరి లక్ష్మీ నృసింహ భజనావళి వంటి గ్రంథాలు రచించారు.

సిద్ధిపేటకు చెందిన మరో పద్యకవి **బొద్దుల పుండరీకం.** శేషశైలవాస శతకం, ముక్తక మౌక్తికాలు మొదలైనవి వీరి రచనలు. **కె. మధుసూదన్** – హనుమాన్ శతకం, **పెందోట వెంకటేశ్వర్లు** – వేంకటేశ్వర శతకం, **ముత్యంపేట కేదారనాథ శర్మ** – జీవన సాఫల్యం నాటకం, వేంకటేశం మణికంఠీయము, **బండికాడి అంజయ్య** శ్రీ వేంకటేశ్వర శతకం, శ్రీ సద్గురు సాయిబాబా చరిత్ర అనే పద్యాలు రచించారు.

చౌడారం గ్రామానికి చెందిన యువకవి **కటుకోజ్వల లాల్‌బహదూర్ శాస్త్రి** తెలంగాణ ఉద్యమ వీరగాథను 'తెలంగాణ బతుకమ్మ పాట'గా రచించారు. సిద్ధిపేటకు చెందిన **వంగా గాల్‌రెడ్డి** 'నా నోట తెలంగాణ పాట' అనే పాటల సంపుటిని వెలువరించారు.

తెలుగు సాహిత్య ప్రక్రియలోనే ఉత్కృష్టమైన ప్రక్రియ అవధానం. సిద్ధిపేటలో అవధాన ప్రక్రియకు ఆద్యుడిగా చెప్పుకొనే వ్యక్తి **గౌరీభట్ల రామకృష్ణశాస్త్రి.** ఎన్నో అవధానాలను విజయవంతంగా నిర్వహించిన వీరు 'ఏకవీర కుమారీయం'

అనే శ్లేష కావ్యం రచించారు. అవధానిగా గొప్ప పేరు సంపాదించిన వ్యక్తి స్వర్గీయ **గుమ్మన్నగారి లక్ష్మీ నరసింహ శర్మ**. దుబ్బాక మండలం పోతారెడ్డిపేట వీరి స్వగ్రామం. అవధాన శశాంక, ఆశు కవితా కేసరి ఈయనకు గల బిరుదులు. మూడువందలకు పైగా అవధానాలు దిగ్విజయంగా నిర్వహించారు. కవితా కళ్యాణి, వాగీశ్వరి స్తుతి, ఆద్య మాతృక, విశ్వనాథేశ్వర శతకం, అవధాన సరస్వతీ, పద్యోద్యానము వంటి గ్రంథాలను రచించారు.

గజ్వేల్ ప్రాంతానికి చెందిన మరొక అవధాని **విఠాల చంద్రమౌళిశాస్త్రి.** ఈయన శ్రీ లీల, మాతృప్రేమ గ్రంథాలు రచించారు. సిద్ధిపేటకు చెందిన **అష్టకాల నరసింహరామశర్మ** పలు అవధానాలు నిర్వహించడమే కాక శిథిల విపంచి, శ్రీరామ చంద్రిక, పురుషోత్తముడు మొదలైన కావ్యాలు రచించారు.

శతావధానాన్ని దిగ్విజయంగా నిర్వహించి పలువురి ప్రశంసలందుకొన్న అవధాని **డా॥జి.ఎం. రామశర్మ** తొగుట మండలం వెంకట్రావుపేటకు చెందినవారు. వాగధీశ్వరీ శతకము రచించారు. వెంకట్రావుపేటకే చెందిన మరో అవధాని **గౌరీభట్ల రఘురామ శర్మ.** ఎన్నో అవధానాలు నిర్వహించారు. ఈయన రాసిన పలు కవితలు వివిధ పత్రికల్లో ప్రచురింపబడ్డాయి.

యక్షగాన ప్రక్రియలో ఈ జిల్లా నుండి విస్తృతమైన సాహిత్యాన్ని పండించిన కవులున్నారు. అందులో ప్రధానంగా దుబ్బాక మండలం రామేశ్వర పల్లకికి చెందిన స్వర్గీయ **బెల్లోజు రమణాచారి** ఉన్నారు. వందకు పైగా యక్షగానాలు రచించి ప్రదర్శింపచేశారు. సిద్ధిపేటకు చెందిన మరో యక్షగాన రచయిత స్వర్గీయ **కాల్వ బాలయ్య**. పలు యక్షగానాలు రచించారు. ఈయన చక్కని నటుడు, దర్శకుడు కూడా. అట్లాగే మిట్టపల్లికి చెందిన **గాజుల స్వామిదాసు.** 'స్వరోచోపాఖ్యానం', 'భళ్లాన చరిత్రము' వంటి యక్షగానాలు రచించాడు.

ఇక కథా సాహిత్య విషయానికి వస్తే ఈ ప్రక్రియలో ఆశించినంత మేర వెలువడలేదు. అయినా పలువురు కథా రయితలు, కథా వ్యాప్తికి ఎంతగానో కృషి చేశారు. వారిలో ముఖ్యులుగా సిద్ధిపేటకు చెందిన **ఐతా చంద్రయ్య**ను చెప్పుకోవాలి. కథాశిల్పిగా పేరొందిన వీరు దాదాపు ఎనిమిది వందలకు పైగా కథలు రాశారు. అందులోని చాలా కథలు పలు భాషల్లోకి అనువాదం అయ్యాయి. చంద్రయ్య కథలపై విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరిగాయి. ప్రముఖకవి నంది అవార్డు గ్రహీత **నందిని సిధారెడ్డి** కూడా గతంలో పలు కథలు రాసినవారే. ఇటీవల కాలంలో ఆ కథల్ని 'చిత్రకన్ను' పేరుతో సంపుటిగా వెలువరించడం జిల్లాలో కథాసాహిత్యంలో ఉన్న లోటును కొద్దిమేరకు పూరించడానికి అవకాశం ఉంది. ఇంకా **ముదిగొండ ఈశ్వర చరణ్, ఉమాపతి పద్మనాభశర్మ, దారం మల్లారెడ్డి- ఆంజనేయులు** జంటగా పలు కథలు రచించారు. **చొప్పదండి ప్రభాకర్** కథలపై తెలంగాణ విశ్వ విద్యాలయంలో పిహెచ్.డి స్థాయిలో పరిశోధనలు జరుగుతున్నాయి. **కందుకూరి శ్రీరాములు, సిద్దెంకి యాదగిరి** ఇంకా చాలామంది రచయితలు, రచయిత్రులు కథారంగంలో ముందుకు వెళుతున్నారు.

వచనకవిత్వం విస్తృతస్థాయిలో వెలువడుతుంది. జిల్లాలో వచ్చిన అనేక ఉద్యమాల ప్రభావంతో చైతన్య వంతమైన చాలామంది యువకవులు, కవయిత్రుల కవితా సంపుటులు వెలువరిస్తున్నారు. వచన కవిత్వాన్ని ఉద్యమంగా, వచన కవిత్వమే ఉద్యోగంగా భావించి నలభైకి పైగా వచన కవితా గ్రంథాలు వెలువరించిన **స్వర్గీయ కనపర్తి రామచంద్రా చార్యులు** సిద్ధిపేట వాస్తవ్యులు. బండారం గ్రామానికి చెందిన **డా. నందిని సిధారెడ్డి** భూమి స్వప్నం, ఒక బాధ గాదు, సంభాషణ, ప్రాణహిత నదిపుట్టువడి వంటి పలు సంపుటాలు వెలువరించారు. ప్రాణహిత కవితా సంపుటిపై తెలుగు విశ్వవిద్యాలయం భాషాశాఖలో ఎం.ఫిల్ జరిగింది. సిద్ధిపేటకు చెందిన చక్కని, చిక్కని వచన కవి **రామగిరి శివకుమారశర్మ.** ఈయన సింగిడి, సముద్రదాహం రచనలు

పలువురి ప్రశంసలు అందుకున్నాయి. సిద్ధిపేట మర్పడగ గ్రామానికి చెందిన **డా॥ చెప్పెల హరినాథ శర్మ** రాసిన కవితలు పలు కవితా సంకలనాలలో చోటు చేసుకున్నాయి.

**కె. అంజయ్య**-'గీతాయుధం'; **మహమూద్‌షా** 'ఉనికి'; **చొప్పదండి సుధాకర్** 'శబ్దఋతువు', **తైదల అంజయ్య** 'పునాస', ఎర్రమట్టి బండి, **ఐలేని గిరి** నెమలి కన్ను; **పప్పుల రాజిరెడ్డి** వరదగూడు, ఆనవాళ్ళు, గంగాళం; **మంతపురి నారాయణ** మెఖుపులు; **కొండి మల్లారెడ్డి** అలికిడి; **బైతి దుర్గయ్య** అక్షర సేద్యం; **దబ్బీకార్ సురేందర్** అగ్నివీణ; **పొన్నాల బాలయ్య** పో, నిగ్గు; **అన్నల్‌దాస్ రాములు** పాయిరం మొదలైన కవితా సంపుటులు వెలువరించారు.

జిల్లాలో చక్కని వ్యాసాలతో పలు గ్రంథాలను వెలువరించిన రచయితలు ఉన్నారు వారిలో పోతిరెడ్డి గ్రామానికి చెందిన **డా. గుమ్మనగారి బాలశ్రీనివాసమూర్తి** సాహితీ మంజీరా, ఆత్మకథల్లో ఆనాటి తెలంగాణ, మా సిద్ధిపేట వంటివి డజన్‌కు పైగా గ్రంథాలు వెలువరించారు. **డా. నందిని సిధారెడ్డి** ఇగురం, ఆవర్తనం వంటి గ్రంథాలు పలువురి ప్రశంసలు పొందాయి. **నర్రా భగవాన్** 'బైరాన్‌పల్లి పోరాటం 1948' పేరుతో గ్రామ పోరాటాన్ని చిత్రిస్తూ వెలువరించారు.

**బాల సాహిత్య** ప్రక్రియలో **వేముగంటి నరసింహాచార్యులు గారు** 'బాల గేయాలు' వంటి రచనలు చేసి ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారు. **ఐతా చంద్రయ్య** అమరజీవి పొట్టి శ్రీరాములు, కుందేలు తెలివి మొదలైన సంపుటాలు వెలువరించారు. **ఎన్నవెళ్ళి రాజమౌళి** చిలుక పలుకులు; **కె. మధుసూదన్** పనస తొనలు; **పెందోట వెంకటేశ్వర్లు** ప్రభాత కిరణాలు; **వర్కోలు లక్ష్మయ్య** మబ్బుల పల్లకి; **ఉండ్రాల రాజేశం** చెఖువు, బాల కథామంజరి; **దబ్బీకార్ సురేందర్** దాగుడు మూతలు, **ఎడ్ల లక్ష్మి** కనుపాప, బంగారు బొంగరం వంటి కథా, కవితా సంపుటాలు వెలువరించి జిల్లాలో బాల సాహిత్య వ్యాప్తికి కృషి చేస్తున్నారు. కవిత్వం రాస్తూ ప్రచారంలోనికి రాని అజ్ఞాతకవులు చాలామంది ఉన్నారు. వీరందరు తమ రచనలను వెలుగులోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## వివిధ రంగాల ప్రముఖులు

సిద్ధిపేట జిల్లాలో వివిధ రంగాల్లో పేరుగాంచిన ఎందరో ప్రముఖులున్నారు. రాజకీయ రంగంలో ఎందరో ఉద్ధండ నాయకులున్నారు. కమ్యూనిస్టు యోధులు సిద్ధిపేట నియోజకవర్గం మొదటి ఎం.ఎల్.ఏ ఎడ్ల గురువారెడ్డి ఈ జిల్లావారే. అప్పటి సిద్ధిపేట లోక్‌సభ సభ్యుడు స్వర్గీయ జి. వెంకటస్వామి, దొమ్మాట ఎం.ఎల్.ఎ, మాజీ మంత్రివర్యులు చెరుకు ముత్యంరెడ్డి ఈ జిల్లాకు చెందినవారే.

నంది ఎల్లయ్య, మల్యాల రాజయ్య, జి. విజయ రామారావు, సర్వే సత్యనారాయణ ఎం.పీలుగా ప్రాతినిధ్యం వహించారు. ఇందులో కొందరు కేంద్రమంత్రులుగా పనిచేశారు.

అపర చాణుక్యుడు తెలంగాణ ఉద్యమ విజేత ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.సి.ఆర్ సిద్ధిపేట జిల్లా చింతమడక బిడ్డయే. అభివృద్ధిపథంలో పైలట్‌గా దూసుకెళ్తున్న రాష్ట్ర మంత్రివర్యులు తన్నీరు హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్ధిపేట ఈ జిల్లా కేంద్రమే.

## దర్శనీయ ప్రదేశాలు - పర్యాటక రంగం

జిల్లాలోని కొన్ని ప్రాంతాలు అత్యంత రమణీయతను, విశిష్టతను కలిగి ఉన్నాయి. ఇందులో సిద్ధిపేటలోని కోమటి చెరువు, ఎర్రచెరువు, శనిగరం చెరువు (ఇటీవల కాలంలో మధ్య తరహా ప్రాజెక్టుగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు) కోమటి బండ జిల్లాలో ప్రధాన పర్యాటక స్థలంగా అభివృద్ధి చెందుతుంది.

ప్రజ్ఞాపూర్ సమీపంలోని రిమ్మనగూడ వద్ద టెలిఫోన్ శాఖ త్రవ్వకాల్లో తామ్రశిలా యుగపు రాగి కత్తులు నాలుగు దొరకాయి. అయితే ఇటీవలి కాలంలో మరో అరుదైన బృహత్ కాలపు సమాధులు ఈ జిల్లాలో పుల్లూర్, నర్మెట గ్రామాల్లో బయటపడ్డాయి. సిద్ధిపేట జిల్లా కేంద్రానికి పన్నెండు

కిలోమీటర్ల దూరంలో పుల్లూర్ గ్రామానికి పడమర వైపునున్న లక్ష్మీ నరసింహ స్వామి బండకు అతి సమీపంలోనే గుర్తించారు. ఇవి బృహత్‌కాలం నాటి (క్రీ.పూ.1000) సమాధులుగా నిర్ధారించారు. ఎకరంన్నర విస్తీర్ణంలో యాభైవరకు సమాధులు గుర్తించగా ఇందులో కొన్నింటిని త్రవ్వగా పలు విలువైన రాతి యుగపు, కాంస్య యుగపు పరికరాలు బయటపడ్డాయి. ఇరవై నుంచి ఇరవై ఐదేళ్ళ యువకునిగా భావిస్తున్న అస్థి పంజరం బయటపడింది. దీనిపై మరింత లోతైన అధ్యయనం చేస్తే మరిన్ని కొత్త విషయాలతో సరికొత్త చరిత్ర లిఖించబడుతుంది.

జిల్లా కేంద్రంలోని లాల్ కమాన్, బురుజు చారిత్రక ప్రదేశాలు. ఇవే కాకుండా సిద్ధిపేట సమీపంలోని రాజగోపాల్ పేట చారిత్రకంగా ప్రసిద్ధి చెందిన ప్రాంతం. గోలకొండ నవాబుల దగ్గర మంత్రులుగా పనిచేసిన అక్కన్న, మాదన్నలు ఈ ప్రాంతాన్ని పరిపాలిస్తూ, కోటను నిర్మించారు. నవాబుల కాలంనాటి చిత్ర, శిల్పకళ కోట గోడల మీద చెక్కబడింది. రజాకారు రాక్షస కృత్యాలను ఎదుర్కొన్న వీర బైరాన్‌పల్లె గ్రామంలోని బురుజు చారిత్రక స్థలంగా చెప్పవచ్చు.

చిన్న కోడూర్ రంగధాంపల్లి, అల్లీపూర్, చౌడారం మొదలైన గ్రామాల్లో ఉన్న బురుజులు, గడీలు, నాటి దొరల, దేశ్‌ముఖ్‌ల పెత్తందారి పాలనకు సజీవ సాక్ష్యాలు. చిన్నకోడూర్ సమీపంలోని సలేంద్రి గ్రామంలో నాటి పాలకులు నిర్మించిన శివాలయం, దాంతోపాటు అద్భుతంగా నిర్మించిన కొలను నాటి చరిత్రను తెలియజేసేవే.

## దేవాలయాలు

సిద్ధిపేట జిల్లా ఆలయాల ఖిల్లాగా ప్రసిద్ధి గాంచింది ఈ ప్రాంతం. ఆధ్యాత్మిక వైభవానిక వేదికగా మారి ప్రత్యేకతను సంతరించుకుంది.

**నాచాద్రి :** గ్రేటర్ హైద్రాబాద్ పరిధిలోకి వచ్చే వర్గల్ మండలం నాచారం గుట్టపై హల్దీవాగు పక్కన నాచాద్రి (నాచగిరి) లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం కొలువదీరి వుంది. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా భక్తులు రెండో యాదగిరిగుట్టగా పేరు గాంచింది. ఇక్కడ నరసింహస్వామి కొండ గుహలో స్వయంభువుగా వెలిశాడు. ప్రధానాలయంతో పటు శివ, సీతారామాంజనేయ, దత్తసాయి, నవగ్రహ, సత్యనారాయణస్వామి ఆలయాలు క్షేత్రంలో ఉన్నాయి.

**కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం :** తెలంగాణ రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం ఒకటి. పరమశివుడికి ప్రతిరూపంగా కొమురవెల్లి గుట్ట గుహలో మల్లికార్జున స్వామి అవతారంలో వెలిశాడని ప్రతీతి. సుమారు 600 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయం నిజాం ప్రభుత్వం కాలంలో 1949లో దేవాదాయ శాఖ అధీనంలోకి వెళ్ళింది. ప్రతి ఏటా మార్గశిర మాసం చివరి ఆదివారం స్వామివారి కళ్యాణోత్సవం జరుగుతుంది. సంక్రాంతి తర్వాత వచ్చే మొదటి ఆదివారం నుండి ఉగాది పండగకు ముందు వచ్చే ఆదివారం వరకు అగ్నిగుండాలలో స్వామివారి బ్రహ్మోత్సవాలు (జాతర) ముగుస్తాయి.

**శ్రీ విద్యా సరస్వతి శ్రీ శనైశ్చరాలయం :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోకి వచ్చే వర్గల్ మండలంలో కొలువు దీరిన మరో ప్రఖ్యాత ఆలయం సరస్వతీ శనైశ్చరాలయం. మండల కేంద్రం వర్గల్ గ్రామంలో శంభుగిరిపై భవ్యంగా నిర్మితమైంది. భక్తుల కొంగు బంగారంగా కొలువు దీరి నిర్మించిన రెండు దశాబ్దాల్లోనే ప్రఖ్యాత సరస్వతీ క్షేత్రంగా భాసిల్లుతోంది. ఇక్కడ ప్రతి ఏటా దేవీ నవరాత్ర్యుత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. అందులో వసంత పంచమి రోజున పెద్ద ఎత్తున భక్తులు క్షేత్రానికి వస్తారు. ఇక్కడ అక్షరాభ్యాసాలు చేయిస్తే తమ చిన్నారులకు చక్కగా విద్యా బుద్ధులు అబ్బుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. క్షేత్రంలో ఉన్న శని దేవుని ఆలయం కూడా ఎంతో పేరు గాంచింది. ప్రతి శని త్రయోదశిని పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో శనిపూజలు జరుగుతాయి. ప్రతిరోజు ఇక్కడ భక్తులకు ఉచితంగా భోజనం పెడతారు. రాజీవ్ రహదారికి

సమీపంలో ఈ క్షేత్రం ఉండడంతో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది.

**కొండ పోచమ్మ దేవాలయం :** జగదేవపూర్ మండలం తీగూల్ నర్సాపూర్ గ్రామ శివారులోని కొండల్లో కొలువు దీరి ఉంది కొండపోచమ్మ తల్లి ఆలయం. ఆలయం ముందు ఉన్న కోనేరు ప్రత్యేకతను సంతరించుకుంది. ఫిబ్రవరి మాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలు కొండపోచమ్మ జాతరగా భారీగా జరుగుతుంది. సమీపంలోని కొమురవెల్లి మల్లన్న ఆలయానికి వచ్చిన భక్తులు కొండపోచమ్మను దర్శించుకోవడం ఆనవాయితీగా ఉంది. ఆలయం చుట్టూ ఉన్న కొండల మధ్య అటవీ ప్రాంతం ఆహ్లాదకరంగా పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతుంది.

**వేలూరు లక్ష్మీనృసింహ ఆలయం :** ఎంతో పురాతన చరిత్ర కలిగి, ఇటీవలే జీర్ణోద్ధరణ కాబడుతున్న ఆలయం వేలూరు లక్ష్మీ నృసింహ స్వామి ఆలయం. వర్గల్ మండలంలోని వేలూరు గ్రామంలో ఉన్న ఈ ఆలయానికి సమీపంలోనే (కేవలం 3. క.మీ). తెలంగాణలోనే రెండో యాదగిరి గుట్టగా పేరు పొందిన నాచారం గుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఉంది. దానితో కలుపుకుని నవ నారసింహ క్షేత్రాలుగా పిలిచే క్షేత్రాలలో వేలూరు ఆలయం కూడా ఉండడం విశేషం. నవ నారసింహ క్షేత్రాలలో దీనిని రెండో క్షేత్రంగా పండితులు పరిగణిస్తుంటారు. సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం నిర్మించిన ఆలయంగా ఆధారా లున్నట్లు నిపుణులు చెబుతున్నారు. దీనికి సంబంధించి ఆలయ ప్రాంగణం ఉన్న రాతి ధ్వజ స్తంభానికి ఎంతో ప్రాశస్త్యం ఉంది.

**భోగేశ్వరాలయం :** సిద్ధిపేట పట్టణానికి చివర రామాలయానికి సుమారు 1 కి.మీ.దూరంలో ఉన్న సుమారు వెయ్యేండ్ల నాటి ఆలయం భోగేశ్వరాలయం. నిజానికి ఇది ఒక దేవాలయం కాదు. దేవాలయాల సముదాయం. మూడంచెలుగా నిర్మించబడింది. భోగేశ్వరాలయం రెండవది భోగేశ్వరాలయం నాట్య మండపానికి దక్షిణంగా ఉత్తరాభి ముఖంగా ఉన్న శివాలయం. మూడవది త్రికూటాలయం. ఈ గుడి ఆవరణలోకి ప్రవేశించగానే కుడివైపు కనిపిస్తుంది. ఈ ఆలయాలు వేరు వేరు కాలాల్లో కట్టబడ్డా, ఎవరు ఎప్పుడు కట్టించారో తెలిపే శాసనం కానీ, ఇతర ఆధారాలు కాని లేవు. అయితే ఇందులోని నిర్మాణం, శిల్పాలను పరిశీలిస్తే ఇంచుమించు 10వ శతాబ్దానికి అంటే తొలి కాకతీయులు, వారి ప్రభువులయిన కళ్యాణి చాళుక్యుల కాలానికి చెందినట్లు తెలుస్తోంది.

**బెజ్జంకి లక్ష్మీ నరసింహస్వామి :** కోరినవారికి కొంగు బంగారమై భక్తుల పాలిట కల్పతరువై, వరాలిచ్చే నరసింహుడిగా బెజ్జంకి మండల కేంద్రంలో (ఏకశిలతో నిర్మితమై తాబేలు ఆకారంలో) ఉన్న గుట్టపై వెలసిన క్షేత్రం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రం. కోహెడ మండలంలోని శనిగరం గ్రామంలో లభ్యమైన కళ్యాణి చక్రవర్తుల కాలపు రెండు శిలా స్తంభ శాసనాలందు పేర్కొనబడిన బెజవాంకెయ నేటి బెజ్జంకి 12వ శతాబ్దంలో కాకతీయుల పాలనలో లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నెలకొల్పినట్లు ఆనవాళ్ళున్నాయి. ఆలయంలోని రాతిపై చెక్కిన శిల్పాలను బట్టి ఇవి చాళుక్యుల, కాకతీయుల కాలం నాటివని తెలుస్తోంది. గుట్టపై గల ఏకశిలతో నిర్మింతమై ఉన్న ఆండాళ్ ధ్వజస్తంభం ఆనాటి శిల్పసౌందర్యానికి నిలువెత్తు నిదర్శనం. ఏకకూట ఆలయంగా నిర్మింపబడిన ఆలయంలో నలుదిక్కుల ఉన్న స్తంభాలు అద్భుత కళాఖండాలకి ప్రతీకలు. కొండపై నున్న సహజమైన గుహయే గర్భగృహంగా రూపొందింది. స్వామివారి మూలవిరాట్‌కు ముందు మరొక లక్ష్మీ నరసింహస్వామి విగ్రహం, దానికి ముందు ఆళ్వార్, నమ్మాళ్వార్ స్వాముల ప్రతిమలు తదనంతర కాలంలో నెలకొల్పబడ్డాయి.

సంతానం లేనటువంటి వారు గుట్టపై ఉన్న ఏకశిల గజస్తంభానికి ఒడిబియ్యం పోస్తే సంతానం కలుగుతుందని ఇక్కడి మహిళల ప్రగాఢ విశ్వాసం. గజస్తంభం చుట్టూ పదకొండు ప్రదక్షిణలు చేస్తే కోరుకున్న కోరికలు తీరుతాయని ఆనవాయితీ. ప్రతియేటా చైత్రమాసం పౌర్ణమిరోజున

ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉత్సవమూర్తులను కన్నుల పండుగగా ఊరేగిస్తారు.

**పొట్లపల్లి రాజేశ్వరాలయం :** హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలో ఉంది ఈ పుణ్యక్షేత్రం. కోరిన కోరికలు తీరుస్తూ, భక్తుల పాలిటి కొంగు బంగారంగా వెలుగొందుతూ ఇక్కడి స్వయంభూ శివలింగాన్ని దర్శించుకుంటే వేములవాడ రాజన్నను దర్శించుకున్నట్లేనని భక్తుల నమ్మకం. అందుకే నిత్యపూజలందుకుంటూ మరో వేములవాడగా భాసిల్లుతుంది.

ఒకప్పుడు ఈ గ్రామం 101 దేవాలయాలతో గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లినట్లు ఇక్కడ బయల్పడిన శిలాశాసనాల ద్వారా తెలుస్తుంది. క్రీ.శ. 1066లో పశ్చిమ చాళుక్య రాజైన త్రైలోక్యమల్లన్న దేవరాయల కాలంనాటి శిలాశాసనం ప్రకారం కాకతీయుల వంశానికి చెందిన మొదటి ప్రోలరాజు 1055-1075 మధ్యకాలంలో పొట్లపల్లిలో శివాలయం నిర్మించాడనే చారిత్రక కథనం ఉంది.

కాకతీయుల శిల్పకళా వైభవాన్ని సంతరించుకున్న శివలింగం అత్యంత సుందరంగా కనిపిస్తుంది. మూడున్నర అడుగుల ఎత్తుతో నాలుగు పొరలుగా ధగధగలాడే నల్లరాతి పానవట్టం కలిగి ఉంది. ఒకప్పుడు నిత్య పూజలందుకున్న ఈ శివలింగం ఆ తరువాత మారుతున్న పరిస్థితులను గమనించిన అప్పటి శైవ మతస్థులు ఇంతటి మహిమ గల శివలింగం ముష్కరుల చేతిలో ధ్వంసం కాకూడదనే ఉద్దేశంతో ప్రత్యేక ఏర్పాట్లతో భూమిలో నిక్షిప్తం చేసినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. విగ్రహం బయల్పడిన సమయంలో శివలింగం చుట్టూ నాలుగు బండరాళ్లు (సల్పలు) ఏర్పాటు చేసి ఉండడం ఈ వాదనకు బలం చేకూరుస్తున్నది. ఇంతటి పవిత్రమైన శివలింగం అరుదుగా ఉంటుందని ఆధ్యాత్మిక వేత్తలు సైతం పేర్కొనడం విశేషం.

ఈ క్షేత్రాన్ని నిత్యం భక్తులతో పూజలందుకొంటుండగా మహాశివరాత్రి పర్వాన వేలాదిమంది భక్తులతో ఈ ప్రాంతం శివ నామస్మరణతో మార్మోగుతోంది.

**స్వయంభూ దేవాలయం :** కాకతీయ శిల్పకళా ప్రభావంతో నిర్మించబడ్డ ఆలయాల్లో దుద్దెడ శంభుదేవుని ఆలయం ఒకటి. ఈ ఆలయం కాకతీయుల కాలాన నిర్మింపబడినట్లు ఆలయ ప్రాంగణంలో గల ఒక శాసనం ద్వారా తెలుస్తుంది. ఈ ఆలయం ఒక రాతికి మరొక రాతిని అతికినట్లుగా చక్కని నైపుణ్యంతో నిర్మించబడింది. ఇక్కడి శివలింగం పుట్ట లింగమని ప్రతీతి. గర్భగుడిపైన 36 అడుగుల గాలి గోపురం గుడిముందు విశాలమైన కల్యాణ మండపం 16 ఏకశిలా స్తంభాలతో నిర్మించబడింది. ఇక్కడి లింగం జల లింగమని పిలుస్తారు. గర్భగుడికి ఇరువైపుల రెండు చిన్న దేవాలయాలు కలవు. ఎడమ ప్రక్కన గల ఆలయంలో మహాశక్తి స్వరూపిణియైన పార్వతీదేవి విగ్రహం కలదు. ఈ అమ్మవారు దక్షిణాభిముఖమై ఉండుట ఇక్కడి ప్రత్యేకత. దక్షిణాభిముఖమైన శక్తి దేవాలయం ఉండటం చాలా అరుదు.

**శరభేశ్వరాలయం :** సిద్ధిపేట పట్టణంలో సుమారు రెండువందల సంవత్సరాల క్రితం నిర్మించబడ్డ ఆలయం శరభేశ్వరాలయం. దీన్ని ఘట్టేపల్లి శరభారాధ్యుడు అనే పరమ భక్తుడు నిర్మించాడు. తదనంతర కాలం ప్రజలు ఈ ఆలయానికి ఆ భక్తుని పేరుమీదనే 'శరభేశ్వరాలయం' లేదా శరవయ్య దేవాలయం అని పిలుస్తున్నారు. ఆ తర్వాత ఘట్టేపల్లి నాగమల్లయా రాధ్యులు "శ్రీ విశ్వేశ్వర బాల భక్త సమాజం" ఏర్పాటు చేసి ఆలయ అభివృద్ధికి కృషి చేశారు.

శరభేశ్వరాలయానికి సంబంధించిన చరిత్ర ఇక్కడి ధ్వజస్తంభం మీద చెక్కబడి ఉంది. ప్రతి యేటా ఇక్కడ జరిగే శరవయ్య జాతరకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ ఆలయం పక్కనే వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయం ఉంది. మొత్తంమీద ఈ ప్రాంతం ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల కూడలిగా భాసిల్లుతోంది.

**కోటి లింగేశ్వరాలయం :** 1979లో సిద్ధిపేట పట్టణంలో శ్రీశ్రీశ్రీ మదనానంద స్వామివారి సంకల్పంతో

ఒక కోటి పార్థిక లింగములు చేయించి ఉమా పార్థివ కోటి లింగేశ్వర దేవాలయం నిర్మించబడింది.

ఇంకా ప్రజ్ఞాపూర్ సమీపంలో వెలసిన వరదరాజ స్వామి దేవాలయం, కొలచిన భక్తులకు కొంగు బంగారంగా పేరు గాంచిన మర్పడగలోని శ్రీ విజయదుర్గ సంతాన మల్లికార్జున ఆలయం, కొండపాకలోని అత్యంత పురాతన రుద్రేశ్వరాలయం, సిద్ధిపేటలోని మోహినీపుర వేంకటేశ్వరా లయం, చిన్నకోడూర్ మండలంలోనిఅనంతసాగర్ గ్రామంలోని 'వీణాపాణి' (దేశంలోనే నిలుచుని ఉన్న మొదటి సరస్వతీ) దేవాలయం, మిరుదొడ్డిలో ఉన్న సీతారామచంద్ర ఆలయం, మర్కూర్‌లోని వీరన్నస్వామి ఆలయం, కుండవెల్లిలోని పురాతన శివాలయం, ఎనిమిదివందల సంవత్సరాల చరిత్ర కలిగిన 13వ శతాబ్దం నాటి కాకతీయ శిల్పకళతో నిర్మితమైన బద్ధిపడగ రాజరాజేశ్వర స్వామి ఆలయాలు ఈ జిల్లాలోని ప్రముఖ ప్రసిద్ధ ఆలయాలు.

జిల్లాలో మత సామరస్యానికి ప్రతీకగా అనేక దర్గాలు కనిపిస్తాయి. అందులో బందారం దర్గా, ఇర్కోడ్ దర్గా, పెద్ద కోదూర్ దర్గాలు ప్రధానంగా చెప్పుకోవాలి.

**జిల్లా ప్రత్యేకతలు :** ఉద్యమాల ఖిల్లాగా సామాజిక, రాజకీయ, సాహిత్య రంగాల్లో కలెబడి నిలబడిన సిద్ధిపేట జిల్లా పలు ప్రత్యేకతలు కలిగి ఉంది.

1969 ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర తొలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన, తెలంగాణ ప్రజా సమితి మెదక్‌జిల్లా కన్వీనర్ మదన్‌మోహన్‌కు ఈ ప్రాంతం వెన్నుదన్నుగా నిలిచింది. ఇక మలిదశ తెలంగాణ ఉద్యమం ద్వారా దశాబ్దాల తెలంగాణ ప్రజల కల తెలంగాణ స్వరాష్ట్రాన్ని సిద్ధింపజేయడంలో కె.సి.ఆర్‌కు 1531 రోజుల (సిద్ధిపేట పాత బస్టాండ్) రిలే నిరాహార దీక్షలతో వెన్నుదన్నుగా నిలిచింది. ఈ ప్రాంతం సిద్ధిపేట జిల్లాలోనిదే.


దోపిడీ పీడనల విముక్తి కోసం, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటానికి పొలికేకగా నిలబడిన మద్దూర్ మండలంలోని వీరబైరాన్‌పల్లి గ్రామం ఈ జిల్లాలోనిదే.

దేశంలో సంచలనం సృష్టించిన గిరాయిపల్లి ఎన్‌కౌంటర్ సంఘటన ఈ జిల్లాలోనిదే.

తెలంగాణలోనే అతిపెద్ద అమరవీరుల స్థూపం సిద్ధిపేట సమీపంలోని రంగధాంపల్లిలో ఉంది. అట్లాగే తెలంగాణలోనే అతి పెద్ద తెలంగాణ తల్లి విగ్రహం సిద్ధిపేటలో కలదు.

ఈవిధంగా సిద్ధిపేట జిల్లా సామాజిక, ఆర్థిక, రాజకీయ సాహిత్య, సాంస్కృతిక, పర్యాటక, వాణిజ్య, వ్యాపార రంగాల్లో తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకుంటూ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణంగా నిలుస్తోంది.

# సూర్యాపేట జిల్లా చిత్రపటం





మట్టపల్లి నరసింహస్వామి



ఉండ్రుగొండ దేవాలయం




జాన్‌పాడ్ దర్గా



ఫణిగిరి బౌద్ధ స్థూప అవశేషాలు



కోదాటి నారాయణరావు



టి.ఎల్.కాంతారావు

# సూర్యాపేట

సూర్యునిపేట యిద్ది రుచిశోభల దీనికినిద్ది సాటియౌ
శౌర్యములొప్పు సంగతుల చూరగొనన్ కమనీయ ధాత్రియే
ఆర్యతలుల్లసిల్లు నిట నందరి యాకలిదీర్చు మిల్లులన్
సూర్యదయాచ్ఛవిద్యలకు చోదితమైన పథాల నిచ్చుచున్ !

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానంతరం రాష్ట్ర ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుగారి ఆలోచనలో రూపు దిద్దుకున్నదే జిల్లాల పునర్విభజన. ప్రభుత్వ పాలన పటిష్టంగా అమలు జరగడానికి, అధికార వికేంద్రీకరణ జరగడానికి, సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందడానికి పది జిల్లాలు కాస్తా 31 జిల్లాలుగా విభజింపబడినాయి. ఈ నూతన జిల్లాల ఆవిర్భావం ప్రజాభీష్టంతో పాటు పలు కమిటీలు చేసిన శాస్త్రీయ అధ్యయనం మేరకు జరిగింది. ఆ పరంపరలోనే నల్లగొండ జిల్లా మూడు జిల్లాలుగా అంటే నల్లగొండ కేంద్రంగా నల్లగొండ జిల్లా, భువనగిరి కేంద్రంగా యాదాద్రి భువనగిరి జిల్లా, సూర్యాపేట కేంద్రంగా సూర్యాపేట జిల్లా రూపాంతరం చెందింది. 2016 అక్టోబర్ 11న సూర్యాపేట జిల్లా అధికారికంగా ఏర్పడింది. ఆ రోజునే కలెక్టరేట్‌ను సూర్యాపేట శాసనసభ్యులు, విద్యుత్ శాఖామంత్రి శ్రీ గుంటకండ్ల జగదీష్ రెడ్డి ప్రారంభించి, జిల్లా చరిత్రలో నూతన అధ్యాయాన్ని ఆరంభించారు. సురేంద్ర మోహన్ గారు తొలి జిల్లా కలెక్టరు.

## భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి

3607 చ.కి.మీ. వైశాల్యమున్న సూర్యాపేట జిల్లాకు జనగామ, మహబూబాబాద్, యాదాద్రి, నల్లగొండ, ఖమ్మం జిల్లాలతో పాటు తూర్పున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, దక్షిణాన కృష్ణానది సరిహద్దులుగా ఉన్నాయి.

## సహజ వనరులు

కృష్ణా నదికి ఉప నదిగా వున్న మూసీ నది జిల్లా మధ్యనుంచి ప్రవహించడం వలన నది రెండు వైపులా సూర్యాపేట జిల్లానే వున్నది. కృష్ణ మూసీ నదులే గాక బిక్కేరు, మున్నేరులు జిల్లాకి చారిత్రక, వారసత్వ సంపదని సమకూర్చ డానికి దోహదపడ్డాయి. అట్లే జిల్లా వ్యాప్తంగా వ్యాపించిన అనేక పర్వతాలు చారిత్రక దుర్గాలకి ఆలవాలమైనాయి. నల్లటి రేగడి భూములు, సారవంతమైన భూములు పంటలతో వ్యవసాయాభివృద్ధికి తోడ్పడగా, జిల్లాలలో లభించే సున్నపురాయి సిమెంట్ పరిశ్రమ అభివృద్ధికి దోహదపడ్డది.

**నేలలు** : జిల్లాలో ఎర్రనేలలు, ఇసుక నేలలు, 47% నల్లరేగడి, చెలక భూములు 44% ఉన్నాయి. జిల్లాలో వ్యవసాయ యోగ్యమైన భూమి 217585 హెక్టార్లుంది.

**అడవులు** : జిల్లాలో అడవులు 117.78 చ.కి.మీటర్లలో విస్తరించి ఉన్నాయి. జిల్లాలోని మొత్తం భూభాగంలో ఇది 3.27 శాతం మాత్రమే. సామాజిక అడవులను పెంచడానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించింది.

**నదులు** : ఈ జిల్లాలో మూసీనది ప్రవహిస్తుంది.

**చెరువులు - ప్రాజెక్టులు** : జిల్లాలో మూడు ఇరిగేషన్ ప్రాజెక్టులున్నాయి. మిషన్ కాకతీయ ద్వారా జిల్లాలోని 1254

**రెవెన్యూ డివిజన్లు – మండలాలు**

సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, కోదాడ రెండు రెవిన్యూ డివిజన్లు ఉన్నాయి. మొత్తం 23 మండలాలున్నాయి.

**సూర్యాపేట రెవెన్యూ డివిజన్‌లో మండలాలు 16 :**

1. సూర్యాపేట 2. చివ్వెంల 3. మోతె 4. జాజిరెడ్డి గూడెం 5. నూతనకల్ 6. పెన్‌పహాడ్ 7. ఆత్మకూర్ (ఎస్) 8. తిరుమలగిరి 9. తుంగతుర్తి 10. గరిడేపల్లి 11. నేరేడుచర్ల 12. నాగారం 13. మద్దిరాల 14. పాలకీడు 15. చిలుకూరు 16. హుజూర్‌నగర్

**కోదాడ రెవిన్యూ డివిజన్‌లో 7 మండలాలు :**

1. కోదాడ 2. కుట్టంపల్లి 3. మేళ్ళచెరువు 4. మునగాల 5. నడిగూడెం 6. అనంతగిరి 7. మల్లారెడ్డి

మైనర్ ఇరిగేషన్ చెరువులు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో మిషన్ కాకతీయ ఫేజ్ –1లో 236 చెరువులను, ఫేజ్ –2లో 296 చెరువులను బాగు చేశారు. లక్ష్మీసముద్రము, బుడబుడా చెరువు, విశ్వనాథ సముద్రము, చౌదరి చెరువు, ఎఱకు సముద్రము ఉన్నాయి.

**జనాభా :** 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ జిల్లా జనాభా 10,99,560, కాగా పురుషుల జనాభా 5,50,974, స్త్రీల జనాభా 5,48, 586. దీనిలో గ్రామీణ జనాభా శాతం 84.44%, పట్టణ జనాభా శాతం 15.56%. ఈ జిల్లా జన సాంద్రత 305. లింగ నిష్పత్తి 1000 : 996.

**అక్షరాస్యత :** అక్షరాస్యతా శాతం 64.11%. ఇది తెలంగాణ రాష్ట్ర సగటు అక్షరాస్యతా శాతం కన్నా 2% తక్కువ. పురుషుల అక్షరాస్యత 73.39%, స్త్రీల అక్షరాస్యత 54.85%.

## జిల్లా చరిత్ర

కృష్ణా పరీవాహక ప్రాంతాలైన కృష్ణాపురం, రేబల్లె, మొఘలాయికోట, చింత్రియాల మున్నగు ప్రాంతాలు ప్రస్తుతం పులిచింతల ముంపు గ్రామాలు ఆది మానవునికి ఆలవాలమైనాయి. అట్లే కృష్ణాపురం నదీతీరంలో గల గుహలు, ఉండ్రుగొండలోని సహజ గుహలు, నేలమర్రి, సిరికొండ, ఫణిగిరి, నాగారం, అర్వపల్లి మున్నగు పర్వతాలలో గల గుహలు, సానువులు ఆదిమానవునికి జీవన ఆవాసాలుగా వున్నాయి. ఈ ప్రాంతాలలో ప్రాచీన శిలాయుగానికి చెందిన రాతి పనిముట్లు లభించాయి. కృష్ణాపురం, అడ్లూరు వద్ద లభించిన పనిముట్లు నేటికి సుమారు అరవై వేల సంవత్సరాల నాటివి. తర్వాత కాలంలో వచ్చిన కొత్తరాతి యుగపు ఆనవాళ్ళు కూడా పై ప్రాంతాల లోనే అనేక చోట్ల లభించాయి. క్రీ.పూ. ఆరు, ఏడు వేల సంవత్సరాల నుంచి క్రీ.పూ. 3000 సంవత్సరాల మధ్య విలసిల్లిన నవీన శిలా యుగపు ఛాయలు ఫణిగిరి, నాగారం, వర్ధమానుకోట, ఆర్యపల్లి, నేలమర్రి ప్రాంతాలలో లభించాయి. ఈ కాలానికి చెందిన నునుపు చేయబడిన రాతి ఆయుధాలు, నాటి మానవుని జీవన విధానానికి ఆధారాలుగా, తార్కాణాలుగా నిలుస్తున్నాయి. ఈ కాలంలోనే మానవుడు జిల్లాలో సంచార జీవనం నుంచి స్థిరనివాసానికి వచ్చాడు. వ్యవసాయం, జంతుపోషణ ఈ యుగంలోనే ఆరంభించాడు. జీవన విధానంలో మార్పు వచ్చింది. మృత సంస్కారం ఈ కాలంలోనే ఆరంభమైంది. చనిపోయిన వ్యక్తులను ప్రత్యేక పద్ధతులలో సమాధిచేసి, దానిచుట్టూ గుండ్రంగానో లేదా ప్రత్యేక విధంగానో పెద్ద పెద్ద రాళ్ళు పెట్టేవారు. సమాధిలో మృతులు వాడిన కుండలను, మట్టి, పూసల, గవ్వల ఆభరణాలను, ఆయుధాలను కూడా పెట్టేవారు. వీటినే రాకాసి గూళ్ళు లేక 'మెగాలిత్ బరియల్స్' అంటారు. ఇవి సూర్యాపేట లోని దాదాపు అన్ని గ్రామ ప్రాంతాలలో కనిపిస్తాయి. కొన్ని ప్రాంతాలలో ఒకేచోట అనేక సమాధులు లభిస్తున్నాయి. అర్వపల్లి సమీపంలోని గొల్లగూడెం వద్ద దాదాపు పాతిక ఎకరాలలో ఈ రాకాసి గుళ్ళు విస్తరించి వున్నాయి. అట్లే ఒక సమాధిలో అనేక అరలు ఏర్పాటు చేయబడి, కళేబరాలు ఉంచబడినాయి.

హుజూరునగర్ వద్ద జరిగిన త్రవ్వకాలలో ఒకే సమాధిలో తొమ్మిది అరలు లేక కంపార్ట్‌మెంట్లలో శిథిల కళేబరాల చిహ్నాలు లభించాయి. ఒకేసారి యింత మందిని సమాధిని చేశారంటే యుద్ధం వల్లనో, తీవ్రమైన వ్యాధుల వల్లనోగాని మరణాలు సంభవించి వుండాలి. హుజూర్‌నగర్ వద్ద లభించిన ఈ సమాధి ప్రపంచంలోనే అరుదైనదిగా చెప్పబడింది.

క్రీ.పూ. వెయ్యి సంవత్సరాల నుంచి ఆరంభమైన తొలి చారిత్రక యుగ అవశేషాలు మనకు సూర్యాపేట జిల్లాలో తిరుమలగిరి, ఈటూరు, ఫణిగిరి మున్నగు అనేక ప్రాంతాలలో లభించాయి.

**చరిత్ర - పాలించిన రాజవంశాలు**

ఇక సూర్యాపేట జిల్లాలో తొలి పాలకులుగా శాతవాహనులే కనిపిస్తారు. క్రీ.పూ. 2వ శతాబ్ది నుంచి క్రీ.శ. 2వ శతాబ్ది వరకు గల వీరి పాలనా కాలంలో రోమ్‌తో వీరు చేసిన వర్తక వ్యాపారాల ఫలితంగా జిల్లాలోని కొన్నిచోట్ల రోమన్ బంగారు నాణాలు లభించాయి. తుంగతుర్తి దగ్గరి గొట్టిపర్తిలో శాతవాహనుల కాలంనాటి రోమ్ నాణెములు 180 లభించాయి. అట్లే వర్ధమానుకోటలో శాతవాహనుల కాలం నాటి బ్రాహ్మీలిపిలో 'ఉపాసికాయ బుద్ధ రక్షితాయ దానం' అన్న శాసనం లభించింది. సూర్యాపేట జిల్లాలోనే కాక ఉమ్మడి నల్లగొండ జిల్లాలో లభించిన తొలి శాసనమిదే. ప్రస్తుతమీ శాసనం ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతిలో వున్నది. 'కాలచక్ర'కి 2005లో దీన్ని తీసుకెళ్ళిన ప్రభుత్వంవారు యిప్పటి వరకు తిరిగి తీసుకు రాలేదు. ఈటూరు గాజులబండ వద్ద బయల్పడిన హీనయాన బౌద్ధ స్థూపం శాతవాహనుల కాలం నాటిదే. ఇవన్నీ సూర్యాపేట జిల్లాలో శాతవాహనుల పాలనకు నిదర్శనాలు.

శాతవాహనుల అనంతరం తెలుగు వారిని పాలించిన ఇక్ష్వాకులు సహజంగానే సూర్యాపేట జిల్లాను కూడా పాలించారు. ఫణిగిరి, అర్వపల్లి, నాగారం, వర్ధమానుకోట, తిరుమలగిరి, నాగారం మున్నగు ప్రాంతాలలో లభించిన శాసనాలు, బౌద్ధ స్థూపాలు ఇక్ష్వాకుల పాలనకు ఆధారాలు.

**మున్సిపాలటీలు :** సూర్యాపేట, కోదాడ

**రెవెన్యూ గ్రామాలు :** 279

**గ్రామపంచాయితీలు :** 279 గ్రామాలున్నాయి.

**పోలీస్ హెడ్‌క్వార్టర్ :** సూర్యాపేట

**పార్లమెంట్ నియోజకవర్గం :** నల్లగొండ

**అసెంబ్లీ నియోజకవర్గాలు :** సూర్యాపేట, కోదాడ, తుంగతుర్తి, హుజూర్‌నగర్

**పట్టణాలు :** సూర్యాపేట, కోదాడ, తుంగతుర్తి, హుజూర్‌నగర్

2004,05 లో ఫణిగిరి త్రవ్వకాలలో బయల్పడిన ప్రాకృత శాసనము చరిత్ర కూడా అత్యంత ప్రధానం. ఋుళుపురుష దత్తుని 18వ రాజ్య సంవత్సరంలో యిచ్చిన ఈ శాసనం ఇక్ష్వాకుల పాలనా కాలాన్ని మార్చుకుంది. ఇక్ష్వాకుల పాలనా కాలం క్రీ.శ.225 నుంచి క్రీ.శ.300 వరకు. అప్పట్లో ఋుళు పురుష దత్తుడు 12 సంవత్సరాలే పాలన చేశాడు. ఈ శాసనం వల్ల ఋుళ పురుషదత్తుడు మరో ఆరు సంవత్సరాలు ఎక్కువ పాలించినట్లు తెలుస్తున్నది. అట్లే ఈ శాసనం ప్రాకృత భాష నుంచి సంస్కృత భాషలోకి శాసన లేఖనం పరిణామం చెందడానికి తార్కాణం. అలాగే బుద్ధుడు హైందవ దేవతా గణములోనికి వచ్చే ప్రక్రియ కూడా ఈ శాసనం ద్వారా తెలుస్తుంది. బుద్ధున్ని 'కంస నిసూదక' అని మదనుణ్ణి సంహరించిన హరునిగా వర్ణించడం ఈ శాసనంలో కనిపిస్తుంది. వీరి కాలంలో వచ్చిన ఆభీరులు సంస్కృత భాషను శాసన భాషగా పూర్తిగా వాడటం కనిపిస్తుంది.

శాతవాహనుల, ఇక్ష్వాకుల కాలంలో సూర్యాపేట జనగామ మార్గంలో అర్వపల్లి, నాగారం, వర్ధమానుకోట, ఫణిగిరి, గాజులబండ, తిరుమలగిరి వంటి బౌద్ధ క్షేత్రాలు అనేకం బయల్పడ్డాయి. ఒకేచోట 25 కి.మీ. పరిధిలో ఇన్ని బౌద్ధ క్షేత్రాలు బయల్పడటానికి కారణం ఈ మార్గం ప్రాచీన కాలంలో ప్రధాన వర్తక మార్గం. విదర్భ నుంచి కంచికి పోయే వర్తకులు, యాత్రికులు (బౌద్ధ మతస్థులు) తప్పనిసరిగా

ఈ మార్గంలోనే వెళ్ళేవారు. విదర్భ కంచి మార్గ మధ్యంలో అమరావతి (ప్రముఖ బౌద్ధ, శైవక్షేత్రం) ఉన్నది. వర్ధమాను కోట వద్ద గల ఏరు పేరు బిక్కేరు. ప్రాకృత భాషలో బిక్కు అంటే "బౌద్ధ భిక్షువు" అని అర్థం. ఎన్ని వేల మంది బౌద్ధ భిక్షువులు ఈ ఏటిలో స్నానమాడారో, ఈ ఏటి ఒడ్డున నడయాడారో దీన్ని 'బిక్కేరు' అన్నారు. భిక్షువుల నది. నల్లగొండ జిల్లా పునర్విభజనలో కాకతాళీయంగా ఒక అద్భుతం జరిగింది. అధికంగా (దాదాపు పూర్తిగా) బౌద్ధ క్షేత్రాలన్నీ సూర్యాపేట జిల్లాలోకే వచ్చాయి. దాదాపు జైన క్షేత్రాలన్నీ యాదాద్రి జిల్లాలోకి రాగా, ప్రముఖ శైవ క్షేత్రాలు (పానగల్లు, పేరూరు, వాడపల్లి యిత్యాదులు) నల్లగొండ జిల్లాకి వెళ్ళాయి.

ఇక్ష్వాకుల తర్వాత సూర్యాపేట జిల్లా విష్ణుకుండినుల పాలనలో వుండేదని చెప్పవచ్చు. వీరి పాలనకు జిల్లాలో ప్రత్యక్ష ఆధారాలు లేవుగానీ, యితర ఆధారాలపై వీరి పాలనను నిర్ధారించవచ్చు. వీరి తర్వాత పశ్చిమ చాళుక్యులు సూర్యాపేట జిల్లాను పాలించారు. వీరి కాలానికి చెందిన శాసనాధారాలు సిరికొండ, చిలుకూరు, హుజూరునగర్ ప్రాంతాలలో లభించాయి. కళ్యాణీ చాళుక్యుల అనంతరం సూర్యాపేట జిల్లా కాకతీయుల ఆధీనంలోకి పోయింది. 11వ శతాబ్ది నుంచి 14 వరకు పాలించిన కాకతీయ రాజులందరూ సూర్యాపేటపై ఆధిత్యాన్ని వహించారు. వీరి కాలంలో సూర్యాపేట జిల్లాలోని ఆమనగల్లు, పిల్లలమర్రి, నాగులపాడు, జలాల్‌పురం మున్నగు ప్రాంతాలని ప్రాంతీయ మాండలిక ప్రభువులుగా రెడ్డిరాజులు పాలించారు. ఈ ప్రాంతీయ రెడ్డి రాజులు లేకున్నచో కాకతీయులు అంత ప్రబలురు, ప్రతిభావంతులు అయ్యేవారు కారేమో?? పిల్లలమర్రిని పాలించిన రేచర్ల రెడ్డి వంశస్థులు కాకతీయులకు అత్యంత విశ్వాసపాత్రులయిన ప్రాంతీయ పాలకులు. వీరిలో బేతిరెడ్డి, నామిరెడ్డి, కామిరెడ్డి, కాట్రెడ్డి ముఖ్యులు. బేతిరెడ్డి అత్యంత ప్రతిభావంతుడు. గణపతిదేవుడు యాదవుల బందీగా వున్నపుడు రాయబారము నెరపిన ప్రసాదిత్యా నాయుడు, రేచర్ల రుద్రారెడ్డి, బేతిరెడ్డి ముఖ్యులు. బేతిరెడ్డి పెండ్లము ఎరుకసానమ్మ గొప్ప మహిళ, పిల్లలమర్రి ఆలయాలను నిర్మింప చేసింది ఈమెనే! పిల్లలమర్రిలో విశ్వనాథ సముద్రము, లక్ష్మీ సముద్రమనే గొప్ప తటాకాలను నిర్మించింది. పిల్లలమర్రిలో విద్యాలయం నిర్మించి, విద్యార్థుల, అధ్యాపకుల గ్రాసవాసాలకు, వండి వార్చే వారికి గ్రామాలను దానం చేసింది. తన పేరున 'ఎరుక వరము' అనే గ్రామాన్ని నిర్మించి, దాన్ని అగ్రహారంగా ఆలయాలకు దానం చేసింది. అదే నేటి 'ఎల్కారం' గ్రామం. సూర్యాపేట జనగాం మార్గంలో వున్నది. అక్కడే ఎరుక సముద్రమనే పెద్ద తటాకాన్ని నిర్మించింది. అట్లే కుడమడ చెరువు వీరి కాలంలోనే త్రవ్వబడింది. వీరి కాలంలో కాకతీయ రాజులు, రాణుల పేర్ల మీద అనేక గ్రామాల నిర్మాణం జరిగినవి. గణసపరం, రుద్రారం మున్నగునవి వీరి కాలం నాటివే. వీరి శాఖ మరొకటి నాగులపాడు కేంద్రంగా పాలన చేసింది. వీరిలో లోకిరెడ్డి, గణిపిరెడ్డి, కాట్రెడ్డి, మల్రెడ్డి మున్నగు వారు ముఖ్యులు.

కాకతీయులకు ప్రాంతీయ పాలకులుగా మహోన్నత సేవలను అందించిన మరో రెడ్డిరాజ వంశము జలాల్‌పురం కేంద్రంగా పాలించిన 'చెరకురెడ్డి వంశము'. వీరు కాకతీయు లకు అనేక యుద్ధ విజయాలను అందించారు. వీరిలో కేతయరెడ్డి బొమ్మిరెడ్డి ప్రముఖులు. ఈ కేతయరెడ్డి వెలసిన గ్రామమే కేతేపల్లి గ్రామం. జలాల్‌పురంలోని ఆలయాలు వీరి నిర్మాణాలే. ఈ జలాల్‌పురము శాసనాలలో జమ్ములూరు గా పిలువబడింది. వీరు శాసనాలలో 'జమ్ములూరు పురవరాధీశ్వరులు' గా పేర్కొనబడినారు. అదే పిల్లలమర్రి రేచర్లరెడ్డి వంశస్థులు శాసనాలలో 'ఆమనిగంటి పురవరా ధీశ్వరులు' గా పేర్కొనబడినారు. ఈ కాకతీయుల ప్రాంతీయ పాలకులుగా సూర్యాపేట జిల్లాలో 'పెండ్లి కొడుకు మల్లిదేవ మహారాజు' వంశము మరొకటి వెలుగులోకి వచ్చింది పాతర్లపాడు, ఆత్మకూరులలో వీరి శాసనాలు బయల్పడినవి. ఈ పెండ్లి కొడుకు మల్లిదేవ మహారాజు "లట్టలూరు

పురవరాధీశ్వరుడైన యాదవరాజు'. ఈ ప్రాంతీయ యాదవ వంశం (పెండ్లి కొడుకు వంశం) యిప్పటి వరకు ఈ జిల్లాలో మాత్రమే లభించింది. ఈ రెడ్డి, యాదవ పాలనలో సూర్యాపేటలో అనేక ఆలయాలు నిర్మితాలు. వీటిలో త్రికూటాలయాలే అధికం. పిల్లలమర్రిలోని నామేశ్వర త్రికూటాలయంలో శిల్పంతో పాటు చిత్రలేఖనం కూడా కనిపిస్తుంది. వీరి ఆలయ శిల్పంలో రామాయణ భారత పురాణ గాథలతో అద్భుతమైన, అలంకారప్రాయమైన లతలు, పుష్పాలు యిత్యాదులు కనిపిస్తాయి. సూర్యాపేట జిల్లాలో ప్రాంతీయ పాలకులుగా వీరికంటే ముందుగా కళ్యాణీ చాళుక్యుల కింద తెలుగు చోళులు కనిపిస్తారు. వీరి పాలన సూర్యాపేట జిల్లాకన్నా నల్లగొండ జిల్లా ప్రాంతాలలో ఎక్కువ.

1323లో కాకతీయ వంశ పతనానంతరం మన తెలుగు ప్రాంతాలు కొంతకాలం ఢిల్లీ సుల్తానుల పాలనలో వున్నాయి. ఆ తర్వాత ఐదు రాజ్యాలుగా ఏర్పడ్డ బహమనీ సుల్తానులు ఈ ప్రాంత పాలనకై తమలో తాము కలహించు కున్నారు. తెలంగాణ ప్రాంతం నుంచి గోల్కొండ నవాబులు పాలన గావించారు. గుల్బర్గా ప్రాంత పాలకుడైన ఫిరోజ్‌షా బహన్‌షా సూర్యాపేట ప్రాంతాలను ఆక్రమించాడు. ఈతడి కాలంలోనే పిల్లలమర్రి ఆలయం కొంత ధ్వంసమైంది. కాకతీయ పతనానంతరం ఢిల్లీ సుల్తానులను తెలుగు నేల నుంచి పారద్రోలుటకు ఆంధ్ర (తెలుగు) రాజులందరూ ఒకటై కాపయ నాయకుని నేతృత్వంలో ఓరుగల్లు నుంచి ముస్లిం పాలనను పారద్రోలారు. ఆ సమయంలో సూర్యాపేట జిల్లా కూడా కాపయనాయకుని ముసునూరి వంశస్థుల ఆధీనంలోకి పోయింది. కాపయ నాయకుని తరపున ఈ ప్రాంతాన్ని పాలించిన ఎదుపోతు లెంకు శాసనం పిల్లలమర్రిలో లభించింది. బహుమనీ సుల్తానులతో పాటు విజయనగర రాజ్య పాలకులు కూడా ఈ ప్రాంతంపైన ఆధిపత్యాన్ని చలాయించుటకు అనేక యుద్ధాలు చేశారు. దీనిలో భాగమే శ్రీకృష్ణదేవరాయల దండయాత్రలు. శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ. 1519 లో సూర్యాపేట ప్రాంతంపై దాడిచేసి ఉండ్రుగొండ, ఉర్లుగొండ, అరువపల్లి, అనంతగిరి ప్రాంతాలను ఏకధాటి జయించినట్లు కంచి శాసనం చెబుతోంది. ఈ సమయంలో రేచర్ల పద్మనాయకులు సూర్యాపేట జిల్లాని ఆక్రమించుకొని పాలించారు. వీరిలో దాచ, ఎఱదాచాలు ఉండ్రుగొండ నిర్మాణాన్ని పటిష్ఠ పరిచారు. ఉండ్రుగొండ, ఉర్లుగొండ ప్రాంతాలు పద్మనాయకుల ఏలుబడిలో వున్నవే. వీరి తర్వాత సూర్యాపేట జిల్లా గోల్కొండ సుల్తానుల స్వాధీనమైంది. సుల్తాన్ కులీకుతుబ్‌షా శాసనాలు కృష్ణాపురం వద్ద లభించాయి. అవి అముద్రితాలు. కాకతీయుల కాలం నుంచి నిరంతరం జరిగిన యుద్ధాల కారణంగా సైనికుల కోసం అనేక గిరిదుర్గాల నిర్మాణం జరిగింది. వీటిలో అర్వపల్లి, ఉండ్రుగొండ, ఉర్లుగొండ, అనంతగిరి మున్నగునవి దుర్గాలు. గిరి దుర్గాలే గాక సూర్యాపేట జిల్లాలో స్థల దుర్గాలు కూడా వున్నాయి. వాటిలో బూరుగు గడ్డ, పిల్లలమర్రి ముఖ్యమైనవి.

1611లో తూర్పుతీరంలోని మచిలీపట్నంలో పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి, ఇంగ్లీషు వారు వారి వారి స్థావరాలను ఏర్పర్చుకున్నారు. మచిలీపట్నం నుంచి వర్తక వ్యాపారాలకు వెళ్ళేవారు సూర్యాపేట జిల్లా ద్వారానే వెళ్ళేవారు. విదేశీ యాత్రికులు రాసుకున్న రాతలలో కొమరుబండ, మునగాల, ఉండ్రుగొండ, పిల్లలమర్రి, కేతేపల్లి ప్రాంతాల ప్రస్తావనలు కనిపిస్తాయి. లభించిన ఆధారాలలో ఉండ్రుగొండ, నాగులపాడు, పిల్లలమర్రి ప్రస్తావన ఉన్నది కానీ, సూర్యాపేట నగర చరిత్ర మాత్రం లభించడం లేదు. సూర్యాపేట నగర చరిత్ర గత రెండు మూడు వందల సంవత్సరాల కన్నా వెనుకకు పోవడం లేదు. జాగ్రత్తగా పరిశీలిస్తే సూర్యాపేట నగరం అనేక చారిత్రక (వ్యాపార కేంద్రాలు, ముఖ్య పట్టణాలు) నగరాల మధ్య మచిలీపట్నం గోల్కొండ మార్గంలో విదర్భ (మహారాష్ట్ర), కంచి మార్గ మధ్యంలో 17,18 శతాబ్దాలలో వృద్ధి చెందింది. 19,20 శతాబ్దాలలో మిక్కిలి చైతన్యవంతమైన ప్రాంతంగా మారి, అనేక ఉద్యమాలకు కేంద్రంగా మారింది.

నిజాం రాజుల పాలనలో వచ్చిన చైతన్యానికి సూర్యాపేట జిల్లా ముఖ్య స్థానమైంది. ఈ ప్రాంతంలో ఆంధ్రమహా సభ, వర్తక సంఘం, ఆంధ్రజన సభ మున్నగు సంస్థలు అనేక సభలు, సమావేశాలు నిర్వహించి సూర్యాపేట ను కార్యక్షేత్రంగా మార్చారు. 1920 ప్రాంతంలో వెట్టిచాకిరి, లెవీ వసూలు మున్నగు వాటికి వ్యతిరేకంగా, విస్నూరు దొర రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి సూర్యాపేట జిల్లా ప్రబల సాక్షీభూతము. నాటి ఉద్యమ గాథలు - సూర్యాపేట నుంచి జనగాం పోయే మార్గంలో బాలెంల నుంచి తిరుమలగిరి వరకు; సూర్యాపేట నుంచి పాలేరు వరకు ప్రతి గ్రామం, గ్రామంలోని ప్రతీ గడప ఒక కథ చెప్తుంది. కడివెండి సంఘటన, పాలకుర్తి సంఘటన, బాలెంల, రావిపాడు సంఘటణలతో మూలకారకులైన నాటి వామపక్ష నాయకులను (భీమిరెడ్డి మున్నగు వారిని) విచారించినది సూర్యాపేట న్యాయస్థానంలోనే. చర్చలు గైకొన్నది సూర్యాపేట పోలీస్ స్టేషన్‌లోనే. 1942 లో సూర్యాపేటలో వర్తకసంఘం వ్యాపారులంతా ఏకతాటిపై నిలబడి నిజాం నిరంకుశ వసూళ్ళకు వ్యతిరేకంగా తీర్మానాలు చేశారు. తెలుగు రాష్ట్రాలలో వర్తక సంఘాల ఏర్పాటుకు, కార్యాచరణులకు ఒక రకంగా సూర్యాపేట వర్తకసంఘ సమావేశాలే స్ఫూర్తి. 1944 లో రావినారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన సూర్యాపేట ఆంధ్రమహా సభలో నిజాంకు శిస్తులు, అప్పులు చెల్లించవద్దని తీర్మానాలు చేశారు. నాటినుంచి కమ్యూనిస్టులు కూడా కలవడంతో నిజాం వ్యతిరేక ఉద్యమం తీవ్రతరమైంది. ఫలితంగా నిజాం రజాకర్ల సైన్యంతో ప్రజా ఉద్యమాలను అణచివేయడం ఆరంభించాడు. ఫలితంగా బాలెంలలో ఇద్దరు కార్యకర్తలు, 1946 లో పాత సూర్యాపేటలో సరసాని నర్సయ్య అనే కార్యకర్త హత్యకు గురైనాడు. నిజాం సైన్యం, రజాకార్లు, దొరల వ్యక్తిగత సైన్యాలు గ్రామాలపై బడి తిరుగుబాటు దార్లను హతమమార్చి, స్త్రీలను చెరబట్టి, రైతులను దోచుకోనారంభించారు. కమ్యూనిస్టు నాయకులైన బి.యన్., మల్లు, రావినారాయణ రెడ్డి, ఆరుట్ల దంపతులు, బొమ్మగాని ధర్మభిక్షం మున్నగు వారి నేతృత్వంలో 'సంఘం' వారు ప్రజా ఉద్యమాలు తీవ్రతరం చేశారు. **"చుట్టుముట్టు సూర్యాపేట, నట్టనడుమ నల్లగొండ నవ్వుండేదైద్రబాదు, దానిపక్క గోలుగొండ; గోల్కొండ ఖిల్ల కింద నీ గోరి కడతాం కొడుకో నైజాము సర్కరోడా"** అన్న బండి యాదగిరి పాట తెలంగాణ అంతటా మార్మోగింది. నిజానికి ఈ పాట సూర్యాపేట జిల్లాలోని తిరుమలగిరి ప్రాంతపు ప్రతాపరెడ్డిపై రాసినది. సిరిపురం, తుంగతుర్తి, తాడ్వాయి, సోలిపేట, బిక్కుమళ్ళ, పాతర్లపాడు మున్నగు ప్రాంతాలన్నింటా, సూర్యాపేట జిల్లాలోని ప్రతి గ్రామం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నది.

1947 ఆగస్టు 15 న భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా నిజాం నవాబు ఇండియన్ యూనియన్‌లో చేరక స్వతంత్రం ప్రకటించుకున్నాడు. నిజాం ప్రభుత్వాన్ని లొంగ దీసుకోడానికి పటేల్ నేతృత్వంలో భారత సైన్యం అన్ని వైపుల నుంచి చుట్టుముట్టింది. ఒక సైనిక దళం విజయవాడ నుంచి వచ్చిన సైన్యం దురాజ్‌పల్లి వద్ద రజకార్ల నెదుర్కొని ముందుకు సాగింది. భారతీయ సైన్యాన్ని నిలువరించాలని రజాకార్లు టేకుమట్ల వద్ద గల బ్రిడ్జిని కూల్చేశారు. తాత్కాలిక బ్రిడ్జి నిర్మించుకొని హైదరాబాద్‌కి చేరడానికి భారతీయ సైన్యానికి మరొక రోజు ఎక్కువ పట్టింది. 1948 సెప్టెంబరు 16 న హైదరాబాదు చేరాల్సిన సైన్యం సెప్టెంబరు 17 న చేరింది. సెప్టెంబరు 17, 1948 న నిజాం పాలన అంతమై, భారత యూనియన్ పాలన మొదలైంది. నిజాంనవాబు రాజ్ ప్రముఖ్‌గా 1951 వరకు కొనసాగాడు. 1952 తర్వాత పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో అడుగుపెట్టినా, తెలంగాణ ప్రాంతంలో ఆంధ్రావారి ఆధిపత్యానికి వ్యతిరేకంగా 1956 తర్వాత అంటే ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత జరిగిన తెలంగాణ ఉద్యమాలలోనూ సూర్యాపేట తన ముద్రను చూపిస్తూనే వచ్చింది. 1969 లో జై తెలంగాణా ఉద్యమంలో "నాన్ ముల్కి గోబ్యాక్" అంటూ సూర్యాపేట జిల్లాలో

విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆ ఉద్యమంలో సూర్యాపేటలో తెలగాణ ప్రజాసమితి నాయకులు కట్కూరి రామకృష్ణారెడ్డి, దామిడి జగదీశ్వర రెడ్డి, కీసర రామిరెడ్డి, లక్కరాజు పాండు మున్నగువారు ఉద్యమాన్ని ఉధృతం చేశారు. పోలీసుల లాఠీఛార్జీ, కాల్పులతో జిల్లా మార్మోగింది. చివరికి నాయకుల కుతంత్రాలకు, ప్రధాని ఇందిరాగాంధీ చర్యల వల్ల తెలంగాణ ఉద్యమం నీరుగారి పోయింది.

తెలంగాణ మలిదశ ఉద్యమంలో కేసీఆర్ నేతృత్వంలో, ఆచార్య జయశంకర్ గారి నిర్దేశకత్వం, సిద్ధాంత కర్తృత్వంలో సూర్యాపేట జిల్లా కూడా ఉధృతంగా పాలుపంచుకున్నది. కేసీఆర్ నాయకత్వంలో రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, ఉద్యమ స్వచ్ఛంద సంస్థలు ఒక ఐక్య ఉద్యమ కార్యాచరణగా (జేఏసీ)గా ఏర్పడి, ప్రొ.కోదండరామ్‌ను కన్వీనర్‌గా నియమించుకొని ఉద్యమాన్ని నడిపాయి. సకలజనుల సమ్మె, రహదారుల దిగ్బంధం, వంటావార్పు, విద్యావంతుల వేదికలోని మేధావుల ఉద్వేగపూరిత ఉపన్యాసాలు మలిదశ ఉద్యమాన్ని ముందుండి నడిపించాయి. ఈ మలిదశ ఉద్యమంలో సూర్యాపేట జిల్లాలో అత్యంత చురుకైన పాత్ర పోషించిన వారు జగదీశ్వర రెడ్డి. వీరు కేసీఆర్‌తో కలిసి ఎంత ఉత్సాహంగా ఉద్యమంలో పాల్గొన్నారంటే కేసీఆర్ అనేక బహిరంగ సభలలో "జగదీశ్వర్ రెడ్డి నా కుడి భుజము" అని ప్రకటించుకున్నాడు కూడా. సూర్యాపేట జిల్లా గూర్చి మాట్లాడుకునేటప్పుడు తప్పకుండా గుర్తుంచుకోవాల్సిన ఉద్యమం జలసాధన ఉద్యమం. జలసాధన సమితి స్థాపకులైన దుశ్చర్ల సత్యనారాయణ గారిని. ఇలా సూర్యాపేట జిల్లా ఆదిమ మానవుని అక్కున చేర్చుకొని, నాగరికతా పరిణామ క్రమానికి సాక్షీభూతమై అనేక రాజవంశాల పాలనలలో లాలింపబడి, ప్రజాస్వామ్య పోరాటాలలో భాగమై, అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతోంది.

## సంస్కృతి

**ఆచారాలు, సంప్రదాయాలు, పండుగలు :** దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది వంటి పండుగలతో పాటు కోర్లపున్నమి (కుక్కల పండగ), బోనాల వంటి పండుగలు కూడా జరుపుకుంటారు. గత దశాబ్దకాలంగా గురుపూర్ణిమ, శివ కల్యాణం వంటి కార్యక్రమాలు నిర్విఘ్నంగా నిర్వహిస్తు న్నారు. వైశ్యులు సంతోషీమాతను విశేషంగా ఆరాధిస్తారు. ఈ అన్ని కార్యక్రమాల్లో స్త్రీలు కోలాటం ఆడటం గమనార్హం. వర్ధమానుకోట, నాగారం ప్రాంతాల్లో జడ కోలాటం ఆడేవారు ఉండేవారు. ఈ కోలాటంలో తర్ఫీదు నిచ్చేవారు సూర్యాపేట జిల్లాలో ఉన్నారు.

ఇటీవలి కాలంలో చాలామంది యువకులు పేరిణి నృత్యం నేర్చుకుంటున్నారు. ఇది సూర్యాపేట జిల్లాలో మన సంస్కృతీ, సంప్రదాయాలు కళలు కాపాడపడుతున్నా యనడానికి నిదర్శనం.

**కళలు :** వృత్తి కళాకారులలో అంతరించిపోతున్నవారు పంచాణంవారు. ఇళ్ళలో, పర్వదినాలలో ఇతర కార్యక్రమాల్లో వాద్యాలు వాయించే రుంజలు. ఈ రుంజ వాద్యాన్ని వాయిస్తూ పార్వతీకళ్యాణం వంటి కథలు చెప్తారు. దాదాపుగా అంతరించిపోయిన ఈ రుంజ కళాకారుల కుటుంబాలు రెండు సూర్యాపేట జిల్లాలో మోత్కూరులో ఉన్నాయి.

**జాతరలు :** చివ్వెంల మండలంలో యాదవులు ఆరాధించే 'లింగమంతుల స్వామి' దురాజ్‌పల్లి వుంది. రెండేళ్ళ కొకసారి జరిగే ఈ లింగమంతుల జాతర తెలంగాణాలోనే రెండవ అతి పెద్ద జాతర. రేపాల లక్ష్మీ నరసింహస్వామి జాతర. అర్వపల్లి లక్ష్మీనరసింహస్వామి జాతర, జాన్‌పాడ్ దర్గా ఉర్సు ఉత్సవాలు సూర్యాపేట జిల్లాలో జరిగే ప్రముఖ జాతరలు. ఈ జాతరలలో జరిగే సంప్రదాయ నృత్యాలతో పాటు నాటికలు, నాటకాలు, గారడీలు, లత్కోర్‌సాబ్ (పిట్టలదొర) వినోద కార్యక్రమాలు కనిపిస్తాయి.

## సాహిత్య చరిత్ర

సూర్యాపేట జిల్లా సంస్కృత, తెలుగు సాహిత్య రంగాలలోని వివిధ ప్రక్రియలలో చారిత్రక కాలం నుండీ ముందంజలోనే వుంది. శాతవాహన, ఇక్ష్వాకుల కాలంలో

ప్రాకృత భాష వ్యవహారంలో వున్నట్టు శాసనాధారాలతో చెప్పవచ్చు. క్రమంగా ప్రాకృత భాష నుంచి శాసన రచన సంస్కృత భాషలోకి పరిణామం చెందడం ఫణిగిరి వద్ద గత దశాబ్దంలో బయల్పడిన బుళపురుష దత్తుని శాసనం ద్వారా చెప్పవచ్చు. తెలుగునాట పూర్తి సంస్కృత భాషా శాసానాలు ఇక్ష్వాకుల కాలం నుంచే ఆరంభమైనాయి. జిల్లాని పాలించిన అనేకానేక రాజవంశాలు చేసిన ఆలయ తటకాది నిర్మాణ మప్పుడు, పుణ్యకాలములందు చేసిన దాన ధర్మాలను శాసనస్థం చేసేటప్పుడు ప్రాకృత సంస్కృత భాషల అనంతరం తెలుగు భాషను వినియోగించడం మనకు క్రమానుగతికంగా కనిపిస్తుంది. తెలుగు శాసనాలలో వచన రచనే గాక పద్య రచన కూడా కనిపిస్తుంది. ఈ శాసన రచయితలలో కవి పండితులే గాక, వేదాది వివిధ విద్యా నిష్ణాతులున్నారు. 1096 నాటి చిలుకూరు శాసనంలో **'కాలాముఖాన్వయ లకులీశ్వర'** పండితుని ప్రశంస వున్నది. నాగులపాడు వద్ద లభించిన శాసనంలో 1544 నాడు తడికమళ్ళ శ్రీగిరి శాసన రచయితగా, గొప్ప పండితునిగా పేర్కొనబడినాడు.

ఇక తెలుగు కృతులు, కావ్యాలలో శైవ సాహిత్యంలో (సాంప్రదాయ) సూర్యాపేట జిల్లాలోని ప్రాంతాల ప్రస్తావన, వర్ణనలు మనకు కనిపిస్తాయి. **మల్లికార్జున పండితుడు** బసవన్న దర్శనానికి కళ్యాణీ నగరానికి వెళ్తూ మార్గమధ్యంలో నేటి మునగాల మండలంలోని నడిగూడెంలోని సారంగేశ్వర దేవాలయంలో విడిది చేసినట్టు పండితారాధ్య చరిత్రలో చెప్పుకున్నాడు. నడిగూడెం ప్రాచీన నామం "నిదుగుదుముల". దీనినే సోమన **"ముదమున నిదుగుదుములకు నేతెంచి సదమ లాత్ముడు వీరచాకి రాజయ్యపు వ్యక్త భక్తి సారంగేశునంద..."** అని తెలిపాడు. నడిగూడెంలోని సారంగేశ్వరాలయం మధ్య యుగాల నాటిది. జైమినీ భారత కర్త **పిల్లలమఱ్ఱి పినవీర భద్రుడు** సూర్యాపేట జిల్లా పిల్లలమర్రి వాసి. ఇక్కడి నుండే యితడు నెల్లూరు జిల్లా సోమరాజు పల్లెకు వెళ్ళి, అచటినుంచి విజయనగర రాజుల ప్రాపకం పొందినాడు. శృంగార శాకుంతలము కూడా యితడి కృతే. తన జన్మస్థలమైన పిల్లల మఱ్రి గురించి **"మఱ్రి మాత్రమే పిల్లల మఱ్రి గాని పేరు వలె గాదు శారదా పీఠకంబు"** అని చెప్పినాడు. పిల్లలమఱ్ఱి శాసనాలలో 12,13 శతాబ్దంలోనే అక్కడ విద్యాపీఠాలున్నట్లు తెలుపబడింది. హుజూర్‌నగర్ సమీపంలో గల బూరుగుగడ్డ గొప్ప చారిత్రక గ్రామము. ఇచ్చటి వేణుగోపాల స్వామి ఆలయం కాకతీయుల నాటిది. ఈ స్వామిని గూర్చి దేవాలయ స్థానిక విశేషాల గురించి **వాత్స్య శ్రీరంగాచార్యులనే** కవి మూడు ఆశ్వాసాలలో, 'శాల్మలీకంద నంద నందన విలాసము"ను రచించాడు. శాల్మలీ కంద మంటే బూరుగు గడ్డ అని అర్థం. నంద నందనుడంటే శ్రీకృష్ణుడు. ధారాళమైన కవిత గల ఈ గ్రంథం హైదరాబాదులోని ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమందున్నది. 1770 లో పిల్లలమఱ్ఱిలో వున్న **బంగారు రంగప్ప** భేతాళ చరిత్రను చెప్పారు. దీన్ని సంస్కృతంలో అన్న సముద్రము **చిన వెంకయ్య** అనే కవి రాసాడు. రేచర్ల పద్మనాయకులకు ఆద్యుడు, ఆరాధ్యుడైన భేతాళ నాయకుని చరిత్రను, పిల్లలమర్రి దేవాలయ గాథలను దీనిలో వివరించాడు. లక్షణా కళ్యాణమనే ప్రబంధాన్ని రచించిన **ముడుంబ లక్ష్మణాచార్యులు** నేటి సూర్యాపేట జిల్లాలోని బేతవోలు గ్రామము. ఐదాశ్వాసాల ప్రౌఢ రీతిలో సాగే ఈ ప్రబంధము వసుచరిత్రకు ప్రతిబింబం.

రామాయణ భారత భాగవతాలను, పురాణాలను కూడా తెనుగించిన కవులనేకులు సూర్యాపేట జిల్లాల వారున్నారు. వారిలో **చెన్నూరి రామన్న** ఒకడు. ఇతడు శ్రీమద్రామాయణమును తెనుగించి చిలుకూరులోని శ్రీరామచంద్రునికి అంకితము చేసినాడు. 1934లో ఈ ప్రాంతంలో పర్యటించిన **శేషాద్రి రమణ కవులు** చిలుకూరులో ఒకరి వద్ద ఈ గ్రంథాన్ని చూసినట్లు చెప్పుకున్నారు. కానీ, నేడది అలభ్యము. 1860 ప్రాంతంలో హుజూర్‌నగర్‌లో నివాసమున్న **చెన్నూరి శోభనాద్రి** 'శృంగార సుధా సముద్ర పూర్ణ చంద్రోదయ'మన్న ప్రబంధాన్ని రచించాడు. 1860 నాడే **దొంతర మల్లేశం** అనే నాగులపాటి అన్నారం నివాసి అలువాల క్షేత్ర మాహాత్మ్య మనే గ్రంథాన్ని రచించాడు. ఈ అలువాల అనుముల మండలంలో వున్నది. సూర్యాపేట జిల్లాలోని బేతవోలు జమిందారైన తడకమళ్ళ సీతారామ చంద్రరావు గారి

పూర్వీకులలో నొకరైన **వెంకట కృష్ణారావు** బహుభాషావేత్త. లీలావతీ గణితాన్ని తెనుగించడమే కాక, రూపకథ, కంబు కంధర చరిత్ర, తెలుగు వెలుగు, ముగుడ కథ, రామావతార కాల నిర్ణయము, కామందకము, చిత్రకథా వివరణలు అనే గ్రంథాలు రచించారు. 1937 లో పరమపదించిన **గోవర్ధనం వెంకట నరసింహాచార్య** కవి, నేటి కేతేపల్లి మండలంలోని బండపాలెం గుట్టపై వెలసిన శ్రీరామచంద్ర స్వామిని గూర్చి 'సారంగ శైల మాహాత్మ్యము'ను రచించారు. గట్టు సింగారం నివాసులైన **గాదె రామచంద్రరావు** గారు ధారాశుద్ధి ప్రసిద్ధి గాంచిన పద్యాలెన్నింటినో రచించారు. సూర్యాపేట నివాసి **కోదాటి శ్రీనివాసరావు, వెంకట రామారావు, వెంకటేశ్వర రావు గార్లు**, తొగర్రాయి నివాసులైన **లక్ష్మీ నరసింహారావు** గారు మృదు మధురమైన పద్య కవితను రాసి, ప్రచారం చేసిన పద్య కవితామూర్తులు.

సూర్యాపేట సమీపమున వున్న చారిత్రక నగరము పిల్లలమర్రి సాహిత్య రంగంలోనూ ప్రసిద్ధమైందే. ముఖ్యంగా యిక్కడి గవ్వావారి కుటుంబం సాహిత్యకృషిలో పేర్కొన దగింది. **గవ్వా రామరెడ్డి** పద్య కవిత్వం చెప్పేవాడు కానీ, అముద్రితాలు. వీరి సోదరుడు **అమృతరెడ్డి** గారి అమృత గీతాలు ముద్రితాలు. అట్లే అధ్యాపకత్వం నెరిపిన **జానకి రామరెడ్డి గారు** దాసకల్పద్రుమము, సత్పథము, సుధాకరుడు, దైవ చింతన అనే రచనలు గావించారు. అలాగే **మురహరి రెడ్డి గారి** గుంటక పురాణము, హాలికుడు భక్తి తరంగిణి మున్నగు రచనలు గావించారు. వీరి బుర్రకథలు, నాటకాలు కూడా ప్రబల ప్రసిద్ధులు. **ఉమ్మెత్తల వేదాంతరావు గారు** ఉమర్‌ఖయూం గేయాలను అనువదించారు. అట్లే పిల్లలమర్రి చరిత్రను రాసి 1985లో ముద్రించారు. వీరి సోదరులు **ఉమ్మెత్తల కేశవరావు** గారు పద్య రచన చేయలేదు గానీ యితర గ్రంథాలు రచించారు.

హుజూర్‌నగర్, కోదాడ, బేతవోలు, లింగగిరి సమీప గ్రామాలలో ప్రతిభావంతులైన పద్య, కావ్య రచన గావించిన కవులనేకులు ఉన్నారు. వీరిలో గోముఖ వ్యాఘ్రం, శంభు లింగేశ్వర పురాణములను రచించిన **జూనవాతల వెంకట నారాయణశర్మ గారు** (లింగగిరి) ప్రసిద్ధులు. **వారణాసి వెంకట నారాయణ శాస్త్రి గారు** 'శంకర విజయం, శ్రీకృష్ణ లీలలు అనే పద్యకృతులు వెలువరించారు. రామసుధ, గేయ కళానిధి రచనలు చేసిన **వంగవీటి వేంకటేశ్వర్లు**, కాళీయ మర్ధనము' గ్రంథాన్ని రచించిన **శ్రీరామకవచం వేంకటేశ్వర్లు**, కృషికార్తి, శ్రీ దాశరథి కర్త **కొండపల్లి వెంకట శేషగిరిరావు** లాంటివారు సూర్యాపేట జిల్లా వాసులే. శాలిగౌరారం వాస్తవ్యులైన **గురిజాల గోపాలకృష్ణ గారు** సంస్కృతాంధ్ర భాషలలోను, వేద జ్యోతిష విద్యాధరులు. సృష్టితత్వం, ఎరుకల చరిత్ర వీరి కవితా రచనకు నిదర్శనములు. కేతేపల్లి మండలం చెరుకుపల్లి వాస్తవ్యులయిన **పైడిమర్రి దుర్గారావు గారు** అనేక గ్రంథాలను వెలువరించడమే గాక, మంజరీద్విపదలో శ్రీ గిరిజా కళ్యాణమును రచించారు.

**శతక రచనలు**

ఆస్తికులున్న గ్రామంలోనే దేవాలయం వుంటుంది. ఆ దేవళంలోని స్వామి పేర ఒక స్తోత్రమో, శతకమో వెలుస్తుంది. ఆలయం లేని పల్లె వుండవచ్చేమో గానీ, శతకం లేని దేవుడు మాత్రం ఉండడని నానుడి. కనుకనే విష్ణు, శివ శతకాలే గాక, దూషణ భూషణ చమత్కార భావోద్రేకాలైన శతకాలు అనేకం వచ్చాయి. సూర్యాపేట జిల్లా కూడా దీనికి మినహాయింపు గాదు. సూర్యాపేట వాసియైన వేంకట నరసింహా చార్యుల వారి కుమారుడైన **పురుషోత్తమాచార్యుల వారు** 'యాదగిరి లక్ష్మీనారసింహ ప్రభూ అని, "వేంకటేశ్వరా" మకుటాలతో రెండు శతకాలు రచించారు. **వెంకట నరసింహాచార్యుల వారు** శ్రీమత్తిరుమలాపుర భోగ సుందర సీతారామ శతకం, ఉర్లుగొండ లక్ష్మీనృసింహ స్తోత్ర తారావళి అన్న శతకాలు రచించారు. ఈ ఉర్లుగొండ సూర్యాపేట జిల్లాలోనిది. అట్లే **గోవర్ధనం వెంకట నరసింహాచార్యుల వారి** మట్టపల్లీ నృసింహ శతకం"లోని మట్టపల్లి కూడా సూర్యాపేట జిల్లాలోనిదే. అలాగే గోవర్ధనం వెంకట నరసింహాచార్యుల వారి అర్వపల్లీ నృసింహ శతకము కూడా సూర్యాపేట జిల్లాలోని అర్వపల్లి నరసింహ స్వామిపై రచించినదే.

కొమర్రాజు లక్ష్మణరావు గారి జనకులు **కొమర్రాజు వెంకట శివుడు** "రేపాల రాజలింగ" మకుటంగా సీసపద్య శతకాన్ని రచించారు. వీరు సూర్యాపేట జిల్లాలోని రేపాల గ్రామంలో నెలకొని వున్న శివుని గూర్చి ఈ శతకం రాశారు. మేళ్ళ చెరువులోని స్వయంభూ శంకరుని గూర్చి **నూతన వెంకట నారాయణ శాస్త్రిగారు** ప్రబంధ కవితా శైలిలో శంభులింగేశ్వర శతకాన్ని రచించారు. నరసింహాపురం ముడుంబ కృష్ణమాచార్యులు రాధాప్రియ శతకం, నృసింహం, సీతారామ గణపవర కాళీయ మర్దన శతకాలను రచించారు. పిల్లలమర్రికి చెందిన **ఉమ్మెత్తల చక్రయ్య గారు** 'పిల్లలమర్రి కేశవా' మకుటంలో చెప్పిన శతకం బహు విషయ భరితం. వేదాటి రఘుపతి విశ్వ శతకం, మాధవశతి సూర్యాపేట జిల్లా నుంచి వచ్చినవే.

శతకాల వలెనే లఘుకావ్యాలు, స్తోత్ర ప్రపత్తులు, తత్వాలు కూడా సూర్యాపేట జిల్లా నుంచి అనేకం వెలువడ్డాయి. తత్వాలు చెప్పి ప్రచారం చేసిన ప్రముఖులలో తుంగతుర్తికి చెందిన **ఈదన్న** గణనీయుడు. ఈతడి సమాధి చింతపల్లిలో వుండి పూజల నందుకుంటోంది.

**నాటక రంగము**

సూర్యాపేట జిల్లా నాటక రంగానికి నెలవు. ఆంధ్ర, తెలంగాణా మధ్య వారధిగా వున్న సూర్యాపేట చాలాకాలంగా నాటక కళా రంగానికి నిలయం. ఎన్నో నాటక సంస్థలు సూర్యాపేటకు పోటీలకు వచ్చేవి. వాటిలో తిరుమలగిరిలోని స్నేహకళా సమితి, హుజూరునగర్‌లోని శ్రీవాణీ నృత్యగాన కళా నిలయం, తాటిపాముల రెడ్‌స్టార్ యూత్ కల్చరల్ అసోసియేషన్, సూర్యాపేట శారదా నాట్యకళా మండలి, వెలుగుపల్లి క్రాంతి కల్చరల్ అసోసియేషన్, మున్నగు సూర్యాపేట జిల్లాలోని నాటక కళారంగ సంస్థలు నాటికలు, నాటకాలను ప్రదర్శించి మెప్పుపొందినవే. తెలంగాణాలో ఔత్సాహిక నాటక రంగానికి, నటులకు స్ఫూర్తిని కలిగించింది సూర్యాపేట అనడంలో అతిశయోక్తి లేదు. కె.ఎల్.రావు గారి నాటకాలు రాతప్రతులుగానే చాలా ప్రఖ్యాతి పొందాయి. వారి నాటకాలను జనం విరగబడి చూసేవారు. ప్రజా నాట్యమండలి వారు కూడా అనేక నాటకాలను, చిత్ర వేషాలు, బుర్రకథలు ప్రదర్శించారు. శ్రీమతి మల్లుస్వరాజ్యం, నర్రా రాఘవరెడ్డి, తిరునగరి ఆంజనేయులు, సుద్దాల హనుమంతు మున్నగు వారు అనేకులు ప్రజానాట్యమండలి ద్వారా ప్రఖ్యాతులైనారు.

టి.ఎల్. కాంతారావుగా ప్రఖ్యాతులైన తాడేపల్లి లక్ష్మీ కాంతారావు కోదాడ దగ్గరి గుడిబండ గ్రామానికి చెందిన వాడు. 1952 లో తెలుగు చలన చిత్రరంగంలో అడుగుపెట్టి, అంచలంచెలుగా ఎదిగి, జానపద చిత్రాలలో తిరుగులేని నాయకుడిగా, ప్రేక్షకులు ముద్దుగా 'కత్తి కాంతారావు' అని పిలిచే స్థాయికి ఎదిగాడు. నిర్మాతగా మారి, 1969 లో ప్రాంతీయ ఉద్యమాల కాలంలో 'సప్త స్వరాలు' అన్న సినిమా నిర్మించి, ప్రాంతీయ భేదాల ఫలితంగా తిరుగులేని నష్టాల పాలై కష్టాలపాలయ్యాడు. 1964 లో అప్పటి కార్మికమంత్రి సంజీవయ్యగారి ఆధ్వర్యంలో కోదాడలో చరిత్రలో చిర స్మరణీయమైన సన్మాన సభ జరిగింది. ఆ సభలోనే కాంతారావు గారికి 'నట ప్రపూర్ణ" బిరుదును ప్రదానం చేశారు. ఈ జిల్లా నుంచి సినిమా రంగంలో నటుడుగా ప్రఖ్యాతి గాంచిన తొలి తరానికి చెందిన మరో గొప్పనటుడు కేతేపల్లి మండలం తుంగతుర్తి గ్రామానికి చెందిన డాక్టర్ మందడి ప్రభాకర రెడ్డి. మలితరం నటుడు, ప్రముఖ హాస్యనటుడు వేణు మాధవ్.

నాటి హైదరాబాదు విముక్తి పోరాటం సూర్యాపేట ప్రాంతంలో నాటి నాటక రంగానికి, బుర్రకథలు మున్నగు సాంస్కృతిక సాహిత్య కళారూపాలకు ఊపిరులూదింది. 1945లో కె.యల్.యన్.రావు హుజూరునగర్‌లో గ్రామ వెలుగు నాట్యమండలిని స్థాపించారు. ఇది తర్వాత రేపాలకు మార్చబడి 'జనతా కళామండలి' పేరుతో ప్రసిద్ధమైంది. 1946 లో రేపాలకు మార్చబడిన ఈ జనతా కళా మండలి వారు రేపాల నృసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నాటకోత్సవాలు నిర్వహించేవారు. తర్వాత కాలంలో మండలి సూర్యాపేటకు మార్చబడి, అనేక మంది కవులకు, కళాకారులకు, రచయితలకు పుట్టినిల్లయింది. నటుడు,

రచయిత కె.యల్.యన్.రావు, డా.శర్మ, ముడుంబ సీతారామానుజాచార్యులు, ఎస్.యల్.దాస్ వంటి వారు జనతా సంస్థ నుండి వచ్చినవారే. టి.యల్. కాంతారావు లాంటివారు హుజూర్‌నగర్ నుంచి వచ్చిన గ్రామవెలుగు సంస్థ నుంచి వెలుగులోకి వచ్చినవారే. 1950 లో కె.యల్.యన్. రావు రచించి ప్రదర్శించిన 'గెలుపు నీదే' వేయికి పైగా ప్రదర్శనలిచ్చి ఖ్యాతికెక్కింది. చైతన్య పూరితాలైన సాంఘిక నాటకాలతో పాటు 'సీతా కళ్యాణం', 'బలి బంధనం' వంటి పౌరాణిక నాటకాలు కూడా జిల్లాలో అనేక మార్లు ప్రదర్శితాలు. బలిబంధనం రచయిత చందాల కేశవదాసు. వీరిదే మరొక నాటకం 'కనక తార' ఎన్నో ప్రదర్శనలిచ్చింది. ఇప్పటి వరకున్న ఆధారాల ప్రకారం చందాల కేశవదాసే తెలుగు సినిమాల తొలి పాటల రచయిత. మునగాల పరగణాలో కమ్యూనిస్టు పార్టీ వారు ప్రజానాట్య మండలి ద్వారా అనేక నాటక ప్రదర్శనలిచ్చింది. వీరు అరసం వారితో కలిసి ముందడుగు, మాభూమి, వీర కుంకుమ వంటి నాటకాలను ప్రదర్శించేవారు. 1926 లోనే గవ్వా జానకిరెడ్డి గారు దేశబంధు, సత్పథం నాటకాలను వెలువరించి, పిల్లలమఱ్ఱిలోని బేతిరెడ్డి గ్రంథాలయం ద్వారా ప్రదర్శించారు. సూర్యాపేటలో 1956 నుంచి స్థానికంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలలో ప్రముఖ సినీనటులు చిత్తూరు నాగయ్య, కాంతారావు, యన్.టి. రామారావు, అక్కినేని, జమున వంటి నటులు పాల్గొన్నారు. సూర్యాపేట వేదాంత భజన మందిరం ఆధ్వర్యంలో జరిగే పలు ఆధ్యాత్మిక కార్యకలాపాలలో శాస్త్రీయ సంగీత కచ్చేరీలతో పాటు హరికథల వంటి ప్రదర్శనలు జరిగేవి. విజయభాను కళా సమితి, భానుపురి కళాసమితి, జనరంజని వంటి స్వచ్ఛంద సంస్థలు నాటక రంగంతో పాటు అవధాన ప్రక్రియ వంటి సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రస్తుత సుధా బ్యాంకు ఎం.డీ. పెద్దిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో 'మనం' వికాస వేదిక సాహిత్య సాంస్కృతిక రంగాలకు జిల్లాలో వెన్నుదన్నుగా నిలుస్తోంది. డా. శంకర్, మేరెడ్డి మట్టయ్య, దేవరశెట్టి వెంకన్న, పోలాగాంధీ వంటివారు కూడా (భారతీ సాహిత్య సంస్థ) సాహిత్య సాంస్కృతిక రంగాలను ప్రోత్సహిస్తూ అనేక కార్యక్రమాల విజయవంతానికి కృషి చేస్తున్నారు.

**హరికథలు, బుర్రకథలు :**

నాటికలు, నాటకాలకే గాక సూర్యాపేట జిల్లా బుర్ర, హరికథలు మున్నగు కళా రూపాలకు కూడా ప్రసిద్ధి గాంచింది. మునగాల మండలం మాధవరంలోని తులసి వారి కుటుంబ హరికథల రచనలోను, ప్రదర్శనలోనూ పేరు గాంచారు. తులసి లక్ష్మీనరసింహాచార్యుల వారు విప్ర నారాయణ చరిత్ర, తిరుమంగై ఆళ్వారుల చరిత్రలు రచించి, ప్రదర్శించారు. వీరి 'గాంధీజీ చరమ చరిత్ర' హరికథ బాగా పేరు తెచ్చుకున్న రచన, ప్రదర్శన. జాజిరెడ్డి గూడెం నివాసులు, భారీ కాయము, అద్భుత కంఠధ్వని గల సముద్రాల లక్ష్మీనరసింహం గారు అంబరీష, భక్త ధ్రువ హరికథలు ప్రదర్శించేవారు. వీరి వింతపెళ్ళి, పిట్టలదొర హాస్య రంజకంగా వుండి, జనాకర్షకంగా వుండేవి. సూర్యాపేటజిల్లా గుంజలూరు గ్రామానికి చెందిన బుచ్చమదాసు, రేపాల వారైన సిరికొండ వెంకటాచార్యులు, వీరవెల్లి వెంకటాచార్యులు గొప్ప హరికథ కళాకారులే గాక, బహుభాషావేత్తలు, సంగీత సాహిత్య నిధివర్యులు. హుజూర్‌నగర్‌కు చెందిన తిరునగరి రామాంజనేయులు ఉద్యమ కవి, బుర్ర కథలకు ప్రసిద్ధులు. సూర్యాపేట వర్తక సమాజం సమావేశంలో "కష్టజీవి" బుర్ర కథను హరికథగా మార్చి ప్రజల హర్షామోదానికి పాత్రులై నారు. సూర్యాపేట నివాసులైన మరింగంటి నరసింహాచార్యులు గొప్ప పౌరాణికులు. హరికథ, బుర్ర కథారచయితలు. వీరి ఉషా కల్యాణం, సత్యనారాయణ వ్రతం హరికథలు మిక్కిలి ప్రాచుర్యం పొందాయి. శాలి గౌరారం శేషభట్టరు శ్రీనివాసా చార్యులు, కృష్ణమాచార్యులు, సూర్యాపేటలో కె. సుబ్బారావు, భీమారంలో సాతాని కృష్ణయ్య మున్నగు వారెందరో సూర్యాపేట జిల్లాకు చెందిన హరికథా ప్రముఖులు. బుర్రకథా రచయిత లలో గాదె రామచంద్రరావు అద్యులు. 1942 వరకు జీవించిన వీరే తెలంగాణాలో మొదటి బుర్రకథా రచయితగా

చెప్పబడి నారు. వారణాసి వెంకట నారాయణశాస్త్రి, గవ్వా మురహరి రెడ్డి, సూర్యాపేటకు చెందిన డాక్టర్ గుండేపూడి హనుమద్విశ్వనాథ శర్మ వైద్యుడేగాక, కాంగ్రెస్ కార్యకర్తగానే గాక బుర్రకథా రచయితగా కూడా ప్రసిద్ధులు. చెరుకుపల్లి గ్రామస్థులైన పైడిమర్రి దుర్గారావు గారు అల్లూరు సీతారామ రాజు, ఝాన్సీ లక్ష్మీబాయి, సరోజినీ దేవి, కందుకూరు వీరేశలింగం వంటి బుర్రకథలను రచించారు.

**నవలలు, చారిత్రక రచనలు :**

కథలు, నవలలు మున్నగు సాహిత్య ప్రక్రియలకు కూడా ఈ జిల్లా ప్రసిద్ధిగాంచిందే. సూర్యాపేటలో వుంటున్న **వనం సావిత్రీనాథ్** రచయిత్రిగా ప్రసిద్ధులు. స్వాతంత్ర్య పోరాట యోధులు, గ్రంథాలయోద్యమంలో సుప్రసిద్ధులైన **కోదాటి నారాయణరావు** గారు 'చిన్ననాటి జ్ఞాపకాలు' పేర తమ జీవిత చరిత్రను వెలువరించారు. **తటపర్తి వెంకటేశ్వర రావు గారు** 'మునగాల పరగాణా చరిత్ర' ను రచించారు. కోదాటి నారాయణరావు గారిదే ఆంధ్రప్రదేశ్‌లో గాంధీజీ, ఆంధ్రప్రదేశ్‌లో స్వాతంత్రోద్యమ చరిత్ర గ్రంథాలు. నేటికీ యివి ప్రామాణిక గ్రంథాలుగా నిలిచాయి. నేటి తరంలో మునగాలకు చెందిన **కుర్రా జితేంద్రబాబు** చరిత్ర పరిశోధకు లుగా అనేక చారిత్రక పరిశోధన గ్రంథాలు వెలువరించారు.

**పత్రికా రంగంలో సూర్యాపేట**

ఈ రంగంలో కూడా సూర్యాపేట వాసికెక్కింది. స్వతంత్ర్య సమరయోధులు, ఆర్య సమాజ సిద్ధాంత ప్రచారకులు, లింగగిరి నివాసులు మంత్రిప్రెగడ వేంకటేశ్వర రావు గారు తమ సిద్ధాంతాల ప్రచారానికై 'సత్యార్థ ప్రకాశిక' అనే పత్రికను ఆరంభించి కొంత కాలం నడిపారు. కోదాటి నారాయణరావు గారు రేపాల నుండే ప్రగతి, బాలసరస్వతి పత్రికను నడిపారు. తరువాత సూర్యాపేటకు మార్చబడింది. కోదాడ నుండే జగిని ఆదినారాయణ గారు "విశ్వాభ్యుదయ" మనే మాస పత్రికను వెలువరించారు.

కోదాడ నుంచే 'వేదిక' అనే పత్రిక కూడా వచ్చేది. సుప్రసిద్ధ జర్నలిస్టు చెన్నూరి హనుమంతరావు గారి సంపాదకత్వంలో 'విపంచి' పత్రిక హుజూర్‌నగర్ నుంచి వెలువడేది. 1980 లో సూర్యాపేట నుంచి పక్షపత్రికగా వెలువడిన 'తేజోప్రభ' దేవులపల్లి ప్రభాకర రావు గారి సంపాదకత్వంలో ప్రముఖ ప్రాచుర్యం పొందింది. 1989 లో 'తేజోప్రభ' ఉత్తమ పత్రిక అవార్డు పొందింది. సూర్యాపేట నుంచే విశ్వబ్రాహ్మణ సంఘంవారు 'విశ్వ ప్రకాశ్' అనే మాస పత్రికను వెలువరిస్తున్నారు. ఇది సక్రమంగా రాకున్ననూ, తన వునికిని చాటుకుంటూనే వుంది. ఇక్కడి నుంచే వెలువడే మరో పత్రిక నరేందర్‌రెడ్డి గారి సంపాద కత్వంలో వెలువడే "ఉజ్జ్వల".

**సాహిత్య సంస్థలు**

ఇక సూర్యాపేట జిల్లాలో సాహిత్య సంస్థలలో 1920 లో సూర్యాపేటలో బేతిరెడ్డి గ్రంథాలయం ప్రముఖమైంది. దీనిని గవ్వా అమృతరెడ్డి గారు, వారి సోదరులు కృష్ణారెడ్డి, రామారెడ్డి, జానకి రామరెడ్డి, మురహరి రెడ్డిగార్లు స్థాపించారు. 1919, 20లలోనే ఆంధ్ర విజ్ఞాన ప్రకాశినీ గ్రంథాలయం ఏర్పడింది. ప్రభుత్వ అనుమతి లేదన్న కారణంతో 1920లో దీనిని మూసేశారు. తిరిగి మాడపాటి వారి చొరవతో అనుమతి లభించి పునఃప్రారంభమైంది. 1921లో సూర్యా పేటలో గ్రంథాలయ సభలు, దాని కనుబంధంగా ఆంధ్రజన సంఘం సభలు జరిగాయి. 1922 లో సూర్యాపేటలో ప్రారంభించబడిన వర్తక సంఘం ఆధ్వర్యంలో కళా, సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు ఇతోధికంగా జరిగాయి. దీని స్థాపనలో పువ్వాడ వెంకయ్య గారనే అధ్యాపకుని పాత్ర మరువలేనిది. హుజూర్‌నగర్‌లో మంత్రిప్రగడ వెంకటేశ్వర రావు గారు స్థాపించిన వైదిక ధర్మ గ్రంథమండలి ఆర్య సమాజ గ్రంథాలను ముద్రించింది. కందిబండ గ్రామ భూస్వాములు, కరణీకం గల నారపరాజు రాఘవరావు గారు 1925 లోనే సీతారామ గ్రంథాలయాన్ని స్థాపించారు. వట్టికోట ఆళ్వారు స్వామి వీరి యింటిలోనే చిన్నతనంలో చాలా కాలం వుండి, స్ఫూర్తిని పొందారు. కొమరబండ నివాసులు సంస్కృతాంధ్ర పరిడితులు, కవి కోదాటి

రామకృష్ణారావు గారు బాలసరస్వతీ ఆంధ్ర భాషానిలయం పేర సాహిత్య సాంస్కృతిక వేదికను ఏర్పర్చి, గొప్ప సాహితీ సాంస్కృతిక కేంద్రంగా మార్చారు. ఉమ్మెత్తల అప్పారావు గారు వారి సోదరులు గోవిందరాజులు పిల్లలమర్రిలో వివేక వికాసినీ గ్రంథాలయాన్ని స్థాపించారు. కానీ సంఘ విద్రోహుల వల్ల అగ్నికి ఆహుతైంది. భానుపురి కళామండలి, విజయభాను కళా సమితి సాహిత్య కార్యక్రమాలకు వేదికగా నిలిచి, అనేక సంచికలను వెలువరించారు. సామాజిక ఆలోచనా వేదికగా రాఘవ ఆర్ట్స్, రవీంద్ర సాహితీ సమితి, సాహితీ మిత్రమండలి వంటివి జిల్లాలో సాహిత్య కళాపోషణ చేసిన సంస్థలు.

## వివిధ రంగాల ప్రముఖులు

ఇక సూర్యాపేట జిల్లాలో సాహితీ పోషకులలో ముందుగా పేర్కొనదగ్గ వ్యక్తి మునగాల రాజావారైన నడిగూడెం జమీందారైన రాజానాయని వెంకటరంగారావు గారు. వీరి తర్వాత బేతవోలు సంస్థానాధిపతి తడికమళ్ళ సీతారామచంద్ర రావు గారు. కొండగడప జమీందారైన అక్కినేపల్లి జానకీరామారావు గారు.

## దర్శనీయ ప్రదేశాలు - పర్యాటకరంగం

**పర్యాటక ప్రదేశాలు :** జిల్లాలోని మండలాలలోని గ్రామాలన్నీ చారిత్రక ప్రాధాన్యత కల్గి, చారిత్రక నిర్మాణాలయిన బౌద్ధ స్థూప విహారాలు, శైవ వైష్ణవ ఆలయాలు, స్థలగిరి దుర్గాలు, శాసనాలతో వారసత్వ పరిణామ క్రమానికి చిహ్నాలుగా భాసిల్లుతున్నాయి. చిలుకూరు మండల కేంద్రమైన చిలుకూరు కల్యాణీ చాళుక్యుల నాటి ప్రముఖ నగరం. 1067 నాటి శాసనాలు, శైవాలయ శిథిలాలు యిక్కడ గోచరిస్తాయి. చింతలపాలెం మండలం లోని వెల్లటూరు కృష్ణానదీ తీరంలోనిది. ఇక్కడి శివాలయాలు అగ్ని లింగ, వాయులింగ, జలలింగ, రసలింగ యిత్యాది పేర్లతో పిలువబడుతున్న కాకతీయుల నాటి ఆలయాలున్నాయి. హుజూర్‌నగర్ మండలంలోని బూరుగుగడ్డ కల్యాణీ చాళుక్యుల కాలంలోను, కాకతీయుల కాలంలోను అత్యంత ప్రసిద్ధి చెందింది. ఇక్కడ కాకతీయుల నాటి మట్టికోట కనిపిస్తుంది. నడిగూడెంలో కోట ఆధునిక చరిత్ర పాత్ర పోషించింది. నేలమర్రిలో ఆదిమానవుని ఆవాస గుహలున్నాయి.

## ముఖ్య దేవాలయాలు

రుద్రమదేవి కాలంలో నిర్మితమైన ఉభయ పిరాట్ల సహిత వరద గోపీనాథ ఆలయం సమకాలీన శైవ వైష్ణవ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. హుజూర్‌నగర్‌లోని వేణుగోపాల స్వామి ఆలయం కూడా కాకతీయుల నాటిదే. చిలుకూరు మండలంలోని బేతవోలు వేణుగోపాల స్వామి ఆలయం కూడా కాకతీయుల నాటిదే. పెన్‌పాడు మండలం లోని నాగులపాడు కాకతీయుల నాటి త్రికూటాలని, నాటి శిల్ప శైలికి చక్కటి తార్కాణాలు. కాకతీయుల శిల్పవాస్తు ప్రస్తావన వస్తే నాగులపాటి ఆలయాలను తప్పక స్మరించాల్సిందే. నేరేడుచర్ల మండలంలోని సోమారం కూడా కాకతీయులనాటి ఆలయాలకు కేంద్రము. పాలకీడు మండల కేంద్రమైన పాలకీడులో రుద్రమదేవి నాటి స్థల దుర్గ శిథిలాలు కనిపిస్తాయి. అట్లే ఇక్కడ కాకతీయుల నాటి శివాలయాలున్నాయి. మఠంపల్లి మండలంలో మట్టపల్లిలో నారసింహాలయం అత్యంత ప్రసిద్ధి. ఇది కృష్ణానదీ తీరంలో గల పంచ నారసింహ క్షేత్రాలలో ఒకటి. సూర్యాపేట జిల్లాలోకి ఆధునిక కాలంలో క్రైస్తవమతం గుంటూరుజిల్లా నుంచి కృష్ణను దాటుకొని మట్టపల్లి మండలం నుండే ప్రవేశించిందని చెబుతారు. ఈ మట్టపల్లిలో క్రైస్తవం పొందిన రెడ్డి కుటుంబాలు అధికం. అట్లే నేరేడుచర్ల సమీపంలోని జాన్‌పాడు దర్గా ఇస్లాం మతస్థులదైనా అన్ని మతాల వారిచే పూజలందుకుంటుంది. 'జాన్‌పాడ్ సైదులు' పై నమ్మకంతో పెట్టబడిన పేర్లే జానయ్య, జానమ్మ, సైదయ్య, సైదమ్మ మున్నగునవి. సూర్యాపేట జిల్లాలో సర్వమత సామరస్యానికి, సహ జీవనానికి ఇవి ఉదాహరణలు. గరిడేపల్లి మండలంలోని పోనుగోడు కళ్యాణీచాళుక్యుల కాలం నాటి గ్రామము. ఇచ్చటి ప్రాచీన శివాలయంలోను, వ్యవసాయ భూములలోనూ నాటి శిలా


శాసనాలున్నాయి. కోదాడ మండలంలోని తొగర్రాయి, బేతవోలులలో కాకతీయ శాసనాలు, శివాలయాలు గోచరిస్తాయి. అనంతగిరి మండలంలో మండల కేంద్రంలో మధ్యయుగాల నాటి ఆలయాలున్నాయి. అట్లే కొండపై గిరి దుర్గమున్నది. శ్రీకృష్ణదేవరాయలు దీన్ని జయించినట్లుగా శాసనాధారాలున్నాయి. మునగాల, నడిగూడెం ప్రాంతాలు కూడా చారిత్రక ప్రాధాన్యత గల గ్రామాలే. మునగాల మండల కేంద్రంలోను, తాడ్వాయిలోను, కాకతీయుల నాటి అద్భుత ఆలయాలున్నాయి. ఇవి చక్కటి అలంకారప్రాయమైన నందులున్న శివాలయాలు. మధ్యయుగాల నాటి శివాలయం, రామాలయాలున్నాయి. మోతే మండలంలోని సిరికొండలో కూడా కాకతీయుల నాటి శివాలయాలు అద్భుత శిల్పాలతో వున్నాయి. ఇక్కడి గుట్టపై అనేక నాగుల విగ్రహాలున్నాయి. కేతయ నాయకుని శాసనమున్నది ఇక్కడే. శాసనంలో జైన ఆలయ ప్రస్తావన ఉన్నది. మోతే మండలంలోనిదే ఉర్లుగొండ. ఇది కూడా ప్రసిద్ధ నారసింహ క్షేత్రం. కృష్ణదేవరాయలచే జయింపబడింది. బండమీది చందుపట్లలో కూడా మధ్య యుగాల నాటి శివాలయాలు గోచరిస్తాయి.

చివ్వెంల మండలంలోని ఉండ్రుగొండలో వెలమ పద్మనాయకుల నాటి నరసింహాలయం వుంది. అట్లే శత్రు దుర్భేద్యమైన గిరి దుర్గం కూడా వుంది. శ్రీకృష్ణ దేవరాయలు జయించిన తెలంగాణా దుర్గాలలో ఈ ఉండ్రుగొండ, మోతే మండలంలోని ఉర్లుగొండలున్నాయి. ఈ ఉర్లుగొండలో కూడా లక్ష్మీనారసింహాలయం వుంది. సూర్యాపేట మండలంలోని పిల్లలమర్రి కాకతీయుల నాటి రేచర్లరెడ్డి రాజుల ప్రాంతీయ రాజధాని. ఇక్కడ కాకతీయుల శిల్ప శోభాన్వితమైన రెండు త్రికూటాలు – నామేశ్వర కాటేశ్వర, కాచేశ్వరాలయాలు, ఎరుకేశ్వరాలయాలు, పిల్లలమర్రి స్థల దుర్గాలున్నాయి. సూర్యాపేట మండలంలోనిదే ఎర్కారం గొప్ప చారిత్రక ప్రాధాన్యత గల గ్రామం. ఇక ఎరుకసానమ్మ కట్టించిన 'ఎరుక వరము' గ్రామంలో బేతేశ్వరాలయమనే శివాలయం వుంది. ఆత్మకూరు మండలంలో గల పాతర్లపాడు గ్రామంలో 1290 నాటి త్రికూటమున్నది. మునగాల మండలంలోనే గల రేపాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం కూడా ప్రసిద్ధి చెందిందే. లక్ష్మీ నర్సింహస్వామి కళ్యాణోత్సవాలు అద్భుతంగా జరుగుతాయి. అట్లే జాజిరెడ్డి గూడెం మండలం లోని అర్వపల్లిలో లక్ష్మీ నరసింహాలయం ప్రబల మహిమాన్వితమైనదిగా పేరు గాంచింది. జాజిరెడ్డి గూడెంలోని దర్గా కూడా వ్యాధిగ్రస్తులకు, రోగ పీడితులకు స్వాంతన చేకూర్చుతుందని ప్రసిద్ధి. తుంగతుర్తి మండలంలోని జలాల్‌పురం చెరకురెడ్డి రాజుల రాజధాని. ఇక్కడ శివాలయం, శక్తి ఆలయాల సముదాయం వుంది. తిరుమలగిరి మండలంలోని ఫణిగిరి, ఈటూరులు ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రాలు. ఫణిగిరిలో పర్వత పాదాల చెంతనున్న సీతారామచంద్ర స్వామి ఆలయం భద్రాచలం ఆలయం తర్వాత ప్రముఖ బౌద్ధ క్షేత్రం. వరంగల్ జిల్లా సరిహద్దున గల మద్దిరాల మండలంలో ప్రాచీన శివాలయంతో పాటు ఉప్పునూతల వంశీయుల మట్టికోట వుంది.


సూర్యాపేట జిల్లా చారిత్రకంగాను, సాంస్కృతిక, సాహిత్య కళా రంగాలలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని పొందింది; పొందుతూనే వుంది.

# సంగారెడ్డి జిల్లా చిత్రపటం






శ్రీ వీరభద్రస్వామి, శ్రీ భద్రకాళీ అమ్మవారు - బొంతపల్లి



బొంతపల్లి దేవస్థానం




దుర్గాభవాని దేవి, ఇస్మాయిల్‌ఖాన్‌పేట



కాశీ విశ్వేశ్వరాలయం



నందికంది రామలింగేశ్వరాలయం



మఖ్దూం మొయినుద్దీన్

308 (b)

# సంగారెడ్డి

సింగారించిన శోభలన్ వెలుగదే శ్రీనిత్యమై దేవతా
సంగోత్సంగఝురా ప్రసంగములతో చారుత్వతా సిద్ధమై
సంగారెడ్డి సమాహితోన్నత పరిశ్రాంతోప సేవ్యమ్ముగా
రంగారున్ తెలగాణ మాతృశిఖలో రాజిల్లు రత్నంబుగా !

కొత్త జిల్లాల విభజనతో తెలంగాణ రాష్ట్ర పాలనా స్వరూపం మారిపోయింది. ప్రజల వద్దకే పరిపాలన అన్న సూత్రంతో ముఖ్యమంత్రి కేసీఆర్ పది జిల్లాలతో వున్న రాష్ట్రాన్ని పునర్విభజించారు. కొత్తగా 21 జిల్లాలను ఏర్పాటు చేయగా, మొత్తం జిల్లాల సంఖ్య 31 కి చేరింది. ఇందులో భాగంగా తెలంగాణ మ్యాప్‌లో కొత్తగా చేరింది ఈ సంగారెడ్డి జిల్లా. ఇంతకు పూర్వం యిది మెదక్ జిల్లాలో భాగంగా వుండేది. విశేష చారిత్రక నేపథ్యంలో చిరస్మరణీయ సాహితీ వైభవంతో, పారిశ్రామిక రంగంలోనూ ప్రత్యేకతతో అలరారిన సంగారెడ్డికి తెలంగాణలో ప్రత్యేక స్థానముంది.

**ఈ పేరెందుకు ?**

1702లో గౌడిచర్ల అనే గ్రామంలో రాణి శంకరమ్మ జన్మించింది. ఈమె తలిదండ్రులు రాజమ్మ, సంగారెడ్డి దంపతులు. రాణి శంకరమ్మ భర్త శత్రువుల చేతిలో మరణించిన తర్వాత కూడా ఆందోలు రాజ్యాన్ని పాలించింది శంకరమ్మ. ఈమె శక్తి సామర్థ్యాలను పరాక్రమాన్ని మెచ్చుకొని అప్పటి నవాబు చేతుల మీదుగా రాయబాగిన్ బిరుదు పొంది మహారాజ్ఞి అయింది. ఆమె పేరు మీదనే శంకరంపేట, ఆమె తండ్రి పేరిట సంగారెడ్డి, శంకరమ్మ దత్త పుత్రుడు సదాశివరెడ్డి పేరిట సదాశివపేట గ్రామాలుగా ఏర్పడ్డాయి. అవి ఇప్పుడు అవే పేర్లతో పట్టణాలుగా అభివృద్ధి చెందాయి.

**భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి**

ఈ జిల్లా విస్తీర్ణం 4,403 చ.కి.మీ. విస్తీర్ణం కలిగి వుంది. ఈ జిల్లాకు జహీరాబాదు, మెదక్, కామారెడ్డి, కర్నాటక, వికారాబాదు, రంగారెడ్డి, హైదరాబాదు, మేడ్చల్ జిల్లాలు సరిహద్దు జిల్లాలుగా వున్నాయి.

**సహజ వనరులు**

ఈ జిల్లాలో విస్తారంగా ఖనిజ సంపద వుంది. ఇది పలుగు రాళ్ల పరిశ్రమకు ప్రసిద్ధి చెందింది. ఈ పలుగు రాయిని గాజు తయారీలో, సిలికాన్ కార్బైడ్‌లో ఉపయోగిస్తారు. ఇది రాయికోడ్ మండలం హుసేనాబాద్‌లో, సంగారెడ్డి మండలం మల్లేపల్లి, తేర్పోల్, కల్పగూరులో ఎక్కువగా దొరుకుతుంది. జహీరాబాదు మండలం బూచినేపల్లిలో రాయికోడ్ మండలం బీడెకన్నెలో లాటరైట్ ఖనిజ సంపద ఎక్కువగా దొరుకుతుంది.

**నేలలు :** ఈ జిల్లాలో 48 శాతం చెలక నేలలు, 45 శాతం నల్లరేగడి నేలలు, 11 శాతం గ్రామాలలో దుబ్బ నేలలు వున్నాయి. కౌకూర్ ప్రాంతంలో ఎర్ర మట్టి నేలలున్నాయి. ఇక్కడ అల్లం బాగా పండుతుంది.

**అడవులు :** ఈ జిల్లాలో 4.63 శాతం అడవులున్నాయి. బొంతపల్లి, జిన్నారం గ్రామాల మధ్య అడవి బాగానే వుంది. ఈ అడవులలో అనేకమైన చెట్లున్నాయి.

### రెవిన్యూ డివిజన్లు, మండలాలు

సంగారెడ్డి జిల్లాలో మూడు రెవిన్యూ డివిజన్లు వున్నాయి. 1. నారాయణఖేడ్ 2. సంగారెడ్డి 3. జహీరాబాదు. మొత్తం 26 మండలాలున్నాయి.

**నారాయణఖేడ్ రెవిన్యూ డివిజన్‌లో 6 మండలాలు :** 1. కల్హేర్ 2. కంక్టీ 3. మానూరు 4. నాగిలిగిద్ద 5. నారాయణఖేడ్ 6. సిర్గాపూర్

**సంగారెడ్డి రెవెన్యూ డివిజన్‌లో 14 మండలాలు :** 1. అమీన్‌పూర్ 2. ఆందోల్ 3. గుమ్మడిదల 4. హత్నూర్ 5. జిన్నారం 6. కంది 7. కొండాపూర్ 8. మునిపల్లి 9. పటాన్‌చెరు 10. పుల్కల్ 11. రామచంద్రాపురం 12. సదాశివ్‌పేట 13. సంగారెడ్డి 14.వట్‌పల్లి

**జహీరాబాదు రెవెన్యూ డివిజన్‌లో 6 మండలాలు :** 1.ఝరాసంగం 2. కోహీర్ 3. మొగుడంపల్లి 4. న్యాకల్ 5. రాయ్‌కోడ్ 6. జహీరాబాదు

ఈ అడవులు ఆకురాలు అడవిజాతికి చెందినవి. ఈ అడవులలో అందుగు - అడ్డసరము, ఇప్ప - అడ్డాకు - పొన్న - ఏపి - చింత, చిన్నంగి, సిరిమెన, తుమ్మ, టేకు, నల్లమద్ది, తెల్లమద్ది, నేరేడు, బూరుగు, బులుసు, మోదుగ, రేగి, మామిడి, రాగి, మేడి మొదలైన చెట్లున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హరితహారంలో భాగంగా ఈ చెట్లను మరింత పెంచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**నదులు :** సంగారెడ్డి జిల్లాలో మంజీరానది ప్రవహిస్తుంది. ఇది కర్ణాటక రాష్ట్రం నుంచి బీదర్ జిల్లా గుండా నారాయణ ఖేడ్‌లో ప్రవేశించి ఆగ్నేయ దిశగా సాగి, జహీరాబాదు, సంగారెడ్డి, ఆందోల్ సరిహద్దులుగా ప్రవహించి ఉత్తరం వైపు మలుపు తిరిగి మెదక్‌లో ప్రవహిస్తోంది. పసుపులేరుపై నిర్మించిన రిజర్వాయర్ ఫతేనగర్, మహబూబ్‌నగర్ నల్లవాగు ప్రాజెక్టులు కొంత వ్యవసాయానికి తోడ్పడుతున్నాయి. మంజీరా నదిపై నిర్మించిన సింగూరు ప్రాజెక్టు, సంగారెడ్డి రిజర్వాయర్‌లు హైదరాబాదు నగర తాగునీటి అవసరానికి తోడ్పడుతున్నాయి. సింగూరు ప్రాజెక్టు నుంచి అప్పుడప్పుడు నీటిని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వదులు తున్నారు.

**చెరువులు - ప్రాజెక్టులు :** ఈ జిల్లాలో నారాయణఖేడ్ ప్రాంతంలోని నల్లవాగు ప్రాజెక్టు, జహీరాబాదు ప్రాంతంలో పెద్దవాగు మరియు మొగుడంపల్లి ప్రాజెక్టు, నారింజా నదికి వేసిన బ్రిడ్జ్, రెగ్యులేటర్, సంగారెడ్డి ప్రాంతంలో మిలిగిరి ప్రాజెక్టు మరియు రెండు లిఫ్టిరిగేషన్ ప్రాజెక్టులు చెప్పుకోదగ్గవి. పుల్కల్ మండలంలో సింగూరు ప్రాజెక్టు వుంది. సంగారెడ్డి జిల్లా మానూరు మండలంలోని కారముంగి గ్రామం వద్ద మంజీరా నదిపై కారముంగి ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు.

**జనాభా :** జిల్లా మొత్తం జనాభా 15,27,628. ఇందులో పురుషులు 7,77,235, స్త్రీలు 7,50,393 వున్నారు. ఇందులో గ్రామీణ జనాభా 65.31 శాతం కాగా, పట్టణ జనాభా 34.69 శాతంగా వుంది. జన సాంద్రత 347. జనాభా నిష్పత్తి 1000 : 965

**అక్షరాస్యత :** జిల్లాలో అక్షరాస్యత శాతం 64.08%. ఇది రాష్ట్ర అక్షరాస్యత కంటె 2% తక్కువ. పురుషుల అక్షరాస్యతా శాతం 73.02, స్త్రీల అక్షరాస్యత 54.84%.

### సంగారెడ్డి జిల్లా చరిత్ర

1905కు పూర్వం జిల్లాలో మెదక్, రామాయంపేట, కల్పగూరు, టేకుమల్ల, అందోలు తాలూకాలుండేవి. 1905 లో జరిగిన జిల్లాల పునర్నిర్మాణంలో కొన్ని మార్పులు వచ్చాయి. కల్పగూరు (సంగారెడ్డి), భగత్, సిద్ధిపేట, ఆందోలు, మెదక్ తాలూకాలుగా ఆవిర్భవించాయి. 1956లో జరిగిన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణలో నారాయణఖేడ్, జహీరాబాదు తాలూకాలకు సంబంధించి 1949 చ.కి.మీ.ను ఉమ్మడి మెదక్ జిల్లాలో విలీనం చేశారు. అంతేకాకుండా నారాయణఖేడ్ తాలూకాలోని నవరంగావ్‌ను నిజామాబాదు జిల్లాలోని మద్నూర్‌కు బదిలీచేశారు. 1980 లో సదాశివపేట, రామాయంపేట, దుబ్బాక అనే మూడు తాలూకాలు కొత్తగా ఏర్పడ్డాయి.

సంగారెడ్డి జిల్లా శాతవాహనుల ఏలుబడిలో వున్నట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. వీరి కాలంలో వీరి కాలంలో వైదిక, బౌద్ధమతాలతో పాటు జైన మతమున్నట్లు తెలుస్తోంది. కానీ సంగారెడ్డి జిల్లాలో బౌద్ధంకంటే జైనమే ఎక్కువగా ఆదరింపబడింది. ఈ జిల్లాలోని పొట్ల చెరువు, కోలాచలం తవ్వకాల్లో మహావీరుని ప్రతిమలు బయట పడ్డాయి. ఈ విగ్రహం పొడవు 8 అడుగులు. అదేవిధంగా జోగిపేటలో పెద్ద జైనాలయం వున్నట్లు చరిత్ర చెబుతోంది.

ప్రాచీనాంధ్ర రాజ్యాల్లో రాష్ట్రకూటుల పాలనలో వుంది. వీరు మొదట బాదామీచాళుక్య రాజుల సామంతులుగా వున్నారు. మెదక్ జిల్లాలో సంగారెడ్డిలో ఈ రాజులు వేయించిన శాసనాలు లభించాయి. వీరు దాదాపు యావత్ తెలంగాణా ప్రాంతాన్ని దాదాపు 200 సంవత్సరాలు పాలించారు.

మెదక్ జిల్లా భూభాగం రాష్ట్రకూట వంశ పాలనా అనంతరం కల్యాణీ చాళుక్యుల పాలన కిందికి చేరింది. కల్యాణీ చాళుక్యులు రాయలసీమతో పాటు తెలంగాణా ప్రాంతాల్లోని సంగారెడ్డి, మెదక్, నిజామాబాదు లాంటి ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకొని కర్నాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కళింగాది ప్రాంతాలలో వీరి పాలన సాగినట్లు చారిత్రక ఆధారాలున్నాయి.

ఉమ్మడి మెదక్ లోని సంగారెడ్డి, మెదక్ వంటి జిల్లాలను కూడా కాకతీయులు పాలించారు. ఈ కాకతీయ సామ్రాజ్యమ నంతరం పది, పదిహేను సంవత్సరాలు మాత్రం ఢిల్లీ సుల్తానుల ఏలుబడిలో అల్లకల్లోలమై నాయకత్వం సరిగాలేక, దోపిడీ దొంగల స్వైరవిహారం సాగింది. వీరి తర్వాత పద్మనాయకులు పాలించారు. వీరి రాజ్య అంతర్భాగంలో సంగారెడ్డి, మెదక్‌లు కూడా వున్నాయి. వీరు పరిపాలించినట్లు శాసనాధారాలున్నాయి.

పద్మనాయకుల తర్వాత రెడ్డిరాజుల పాలన ప్రారంభ మైంది. పద్మనాయకుల, ముసునూరి, కాకతీయులలో ఒకరి వద్ద రాజోద్యోగం చేసిన రామనీడు బహమనీ సుల్తానుల సహాయంతో వారి అధీనంలో ఉన్న కల్పగూరు ప్రాంతాన్ని పొంది, పద్మ నాయకుల రాజ్యం అంతం చేసాడు. రామినేడు

**మున్సిపాలిటీ :** సంగారెడ్డి, జహీరాబాదు, నారాయణఖేడ్

**రెవిన్యూ గ్రామాలు :** 601

**గ్రామపంచాయతీలు :** 475

**పోలీస్ హెడ్‌క్వార్టర్ :** సంగారెడ్డి

**పార్లమెంటు నియోజకవర్గం :** జహీరాబాద్

**అసెంబ్లీ నియోజకవర్గం :** సంగారెడ్డి, పటాన్‌చెరు, ఆందోల్, జహీరాబాదలు, నారాయణఖేడ్

**పట్టణాలు :** సంగారెడ్డి, పటాన్‌చెరు, ఆందోల్, జహీరాబాదు, నారాయణఖేడ్

బహమనీ సుల్తానైన ఫిరోజ్‌షా నుంచి కల్పగూరు పరిగణా లను పొందాడు. పరగణా మొత్తం బీడు భూములుగా వుండేది. అంతేకాకుండా వ్యవసాయానికి అనుకూలమైన భూములు వుండేవి కావు. అందుకు గాను వ్యవసాయం చేయడానికి అనువైన తటాకాలను నిర్మించడమే తన ప్రథమ కర్తవ్యంగా భావించాడు. రామినేడు ఆ ప్రాంతమంతా చూసి వ్యవసాయోగ్యమునకు అనువైన ప్రదేశమని తలచి, హరిజనులను చేరదీసి వారి సహాయంతో అక్కడ ఓ గ్రామాన్ని, విశాలమైన తటాకాన్ని నెలకొల్పాడు. లందల అనే పేరు వుండగా తర్వాత అందలగా మారి, ఈ అందలనే అందవోలుగా మారి, చివరకు ఆందోలుగా స్థిరపడింది. రామినీడు తమ్ముడైన మాచినేని చేయూతతో ఆందోలు, పెదతాటిపల్లి, అనంతసాగరాలను కలిపి పెద్ద తటాకాలను నిర్మించాడు. పెద్ద కుమారుడైన ముసలారెడ్డికి కల్పగూరు వస్తే, ఆందోలు గ్రామాధిపత్యం చిన్నకుమారుడైన పోతిరెడ్డికి వచ్చింది.

ఆసఫ్జాహీ వంశం క్రీ.శ. 1854 లో మీర్ మహబూబ్ ఆసఫ్జాహీ బహదూర్ పరిపాలనా కాలంలో నిజాం రాజ్యం ఐదు సుబాలుగా విభజింపబడింది. ప్రతి సుబాకు ఒక సుబేదారు వుండేవాడు. ఈ ఐదు సుబాల కింద 17 జిల్లాలుండేవి. ప్రతీ జిల్లాకు ఒక తాలూకాదారు పరిపాలనా అధికారి వుండేవాడు. ఆనాడు మెదక్ ఒక సుబాగా వుండేది. ఈ సుబాలో సంగారెడ్డి ప్రాంతం కూడా వుంది.

**ఆచారాలు, సంప్రదాయాలు, పండుగలు**

వేదాల నుంచి, పురాణేతిహాసాల నుంచి, వివిధ మత గ్రంథాల నుంచి సంక్రమించిన అనేక జీవన విధానాలను ఈ జిల్లా ప్రజలు ఆచరించి, నైతిక ప్రవర్తనతో భాసిల్లు తున్నారు. సంప్రదాయంలో భాగమైన వివిధ పండుగలను, నోములను, వ్రతాలను, ఆచారాలను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకొని ఆధ్యాత్మిక జీవనంలో ముందుకు సాగుతున్నారు. వివిధ పండుగల ద్వారా కలిసి మెలిసి జీవించే తత్త్వాన్ని పెంపొందించుకుంటూ సమతా సమరసతలను, భక్తిని, ధార్మికతను చాటు కుంటున్నారు. పూలనే అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించే బతుకమ్మ పండుగ ద్వారా మహిళా శక్తిని చాటుతున్నారు. దసరా, దీపావళి, ముక్కోటి ఏకాదశి, సంక్రాంతి, మహాశివరాత్రి, ఉగాది, తొలి ఏకాదశి, వినాయక నవరాత్రులు, రాఖీపౌర్ణమిలతో పాటు, రంజాన్, బక్రీద్, క్రిస్మస్ లాంటి పండుగలు జరుపుకుంటారు.

**జాతరలు**

కేతకీ సంగమేశ్వరాలయంలో ప్రతి సంవత్సరం శివరాత్రి సందర్భంగా ఉత్సవాలు జరుగుతాయి. దీనికి 2 నుంచి 3 లక్షల మంది భక్తులు వస్తుంటారు. ఈ సందర్భంగా కుంకుమ సేవ, పల్లకీసేవ, అగ్నిగుండం, రథోత్సవాలు, కల్యాణాలు జరుగుతాయి.

శ్రీశ్రీశ్రీ రాచన్నస్వామి దేవాలయం బడంపేట్‌లోని అటవీ సమీపంలో ఈ స్వామి వెలిశాడు. ఫాల్గుణ శుద్ధ షష్ఠి రోజున మాత్రం జాతర సందర్భంగా అగ్నిగుండం ఉంటుంది. ఆరోజు వేలాది మంది భక్తులు కోనేటిలో స్నానం చేస్తారు. అన్నదానం నిర్వహిస్తారు.

**సాహిత్యం**

ప్రపంచ వాఙ్మయానికి తొలి కథను అందించింది సంగారెడ్డి జిల్లాలోని కొండాపురమే. ఇక్కడి **గుణాఢ్యుడు** అందించిన బృహత్కథ ప్రపంచ భాషలన్నింటిలోకి అనువాదం చేయబడింది. అచ్చ తెనుగులో కావ్యాన్ని రచించిన **పొన్నగంటి తెలగన** నాటి పొట్లం చెరువు (పఠాన్ చెరువు) ప్రాంతీయుడు. తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంతరించుకున్న పొన్నగంటి తెలగన సంగారెడ్డి జిల్లావాడే కావడం జిల్లాకు గర్వకారణం.

**గుణాఢ్యుడు :** వీరు కొండాపూర్ ప్రాంతంలో జన్మించారు. వీరు శాతవాహనుల కాలానికి చెందినవారు. గాథాసప్తశతి అనే గ్రంథాన్ని రచించిన హాలుడు రాజకవి. ఇతని ఆస్థానకవి గుణాఢ్యుడు. వీరు బృహత్కథా అనే గ్రంథాన్ని రచించాడు. ఇది ప్రపంచ కథలన్నింటికీ మూలంగా చెప్పవచ్చు.

**ముళ్ళపూడి సచ్చిదానందమూర్తి :** వీరు సంగారెడ్డిలో చాలా కాలం తెలుగు ఆచార్యులుగా పనిచేశారు. తెలుగుబిడ్డ, వెండికొండ పావురాలు, వీరభద్ర మాహాత్మ్యం, యాదగిరి పారిజాతం, మహాభియానం (కవితా సంపుటి), పనిమనిషి మున్నగునవి వీరి రచనలు. వీరు రచించిన వెండికొండ పావురాల గురించి దాశరథిగారు సాధారణ కవి కులానికి లొంగని మధ్యాక్కఱలను లొంగదీసుకున్నారని వీరిని ప్రశంసించారు.

**ప్యారక శేషాచార్యులు :** సాహితీ ప్రక్రియలన్నింటినీ చవిచూసిన కవి వీరు. తన చిన్నతనంలో 8 వ తరగతి నుంచి పద్యాన్ని నేర్పుగా చెప్పి, సాహిత్య పఠనంలో వీరు పద్యానికొక ప్రత్యేకతను ఏర్పర్చారు. వీరు మాతృశ్రీ (ఖండ కావ్యం), ఏకలవ్య (నాటకం), సమాజం, ఏకాంకిత, గురూపదేశం, కాకతాళీయం, ప్రపత్తి నిర్వేదం అనే కావ్యాలు రచించారు.

**రంగకృష్ణమాచార్యులు :** వీరికి సంస్కృతం, ఉర్దూ, ఇంగ్లీషు, తెలుగులలో ప్రవేశం వుంది. మెదక్ జిల్లా రచయితల సంఘాన్ని స్థాపించి సుమారు 20 సంవత్సరాల పాటు సాహిత్య సేవ చేశారు. ఆచార్యులు రచించిన అనేక గ్రంథాలున్నాయి. గురుభక్తి, జోగినాథ పద్యకృతి, రంగనాథ స్తవం (దండంక), దేశం కోసం సందేశం (నాటకం), నవజీవనం (నాటిక), లాల్ బహదూరీయం, నాకవనం (కవితా సంపుటి), వీరభద్రీయం (పద్యకావ్యం),

వేంకటాచలం (గేయకావ్యం), గేయగీత సంకలనం, శ్రీరామ సుప్రభాతం మొదలైన గ్రంథాలు రచించి, ముద్రించారు.

**వితాల రాజమౌళి శాస్త్రి** : వీరు చంద్రమౌళి శాస్త్రి గారి సోదరులు. వీరు సంగారెడ్డి వాస్తవ్యులు. సంస్కృతాంధ్రంలో చక్కని పాండిత్యం కలవారు. వీరు భావానంద రామాయణము 23 భాగాలు, తందనాన భారతము, శ్రీ పాండురంగ సేవ, పాండురంగ స్వామి మేలు కొలుపులతో పాటు అనేక చాటు పద్యాలు రచించారు. వీరు హరికథను సాధనంగా చేసుకొని భావానంద రామాయణాన్ని స్వయంగా రచించి, ఇతర రాష్ట్రాల్లో కూడా ప్రచారం చేసారు.

**చిదిరె లక్ష్మణశాస్త్రి** : చిదిరె గృహనామంగా ఉన్న వీరు సంస్కృతాంధ్ర ఉర్దూ భాషలలో చక్కని పాండిత్యం గలవారు. వీరు సలక్షణ ధారాశుద్ధి గల రసమయ కవితా రసజ్ఞులు. సరస సాహితీ మండనులు. చారిత్రక పరిశోధకులు కూడా. వీరి 'మెదకు రాజుల చరిత్ర' జిల్లా చారిత్రక పరిశోధకులకు కరదీపిక వంటిది. వీరు వ్రత పరీక్ష, శ్రీనివాస చరితము, స్వయంవర నాటకము మొదలైనవి రచించారు. వీరు రచించిన వ్రత పరీక్ష ఐదాశ్వాసముల కావ్యం.

**మల్యాల దేవీప్రసాద్** : ఆంధ్ర ప్రాంతంలో పుట్టినా కూడా తెలంగాణలోని మెదక్ జిల్లాను తనదిగా భావించి, జీవించిన గొప్ప మనిషి. వీరు సంగారెడ్డిలో నివసించారు. ఎంతో శ్రమకోర్చి మెదక్ జిల్లా కవుల చరిత్రను మెదక్ జిల్లా రచయితల సంఘం పక్షాన వెలువరించారు.

**చిదిరె రాజేశ్వర్రావు** : వీరి జన్మస్థలం అందోలు. వీరు సంస్కృతాంధ్రంలో, ఉర్దూ, ఇంగ్లీషులో బి.ఏ. పట్టా పొందినారు. వీరు రాసిన ఖండ కావ్యాలు అనేకాలు. దేశబంధు తెలుగు పత్రికకు విలేఖరులుగా వుండిరి.

**ఐచ్చు వేంకటేశ్వర గుప్త** : వేంకటేశ్వర గుప్త గారు సదాశివపేటలో సంపన్న వైశ్య కుటుంబంలో జన్మించారు. వీరు సంస్కృతాంధ్ర ఉర్దూ భాషలలో పాండిత్యం, ఆంగ్లం, ఉర్దూ, హిందీ భాషలలో చక్కని ప్రవేశం వున్నవారు. ఒకచేత్తో వ్యాపారము, మరోచేత్తో సాహిత్య రచనలు చేస్తున్నారు. వీరు జీర్ణోద్ధారము, అమృత బిందువులు అనే గ్రంథాలు రచించారు. జీర్ణోద్ధరణములో నిజాం ప్రభుత్వమున హిందువుల ప్రాథమిక హక్కులకు భంగపాట్లు, తన తండ్రి తురకలను, తురక ప్రభుత్వాన్ని ఎదిరించిన విధానాన్ని చక్కగా వర్ణించారు.

**పెండ్యాల హనుమచ్ఛర్మ** : వీరు అందోలు నివాసులు. చక్కని కవిత్వం చెప్పగల నేర్పరి. వీరి రచనల దేశబంధు, నీలగిరి పత్రికలలో ప్రచురించారు. గోలకొండ కవుల సంచికలో వీరు రచించిన 'హృదయ నిర్వేదము'లో గీత మాలిక గైకొనబడింది.

**మఠం సిద్ధివీరయ్య** : వీరు అందోలు మండలంలోని ఢాకూరు గ్రామంలో జన్మించారు. వీరు జోగిపేటలోని జోగినాథ గ్రంథాలయానికి కార్యదర్శిగా వుండి అల్లాదుర్గం వేంకట రాయ గ్రంథాలయ స్థాపనలో కృషిచేశారు. ఉర్దూ నుంచి తెలుగులోకి అనువదించిన కొన్ని కథలు గోలకొండ పత్రికలో అచ్చయ్యాయి. అంతేకాకుండా మరాఠీ నుంచి వ్యాఘ్రబలి, పుష్పసేన విజయాలను అనువదించారు. నిరపరాధి అనే నవలను రాశారు. కొమిశెట్టిపల్లి తిమ్మయ్య గారు రాసిన కేతకీ సంగమేశ్వర గ్రంథ ప్రచురణకు సంపాదకత్వం వహించారు.

**పడిగ శివయ్య గారి నారాయణ** : వీరు సదాశివపేట వాస్తవ్యులు. 1919 లో జన్మించారు. శ్రీరామ నక్షత్రమాల, శ్రీసాయిబాబా పంచవింశతి, తత్త్వభజనలను రాసి ముద్రించారు. లక్ష్మీ సరస్వతీ సంవాదము, రుక్మాబాయి నాటకాలను రాశారు. కానీ అవి అముద్రితాలు. అంతే కాకుండా కుమారస్వామి విజయము, రుక్మిణీ కల్యాణము, సభా పర్వము నుంచి పాండవుల విజయం వరకు 8 రాత్రుల యక్షగానము, పాండవ అశ్వమేధయాగము, శ్రీకృష్ణ లీలలు లాంటి యక్షగానాలను రచించారు.

**చక్రవర్తి కూరత్తాళ్వాచార్యులు** : వీరు సంగారెడ్డి మండలం చేర్యాల గ్రామవాసి. వీరి రచనలు అధికం భక్తిపూర్వకమైనవే. వీరు అనేక కీర్తనలను రచించారు. వీరిని ఒకరకంగా వాగ్గేయకారులని కూడా అనవచ్చు. శ్రీకృష్ణ లీలలు

(నాటకము), ద్రౌపదీ స్వయంవరం (యక్షగానం), కీచకవధ, ఉత్తర వివాహము (నాటికలు) లతో పాటు అనేక భక్తి గేయాలను రచించారు. వీరి రచనలన్నీ ముద్రితమైనాయి. వీరి పద్యాలు గోలకొండ కవుల సంచికలో అచ్చయ్యాయి.

**మురహరి శర్మ** : వీరు సంగారెడ్డి జిల్లా జోగిపేటకు చెందినవారు. పండిత రాజవీర దేవర – వీరశైవ కావ్యాలు రాశారు. కన్నడం నుంచి సిద్ధాంత శిఖామణిని అనువాదం చేశారు.

**బచ్చు రామన్నకవి** : సదాశివ పేటకు చెందిన వీరు నవనాథ చరిత్ర (పురాణం) రాశారు.

**గంటకట్ల వెంకట భుజంగకవి** : వీరు అందోల్ వాస్తవ్యులు. అభినవ శాకుంతలం అనే కావ్యాన్ని రాశారు.

**కె.వి. సుందరాచార్యులు** : వీరు గుమ్మడిదల ప్రాంతానికి చెందినవారు. వీరు అచ్చ తెలుగు కావ్యాలను రచించారు.

**చెర్విరాల బాగయ్య** : వీరు యక్షగాన పితామహులు. వీరు సికింద్రాబాద్ వాస్తవ్యులైనా, గుమ్మడిదలలో చాలా ఏళ్ళు వున్నారు.

**మగ్దూం మొహియుద్దీన్** : సంగారెడ్డి జిల్లా ఆందోల్‌లో జననం. వీరు సామ్రాజ్యవాదానికి, దారిద్ర్యానికి, కిరాతక తత్వానికి, నైతిక పతనానికి వ్యతిరేకంగా సామాజిక ప్రయోజనాల కోసం అనేక గేయాలు రాశారు. కాలం చెల్లిన పెట్టుబడిదారీ కళ, అతీష్‌కదా (అగ్నిగుండం), తెలంగాణా, అంధేరా, ఇంతేజార్ లాంటి గేయాల మాలలను అల్లినాడు. ఈయన 1938 లో కామ్రేడ్స్ అసోసియేషన్‌ను స్థాపించి యువకులలో రాజకీయ పరిజ్ఞానాన్ని కలిగించాడు. గవర్నమెంటు సిటీ కాలేజీ లెక్చరర్ పదవికి రాజీనామా యిచ్చి కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. మొదటి సాధారణ ఎన్నికలలో హైదరాబాదులో పోటీచేసి ఓడిపోయాడు. తర్వాత హుజూర్‌నగర్ శాసన సభా స్థానానికి ఉప ఎన్నిక జరిగితే అందులో గెలిచాడు. 1957 లో 'చాంద్‌తార్‌కాబన్' (తారా చంద్రుల కారడవి) అనే అద్భుత గేయాన్ని రాశారు. ఇందులో భారత స్వతంత్ర్య సంగ్రామంలోని వివిధ దశలున్నాయి. దీనితోపాటు 'రాత్ కే బరాహ్ బజే' అనే రచనలు చేశారు.

వీరితో పాటు కె. పిచ్చయ్య చౌదరి అష్టావధాని. అనేక కవిత్వాలు రాశారు. కానీ అవి అముద్రితాలు. తలారి దాకన్న. డిగ్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్న వీరు నాల్‌చెరు అనే పత్రికకు సంపాదకులు. వి.లచ్చయ్య. వీరు వివిధ కవిత్వాలను పత్రికల్లో ప్రచురిస్తున్నారు. జి. శ్రీనివాస్. డిగ్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. కవిత్వాలను రచించారు. శివకుమార్. వీరు డిగ్రీ లెక్చరర్. కవిత్వాలను రచించారు. అశోక్ కుమార్, సతీష్, వీరు తెలుగు పండితులు. వీరి కవిత్వాలు దినపత్రికల్లో వస్తాయి. భానుప్రకాష్. వీరు జాతీయ సాహిత్య పరిషత్తుకు కార్యదర్శిగా వున్నారు. అష్టావధానాల్లో జిల్లా నుంచి చురుగ్గా పాల్గొంటున్నారు.

**సాహితీ సంస్థలు**

పూర్వ మెదక్ జిల్లాలో సిద్దిపేట సాహిత్యానికి పుట్టినిల్లుగా పేరు గాంచినా ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాలో సాహిత్య సేవ వివిధ సంస్థల ద్వారా చిగురు తొడిగింది. ప్రధాన సాహితీ సంస్థలు స్థాలీపులాక న్యాయంగా పరిశీలిద్దాం.

**మెతుకు సీమ సాహితీ సాంస్కృతిక సంస్థ** : జాతీయ భావ ప్రచారం కోసం, ఇక్కడి కవులను ప్రోత్సహించడం కోసం సాహితీ సాంస్కృతిక అంశాలకు వెన్నుదన్నుగా నిలువడానికి పూసల లింగాగౌడ్ అధ్యక్షులుగా, అవుసుల భానుప్రకాశ్ వ్యవస్థాపక అధ్యక్షునిగా 2012 లో ఈ సంస్థ పురుడు పోసుకుంది. కవి సమ్మేళనాలు, అష్టావధానాలు, ప్రత్యేక దినోత్సవాలు, పుస్తకావిష్కరణలు తదితర కార్యక్రమాలతో మెతుకుసీమ సంస్థ ఇతోధిక సేవలందిస్తోంది. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, బోర్పట్ల హన్మంతాచార్యులు, తల్లోజు యావాచార్యుల మార్గదర్శకత్వంలో పనిచేస్తోంది.

**సాహిత్య రంజని** : 'విశ్వశ్రేయః కావ్యమ్' అనే నినాదంతో ముళ్ళపూడి సచ్చిదానంద మూర్తి గారి హృదయ భావాల్లోంచి ఆవిర్భవించింది సాహిత్య రంజని. ఉగాది కవి సమ్మేళనాలు, వివిధ సాహిత్య ప్రక్రియలతో సాహిత్య రంజని

కృషి చేస్తుంది. ప్రస్తుతం ఈ సంస్థ అధ్యక్షులుగా పెంటారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బాబూరావు గార్లు కొనసాగుతున్నారు.

**మెదక్ జిల్లా రచయితల సంఘం :** రంగకృష్ణమాచార్యులు, వేముగంటి నరసింహాచార్యుల సాహితీ సేవలకు తార్కాణం ఈ సంస్థ. వందకు పైగా పుస్తకాలు ముద్రించి సాహిత్య, ఆధ్యాత్మిక, సాంస్కృతిక సేవలందిస్తోందీ సంస్థ.

**రసగీతి :** మహిపాల్‌రెడ్డి గారి సారథ్యంలో 1955 లో ఈ సంస్థ ఏర్పాటైంది. రెండు దశాబ్దాలుగా కవి సమ్మేళనాలు, అష్టావధానాలు నిర్వహిస్తూ అజ్ఞాత కవులను సాహితీ లోకానికి పరిచయం చేసింది ఈ సంస్థ.

**సాహితీ మిత్రమండలి :** నారాయణఖేడ్ ప్రాంత యువకవులు ఏర్పర్చిన సంస్థ. సాహిత్య కార్యక్రమాల నిర్వహణ కోసం తపిస్తూ, తెలుగు భాషపై మమకారాన్ని చాటుకుంటుంది. భూమయ్య, రాజయ్య, చంద్రశేఖర్ తదితర వర్ధమాన కవులు తోటి కవులకు ప్రేరణగా నిలుస్తూ తమ వంతు బాధ్యత నిర్వర్తిస్తున్నారు.

**జాతీయ సాహిత్య పరిషత్తు :** జహీరాబాదు కేంద్రంగా నడుస్తున్న సాహిత్య సాంస్కృతిక సంస్థ యిది. సాయిరెడ్డి విఠల్‌రెడ్డి, కృష్ణారెడ్డి వంటి అగ్రశ్రేణి సాహిత్య పోషకులు చూపుతున్న మార్గంలో మారుతి, చంద్రకాంత్, విశ్వనాథ్ ఇతర యువ కవుల కార్యా చరణలతో ఇది జాతీయ భావ వీచికలను అందిస్తోంది. సాహిత్య, సాంస్కృతిక, ధార్మిక కార్యక్రమాలతో ప్రేరణగా నిలుస్తోంది.

**వివిధ రంగాల ప్రముఖులు**

**బీబీపాటిల్ :** వీరు ప్రస్తుతం జహీరాబాద్ ఎం.పిగా ఉన్నారు. ప్రముఖ సామాజిక వేత్త, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. **శ్రీమతి గీతారెడ్డి :** జహీరాబాద్ ఎం.ఎల్.ఏగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో 5సార్లు మంత్రిగా ఉన్నారు. **చింత ప్రభాకర్ :** గతంలో మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన వీరు ప్రస్తుతం సంగారెడ్డి ఎం.ఎల్.ఏగా ఉన్నారు. **జగ్గారెడ్డి :** వీరు గతంలో సంగారెడ్డి నుండి కాంగ్రెస్ పార్టీ నుండి ఎం.ఎల్.గా పనిచేశారు. ప్రస్తుతం బి.జె.పి. పార్టీ నాయకుడుగా ఉన్నారు. **శ్రీ సూడె గోపాలరెడ్డి :** జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామవాసి. వీరు భూదానోద్యమంలో 18 ఎకరాల భూమిని దానం చేసారు. **వెల్దుర్తి మాణిక్యరావు :** వీరు కవి, పాత్రికేయులు, స్వాతంత్ర సమర యోధులు. భూదానోద్యమంలో పాల్గొన్నారు. **ఎస్. ఆర్. నర్సింహా :** తెలంగాణ ఉద్యమకాలంలో అనేక పాటలు రాసారు. ప్రస్తుతం సినిమాలకు కూడా పాటలు రాస్తున్నారు. **దామోదర్ రాజ నర్సింహా :** సంగారెడ్డి జిల్లాకు చెందిన వీరు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు. **బాబూమోహన్ :** వీరు ఆందోల్ నియోజకవర్గ ఎంఎల్.ఏ.గా ఉన్నారు.

**దర్శనీయ ప్రదేశాలు – పర్యాటక రంగం**

**మంజీరా అభయారణ్యం :** సంగారెడ్డికి 5 కి.మీ. దూరంలో మంజీరా, సింగూరు బ్యారేజీల మధ్య రెండువేల హెక్టార్లలో మంజీరా వన్యప్రాణి అభయారణ్యం విస్తరించి వుంది. ఈ అభయారణ్యం 36 కి.మీ. పొడవు, 500 నుంచి 800 మీటర్ల వరకు వెడల్పు కలిగి వుంది. ఇందులో తొమ్మిది ద్వీపాలున్నాయి. వీటిలో పుట్టిగడ్డ, బాపనిగడ్డ, కరణంగడ్డ అనే ద్వీపాలు ప్రత్యేకమైనవి. ఇక్కడ సందర్శకుల సౌకర్యార్థం మంజీరా బ్యారేజీ వద్ద ఒక పర్యావరణ విద్యా కేంద్రాన్ని నిర్మించారు.

**దేవాలయాలు**

**త్రికూటేశ్వరాలయం – కల్పగూరు :** జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి 5 కి.మీ. దూరంలో గల కల్పగూరులో కాకతీయుల చేత త్రికూట పద్ధతిలో నిర్మించబడ్డ ఆలయమిది. ఈ ఆలయ సముదాయంలో కాశీ విశ్వేశ్వర, వేణుగోపాల, అనంత పద్మనాభస్వామి ఆలయాలున్నాయి. ఎనిమిది స్తంభాల మంటపంలోని నందీశ్వరుని విగ్రహం ఈ ఆలయానికి ప్రత్యేక ఆకర్షణ. ఈ ఆలయానికి కూతవేటు దూరంలోనే త్రాగునీటి సరఫరా కోసం నిర్మించబడిన రిజర్వాయలున్నవి. ఇది పర్యాటక స్థలంగా, వన్యప్రాణి సంరక్షణా ప్రాంతంగా, మొసళ్ళు సంరక్షణ కేంద్రంగా పేరుగాంచింది.

**కేతకీ సంగమేశ్వరాలయం – ఝరాసంగం :** సుప్రసిద్ధ శైవ క్షేత్రాల్లో కేతకీ సంగమేశ్వర ఆలయమొకటి. జిల్లా కేంద్రం నుంచి 65 కి.మీ. దూరంలో వున్న ఈ క్షేత్ర గుండంలోకి కాశీ నుంచి 'ఝర' ఒకటి వచ్చి కలవడం చేత ఝరాసంగం అనే పేరు వచ్చిందని ఐతిహ్యం. నిత్యం కేతకీ పుష్పాలతో పూజించబడే పరమశివుని ఆలయం కాబట్టి ఇది కేతకీ సంగమేశ్వరాలయంగా భాసిల్లుతోంది.

**రామలింగేశ్వరాలయం – నందికంది :** సంగారెడ్డికి 12 కి.మీ.దూరంలో నందికంది అనే గ్రామం వద్ద నక్షత్రాకారంలో చాళుక్యుల చేత నిర్మించబడిన ఈ రామలింగేశ్వర ఆలయం సుప్రసిద్ధమైన ఆధ్యాత్మిక క్షేత్రంగా వెలుగొందుతోంది. ఈ దేవాలయంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వర, నరసింహావతార, నటరాజ, మహిషాసుర మర్ధిని, సరస్వతీదేవి తదితర మూర్తులున్నాయి.

**సప్త ప్రాకారయుత దుర్గాభవానీ ఆలయం – ఇస్మాయిల్‌ఖాన్ పేట :** చుట్టూ పెద్ద కోట గోడ. రెండు బురుజుల మధ్యలోంచి ప్రవేశించే రహదారి. తేజోమయ మైన, ఎత్తైన అమ్మవారి విగ్రహం. సంగారెడ్డికి 15 కి.మీ. దూరంలోని ఇస్మాయిల్ ఖాన్‌పేట సప్త ప్రాకారయుత భవానీ ఆలయం ప్రత్యేకతలివి.

**ఆది నారాయణస్వామి దేవాలయం – కొడకంచి :** దాదాపు 500 సంవత్సరాల క్రితం అప్పటి జాగీర్దార్ రామోజీరావు సంకల్పంతో నిర్మితమైన ఆది నారాయణుడి క్షేత్రమిది. ఇక్కడ బంగారుబల్లి, వెండిబల్లి చూపరులను బాగా ఆకర్షిస్తాయి.

**వీరభద్రేశ్వరాలయం :** భద్రకాళీ సమేతుడైన వీరభద్రుని క్షేత్రమైన భక్తుల కోరికలకు కొంగుబంగారమైన ఒళ్ళుబండ, ఆగ్నేయాన అగ్నిగుండంలో భక్తులు, మొక్కుబడులు చెల్లించు కుంటారు. ఆధ్యాత్మికం, ఆనందం రెండూ కలగలసిన పుణ్య క్షేత్రంగా బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయం భాసిల్లుతోంది.

**శ్రీకాశీ విశేశ్వర ఆలయం :** ఇది సంగారెడ్డికి 4 కి.మీ. దూరంలో వుంటుంది. కలబగూర్ గ్రామంలో ఉన్న ఈ ఆలయానికి చేరుకోవచ్చు. ఈ శివాలయం మంజీరా బ్యారేజ్‌కు చేరువులో వుంది. 14వ శతాబ్దిలో కాకతీయులు దీన్ని నిర్మించారు. వరంగల్‌లోని వెయ్యి స్తంభాల మండప నిర్మాణ శైలి ఇందులో కనిపిస్తుంది. దీనితోపాటు ఒకే కప్పుకింద అనంతపద్మనాభ స్వామి, శ్రీ వేణుగోపాల స్వామి ఆలయాలు వున్నాయి.

**కద్పల్ – చల్లగిరి లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయం:** అద్దంకి తిరుమల కూచాచార్య గురు మహారాజు గారి చేత ప్రతిష్ఠించబడిన ఈ దేవాలయం చల్లగిరి గుట్టపై వుంది. గురుమహారాజు చేత విశిష్టాద్వైత ప్రచారం జరిగిన ఈ ప్రాంతం సంగారెడ్డి నుంచి 70 కి.మీ. దూరంలో వుంది. ప్రతి యేటా మాఘశుద్ధ పంచమి నుంచి రథ సప్తమి వరకు ఉత్సవాలు జరుగుతాయి.

**బీరంగుడా మల్లికార్జునస్వామి దేవాలయం :** పటాన్‌చెరు – అమీన్‌పూర్ పంచాయితీ పరిధిలో ఈ ఆలయం వుంది. గత కాలంలో ఈ ఆలయం చాలా వైభవంగా ఉండేదనీ, దీన్ని ఈ ప్రాంతీయులు రెండవ శ్రీశైలంగా భావించేవారనీ చెబుతారు. భృగుమహర్షి మరికొందరు ఋషులతో కలిసి ఇక్కడ తపస్సు చేయగా, శివ ప్రకటన, కొలను ఆవిర్భావం జరిగాయంటారు. ఈ ఆలయం 13వ శతాబ్దానికి చెందినదిగా చెబుతారు.


గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా, కవులు, కళాకారులకు నిలయంగా ఎంతో చరిత్రను పొంది ఉన్నదీ సంగారెడ్డి జిల్లా. కొన్ని ప్రాంతాలు వెనుకబడి ఉన్నప్పటికీ కొత్త జిల్లాగా మారడం వల్ల మరింత అభివృద్ధి పథంలోకి వడివడిగా ప్రయాణం చేస్తుందని ఆశిద్దాం.

# హైదరాబాద్ జిల్లా చిత్రపటం





ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల



చౌమహల్లా ప్యాలెస్



బిర్లా మందిరం



చార్‌మీనార్



గోలకొండ ఖిల్లా



హుసేన్‌సాగర్




ఇబ్రహీం కుతుబ్షా



భాగమతి



భాగ్యరెడ్డి వర్మ



శ్యాం బెనగల్

316 (b)

# హైదరాబాద్

భాగ్యపు రాజధాని సమభావనలల్లిన పూలతీగ సం
భోగ్య కళా సరస్వతి యపూర్వ చరిత్రకు గోలకొండయై
యోగ్య చతుష్పథమ్ముల సుయోగపు హైదరబాదు దేశ సౌ
భాగ్యము తీర్చిదిద్దు ఘనభాసిత సర్వ గుణాలయంబుగా !

శతాబ్దాలుగా నిజాం రాష్ట్ర రాజధానిగా, హైదరాబాదు రాష్ట్ర రాజధానిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా, ప్రస్తుత తెలంగాణ రాజధానిగా, రాజసం ఒలకబోస్తున్న రాజధానీ నగరం హైదరాబాదు. చారిత్రక కట్టడాల కేంద్రంగా, ప్రపంచ ఐటీ రంగ ముఖ్య కేంద్రంగా, అత్యధిక రెవెన్యూ వనరుగా, అత్యధిక జనాభా గల నగరంగా, భిన్న సంస్కృతుల సంగమంగా, అనేక భాషలకు నిలయంగా ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకున్నది.

**ఈ పేరెందుకు?**

మొదట 16వశ॥ ప్రారంభం వరకు గోలకొండ నగరంగా ప్రసిద్ధి వహించిన రాజధానీ నగరం 1519వ సం॥లో మూసీ నది ఒడ్డున కుతుబ్‌షాహీ వంశస్థుడైన మహ్మద్ కులీ కుతుబ్‌షా తన ప్రేయసి భాగమతి పేరున భాగామతి నిర్మాణానికి శ్రీకారం చుట్టినాడు. భాగమతి 'అలీ'ని పెండ్లి చేసుకున్న తర్వాత మతం మార్చుకున్నది. ఆమె నివాసం హైదర్‌మహల్ అయ్యింది. ఆ హైదర్‌మహల్ పేరుతోనే హైదర్ ఆబాద్- హైదరాబాద్ అనే పేరు తదనంతర కాలంలో భాగ్యనగరికి స్థిరపడిపోయింది. హైదర్ (ఖలీఫ్ అలీ అబిదిన్ తాలిబ్) అనే యోధుని పేరు మీద హైదరాబాద్‌కు ఆ పేరు వచ్చిందన్న కథనం కూడా ప్రచారంలో ఉన్నది.

**భౌగోళిక స్వరూపం - విస్తీర్ణం - పరిధి**

హైదరాబాద్ జిల్లా $17^0$-22'31 ఉత్తర అక్షాంశాలు మరియు $78^0$-28'27 తూర్పు రేఖాంశాల మధ్య వ్యాపించి ఉన్నది. హైదరాబాద్ జిల్లా విస్తీర్ణం 217 చ.కి.మీ. దక్కన్ పీఠభూమిలో విస్తరించిన ఈ జిల్లా సముద్రమట్టానికి 1640 అడుగుల ఎత్తున ఉన్నది. రాతి పొరలు అధికంగా ఉన్న ఈ నగరంలో కొండ ప్రాంతం కూడా కొంతమేర ఆవరించి ఉన్నది. 11 అక్టోబర్ 2016 వరకు రంగారెడ్డి జిల్లా ఒక్కటే హైదరాబాదు జిల్లాకు సరిహద్దు. జిల్లా పునర్విభజన కారణంగా హైదరాబాదు చుట్టూ ఉంగరం (రింగ్)లా ఉన్న రంగారెడ్డి జిల్లా ముక్కలైపోవడంతో జిల్లా సరిహద్దులు మారిపోయినాయి. తూర్పు మొదలు వాయువ్యం దాకా మేడ్చల్ జిల్లా, వాయువ్యం మొదలు దక్షిణం నుండి తూర్పు వరకు రంగారెడ్డి జిల్లా హైదరాబాదుకు సరిహద్దులైనాయి.

**సహజ వనరులు**

భారత స్వాతంత్ర్యానికి ముందు నుండే హైదరాబాదు ధనికనగరంగా గుర్తింపు పొందింది. ఇక్కడ ఎన్నో పరిశ్రమలతో పాటు వ్యాపార రంగం కూడా ఇతోధికంగా వృద్ధి చెందింది. 1873లో మొదటి స్పిన్నింగ్ మిల్లు, 1876లో ఫిరంగుల ఫ్యాక్టరీ, ఇదే సంవత్సరంలో ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్,

### రెవెన్యూ డివిజన్లు- మండలాలు

హైదరాబాద్‌లో రెండు రెవెన్యూ డివిజన్లు, 16 మండలాలున్నాయి. హైదరాబాదు, సికింద్రాబాదు డివిజన్లు.

**హైదరాబాద్ డివిజన్‌లోని మండలాలు 9 :**

1.అంబర్‌పేట 2. ఆసిఫ్ నగర్ 3. బహదూర్ పురా 4. బండ్లగూడ 5. చార్మినార్ 6. గోల్కొండ 7. హిమాయత్ నగర్ 8. నాంపల్లి 9. షేక్‌పేట

**సికింద్రాబాద్ డివిజన్‌లోని మండలాలు 7 :**

1. అమీర్ పేట 2. ఖైరతాబాద్ 3. మారేడ్‌పల్లి 4. ముషీరాబాద్ 5. సైదాబాద్ 6. సికింద్రాబాద్ 7. తిరుమలగిరి.

1910లో సోడా, ఐరన్ ఫ్యాక్టరీలు, 1916లో దక్కన్ బటన్ ఫ్యాక్టరీ, 1919 లో వి.ఎస్.టీ.(వజీర్ సుల్తాన్ టొబాకో) ఫ్యాక్టరీ దీన్నే చార్మినార్ (సిగరెట్) ఫ్యాక్టరీ అంటారు. 1921 లో కెమికల్ లాబొరేటరీ, 1927 లో దక్కన్ గ్లాస్ ఫ్యాక్టరీ, 1929 లో డిబిఆర్ మిల్స్, 1932 లో ఆర్.టీ.సీ. స్థాపన, 1941లో గోల్కొండ సిగరెట్ ఫ్యాక్టరీ, 1942 లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు మరియు హైదరాబాద్ ఆల్విన్ మెటల్స్, 1943 లో ప్రాగాటూల్స్, 1946 లో హైదరాబాద్ ఆస్‌బెస్టాస్ రేకులు, 1947 లో హైదరాబాద్ లామినేషన్ ప్రొడక్షన్స్‌తో పాటు ప్రముఖ మందుల కంపెనీ ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ మరియువిద్యుత్పరికరాల ఉత్పత్తి పరిశోధన కేంద్రం భారత్ హెవీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఇక్కడ నెలకొల్పబడ్డాయి. చార్మినార్, బేగంబజార్, ఉస్మాన్‌గంజ్, అఫ్జల్‌గంజ్, జుమేరాత్ బజార్ తదితర కేంద్రాల్లో వివిధ వర్తక వ్యాపార కార్యకలాపాలు సాగడం అనాదిగా వస్తున్నది. పూలు, పండ్లు, కూరగాయలు, ధాన్యం తదితర వస్తు విక్రయానికి కూడా పూర్వం నుండీ హైదరాబాదు పేరెన్నిక గన్నది. ముఖ్యంగా మహమ్మదీయ శైలిలోని గాజులు, దుస్తులు, ఆభరణాలు, బంగారం, వజ్రాలు ప్రసిద్ధి గాంచినాయి. హోటల్ వ్యాపారం ఎంతో ప్రత్యేకత కలిగి ఉన్నది. హైదరాబాద్ బిరియానీ ప్రపంచ ప్రసిద్ధి గాంచింది. నక్షత్ర హోటల్లెన్నో ఇక్కడ వెలిసి ఈ రంగంలో ప్రముఖ వ్యాపార కేంద్రమైంది. తదనంతర కాలంలో హైదరాబాదు ఐటీ రంగానికి కేరాఫ్ అడ్రసుగా మారింది. ఇప్పుడు ఎంతటి అంతర్జాతీయ సంస్థ అయినా కొత్త ప్రాజెక్టు చేపట్టడానికి హైదరాబాదు వైపు చూస్తున్నదంటే అతిశయోక్తి కాదు. వస్త్ర వ్యాపారానికి సికింద్రాబాదు ఎంతో పేరెన్నికగన్నది. ఏడవ నిజాం ప్రభువు ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా చరిత్రకెక్కడం ఈ జిల్లా సంపన్నతకు గీటురాయి.

### జనాభా

2010 -11 ప్రకారం జిల్లా జనాభా 39,43,323 ఇందులో పురుషులు 20,18,575, స్త్రీలు 19,24,748. హైదరాబాద్ గ్రామీణ జనాభా 0 శాతం ఉండగా, పట్టణ జనాభా 100%. జనసాంద్రత 18,172. లింగ నిష్పత్తి 1000 : 954

### అక్షరాస్యత

జిల్లాలో అక్షరాస్యతా శాతం 83.25 పురుషుల అక్షరాస్యతా శాతం 86.99% కాగా, స్త్రీల అక్షరాస్యతా శాతం 79.35%.

### జిల్లా చరిత్ర

భారతదేశంలోని దక్షిణాపథంలో 'పట్టణం' అనే మాటకు ఏకైక పర్యాయపదంగా నిలిచిన రాజధానీ నగరం గోలకొండ. పటిష్టమైన కోటగా, ప్రముఖ వ్యాపార కేంద్రంగా, కళాపోషణ నిలయంగా, హిందూ, మహమ్మదీయ సంస్కృతుల సంగమంగా భాసిల్లిన గోలకొండ కుతుబ్‌షాహీల కాలంలో అత్యంత వైభవ స్థితికి చేరుకున్నది. సువ్యవస్థితమైన నీటి పంపిణీ విధానంతో అందమైన కట్టడాలతో, వాస్తుకళా సౌందర్యంతో, పటిష్టమైన భద్రతతో, సంగీత సాహిత్యాది కళాపోషణతో, అంతర్జాతీయ వ్యాపార కేంద్రంగానూ కీర్తి గాంచింది. కుతుబ్‌షాహీలలో నాల్గవ వాడైన మహ్మద్ కులీ కుతుబ్‌షా తన ప్రియురాలు భాగమతి పేరుతో 'భాగ్యనగరం'

నిర్మించినాడు (1590లో). గోలకొండ రాజధానిగా వెలుగొందుతున్న కాలంలోనే అంటే 1591లో చార్మినార్ నిర్మితమైంది. దీని వెనుక ఒక ఆసక్తికర కథనం ఉన్నది.

1589 ప్రాంతంలో గోలకొండ పట్టణంలో భయంకరమైన మహమ్మారీ పీడ సంభవించి లెక్కలేనంతమంది చనిపోయినారు. దీన్ని నివారించడానికి కొందరు సాధువులు పీర్లపంజాలు, తావీదులు పట్టుకుని భజనలు చేస్తూ ఊరేగినారు. తత్ఫలితంగా నగరం ఆ మహమ్మారి పీడ నుండి బయటపడింది. ఆ జ్ఞాపకానికి గుర్తుగా, కృతజ్ఞతా సూచకంగా మహ్మద్ కులీ కుతుబ్‌షా పాదుషా 1591వ సంవత్సరంలో చార్మినార్ నిర్మాణం చేయించినారు. గత నాలుగు వందల ఇరవై అయిదు సంవత్సరాలుగా చార్మినార్ తెలంగాణకు ప్రతీకగా వెలుగొందుతున్నది. ఈ చారిత్రక ప్రాధాన్యత కారణంగానే అందమైన చార్మినార్‌ను రాష్ట్ర ప్రభుత్వం లోగోలో స్థానం కల్పించింది.

1687ప్రాంతంలో ఢిల్లీ పాదుషా ఔరంగజేబు గోలకొండను జయించి చాలా వరకు ధ్వంసం చేయించినాడు. (ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కోహినూరు వజ్రం కూడా ఈ సందర్భంగా కొల్లగొట్టబడిందని చెప్తారు.) ఆ తర్వాత 1724 నుండి ఈ ప్రాంతంలో అసఫ్ జాహీల పరిపాలన మొదలైంది. వీళ్ళ రాజధాని హైదరాబాదు. 1803లో సికింద్రాబాద్ నిర్మించబడింది. నిజాం నవాబులు హైదరాబాద్ రాష్ట్రాన్ని (సంస్థానం) 1948 వరకు పాలించినారు. 1948లో నిజాం పాలకులలో చివరి రాజు 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్. సర్దార్ వల్లభబాయ్ పటేల్ (స్వతంత్ర భారత తొలి ఉపప్రధాని) నేతృత్వంలో జరిగిన సైనిక చర్య ఫలితంగా సెప్టెంబర్ 17న హైదరాబాదు అఖండ భారతదేశంలో విలీనమైంది. హైదరాబాద్ రాష్ట్ర తొలి (ఏకైక) ముఖ్యమంత్రిగా బూర్గుల రామకృష్ణారావు (1952-56) చరిత్రకెక్కినాడు. 1956లో 'విశాలాంధ్ర' ఒత్తిడి కారణంగా ఆంధ్ర రాష్ట్రంతో కలిపి, ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడినప్పటి నుండి ఇప్పటిదాకా హైదరాబాదు రాజధానిగా రాజసం ఒలకబోస్తూనే ఉన్నది.

**మున్సిపల్ కార్పొరేషన్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

**రెవిన్యూ గ్రామాలు :** 67

**పోలీస్ కమీషనరేట్ :** హైదరాబాద్

**పార్లమెంటు నియోజకవర్గాలు :** హైదరాబాద్, సికింద్రాబాద్

**అసెంబ్లీ నియోజకవర్గాలు :** 1. ఖైరతాబాద్ 2. జూబ్లీహిల్స్ 3. నాంపల్లి 4. గోషామహల్ 5. అంబర్‌పేట్ 6. ముషీరాబాద్ 7. సికింద్రాబాద్ 8. సనత్‌నగర్ 9. మలక్‌పేట్ 10. కార్వాన్ 11. చార్మినార్ 12. బహదూర్ పురా 13. యాకుత్‌పురా 14. చాంద్రాయణ గుట్ట 15. సికింద్రాబాద్ కంటోన్మెంట్.

**పట్టణాలు :** హైదరాబాద్, సికింద్రాబాద్ (అన్నీ పట్టణంలోని భాగాలే)

తెలంగాణ ప్రజల మనోభీష్టానికి వ్యతిరేకంగా ఆంధ్రరాష్ట్రంతో హైదరాబాదు రాష్ట్రాన్ని కలిపిన నాటి నుండి కలతల సంసారం సాగుతూనే వచ్చింది. మొట్టమొదటి సారిగా 1966లో ఆంధ్రపాలకుల ద్రోహచింతనకు వ్యతిరేకంగా జై తెలంగాణ ఉద్యమం సాగింది. కాని నాయకుల స్వార్థ చింతనతో ఫలవంతమయ్యే క్షణాల్లో నోటికాడి ముద్ద చేజారినట్లు కథ మళ్ళీ మొదటికొచ్చింది. కాని కె.సి.ఆర్. నాయకత్వంలో, జయశంకర్ సార్ సిద్ధాంత రూపకల్పనతో కొత్త ఉత్తేజంతో 'తెలంగాణ రాష్ట్ర సమితి' ఉద్యమించి 2014 జూన్ 2 న ఇక్కడి ప్రజల కలలు సాకారం చేస్తూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో కీలక భూమిక వహించింది. ఉద్యమంలో వేయికి పైగా యువకులు బలిదానమైనారు. నిన్న మొన్నటి దాకా ఆంధ్ర తెలంగాణాల ఉమ్మడి రాష్ట్రంగా కూడా సర్దుకు పోయిన హైదరాబాదు. ఇప్పుడు అచ్చంగా తెలంగాణ రాజధానిగా వెలుగులను విరజిమ్ముతున్నది.

## సంస్కృతి

హైదరాబాద్ సంస్కృతిని 'గంగా జమునా తహజీబ్'గా అభివర్ణిస్తారు. కుతుబ్షాహీల నుండి నేటిదాకా వివిధ జాతుల, మతాల, భాషల సంస్కృతులకు చెందినవారిని హైదరాబాద్ అక్కున చేర్చుకుంది. బార్కాస్‌లో అరబ్‌లు, ఎ.సి.గార్డ్స్‌లో ఆఫ్రికన్ సంతతివారు, ధూల్‌పేటలో లోథ్‌లు, కాచిగూడలో కాచివారు, సికింద్రాబాద్‌లో ఆంగ్లో ఇండియన్‌లు, బేగం బజార్‌లో గుజరాతీలు ఇట్లా నగరంలోని ప్రతీ ప్రాంతం తనదైనటువంటి సంస్కృతిని కలిగి ఉంటుంది. మూసీకి కుడివైపున ఉన్న నగరాన్ని పాతబస్తీ అంటారు. అవిద్య, నిరుద్యోగం, మూఢవిశ్వాసాలు పేదరికం ఎక్కువగా కనిపిస్తుంది. మరోవైపు ఆధునికత, నవీన పోకడలతో సికింద్రాబాదు అభివృద్ధి చెందింది. ఈ రెండు నగరాలకు భిన్నంగా 'సమాచార సాంకేతిక (ఐ.టి) పుణ్యమా అని సైబరాబాద్ అనే నూతన నగరం పురుడుపోసుకుంది. చిన్నవయసులో పెద్ద జీతాలతో ఇక్కడి యువత పాశ్చాత్య సంస్కృతితో మమేకమయ్యారు. కుతుబ్షాహీలు, అసఫ్జాహీల నిర్మాణాలు, ఆంగ్లేయుల చర్చిలు, విద్యాసంస్థలు హైదరాబాద్ ప్రత్యేకతను చాటుతున్నాయి. కాస్మోపాలిటన్ సంస్కృతిక నిలువెత్తు ఉదాహరణగా యీ జిల్లాను చూడవచ్చు. కన్నడిగుల 'నృపతుంగ' విద్యాసంస్థలు, మరాఠాల 'వివేకవర్ధినీ', గుజరాతీల 'ప్రగతీ మహా విద్యాలయ' యీ జిల్లా వాసులకు విద్యాదానం చేశాయి.

ఆషాఢమాసంలో బోనాల ఉత్సవాలు హైద్రాబాద్ ప్రత్యేకత. గోల్కొండ కోటలో మొదలై లాల్‌దర్వాజ దాటి, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయం దాకా నగరమంతా యీ మాసం ఉత్సవశోభను సంతరించు కుంటుంది. దసరా పర్వదినానికి ముందు బతుకమ్మ పండుగను వీధి వీధిన ఘనంగా జరుపుకుంటారు. ఇస్లాంలోని షియా వర్గీయులు మొహర్రం సందర్భంగా లక్షలాదిగా తరలివచ్చి హసన్, హుసేన్‌లను స్మరిస్తూ 'మాతం' ఊరేగింపు జరుపుతారు. వినాయక మండపాలు నగరమంతా కనువిందు చేస్తాయి. ఇటీవల హనుమాన్ జయంతి శోభాయాత్ర, యాదవుల సదర్ ఉత్సవాలు ఆకట్టుకుంటున్నాయి.

సంస్కృతి హిందూ ముస్లింల సంశ్లిష్టమై ఉంటుంది. వస్త్రధారణ– మహిళలకు చీర ప్రధాన వస్త్రమైనప్పటికీ నగర జీవనం ఇక్కడి స్త్రీలను పంజాబీ చుడీదార్‌లు ధరించేటట్లు చేస్తున్నది. యువతులు, విద్యార్థినులు, పిల్లలు జీన్స్ ఇష్టపడతారు. 'లంగావోణి' ఏ పండుగలకో, పబ్బాలకో, ఉత్సవాలకో, శుభకార్యాలకో తప్ప కనిపించదు. ముస్లిం మహిళల్లో అత్యధికులు బురఖా తప్పనిసరిగా ధరిస్తారు. పురుషుల్లో ఎక్కువమంది ప్యాంటూ షర్టు వేసుకుంటారు. యువత జీన్స్, పెద్దవాళ్ళు(వయోవృద్ధులు) కొందరు ధోవతీ లాల్చీ ధరిస్తారు. ముస్లిముల్లో సంప్రదాయవాదులు కుర్తా పైజామా ధరిస్తారు. శుక్రవారం రోజు చాలా మంది తలమీద టోపీలు కూడా పెట్టుకుని తిరుగుతుండటం తరచూ కనిపిస్తుంది. ఇతర ప్రదేశాల నుండి వచ్చి ఇక్కడ నివసించే వాళ్ళు వాళ్ళ వాళ్ళ సంప్రదాయాలననుసరించి బట్టలు వేసుకోవడం చాలా అరుదుగా కనిపిస్తుంది.

ఇక ఆహారంలో హైదరాబాద్ బిరియానీదే పైచేయి. ఈ కారణంగానే ప్యారడైజ్, బావర్చీ, ఆస్టోరియి తదితర హోటల్లు ప్రసిద్ధమైనాయి. బేకింగ్ ఆహారానికి కరాచీ బేకరీ ప్రసిద్ధి. ఇటీవలి దశాబ్దకాలంగా చాట్‌ఫుడ్(గుజరాతీ) నగర మంతటా విస్తరించి, పట్టణాలు పల్లెల్లో కూడా ప్రవేశించి నాయి. శాకాహార ప్రధానమైన తాజ్‌మహల్, కామత్, సందర్శిని వంటి హోటెల్ వ్యాపారం కూడా ఇక్కడ బగా సాగుతుంది. తర్వాతకాలంలో ప్రవేశించిన ఆంధ్రాఫుడ్స్ గిరాకి కూడా బాగానే ఉంది. ఇటీవల 'తెలంగాణ రుచులు' నగరంలో సందడి చేయడం ప్రారంభించినాయి. మొత్తం మీద హైదరాబాదులోని ఆహారం కూడా ఇక్కడి వైవిధ్యజీవనానికి అద్దం పడుతున్నది.

ఆచార విచారాలు, పండుగలు, ఉత్సవాలు హైదరాబాద్ జీవనాన్ని వర్ణభరితం చేస్తున్నది. వివిధ మతాలకు, సంప్రదాయాలకు సంబంధించిన వాళ్ళు తమ

తమ మత సంప్రదాయాలను వ్యక్తిగతంగా పాటిస్తున్నప్పటికీ సామాజిక ఉత్సవాలు, కార్యక్రమాల్లో అన్ని మతాల వాళ్ళు పాల్గొనడం, సామరస్యాన్ని ప్రదర్శించడం ఇక్కడి ప్రత్యేకత. ముస్లింల రంజాన్ పండుగకు ఇతర మతాలకు అతీతంగా ఆహారాన్ని పంచుకోవడం, మొహర్రం పండుగలో హిందువులు పాల్గొనడం గమనించదగ్గ విషయం. అట్లాగే హిందువుల వినాయక నిమజ్జనం, సదర్ పండుగ, దేవీ ఉత్సవాలు, దసరా, దీపావళి, హోలీ పండుగల్లో ఇతర మతాలవాళ్ళు పాల్గొనడంగాని, సహకరించడంగానీ ఇక్కడ సాధారణం. పెండ్లిండ్లు, ఫంక్షన్‌లలో అందరూ కలివిడిగా పాల్గొనడం కూడా చూడవచ్చు.

ఇక్కడి జీవితం చాలా వరకు విలాసవంతం. బతుకుతెరువు కోసం, ఉపాధికోసం, ఉద్యోగాల నేపథ్యంలో ఇక్కడికి వచ్చిన వాళ్ళుగాక, ఇక్కడ స్థిరనివాసం ఏర్పరచుకున్న వాళ్ళు. ఇక్కడివాళ్ళు, సంపన్నులు విలాసవంతమైన జీవనాన్ని గడుపుతారు. కార్లలో షికార్లు, క్లబ్బుల్లో సభ్యత్వాలు, పబ్బుల్లో కాలక్షేపాలు, కనువిందు గొలిపే స్థలాల్లో విహారాలు, హోటెళ్ళలో భోజనాలు, సినిమాలు, షికార్లు, ఆటలు, విందులు, వినోదాలు హైదరాబాదీలకు ఇష్టం.

### చారిత్రక కట్టడాలు

ప్రపంచంలో మరెక్కడా లేని ఇండో అరబిక్ పర్షియన్ వాస్తు శిల్పకళా నైపుణ్యానికి ఇక్కడి నిర్మాణాలు ప్రతీకలు. 14వ శతాబ్దంలో నిర్మించబడ్డ గోలకొండ కోట- గోలకొండ పట్టణం ప్రపంచ ప్రసిద్ధి గాంచినాయి. ఉస్మాన్‌సాగర్, హుస్సేన్‌సాగర్, హిమాయత్ సాగర్, మీర్ ఆలం చెరువు నగర ప్రజల దాహార్తిని తీర్చడానికి నిర్మితమైనా, కాలక్రమంలో హుస్సేన్‌సాగర్ కలుషితమైపోయింది. 1578లో పురానాపూల్, 1589 లో చార్మినార్, గుల్జార్‌హౌజ్; 1803లో సుల్తాన్‌షాహిలో టంకసాల నిర్మాణం; 1805లో మీరాలం మండి; 1806లో మీరాలం చెరువు; 1808 లో బ్రిటిష్ రెసిడెన్సీ భవనం (కోఠి); 1828లో చందూలాల్ బారాదరి; 1831లో చాదర్‌ఘాట్ వంతెన; 1859-66లో అఫ్జల్‌గంజ్ (నయాపూల్) వంతెన; 1862లో డాక్‌ఖానా (పోస్టాఫీస్) (ఇప్పటి); 1873లో బాగేఆం (పబ్లిక్ గార్డెన్స్) మరియు బొంబాయి (ముంబై)- సికింద్రాబాదు రైల్వేలైన్ నిర్మాణం, 1874లో నిజాం రైల్వే సంస్థ ఏర్పాటు, ఫలక్‌నుమా ప్యాలెస్ నిర్మాణం; 1882లో చంచల్‌గూడా జైలు; 1883 లో నాంపల్లి రైల్వే స్టేషన్; 1884లో ముస్లింజంగ్ వంతెన; 1885లో టెలిఫోన్ భవన్; 1890లో నిజామియా అబ్జర్వేటరీ టెలిస్కోప్; 1920లో హైకోర్టు మరియు ఉస్మాన్‌సాగర్ (గండిపేట) నిర్మాణం; 1927లో హిమాయత్‌సాగర్ ఆనకట్ట నిర్మాణం, ఇదే సంవత్సరం యునానీ ఆయుర్వేదిక్ ఆసుపత్రి నిర్మాణం జరిగింది; 1930లో తొలిసారిగా నగరంలో సిమెంట్ రోడ్లు విస్తరించినాయి.

### సాహిత్య చరిత్ర

గోలకొండ పాదుషాలలో ఇబ్రహీం కుతుబ్‌షా తెలుగు భాషా మాధుర్యాన్నెరిగిన విద్యాసాహిత్యప్రియుడు. 'మల్కిభ రాము'డనే ముద్దుపేరుతో తెలుడు కవుల మన్ననలందుకున్న ఈ పాదుషా కాలంలో అద్దంకి గంగాధర కవి 'తపతీ సంవరణోపాఖ్యాన'మనే కావ్యాన్ని రచించి, అతనికే అంకితమిచ్చాడు.

పూర్వపు మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఆసూరి మరింగంటి సింగరాచార్య మహాకవి పాండితీ ప్రతిభకు ముగ్ధుడై 'మత్తేగంధేభపితఛత్రముత్తమాశ్వహాటకాంబర చతురంతయాన అగ్రహారా'లనిచ్చి సత్కరించినాడు ఇబ్రహీం కులీ కుతుబ్‌షా. ఇబ్రహీం కులీ కుతుబ్‌షా సేనాని అమీర్‌ఖాన్ కూడా తెలుగు సాహిత్య పోషకుడే. తొలి అచ్చ తెలుగు కావ్యం 'యయాతి చరిత్ర' రచించి ఖ్యాతిగాంచిన పొన్నిగంటి తెలగన కవి తన ఈ కావ్యాన్ని అంకితమిచ్చింది అమీర్ ఖానునికే. ఆరవ కుతుబ్‌షా 'అబ్దుల్లా' హిందూ మత సాంప్రదాయాలను విశేషంగా ఆదరించి అనుసరించినాడు. విజ్ఞానశాస్త్రం, వాఙ్మయం, లలితకళల వృద్ధికి విశేషకృషి చేసినాడు.

క్రీ.శ.1580 ప్రాంతంలో గోల్కొండ కరణంగా చెప్పుకున్న సారంగు తమ్మయ్య 'వైజయంతీ విలాసము' అనే ప్రబంధాన్ని రచించాడు. 'చతుర వచో రచనాతి ప్రతిభాసు కవిత్వ తత్త్వ పారీణు' డైన ఈదూరి ఎల్లనామాత్యుడు అనే కవి 'హరిశ్చంద్రోపాఖ్యానం' అనే గ్రంథాన్ని రాసి సుల్తాన్ కులీకి అంకితమిచ్చాడు. దాదాపు యిదే కాలం వాడైన శంకర కవి 'శంకర వచనములు' అనే రచన చేశాడు. ఇబ్రహీం కుతుబ్షా (క్రీ.శ. 1550-1580) చాలాకాలం విజయనగర సామ్రాజ్యంలో అళియ రామరాయల వద్ద ఆశ్రయం పొందాడు. అద్దంకి గంగాధరకవి యీతని సాహిత్య పోషణని ప్రశంసించాడు. ఇబ్రహీం మరణంపై దుఃఖిస్తూ 'చాటుపద్య మణిమంజరి'లో యీ పద్యం కనిపిస్తుంది.

**"రాముడు దుక్కి ముచ్చు రఘురాముడు క్రోతులరాజు రేణుకా**
**రాముడు పోటుబంటు పటురాగ సమంచితుడైన గోపికా**
**రాముడు వెఱ్ఱి గొల్లడిక రాష్ట్రములందు సమానులేరయా**
**రాముల నెంచి చూడ నిభరామ మహీధర భవ్య వైభవా!"**

నేబతి కృష్ణయామాత్యుడు 'రాజనీతి రత్నాకరం' అనే 6 ఆశ్వాసాల గ్రంథాన్ని రచించాడు. రాజమల్లారెడ్డి అనే కవి 'శివ ధర్మోత్తరం', 'పద్మపురాణం' అనే రచనలు చేయగా, గణేశ పండితుడు, తులసీమూర్తి అనే కవులు కుతాబ్షాహీల ఆస్థానంలో ఉండేవారు. క్రీ.శ. 1584 కాలంలో తెనాలి రామలింగం అనే కవి 'ధీర జన మనో విరాజితము' అనే రచన చేశాడు.

కుతుబ్షాహీల అనంతరం క్రీ.శ. 1719 నుండి 1948 వరకు ఆసఫ్జాహీలు యిక్కడ పరిపాలన చేశారు. సుమారు 200 సంవత్సరాలు యిక్కడ తెలుగు సాహిత్యం చీకటిలో ఉండిపోయిందని పండితులు భావిస్తున్నారు. ఆధునిక యుగారంభంలో తిరిగి కవులు సాహిత్య సృజన చేశారు. కోటయామాత్యుడు (క్రీ.శ. 1885-1960) శ్రీ ఆంజనేయ శతకం రచించాడు. సికింద్రాబాదుకు చెందిన పంతము ఆంజనేయకవి విచిత్ర రాఘవీయము, మోక్షసాధన, శ్రీకృష్ణ లీలా తరంగిణి, శ్రీ పాండురంగ శతకం, రుక్మిణీ కల్యాణం అనే గ్రంథాలు రచించారు. గోల్కొండ కవుల సంచికలో 'మాతృప్రేమ' శీర్షికన వీరి పద్యాలు ప్రచురించబడ్డాయి. వారణాసి రామయ్య (క్రీ.శ. 1870) సికింద్రాబాదు వాసి. వీరు కొండా వెంకటరంగారెడ్డిగారి ఆస్థానకవి. హరిదాసుగా జీవనం గడిపిన, వీరు 'దత్తాత్రేయ పంచవింశతి' రచించారు. యిందులోని పద్యాలు గోల్కొండ కవుల సంచికలో చూడవచ్చు. ఆరు భాషలలో పండితులైన గుండేరావు హర్కారే (క్రీ.శ. 1887-1979) ఉర్దూ భాషేతిహాసము, మరాఠీ సాహిత్య చరిత్రము వంటి రచనలు చేశారు. నూటికి పైగా యక్షగానాలను రచించిన చెర్విరాల భాగయ్య కవి ముషీరాబాద్ వాస్తవ్యులు. ప్రముఖ సంఘసంస్కర్త అరిగె రామస్వామి (1895-1973) 'రైతులారా' అనే శీర్షికతో కవిత్వం రాశారు. ఆధునిక కవులెందరో ఈ ప్రాంతాన్ని పునీతం చేశారు. ఇక్కడ పుట్టి పెరిగిన పాతనగరపు కవులు, రచయితలైన ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, ఎన్.ఆర్. వెంకటేశం, చింతపట్ల సుదర్శన్ వంటి వారే గాక ఆధునికులు ఎందరో ఉన్నారు. అదేవిధంగా ఇతర ప్రాంతాలనుండి ఉద్యోగాల రీత్యా, ఇతర కారణాల రీత్యా వచ్చినవారు కూడా ఇక్కడి సాహిత్య వాతావరణాన్ని సుభిక్షం చేశారు. భాగ్యనగర సాహిత్యంపై ప్రత్యేక గ్రంథమే వెలువడవలసి ఉంది.

### సాహిత్య సంస్థలు

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం 1901లో ప్రారంభించారు. కేవలం హైదరాబాద్‌లోనే కాక మొత్తం నైజాం ప్రాంతంలోనే విద్యావ్యాప్తికి, సాహిత్య ప్రచారానికి యీ సంస్థ దోహదపడింది. 1905లో నెలకొల్పిన ఆంధ్ర సంవర్ధినీ గ్రంథాలయం, 1913లో సంస్కృత కళావర్ధినీ గ్రంథాలయం, 1923లో కొండా వెంకట రంగారెడ్డి ప్రారంభించిన వేమన ఆంధ్రభాషా నిలయం వంటి సంస్థలు అక్షరాల ద్వారా సమాజంలో చైతన్యాన్ని రగిలించాయి. దేశోద్ధారక గ్రంథమాల (1938), అణా గ్రంథమాల (1939) సాధన సమితి (1939), ఆంధ్ర సాహిత్య పరిషత్తు (1940), ఆంధ్ర సారస్వత పరిషత్తు (1943) సాహిత్యోద్యమాన్ని కొనసాగిం

చాయి. 1862లో మహబూబ్ కళాశాల, 1906లో ఆదిహిందూ పాఠశాల, 1944లో ఆంధ్ర విద్యాలయం తెలుగుకు పెద్దపీట వేశాయి. 1887లో నిజాం కళాశాల, 1918లో ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రారంభమై తెలంగాణ సమాజాన్ని ఉన్నత విద్యకు చేరువ చేశాయి.

1901 – శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషా నిలయం, సుల్తాన్‌బజార్

1906 – విజ్ఞానచంద్రికా గ్రంథమాల, కొమర్రాజు లక్ష్మణరావు, పరిశోధనే పరమార్థంగా మొదలైన సంస్థ ఇది.

1922 – లక్ష్మణరాయ పరిశోధక మండలి, కొమర్రాజుగారి స్మారకంగా ఏర్పడింది. సంస్థాపకులు ఆదిరాజు వీరభద్రరావు.

1934 – ఆంధ్ర కేసరీ సంఘం, సుల్తాన్ సంఘం – ఆంధ్రకేసరి పేరిట లిఖిత మాసపత్రిక, గుండవరపు హనుమంతరావు, బూర్గుల రంగనాథరావు, కె.సి.గుప్త సభ్యులు.

1938 – దేశోద్ధారక గ్రంథమాల, ఇమాం బావడి, స్థాపకులు – వట్టికోట ఆళ్వారుస్వామి. హైందవ ధర్మవాదులు, ప్రజలు – ప్రభుత్వం, సంస్థాన ప్రజల సమస్యలు వంటి గ్రంథాలు ప్రచురించారు.

1939 – అణా గ్రంథమాల, ట్రూప్‌బజార్, స్థాపకులు · వెల్దుర్తి మాణిక్యరావు. మొగలాయి కథలు, ఆంధ్ర వాఙ్మయము, మాడపాటి హనుమంతరావు కథలు మొ॥నవి.

1939 – సాధనా సమితి, ఇసామియా బజార్, యువ కవులను సాహితీ ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా మొదలైన సంస్థ ఇది. 'ప్రత్యూష' లిఖిత మాసపత్రిక ద్వారా 1950 నాటికి 18 పుస్తకాలు ప్రచురించారు. ఆముక్త మాల్యద పర్యాలోకనము – వెల్దండ ప్రభాకరరావు, నవ్యకవితా నీరాజనం – దేవులపల్లి రామానుజరావు.

1940 – ఆంధ్ర సాహిత్య పరిషత్తు నాంపల్లి, రాయప్రోలు, కురుగంటి సీతారామయ్య, ఖాసింఖాన్.

1943 – ఆంధ్ర సారస్వత పరిషత్తు, తెలుగు భాష సంస్కృతుల పరిరక్షణ, ప్రచారం ప్రధాన లక్ష్యం. ఇందులో సురవరం – ఆంధ్రుల సాంఘిక చరిత్ర, ఖండవల్లి సోదరులు – ఆంధ్రుల చరిత్ర, సన్నిధానం సూర్యానారాయణ శాస్త్రి – కావ్యాలంకార సంగ్రహం. ఈ సంస్థకు ఎక్కువకాలం దేవులపల్లి రామానుజరావుగారే అన్నీ తానే అయి సారస్వత సేవ చేశారు.

**కొందరు ప్రముఖ వ్యక్తులు**

హైదరాబాదును రాజధానిగా చేసుకుని పరిపాలన సాగించిన గోలకొండ ప్రభువుల అనంతర కాలంలో అసఫ్‌జాహీలు, నిజాం ప్రభువుల్లో చివరిరాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్‌ల గురించి తెలిసిందే. ఈ నేపథ్యంలో చివరి నిజాం పరిపాలనలోని చివరి దశలో సంభవించిన లోపాలు, పక్షపాత వైఖరి, స్థానిక నాయకుల అన్యాయ వర్తన కారణంగా ఉద్యమాలు ఊపిరిపోసుకున్నాయి. ఆ సందర్భంగా ఎందరో ప్రముఖులు తెరమీదికి వచ్చినారు. వారిలో కొందరి గురించైనా తెలుసుకోవడం అవసరం.

హైదరాబాద్ రాష్ట్ర తొలి(ఏకైక) ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు; తెలంగాణలో దళితోద్యమ మూలపురుషుడు భాగ్యరెడ్డి వర్మ; సాహిత్య సామాజిక చైతన్యశీలి వట్టికోట ఆళ్వారు స్వామి; గోలకొండ పత్రిక ద్వారా తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటిన సురవరం ప్రతాపరెడ్డి; తెలుగువాళ్లను తెలుగు సంస్కృతిని కాపాడటానికి అండదండగా నిలిచిన కొత్వాల్ రాజా వెంకట్రామిరెడ్డి; ఇమ్రోజు పత్రిక ద్వారా రజాకార్ల దుశ్చర్యలను ఎండగట్టిన కలం యోధుడు షోయబుల్లాఖాన్; స్త్రీవిద్య, గ్రంథాలయోద్యమ, ఆంధ్రోద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న మాడపాటి హనుమంతరావు; శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం కోసం సమస్తం అర్పించిన రావిచెట్టు రంగారావు; సంస్థ స్థాపకులు కొమర్రాజు వెంకట లక్ష్మణరావు; 'భారతకోకిల' సరోజినీ నాయుడు; భారత స్వాతంత్రోద్యమంలో చురుగ్గా పాల్గొన్న సంగెం లక్ష్మీబాయి; తొలితరం రచయిత్రి బండారు అచ్చమాంబ మరెందరో నాయకులు, సాహితీవేత్తలు, కళాకారులు ఈ నేల మీద జన్మించినారు.

**దర్శనీయ స్థలాలు - పర్యాటకం**

హైదరాబాద్ విశ్వనగరంలా పేరు గాంచడంలో ఇక్కడి నిర్మిణాలు, చూడదగ్గ ప్రదేశాలు అగ్రస్థానంలో నిలుస్తాయి. ప్రపంచంలో మరెక్కడా లేని ఇండో అరబిక్ పర్షియన్ వాస్తు శిల్పకళా నైపుణ్యం ఇక్కడి చారిత్రక నిర్మాణాల్లో మనకు కనిపిస్తుంది. గోలకొండ, చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, షేక్‌పేటలోని టూంబ్స్ మక్కామసీదు ఈ శైలికి ప్రతీకలుగా కనిపిస్తాయి. వీటితో పాటు బిర్లామందిర్, బిర్లా ప్లానిటోరియం, జూపార్కు జింకల పార్కు అసెంబ్లీ భవనాలు, లాల్‌బహదూర్ స్టేడియం, ట్యాంక్‌బండ్, ఎన్‌టీఆర్ పార్కు, లుంబినీ పార్కు, హుస్సేన్‌సాగర్, సిటీ కాలేజ్, హైకోర్టు, గండిపేట్ (ఉస్మాన్ సాగర్), హిమాయత్ సాగర్, హైటెక్‌సిటీ, శిల్పారామం, విశ్వవిద్యాలయాలు (అన్నీ) మరియు ప్రపంచ ప్రసిద్ధిగాంచిన రామోజీ ఫిల్మ్ సిటీ, బేగంపేట, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లు తప్పక చూడదగ్గవి.

తెలంగాణ రాజధానిగానే కాదు హైదరాబాద్ దక్కన్ సంస్కృతికి, కళలకు, చరిత్రకు కూడా ప్రధాన కేంద్రం. ఇరాన్‌లోని ఇస్ఫహాన్ నగరం స్ఫూర్తిగా ఈ నగరం నిర్మించబడింది. చార్మినార్ కేంద్రంగా ఈ నగరం రూపు దిద్దుకుంది.

నాటి ప్లేగు వ్యాధితో మరణించినవారి జ్ఞాపకంగా క్రీ.శ. 1591లో ఈ కట్టడం రూపొందిచబడింది. నాలుగు ఎత్తైన మినార్లతో పైభాగాన మసీదుతో ఈ అద్భుత నిర్మాణం జరిగింది. ఆ పక్కనే మక్కామసీదు ఉంది. ముస్లింల పవిత్ర స్థలం మక్కానుండి తెచ్చిన ఇటుకలను కూర్చి ఈ నిర్మాణం జరిగినందున దీనికి మక్కామసీదు అనే పేరు స్థిరీకరించారు.

గోల్కొండ కోట, పైగా సమాధులు, కుతుబ్షాహీ సమాధులు, చౌమహల్లా ప్యాలెస్, ఫలక్‌నుమా ప్యాలెస్, పురానీ హవేలీ వంటివి కుతుబ్షాహీ, ఆసఫ్జాహీల కాలంలోని ప్రసిద్ధ నిర్మాణాలు. నాడు నగరం నడి బొడ్డున ఉన్న హుసేన్ సాగర్ జలాశయం ఒకప్పుడు హైదరాబాద్, సికిందరాబాద్ నగరాలను వేరు చేసేది. అక్కడే నౌబత్‌పహాడ్‌పై బిర్లా మందిరం, సైన్స్ మ్యూజియం, ప్లానిటోరియం ఉన్నాయి. ఈ సరస్సు చుట్టూ ఇందిరాపార్క్, లుంబినీపార్క్, సంజీవయ్య పార్క్, ఎన్టీఆర్ గార్డెన్స్ పర్యాటకులను ఆకర్షిస్తాయి.

నెహ్రూ జంతు ప్రదర్శనశాల, సాలార్‌జంగ్ మ్యూజియం, అస్మాన్‌ఘడ్‌లోని రేమండ్ సమాధి, తారామతి, బారాదరి, కింగ్‌కోటి ప్యాలెస్, కె.బి.ఆర్ పార్క్, స్టేట్ మ్యూజియం సందర్శకులు తప్పక చూడవలసిన ప్రాంతాలు.

ఉజ్జయిని మహంకాళి స్కంధగిరి, గణేశ్ దేవాలయం, సెయింట్ మేరీ చర్చ్ వంటి క్షేత్రాలున్నాయి.

ఇక్కడి రవాణా సౌకర్యం కూడా గణనీయమైంది. విమానయానం, రైలు మార్గం, రోడ్డు రవాణా సౌకర్యం ద్వారా ఇక్కడి నుంచి రాష్ట్రం, దేశం నలుమూలలకే గాక, ప్రపంచంలోని ఏ ప్రదేశానికైనా వెళ్ళే సౌకర్యం ఉన్నది.

**అష్టలక్ష్మీ దేవాలయం :** వాసవీ కాలనీలోని శ్రీ అష్టలక్ష్మీ ఆలయం అద్భుతమైన నిర్మాణంలో ప్రశాంతమైన వాతావరణంలో, మహిమాన్వితమైన దేవతా మూర్తులతో, నయనానందకరంగా దర్శనమిస్తుంది. ఆలయం ఉత్తరాభి ముఖంగా ఉంది. ప్రధాన ద్వారాన్ని దాటుకుని ఆలయంలోకి ప్రవేశిస్తే రెండు అంతస్తులుగా ఆలయం దర్శనమిస్తుంది. సోపానమార్గం సమీపంలోని చిన్న ఆలయంలో శ్రీ అభయ వినాయకుడు కొలువుదీరి పూజలందుకుంటున్నారు. వినాయకుడిని దర్శించుకుని ముందుకు వెళ్తే ప్రధాన ఆలయం, ఆలయానికి ఎదురుగా బలిపీఠం, ధ్వజస్తంభం ఉన్నాయి. మహామండపం, గర్భాలయ మండపాన్ని కలిగి ఉంది.

ప్రధాన గర్భాలయంలో శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారు శ్రీమన్నారాయణుడితో పాటు కొలువుదీరి దర్శనమిస్తాయి. ఆతయానికి చుట్టూ, మూడువైపులా ఏడు గర్భాలయాలు ఉన్నాయి. ఈ గర్భాలయాల్లో సంతాన లక్ష్మి, గజలక్ష్మి, ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, విజయలక్ష్మి, వీరలక్ష్మి, ఐశ్వర్యలక్ష్మి అమ్మవార్లు కొలువుదీరి, పూజలందుకుంటూ ఉన్నారు. ప్రతిరోజు పూజలు జరిగే అష్టలక్ష్మి ఆలయంలో ప్రతి సంవత్సరంలో వైశాఖ శుద్ధ విదియ మొదలు వారం రోజుల

పాటు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి.

**శ్రీ ధ్యానాంజనేయ స్వామి ఆలయం, కర్మన్‌ఘాట్ :** కర్మన్‌ఘాట్ గ్రామంలో స్వయంభూగా వెలసిన కర్మన్‌ఘాట్ శ్రీ ధ్యానాంజనేయస్వామి అశ్రిత జన భక్తకోటి కల్పవృక్షంగా వెలుగొందుతున్నాడు. కాకతీయ ప్రభువుల చేత నిర్మించబడిన శ్రీ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయంలో ఆంజనేయుడు భక్తుల మనోభీష్టాలను నెరవేరుస్తూ యశో బుద్ధిబలాలను ప్రసాదించే భక్తవరదుడిగా విరాజిల్లుతున్నాడు.

క్రీస్తుశకం1143 నాటి గోల్కొండ దుర్గాన్ని పాలించిన రెండవ ప్రతాప రుద్రుని మొదలుకుని ఔరంగజేబు వరకు కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయుని సేవించారని పురాణాలు చెపుతున్నాయి. ఆనాడు వచ్చి కోనేరును మనం ఆలయం ఆవరణలో చూడవచ్చు. మహారాజుకు ఆంజనేయుడు కనిపించి తన విగ్రహం దొరికిన చోటే దేవాలయం నిర్మించాలని ఆ స్థలం కర్మ క్షేత్రమని, రాబోయే రోజుల్లో కర్మన్‌ఘాట్‌గా ప్రసిద్ధి పొందుతుందని ఆదేశించారు. స్వామి వారి ఆదేశానుసారం క్రీ.శ.1143లో హనుమాన్ జయంతి రోజున దేవాలయ నిర్మాణ పనులు ప్రారంభించారు.

**తాడ్‌బంద్ వీరాంజనేయుడు :** భాగ్యనగరంలో సైనిక్‌పురి సమీపంలోని సిక్‌విలేజ్ దగ్గర పూర్వం తాడ్‌బంద్ అనే గ్రామం ఉండేది. అక్కడ వెలసిన వీరాంజనేయుడే తాడ్ బంద్ వీరాంజనేయుడిగా పూజలు అందుకుంటున్నాడు. దాదాపు ఎనభై సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలోని పొదల్లో ఒక పెద్ద గుండ్రాయి బయటపడింది. ఆ గుండ్రాయిపై వీరాంజనేయుడు సుందర రూపంలో చెక్కబడి దర్శనమిచ్చాడు. ఇక్కడే స్వామివారి కోసం ఆలయాన్ని నిర్మించారు. బూరుగు వీరయ్య, కొండా రఘురాములు, ఎప్పల వీరమల్లయ్య, సోమనర్సయ్యలు స్వామివారికి గుడి కట్టించడంలో ముఖ్యపాత్ర వహించారు. ఇక్కడ ఆలయం కట్టించింది. దాదాపు ఎనభై సంవత్సరాల క్రితమే అయినా ఇక్కడ లభించిన వీరాంజనేయుల వారి ప్రతిమ ఇక్ష్వాకుల కాలం నాటిదని చెపుతారు. రామాయణ కాలంలో జాబాలి మహర్షి ప్రతిష్ఠించిన మూడు ఆంజనేయ విగ్రహాలలో ఇదొకటి. రెండవది హృషీకేశ్‌లోను, మూడవది తిరుపతిలోను ఉన్నాయి. వీటిని జాబాలి క్షేత్రాలంటారు.

**సికింద్రాబాద్ - మహంకాళి అమ్మవారు :** లష్కర్ ప్రజలనే కాకుండా నగర ప్రజలకు కరారాధ్య దైవంగా సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారు విరాజిల్లుతున్నది. భక్తుల కోరికలను తీర్చే కొంగు బంగారంగా ఈ అమ్మవారిని ప్రజలు కొలుస్తుంటారు. సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళీ దేవాలయానికి దాదాపు 196 సంవత్సరాల ఘన చరిత్ర ఉంది. 1813వ సంవత్సరంలో మిలిటరీలో పనిచేస్తున్న సికింద్రాబాద్ వాస్తవ్యులు సురిటి అప్పయ్య(ఆర్మీ సోల్జర్) మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని టవర్‌కు బదిలీ అయినారు. బదిలయిన కొన్ని రోజులకు ఉజ్జయినిలో కలరా వ్యాధి సోకి వేలాది మంది మరణించడం జరిగింది. ఆ సమయంలో అప్పయ్య వారి అనుచరులు ఉజ్జయినిలో శ్రీ మమంకాళీ దేవిని దర్శించి, కలరా వ్యాధి నుండి కాపాడాలని వేడు కున్నారు. పరిస్థితులు అనుకూలించిన తదుపరి సికింద్రాబాద్ లోనే విగ్రహ ప్రతిష్ఠ చేయించి ఆలయ నిర్మాణం చేసి నిన్ను కొలుచుకుంటామని మొక్కుకోగా, కలరా వ్యాధి నుండి అనేక వేలమంది రక్షింపబడ్డారు.

తదనంతరం సురిటి అప్పయ్య వారి అనుచరులు సికింద్రాబాద్ తిరిగివచ్చి 1815 సంవత్సరంలో ఇప్పుడు అమ్మవారు ఉన్నచోట కట్టెతో అమ్మవారి విద్రహం చేయించి ప్రతిష్ఠ చేసి నిత్యపూజలు చేయడం జరిగింది. అమ్మవారికి శ్రీ ఉజ్జయిని మహంకాళీ అని నామకరణం అప్పట్లోనే చేశారు.

సురిటి అప్పయ్య 1864 సంవత్సరంలో కట్టె విగ్రహం తీసేసి ఇప్పుడున్న మహంకాళీ మాణిక్యాల దేవి అమ్మవారుల విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించేసి ఆలయ నిర్మాణం చేయడం జరిగింది. 1953 సంవత్సరంలో దేవాదాయ ధర్మదాయ శాఖవారి ఆధీనంలోకి తీసుకుని భక్తుల సౌకర్యార్థం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతున్నది.

**దిల్‌సుఖ్‌నగర్ - షిర్డీసాయిబాబా మందిరం :** ఈ ఆలయం దిల్‌సుఖ్‌నగర్ లోనే ఉన్న అచ్చం షిర్డీ సాయిబాబా దేవాలయం నమూనాతో నిర్మాణం కావడంతో పాటు ఇక్కడి సాయినాథుని దర్శించుకునే షిర్డీ సాయినాథుని దర్శించుకుంటే షిర్డీ సాయినాథుని దర్శించుకున్నట్టే అనే భావన భక్తుల్లో కలుగుతుండడంతో ఈ ఆలయానికి దక్షిణ షిర్డీగా నామకరణం జరిగింది. మొదట్లో చిన్న ఆలయంగా ఉన్న ఈ దేవాలయం నేడు మూడంతస్తుల భవనంతో పాటు సాయి నాథుని ఆదేశాల మేరకు అన్నట్లుగా సేవా కార్యక్రమాలు సైతం నిర్వహిస్తూ దేవాలయం ట్రస్ట్ ఆధ్వర్యంలో దేదీప్యమానంగా వెలుగొందుతోంది.

సాయిబాబా దేవాలయం ట్రస్ట్ వారు దేవాలయం అభివృద్ధితోపాటు దాతల సహకారం, భక్తుల తోడ్పాటుతో పలు సమాజ, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. దేవాలయం ప్రాంగణంలోనే ఉచిత వైద్యశాల ఏర్పాటు చేసి రోగులకు సేవ చేస్తున్నారు. 26మంది నిపుణులైన వైద్యులతో హోమియోపతి, అలోపతి, ఆయుర్వేదిక్ చికిత్సలు చేస్తున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. లక్షల రూపాయల వ్యయంతో ఈ వైద్య సేవలు అందిస్తున్నారు. అదే విధంగా ఆలయం ఆధ్వర్యంలో వృద్ధాశ్రమానికి కూడా సేవ లందిస్తున్నారు.

**శ్రీ కృష్ణుని దేవాలయం :** నెహ్రూ జంతు ప్రదర్శన శాలకు దగ్గరలో ఉన్న బహదూర్‌పురాలోని శ్రీ కృష్ణుని దేవాలయమే కిషన్‌బాగ్ దేవాలయం. ఇది హైదరాబాద్‌లోని అతి పురాతన ఆలయాలలో ప్రధానమైంది. 150 సంవత్సరాల క్రితం రాజా రఘురాం ఈ దేవాలయాన్ని నిర్మించారని చరిత్రకారులు పేర్కొంటారు. నిజాంల పరిపలనా కాలంలో వకీలుగా, దౌత్యవేత్తగా రాజా రఘురాం ఉండేవారు. ఆయన మనుమడు రాయ్ మోహన్‌లాల్ కిషన్‌బాగ్ దేవాలయం నిర్వహణ బాధ్యత చేపట్టడంతో పాటు ప్రతి ఏటా శ్రీ కృష్ణ జన్మాష్టమి రోజున రథయాత్ర నిర్వహించేవారు. దేవాలయం చుట్టూ ఎత్తైన ప్రహరీగోడ, ప్రాంగణంలో పెద్ద పూదోట, మంచినీటి బావి, అర్చకుల నివాసాలు ఉన్నాయి.

**శ్రీ గణపతి దేవాలయం :** భారతీయులు అనాది నుండి వైదిక పౌరాణిక మంత్రాల ద్వారా శ్రీ గణపతిని ఆరాధించి, పూజిస్తున్నారు. అట్టి పరమాత్మ అయిన గణపతి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో సుమారు ఒకటిన్నర శతాబ్దాల క్రితం అనేక కోటి సూర్యప్రభలతో శ్రీ గణపతి దేవాలయమునందు ఆవిర్భవించియున్నారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన శ్రీ గణపతి దేవాలయమునందు వెలసిన విఘ్ననాయకుడు తన కరుణాకటాక్ష వీక్షణాలతో నమ్మినవారికి శుభములు ప్రసాదిస్తున్నారు.

1824 సంవత్సర ప్రాంతంలో ప్రస్తుతం గణపతి దేవాలయం ఉన్న ప్రాంగణంలో ఒక పాత దిగుడుబావిని బ్రిటీష్ సిపాయిలు ఇప్పుడు ఉంచబడిన ఆలయంలో ప్రతిష్ఠించిన పూనుకొన్నారు. బ్రిటీష్ అధికారులు అందుకు అభ్యంతరం తెలుపగా అధికారులకు స్వప్నంలో శ్రీవారు దర్శనమిచ్చి ఆలయ నిర్మాణానికి ఎలాంటి అభ్యంతరములు తెలుపవద్దని ఆదేశించారు. వెంటనే ఆయన ఆలయ నిర్మాణం ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్విఘ్నంగా జరిగింది. ఈ దేవాలయం నందు 1932 సంవత్సరంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ వారు తమ ఆధీనములోకి ఈ దేవాలయాన్ని తీసుకున్నారు. నాటి నుండి ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది.

**చిక్కడపల్లి వేంకటేశ్వర స్వామి దేవాలయం :** కలియుగంలో రామకృష్ణావతారములకు అతీతమై నారాయణ స్వరూపుడు, సకల భక్తజనుల పాలిట సర్వేశ్వరుడు, సర్వాంగ సౌందర్యుడు, అలివేలుమంగను అర్ధాంగిగా పొందిన ఈ తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు భాగ్యనగర నడిబొడ్డున వున్న చిక్కడపల్లిలో 1945వ సంవత్సరములో ప్రతిష్టించబడి భక్తుల పాలిట భవబంధ విముక్తుడై శ్రీనివాసపురంలో నిలిచారు అని ప్రతీతి. ఆనాటినుండి ఈనాటి వరకు అసంఖ్యాకులైన భక్తులకు దర్శనమిస్తూ కరుణిస్తూ ఆనంద నిలయంలో స్థిర నివాసుడైనాడు. నగరం నడిబొడ్డున ఉన్నా అంత రద్దీ మధ్య

అత్యంత సుందరంగా, మనోహరంగా అతి ప్రశాంతతతో, దేవాలయంలో కాలిడగానే భక్తిపూర్వకమైన వాతావరణాన్ని సూచిస్తూ భక్తులకు ఆహ్లాదకరమైన దినచర్యలో భాగంగా ఉంది హైదరాబాద్, చిక్కడపల్లి లోని శ్రీనివాసపురంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానము.

**శ్రీ జంగల్ విఠోభ దేవాలయం :** శ్రీ పాండురంగడు, దయా సముద్రుడు, భక్తుల పాలిట కల్పతరువు. ఆ పవిత్ర మూర్తి కొన్ని వందల సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లోని ముచుకుంద పవిత్ర నదీతీరమున ఉస్మాన్‌షాహి (విఠల్ నగర్) లో విలసిల్లినారు.

ఈ దేవాలయమును కీ.శే. గున్నాజీ నాదస్వర వాదకుడు అనే భక్తుడు కట్టించినాడు. ఈ గున్నాజీ పరమ పాండురంగని భక్తుడు. అతనే సర్వమని భక్తిభావముతో తన్మయత్వం చెందిన మనిషి, అతడు అందజేసిన ఈ భక్తి భావన మందిర ప్రాంతములో స్పష్టంగా కనబడుచున్నది. ఈ దేవాలయం అతి పవిత్రమైనది. ఆయన లీలలు ఆశ్చర్యానికి గురిచేస్తాయి. ఈ దేవాలయమునకు "సయ్యద్ హుస్సేన్ ఖాన్ బహదూర్" అనే ముస్లిం మందిర నిర్మాణానికి భూమిని ఇచ్చినాడు. సయ్యద్ కి పురుష సంతానం లేకుండెను. ఈ విషయం శ్రీ గున్నాజీ మహరాజ్‌కి విన్నవించగా విఠలేశ్వరుని అనుగ్రహ కటాక్షం వలన సయ్యద్ పుత్రసంతానం కలిగింది.

సయ్యద్ సంతోషం చేత విఠలేశ్వరుని ఆలయ నిర్మాణం కొరకు భూమిని ఇచ్చెను. ఈ దేవాలయం 200 సంవత్సరాల క్రితం ప్రతిష్ఠ అయినది. శ్రీ పాండురంగని దేవాలయం, ఆంజనేయస్వామి, నవగ్రహ, శివపార్వతుల ప్రతిష్ఠ కూడా అదే సమయంలో జరిగింది. ఈ పుణ్యక్షేత్రంలో రుక్మిణీ, పాండురంగని దర్శనం కొరకు శ్రీ మాణిక్య ప్రభు సంస్థాన పీఠాధిపతి సంత్ శ్రీ శ్రేష్ఠ మనోహర ప్రభువు లాంటి ఎందరో మహానుభావులు ఈ ఆలయమును దర్శించినారు.

**శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవాలయం, బల్కంపేట :** హైదరాబాద్‌లోని బల్కంపేట యందు శతకోటి ప్రభల తేజస్సుతో సర్వాభీష్ట ప్రదాయినియై భక్తుల ఆరాధ్య దేవిగా ఎల్లమ్మ వెలుగొందుచున్నది. భూమి ఉపరితలం నుండి సుమారు పది అడుగుల దిగువన స్వయంభూమూర్తిగా వెలసింది. అమ్మవారి మూల స్థానము నుండి సర్వకాలముల యందు ధారాళంగా పవిత్ర జలము ఆవిర్భవించడం ఇక్కడి విశిష్టత. ఈ దేవాలయం అతి ప్రాచీనమైనది. జలోద్భవ స్థానంలో ఉండటం వలన శాస్త్రరీత్యా ఈమె జల దుర్గాదేవి.

**శ్రీ పెద్దమ్మ దేవాలయము, జూబ్లీహిల్స్ :** హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్‌లో వెలసిన శ్రీ పెద్దమ్మ దేవాలయం సుమారు 7 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించియున్న, సనాతన మైన అతి పురాతనమైన దేవాలయం. వేల సంవత్సరాల క్రితం ఇక్కడ దేవాలయమున్నట్లుగా పూర్వీకులు చెబుతారు. ఈ దేవాలయమునకు భక్తులు జంటనగరాల నుండే కాక, ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి కూడా వేల సంఖ్యలో ప్రతి ఆది, మంగళ, శుక్రవారములు ఆలయమునకు వచ్చి సంప్రదాయ సిద్ధంగా బోనములను శ్రీ పెద్దమ్మ తల్లికి సమర్పించి వారి మొక్కులను చెల్లించుల అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఈ ఆలయ జీర్ణోద్ధారణ కార్యక్రమం కీ.శే. పి. జనార్ధన రెడ్డి (ఆలయ ఫౌండర్ ట్రస్టీ) గారి ఆధ్వర్యంలో జరిగింది. వీరి నేతృత్వంలో ఐదు అంతస్తుల గర్భగుడి, ఏడంతస్తుల రాజగోపురం, శ్రీ గణపతి లక్ష్మీ సరస్వతి దేవాలయాలు, దేవాదాయ ధర్మాదాయ శాఖ వారి ఆగమ శిల్పశాస్త్ర ప్రకారం కళా నైపుణ్యముతో నిర్మింపబడి, 1993 సంవత్సరములో ప్రారంభించబడింది.

**చిత్రగుప్తుడి గుడి :** చిత్రగుప్తుడి దేవాలయం కేవలం ఒకే ఒకటి ఉంది. ఇంత అరుదైన దేవాలయం హైదరాబాద్ పాతబస్తీ కందికల్‌గేట్ ప్రాంతంలో ఉంది. దాదాపు 250 ఏళ్ళ క్రితం చిత్రగుప్త దేవాలయాన్ని నిర్మించారు. నిజాం నవాబుల కాలంలో రాజా కిషన్ పర్షాద్ దీన్ని అభివృద్ధి చేశారు. వాస్తవానికి ఈ దేవాలయ నిర్మాత ఎవరు అనే విషయంలో స్పష్టత లేదు. ఇక్కడే శివాలయం, సాయిబాబా ఆలయం, హనుమంతుడి ఆలయం, అయ్యప్ప ఆలయం

ఇలా నాలుగు ఆలయాలు, చిత్రగుప్త దేవాలయంలో కొనసాగుతున్నాయి. కాబట్టి నాలుగు గుళ్ళ దేవాలయంగా ఇటీవలి కాలంలో ఖ్యాతి పొందింది. ప్రస్తుతం ఈ ఆలయంలో చిత్రగుప్తుడు తన ఇద్దరు భార్యలతో కలిసి ఉన్న రాతి విగ్రహం కొలువు తీరింది.

**సంఘి టెంపుల్ :** హైదరాబాద్ నుండి 25 కి.మీ. దూరంలోని సంఘి నగర్‌లో ఉన్నది. సంవత్సరం అంతా చూడదగిన సమయము. పరమానందగిరి అనే కొండపై ఉన్నది ఈ దేవాలయం. పెద్ద మహాద్వారం సందర్శకులకు ఆహ్వానం పలుకుతుంది. కొండపైనున్న ఆలయంలో ఉండే స్వామి శ్రీ వేంకటేశ్వరుడు. స్వామి విగ్రహం 9.5 అడుగుల ఎత్తుతో తిరుమలలో వెంకన్నను గుర్తు చేస్తుంది. ఎల్లప్పుడు అభిషేకాలు జరుగుతుంటాయి. శ్రీ స్వామివారు ఆలయం పక్కన పద్మావతీ దేవి అమ్మవారి విగ్రహం ఉంటుంది.


**బిర్లా మందిర్ :** బిర్లా ఫౌండేషన్ వారిచే నిర్మించబడిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి మందిరం పూర్తిగా పాలరాతితో నిర్మించబడినది. చిన్న కొండపైనున్న ఈ ఆలయం హుస్సేన్ సాగర్‌కి దక్షిణ దిక్కుగా ఉన్నది. ఆలయం లోపల గోడలపై రామాయణ, భారత ఘట్టాలు చక్కగా చెక్కబడినాయి. ఇంకా ఆలయ ప్రాంగణంలో మార్బుల్ రాయితో చేసిన దేవీ దేవతల విగ్రహాలు దర్శనీయాలు. ఆలయంలో స్వామి తిరుపతి వెంకన్నవలె ఉంటారు. శ్రీ స్వామి వారి దర్శనార్థం ఎల్లప్పుడు భక్తులు బారులు తీరి ఉంటారు. ఈ ఆలయ ప్రాంగణం నుంచి చూస్తే భాగ్యనగరం అత్యద్భుతంగా దర్శనమిచ్చి మనస్సులను కట్టివేస్తుంది. ఈ ఆలయ ప్రాంగణంలో కాసేపు గడిపితే ఎటువంటి మానసిక పరిస్థితి ఉన్నా మనసు ప్రశాంతతను అలవరచుకుంటుంది.

ఇలా హైదరాబాద్‌ను గూర్చి ఎంత రాసినా తక్కువే. ఇప్పటికే హైదరాబాద్ చరిత్ర, సంస్కృతి, కట్టడాలు, నిర్మాణాలు, ఆధునికీకరణ వంటి అంశాలపై ఎన్నో గ్రంథాలు వెలువడినాయి. హైదరాబాద్ నగరం చారిత్రక ప్రాధాన్యం పొందిన గొప్ప నగరం. వాతావరణం, ప్రకృతి సౌందర్యం ఇక్కడ అత్యంత రమణీయం. మూసీ నదీ తీరంలోని ఎన్నో చిన్న పెద్ద గ్రామాలు అన్నీ నేడు కలిసిపోయి 'గ్రేటర్ హైదరాబాద్' గా పరిణామం పొందినాయి. ఎన్నో వందలాది చెరువులున్న ఈ ప్రదేశం ఎంతో ఆహ్లాదాన్ని కలిగించేది. ఇప్పుడు హైదరాబాద్ జనారణ్యంగా మారింది.

పాత నగరంలోని ఏ ప్రదేశాన్ని గమనించినా, ఏ వీధిని చూసినా ఎంతో చరిత్ర కనిపిస్తుంది. ఎన్నో దేవాలయాలు, దర్గాలు, మసీదులు, చర్చిలే కాక అన్ని మతస్థులకు సంబంధించిన ప్రత్యేక గుర్తింపు, అన్ని ప్రాంతాల వారికి ప్రత్యేక అస్తిత్వం హైదరాబాదులోనే సాధ్యం అయింది. పురాతన, అధునాతనమైన ఎన్నో విహార ప్రదేశాలు, పార్కులు, ఎంటర్‌టైన్‌మెంట్‌లకు ఇది ప్రసిద్ధి. హైదరాబాద్ బిర్యానీ, ఇరానీ ఛాయ్ లోకోత్తరమని అందరూ ప్రశంసించిందే. ఈ హైదరాబాద్‌లో గొప్ప సైనిక స్థావరాలున్నాయి. గొప్ప విశ్వవిద్యాలయాలున్నాయి. విద్యాక్షేత్రంలో అత్యున్నతిని పొందింది భాగ్యనగరం. రైల్వే, వైమానికం వంటి రవాణా రంగంలోనూ ఎంతో వైశిష్ట్యాన్ని పొందింది ఈ భాగ్యనగరం. కళలకు కాణాచి ఈ నగరం.

అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తున్న హైదరాబాదు మహానగరం మరింత వేగవంతంగా, విశ్వఖ్యాతి నగరంగా మారి అందరికీ ఆనందాన్ని కలిగించాలని ఆశిద్దాం.

## 'ఆలోకనం' 31 జిల్లాల సమాచార రచయితలు - వివరాలు



**31 జిల్లాల పద్య రచయిత**

**డా॥ అయాచితం నటేశ్వర శర్మ**

విశ్రాంత ప్రాచార్యులు,

ఓరియంటల్ కళాశాల,

కామారెడ్డి.


ఫోన్ : 9440468557

**ఖమ్మం**

**డా॥ కావూరి పాపయ్య శాస్త్రి**

విశ్రాంత అధ్యాపకులు

ఫోన్ : 9848421964





**ఆదిలాబాద్**

**సామల రాజవర్ధన్**

విశ్రాంత ఉపాధ్యాయులు


ఫోన్ : 96529 50959


**ఖమ్మం**

**కూరాకుల శ్రీనివాస్**

పరిశోధక విద్యార్థి, ఉ.వి.

ఫోన్ : 8309360637





**కరీంనగర్**

**స్తంభంకాడి గంగాధర్**

ప్రభుత్వ ఉపాధ్యాయులు

ఫోన్ : 9704466936

**జగిత్యాల**


**డా॥ సంగనభట్ల నరసయ్య**

విశ్రాంత ప్రాచార్యులు,

ఓరియంటల్ కళాశాల, ధర్మపురి

ఫోన్ : 9440073124





**కామారెడ్డి**

**దత్తయ్య అట్టెం**

పరిశోధక విద్యార్థి, ఉ.వి.

ఫోన్ : 9494715445

**జనగామ**

**రెడ్డి రత్నాకర్ రెడ్డి**

తెలుగు అధ్యాపకులు

ఫోన్ : 9848625060





**కొమురం భీం ఆసిఫాబాద్**

**మాడుగుల నారాయణ మూర్తి**

ప్రభుత్వ ఉపాధ్యాయులు


ఫోన్ : 9441139106


**జయశంకర్ భూపాలపల్లి**

**పల్లేరు వీరాస్వామి**

సబ్-ఎడిటర్, మన తెలంగాణ పత్రిక,

ఫోన్ : 9441602605





**జయశంకర్ భూపాలపల్లి**

నర్రా ప్రవీణ్ రెడ్డి

ఎం.ఏ., తెలుగు విద్యార్థి. ఉ.వి.

ఫోన్ : 9393636405




**నిర్మల్**

మడిపల్లి భద్రయ్య

విశ్రాంత ఉపాధ్యాయులు

ఫోన్ : 7780678657




**జోగులాంబ గద్వాల**

డా॥ భీంపల్లి శ్రీకాంత్

ప్రభుత్వ ఉపాధ్యాయులు

ఫోన్ : 9032844017



**పెద్దపల్లి**

కావటి సతీష్ కుమార్

పరిశోధక విద్యార్థి, ఉ.వి.

ఫోన్ : 9493264901




**నల్లగొండ**

డా॥ ఇడికోజు శ్రీనివాసాచారి

తెలుగు ఉపన్యాసకులు

ఫోన్ : 9885349305




**భద్రాద్రి కొత్తగూడెం**

రాళ్ళబండి బాలాజీ

ప్రభుత్వ ఉపాధ్యాయులు

ఫోన్ : 8466935458




**నాగర్ కర్నూల్**

వేముల నారాయణ

ప్రభుత్వ ఉపాధ్యాయులు

ఫోన్ : 9491489018



**మహబూబాబాద్**

మద్దెర్ల రమేశ్

ప్రభుత్వ ఉపాధ్యాయులు

ఫోన్ : 9985135771




**నిజామాబాద్**

డా॥ బోచ్కర్ ఓం ప్రకాశ్

ప్రభుత్వ ఉపాధ్యాయులు

ఫోన్ : 9441955998




**మహబూబ్ నగర్**

మ్యాతరి ఆనంద్

పరిశోధక విద్యార్థి, ఉ.వి.

ఫోన్ : 8184859060




**మంచిర్యాల**

ఎం.వి. పట్వర్ధన్

అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు, లక్సెట్టిపేట.

ఫోన్ : 939 375 1540



**రంగారెడ్డి**

ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

విశ్రాంత శాఖాధ్యక్షులు, తెలుగు శాఖ, ఉ.వి.

ఫోన్ : 9866956250



**మెదక్**

వర్ధ వేణు

పరిశోధక విద్యార్థి, ఉ.వి.

ఫోన్ : 9963815484




**వనపర్తి**

డా॥ గుంటి గోపి

తెలుగు ఉపన్యాసకులు

ఫోన్ : 8019808207



**మేడ్చల్ మల్కాజ్‌గిరి**

డా॥ ఎం. శ్రీకాంత్ కుమార్

పోస్ట్ డాక్టరల్ పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం

ఫోన్ : 9866570779



**వరంగల్ అర్బన్**

డా॥ బి. రాములు

అసిస్టెంట్ ప్రొఫెసర్, కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కా.వి.

ఫోన్ : 9866560960




**యాదాద్రి భువనగిరి**

సిద్ధగౌని సుదర్శన్

పరిశోధక విద్యార్థి, ఉ.వి.

ఫోన్ : 9701703684



**వరంగల్ రూరల్**

డా॥ యల్లంభట్ల నాగయ్య

విశ్రాంత తెలుగు అధ్యాపకులు

ఫోన్ : 9441479388




**రాజన్న సిరిసిల్ల**

సంకేపల్లి నాగేంద్ర శర్మ

ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, రచయిత

ఫోన్ : 9441797650



**వికారాబాద్**

డా॥ కె. భాస్కర యోగి

ప్రభుత్వ ఉపాధ్యాయులు

ఫోన్ : 9912070125





**సిద్ధిపేట**

కటుకోజ్వల లాల్‌బహదూర్ శాస్త్రి
పరిశోధక విద్యార్థి, తెలంగాణ విశ్వవిద్యాలయం
ఫోన్ : 8639024683

**సంగారెడ్డి**

ఎ. శ్రీనాథ్ రావు
సహాయ సంపాదకులు, మూసీ
ఫోన్ : 7981797832







**సూర్యాపేట**

డా॥ దామరాజు సూర్యకుమార్
విశ్రాంత చరిత్ర ఉపన్యాసకులు
ఫోన్ : 9247879164

**హైదరాబాద్**

దోరవేటి (డా॥ చెన్నయ్య)
ప్రభుత్వ ఉపాధ్యాయులు
ఫోన్ : 9866251679





**సంగారెడ్డి**

అవుసల భానుప్రకాశ్
ప్రభుత్వ అధ్యాపకులు
ఫోన్ : 9603204507

**హైదరాబాద్**

డా॥ బి. మనోహరి
సహ సంపాదకులు, మూసీ
ఫోన్ : 934 797 1177






# 'కదంబం'

## (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)

మూసీ మాస పత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం



ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు
(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం 'కదంబం'.

**440 పేజీలతో వెలువడిన**

ఈ గ్రంథం వెల రూ. **350/-**

# హరిహర త్రిశక్తి క్షేత్రం

నవాలయ ఆవరణం, శ్రీ విద్యాపురం, వలిగొండ, యాదాద్రి జిల్లా.

## అన్నదాన సత్ర నిర్మాణము



శక్తిమేరకు ఎవరు ఎంతైనా దానం చేయవచ్చు. దానితోపాటు ఈ ధర్మకార్యం త్వరగా పూర్తి కావటానికి "చింతామణి గృహాంతస్థా శ్రీమన్నగరనాయికా" అనే మంత్రాన్ని నిరంతరం జపించండి.

ఈ అన్నదాన సత్ర భవన నిర్మాణం 5000 చ.అ.లో ఐదు అంతస్తులలో రూపకల్పన చేయబడింది. ప్రస్తుతం రెండు అంతస్తులు నిర్మించబడుతుంది. దీనికి సుమారు ఒక్క కోటి రూపాయలు అవుతుంది.

లక్ష రూపాయలు ఆ పై విరాళం అందించినవారి పేర్లు నిత్యాన్నదాన సత్రంలోని భోజనశాలలో ఉంచబడును.

ఐదు లక్షలు, ఆ పైన విరాళం ఇచ్చిన వారి పేర్లు శిలాఫలకంపై చెక్కించబడును.

మీ సహకారం ధన, వస్తురూపాలేవైనా కృతజ్ఞతతో స్వీకరించబడుతాయి. చెక్కుల రూపంలో మాత్రమే సహకరించేవారు "Veda Samskriti Parishath" పేరు పంపాలి. దాతలు తమ సహకారం ఆన్‌లైన్ ద్వారా అందించవచ్చు. State Bank of India, Nallakunta Branch, A/c.No. 62011461764, IFSC Code : SBIN0020083



## వేద సంస్కృతి పరిషత్

వైదిక సాంస్కృతిక ఉద్దీపన పరిశోధనా సంస్థ

(రి.నెం. 43/2006)

# 2–2–1109/BK-LIG-10, బతకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట్,

హైదరాబాద్ - 500 013. తెలంగాణ సెల్ : 9347971177, 9704227744

Website : vsparishath.com, E-mail : vsp613@gmail.com

# కేసిఆర్ కిట్

మాతాశిశు సంరక్షణ కోసం రూ.15 వేలతో కేసిఆర్ కిట్స్
గర్భిణులకు రూ.12 వేల ఆర్థిక సాయం.
ఆడపిల్ల పుడితే రూ.1000 ప్రోత్సాహకం
రూ.2 వేల విలువైన 'మదర్ అండ్ బేబి బ్యాగ్'



## తెలంగాణ ప్రభుత్వం

ప్రజలకు అందిస్తున్న అద్భుతమైన పథకాలు



# కేసిఆర్ కిట్

ISBN 938717304-6
9789387173040

జారీ చేసినవారు: కమీషనర్, పౌర సంబంధాల శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం

334